Barcode - 2030020024913
Title - shrii tirupati vein'kat'eishvara krxtulu 3
Subject - GENERALITIES
Author - vein'kat'eishvara tirupati
Language - Telugu
Pages - 703
Publication Year - 1934
Creator - Fast DLI Downloader Tool
http://www.shunyafoundation.com
Barcode EAN.UCC-13

TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204473
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. 182 V46B Accession No T1394

Author

Title

This book should be returned on or before the date last marked below

# శ్రీ తిరుపతి వేంకటేశ్వర కృతులు

( షష్టిపూర్తి మహోత్సవ ముద్రణము. )

## సంపుటము 3

షష్టిపూర్తి మహోత్సవ సంఘము, బందరు,

౧౯౩౮.

# నాటకములు

పాండవజననము

పాండవప్రవాసము

పాండవోద్యోగము

పాండవవిజయము

పాండవాశ్వమేధము

ప్రభావతీప్రద్యుమ్నము

దంభవామనము

అనర్ఘనారదము

సుకన్య

పాండవరాజసూయము

సర్వస్వామ్యములు—గ్రంథకర్తలవి

మినర్వా ప్రెస్,  మచిలీపట్నము.

శ్రీ మత్పరదేవతాయైనమః.

శ్రీ

# పాండవజననము

# ఇందు వచ్చు పాత్రములు.

1 అంకము.

1 సూత్రధారుఁడు
2 నటి
3 పరాశరుఁడు
4 దాశుఁడు
5 మత్స్యగంధి

2 అంకము.

1 శంతనుఁడు
2 భీష్ముఁడు
3 దాశుఁడు

3 అంకము.

1 ఋషిబాలురు
2 భీష్ముఁడు
3 పరశురాముఁడు
4 అంబ
5 గంగ
6 నారదుఁడు
7 జమదగ్ని

4 అంకము.

1 వ్యాసులు
2 సత్యవతి
4 భీష్ముఁడు

5 అంకము.

1 సూర్యుఁడు
2 కుంతి
3 చెలికత్తె

6 అంకము.

1 పాండురాజు
2 కిందవుఁడు
3 మృగయుఁడు
4 కుంతి
5 మాద్రి
6 భటుఁడు

7 అంకము.

1 సిద్ధాంతి
2 ధృతరాష్ట్రుఁడు
3 భీష్ముఁడు
4 విదురుఁడు
5 ప్రతీహారి
6 కొందఱుఋషులు
7 కుంతి
8 పంచపాండవులు

ఓం

శ్రీ పరమేశ్వర దేవతాయైనమః.

# పాండవ జననము.

## ప్రథమాంకము.

### నాంది

మ. కరముల్ స్వచ్ఛ మొకండు వేఱొకఁడు రక్షశ్చక్రసంహారి భీ
కర మింకొక్కఁడు శత్రుపక్షమునకుల్, గాంధారీశిశువుల్
గురు వాక్యం బెరకంతలుంతనవిధుల్ గ్రాహ్యం బాకం బట్టె శ్రీ
హరిపంచాయుధముల్ గడంగి జగదాహ్లాదంబుగా గాచుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సూత్ర— (తెరపంకఁజూచి) ఆర్యులారా! సభ్యులు నాటకారంభమున కెదురు చూచుచున్నట్లు కొన్ని సూచనలు సలుపఁ దెలియఁజేయుచున్నారు, ఇంకను తెరబయలు దేలనేమి?

(నటి ప్రవేశించి)

నటి— ఆర్యపుత్రా! ప్రకృతోచితసామగ్రిం జేకూర్చుటయం దాలస్యమున నింత పట్టు నాలస్య మొనరించినందులకు మన్నింపుఁడు. కర్తవ్య మాజ్ఞాపింతురుగాక.

సూత్ర— కర్తవ్యమున కేమున్నది? అటు చూడుము.

తే. గీ. సభయు గాంచిన సంద్రమో సరసిజాక్షి!
అందు మన నాటకం బను యానపాత్రి
మిఘుఁడు నడుపవలెఁగదా! యింపు గదుర
గర్వగాంభీర్యగా ముంచి కదలు విప్పు.

నటి—(తనలో) మత్స్యగంధిని గమ్మందురు కాంబోలును. (ప్రకాశము) ఆర్యా! నేను గడపటి య్యేందులకు? తామే సర్వమును నిర్వహింపఁ గలరు.

సూత్ర—(గౌరవముతో) ప్రేయసీ!

ఆ. వె. పేరు పూరుషులకుఁ దారసిందునె కాని
కార్యనిర్వహణము కామినులది
వెన్నెలయె జగంబు వెలయింపవలెఁ గాని
చంద్రుఁ డేమిచేయు? జలజనయన!

నటి— చక్కని దృష్టాంతమును జూపితిరి. పరస్పరసాహాయ్యమువలన సర్వకార్యములును నెఱవేఱు నని తేలెఁగా.

సూత్ర— ఇదియును ననుభూతమేకాని యనేక మహాకార్యములు స్త్రీలవలననే నెఱవేఱినవియును గలవు.

క. కుల మడఁగిపోవు పడఁపడి
నిలిపెఁగదా! యొక్కసాధ్వి, నేఁడో రేపో
పొలియుఁగ వంశం బనుతఱి
నెలయించెం గాదె? యొక వివేకిని మరలన్

కావున నెంతటి నిర్వాహకురాండ్రేని స్త్రీలయందుఁ గల రనుటకు సంశయము లేదు.

నటి— (తనలో) ఆర్యుని యుపన్యాసము సత్యవతినిఁ గుంతిని స్మరణకుఁ దెచ్చుచున్నది. (ప్రకాశము) కేవలబ్రహ్మచారులుగా నుండి యనేకమహాకార్యము లొనర్చిన పురుషసింహులు మాత్రము లేరా!

సూత్ర— లేకేమి?

తే. గీ. తండ్రిపెండిలికై పెండ్లి తాను మాని
కేవలబ్రహ్మచారియై కీర్తి కెక్కి
బలిమిమై స్వయంవరమున గెలిచి తెచ్చి
తమ్మునకుఁ బెండ్లిసేయఁడే! ధన్యుఁ డొకఁడు.

నటి— (తనలో) ఈ మన సురాసురజేగీయమానపరాక్రమక్రముం డగు భీష్ముంకు (ప్రకాశము) నాథా! మన మీ ప్రసంగములోఁ బ్రకృతమునే మఱచుచున్నారము. నేఁడు ప్రదర్శింపఁదగు నాటక మెయ్యది?

సూత్ర— (నవ్వి) వెఱ్ఱిదానా! అయ్యది నాందిలోనే సూచింపఁబడెఁగదా!

నటి— (యోజించి) పాండవజననము కాదుగదా?

సూత్ర— (సంతోషముతో)

తే. గీ. అంత సులభమునుం గాక యంత దుర్ల
భమ్మునుం గాక మధ్యమఫణితి నలరు
పద్యమునఁ గల్గు వ్యంగ్యంబు పయికిఁదీయ
నేర్చితివి నీదుభర్త ప్రశంసింపఁ దగఁడె?

(కౌఁగిలించుకొనఁబోవును)

నటి— (సిగ్గుతోఁ దలవంచుకొని కొంచెము తొలఁగి) ఆర్యా! దీనికినిఁగవులు తిరుపతి వేంకటేశ్వరులేనా?

సూత్ర— నీకొక్కటే గుఱుతును జెప్పుచున్నాఁడను. భారతకథను దెలుఁగులో స్వతంత్రించి నాటకముగా రచించినవారే లేరు. ఒకవేళనున్నను పాండవపదచిహ్నితమగు నామ ముంచినవారు లేరు. ఉన్నను సుప్రసిద్ధులు లేరు.

క. పారాశర్యమునీంద్రుఁడు
భారతమును వ్రాసెఁ దెలుఁగుపఱచిరి కవితా
స్వారాజు లొక్కమూఁగురు
వీరిరువురు నాటకముగ వెలయించి రిలన్.

(తెరలో) ఎవరక్కడ? పుట్టనిబిడ్డకుఁ బేరు పెట్టుచున్నారు? పరిశుద్ధమగుపరాశర శబ్దమున కపత్యప్రత్యయ మనెడి కళంకమును గూర్చు సాహసము గూడనా?

సూత్ర— (విని) తీర్థయాత్రార్థమై బయలువెడలిన పరాశరమునీంద్రుని మాటలు వినవచ్చుచున్నవి. మన మీపాటికి నరుగుదము రమ్ము. (నిష్క్రమింతురు)

## ప్రస్తావన.

(అంతఁ బరాశరుఁడు ప్రవేశించును)

పరా— (సంతోషముతోఁ దనలో) ఆహా! తీర్థయాత్రామాహాత్మ్యము!

ఉ. ఎందఱు పెద్దలెందఱు మునీశ్వరులెందఱు పండితుల్ మహా
నంద మొసంగఁజాలెడి ఘనంబులు నేలలు గొంచు నెన్ని వే
డ్కం దులఁదూగు పట్టణము గ్రామములన్ బురముల్ మఱెన్ని యీ
చందము లన్నియున్ గనఁ బ్రశాంత సుశాంతము గాకయుండునే?

(సంతోషావేశముతో) నాజన్మ మెంత ధన్యమైనది?

శా. కాశీయాత్ర యొనర్చితిన్ సుకృతి ప్రయాగక్షేత్రమున్ జూచితిన్
శ్రీశైలేశు భజించితిన్ గొలిచితిన్ శేషాచలావాసు రా
మేశున్ మ్రొక్కితి సన్నుతించితిని నీలాధరాధ్యక్షు రం
గేశున్ గాంచితి మెట్టినాఁడ నికఁ జెన్నౌ దివ్యదేశంబులన్.

(పరిక్రమించి) ఎదుట నేదో యొకనది పొడకట్టుచున్నయది.
(కొంతనడచి)

ఉ. నేరెడుపండుచాయ ఘననీరదమండలిభాతి నీలపుం
జేరువిధానఁ దుమ్మెదలపెంపుగఁ దోఁచు గగనంబుపోల్కి నీ
నీరము వన్నెగన్నెగల నిండుదనున్నది యింతవల్లనా.
నారము దేని కొప్పు? యమునానదియే యిది యుల్లఘంబులన్.

ఓహో! దీనిరామణీయకము!

తే. గీ. నలుపయిన నేమి మిగుల నానంద మొసఁగు
సొబగు గల్గిన దీ సతీసుందరాంగి
ఇట్టి సొగసరి భార్యగా నేలుచున్న
గేస్తు రత్నాకరుఁడు కృతకృత్యతముఁడు.

(ఆకసమువంకఁ జూచి) అరుణగభస్తిబింబము చాల నెఱుఁ బడమర దిగుచున్నది. కావున నే నింతలో నీ నదిం దాఁటి యవలియొడ్డున నేదేని యొక పవిత్రప్రదేశమున నీరేయి గడపి రే పొందుఁ గ్రుంకులిడి విధివిహిత కృత్యము లాచరించుకొని మఱియుం బోయెద. (దెసలు పరికించి) కర్ణధారుండు కాఁబోలును పుట్టినుండి దిగి యిటు వచ్చుచున్నాఁడు. నన్నుం గూడ నవలియొడ్డు చేర్చిన పదపఁ బొమ్మనియెద.

(అంత దాశుఁడు ప్రవేశించును.)

దాశు— (తనలో) మరల నెవరో యొక జడదారి గాఁబోలును వచ్చుచున్నాఁడు. నేఁ డేమోకాని యెంతసేపటికిని నాకుఁ గూటికే తీఱినది

కాదు. ఎప్పటితిండి? పొద్దుపొడుపువేళఁ దిన్నతిండి. ఏమైనను కూడు గుడిచినపడఁపడిఁగాని యీయనను దాఁటింపఁజాలను. (తలవంచికొని పోవుచుండును.)

పరా— (సమీపించి) ఏమోయి మరకాఁడా! నన్నావలికి దాఁటింతువు గాని రమ్ము.

దాశు— (తేఱిపాఱఁజూచి) అయ్యా! దండము. దయచేసి యిచ్చోటఁ గూర్చుండుండి. నా పిల్లదాని పంపించెదను. అది మిమ్ముల నవల దింపి రాఁగలదు. నాకు సెలవొసంగుఁడు. కూటివేళ దాఁటిపోవుచున్నది. (నిష్క్రమించును)

పరా— (తనలో) ఓహో! ఏమి వీనియోగ్యత? నా ప్రయాణమున కంతరము లేకుండఁ దన కొమరిత నంపనెంచినాఁడు. కానిమ్ము. ఇంతలో నీ యేటియొడ్డునం గల వృక్షరాజముల సొబగుం బరికింతుఁగాక. (పరికించి)

సీ. కొమ్మలు దిగవంచి గొడుగులచందాన
సేవించుచున్నట్టి చెట్లు కొన్ని
జలజలమనఁగఁ బుష్పములు నేలఁబడ రాల్చి
కైసేయుచున్న వృక్షములు గొన్ని
పొటుటాకులను గుప్పలు తెప్పలుగ నించి
ఛాదించుచున్న భూజములు గొన్ని
కడుబెడఁగగు పుష్పములచే నొడలెల్ల
మెఱయించుచున్నట్టి లతలు గొన్ని
తే. గీ. అరమఱ యొకించుకయు లేక యంతరమునఁ
బ్రతిఫలించు మహీజసంతతులు గొన్ని
కలిగి యీనది కనువారి కన్నుఁగవకుఁ
బండువు నొసర్చుఁ దనదుసంపత్తికలిమి.

(మత్స్యగంధి పుట్టిలోఁ బ్రవేశించును.)

మత్స్య— అయ్యా! యీపుట్టిలో నెక్కుఁడు. మిమ్మావల దింపి వచ్చెదను.

పరా— (పరికించి ఆశ్చర్యముతో తనలో) ఔరా! యీ జాలరికొలమ్మునకెంత యదృష్టకాలము వచ్చినది! ఏమీ యీ బ్రహ్మదేవుని యవివేకము?

ఉ. జవ్వనముల్ విలాసమున్ జక్కఁదనంబును మేల్మిచెక్కులున్
మవ్వపుఁగన్నులున్ మురుపుమాటలు కుల్కుపిసాళిగుబ్బలున్
నవ్వులతేటలున్ సొలపునన్ దగు మేటివిలాసవున్నడల్
నివ్వటిలంగఁజేసియును నీచపుజన్మము సంఘటించునే?

సీ. మృగశాబములకు నేర్పెడి నేర్పు గలచూపు
సోయగం బొలుకు కంబోయితళుకు
కుంభికుంభములయుక్కును ద్రొక్కి నిక్కునీ
ల్గెడి గుబ్బచన్గవలే బెడంగు
మాటిమాటికి ముద్దు మూటగట్టంగఁ జాలు
మురువున మెఱయు నెమ్మోముహరువు
మిసమిసల్ నించు క్రొమ్మించుసంచు నడంచు
మెఱుఁగారు నెమ్మేని మెలపుసోలపు
తే. గీ. గనినవో నెట్టి జడదారి కన్నుఁగవయు
రిచ్చపడు నట్టి యీమోవి మెచ్చులాఁడి
యచ్చరకుఁ బుట్టు పందక యక్కటకట!
నుచ్చెముబఁ బట్టు నెడ్డె కేమాడ్కిఁ బుట్టె?

(ధ్యానించుట నటించును.)

మత్స్య— (తనలో) ఈయనసుఁ డేమో యోజించుచు నామాట వినిపించుకొన్నట్లులేదు. "తొరలో నమ్మనిపరు నవలి కనిపిర'' మ్మని తండ్రి నాకానతిచ్చెఁగదా! తడవు చేసితినేని జనకునాజ్ఞ ననాదరించిన దాన నగుదును. కావున నిమ్మహనీయు నిఁక నొకపరి వేగిరించెద. (ప్రకాశము) స్వామీ! తడయక దయసేయుఁడు. మి మ్మవల దింపి నేను వెనువెంటన యిటకు రావలయు.

పరా— (తనలో) ఔరా! యీమాటల పొందిక! ఇట్టిపలుకులతో నీకన్నియ యెవరి నేమి కోరినను వృథా పోదు. (ప్రకాశము) ఇదుగో వచ్చుచున్నాఁడను. (పుట్టె నెక్కి మరల ధ్యానించుచుండును.)

మత్స్య— (పుట్టెను తెడ్డుతో నడుపును.)

పరా— (తనలో) ఇప్పటికిఁ దేలినది. ఈసుందరి వసుపీర్యసంభవ. ఈపె తల్లి నిక్కముగా నచ్చరయే కాని శాపవశమున మత్స్యమై యీబాలను గడుపున ధరించియున్న కాలమున నీదాశరాజు భృత్యులకుఁ జిక్కినది. వారా చేఁప యందమున కచ్చెరువంది తమ రాజునకుఁ గానుక వెట్టిరి. పదఁపడి యద్దాని గర్భమ్మున నిక్కన్నియయు నిఁక నొక బాలకుండును జన్మించిరి. ఈపె సర్వథా మాన్యురాలుగాని కేవల నీచురాలుగాదు. (యోజించి) ఏమో నామన ముత్తరలాక్షిం దగిలి మరలకున్నయది. ఇందుపాయ మేమి? (పరికించి) ఈపె సా[illegible] కేసియుం గాడక పుట్టె నడిపించుచున్నది. కొంచెము పలుకరించి చూతునా? (సంశయించి) మాటలాడ దేమో! (ధైర్యముతో) అడసిచో బలాత్కరించెదను

కృతకృత్యుఁడ నయ్యెద. ఇట్టి రహస్యసమయమున నన్నెవ రేమి సేయుదురు? (యోజించి) ఎట్టి గోప్యకృత్యములనైనఁ బంచభూతములును సూర్యచంద్రులును బరమాత్మయును జూచుచుందురుగదా! ఇదిగాక నేఁ జింతించినపని యోగ్యులకుచితమా! ఔచిత్యము మాటట్లుండ బలాత్కరించుట యెంత నీచకృత్యము? (ఆలోచించి) అయినఁగాఁ గర్తవ్యమేమి? (నిశ్చయముగా) మాటలాడించి యిక్కన్నియ యనుగ్రహముం బడయుటకన్న వేఱొం డుపాయములేదు. (ప్రకాశము) లతాంగీ! నీ పేరేమి?

మత్స్య— మత్స్యగంధి.

పరా— (ఆఘ్రాణించుట నటించి) ఓహో! యీ మత్స్యగంధ మీ శరీరము నుండియే వచ్చుచున్నదేమి! పాపము! ఈ వాసన యీ చక్కఁదనమున కెంతలోపముగానున్నది! (వెనుకఁ జూచి) అప్పుడే యేటి నట్టు నడిమికి వచ్చితిమి. ఇఁక నిక్కమలాక్షిని బ్రకృతోచిత ప్రసంగములోనికిం దింపిన నేమియగును? (యోజించి)

తే. గీ. ఈయబల నిత్తలోదరి నీమనోజ్ఞ
నీ లతాతన్వి నీబాల నీమృగాక్షి
మొదల నొకపరి స్పృశియించి పిదపఁ గాని
యే ప్రసంగమ్మునకుఁ గూడ నేచ జాల.

(చేయి పట్టుకొనఁబోవును)

మత్స్య— (తొలఁగి తనలో) ఏమీ? యీమహాత్ముఁ డిటులొనర్చుచున్నాఁడు! ఔరా! పరమవిరక్తుండయ్యును నిట్టిపనికిఁ బూనినాఁడే! కానిమ్ము. నేర్పున మరలింపవలెఁగాని మఱియొక్కచొప్పని ముప్పు రావచ్చును. మునులు శాపాయుధులుగదా! అందులో "నీయన వసిష్ఠుని మనుమఁ" డనికూడఁ దండ్రి నాకు వాక్రుచ్చియున్నాఁడు. (ప్రకాశము) దేవరా! మన మిరువురమును నొకటేప్రక్క నుంటిమేని యీపుట్టి యీనట్టేట మునిఁగిపోవును. కావున మీ రావలినై పునకుం జనుఁడు.

పరా— (మున్నున్నచోటికివచ్చి తనలో) ఇఁక నీలతాంగి నాకుఁ జిక్కినదియే, లేనిచో నేమేని విరసత్వమును సూచింపదా? అవ్వలియొడ్డు చేరిన పిమ్మటఁ దప్పక నామనోరథమ్ము సఫలము చేయును. కాని యంతదనుక నే నోపుటెట్లు? (యోజించి) ఈమె తియ్యనిపలుకులు కొన్ని వినుచుఁ గాలయాపనం బొనరించుకొందుఁగాక! (ప్రకాశము) ప్రియభాషిణీ! పుట్టి నట్టేట మునిఁగిపోవుననియా భయపెట్టెదవు? ఇట్లు మునుఁగకుండఁగనే నీవు కడపఁగలవు. ఒకవేళ నీ వన్నట్లే మునుఁగుఁగాక.

ఉ. ఈఁదఁగ నేర్తువే కద శుభేక్షణ నీవు, త్వదాశ్రితున్నను
గాదన కెట్టులేని యొక గట్టునఁ జెట్టకపోదువే? చెలీ!
నీదయకల్మి నేను నొక నీరనిధిన్ దరియింపనుంటి నిం
దీఁదఁగలేకపోదునె? యిదెంత? భవత్కుచకుంభ సంభృతిన్.

మత్స్య— (తనలో) సర్వవిధముల నిమ్మహనీయుని చిత్తము నాయందుఁ జిక్కినయది. పలదందునా? శపించును. లేదేని కన్యకాత్వమునకు భంగము కల్గును. ఇందేమిగతి? (పరికించి) ఒడ్డుసమీపమునకు వచ్చితిమి. మరల నీయన నా యున్నచోటికి వచ్చుచున్నాఁడు. ఆహా! కామాంధకార మెంత యవివేకమును బుట్టించుచున్నది? (ప్రకాశము) స్వామీ! యొకించుక తాళుఁడు. పుట్టె మునుఁగవచ్చు.

పరా— (చేయిపట్టుకొని) ఈపుట్టెతో నిఁక మనకేమి యవసరము? నన్నీ మహా మోహసముద్ర ముత్తరింపఁ జేయుటకు నీవే యొక పుట్టెవగుము. తడయకుము. (అని బిగియారఁ గౌఁగిలింపఁబోవును)

మత్స్య— (తొలఁగి) స్వామీ! మీవంటివారి యాజ్ఞకు నే నన నెంత? ఎవ్వరైనను లోఁబడియే తీరవలయును. అయినను తప్పుగాఁజూడక నామనవి కొంచెము చిత్తగింపవలెను.

ఉ. నీవు వసిష్ఠు మన్మఁడవు నేనొక జాలరివాని కూఁతురన్
భావమునందుఁ జూడఁ గడి భావ్యముగా దిటుచేసినన్ గులం
బా వెలిచెందు, మానినరులా హసియింత్రు, తపంబు నష్టమై
పోవు భవాదృశుల్ పడఁగుఁబోకలకుం దగువారలౌదురే?

క. తపమునమిను వంశంబున
కుపద్రవము సంభవించు నూహింపక యి
ట్టిపనికిఁ దిగఁబడ నగునే?
తపసుల కెందేని యిట్టి తగులము లున్నే?

పరా— (మరలఁ జేయిపట్టుకొని) సుగుణశాలినీ! "స్త్రీరత్నం దుష్కులాదపి" కావున నీ వెకులమందానవైనను దప్పులేదు. ఇదిగాక నీ జన్మమునుగూర్చి నీ కెఱుకలేదు గాని నాకుఁ బూర్ణముగాఁ దెలిసినది. నీవు బ్రాహ్మణ క్షత్రియ జాతులకుఁ దగినదానవు. ఇది నిశ్చయము. ఇఁక జాగొనరింపక నన్ను మన్నింపుము. (ఆలింగనముఁ జేసికొనఁబోవును)

మత్స్య— (తొలఁగి తనలో) వీరు దివ్యజ్ఞానసంపన్నులు. వీరి కేదేని గోచర మగును. ఏమో? నాజన్మ మెట్టిదో? వీరికిఁ దిరుగుసుగాఁబోలు ఏమైనను నాకుఁ దండ్రి యనుమతిలేని పని యనుచితముగదా!

(ప్రకాశము)

ఉ. చేఁపలకంపుచే నిగడి చెప్పఁగరాని యసహ్యభావముం
జూపెడి నాశరీరమును జూచి వరింపఁగ నిచ్చగించె దీ
వోపికమాని, దీన సుఖమున్నదొ? లేదొ? గ్రహింప వయ్యయో
పాపపుమారుబారిఁ బడి పండితభావము రిత్తపుత్తురే!

మ. అనఘా! మానవజన్మమెత్తుట యసాధ్యం బగ్రజత్వమ్ము గై
కొనుటన్నం గడు దుర్లభం బదియు నీకుం జేకుఱెన్ మీఁద గా
సిని లెక్కింపక మౌనివై తపమువాసిం జెంది పెంపొందు నీ
వనిమిత్తమ్ముగ మారుబారిఁ బడి నష్టింపఁగాఁ జెల్లునే?

పరా— నాకుఁ దపమును జపమును ధ్యానమును బూరుషార్థమును నీవే. నీకంపు నాకింపగునప్పుడావిషయమై నాకెందుకు విరక్తి గలిగించెదవు? (యోజించి) పోనిమ్ము పాపము. నీకీ కంపు మనమ్మున న్నేవంబు గలిగించుచున్నది కాబోలును సుందరీ!

క. మీనపుగంధము నీ నె
మ్మేనిం బాయించుఁగాత మిక్కుటముగ నా
యానతి నిది మొదలుగ నీ
మేనన్ మృగమదపుఁదావి మేకొనుఁగాతన్.

ఇఁక మాటాడక సన్నాదరింపుము. (మరలఁ జేయి పట్టుకొనును)

మత్స్య— (తనశరీరము నాఘ్రాణించుట నటించి) ఔరా! యీమహాత్ముఁడు నాకెంతటియుపకృతి నాచరించినాఁడు. ఇందుల కీ యనఘుని కేమి ప్రత్యుపకారము చేయఁగలను? ఇట్లగుఁగాక. (ప్రకాశము)

ఉ. తుంమదు కింత చెల్లునె? బుధుండవుగావె? యెఱుంగవే? ధృతిన్
జెందుము చిత్తవృత్తి నిటు చింపిరిపంపిరి చేయనేల? నా
యందము నీమనమ్మునకు నంటినదేని భవన్మనోరథ
మ్మొందఁగఁదీర్తు నొడ్డునకుఁబోవఁగని మ్మదుపమ్ము నిమ్ముగన్.

పరా— (పుట్టె దిగి యాపె కరమును బట్టికొని దింపఁబోవును)

మత్స్య— (దిగి పుట్టె నొక కొయ్యకుఁ గట్టి యొడ్డెక్కును)

పరా— (మదనావేశముతోఁ గౌఁగిలింపఁ బోవును)

మత్స్య— (తనలో) ఇఁక నెట్లయిన నియ్యనఘుఁడు నన్నువిడువఁడు. నా తప్పిదము తల్లిదండ్రు లెఱుఁగకుండ నెట్లు దాఁచుకొనఁజేర్తును.

(ప్రకాశము)

తే. గీ. కన్నియను నేను నాతోడఁ గలయనుంటి
వోమహాత్మ ! యమోఘవీర్యుఁడవు నీవు
తల్లిదండ్రుల కే సమాధానమును ప
చింపఁగా నేర్తు? ననఘాత్మ ! చెప్పుమయ్య!

మ. తలిదండ్రుల్ తల లెత్తలేక కడుపంత న్మన్ని యెగ్గింతు ర
న్నలుఁదమ్ముల్ పెఱవారి మోములు గనన్ శంకించి లజ్జింత్రు నె
చ్చెలులన్నన్ గడు గేలిసేయుదురు వాసిన్ జెండ్లిగాఁబోదు క
న్నెలకున్ జారుఁడొనర్చు వేఁకటు ల నెంతేఁ జింతఁగల్పింపవే !

పరా— తే. గీ. నీకు నాపొందుఁ జేసి కన్నెఱికమునకు
హాని వాటిల్లకుండెడు నది యటుండఁ
గోరుకొ మ్మిచ్చెదను నీవు గోరు వరము
లెన్నియేనియు నోశర్వరీశ వదన !

అచ్చరమచ్చెకంటుల యొయారము లారసి యూరకున్న నా
కిచ్చ జనించె నేఁడు తరళేక్షణ! దైవవశంబుఁ జేసి, నీ
మచ్చెపుఁ దావి యెడ ? నిను మన్ననఁ జేసి వరించు శేడ ? నా
సచ్చరితం బదేడ ? తనశక్యమె ? దైవకృతంబు దాఁటఁగన్.

మత్స్య— (సంతోషముతో) మహాత్మా ! నేనేమి కోరినను నొసంగెద మంటిరి
గానఁ గోరుకొనుచున్న దానను.

సీ. నిన్నుఁబోలంగ ల్గుచిన్నారిపాన్నారి
చిఱుతపాపని దయచేయు టొకటి
కన్యాత్వమున కించుకయు నిందు నందు లో
పమ్ము లేకుండఁ గాపాడు టొకటి
తల్లిదండ్రుల కీ ధ్యుదంత మించుకయును
దెలియకుండంగ సంధించు టొకటి
యక్షయం బగునట్టి యౌవనం బేవేళ
మించుకీలివి గటాక్షించు టొకటి

తే. గీ. మీనగంధమ్ము వాపి నా మేని కిప్పు
డీ వొసంగిన కస్తురితావి చేవ
వెడల వాసించుపద్ధతి చేయు టొకటి
నాకు దయచేసి యామీఁద నన్నుఁగొనుము.

గీ. నీకుఁ బ్రతిచెప్పఁ గానోప నీవెఱుంగ
నట్టి ధర్మంబుకలదె? కామాతురత్వ
మింతగా నీమనము నలయించెఁగాక
పట్టపగ లిట్టి కృతిసేయఁ బాడి యగునె?

పరా— సుందరీ! నీకోరినకోరిక లెల్ల నమోఘములై ఫలించుఁ గాక మఱియు నొక్క విశేషమ్ము వినుము.

మ. నిగమమ్ముల్ విడఁదీయువాఁడు సొబగు న్నేర్పున్ దయాళుత్వముం
దగువాఁ డుత్తముఁ డూర్జితాత్ముఁడు పురాణంబుల్ వెలిన్ జేసి యీ
జగతిన్ బేరును గాంచువాఁడు పరవిద్యాచతుర్యధుర్యుండు నా
దు గుణమ్ముల్ గలవాఁడు నీ కొకసుపుత్రుం డుద్భవించుం జెలీ!

(ముద్దిడుకొనఁబోవును)

మత్స్య— (తొలఁగి) మునీంద్రా! సర్వజ్ఞుండవగు నీ కొకరు బోధింపవలసినది లేశమును లేదు.

తే. గీ. "దాశపుత్రికతోడఁ బరాశరుండు
పట్టపగలు నదీతటీభాగమందుఁ
దగులు సేసె" నటంచు వింతగ. జనమ్ము
లాడికొను మాటలు సహింపనగునె? చెపుమ.

అదియునుం గాక.

తే. గీ. కాలనియమము పశులసాంగత్యమున క
నవసరముగాని మనుజుల కట్లు గాదు
కాన నామాట విని రాత్రికాల మబ్బు
దనుకఁ దాళుము పాపకృత్యం బిదేల?

తే. గీ. అరయుచున్నాఁడు నాతండ్రి యవలియొడ్డు
నందు, మార్గస్థు లెవరేని యరుగుదేర
వచ్చు నేమైన నిటు పశువై ఖరినిఁ జ
రింపుటకు నామనము సమ్మతింప దనఘ!

పరా— తలోదరీ! ఇప్పట్ల నీవు బోధించిన తెఱంగు గడు రమణీయము. ఇదిగో చూడుము. సర్వదృష్టినిరోధకం బగుమంచుం గల్పించుచున్నాఁడను. ఇంక నీసందియము దొలఁగెనుగదా!

మత్స్య— (ఆశ్చర్యముతో) ఔరా! మహానుభావుని తపోమహిమ! ఏరి కోరిన నదియే సంఘటించుచున్నాఁడు! ఇట్టి పరమపావనుని తనుసంబంధమున కెంతటి పుణ్యము చేసికొంటినో.

(తలవంచి నిలువఁబడును.)

పరా— (మోమునెత్తి) లజ్జావతీ! ఆ పొదరింటిం జూడుము.

క. తుమ్మెద లెల్లెడ ఝుంకా,
రమ్ములు పొసఁగించుచుండె రాచిలుకల మొ
త్తమ్ములుఁ బికములుఁ గేకులు,
సమ్మద మొనరించుఁ గామజనమిత్రములై.

చెలీ! నీకు నేఁడు కడు సుదినము.

క. సద్యోగర్భమ్మున సూ
ర్యద్యుతితో నీకుఁ గొడుకుఁడై పుట్టుఁ జవీ
యాద్యుఁడు నారాయణుఁ డా
విద్యానిధికతన జగము వెలయుఁగ జెలియా!

సందేహింపకుము. నా సాహాయ్యమ్ము గుర్భదమైయుండు. కొలఁది కాలమునకే నీకు నొక యుత్తమవంశసంభవుం డగు భూపాలుండు సంతుఁ గాఁగలఁడు.

ఉ. భారతకర్తయై తొలుత పావనయాత్మను గాంచు నీవునుం
భారతవంశము న్నిలిపె పావనకీర్తి వహింతు వారసే
ధీరత నోలుపోయి వలివం యిడు నొక్కొ? పరాశరుండు, సం
సారసుఖమ్ములం మరగు బాల్యములొక్కో? యనఘుల్ ఋషీశ్వరుల్
రమ్మ బాగు సేయకుము. (నిష్క్రమింతురు.)

## గద్య.

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ
బడిన పాండవజననమ్మునఁ బ్రథమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవజననము

## ద్వితీయాంకము

(అంత విరహావస్థతో శయనస్థుఁడై శంతనుఁడు ప్రవేశించును)

శంత— (నిట్టూర్పు పుచ్చి)

ఉ. వేఁటకు నెందు కేగితి? వివేకము నేటికిఁ గోలుపోయి యా
బోటిని గోరితిం గరియపో! యది సమ్మతిఁ జూపనేల? య
య్యాటవికుండు దానిపిత యందుల కడ్డు పచింప నేల? యా
హాటకగాత్రి మాటమి కటా! యెటు లబ్బెడి నేగి దిక్కుఁ గన్.

కొలఁదిదినమ్ముల క్రిందటనే కదా నాప్రియురాలు జాహ్నవి కొమరుని నాకు నప్పగించి "వీఁడు సర్వవిద్యలయందును విద్వాంసుఁడయ్యె నిఁక వీనికి యౌవరాజ్యపదము నొసంగు"మని చెప్పి యంతర్హితయయ్యె. దాశరాజు తన దౌహిత్రునకు రాజ్యమీయవలయుననియు లేనిచోఁ గొమరె నీయననియు నిష్కర్షగాఁ జెప్పినాఁడు. అందులకే యొప్పుకొంటినేని,

మ. "కొమరుం డుండఁగఁ బెండ్లియాడు నవివేకుం" డందు రనే కాక పు
త్రు మహీరాజ్యభరంబు పూనుపఁడహో! దుష్టుండు వీఁడంచు లో
కము నిందించు నశించు ధర్మము యశఃకాముల్ మహీపాలు ర
క్రిముఁ డీతండని గేలిసేసి కడు ధిక్కారింతు రెక్కాలముల్.

ఎట్లయినను అత్తలోదరిని గొనికాని జీవింపఁజాలను. (మెచ్చుతో)

ఉ. ఆ యలఁతారు చూపులయొయారము నాగమనంపు సౌరు నా
ప్రాయము తీరు నామురువు పల్కుల సొంపును నాయురోజసు
శ్రీయు నటుంత మేరకిని జెప్పను గప్పుదరంబుగాని వ
క్కాయజరాజ్యలక్ష్మి నవకాయపరిమళభాగ్యసంపదల్.

తలోదరీ! నీవు నిజముగా యోజనగంధివే యగుదువు. నీరూపరేఖావిలాసమ్ము లింతకుమున్ను విన్నందులకును జూడఁగన్నందుకును సరిపోయినది. అయిననేమి? నీతండ్రి కేవలమూర్ఖుఁడై వెఱ్ఱిపట్టు పట్టి "తాఁ బట్టిన కుందేటికి మూఁడే కా" ళ్ళనుచున్నాఁడు. పోనీ నేనీ మహామోహమ్మునం బడి యట్లేయని యొప్పుకొన్నను, నా కొమరుండు గాంగేయుం డేగతి సమ్మతించు? వానిసమ్మతి లేనిచో సాక్షాద్భగవంతుఁడేని నారాజ్యమ్మున నడుగుపెట్టఁ గలుగునా?

ఉ. పౌరవవంశవర్ధనుఁడు బాహుపరాక్రమధుర్వహుండు దు
ర్వారుఁడు జామదగ్న్యమునివర్యునిశిష్యుఁడు జహ్నుకన్యకా
దారకుఁ డవ్వసిష్ఠమునితల్లజు సత్కృప నెల్లవేదముల్
పారము ముట్టినాఁడు గుణభవ్యుఁడు నా కొమరుం డలంతియే?

శా. ఈరాజ్యంబఖిలంబు వానిది యొకం డీనేల? యే నేల నే
నీ రాజుల్ విని సమ్మతింతురె? పృథా యే నన్యథా చేసినన్
సారజ్ఞుల్ విని మెచ్చుకోని పనికై చర్చింపఁగా నేల? దు
ష్ప్రారంభుం డితఁ డంచు నిందఁబడ నేలా? నాకు లోకమ్మునన్.

(నిట్టూర్పు పుచ్చి తన్మయత్వముతో) ప్రేయసీ! యోజనగంధీ! నీపాణిగ్రహణము నాకుఁ బ్రాప్తిలేదు. నే నేమి సేయుదును? అస్వతంత్రుఁడను.

చ. కొమరులకున్ వివాహములు కోరి యొనర్తురు తల్లిదండ్రు ల
క్రమ మిటఁ దారసించె మనకర్జము పుత్రునధీన మయ్యె వాఁ
డమలుఁడు వానికిం దెలిసెనా? వెనుదీయఁడు వానితోడ నే
క్రమమునఁ జెప్ప నేరుతు? మొగం బెటు లెత్తుకొనంగఁ జాలుదున్.

ఇం దుపాయ మేదియును దోఁచదు. (విచారించుచుండును.)

## (అంత భీష్ముఁడు ప్రవేశించును.)

భీష్మ— (తనలో) తండ్రిగా రేలొకో వేఁటకు వెళ్లి వచ్చినదిమొదలు పరాయత్తచిత్తులై రాజకార్యములయం దనాదరము గలిగి శయనగృహమ్మునన కాలయాపనం బొనరించుచున్నారఁట.'? "కారణమే" మని మంత్రు లడిగియును కృతార్థులు కారైరఁట! దేహమం దస్వాస్థ్యమేమో యనుకొందమన్న నయ్యది లేశమును గానరాదఁట? ఇఁక నేమి కారణమో కదా? (యోచించి) ఏమేని యగుఁగాక. ఆయనకోరికం దీర్పకపోతినేని నేను బుత్రుఁడ నెట్లగుదును?

తే. గీ. బ్రతికి యున్నప్డు మాటను బాటి చేసి
మృతి గనినపిమ్మటను దగుకృతు లొనర్చి
యెపుడు తండ్రికి సమ్మోద మొసఁగఁజేయు
వాఁడె పుత్రుండు సఫలంబు వాని బ్రతుకు.

క. "శ్రీరాముఁ డొక్కరుండును
బూరుం డొక్కరుఁడు దక్కఁ బుత్రులలోనన్
లేరు జనకునాజ్ఞను గర
మారాధించిన వినీతు" లందురు పెద్దల్.

కావుననే వారి నిప్పటికిని గౌరవ ప్రశంసా పాత్రులలో నగ్రగణ్యులుగాఁ జెప్పికొనుచున్నారు.

క. వ్రతములుఁ దపములు జపములు
పితృసేవకు లొచ్చు తనదు పెంపునకెల్లన్
గతి తండ్రియె కావుననే
"పితృదేవోభవ" యటంచు వేదము పలుకున్.

(పరికించి) తండ్రిగారేదియో యోజించుచున్నారు. (సమీపించి నమస్కరించును.)

శంత— (కౌఁగిలించుకొని) కుమారా! ఆయెడఁ గూర్చుండుము.

భీష్మ— (కూర్చుండి) తండ్రీ! "మీ రేదియో తీరరాని విచారము మనమున నిడికొని కుందుచున్నా"రని మన మంత్రులు మొదలగువారు చెప్పికొనుచున్నారు. తమకును దుర్లభములగు కోరికెలు కలుగునా? అట్లయిన నింక జగమ్మునఁ గృతార్థు లెవ్వరు?

చ. అనుపమమైన రాజ్యము, మహాత్ములు మంత్రులు, శత్రురాజమ
ర్దనమగు తేజముల్, ధన పదభ్రియు, సౌఖ్యము కొల్ల, నందనుం
డనిమిషవాహినీప్రభవుఁ డన్నిఁట నున్నతి గాంచి మించి వా
రని వలవంత లోఁగొని కరంబు భరంబుగఁ గుందనేటికిన్.

శంత— (తనలో) నాకుఁగల యీకోరికె నీతనితో నేమని చెప్పుదును? ఛీ! కామ మెంత గర్హ్యము? అందునను,

చ. కొమరులు గూఁతులుం గలిగి కొండొక ప్రాయముపోయి యప్పుడున్
దమి నిలుపంగఁజాలక వృథావ్యసనంబు మనంబు నొంపఁ బా
రము నెఱుఁగంగనేరక దురంతపుఁ బెండిలిఁ గోరుఁ బో! లలా
ధముపలె మంచి పెద్దలకు నాత్మను జొన్పని మూఢుఁ డక్కటా!

యాథార్థ్య మెఱింగియును నే నమ్మగుపకు లోనైతి. అయిననగుదుం గాక ! కొమరునితోఁగూడ నేమని చెప్పువాఁడను (యోజించి) ఇట్లగుఁ గాక (ప్రకాశము) కుమారా! సకలగుణశాలియగు నీవంటి కొమరుఁ డున్నవానికి విచార మన నేమి? దుర్లభమన నెట్టిది ?

క. ఎనమండ్రఁగనియుఁ గొమరుల
ననిమిషనది నీదుతల్లి, యందఱలో ని
న్నును మాత్రము నా కిచ్చెను
దనలోనే కలిపికొనియెఁ దక్కినసుతులన్.

నిన్నుఁ గూడ యథాపూర్వముగఁ దనలోనే చేర్చుకొన నుంకించు చుండ నేను సహింపక ప్రతిజ్ఞాభంగమ్మున కంగీకరించి వారించితి నంతట నాపె నాపైఁ గనలి తనయిచ్చం బోవుచు దీనవదనుండనగు నన్నుం జూచి "రాజా ! విచారింపకుము నే నేదోయొక శాపకారణం బున నీకు భార్యనైతి. వసువులును నావలెనే శాపకారణమున మను ష్యులు కావలసియుండి నన్నుఁ బ్రార్థించుటచే నందుల కంగీకరించి యీదురితం బొనర్చుచుంటి. ఇపుడు నీచే వారింపఁబడి మొదటి ప్రతిజ్ఞ దప్పితివను నెపమున నేను బోవుచుంటి" నని చెప్పి నిన్నుం దీసికొని చని విద్యాబుద్ధులం జెప్పించి సత్యవాదిని గావున నప్పగమపానని తిరిగియు నా కప్పఁజెప్పె, అయిన నేమి ?

క. ఒకకొడుకు కొడుకునుం గాఁ
డొకకన్నును గన్ను గాదయో ! పుత్రా ! యిం
కొకఁడేని యథమపక్షం
బకటా ! యుండంగవలదె ? యాత్మజుఁడనఘా !

ఇందులకై నామనంబు కడు వ్యాకులపడుచున్నయది.

తే. గీ. దాశరా జను నొండొక్క ధన్యతముఁడు
గలఁడు వానికి నొక్కతె గలదు కూఁతు
రాకె నా కిచ్చుటకు నాతఁ డడ్డదిడ్డ
ములుగ నేమేమియో చెప్పె మొన్నఁ దనయ.

దానిపై నింటికి వచ్చి యేమియుఁ దోఁపక యిట్లుంటి.

భీష్మ— (తనలో) "అతఁడు చెప్పిన యభ్యంతర మే"మని తండ్రిని గోరుట కన్న నయ్యోడ కరిగి యతనివలననే వినుట కడు నుచితముగదా !

(ప్రకాశము) తండ్రీ! ఇందుల కింత చింతయేల? నే నిప్పుడ చని దాశరాజుం బ్రసన్నుఁ జేసికొని నీకోర్కె నెఱవేర్తు. నా కాజ్ఞయొసఁగుము.

(నిష్క్రమించును.)

శంత— (తనలో సంతోషముతో)

చ. కొమరుఁడ వన్న నీవె యిటు కోరినకోరిక దీర్చు పుత్రస
త్తములను వింటమే? యకట! తప్పని యొప్పని సుంత సందియం
బు మది నెఱుంగవే కడఁగి పూని మదీప్సితముం బొనర్చు నీ
కమరెడిఁగాక స్వేచ్ఛ కనువై తగు జీవిత మేవితంబునన్.

సర్వ విధముల నీ యుద్యమంబు సద్యశఃప్రద మగుఁగాక! నీకు దాశుండు దాసుండగుఁగాక!

(అంత దాశరాజ సహితముగా భీష్ముఁడు ప్రవేశించును.)

భీష్మ— (నమస్కరించి) తండ్రీ! ఇదుగో దాశరాజు! ఇయ్యనఘుండు తన పుత్రికను నాకుఁ దల్లిఁగాఁ జేయుట కంగీకరించెను.

శంత— (సంతోషముతో) కుమారా! ఎట్లంగీకరింపఁ జేసితివి? అతఁడు గోరిన విషమపుఁగోరిక కేమి యుత్తరము నిచ్చితివి?

భీష్మ— ఈవిధముగా నుత్తరం బొసంగితిని.

శా. రాజ్యం బక్కఱ లేదు నాకు, సకలారాతి క్షమానాథ సా
మ్రాజ్యంబుల్ వెసఁ గెల్చి తెచ్చెదను నీమన్నండె యీసర్వముం
బూజ్యుండై భరియింపఁగాఁగలఁడు సోముం డర్కుఁడున్ సాక్షులే
నే జ్యేష్ఠత్వము వాని కిచ్చితిని నీ కింకేల? శంకల్ నృపా!

శంత— (తనలో) ఔరా! వీని సాహసము! (యోజించి) ఔను! అప్రయోజకులకుఁగాని సుప్రయోజకులకు రాజ్యాధిక మందంత యాస్థ యుండదు కదా! (ప్రకాశము) తండ్రీ! నీ సాహసమునకు సంతసించితిని. నీవు స్వేచ్ఛాజీవివి గమ్ము.

దాశు— (సంశయముతో) గాంగేయా! ఇంతకు మున్ను నీవిట్లు చెప్ప నేను నిన్నీప్రశ్న యడుగఁదలఁచి మీ తండ్రి సమక్షముననే యా వచ్చునని మిన్నకుంటిని. నీవు సర్వవిధముల రాజ్యమునకుఁ దగియుండి "రాజ్యమక్కఱలే"దనుట యంత భావ్యముగాదు. ఒకవేళ పితృభక్తి పరవశుండవై యట్లు ప్రతిజ్ఞ పట్టితివే యనుకొందము.

క. నీ కొమరులో నీ మనుమలో
తాఁకుదురు వివాదమునకుఁ దమ రాజ్యంబున్
గైకొను తలఁపున, నిందుల
కేకరణిన్ బదులు చెప్పె? దెఱుఁగఁగ పలుకున్.

నాకు మొదటినుండియు నీవిషయముననే సంశయము.

ఉ. సోమకులైకభూషణుఁడు సుంతయుఁ డంటఁబికన్న మేటి మా
కోమలిపెన్మిసం గుఱుకు కోరియె మే మొసఁగంగవచ్చు మీ
రే మియుఁ గోరినప్పు డిఁక నేటికి సంశయ? మిట్టి చోనికన్
మామయటన్నఁ జాలదె? కుమార! యిదొక్కటి లేకపోయినన్.

భీష్మ— (నవ్వి) తాతా! మీసందియ మింతమాత్రమే కదా? అటులైన నిదె వినుఁడు.

ఉ. పెండిలి యాడినన్ బిదప బిడ్డలు పుట్టుట గల్గు నే నిదే
"పెండిలి మానుకొంటి" నని ఒట్టు ప్రతిజ్ఞయొనర్చితిన్ సుహీ
మండలి బ్రహ్మచారినయి మన్నవకుం గుదురౌనుఁ గాక బ్ర
హ్మాండము మున్గిపోవునె? యహో! యొకఁ డీగతి నుండిపోయినన్.

శంత— (తత్తఱపాటుతో) తండ్రీ! ఇట్టి దారుణ ప్రతిజ్ఞ నేలపూనెదవు? నా వివాహమున కేమి? మఱియొక విధముగాఁ గావచ్చును. లేదా? కాకపోనిమ్ము. నీయట్టికొమరుఁడుండ నాకుఁ బెండిలిమాత్ర మెందులకు? ఒక్కచో సంతానముగూడ లేకుండుటయుం దటస్థించినను రెండవపెండ్లి కూడదు. విచారించిన దీనియం దెన్ని నష్టములు గలవో పరికింపుము.

సీ. భార్య యుండఁగ నొండు భార్యఁ గైకొనువారి
కస్తి కుక్కలకు నక్కలకు నెఱుక
సంతాన ముండియు "సతిలే" దనుచుఁ బెండ్లి
యాడు పెద్దలబుద్ధి యాఁడుబుద్ధి
ఉభయంబు లేదని యుపయమంబు వహించు
వృద్ధుడై వేచ్ఛకు నెదురువాఁడు
"వెనుకటిపెండ్లము వినదు మాట" యటంచుఁ
బెండ్లాడు వాఁ డొక్క పెద్దమూర్ఖుఁ
తే. గీ. డెట్టులో కొంత జవ్వన మేఁగుపిదప
గ్రామ్యసుఖమునకై యొక కన్నెఁ గోరు
వాఁడు హీనుఁడు తులువ యవ్వాఁడు దేబె
వాఁడు వీఁడె శంతనుఁ డిఁక లేఁ డొకండు.

ఇట్టిచపలునకై నీవుబ్రహ్మచారివి గావు టుచితమా! అదియునుంగాక,

క. మనమును బంచేంద్రియములు
తనయా! కడుఁజంచలములు, దారవిహీనుఁ
జెనకి యగ్రోలోకమునకుఁ
బనుచుఁ వాఁడెంత పెద్ద పండితుఁడేనిఁ.

భీష్మ— తండ్రీ! నీవు చెప్పినది సత్యమేకావచ్చును. ఐనను,

మ. కురువంశమ్మునఁ బుట్టి నిస్తులయశఃకూలంకషుల్ సత్యసం
గరు లాశాంతధరేశ్వరుల్ చిరతపఃకంజోద్భవుల్ తాతలై
పరఁగన్ బెంపు వహించి శంతనుమహీపాలాత్మజన్ముండనై
తిరుగన్నేర్తునె యన్నమాట కది కీర్తిన్ దెచ్చునే? నచ్చునే?
అదియునుంగాక

ఉ. గంగకుఁ బుట్టితిన్ నిఖిలకల్మషహారిణికిన్ మహానుభా
వుం గురుఁ గొల్చితిన్ బరశువున్ గయిఁబూను మునీంద్రు, నిట్టి నే
నంగజుఁ ఘాటి కోడి యొక యంగనదాస్యము సేయఁబూనుక
న్నం గుఱిగల్గి నిల్చి ప్రతినన్ నెఱవేర్చుట పెంపు నింపదే?

ఆ. వె. పుట్టుబ్రహ్మచారి పట్టినపట్టు నె
ప్పట్టునందు వీడనట్టిఘనుఁడు
భార్గవుండు నా కుపాధ్యాయుఁ డాతండు
సిగ్గు వడఁడె? ప్రతిన చేసి తిరుగ.

శంత— కుమారా! అట్లు కాదు,. ఏయవస్థకుఁ దగినట్లు లప్పుడు సంచరింప వలయు.

ఉ. "ఆదిని బ్రహ్మచర్యము ననంతరమందు గృహస్థధర్మ మా
మీఁద వనప్రవాస మటుమీఁద యతిత్వ" మటంచు బ్రహ్మ వి
ద్యాదరు లండ్రుగాదె? తనయా! వినయమ్ముగలాఁడ వాగమా
పాదితమైనధర్మము నెపమ్మున నమ్మెనరింపఁ బాడియే.

భీష్మ— జనకా! ఆంజనేయాదులగు నస్ఖలితబ్రహ్మచారులను వినవా?

శా. ఆయుర్దాయము హెచ్చు వచ్చును యశం బాశాపిశాచంబు ప
వైవ్వయేగున్ దనుకాంతి హెచ్చు మెఱుఁగున్ హైన్యం బడంగున్ జెడున్
మాయాసంగతి, దేహదార్ఢ్య మెసఁగున్ మానం బవిచ్ఛిన్నమౌ
నే యెగ్గుల్ నహి బ్రహ్మచారులకు, నాత్మైక్యంబు గల్గున్ దుదిన్.

శంత— తండ్రీ! చక్కఁగా విచారించినచో గార్హస్థ్యమును సమస్తపురుషార్థ సాధకముగాని వేఱొండు తెఱంగు గాదు.

మ. అతిథుల్ పూజితులౌటచే క్రతువులం దాసక్తి గైకొంటచే
సుతులన్ గాంచుటచేఁ గుమారికల నచ్చున్ భర్తలోఁ గూర్చి పెం
డ్లి తగం జేయుటచే గృహస్థిహమునం దేజోధికుండై పయిన్
మృతుఁడై మోక్షపదంబు గైకొనెడిఁ జుమ్మీ! దేవతాసేవ్యుఁడై.

భీష్ము— నిజమ్మరసిన గార్హస్థ్య మట్టిదియే కావచ్చును. ఐనను ఎక్కడనో కాని యిందుఁ గృతార్థుఁడు చూపట్టఁడు.

మ. ధనమున్నన్ సతి లేక తత్సుఖము సందర్భించినన్ సంతతిన్
గన కాభాగ్యము గల్గ వేఱొకటి యాకాంక్ష్యంబు చేకూఱి నిం
కను నొక్కం డది గల్గ నొక్కఁ డదియుం గల్గన్ మఱొక్కండు లే
దనుకోల్దప్పదు తృప్తి యెక్కడణి లభ్యం బౌను సంసారికిన్?

శంత— (తనలో) ఓహో! వీని మనోనిశ్చయము కడు దుర్వారమై యున్న యది. చక్కఁగాఁ బరిశీలింప నిది యంతయు నాకు బుద్ధిచెప్పుటగాని వేఱొండు గాదు, కానిమ్ము. ఇట్లు గూడఁ జెప్పి చూచెదను. (ప్రకాశము) కుమారా! సర్వవిధములను "గార్హస్థ్యము నింద్య" మనికదా నీవు సమర్థించుచుంటివి! అట్టియెడ నాకుమాత్ర మయ్యది సుఖకర మెట్లగును? నేనును జాలించికొనియెద. మనమిరువురమును నిట్లే యుందము. (దాశునిదిక్కై) రాజా! నీ కొమిరెను నీయిష్టము వచ్చిన వరున కిచ్చి వివాహం బొనరించుకొమ్ము, నీవు కోరినహిరణ్యాక్షపరమ్ములు మ మ్మింత వఱకుఁ దెచ్చినవి.

దాశు— (తనలో) ఓహో! తుద కీ ప్రశంస వంశచ్ఛేదమునకు సూచక మగుచున్నదే! కానిమ్ము, ఇందులకు గాంగేయుం డేమి యుత్తర మిచ్చునో వినియెదఁ గాక!

భీష్ము— తండ్రీ! నేను బ్రహ్మచారిని. కావున నిట్లున్నచో నే లోపమును లేకుండెడిని. నీవో? ప్రకృత మే యాశ్రమమును లేక నిరాలంబుండవై యున్నాఁడవు. "అనాశ్రమీ నతిష్ఠేత" యని వృద్ధులు వచియింతురు. ఒకవేళ నీవిప్పుడు సన్న్యాసాశ్రమముఁ గైకొనెద ననుకొన్న నది విరాగమ్ములేని నీ కుచితము గాదు. "విరక్తిలేని సన్న్యాసము ముక్తినొడఁగూర్చుటకుబదులు ముప్పు నొడఁగూర్చు" నని యనేక గ్రంథములు చెప్పుచున్నవి. కావున,

ఉ. సత్యవతిన్ వరింపుము. యశస్కరులన్ సుతులన్ భరింపు
సత్యము పూనితిం బ్రతిన, సాగరముల్ స్థితి దప్పఁగా

దిత్యుఁడు చంద్రతారకలు తేజము డింతురుగాక మేటి వా
గ్గత్యము గల్గుఁగాక తిరుగండిఁక నీతనయుండు పూన్కికిన్.

(ఆకసమునుండి పుష్పవృష్టి గురియును.)

శంత— (ఆశ్చర్యపడి చూచుచుండును.)

దాశ— (అట్లే చూచుచుండును.)

భీష్మ— తండ్రీ! చూచితివికదా! ఇందులకు దేవతలు గూడఁ దమ యంగీకారమును బుష్పవృష్టి మూలమున సూచించుచున్నారు.

శంత— (సిగ్గుతో) కుమారా! ఈపుష్పవృష్టి సర్వసంస్తుండవగు నీ యోగ్యతను దెల్పుటకుఁగాని వృథాకాముకుండనగు నావివాహము ననుమతించుటకుఁ గాదు.

దాశ— రాజా! అట్లనుకొనకుము. ఇయ్యది నీవివాహమునకుఁ గూడఁ బ్రేరకమే, ఏమంటివా? మా సత్యవతి దేవేంద్రసఖుఁడగు నుపరిచరవసుని పుత్రిక. ఆ వసురాజునకు నిన్నల్లునిఁగాఁ గైకొను తలంపు పూర్ణముగా నుండి యొక్కనాఁడు నా యొద్దకు వచ్చి సత్యవతి తనకూఁతు రగుటం గూర్చి విస్తరించి వచించి యిట్లనియె.

చ. కలఁడుగదా! సమస్తరిపుసుస్మరుఁ డైన ప్రదీపపుత్రుఁ డ
య్యలఘుని శంతనుంబిలిచి యాత్మజనిచ్చి ననున్ గృతార్థుఁగా
సలుపుము దీనిహేతువున సద్గతి నీకును నాకుఁ గూర్పు మి
క్కలికి నిఁకేరు గోరినను గైకొన నీయకుమన్న! గ్రన్ననన్.

దీనింబట్టి చూడఁ దనచెలికాఁడగు వసురాజుకోర్కె చెల్లునని దేవేంద్రుఁ డిట్లొనర్చించి యుండును.

భీష్మ— తండ్రీ! నీ వియ్యనకుం దోడ్కొని తగుగౌరవమ్మునఁ జూచి మన్నించుచుండుము. నే నిప్పుడ యీయన యానతిం జేసి యరిగి

ఉ. బంగరుతేరిమీఁద నల భార్గవివోని మదంబ నుంచి పే
ర్మిం గొనితెచ్చి యెల్లరును మెచ్చుకొనందగు మేటికల్మి న
ర్థాంగిగఁ జేతు నీకుఁ, జరితార్థుఁడనౌదు మదంబకన్న నా
పెంగడు భక్తిఁగొల్తు నిఁక వేఱు వచింపకుమయ్య! మ్రొక్కెదన్.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ
బడిన పాండవజననమ్మునఁ ద్వితీయాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవజననము

## తృతీయాంకము

(అంత నిరువురు ఋషిబాలురు ప్రవేశింతురు)

ప్రథ— చెలికాఁడా! జామదగ్న్యముని తన యాశ్రమము విడిచి యియ్యెడకు రాఁ గతమేమై యుండునో?

ద్వితీ— ఏమీ? కారణము నీవెఱుఁగనే యెఱుఁగవా? ఆయనతో నవకుసుమ సుకుమారాంగియు యోగినీ వేషధారిణియు నగు నొక కన్నియ యున్నది చూచితివికదా?

ప్రథ— ఆ! చూచితిని. ఆమె యెవ్వరో? ఈయన వెనువెంట నుండుటకుఁ గారణమేమో?

ద్వితీ— తుదముట్ట వినుము. ఆమె కాశీరాజపుత్త్రి. అంబ యనునది. అంబికాంబాలికలు ఈమె చెల్లెండ్రు. ఈ ముగ్గురకును దండ్రి స్వయంవరము చాటింపఁగా గాంగేయుఁడు సకలరాజలోకము నోడించి కన్యకాత్రయమును దన రథమ్మున నిడికొని చని తన రెండవ తమ్ముఁడగు విచిత్రవీర్యునకుఁ బెండిలిసేయుతఱి నంబ యతనికి సవినయమ్ముగ నిట్లనియె.

ప్రథ— ప్రథమ సోదరుని వదలి రెండవవానికిఁ బెండ్లిసేయుట యెట్లు?

ద్వితీ— ఓహో! "సన్యాసి పెండ్లికి జుట్టుదగ్గఱ నుండియు నెర" వన్నట్లు నీకు బొత్తిగా నీ చరిత్రమే తెలియదే? సరే, ఆసంగతి పదఁపడి విస్తరించి వచించెదను గాని ప్రకృతమును వినుము.

ప్రథ— కానిమ్ము. అంబ యేమనియెను?

ద్వితీ— తే.గీ. "సాళ్వ భూపాలకునియందుఁ జాలవలపు
గలదు నాకు నాయందును గల దతనికి

బలపరాక్రమశాలివై పట్టితెచ్చి
తీవు ధర్మజ్ఞుఁడవు చెప్ప నేమిగలదు?"

ఈమాటకు భీష్ముండు సమ్మతించి సత్యవతి యనుమతింగూడఁ గైకొని "నీవు నీయిచ్చఁజను" మని వదలిపెట్టెను.

ప్రథ— (స్మృతి నభినయించి) పదఁపడి వృత్తాంతము నేనును గొంచె మెఱిఁగినదే. ఆరాజు "నీవు భీష్మునిచే నంటఁబడి రథమ్మున నుంచఁ బడితివిగాన నిన్ను నేనొల్ల" నన నామె తిరిగియు భీష్మునియొద్దకే తెంచి తన యవస్థ నివేదించుకొన నతండు "నీ వన్యసంగచిత్తవుగాన నిన్ను నా తమ్మునికి వివాహము సేయ నొల్ల" ననుటయు నంబ జగదంబయై యుండెనఁటగదా!

ద్వితీ— (నవ్వి) అవును. పేరు విచారించినచో నీమెమాత్రమేకాదు. ఈ ముగ్గురును జగన్మాతలుగా నుండఁదగినవారే. కానిమ్ము దీనికేమి. పిమ్మట "రెంటికిం జెడ్డ రేవణయై" ఋష్యాశ్రమముల పొంతఁ దపం బొనర్చుచుండ నొక్కతఱి యీ మెహాత్మహులుండరుదెంచి చూచి యావద్వృత్తాంతమును విని యోదార్చి "అమ్మా! పరశురాముండు నాకుఁ బరమమిత్రుఁడు కావున నీ వయ్యనఘునొద్దకుం జని చెప్పుము. అమ్మహనీయుండు భీష్మునిం బిలిపించి నీ యవమానము నెల్లనిఁ బాపఁగలఁడు" అని చెప్పఁగా మంచిదని యామె భార్గవు నాశ్రయించెను.

ప్రథ— సరే, ఈవిషయమై జామదగ్న్యముని తనశిష్యుఁడగు భీష్ముని మందలించుటకే కాఁబోలును రమ్మని వార్త చేసియున్నాఁడు.

ద్వితీ— (దృష్టినిగిడ్చి) అదుగో దేవవ్రతుఁడు, గురుదర్శనార్థమై వచ్చుచున్నాఁడు. మనము శీఘ్రముగా సమిదాహరణం బొనర్చికొని పోయి వీరికిఁ బరస్పరముం జరగు ప్రసంగము విని యానందింతము.

(నిష్క్రమింతురు.)

(భీష్ముఁడు ప్రవేశించును.)

భీష్మ— (తనలో) గురువుగారు స్వాశ్రమమునుండి గదలివచ్చియు హస్తిపురికి రాక, మధ్య నీ సరస్వతీతీరమున దిగి నన్నుఁ బిలువనంపిరి. ఇందులకుఁ గత మేమో; కానిమ్ము తినఁబోవుచు రుచు లెందుకు? (పరిక్రమించి) అదుగో గురువుగారు, ఎవరో యొకశిష్యురాలితో నేమో మాటలాడుచున్నారు. పోయి నమస్కరించెదఁగాక.

(అంబాసహితముగఁ బరశురాముండు ప్రవేశించును.)

పర-శా. అంతేవాసియె మాకు భీష్ముఁడతివా? యాతండు మా మాటకున్
సుంతైనం బ్రతిచెప్ప నోపఁ డొకచో శుంఠత్వముం బూని తాఁ
బంతంబే వహియించుఁగాక పరశుప్రాగల్భ్యముం జేసి వి
న్వింతుం జింతిలనేల? యూఱడిలుమో నీరేజపత్రేక్షణా!

అంబ— స్వామీ! యతఁడు మహాపరాక్రమశాలి యనఁగాఁ బ్రపంచమునఁ దానే యనియు నిఁక నెయ్యెడలను శూరులే లేరనియుం గడుగర్వించి యున్నాఁడు. కావునఁ దమ్మునుగూడ లెక్కపెట్టఁడనియే యే నూహించెద. స్వయంవరమండపమ్మున ననేక రాజన్యసమక్షమ్మున నతండు పల్కిన ప్రగల్భమ్ములు చిత్తగింపుఁడు.

మ. "కఱకుంగొడ్డలి వేల్పుకండు గురువౌఁగానన్ బ్రణమ్యుండు త
క్కొరులౌ శూరుల శూరులంచు మది నే నూహింప మీరిప్పు డె
ల్లరునుం జూడఁగ నీ లతాంగులను హేలన్ స్వీకరింతున్ పృథా
గరువం బేటికి? నిల్వరించి నను ధిక్కరింపుఁడా! భూపతుల్"

పర— (సంతోషముతో) వానిపరాక్రమ మట్టిదియే. వానియెదుట నీ రాజలోకం బన నెంత? దేవతలైనను నిలువఁ జాలరు.

మ. కృతవీర్యాత్మజుఁ డాదిగాఁ గల ధరిత్రీనాథులన్ పెక్కురన్
బ్రతిపక్షక్షితినాథదర్పదళన ప్రజ్ఞామహోత్సాహులన్
ధృతిమన్ముఖ్యుల నేనెఱుంగుదు నహో! దేవవ్రతుం బోలు ను
న్నతుఁ డొక్కండును లేఁడు రాముఁడువినా నాచూచురాజన్యులన్.

అంబ— (తనలో) ఔరా! ఈ మహనీయునికి శిష్యునియం దెంత గౌరవ మున్నది.

భీష్మ— (సమీపించి యంజలి ఘటించి)

సీ. ఏమహాభాగునం దిషువిద్య వెదఁజల్లి
మృత్యుంజయుఁడు కృతకృత్యుఁడయ్యె
ఎవనిశక్తికి మెచ్చి యవనీధరకుమారి
కొమరునికన్న నెక్కుడుగఁ జూచె
ఏమహావీరు పేరెద నెంచి భీతిమై
నృపు లాఁడుపోఁడుముల్ నేర్చుకొనిరి
ఎవఁడుకారణముగాఁ వవనీసురుల కప
నీపాలకత్వంబు నివ్వటిల్లె

తే. గీ. నీవనిపితరులు రాజన్యనివహరక్త
ధారలఁ దృప్తులైరి యే ధన్యతముఁడు
శాపమునఁ జాపమునఁగూడ శక్తినెఱపె
నట్టినీకు నమస్కార మనఘమూర్తి!

పర— (కౌఁగిలించుకొని) అబ్బాయీ! అటు గూర్చుండుము.

అంబ— (భీష్మునివంకఁ గోపదృష్టితోఁ జూచుచుండును)

భీష్మ— (అంబవంకఁ దిరిగి తనలో) ఓహో! ఈమె యీ మహాశీయుని కడ కేల రావలయును? (యోజించి) నన్ను గురువుగారు పిల్పించుటకుఁ గారణ మీ కుహనాయోగినియే యై యుండదుకదా?

పర— గాంగేయా! నీ లోకోత్తరమ్ములగు గుణమ్ము లన్నియు విని నేను సంతసించుచుంటిని. నిన్నుంబోల నొరులకుఁ గాదు.

చ. "జనకుని పెండ్లిచేసి గుణసత్తమతన్ గయికొంటి" వంచుఁ "ద
మ్మునికి వివాహమున్ సలిపి ముజ్జగముల్ నుతికెక్కె" నంచు నీ
గొనములు మానిసత్తములు గూడి ప్రశంస యొనర్పఁగాఁగడున్
వినివిని నీవివేకమును వేగతులన్ మది నెంతు నిచ్చలున్.

మ. విలువిద్దెన్ బలుమంది కిచ్చితిని మీ పృథ్వీశులం దేమి పా
ఱుయందేమి నినుం బలెన్ మదికి నేరన్ మోదమున్ గూర్ప రీ
యిల నిన్నుంబలెఁ గీర్తికిం దెఱవులై యేపారఁబో రొక్కరున్
గలిగె న్నాకు భవద్వశంబున యశఃకైవల్యలీలాగతుల్.

భీష్మ— (తనలో) నన్నింతగా నీ మహామహుఁడు నుతించుట యేఁదులకో? ఈ యుపోద్ఘాత మూరకయ బయలుదేర [illegible]కు వలనుపడదు. తృణీకృతబ్రహ్మపురందరుండగు నీ జగదేకవీరుని వలన నే కాదు మఱెవ్వరివలనను గావలసినకార్య మేమిం దుండదు. కానిమ్ము. ఏదో తేలక యుండునా? (విజయముగా ప్రకాశము) ఇదియంతయుఁ దమ యాశీర్వచనము. తమ శిష్యపరమాణువగు వీఁ డింతటినుతికిం దగఁడు. నాయందుఁ దమకంత యనుగ్రహమేని

ఉ. నాదగుబ్రహ్మచర్యము ప్రణష్టము గాక యెసంగునట్లు న
న్నేదెస నేరు నాజిని జయింపక యుండెడునట్లు సత్యమం
దాదర మబ్బునట్లు ధనమందు నిరాశ జనించునట్లు మీ
పాదయుగాశ్రితు న్ననుఁ గృపన్ గని దీవన లీయ వేఁడెదన్.

పర— నీకీ గుణమ్ములన్నియును స్వతస్సిద్ధముగనే యున్నవి. ఇందుల కొకరి యాశీర్వచన మేఁదుకు? (అంబను జూపి)

చ. అనఘుఁడవై సమస్త విషయమ్ములయందును మేలుబంతివై
పనుపడు నీకుఁ జెప్పఁ దగుపాటిదె? యీవిషయంబు; కూరతా
ఖనివయి యీ కనత్కనకగాత్రిని దెచ్చి పరిత్యజింపఁగాఁ
జనునె? యనాథయై యిది భృశంబు కృశించె నిటుల్ పొనర్తురే?

తే. గీ. గతము చింతింపఁగా నేల కడచిపోయె
నింక నేనియు నీ శర్వరీశవదన
ననుజునకుఁ బెండ్లిచేయు మీ యాఁడుగోడు
పోసికో నేల? నీవంటి పుణ్యమతికి.

ఆ. వె. అబల లస్వతంత్ర లగుటచే నంగనల్
వారిఁ బ్రోచుచుండ వలయుఁ బురుషు
లెచట స్త్రీజనంబు లెలమిమై వర్తింతు
రచట నిల్చు లక్ష్మి యనవరతము.

ఉ. అంగనలన్ వృథాగ నెవఁ డాఱడిపెట్టి తిరస్కరించు నా
వెంగలికిన్ యశోబలవివేకములెల్ల నశించు నయ్యనా
ర్యుం గడు నిందసేయుదురు యోగ్యులు "వీఁ డధముం"డటంచు; స
త్సంగతిగల్గు నీ కిది యశస్కరమౌనె? తలంచి చూడుమా.

భీష్ము— (తనలో) ఓహో! తుదకీ యనాత్మజ్ఞ యీయుపాయ మాలోచించి యీమహాత్ము నాశ్రయించినది. ఆశ్రిత పక్షపాతిత్వము మహామహులకు సహజం బగుటచే నియ్యనఘుం డిందులకుఁ బూనుకొన్నాఁడు. కానిమ్ము. యథార్థము నివేదించిన వినకపోవునా? (ప్రకాశము)

మ. "ఎద నే సాళ్వునిఁ గోరియుంటి" నని తా నీ కన్నె నాతోడ దీ
నదశన్ జెప్పఁగ "నన్యసక్తహృదయన్ గైకొంట త"ప్పంచు నో
ప్పాదవన్ బొమ్మని యానతిచ్చితి మహాయోగంబు చేకూరిన
ట్లని వేడ్కం జని వెంటనే మరలి తా నేతెంచె మాప్రోలికిన్.

అట్లు వచ్చి సాళ్వుండు తన్నవమానించుటకుఁ గారణంబు నేను రథమ్మునుంచి తెచ్చుట యని చెప్పి తన చెల్లెండ్రలోఁ బాటు మదనుజానకుఁ దన్నుంగూడఁ బరిణయంబు గావింపు మని వేఁడుకొనఁగ నేనంగీకరింపనైతి; అందులకుఁ గారణంబు సర్వజ్ఞులగు తమకు నేను వక్కాణింప నవసరము లేదు.

క. కొండిక లగు కన్నియలకుఁ
పెండిలి యగు [illegible]

యండజయానకు; నది గా
కొండొరు వలచిన లతాంగి నొప్పునె కొనఁగన్?

తా.— (కోపముతో) ఇంతయును నీవు చెప్పఁబూనిన ముఖ్యాంశమేమి? ఈపె నత్యోగతిపాలు చేసెదననియే కదా? ఏదో కొంచె మీ కన్నియయందు లోప ముండుటంబట్టియే యీవిషయము మావఱకు వచ్చుటయు మేము నీకుఁ జెప్పుటయు నీవు మామాట తృణీకరించుటయుఁ దటస్థించినది. నీ వీ స్వల్పలోపమున కీ యబల నింత యనాదరింతువేని నాచేయు ప్రతిజ్ఞ వినుము.

ఉ. చంపెద నిన్ను నీ యనుజుఁ జంపెద నీదగు బంధువర్గమున్
జంపెద నీదు భృత్యులను జంపెద నా కెవరడ్డమైనను
జంపెద నీపురంబు వెలుచన్ బరశుజ్వలనాబ్ధిలోపలన్
దింపెద మున్నుపోలె నృపతివ్రజమున్ బనిఁబూనిఁ దంపెదన్.

(పండ్లు పటపటఁ గొఱుకుచు) ఏమీ! నాకు శిష్యుండవై యుండి యీమాత్రము నేని నాయాజ్ఞను మన్నింప నేరవుగా? అవురా! జాతి!

ఉ. క్షత్రియజాతి యంచెఱిఁగి క్షత్రియులెల్ల నపాత్రులున్ ద్విష
ద్గోత్రులు నం చెఱింగియును గొండొకకాలమునుండి "యెందుకీ
శత్రుత" యంచు మిమ్ములను జాత్రులుగాఁ గొనుచుంటి నేఁడు నా
గాత్ర మశేషమున్ రగులఁగా గమకించితి వౌర! దుర్మతీ!

నీ వెట్టివాఁడ వైనను నీయందలి వాత్సల్యప్రాబల్యముంజేసి యిం కొక్కమాట చెప్పుచుంటి నాలకింపుము.

ఉ: ఈకమలాక్షి కీవు గతియేదియుఁ గల్పన సేయవేని యీ
లోకములో మఱొక్క నృపలోకశిఖామణి యాదరింపఁ డే
కాకినియై యిటుల్ తిరుగఁగావలె యౌవనదుర్మదంబు పల్
పోకలు నేర్పవచ్చు నెటుపోయిన నీదురితంబు నీదగున్.

క. చిన్నతనము మానుము నీ
కన్నన్ మూర్ఖుండఁ గానుగా? నేను; మృగా
క్షి న్నీదుతమ్మునికిఁ జెం
డ్లి న్నాకై సేయు మినుమడింపుము యశముల్.

క. ఎఱుఁగక తప్పొనరించియు
నెఱిగించినయప్పు డెఱిఁగి "యెవ మిది" యటం
చరసి యది దిద్దుకొనుటయె
మరియాదమమీ [illegible] .

భీష్మ— (తనలో) ఈయనఘుండు తా నేది తలఁచిన "నది యట్లు కావలయు" ననువాఁడేగాని యొకరు చెప్పు త్రోవకు వచ్చువాఁడు గాఁడు. పోనిమ్ము. "గుర్వాజ్ఞగదా?" యని యిందుల కొప్పుకొంద మన్న నియ్యది యననురక్తదాంపత్య మగుటచేఁ గులనాశనంబునకు హేతు వౌను. కావున నేదేని తెఱంగున నీమహాత్ము నొప్పించుటయు నొప్పు కున్న నియ్యనఘు నాజ్ఞ చొప్పున నాహవంబునకు దిగుటయు నిందుఁ గర్తవ్యములు. (ప్రకాశము)

చ. గురువరులయ్యు మాయెడలఁ గూరిమిగల్గినవారలయ్యు నొం
డొరుల తెఱంగునన్ బలుకు టొప్పునఁటయ్య! పరానురక్తయౌ
తరుణి కుటుంబమున్ జెఱుపదా? యిటు దా ముపదేశముం బొన
ర్తురె! "వినలే" దటంచు నను దూఱుదురే! యిది నాదు దోసమే?

క. గురు లేమనినను శిష్యులు
త్వరపడఁగారాదు వారె దయఁ జూతురు కో
పరసము కొండొక మరలిన
తఱి నట్లగుటన్ బ్రశాంతి దగు శిష్యులకున్.

తా మేమివచించినను నయ్యవి మా కాశీర్వచనములు. తమతో మాకు వివాద మెన్నఁటికిని సమంజసము గాదు. శాంతి వహించి యీ దీనుని మన్నింపఁ బ్రార్థించెదను. (అంజలిపట్టి నిల్చును.)

పర— (కోపముతో)

మ. "గురు వీతం"డని పూర్తిగా నెఱిఁగియున్ గ్రూరుండవేకాక ధి
క్కరణంబుం బొనరింతువే ఖలమతీ! కార్యం బకార్యంబు నా
నెఱుఁగం జాలక యేను జెప్పెదనె? నీవే నాకు బోధించుటల్ ?.
గరువం బింత జనించెనే? సరిసరే కానిమ్ము యుద్ధంబిఁకన్.
ఓరీ గురుద్రోహీ! క్షత్రియకులాంకూరమా!

చ. చిరమునుండి శాంతమును జెందిన నా హృదయంబులోని చి
చ్చురులఁగఁజేసియున్ బయికి యోగ్యగతి న్నటియించుచుంటి వే
నెఱుఁగనె? యింతమాత్ర మిదియే పరికింతువుగాక బ్రాహ్మణ
స్ఫురణము వేగఁబోయి బలముల్ గొలువన్ జను దెమ్ము పోరికిన్.

భీష్మ— (తనలో) ఇఁక గురువుతో గ్రుద్దులాట యొట్లునుం దప్పదు. తప్పక పోవుఁగాక! ఇదియును గుర్వాజ్ఞగనుక నంత తప్పిదము గాదు. కాని వాత్సల్యము మాత్రము వారికిఁ జనుఁ గాని నాకు లేశమును జనదు. కావున వినయముగనే మనవి చేసికొందుఁ గాక. (ప్రకాశము) దేవా! దేవర కృపాళూ! నాపై నిట్లు కినిసిన నీ కేను మనవి చేసికొను టెట్లు?

శా. నాకున్ మీకును బోరు న్యాయ మగునే? నన్మీరు నిర్జించినన్
మీకున్ గీర్తిఘటిల్లునే? యొకట నే మిమ్మోడఁగాఁ జేసినన్
లోకుల్ కాకులు గేలిసేయరె? దయాసత్త్వంబు వోనాడి నా
పైకిన్ వచ్చుట ధర్మమే? రిపుఁడనే? ప్రాజ్ఞుల్ ప్రశంసింతురే?

పర— (కోపముతో) ఏమీ! నీవే నన్ను నిర్జించెదవుగా? కానిమ్ము, నీకీ ధైర్య మెక్కడినుండి వచ్చినదో నే నెఱుఁగుదునులే.

ఉ. "రామున కోడె నీ పరశురాముఁ" డటంచును "వాఁడు క్షత్రియ
గ్రామణి" యంచునున్ దలఁచి కాఱులు ప్రేలఁదొడంగి తీవు శ్రీ
రాముఁడు నిన్నుఁబోలె నొక రాజకుమారుఁడు గాఁడు విష్ణుతే
జోమహితుండు నావలెనె; సూక్ష్మమతుల్ గుఱుతింతు రింతయున్.

క. రాముండె నేను నేనే రాముఁడు
మాయిరువురకుఁ బరాభవ మనఁగా
నేమి? యిది యొప్పకుందురె?
ధీమంతులుఁ దత్త్వవిదులుఁ దేజోధికులున్.

కానిమ్ము, దీనికేమి? నీవు సైన్యసమేతుండవై యరుదెమ్ము. సకలమ్మును బదఁపడి తెలియఁగలదు.

భీష్మ— (తనలో) పృథివి పుట్టినదిమొద లెవ్వనికిని దటస్థింపని దురవస్థ నాకుఁ దటస్థించుచున్నది. కానిమ్ము. ఇందులకుఁ బ్రతిక్రియ కన్పట్టదు. నే నొకటి చెప్పిన వేఱొకటిగాఁ బరిణమింపఁజేయు నీ మహామహునితో నేమి వచించినను గలహకారణమే యగుచున్నది. (ప్రకాశము) స్వామీ! తామిప్పు డూహించినట్లు నేను దమ్మును జయింతునని కాని తాము శ్రీరామున కోడిపోవుటచే నమ్మదాదులకుఁ గూడ లొచ్చని కాని నా యభిప్రాయము కాదు. నే నేమి మనవిచేసికొన్నను దమ హృదయమున కది యన్యథాపరిణమించుచున్నది. కావున,

ఉ. దేవరయాజ్ఞచొప్పున నిదే యనిఁ జేయగ నియ్యకొంటి మీ
సేవ పొనర్చి మున్ను కృషిచేసి గడించిన శస్త్రవిద్యయే
పావన తేజ! నా కిపుడు బాసట సేసెడుఁగాక సేన లిం
కేలయు నాకు నేటికి? మహీయము మీపదభక్తి చాలదే?

ఆజ్ఞ యొసంగుఁడు. రథినై యరుదెంచెదను.

(నిష్క్రమించును)

**అంబ**— చూచితిరికద, మీ శిష్యుని దురహంకారము ? నాకై యామోఘవచస్కు-
లగు తమ వాక్కుఁగూడ వృథాగా వినియోగించితిరి. మిమ్ములనే యప
మానించువానికి నాబోఁటి బోటి యొకలెక్కా ?

**పర**— (కొంచెముకోపముతో) కుమారీ ! ఇందు నీలోపముఁగూడ నున్నదిగాని లేకపోలేదు. ఏమైనను మచ్ఛాసన మతిక్రమించుటఁజేసి యవశ్యము నతని శిక్షించి తీఱెదను.

**అంబ**— అతఁడట్లు సమర్థించెనేకాని నా లోపము లేశమును లేదు. ఏమంటిరా ? నే నీస్వయంవరమునకు మున్నే సాళ్వుని వరించి యుంటిని. నా చెల్లెండ్రకొఱకు మాత్రమె స్వయంవర మేర్పడినది. వినోదముగాఁ జెలికత్తియలు నాకుఁగూడ స్వయంవరోచితాలంకారమును జేసిరి. అంతియకాని నే నిందుద్దేశింపఁ బడినదానఁగాను. ఇది యిట్లుండ,

**తే. గీ.** బ్రహ్మచారిగదా ! తాను బడఁతి నెట్లు
లంటె ? నిదియు స్వయంవర మగుట యెఱేఁగి
యప్రయోజకుఁడగు తన యనుజుకొఱకుఁ
గోర్కె లేని మమ్ముల నేల కొనఁగవలయు ?

నేను "పరానురక్త"నని కదా! యీతండు మీతోడఁ జెప్పుచున్నాఁడు నా చెల్లెండ్రుమాత్ర మాతనిం గోరి వరించియుండిరా ? అగస్త్యభ్రాంత యన్నట్లు భీష్ముని తమ్ముఁ డనుట తప్ప నతని పేరేని యెవ్వరికిని దెలియదు. ఇది యిట్లుంతెము. ఈతని పెద్దతమ్ముఁడు చిత్రాంగదుఁడు గడుఁ బొగరునఁ జరింపఁ గని చిత్రాంగదుం డను గంధర్వుఁడు రూపు మాఁపెఁ గదా ! అప్పుడీ గాంగేయుని పరాక్రమ మేమయ్యెనో యోజింపుఁడు.

(అపటీక్షేపముగా గంగ ప్రవేశించును)

**గంగ**— (తనలో) కొమరునిపై గురువయ్యును స్వల్పవిషయమ్మునకు భార్గవుండు గసలుచున్నాఁడని సరస్వతి నాకుం జెప్పెఁగావున నమ్మహనీయు నెట్లేని యనునయించెద. (సమీపించి ప్రకాశము) మహాత్మా! చిఱుతయగు శిష్యునిపై నలుగుట తమకు ధర్మము కాదు. నా మొగమేనిఁ జూచి నాకొమరు ననుగ్రహింప వేఁడుకొనుచున్నదానను.

**పర**— (వైమనస్యముతో)

**క.** ఎక్కడి గురుఁడను నే నిం
కెక్కడి శిష్యుండు వాఁడు; హీనునిగతి స
న్నెక్కట తృణీకరించెను
ధిక్కారము సైఁపురె ట్లుదీర్ణచరిత్రుల్.

నీయందు నేను గౌరవము లేనివాఁడఁ గాను. నన్నెరక మాటమాట పెట్టకుము. విచ్చేయుము. అంత వలసినచోఁ బుత్రునికి బుద్ధిచెప్పుము.

గంగ— ఈ యనఘుని మనము పూర్తిగాఁ జెడియున్నది. ఇఁక నే నేమివచించినను లాభము లేదు. పోయి కొమరునికే బోధింతుఁగాక !

(నిష్క్రమించును)

అంబ— (తనలో) ఈపెద్దల నీరణము విచ్ఛిన్నమైనదని యనుకొంటిని. కాని యవంధ్య ప్రయత్నుండగుటచే నిస్పృహణీయుం డీపెమాటలను వినిపించుకొననే లేదు. (పండ్లు పటపట కొఱికి) ఎట్లేని వాని శిరము ధరఁ ద్రెళ్ళవలయు. నా పరిభవానలము చల్లాఱవలయు. స్త్రీననికదా ! నన్నింత నైచ్యముగాఁ జూచుట ! కానిమ్ము,

తే. గీ. స్త్రీల పట్టుదలయు స్త్రీల సామర్థ్యంబు
స్త్రీల యోగ్యతయును స్త్రీల మనముఁ
దెలిసికొనెడిఁ గాక దేవవ్రతుం డొక్క-
యంబ కారణమున ననద యగుచు.

(భీష్ముఁడు రథసహితముగా ప్రవేశించును)

భీష్మ— (వినయముతో)

తే. గీ. అంజలి ఘటింతు మీకు వీరాగ్రగణ్య !
మ్రొక్కెదను మీ పదముల కమోఘచరిత !
ఇదె నమస్కారమయ్య మునీంద్రవంద్య !
అయ్య ! సాష్టాంగ మిదుగో లోకైకపూజ్య !
ఈ నా మనవి యొకటి చిత్తగింపవలయు.

ఉ. నే రథమందు మీరు ధరణీతలమందును నుండి పోరు నీ
తీరు నుతింతురే ? రణవిధిజ్ఞులు నన్నిది నీఁడు మందుఁడో
తేరికి మీరుఁగూడఁ బ్రయాతింతురో యానతి యీఁదగున్ మహో
దారచరిత్ర ! మీ కొరులు ధర్మము చెప్పెడిపాటివారలే ?

పర—(సంతోషముతో) గాంగేయా ! నీ తెలివితేటలకు నాకుఁ గడు సంతోష మగుచున్నది. నీ విప్పుడు నమస్కరింపవేని నిన్ను శపించియే యడఁచి వేయుదును. ఇఁక నిన్నాశీర్వదింపవలసియున్నను నే నిన్ను జయింపఁ బూనుకొంటచే విజయము తప్పఁ దక్కిన శ్రేయస్సులు గలుగునట్లాశీర్వ

దింపఁబడితివి. మాకు రథాదికము సర్వమును వచ్చుటనే సంసిద్ధము కాఁగలదు. రణోచితస్థలమ్మున కవతరింపఁ దమ రమ్ము.

(నిష్క్రమింతురు)

అంబ— (చూచి) మునుమున్న భార్గవుఁడే శిష్యునిపై ననేకములుగ శరములు గురియుచున్నాఁడు. ఔరా! ఒక బాణమేని దన యరదము పొంతకుఁ గూడ రాకుండఁగనే గాంగేయుండు వారించి మరలఁ గొన్ని యమ్ములు గురువుపై నిగుడ్చుచున్నాఁడు. (ఆశ్చర్యముతో) ఈ యుద్ధము గడు భరముగా నున్నయది. ఇది చూచుటకే కడు భీతిగలిగించుచున్నది. (ఆకసముపంకఁ జూచి) అంబరచరుల విమానము లెల్లయెడల నిండినవి. ఋషులందఱును బరశురామపక్ష మవలంబించినట్లు కనుపట్టుచున్నారు. ఔరా! యెన్నిసార్లిరువురును మూర్ఛిల్లి మరలఁ దెప్పిఱిల్లుచున్నారు. ఎన్నెన్ని మహాస్త్రములు ప్రయోగించి వారించుకొనుచున్నారు. (వినుటనటించి) గురువరుఁడు సింహనాద మొనర్చి యేమో అనుచున్నాఁడు.

(తెరలో)

ఉ. నిన్ననె చచ్చిపోతివని నే ననుకొంటినిగాని యంతలోఁ
గ్రన్నన నూర్పువచ్చితివి కాఁగల తక్కిన బన్న మీ దినం
బున్నది కాచికొమ్ము ప్రళయోగ్రము లీ శరముల్ భవాదృశుల్
వెన్నిడి పాఱిపోదు రివి వీనులు సోకినయంతమాత్రనే.

అంబ— (బొమముడిపాటుతో) నిన్న నంతవఱకు వచ్చినమాట సత్యమే. కాని యంతకుమున్నీయనకుమాత్ర మీయవస్థ పట్టలేదా? తుదకేమి జరగునో కాని యిప్పటికి గురుశిష్యులలో నొకరి కొక రెప్పట్లను దీసిపోయినట్లు లేదు. (పరికించి) భీష్ముఁ డేదో ధ్యానములో నున్నట్లు తోఁచుచున్నది. (ప్రక్కకుఁ జూచి) ఎందులకో కలహాశనముని యిటు డిగుచున్నాఁడు.

నార— (ప్రవేశించి) గాంగేయా! తత్తఱపడి యనుచిత కృత్యమును జేయుచున్నాఁడవు.

చ. వసువులు నిన్న రాతిరి యవంధ్యతరంబగు మోహనాస్త్రముం
దెస స్మృతి కెక్కఁజేసి రిది విష్ణువుపై గురువర్యుపై ద్విజా
గ్రసరునిపైఁ బ్రసారితముగా నొనరింతె! యెఱుంగఁ డీ శర
ప్రసరణ మాఁగుమంత్రమును రాముఁడు నీమది నేవియెంచితో!

భీష్మ— (ప్రవేశించి) మునీంద్రా! అయ్యనఘుఁ డిద్దాని నాఁగుట యెఱుంగఁడను హేతువుననే నే నిది ప్రయోగింపఁ దగ దనుట యంత యుక్తి

యుక్తముగాఁ దోఁచదు. మీ రనేక రణమ్ములు చూచియుండియును నట్లు వచించుటకుఁ గత మారయఁ జాలకున్నాఁడ.

పర— (తనలో) ఇప్పట్ల నీతనికిఁ జెప్పఁదగిన యుక్తియే లేదు. (యోజించి) ఇట్లగుఁ గాక. (ప్రకాశము) గాంగేయా! నీగురుండు సైన్యసమేతుం డవై యనికి రమ్మన్నప్పుడు నీ వేమంటివో జ్ఞప్తికిఁ దెచ్చికొనుము.

భీష్మ— (స్మృతి నభినయించి "దేవర యాజ్ఞచొప్పన" అనునది మరలఁ జదువును)

పర— అదుగో "మీసేవ పొనర్చి మున్ను కృషిచేసి గడించిన శస్త్రవిద్యయే" అనికదా! చెప్పితివి. దాని కర్థమేమి? నేను మీయొద్దఁ జదువుకొన్న శస్త్రవిద్యచేతనే మీతోఁ బోరాడెదఁగాని యితరము లేశమును సహాయముగాఁ గొనసని యభిప్రాయము స్ఫురించుచున్నది. ఈమోహనాస్త్రము నీవు వెనుకటిజన్మమునం దెఱిఁగినదియు నిప్డు వసువులచే స్మారితమైనదియుఁ గాని జామదగ్న్యుని కతన సంపాదించినది గాదు కావున,

ఆ. వె. సత్యసంగరుఁడవు సత్యప్రతిజ్ఞుఁడ
వనఁగ వినుతి కెక్కినట్టి ఘనుఁడ
వింత స్వల్పమునకు నిట్లేల ప్రతిభంగ
మాచరించుకొనెదవయ్య వృథగ?

భీష్మ— (తనలో) ఈమహాముని కలహాశనుం డయ్యును నియ్యెడ నెందులకో వారింపఁ బూనుకొన్నాఁడు. (ప్రకాశము) మునీంద్రా! ఇప్పట్ల మీరు చెప్పఁ బూనినది కొంత యుక్తియుక్తముగనే యున్నను, సమంజసముగా మాత్రము లేదు. ఎవ రేమి చెప్పినను నేను రణమునుండి మరలువాఁడను గాను.

ఉ. చచ్చినఁ జచ్చిపోవలె వెసన్ గురుపర్యుని చేతిలోన, న
స్త్రచ్ఛటులాస్త్రసంపదకు మద్గురుఁ డేనియు లొచ్చుగావలెన్
వచ్చినవాదు వచ్చెనిఁక వారణ చేయకుఁ డయ్య! మీనుడుల్
నచ్చవు మాకు; మాపయిఁ జలంబు వహింపకుఁ డయ్య! యియ్యెడన్.

పర— దేవవ్రతా! ఇంతటితో మీసంగరము సమాప్తమే కాని యిఁక జరగనేరదు. దేవతలయు ఋషులయు నభిప్రాయము గట్టిగా నిట్టులున్నది. అదుగో జమదగ్నికూడఁ దన కొమరునకు బోధింపుట కిటు వచ్చుచున్నాఁడు పరికించితివా?

(జమదగ్ని ప్రవేశించును.)

జమ — (తత్తఱపాటుతో) తండ్రీ ! పరశురామ !

ఉ. నాకయి ఘోరమైన ప్రతిన౯ గయికొంటివి మున్ను, దానిచే
వ్యాకుల మయ్యెలోక మటుపై నెటులో శమము౯ వహించి తా
గాఁకకు మాఁడియు౯ మరలఁ గన్పడె క్షత్రియజాతి మెల్లఁగా
మేకొనె వృద్ధి నెంటనె శమింపఁగఁ బూనెదవయ్య ! పుత్రకా !

(పరశురాముఁడు ప్రవేశము.)

పర — (నమస్కరించి) తండ్రీ ! నేనొక్కటిఁ జెప్పెద నవధరింపుము.

ఉ. అప్పటి కార్తవీర్యరణ మాదిగ సంగరరంగమందు వీఁ
డెప్పుడుగాని వెన్కఁ జనఁడింతయు లోక మెఱుంగు భీష్ముఁడో !
నిప్పులకుప్ప యాతఁడు నని౯ నెదురీయుట సున్న యీరకే
చెప్పఁగ నేల ? మమ్ముఁ గృపసేసి రణమ్మున కాజ్ఞ యీఁదగు౯.

జమ — కుమారా ! నేఁటి కిరువదియేడు దినములు కావచ్చెను గదా ! ఒకరి
కొకరింతకేని దీసిపోతిరా ? ఇదిగాక

ఉ. శాపముఁ జాపమంచు రిపుసంహృతికై గల రొక్కయుక్కు నిం
దాపదలందుఁ దప్ప మన కార్యము ముఖ్యము, క్షత్రజాతికి౯
జాపము ముఖ్య మట్లగుట శాంతి వహింపఁగవయ్య! యెందుకీ
పాపపుఁగృత్య మియ్యది తపస్వులకు౯ హితమౌనె ? పుత్రకా !

నార — కుమారా ! చూచితివా ? జమదగ్ని తన తనయున కెట్లు శాంతవచనములు బోధించుచున్నాఁడో ? నీ వీ సమయమున గురునికటమునకు నరిగి మ్రొక్కితివేని నిన్నాతఁడు మిగులఁ గౌరవించును. ఇంతకన్న నీవయ్యనఘు నిర్జించుట యశస్కరంబని తలఁపకుము. నామాట వినుము.

(పరశురామునియొద్దికిఁ దీసికొని చనును)

భీష్మ — (తనలో) ఈ మునివచనం బుల్లంఘించితినేని మూర్ఖతగా నుండును. అంత గురుఁడు నన్నవమానించినచో నెప్పటిసమరము స్థిరమయియే యున్నదిగదా ! (నమస్కరించును)

పర — (తనలో) ఈతండు మోహనాస్త్రప్రయోగాభిముఖుండయ్యును నిమ్ముని వచనంబులకతన వైరంబుడిగి నమస్కరించుచున్నాఁడు. ఇఁక నాకుఁ బంతమెందుకు ? ఇట్లగుఁగాక (ప్రకాశము) శాంతనవా ! నీకతన నేను ధన్యుండను కృతకృత్యుండను.

ఉ. నన్ను జయించి తీవు మునినాథులు సాక్షిగ మోహనాస్త్రసం
పన్నతఁ జేసి నీజయ మపారముదం బొనఁగూర్చె నాకు నీ
కన్న ధనుర్ధరుండు త్రిజగమ్ములయందును లేఁడు నీకు సా
టెన్నఁగ నీవె నీకతన నే యిఁక నే బలవంతుఁడం జుమీ.

(అంబదిక్కై)

ఉ. ఈతఁడు నాకె కాదు త్రిదశేంద్రులకేని యజేయుఁ డింక నో
పూతచరిత్ర! నీ వెటకుఁ బోయెదవో యటఁ బొమ్ము చూచితే
చేఁతను మించినంతపనిఁ జేసితి శక్యము గాక పోయె నీ
వ్రాఁతకు నే నెసండ? మగువా! నగుఁబాటిఁక నేమి చేసినన్.

అంబ— (లజ్జాదైన్యములతో) గురువర్యా! మీ శక్తివంచన లేక యుపకృతికై ప్రయత్నించితిరి. ఇంతకన్న నేమి సేయుదురు? తమకు వృథాగా నింత పరిశ్రమ మిచ్చినందులకయి నన్ను క్షమింప వేఁడెదను. నా యవమానమా? ఇది యెన్నఁటికి నేవిధమున దీఱవలయునో అప్పటికి నా విధమునఁ దీఱఁ గలదు. నాకు సెలవొసంగుఁడు. నేను భవిష్యద్గతికయి యత్నింపవలయు.

(నిష్క్రమించును)

భీష్మ— (వినయముతో)

ఉ. బాలుఁడ నైనహేతువున భావిగతుల్ గనలేక మీ యెడన్
జాల నవజ్ఞ చేసితిని ఛాత్రుఁడనయ్యు వృథాగ్రహమ్మునై
నాలములో నెదిర్చి యిదియంతయు దేవరయోర్పుకల్మి ను
చ్చాలిత మయ్యెఁ గాక యిటు సైఁతురె! వేఱొక రెవ్వరేనియున్.

నా కాజ్ఞ యొసంగుఁడు

(నిష్క్రమించును)

రాము— తండ్రీ! యిఁక నీవీ చాపాయుధత్వ ముడిగి మావలెనే శాపాయుధుండవై వన్నె కెక్కుము. చనుము. మేమరుగుచున్నాము.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ
బడిన పాండవజననమ్మునఁ దృతీయాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవజననము

## చతుర్థాంకము

(అంత వ్యాసులు ప్రవేశించును)

వ్యాసు— (తనలో సంతోషముతో)

మ. యమునా ద్వీపచునందు నన్నుఁగని కన్యాత్వంబు లోపించునం
చు మదిన్ జంకె త్యజించి పేర్మి మెయి నిచ్చో నన్ను ధ్యానించె నా
కమరె న్నేఁటికిఁ దల్లిఁ గాంచఁదగు భాగ్యం బెంతపుణ్యంబు నే.
మముమై మున్నొనరించికొంటినొకదా మాతల్లి నీక్షింపగన్!

(స్మృతి నభినయించి) అవును. అప్పుడు తల్లితో "నన్ను నీ వెప్పుడు స్మరింతువో అప్పుడ నీయెడకు వత్తు" నని చెప్పియుంటిని. కావునఁ బోయెదను. (పరిక్రమించి) హస్తిపురికి వచ్చితిని. (యోజించి) తల్లి నన్నుఁగనిన పదఁపడి యేమైనదియు నెచ్చట నున్నదియు సుంతేని యెఱుంగక తపస్సమాధిలో నున్న నాకుఁ దల్లి యెక్కడ నున్నదియు నెట్లు తెలిసెడిని? అక్కటా! యెక్కడి కేగుదును?

(ధ్యానము నటించి)

ఉ. నా జనకుండు సన్మునిగణస్తవనీయ చరిత్రుఁ డేనియున్
నా జనయిత్రి సర్వ భువనస్తవనీయగుణాఢ్యయేని ని
ర్వ్యాజ పరోపకారపరమై మది నాయది యొప్పునేని నా
కో జగదీశ! నా జననియున్కి సమస్తము గోచరించుతన్.

(కన్నులు మూసికొని మరలఁదెఱచి సంతోషముతో) ఆహా! భగవదనుగ్రహమువలన సమస్తముం గరతలామలకముగఁ బొడకట్టినది. ఔరా! అప్పుడే యెన్ని మార్పులు జరిగినవి! కాల మనివార్యము.

సీ. శంతనుండు మదీయ జననిఁ బెండిలియాడెఁ
గలిగి రిద్వరుసుతు ల్లలితమతులు

వారి బాల్యముననే ధారుణీపతి వోయె
భీష్ముండు రక్షించెఁ బిదప వీరిఁ
బడఁపడి గర్వియై ప్రథముండు మృతిచెందె
రెండవవాఁడు ధీరుండు ప్రబలె
నంబికాంబాలిక లతనికి సతులైరి
యతికాముకుండయి యతఁడు సమసె
తే. గీ. వంశ మంతరించెడి దురవస్థ వచ్చెఁ
దల్లిమాటకు గాంగేయుఁ డొల్లఁడాయె
దానిపై నాదు జన్మం బతనికిఁ దెలిపె
నాఁతడును సమ్మతించె నన్నంబ తలఁచె.

(సంతోషముతో) ఔరా! భవితవ్యత? ఎఱుఁగనియప్పుడును దల్లి యున్నయెడకే వచ్చితినే. (పరిక్రమించి) ఇదియే నగరు. (పరికించి) తల్లియును గాంగేయుండును నా రాకకయి వేచుచు నేమో మాటలాడు కొనుచున్నారు. పోయి నమస్కరించి జన్మమును గృతార్థముగా నొన రించుకొనియెద.

(భీష్ముండును సత్యవతియుఁ బ్రవేశింతురు)

భీష్మ— తల్లీ! ద్వైపాయనుండు తపస్వికరన జనించుటంజేసి బ్రాహ్మణుం డనియు మనము క్షత్త్రియులమనియు సంశయించుచున్నట్లు లున్నావు. అట్టి సంశయము లేశమును గలదు.

ఉ. హైహయుఁ జంపి మీఁద జమదగ్ని తనూజుఁడు మద్గురుండు పూ
ర్ణాహుతిఁజేసె క్షత్త్రియకులాంకురముల్ మఱి మొల్వకుండ ని
ర్వాహకుఁడై జ్వలత్పరశువహ్నిశిఖాతతియందు విప్రసం
దోహముగాదె క్షత్త్రకులదోహదమయ్యె ననంతరంబునన్?

ఇదిగాక పారాశర్యుండుఁగూడ నావలెనే యిందు నియోగింపఁదగిన వాఁడేకాని యన్యుండుగాఁడుగదా!

సత్య— తండ్రీ! సర్వధర్మము లెఱింగిన నీకు నేను జెప్పవలసిన దేమి యుండును. అతని వలననో నీ వలననో యీవంశము వృద్ధినందఁ దగినది. లేనిచో నింతటితో విచ్ఛిన్నముకాఁదగినది.

వ్యాసు— (సమీపించి)

చ. బహుళతరామయమ్ములను బాపఁగఁ జాలెడు మాతృభక్తి దు
స్సహదురితప్రచారము నసార మొనర్చెడి మాతృభక్తి తా

నిహపరశోభనంబు లుదయింపఁగఁజేసెడి మాతృభక్తి నా
కహరహమున్ బ్రవృద్ధమగునట్లు లొనర్పుము తల్లి మ్రొక్కెదన్.
(నమస్కరించును)

సత్య— (సంతోషముతోఁ దనలో) ఎంత ధన్యాత్మురాలనో కదా! ప్రాజ్ఞుఁడగు పుత్రునింజూచి యానందింపఁగలిగితిని. విజితేంద్రియుండగు పరాశరుం డప్పుడే నిన్ను ననుగ్రహింపఁడేని యిప్పటి యవస్థంబట్టి నే ననపత్యురాలనే కావలసినదానను. నా కిట్టి సుయోగముండుటం జేసియే కామవిరక్తుండగు నమ్మునికట్టి ప్రవృత్తి గలిగినది (కౌఁగిలించుకొని ప్రకాశము) తండ్రీ! చిరాయుష్మంతుఁడవయి సర్వవిధముల వన్నె కెక్కుము. పుణ్యాతిరేకమ్మునం జేసి దిరిగియు నిన్నుఁ జూడఁగలిగితిని.

భీష్మ— (నమస్కరించి)

శా. వేదవ్యాసుఁడ వంచు సర్వజగతీవిఖ్యాతపాండిత్యస
మ్మోదస్వాంతుఁడ వంచు ధర్మవిదులంబూర్ణుండవంచున్ భవ
త్పాదద్వంద్వముగాంచు వారలకుఁ బాపం బుండదంచున్ శ్రీవ
త్స్వాదార్హంబగు నీ చరిత్రము విన్ సంతోష మయ్యెన్ మునీ!

ఉ. ఇట్టిమహానుభావుఁడ వహీనమహత్త్వయుతుండ వీవు తోఁ
బుట్టినవాఁడ వౌదుగఁట! పూర్వభవార్జితపుణ్య మెట్టిదో?
నెట్టన నిన్ భరింప ధరణీతరుణీమణి యేమినోఁచె? నీ
పట్టణభాగ్యమేమొ? నినువంటి మహాత్ముని రాకఁ గైకొనెన్.

వ్యాసు— (గౌరవముతో) గాంగేయా! నీవంటి పావనచరిత్రులు మునులలోఁ గూడఁ గడు నరుదు. నీకు నాయందేకాదు, అందఱియెడలను మంచి యభిప్రాయమే యుండును. (తల్లిదిక్కు)

ఉ. ఎంతయొకాలమాయె మును పెన్నఁడు నన్నుఁ దలంపలేదు నేఁ
డింతగ నాపయిన్ దలఁపదేటికిఁ బుట్టె? వచింపుమమ్మ? యే
చింతయొ లోన నున్నటులు చెప్పఁ దొడంగెఁగదమ్మ నీముఖా
భ్యంతరదీప్తి దానిఁ దెలుపంగదవమ్మ యొకింత వీనికిన్.

సత్య— (విచారముతో) కుమారా! సర్వజ్ఞుండవయ్యును నన్నేలయడిగెదవు? నీయనుజు లిరువురిలో జ్యేష్ఠుఁడు వివాహము కాకమున్న గతించె. ఇఁక రెండవవాఁడు వంశకరుండగునని తలఁచుచుండ నాతండును క్షయరోగ గ్రస్తుండై వంశంబు నెగడింపకమున్న మృతిఁజెందె. ఇఁక నీతండు బ్రహ్మచర్యవ్రతస్థుఁడుగదా! చంద్రుఁడు మొదలుకొని యింతవఱకవి-

చ్ఛిన్నముగా నెగడుచున్న యిక్ష్వాకువంశమునకు నేఁటికిట్టి దురవస్థ తటస్థించినది. (కన్నీరునించును)

వ్యాసు— (విచారించుట నటించి) తల్లీ! యూరడిల్లుము. ఇందులకుఁ బ్రథమ కారణము నీతండ్రియగు దాశరాజు. నే నిట్లంటి నని నీ వన్యథా భావింపకుము.

ఉ. సర్వవిధమ్ములన్ మిగులఁ జాలినవాఁ డనపత్యుఁ డన్నిటన్
ధూర్వహుఁ డీతఁ డుండఁ దన తోకముగన్నసుతుండు విశ్వభూ
నిర్వహణంబొనర్చుటది నీతియె? దేవుఁడు మెచ్చునే? గుణా
ఖర్వులు సమ్మతింతురె? యికన్ గులవృద్ధియు సంఘటిల్లునే?

ఇఁక నొకకారణము మన గాంగేయుని నిరంకుశత్వము. శంతనుఁడు సకలధర్మవేదియు శాంతుండును మహాసత్త్వుండును ననుటకు సందియము లేదు. ఐనను దైవవశమ్మునఁ గామశరాప్రహతుఁ డై హితము కానిదానిని ఘటించు టొల్లుండఁ దనకుఁబలె బలాత్కారముగా నిప్పించినాఁడు.

ఉ. కొంచెము గొప్ప యాపెయెడఁ గొండొక దోషము గల్గెఁగాక యా
చంచలబుద్ధి స్త్రీజనులు సాజముగాఁ గలవార లెందు మ
న్నించు మటంచు భార్గవుఁ డనింద్యచరిత్రుఁడు చెప్పవచ్చుడే
నిందుక లోఁదలంచవలదే? కలదే? యబలాపకారముల్.

ఈయెడ నీవుఁగూడ సమ్మతి దూపితివే కాని వారింపవైతివి.

సత్య— (తనలో) ఏమో యిప్పట్లు నిరనియతిప్రాయమే యనుకూలముగా నున్నది. ఐనను గతించినదానికి వగచినఫలమేమి (ప్రకాశము) కుమారా! దైవతంత్రము సర్వథా దుర్నివారముగదా! ప్రకృతోపద్రవనివారణకై యత్నింపవలయును. అందులకై నిన్నుఁదలంచితిని. నీవేమియుపాయము చెప్పెదవు?

వ్యాసు— (తనలో) తల్లి ఈనియోగము నాపైనిడుటకే సంసిద్ధురాలై యున్నది. భీష్ముండు నేఁడు బ్రహ్మచారిని దప్పించుకొన్నాఁడు. నేనును దప్పించు కొందునేని యిఁక నీవంశ ముచ్ఛిన్నము కావలసినదే! అదిగాక,

క. తన తను వెవ్వరివలనన్
జనియించెనొ యట్టిజనని జనకుఁడును జె
ప్పినపని చేసి తనూజుఁడు
తన జననమునకుఁ గృతార్థతన్ గలిగించున్.

(ప్రకాశము) సర్వధర్మములు నెఱింగిన నీకు నేనేమిచెప్పఁగలను? నీవే యాజ్ఞాపింపుము.

సత్య— కుమారా! నీయనుజుని కళత్రంబులలో జ్యేష్ఠురాలగు నంబికయందు దేవరన్యాయమున నపత్యం బుత్పాదించి యీకురువంశమ్ము నుద్ధరింపుము. ఇయ్యది సనాతనాచారంబును శాస్త్రచోదితంబును నగుట నీ వెఱుంగనిది కాదు గదా!

వ్యాసు— తల్లీ! ఇది శిష్టాచారంబును శాస్త్రసమ్మతంబును నగుననుట నిక్కువమే. ఐనను నావంటి తపస్వికి మాత్రము గైకొనఁదగిన పనికాదు.

ఉ. ఎన్నఁడు గాని కామినుల హేలలపై మతి లేక నిష్ఠఁ గై
కొన్నతపస్వి లేఁడ! తమకుం గొడుకుల్ మఱికూఁతు లన్నభ్రాం
తి న్నశియించు సంసృతిగతిప్రణముల్ గృహదాసు లేఁడ? యీ
తెన్ను విరాగి కేగతి విధించెడి? రాగికిఁ గాని శాస్త్రముల్.

భవత్పాదసాక్షిగా నేను భూతభవిష్యద్వర్తమానములయందు స్త్రీముఖ వీక్షణమాత్రమునం దేని యిచ్ఛ లేనివాఁడనయ్యెను.

క. తల్లియె వేదము శాస్త్రము
తల్లియె జపముం దపంబు తల్లియె గురువుం
దల్లియె సకలము తల్లియె
తల్లికి నెదిరించువాఁ డధమగతి నొందుం.

(గౌరవముతో) అందులో నెల్లతల్లులకంటె తల్లివా?

ఉ. ధన్య వయోనిజాత వుచితజ్ఞవు రాజఋషీశ్వరుండు నా
మాన్యత కెక్కిన వసుకుమారివి ధీవరుఁడై యఖండసౌ
జన్యము గన్న దాశనృపు సాఁకుడు కూఁతుర వార్యలోకమా
న్యవు నీ వచోరచన తప్పదు వేదము దప్పనేనియుం.

సత్య— (సంతోషముతో) కుమారా! పితృభక్తికి గాంగేయునిం బలె మాతృభక్తికి నిన్నుఁ బ్రపంచమెల్ల మెచ్చుకొనునట్లు వర్తించినందుకుఁ గడు సంతసించితిని. (భీష్మునిదిక్కై) అబ్బాయీ! యీతని కంబికాంతఃపుర నికటగతోద్యానమ్మునందు వసతి నేర్పఱచి యుపచారంబునకుఁ దగు వారల నియోగింపుము. నే నంబికకడ కరిగి యిందుల కొప్పించి సుపుత్త్రుం డుద్భవించుటకుం దగిన సుకృతంబు నీఁదగు బ్రాహ్మణారాధనాదికమం దప్రమత్తురాలనై యుండెదను.

(నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ
బడిన పాండవజననమ్మునఁ జతుర్థాంకము.

ఓం.

శ్రీపరమేశ్వరదేవతాయైనమః.

# పాండవ జననము.

## పంచమాంకము

(తెరలో)

తే. గీ. రాత్రియెల్లను విరహాభారమున వేగి
వేగినంతన రాగ మావిర్భవింపఁ
బుష్పవతియైన పద్మిని పొందుఁ జేయఁ
బోవుచున్నాఁ డినుండు కాముకుఁడువోలె.

(సూర్యుఁడు ప్రవేశించును)

సూర్య— (తనలో) ఎవ్వరీలతాంగి! నన్నుఁ దన మంత్రశక్తిచే నాకర్షించినది. (ధ్యానించుట నటించి) ఓహో! ఈమె యాదవవంశప్రభువుఁడగు శూరుని పెద్దకొమారిత, వసుదేవుని చెలియలు, కుంతిభోజుని దత్తపుత్రిక. (పరికించి)

శా. ఆ నవ్వుల్ మొగ మా కచావళిపసం దా నేత్రపుల్ సోయగం
బా నాదారగు కాను నా మిసిమిఁజెన్నా చిన్నియొయ్యారపుల్
మే నా గుబ్బలపొంక మా యధరపున్మేలెంతకేనిం దగున్
దీనిన్ గూడనివానిజన్మ మది యంధీభూత మింతేటికిన్ ?

ఈ కన్నియ తన చెలికత్తియతో నేమో ముచ్చటించుచున్నది. ఈ లతాకుంజమునాపన నుండి వినియెదఁగాక (అట్లొనరించును)

(కుంతి చెలికత్తెతోఁ బ్రవేశించును)

కుంతి— సఖీ! ఇఁక మన మరుగ వచ్చును. నా సూర్యోపాస్తి యైనది.

(ఇరువురును పరిక్రమింతురు)

సూర్య— (తనలో) ఔరా! ఈ కన్నియ యందమిప్పటి యవస్థంబట్టి యెంత పవిత్రతరముగా నున్నయది!

మ. జలకం బాడి మడుంగుగట్టియు నిశాంచద్దీప్తి పయ్యంటలో
వెలికిం బాఱఁగఁ గేశపాశ ముదుపై వెన్నంటి జాఱంగ మేల్
తిలకం బంతగ దిద్దకున్న నొసలపై దీపింప నిచ్చానసాం
పులు శృంగారరసాధిదైవతములై పొల్పొందు శుద్ధంబులై.

(పరికించి) ఈ మృదుగాంగి నన్నతి ప్రయత్నమున రప్పించియు నాపంకకేలి చూడక తవంతన పోవుచున్నయది. (ఎదురుగాఁజని)

ఉ. ఎక్కడి కేగుచుంటి తరళేక్షణ! వీని ననాదరించి నీ
మక్కువ నిక్కమంచిటు మంత్రబలంబునఁ జేసివచ్చితిన్
దక్కులకేమి నా మదనతాపము వాపు మనుగ్రహించి యీ
దిక్కు మరల్పు చూపు సుదతీ! యెద తీపర మాఁగ రాదిఁకన్.

చెలి— (అత్యాశ్చర్యముతో ఁజూచుచు నించుక తొలఁగును)

కుంతి— (తేటపాఱఁజూచి తలంచి తనలో) అక్కటా! నేనిపు డేమిసేయుదును? ఈ యనఘుఁడు త్రయీమయుండగు సూర్యుండు. మంత్రశక్తిం దిలకింపుటకై నా యొనర్చిన పరీక్ష తుదకిట్లు పరిణమించినది. (యోజించి) ఇట్లుగాఁగాక (ప్రకాశము) దేవా! నాతప్పులు సైచి నామనవిఁ గైకొని నా కనుజ్ఞ యొసంగవేఁడెదను. మున్ను చిన్ననాఁడు దుర్వాసునికిఁ బరిచర్య సల్పితి నమ్మహాత్ముఁడు నాయందు మిగుల దయగలిగి యిప్పటి యీమంత్రము నుపదేశించి 'ఇద్దానిమహత్త్వ మిట్టిది' యని చెప్పి చనియె. నేఁడియ్యెడ స్నానంబొనర్చితి నమ్మంత్రంబు స్మృతికిం దగుల స్త్రీస్వభావసులభమ్మగు చాపలమ్మున నిన్నుద్దేశించి పఠించితి. అంతియ కాని వేఱొక దురభిప్రాయము కలదానను గాను. సర్వజ్ఞుఁడవగు నీకు నేను వచింపుట పునరుక్తి యని యింతతో ముగించుచున్నదానను. నా యపరాధమును సైఁపఁగోరెదను.

సూర్య— (అనురాగముతో)

క॥ కోరితివి వచ్చియుంటిని
నూరక యే నెట్లు పోవనోపుదుఁ దరుణీ!
నా రాక గాంచు దేవత
లాఱడి సేయరె? వృథాప్రయత్నుఁడ నైనన్.

చ. ఎఱుఁగుదు మంత్రమంచు నది యిచ్చినమౌని మహానుభావుఁడం
చెఱుఁగుదు సర్వమున్ దెలిసి యీగతిఁ బల్కనయంతఁ బోవునే?

సరసిజనేత్రి! మంత్ర మది సారము దప్పదె? యేను నీ వచ
స్సరణికి లోఁగి పోయిన, విచారణ సేయకు మింక నెచ్చెలీ!

ఇది యిట్లుంచుము,

ఉ. కోరఁగ లేదు నీవు నినుఁ గోరితి యేఁ జను టెంతుఁ గాక పో
నీ రమణీ! యొకింత గణియింపుము నింపుము పేర్మి నీదు నా
య్యారము మున్ను నంగని యహా! యని సొక్కుచునుందు నేఁటికిన్
గౌరవపూర్వకమ్ముగఁ దగన్ ఫలు పండియుఁ బోవ నేర్తునే?

(చేయి పట్టుకొనఁబోవును)

కుంతి— (తొలఁగి తనలో) ఈ యమలుఁడు నేను గన్యక నని యెఱిఁగియు ధర్మేతరం బగు పద్దతికి దిగుచున్నాఁడు. ఇతనికి నే నేమి వచించినను మదికెక్కుట కడు దుర్లభముగా నున్నది. ఎట్లేని యియ్యనఘు నొప్పించి యి ప్పాపమునకుఁ దొలఁగి కన్యకాత్వమును గాపాడుకొనవలయు. (ప్రకాశము) దేవా! యేను మానవ జాతిదానను. నీవు దేవతలలోని వాఁడవు. ఇట్టి నీవు గడు నీచురాలనగు నన్ను నీవు చేకొన నెంచుట న్యాయమా? ఇదిగాక నేను గన్యకను. నీవంటి ధర్మజ్ఞునకు వ్రతభంగం బొనరించుట ధర్మ మెట్లగును?

సూర్య— (చిఱునవ్వు నవ్వి) తలోదరీ! ఊరక కాలయాపనం బొనర్చుటకు నీవిట్లు పల్కుచుంటివి కాని దేవతలకును మనుష్యులకును నిట్టి సంబంధ మున్నట్లు లనేకదృష్టాంతములు గలవు. ఇఁక నీ కన్యకాత్వముం గూర్చి కొంత యోజింపవలసియేయున్నది కాని,

తే. గీ. మొన్న మొన్న పరాశర మునివరుండు
దాశకన్యకతో నిట్టి తగులొనర్చె
నతఁడు తప్పగు నేని యెట్లనుమతించు?
ధర్మశాస్త్ర మొనర్చిన ధన్యమూర్తి.

వారిరువురికిని జనియించినవాఁడె ద్వైపాయనుఁడు. అమ్మహనీయుకతముననే ధృతరాష్ట్ర పాండురాజ విదురు లుద్భవించిరి. కొలఁది కాలమున వారిలో పాండురాజు నీకు భర్తయగు. ప్రకృతరహస్య మెరికిని దెలియకుండఁ గాపాడఁగల భారము నాది. సంశయింపకుము. నీకన్యకాత్వమునకు భంగంబు గలుగకుండ నేను వరమొసంగెదను రమ్ము.

(చేయి పట్టుకొనును)

కుంతి— (స్వగతముగను మాటించి సిగ్గుతో) మహాత్మా! ధర్మవిరుద్ధంబని కాని లేనిచో నిన్నువంటి పురుషోత్తముం డెవ్వరికైను ఘటించెడిని?

(చేతితోఁ జూపి) అదిగో నా పరిచారిక. దాని కీ రహస్యము దెలియ కుండుట యెట్లు? కావున నన్ననుగ్రహించి యనుజ్ఞ యొసంగుము.

సూర్య— (నవ్వి) లతాంగీ! సర్వసాక్షినగు నాకుఁ దెలియదనియా నీవిట్లు చెప్పుచుంటివి? మీ రాజులలో స్త్రీలకేమి పురుషులకేమి నాకుఁ దెలియని రహస్యము లేని యుండవచ్చును గాని దాసీదాసాదులకుఁ దెలియని గోప్యము లుండవుగదా?

ఉ. వారలె మీరు, మీరె మఱివారలు, వారిందకు మీకు వించుకే
వారయ భేదముండ దిటులైననె మీ మరియాద సాఁగు నా
చారమనాదిగా నిటు లెసంగుచునున్నది చంచలాక్షి! న
న్నారక యేఁచనేల? దయయుంచి కృతార్థునిఁజేసి పంపుమీ.

మీకును బరిచారికలకునుంగల యాంతరంగికత్వ మిట్టిదట్టిదన వలను పడదు. ఇది వినుము. సత్యవతి తన కోడండ్రలో జ్యేష్ఠురాలగు నంబి కను వంశము నిల్పు మని వ్యాసునియొద్ద కనుప నాపె యమ్మునియెడ నేవము గలిగి కనులు మూయుటంజేసి తత్పుత్రుండగు ధృతరాష్ట్రుం డంధుం డయ్యె. మరల సత్యవతి యంధుఁడు రాజ్యార్హుండుగాఁడని వ్యాసుని రెండ వ కోడలగు నంబాలికతో సంఘటించె. అయ్యతివయు వెలవెలఁ బోవుచు నజ్జటిలునియం దనాదరము బ్రకటించె. అక్కతన నాపెకుఁ బాండు రోగగ్రస్తుండగు పాండుం డుదయించె. పదఁపడి సత్యవతి విచారించి కొమరునిం జూచి.

క. పాయక నా యనుమతిచే
దాయాదులఁ గంటి వంధతాపాండుత్వ
పాయసము పేతు లేగతిఁ
జేయఁగనగు రాజ్య మేమి సేయుదుఁ బుత్రా?

అని మరల నిఁక నొక కొమరునిం గనుమని పెద్దకోడలికి నెట్టకేలకు నచ్చఁజెప్పిన నయ్యతివ, యా కృతి యేవమగు టట్లుండ శాస్త్రసూప్యము గూడనని యెంచి తనదాసిని సర్వాభరణభూషితురాలుగా నొనర్చి తన కేళీగృహమ్మున నుండ నియమించె.

క. దాసియు వ్యాసుని మది కు
ల్లాస మెల్మిదవింపఁ దగువిలాసము లొప్పన్
జేసిన నంతట దానికి
వ్యాససముఁడు విదురుఁడనెడివాఁ డుదయించెన్.

అవిదురుఁ డిప్పుడు సర్వవిధముల వారితోఁబాటు గౌరవింపఁ బడు చున్నాఁడు. దీనింబట్టి మీకును పాండ్రకునుం గల యైకమత్యము నీకుఁ

బూర్తిగాఁ దెలిసియుండును. ఇంక నెందుకు జాల మొనరించెదవు. (చేతఁజూపి) లతాంతసంతానదంతురం బగు నా నికుంజము దిలకింపుము.

చ. దళముగ నల్లుకొన్నది లతాభవనం బది దానఁ బూలగు
త్తులు రతనంపుదీపములతోఁ దులఁదూఁగుచునున్న వింపుసొం
పులు గల పక్షిజంపతులు ముచ్చట లాడుచునున్న వయ్యెడన్
గలుగువిశేషముల్ గలయఁగాఁ గనుఁగొందము రమ్ము సెచ్చెలీ.

(కుంతిచేయిపట్టుకొని నిష్క్రమించును.)

చలి— (ఆశ్చర్యముతోఁ దనలో) ఆహా! నే నెట్టిపుణ్యము చేసికొంటిని! ఈపె చెలికత్తియ నగుటం జేసియే కదా? ప్రత్యక్షసౌఖ్యనిం గాంచఁ గలిగితిని (మరల యోజించి) అవునుగాని యీపె కియ్యానఘుకతన వేఁకటి యొదవినచో నయ్యది యెట్లు దాఁపనగును. అవురా! కన్నియలకు రజస్వలావివాహ మెంతటి దుర్దశఁ గలిగించుచున్నది! అతిబాల్య వివాహమువలెనే యియ్యదిగూడ దూష్యమేకాని వేఱొండుగాదు (పరికించి తత్తఱపాటుతో) అత్యద్భుతముగనున్నదే! చిన్ని శిశువుం గైకొని కుంతి యిటు వచ్చుచున్నది.

(శిశువుతోఁ గుంతి ప్రవేశించును.)

కుంతి— (విచారముతోఁ దనలో) అక్కటా దైవమా! ఈపాపాత్మురాలి కింతటి చక్కని శిశువు నెందు కీవగౌను?

చ. కలకలలాడు నెమ్మొగము కాంతులదొంతుల నీను మేను, సొం
పు లొలుకు ముద్దుకన్నుఁగవ పున్నమవెన్నెల నేలు పాలబు
గ్గలు నునుఁ దేఁటిముత్తమనఁగాఁ దగుపెన్నెలులున్ మృగేంద్రముల్
గెలిచెడి కాను వీనికి నొగిన్ మృతి నేగతి సంఘటించితో?

(అతిదుఃఖముతో) అయ్యో నే నేమిసేయుదును? ఇయ్యెడ నీచిన్ని శిశువు నీ నాముద్దులమూటను డించిపోయిన వీఁడు మృతిచెందక యెట్లు జీవింపఁగలుగును?

ఆ. వె. ఎవ్వరెత్తుకొందు? రెవ్వ రాడింతు? రె
వ్వారు పాలనిత్తు? రేరు పెంతు
రకట? యెంత దుష్టురాల నైతిని దండ్రి!
నిన్నుఁ గనఁగ నేల? నేను గుల్ల!

అయ్యో కొడుక! నిన్ను నేనెట్లు వీడుదునోయి? చక్రవర్తివి కాఁ దగిన లక్షణము లన్నియు నీకే కలవోయీ నాయనా! నా యిష్టవాక్

త్వము కారణముగా నీవు బాల్యమృతి నందుచుంటివి గా నీకు యా
ర్ద్రాయము లేకపోలేదు. తండ్రీ! యేమిసేయఁదును? అయ్యో భగ
వంతుఁడ!

ఉ. సంతతిలేక పెన్వగల సారెకుఁ గుందుచు వందుచున్ మన
శ్శాంతి యొకింత గాన కొరు సాఁకఁదలంచియు సంశయించు సా
మంతు లనేకు లుండఁ గొఱమాలినదానికి నాకు నిట్టి శ్రీ
మంతు నొసంగ నీకుఁ జలమా? యిల మానిను లెందు లేరొకో?

చెలి— (దగ్గఱఁజని) నెచ్చెలీ! సంతోషసమయమున విచారించెదవేల? నీకొమరుని కించుకయు భయములేదు. ఏదేని యుపాయముచేసి పెంచెద. ఊఱడిల్లుము. (శిశువుం గైకొని) తండ్రీ! యెంతచక్కగా నుంటివోయి? (కుంతిదిక్కై) మొగము మూఁడు ముహూర్తముల నిన్నుఁబోలి యున్నది. తక్కిన లక్షణములుమాత్రము చాలవఱకు సూర్యునింబోలియున్నవి. (అని ముద్దువెట్టుకొనును)

కుంతి— (శిశువుం గైకొని) చెలీ! ఈశిశువు నీ వెట్లు గోప్యముగాఁ గాపాడినను నీరహస్యమెట్లో బయలఁబడకమానదు. కావున వేఱొక యుపాయము జూడుము (మరల దుఃఖముతో) తండ్రీ! నీ విట్టి నిర్భాగ్యురాలికడుపున నుదయించుటచేతఁగదా నీ కే యుత్సవములును నే రక్షలును లేకపోయినవి.

తే. గీ. అంతిపురముల నుండెడి యతిపలేని
చంటిపిల్లలరక్షకై జంకుచుండ్రు
కాన నెగతి డించెడిదాన నకట!
కనులు దెఱవని పసికూన కాన! నిన్ను.

(కోపముతో)

ఉ. ఏమని యొప్పినారొకో? మునీంద్రులు దాము రజస్వలాంగనల్
ధామములందుఁ బెండ్లికి నెదల్ దపియించెడిరీతి కక్కటా!
కామము గెల్వశక్యమె? యఖండమనీషులకేని యట్టిచోఁ
గామిను లేఁడ? కామునివికారము లేఁడ? సతుల్ యతీంద్రులే?

ఔరా! అనుభవశూన్యులగు మాన్యులవలన జగంబున కిట్టియిక్కట్టు లుప్పతిల్లుచున్నవి. (సూర్యునుద్దేశించి) దేవా త్రయీమయ!

చ. అరిగితి వీవు నాదుగతి నారయవైతివి సిగ్గుకల్మి ము
న్నరయఁగఁజాలనైతి నిటులౌట; కటా! శిశుహత్య కేగతిన్
గరములువచ్చు? నెట్లు చనఁగల్గుదు నీ పసికూన డించి? యీ
మరణము నీకు సమ్మతమె? మ్మానిసులన్ బయలెక్కఁజేతువే?

(పుత్రు నుద్దేశించి తన్మయత్వముతో)

తే. గీ. ఏడువకు తండ్రి! యేడువ కేడ్వఁబోకు
మేను నిను డించిపోను నీయాన కూన!
కులము పోనిమ్ము బంధుగుల్ చలముఁబూన
నిమ్ము కానిమ్ము మఱియు నేమేనివమ్ము.

అక్కటా! యెట్టి చిక్కు తటస్థించినది?

శా. దుర్వాసుం డనుదేర నేల? యతఁడీ దుర్మంత్రము న్నాకు నం
తర్వాణీశ్వరుఁడయ్యు నేటికొసఁగెన్? దచ్ఛక్తి గుర్తింప నే
సర్వాతీతు వరింప నేమిటి కివన్? సర్వజ్ఞుఁ డద్దేవుఁ డం
తర్వాత్సిత్వవిచారణం బుడిగి చింతల్ గూర్పఁగా నేటికిన్?

చెలి— (పరికించి) రాజపుత్రీ! భాగీరథిపంకఁ జూడుము. ఏదో యొక పెద్ద పెట్టె యొడ్డుదరినుండి నీటఁ దేలిపోవుచున్నది. మనమిప్పు డద్దానిం బట్టికొని యీశిశువు నందుఁ బదిలముగా నుంచి మరల విడిచితిమేని యియ్యెడ కనతిదూరమ్మునఁగల పల్లెలోని జను లెవ్వరేని యాపెట్టెఁ గైకొనవచ్చును. పడఁపడి యీ పసిబాలునిం జూచి పెంచి పెద్దఁగాఁ జేయుటకూడఁ దటస్థింపఁగలదు. ఇంతకన్న నదుపాయ మియ్యెడఁ గానగాదు. నే నరిగి యా పెట్టెను బట్టికొందును. నీ వీ శిశువుంగొని నా వెంట రమ్ము.

(నిష్క్రమింతురు)

కుంతి— (తనలో) ఇప్పటి కీయుపాయమే కడు ననుకూలముగా నున్నది. ఇట్లొనర్తుఁగాక (కొంత నడిచి విచారముతో)

సీ. ఏయదృష్టవతి నిన్నెత్తి పెంచికొనంగ
నోఁచుకొన్నదొ నా యనుంగుఁగుఱ్ఱ
ఏభాగ్యవతికిఁ జన్నిచ్చి నిన్ బోషించుఁ
బున్నెమున్నదొ నాదు చిన్నికూన
ఏపుణ్యవతి నీదు నేపుఁగాంచుచు మోద
మందనున్నదియొ నా యాత్మజాత
ఏకృతకృత్యురా లీ వాడు తొలిపల్కు
లాలింపఁగలదొ నాపాలిపంట
తే. గీ. ఏమహాభాగ నీదు విద్యామహోద
యంబు నీ పెండ్లి నీ యపత్యాభివృద్ధి

యాదిగాఁగల సంపద లరసి నీదు
మన్ననలు గాంచఁగలదొ నా కన్నతండ్రి!

తే. గీ. ఏనె దురదృష్టవతిని నీ యెల్లవగలు
గాంచఁగా నోఁచుకోలేని కారణమున
నెచట నీవున్న నీ యభివృద్ధిఁ జూడఁ
జాలు నాతండ్రి! నీతండ్రి సర్వసాక్షి.

మ. నిను రక్షించు సహస్కరుండు పగట నీతండ్రి నాతండ్రి! ని
న్ననుఁ బోషించు నిశాకరుండు నిశలందున్ ద్వత్పితృస్నేహి ని
న్ననుఁ గాపాడుతఁ బంచభూతములు నిన్నున్ జహ్నుకన్యాంబువుల్
మనుచున్ నిన్నెగడించుఁగాత సకలామ్నాయమ్ములున్ భూమియున్.

(తెరలో)

సఖీ! రమ్మా తడయకుము. ఈయేటి వంపులో నెవరోగాని దంపతులు స్నాన మొనరించుచున్నారు. ఈపెట్టె నీ శిశుసహితముగా వారు గైకొనఁ గలరు; దాన నీ కొమరునకు క్షేమంబు గలుగును. మనము వారి కగుపడకుండఁగనే పోవుటకుఁగూడ వీలుగానున్నది.

**కుంతి**— (దుఃఖముతో)

తే. గీ. మరల నినుఁ గాంతునో లేదొ కొఱఁత దీఱఁ
బాలు ద్రావుము నాతండ్రి! జాలి లేని
కఠినురా లిది యని మార్మొగంబు గాకు
మన్న! నా చిన్ని యన్న! నాయాన నీకు.

(కొంతపఱకు నడిచి)

చ. కనియును నిన్నువంటితగుకానుపు నెన్నఁడుగాని సంతతిన్
గనని యనాథవోలెఁ గొడుకా! యుడుకాఱెడివంత నెంతయున్
గనవలసెన్ బురాభవమునన్ సుతసంపద పెట్టి పుట్టకుం
డిన ననువంటిద్రాని కిదునే పరమాత్మ సుతున్ భవాదృశున్?

తండ్రీ! నీవు పెద్దవాఁడ వైనపిదప నెప్పుడేని నీకు నేను గనుపట్టినచో నన్నాదరింతువుగద! పోనీ యాదరింపవద్దు తండ్రీ! నీవు చిరాయుష్మంతుఁడవై వర్ధిల్లుము, ఇట్టి పాపాత్మురాలి నేల యాదరింప వలయును?

(శోకావేశముతో)

క. సహజం బగు కవచమ్మును
సహజములగు కుండలము లెసంగెడి నీ వి

గృహ మెట్లు మఱచిపోఁగల
నహహా! నిన్నెట్టు లేటి కర్పింతు సుతా!

(ధైర్యముతో)

ఉ. ఆ కనుపట్టు దంపతులె యాత్మజ! నీ కనుఁగొండ్రు గాక వా
రే కనువారిరీతి నినుఁ బ్రేముడిఁ బెంతురుగాక! నాకు నీ
శోకము పోవునట్టు లొకచో నయినన్ భవదీయ మైన ది
వ్యాకృతి గాంచుభాగ్య మది యబ్బెడుఁగాక! పురాకృతంబునన్.

(నిష్క్రమించును)

## గద్య.

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ
బడిన పాండవ జననమ్మునఁ బంచమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవజననము

## షష్ఠాంకము.

(తెరలో)

తే. గీ. ఓరి కఠినాత్మ! యోరోరి క్రూర! యోరి
చంద్రవంశాబ్ధిబడబాగ్ని! సాధుదూర!
దంపతుల గ్రామ్యకర్మసందర్భగతుల
నడఁచితి విదేమిరోరి! నీచాతినీచ!

(పాండురాజు చాపధరుఁడై ప్రవేశించును.)

పాండు— (తత్తఱపాటుతో దెసలు పరికించి) ఇది యేమి వింత?

క. మృగమిథునం బని కొట్టితి
నగపడ దది యీమునీంద్రుఁ డతిరోషోగ్రుం
డగపట్టనేమి? యకటా!
తగిలెఁగదా! బ్రహ్మహత్య దైవముకలిమిన్.

(విచారముతో) ఆహా! యెంతదుర్మార్గుఁడ నైతిని? ఈతపస్వి ప్రళయకాలరుద్రుండోయన నాపైకి దుముకుచు వచ్చుచున్నాఁడు. కోపావేశంబుచే బాణపాతవ్యథ నించుకయు లెక్కింపఁడు సరిగదా తొరఁగెడి రుధిరమునేని గణించుటలేదు. ఇందేమి గతి? (నివ్వెఱతో నిల్చును.)

కిందముఁడు— (యథోక్తముగాఁ బ్రవేశించి, "ఓరికఠినాత్మ" యనునది మరలఁ జదువును.)

పాండు— (వినయముతో) స్వామీ! క్షమించి నావిన్నపమాలింపవలయు.

ఉ. మీరెకదా విధించితిరి మేదినికిన్ హితమంచు నెంచి యా
చారముగా నృపాలురకు సాజము వేఁట యటంచు, దీనియా
ధారమునన్ జరింతు మిది ధర్మముగాఁ దలపోసి మేము, నేఁ
డారయకున్కి యిట్టిపని యయ్యె మృగంబులె యంచు నేసితిన్.

అంతియకాని మీరని యెఱిఁగి చేసిన పనికాదు మన్నింపవలయు. మీరు మృగాకృతితో నుంట నన్నీ మహాపాపమునకుఁ బ్రేరేపినది నేనేమి సేయుదును. తమకీ బాధ యుపశమింపఁ దగు నుపచారముం గావించెదను నన్నాశీర్వదింపుఁడు.

కింద — (కోపముతో) ఓరీ! దుర్మార్గా! ఇంకను మమ్మే యధిక్షేపించుచుంటివిరా? రాజులకు వేఁట యెందులకుఁ బెద్దలు విధించిరో యెఱుఁగుదువురా?

ఉ. క్రూరమృగంబు లేవయినఁ గుంభినికిన్ బ్రజకున్ దురంతమౌ
తీరు నుపక్రమింప నది తీర్చుటకై మృగయాపరత్వ మా
చార మటంచుఁ దెల్పిరిటు సాధుమృగంబులఁ బట్టిచంపు టా
చారమె? వీరధర్మమె? యశస్కరమే? పరమోపకారమే?

మేమేమైనఁ గ్రూరమృగముల యాకారమును ధరించియుంటిమిరా?

క. కనుపట్టినంతనే యో
జనములకోలఁది బరుగిడెడుజంతువులఁ గృపా
ఖనులు నినుఁదక్క రాజులు
చెనఁకుదురే? లేళ్లనెందుఁ జెనఁటివితమునన్.

అదిగాక స్వతంత్రేచ్ఛల మగుమాకు నీయాజ్ఞయేమి! మాయిచ్ఛ వచ్చినచొప్పున వర్తింతుము.

చ. ఇది మృగకృత్యమంచు మదినెంచియు లేక మదీయభార్య కి
య్యది హితమైనదన్న హృదయంబుననో మఱి యొండుహేతువో
యొదవుటచేఁ గురంగగతి నుండి రమించుచు నుంటి మిట్టిచో
నదయుఁడవై వధింపఁదగవా? పగవారము రోరి దుర్మతీ?

ఓరీ పరమమూర్ఖుఁడా!

తే. గీ. మృగము లేవేనియును వధియించుపనికి
నృపతు లర్హులైయని వచియింతువేమొ
అఖిల జంతు సాధారణ మైన సుఖము
వేళఁ గొట్టఁగనేల? వివేక మెడలి.

చ. పఱుగిడలేనిదానిని వ్యవాయపరంబగుదాని నీనఁగా
మఱిఁగినదాని రోగమున మ్రాన్పడుదానినిఁ గొట్టనోడువా
రెఱుకులుగూడ నీవు మనుజేశుఁడవై యెటు లాచరించి తీ
మొఱకుఁదనం ఓసీ! కులము ముందుకుఁ దెచ్చెనె యిట్టి దుష్కృతుల్?

కానిమ్ము నీకి ప్పాపమ్మునఁజేసి ప్రియాసాంగత్యమ్ము మృతిపర్యంతం బగుఁగాక. ఇఁక నీయిచ్చం జనుము. నాకుఁ బ్రాణములు కంఠగతము.

లగుచున్నవి. నన్ను నింతకు మున్న గతప్రాణనై యున్న నా ప్రియు రాలికడకుం జేర్పుము; జాగు సేయకుము. (చదికిలంబడును)

పాండు— (తనలో) సంతాన ముదయింపక మున్నే యిట్టిశాపము దటస్థించెం గదా! (ధైర్యముతో) కానిమ్ము. ఇప్పుడీ విచారమునకుం దఱిగాదు. (ప్రకాశము) మునీంద్రా! నన్ను వృథాగా నెందులకు శపించెదవు? శాంతిం గైకొని యిప్పుడేని యిందులకు నిష్కృతి ననుగ్రహింపుము. రాజులకు వేఁట యనునది నిన్న నేఁట వచ్చినదిగాదుగదా! అగస్త్యునంతటి మహాముని విధించినట్లు మీవంటి పెద్దలు సెప్పుదురు. అయ్యనఘుండు మృగమాంసంబు పితృప్రీతికరంబని వాక్రుచ్చెఁ గావున నిది ధర్మేతరం బని తలఁచి నన్నధోగతిపాలు సేయకుము.

ఉ. సంతతి లేదు నాకుఁ బెలుచన్ శపియించితి వేమిసేతు? నా
యింతులు నిన్ను దూఱుదు రి దేగతినైనను ద్రిప్పుమయ్యా! నీ
యంతటివాని కింతటి మహాగ్రహ మొప్పునటయ్య? యౌవనం
బంతయు నేమిసేయవలెనయ్య మహాత్మ యిటుల్ శపించినన్?

కింద— (హీనస్వరముతో) రాజా! నీవు పశ్చాత్తప్తుండ వగుటచే ననుగ్రహింపఁబడితివి. నీకు సంతానముమాత్ర ముదయించు నీకఁ జింతింపకుము. నన్ను నా ప్రియురాలిం జేర్పుము.

పాండు— (తనలో) ఇయ్యనఘుఁడేమో యించుక కరుణించినాఁడు. కానిమ్ము. వివాహము సంతాన ప్రధానమైనదియేకదా! ఇఁక నితని నయ్యెడకుఁ జేర్పించెదఁగాక. (ప్రకాశము) ఎవరురా అక్కడ?

(మృగయుఁడు ప్రవేశించి)

మృగ— ఏమి సెలవు?

పాండు— త్వరలో ని మ్మహనీయు నయ్యెడకుం గొనిపొమ్ము.

మృగ— చిత్తము. (దగ్గఱకు వెళ్ళును)

కింప— (కోపముతో) ఓరీ పరమదుర్మార్గ! నన్నీ నీచునిచే నీడ్పించెదవురా! (ధ్యానించి) కానిమ్ము. నీ వేమి చేసెదవు? భావిగతి నీకిట్టి రాజసము నుత్పాదించుచున్నది. లేనిచో,

క. అనుచితమగు కృత్యము మొద
లొనరించియు బుద్ధిలేక యొకటికిఁ దోడ్తోం
[illegible]తునె? రాజకులం
బునకున్ రాజసము మగుల మూపొనరించెన్.

ఉ. భారతమాత యీపుడమి; పావను లిందు జనించువా రనా
చారులు నేఁటికిన్ ప్రబల సాఁగిరి రాజులు మిమ్ము బోఁటు లీ
కారణమై క్రమక్రమముగా మిము వీడఁగ నున్నదీ ధరా
భారము రాజసం బపుడె పాయు శిరోధరమంతఁ దగ్గెడున్.

శా. సోమార్కోత్తరవంశజుల్ తదితరుల్ శుద్ధైహికానందు లీ
భూమిం బాలనసేయ వారల పదంబుల్ మ్రొక్కుచున్ గౌరవ
శ్రీ మూలన్బడి కుందఁ బూర్వులకు దుష్కీర్తిం బొసంగించుచున్
సామాన్యుల్బలె మీ కులీనులు చరించం గాల మేతెంచెడున్.

పాండు— (తనలో) అక్కటా! "గోరుచుట్టుపై రోఁకటిపోటు"న్నట్టు లీ యప చారము గూడ సంభవించినదే! (ప్రకాశము) మహాత్మా! ప్రభుత్వదోష సంజనితంబగు నీ యపచారమును సహింపుఁడు. నేనే తమ్ము నయ్యెడకుం గొంపోయెదను. (ముట్టుకొనఁ బోవును)

కింద— (కోపముతో) నన్ను ముట్టుకొనకుము. యోజించి చూడ నీకన్న వీని తక్కువ యేమియును గనుపట్టదు.

ఉ. నీవును వీనిఁబోలె వని నిత్యమునుం జరియించుచున్ వృథా
గా వధియించుచుంటివి మృగంబుల నాఁకటికై, కృపారసం
బావలి కేగు నిన్నుఁ గనినంతనె జన్మముతోడ నేమి? దు
ర్భావులు సర్వథా దురితభాక్కులు వాక్కులు పెక్కులేటికిన్.

(కిరాతునిదిక్కై) ఓరీ! నన్ను శీఘ్రముగా నిర్దిష్టప్రదేశమ్మునకుఁ గొనిపొమ్ము.

మృగ— చిత్తము.

(తత్సహితముగా నిష్క్రమించును)

పాండు— (పశ్చాత్తాపముతో)

తే. గీ. జంతుహింసయె పాపప్రశంస తెరువు
అందులో బ్రహ్మహత్య! స్త్రీహత్య! యిదియు
నిట్టులుండఁగఁ గ్రీడించుపట్టు దీని
కంతయో దుష్కృతము నిర్ణయింపఁ దరమె?

అక్కటా! యెంత దుర్మార్గుఁడ నైతిని.

ఉ. వేఁటకు రాఁగ నేల? యవివేకము నింత వహింప నేల? యి
చ్చోటను నింతకాలము పశుల్ పశుతుల్యులు తోడునీడలై

పాటిల నుండ నేల? యిటు పాపపుఁగృత్య మొనర్ప నేల? యా
రాట మిదేల? యెంతటి పరాభవముఁ గయికొంటి దీనిచే?

(శరీరమువంకఁ జూచుకొని)

మ. కను లెప్పల్ గడు వంగి చూపడఁగి వక్త్రంబెంతయుఁ హేయమై
తనువెల్లన్ వళులై శిరోజముల చందంబెల్ల నిందార్హమై
కనఁగా రోఁత జనించు వృద్ధులును వాక్కుంపమ్ముతోఁ గామినీ
జనులం గూడఁగ నన్నుబోఁటి కకటా! శక్యంబె వైరాగ్యముల్?

(స్మృతి నభినయించి) ప్రియా సాంగత్యమ్ము మృతిప్రదం బగునని వచియించియు సంతానముమాత్రము కలుగు నని యమ్ముని యానతిచ్చెఁ గదా! ఇది యెట్లు సంఘటిల్లును? ఇయ్యది కేవల మసంభవము. ఇఁక నే ననపత్యుఁడ నగుటయే ధ్రువము. (యోజించి) మును లమోఘవచస్కులుగదా? అట్టిచో నమ్ముని చెప్పినచొప్పు తప్పు టెట్లు? (విరక్తితో) ఇట్టి దుర్మార్గకృత్య మొనరించియును మరల నీ సంతానచింత యేల? నా కుదయించు కొమరులు నాకన్నను దుష్టులు కావచ్చును. నా కిఁక సంసారమును వలదు సంతానమును వలదు.

చ. పరమవిరక్తిమై నిచటి పాదపముల్ క్షుధ దీర్ప నిష్ఠమై
మరణముదన్క నియ్యెడనె మ్రాన్పడి యుండెదఁగాక—
(విచారముతో) అక్కటా! తరుణులు కుంతి మాద్రియు నెదన్
నను మఱరె?—(విరక్తితో) దూఱనిమ్ము;
సంసరణముకన్నఁ గ్లేశకరము సన్న్యసనంబె పరమ్ముగాఁదగున్.

ఔరా! నేను గ్లేశుండ ననఁ గ్లేశుండను గాక పోతిని. (కోపముతో) ఓతపోధనా! నన్నుఁ గ్లేశునిఁగా శపింప కిట్లేల శపించితివి? (తల పంకించి) అవును, ఎట్లొనర్చుట కేని నీవెవరు? నేనెవరు? సర్వమును గర్మవశము.

తే. గీ. రుద్రుఁడు కపాలి చంద్రుఁడు రోగియౌట
సూర్యుఁడు పరిభ్రమించు టించుకయు నన్య
కారణమ్మునఁ గాదది కర్మఫలము
సకలజగమును గర్మవశమ్మె సుమ్ము.

నే నియ్యెడనేయుండి తప మొనర్చికొందునుగాక. (యోజించి) నే నిచ్చటన యుంటినేని యిట కనతిదూరమ్మునన వసించు నా ప్రియురాండ్రు నన్నెట్లేని గుఱుతింప వచ్చును. వదఁపడి వారలవలన నా తపమ్మె విఘ్నమ్ము గావచ్చును. ఎన్నివిధమ్ములఁ జూచినను నా మొన ర్చిన లోపముల కంతము లేక యున్నది. వేటకు వచ్చిన వాఁడను

ప్రియురాంద్రంగూడ నెందుకు వెంటఁబెట్టుకొని రావలయును? కాని మ్ము; గతజలసేతుబంధనముతో నేమి ప్రయోజనము? ప్రకృతము చూచుకోవలయును. (దృష్టినిగిడ్చి) ఆపర్వతప్రాంతమున నున్న వనంబులోని కరిగి యయ్యెడ గూఢమ్ముగఁ దపమాచరించుకొందుఁ గాక (పరిక్రమించి) ఈపర్వతము గడు రమణీయముగనున్నది. (లెక్కించి) దీని శిఖరములకుఁ బరిమితియే కాన రాకున్నయవి. శతశృంగమను పర్వతం బిదియే కాఁబోలును.

ఉ. ఈదెసఁ బాఱుచున్న దొకయే యతినిర్మల మింగు నీరు మేల్
పాదపముల్ ఫలమ్ముల నపారముగా భరియించి యొడ్డులం
దేదెసఁ బాదుకొన్న వది యే యొక పెద్దతటాక మందు న
బ్జాదు లనేకముల్ సుమము లాత్మకు మెచ్చుదయింపఁజేసెడిన్.

ఇది సర్వథా వాసయోగ్యముగాఁ గన్పట్టుచున్నది. కావున నే నియ్యెడలనె తపం బొనరించి కొనియెద; (తపోనిష్ఠను నటించుచుఁ గూర్చుండును.)

(అంతఁ గుంతియు మాద్రియుఁ బ్రవేశింతురు)

కుంతి— (విచారముతో) చెలి! ఆర్యపుత్రుండు మనల నెడఁబాసి, యింతతడ వెన్నఁడును పాసలుట లేదు. నేఁటి కొకటి గాదు రెండుగాదు చాల దినములు గతించెఁగదా! ఇప్పటికేని రాని హేతువేమొ?

మాద్రి— (విచారముతో) అక్కా! యేమి చెప్పుదును? ఎవరో యొక ఋషి శపించె ననియు దానిచే విరక్తుండై శతశృంగమ్ము దాపున కరిగి యయ్యెడఁ దప మొనర్చుకొనుచుండె ననియు నొక బోయతవలన నింతకు మున్నే విని యుంటిని.

కుంతి— (తత్తఱపాటుతో) ఎందుకు శపించెనో? ఏమని శపించెనో? కనుఁ గొంటివా?

మాద్రి— నే నామాట వినినతోడనే నిర్విణ్ణురాలనై యేమియు మాటలాడ లేక యున్నకుంటిని. వలసినచో నిపుడు కనుఁగొనవచ్చును. దానియునికిప ట్టయ్యదియే.

కుంతి— అక్కడి కరిగి కనుఁగొని దయితు నోదార్చి తేర్చి తత్సహితముగాఁ బురి కరుగుదము; రమ్ము.

(నిష్క్రమింతురు.)

పాండు.— (కనులు తెఱచి) ఔరా! తపోమహిమ!

ఉ. ఆస నశించెఁ, గామ మడుగంటెను, లోభము రూపు మాసె, ని
ష్కాసితమయ్యె మోహము, వికావికలయ్యె విచార, మెంతొ సం
తోసము నెంతయో దయయునున్ మఱిఁ బాదుకొనెన్ దపఃక్రియా
భ్యాసము నిందుకే మునులు పాయరు రాజ్యము దీనిపాటియే?

(స్మృతినభినయించి) ఏమీ యీపామరత్వము? మరల నను వెనుకకు లాగుచున్నదే! (తల పంకించి) అవును.

ఉ. పున్నమచందమామనెటఁ బోలెడినెమ్మొగముల్ సుతారపున్
వెన్నెల సేలు నవ్వులును వింతవగల్ తళుకారుపల్కులున్
వన్నెలుఁ జిన్నెలుం జెలఁగువాఁడిమిచూపులు వొల్చుకన్నులున్
జిన్నఁగఁ బుచ్చియేఁ దపము చేసియు నన్నముఁ జేసి యొక్కటే.

(పెదవివిఱిచి) కాక చేసెడిదేమి?

ఉ. అంగన లన్నఁ బెద్దపులు లైరిగదా మునిశాపభీతి, న
ర్థాంగులపొందులేనియపు డన్నియుఁ ద్యాజ్యము లౌనటన్న రా
జ్యాంగము లేల? తక్కినవిహారము లేల? యొకంట నెట్టులో
క్రుంగి యడంగియుండుటయె కూడు మఱేదియుఁ గూడ దెమ్మెయిన్.

(నిట్టూర్పుపుచ్చి)

మ. మఱి నూహింప సతీసుతాదిగతసంబంధమ్ము సర్వమ్ము క
ల్పిత మవ్వారలరక్షణార్థమ కదా? లెక్కింపఁగారాని దు
ష్కృతులన్ దేహియొనర్చు టక్కటకటా! యీబంధమే యీజగ
త్థితికిన్ గాపలెనే? మఱొక్కగతి నీచేఁ గాదె? లోకేశ్వరా!

(ప్రేమావేశముతో) పరమపతివ్రతామణులగు నోప్రేయసులారా!

ఉ. ఏమియొనర్తు? మీయెడల నేను విరక్తుఁడఁ గాను, వేఱుభా
మామణులన్ వరించి మిము మానినవాఁడను గాను మీరు న
న్నేమనుకొందురో యకట! యెందులకుం గొఱగానివాఁడనై
యీమెయి నుంటి నొక్కముని యింతటిదుర్దశ దెచ్చె నాకెడన్.

కాదు కాదు తప్పఁదలంచితిని.

మ. కరుణాసస్యము పాలి యూషర మఘౌఘధ్వాంతపక్షాంత మీ
శ్వరసంసారవనీకుఠారము శుభాపస్మార మాయుష్యభా
స్కరరాహుగ్రహ మాధికారకము దుస్సంగంబు క్రూరక్రియాం
కుర మాఖేటక మిట్టిదుర్గతిని నాకుం గూర్చెఁ జల్పాదిరై.

(దిక్కులు పరికించి) ఏమీ ! ఇయ్యెడఁ బ్రియురాండ్రు లేనేలేరా? ఔరా ! మోహము నాకెట్టిభ్రాంతి పుట్టించుచున్నది. కానిమ్ము. ఇఁక నేని జిత్తమును గట్టిగా నిరోధము చేసికొని యీతపస్సమాధియందుఁ బ్రవర్తింతుఁగాక.

సీ. అపకుండనైతి మున్నపచారమును జేసి
కామమా ! నన్నింకఁగలఁచఁబోకు
విజ్ఞానినైతి నే నజ్ఞానకృతిఁ జేసి
మోహమా ! నన్నింకముట్టఁబోకు
నీకారణముననే నాకీదశఘటించె
లోభమా ! నాలోనెలుంగఁ బోకు
నీదునుక్కు మునీంద్రుఁ డాదరింపకపోయె
మదమ ! నన్నీవీఁదఁ గదియఁబోకు
తే. గీ. మెట్టులో కాలయాపన మిచటఁ జేసి
పరముఁగనలేంతు నాతోడఁ బంత మేల?
రమ్ము వైరాగ్యమా! శాంతి! రాఁగదమ్మ
దాంతిరో! వేగ రావమ్మ తపమ! రమ్ము.
(కనులు మూసికొని జపించును)

(కుంతీ మాద్రులు ప్రవేశింతురు.)

కుంతి— చెలియలా ? ఆ చెంచెత చెప్పినప్రదేశ మిదియే. మన మిచ్చటనే వెదకవలయును.

మాద్రి— అవును, ఇది తపస్విజనోచితమై యున్నది. ఇక్కడనే తప్పక యార్యపుత్రుం డుండవచ్చును. (పరిక్రమింతురు)

కుంతి— (దృష్టినిగుడ్చి) అదుగో, ఆర్యపుత్రుఁడు తపస్విజనోచితమ్ముగు వేషమున నొప్పుచున్నాఁడు. దగ్గఱకుఁ బోవుదము రమ్ము.

(అట్లొనర్తురు.)

మాద్రి— (విచారముతో) అక్కా ! ఎంతలో నెంతటిమార్పు కలిగినది. అఖండతపస్సమాధిలో నుండి నాథుండు మనవంకకైనను జూచినట్లు తోఁచదు.

కుంతి— అదుగో, కనులు విచ్చుచున్నాఁడు. చూచితివా?

పాండు— (తనలో)

చ. "వనితలపొత్తు చంచలము స్వప్నసమానము నాఁడునాఁటికిన్
జను విరసమ్ముగా" ననుచు సారెకు నూఱువిధమ్ములన్ మనం

బునకు విరక్తి గల్గుటకు బోధ యొనర్చిన వప్పుడొప్పిన
ట్లనుమతిఁ జూపియుఁ మఱవ దంతర మేఘియొనతుఁ నింతులన్.

(దెసలు పరికించి ఆశ్చర్యముతో) ఏమీ? నాయనుంగు నెచ్చెలులు నా పాలి భాగ్యదేవతలు, నన్నెట్టులో గుఱుతించి యియ్యెడకే వచ్చి యున్నారే! (విరక్తితో) ఛీ? మూఢచిత్తమా! యెందు కీసంతోషము?

క. చండాలుభంగి దూర
స్థుండై వీఁడుండవలయుఁ దొయ్యాలులకు నీ
గొండాట మింక నేటికి
దండుగ ; వైరాగ్యమందుఁ దగులుము సుఖినై.

(తలవంచికొని) అక్కటా! వీరి నేమొగమ్మునఁ జూడఁగలను? వీరితో నాయపరాధము నేమని చెప్పుదును?

చ. తనియరు కామినుల్ పురుషదర్శనమాత్రముచేత నెందుఁ గా
మిను లను పేరె చెప్పు నినుమిక్కిలి కామ మటంచు స్త్రీలయం
దెనిమిదిరెట్లు కామగుణ మేర్పఱచుఁ స్మృతు లక్కటా మనం
బున నను నేవగింపరొకొ? మోము నెడఁ బ్రియమాడి చూచినన్.

(తలవంచికొని విచారించును)

కుంతి— (ఎదుటికరిగి) నాథా? నమస్కారము. మమ్మిరువుర న య్యరణ్యమున డించి తా మొంటిగ నేగుదెంచి యిట్లుండుట న్యాయమా? భార్య భర్తకు సగము శరీరమని చెప్పు శ్రుతిస్మృతులు తా మెఱుఁగనివా? ఇంతకు మే మొనరించిన యపరాధ మేమి? ఏదేని గారణాంతరమున నిట్లుండవలసివచ్చినను ధర్మార్థకామములయందు సహధర్మచారిణియగు కుటుంబిని ననాదరింప వలసిన యావసరముండదుగదా? మీరే యనాదరించిన మాకు గతియెవ్వరు? (అని కన్నీరు పెట్టుకొనును)

పాండు— (తనలో) ఔర్లా సంగ మెంతచెడ్డది!

ఉ. పుట్టినతోడనే శుకునిపోలిక భీష్మునిభాతి విష్ణురా
ట్టట్టులు నాంజనేయుగతి నంగనలం గయికోక మోక్షపుం
బట్టముకోసమై తిరుగువారికి స్వేచ్ఛయొసంగుఁగాని నా
యట్టిరు మోక్ష మందుటకు నైన మఱెందుల కైన రిక్తులే.

క. ఒకభార్యగలుగుమానవు
కకు స్వాతంత్ర్యమ్మునున్న నా కిర్వురవీ
రకటా! తప మేగతి నా
కిఁక సిద్ధింపంగనిత్తు రికంజాక్షుల్?

ఇం దేమి గతి? ఇట్లగుఁగాక (ప్రకాశము) రాజపుత్త్రీ! నాకుఁ దటస్థించిన దురవస్థ మీరును నారణ్యకులవలన వినియేయుందురు. కావున మీరు నన్ను నిరోధింపక నావెనువెంట వేఁటకై వచ్చిన యనుచరులతో హస్తిపురికిం జని

సీ. సత్యవతీదేవిసాన్నిధ్యమున కేగి
భీష్మునిఁ జూచి యవ్విదురుఁ గాంచి
మాతల్లి దర్శించి మాయన్న నీక్షించి
మావధూనికకు నమస్కరించి
మాపురోహితుల సమ్మానించి మఱియును
పౌరవృద్ధులఁ జేర్చి గారవించి
అస్మదాశ్రితులగు నాగమవేత్తల
సత్కవిప్రవరుల సత్కరించి

తే. గీ. "అర్థమును గామమును సుఖ మఖిల మితర
మును బరిత్యాగ మొనరించి వనమునందుఁ
బాండుఁడున్నాఁడు వైరాగ్యపరత" నంచు
వినయమునఁ దెల్పుఁ డోయలివేణులార!

ఇఁక నాకై విచారింపకుఁడు.

క. కృపణునివిత్తము మూకుని
లపనము విధవాంగనావిలాసము పాథో
ధిపయఃపూరము నా ప్రా
యపుసొబగును నొక్కరూప; యరుగుఁడు మీరల్.

కుంతి — నాథా? మీకుఁ గలిగినశాపంబు తెలియం గలుఁగుదుము. దైవవశమ్మున వచ్చుఁ గష్టసుఖములకుఁ మనము విచారించిన నేమగును? ఇంతకును విచారించి చేసెడిదేమి? కావునఁ దాము ధైర్య మవలంబించి తమయిచ్ఛానుసారముగనే యిద్వనమ్మున [illegible]ఁగూడ నివసింపుఁడు. మేము మీ[illegible] నిష్ఠ కించుకయు భంగముఁ [illegible]గించెడి తెలఁగునకుఁ బోక జాగరూకత గలిగి వర్తించుచుందుము. మమ్ము పీడుట తమకు న్యాయముగాదు. మేము మిమ్ము వదలి రాజధాని కరిగి మాత్రము చేయవలసినదేమి? వానప్రస్థాశ్రమమున భార్యాసహితముగఁ బ్రవర్తింపుటకుఁ గూడఁ గొందఱు ఋషుల మత మున్నదని వినియుంటిని. అక్కతమున నేకదా వసిష్ఠాదు లందఱును గృహిణీసమేతులై వనమ్మున వసియించెదరు. దాము వృథాగా మమ్మెందులకుఁ బరిత్యజించి విచారనీరనిధి ముంచెదరు? మమ్ముఁగూడ నియ్యెడనుండు నట్లానతిండు. భార్యయనునది భర్తతో సుఖమునాత్ర

మనుభవించుటకే యేర్పాటు గాలేదు. దుఃఖభాగినిగూడఁ గావలయు నని యే పెద్దలు సెప్పుదురు.

పాండు— (తనలో) ఇప్పట్ల నీపె వాక్యము శాస్త్రసమ్మతముగను వ్యవహారోప యుక్తమ్ముగను గనుపట్టుచున్నది. కాని యిందు ము ప్పెన్నఁటికేని యున్నది గాని లేకపోలేదు. కావున నిట్లుకూడఁ జెప్పిచూచెద. పదఁపడి వారల యిష్టమునచ్చిన ట్లొనర్తురుగాక. (ప్రకాశము) తలోదరీ!

చ. సహజవిరక్తిగల్గు మునిచంద్రులు భార్యలతోడఁ గూడియుక్
గహనమునందు నిష్ఠమెయిఁ గాలము పుత్తురుగాక యేను దు
ర్వహమగు ప్రాయమందిటు విరాగ మరాగకృతంబుఁబూని యే
గహిఁదుదముట్ట నేరుతు గరంబును మీ పరిచర్యలొందుచుక్.

తే. గీ. వ్యక్తిగలదాన వీవు లోపంబు రాక
యుండఁ గాపాడఁ గలవని యొప్పుకొన్న
ముగుద యెంతయు నీ సనమోహనాంగి
మాద్రిపట్టున నాకు నమ్మకము లేదు.

కుంతి— నాథా! మీకీ సందియము లేశమును వలదు. ఈమె వయస్సున నాకన్నఁ జిన్న యయ్యు గుణాతిశయమున మిన్న యని పూను నేను వేఱె చెప్పనక్కఱలేదు. మీవ్రతమును మే ముభయులమును సర్వవిధ ములఁ గాపాడుచుందుము. మా యునికికి సమ్మతించి మమ్ముఁ బ్రది కింపుఁడు.

పాండు— (ప్రేమతో) ప్రేయసీ! దుర్వారమగు నీ ప్రతిబంధకమ్మునఁ గాని నాకుమాత్రము మిమ్ముఁ బరిత్యజింప వలయునని యున్నదా? కానిండు. నే నేమటినను మీ రేమఱక జాగరూకత గలిగి యశమ్ము సంపాదింపు దురుగాక.

మాద్రి— (తనలో) ఈమెకతన నాథుని సందర్శనభాగ్యము లోపింపక నాకుఁ దటస్థించినది. నేను ధన్యురాలను

**(అపటీక్షేపమున నొకభ ప్రవేశించును)**

భటు— జయము జయము. దేవా! సేనాపతి తమయాజ్ఞకై యెదురు చూచు చున్నాఁడు. ఏమిసెలవు?

పాండు— నీ వరిగి, "పాండురాజు సభార్యుఁడై కొంతకాల మీ యడవియందే మునివృత్తి నుండఁదలంచినాఁ" డని మాయన్న మొదలగు వార్యులతో నివేదించునట్లు సేనాపతికి నాయాజ్ఞఁ దెల్పుము పొమ్ము.

భటుడు — చిత్తము.

(నిష్క్రమించును)

కుంతి — నాథా! ఈశతశృంగారణ్యమం దెచ్చటనేని మున్యాశ్రమము లుండక పోవు. కావున మన మయ్యెడ కరిగి వారలవలనఁ బుణ్యగాథలు వినుచు నారణ్యకాచారము లభ్యసించుచుఁ గాలముపుత్తము.

పాండు — నీవు వచియించెడి తెఱఁగు గడు రమణీయము. అట్లె యొనర్తము. మునుల మహిమము లగాధములు. వారలే దేని తెఱఁగున నా కపత్యో దయంబుఁగూడఁ బ్రసాదింపవచ్చును. అమ్మౌని నన్ను శపించునప్పుడు గూడ సంతాన ముదయించు ననియే సూచించి యున్నాఁడు. పదండు పోవుదము.

(నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ ..తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ బడిన పాండవజననమ్మున షష్ఠాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవ జననము

## సప్తమాంకము.

(అంతనొక సిద్ధాంతి ప్రవేశించును.)

సిద్ధాం— (తనలో) "గాంధారీమహాదేవికి మొట్టమొదట పట్టిమాంసపిండము యుదయించు ననియుఁ దుద నయ్యది నూటుగురు కొమరులుగాను నొక కుమారికగాను బరిణమించు" ననియు నేను మున్ను చెప్పినప్రశ్న నిజమగుటచే నాకు ధృతరాష్ట్రమహారాజుగా రగ్రహారాదిక మిచ్చి మిక్కిలి గౌరవించి యున్నారు. వారి యనుగ్రహముచే సుఖముగా రాజువలె గార్హస్థ్యము నడపికొనుచుఁ బంచాంగమును వారిపేరుగనే రచింప మొదలిడితిని. కాని మరల నేఁ డేదో యొకయత్యావశ్యకమైనప్రశ్న చెప్పవలసియున్నదని కబురంపియున్నారు. ఈ ప్రశ్నగూడఁ దగినంత తార్కాణముగా ఋజువిచ్చినచో నాకింకను విశేషముగా బహుమానము లభింపఁగలదు. ప్రశ్నశాస్త్రము మంచిదే కాని దీనికొకదోషము కడుఁ బెద్దది లభించినది. ఆపార్వతి కీ జ్యోతిష్కు లేమిమహాపకారము చేసిరోకాని యీశాస్త్రము దృశ్యాదృశ్య మగునట్లు శపించినది. ఆహేతువుచే నొకప్పుడిది తప్పిపోవుటయుం దటస్థించును. దానితో వెనుక నున్నగౌరవముఁగూడ "క్రొత్తనీరువచ్చి ప్రాఁతనీరును బోఁగొట్టిన" దన్నట్లు తుడిచిపెట్టుకొనిపోవును. అందుచేతనే వైద్యులకును జ్యోతిష్కులకును వేశ్యలకును బరమనోరంజనమే వృత్తికావునఁ బ్రతిదినగండమని చెప్పుదురు. (వ్రేళ్ళు లెక్కించి) ఇప్పటిగ్రహస్థితిని బట్టి చూడ నా జాతకము బాధకారిగనే యున్నది. కాన నే "నాడినదాటయుఁ బాడినది పాటయు" నగుటకు సందియములేదు. (పరిశీలించి) అదుగో, ధృతరాష్ట్రమహారాజు. పరమపూజ్యులగు భీష్మాదులతో నేదో ముచ్చటించుచున్నాఁడు. కొంచెము మావిషయము పెదవి యదల్పుం బట్టి గుఱుతించుచు మెల్లఁగాఁ బోయెదను. ప్రశ్నవిషయమున కిది యప్పుడప్పుడు కొంత సహాయమగుటయుంగలదు. (అట్లొనర్చును)

(అంత ధృతరాష్ట్ర విదుర భీష్ములు ప్రవేశింతురు)

విదు— అన్నా! ఈస్వప్నము కడు శుభప్రదమే; ఏమో యతని కేదేవు ననుగ్రహమున నేని నైదుగురు కొమరులును గలుగఁగూడదా? వెనుక యువనాశ్వునిగర్భమున మాంధాత యుదయింప లేదా? కాక యీస్వప్నమున కీవిచార మేల? ఇది శుభప్రదమే కదా?

ధృత— (విచారముతో) తుదముట్ట వినుము. అనంతరమున నాశిశువుల బాల్యమునఁనే యతఁడు—(అర్ధోక్తితో విరమించి కన్నీరునించును.)

భీష్మ— (ధైర్యముతో) సరే తెలిసినది. స్వప్నములో నెవరు మృతిచెందినట్లు కనుపట్టునో అది వారి కెన్నఁడును దటస్థింపదని వాడుకయొకటి కలదు. కావున నీవిఁక బొత్తిగా విచారింప నవసరములేదు.

ధృత— (కన్నీరుదుడుచుకొని) అవును. పెద్ద లిట్టులే చెప్పుదురు. ఐనను మనసు నిల్పలేక ప్రశ్నపూర్వకముగా నీవిషయమును దెలియ నూహించి మన సిద్ధాంతిగారికిఁ గబురు చేసితిని.

సిద్ధాం— (సమీపించి) (బుధుండుꣳ శనై

మ. గురుఁడుꣳ సూర్యుఁడుఁ జంద్రుఁడుం గుజుఁడు శుక్రుండుꣳ
శ్చరుఁడుꣳ రాహువుఁ గేతువుꣳ మిగుల విశ్వాసమ్ముతో మంగళ
స్ఫురణంబుల్ బొనరింత్రుగాక నిరతంబుꣳ మీరు నవ్వారలꣳ
గర మారాధన సేయుచుండుటకునై కాంక్షించి సన్నేహులై.

ధృత— స్వామీ! ఆసనము నధిష్ఠించి స్థిరచిత్తులరై యొకప్రశ్నంబుం బుర స్కరించుకొని యాలోచింపుఁడు

సిద్ధాం— చిత్తము. (వేళ్ళు లెక్కించి యాకసమువంకఁ జూచి) రాజా! ఈప్రశ్నము శుభాశుభమిశ్రఫలదంబుగాఁ దోఁచుచున్నది. సావధానముగాఁ జిత్తగింపుదురుగాక.

ఉ. పాండునృపాలకుం డటఁ దపంబొనరించుచు నుండి సంతు లే
కుండుటకై విచారమును నొంది పృథꣳ గని యాజ్ఞ యీఁగ న
య్యండజయాన మంత్రబల మంది యమానిలజిష్ణులꣳ మహో
ద్దండులఁగూడి తాఁగనె సుతత్రితయంబును ధర్మ్యపద్ధతిꣳ.

అంబరవాణి వారలకు ధర్మభీమార్జునులను నామధేయంబు లొసంగె. పదఁపడి నయ్యనఘుం డింకను బుత్రులు గావలయు నను తలంపున గుంతితో నిఁక నొక్కనిం గనుమన నాయమ ధర్మజ్ఞ గావున "నాథా! ఆపత్తునందుఁ గుల ముద్ధరించుట కేర్పడిన యీధర్మము మాఁగురవు లే

గాని యట్టిపై శాస్త్రము లొప్పవు. ఈధర్మము ననుసరించి నాల్గవ కొమరునిఁ గన్నది స్వైరిణియు నైదవపుత్త్రునిం గన్నది బంధకియు నగును" అని బోధించి యంతతో విరమించె.

ధృత— దైవజ్ఞ శిరోమణీ! కడుఁ జక్కఁగాఁ జెప్పితిరి. కాని, నాస్వప్నమునకును మీ ప్రశ్నమునకును స్వల్పభేద మగపట్టుచున్నది. మీరు మూఁగురనియే చెప్పినారు. నా కేగురని కల చెప్పినది.

సిద్ధాం— రాజా! నేఁ జెప్పఁదగిన దింకను నవశిష్టముగ నుండఁగనే తాము సెప్పఁ బూనుకొన్నారు. శేషము వినుఁడు. పిదప నొకనాఁడు మాద్రి, కుంతి సన్నిధిని లేకుండఁ జూచి "నాథా! తమకుఁ గలిగిన శాపప్రకారము నే నెఱింగియు నేను మిమ్ము నపత్యార్థమై వేడుకొనుచున్నందులకు మన్నింపుఁడు. మాయక్క కుంతి తనకుఁ జిన్ననాఁడు దుర్వాసుం డిడిన మంత్ర ప్రభావమునఁ గదా మూఁగురఁ గొమరులఁ బడసె. సవతి నగు నా కయ్యది యెంత దుఃఖకరమో యోజింపుఁడు. నాతోడికోడలగు గాంధారికిఁ బుత్రశత ముదయించినను నాకిందు శతాంశమేని చింతలేదు సరికదా! పైపెచ్చు సంతోషముకూడఁ గలిగినది. ఇది సాపత్న్యదోషము. కావున మీ రట్లేని యాపెకు బోధించి యామంత్రము నా కుపదేశించునట్లు చేసితిరేని నేనుఁగూడ మీ యానతింజేసి వంశకరులగు కొమరులఁ బడసి కృతార్థురాల నయ్యెద" ననుటయుఁ బాండుఁడు సంతానమ్మున నింకను దనియనివాఁ డగుటంజేసి కుంతితోఁ జెప్పి యాపెకా మంత్ర మిప్పించిన మద్రరాజ పుత్త్రియు నమ్మంత్రబలమ్మునంజేసి,

తే. గీ. అందమునయందుఁ దేజమ్మునందు మిగులఁ
పేరుఁ బెంపును గైకొన్న వేల్పు వెజ్జు
లిరువురంగూడ రప్పించి యిగురుఁబోఁడి
నకుల సహదేవు లనెడి పుత్రకులఁ గాంచె.

(విరమించుట నటించును)

ధృత— (తనలో) ఇక్కడికి శుభఫలము పరిసమాప్తమైనది కాఁబోలును. ఈ యనఘుఁడు చెప్పుట విరమించినాఁడు.

భీష్మ— సంశయించెద రేమి? శేషము గూడ వచింపుఁడు.

తే. గీ. కష్టమగుఁగాక సుఖ మగుఁగాక ప్రాప్త
మైనదానిని వచియింతు రంతె కాని
మీరు తెచ్చి పెట్టరుగదా? మీకు నేటి
సంశయము? సత్యమున కింత చర్చయేల?

విదు— (తనలో) పిదప నేమి విన్నను, "అతనికిఁ బుత్రు లుద్భవించి రనువార్త వినుటచే నాశ్రవణములు కృతార్థము లైనవి.

సిద్ధా— మీరందఱును బ్రాజ్ఞులు గనుక వచించుచుంటినిగాని యితరుల కైనచో మంచియేకాని చెడ్డ చెప్పుటకు దైవజ్ఞు లొప్పరు. పడఁపడి మాద్రిం జూచి "మఱియు నొక్క కుమారుం గను" మని యాంబాలికేయుండు పలుక నాపె నాకమ్మంత్ర మొకసారికి మాత్రమే యుపయోగించినది కాని యిఁక నుపయోగించునట్లు కనుపట్ట దనవుడుఁ, గుంతింగని, "యిందు లకుఁ గారణమే" మన నాపె "యదియంతయు దోషముగాదు ఈమె బుద్ధిదోషము, ఏమన ఏకవారగ మిరువురఁ గోరుటచే సమ్మంత్రరాజంబు కుపితం బయ్యె" ననివచియింపఁ, దిరిగియు నుపదేశింపు మనుటయుఁ గుంతి "ఇట్టి యవివేకినుల కీమంత్రి మీఁడగ" దని నిష్కర్షగాఁ జెప్పుటయు నతండు మిన్నకుండె. పడఁపడి యొక్కనాఁడు వసంతసమయమునఁ గుంతి సన్నిధిని లేకున్నయెడ—

ఉ. పలదని మాటిమాటికి నివారితుఁడయ్యును గామబాణసం
చలితమనస్కుఁడై తపసిశాపము నెంచక మద్రరాట్సుతన్
గలిసి, గతాసుఁడై చనియెఁ; గాముకులై తగువారు చావునన్
దలఁప రటన్న వేఱొకవిధం బగుహాని దలంప నేర్తు రే?

ధృత— (దుఃఖముతో) హా! సోదరా! కురుకులమునకు వన్నె తెచ్చి యింత స్వల్పవయస్సుననే యంతరించితివా?

ఉ. దిశలు జయించినావు ఘనతేజుల రాజుల నెల్ల నింతలో
వశముగఁజేసినావు బలవంతుల కెల్లను గుండెనీరుగా
యశము గడించినా వకట! యమ్మునిశాపము చుట్టుముట్టి దు
ర్దశ ఘటియించెనే? యిటుకుఁదమ్ముఁడ! మమ్మికఁ జూడరావుగా?

అయ్యో! సోదర! నీవు నాఁడు "తపస్వినైతి" నని తెల్పుచు నను చరునిచే నంపిన నమస్కారమే మాకెల్లరకును దుదినమస్కారమా? నీ వంటిభక్తిగల సోదరుఁ డెన్ని జన్మము లెత్తినను దటస్థింపఁడుగదా!

క. నేనంధుఁడనయ్యును నీ
చేనెల్లజగమ్ము నాకుఁ జేతికి వచ్చెన్
మానించి యెల్లనృపు లీ
పై నాకొక్కరుఁడుఁగూడఁ బలుకఁడు సుమ్మీ!

విదు— అన్నయ్యా! ఆయన శాస్త్రమునుబట్టి కదా చెప్పినాఁడు. అదియొక ప్పుడు నిజమైనను మఱొకప్పు డసత్యమును గావచ్చును. వృథాగా

నెందులకుఁ జింతించెదవు? మనచే నంపఁబడిన యనుచరుఁడు వచ్చె దనుక ధైర్య మవలంబింపుము.

భీష్మ— కుమారా! ఒక్కచో నిక్కమేయయినను విచారము తగదు. ఊఱడిల్లుము (సిద్ధాంతిదిక్కయి) పదఁపడి సంగతి సెలవిండు.

సిద్ధాం— ఇఁకఁ జెప్పఁదగిన దేమున్నది, ఇట్లతండు గతాసుండగుటయు.

తే. గీ. చెట్టువడినంతఁ జెట్టును జుట్టుకొన్న
తీవయునుబోలె నపుడు మాద్రీసుమాంగి
యానృపాలునిపైఁబడి యడల సాగఁ
గాంతలకు నింతకన్న దుఃఖంబు కలదె?

తే. గీ. కుంతియును నట్లొనర్చెఁ దత్సంతతియును
గరము దుఃఖించె మునివరు లరుగుదెంచి
వారి వారించి పాండుభూపతికి నుత్త
రక్రియలు దీర్చి రంత విధిక్రమమున.

మాద్రి, తనకతమున భర్తమృతిచెందె నను విచారముతోఁ బుత్రులఁ గుంతి కప్పగించి యచ్చటిమునిజనులు వలదని యెన్నివిధములఁ జెప్పినను వినక సహగమనం బొనర్చె. నేఁటి కీసంగతి జరిగి పదియేడు దినములైనది. ఇప్పుడో యిఁకనో ఋషివరులు గొందఱు పాండుపుత్రులనుఁ గుంతిని వెంటఁబెట్టుకొని యిక్కడికే వచ్చుచున్నట్లు పొడకట్టినది. ఇది శాస్త్రము ననుసరించి నా వచించుట. ఆ యా గ్రహము లన్నియు మీ యెడలఁ గృపగల్గి మీకు సమస్తమంగళములను జేకూర్తురుగాక!

ధృత— మహాత్మా! ఇన్నిసంగతులు తెలిసిన మీకిది గోచరమగుట యొక కష్టము గాదు. కాన నడుగుచున్నాఁడను. మాతమ్ముని కొమరుల కించుమించుగ నిప్పుడెంత వయస్సుండునో?

సిద్ధాం— (లెక్కించి) రాజా! ఇంచుమించేల? సరిగా నేచెప్పెద నవధరింపుము.

తే. గీ. పదియునాఱేండ్లు ధర్మసంభవునివయసు
అంతకొకయేడు తక్కువ వయ్యనిలజునకు
ఇంద్రసుతునకుఁ బదునాలు గేండ్లునిండెఁ
గవలకుఁ ద్రయోదశాబ్దముల్ కౌరవేంద్ర!

ధృత— అట్లయిన భీముఁడును దుర్యోధనుఁడును సమానవయస్కులు.

సిద్ధాం— సమాన వయస్కులనఁగా నొకటేదినమున నుద్భవించినారని యర్థము చెప్పికొనవలెను.

ధృత — ఔరా ఈ సిద్ధాంతిపాండిత్యము ! గడియలలోఁ దను నిమిషములలోఁ దను 'తూచా' తప్పకుండఁ జెప్పుచున్నాఁడు. కానిమ్ము, ఇందు నిజమెంతో అబద్ధమెంతో యిప్పుడే రాఁబోవు ఋషులవలనఁ దెలిసికోఁదగు.

(ప్రతీహారి ప్రవేశించి)

ప్రతీ — జయము జయము దేవా ! ఋషులు గొంద ఱొకవిధవాంగనయును నిరుపమాన తేజస్కులగు నేవురుబాలురను వెంటఁ జెనుదెర వచ్చి ద్వారమున నున్నారు.

భీష్మ — (తనలో) ఆబాలకులు పాండవులు, ఆమెకుంతి, నిస్సంశయము. (ప్రకాశము) ప్రవేశపెట్టుము.

ప్రతీ — చిత్తము.

(నిష్క్రమించును.)

(అంతఁ గుంతియుఁ బాండవులును ఋషులును బ్రవేశింతురు.)

భీష్మ — (ఋషులతో) మహాత్ములారా ! ఆయాసనము లలంకరింపుఁడు

(ఋషులందఱును గూర్చుందురు.)

భీష్మ — (నమస్కరించి) మహామహులగు నో ఋషిపుంగవులారా ! భవద్దర్శనంబునఁ జేసి మా పురంబెల్లఁ బవిత్రమయ్యె. మా రాజ్యమును మేమును మీ యాధీనము. మీ రాకకుంగల మేమో ? యానతీయ వేఁడుచున్నాఁడను.

ధృత — (తనలో) మనసిద్ధాంతి వచించినదంతయు నిశ్చయమే. తగిన ప్రవేశమున్నచో శాస్త్రము లెన్నఁడును నసత్యములు కావు.

ఋషి — (లేచి) రాజా !

ఉ. పౌరవవంశవర్ధనుఁడు పాండునృపాలుఁడు మా వనంబులో
ఘోరతపంబుఁ జేసి తనకున్ మృతికాలము రాఁగ మాద్రియున్
దారను గూడి శాపముకతమ్మున స్వర్గ మలంకరించె న
వ్వీరునిపుత్రు లేవురును విశ్వజనీనకళాధురంధరుల్.

(ధృతరాష్ట్రాదులు కన్నీరునింతురు)

ఋషి — ఎందుకు విచారించెదరు ? ఆతనిం గూర్చి మీకన్న మాకు విచారింపవలసియున్నను, విచారించి చేయునది లేక దిగమ్రింగితిమి.

తే. గీ. కొందఱకు నన్నఁగా మఱికొందఱకును
దమ్ముఁడుగ శిష్యభంగిఁ గొందఱకు గురువు

చందమునఁ గొందఱకు నాతఁడందు మాకు
నరమర యొకించుకయు లేక యధివసించె.

కుంతి — (తలవంచి కన్నీరు నించును)

భీష్మ — (తనలో) వీరు దేవప్రసాదమ్మునఁ గలిగినసంగతి యథార్థమే. అయినను లోకారాధనమునకై యీఋషులతోఁ గొంత ప్రసంగింపకమున్న యీపసిబాలురను గైకొనుట యంత మంచిపనిగాదు. (ప్రకాశము) స్వామీ! మాకీ సందియముం దీర్పుఁడు. మాపాండురాజునకు మునిశాపంబు తటస్థించెఁ గదా! ఈసంతాన మెట్లుదయించినది?

ఋషి — మీరిట్లు సంశయింతురని యోజించియేకదా మేమందఱమును నియ్యెడకు రావలసివచ్చినది. ఒక్కనాఁడు మేమెల్లరమును గలిసి బ్రహ్మలోకమ్మున జరుగుసభకుఁ బోవుచుండ మాతోడ నీతండు గొంతవఱకు వచ్చి రాఁజాలక మమ్ముం గాంచి, "నే ననపత్యుఁడ నగుటచేఁ గాఁబోలు నాకీమార్గమ్ము దుర్గమమ్ముగానున్నది. 'అపుత్రస్య గతిర్నాస్తి స్వర్గో నైవచ నైవచ' అని మీవంటిపెద్దలు పచింతు"రని విచారించుచుండ, మే మాతనియెడ సస్నేహులమై దివ్యదృష్టిం జూచి "రాజా! యెందుకు విచారించెదవు? నీకు దేవదత్తంబగు నపత్యంబు నిర్ణీతంబై యున్న"దని చెప్పితిమి. పదంపడి యీమహాభాగతో నాతండు యోజింపఁ దనకు దుర్వాసుం డిచ్చిన మంత్రంబుం జపించి యీమె యీ మూఁగురు కొమరులం గనియె. ఆమంత్రబలముననే యీ యిరువురను మద్రరాజపుత్రి ప్రసవించె. వీరలకు జాతకర్మము మొదలు పనయనము వఱకును మావలననే యయ్యనఘుండు జరిగించె. (చేతఁజూపుచు)

ఉ. ఆతఁడు ధర్మరాజు యమునంశమునన్ జనియించినాఁడు ప్రి
ఖ్యాతగుణాకరుండు త్రిజగమ్ముల నీతనికీర్తి నిండు నిం
కీతనితోడఁ దుల్యుఁడు మఱెందు జనింపఁడు వాస్తవమ్ము; మీ
రీతనిచేఁ దరింతు రది యేను దపంబునఁజేసి తెల్పితిన్.

ఉ. భీముఁడితండు లోకములు పెల్చన నొక్కట నెత్తివచ్చినన్
వే మడియించు నయ్యనిలవీర్యసముద్భవుఁ డొక్కనాఁ డితం
డీమె కరంబునుండి పడి యెత్తగుగ్రావము నుగ్గుఁజేసినాఁ
డామెయిఁ బాలుఁడావునపు; డచ్చెరువందె మునీంద్రసంఘముల్.

మ. అతఁడే యర్జునుఁ డక్కుమారుజనకుం డాఖండలుం డింక నీ
క్షితియందొక్కటఁగాదు వీని కెచటం జేటొప్పటు వాటిల్ల దు
న్నతమా చాపము చూచినంతన రిపుల్ నష్టాశులై కేలుమో
డుతు రీ వీరుపరాక్రమమ్మునకు నీడున్ జెప్పఁగా శక్యమే?

చ. నకులుఁ డితండు వీనిదగు నామము విన్న రిపుల్ హతాశులై
తికమక గాంత్రు; వాఁడె సహదేవుఁడు తగ్గఁడొకింతయేని య
న్నకు నొకటన్, గవల్ కడుఁ గనందగు వీరలసొంపు దగ్రపు
త్రికలు గుణాకరుల్ గడుఁదిరంబగు వీరియశంబు దిక్కులన్.

మీ కింకను బ్రమాణాపేక్ష కలదేని యద్దేవతలే సాక్ష్యమిత్తురుగాక !

(ఆకాశమువంకఁ జూచును)

## (తెరలో)

చ. అగునది నిక్కువంబు ఋషు లాడుదురయ్య యసత్యమెల్లరున్
గగనమువంకఁ గన్గొనుఁడు కాలుఁడ నే ననిలుం డితండు దే
వగణవిభుం డితండు సురవైద్యులు వీరు మునీంద్రు మంత్రమున్
మగువలు మమ్ముఁగూర్చి మననం బొనరింప జనించి రీసుతుల్.

(అందఱును ఆశ్చర్యముతో నాకసమువంకఁ జూచుచు నాకర్ణింతురు)

ఋషి — (భీష్మాదులదిక్కు) ఇంతకన్నను మీకు మే మొనరింపఁదగు పను
లేమి ? అయిన నిట్లగుఁగాక.

## (భరతవాక్యము)

మ. కలుగుంగాక ! యశమ్మునం బ్రజలకుం గాఢానురాగంబు భా
సిలెడుంగాక ! సుఖమ్ము లెల్లరకు సుశ్రీ యెల్ల దేశమ్ములన్
నెలయుంగాక ! యపాత్రులైన కుకవుల్ వేవే పరాభూతులై
తలవంపుల్ గయికొంద్రుగాక ! ఋతమే దైవంబుఁగా కెల్లెడన్.

మఱియును.

ఆ. వె. పక్షపాతులైన కుక్షింభరుల యుచ్చ
యోగ మడఁగుఁగాక యోగ్యులైన
కవుల వాక్కులందుఁ గాళీమహాదేవి
నిలుచుఁగాక నిజమె గెలుచుఁగాక.

## గద్య.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరులచే
రచియింపఁబడిన పాండవ జననమ్మున
సప్తమాంకము.

శ్రీమత్సర్వదేవతాభ్యోనమః.

శ్రీ

# పాండవప్రవాసము

## ఇందు వచ్చు పాత్రములు.

**1. వ యంకము.**

1 ద్రోణుఁడు
2 పంచపాండవులు
3 ద్రుపదుఁడు

**2. వ యంకము.**

1 బ్రాహ్మణదంపతులు
2 కుంతీదేవి
3 భీముఁడు
4 బకుఁడు
5 హిడింబ

**3. వ అంకము.**

1 భటుఁడు
2 ద్రుపదుఁడు
3 పురోహితుఁడు
4 ధృష్టద్యుమ్నుఁడు
5 దుర్యోధనుఁడు
6 దుశ్శాసనుఁడు
7 కర్ణుఁడు
8 శ్రీకృష్ణుఁడు
9 బలరాముఁడు
10 ద్రౌపది
11 పంచపాండవులు
12 కుంతి

**4. వ అంకము.**

1 విదురుఁడు
2 పంచపాండవులు
3 ధృతరాష్ట్రుఁడు
4 భీష్ముఁడు
5 ద్రోణుఁడు
6 దుర్యోధనుఁడు
7 దుశ్శాసనుఁడు
8 శకుని
9 కర్ణుఁడు
10 వికర్ణుఁడు
11 ప్రాతిగామి
12 ద్రౌపది

**5. వ యంకము.**

1 అర్జునుఁడు
2 ఊర్వశి
3 దాసి
4 ఇంద్రుఁడు

**6. వ అంకము.**

1 ధౌమ్యులు
2 ద్రౌపది
3 సైంధవుఁడు
4 పంచపాండవులు
5 దాసి

**7. వ అంకము.**

1 గాయకుఁడు
2 సైరంధ్రి
3 ఉత్తర
4 బృహన్నల
5 ఉత్తరుఁడు
6 గోపాలకుఁడు
7 భీష్ముఁడు
8 ద్రోణుఁడు
9 కృపుఁడు
10 అశ్వత్థామ
11 కర్ణుఁడు
12 దుర్యోధనుఁడు

**8. వ అంకము.**

1 పంచపాండవులు
2 ఉత్తరుఁడు
3 విరటుఁడు
4 రాయబారి
5 సైరంధ్రి

ఓమ్.

శ్రీమత్పరదేవతాయై నమః.

# పాండవప్రవాసము

## ప్రథమాంకము.

### నాంది.

చ. జయమొసఁగియిచ్చు నెయ్యది యశంబిడు నేది సుఖంబొసంగు న
న్వయ మభివృద్ధి చెందుటకునై మతి యొద్దినిదాన మేది దా
నయ మొనగూర్చుఁ బాఠకుల కట్లన శ్రోతలకుఁ బ్రశస్తమ
ద్వయ మలభారతం బొసఁగుఁ బంచమవేదము మీ కభీష్టముల్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్ర— బావా! ఇటురమ్ము.

(మారిషుఁడు ప్రవేశించి)

మారి— ఇదె వచ్చితిని.

సూత్ర— మొన్నటి వ్యాసపూర్ణిమనాఁడు మన మొనరించిన పూజాపురస్కారములకు నలరి భారతగురువుగారు మనకిడిన యాశీర్వచనమును నీవును వింటివిగా?

మారి— వినకేమి? "పాండుపుత్రులంబోలె మీరును దుర్జయులై నెగడుదురుగాక" యని ప్రీతిపూర్వకముగ నాశీర్వదించిరి.

సూత్ర— తిరుపతి వేంకటేశ్వరులచే రచింపఁబడిన పాండవ ప్రవాసముం బ్రదర్శింపనెంచిన మన కీనాఁడు వారి యాశీర్బలమున నెందును గొదువ రానేరదు. కావునఁ బాత్రముల నాయత్తపఱుపుము.

మారి— చిత్తము.

(నిష్క్రమింతురు)

సూత్ర— పుణ్యమూర్తులగు నో సభాస్తారులారా!

క. ద్రోణాచార్యుల కెనయగు
జాణన్ మద్గురువరేణ్యు స్మరియించి కడున్
నాణెముగ నతనిశిష్యుల
పోణిమి మీకిపుడు దృశ్యముగ నొనరింతున్.

(నిష్క్రమించును)

## ప్రస్తావన.

(అంతట ద్రోణుడును పాండవులును ప్రవేశింతురు)

ధర్మ— చిత్తము. తరువాతి సంగతి సెలవిండు.

ద్రోణు— అట్టిరువురమును నగ్నివేశునొద్ద సహాధ్యాయులమై చదువుచు నీర క్షీరంబులంబోలె మెలంగుచుండ నొక్కనాడు ద్రుపదుండు నన్నుం జూచి,

గీ. "ఏను పాంచాలదేశము నేలునప్పు
డయ్యెడకు నేగుదెంచి మీరందు యుండి
నన్ను నుంబోలె రాజ్యంపు మన్ననలను
నొంది నాకుఁ గృతార్థత నొసఁగవలయు."

అని ప్రార్థించెను.

భీము— అది యుచితమే కదా!

గీ. పుడమి నేలుపులే కడుఁ బూజ్యతములు
దానిలో మీ రనంగ మహానుభావు
లదియు నట్లుండ సహపాఠు లధికమిత్రు
లట్టి మిమ్ముఁ బూజించుటకన్నఁ గలదె?

తరువాతి సంగతి సెలవిండు.

ద్రోణు— పదంపడి కొంతకాలమునకు నేను విద్యాసమాప్తిం బొనరించి వివాహంబు చేసికొని పుత్రవంతుండనై ధనార్జనంబునకై పరశురాము నికటమ్మున కరుగుటయు నయ్యనఘుండు.

క. "ధనమెల్లఁ బంచియిచ్చితి
ననఘులకున్ యాచకులకు నవనీతల మె
ల్లను గశ్యపున కొసంగితి
నను నేటికిఁ జూడ వచ్చినాఁడవు చెపుమా?

కానిమ్ము. మించినదానికేమి ? నా శరీరంబును వస్త్రమ్ములును నిప్పటికి నిలిచి యున్నయవి. ఇందు నీ కెయ్యదివలయు నదియ పరిగ్రహింపు" మనవుఁడు సంతసించి 'శస్త్రాస్త్రమ్ము లయ్యానఘునివలనఁ బరిగ్రహించి బాల్యమిత్రుండగు ద్రుపదుని పాలికిం బోయితి.

అర్జు— (తనలో) ఓహో ! ఇయ్యానఘుఁ డొక్క-చోటనే విద్య నభ్యసింపలేదు. తాతంబోలె భార్గవునకుఁగూడ శుశ్రూష యొనర్చి కొన్ని విశేషములు గ్రహించియున్నాఁడు. (ప్రకాశము) చిత్తము. తరువాత ద్రుపదుండు కండకావరమున మిమ్ము నెఱుఁగక నికృష్టరాజోచితం బగు ధనమత్తతం గనఁజేసెను గాఁబోలును.

ద్రోణు— అంతమాత్రముతోఁ జాలించిన నా కింత పట్టుదలయే లేకుండును.

నకు— గురువర్యా ! ఇఁక నేమిచేసెను ?

ద్రోణు— నన్నుఁ జూచి యెకసక్కె-ముగా,

గీ. "ఏను మూర్ధాభిషిక్తుండ నీవు పేద
బాఁపనయ్యవు మనకెట్లు పరఁగు మైత్రి ?
సరిసరే ! పొమ్ము పొమ్ము యాచకుల లక్ష
ణంబు గనఁజేసితివి నీగుణంబు దెలిసె"

అని నన్నవమానించెను.

సహ— (కోపముతో)

చ. ఇరువుర మేము నన్న లొక యిర్వురు నల్వుర మేకమై సురా
సురు లని నడ్డమైన నఁశూలి సహాయుఁడు గాఁగ వచ్చినన్
దురమున నేడ్తెఱన్ ద్రుపదు దోర్బలమున్ హరియించి తెచ్చి యో
గురువర ! మీకు దక్షిణగఁ గొంకక యిచ్చెద మింతయేటికిన్.

ధర్మ— గురువర్యా ! ఇంతకుమున్న ధార్తరాష్ట్రులు యుద్ధసన్నద్ధులై యరిగిరి గదా ! వారల కతండు సాధ్యుండు గాకయుండునా ?

ద్రోణు— ధర్మనందనా !

చ. ద్రుపదుఁ డయోనిసంభవుఁడు దోర్బలమందున నాకు లొచ్చు గాఁ
డపరిమితాస్త్రశస్త్రనిచయమ్ములఁ జెద్దయు నాటితేటిన
ట్టి పరమశూరుఁ డాతని కడింది మగంటిమి కెవ్వరడ్డు ? భూ
మిప ! మనయర్జునుం డతని మించుఁ దదన్యుల కాతఁ డోపఁడే !

అర్జు— (సంతోషముతో) దేశికేంద్రా!

చ. కవ లిరుప్రక్కలన్ నడవఁ గాఁ బవనాత్మజుఁ డగ్రముందు నె
క్కిన రథమ్మునన్ రిపులఁ గూల్పఁగ నేను రథమ్ము నెక్కి యా
హవమునఁ బార్షదుం గదిసి ప్రాణముతోడన పట్టి తెచ్చి మీ
కవమతిఁ జేసినట్టి ఫలమందఁగ దక్షిణగా నొసంగెదన్.

ధర్మ— అర్జునా!

మ. ధనమున్ రాజ్యము నెందుకిచ్చెఁ దనకున్ దైవంబు? పూజ్యుల్ తపో
ధనులు న్మాన్యులు నైన యాచకులకున్ దారిద్ర్యబాధానిరం
జనులౌ పంగులు నంధులౌ జనులకున్ సంరక్షణ ల్సేయు నం
చున కాదే? యొకపొట్ట కేమిటికి నిచ్చు న్కోటిసామ్రాజ్యమున్.
కావున నతం డవశ్యమును దండ్యుం డగుట నట్లొనరింతువుగాక.

భీము— అన్నా! తక్కినవారిమాటెట్టులైనను,

క. చిననాఁటనుండియును నొ
క్క నిమేషము పాయ కొక్క కాయంబై యుం
డిన మిత్రుఁ బాత్రు నిటు చే
సిన దుర్మార్గునికి నింక సిరి యెటు నిలుచున్?

నకు— గురువరా! నాకుఁ దెలియమి నడుగుచున్నాఁడను క్షమించి యీసందియముం దీర్పుము.

మ. బకముం బోలె స్వకుక్షిరక్షణకునై ప్రాజ్యంబు రాజ్యంబు పూ
ను కఠోరాత్మకునిన్ గృతఘ్ను జడునిన్ దుశ్శీలు దుశ్శ్రీకుఁ జం
పక "ప్రాణంబులతోడఁ దె" మ్మనుచుఁ బంపం బాడియే? వీఁడు భూ
మికి భారం బగుఁ గాదె? యెందుకొ యకో మీరిట్లు భాషించుటల్?

ద్రోణు— నాయనా! ఇతఁ డిప్పు డెట్టివాఁడైనను క్రమముగాఁ గష్టసుఖము లొందుటఁబట్టి పిదప లోకోపకారి కావచ్చును. కావున మన మితనిం జంపఁ దగదు. "లేని దాతకన్న నున్న లోభి మేలుఁ" గని కదా? పెద్దలు సెప్పుదురు.

అర్జు— గురువరా! ఇఁక నాలస్య మెందులకు? పోవుదము పదుండు. (అందఱును బరిక్రమింతురు.)

భీము— (దృష్టినిగిడ్చి) అదిగో కాంపిల్యనగరము. కౌరవసైన్యమెల్ల ద్రుపదుని ధాటికి నోడి యెట్లు వెనుకకు వచ్చుచున్నదో!

అర్జు— (ద్రోణధర్మజులకు నమస్కరించి) మీరు సమీపమ్మునసె యుండి చూచుచుండుఁడు. నేను నల్వురకును జన,

క. మత్తాత్ముఁడైన ద్రుపదుని
నెత్తెఱంగుననేని బట్టి యిప్పుడ యిటకుఙ్
దెత్తును దెచ్చినపై మీ
చిత్తం బెటువచ్చు నట్లు సేయఁగవచ్చుఙ్.

(నలువురు నిష్క్రమింతురు.)

ధర్మ— మహాత్మా! ద్రుపదుం డయోనిజుం డని తాము నుడివితిరిగదా, యెట్టిది యది?

ద్రోణు— మున్నితనితండ్రియగు పృషతుండు తపంబొనర్చుతఱి నొక్కనాఁ డ న్నికటమ్మున మేనక యను నచ్చర కుసుమాపచయంబు సలుపుచున్న నద్దానిం గాంచి పరవశుం డగుటయు, నతనికి ధైర్యంబు నిలుపదయ్యె. అమోఘవీర్యం డగు నతని తేజం బిట్లు పరిణమించె.

ధర్మ—(దృష్టినిగిడ్చి) అదిగో! సమరమెట్లు ప్రవర్తిల్లుచున్నదో చిత్తగింపుఁడు.

ద్రోణు— (చూచి) వత్సా! నేను ద్రుపదునిం గూర్చి యేమిచెప్పితిని?

చ. అతఁ డెటువంటివారలను నాహవమందున లెక్కసేయఁ డ
ప్రతిహతవిక్రముండు మనపార్థుపయిఙ్ నిగిడించుచున్న యా
శితశరవర్షమే యతనిచేవ పచించెడు నైననేమి? ని
ర్జితు నొనరించి తెచ్చె మనకీ్రిడి యకుంఠిత విక్రమమ్మునన్.

(తెరలోఁ బెద్దకలకలము.)

ధర్మ— (విని) గురువరా! ఏమి యీ హాహారవ మింత విపరీతముగా వినవచ్చుచున్నది?

ద్రోణు— హాహారవమున కేమున్నది? ద్రుపదుని యరదముపైకి సింగంబువలె లంఘించి మనయర్జునుం డతని నొడిసి పట్టి తన యరదమునకుఁ గట్టుచున్నాఁడు.

ధర్మ— (చూచి) అతిశీఘ్రగమనమ్మున నిచ్చటికే తీసికొనివచ్చుచున్నాఁడు.

(అంత ద్రుపదసహితముగా నర్జునుఁడు ప్రవేశించును.)

అర్జు— (నమస్కరించి) గురువరా! ఇదిగో దక్షిణ, పరిగ్రహించి యాశీర్వదింపుఁడు.

ద్రోణు— (ద్రుపదుంజూచి ఎకసక్కెముగా)

ఆ. వె. పేదపాఱుఁ డెవఁడొ పెద్దరాజెవ్వఁడో,
యిప్పుడైన నీకు నెఱుకపడెనె ?
రాజ్య మేలు టుడిగి రాఁజన్నె
రిక్తుల మైన మమ్ముఁ జూడ నో నరేంద్ర ?

ద్రుప— (తలవంచుకొని యూరకుండును)

ద్రోణు— అర్జునా ! ఇతని కీబంధనములు విప్పుము.

అర్జు— చిత్తము. (అట్లొనరించును)

ద్రోణు— ఓయి ! పాంచాలభూపాల !

క. నినుఁ జంటిపిల్లనికి గో
వు నొసంగెద వంచుఁ జూడఁబూనితి నీదౌ
ధనగర్వము నా కియ్యెడ
నొనరించె నఖండమైనయోగము కంటే.

సమస్తధర్మవేదియు నఖండ ప్రజ్ఞాధురంధరుండును రాజకులైకభూషణుండును నగు భీష్ముండున్నవాఁ డని యెఱింగియు నిన్నుం జూడవచ్చుట నాతప్పిదమేకాని నీతప్పిద మిందు లేశమునులేదు. ఇఁక నీయిచ్ఛంజనుము.

ద్రుప— (తనలో) అన్నా ? బ్రాహ్మణప్రభావ మెంతదుర్జయ మైనది! వీరిల కిట్టి శక్తి తపంబు వలనఁగదా గలిగె ! నేనును నట్టితపం బొనరించి యెట్టు లేని యితని జయించి యీయపమానముం బాపుకొందుఁగాక.

(నిష్క్రమించును.)

భీష్మ— గురువరా !

తే. గీ. కష్టపడి కట్టి తెప్పించి కడకునింత
వైళమే యీతనిని విడువంగవలెనె?
వృద్ధరాజులకేని జూపింపవలదె ?
యింతమెత్తని హృదయ మే నెందుఁజూడ.

ద్రోణు— తండ్రీ ! ధర్మనందన !

క. అవనీసురులకుఁ గోపము
[illegible]గాఁ[illegible]న దొకంటఁ దవిలిన నొకజా
[illegible] బోవలె నటుగా
[illegible]ప మొందు నతఁ డంత్యజుఁడౌ.

అర్జు— అదుగో, అన్నయును, గవలును, మనసైన్యమ్ములును నిటువచ్చుచున్నవి. ఇఁక మనము గూడ వారిం గలసికొని పురమ్మున కరుగుదము.

(నిష్క్రమింతురు.)

## గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవ ప్రవాసమ్మునం బ్రథమాంకము.

ఓం.

శ్రీమత్స్వరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## ద్వితీయాంకము.

(అంత నిద్దరు బ్రాహ్మణ దంపతులు ప్రవేశింతురు)

భార్య— నాథా! నేనుండఁగా మీ రా యసురుని కాహారంబగుట న్యాయము కాదు. అందులకై నే నరిగెద. నా మనవి విని నన్ననుగ్రహింపుఁడు.

భర్త— (విచారముతో)

తే. గీ. అగ్ని సాక్షిగఁ బెండిలి యైనయట్టి
పరమ సాధ్విని సంతానవతిని నిన్ను
నసుర కాహారముగఁ బంపి యవుల నరక
మనుభవించుటకన్న నియ్యది యె మేలు.

భార్య— నాథా! మీ రట్లు సంశయింపవలదు. భార్య సంతానార్థముగా నేర్పడినది. అట్టిఫలము నావలన నిదివఱకే కలిగినది. నన్ను వానికై యర్పించి కొమరునిం గొమార్తెను రక్షించుకొనుఁడు.

భర్త— అకటా! నే నీ పలుకులు వినఁజాలను. ఓహో, దైవమా!

గీ. నరుల భక్షించునట్టి దుర్ణయు హిడింబు
సమయఁగాఁ జేసెనఁటకదా శౌర్యధుర్యుఁ
డెవ్వరో యొక్కరుండు లోకైకవీరుఁ
డతని నివ్వానిఁ జంప నీ వనుపరాదె?

భార్య— ఆహా! ఆ మహానుభావునిఁ గన్నతల్లి యెంత పుణ్యాత్మురాలో కదా ఎల్లకాలమును నాపె కడుపు చల్లనై వర్ధిల్లుఁగాక.

(బ్రాహ్మణ స్త్రీ వేషముతోఁ గుంతి ప్రవేశించును)

కుంతి— అమ్మా! మీ రెందులకో యిట్లు విచారించుచున్నారు? వినఁగా వినఁగా మీ యాపద తెలుఁగు నాకు స్పష్టపడినది. మీ దంపతులుగాని

మీ కొమరుఁడుగాని కొమిరెగాని యాముక్కిడి రక్కసుని కాహారముగఁ బోనక్కఱలేదు. నా యైదుగురు కొమరులలో నొక్కరుని బంపెద. మీరు స్వస్థతం జెందుఁడు.

భర్త— అక్కటా! ఎంతమాట వినవలసివచ్చినది?

గీ. అన్నవస్త్రమ్ములకు లేక యనదలగుచు
నతిథులై మద్గృహమ్మున నడఁగియున్న
మీకు నపకృతిఁ గల్పించి మేను పెంచి
బ్రతుకుదునె యప్రతిష్ఠకు భాజనముగ?

కుంతి— మాకది యపకారంబు కాదు, ఉపకారమే. ఏమంటిరా? నా కొమరుండా రక్కసుం జంపి యిహమందుఁ బ్రతిష్ఠయుఁ బరమందుఁ బుణ్యమును నార్జించువాఁడే కాని వానిచేఁ జిక్కువాఁడు కాఁడు.

భార్య— అమ్మా నీ వట్లనెదవేమి? ఈ బకాసురుఁడు సామాన్యుఁ డనుకొంటివా? వీనిని గొప్ప రాజు లెవ్వరును జయింపలేకయే కదా ప్రతిదినము నొక్క మానిసిని, రెండెనుపోతులను, ఒక బండి యన్నమును నియతముగా నిచ్చుట కేర్పఱచుకొనిరి. వీనిం జంప నొరులకు వశముగాదు. ఎప్పుడో ఆ ఘటోత్కచ జనకునివంటి మహానుభావుఁడు పుణ్యము కట్టికొనవలెను.

కుంతి— అట్టివాఁడే నా కొమరుఁడును ననుకొనుఁడు. మీ కది యంతయు నెందులకు? మీ రూరకుండుఁడు. నే నీ పని నెఱవేర్పించెదను.

భార్య— అమ్మా! నీకు నిజముగ నాపద రానేరదను నమ్మకమున్నచో నట్లొనరింపుము, లేనిచో మాకొఱకు నీవు పుత్రశోక మనుభవింపకుము.

కుంతి— నాకిట్టి యిక్కట్టు లేశము లేదు. లోనికిం జని యొడ లెఱుఁగక దుఃఖించు మీ సంతానము నోదార్పుఁడు లెండు. అదె నా కొమరుఁడు భిక్షాశనంబు గొని వచ్చుచున్నాఁడు. నే నతనితోఁ జెప్పి వానిం బంపించెద.

(ఇరువురును నిష్క్రమింతురు)

(అంత భీముఁడు చంక జోలితోఁ బ్రవేశించును)

భీము— (జోలినంకఁ జూచుకొని తనలో)

క. ఆఁకట నాకుం గడుపెం
తో కట! నకనకలఁబడెడు నొక కబళంబే

నీ కాదు బికిరపుం గూ
డీ కాసంతయును, నెట్టు లీదిన మోమున్ ?

ఏమో ? యీదిన మెక్కడికేగినను లే దనువారే కాని మాధుకరము వైచువారే అరుదు. లాక్షాగృహంబు వెలువడి వచ్చినయది మొదలు నాకుఁ గడుపునిండ నన్నమే లేదు. అక్కడికిని దల్లి మే మేగురమును దెచ్చిన యన్నమును నేకరాశిఁజేసి యందు సగపాలు నాకుఁ బ్రత్యేకము గుడుపఁ బెట్టుచుండును. ఛీ! ఈ దరిద్రపు వృత్తికన్న నధమవృత్తి వేఱొండు లేదు. (కోపముతోఁ బ్రకాశము) ఔరా ! యంధరాజా ! కేవలాంధుఁడవే కాక దుర్గుణాంధుండవు గూడ నైతివిగా !

ఉ. కూళతనమ్మునం గొడుకు గోరెడికోర్కకు సమ్మతించి భూ
పాలుని ధర్మనందను నుపాయముమైఁ బురి వెళ్ళఁ గొట్టియున్
జాలక లక్కయింట నిడి చంపఁగ నగ్గి దగిల్చితే ? కటా !
జాలి యొకింత లేదె ? నరజన్మము నెత్తవె ? గొడ్డువాఁడవే ?

కుంతి— (సమీపించి తనలో) ఏమో యీవేళ నితఁడు కడుఁ గోపముగ నున్నవాఁడు. ఓహో ! ఇదియా హేతువు ? ఈనాఁడు జోలి బొత్తుగా నిండలేదు. అక్కటా ! దైవమా ! రాజాధిరాజగు పాండునృపాలుని పుత్రులకెట్టియవస్థ కల్పించితివి ? (ప్రకాశము) తండ్రీ ! ఎందుకోయి, ఆవృద్ధరాజు నట్లు నిందించుచుంటివి ? ఇది యంతయు నాజన్మశత్రుఁడగు నా దుర్యోధనుని దుర్మంత్రమేకాని మఱియొకటి కాదు. నీ యన్నను యువరాజుఁగాఁ జేయుటకు సహింపక, కొడుకు సారెసారెకుఁ దనయొద్ద కరుదెంచి విచారింపఁగాఁ దన యావచ్ఛక్తిని జెప్పి చూచి తుదకు మనకు వారణావతము నివాసముగా నేర్పఱచెను. అచ్చట జరిగిన లాక్షాగృహదాహప్రయత్న మతఁడు లేశమును నెఱుఁగఁడు. ఇది యంతయు సుయోధనుని పన్నుగడ. ఇంతకు విదురుఁడని యొక మహాత్ముం డుండుటంబట్టి గాని మనమా పురంజనుని మాయలోఁ బడి మ్రగ్గినవారమే. పోనిమ్ము తండ్రీ ! ఇఁక వారలం దలఁపకుము. మనకు మంచిదినములు రానున్నవని వ్యాసులవారు చెప్పుట వింటివి కదా ?

భీము— అమ్మా ! నాఁడు నేనొక్కపని చేయవలసినది సుమీ !

మ. కలియం గట్టి సుయోధనాదిశతముం గాలాంతకుండో యనం
బలిమి న్నెత్తినిఁ బెట్టి తెచ్చి జతుసద్మంబందు మున్నగ్ని సం
ధిలఁగాఁ జేసి యొకొక్కనిం గ్రమముగా దీపించునావహ్నికిన్
బలిగా నిచ్చినచో ననున్ జగము సేబా సంచు శ్లాఘింపదే.

కుంతి— తండ్రీ! శాంతింపుము. ఎన్నటికేని యా సుయోధనునికి మంచిబుద్ధి కలుగకపోవునా? కలిగినచో మీరునుమీరు నేకముగా నుండకపోదురా?

భీము— తల్లీ! ఎంత వెఱ్ఱిదానవు?

ఉ. పుట్టినబుద్ధి వానికిఁకఁ బుల్లలతోడనె కాని పోదు నీ
వెట్టి యమాయకత్వ మొకొ? యించుకయేని యెఱుంగ వక్కటా!
పెట్టఁగఁజేయఁడే విషము పెద్దనదిం బడఁద్రోయఁ జేయఁడే
బెట్టిదుఁడై విషాహులను బెట్టి ననుం గఱపింపఁ జేయఁడే?

కుంతి— తండ్రీ! పడ్డవారెప్పుడును జెడ్డవారలుకారు. సారెసారెకు నదియే తలపోయకుము. ఈమాట వినుము. మనవలన మనయింటి గృహస్థుని కొకయుపకారము కావలసియున్నదఁటోయి.

భీము— (ఆదరముతో) అది యెట్టిది యైనను దప్పక చేయవలసినదే.

క. మనకుఁ దమయిల్లు వాస
మ్మునకిడి బంధుగులకన్న మోమోటమునం
జన వొసఁగినట్టి యిప్పా
వనుని ఋణము దీర్చుకంటె భాగ్యముకలదే?

అదియేదో చెప్పుము.

కుంతి— నీవు కడు నాఁకొని యున్నవాఁడవు లోనికిరమ్ము. భోజన మైన పిమ్మటఁ దెల్పెదను.

భీము— తల్లీ! యేమట్లంటివి? బ్రాహ్మణకార్యముకన్న నాకు భోజన మెక్కుడా? (స్మృతినభినయించి) ఈ పట్టణములోని జనులనందఱిని బకాసురుం డను నొక్క ముక్కఁడిరక్కసుండు బాధించుచున్నవాఁడని వింటిని. వాని బాధ వీరి కేమైనఁ దటస్థింప లేదు కద! అట్లే యైనచో (కోపముతో)

మ. ఇపుడే పోయి మదాంధు నచ్చెనఁటి నాహీనుం దురాచారు న
చ్చపలుం గ్రూరు నరాశిఁ బట్టి త్రుటిలో సంగ్రామరంగంబున
న్నసువులంగూల్చి "మహానుభావుఁ డెవఁ డీవిప్రార్భకుం" డంచు నా
యుపకారమ్మను బౌరు లెన్నుకొనఁగా నుత్సాహినై వచ్చెదన్.

కుంతి— తండ్రీ! వానినే నీవు వధింపవలసినది: వానినిమి త్తము పిండివంటలు మొదలైనవి లోన వండుచున్నారు. తృప్తిగా నవి భుజియించి మఱియుం బొమ్ము.

భీము— తల్లీ యూరార్చెదను (శోకముతో) ఓరీ! ఏకచక్రపురసరోవరభ్రమరబక!

ఉ. దేవుఁడో సంగునంగములఁ దెల్వి యొసంగియుం బని చేసి చక్కఁగా
జీవనమున్ బొనర్పక కుచేష్టుఁడవై మదమెక్కి యూరకే
జీవుల బాధపెట్టెదవె? ఛీ! చెడుసోమరిపోఁత? నీ కిదే
చావు తటస్థమయ్యె నిఁక సాగవు నాయెడ నీప్రతాపముల్.

(అని తల్లితో నిష్క్రమించును)

(బకుఁడు ప్రవేశించును.)

బకుఁడు— (పరికించి) ఓహో! ఏమి యీనాఁడింత ప్రొద్దయినను నా కాహారము వచ్చినదికాదు? (కోపముతో) ఔరా? పౌరుల కింత యేమఱుపాటా? సరే వీరలనెల్ల నొక్కదినమే భక్షింతుఁగాక!

తే. గీ. ఒక్కమానిసియును దున్నలొక్కరెండు
బండెఁడన్నము నాకొక్క పంటక్రింది
కైన వచ్చునె? పోనిమ్మటంచునొప్ప
కొన్న నదిగూడఁ గ్రమముగా నున్నయయ్యె.

ఓరీ! ఏకచక్రపురవాసులారా!

శా. చేత న్గాకయె యింతస్వల్పమున కాసించె న్బకుం డంచు మీ
చేతమ్ముల్ దలపోయఁ బోలు నవురా! జీమూతసంఘాత ని
ర్ఘాతవ్రాతకఠోరు నన్నెఱుఁగరే? కాలంబు దాపయ్యెనే?
గోత్రం గూలితి రేదురాత్ముఁడిటు మీకు న్జేసె దుర్బోధముల్?

ఔరా, విరుద్ధము! ఏమీ పొగరు? భ్రుకుటివిక్షేపమాత్రవిత్రస్తీకృతత్రియంబకుం డగు బకుండే మీయవమతికి భాజనమయ్యెఁగా! (యోజించి) ఈతప్పు నాకరుణది కాని మీదికాదు.

ఉ. ఏడుచుచున్నవార లిటు లేకముఖంబుగ వచ్చియంచు మో
మోడి యనుగ్రహించు టదియుం దోసఁగయ్యెనె? నేను నాఁకట
న్మాఁడుచునుండ మీరలు సమగ్రముగా భుజియించివచ్చిన
న్జూడఁగ వేడుకయ్యెనె? నృపాదమఁ డీబకుఁ డం చెఱుంగరే?

ఇంతకు మీరేమిచేసెదరు! కలియుగం బాసన్నమవుటచే మీకిట్టి దుర్బుద్ధులు పుట్టుచున్నవి. కానిచో,

ఉ. ఎప్పటినుండి నాకు బలి యిట్లిడుచుండిరి నేఁడె పుట్టెనే?
తప్పునె యింతమాత్రమున, దానవజాతి యటన్న నింతగా
నెప్పుడు సెల్లిదం బగుట నిప్పటి కే వినలేదు నేఁటికి
న్నప్పాడఁగూడి క్రొత్తలగు మున్నరికంబులు మీకుఁ జొప్పడెన్.

(చెవియొగ్గి) ఏదోధ్వని వినవచ్చుచున్నది (చూచి) బండిపలెం భ్రొడ కట్టుచున్నది. (కొంచెము నడచి) అవ్వురు నానిమిత్తమై వచ్చెడి యన్నపుంబండియే, కానిమ్ము నేఁడింతటితో శాంతింపను. ఈయాల స్యమునకుం దగిన ప్రాయశ్చిత్తము చేసితీరెదను. (దృష్టినిగిడ్చి) ఏమిరా! బండి నక్కడనే నిల్పి యూరకున్నావు? ఈయాలస్యమునకుఁ గారణము నీవా? పురజనులా? (తనలో) వీఁడెవఁడో జెల్లము గొట్టిన రాతివలె నెందులకును సమాధానము చెప్పఁడు (కొండొక నడచి చూచి) కడుఁ బొగరుఁబోతుగాఁ దోఁచుచున్నాఁడు! బండిలోఁ గూర్చుండి యందుఁగల భక్ష్యములన్నియుఁ దినుచున్నాఁడు. ఏమోకాని యీదిన మంతయు మార్పుగానే కన్పట్టుచున్నది. (ప్రకాశము) ఓరీ! తిండి పోతా! నన్నెఱుఁగుదువురా? నాకై తెచ్చిన పదార్థము లుచ్ఛిష్టములు చేయుచుంటివా? ఇదిగోఁ జచ్చితివి.

(తెరలో)

ఈపదార్థములు నేను దినుటవలన నీకొకనష్టములేదు. ఏమంటివా? నేనుఁగూడ నీ కాహారమగువాఁడనే కదా?

బకు— (తనలో) ఓహో! వీఁడెవఁడో పురజనుల ప్రేరణచే నాతోఁ బోర వచ్చినవాఁడు కాని నాకాహారార్థమై వచ్చినవాఁడు కాఁడు. అట్టివాఁడే కాకున్న నీధైర్య మెక్కడిది? ఏమీ ఈకంఠధ్వని కడు గంభీరముగా నున్నదే! కానీ వీనిం జంపలేకపోదునా? (ప్రకాశము) ఓరీ! కప టాత్మ! నీచందంబు నేను గుర్తించితిని. నీవు నన్ను జయింపవచ్చి తివిగా? అట్లయిన బండిదిగి యిటురమ్ము.

క. జీవమ్ముకను యమపురికిం
బోనెడలం గొట్టి దేహమును రక్తముతోఁ
బ్రేవులతో నిమిషములో
నావంతయు మిగులకుండ నాహారింతున్.

(భీముఁడు ప్రవేశించి)

భీము- తే. గీ. కొంగవలె దొంగతిండిని గోరనేల?
తులువ! జీవింపరాదె యేవలననైన?
బుద్ధిగలిగెద వేనియుఁ బొమ్ము విడుతుఁ
గానిచో నేఁడు బంపింతుఁ గాలుపురికి.

బకు— ఓరీ! వదరుఁబోతా! "గుడ్డువచ్చి పిల్లను వెక్కిరించిన" దన్నట్లు నాకు నీవు ధర్మపన్నములు గూడఁ జెప్పఁబూనితివిగా? అవును చెప్పకేమి?

ఉ. చూచినతోడనే కదిసి సున్నముగా నలఁగంగఁగొట్టి లో
నైచుట మానినందు కిటువచ్చుచునున్నవి చిల్కపల్కు లో
రీ! చిరకాలభుక్తమగు నీబలి మాన్పఁగ నీవకావు క్రా
నీ చతురాననప్రముఖులేనియుఁ జాలుదురా? దురాత్మకా.

దీనికేమిగాని నిన్నుం జూచిన నాకుఁ బరమానందం బగుచున్నది. ఏమంటివా? నేను పుట్టి బుద్ధియెఱిఁగినది మొద లిప్పటి కీమాత్రము ధైర్యముగా నాతో మాటలాడినవానిఁ జూడలేదు. అందులకే నిన్నిం తవఱ కుపేక్షించితిని. ఇఁక నుపేక్షింపను.:

భీము— ఓరీ! మూర్ఖాగ్రేసరుఁడా! ఈప్రగల్భముల కేమిగాని నేనొక్కటి చెప్పెద నాలింపుము.

ఉ. నీవలెనే పొగర్మిగిలి నిక్కి ననున్ జెనకంగ వచ్చె నాఁ
డా వనిలో హిడింబుఁ డనునామిషఖాది త్రుటిన్ వధించి దు
ర్భావుని వాని నయ్యమపురంబున కంపితి వానికన్నను
జేవఁగలాఁడవే? యతనిచెల్లెలి నేనియుఁ బోలనేర్తువే.

(అంత హిడింబ ప్రవేశించును.)

హిడిం— (నమస్కరించి) ఆర్యపుత్రా! జయము, జయము. ఇతఁడు మీ రంత చులకనగాఁ జూడఁదగినవాఁడు కాఁడు. మా యన్నయు, నితఁడును, వీనితమ్ముండు గిమ్మీరుండును, జరాసంధుఁడును, గీచకుఁడును, దుర్యోధన దుశ్శాసనాదులును, నించుమించుగ సమానులు. కాని యిందులో నొక్కఁ డెవ్వరిచే మృతినొందునో తక్కినవారందఱును నాయనచేతనే చత్తురని వినియుంటిని. కావున మీ కితఁడు సుకరముగనే జయింపఁ దగినవాఁడు కావచ్చును.

బకు— ఓసీ! పరమదుర్మార్గురాలా! కామమోహితవై యన్నం జంపించి యీ నరాధముం గట్టికొని యంతం బోక వీనికి సంతతిం గూడఁ గని రాక్షసకులమున కపకీర్తి తెచ్చితివే. ఛీ! నీ మొగము చూడఁగూడదు దూరముగాఁబొమ్ము. నీవు చూచుచుండఁగనే నీ మగనిం జంపుదును. చూడుము. (భీమునివంకఁ దిరిగి) ఓరీ నరపశువా! హిడింబుం జంపితినని గర్వించు చుంటివిరా? అది నీ ప్రయోజకత్వముగాదు వినుము.

తే. గీ. తనదు చెల్లెలు నిన్నుఁ గోరినకతమున
దాని మేల్మిక్కిలిగ నెదఁదలఁచు కతన
నిన్నుఁ జంపఁగ లేఁడాయె నీచ!
లేక యున్న నీవేడ? మా హిడింబన్న యేడ?

భీము— (తనలో) ఓహో! సమయమునకు నా ప్రియురాలు కూడ నాకు సహాయురాలుగ వచ్చినదే! (స్మృతినభినయించి) అవును, నాఁడు "నన్నెప్పుడు మీరు దలఁచిన నప్పుడే వత్తు" ననికదా? చెప్పినది. ఈమె యిట్లిదివరకనేక పర్యాయములువచ్చి యుపకారము చేసెను. (ప్రకాశముగా) దేవీ! నీవు కడు సత్యసంధురాలవు. నీవొనరించిన యుపకారమును మాతల్లి తఱచుగఁ దలంచుచునే యుండును. నే నిద్దురాత్ము వధియించుదనుక నీవిక్కడనేయుండి చూచుచుండుము.

బకు— (నవ్వి) ఓరీ! మానవాధమా! పట్టి చూచుటయే కాదురా! నీవంటి యసమర్థుఁడగు నరాధముఁడను గాకపోఁ బట్టిగాని లేనిచో నియ్యెడ వధింపనే గలదురా.

ఉ. ఎందఱిఁ జంపె నీయతివ యెందఱి రక్తముఁ గ్రోలె మున్ను దా
నెందఱి క్రొవ్వు మ్రింగె మఱి యెందఱి మాంసము లాహరించె నేఁ
డందఱు మాదృశుల్ శిరము లక్కట! యొక్కట వంచుకోఁగ ని
న్నుం దగు లొంది యన్వయమునున్ జెడఁగొట్టెను దానునున్ జెడెన్.

(హిడింబ దిక్కై) ఓసీ! తెలివి తక్కువదానా! జరిగినదేమో జరిగినది యిప్పుడేని నా మాటవిని బుద్ధితెచ్చుకొని వీనిం జంపి నీయన్నకు వచ్చిన యపప్రతిష్ఠను బోఁగొట్టుకొనుము. నీకు వచ్చిన భయములేదు. నేను పైనుండి చూచుచుండెదను.

శా. వీనిం జంపిన "భర్తయెవ్వఁ" డనుచున్ వీక్షింపఁగాఁ బోకు మీ
వీ నీచున్ వరియించుటే మొదటితప్పిపాటికేనిన్ మృతుం
గా నుంకింపమి గొప్పతప్పిటు మొదల్ గావింపు మాపైని నే
నే నిన్నున్ వరియింతు దానవకులం బేలింతు నీచేత నే.

భీము— (కోపముతో నొకచేత దవుడలును నొకచేతఁ గంఠమును నొక్కి) ఓరీ! వాచాటా! ఏమని పేలితివి? ఇదుగోఁ జచ్చితివిరా. (గెంటుకొని పోవును.)

(తెరలో)

బకు— ఓరీ! నరాధమా! ఈగుద్దు కాచుకొనుము.

హిడిం— అక్కటా, నాథుని కెంతగుద్దు తగిలినది! (చూచి) అయ్యో, మూర్ఛిల్లినట్లున్నదే! (పరికించి) లేదు, లేచి యేమో అనుచున్నాఁడు. (తనలో)

తే. గీ. నీకును హిడింబునకుఁ గల నేర్పుతీర
తమ్ముముఁ జూడఁగా మదిఁదలఁచి యొక్క
గ్రుద్దు నవకాశమిచ్చితిఁ గ్రూర! నీచ!
యింకఁజూడుము నీబ్రతు కేమియగునొ?

హిడిం— మరల బకుఁ డేమో యనుచున్నాఁడు.

(తెరలో)

ఓరీ! వాచాటా! వృథాగర్వాటోపా! క్రిందఁబడ్డను మీఁదివాఁడనే యనుచుంటివిగా? ఇదిగో, ఈసారి యీకాలితాఁకుతోఁ గూలెదవులే.

హిడిం— (సంతోషముతో) బలే! నాథా! మంచి పని చేయుచున్నావు. అట్లే రెండుకాళ్ళును బట్టుకొని త్రిప్పుచుఁ దీసుకొనిపోయి యా సాలవృక్షస్కంధమునఁ ఔట్టి తల పగులం గొట్టుదువుగాక.

(తెరలో)

ఉ. కెవ్వన నేకచక్రపురి కేరి ముదంబుధి మున్గఁగాక గౌ
డవ్వల నున్న నీ భటులు దైన్యము గొందురు గాక మీఁద నిం
కెవ్వఁడు నీవలెం జగము నేర్చక పోయెడుఁగాక యేడ్తెఱన్
ద్రెవ్విన తాటిపండువలె నీతల త్రెళ్ళెడుఁగాక త్రుళ్ళఱన్.

హిడిం— (సంతోషముతో) ఔరా! దురాత్మా! నన్ననరానిమాట లనినందులకుం దగిన ఫలము నందితివి. ఇఁక నెంతసేపు భూమిపయిం బడి గింజుకొనెదవు. ఈపాటికిఁ జావుము. (తనలో) జయలక్ష్మీ పరివృతుఁడగు నాథుని నికటమ్మునకుఁ జని స్వయంగ్రహాలింగనమ్మున సమ్మానించెదంగాక.

(నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వర ప్రణీతంబగు
పాండవ ప్రవాసమ్మున ద్వితీయాంకము.

(భటుఁడొకఁడు ప్రవేశించును)

---

భటు— (తనలో) నాకుఁ బ్రభువుగా రాజ్ఞయిచ్చిన చొప్పున నాసనము లన్నియుఁ దారతమ్య విపత్తుగా నలవరించితిని. మత్స్యయంత్రమిది వఱకే సంసిద్ధమై యున్నది. రాజకుమారు లందఱును వచ్చెడివేళ కావచ్చినది. కావునఁ ద్వరగాఁ బోయి యీయుదంతమును మహారాజు గారికి మనవిచేసిన వారే వచ్చి వీరల గౌరవింతురు.

(నిష్క్రమించును) — (ఇది ప్రవేశకము)

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## తృతీయాంకము.

(అంత ద్రుపదుఁడు పురోహితునితోఁ బ్రవేశించును.)

ద్రుప— గురువరా! ధ్రువముగాఁ బాండవులు కుశలముగా నున్నారనియే కదా, మీరు సెలవిచ్చితిరి?

పురో— ఆ! ఇంకను సంశయము గూడనా? నేను జ్యోతిషముచేఁ జూచుటయేకాదు పిదపఁ గొందఱివలనఁగూడ నీసంగతిని వింటిని.

ద్రుప— ఏమని వింటిరి?

పురో— వినుటకేమున్నది? విదురుఁడు దుర్యోధనుని దురభిప్రాయ మెఱిఁగి రహస్యముగా నొక ఖనకునిబంపి యా లాక్షాగృహమ్మునఁ బాండవులకుఁ దక్క నితరుల కెఱుఁగరాకుండ నొక పెద్దబిలము త్రవ్వింపఁజేసె ననియు భీముఁడు, పురంజనుఁడింక నెప్పుడో నిప్పునంటింప వలెనని యనుకొను చుండ ముందుగానే వానికిఁ దెలియకుండఁ దా నగ్గిదగిల్చి సోదరులను దల్లిని దీసికొని యాబిలము త్రోవను వెలువడిరి యనియుఁ బురంజనుం

డును మఱియొక నిషాదవనితయును దానికొమరు లేగురును సందుంబడి చచ్చిరనియు వింటిని.

ద్రుప— కపటియగు పురంజనుని మాటకేమిగాని నిరపరాధులగు నిషాదులు చచ్చుట కడు శోచనీయము.

పురో— అదియును విచార్యముగాదు. ఆ నిషాది పాండవుల గుట్టును బురంజనునికిఁ దెల్పుచుఁ బుష్పఫలాదు లర్పించు మిషచేఁ గుంతీమహాదేవి యొద్దకు వచ్చుచుఁ బోవుచుండెడి దుర్మార్గురాలు. నాఁటిరాత్రి మద్యపానవశమ్మున నాయింటి పంచంబడి సుతసహితముగా నిద్రించుటం జేసి మృతినందె.

ద్రుప— అట్లయిన నిదియును నిట్లు కాఁదగినదే! మహాత్మా! ఇంత విస్పష్టముగా మీకీ యుదంత మెట్లు తెలిసినది?

పురో— ఆబిలము త్రవ్విన ఖనకునిభార్య పుట్టినిల్లును నా పెద్దకుమారుని యత్తవారియూరును నొకటే. చోటగుటచేఁ గ్రమముగ స్త్రీలవలన నియ్యది తెలిసినది. దానికిఁ దథ్యముగాఁ బ్రహ్మశాస్త్రముగూడ వారందఱు సుఖులై యున్నట్లు సూచించినది.

ద్రుప— పాపము! ధృతరాష్ట్రుఁడు వీరలకుఁ గ్రమముగాఁ బారలౌకికక్రియలు గూడ నెఱవేర్చినాఁడఁట సుఁడీ.

పురో— అవునట, ఆయనకేమి తెలియును? విదురుఁ డెఱిఁగియును జెప్పుటకు వలను పడమి నూరకొనియుండును. (యోజించి) పోనిండు దీనివలనఁ బాండవులకుఁ బీడాపరిహారము కావచ్చును.

ద్రుప— ఇంతకును నాదుర్యోధనుని యయోగ్యత కారణము. ఇప్పటికి వృద్ధరాజుమాత్రము తమ్ముని కొమరులయందుఁ దన కొమరులకన్నను నెక్కుడు దయ గలిగి యున్నాఁడనియే చెప్పికొందురు.

పురో— అదియును మనము నమ్మఁదగినది కాదు. (విని) అదిగో రాజకుమారాగమన సూచకమగు మంగళధ్వనులు వినవచ్చుచున్నవి. మనము వారల నెదుర్కొనవలయును.

(పరిక్రమింతురు)

**(అంత దుర్యోధన దుశ్శాసనకర్ణులును కృష్ణబలరాములును బ్రవేశింతురు.)**

పురో— అయ్యా! దయచేసి యీ యాసనముల నధిష్ఠింపుఁడు.

(అందఱును యథోచితంబుగాఁ గూర్చుందురు.)

ద్రుప— (దృష్టినిగిడ్చి) గురువర్యా! అదుగో, మఱికొందఱు రాజపుత్రులు వచ్చుచున్నారు. వారలనందఱిని యథోచితపీఠమ్ముల నలంకరింపఁ జేయుఁడు.

పురో— అట్లే యొనర్చెదను.

(నిష్క్రమించును)

ద్రుప— (మఱియొక దిక్కు చూచి) ఎవరురా అక్కడ?

భటు— (ప్రవేశించి) జయము జయము. ఆజ్ఞాపింపుఁడు.

ద్రుప— బ్రాహ్మణప్రవరు లనేకులీ యుత్సవముఁ జూడ నేతెంచుచున్నారు. వారలనందఱి నుచితరీతి గౌరవించుటకునై మన ధృష్టద్యుమ్నునితో మాయాజ్ఞఁ దెల్పుము.

భటు— చిత్తము.

(నిష్క్రమించును.)

(ధృష్టద్యుమ్నుఁడు ప్రవేశించును.)

ధృష్ట— తండ్రీ! ఎల్లరును యథోచిత స్థానమ్ములం గూరుచుండిరి. పురోహితు లగ్నిని వేల్చుచున్నారు. ద్రోపదియును సఖీసమేతయై యటవచ్చి యున్నయది. ఇఁకఁ గర్తవ్యము వీరలతో నివేదించెదను.

ద్రుప— ఆలస్య మెందులకు? నివేదింపుము.

ధృష్ట— ఓ ధానుష్క శేఖరులారా!

ఉ. ఆమె మదీయసోదరి సమగ్రగుణాకర సర్వలక్షణ
శ్రీమహనీయ యాధనువు చేకొని యేడ్తెఱ మత్స్యయంత్ర మిం
డే మహితుండు దానఱకు నేనుశరమ్ముల నాతనిక్ ఘన
ప్రేమమున న్వరించు వివరించితి నున్న యథార్థమంతయున్.

తే. గీ. కన్యకాలాభ మొక్కండె కాదుసుండు
ఎక్కుడు యశంబుగల్గు మీ కిందువలన
నాధనువు మాకు నొక్క మహాత్మకతన
దొరకె నది యెక్కువెట్టుటే దుర్లభంబు.

దుర్యో— (అపవారించి కర్ణునితో) సఖా దానిని నీ వెక్కువెట్టి యాసుందరాంగిని వరింపుము.

కర్ణ— (అనాకర్ణితముగా) చెలికాఁడా! అటు చూచితివా?

క. తనికొందఱు దరిదరిసాఁ
జనికొందఱు మ్రొక్కికొని నిలిచెన గ్గొందఱునన్
గొనము బిగలాగి కొందఱు
వెనుకకుఁ జనుచున్నవారు పృథ్వీశసుతుల్.

దుర్యో— మిత్రమా! వీరలవలన నేమగును?

క. అలలన ద్యూతలోదరి
యాలలితవిలాస ధూమమహాభాగ్యశ్రీ
లీలావతార చెలి నీ
పాలగు నిక్కముగ వెలుఁగఁబడియెన్నాకున్.

దుశ్శా— అన్నా! నీవనినట్లే కాని యా శిశుపాలుని సంరంభము చూడుము.

బల— (కోపముతో తనలో)

క. ఓరోరిమూర్ఖ! నీదో
స్సారము నీ మెఱుఁగలేక చాపమ్మునఁ గేల్
పూరించితి వేమాయెన్
నారిందగిలింపలేమి నాకెఱుక సుమీ!

కృష్ణ— అన్నా! మినపగింజంత మిగిలి పోయెనుగాని లేనిచో నితఁడు కృత
కృత్యుఁడే యగును జుమీ!

బల— తమ్ముఁడా! ఒకవేళ వీఁడెక్కు-నెట్టునే యనుకొందము; అంతతో నేమ
గును?

కం. అంబరమునందుఁ గలమ
త్స్యంబున్ దెగవఱుక వలయు నయ్యది సామా
న్యంబే? యిల్లలికిన మా
త్రిం బండువయగునె? యదియుఁ దరమే? తనకున్.

కృష్ణ— అదుగో! జరాసంధుఁడు తనధ్యాపచ్ఛక్తియు వినియోగించు చున్నాఁడు
(పెదవివిఱిచి) పాపము! ఇతనికిని యవమాత్రము కడమ యైనది.

దుర్యో— సఖా! ఎందులకీయాలస్యము? నీకుఁదక్క నొండొరుల కయ్యది సాధ్య
ముకాదు.

కర్ణ— అదుగో శల్యుఁడు రంగస్థలమున కవతరించుచున్నాఁడు

దుర్యో— ఎవ రవతరించినను నోటే, మన మెఱుఁగనిశల్యుఁడా, యేమి?

కర్ణు— ఓహో! ఇతఁడును ధుద కొక పెసరగింజంతలోఁ దేలిపోయినాఁడు (తనలో) శాకుని నియ్యది పరాభవస్థానమే యగునా? కాదు; (పరికించి) యాదవు లెవ్వరును నావంకకే రాక యున్నారు కారణమేమో? కృష్ణ బలరాములే మిన్నకున్నప్పుడు మనకు సాధ్యమగునా? యని సంశయించిరి. కాఁబోలును, ఇంతియకాదు కృష్ణుఁడు వారల కెందులకో యించుక సంజ్ఞకూడ చేసినట్లున్నది. (యోజించి) కృష్ణుఁడూరకొనుటకు హేతువేమో? (బింకముగా) ఇదికృష్ణునకును గిష్ణునకును సాధ్యమయ్యెడిది కాదు. (నడుముగట్టుకొని విశ్రమించును.)

దుర్యో— (సంతోషముతో) సఖా! ఇఁకఁ దిలప్రమాణము మాత్రమే కొదవ. పట్టు వదలకుము.

ధృష్ట— (ఆత్రముతో) ఔరా! తుద కీ సూతసుతునికి నాచెల్లెలి నీఁబలసి రాదు గదా! (సంతోషముతో) ఆ! ఇక్కడికీయిక్కట్టు దప్పెనది, వీఁడును విముఖుఁడైనాఁడు.

బల— తమ్ముఁడా! నీవూరకొంటివేమి?

తే. గీ. మత్స్యయంత్రముఁ దెగఁ గొట్టి మద్రరాజ
కన్యకను లక్షణను లోకమాన్యచరితఁ
గైకొనినయట్టి నీకులక్ష్యంబె? యిదియు
నెందులకు మిన్నకుంటివో యెఱుఁగఁ జెపుము?

కృష్ణు— (రహస్యముగా)

క. కనుఁగొంటివె? యావిప్రుల
నసఘుల నవ్వారియంద యైదుగురును బాం
డునృపాత్మజు లున్నా ర
ర్జునుఁ డీయంత్రమ్ముఁ ద్రేయు సుదతి వరింపన్.

## (అంత బ్రాహ్మణవేషముతో నర్జునుఁడు ప్రవేశించును)

(అందఱును నొకరి మొగము లొకరు చూచుకొందురు)

బల— (సంతోషముతో) పాండవు లింకను కుశలముగా నున్నారా? (చూచి విచారముతో)

క. ధృతరాష్ట్రునికొడుకులు దు
ర్మతులు ప్రయోగించినట్టి మాయలకున్ ద
ప్పితిరే? యకటా! యీక్రియ
క్షితిసురవేషములు విధి లిఖించెనె? మీకున్.

అర్జు— (తనలో) పూజ్యులగు కృష్ణబలరాములెట్లు చూచుచున్నారో? వీరు గుర్తించినట్లున్నది, (నలుదెసలఁ గనుఁగొని) ఇఁక నెవ్వరును నన్ను గుర్తించినట్లులేదు (ధనువున్నచోటికిఁ జనును)

ద్రుప— (పరికించి)

చ. నెడఁద యురమ్ము మూఁపు లన వీనుల కంటుచునున్న వద్దిరే!
పిడికెఁడు కాను నేత్రములు పెద్దవి తక్కిన లక్షణంబులున్
గడు రమణీయముల్ ద్విజుఁడన్నం దరమే? యితనిన్ జగమ్ము లో
కక్కఁడయయి యేలఁగాఁ దగఁడె? కట్టెఁడి నాఁ జనదే? విధాతృనిన్.

కాని యితని నే నెప్పుడో యొకపరి చూచినట్లున్నాఁడను.

ధృష్ట— (ఆశ్చర్యముతో)

తే. గీ. వేదపాఠుం డితం డేడఁ బెద్దపెద్ద
చతురులఁ బరాభవించు నీ చాపమేడ
నంచు ననుకొంటి నితఁడది యశ్రమమున
నెక్కువెట్టెను మఱి యంత్ర మేయకున్నె?

దుర్యో— (ఆశ్చర్యముతో) ఏమీ యీ బ్రాహ్మణవటుని చాతుర్యము.

క. చిరపరిచిత మగుచాపము
కరణిన్ శ్రమమింతలేక కైకొని గొనమున్
సరిచేసి కూర్చి యంత్రము
నఱుకుచు నున్నాఁడు వాఁడి నారాచములన్.

దుశ్శా— (ఆశ్చర్యముతో) అన్నా!

తే. గీ. సూతపుత్రునియంతటి శూరవరుని
కలవిగానట్టి యీకృత్య మలఁతిగా స
మర్థన మొనర్చు నీ విప్రుఁ డహహా! యెవఁడొ
యెవరిశిష్యుఁడొ? తలిదండ్రు లెవ్వరొక్కొ?

దుర్యో— దీని కింత విచారమేల? బ్రాహ్మణులలో మాత్రము శూరాగ్రేసరులు లేరా?

తే. గీ. పరశురాముని లోకైకగురుని వినమె?
యతని శిష్యుండె కద! తాత యఖిలజేత
ఇంతయెందుకు? మన గురువెవ్వ రమ్మ
హాత్మ్యకొమరుఁ డశ్వత్థామ కన్న్య లీడె?

ద్రుప— (చూచి) యంత్రము నఱికి యీ విప్రార్భకుండు చాపధారియై యిక్కడికే వచ్చుచున్నాఁడు.

(అర్జునుఁడు ప్రవేశించును)

ద్రౌప— (ప్రవేశించి సిగ్గుతోఁ బుష్పమాల యతని కంఠమున వైచినను.)

ద్రుప— (విచారముతో)

క. పాండవ మధ్యమునకు నా
ఖండలతనుజాతునకును గన్నియ నిడఁగాఁ
గొండాడి తుదకుఁ గార్ముక
పండితునకు నీయవలసె బ్రాహ్మణున కయో!

అయినను నీ విషయ మింకను బరిశీలింపవలసియున్నది, కాని పరిశీలించి చేయవలసినది లేశమును గానరాదు.

దుశ్శా— (జనాంతికముగా) అన్నా! చూచితివా? యీరాజు మనకందఱికిని నెట్టి యవమాన మొనర్చెనో? కావున నితని కిప్పట్టునఁ దగిన శాస్తి యొనరింపవలెను.

దుర్యో— అవును; అట్లవశ్యమును జరగఁదగినదే? (ప్రకాశముగా) ఓయీ! పాంచాల భూపాల!

ఉ. ఇచ్చితివా తు "యంత్రమును నేసె" నటంచొక పాఱువానికిం
బొచ్చెము చేసి శూరులగు భూవరు లూరక పోవనేర్తురే?
వచ్చినత్రోవనెంబడిసి వహ్వారె! క్రొవ్వనఁ దెచ్చుకొంటి వీ
ముచ్చట నీకు నిక్కతన ముప్పు ఘటింపకమాన దెన్నఁయిన్.

కర్ణు— (ప్రవేశించి)

క. ఆవిప్రవటుని లోపం
బావంతయు లేదు మాకు నవమానంబున్
నీవొనరించితి విందుల
కేవగ నుత్తరము చెప్ప దేర్పడవలయున్.

ధృష్ట— ఓయి సూతపుత్రా! నేనొక్కటి చెప్పెద వినుము.

ఉ. కట్టిన మత్స్యయంత్రమును గాఁడఁగ నేసినవానికే కదా?
పట్టినొసంగు నీ నృపుఁడు; పార్థివు లేమిటి కల్గఁగావలెన్?
దిట్టతనంబు గల్గుటకుఁ దెల్వియుఁ దేటయుఁ గల్గి యుక్తికిం
బట్టగు పట్టున వ్వలయుఁ బట్టును బంతము శూరభావమున్.
తే. గీ. ఊరకే గ్రుద్దులాడుట యుక్తిగాదు
పార్థివుల కిచ్చెద మటంచుఁ బల్కినామె

ఇంత యెందుకు? యంత్ర మీ వేసితేని
నీకె యీయమె? రాజవా నీవు చెప్పుమ?

కర్ణ— (తనలో) అక్కటా! వీఁడు నన్ను మఱియు నవమానించినాఁడే.

కృష్ణ— చిన్నవాఁడైనను మంచి యుక్తిగాఁ జెప్పినాఁడు.

ఉ. విద్దియ చూచి యివ్వనిత పెండిలియాడెడుఁగాని యన్వయం
బెద్ది యటన్న యంశ మిట నేర్పడ లేదొకయించుకైన లెం
డద్దముగట్టినట్లు కనరాని విషయంబున లేనిపోని యీ
సుద్దులు పెద్దలౌ నృపులు సూచిన నవ్వుదు రింతయేటికిన్.

దుర్యో— (గర్వముతో) వాసుదేవా! యేమి నీ విట్లు చెప్పుచున్నావు?

తే. గీ. కార్ముకప్రగృత్య మియ్యెడఁ గలదుగాన
నదియు రాజులకే విధియగును గాన
రాజులే యర్హులనెడి యర్థమ్ము వచ్చు
యోగ్యతను జూడకుండుట యుక్తమగునె?

దుశ్శా— సంశయమేమి?

ఉ. పాఱుఁడు యంత్రమేసె నని పట్టి నొసంగుట ధర్మమౌనె? పెం
పారెడి యగ్రహారములొ? యంతకునున్ బయిపెచ్చుభూములో?
చీరలొ మాడలో? ధనమొ? నేలువులో? యొసగంగరాదె? యే
ధారుణిఁ గల్గు నిట్టిపని? తప్పుపనుల్ సహియింపు టొప్పునే?

బల— (కొంచెము కోపముతో) దుశ్శాసనా! నీవు చిన్నవాఁడవు, ఇందు వివాద్యాంశము లేశమును లేదు, ఊరకొనుము.

క. ఎందఱు రాజులు విప్రుల
కెందఱఁ గన్నియల నీయ? రిదియొకతప్పా?
తందరపడు టుచితం బే
గందరగోళంబు మాని కదలుఁడు నృపతుల్.

కర్ణ— (తనలో) ఈదుర్విప్రుని నిప్పట్టున నెట్లైని యవమానించి తీరవలయును. ఇందుల కుపాయ మేమో? (యోజించి) ఇట్లగుఁగాక (ప్రకాశము) బ్రాహ్మణులకుఁ జాతుర్వర్ణ్యవివాహ ముండుటచే నితఁ డీయనువచ్చును నతండు పరిగ్రహింపను వచ్చును గాని యింకొక విశేషముమాత్ర మున్నది. బ్రాహ్మణుఁడు క్రమముగా నాలుగుజాతుల కన్నియలను బెండ్లి యాడ వచ్చునుగాని మొట్టమొదటనే క్షత్రియకన్యకం గొనఁదగదు; అట్టివాని కితఁడు వర్ణాశ్రమధర్మములను జక్కఁగాఁ బాలింపఁదగు రాజయ్యును

నెట్టులిచ్చుచున్నాఁడు? కావున నవశ్యము నితఁడు దండ్యుఁడ యగుటం జేసి మీ మితనిని విడువము.

భీము—(బ్రాహ్మణవేషముతోఁ బ్రవేశించి కోపముతో) విడువరేమి? విడువక చేసెడిదేమో చేయుఁడు.

(తెరలో)

శూరాగ్రేసరులగు నో బ్రాహ్మణవటువులారా! మీరు వెనుదీయవలదు. మీతోపాటు మేము సంసిద్ధులమై యున్నారము. మీకువచ్చిన భయములేదు.

క. శపియింతుము మంత్రమ్ములు
జపియింతుము వలసెనేని చంపక జావక
గృపణులము కాము నిక్కము
దపమంతయు ధారపోయఁదలఁచితి మిందుక.

ఓసీ! పేరిశాస్త్రీ! నీవు పోయి పరశురామునిం బిల్చుకొనిరా. ఔరా! పాపావధానీ! నీవరిగి మన ద్రోణాచార్యులను గృపాచార్యులను నశ్వత్థామను దీసికొనిరమ్ము. ఈరాజు లేమిచేసెదరో చూడవలెను.

అర్జు—(చేయెత్తి) ఓతపోధనులగు బ్రాహ్మణాగ్రేసరులారా! మీరేమియుఁ జేయ నక్కఱలేదు. మిన్నక చూచుచుండుఁడు.

దుర్యో—(నవ్వుచు) తమ్ముఁడా! యీవిప్రు లెల్ల నంగవస్త్రమ్ములు జారికొమ్ముల కెట్లు ముడిసైచి నిలుచున్నారో చూడుము.

కర్ణు—కార్ముకవిద్యానిపుణుండ వగు నో విప్రనందనా! నేనొక్కటిచెప్పెద నాలింపుము.

ఉ. పుట్టిననాఁట నుండియును భూసురకోటికిఁ గేలు మోడ్తు నె
ప్పట్టున వారితోడను వివాద మొనర్చుట కిచ్చగింప నీ
కెట్టులనేని చేపడియె నీనృపకన్నియ, దానికేమి? మా
పట్టినపట్టు మిమ్ములను బట్టదు పాఱదు రూపుమాపెడిక.

కం. శూరు లగురాజవరులకుఁ
బాఱులతోఁ గలహ మన్నఁ బకపక నగరే?
ధారుణిప్రజ లెల్లరు మీ
రీ రమణిం దీసికొంచు నేగఁగ వచ్చుక.

ద్రుప— (తనలో) ఓహో! ఈసూతాధముఁడు వృథాగాఁ గలహముం బెంచుచున్నాఁడు. వీనింబట్టి దుర్యోధనాదులును వారింబట్టి తక్కిన రాజమండలమును దిగకమానదు.

ధృష్ట— (ఎకసక్కెముగా) ఓయి సూతపుత్రా! ఉత్తమక్షత్రియునకుఁ బ్రాహ్మణులతో యుద్ధము తగకుండునేమో కాని సామాన్య నృపతులకును నీవంటి సూతవంశజులకును నిట్టి విచార ముండదు కదా!

ఉ. మంచియుఁ జెడ్డయుఁ దెలియుమానిసి "కియ్యది యుక్త మిద్దిగా"
దంచు విచారణంబు దురహంకృతిశాలికి మంచిచెడ్డ లం
చెంచఁగనున్నవే? యెటులనేని వృథాకలహమ్ము పెంచి తా
వంచనసేయఁబూని యట వంచన గాంచుటయే స్వభావమూ.

భీము— (ఎకసక్కెముగా) ఓయీ సూతాధమా!

తే. గీ. పూని నీచేత సజ్యంబుగానిధనువు
లీలఁ గొనియంత్రిమేసె నిబ్బాలకుండు
ఇతనితోఁ బోరలేవని యెవ్వ రెఱుఁగ
రేగు మూరక నవ్వెద రెల్లవారు.

అర్జు— నీవు బ్రాహ్మణులతోఁ బోరవేమోకాని మేము క్షత్రియులతోఁ గాని తదన్యులతోఁ గాని పోరుట కభ్యంతరములేదు.

ఉ. ఎంతటిజ్ఞానశూన్యుఁడవొ యిట్టి కుయుక్తులు పన్నుచుంటి వా
యింతినిఁ గొన్నవానిపయి నెవ్వనికేనియుఁ గోపముండు నా
యింతిని గన్నవానిపయి నేటికిఁ గోప? మొకింత చెప్పుమీ
బంతముగల్గెనేని ననుఁ బట్టుము కొట్టుము నెట్టుమీసతిన్.

ఆ. వె. ఇంత తెలివితక్కు వెందు నేఁ గనలేదు
ద్రుపదుఁ డెవరు నాకు? నృపుని నొకని
నింతమందిమూర లేకమై వధియింప
నూరకేను జూచుచుండవలెనె?

ద్రుప— (తనలో) ఇతని ధైర్యస్థైర్యాదికము చూచిన బొత్తిగా బ్రాహ్మణుఁడని లేశమును గానరాకున్నది. (యోజించి) ఏమో! అట్లనుకొనుటయును వలనుపడదు; పరశురాముఁడు లేఁడా? ద్రోణాదులు లేరా?

కర్ణు— (ఎకసక్కెముగా) నా తెలివితక్కువను జూతువు గాని రంగమున నవతరింపుము. ముందు నీత్రుళ్లడఁగించియే పిదప జామాతృబాహుబల[illegible]

నోద్భూతగర్వాస్పదుండగు నీ ద్రుపదునియు భగినీపతిప్రదర్శిత పరాక్రమ జనితదుర్గర్వనిమ్నుండగు ధృష్టద్యుమ్ననియుఁ గ్రొవ్వణఁగించెద.

(కర్ణార్జునులు నిష్క్రమింతురు.)

భీము— (దుర్యోధనుని దిక్కై యొకసక్కెముగా) అదిగో పాపము ! మీతమ్ము లందఱును మా బ్రాహ్మణుని ధాటికి నోడి పాఱుచున్నారు. మీరు చూచి యూరకొనుచున్నారేమి ?

దుర్యో, దుశ్శా— (తమలో) ఏమి యీపాఱుని పొగరు ? (చూచి) ఇదిగో మేము వచ్చుచున్నాము. నిలువుఁడు. నిలువుఁడు.

(నిష్క్రమింతురు)

భీము— (చూచి తనలో) తమ్ముఁడును గర్ణుఁడును దుల్యముగాఁ బోరాడుచున్నారు. కృపాశ్వత్థామ లూరక చూచుచున్నారు. కర్ణుండు కొంచెము తీసిపోవుచున్నాఁడు. పోకేమి ? మన మెఱుఁగని కర్ణుఁడా ? (ఆశ్చర్యముతో) ఔరా ! వీరి యవివేకము, ఇప్పటికేని తమ్మునిం గుఱుతింప లేరు. (కోపముతో) లక్కయింటఁ జచ్చితిమనియే కాఁబోలును వీరల దృఢనిశ్చయము. అదిగో దుర్యోధనాదులు గూడఁ గర్ణునికి బాసటయై తమ్మునిపైకి దుముకుచున్నారు. కానిమ్ము వీరలపొగరు నే నణంచవలెను.

(నిష్క్రమించును)

ద్రుప— కుమారా ! చూచితివా ? రణ మెట్లు పరివర్తిల్లుచున్నదో ! వీరలెవరో బ్రాహ్మణవేషము ధరించిన హరిహరులవలె నున్నారు. (మఱియొకదిక్కు చూచి) అదిగో బ్రాహ్మణు లందఱును నొకపెట్టునఁ గురుబలముపైకి నుఱుకుచున్నారు. మనము వీరికిఁ దోడుగానుండి కాపాడుదము పద.

(కుమారునితో నిష్క్రమించును)

బల— తమ్ముఁడా ! యుద్ధ మెంత భరముగా నున్నదో చూచితివా ? భీమార్జునులే కనుపట్టుచున్నవారు. కాని ధర్మరాజును గవలును నా కా బ్రాహ్మణ సంఘములో నానవాలుగాఁ దెలియకున్నారు.

కృష్ణ- ఉ. తాళమువంటి విల్గొనినధన్యుఁడు కిరీడి, యనోకహంబు దాఁ
కేల ధరించి మార్తురను గీటడఁగించెడువాఁడు భీముఁ డి
య్యాలము రాకమున్న శమనాత్మజుఁడున్ గవలున్ సమేతులై
యేలొకొ యేగి రక్కతన నెయ్యెడ వారలు లేరు సోదరా !

బల— (చూచి) కురుబలమెల్లఁ బటాపంచలై యెట్లు పరుగిడుచున్నదో! (కోపముతో) ఓరీ! మూర్ఖుఁడా! దుర్యోధనా!

చ. గద భుజమందు నైచికొని కయ్యమునుండి తొలంగి పాఱిపో
యెదవె? మదీయశిష్య నిను నెల్లరు నవ్వఁగ నాకు దుర్యశం
బెదిగి శిరంబు నెత్తుకొన నిచ్చునె? నేఁటికి నిన్నుఁ జేరి యా
గదయును నాగురుత్వమును గంగకు నర్పితమయ్యె నేమిగా?

కృష్ణ— అదుగో నర్జునుఁడు జయలక్ష్మీలాలితుండై పాంచాలిని నెంటఁబెట్టుకొని పోవుచున్నాఁడు.

బల— మన మిక్కడ నిఁక నెందులకు?

కృష్ణ— అదుగో ధృష్టద్యుమ్నుఁడిట వచ్చుచున్నాఁడు. అతనితోఁ జెప్పి యొకసారి కుంతీదేవిం జూడఁబోవుదము.

ధృష్ట— (ప్రవేశించి తనలో) తండ్రిగారు "మన కన్నియంగొన్న బ్రాహ్మణు లేత్రోవం జనియెదరో పరిశీలింపు" మనియెను. అట్లొనర్చెద. (పరికించి) అరుగో ఆవీధింబడి చనుచున్నారు.

కృష్ణ— పాంచాలకుమారా! మే మరుగుచున్నాము.

(నిష్క్రమించును)

ధృష్ట— (కొంతవఱకు నడచి) అదిగో ఆ కుంభకార గృహమునకుఁ బోవుచున్నారు. అక్కడనే పొంచి వీర లేమి మాట్లాడికొందురో వినియెద. (అట్లొనరించి విని) ఈసంగతులన్నియుఁ బోయి తండ్రిగారికి విన్నవించెదను. (పరిక్రమించి) అరుగో తండ్రిగారు పురోహితులతో నీవిషయమునే కాఁబోలును ముచ్చటించుచున్నారు.

(ద్రుపదుఁడును బురోహితుఁడును బ్రవేశింతురు)

ద్రుప— గురువరా! మీరు స్వయంవర మేర్పఱచినఁ దప్పక యర్జునుండు వచ్చునని సెలవిచ్చితిరి కదా! అట్లు జరిగినదా?

పురో— ఇంకను సందియ మేమి?

ఆ. వె. అర్జునునికిఁ దక్క నా మత్స్యయంత్రమ్ము
నితరుఁ డేయఁజాలు టేటిమాట?
కర్ణునంతవాఁడు గజగజలాడె న
వ్వింటి గుణము గూర్ప వెరవు లేక.

ఇది యట్లుంచుము.

చ. ఎదిరినవారినెల్ల మద మేదఁగఁ జేసి యొకింతలోన న
మ్మదవతిఁ గొంచుఁ బోవుటకు మాదృశవిప్రులకౌనె? లేశమున్
మదిఁ గదియింపఁబోకు మనుమానముఁ బ్రాహ్మణులేడ? పౌరుషా
స్పదులగు లేడ? యింతపని సల్పునెఁ పార్థుఁడు గాకయుండినన్?

దృష్ట— తండ్రీ! నీయాజ్ఞ చొప్పున వలనైనంతవఱకుఁ దెలిసికొని వచ్చితిని. వారు మనయాజ్ఞసేనిం దీసికొని యొక్క కుంభకారగృహమ్మున కరిగిరి. అచ్చటికే కృష్ణబలరాములుగూడ వచ్చిరి. అయ్యెడ నిఁక నొక మువ్వురు పురుషులును నొక ముసలియామెయును గలరు.

పురో— రాజా! చూచితివా? ఆమె కుంతి. వారు మువ్వురును ధర్మజనకుల సహదేవులు. భీమార్జునులను రణరంగమునఁ జూచితిమికదా.

ద్రుప— కుమారా! యింతవఱకేనా? నీ యెఱిఁగినది.

దృష్ట— ఇంతేకాదు, కృష్ణబలరాములును వారును మాటలాడికొనినరీతిం బట్టి చూడఁ దప్పక వారు పాండవులే యని నిశ్చయించితిని.

ద్రుప— అట్లయిన నీవు పోయి యీ యుదంత మంతఃపురమునకుం జెప్పుము.

దృష్ట— చిత్తము.

(నిష్క్రమించును.)

పురో— ఇక్కడికి నీ సందియము తీఱినదా?

ద్రుప— తీఱుటకేమి? తీఱినది. అయినను మీరేగి వారియాథార్థ్య మింకను దఱచి తెలిసికొని యిక్కడికిం గొనిరండు.

పురో— (పోయి పాండవులతోడను గుంతీద్రౌపదులతోడను బ్రవేశించి) వీరు కుంతీమహాదేవులు, వారు పాండవులు.

ద్రుప— (వినయముతో) అక్కా, భోజపుత్రి!

ఉ. పావన మయ్యె నాకులము ఫల్గునుఁడల్లుఁడు కావుటన్ మహీ
దేవులుకారు మీరనుచుఁ దెల్ల మెఱింగితి నింత చేసిరే
కావలులైన కౌరవులు కష్టములెల్ల భరించి నేఁటికిన్
దేవునను గ్రహమ్మున నుదీర్ణత గాంచితి రెల్లభంగులన్.

ఇఁక నాలస్య మెందులకు? విజయునిఁ బెండ్లికొమరునిఁ జేసి సలక్షణమ్ముగా వివాహ తంత్రము నడపుకొందము.

కుంతి— అన్నా! పాంచాలభూపాల! అగ్రజులగు ధర్మజభీములుండఁగాఁ గొండిక యగు ఫల్గుగునికిఁ బెండ్లియెట్లు? అదిగాక నావచనంబుకతమున నికన్నియకు వీరేవురును బతులుగాని యొక్కరుండు గాకుండు.

ద్రుప— (తనలో) ఈమె యభిప్రాయమే చక్కఁగా బోధపడినది కాదు. ఒక కన్నియ కైదుగురు పతులెట్లు? (ప్రకాశముగా) ధర్మనందనా!

క. కుంతి యన ధర్మములలో
నెంతయుఁ గడు నాటితేలు నిల్లాలు ఋజు
స్వాంత యిటులానతిచ్చెనె?
యంతర్వాణులకు నిదియు నర్హంబగునె?

నీవు కొండిక వయ్యును బుద్ధిం గడుఁ బెద్దవు, నీ వాక్యంబొండును వేద మొండును గాదు. నీ యభిప్రాయ మెట్టిది?

ధర్మ— క. ఇది లోకవిరుద్ధం బని
వదిఁబది చెప్పంగవలెనెపార్థివ? యైనన్
దుద కిది యిటు జఱుగుటయే
మదిమాకెల్లరకు హితము మాత్రాజ్ఞప్తిన్

అదియునుగాక.

క. నామన మెన్నఁడు ధర్మవు
నేమఱుట యెఱుంగ దిట్టి యీ నాడెందం
బేమొకో? యిప్పట్టునఁ దా
నామోదముచెంద నిట్టులైతీరవలెన్.

ద్రుప— (తనలో) ధర్మావతారుం డనఁదగు నియ్యనఘుం డొచ్చెం బుచ్చరించుట కల్ల. ఇందులకేదో యనివార్యంబగు కారణంబుండక తప్పదు. (ప్రకాశముగా) ఐనచో సమ్మతమేకాని మనకు మనమై యిందులకు స్వతంత్రించుటకన్న దురూహమగు నీయంశమ్మును గృష్ణద్వైపాయనునికిం దెల్పి తత్సమ్మతిం గొని యాచరించుట శ్రేయస్కరంబు. కావున వెళ్లి వేఁట నట్లొనరింపుదము. నేఁటికిఁ గొలువు చాలింతము.

(నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వర విరచితం
బగు పాండవ ప్రవాసమ్మునఁ దృతీయాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## చతుర్థాంకము

(విదురుఁడు ప్రవేశించును.)

విదు— (తనలో) అప్పుడే యింద్రప్రస్థపురమ్మునకే వచ్చితిని. (కోపముతో) ఓరీ! దుర్యోధన! పాండవు లనిన నీకింత యసూయ యెందులకురా? నీతండ్రి వారి తండ్రిభాగమగు నర్ధరాజ్యము వారల కిచ్చెను గాని నీది లేశమును నీయలేదే? వారు దిగ్విజయమొనర్చి రాజసూయము చేసిగనియే కదా నీకీదుఃఖము! (యోజించి) కలహప్రియుఁడగు నారదుని వలన నీముప్పు మూడినది. పాపము! అతఁడేమిచేయును? స్వర్గస్థుఁడగు పాండుఁడు కొమరునిచే "రాజసూయము చేయింపు" మని యమ్మునివరుం గోరెనఁట, ఇతరుల యెడ నెట్లయినను నారదుఁడు వీరి యెడల నుపకారియే కాని యపకారి కాఁడు. కానిచోఁ బాంచాలికై వీరు పరస్పరముఁ గలహింపకుండ సుందోపసుందచరిత్రము నుపన్యసించి చక్కని కట్టుఁబాటు చేయునా? బ్రాహ్మణకార్యార్థమై యాకట్టించుక దాఁటుటచేతనే కదా యర్జునుఁడు తీర్థయాత్ర కరుగవలసెను. అదియును వారలకుపకారకమే యయినది.

ఉ. అందు నులూపి యన్వనిత నంది సుతోదయ మందె నీఁదఁ బాం
డ్యేందుకుమారియందుఁ గనియెన్ మఱియొక్క సుపుత్త్రుని, న్సుభ
ద్రం దుదకు న్వరించి సుతరత్నముఁ గాంచె నొకంటఁ గాదు వా
రెందుల కేగినన్ జయమ యేర్పడుఁ బార్థు లజేయు లేరికిన్.

యాగమువా టట్లుండ మయుఁ డొనర్చిన యా లోకపాలకసభం జూచినదిమొదలు వీనికి మఱింత యసూయ హెచ్చుపెరిఁగినది. వీనికిఁ దోడా శకుని యొకఁడు; తమ్ముఁడు చెప్పనే యక్కఱలేదు. కర్ణుఁ డొకఁ డుండినను వాఁడు పరాక్రమముచే జయింపవలయునని యె

బోధించును. కాని శకునివలె నైదుగురలోఁ గలహము కల్పింతమనియు ద్రౌపదిని వారలను నెడఁబాపుదమనియు లేనిపోని కుట్రలు పన్నుట కొప్పుకొనఁడు. ఏమైనను నీదుష్టచతుష్టయము కురువంశ మున్మూలించుట కుదయించినది. హా నీ! కొడుకు దుష్టుఁడైనను తండ్రి బుద్ధిగఱపి మరల్పవలెనెగాని దుర్ద్యూతవినోదమునకై తగుదునని నన్నుఁ బాండవులఁ దెమ్మని యనుపుట యెంతబాగుగనో యున్నది.

క. పండుగయో పబ్బంబో
పెండిలియో రాజకార్య విషయమొ యకటా!
పాండవుల నేమొగమ్మున
దుండగపుంద్యూతమునకుఁ దోడ్కొనిపత్తుఁ ?

నాకృత్యము నే నెఱవేర్చుకొనక తీఱదు. (పరిక్రమించి) అరుగో పాండవులు, తమలోఁ దామేమో చెప్పికొనుచుఁ గూర్చున్నారు. పోయి ప్రకృతము దెలిపెద.

(పాండవులు ప్రవేశింతురు.)

ధర్మ— (చూచి) తమ్ముఁడా! పరమపూజ్యుఁడగు విదురుఁడు కాఁబోలును వచ్చుచున్నాఁడు ఎదురుగాఁబోయి తోడ్కొనిరమ్ము.

భీము— (అట్లొనరించును)

ధర్మ— (ఆదరముతో)

ఉ. తల్లియుఁ దండ్రియుఁ గడుముదంబున నుండిరె? ధార్తరాష్ట్రులం
దెల్లెడ సేమమే కద? యహీనుఁడు లక్ష్మణుఁడొప్పుమీఱునే?
సల్లలితుండు ద్రోణునకు సంతసమే? గుణరాశి తాతకుఁ
మెల్లమె? యెల్లవారికిని మోదమె? నీకు సుఖమ్ము గల్గునే?

విదు— అందఱును గుశలముగా నున్నారు.

ఆ. వె. మీ కనామయంబె? మీపుత్రు లేవురు
ద్రౌపదేయులకు ముదంబె? శౌరి
మేనయల్లుఁ డొప్పుమీఱునే? పాంచాలి
పరమసాధ్వి కుశలవతియె? తండ్రి!

మిమ్ములనందఱి నొక్కపరిఁ దోడ్కొనిరమ్మని సుయోధనానుమతంబున వృద్ధరాజు నన్నుం బనిచిన వచ్చితిఁగావున మీరు నావెంట హస్తిపురమ్మున కరుదేరవలయు

భీము— (తనలో)

తే. గీ. అంపినను దండ్రి యాతని నంపుఁగాక
వల్లభంబని యితఁడిట వచ్చుఁగాక
ఎప్పుడు మనమున మనమన్న నేవగించు
కపటి దుర్యోధనుని ప్రేరకత్వమెట్లు?

అర్జు— (తనలో)

ఉ. అన్నయొనర్చు జన్నమున కందఱు వచ్చిరి చూచి రంతయున్
మొన్నటిముచ్చటేకద? మమున్ మరలం బిలిపించు టేటికో
యెన్నఁడు లేని యిట్టి దయ యెక్కడిదో? ధృతరాష్ట్రసూతికిన్
పన్నిక యెందుకో? మనము పట్టికదల్చినయట్టు లూఁగెడున్.

నకు— (తనలో)

క. కారణము సెప్పకయె యిటు
లూరక రమ్మనుట కేదియో హేతువు? ని
స్సారమగు విషయ మేనియు
ధీరుఁడు విదురుండు వచ్చి తెలుపునె యిటకున్?

సహ— (తనలో)

తే. గీ. అదరఁగాఁజొచ్చె నెడమకన్నదియుఁగాక
మనము చెయిపెట్టి కలఁచినమాడ్కి నుండె
నితని యాగమనమ్మున నేదియేని
దొసఁగుపొసఁగంగ వలెనని తోఁచునాకు.

ధర్మ— (సంశయముతో) ఆర్యా, ఎందులకైయుండునో?

విదు— (తనలో)

తే. గీ. ఉన్నదున్నట్లు చెప్పిన నన్నయాజ్ఞ
కన్యథా సంచరించినయట్టు లగును
అట్లు చెప్పనిచో సత్యమడఁగిపోవు
టట్టులుండంగ జగమున నప్రతిష్ఠ.

కావున సాధ్యమైనంతపట్టు రాజద్రోహము లేకుండ నేమైనను యథార్థమే వచింపవలయును. (ప్రకాశము) నిమిత్తమున కేమున్నది? రాజులు ద్యూతప్రియులు గదా! అది గాక యపూర్వమైన సభయొకటి నిర్మింపఁజేసినారు. అదిమీరు చూడవలయునఁట.

భీము— (తనలో) సుయోధనుఁడంత ద్యూతప్రియుఁడు కాఁడే ?

అర్జు— (తనలో) ఇక్కడికిఁ దేలినది. ఇది శకునియొక్క ప్రేరణయైయుండును.

నకు— (తనలో) ఇంతటిపని కింతప్రయత్న మెందులకో ?

సహ— (తనలో) ఈద్యూతము తేనెపూసిన కత్తిగాఁ బరిణమింపవచ్చును.

ధర్మ— (తనలో) నాకిది పరమప్రియమే (యోజించి) ఐనను నియ్యాని సద్వర్తను లాదరింపఁ దగినది కాదుగదా? (ప్రకాశము) ఆర్యా! సమస్తధర్మవేది వగు నీకు మాదృశులు బోధింపవలయునా ?

ఉ. కుక్కుటపు న్సమీకములు గొఱ్ఱెపొటేళ్ళ దురంబులు న్వశం
బక్కఱలేని రాజులకునై యుదయించిన వంతకన్నను
న్వెక్కసమౌ దురోదరము వృద్ధనృపుం డెటుసమ్మతించెనో ?
యక్కట ! యింకమాకుఁ దనయం డెటులన్ భయభక్తు లుండెడిన్.

తే. గీ. చెడ్డపను లాచరించెడి చిన్నవారిఁ
గనికననీతి నుండుట చను నొకింత
అంతియేకాని తామయై యాచరింపఁ
జేయుదురె ? కూఁడదనఁడె గాంగేయుఁడేని.

విదు— (తనలో) అడిగిన యంశమున కుత్తరమీయక తప్పదుగదా ! ఇందు రాజద్రోహమేముండెను ? (యోజించి) ఇట్టి దుష్టరాజునకు ద్రోహమైనను దోషములేదు. (ప్రకాశము) కుమారా !

ఉ. తాత యొకండె కా దఖిలతత్త్వవిదుండగు ద్రోణుఁ డేను 'బ్రఖ్యాతిపథంబె ? యిద్యూది యనర్హ మమాన్యము నిన్నువంటి ప్ర
జ్ఞాతిశయుల్ దలంపఁ దగినట్టిది కా' దని యెంత చెప్పినన్
ద్యూతము మానిపించెడి కుతూహల మించుక లేదు తనికిన్.

భీము— (సంశయముతో) వినోదార్థమై యేర్పడినపని కింతవిచార మెందుకు ? ఇది గాక యిద్యూది యెట్టిదైనను అనాదిగా రాజులందఱును మన్నించుచునే యున్నారుకదా !

అర్జు— వినోదమున కైనను దుష్కృత్యము సమంజసము కాదు. శిష్టాచారమైనను నీతికి బాహ్యమైనచో నది మాన్యము కానేరదు.

నకు— ఇంతకు నీజూదమువలన సుయోధనుని కుపయోగ మేమో ?

సహ— అదియే తేలవలసియున్నది.

ధర్మ— ఏదో యొకవిధముగా మనల నవమానించుటయే యాతనిముఖ్యోద్దేశ్యము.

భీము— అతనికి నెఱవేఱనిదియును నదియే.

అర్జు— ఇతని కీయుద్దేశ మింతలో నెందుకుఁ గలుగవలెనో ?

ఉ. యాగము చూడవచ్చి యట నయ్యయి కృత్యములందుఁ దాన యు
ద్యోగ మొనర్చి యెక్కుడు కుతూహలమున్ గనఁజేసె నింతలో
నీగతి దుర్గ్రహుండగుట కేమినిమిత్తమొ ? లేక యింతకున్
యాగమె కారణంబొ ? తెలియన్వలె దీనియథార్థ మియ్యెడన్.

విదు— ఇంద్రనందనా! యథార్థము నీవుకనిపెట్టనే కనిపెట్టితివి. నాచేఁ గూడ నెందుకుఁ జెప్పించెదవు ?

నకు— ఇది నాచే నింతకుమున్నే కనిపెట్టఁబడినది.

తే. గీ. యజ్ఞమున కేగుదెంచె నటన్నమాటె
కాని యాతనిమొగ మించుకయును గళల
నొప్ప దప్పుడె యాతని కుద్భవించెఁ
బాయని యసూయ యదియిట్లు పరిణమించె.

విదు- ఉ. వాడినమోముతోఁ గళకుఁ బాసిన చూపులతో విచారముం
గూడినబుద్ధితో మిగులఁ గృంగిన దేహముతోడ నొక్కెడం
బోఁడిమి దక్కియున్న కురుముఖ్యుని మాతులుఁ డాదరించి యా
జాడయెఱింగి జూదపు విష స్గ్రగించెను విమ్మనోంపఁగన్.

ఇద్దాని వారింప మాపడిన పాటులు భగవంతుని కెఱుక. ఇప్పటికిని భీష్మద్రోణులు లీవిషయమై సంతతమును వృద్ధరాజునకుఁ జెప్పుచునే యుందురు. కానిందు దాని కేమి? భవితవ్యమెట్లయినను మనమయ్యెడ కరుగుట తప్పనిపని. వారు మనరాక వేచియుందురు.

ధర్మ- తే. గీ. తండ్రి చిన్నప్పుడే పోయెఁ దండ్రియైన
దైవమైనను నింక నాతండగాఁడె
కొమరుఁ డైన నయ్యానఘుండుమాకు
నెన్నఁ డపకారము నొనర్పఁ డింతవఱకు.

కావున నవశ్యమును దంద్రియాజ్ఞ నిర్వర్తింతును. (తమ్ములవంకఁ దిరిగి)

చ. అలఘుమనీషులార ! మనకందఱు కాతఁడె నేత యాటఁ బో
వలయునె కాని జూదమను వ్యాజమున న్నిరసింపరాదు ని
ర్మలమతులైనవారు విదురప్రముఖుల్ పలుమంది కల్గుచోఁ
గలఁత ఘటిల్లునే ? యొకటఁ గల్గినమం దుదిదాఁక నిల్చునే ?

పోదము పదుండు. ప్రయాణసన్నాహ మొనరింపుఁడు. (నిష్క్రమింతురు)

(అంత ధృతరాష్ట్రుఁడు భీష్మద్రోణులతోఁ బ్రవేశించును)

భీష్మ— కుమారా! ఆంబికేయ! ఒరులు విన్నను వినకున్నను ధర్మజ్ఞులకు ధర్మము చెప్పక తప్పదు. కావున,

ఉ. జూదమ దేరకేనియు ననూయ జనింపఁగఁ జేయు దానిచే వా
దనివార్యమౌ నదియు వంశములన్ గడకొత్తు నారకే
పోదవమానపుం బని నృపుల్ తలపెట్టఁగ రాదు నీవు దు
ర్యోధనుచందమున్ దెలియవో? పరికింపవొ వానిమిత్రులన్?

క. ఈ యప్రతిష్ఠ నీయది
నాయది ద్రోణునిది వినుము నామాట జగ
ద్దేయమగుపనికి విఘ్నము
సేయుట తగ దిట్టిపనికిఁ జేయఁగఁదగదే.

ద్రోణు-ఉ. ఎంతయొ కాలమాయె నిటకే నరుదెంచి తదాదిగా ఋజా
స్వాంతుని నిన్నెఱుంగుదును నక్కట! యేమననేర్తు? నేవపుం
జింతఘటిల్లె నియ్యదియు శిష్టులకున్ హితమౌనె? దీనిచే
నంతమునంద రెందఱు? నలాదులు వంత లెఱుంగమే నృపా?

ఆ. వె. అతఁడుఁ బుష్కరుండు నన్నదమ్ముల సుతుల్
గారె? జూదమనెడి కారణమునఁ
గాదె? శత్రులైరి కావున జూదంబు
వలని తగులు మనకు వలదు వలదు.

ధృత— (తనలో)

చ. కొమరుని దుష్టచేష్టితము గూడ దటందునొ? వాఁడు నేఁడె ప్రా
ణము లెడఁబాయు, వీర లనినం గడు మాన్యులు తండ్రియున్ గురుం
డమలినచిత్తు లిర్వురకు నాప్తులు నిక్కము పల్కుచుండి రీ
సమయము నాకు నెంతయును సంకటమై కనుపట్టు నక్కటా!

(ప్రకాశము)

క. మీరిరువురు విదురుండును
శారద్వతుఁడున్ మహాయశస్కరులుండన్
బో రొడఁగూడునె? ద్యూత
ప్రారంభమువలన నింత భయమేమిటికిన్.

(తెరలో)

ఓహో! ద్యూతప్రియులగు రసికులారా! పాండవులును గౌరవులును ద్యూతారంభమునకై సభ కరుగుచున్నవారు. చూడ నాసక్తి యున్న వార లందఱుఁ ద్వరగా రండు.

(అంత విదురుఁడును బాండవులును దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణ వికర్ణులును ప్రవేశింతురు)

ధర్మ— (ధృతరాష్ట్రునకు నమస్కరించి)

క. ద్యూతమ్మునకై యే నా
హూతుఁడనై వచ్చితిని మహోన్నతగుణుఁడౌ
తాతయు గురుఁడును నీవును
నీ తెఱఁగున కొప్పుకొంటిరే దయకలిమిన్ ?

దుర్యో— (వారికడ్డమై) ధర్మనందనా!

క. ద్యూతమ్మునందు నీ కతి
చాతుర్యము గలుగుటయును సతతమ్మును సం
ప్రీతిగలుగుటయు నీ యా
హూతికిఁ గారణము లింతయొప్పదె మనకున్ ?

ఇం దెవ్వరితోడను విచారింప నక్కఱలేదు. ఇది సుహృద్ద్యూతము గాని వేఱొండు కాదు. నీకు నభిప్రేత మైనయెడలనే యాడుకొంపను లేదేని బలాత్కారము లేదు.

విదు— సుయోధనా! ఎందులకేని వృద్ధానుమతముగాఁ బ్రవర్తించుట పనికదా! అదిగాక,

క. ద్యూతము వేఁటయుఁ బానము
నాతిమొదల్ వ్యసనముల ఘనమతులు ప్రాజ్ఞుల్
నీతిపరులు నగు నృపతులు
ప్రీతి విశేషించి తగుల నెఱతురు కాదే! నను

కర్ణ— (తనలో) ఇతని కక్కఱలేనిది కనుపట్టదు. (ప్రకాశము) విశేషించి తగులఁదగదు కాని యొకించుక తగులవచ్చునుగదా!

భీష్మ— (కోపముతో) ఓయీ, అంగరాజా! ధర్మశాస్త్ర ప్రశంసకుఁగూడ నీవే యుత్తరము చెప్పవలయునా? చక్కఁగా యోజించినచో నీవ్యసనము నొకట రెంటఁ దక్క బొత్తిగాఁ దగులనే తగదు.

దుర్యో— (ప్రీతితో) సఖా! మనకీ ప్రసంగ మెందుకు? నీ వూరకొనుము. ఏమో రాజులకుఁ జిరకాలమునుండి వినోదముగా నేర్పడిన విషయము గనుక మనమిందు దిగితిమి. అందులకు ధర్మనందనుం డంగీకరించెనా మంచిదే, లేనిచో నంతకన్న మంచిది.

ధర్మ— (ఆవేశముతోఁ దనలో)

ఉ. రమ్మని పిల్వఁగాఁబడి భరమ్మగు పూనిక నేగుదెంచి ధ
ర్మ్యమ్మని యెల్లరాజులు చిరమ్ము బహూకృతి చూపినట్టి ద్యూ
తమ్మునయందుఁ దద్దయు హితమ్ముగలాఁడని పేరుగాంచి నే
నిమ్మెయి వెన్కఁదీయ నగరే? పగ రేఁగునె యింత మాత్రలో?

(ప్రకాశము) అంగీకరించుటం జేసియే యిటకు వచ్చితిని. పృథానుమతమ్మున నిరపాయంబగు మార్గమ్మున నిందుఁ బ్రవర్తింతము.

శకు— ద్యూతమున నింతవ్యసనిని నేనింతవఱకుఁ జూడను. కావుననే యితఁడు మనపన్నిన యురిలోనికి వచ్చియున్నాఁడు.

ఉ. నాడగు నేర్పుకల్మి యమనందనురాజ్యము నెల్లగెల్చి యా
మోదముదక్కియున్న కురుముఖ్యుని కిచ్చి యతండ నేనుగా
నేదెస నన్నె భూమిపతిజ లెల్లరు మెచ్చుకొనంగ మేటి పు
ర్యాదకు నాస్పదుండనయి యందెద నందఁగ రాని సౌఖ్యముల్.

(ప్రకాశముగా)

క. జూదమ్ముకన్న ధనసం
పాదక మగువిద్య గాని పరమానందం
బీఁదగువిద్దియ కానీ
లేదని నీవెఱుఁగవే? యళీకమె? నృపతీ!

ధృత

కావున నొండు విచారంబు దక్కి స్థిరచిత్తుండవై యిందుఁ బ్రవర్తింపుము

ధర్మ— (తనలో) ఈకాలప్రవారిలో నితండు ద్యూతమునఁ గడుఁ బండితుఁడు. (ప్రకాశము) గాంధారరాజా! నీవు మధ్యస్థుండవై యిందలి మంచి చెడ్డలను వివరించుచుండుము.

దుర్యో— (బహూకృతితో) అన్నా! ద్యూతమున నీకును నాకును హస్తిమశకాంతరమని యే నెఱిఁగి నాకై ప్రతినిధిగా నీతని నేర్పఱచుకొంటిని. మాధ్యస్థ్యమునకేమి? శాంతనవాదులు పెక్కండ్రుగలరు.

ధర్మ— (తనలో) శకుని యనన్యసామాన్య ద్యూతకుశలుఁడు. నేనితనితో నాడితి

నేని యోడుటయే ధర్మము. ఇందుపాయ మేమి? ఇట్లగుఁగాక (ప్రకాశము)

గీ. ద్యూతమన్నను ధనమిచ్చు ఖ్యాతిఁదెచ్చు
రెండునుంగూడఁ బోఁగొట్టుచుండు నొకటఁ
దనకుఁదాన యిప్పని సేయఁదగునుగాని
యొకరికై యొండొరులు సేయు టుచితమగునె?

ద్రోణు— (తనలో) మొట్టమొదట జూదమే గర్హ్యమనిన ధర్మనందనుఁడు తుదకుఁ దన్మయుఁడైనటులున్నాఁడు. అక్కటా! యిది యెంతదుర్వ్యసనము? (కోపముతో) ఛీ! ధర్మశాస్త్రములు తగులఁబెట్టనా? ఇట్టి జూదముగూడఁ బుణ్యప్రదమఁట. ఇట్టి వ్రాఁతలు వ్రాయువారి నేమన వచ్చును?

ఆ. వె. ద్యూతమాడువాఁడు దొంగయుఁ గావచ్చు
దొంగ చేయలేని దోషమేది?
దీనిఁదగులువాఁడు దెల్లంబు గక్కిన
వ్యసనములకుఁబోవువాఁడు కాఁడు.

దుర్యో— అన్నా! నీకీసందియ మెందుకు?

క. నా మేనమామ యోడిన
గ్రామములున్ దేశములను గనకంబును నిం
కేమైన నేనె యనుకొని
యామోదము మీఱ నీకు నర్పణసేతున్.

శకు— కౌంతేయాగ్రజా! అతఁ డెందుకు? నేను మాత్రము దరిద్రుఁడననుకొంటివా?

తే. గీ. నాకు రాజ్యంబులేదొ? ధనంబులేదొ?
కామినులులేరొ యశ్వముల్ కరులులేవొ?
ఓడుటయె నిక్క మేని నేనోడఁగ లేనె?
యోడఁ గలిగిన నాదు మిట్లవర నేల.

భీష్మ— ఓహో! ఈదుర్మార్గుఁడు క్రమముగాఁ బురికొల్పుచున్నాఁడే!

కర్ణ— యమనందనా! గాంధారరాజు దుర్యోధనునికై ద్యూతమాడును, అందునోడిన యఖిలమ్మును నాతఁడే భరించును. అట్లుకానిచో నితఁడే వహించును. అందులకు నీతఁడు వెనుదీసె నేని,

క. నారాజ్యమిత్తు నంతకు
దీఱనిఋణ ముండెనేని దేజమ్మున నీ
ధారుణి నఖిలము గెల్చియ
వారణగతి నీకు నొసఁగువాఁడ నితనికై.

విదు— సూతపుత్రా! యుత్తమక్షత్రియుల కేర్పడిన విషయమ్మున మనబోటులు ధన మొసంగుట యెట్లు? ఒసంగినను వారు గ్రహించుట యెట్లు? అదిగాక

తే. గీ. తనకు సెనయైన ధృతరాష్ట్రతనయుకన్న
నితని మామ గాంధార నృపేంద్రుకన్న
మిన్న యని ధర్మరాజు నిఁక మేటిఁజేసి
యాడునే? ద్యూత మింతయనూహ్యమగునె

ఇది యిట్లుంచుము.

ఉ. ధారుణి గెల్తునంటివి వృథా రుచియింపనివాక్కు లేల యీ
దారుణపుం బ్రతిజ్ఞ యల ధర్మతనూజుని తమ్ములున్నచో
నేరు వచింప నేర్తురె? జయింపరె వారలు రాజసూయముఁ
శూరతమై నొనర్పరె? యనూయ భవత్ప్రముఖుల్ వహింపరే?

భీష్మ— కుమారా! పాంచాలీ పరిణయమునాఁటి పరాభవమునేని జ్ఞప్తికిఁ దెచ్చుకో నేరని యితనిమాటలకు నీకింత కోపమెందుకు?

కర్ణ— (కోపముతో) ఏమీ? నీవు శూరతాప్రసంగము దంభధర్మములు చెప్పుటవంటిదే యని యూహించుచుంటివా? (ఏమోయనఁబోవును)

దుర్యో— (వారించి కోపముతో విదురునిదిక్కై)

క. ఈసుగలవాఁడవని ని
న్నోసరిలఁ జేయ నెంచియును దండ్రికినై
నేసైఁచి యూరకొందును
దాసిపుత్రుండె? యితఁడు తగఁడె? జయింపన్.

ధృత— (తత్తఱపాటుతో) కుమారా! ఎందులకీసభ? ఏమి జరుగుచున్నది? అంతతో విరమింపుము. విదురుఁడు సర్వవిధములఁ బెద్దవాఁడు. నాకన్నను నీకుఁ బరమ పూజ్యుఁడు. అధికప్రసంగము కట్టిపెట్టుము. ప్రకృతము చూచుకొనుము. (విదురునిదిక్కై) తమ్ముఁడా అతఁడు బాలుఁడు, నేనొకటియు నీవొకటియుఁగాదు. వానిమాటలకు నాతోపాటు నీవును సహింపుము.

విదు— సహింపకేమి సహించితిని. కాక సహింపక చేసెడిదేమి? (జనాంతికముగా) నీహితమే కాక లోకహితముం గోరి నీకొకటి చెప్పుచున్నాఁడను. దానియందలి యాథార్థ్యమును గ్రహించి పిదప నీచిత్తమువచ్చినట్లొనరింపుము.

చ. కొమరుఁ డటంచుఁ జూడకుము క్రూరుఁడు వీఁడు నిజంబు రాజవం
శము లడఁగింపఁ బుట్టె మది సంశయముల్ దెగఁ గోసి ప్రీతిమూ
లము దిగ ద్రావి వీనిని బలాత్కృతిమై వధియింపు మంతతో
నమలినమౌ జగంబు యశమబ్బు నిహంబుఁ బరంబు నీకగున్.

వీఁడు వోయినను నీకుఁ దొంబదితొమ్మండ్రు కొమరులు గలరు. నేనెందులకో చెప్పితినని యోజించి యుపేక్షించితివేని,

ఉ. ఎల్లకుమారులున్ బడుదు రెల్లకులమ్ములు నాశమౌ జగం
జెల్లఁ జెడున్ సమస్తమున కీచెడుగే యగుమారకుండు నేఁ
గల్ల వచింతునే? తుదకుఁ గాలమువచ్చినయప్పు డాఁపఁగాఁ
జెల్లునె? యిప్పు డిట్టిపని సేయుము కోయుము వీని కుత్తుకన్.

కర్ణు— (జనాంతికముగా) సఖా! చూచితివా? మీతండ్రి యాదాసీపుత్రుని దురుపదేశ మెట్లు చెవియొగ్గి వినుచున్నాఁడో! ఆబోధించెడి బోధన యెట్టిదియో?

దుర్యో— (జనాంతికము) ఎట్టిదో మన మెఱుఁగమా? మన యుద్యమమ్మున కెల్లని భంగము కలిగింపుమని, లేదా? నిన్నును నన్నును జంపించి పాండవులకు రాజ్యమిమ్మనియైనను జెప్పఁగలఁడు. ఇం దతని తప్పేమి?

క. ఎంగిళులు మెసవుబానిస
సంగడ మని యెఱిఁగి వీనిఁ బరమాప్తునిఁగాఁ
జెంగటికిఁ జేర్చుజనకుని
సంగతికిన్ వగవవలయు సంగడికాఁడా!

ఇప్పుడు మనమెవరితోడను గలహింపఁగూడదు. "కార్యార్థినః కుతోగర్వః" అనుట నీ వెఱుఁగనిదికాదు. ఎవరేమన్నను నాకై సయిరింపుము. (ప్రకాశము) ధర్మనందనా! మధ్యమధ్య లేనిపోని ప్రసంగములచేఁ గాలము వృథయగుచున్నది. నానిమిత్తమై గాంధారరాజు ద్యూతమాడుటకు నీ వంగీకరించితివేని ద్యూతము ప్రారంభమగును; లేదా? నీవతనికి నోడితివని యనుకొందుము.

ధర్మ— (ఆవేశముతో)

ఆ. వె. శకుని కెంతయెంత సామర్థ్యమున్నను
నాకు నందొకింత లేకయున్న
నాడఁబూనివచ్చి యవల కూరకపోవు
నంతనీచుఁ డొక్క! యమసుతుండు.

భీష్మ— (తనలో) ఔరా! యెంతటినీతిమంతున కెట్టియావేశము గలుగుచున్నది?

ద్రోణు— (తనలో) ఇప్పు డితఁడు తన్నే తాను గుఱుతించునట్లు తోఁచదు.

క. పానాసక్తులు నబలా
ధీనులు మృగయులును కొంత యేగినపిదప౯
మే నెఱుఁగుట కల దకటా!
మానరు జూదరులు దాని మరణముదనుక౯.

శకు— (తనలో) ఇతఁ డితరు లెన్ని యంతరాయప్రయత్నము లొనర్చినను దుదకు మనకే యనుకూలుఁడైనాడు. ఇఁక నాలస్యము చేయరాదు. "ఆలస్యాదమృతంవిషం" (ప్రకాశము) రాజా! నీవు నాకన్నను సమర్థుఁడవే. సంశయమేమి? ఇవిగోఁ బాచికలు. ముందు నీవే మొదలిడుము.

ధర్మ— (పాచికలు పుచ్చుకొనును)

దుర్యో— (సంతోషముతో) ఇదిగోఁ బందెము. (రత్నఖచితములగు మురుగులు తీసి యక్కడ నుంచును)

ధర్మ— (పాచికలు వైచును)

దుశ్శా— (తొందరగాఁ జూచి) గెలిపు మనది. (విచారముతో) కాదు కాదు.

ధర్మ— (సంతోషముతో) మరల నొడ్డుఁడు.

శకు— (జనాంతికము) కుమారా! సంశయింపకుము. మొట్టమొదట నతనికిఁ గెల్పుగలిగించుట యెందుల కనుకొంటివి? మఱింతయాదరము హెచ్చించుటకుఁ జుమా! ఇది ద్యూతజ్ఞుల రహస్యము.

దుర్యో— నా రాష్ట్రమును దప్పఁ దక్కిన యావత్తుధనము నొడ్డితిని.

ధర్మ— మంచిది. (పందెము వేయును)

శకు— గెలుపు మాది. పాచిక లిటు తెమ్ము, ఒడ్డుము.

ధర్మ— (ఆవేశముతో) నా యావద్రాజ్యమును నొడ్డితిని.

శకు— సమ్మతించితిని. (పందెము వేయును)

విదు— (ధృతరాష్ట్రునితో) అన్నా! చూచితివా? సుహృద్ద్యూత మెంతవఱకు వచ్చినదో?

ధృత— (విననియట్లు నటించును)

దుర్యో— (సంతోషముతో) మామా! పందెము మనమే గెల్చితిమి.

శకు— (తనలో) ఇక్కడికి నా మేనల్లుని చింత తీరినది. (ప్రకాశము) ధర్మనందనా!

క. ఓడితివి సర్వరాజ్యము
నేఁడిఁక నొడ్డఁగ నేది నీకున్నది? యిం
కాడుట చాలించెదవో?
యాడెదవో, యేదియే నుపాయము కలిమిన్?

ధర్మ— (ఆవేశముతో)

మ. బహుదర్పోద్ధతుఁ డైననీలు నని లో భంజించియున్ జంభకు
న్నిహతుం జేసియు శూరసేననృపతి న్నిర్జించి పాండ్యున్ జయా
వహు నోడించి యనేకులన్ ప్రబలులన్ వారించి నాచేత నే
సహదేవుం డొనరింపఁజేసె మఖ మాసత్యాఢ్యు నిం దొడ్డితిన్.

శకు— అట్లయినచో నిదిగోఁ బందెము వైచుచున్నాను. (పాచికలు చూచి) మేమే గెల్చితిమి. ఇఁక నేమి యొడ్డెదవు?

ధర్మ— (ఆవేశముతో)

ఉ. ప్రాకట శౌర్యదర్పులగు బర్బర మాళవ దేశవాసులన్
వీఁక నదల్చి పుష్కరవనీగత దుర్మదులన్ జయించి దు
ర్ధీకుల దత్తకాదుల హరించి ననున్ మఖిఁగా నొనర్చు న
శ్లోకు ద్విషద్విపాహినకులు న్నకులుం బణ మిందు వైచితిన్.

శకు— (పందెమువైచి చూచి) మేమే గెల్చితిమి. (ఎకసక్కెముగా) రాజా! సవతితల్లి కొమరు లనియా యేమి మాద్రేయుల నొడ్డితివి?

ధర్మ— గాంధార రాజా! నీ ఛేదకతాచాతుర్యము నేనెఱుఁగనిది కాదు. అంతతోఁ గట్టిపెట్టుము (ఆవేశముతో)

మ. భగదత్తున్ నగభేదిమిత్రు నని సంభావించి కాశ్మీరుఁ బాం
డ్రుఁ గలూతాధిపు విష్వగశ్వుని సుధన్వుం బోర నిర్జించి శ్వే

తగిరీశుం బొగరేదఁ జేసి మిగులం దర్పించి నాచే ముఖం
భగ్గిఁ జేయించిన పార్థుఁడిందుఁ బణమై యున్నాఁడు నాయానతిన్.

శకు— (మరలఁ బందెమువైచి) రాజా! మేమే గెల్చితిమి చూచితివా?

ధర్మ— (ఆవేశముతో)

మ. శిశుపాలుం బశుపాలునిం బలె జిగీషించెం జరాసంధునిం
గృశునిం జేసి వధించె నియ్యనఘుచేఁ గీడ్వడ్డ యుక్కీలనా
వశమే పేర్కొన? రాజసూయమున కెవ్వాఁడయ్యెఁ బ్రేరేపకుం
డశనిప్రాయుఁడు భీమసేనుఁ డిటఁ దానేఁ గాక పందెంబొగిన్.

శకు— (పందెమువైచి) ధర్మనందనా! మాదే గెల్పు.

ధర్మ— (ఆవేశముతో)

చ. తెలిసినమూర్ఖుఁడంచు జగతీతల మెల్లను గేలిసేయ న
ప్పలుకులువైఁచి ద్యూతపు నెపమ్మున సర్వము గోలుపోవు కా
వలుఁడు యమాత్మజుం డిచటఁ బందెముగా నియమింపఁగాఁబడెన్
దలఁగని దుష్టదైవము కతమ్మున నెమ్మన మాఁప నేరమిన్.

శకు— (పందెమువైచి) ఇదియును మమ్మె గెలిపించినది. (ఏకసక్కెముగా)
ధర్మనందనా!

ఆ. వె. మీకు నేగురకును మిక్కిలి ప్రియురాలు
యాజ్ఞసేని నొడ్డ కకట! నీవ
నిన్ను నొడ్డుకొంటి వన్నలినాక్షి ని
న్డేని యొడ్డు గెలుతువేమొ మరల?

అట్లొడ్డితివేని మే మింతకుమున్ను గెల్చిన నీయాపత్తు సొత్తును ఒక
ముగా వైచెదము.

ధర్మ— (యోజించి తనలో) కానిమ్ము చెడ్డకాఁపురమునకు ముప్పేమిటి?
(ప్రకాశము)

చ. పరమ పతివ్రతామణి నపారగుణాకరఁ బాండుపుత్రసం
సరణమహోర్మికా నభిజాత నయోనిభవ న్మహాయశ
స్కర నవపద్మలక్షణఁ బ్రసన్నహృదంతర ద్రోవదిన్ దురో
దరమున నేఁడు పందెముగ ధర్మతనూభవుఁ డొడ్డినాఁడహో!

శకు— (పందెమువైచి) ఇదియును మేమే గెల్చితిమి.

(అందఱును నెవ్వెఱఁగుపడి చూతురు)

(దుష్టచతుష్టయము సంతోషము సూచించును.)

దుర్యో— (విదురునిదిక్కు) విదురా! నీవుపోయి మాకు దాసియైన పాంచాలిఁ దోడ్కొనిరమ్ము. ఇఁక ముందు తా నొనరించుపనుల నేర్పఱచి మీ యందఱ సమ్ముఖమ్మునను వినిపింపవలయును.

భీము— (కోపము సూచించును)

విదు— (మండిపడి) ఓయీ! కురువంశోద్ధారక!

క. చెడిపోయెదు సుమ్మీ దుం
దుడుకింతగఁ దగదు సాధ్వి ద్రౌపది తా నె
క్కడ? నీ వెక్కడ? నేనె
క్కడ? తరతమభావ మింతగా నెఱుఁగుదువే?

నీ వేమనినను నాకుఁ గోపములేదు గాని యటుజూడుము (భీము నిర్దేశించి)

చ. అతని నెఱుంగుదే? జగమునంతయు నొక్కట మ్రింగఁజాలు ను
న్నతుఁ డకటా! కడుం బసితనంబు నినున్ బలవంత పెట్టి యి
ట్టి తులువప్రవృత్తుల న్గడపెడి న్జెడిపోతివి పార్థులేడ? నీ
మతమున దాస్యము న్సలుపుమా టది యేడ? దురుద్ధరం బహో!

ధృత— (ఎఱుఁగనట్లుగా) తమ్ముఁడా! ఏమి జరిగెను? ఎవరెవ రేమేమి యొడ్డిరి?

విదు— (అనాకర్ణితముగా)

క. మిత్రద్రోహంబని సుచ
రిత్రులఁ బార్థులను బిల్చి ఱేఁపి తుదిన్
శత్రుత్వము సాధించు న
పాత్రుని నిను దైవ మెట్లు పరిపాలించున్?

దుర్యో— (తనలో) ఇతఁ డెప్పుడును శత్రుపక్షములోని వాఁడే; మనమితనితోఁ జెప్ప నేకూడదు (ప్రకాశము) ఎవఁడురా? అక్కడ.

ప్రాతిగామి— (ప్రవేశించి) జయము జయము. ఏమియాజ్ఞ?

దుర్యో— ప్రకృతమ్ము తెలిపి ద్రౌపది నియ్యెడకుఁ దోడ్కొనిరమ్ము.

ప్రాతి— (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) అయ్యా! మీయాజ్ఞఁ దెల్పఁగా నామె యిట్లనియె.

దుశ్శా— ఏమనియెను?

ప్రాతి— "భార్యను జూదమం దోడిన మహానుభావుం డిప్పటి కెన్నండును వినం బడండు. అయినను దన్నోడి నన్నోడెనో నన్నోడి తన్నోడెనో కనుంగొని మరలరమ్ము. అప్పుడవసరమైనచో నేను వచ్చెదను" అనియెను.

ధర్మ— (తలవంచుకొనును)

దుర్యో— సరే. ఈధర్మసందేహము తానిక్కడికేవచ్చి చెప్పుకొనినచో సభ్యులు తీర్చెదరు. రమ్మని చెప్పుము పొమ్ము.

ప్రాతి— (పోయి మరలవచ్చి) అదిగో నాయమ చనుదెంచి యాకురువృద్ధుల వెనుక నున్నయది.

దుర్యో— అక్కడ నెందుకు నిల్వవలెను? ఇక్కడికే రమ్మనుము పొమ్ము.

ప్రాతి— (నిష్క్రమించును.)

దుర్యో— (చూచి జనాంతికము) తమ్ముండా వాండు భీమసేనునికి వెఱచును గావున

క. నీవరిగి తోడితెమ్మది
కేవలముం గులటయాటం గిల్బిషమని శం
కావిలుండవు కాకు మహో!
యేవురు పతులుండి సాధ్వి యెట్లగునొక్కా?

దుశ్శా— (జనాంతికము) అన్నా! ఈపన్నుగడ కుంతి యెందులకుం బన్నినదనుకొంటివి? తన్నుం గోడ లెప్పుడేని యాక్షేపింప కుండుటకుం జుమీ! (ప్రకాశము) ఇదిగో తోడితెత్తును. (కొంతవఱకుంజని తనలో) ఓహో! నన్నుం జూచి యెక్కడికో పోవుచున్నదే!

ఉ. ఎక్కడికేఁగ? దింక మగలేవురు నాకుం గలారటంచు బల్
నిక్కెదు విఱ్ఱవీఁగెదవు నేఁడు మదర్థమవైతి వోసి! నీ
కక్కసమెల్లఁ బోనడచుకాలము వచ్చెనులే యిఁకేటి కీ
తక్కులు? దాసివైతివిగదా! పనిచేయుము చెప్పినట్లుగన్.

లేదేని నీమానప్రాణంబులు దక్కవు. దుశ్శాసనుండు చండశాసనుండని యెఱింగి మసలుకొనుము.

(నిష్క్రమించును.)

(తెరలో)

నేనేకవస్త్రను రజస్వలను దూరముగాం దోలుదుము. ఇట్టియెడ నేను గురుజన స్థానంబగు నాస్థానంబున కెట్లు రానయ్యెడిని?

కర్ణు— (దుర్యోధనునితో జనాంతికము) సఖా! చూచితివా ఎంతలో నెట్లు బొంకుచున్నదో?

దుర్యో— అట్టి బొంకులను మనదుశ్శాసనుఁడు పాటించువాఁడు కాఁడు గదా! వినుము, తగిన యుత్తరమునే చెప్పుచున్నాఁడు!

(తెరలో)

ఆ. వె. ఏకవస్త్రవేమి? యేకవస్త్రవె యౌదు
కాక విగతవస్త్ర గావుగాదె?
దాసి కిన్నివగలు తగవు నీ టక్కరి
తనము మానిరమ్ము తడయ కిపుడు.

(శిరోజములు పట్టుకొని యీడ్చికొనివచ్చును.)

(భీష్మాదులు తలలు వంచికొని విచారింతురు.)

ద్రౌప— (శోకముతో) ఓహో! కురువృద్ధులారా! ధర్మనందనుండు దైవవశమ్మున నన్నోడినను నోడుఁగాక. మీయట్టి వివేకులు గలసభలో నన్నువీఁడిట్లు పరాభవింపఁజూచి యూరకొనుట తగవేకదా?

భీము— (విచారముతో) అన్నా! ధర్మనందన!

క. ఓడితివి మమ్ము నలుఁవురఁ
బాడియె వీరేమి మనల బాధింతురు? పూఁ
బోడిం ద్రోవదిఁ బణమిడి
యాడుదురే? యెందుఁగలదె? యవివేక మిటుల్.

(కోపముతో) ఇయ్యెడల ని న్నేమిచేసినను దోసము లేదు. నీబాహువులు తగులఁబెట్టినఁగాని నా కీ కోపము తీరదు.

అర్జు— (వారించి) అన్నా! శాంతింపుము.

క. ఆడెడిది జూద మందుం
బాడిఁయెటుల్ తోఁచు? ధర్మవర్తనుఁ డితఁడే
జాడ జను నదియ ధర్మము
కూడ దనం జాలునంత కోవిదులమొకో?

వికర్ణ— ఓహో! సభాస్తారులారా!

ఉ. అందఱు నాఁడువాండ్రు గలయట్టిరె యిట్టిసభ న్సతీమణిన్
నిందితఁ జేయఁగానగునె? నీచులమే? తినమొక్కొ యన్నమున్?
బందలకేని యిట్టికృతి పాడియె? లోకము మెచ్చునే? యశం
బొందెడి వారికిం జనునొకో? యిటు లూరక చూచుచుండుటల్.

కర్ణు— కుమారా! యనేకులు పెద్దలున్నయెడ నీకీ యధికప్రసంగ మెందుకు? ఇంతకును నియ్యది పతివ్రతయైనచో నీవన్నట్టు లిప్పని యధర్మమే కావచ్చును. కులటయైనయెడ నిట్టి నీతులతో నవసరముండదు. మిన్నక కూర్చుండుము.

వి.క— తండ్రీ! యిప్పట్లు గురువుల కెదురాడక తప్పకవచ్చుచున్నది.

తే. గీ. ధర్మసూక్ష్మమ్ము లెఱిఁగెడి ధన్యులన్న
దొరకరెక్కడనో కాని, ద్రుపదపుత్రి
కులటయే యనుకొంద మక్కలటకేని
మానవంతు లోర్వరుకదా! మానహాని.

కర్ణు— (కొంచెము కోపముతో) అంతతోఁ జాలింపుము. పుంశ్చలికి మానహాని యొకరు చేయుటయెందుకు? తనంత నే సిద్ధించుచున్నది. తెలిసియుఁ దెలియని ప్రచారములు గట్టిపెట్టుము.

దుర్యో— తమ్ముఁడా! పాండవులయు ద్రోవదియొక్కయుఁ బట్టమ్ము లొలువుము.

(పాండవులు తమపై వస్త్రమ్ములుదీసి యొక్కెడ నుంతురు.)

దుశ్శా— (ద్రౌపది పైటకొంగు పట్టుకోఁబోగా నామె తొలఁగి చనఁగా నతఁడు వెంటనంటి చీరలాగును)

ద్రౌప-మ. కరుణాదూరత నూరకుండి రయయో! గాంగేయముఖ్యుల్ మహా
పరిభావమ్మున కోర్వరామిఁ దలలన్ వక్షమ్ములోఁ గ్రుక్కి దు
ర్భరదీనస్థితి నున్నవారలు పతుల్ రావే ననుం బ్రోవవే!
శరణం బెవ్వరులేరు నాకునిఁక గృష్ణా! దీనసంరక్షణా!

దుశ్శా— (తనలో) క్రింద నొకచీరయున్నదే! (మరల చీరలాగును)

ద్రౌప-మ. తరుణీరత్నముగాదొ యాసిరి ప్రమాదంబెప్పుడున్ జెందదో?
త్వర నీకుం దగఁ జెప్పి పంప దదియే బాగంచు లోనెంచెనో?
సరి యామాటలకేమి? చెల్లెలని యిచ్చన్ గొంత చింతింపుమా!
శరణం బెవ్వరులేరు నాకు నిఁకఁ గృష్ణా! దీనసంరక్షణా!

దుశ్శా— (యథాప్రకారముగా నుండుటఁజూచి మరలఁ జీరలాగును.)

ద్రౌప-మ. గిరికేలం ధరియించి గోపకుల రక్షింపంగలేదే? వడిన్
గరిఁ గాపాడఁగలేదె? చక్రమున నక్రమ్మున్ విదారించి, ని
ష్కరుణాదృష్టిని నన్నుఁ జూడఁ దగవా? కాపాడవా? సోదరా!
శరణం బెవ్వరులేరు నాకునిఁకఁ గృష్ణా! దీనసంరక్షణా!

దుర్యో— (కర్ణునితో) సఖా! చూచితివా? ఈబంధకి చాతుర్యము. ఎన్ని వస్త్రమ్ము లిమిడ్చి కట్టికొన్నదో!

కర్ణు— ఇది కడువిచిత్రముగానున్నది. (యోజించి) ఇన్నివస్త్రమ్ము లిమిడ్చి కట్టికొన్నదనుటకుఁ దోఁచకున్నది.

దుశ్శా— ఓసీ! పంచభర్తృకా!

గీ. ఎపుడుగాని యసత్యమ్ము నెఱుఁగఁడనుచు
నీదుభర్తను వర్ణింత్రుగాదె? జనులు
అట్టివానికి భార్యవై యెట్టులంటి?
ఏకవస్త్రనటం చిన్ని కోకలుండ.

భీష్మ— (తనలో) ఓహో? ఆపద్బాంధవుఁడగు శ్రీకృష్ణునిదయ ద్రోవదిని గాపాడినది. (ప్రకాశము)

ఉ. ఎందుకు నేను గల్గి? మఱియెందుకు ద్రోణుఁడుగల్గి? యక్కటా!
పంద విచిత్రవీర్యజుఁడు పాపి తనూజులఁ గా దనండు వీ
నిం దునుమన్ వలెన్; విదురుని న్నను ద్రోణునిఁ గాదటంచు నీ
నిందితమైనజూద మవినీతుఁడు తా నిటు సమ్మతించునే?

(కత్తి దూసి ధృతరాష్ట్రునిపై కరుగఁబోవ విదురుఁడు వారించును)

ధృత— తమ్ముఁడా! యేమిజరుగుచున్నది? ఎందులకా కలకలము?

భీమ— (కోపముతో) ఓయీ! నీకుఁ గన్నులు గానరావు గాని చెవులు వినరావా? పాంచాలి పెట్టుకొన్న మొఱ్ఱ వినియును విననియట్లు నటించుచున్నావుగా? కానిమ్ము.

శా. పిన్నల్ పెద్దలనేకు లున్నసభలోఁ బెంపేది దుర్మార్గుఁడై
పన్నెన్ వాసియు సుంత చూడ కకటా! పాంచాలి నీరీతిగా
బన్నం బందగఁజేయు నీఖలుని నిర్బంధించి వక్షస్థలం
బున్నై పగిలించి శోణితము నామోదంబుమైఁ ద్రావెదన్.

ఈదుశ్శాసను నిట్లు చేయనైతినేని,

క. అధముండ జడుఁడ బూర్వపుఁ
బృథివీశులగతికిఁ దప్పు వెకలిని దుష్ట
ప్రథమానతారమూర్తిని
పృథానిహంతృకుఁడ నింక వెయ్యేమిటికిన్.

దుర్యో— (తనలో) అధముఁడవే కాకున్నచో భార్యకట్టి యవమానము జరుగు చుండ నెందుల కూరకొందువు? నీమాటట్లుండ నీభార్య యనేకవిధము లచే నధమురాలై నదిలే?

విదు— అన్నా! యెందుల కిట్టు లెఱుఁగనట్లు నటించెదవు?

తే. గీ. చెప్పలేదె, వికర్ణుండు? చెవులు లేవె
అతనిపాటి యోగ్యుండు ధీయుతుఁడు జ్ఞాని
యీసభ నొకండుగలఁడె? నీయిష్టమింక
కురుకులమడంగె జూదంబు జరుపునాఁడె.

నీ కొమరుండు దుశ్శాసనుండు ద్రోవదిం బలాత్కరించి చీర లొల్చుచున్నాఁడు. అందులకు సుయోధనాదులు సంతసించుచున్నారు.

దుశ్శా— (తనలో) అక్కటా! విప్పి విప్పి విసునెత్తినది. చీరలరాసులు పర్వతప్రాయములుగా నైనవి! ఇఁక నేమిచేయుదును?

ద్రౌప— (దుఃఖముతో) అక్కటా! ధర్మజ్ఞులారా! అట్టి ద్రుపదమహారాజునకుఁ బట్టినై పరాక్రమైకధనులగు సోదరులకుఁ దోడఁబుట్టువనై విపక్షగజహర్యక్షులగు పాండవులకు ధర్మపత్నినై యేనిట్లు పరిభవం బందుచుండం జూచి మీ రందఱును మిన్నకుండెదరుగా! ఇది యేమి న్యాయ్యము? పోనిండు నేను వీరికి దాసినేమొ తెల్పుఁడు! దాసినే యనుకొండు. అయినచో నిట్టి పరాభవ మొందఁదగిన కార్యమేమి యొనర్చితిని?

భీష్మ— (విచారముతో) అమ్మా! ద్రుపదరాజ నందని!

ఉ. చచ్చినవానిపోల్కెఁ బెలుచన్ మతిపోయిన వానిమాడ్కి నే
నిచ్చటనుంటి, నీశ్వశురుఁ డేమనుకొంటివొ? నాలిఁ ద్రుచ్చు జల్
కుచ్చితుఁ డెందుకీవు మముఁ గోరెదు? ధర్మము చెప్పుమంచు ను
ద్యచ్చరితుండు ధర్మజుఁడు దానిది సెప్పవలెన్ సతీమణీ.

నీ కేమియుం గొదవ రానేరదు. ఇక్కురువంశనాశనమ్మునకై యీ దురోదరం బేర్పడినది.

కర్ణ— (ఏకసక్కెముగా)

తే. గీ. తరుణి? యిమ్మడిగొడ్డుచందమున నిడుమ
లొందవలసెను బతులింద ఱుంటఁజేసి
ఏమి సార్థక్య మిందఱు హీనులుండి
తగినవారు నొండొక్కరుఁ దగులుకొనుము.

దుర్యో— (విలాసముగాఁ జూచి తనతొడఁ జూపించును)

భీము- ఉ. తొడఁజూపించెదురా దురాత్మ! తులువా! ద్రోహీ! కులఘ్నా! జడా!
వెడఁగుం బోక లడంపఁజాలఁడొకో? యీభీముండు కామానలం
బుడిపింతు న్వీను మోరిపాపి! గదచే నూరుద్వయంబుం బొడిం
బొడిగాఁజేసినయప్పు డేడ్చెదవులే పాల్పేది బల్ పేదవై.
(మండిపడి మీఁదికురుకఁబోవును)

భీష్మ— కుమారా! యిది సమయముగాదు శాంతింపుము.

అర్జు— అన్నయ్యా! శాంతింపుము.

ద్రోణు— కుమారా! పవమాననందన!

క. కురుకులము నశించుటకై
దురూహలు జనించె నిట్లు దోర్బలమునకుం
దఱికాదు ధర్మనందను
మరియాద న్నిలుపుమయ్య! మముఁ గనియైనన్.

ధృత— (తనలో) అక్కటా! నాకొమరులెంత దుర్మతులైరి? సుహృద్ద్యూత
మెంతపఱకు వచ్చినది? ఇఁక నేనెట్టులీ యుపద్రవము వారింతును?
(యోజించి) ఇట్లగుఁగాక. (ప్రకాశము) నాయనా సుయోధనా! ఏమి
యీయాగడము?

ఉ. ఏఁడులు హెచ్చునకొల్లఁది నేవప్రబుద్ధులు నీకు హెచ్చె నా
నాఁడె నశింపఁజేసెదవె? నా కులశీలములెల్ల నుంతమో
మోడక ద్రౌపది న్సతి నయోనిజ నింత యనాదరింతె? యీ
కూడని చెయ్వి లెట్టు లొడఁగూడెనురా? చనురా దురంతముల్?

క. కడు యోగ్యులైన పాండవు
లిడుమలపాలైరి నీవు హేతువుగ నిఁకే
నుడుగుము దుండగపు న్నడ
వడి పచ్చనికొంప మాపఁ బాడియె పుత్రా!

(పాంచాలిదిక్కై) అమ్మా! ద్రుపదరాజనందని!

క. ఎఱిఁగియు నెఱుఁగని తులువల
దురాత్ములను దుండగులను ద్రోహుల మమ్మున్
భరియింపుమమ్మ! నా సుతు
తిరస్కృతిన్ మఱవుమమ్మ తేఁకువకలిమిన్.

ఈతప్పునకై నీకెయ్యది యిష్టం బయ్యదియ నుడువుము. చేయూటను
నిచ్చుటకు సంసిద్ధుఁడనై యున్నాఁడను.

ద్రౌప— అట్లు వరమొసంగెదవేని ధర్మపుత్త్రుని దాస్యమువలన విముక్తుం జేయుము. దాన్నిచే నయ్యనఘు కొమరుండగు ప్రతివింధ్యునిఁ గురుకుమారులు దాసపుత్త్రుండని యాక్షేపింపకుందురు.

ధృత— ఇచ్చితిని. మఱియొండు గోరికొనుము.

ద్రౌప— ధర్మనందను తమ్ములు తమతమ శస్త్రాదిసాధనమ్ములతో దాస్యము వలన విముక్తులగున ట్లొనరింపుము.

ధృత— ఇచ్చితిని, మఱియొండు గోరుము.

ద్రౌప— ఇంతకన్న క్షత్త్రియసతికి నధికారము లేదుగదా!

ధృత— అమ్మా! నీయోరిమికి సంతసించితిని. నీవుకోరకున్నను నేనే యిచ్చుచున్నాను. కైకొనుము.

తే. గీ. ద్యూతమున నేఁడు ధర్మజుండోటువడిన
యెల్లరాజ్యము నొక్కింతయేని మిగుల
కుండ నీకిచ్చితిని మోదమొందుమమ్మ
దుస్సలయొకండు, నీవొండె? ద్రుపదపుత్త్రి!

శకు— (జనాంతికము) కుమారా!

తే. గీ. ఎంతకష్టించి తెచ్చిన నేమిఫలము?
వమ్ముచేసె మనపరిశ్రమమ్ము రాజు
కోరకుండఁగ నే యిచ్చె నూర కీతఁ
డొకఁడుగణియింప గుణియించు నొక్కఁడకట!

దుర్యో— (జనాంతికము) అవును; ఈవృద్ధులమూలమున మన ప్రయత్నము లన్నియు నిటులనే యగుచున్నవి. (యోజించి) ఎవరొప్పుకొన్నను నిందులకు దురభిమానగ్రస్తుండగు భీమసేనుండు మాత్ర మొప్పికొనఁడు.

దుశ్శా— అవును నీ వనినట్లేకాని యొకవేళ నాతఁడును నొప్పుకొన్నచో నుపాయమేమి?

శకు— ఉపాయమున కేమున్నది? తిరిగియు జూదమని పిలిచిన ధర్మజుఁడు వెనుదీయువాఁడుకాఁడు. అయ్యెడ నింకొకయుక్తి పన్నుదము.

ఉ. ఓడినవారు కాననల యుండవలె న్బదిరెండు నేఁడు లో
కేక్కఁడతిగూఢవర్తనమ్మెయిం జరియింపఁగ నొప్పు నయ్యెడన్
జాడయెఱుంగ వచ్చినఁ బునర్వనవాసము గూఢవాసముల్
బాడికిఁ దప్పకుండ సలుపన్వలె నిద్ది పందె మియ్యెడన్.

అని యేర్పఱచి యోటుపఱచి యాదవులకుం బంపుదము.

కర్ణు— ఇది కడు(జక్కనియుపాయమే కాని నన్నడిగితిరా—

ఉ. పోరి జయించి రాజ్యమును బొందుద మయ్యది కీర్తినిచ్చు బెం
పారును దానఁ దేజము సమస్తజగమ్మును మెచ్చు నెవ్వరున్
నోరు మెదల్పలేరు శమనుం డెదురైన నదల్తు గెల్తు ని
వ్వారొకలెక్కయొక్కొ ? విలువట్టుట కేమిఫలమ్ము ? భూవరా !

శకు— నీవు చెప్పినది తుట్టతుద నాచరింపఁ దగినది కాని ప్రప్రథమముననే తగినదికాదు. మనమిప్పు డియ్యెడనుండి యీసంగతులు వింటిమేని వృద్ధరాజు కృత్యమ్మునకు సమ్మతించినవార మగుదుము. కావునఁ బోవుదము పదుండు. (దుష్టచతుష్టయమును వికర్ణుఁడును నిష్క్రమింతురు.)

ధృత— తండ్రీ ! ధర్మనందన !

క. నీవు కడు మంచివాఁడవు
కావలుగై నాకొమరులు కావించు పరీ
భావము సైఁపుము రాజ్యము
ద్రోవది కిచ్చినవరమ్ము తోఁబడ గొనుమీ.

క. మోఱకులతప్పు లన్నియు
ధీరులు సయిరింపవలయుఁ దెలియదు తన
కెవ్వారలు సెప్పిన వినఁడు కు
మారుఁడు నాకెల్లగతుల మారకుఁ డయ్యెన్.

ఏమి సేయుదును ? నీవు నాయందుఁ గడుభక్తుండవు. నీ కెగ్గుగలిగెం గదా ! యని విచారించుచుంటి. నన్నుంజూచి నాకొమరులయెడఁ బగదిగఁద్రావి యథాపూర్వకముగ నింద్రప్రస్థపురమునకుం జని రాజ్యం బేలుకొనుము.

ధర్మ— జనకునాజ్ఞ శిరసావహించుచున్నాఁడను.

భీము— (కోపముతో)

మ. కొఱవిం గాల్చుచు నీరమున్ జిలుకు నీక్రూరాత్మ వాఙ్మ్రపుణిన్
బరిభావంబు దలంపకే శిరము నూఁపం జెల్లునే ? దీన సం
బరముంగల్గెనె ? యింతదీనదశయే ? భార్యాకృపాసంభృతిన్
స్థిర నేలించునె ? భీమసేనుఁ డకటా ! సిగ్గేది ధర్మాత్మజున్.

ఉ. ఉత్తమమధ్యమాధమము లొక్కటికొక్కటి తీసిపోవు నీ
విత్తములం దొకండు తనవృత్తికిఁ గైకొనఁ జెల్లఁగాక స్త్రీ

విత్తము సత్తముండును వివేకియు నౌ యమనందనుండు దా
నత్తికి నత్తునంత యధమాధముఁడే ? మృతులైరె? సోదరుల్.

అర్జు— అన్నా ! ప్రకృతమీ సూచన యెందుకు ? భార్యకృపచేతనని యేల యనుకోవలెను ? ఆర్యకృపచేతనని యనుకొందము. భవితవ్య మెట్లుజరుగనో అట్లే జరుగును. పోవుదము పదుండు. (పాండవులు సతీసమేతముగా నిష్క్రమింతురు.)

ద్రోణు— రాజా ! తుదకు మంచిపని చేసితివి. ఈకారణమున నీకులగ్గు గలుగుఁగాక.

(తెరలో)

దుర్యోధనమహారాజుగారు తండ్రిగారితో నేదియో యోజించుటకు వచ్చుచున్నారు గావున సభ్యులందఱును జనుఁడు.

(ద్రోణభీష్మాదులు నిష్క్రమింతురు.)

దుర్యో— (ప్రవేశించి) తండ్రీ !

క. నీ కేమి వెఱ్ఱి యెత్తెను ?
యా కోడలియందుఁ బ్రేమ మం తగ్గలమే ?
యేకారణమున రాజ్యం
బా కులటకు ధారవోసి తకటా ! చెపుమా.

ధృత— (తనలో) అప్పుడే పోయి యెవరో యీసంగతి వీనికిఁ జెప్పినారే ! (ప్రకాశము) నాయనా ! ఈయుకున్న నా భీమునిముందు మనకు బ్రతుకవశమటోయీ !

దుర్యో— మంచిది; ఆభీమున కిప్పుడు మాత్రము మంచివారమైతిమా? ఏకారణముననో చిన్నప్పటినుండి మేము పరస్పరవైరులము; అదిగాక,

ఆ. వె. కొఱవి వెట్టి నెత్తి గోఁకికొన్నవిధానఁ
బాము నింట నుంచు పగదిఁ బాండు
పుత్రకులను బరమశత్రుల రాజ్యము
నంద యుంచువెట్టు లర్హ మకట !

ధృత— (తనలో) వీఁడెట్లును వృద్ధినొందువాఁడు కాఁడు. నే నేమి సేతును? (ప్రకాశము) అప్పటికి నాకుఁ దోఁచినచందమున వృద్ధసమ్మత మగుగతి నట్లు చేసితిని; ఈమాటకు నే నన్యథా సంచరింప వీలులేదు. పయిన నీయిష్టము

దుర్యో — అట్లయినచో వారల నింకొకపరి జూడంబాడుటకుఁగాఁ బిలిపింపుము.

ధృత — (తనలో) అక్కటా! యేమి చేయుదును? (ప్రకాశము) తిరిగియుఁ బాంచాలిని బరిభవింపవలయు ననియేనా?

ఉ. అన్నకు నోడి భీముఁడును నర్జునుఁడుఁ గవలుఁ సతీమణిన్
బన్నము సేయునప్డు మిముఁ బందల నొప్పరికించి రింక వాం
డ్రిన్నను గిన్ననుం దలఁప కాగ్రహవృత్తి మెయిఁ గడంగి మీ
యున్నతి రూపుమాపుదు రహో! యిపు డేటికి జూద? మాత్మజా!

దుర్యో — చేసినపనియే చేయుటకు నేనంత నెట్టివాఁడ ననుకొంటివా యేమి?

క. ధనసంబంధమ్మును స్త్రీ
జనసంబంధమ్ము రాజ్యసంబంధము లే
కనివార్యమైన వేఁ బోక
పని పణముగఁ జేసి యందు వర్తింతు మొగిన్.

ధృత — అట్లయినచో మీతల్లితో యోజించి పిలిపింతును. ఇప్పటి కీవిచారము కట్టిపెట్టుము.

(అందఱు నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వర విరచితం
బగు పాండవ ప్రవాసమ్మునఁ జతుర్థాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## పంచమాంకము.

(అంత నొక దాసి ప్రవేశించును)

దాసి— (తనలో) నా యొడయురాలగు నూర్వశి యర్జును విడిది కరిగి యతఁ డేమి యొనర్చుచున్నాఁడో చూచిరమ్మనియెఁ గావున నరసి పోయెద. (పరిక్రమించి యాకాశముఁ జూచి) అప్పుడే భగవంతుఁడగు చంద్రుఁ డుదయించినాఁడు. ఇఁక నాలస్య మొనరింపఁదగదు. (పరిక్రమించి చూచి) అదిగో నర్జునుని యనుచరు లటు పోవుచున్నారు. వారలవలనఁ దెలియకున్న పిదప నాపెం దీసికొనివచ్చెద.

(నిష్క్రమించును)

(అంత నూర్వశి చెలికత్తెతోఁ బ్రవేశించును)

ఊర్వ— (తనలో) మనోరథము నెఱవేఱెడినా? నెఱవేఱకేమి? ఇందుల కొక సూచన గన్పట్టుచున్నది. ఏమన, ఇంద్రుండు తనకుఁ దానయై "చెలీ నీ వీ రాతిరి నా కొమరు కేళీగృహమున కరుగు" మని యాజ్ఞాపించెఁగదా! (సంతోషముతో) చిరకాలానురక్తనగు నా కిది యెంత యనుకూలమైన యాజ్ఞ! (ప్రకాశము) చెలీ! ఇఁక నెంత దూరము పోవలయును?

చెలి— అదిగో నయ్యదియే మాడుగు.

ఊర్వ— అట్లయిన నే నియ్యెడ ద్వారమ్మునందే యుండెదను గాని నీ వరిగి నారాకం జెప్పుము.

చెలి— అట్లనే యొనరించుచున్నాను. (భవనములోఁ బ్రవేశించుట నభినయించి) అడుగో, నాయెడ శయ్యామాత్ర సహాయుండై యర్జునుఁ డున్నవాఁడు. పోయి విన్నవించెద.

(అంత యథోక్తముగా నర్జునుఁడు ప్రవేశించును)

అర్జు— (తనలో)

క. అన్నలు దమ్ములు సతియును
నున్నారు వనమ్మునందు నొకఁడనయ్యె యే
నిన్నాకమందు సుఖినై
యున్న ఫలంబేమి ? యెప్పుడో? యేగుటిఁకన్.

రేపటఁ దండ్రితోఁ జెప్పి యొప్పించి యాజ్ఞఁగొని వేగమ యన్నన్ జూడఁ బోవలయు.

చెలి— (సమీపించి) మహారాజా ! జయము, జయము. ఊర్వశి యింద్రప్రేరితయై వచ్చి ద్వారంబున నిల్చియున్నయది.

అర్జు— (తనలో) ఏమి ? ఇట్టిసమయమ్మున నెందుకు రావలయును ? అందులోఁ దండ్రి ప్రేరణకూడ నెందు కుండవలెను ? (ప్రకాశము) ప్రవేశపెట్టుము

చెలి— చిత్తము. (పరిక్రమించి యూర్వశితో) అమ్మా ! సెలవైనది.

ఊర్వ— నీవరిగి మరల వేకువజామునకు రమ్ము.

చెలి— (నిష్క్రమించును)

ఊర్వ— (ప్రవేశించుట నటించును) ఔరా ! ఇతని నింతకు మున్నింద్రసింహాసనంబునఁ జూచినప్పటికన్న నిప్పు డెక్కుడు సొబగు గన్పట్టుచున్న దే? (యోచించి) కాదు, కాదు. ఇది రాత్రిసమయముగదా ! ఈ ప్రభావము దానిదియై యుండునా ? అదియును గాదు. స్వతో రమణీయములగు వస్తువులు క్రమక్రమముగా నాసగొలుపుట సహజమై యున్నది.

అర్జు— (శయ్యడిగ్గి చేతులు జోడించి)

క. కొమరునిపై దయకలిమిని
నమరాధిపుఁడనుపఁ జూడ నరుదెంచితె ? యో
యమ ! సంతోషమ్మయ్యెను
శ్రమయేమిటి ? కేన యటకుఁ జనుదేరనొకో ?

ఊర్వ— (తనలో) ఆహా ! యేమి యీ వినయము ! కాని యిందీతఁ డేలొకో నాపై మాతృభక్తిం గనఁజేయుచున్నట్టున్నాఁడు. (యోజించి) కాదు కాదు. తన కులదేవతలయందుఁ గల గౌరవాతిశయమ్ముచే నిట్టులాడి యుండనోపును. (సంశయముతో) కొమరునిపై ననుగ్రహ మనఁగా నేమో ? ఇట శ్లేషపొడకట్టుచున్నది. యౌవనవంతుఁడౌన నాయందలి

ప్రేమచే వచ్చితివా ? యని యతని యాశయమైయుండును. (తలపంకించి) అట్లయయినచో 'ఓయమ' యని యేల సంబోధించును ? (యోజించి) సంబోధించుటకేమి ? ఇది గౌరవార్థము కావచ్చును. ఐనను వావి వరుసలతో వేశ్యలకేమి యవసరము? ఇతఁడు నన్ను ధ్రువముగాఁ గామించి యేయున్నాఁడు, లేనిచో నిట్టి సమయమున నొంటరిగానున్న తనయొద్దకు వచ్చుట కేల యంగీకరించును ? ఇదిగాక "నే నే నీ గృహమ్మునకు రాఁదలంచి యున్నాఁడ" నని యెందుకుఁ జెప్పవలయును ? అయినను గొంచెము మాటలాడిన పిదపఁగాని నిశ్చయము తెలియదు. (ప్రకాశము) కుమారా ! (నాలుక కఱచుకొని తనలో) అక్కటా ! నేనుగూడ సందిగ్ధార్థముగనే సంబోధించితినే! (ధైర్యముతో) కానిమ్ము; అతఁడు మూర్ఖుఁడా యేమి ? ఈశబ్దము యౌవనవంతునే న్యాయముగా బోధించునని తెలియకపోదు (ప్రకాశము) కుమారా !

ఆ. గీ. వ్యాసుఁడిచ్చిన మంత్రమ్ము పఠనచేసి
యమ్మహాదేవు నారాధన మ్మొనర్చి
పాశుపతమును గైకొని స్వర్గలోక
మరుగుదెంచుటచే ధన్యురాలనైతి.

అర్జు— (వినయముగా)

తే. గీ. జన్మములు చేసి తపములు సల్పిగాని
పొందఁగారాని యీలోకమునకుఁ దండ్రి
యనుమతింజేసి వచ్చితి ననక యిట్లు
తాలుమాలుగఁ బల్కు టెంతయును వింత.

ఊర్వ— రాజాగ్రణీ ! నాయభిప్రాయ మిది.

క. స్మరసుందరుండవైన ని
ర్జరనాథునికన్న మేటిశౌర్యమ్మున కా
కరమగు నీపరిచయముఁ
బొరసిన లోకమ్ము స్వర్గమున కధికంబౌ.

ఉ. కావలువైన కౌరవులకారణమై వనవాసమబ్బె మీ
కేవురకుఁ సతీమణికి, నియ్యది మీకతికష్టమైననుఁ
భావుకమయ్యె మాకుఁ గనుపండువుగా నినుఁ జూచుభాగ్య మా
యీవగఁగాక కల్గునె ? మహేంద్రుఁడు మేమును నీకు లక్ష్యమే.

అర్జు— (తనలో) ఈ పెవాస్త్వ్యఖరిం జూడ నేదోవిధమున బోడకట్టుచున్నది. ఇంతకు నియ్యెడకు రాఁగల తమైయుండునో? (యోజించి) చూచుటకే

రైన నిశీవేళ నేలరావలయును ? ఇది తగదని చెప్పి యవ్వలకుం బంపుదునా ? (సంశయించి) తగ దని చెప్పుట కిప్పటి కీమె చేసిన యకృత్యమేమున్నది ? ఇట్లగుఁగాక (ప్రకాశముగా)

తే. గీ. ప్రొద్దు వోవుచు నున్నది పురుషులెవరు
వెంటలేకుండ వచ్చితి వొంటి నింటి
కరుగఁగావలెఁ గాఁబోలుఁ దరుణిగూడ
నింతవఱకును రాదు నీవిపుడ చనుము.

ఊర్వ— (తనలో) ఇతని గాంభీర్యము కడుశ్లాఘనీయము. వలచినచో నిట్టివానినే వలవవలయును. (లేని కోపముతో)

ఉ. వచ్చినకార్య మేమనవు భావ మొకింతయుఁ దేలనీవు నా
కచ్చెరు వయ్యెఁ బూరుషుల కక్కట ! యింతటి ధైర్యముండునే ?
మెచ్చఁగవచ్చు నిన్ను వినుమీ వచియించెద నాకు నేనయై
వచ్చిమనంబు నీకడకు నన్నిటఁ దెచ్చె నిఁకేడ కేగెదన్

తే. గీ. నారదాదులవలన నీ నామరూప
ములను. వినివిని దర్శనమ్మునకు రాఁగ
నెడను వేచుచునుండ నదృష్టమిట్లు
తనకుఁ దానయి పండె నుదారచరిత!

అర్జు— (తనలో) ఓహో ! యీమె తుదకుఁ దనభావము స్పష్టపఱచినది. కాదు కాదు. మొదటినుండియుఁ బ్రతిపదమునను సత్కవి కవితారచనం బోలె నేదో యొకవిధమునఁ బ్రకృతమును సూచించుచునే యున్నది. ఇంద్రునకు సంపుడుకత్తెయగుటచే నీపె నాకుఁ బరమపూజ్యురాలును దల్లివంటిదియును గావున నిందుల కంగీకరించుట యిహపరలోకదూష్యము. (ప్రకాశము)

చ. తెలిసె భవన్మనోరథము దేవవిలాసిని ! నీకు నేతయా
నలఘుఁడు నాకుఁ దండ్రియగునప్పుడు తల్లివినీవుకావె ? యి
ప్పలుకులువిన్న నెవ్వరును బాపమటంచును రోయ రొక్కొ ? నీ
తలఁ పసమంజసం బగుఁగదా ? పగదానవె లేకయుండినన్ ?

ఇదిగాక మావంశజుండగు పురూరవునకు నీవు కొంతకాలమ్ము భార్యవని విందు. దానంజేసి నాకుఁ బరమపూజ్యురాల వగు నవ్వవుకదా ! కావున నాయెడ నాగ్రహింపక యీతలఁపుడిగి నన్ననుగ్రహింపుము.

ఊర్వ— (తనలో) ఓహో ! మొదటనే యీతఁడిట్టి యభిప్రాయమును సూచించినాఁడు. నేనే పొరఁబడితిని. కానిమ్ము ఈయంశమున నుత్తరమే

చెప్పలేకపోదునా ? (ప్రకాశము) రసికవరా ! ఈమాత్రమెఱుఁగకయే నేను నిన్నుఁ గామించితి ననుకొంటివా ?

తే. గీ. భూమిలోకపు మాజాతి భామినులకె
వావివరుసలతో ననావశ్యకంబు
స్వర్గముననున్న మాకివి చాగుటెట్లు ?
పత్తెనే లేని కట్టెట్టు పట్టనముల ?

ఇదియట్లుంచుము. రణనిహతులకు స్వర్గంబు నియతమని నీవెఱుఁగనిది కాదుగదా !

మ. ధృతరాష్ట్రాత్మజు లొక్కనూర్గురు భవత్తేజోనలంబందు నా
హుతి గాఁబోదురు నేఁటరేపట, సమాయోగంబు మాతోడ నా
శితముల్ గాంచకయున్నె ? వారితనుజాల్ సంబంధ మా మీఁదటన్
బ్రతిషేధింతురె ? నేఁడె పుట్టినదొకో ? స్వర్గంబు రాజోత్తమా !

అర్జు— పితృ ప్రేయసీ ! నీవుపచించిన సమాధాన మియ్యెడల సరిపడదు.

క. దేహాంతరమ్మునం దీ
యూహలు జనియింపకుండు టొప్పును నొకఁడా
దేహమ్మున నీకృత్యం
బాహా ! యంగీకరించునా యెవఁడేనిన్ ?

ఊర్వ— (సంతోషముతో) త్రోవలోనికి వచ్చితివి.

తే. గీ. అన్నదమ్ములరగు మీకు నైదుగురికి
ద్రోవది యొకతెకాకద భార్య ? యీవివేక
మచట నేమాయె ? జ్యేష్ఠునిల్లాలు కాక
తండ్రి యుంపుడుకత్తెయే తల్లియగునె ?

"పితృసమో జ్యేష్ఠ" యనుట నీకు నేను జెప్పవలయునా ?

అర్జు— (తనలో) ఈప్రశ్నమునకుఁ దగిన సమాధానమే లేదు. అయిన నిట్లనుఁ గాక. (ప్రకాశము) అయ్యాది మాతృశాసనమ్మునను కృష్ణద్వైపాయనుని యనుమతమ్మునను బూర్వజన్మసంస్కారవిశేషవశమ్మునను శిష్టసమ్మతం బయ్యె, దాని నుదాహరణంబుగఁ గైకొని మనమేకాదిఁక నెవ్వరును బ్రవర్తింపరు. ప్రవర్తింపను గూడదు.

ఊర్వ— (సంతోషముతో) మరలఁ ద్రోవలోనికే వచ్చితివి. ఇయ్యాది పత్నీ శాసనము, నీతండ్రియాజ్ఞ లేనిచో నాకెంత యనురాగమున్నను నింత ధారాళముగ నేను రాఁగలుగుదునా ? ఇఁక నీ కేమిసందియము ?

అర్జు— (తనలో) ఎక్కడి కళ్ళడికి నేస్తో యొక దురుద్ధరమగు యుక్తి చెప్పు చున్నది. వేశ్యలనఁ జతురిమకుఁ బుట్టినిండ్లుకదా !

క. పరదేశము లరయుట ధీ
పరమైత్రియు రాజసభల వర్తించుట శా
స్త్రరసము లెఱుఁగుట వేశ్యా
పరిచితియును నైదుగల్గువాఁడు చతురుఁడౌ.

' అని చాతుర్య సంపాదన సామగ్రిలో వీరల పరిచయమునుగూడఁ బెద్దలు బరిగణించి యున్నారు. అందులో దేవవేశ్య ! ఈమె కెవ రుత్తరము చెప్పఁగలరు! ఎట్లేని యీవిషయమ్మునుండిమాత్రము తప్పించు కోవలెను. (ప్రకాశము)

ఆ. వె. తండ్రియాజ్ఞగనుక తప్పదు నీకంటి
వింద్రుఁ డిట్టియాజ్ఞ యిడెన యనుము
అమరవరులదైన యాచారమునుబట్టి
యేను మానవుండ నెట్లు నడతు ?

ఊర్వ— ఇంద్రనందనా ! నీవు మానవుఁడవని నీలో నీవనుకొనవలసినదేకాని యొరులు విశ్వసింపరు. మానవమాత్రుఁడవు కావనుటకుఁ బ్రమాణం బింద్ర నందనుఁడవగుట యొక్కటియే కాదు.

సీ. అంగారపర్ణుని నవలీలమై జయిం
పఁగ నేర్చుటెట్టులో ? మనుజుఁడొకఁడు
అమరేంద్రు నిర్జించి యగ్నిచే ఖాండవం
బేర్పింపనేర్చునే ? యితరుఁడేని
మాయాకిరాతు నుమానాథు నిర్జింపఁ
దరమెట్టులగు ? నొక్క నరవరునకు
మేనితో స్వర్గంబు రానేర్చునే ? యిట్టి
ఘనతపశ్శాలియౌ మనుజుఁడేని
ఇంక నెన్నేనియును గలవీవు నరుఁడ
వించుకయుఁ గావనుచుఁదెల్ప హేతువులు న
రుండనెడిపేరు నీకు నొక్కండు మాత్ర
మున్నదది నేతిబీరకాయన్న పగిది.

లేదా, అయ్యది నీవు పూర్వజన్మంబున నరనారాయణులలో నరుండ వగుటఁజేసి కలిగిన పేరు కావచ్చును. ఆ నరనారాయణులు దేవతల కన్నఁగడు నధికులు. నన్ను, ఆ నారాయణమునియేకదా తన యూరువు నుండి సఖీసమేతముగ నిచ్ఛామాత్రమ్మున సృష్టించె. దానం జేసియే

యే నూర్వశి నైతి. ఆయాయీ హేతువుల నితరులలోనివాఁడవే యగుటచే స్వర్గలోకాచారములంబట్టి చరించుటకే యభ్యంతరమును నుండదు. కావున నొండువిచారంబుదక్కి నన్ను మన్నింపుము. మదనుండు కాలహరణమ్మొనకు నోర్చువాఁడు కాఁడని పరేంగితజ్ఞులకు వేఱ చెప్పవలయునా ?

అర్జు— (తనలో) ఓహో! తుదకు సుతిమించుచున్నది (యోజించి) కాని యీమెయే నాకొక యుక్తికిఁ దోవఁజూపినది. దానిచే నిరుత్తరయగుఁగాక (ప్రకాశము) జనకమనోహారిణీ!

మ. నరనారాయణు లన్నదమ్ము లెకదా! నారాయణోరూద్భవన్
దరుణిన్ నిన్నును గూఁతురం చెఱిఁగియున్ ధర్మంబు వోనాడి ముం
దరయన్ జాలక కైకొనన్ నగఁడె కంసారాతి నీతండ్రి? ము
ష్కరుఁ డీతండని గేలిసేయరె ప్రజల్? కామాంధతల్ కూడునే?

ఊర్వ— (నవ్వుచు) ఇందులకా నీవు జంకుచుంటివి? కృష్ణుఁడు తనచర్యలు నిర్దుష్టములై నప్పుడుకదా నిన్ను నవ్వవలయును. అతఁడు నాకుఁ దండ్రియే యైనను బ్రసంగవశమునఁ జెప్పవలసివచ్చినది.

తే. గీ. గొల్లయిల్లాండ్రకెల్లను గుత్తఁకాఁడు
దేవకీనందనుం డందు వావివరుస
లిట్లువెదకిన సరిపడు టెట్లు? లింత
యేల? రాధకు నతనికి నేమివావి?

అది యట్లుండనిమ్ము. అనేకములుగా వావులున్నప్పు డందులోఁ బ్రకృత మనుకూలించు వావిఁజూచుకోవలెను. ఒక తల్లివావిగాని చెల్లెలివావిగాని వచ్చినచోఁ బరిత్యజింతురుగాని మీ మానవులైన నిట్టియెడ నిషేధింపరు. ప్రకృతము నీవు చూపిన కూఁతువావి బొత్తిగాఁ దప్పులేదు "కూఁతువావి కూర్చవచ్చు" ననికదా? పెద్దలందురు. ఇవి యన్నియు నిట్లుంచుము.

మ. నరనారాయణు లన్నదమ్ము లెకదా! నారాయణుం డిందు ప్రసో
దరుఁడా టీవు నెఱింగినట్టిద మదిన్ దర్కింపు మేమూడు? వీ
వరుస న్మద్దుమఱంది నైతివిసుమీ! వావుల్ విచారింప కా
దరమున్ జూపుము కౌఁగిలింపుము మరున్ దండింపు మొండేటికిన్.

(అని బలాత్కారముఁగా కౌఁగిలింపఁబోవును)

అర్జు— (తొలఁగి కోపముతో)

ఆ. వె. ఈవు దేవవేశ్య వెంతయు జాణవు
నీకు నుత్తరంబు నేనుచెప్పఁ

జాలువాఁడనే ? విచారంబు దక్కుము
చనుము నిన్ను నేను సమ్మతింప.

ఊర్వ— (కోపముతోఁ దనలో) అక్కటా ! యీతండు వృథాగా నన్నవమానించినాఁడే !

ఉ. తానయి కోరుటన్నఁగడు దప్పిదమౌఁగద ! వారకాంత కెం
దేనియు నద్దియుంగ్ గలిగనేని "సెబా" సనిపించుకొన్న మే
లౌనది యట్లుగాక యిటులైనను వేడ్కఁ జెప్పనున్నదే ?
లేనిది లేకయుండ సరిలేవలు నప్పటియుంగ్ దటస్థపడె.

ఇంతయవమానము నేనెట్లు సైరింతును ? (ప్రకాశము కోపముతో)
ఏమి, నన్నవమానించెదవుగా ? ఇదిగో దీనికింపగిన శాప మనుభవింపుము.

తే. గీ. ఏను నిజముగ నిను వరియింతు నేని
ఇదియు శాస్త్రవిరుద్ధమై పాడలదేని
సురపతియు నిట సమ్మతిచూపెనేని;
శాపమిది కైకొనుము నపుంసకుఁడవగుము.
(దిగ్గున లేచిపోవును)

అర్జు— (తనలో)

ఆ. వె. శాప మిచ్చుఁగాక చనుఁగాక యింద్రుని
తోడఁ జెప్పుఁగాక తోయజాక్షి
యతఁడు నన్ను శిక్షయైనఁజేయునుగాక
యిట్టి కానివలపు లెట్లు తగును ?

(అంత నింద్రుఁడు ప్రవేశించును.)

ఇంద్రు— (కౌఁగిలించికొని) తండ్రీ ! నీ యింద్రియజయమ్మునకు మెచ్చితిని. ఊర్వశి యొసఁగిన శాపంబు నీకు నజ్ఞాతవాసమ్మున నొకవత్సరం బుపకారమై పరిణమించుఁగాక.

అర్జు— (ఆశ్చర్యముతో) తండ్రీ ! నీకీసంగతి యప్పుడే యెట్లు తెలిసినది ?

ఇంద్రు— నేనియ్యెడనే గూఢముగానుండి మీ యిరువుర సంభాషణమ్ములను వినుచున్నవాఁడ. నీయంతవానిని నేను మునులయందేని జూడలేదు. నీ యట్టి జితేంద్రియునకు సాధింపరాని పని యుండదు. కావున,

క. ఘోరుల నివాతకవచుల
దారుణసంగ్రామమున విదారింపుము నీ
కారణమున దేవతలకు
భూరిసుఖమ్ములు లభించు పుత్రక! యింకన్

అదె ప్రభాతంబగుచున్నది. ప్రాగ్దిశాంగనాముఖసరోజాగ్నిశిఖా విశేషకంబుపగిది భాస్కరుఁ డుదయించుచున్నాఁడు. మన మయ్యెడ సురనదికిం జని యయ్యెడఁ గృతస్నానులము కావలయు. పదఁపడి నీకు మఱికొన్ని యస్త్రమ్ము లుపదేశింప నవసరమై యున్నది.

అర్జు— (వినయముగా)

తే. గీ. తండ్రి! నీయాజ్ఞ కన్యథాదలఁచు నన్ను
నించుక క్షమించి దయ సెలవిచ్చి పంపు
మన్న నా రాకఁ గోరుచు ననుపదంబు
చింతఁగొనుచుండు నేనటఁ జేరవలయు.

ఇంద్రు— (ధ్యానించుట నటించి) తండ్రీ!

క. నీయన్నయు నీతమ్ములుఁ
దోయజపత్రాక్షి ద్రుపదదుహితయు మీకున్
శ్రేయస్కరుండు ధౌమ్యుఁడు
నీయెల్లరు గుశలులింత యెఱుఁగఁగనయ్యెన్.

మఱియు నీ దివ్యాస్త్రలాభంబు వ్యాసునివలన విని ధృతరాష్ట్రాదులు మిక్కిలిగ ననూయాగ్రస్తులై వందురుచున్నవారు. నేఁట రేపట నీనేమంబు లోమశునివలనంబున నీయన్నకడ కంపుదు. అమ్మహాముని ప్రేరణమ్మున నీయన్న శ్రేయస్కారియై తీర్థయాత్రం బొనరించి పదంపడి గంధమాదనంబున సతియును దానును దమ్ములును నీరాకకై లోమశు నాదేశమ్మున వేచియుందురు. అయ్యెడ నీవు వారలఁ గలసికొందువు గాక. ఇప్పటికీ యుద్యమం బుడుగుము. నావెంట రమ్ము.

(నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వర విరచితంబగు
పాండవ ప్రవాసమ్మునం బంచమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## షష్ఠాంకము.

(అంత ధౌమ్యులు ప్రవేశింతురు)

ధౌమ్య— (తనలో) వేఁటకుఁ బోవుచుఁ బాండవులు నన్ను ద్రుపదపుత్రింగాపాడుటకై నియోగించిరి. అత్యావశ్యక మగుటచే దేవార్చనకై కుసుమంబులు తెచ్చుకొన నింతదవ్వు వచ్చితిని. వచ్చి యప్పుడే చాల సేపైనది. ఇఁక నిటఁ దడయఁదగదు. తఱచుగా దుష్టులు సంచరించుచుండు నియ్యడవిలో స్త్రీల నొంటిగా డించుట భావ్యముగాదు. కావున నుటజమునకే పోవుదును. (పరిక్రమించి చూచి) అదిగో! పాంచాలి లోన నెవరికో యాతిథ్య మొసఁగుచున్నది. ఇతఁ డెవఁడో రాజన్యుఁడుగాఁ దోఁచుచున్నాఁడు.

(పాఱఁజూచి) వీఁడా? వీఁడు పరమదుర్మార్గుఁడగు దుర్యోధనుని బావ. దౌర్మార్గ్యమున వానికన్న నేడాకు లెక్కువ చదివినవాఁడు. వీఁ డియ్యెడకు రాఁ గతమేమో? వీనివలన నేదేని యుపద్రవము రాదుగదా? అట్లయిన శుద్ధ శ్రోత్రియుఁడను; అసమర్థుఁడను నేనేమి చేయఁ గలను? కావునఁ ద్వరగాఁ జని పాండవుల వెదకి తీసికొని వచ్చెదను. వారును నీవఱకు వచ్చుచునేయుందురు.

(నిష్క్రమించును)

(ఇది విష్కంభము)

(అంత ద్రౌపదియు సైంధవుఁడును యథోక్తముగాఁ బ్రవేశింతురు)

ద్రౌప— అన్నా! అదిగో! పాద్యము. కాళ్ళు గడిగికొని యా కృష్ణాజినంబునఁ గూర్చుండుము.

సైంధ— (కూర్చుండి) అక్కటా! యింత సుందరిని నే నెందును జూడలేదు.

క. కొమరులఁ గనినను నీసతి
కొమ రించుకయేని జనక కొండొక హెచ్చై
సుమబాణు బాణమో? లే
కమరాధిపు వజ్రమో? యహో మోహినియో!

ద్రౌప— అన్నా! పూజ్యులగు గాంధారీ ధృతరాష్ట్రులకుఁ గుశలమకద? నీ వెందుండి యెట కరుగుచుంటివి?

ంధ— (విలాసముతో) ఆఁ! అందఱును గుశలముగా నున్నారు. నేను సాల్వకన్యం బెండ్లియాడుటకై పోవుచుంటిని గాని,

ఉ. నీరజపత్రనేత్ర! విను, నిన్ గనుఁగొన్నది యాదిగా మనో
ధీరత బొత్తుగాఁ జెడియెఁ దెంపున నే నిఁక సాల్వకన్యకై
యేరహిఁ బోవనేర్తుఁ? జననీయవు నీదగు తళ్కు బెళ్కు లం
భోరుహముం ద్యజించి యెటు పోఁగలుగున్ భ్రమరంబు కోమలీ?

నిన్ను సౌదవ్వులన కాంచి నా పడినపాట్లు వినినచో నీవు కరుణింపక పోవని నా నమ్మకము.

చ. నినుఁ గనుగొంటి నెమ్మనము నీఱయి పోయెను నానవాలు ప
ట్టనెఱుఁగనైతి వెంటనె తటాలున నా చెలిఁ గోటికాస్యునిన్
బనిచితిఁ జూచితేగద! యబద్ధ మొకింతయులేదు నమ్ము మా
తనివలనన్ సమస్తమును దన్వి యెఱింగితి ధైర్య మందితిన్.

తే. గీ. జూదమున నాలిఁ గోల్పోయి సొబగుదక్కి
యడవులందున్న నిర్భాగ్యులైన పాండ
వుల తలోదరియే కదా? వలచి నేను
రమ్మనిన రాదె? యను నమ్మకమ్ముగలిగె.

అక్కటా! నీవంటి కులుకులాఁడికి భగవంతుఁడు — కాదు కాదు, దుర్ణయులగు పాండవు లెన్నిపాట్లు దెచ్చిపెట్టిరి?

ఉ. నీపతికన్ననున్ గలఁడె నీచుఁడు? ప్రప్రథమంబు జూదమం
దాపదగాంచియున్ మరల నాడుట కేమనిసమ్మతించె? నీ
కై పలుపాటులన్ బడి నయమ్మున మామకుఁ జెప్పి నేన చ
మ్మి, పరమార్థబుద్ధిమెయి నీయఁగఁజేసితి మున్ను రాజ్యమున్.

నీకై యిప్పుడు నేను బడిన పాటు లన్నియుం జెప్పనేల? ఎందులకేని నీసౌందర్యము ముఖ్యకారణము.

సీ. దుర్యోధనుని కేమి దుశ్శాసనునికేమి
ధార్తరాష్ట్రులకు నందఱకు నేమి
కర్ణుని కేమి యాగాంధారపతికేమి
నాకేమి నిక్కమ్ము నమ్ము మబల!
లేదు కోపమ్ము నీమీఁద లేశమ్మును;
నినుభార్యగాఁగొను మనమె కాని
కొప్పుపట్టుకొని నిన్ గొలువునకీడ్చుట
కోకలొల్చుట తోడఁగూరుచుండు
తే. గీ. మనుట యన్యుని వరియింపుమనుట మొదలు
సకలకృత్యమ్ములును సంజ్ఞలకట! యెఱుఁగ
నైతి వింతకు నరసికు లల్లవారు
నే నొనర్చితినే యిట్టి నీచకృతులు ?

తటస్థించిన రహస్యమ్మున నామనంబు నీకుఁ దెల్పిన నీవు సమ్మతింపక మానవని వేచుచుండ నేఁటికి భగవంతుండు మన కనుకూలుం డయ్యె నిఁకఁ దడయకుము. లెమ్ము. అదియె నా సేన, పోయి నీవు రథమ్ము నెక్కుము. నేను నీ వెనువెంట వచ్చుచున్నాఁడను.

ద్రౌప— (తనలో) అక్కటా! దైవమా! యీ యడవింబడి యాకలములు తిని జీవించుటకును నీ వోర్వలేకపోతివా? ఈ దుర్మార్గు నిక్కడి కెట్లు తెచ్చితివి? (నలుదెసలు పరికించి) ఒకరుగాకున్న నొకరేని సమయమునకు రాకున్నారు. అయ్యో! ధౌమ్యు లెక్కడికేగిరో, యేమిగతి? హా! కృష్ణా! ఆపద్బాంధవా! నీవు మున్ను నా కొనర్చిన మేలు నేను మఱవలేదు. మరల నీ చెల్లెలిఁ గాపాడఁదగు సమయము వచ్చినది. వీనిని వధియింపుము! లేదా! సుబుద్ధి నేని బ్రసాదింపుము. (యోజించి) విధిగా వీని కీపాటికి మంచిబుద్ధి కలుగవచ్చును. భగవంతుఁడు తలఁచినచో నొకటి దుర్లభమా? (పెదవివిఱిచి) తక్కిన వేవియును దుర్లభములు కావు కాని దుష్టులకుమాత్రము మంచిబుద్ధిని భగవంతుఁడును గలుగఁజేయలేఁడు. అయినను నిట్లు చెప్పి చూతును. (ప్రకాశముగా) అన్నా! నీవు కౌరవ భగినియగు దుస్సలకు భర్తవుకాన నాకు సోదరుఁడవు. అట్టిచోఁ దగవు విడిచి నన్ను మోహింపఁ దగునా? నీవు సమస్త ధర్మమ్ము లెఱింగిన వాఁడవే. ఐనను బ్రమాదవశంబున నిట్టిపనికిఁ బూనితివి. దానికేమి? యెఱుఁగక చేసిన దోషమును భగవంతుఁడును లెక్కింపఁడు. ఇఁక నేని నాయెడ నొండు తలంపుడిగి వేఁటఁబోయిన నీ బావలు వచ్చుదనుక

నియ్యెడ నుండి వారు తెచ్చిన మృదుమధురమాంసమ్ములు సేనాసమేత మ్ముగ విందుగుడిచి వారు వీడ్కొలుప నరుగుదువుగాక.

సైంధ— (తనలో) పయికిట్లు చెప్పుచున్నను నీమెకు నాయం దనురాగము లేకపోలేదు. కానిచో విందుగుడిచిపొమ్మని యెందుల కనవలెను. ఇష్టమే లేనిచో నన్నుఁ బరుషభాషణమ్ముల నిందింపకుండునే? ఇఁక నీమె విధిగాఁ దక్కినదియే కాని యెందుకో జాలమొనరించుచున్నది ఇంతలోఁ బాండవులు వత్తురేమో? (ధైర్యముతో) వత్తురుగాక, చిరకాలమునుండి యన్నవస్త్రమ్ములు లేక యాకలములు దినుచున్నవారు నన్నేమి చేయఁ గలరు? నేను సైన్యసమేతుండ, వార లేకాకులు. అయినను నంతవఱకు రాకుండఁగనే యీమెం దీసికొని పోవుట కడు మంచిది. (ప్రకాశము) మోహనాంగీ! విందుగుడిచి పొమ్మనెదవా? ఇప్పటికి నేను ధన్యుండను. నాజన్మము సఫలము.

ఉ. విందవ నిష్టభోజనము వేయును నేటికిఁ? గాముకుండ నా
కెందుకు, మాంసముల్? ఫలము లెందుకు? నన్యము లో మృగాక్షి! యో
చందనగంధి! నీయధరసంపద నానఁగ నిచ్చుటేసుమీ?
విందగు; నీమనంబు నరవిందముఖీ! కనుఁగొంటిఁ జూచితే?

తే. గీ. అడవులంబడు ననదల నాశ్రయించు
కతన నీకిట్టి యిక్కట్టు గలిగె నబల!
అక్కటా! చిక్కిపోయితి వతివమిన్న!
యిప్పుడేనియు నీసాగ సేరికబ్బు?

ఇంక మాటాడకుము. లెమ్ము రథ మెక్కుము. (కేలు పట్టుకొనఁబోవును)

ద్రౌప— (తొలఁగి తనలో) అక్కటా! యిఁక వీనికి వివేకము గలుగదు. (దెసలు పరికించి) పార్థులు వచ్చుచున్నట్లులేదు. ఇందేమిగతి? శ్రీకృష్ణుఁడు నన్నుఁజూచియైన నీదుర్మార్గునికి సుబుద్ధి గలిగింపఁడయ్యె. (యోజించి) వీనికి వినాశకాలము దాపయి యుండఁ గృష్ణుఁడు మంచి బుద్ధి నిచ్చుటయెట్లు? వీని వలన నా కవమాన మెట్లును దప్పదు. కావున్నుమ; (ప్రకాశము కోపముతో) ఓరీ! దుష్టా! 'అన్నా'! యని నిన్నుఁ బిల్చుచున్న నన్నిట్టి బెట్టిదంపుమున్నటికపుఁ బలుకులచే నొప్పింప నీ నాలుక యెట్టులాడెరా! దురాత్మా! ఇఁక నేని బుద్ధి తెచ్చు కొనుము. వృథాగాఁ బాండవుల కోపానలమ్మునకు మిడుతవు కాకుము పొమ్ము.

సైంధ — (తనలో) ఓహో! యింకను నీపై మనము గరఁగినట్లు లేదే! (యోజించి) అవును. స్త్రీలు వక్రస్వభావలు గదా! లోనొకటి యుంచుకొని పైకొకరీతి మాటలాడుదురు. (ప్రకాశము) జగన్మోహినీ! విందు గుడిచి పొమ్మని, యిప్పు డూరక పొమ్మనుట న్యాయమా? నీ 'వన్న' యని పిల్చితి నంటివిగదా! ఆశబ్దమున కర్థము "ఓయీ!" యనుట సుమీ! నీయంతన నీవుపత్తువని యింతసే పూరకొంటి, నింక నిన్ను బలాత్కారముగనైనఁ గొంపోక మానను. తరువాత నీయిష్టము.

ద్రౌప — (మండిపడి) కొంపోయెదవుగా? తులువా! బలాత్కృతిగా నన్నును ధర్మజాదులతోఁ గొంపోయిన జటాసురునిగతి వాయునందనుచే నేమయ్యెనో, అదియె నీకును మూఁడును. వృథాగా నెందుకుఁ జచ్చెదవు? నామాట వినుము. ఒకరు తూర్పు నొకరు దక్షిణము నొకరు పడమట నిరువు రుత్తరమునకును వేఁటకుఁబోయిరి. నీవు నన్నుఁదీసికొని యేదిక్కున కరిగినను నీకుఁజావు నిశ్చయము. నామాట విని బుద్ధిగలుగుము. ఓకీ! నీకుఁ దోడఁబుట్టువులు లేరా?

సైంధ — (తనలో) నీతో వచ్చుట నాకిష్టమేకాని పతులవలన జంకెదననిసూచించుచున్నది. ఈభయము తీర్చెదంగాక. (ప్రకాశము)

ఉ. నీపతు లెంత? నాకుఁ, గడునీచులు జూదపుఁ గొల్వునాఁడు నీ
యాపదఁ జూచి యూరకొనినట్టిరెకా? తరలాక్షి! వారిప్ర
జ్ఞాపటిమంబు నేనెఱుఁగనా? యిటు లూరకయంటి గాని యో
కోపన! నీమనమ్మెఱుఁగుకై, నిజముం గ్రహియింప నేరనే?

జాగుచేయకుము. త్వరపడుము. అల్లదె భద్రగజము, దాని నొండె లేక రథమ్మునొండె నధిరోహింపుము.

ద్రౌప — ఓరీ! పాపాత్మా? నీతరమును నెదిరితరమును నెఱుఁగక వృథాగర్వాలాపము లేల యాడెదవు? మొన్న మొన్ననేకదా! నిన్నును నీరాజును దమ్ములను గంధర్వులు కట్టి కొంపోవుచుండఁ బార్థులు విడిపించిరి. ఇంతలోఁ బాండవులకన్న నీకెక్కుడుబల మెక్కడనుండి వచ్చినదిరా? దురాత్మా! బుద్ధిగలిగి మసలుకొనుము.

సైంధ — (తనలో) ఇఁక నీయతివ తనంతఁ దానై వచ్చునట్లు తోఁచదు కావున బలాత్కారంబ యిటఁ గర్తవ్యము. (ప్రకాశము) ఇదిగో నిన్ను బలాత్కృతిగాఁ దీసికొని పోవుచున్నాను. (పట్టికొని యెత్తుకోఁబోవును)

ద్రౌప — (వానిని వెనుకకుఁబడునట్లుగాఁ ద్రోసివేసి) ఓకీ! దుర్గంధ సైంధవ! నీకుఁ జేటుకాలము దాపైనది. అవశ్యమును బాండవుల చేతిలో మరణము

వ్రాసియున్నది. సీత నపహరించిన రావణునిగతి యేమైనదిరా? దురాత్మా! (నలుదెసలు పరికించి తనలో) అక్కటా! యిప్పటికేని యొక్కరును రారే! పోనిమ్ము; ధౌమ్యులుగూడ సమయమునకు లేక పోయిరే! (అంత ధౌమ్యులు ప్రవేశించును)

ధౌమ్య— అక్కటా! యెంత వెదకినను నేగురలో నొకరేని గన్పట్టరైరి. ఇక్కడ పాంచాలిగతి యెట్లులున్నదో! (పరికించును)

సైంధ— నన్ను వెనుకకుఁ బడఁద్రోసెదవుగా! (నవ్వి) ఇందుఁ దప్పేమున్నది? ప్రియురాండ్రు తమ ప్రియులయెడ నిట్లు జరుపుట కామశాస్త్ర ప్రసిద్ధ మేకదా! ఈసారి తప్పక నిన్ను రథమెక్కించెదను, చూడుము. (బలాత్కారముగా నెత్తికొనిపోవును)

ద్రౌప— ఓరీ! దుష్టాత్మా! దుర్మతీ! (అని తిట్టును)

ధౌమ్య— (ఆత్రముతో) ఓరీదురాత్మా! నీకు వినాశకాలము తటస్థించినదిరా? "వినాశకాలే విపరీతబుద్ధిః" అన్నట్లు నీకిట్టిదురూహ జనించినదిరా? (ఎలుగెత్తి) ఓహో! ఖండితారాతి మండలురగు పాండవులారా!

క. సైంధవహతకుఁడు కడు దు
ర్గంధుండు మదాంధుఁ డగుచు ద్రౌపది నిదె ని
ర్బంధించి బలాత్కృతిమై
బంధురగతిఁ బోయెడిఁ బ్రదారహితుండై.

నేను వానువెంటఁ బోవుచున్నాఁడ. మీరు త్వరలో రండు విడిపింపుఁడు. (మూఁడుసార్లు కేకలువైచి నిష్క్రమించును.)

(అంతఁ బాండవులు ప్రవేశింతురు.)

ధర్మ— (తనలో) ఏమో? కారణము తెలియరాకున్నయది గాని యెడమ కన్నదరు చున్నది. (విని ప్రకాశము) తమ్ముఁడా! ఉటజమ్మున నేదియో రోదనధ్వని వినవచ్చుచున్నది.

భీమ— అవును, ధాత్రిక కంఠధ్వని వలె నున్నయది.

(అంత యథోక్తముగా ధాత్రిక ప్రవేశించును.)

ధాత్రి— (రోదనముతో) ఏమి చెప్పుదును? సైంధవహతకుఁడు ద్రౌపదిని బలాత్కరించి తన రథమ్మునఁ బెట్టుకొని యల్లదె కొంపోవుచున్నాఁడు. ధౌమ్యులు వెనువెంట వానిని శపించుచుఁ బోవుచున్నారు.

భీమ— (కోపముతో) ఏడనఁ బోవుచున్నాఁడు? ఏఁడీ! (ధర్మజుఁడక్కు-)

అన్నా! చూచితివా? నీవలన నెంతటి కెన్నిపాట్లు మూఁడుచున్నవో.

సీ. ఘోషయాత్రను జచ్చు కుటిలాత్ములను నీవ
విడిపించితివి మమ్ము వెనుక కంపి
జూదంబునాఁడె చచ్చుదురాత్ములను నీవ
బ్రదికించితివి మమ్ము మెదలనీక
యుద్ధమో యని యేడ్చు నువిదమాత్రంబేని
పౌరుషం బొక్కింత నేరనైతి
వేనాఁటికానాఁడె యీరీతి దిగఁదీసి
యనుజులబలము నట్టడవిఁగల్పి

తే. గీ. తకట! నిన్నేమనంగల, దతివ కెంత
యెగ్గుచేయించిరో చూచితే? సుయోధ
నాదు, లీఁకనైన నీయుపన్యాసములనుఁ
గట్టిపెట్టుము మము దయఁగావు మధిప!

అర్జు— అన్నా! ఇప్పు డీప్రసంగమున కవకాశములేదు. కావున శీఘ్రముగాఁ బోయి యా సైంధవు నుక్కడంచి పాంచాలినివిడిపించి పదంపడి చూచుకొందము. (చూచి) అదిగో వానిరథము పోయినపలను, ఇటు పోవుదము. (పరిక్రమించి) అదిగోఁబన్నిద్దఱు సౌవీరకుమారులును దక్కటి సైన్యములును వెంట రా సైంధవుం డరుగుచున్నాఁడు. రయమ్మునఁ బోయి కలసికొందము.

(పాండవులు నిష్క్రమింతురు.)

ధాత్రి— (చూచి సంతోషముతో) అమ్మయ్యా! యిక్కడికి బ్రతికితిని. సౌవీర కుమారుల నర్జునుఁడెప్పుడు చంపెనో తత్ క్షణమే సైంధవుఁడు రథము నుండి యుతికి యిల్లె పరుగు పరుగున వచ్చుచున్నాఁడు. ద్రోవది ధౌమ్యులున్నయెడకు వచ్చి నిల్చినది. (కోపముతో) ఓసీ! దురాత్మ! ఎక్కడికిఁ బోయెదవురా? చచ్చితివిలే, (భయముతో) అయ్యో! నేను జెప్పితినను కోపముచేఁ గాఁబోలును నావంకకే వచ్చుచున్నాఁడు. (చూచి) లేదు. అక్కడ నేదోయొక పొదరింట దాఁగుచున్నాఁడు దురాత్మా! వారి కాననాలు చూపి నిన్నుఁ జంపించెదనులే. (పరికించి) పాండవు లెల్లరును వీనిని వెదకుచు నిచటికే వచ్చుచున్నారు. (అంత భీముఁడు దప్ప నందఱును ప్రవేశింతురు)

ధర్మ— (బిగ్గరగా) తమ్ముఁడా! పాఱిపోవు సైన్యమ్ములనెందుకుఁ దఱిమెదవు? సైంధవుని వెదకి పట్టుకొని నాయొద్దకుఁ దీసికొనిరమ్ము.

ద్రౌప— (కోపముతో) మరల నాదురాత్ముఁ డిక్కడికి కెందులకుఁ దీసికొని రావ లయును. అక్కడనే చంపి రాఁగూడదా!

భీమ— (కోపముతోఁ బ్రవేశించి)

ఉ. సోదరియంచుఁ జూడక పశుస్థితి నిట్లు బలాత్కృతిన్ దివిలో
కాదరణీయపుణ్యచరితాస్పద కగ్గొనరించు దుర్మదున్
మోఁది వధించి రమ్మనక ముందటి కేటికిఁ దెమ్మటంటి? వా
పై దయ నిచ్చి పంపెదవొ? బావకుఁ బూజ్యుఁడటంచుఁ గానుకల్.

అర్జు— అన్నా!

ఉ. పాటినవానిఁ జంపెదరె పాండుతనూభవు లెన్నఁడేని నీ
వూరక యంటికాని యిది యొప్పిదమే? రణధర్మమౌనె? యా
కౌరవసోదరిన్ దలఁచి కారుణికత్వము దాల్పఁబోలు స
త్కారమొ లేక యొండొకవికారమొ చేయుద మింత యేటికిన్.

ద్రౌప— (కోపముతో) ఇక్కడికిట్లయిన నేమి యెట్టకేలకు వనవాసము సమాప్తి కావచ్చినది. పదంపడి యజ్ఞాతవాసముగూడ నిట్లనే తుద నెగ్గవచ్చును. అప్పుడేని వారలు మీకు రాజ్యము నీయ రనుట ధ్రువము. అయ్యెడ యుద్ధము తప్పదు గదా! అప్పు డవ్వారిని నివ్వారిని దలఁచి నచో జయము కలుగుట యెట్లు? రాజ్యము చేకూరుట యెట్లు?

ధర్మ— ఇప్పుడీ యనవసరప్రసంగ మెందులకు? ఆదుర్మార్గుఁ డెక్కడికేని దొలఁగి చనకుండఁ ద్వరలోఁ బోయి వానికి పట్టితీసికొనిరండు శిక్షింతము. దుస్సలయొక్కయు గాంధారీధృతరాష్ట్రులయొక్కయుఁ బ్రియమ్మునకై వానిని జంపుట మాత్రము నాయభిమతము కాదు.

భీమార్జునులు— (వెదుకుటకై పోవుచుండఁగా)

ధాత్రి— ఆర్యా! అడుగో, దట్టమ్మగ నల్లికొన్న యాపొదరింట దాఁగినాఁడు. ఇందాఁక నేను జూచితిని (అంత యుద్ధోక్తముగా సైంధవుఁడు ప్రవేశించును.)

ద్రౌప— చూచితిరా? ఈ దురాత్ముఁడు మరల నేఁడేని యెడరు వేచి నన్నున్ గొనిపోవ నెంచి మన యాశ్రమసమీపముననే వచ్చి దాఁగినాఁడు. లేనిచోఁ బాఱిపోవువాఁ డిక్కడికే యేల రావలెను?

ధౌమ్య— (నవ్వి)

క. ఒడలెఱుఁగనిభయమున నిటు
తడఁబడి యరుదేరఁబోలుఁ దరుణీ! యితఁడి

ప్పుడు దినినదెబ్బలను మఱి
చెడినే ? యిఁక నిట్టిపనికిఁ జిత్తంబిడునే ?

ధర్మ— గురువరా ! చక్కఁగా సెలవిచ్చితిరి.

భీమార్జునులు— (వెదకుట నభినయింతురు)

సైంధ— (తనలో) ఔరా ! నేను వీరి యాశ్రమముననే వచ్చి వంటయింటి కుందేలనైతినే ! ఇఁక నేమిగతి ? అన్నా ! యీగర్భదాసి నాకొంప తీసినది. ఇప్పుడేని దీని కేదేని యిచ్చెదనని సైగచేయుదునా ? మఱి యొకదిక్కునకుఁ గొనిపోవును. (చేతి మురుగును జూపును)

ధాత్రి— (బిగ్గఱగా) అదుగో ! అదుగో ! అక్కడనే ! అక్కడనే !

భీమార్జు— ఏఁడీ ? ఏఁడీ ? ఎక్కడ ? ఎక్కడ ? (పరిక్రమింతురు)

సైంధ— అక్కటా ! యీ తెలివితక్కువముండ చక్కఁగ గ్రహింపక పైపెచ్చు మఱింత గుట్టు బైటఁబెట్టినదే ? ఇఁక నిక్కడనుండిన లాభములేదు. (లేచి పరుగిడును)

భీము— ఓరీ ! పాఱఁబోతా ! నిలువుము. (పట్టుకొనియీడ్చి తన్నఁబోవుట నటించును)

సైంధ— (తిరుగఁబడఁబోవును)

భీము— (ధర్మజునొద్ద కీడ్చుకొని వచ్చి మరలఁ దన్నఁబోవును)

ధర్మ— తమ్ముఁడా! అంతతోఁ జాలింపుము. వీఁడు చచ్చిపోవుచున్నట్లున్నది. (సైంధవుదిక్కయి) ఓరీ ! మాతృద్రోహీ ?

తే. గీ. శకునిసోదరిఁ బెండ్లాడుటొకటి పట్టి
వెకలులఁ దనూజులన్ గాంచు టొకటికాక
కూఁతు నీ కిడుటయుఁగూడఁ గురునరేంద్రు
నన్వయము మాపుటకె హేతువయ్యెనొక్కొ ?

(భీమునిదిక్కయి) తమ్ముఁడా ! యిద్దురాత్ముని కేమిశిక్ష విధింపుమందువు ?

భీము— ఇయ్యది పాంచాలి చెప్పవలసినదిగదా.

అర్జు— ఆమె చెప్పుటయు నందుల కుత్తరము చెప్పుటయు నిదివఱకే యైనది.

నకు— ఇప్పట్లఁ బాంచాలి చెప్పిన చొప్పంతరమణీయముగలేదు. ఏమంటిరా ?

తే. గీ. మరణ మెప్పుడో యొక్క [illegible]
కల్లనున్న [illegible]
శిక్షగాఁ జూడఁ దగు దిట్టి చెనఁటి కేది
యేని మతియొక్క శిక్ష యూహింపవలయు.

సైంధ— (తనలో) ఇతఁ డిప్పట్ల నాకుఁ బరమోపకార మొనర్చినాఁడు. కానిమ్ము, బ్రతికియున్నచో పిమ్మట వీర లిప్పుడొనర్చెడి యవమానమును దీర్చుకొనలేక పోవుదునా? ఘోరమ్ముగ తప మొనర్చి పురహరు మెప్పించి యుద్ధురాత్ముల నడఁచెదఁగాక.

సహ— అన్నలారా! నాకుఁ దోఁచిన తెఱంగు చెప్పుచున్నాఁడ.

చ. తెగ [illegible] కత్తి [illegible] నె త్తిని చెక్కులూడిన
ట్లుగ నొకకొంత చెక్కియుఁ గడుఙ్ బరిహాసము గాఁగ సైదుజా
ట్లొగి నొనరించి చెప్పఁదగు నొప్పగుబుద్ధులు సెప్పి పొమ్మనం
దగుఁ జెయిఁజిక్కు శత్రుఁడు వధంబున కర్హుఁడు కాఁడు గావునన్.

ధర్మ— నీవు చిన్నవయ్యును నీయూహ కడు శ్లాఘ్యముగా నున్నది.

భీము— ఇఁక నొకటిగూడ నిందులోఁ జేర్పవలెను. (సైంధవు నుద్దేశించి) ఓరీ! కౌరవభావుక.

క. ఎవరేని నిన్నుఁగని "నీ
వెవఁడవురా" యనిన వారికేమందువు? "పాం
డవదాసుఁడ" నని చెప్పుము
తవులను మిఁక నెన్నఁడిట్టి తప్పుపనులకున్.

ఏమిరా! వెకలీ! యిట్లు చెప్పఁగో నెదవా?

సైంధ— (తనలో) ఇప్పు డిందుల కొప్పనేని యితండు నన్నుఁ జంపు. ఏమి గతి? (ప్రకాశముగ) చెప్పకొనెదను.

సహ— ఏమని?

సైంధ— పాండవదాసుఁడ నని.

నకు— ముమ్మాటికి?

సైంధ— పాండవదాసుఁడను (అని మూఁడుసార్లు చెప్పును)

భీము— ద్రుపదపుత్త్రీ! ఇఁక వీనికిఁ బంచశిఖలుంచి క్రొత్తపడక పెండ్లికొడుకుం జేసి పొమ్మందునా?

ద్రౌప— పాండవదాసుఁడు గనుక నరితలో విడువవచ్చును.

భీము— ([illegible])

ధర్మ— ఓయీ! సింధురాజా!

చ. చపలులు లేరె? యెందుఁ జెలిచానలి కావలెనే? స్వకాంత లే
ల పనికిరావు? కా యను; [illegible] లేరె? [illegible] నృపా
లపశువు లంగనాజనములన్ గికిరింతు రటంచుఁ గాదె? బు
ద్ధపశుసమానజాతి నొకదానిని దీవరు లొప్పి రో జడా!

ఇది యిట్లుంచుము.

క. చాపల్య మెంతఁ గల్గినఁ,
బాపమునకు వెఱపకున్నఁ బరభార్యయ కా
దీపడఁతి తోడఁబుట్టువు
ఛీ! పాపీ! తొలఁగిపొమ్ము చెడుగా! తులువా!

(సైంధవుఁడు నిష్క్రమించును.)

ధర్మ— (ధౌమ్యునితో)

ఉ. పాపమటన్న భీతిపడువారలు నాయనుజన్ము లక్కటా!
యీపెను జెప్పనేల; యిటులేటికి వీరికిఁ గష్టముల్? మహా
పాపిసుయోధనుం డతనిపక్షము సర్వము నట్టిదే సుఖా
శాపరిపూర్తిఁ వారల కెసంగుట కేమినిమిత్తమో కదా?

ధౌమ్య— (ఆలోచించుట నటించును)

భీము— ఇందుల కుత్తరము విశేషించి యోజింపనక్కఱలేదు.

క. కడు దుర్మదులగు శత్రుల
యెడ దయఁ గల్గుటయు దాని కీ మేమును దో
డ్పడుటయె హేతువు లలనాఁ
డడఁగరె? కౌరవులు షడఁతి నటు చేయునెడన్.

ద్రౌప— ఇప్పుడీసైంధవునెడ జరిపిన శాస్తియేని వారలకు నపుడు జరిగినచో మనకు వనవాస మెందుకు? ఈపాటు లెందుకు?

అర్జు— అవును ప్రమాదమే జరిగినది. అప్పటి మన యోరిమియే మనకింత తెచ్చినది. (కోపముతో)

ఉ. పలువురు గల్గు నాసభ నపాత్రుఁడు రాధసుతుండు సాధ్విఁ బుం
శ్చలి యని ప్రేలినప్పుడె రసజ్ఞను సైంధవునెత్తి [illegible]
జెలిపినఁ గౌరవుల్ జడిసి చేతులవెత్తి నమస్కరింపరే:?
కొలఁదికి దాఁటె గోటిఁ [illegible] గొడ్డలిదన్క [illegible].

ధౌమ్య— అర్జునా ! వానికిందగు ప్రాయశ్చిత్తము నీతండ్రి యమరేంద్రుండు సహజకవచకుండలమ్ముల నపహరించి యొనరించెనుగదా ! ఇఁక వాని త్రుళ్ళణఁగినది. కౌరవేంద్రునకు వానిసహాయ మంతలాభకారి కానేరదు.

నకు— అన్నా ! మనమిది యోరిమి యనుకొనుచున్నారము గాని వార లట్లను కొనరుసుమీ !

సహ— అసమర్థతగాఁదలఁచుచున్నారు. అట్లనుకొనుట వారిది తప్పా ?

క. కపటద్యూతమునందుఁ
నృపతి నమాయకుని గెల్చె నేదుర్మతి యా
చపలుఁ శకునిఁ నాఁడె కె
డపినఁ మనకేల ? యీయడవులంచుండఁ.

ధర్మ— అన్నలారా ! ఎందుల కీగతజలసేతుబంధనము ? (ధౌమ్యులదిక్కు) గురువరా ! మన వనవాసవత్సరము లిఁక నెన్ని మిగిలియున్నవి ?

ధౌమ్య— (లెక్కించి) పండ్రెండవ వత్సరము జరుగుచున్నది. ఇఁక స్వల్పము మాత్రమే శేషమున్నది.

భీమ— ఎందుల కీలెక్కలు ? అధర్మవర్తనులయెడ ధర్మం బెందుల కుపచరింప వలెను. వనవాసమునకేమి? ఎట్లో నెఱవేర్చితిమి. అజ్ఞాతవాసము నేయుట మనబోంట్లకు శక్యమా ?

ఉ. డాఁగెద వెట్టు ? లీవు; నను డాఁచెద వెట్లు ? ధనంజయుండు డా
డాఁగెడు నట్టివాఁడె ? యకటా ! కవ లేక్రియ డాఁగువారలో?
యీగజరాజయాన నెటు లెయ్యెడ దాఁతుము సెప్పుమా ? వృథా
గాఁ గడపంగనేల ? చని కౌరవులన్ వధియింత మగ్రజా!

ధర్మ— తమ్ముఁడా ! ఆనాఁడు శ్రీకృష్ణుండు సత్యాసమేతుండై వచ్చి మన కేమి చెప్పెను ?

ద్రౌప— ఏమిచెప్పెను ? యాదవవృష్ణిభోజాదిరాజులెల్లరు మీయంద పక్షము గల్గియున్నారు గావున మీరు యుద్ధసన్నద్ధులు కావచ్చునని చెప్పెను.

ధర్మ— ఇంక నేమియుఁ జెప్పనేలేదా ?

అర్జు— చెప్పకేమి ? నీవు తలఁచినచో దుష్కరమేమియును లేదనికూడ నొక్కి చెప్పెను.

ధర్మ— పిదప నేను "అజ్ఞాతవాసానంతరమునం గాని యుద్ధము సమంజసముగా" దనిన నొప్పికొనియెనా ? లేదా ?

సహ— ఆసంగతి మేము వినలేదు.

ధర్మ— పాంచాలీ! కృష్ణుఁడు నీకొమరులందఱును విద్యాబుద్ధులు గలిగి సేమముగా నున్నారని చెప్పి పదంపడి యేమనియెను?

ద్రౌప— అనుటకేమున్నది? "మీకచిరమ్ముననె శుభకాలము రానైయున్నది" యనెను.

ధర్మ— అతనికిఁగూడ నిదియే సమ్మతము. కానిచో రానైయున్నదని యేల యనును? అజ్ఞాతవాస మెట్లొనరింప నేర్తు మని మీరు వెఱవవలదు. అందులకును ధర్మవర్తనమే సహాయము కాఁగలదు.

(తెరలో)

చ. విరటుపురమ్మున మీకుఁ గడు వీలుగ నుండెడి గూఢవాసమున్
జరుపుట కాతఁ డెంతయును సజ్జనుఁ డయ్యెడ మిమ్ములోకు లె
వ్వరుఁ దెలియంగ లేమిని ధ్రువంబు వరంబుగ ధర్ముఁ డిచ్చుఁ ద
త్తరపడ నేల మీకు శుభదంబగు కాలము వచ్చె నచ్చుగన్.

(అందఱును నాశ్చర్యముతో విందురు.)

ధర్మ— వింటిరా? అంబరవాణికూడ నెట్లు బోధించుచున్నదో!

(మరలఁ దెరలో)

శా. మార్కండేయుఁడు వచ్చు మీకడకు నమ్మంత్రజ్ఞుచే మంగళో
దర్కంబౌ కథ లాలకించుచు నమందానందులై ధర్మసం
పర్కమ్మున్ బెడఁబాయకే వనమునన్ బండ్రెండు నేఁడుల్ చనన్
గోర్కుల్ మీర విరాటరాణ్ణగరి కేగుం డేగురున్ భార్యయున్.

ధర్మ— (నివి)అట్లనే నీ యాజ్ఞచొప్పున వర్తింతుము. మీ కందఱికిని మాయం దనుగ్రహ మున్నప్పుడు మాకెంతయును గొదవ రానేరదు. మాకు నిఁక సర్వశుభమ్ములును గరతలామలకమ్ములు.

(అందఱును నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వర విరచితంబగు
పాండవ ప్రవాసమ్మున షష్ఠాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయై నమః.

# పాండవప్రవాసము

## సప్తమాంకము.

(అంత నొక గాయకుఁడు ప్రవేశించును)

గాయ— (తనలో) ఇప్పటికాలపు రాజులలో నీతఁడు గానమునఁ గడు నాసక్తుఁడని వినియుంటిని. (స్మృతి నభినయించి) ఒక్క గానముననే కాదు. సమస్త విద్యలందును నట్టివాఁడే. మొన్న మొన్ననే యొక మల్లునితోఁ దనయొద్దనున్న వంటలవానిం బరీక్షార్థము పోట్లాడించెనని వినియుంటిని. కావున నితఁడు తానేవిద్యయైనఁ బరీక్షించి యోగ్యతానుసారమ్మున సమ్మానింపఁ గంకణము కట్టుకొన్నాఁడనుటకు సందియము లేదు. సమ్మానించు రాజు లనేకు లుండవచ్చును. విద్య నెఱిఁగి సమ్మానించువా రరుదు. (సంతోషముతో) నా యదృష్టము మంచిది గనుకనే యిచ్చటికి వచ్చితిని. (ఆకాశమువంకఁ జూచి) 'రాజుగారు ప్రకృత మిచ్చట లే'రనుచున్నారా? ఏమి? ఎక్కడికి వెళ్ళినారు? (వినుట నటించి) 'ఎవరో శత్రువులు తమ గోగణము నపహరించిరని విని వారిమీఁదికి యుద్ధమునకుఁ జనినా'రనియా? అట్లైన వారు వచ్చుదనుక నీ పట్టనముననే యుండెదను. (పరిక్రమించి) ఇదిగో! నొక భవనము. (విని) గానము వినవచ్చుచున్నదే! వహ్వా! కడు మధురముగానున్నది. స్త్రీ కంఠములవలె వినవచ్చుచున్నవి. లోనికిఁ బోదునా? (ప్రవేశము నటించి) ఏమి? యీయుపాధ్యాయుని సొగసు! (సంశయించి) ఆఁడుదివలెఁ జొడకట్టుచున్నది. ఇది వేశ్యాగృహము కాదుగదా! కానిమ్ము. ప్రకృత మేదేని తగు బస విచారించుకొని పదంపడి సావకాశముగ వీరలం గలసికొనియెద.

(నిష్క్రమించును)

(విష్కంభము)

(అంత నుత్తరయుఁ జెలికత్తెలును పేడియగు నర్జునుఁడును బ్రవేశింతురు)

అర్జు- తే. గీ. బాల! కంఠమ్ముచే గీతిఁ బాడవలయుఁ
జేతితో నర్థమును బ్రదర్శింపవలయుఁ
జరణముల నాట్యపుఁబ్రశంస జరుపవలయు
నభినయంబనె నిట్టిది యందురు బుధులు.

ఉత్తర— చిత్తము. (అభినయ కౌశలమును జూపును)

(సైరంధ్రి అపటీక్షేపముగాఁ బ్రవేశించును)

సైరం— అమ్మా! ఉత్తరా! నీ విద్యాభ్యాసమునకు భంగము గలిగించు నన్ను మన్నించి కొంచె మిటు రాఁగలవా?

అర్జు— ఏదో యత్యావసరమైన కార్యమున్నట్టులున్నది పోయిరమ్మా.

ఉత్తర— (సైరంధ్రితోఁ గొంచెమావలకుఁ జని) నావలనఁ గార్యమేమున్నది?

సైరం— ఎక్కుడు కార్యమే యున్నది. దక్షిణ గోగ్రహణప్రశంస యంతయు నీవెఱిఁగి నదియే కదా! ఇప్పుడుత్తరమునందలి గోవులఁగూడఁ గౌరవులు గొంపోవుచున్నారని గోపాలకులు చెప్పిరి. అందులకై నీయన్న యుద్ధసన్నద్ధుండయ్యును దగిన సారథికై వెదకుచున్నాఁడు.

ఉత్తర— ఇయ్యెడ నేను జేయవలసినదేమి?

సైరం— శేషము వినుము. మీయుపాధ్యాయు లున్నారా? ఆయనకు సారథ్యమునందుఁ గడు నేర్పు గలదని నేను విని యున్నదానను. కావున నీవు వారిం గోరెదవేని తప్పక నీయందలి గౌరవంబున వారిందుల కంగీకరింతురు; నేను బోయి యీ యుదంతమును మీయన్నతో విన్నవింతును

(నిష్క్రమించును.)

ఉత్తర— అట్లనె యొనరించెదను (సమీపించి) మీ రొక్కసారి మాయన్నగారి యొద్దకు దయచేయ వలయును; కార్యమాయనయే నివేదించును.

అర్జు— (తక్కినకన్నియల వంకఁ జూచి) ఈ నాఁటికిఁ బాఠశాలకు సెలవు, మీరిండ్లకేగుఁడు. నేను యువరాజదర్శనమునకుఁ బోవలసియున్నది.

(చెలికత్తెలు నిష్క్రమింతురు.)

(ఉత్తరుఁడు గోపాలసహితముగాఁ బ్రవేశించును.)

ఉత్త— (సంరంభముతో):

శా. ద్రోణుం ద్రుంచెద భీష్మునొంచెదఁ గృపున్ దూలించెదన్ గౌరవ
శ్రేణిం దంచెద మించెదన్ గురుసుతున్ శిక్షించెదన్ గర్ణునిన్
ద్రేణింతున్ గవలన్ బృథాతనయులన్ గెలింతు వాలమ్ములన్
స్థాణున్ గూల్చెద వేయు నేటికిఁ ? దగున్ సామర్థ్యమే యున్నచోన్.

గోపా— (తనలో) ఏమీ ? మనరాకొమరుని శూరత్వము ! (ప్రకాశము) రాజేంద్రా ! పాండవు లందున్నట్లు లేదు.

ఉత్త— (గాంభీర్యముగా) ఉండనిమ్ము. ఎందుకుండక పోవలెను ? నాకుఁదగిన సారథి యుండవలెఁగాని యెవరున్న నేమిభయము ? (స్మృతినభినయించి) అవును పాపము పాండవులను దుర్యోధనుఁడు ద్యూతమునం దోడించి యడవులపా లొనరించెఁగదా ! (కోపముతో) కానిమ్ము నేఁడందులకుఁ బ్రతిక్రియ జరుగునులే. "ఏకక్రియా ద్వ్యర్థకరీ బభూవ" అని లోకు లాడుకొందురుగాక !

ఉ. శూరుల మంచుఁ జేరుగొని చోరులు నాఁ జనుదెంచి మించి యా
భీరకుమారులన్ గెడపి వేరును జెంపును గోలుపోయి యా
కౌరవు లాచరించిన యకార్యముఁ జూచి సహింప నేర్తునే ?
వారలఁ ద్రుంచి రాజ్యమును బార్థులకిచ్చి యశమ్ముఁ గాంచెదన్.

(సంరంభముతోఁ బరిక్రమించి) అవురా ! సమయమున కెట్టి యిక్కట్టు వచ్చినది ? ఇది యంతయును గంకుభట్టు చేసిన తెలివితక్కువ. పోనీ తండ్రియాలోచనము మాత్రమేమి బాగుగనున్నది ?

ఉ. వంటలవానికిన్ బసులవాండ్రకునున్ రథమేల ? వీరలా ?
గెంటెడివారు శత్రువులఁ, గేవలనైదికు మంత్రిఁజేతురే ?
బంటులు రాజులన్ గుఱుతు సల్పొదె ? యే దెటులైనఁగాని నా
వంటి నృపాలు సారథిని వారికినిత్తురె ? గాసి తెత్తురే ?

సైరం— (ప్రవేశించి) రాకుమారా ! నీకిప్పటియవసరమును మన బృహన్నల దీర్పఁగలఁడఁట. మీ చెల్లెలాయన నిటకుఁ దోడ్కొని వచ్చుచున్నది.

ఉత్త— (తిరస్కారముగా)

మ. నృపలోకోత్తరు నుత్తరున్ దెలియవో ? నిష్పౌరుషున్ బేడి నే
నెపుడున్ జూడఁగ నేవగింతు నకటా ! యీనాకు సారథ్యమా ?

చపలుం డాతఁడు సేయుటా ? వినిన నీవచంబు నిందింతురే ?
రిపులోకం; బిటు గెలిసేసెదవె ? తీరే ? యిట్టిసంభాషణల్.

సైరం— (తనలో) ఇతఁడు విపరీతముగా భావించినాఁడే ? (ప్రకాశము) కుమారా ! బృహన్నల కొక్క నాట్యవిద్యయందే పాండిత్య మనుకొంటివా యేమి ? మున్నర్జునుండు ఖాండవవనమ్ము దహించునప్పు డితఁడే చుమీ సారథ్యమొనర్చినవాఁడు !

అర్జు— (సమీపించును)

ఉత్త— (తనలో) సైరంధ్రియనఁ గడుమాన్యురాలు. ఈమె యసత్య ముచ్చరింపదు. (అర్జునుదిక్కై ప్రకాశము)

ఉ. కౌరవసేనతోఁ గలిగెఁ గయ్యము నేఁటికి నాకు, దానికిన్
సారథి లేమి నట్టునిటు సందియముల్ గనుచుండ నంత నీ
పేరు వచించె నీయతివ పేడితనంబున నింత నేర్చితే ?
వారక సారథంబు కడపన్ బని పూనెదవే ? బృహన్నలా !

ఆ. వె. గాయకుండ వంచు గారవింతుమె కాని
నీవు యుద్ధమునకు నేర్పరివని
యెఱుఁగ; మింక నేమి ? యిప్పు డెఱింగితి
మవసరంబు గలిగె నదియుఁజూడ.

అర్జు— (తనలో) పగఱ నిర్జించుటకుఁ దగినసమయము వచ్చినది. అందుల కియ్యది నాందిగాఁ బరిణమించుఁగాక. (ప్రకాశము) కుమారా ! నాకెందును విశేషించి ప్రవేశములేదు. మీయొద్ద నునికింజేసి యవసరమైన తఱి వెనుదీయుట పాడిగాదని యిందులకు సమ్మతించుచుంటి.

ఉ. చిన్నతనమ్మునందుఁ గృషిచేసితి నించుక గానవిద్య యం
దు న్నటనంబునందును ననుంగులు కొందఱుగూడి తేరిసే
ర్పు న్నెఱి నేర్చుచుండఁగ "నృపుల్ కడు మన్ననఁజేతు" రంచు నా
చిన్నెయుఁ గొంత నేర్చితి విశేషములంతగ నేర నెయ్యెడన్.

ఉత్తర— (చనవుగా) అన్నా ! ఇమ్మహాత్ముఁడు గానమునందుఁ దనకెంత ప్రజ్ఞయున్నదో సూతకృత్యమునందును నంత ప్రజ్ఞయున్నదని సూచించుచున్నాఁడు. కావున నఖండప్రజ్ఞ యున్నదనియే మనమనుకొనవచ్చును.

ఉత్త— (గౌరవముగా) నీవినయమునకు మేము సంతసించితిమి. నీవు సన్నద్ధుండవై తేరి నాయత్తపఱచి యిటు తోడితెమ్ము.

అర్జు— మంచిది. (నిష్క్రమించి తేరితోఁ బ్రవేశించి) కుమారా ! ఇం దధిరోహింపుము.

ఉత్త— (ఎక్కుటనటించి)

చ. దురముగఁ దోలుమీ రథము ద్రోహులుకౌరవు లేగకుండఁగన్
దటిమి వధింపఁగావలెఁ బదంపడి గోవులఁ గ్రమ్మఱించి స
త్వరమున వచ్చి తండ్రియుఁ బ్రధానులు మెచ్చుకొనంగఁ బ్రోలి న
చ్చెరువున నుంపఁగావలయు శ్రీయు యశంబును గాంచఁగావలెన్.

అర్జు— ఇదిగోఁ దోలుచున్నాఁడను.

ఉత్తర—అన్నా! నీవ క్కురువీరుల జయించి వచ్చునప్పుడు నానావిధమ్ములును నవర్ఘ్యమ్ములును నగు వారల యుష్ణీషాంచలమ్ములు బొమ్మపొత్తికలకుఁగా నాకై తేవలయు.

ఉత్త— (ఆదరముతో) తప్పక యట్లొనరింతును.

సైరం— (తనలో) అజ్ఞాతవాసవత్సరము గూడఁ బూర్తికావచ్చినది. ఇఁక నెవరెఱిఁగిన నేమగును? (ప్రకాశము) కుమారీ! తేరప్పుడే దూరమరిగినది; మన మంతిపురికిఁ బోదము.

(నిష్క్రమింతురు.)

అర్జు— (నిరూపించి)

మ. అదె కన్గొంటివె? కౌరవేంద్రుబల మల్లంతం డె రారాజు, బ
ల్లిదులౌ మేటి మహారథుల్ తదితరుల్ లెక్కింపఁగా రాక యె
ల్ల దెసల్ నిండిరి వారిఁజూచితివె? నీలానెల్ల శోభిల్ల న
భ్యుదయ మ్మందుము వీరలన్ గడపి మాతోన్ సర్వోర్వీధవుం డుబ్బఁగన్.

ఇంతకన్నను నెక్కుడు వేగంబునఁ దేరువోవనిచ్చినంగాని వారలం గలసికొనఁజాలము. (రథవేగమును హెచ్చింపఁబోవును)

ఉత్త— (తేఱిపాఱఁజూచి భయముతో)

ఉ. కౌరవనాథుసేన యనఁగా నిదియా? పొరపాటు చేసితిన్
వీరవరేణ్యు లెయ్యెడల వేలకువే, భటసంఘమన్ననో
ధారుణి యీనినట్లె మదిధైర్యము చాలదు వెన్కప్రక్కకున్
తేరు మరల్పుమా తగుగతిన్ బొనరింపఁగ వచ్చుఁ బిమ్మటన్.

అర్జు— (తనలో) ఏమీ! యీకొమరుఁడు చూచినంతనే భీతిల్లుచున్నాఁడే! (యోజించి) లేక నాధైర్యము కనుఁగొనుటకై యిట్లనియుండునా? (ప్రకాశము) రాజనందనా!

శా. నన్నుం గేలి యొనర్చుటో? నిజముగా నాశక్తి వీక్షించుటో
చన్నే? రాజకుమారు లిట్లువలుకన్ జన్యంబులన్ జూడమే?

యెన్నండుఁ గనలేదు మఱి విసఁగలే దీలాటిచందంబు నె
న్నఁడు నీబోఁటులు చూతురే? సమరముఁ గావింప నేతెంచిరయ్యొ.

ఉత్త—(పారిభవముతో) ఏమీ! బృహన్నలా! యుద్ధములు నీవేచూచితివా? మేము చూడలేదా? నీకదియంతయు నెందులకు? ఎందుకువచ్చితివో యాపని నెఱవేర్చుకొనుము. అధికప్రసంగము గట్టిపెట్టుము.

అర్జు—(తనలో) ఏమీ! ఇతని ప్రాగల్భ్యము (ప్రకాశముగా) ఇదిగో నాపని నెఱవేర్చుకొనుచున్నాఁడను. (రథమును వడిగాఁదోలును)

ఉత్త—(కోపముతో) ఏమీ! నాతోనీకు నెకసక్కెమా? ఒకటిచెప్పిన నొకటి చేసెదవుగా?

అర్జు—(శాంతముగా) రథచోదకత్వము నాపని. అది నెరవేర్చుట తప్పా?

ఉత్త—(కోపముతో) ఓహో! ఇట్లయిన బాగుగనే జరుగును. ఇఁకనేని నీ కొంటెతనము గట్టిపెట్టి రథము వెనుకకుఁ ద్రిప్పుము.

అర్జు—(తనలో) ఇతఁడు నిజముగానే భయఁపడినాఁడు! కావున నితనికి ధైర్యము చెప్పిచూచెద. (ప్రకాశము)

ఉ. ఒక్కఁడు పెక్కుసేనలను నుక్కడఁగించుట యొక్కవీరునిన్
బెక్కురు గూల్పలేమి పృథివిన్ గలయట్టిదె "వారు పెక్కురే
నొక్కఁడ" నంచు భీతిలుట యొప్పునె? నీవె జయింపవచ్చువా
రుక్కడఁగంగ వచ్చు నిటు లోడుట పాడియె? రాజనందనా!
మఱియొక లాగు భావింపక నావచనంబులు వినుము.

ఉ. రాజననేమి? శాత్రవపరంపర ద్రచ్చుటొ? లేక చచ్చుటో?
నాజననప్రయోజనమునాఁ జనువాఁడె చుమీ కుమార! నీ
వాజికి నోడితేని భవదంబయుఁ దాతయు సాటివారి నే
యోజ శిరమ్ము లెత్తి కననోర్తురు? మార్తురఁ జంపనెంచుమా!

ఉత్త—(తనలో) ఇతఁడు క్లీబుండయినను మాటలు గడుఁ బౌరుషోచితముగాఁ గనుపట్టుచున్నవి. అక్కటా! యెంతదుర్దశ వచ్చినది! ఒక నపుంసకుఁడు నాకు ధైర్యము చెప్పవాఁడా? అయినను నితఁడె వఁడో యొకింత కనుఁగొనవలయు. (ప్రకాశము)

ఉ. గానముగాదు నాట్యమును గా దభినీతియుఁగాదు యుద్ధపుం
బూనిక లేద? యక్కట! నపుంసకులేడ? విశేషపౌరుషా
ధీనులమైన మేమె వెనుదీయుదు మొక్కకచోఁబరుల్ దగం
గా నెఱుఁగన్వలెన్ బిదపఁగయ్యము నెయ్యము సేయఁగావలెన్.

రాజనీతిజ్ఞులనుగాఁడు తుచ్ఛుగామాయు. వాని సెయ్యఁగుట సామాన్యంబు కాదు. ఎవరి బలిమిని నమ్మియుండునో వాని సెలఁగక కడంగువాఁడు వృథాగా మానప్రాణమ్ములకుం దక్కు. ఇది యంతయుఁ గేవలము నాసంరక్షణకే కాదు.

ఉ. సారథిఁ జంపియే రథికుఁ జంపుదు రింతయెఱుంగ వొక్కొ? ని
న్నారక నేను దీసికొని యుద్ధమునన్ బలియిత్తు నేని మా
వారలు నన్ను దూఱరె? కృపారహితుం డని, నిన్నువంటి వి
ద్యారుచిరుండు గానమున కబ్బునె? యుత్తరకింక నొజ్జగన్.

అర్జు— (తనలో) ఏమి? యీతని యుపన్యాసము. (ప్రకాశము) నృపకుమారా! ఎందులకుఁ గొఱగాని యీ పేడిబ్రతుకుకన్న నాకుఁ జచ్చుటయే కొంత మంచిది. అదిగాక చావెన్నటికైన దప్పనిదే. ఇట్టి మహాకార్యంబునఁ బ్రాణపరిత్యాగంబు శ్లాఘ్యంబుకదా! నాకై నీవు సంశయింపకుము. ఇది యిట్లుండ నీవంటి రథికశ్రేష్ఠునిచేఁ గాపాడఁబడు నాకు మాత్ర మేమిభయము? ఆత్మను సారథిని నశ్వములు మొదలగు వానిని సంరక్షించుకొనువాఁడే కదా రథారోహణమున కర్హుఁడు!

ఉత్త— (తనలో) ఇతఁడు దేనికిని నొప్పకున్నాఁడు. వీని యభిప్రాయము నిజముగా నిట్టిదే యైయుండవచ్చును. రూపు చూచిన పేడి, మాటలు చూచిన నెట్టివారలకును బైపెచ్చు. ఎట్లైన తేరు మరలింపవలయు. లేదా? ఇఁక బ్రతుకుపై నాస వదలవలయును. (యోజించి) చెప్పిన చొప్పున వర్తింపని యనుచరుఁ డుండుట కడు ముప్పుగదా! కానిమ్ము. ఇట్లు చెప్పిచూచెద. (ప్రకాశము) నీ ధైర్యస్థైర్యమ్ములు చూచిన నాకుఁ గడు నచ్చెరువుగా నున్నది. ఎందుకైననేమి? నేనీ సంగరమ్మునకుఁ బూననేరను. నీకంత ధైర్యముండెనేని నీవు రథివై కార్యంబు నిర్వహించెదవా? లేక నా చెప్పిన చొప్పునఁ దేరు మరలించెదవా?

అర్జు— కుమారా! ఎవరికృత్యము వారు నెఱవేర్చుకొనవలయును. కావున నొక్కింత ధిట్టయు గలిగి వర్తింపుము.

క. కురుసేన గాదు దేవా
సురులెదిరించినను నీవ చోరవ గలిగి నేఁ
[illegible] వోడింతు నేద వే
[illegible] నీ కట్టికాలమును సువర్తించెదన్.

(రథము మరలనీక పోవును.)

ఉత్త—(తనలో) ఏమి యీరథవేగము! అప్పుడే చాలదూరము వచ్చితిమి. (కౌరవసేనం జూచి భయముతో) అమ్మయ్యో! దగ్గఱకు వచ్చినకొలందిని సైన్య మెంతభీకరముగానున్నదో! ఈ మూర్ఖుఁడు నేనెంతచెప్పినను వినునట్లు తోఁపదు.

ఆ. వె. అకట! "డబ్బువెట్టి యాధికమునుగొన్న
సగిది" వీఁడు నాకుఁ బ్రాప్తమయ్యె
వీణపట్టె కాని వింటిప ట్టెఱుఁగని
కాంత కెఱుకపడునె? కదనబాధ.

కానిమ్ము, వీని కౌరవులే చెప్పవలసినరీతిని బుద్ధిచెప్పుదురు గాక. నేను జెప్పి చూచిన లాభము లేదు. వీనికిం దెలియకుండ నిందుండి యుత్తికి పాఱిపోయెద. (అట్లొనరించును)

అర్జు—(చూచి ఆశ్చర్యముతోఁ దనలో)

మ. అకటా! నీచునితోడ వచ్చితిఁగదా! హాస్యాస్పదుం డిట్టి పూ
నిక కేమంచుఁ గడంగె? రాచకొలమేనిన్ లోన శంకింప కూ
రక పాఱన్ వెసఁ దేరు డిగ్గి యిది వీర వ్రాతముల్ విన్నచో
నెకసక్కెంబగుఁగాదె? క్రీడియుఁ గలం డిందంచు నిందింపరే?

నేఁడు గాకున్న రేపేని బృహన్నల యర్జునుఁ డని లోకులకుఁ దెలియదా? ఇం దుపాయమేమి? (యోజించి) ఇట్లగుఁగాక. నెనువెంటఁ జని యక్కుమరుని బోధించి సారథిం జేసికొని యేను రథినై విరటుని ఋణముం దీర్చెద. (పాఱఁజూచి) అరుగో భీష్మద్రోణాదిమహావీరు లందఱును నిక్కడి విశేషములన్నియుఁ గనిపెట్టుచు వారిలో వా రేవో చెప్పికొనుచున్నట్టు లూహింపనయ్యెడిని. కానిమ్ము.

(నిష్క్రమించును)

(అంతట భీష్మద్రోణకృపాశ్వత్థామకర్ణులును, దుర్యోధనుఁడును బ్రవేశింతురు)

దుర్యో—(పాఱఁజూచి) ఓ రథికవరులారా!

మ. పసులం బట్టితి మేగుచుంటిమి కడున్ బాగాయె గోపాలకుల్
వెసమైఁ బోయి వచింపఁబోలు నెవఁడో వీరుండు తేరెక్కి పెం
పెసలారన్ జనుదెంచి స్యందనము నందే డించి భీతిల్లి యే
గు సడిన్ గాంచితిరే? యితం డెవఁడొకో శంకించి నూహించిరే?

కర్ణ— అంతటిశూరుఁ డెవఁడైననేమి? ఇందుల కీ విచార మెందులకు?

కృపా— అంగరాజా! అట్లు నిరసించి మిన్నకుండుటకన్న జాగరూకత కలిగి వివేకించుట మంచిపని కదా? చిన్న పామునేని పెద్దకఱ్ఱతోఁ గొట్టవలయును.

ద్రోణు— రాజా! అతఁ డెవరనియా? నీ విచారణము కడు మాననీయము. నాకుం దోఁచిన తెఱఁగు వినుము.

ఉ. కౌరవసేనపై కొకఁడుగాఁ జనుదెంచుట కెవ్వఁ డోపు నీ
ధారుణిఁ గౌరవాన్వయుఁడె తప్పక కావలయున్ బకుప్రజం
జేరిని గోరి పట్టితిమొ యీపురి వారలయున్కి నిక్కవం
బారయనయ్యె నర్జునుఁడె యాతఁడు సందియ మంద నేటికిన్?

కర్ణ— (ఏకసక్కెముగా) మీ రర్జునుంజూచి చిరకాల మగుటచే శిష్యప్రేమ మీ కట్టి యూహ జనింపఁ జేయఁబోలు. లేక,

ఉ. స్యందన మందెడించి వెలుచన్ బరుగెత్తిన గుర్తు చూచి మీ
రందలివాఁడు పార్థుఁడని యాడితి రర్జునుఁడైనఁ గోడుతో
డం బరతత్వ మూనునె? కడంగఁడె? పోరి కొకించుకేని యా
వంద యొవండొ పార్థునిఁగ భావన చేసితి రీరు పేరిమిన్.

కృపా— అంగరాజా! వారివాక్యము తుదముట్ట వినినపిమ్మటఁ జెప్పఁగూడదా?

అశ్వ— (ఏకసక్కెముగా) అట్లు విని చెప్పినచో నాతఁడు ప్రభువునకు ముఖ్యమిత్త్రుఁ డని యెట్లు వెల్లడియగును?

దుర్యో— (భీష్మనుద్దేశించి) తాతా! వీర లందఱును నమేమో యభిప్రాయము లిచ్చుచున్నారు వింటిరికదా? మీ యభిప్రాయమేమి?

భీష్మ— ఎవరేనియు నొకప్పుడు గాకున్న నొకప్పుడేని నీకు నచ్చఁజెప్పఁగలరు గాని రాధేయునకుమాత్రము చెప్పలేరు. అతండు తప్పక యర్జునుఁడే సందియములేదు. కారణము లింకను ధనురాచార్యులే చెప్పనై యున్నారు. అంతలో నీతఁ డుత్ప్రేక్షకు మొదలిడెను.

కర్ణ— (ఏమో చెప్పఁబోఁగా)

దుర్యో— (వారించి) ఆచార్యా! తమయభిప్రాయము సాంతముగా సెలవిండు.

ద్రోణు— ఎవరు చెప్పుట కేమున్నది?

ఉ. ఇంతకు మున్ను విన్నయదియే కద కీచకుచావు; భీము వి
క్రాంతికి సాక్ష్యమిచ్చెనది, కవ్వడి యాతఁడు గావుటెల్ల మీ

కంతట నింతటన్ దెసయు నల్లదె వచ్చుచునున్నవాఁడు ది
క్ప్రాంతములెల్ల నిండె నది యాతని శంఖపుమ్రోఁత భూవరా!

(అందఱును వినుట నటింతురు)

కర్ణ— (తనలో) అవును. ఆధ్వని దేవదత్తధ్వనివలెనే యున్నది.

దుర్యో— గురువరా! నాకీ సందియముం దీర్పుఁడు.

మ. తమకున్ శిష్యుఁడు గౌరవాన్వయజుఁ డంతర్వాణిమాన్యుండు వి
క్రమపారంగతుఁ డింద్రనందనుఁడు పోరన్ వచ్చుటే నిక్కమం
దము వీరుం డతఁ డేల వెన్కఁజను మానంబేది సైన్యంపుసం
ద్రము వీక్షించినఁ బౌరుషం బధికమై నైవారదే క్రీడికిన్?

ద్రో— చ. వెనుకకు నెందు కేగెనో వివేచన సేయఁగ రాదు గాని య
ర్జునుఁ డనుమాట నిక్కమిఁక శూలికి నెక్కుడువాఁ డెవండొ యా
తని నని నోర్చుఁగాని విదితంబె తదన్యుల కోర్వరామి యా
లను గడు వేగ నంపుము బలమ్ములఁ దోడుగ నిచ్చి భూవరా.

దుర్యో— (సంతోషముతో) అతఁ డర్జునుఁడే యైన మన కార్యము ఫలించినదే.

క. మరలఁ బదిరెండు సంవ
త్సరములు వని నుండి యొక్క సంవత్సర మీ
వరుసఁ జరియించి రావలె
నరుఁడే యతఁడంచు మీరు నమ్మికయేనిన్.

భీష్మ— (తనలో) అక్కటా! వీనికౌటిల్య మెన్నఁటికిని బోవదయ్యెఁగదా!
మం[illegible]ము) కుమారా! పదుమూఁడువత్సరములును నిన్నఁటికే
నిండినవి. లేదే యనుకొందము.

ఉ. పాలడుగంగ నర్జునుఁడు వచ్చినచో నిటులాడ వచ్చుఁ దా
నాలకునై విరాటు భటుఁడైకద రావలె? నిప్పు డంపుకై
యాలమునేఁతనుం గలదె యడ్డము? పిమ్మటఁ జూచుకొంద మా
కాలగళాధికున్ దొరయఁగా దొరలెవ్వరో? యేర్పఱింపుమా!

దుర్యో— (తనలో) అప్పుడే యీముదుసలి పాండవపక్షపాతముం జూప
మొదలుపెట్టినాఁడు. (ఆలోచించుట నటించును)

కర్ణ— (ఎకసక్కెముగా) ఏమీ! నిజముగా నతఁ డర్జునుఁడేయైన నతనిని
మార్కొనువారే లేరా?

చ. అతనికె కాక యందఱికి నస్త్రగురుండు ఘటోద్భవుండు నీ
వతులితవిక్రముండవు మహాపదత్తుఁడ విట్టివీకునున్

బ్రతి గురుపుత్రుఁడుఁ గృపుఁడు పాండవపక్షముఁబూని వీరు నీ
చెత మతి రోయరే నతనిజంపుట కేనొకరుండఁ జాలుదున్.

అశ్వ— (పరిహాసముగా) నీవు చాలినదియు లేనిదియుఁ బాంచాలీపరిణయం
బును ఘోషయాత్రయును సంపూర్ణముగా నెఱుఁగుదు. దానికేమి?
(సుయోధనుదిక్కు) నరేంద్రా! ఇంతకును నతఁ డర్జునుఁడా కాఁడా
యనునది వివాద్యాంశము. నిక్కముగా నర్జునుఁడే యైనను విరటు నను
చరుం డగుకతన మనము మున్నొనర్చికొన్న సమయ మతని కిప్పట్టునఁ
బ్రతిబంధకము గానేరదు. ఏమందువా?

శా. న్యాయం బంచునొ యేమి హేతువుననో నాతండ్రియు న్నేను గాం
గేయుండుం గృపుఁడు న్నిరంతరముఁ దత్క్షేమంబ కామింతు మిం
తే యా నిక్క మటైనను న్బరులయాదేశంబునం దుంటఁ గా
దే? యేదుష్కృతికైన సిద్ధముగ మే మిందుంటి మో భూవరా!

చ. విరటునిగోవులన్ వృథగ వీరులమం చొకపేరు పూని ని
ష్కారణులమై హరించుటయ కాక నిరాగసు లైనగోపబా
లురఁ బడమోఁదు టెవ్వరును లోకులు మెచ్చెడి మేటికర్జమే?
నరులు పరానువర్తులు పొనర్పని దుష్కృతు లున్నె? భూవరా!

కర్ణ— (కోపముతో) అంతతోఁ గట్టిపెట్టుము. నీ యుపన్యాసమునకు నెల్ల
ఫలితార్థ మతఁడు పరాధీనుఁడు గనుక నతని కిప్పట్టున సమయభంగ
విచారణం బనావశ్యకమని తేలినది. (దుర్యోధనునిదిక్కు) మిత్రమా!
వీరలహృదయము నీకు స్పష్టముగాఁ దెలిసినదిగదా?

ఉ. పోరికి నిట్టివారిఁ గొని పోవుట హానికరంబు వీరు స
ద్వీరులు గారు పోషకుని వేరము దీరుప లేరు; శత్రులన్
శూరులు పెద్దఁగాఁ బొగడఁజొత్తురె? యాచనగాఁ దలంచెనో
పాఱఁ డితండు? యుద్ధప్రస్వభావ మెఱింగిన నిట్టులాడునే?

"తాఁ జెడ్డకోఁతి వనమెల్లఁ జెఱచిన" దన్నట్లు తనకుఁదాను స్వతం
త్రుఁడుగాని తక్కినవారిం గూడ నిరుత్సాహులఁ జేయుట యెందులకో?
అగుఁగాక నీవు సంశయింపకుము.

ఉ. అర్జును లెక్కయే మతనియబ్బ సురేశ్వరుఁ డౌను గాక వి
స్ఫూర్జితశక్తిమై నెదిరి పోరి జయింపఁ గలాఁడ నూరకే
గర్జిలుపాటిగా దిపుడె కాంచెదు నాదుపరాక్రమంబు నీ
తర్జనభర్జనల్ కని యెదన్ భయ మందఁడు కర్ణుఁ డెన్నఁడున్.

కృపా— వృథాగా నెందులకు వాగ్వ్యయ మొనరించెదవు? ముసలో మనము
మంచిచెడ్డలు చెప్పికొనుటయా శోకతప్పా? పైపై నవసరానవసరములం

బట్టి మనమెట్లు సంచరించుచున్నను మనస్సుమాత్రము న్యాయము పరిక్కకు ములుసూపకమానదు.

ఉ. ద్యూతములోన గెల్చుటది దోసమటంచుఁ బ్రపంచ మెంచు నో
సూతతనూజ! దాని విని శూరతఁ దెచ్చుకొనం బనేమి? దు
ర్ణీతిని లోకముల్ బొగడునే? యటుసేయఁగ బ్రహ్మశక్యమే?
మూతి బిగింతు వేరిపయి? మూర్ఖులె, వీరలు నీకుఁజాలరే?

కర్ణ— (పండ్లు గొఱికి ఏమోయనఁ బోవుచుండ దుర్యోధనుఁడు వారించును)

అశ్వ— (ఏకసక్కెముగా) రాజా! ఎందులకు వారించెదవు?

వారింపనేల? యాతని
శూరత వాక్కులనె కాదె? చూడం దగుఁ "దా
నే రాజ" ననెడిగర్వ
ప్రారంభం బితని నింతపఱుకుం దెచ్చెన్.

ఉ. వచ్చుచునున్నవాఁ డమరవంద్యపరాక్రమధూర్వహుండు వి
వ్వచ్చుఁడు మాటలన్ జనెడివాఁ డతఁడెన్నఁడు గాఁడు మాపయిన్
మచ్చరమేల యీతనికి? మా కతఁడన్నను గౌరవంబు లే
దిచ్చట; శత్రువైన వచియింపఁ దగున్ గుణమందు రేకదా!

కర్ణ— (కోపముతో) నీవంటి కుక్షింభరులకు గౌరవమున్ననేమి? లేకున్ననేమి?

ఉ. పాఱెడువారు కావుననె పాఱులు మీరలు మిమ్ము బోఁటులన్
బోరికి వెంటఁబెట్టుకొని పోవుట "పిల్లినిగొంచుఁ బెండ్లియిల్
చేరుటవంటి" దూరకొనఁ జెల్లదె తేనిమనంబునిట్లు కం
గా రొనరించునట్టి పనికా యిటకున్ రథమెక్కి వచ్చుటల్?

అశ్వ—. (కోపముతో) ఓరీ! జాల్మా! ఏమని ప్రేలితివి? ఇదిగోఁ జచ్చితి
విరా! (కర్ణునిపై కుఱుకఁబోవును.)

ద్రోణు— కుమారా! ఊరకొనుము. ఎందుకేని యసమానునితోఁ బ్రసక్తి
గూడదు.

కర్ణ— (ధైర్యముగా) రమ్ము. అంతలో శాంతించితివేమి?

ఉ. ఆలము సేయువానివలె నాయుధముం గొని సారెసారె మీ
సాలను దువ్వుకొంచు నృపుసత్రమునం బడి మెక్కి మెక్కి పైఁ
గాలమువచ్చినప్పు డిటు కాతరతన్ గని 'తిన్నయింటివా
సాలను లెక్కవెట్టు' నినుఁ జంపి కురుపతిఋణ నప్పు దీర్చెదన్.

అశ్వ— (కత్తి దూసి) ఓరీ దుర్జనమూర్ధన్యా ! జఘన్యా!

శా. కందాలోఁ బడి భుక్తశేషమును జక్కన్ మెక్కి బల్పెక్కి యీ
నిం దుర్నీతికిఁ ద్రిప్పునీ బ్రతుకు నేనే కాదు లోకంబులో
నిందల్ జేయనివార లుండ రిదిగో నీచావు దాపయ్యె నో
పందా! నోటికి బుద్ధిచెప్పుకొనుమా పై పైకి రాఁబోకుమా.

కర్ణు— (అశ్వత్థామపై కుఱుకఁబోవును)

దుర్యో— (వారించి) మిత్రమా ! ఇప్పుడు నీవు శాంతించి నాయందలి విశ్వాసమును జూపవలయును. (ద్రోణునిదిక్కు)

ఉ. మీ కిది న్యాయమే కద ? యమేయపరాక్రము లయ్యు శత్రునిన్
వాకొని పెద్దఁజేసి యిటు వారికివీరికి వాదు గూర్తురే ?
సాఁకినవాని ద్రవ్యము విసంబె ? యసంబున కాస్పదేయరే ?
నా కవమానమైనఁ గదనంబున మీకుఁ బ్రశస్తి గల్గునే.

భీష్ము— కుమారా ! ఇందు ద్రోణాదుల తప్పిదంబు లేశంబును లేదు. కర్ణుఁడు తనకుంగల పరాక్రమాతిశయంబు ప్రకటించె. దానికేమి.

క. ఆర్యులు కదనంబులఁ గడు
ధైర్యస్థైర్యములు గల ప్రధానులు వీరల్
కార్యాకార్యజ్ఞులు దు
శ్చర్యులె ! యివ్వారి గేలిసలుపన్ దగునే.

అర్జునుండన సామాన్యుండు కాఁడు. అతఁడొక్కఁడేకదా, యని మన మొప్పరికింపంజన దనుట మన క్షేమమునకే కాని వేఱొండు కాదు. కావున వారలం బ్రసన్నులం జేసికొని కార్యంబు నెఱవేర్చికొనుము. (ద్రోణాదులదిక్కు)

ఉ. దగ్గఱవచ్చె నల్లదె పృథాసుతుస్యందన మార్యులార! మా
యొగ్గుఁ దలంపఁబోక యిటకెందుకు వచ్చితి మట్టికార్యమున్
నెగ్గఁగఁజేయుఁడీ ? విజయునిన్ జిరకాననవాసజాతరో
షోగ్రుని నుగ్రతేజు నెటులో మనమాఁపుద మెల్లభంగులన్.

(దుర్యోధనునిదిక్కు) కుమారా ! నీకర్ణుని సహాయునింగాఁ గొని పసులవెంబడిం జనుము.

దుర్యో— (కర్ణసహితుఁడుగా నిష్క్రమించును.)

(అంత నర్జునుఁడు స్వస్వరూపముతో నుత్తర సహితముగఁ బ్రకాశించుచుండును.)

(ద్రోణాదులందఱును బ్రసన్నులై సన్నద్ధులగుదురు)

అర్జు— (నవ్వి) ఇంకను నీకు సంశయము బాధించుచునే యున్నదా?

సీ. కంకుండునా నిరాతంకుండు మీతండ్రి
ప్రియమిత్రుఁడతఁడు మా పెద్దయన్న
వలలుండు కీచకవనవహ్ని మీబావ
నీఁడెవ్వఁడతఁడు మా నిన్నయన్న
వారువంబులనేలెడి పాలుపత్తెమున క
ర్థాండు దామగ్రంధి యొక్కఁడతమ్ముఁ
డాలఁగాచెడివారి కధినాథుఁ డల్ల తం
త్రీపాలుఁడే సహదేవుఁ; డేన

తే. గీ. యర్జునుండను సైరంధ్రియాజ్ఞసేని
గాండివం బియ్యదియె సురేంద్రుం డొసఁగిన
మకుట మిద్దియె యే నపుంసకుఁడ నగుట
యూర్వశీశాపమునఁ జుమ్మి యుత్తరుండ!

శాపావసానం బగుటంజేసి మరల నారూపునాకు వచ్చె. భీమసేనాదుల యాయాయధమ్ములు నీవు శమీవృక్షమ్మునఁ జూచి యుంటివి. మఱియును నీవడిగిన ప్రశ్నంబుల కెల్ల నుత్తరం బిచ్చితి; నిఁక నీవు లేశమ్మును జంకుఁ గొనక సారథ్యమునం దప్రమత్తుఁడవై వర్తింపుము. రథవేగంబు హెచ్చింపుము.

ఉత్త— చిత్తము. అట్లే యొనర్చెదను.

క. నరుఁడ వని నిన్నెఱింగిన
తరుణమునన పోయె నాయెదం గలభయ మో
కురువీర! యెఱిఁగి యెఱుఁగక
విరచించిన తప్పులకును వేఁడెద నిన్నుఁ.

అర్జు— అట్టి సందియము నీమనమ్మున నుంచకుము. తేరు వోవనిమ్ము.

ఉత్త— ఇదిగో! తోలుచున్నాఁడను. (అట్లొనర్చును.)

అర్జు— (చేతితో నిర్దేశించి) నృపకుమారా! అటు చూడుము.

శా. ద్రోణుం డాతఁడు భీష్ముఁడల్లతఁడు కర్ణుం డాతఁడే చావని
క్షాణంబుల్ గొనవచ్చుచున్నవిరొ? యశ్వత్థాముఁడు! యాతఁడా

స్థాణుం బోలినవాఁ డతండె కృపుఁ డాచార్యోత్తమానుండు పై
రాణించున్ ధ్వజమందు వ్యాళి మతఁడే రారాజు కన్గొంటివే.

ఉత్త— దగ్గఱకు వచ్చితిమికదా! ఇంకను వీరు మనపై నారాచమ్ముల నిగుడ్ప రేమి?

అర్జు— ఏమనియా?

శా. ఆచార్యుండు నియంత యాయనకు నాయం బెంతయో పేర్మి స
త్యాచారుండగు భీష్ముఁడోలి మము బాల్యంబాదిగాఁ బెంచె ద్రో
ణాచార్యాత్మజుఁ డేను సోదరుల మన్నట్లుండు మద్దష్ప మా
కాచార్యత్వము చేయుటన్ గృపుఁ డుపాధ్యాయుండె యా నుత్తరా!

మ. ఒకకర్ణుండు సుయోధనుండు మనపై నుగ్రత్వముం బూని కొం
డికనాఁడాదిగఁ గీడు సేయుదురు కానీ వీర లయ్యార్యులన్
గికురింపం దగ దౌఁ గదా! మనము ముల్ గీలింతు మేనిన్ శర
ప్రకరం బార్యులు నింతు రంతవఱకున్ బైరారు వారుత్తరా!

(పాఱఁజూచి) సుయోధనుండు గడుదవ్వునఁ బసులవెంటఁ జనుచున్నవాఁడు. కావున మనమియ్యెడ నున్నఁ బ్రయోజనములేదు. మన తేరిపక్కిగా నతని యెదుటికిం గొనిపొమ్ము.

ఉత్త— అట్లనే పోనిచ్చుచున్నాఁడను.

అర్జు— (యోజించి) క్షణ మిక్కడనే యుండనిమ్ము. (తనలో)

క. వీరియెడ నాకుఁ గలిగిన
గౌరవమున్ జూపవలదె! కలదే! గురుధి
క్కారము శ్రేయస్కరమే
నారాచమ్ములనె వీరి నారాధింతున్.

(కొన్ని యమ్ములు విడిచి) ఉత్తరా! తేరు వెనుకఁ జెప్పినచోటునకుఁ బోవనిమ్ము.

ఉత్త— చిత్తము.

(ఇరువురును నిష్క్రమింతురు)

ద్రోణా— (సంతోషముతో)

శా. ఔరా! శిష్యుఁడ వన్న నీవకదరా! యాచార్యసద్భక్తి
దేరా! నూర్గురు శిష్యు లుండవలెనే? యీ వొక్కఁడే చాలు జ

న్మరాతిన్ గురునాథుఁ గొల్చు గురుపై నన్నన్న! కోపింప కి
ట్లారాధింతువె? దీనికిన్ ఫలము నీ కౌఁగాక శీఘ్రమ్ముగన్.

(పట్టరాని సంతోషముతో భీష్మదిక్కై) చూచితివికదా! మన యెడల నాతఁ డొనర్చిన గౌరవము.

తే. గీ. స్వాగతమునకు రెండేసి సాయకములు
శ్రవణములు సోఁకి సోఁకనిసరణి నించె
వందనమ్మున కట్టులే నైచె పాద
యుగళి సోఁకియు సోఁకనిపగిది నరుఁడు.

భీష్మ— (నవ్వి) ఆచార్యా! యిం దాశ్చర్య మేమి? ఆతఁడొనర్చిన శిష్యత్వ మెట్టిది? (ప్రక్కకుఁ జూచి)

చ. మనలఁ బరిత్యజించి యదె మండలపుంగతిఁ దేరు ద్రిప్పి య
ర్జునుఁడు సుయోధనున్ గదియఁ జూచుచుఁ బోవుచు నున్నవాఁడు తోఁ
డని యొనరింప లేఁ డతని నాఁగి క్షణంబునఁ బోయి తోని మ
న్నన నిలుపన్ వలెన్ దడసినన్ బయి వచ్చుఁ జూఁడీ కడంగుఁడీ.

అశ్వ— (పాఱఁజూచి) చూడుఁడు. రారాజుపై కరుగు కవ్వడికిఁ గర్ణుఁ డడ్డ మగుచున్నాఁడు.

ద్రోణా— తండ్రీ! అట్లని మన మొప్పరికింపఁ జనదు. మీ రిరువురును బోయి రాజుం గాపాడుఁడు. పలయు నేని యేమును వచ్చెదము.

(కృపాశ్వత్థామలు నిష్క్రమింతురు)

ద్రోణు- (భీష్మునితో) కర్ణార్జునుల ద్వంద్వయుద్ధ మెట్లున్నదో పరికించితిరా?

భీష్మ— ఉభయులును సమర్థులేకదా, అయిన నర్జునున కితఁడే కాఁ డెవ్వ రేనియు లొం చ్చనక తప్పదు. (పరికించి) కనుఁగొంటిరా! కర్ణు నతి క్రమించి దుర్యోధనుఁ జెనకఁబోవు నవసరంబున మన యశ్వత్థామ యనికిఁ గడంగెను.

ద్రోణు— (చూచి) యుద్ధము కడు భరముగా నుండెడినిగాని కవ్వడి యక్షయ తూణీరుం డగుటచే నితని నతిశయింపవచ్చును. నేనుబోయి యతనిన్ దలపడియెద (కొండొకపోయి నిల్చి) ఇతం డెక్కతమునన్ కుమారుఁ దలపడకయె నావంకకు వచ్చుచున్నాఁడు.

అర్జు— (ఉత్తరునితోఁ ప్రవేశించి) ఉత్తరా! తేరమ్మహాత్మున కభిముఖ ముగాఁ బోవనిమ్ము. (తనలో)

ఆ. వె. ఓనమాలు మొదలు నోజ్జయై విలువిద్దె
మొట్టతుట్టె చెప్పి మురువదనము
వాసినట్టి గురునిపై కేల్మోడ్పకున్న
బవరమునకుఁ బోదు భయము విడిచి.

(విచారముతో) ఓహో! దైవమా! యి క్కురుకులపాంసను కారణ
మ్మున నెన్ని యిక్కట్టులు ఘటించితివి?

మ. 'పతితో దీకొనుఁ బుత్రుఁ గన్న నవలా, భార్యాసమాయోగసం
గతుఁ డాపై జననిన్ గణింపఁడు భిషక్పుత్రత్వమున్ బూను యా
పితరోగుండు సమాప్తిఁ దియ్యఁడు గురున్ ద్వేషించు' నన్నట్టి సా
మెత నన్ జూచి పఠింతురే? యిఁక జనుల్ మేనెల్ల వమ్మయ్యెనే.

(యోజించి) ఇట్లగుఁగాక (సమీపించి చేతులు జోడించి)

క. అడవులఁ బండ్రెండేఁడులు
కడు నిడుమలు గుడిచినట్టి కవ్వడి మీ శి
ష్యుఁడు మీ రిడుదీపము మీ
యడుగులకుఁ ద్రికరణశుద్ధి నభివాదించున్.

ద్రోణు— (ఆదరముతో లేవనెత్తి) తండ్రీ! దీర్ఘాయుష్మంతుఁడవై సర్వవిధ
మ్ముల వన్నెకెక్కుము. శిష్టాచారమ్ము కావించితివి కావున,

క. చనుము రథ మెక్కి మాహవ
మునకున్ దీకొమ్ము మేము మును చెప్పిన యా
ధనురాగమమును జక్కం
గ నొప్పఁగఁ జెప్పి మమ్ముఁ గయి సేయు మిఁకన్.

అర్జు— (వినయముతో) తమయాజ్ఞ శిరసావహించుచున్నాఁడను. (రథ మెక్కి
సంశయముతోఁ దనలో)

క. గురుపై నెక్కరణిని శర
పరంపరలు విడుచువాఁడఁ బగతుఁడె? యాతం
డర లేక యాజ్ఞ యిడుఁగా
కరయంగా వలదె? యిట్టియాగడము నెదన్.

ఇట్లగుఁగాక. (ప్రకాశము)

ఉ. ఏనయి యెంత చెప్పినను నేయఁగఁజాల శరంబు మీరె నా
పైనెనరుంచి యేయఁదగుఁ బ్రప్రథమంబున నట్టులేని నా
మానసమందుఁ గల్గు ననుమానము వోవుటెకాక సత్యసం
ధానిరతుండు ధర్మజుఁడు తమ్మునిపైఁ గడు నల్గకుండెడున్.

ద్రోణు— (తనలో) బళిరా! అర్జునా! బళిరా! (ప్రకాశము) అట్లే కావించెదను. కాని రణోచితస్థలమునకుఁ బోవుదము రమ్ము.

(నిష్క్రమింతురు.)

భీష్మ— (సంతోషముతో) సెబాసు! అర్జునా! సెబాసు! "అవశ్యంపితురాచార"మ్మనుట నీకు సర్వవిధమ్ములం బట్టినది.

చ. అలజమదగ్ని పుత్రునకు నస్త్రగురుం డెన, నాకు నీవునుం
గలన నొకింత వన్నెడవు "కౌరవ వంశమునందు నేఁటితోఁ
గలిగెను యుగ్మమొక్కటి తగన్ గురుమెచ్చును గాంచినట్టి" దన్
విలసనమున్ గడించితివి వీరవరేణ్యుఁడ నైతి వొప్పఁగన్.

(పరికించి) ఏమీ? అస్త్రగురుఁడే కాక గురుపుత్రి శారద్వతులు గూడ నోడినారే! అర్జునుఁ డుత్తరునితో నేమో యనుచున్నాఁడు. (విని) గోవులం దోలికొని పొమ్మని గోపాలకుల నాజ్ఞాపింపుమనియు నీజయమంతయు నీవే కావించినట్లు నగరంబునఁ జాటింపంచుమనియును బోధించుచున్నాఁడు. (విని) మరల నేమో యనుచున్నాఁడు.

(తెరలో)

ఉ. అమ్మహితుండు చాపధరు లందఱికిం దలపువ్వు వృద్ధుఁడం
చు మ్మది నెంచఁబోకు మరిసూదనతాపటిమంబు పట్లబిం
కమ్మగు జవ్వనంబు పొడకట్టు మఱేమనుకొంటివో మహా
త్త్వమ్మున మేటి మాకొక పితామహుఁడే యన నేల? దేవుఁడే.

కావునఁ గడు జాగరూకుండనై సారథ్యమ్ము నెఱవేర్చెదవు గాక.

(ఉత్తరార్జునులు ప్రవేశింతురు.)

అర్జు— ఉ. ఆయన గెల్చి కాని మన మక్కురురాజుఁ గలంపలేము గాం
గేయున కాదరంబ కద! కేవలమున్ మనయం దనంగరా
దోయవనీశనందన! నయోచితమార్గము దప్పఁ జెప్ప డా
మ్నాయవిదుం డతండు గదనం బొనరించియ తీరుఁ దీరుగన్.

భీష్మ— (సంతోషముతో) అర్జునుండు నన్నుం గూడఁ దనవిద్యాపాటవమ్మున నానందింపఁజేయ నిట వచ్చుచున్నాఁడు. (ప్రక్కఁజూచి) మా యిరువుర సమరముం జూచుటకుఁ గాఁబోలుఁ గురురాజులో పాటు యోధులం దఱును నీ దిక్కునకే వచ్చుచున్నారు. (సన్నద్ధుఁ డగును.)

(అంత దుర్యోధనాదులు ప్రవేశింతురు.)

అర్జు— (వినయముగా)

ఉ. పోరికి నిన్ను మార్కొనఁగఁ బోలునె ? యొక్కనికేనియున్ మహో
దారచరిత్ర ! యట్లయినఁ దప్పక వచ్చె విరాటుబంటనా
కారణ మిట్టినన్ వెకలిగాఁ దలపోసెదొ, యేమొ ? యీ దురా
చారుఁ గృతఘ్ను గౌరవవిచారవిదూరు క్షమింపు మియ్యెడన్.

భీష్మ— (ఆదరముతో) తండ్రీ ! క్షత్రియోచితప్రచారప్రవర్తనుండ వగు నిన్నొకరు క్షమించుట యెందులకు ?

ఉ. శూలి నెదిర్చినట్టి యల శూరత విన్నది యాది నీకు భూ
పాలురెకారు దేవతలు భండనమం దెదురే ? యటంచు నేఁ
బోల నెఱుంగుదున్ సమరముం బొనరించెద నైన నన్ను నె
ట్లాలములోఁ గలంచెదవొ యయ్యయి భంగులు సూచు వేడుకన్.
ఉచితస్థలమ్మున కరుగుదము రమ్ము.

(నిష్క్రమింతురు)

అశ్వ— (ఆకాశము వంకఁ జూచి) ఓహో ! ఆకస మెల్ల నంబరచరుల విమానము లెట్లు నిండినవో !

తే. గీ. తాతమనుమల సంగరౌద్ధత్యమునకు
సంతసించుచు నున్నారు చదల సురలు
హరిని సంగరమున గెల్చినట్టిఁ డొక్కఁ
డొక్కఁడో హరునోర్చిన యుక్కుతునుక.

కృపా— (చూచి) కుమారా ! గాంగేయునిచాపముల నర్జునుఁ డెట్లు తుత్తునియలు సేయుచున్నాఁడో చూచితివా ?

ఉ. ఎత్తెను చాప మాతఁ డొకయేటున నీతఁడు ద్రుంచె వెండి తా
నెత్తె నితఁడు ద్రుంచె నిటులెత్తుటయే తడ వెన్నిమాఱులో
తుత్తునియల్ పొనర్చె నరితూఁగు నెవం డిఁకఁ బార్థుతోడ లో
కోత్తరుఁ డాతనిం దొరయు యోధులు నున్న జగత్త్రయంబునన్.

ద్రోణు— (ఆశ్చర్యముతో) అవురా యితని శరలాఘవము !

క. చాపమ్ముఁ ద్రుంచి వేఱొక
చాపమ్ము గ్రహించునంత శాంతనవునిఁ జెం
దూపులఁ గొన్నిటఁ బార్థుం
డాపన్నునిఁ జేసి కూని నదె యుద్ధఁజనున్.

అశ్వ— (కర్ణునితో నెకసక్కెముగా)

ఉ. పార్థునిలావు నీ కెఱుఁగ వచ్చెనె ? యిప్పటికేని కాలపున్
వార్ధియొ నాఁగ నాతఁ డిటువచ్చెడి సేనికిఁ గల్గుకూరిమిన్
సార్థకమున్ బొనర్ప సమయం బిదియే యెదిరించి నిల్వు ప్ర
త్యర్థిని గెల్వలేనిచో బిరుదమ్ములు వమ్ములు కావె యేరికిన్ ?

దుర్యో— (తనపైకి వచ్చుబాణమ్ముల నిపుణముగా వారించుకొనుట నటించును.)

కర్ణ— (సంరంభముతో) రాజా ! నేనుండఁగా నీ వెందుకు వారించుకొన వలెను ? (కొంతవడి నిలిచి పాఱుట నటించును)

దుర్యో— ఏమీ ? ఈనాఁ డితని విక్రమం బవక్రంబుగా నెగడుచున్నదే ! (యుద్ధసన్నద్ధుఁడగును)

అశ్వ— (తనలో) ఏనాఁ డతనివిక్రమ మవక్రము గాకున్నది ? మన కిప్పటి కప్పుడే క్రొత్తగాఁ గన్పట్టును.

అర్జు— (ప్రవేశించి) విరాటనందనా ! అదె సుయోధనుఁడు మనకుం జేఁ జిక్కి యున్నాఁడు. అరదమ్ము టు పఱుపుము.

ఉత్త— (అలసటతో)

చ. ఎడ యొకయింత లే దొకటె యేయుట యే నిఁక నిల్వఁజాల మేన్
వడవడ లాడఁగాఁ దొడఁగె వాఱుపముల్ కడు డస్సె నుంత యొ
క్కెడ శ్రమ దీర్చి కొంద మిటు లేకముఖంబుగఁ బోరు సల్పి యె
వ్వఁడు బడలండు లోకమునఁ ? బార్థులె పార్థివులెల్ల నర్జునా ?

అర్జు— (మీఁదఁ జెయి వైచి) రాజనందనా ! కడుబడలితివి. ఇఁకఁ గష్టించి నంత కాదుగదా ? అందు శతాంశమేనియు నవసరము లేదు.

మ. అదె రారా జతనిన్ బరాభవము చేయన్ గాల మేతెంచె దు
ర్మదుఁ డీతండు గణింపఁ డేరిని మహామాత్సర్యపర్యాప్తుఁ డి
య్యదనన్ బైఁ బడమేని జోదులు శరీమంబాఱన్ సమీపింతు రాఁ
గుదు రీయత్న మొకింతయోర్చికొనుమా ! కోపంబు దీపింపఁగన్.

అంత వలసిన నేన యశ్వమ్ములం గడపఁ గలవాఁడ. నీయథాశక్తింబని సేయుము. (శరప్రయోగము నటించి)

ఉ. పాఱెదవేల ? జూద మని వచ్చితివో ? యిది భండనంబు తే
రూరక యెక్కు మాత్రమున కోడరు శత్రులు వీథులెల్లడన్

స్వారి యొనర్పఁగాఁ గలవె సామజయానము నెక్కి? నేఁడు నీ
పేరు నిరర్థకం బగును బెంపతి యేగినచో సుయోధనా!

తే. గీ. అబలఁ బాంచాలి నవమానమందఁజేయ
వచ్చు నోరెఱుఁగని పశువ్రజముఁబట్టి
వెట్టి గొల్లలపైని వేవేగ నుఱుక
వచ్చు రాదొకో వివ్వచ్చు వ్రచ్చునేర్పు?

ఉ. రాజవుకావె నీవు? కురురాట్కులమందు జనింప లేదె? యే
యోజ ధరన్ భరించెద వహో! యని పౌరుషనవ్వ నింత ని
స్తేజుఁడ వేల వచ్చితి విసీ! యని సేఁతకు యుద్ధ మన్నచో
భోజనమో? యలంకరణమో? యవరోధవధూవిహారమో?

ఉ. చంపెదనంచు భీతివడి సారెకుఁ బాఱెద వేల? నేను నిన్
జంపమి నిక్కవంబు రిపుజైత్రభుజుండు మదగ్రజుండు మా
యింపఁ బ్రతిజ్ఞఁ గొంటెఱుఁగవే మిము నూర్వుర; మొన్న మొన్న నే
చంపెను మీవలెన్ ద్రుపదజన్ గికురించిన కీచకావళిన్.

దుర్యో— (సిగ్గుపడి నిలుచును.)

భీష్మాదులు— (మరల యుద్ధసన్నద్ధులై శరప్రయోగము నటింతురు)

అర్జు— (ధ్యానమునటించి యమ్ము విడుచును.)

భీష్మాదులు— (అందఱును మూర్ఛ నటింతురు.)

అర్జు— ఉత్తరా! నీసహోదరి యుత్తర చెప్పిన పలుకు స్మృతికిం దెచ్చుకొని
వీరి యుష్ణీషాంచలమ్ముల నుత్తరించి యిటు తెమ్ము.

ఉత్త— చిత్తము. (దరికరుగఁబోవును.)

అర్జు—(మెల్లఁగా) మాట, యీమోహనాస్త్రమ్మునకుఁ బ్రతి పితామహుం డెఱుఁ
గుఁగాన నతని దెసకుంబోకుము. తక్కఁగలజోదు లెఱుంగరు. వారలు
తెల్విఁగను నాలోనఁ గృతకృత్యుఁడవై మరలిరమ్ము.

ఉత్త— (తలపాగల కొసలు కోయుట నటించును.)

భీష్మ— (ధ్యానము నటించి కనులువిచ్చును.)

ఉత్త— (పరుగున వచ్చి యర్జుని చెంతనిలుచును)

అర్జు— ఇఁకఁ బోదము పద.

(నిష్క్రమింతురు)

భీష్మ— (తనలో) అన్నా! కిరీటి యెంతపని చేసినాఁడు? (కోపముతో)

చ. నిలునిలు పార్థ! మోహనము నీవ యెఱుంగుదువే? బలమ్ములన్
గలఁచెద యుక్కివమ్ము మెయి? గల్గునె దీన యశంబు? ధర్మపుం
గలన జయంబొ వెఱొకఁడొ గాంచుట యుక్తము కాక నిద్దురన్
సొలసినవారిపైఁ దగునె? శూరతఁ జూపుట నిన్ను బోఁటికిన్.

(దుర్యోధనుని శిరము చక్కఁగాఁ బరికించి మెప్పుతో)

చ. కరుణయటన్న నీయదియ కౌరవనాథుశిరంబు నిప్పు డు
త్తరుఁడొగి నుత్తరించెనని తత్తరమందితి భ్రాంతి కల్మి ని
క్కురుపతి కిట్లు చేపడినఁ గుత్తుకలొక్కటఁ గత్తిరింపఁడే?
తరతమభావవేది యగు ధర్మజదమ్ముఁడ వౌదు వర్జునా!

(ద్రోణాదులు మూర్ఛ దెలియుదురు)

దుర్యో— (కోపముతో)

శా. ఏఁడీ? ఫల్గునుఁ డేడఁబోయెనో కదా యిందెందుఁ గన్పట్టఁడే
కూడన్ ముట్టుద మేటికీ తడవదే గోపాలకుల్ గొల్వ నా
జాడన్ బోయెడి మిన్నకుంట తగునే? శౌర్యమ్ము వమ్మయ్యెనే?
వాడం బాఱినమోముతోఁ బురికిఁ బోవన్ బాడియే యేనికిన్.

భీష్మ— కౌరవేంద్రా! ఎందులకీ పశ్చాత్తాపము?

చ. మనకపమానమా? కడుఁ బ్రమాదము దప్పెను గ్రీడి కేవల
మ్మును గరుణార్ద్రుఁ డేమిటికి మూర్ఛిత నాతనిఁ దూఱఁబోయె? ద
య్యనువునఁ గుత్తుకల్ దునిమెనా? మన మేమగువార మట్టియో
గ్యునికి జయంబు కాక మఱియొక్కనికిన్ జయ మబ్బనేర్చునే?

దుర్యో— (లజ్జాదైన్యములను నటించును)

కృపా— (దృష్టినిగిడ్చి) పితామహా! సుశర్మకాఁబోలు ననతిదూరమ్మున నిట వచ్చుచున్నాఁడు. అక్కడివిశేషము లేమైయుండునో?

అశ్వ— ఇక్కడ నింతమంది యోధానుయోధు లుండి యిట్లుజరిగినదికదా, ఇఁక నక్కడ మఱియొగలాగు జరుగునా?

చ. అట శమనాత్మజుండుఁ గవ లయ్యనిలాత్మజుఁడున్ గడంగిపో
రుటకుఁ దొడంగినన్ బలము రూపఱు టబ్రమె? వీరలెల్ల బా
సట యొనరింప నేగరె? విచారముతోడఁ బనేమి? పార్థు డె
క్కటిన దిగంతముల్ గెలువఁగా వినమే, కనమే తదుద్ధతుల్?

కర్ణ— (తనలో) అక్కటా! మొదట వీరెన్ని వచించిరో దైవ మన్నియును ఘటించినాఁడే? (ప్రకాశము)

చ. బవరము సేయనొక్కఁడును వచ్చుజయం బొకటన్ దొలంగు దీ
నివిషయమై విచారణము నెక్కలుపం బనిలేదు కానిచో
నెవరు నెఱుంగరే? విజయు నేర్పెఱ దైవబలంబు కాక యొ
క్కవిజయుఁడే జయించెననఁగా వశమే కురునాథ యిందటన్?

కృపా— ఒక్కయర్జునుఁడే యొనర్చిన విట్టి వనేక దుర్ఘటకార్యమ్ములు గలవు. ఐనను మనయిప్పటి యావస్యకం దగిన ప్రసంగ మింతకన్న నుండదు.

దుర్యో— (పితామహుదిక్కై) సమయభంగముం గూర్చి తమయభిప్రాయమేమని స్థిరపఱచెదరు?

భీష్మ— నాయభిప్రాయ మిదివఱకే విశదీకరించితిని. వలసినచో

ఉ. ధర్మజుఁ డెన్నఁ డెయ్యెడ నధర్మపథంబునఁ గాలువెట్టఁడీ
మర్మము నీకునుం దెలియు మానవనాథ! తదర్థ మొక్కనిన్
నిర్మలచిత్తు నయ్యెడకు నీసనుపన్ సకలంబుఁ దెల్లపూ
నర్మిలి మీకు వారలకు నాటిఁక నేనియు మేలు భూవరా!

దుర్యో— (తనలో) వారలకును మాకును జన్మాంతరమున నేమోగాని యీ జన్మమున మాత్రము సఖ్యముసుమురను. (ప్రకాశము) కానిండు; పురికిం బోయి యిందుంగుఱించి యోజింతము.

(అందఱును నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వర విరచితం
బగు పాండవప్రవాసమ్మునందు సప్తమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవప్రవాసము

## అష్టమాంకము.

(అంత నర్జునుఁడును నుత్తరుఁడును ప్రవేశింతురు)

ఉత్త— బృహన్నలా! (నాలుక కఱచుకొని) ఇంద్రనందనా! ఈ జయము నేనే యొనర్చినట్లు మాతండ్రిగారికిఁ దెలియఁ జేయింపు మంటివికదా? దానికిం గతమేమి?

అర్జు— ఏమనియా? కొమరుఁడు సంగర మ్మొనర్ప నేగెనని యాయన విని యుండి పదంపడి యొవరిపలననో జయముకల్గినదన్న నంతగా సంతసింపఁడు. (చేయిసాఁచి) చూచితివా, యెట్లలంకరించిరో పట్టనము! (విని) ఉత్తరవిజయమంగళమని చాటింపు వినఁబడుచున్నది.

ఉత్త— (నవ్వి) పదంపడి దానికర్థము నిట్లు చెప్పుకొనవలయును.

అర్జు— ఎట్లు?

ఉత్త— శ్రేష్ఠుఁడైన విజయుని సంబంధమగు శుభమని.

అర్జు— (పరికించి) కొల్వుకూటముదాపునకు వచ్చితిమి. (విని) ఏదో మీతండ్రి గారు బిగ్గరగా నుపన్యసించుచున్నారు.

(అంతట విరటుఁడును బ్రచ్ఛన్నవేషులగు పాండవులు నల్వురును బ్రవేశింతురు)

విర— (కోపముతో)

ఉ. గొల్లలువచ్చి నాకొమరు గొప్పదనంబు వచింప నేను నా
కెల్లను జాటఁ బంపఁ దగదే? యొక పేడికతమ్మునన్ జయా
భ్యుల్లసనంబు గల్గునె? రిపుల్ రథసారథి గొనియాడింతురే?
నల్లవొ! యిట్టిమాట లనినన్ సహియింపను గంక! యింక నిన్.

ధర్మ— రాజా! కోపింపకుము.

క. కౌరవు లెక్కడ? మిగులఁగు
మారుఁడు పసితనమువాఁడు మనయుత్తరుఁ డ
ప్రారబ్ధసంగరవిశే
షారూఢుం డేడ? గెలుచు టది యెడ? నృపా!

కావున నామాట విని బృహన్నలవిజయంబు చాటింప నంపుము.

ఉత్త— (విని) మన మొనర్చిన కపటము మీ యన్నగారికిని మా తండ్రిగారికిని కలహమునకుఁ గారణం బగుచున్నయది. మన మిఁకఁ దడయఁ దగదు. పోయి యథార్థము నివేదింతము.

అర్జు— నీవు ముందరుగుము నీవెనువెంటనే నేను వచ్చెదను.

విరా— (కోపముతో)

క. పేడిఁ బొగడఁగ వలదన
నోడవు భయమింత లేదహో! నాయెడ నీ
జాడ యెఱుఁగంగవచ్చెను
జూదము శిక్షింతునిను నసూయ యడంగన్.

(సారెగొని వేయును)

ద్రౌప— (అపటీక్షేపముగా సైరంధ్రీవేషముతోఁ బ్రవేశించి, చీరచెఱఁగున రక్తముఁ దుడుచుట నటించును)

భీము— (క్రోధము సూచించును)

ఉత్త— (తత్తరముగా వచ్చి) తండ్రీ! యెంత యనుచితము గావించితివి?

ఉ. అమ్మహనీయుఁ డెవ్వరని యాత్మఁ దలంచితి? ధర్మమూర్తి లో
కమ్మఖిలమ్ము నేలఁగల కార్యవిచక్షణుఁ డుత్తమోత్తముం
డిమ్మెయి ధిక్కరింతువె? శుభేచ్ఛులకున్ ద్విజవర్యరక్తపా
తమ్మది శ్రేయమే? సకలధర్మవిధిజ్ఞుఁడ విట్లొనర్తువే?

వి.రా— (విని విననియట్లు పట్టరాని సంతోషముతో)

ఉ. కౌరవసేన నక్కడఁపఁ గల్గితి వెట్లు కుమార? యాజిదు
ర్వారులు వార లప్పరశురామవిజేత పితామహుండు మేల్
భారతవీరులన్ గెలిచి వచ్చితి వెంతకుఁ జాల? వేను స
త్కారము గంటిఁ బుత్రకులఁ గాంచినవారలకెల్ల మేటినై.

ఉత్త— తండ్రీ! పదంపడి సకలమ్మును దెలియనగుం గాని ముందయ్యనఘుని వేఁడికొని సుప్రసన్నుం జేసికొనుము.

విరా— కుమారా ! బృహన్నల యెక్కడ ?

అర్జు— (సమీపించును)

ఉత్త— (గౌరవముతో) ఈయనయే.

విరా— (తనలో) ఇతఁడే బృహన్నలయెట్లగును. (సంశయముతో ప్రకాశము)

ఉ. ఆతఁడు పేడి యీతఁ డనఘాకృతిఁ బోల్చెడి శక్రసూనుమంతుఁ డ
త్యాతతపౌరుషంబునకు నాకృతియో యన నొప్పువాఁడు ప్ర
ఖ్యాతగుణాకరుం డని మొగంబె తగం బలుకం దొడంగె నీ
కీతనిసఖ్య మెట్లొదవె? నేర్పడఁ జెప్పుము నాకుఁ బుత్రకా !

ఉత్త— సకలమ్మును బిదప విస్తరించి వచించెద. ఇపుడు సూత్రప్రాయముగా విని మఱియొండు వచింపక యిమ్మహామహు శరణంబు వేఁడికొనుము.

(పాండవులను ద్రౌపదిని గేల నిర్దేశించుచు)

ఉ. ఈయనఘుండు పాండుధరణీంద్రుని యగ్రతనూజుఁ డాతఁ డ
త్యాయతశక్తి భీముఁ, డితఁ డర్జునుఁ, డయ్యనఘుల్ కవల్, సతీ
గేయచరిత్ర పాండుసుతగేహిని యీయమ యాజ్ఞసేని, వీ
రీయెడ గూఢవర్తనమెయిన్ జరియింతురు సత్యసంధులై.

విరా— (పశ్చాత్తాపముతోఁ దనలో)

ఆ. వె. నను సుశర్మ పట్టుకొని రథమునఁ బెట్టి
నంతలోన నన్న యాజ్ఞఁ జేసి
విడువఁ జేసినట్టి వీరుండు భీమసే
నుండె సందియం బొకండు గలదె?

నివురుగప్పిన నిప్పుపగిదినున్న వీరలయెడఁ గడునవజ్ఞ సలిపితిని. ఇందుకేమి నిష్కృతి? ఇట్లుఁగాక (ప్రకాశము) అనఘాత్మ ! నన్ను క్షమించి నాయపరాధము మరవవలయు. (ధర్మరాజు పాదములపైఁ బడఁబోవును)

ధర్మ— (పడకుండ లేవనెత్తి)

క. నరపాల ! యిందు నీ త
ప్పరయఁగ లేశంబు గల్ల దఖిలమ్మును న
క్కురునాథునిదురితమె నా
దురితమె కావలయు ద్యూతదోషంబగుటన్.

దౌవా— (ప్రవేశించి) జయము జయము దేవా ! దుర్యోధనమహారాజుగారి

యొద్దనుండి యెవరో యొక రాయబారివచ్చి ద్వారమున నున్నాఁడు.

విరా— ప్రవేశపెట్టుము.

రాయ— (ప్రవేశించి నలు దెసలు దిలకించి) ఇందు ధర్మరాజుగారెవరో నాకు నొకింత తెలుపవలయు.

ఉత్త— (చేతితో) ఆయనయే (చూపును)

రాయ— (వినయముగా) అయ్యా! "మీతమ్ముఁడు ఫల్గునుఁడు సమయభంగం బొనర్చెఁ గావునఁ దిరిగియు మీ రరణ్యమున యథాపూర్వమ్ముగ వసించి యజ్ఞాతవాసమ్ముఁ గూడ నాచరింపవలయు నఁట. ఈసంగతి మీతో మనవి చేసి మీయభిప్రాయమును దెలిసికొని ర"మ్మని మారాజుగారు నన్నుం బనిచిరి.

ధర్మ— (ధైర్యముగా) సమయభంగము లేశమును గాలేదనియు, మాయర్జునుని మీరు గుర్తుపట్టుటకుఁ బూర్వదినమునకే పదమూఁడు వత్సరములు నిండె ననియు, మీరాజుతో నామాటలుగా మమ్మాటికిఁ జెప్పుము.

రాయ— చిత్తము. (పోవుచుండఁగా)

భీము— ఓయీ! మాట.

ఉ. నిండెను వత్సరమ్ము లని నీపతితో నృపుఁ డాడినట్టు ల
ద్దండతఁ జెప్పి పిమ్మట నతం డది వెండియుఁ బృచ్ఛ సేయ "జా
ల్మండ! సుయోధనుండ! యధముండ! త్రయోదశవత్సరంబులే
నిండుట గాదు నిండెనఁట నీదగు నాయువు" నంచుఁ దెల్పుమీ.

ఇట్లుగూడఁ దప్పక చెప్పుదువుగాక.

ఉ. నిండెను నీదుపాపములు నిండె భవత్పరిపాలనంబును
న్నిండెను నీసహోదరుల నిక్కులు పెక్కులు సెప్ప నేల తాఁ
బండె నజాతశత్రుని తపంబును ద్రోపది భాగ్యరేఖ భీ
ముండును దమ్ములున్ సలుపఁబూనిన యత్నమునంచుఁ దెల్పుమా.

అర్జు— నే నిట్లంటినని చెప్పుము.

ఉ. నిండినయాయువే మరల నీకు విరాటసుతుం డొసంగె లే
కుండిన బొమ్మపొత్తికల కుత్తరకై తలచీరఁ గోయుచో
దుండగు నెట్లు చంపినను దోసములేదని తోఁచి కుత్తుకన్
ఖండన సేయ నిప్పటికి కాఁదగు నుత్తర ముత్తరక్రియన్.

ధర్మ— (శాంతముగా) ఓయీ! వీ రనుభవించిన కష్టంబు లట్లు వీరలం బేరేఁపుచున్నవి. తప్పక నా వచనంబులుమాత్రము చెప్పుము. పొమ్ము.

తాయ— చిత్తము.

(నిష్క్రమించును)

విరా— (వినయముగా) రాజేంద్రా! నీ వీ సింహాసన మలంకరించి మీతమ్ము లందఱి నుచితరీతి నయ్యై మహాసనమ్ముల నుండం జేసి యింతవఱకు మీయెడ నే నొనర్చిన యపచారమ్ము మఱవవలయు. (బలవంతముగా సింహాసనమ్మునఁ గూర్చుండఁ బెట్టి భీమాదులఁగూడ నుచితాసనమ్ముల నలంకరింపఁజేసి ద్రౌపదిదిక్కు) అమ్మా! పాంచాలరాజపుత్రి!

చ. పగవుడమున్ బొనర్చితివి వామవిలోచన మద్గృహమ్మునన్
సరిసర! యెంతదుష్కృతము సల్పితి మేమును మత్కుటుంబమున్
గురుకులవర్ధనీ? యనుఁగుగోడలిఁగాఁగఁ దనూజ నిత్తు ను
త్తరను గ్రహించి యక్కృతనఁ దప్పిడఁజేయఁగదమ్మ! సోదరీ!

ఉ. దుష్టుఁడటంచెఱింగియు వధూమణి! కీచకునింటికి న్నినున్
శిష్టచరిత్రి నంపిన కుశీల సుదేష్ణ మదీయభార్య నే
కష్టము నందనున్నదియొ? కాఁగల కార్య మొకండె యుండు? సం
తుష్టమనస్కవై శుభవిధుల్ ఘటియింపుము మాకు నెమ్మెయిన్.

ద్రౌప— (గౌరవముతో) అన్నా! నీతో వియ్యమందుట మాకుఁ బరమప్రియమే. తప్పక నీకొమరితను మాసుభద్రకుఁ గోడలింగాఁ గైకొంటిని.

ధర్మ— (తనలో) అగును, పాంచాలియూహ కడుఁ జక్కఁగా నున్నయది. ఆకన్నియ యభిమన్యునికే భార్యయగుట కడు నుచితము.

విరా— సోదరీ! మీకుటుంబములో నెవరికేనియును నాకు సమ్మతమే. ఇప్పటికి నేను ధన్యుఁడను. (ధర్మజునిదిక్కు) రాజేంద్రా! నేఁట రేపట నీవివాహ మహోత్సవంబు సలక్షణంబుగా నడపి నన్నుఁ గృతార్థునిం జేయఁగోరెద.

ధర్మ— అవశ్యమును నట్లేజరగును. దీనికింత నొక్కి చెప్పవలయునా?

విరా— (భీమునిదిక్కు చిఱునవ్వుతో) బావా! మహాసనమ్మునకుం దగిన మిమ్ము మహానసమ్మున నియమించి తాఱుమాఱొనర్చిన నన్ను మన్నింపవలయు. (ధర్మజునిదిక్కు) సకలలోకధురంధరత్వము వహింపఁగల మీకు నేనింతకన్న నేమి ప్రియమాచరింతును? అయిన నిట్లగుఁగాక!

## భరతవాక్యము

ఉ. ధర్మమునందు నీవలెనె తక్కిననృపుల్ చరియింతురు గాక స
త్కర్మములందు నీవలెనె కర్మఠులెల్లఁ జరింతురు గాక నీ
పేర్మి సహోదరుల్ బలెనె పెద్దలఁ బిన్నలు గారవింత్రు గా
కోర్మిని నీసతిం బలెనె యుగ్మలు లెల్లరు గొంద్రుగావుతన్.

## గద్య.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వర
ప్రణీతంబగు పాండవ ప్రవాసమ్మున
సర్వంబును అష్టమాంకము
సంపూర్ణము.

## —• తప్పొప్పుల పట్టిక. •—

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు. |
|---|---|---|---|
| 1 | 15 | గొదువ | గొదవ |
| 10 | 7 | ఛీ | చీ |
| 10 | 15 | బొత్తుగా | బొత్తిగా |
| 14 | 17 | జేవఁగ | జేవగ |
| 16 | 26 | మిఁతు | మింతు |
| 26 | 15 | నిఁగొ | నిగొ |
| 29 | 4 | నెఁపా | నెపా |
| 30 | 9 | గునె | గునే |
| 36 | 26 | అప్ప్ర | అప్రి |
| 42 | 21 | గెలిపు | గెలుపు |
| 44 | 31 | నెవ్వెఱ | నివ్వెఱ |
| 47 | 24 | డిఁయొ | డియొ |
| 57 | 2 | తింయు | తియు |
| 62 | 1 | నిరరుల | నిర్జరుల |
| 64 | 3 | పదఁపడి | పదపడి |
| 94 | 4 | వెటొ | వేటొ |
| 99 | 10 | జూద | జూత |
| 99 | 26 | యొగ | యొక |

# ఉపోద్ఘాతము

(తృతీయముద్రణము)

చదువరులారా !

ఈమూఁడవకూర్పునం దనేక హేతువులంబట్టి యీవిజయ మించుకమాఁ
బడినది. దీనినుండి మొదటి యొకటి రెండంకములు తగ్గించి నూతనముగా నొ
యంకము చేర్పఁబడినది. ఆ రెండంకములకును మఱికొన్ని యంకములు చేర్చి
పాండవోద్యోగమను పేర నింక నొక నాటక మచిరంబునన ప్రకటింతుమ
ఇంతకుమున్ను జనపత్రికలో భారతమెల్ల నాల్గు నాటకములే యని వ్రాసిన
ఈకారణమున నైదునాటకములు కావలసి వచ్చినది. ఇప్పటిమార్పు చొప్పున
ప్రదర్శకులకు మునుపటివలెఁగాక సుకరమగునని యెంచితిమి గాని తిఱిగియు
మధ్యమధ్యఁ గొన్ని విశేషములు చేర్చుటచే వెనుకటియంత పెద్దనాటకము
నిదియు నించుమించు కాకతీఱినదికాదు. అగుఁగాక, ప్రదర్శకులు జాగరూ
లగుదురేని బ్రదర్శింప వచ్చును..............................

పూర్వపువిజయము యుద్ధప్రధానమేగాక సంధివిషయమునుగూడ నొఁ
యుండెడిది. ఇప్పటిమార్పులోఁ గేవల యుద్ధముమాత్రమే యిందుఁ జేర్కొ
నఁబడినది. ఈ విజయమునందేమి యితర భారతనాటకములయందేమి మేమ
వీలునుబట్టి కొన్ని యెడల సంస్కృతభారతమును గొన్నియెడలఁ దెలుఁగుభార
మును ననుసరించి మఱికొన్ని యెడల నాటకసంప్రదాయమునుబట్టి యీ రెం
కిని భిన్నమగునట్లు రచించియుంటిమి. ద్రోణవధవిషయమున నీతుది సంగ
స్పష్టముకాఁగలదు. తెలుఁగుభారతము సంస్కృతమునుండి వచ్చినదేయైన
ననేకస్థలముల నెంతో భిన్నముగ నున్నయది. స్థాలీపులాకన్యాయముగ
గొన్ని హెచ్చుతగ్గులు చూపఁబడుచున్నవి. ద్రౌపదీస్వయంవర ప్రస్తావనలో
గర్ణుఁడు మత్స్యయంత్రమును నఱకుటకు సిద్ధమైయుండ ద్రౌపది

"నాహం వరయామి సూతం"

అని యనాదరించినట్లును పదఁపడి యతఁడు విముఖుఁడైనట్లును సంస్కృతవ
నుండఁ దెల్గులో నితఁడు చాపము నెక్కు పెట్టుటకై తిలమాత్రము కొ
యున్నట్లు మార్పఁబడియున్నది. మఱియు నభిమన్యువధఘట్టమున దుశ్శా
సుతునిచే నభిమన్యుఁడు మడిసినట్లును పదఁపడి మఱియొకప్పుడీదౌశ్శా
ద్రౌపదేయునిచేఁ జంపఁబడినట్లును సంస్కృతమందుండఁ దెల్గులో వీరిరువురి

శ్లోకకాలమందే హతులైనట్టు లున్నది. మఱియుఁ దెల్గులో భీముఁడు కర్ణుని వాలుకఁ గోయఁబోఁగా శల్యుఁడు వారించినట్లున్నది. సంస్కృతములోఁ గర్ణుఁడు మూర్ఛపడినట్లు మాత్రమే యున్నది. ఇట్టివశ్లోకములుగలవు. గ్రంథ విస్తరభీతిచే నీవిషయమును విరమించెదము. ఇంక నీభారతయుద్ధ మెప్పుడుజరిగిన దనః-శల్యపర్వములోని

“ ప్రవిష్టంకలియుగం విద్ధి ”

యను శ్రీకృష్ణవాక్యము ననుసరించి కలియుగ మించుక భుక్తమైనపిమ్మట నని తెలుచున్నదిగాన నిప్పటి కించుమించుగ నైదువేల వత్సరము లనుకొందము. ఇందేదైన మతభేదమున్న నుండ నిండు గాని యుద్ధప్రారంభ తిథిమాత్రము.

## కార్తికామావాస్య కాదు, కార్తికశుద్ధదశమి.

అమావాస్యావాదులకు 14 నాఁటి రాత్రి యుద్ధమున దీపములు వెలిగించుటయు సగమురాత్రి గతించినపిదపఁ జంద్రుఁడుదయించుటయుఁ బూర్తిగా బాధకములు. ద్రోణపర్వము 163-185 అధ్యాయములు చూడుఁడు. అంతవఱకక్కఱలేదు. ఈవిషయము తెల్గులోఁజూచిన ద్రోణపర్వమున 5 వ ఆశ్వాసములోఁ దెలును. దశమీపక్షమున నీబాధలేదు. శుద్ధదశమికి 14 వ దినము బహుళాష్టమిగాన నాఁడు 16 గడియలకుఁ జంద్రుఁడుదయించుట సంఘటించుచున్నది. ఇట్లేని,

“అష్టపంచాశతం (58) రాత్ర్యశ్శయానస్యాద్యమేగతాః”

ఆనుశాసనికములోని వాక్యము కుదురుట దుర్ఘటమందురేని ఈ 58 రాత్రులు శరతల్పశయనానంతరము 25 వ దినమునఁ గృష్ణుఁడు

“పంచాశతం షట్చ (56) కురుప్రవీర శేషందినానాంతవజీవితస్య”

యన్న నాఁటినుండి లెక్క పెట్టినఁ దుదిరాత్రితో సరిపోఁగలదు. ఇక్కడ వ్యాఖ్యాత క్లిష్టార్థమును జెప్పి ఇఁక నీకు 30 దినము లాయువుకలదని తేల్చెను గాని యది తిక్కన్నగారి తెల్గునకు విరుద్ధ మగుటయేగాక

“ ఉషిత్వాశర్వరీశ్శ్రీమాన్ పంచాశన్నగరోత్తమే ”

యని యానుశాసనికమునఁ జెప్పిన దానికిఁగూడ విరుద్ధము. ఈ పంచాశత్పదమునకు వెనుకటిదానికింబలెఁ గ్లిష్టార్థము చెప్పి 30 రాత్రులని సాధించుట యశక్యము. 30 దినములలో భీష్ముఁడు స్వర్గస్థుఁడైనచో 50 దినములపైని ధర్మజుఁడు వెళ్ళి సెంచ్చూసెని యతఁడు చనిపోయిన 20 దినములకా ! ధర్మరాజు భీష్మునిజూడఁ గోరినది ? కాదుకదా, తిక్కన్న

"పంచాశతం షట్చ"

అను శాంతిపర్వస్థ శ్లోకమునకు

"ఏబదియారు దినములకు" అనియును జేసి త్వా— "పంచాశత్"

అన్నచో

"పంచాశద్వాసరానంతరంబ"

యనియును దెనిఁగించె. దీనింబట్టి శాంతిపర్వమున

"పంచాశతం షట్చ"

అను పదమునకు 30 దినములను నర్థము చెప్పి యంతకుఁబూర్వము శరతల్పశయనము మొదలు 28 రాత్రులనియును ఈ 30 యు ఆ 28 యుఁ గలిపి 58 చేసి

"అష్టపంచాశతం"

అను శ్లోకమును సరిపెట్టి కార్తికామావాస్య మొదలు మాఘశుద్ధాష్టమివఱకు 88 దినములనియు నందు భీష్ముని యుద్ధదినములు 10 యును ద్రోసివేయఁగా 58 రాత్రు లాయన యంపశయ్యయం దుండెననియుఁ జెప్పు పక్షము పూర్తిగా దుర్బలమని తేలినది. ఈ చూపినవే కాక యీపక్షమున నింకొక నాల్గుదినములు ధర్మజున కాశౌచవిషయమున వృథాగాఁ గల్పికొనుట యొక యనుచితము. అది కల్పనిచో భీష్మనిమృతి మాఘ శు 5 నాఁడు కావలయు లేకాక

"అష్టపంచాశతం" "చతుష్పంచాశతం"

కావలసివచ్చును. లోకప్రసిద్ధమైన భీష్మైకాదశీద్వాదశులు నేతిబీఱకాయ లగుచున్నవి. అమావాస్యాపక్షవాదులు భీష్ముఁడు శరతల్పమందున్నది 58 రాత్రులనిగదా చెప్పుచున్నారు. వారికిఁగల విప్రతిపత్తులు సంగ్రహముగాఁ జూపితిమి కాన నిఁక శుద్ధదశమీపక్షవాదుల సిద్ధాంతమును జూపుచున్నాము. వీరిమతమున భీష్ముఁడు శరతల్పమందున్నది 82 దినములు. మాఘశుద్ధ ద్వాదశి నితఁడు స్వర్గతి చెందెను. కార్తిక శుద్ధ దశమికి మాఘశుద్ధ ద్వాదశి 92 వ దినమగును. కాన భీష్మ యుద్ధదినములు 10 యును 82 లోఁ జేర్చుకొన్న 92 దినములు తేలును.

"అష్టపంచాశతం"

అనునది తిరిగియు శాంతిపర్వమున 25 వ దినమునఁ గృష్ణుఁడు

"పంచాశతం షట్చ"

అని చెప్పినదిది మొదలుకొని లెక్కించుకొనవలెనని వ్రాసియే యున్నారము. 25 వ దినమున శ్రీకృష్ణుఁ డీమాటచెప్పె నను నిర్ధారణ యెట్లనఁగా, భీష్ముఁడు

శరశయ్యా నలంకరించినది మొదలుకొని 8 దినములు యుద్ధశేషముగదా; 9 వ నాఁడు దుర్యోధనమృతి. నాఁడు మొదలు 12 దినములు ధర్మజున కాశౌచము. శ్రాద్ధదాన, పురప్రవేశ, పట్టాభిషేక ప్రకృతిసాంత్వనాదులకు 4 దినములు. వెరసి 24 దినములు. 25 వ దినమున భీష్మునికడ కరిగినట్లు విస్పష్టము. అమావాస్యాపక్షవాదుల కనుకూలముగ వ్యాఖ్యాత ఈలెక్కలో యుయుత్సుఁడు వైశ్యాపత్యముకనుక నతనికి 16 దినములవఱ కాశౌచమగుటచే నతఁడును పాండవులును శ్రాద్ధము కలిసి చేసినట్లభిప్రాయపడి పృథాగా నతనికై 4 దినములు ధర్మజాదులు శ్రాద్ధ మొనరించుకొనక మిన్నకున్నట్లు వ్రాసినాఁడు. అట్లాగుట లోక విరుద్ధమును శాస్త్రవిరుద్ధమునుగూడనై యున్నది. కావున నీ నాల్గుదినములును మేము కట్టుకొనలేదు.

" క్షత్రియోద్వాదశాహేన వైశ్యఃపంచదశాహకైః "

అని పరాశరస్మృతి; తేలిన సారాంశమిది- భీష్మ శరతల్పశయనము మొదలుకొని 25 వ దినమున ధర్మజుఁడు శ్రీకృష్ణాదులతో భీష్మునియొద్దకు వెళ్ళెను. కృష్ణుఁడు నీకిఁక 56 దినములు జీవితశేషమనిచెప్పెను. కావున నిర్యాణదినమున భీష్ముఁడు 58 రాత్రులు లెక్కచెప్పెను. ఇయ్యెడ (గతాః) అను పదమునకు "వెళ్ళవచ్చెను" అను నర్థమేని చెప్పికొనవలెను; లేదా,

" ఈషద్వైషమ్యమవివక్షిత "

మనియేని యనఁదగు. ఈమాత్రము సహించితిమేని దశమీపక్షమున నేచిక్కును లేదు. అమావాస్యవారికో,

" [illegible]శతంపట్బా "

అను దానికి భారతసారవేదియగు తిక్కన్న సోమయాజి 58 అని తెల్గించియుండఁగా 30 దినములని క్లిష్టవ్యాఖ్యానము చేసికోవలెను. అందుకు సమ్మతించినను ధర్మజుఁడు 50 రాత్రులు పట్టనమున నుండిన పిదప నీవిషయమును స్మరించెనని యనుశాసనికములోనుండుటచే నతఁడు ప్రమత్తుఁడు కావలసివచ్చును. దానిపై భీష్మనిర్యాణఘట్టమెల్లఁ బొల్లగును. తక్కుఁగల విరోధము లట్లుండ నమావాస్యవారికి లెక్కలోఁగూడ పైని జెప్పిన వైషమ్యము లేకపోలేదు. అందుకే వ్యాఖ్యాత 16 వ దినమున వైశ్యులకు శుద్ధి చెప్పుటకు బదులు 17 వ దినమునఁ జెప్పినాఁడు. ఇట్లు చెప్పనిచో 28 వ నాఁడే ధర్మజుండు భీష్మునియొద్దికి వెళ్ళినట్లగును. అట్లేని [illegible]కు

" అష్టపంచాశతం, సప్తపంచాశతం "

కావలసివచ్చును. ఇంకను విస్తరించిన నొక గ్రంథము వ్రాయవలసివచ్చునని మాత్రమిప్రాయముగా వ్రాసితిమి. మే మీ దశమీపక్షమును గనుఁగొనుటకు

బీజము మున్నుదాహరించిన ద్రోణపర్వస్థమగు నధ్యాయద్వితయము, కాన వలయువారవి చూతురుగాక. అమావాస్యవారికి 18 వ నాఁ డశ్వత్థామ చీఁకటిలోఁబోయి శిబిరము చొచ్చె నను భారతముగూడ విరుద్ధమే యగును. ఆనాఁడు బహుళ ద్వితీయకదా కావలెను. 4 గడియల రాత్రికే చంద్రోదయ మగును. తెల్లవారుదనుక వెన్నెల పుచ్చపువ్వుపలె నుండును. దశమీపక్షము వారికీబాధలేదు. వీరికి నాఁడు బహుళ ద్వాదశి గాన 24 గడియలకుఁ గాని చంద్రోదయము కాదు. అప్పటికి నశ్వత్థామ కృత్యమంతయు నెఱవేఱవచ్చును. కావున నిం దెచ్చటనేని ఈషద్వైషమ్యమున్నను వారిపలె మాసములును బక్షములును హెచ్చుతగ్గుండనంమనఁ జదువరులు శుద్ధదశమినే భారతయుద్ధ ప్రారంభ దినముగా నెఱుంగుదురుగాక. మాఘశుద్ధద్వాదశి భీష్మనిర్యాణము. కావుననే అష్టమి మొదలు నాఁటివరకును నీవ్రత మాచరించుట యాచారముగా నున్నది యని గ్రహింతురుగాక. మే మశ్వమేధములో వ్రాసిన యేకాదశినిగూడ నీషద్వైషమ్య మని సమన్వయించుకొందురుగాక . . .

తిరుపతివేంకటేశ్వరులు.

# ఇందు వచ్చు పాత్రలు.

1 వ అంకము

1-సూత్రధారుఁడు
2-నటి
3-భీష్ముఁడు
4-కృష్ణుఁడు
5-అర్జునుఁడు
6-సాత్యకి

2 వ అంకము

1-భాగీరథి
2-యమున
3-సరస్వతి
4-కృశానుఁడు
5-విశ్వావసుఁడు

3 వ అంకము

1-పంచపాండవులు
2-అభిమన్యుఁడు
3-కరండకుఁడు
4-బకోటకుఁడు
5-సుమిత్రుఁడు
6-ద్రౌపది
7-యుయుత్సుఁడు
8-కృష్ణుఁడు

4 వ అంకము

1-కృష్ణుఁడు
2-అర్జునుఁడు
3-ధర్మరాజు
4-బకోటకుఁడు

5 వ అంకము

1-ధర్మరాజు
2-సేవకుఁడు
3-కృష్ణుఁడు
4-భీముఁడు
5-అర్జునుఁడు
6-హిడింబ
7-సాత్యకి
8-ధృష్టద్యుమ్నుఁడు

6 వ అంకము

1-శల్యుఁడు
2-కర్ణుఁడు
3-కృష్ణుఁడు
4-అర్జునుఁడు
5-ధర్మరాజు
6-అశ్వత్థామ

7 వ అంకము

1-దుర్యోధనుఁడు
2-సంజయుఁడు
3-కంకాళికుఁడు
4-కృపాచార్యులు
5-అశ్వత్థామ
6-కృతవర్మ
7-పంచపాండవులు
8-కృష్ణుఁడు
9-కిరాతుఁడు
10-బలరాముఁడు

8 వ అంకము

1-దుర్యోధనుఁడు
2-పాండవపంచకము
3-కృష్ణుఁడు
4-బలరాముఁడు
5-సంజయుఁడు
6-కృపాచార్యులు
7-అశ్వత్థామ
8-కృతవర్మ

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవ విజయము

## ప్రథమాంకము

( నాంది )

చ. కరము మనోహరంబు లతికర్ణము లాశ్రితవత్సలంబులుం
బరపుర భేదకంబులు సుమాసదపాంగనివాసభూము లు
ద్ధురకృపభావుకంబులు విధాతపితామహ మస్తకంబులౌ
హరిహర నాథులోచనము లైదిటికి న్విజయంబు గావుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్రి— ఆర్యురాలా ! నీయొడలి సింగారము ముగించుకొని త్వరగారమ్మా.

(నటి ప్రవేశించును)

నటి— ఆర్యపుత్ర ! ఇదిగో వచ్చితిని. ఏమి సెలవు ?

సూత్రి— ఏమి యింత తడసితివి ? రసాస్వాదనత్వరాయమాణమానసులగు సభాసదు లింతటి కాలహరణమున కోర్తురా ?

నటి— ఈనాఁడు తలదువ్వుకొనుటకుఁ గొంచెమాలస్యమయినది కావున క్షమింపవలయును.

సూత్రి— సహజశ్రీగల యీకురుల సంతతికి శృంగారము గూడ నేల ?

నటి— సహజశ్రీగలవానికయినను సంస్కారమువలన మిగుల శోభవచ్చునుగదా ?

సూత్రి— (ఆలోచించి) ఔను. ఐనను స్త్రీలకు సహజసౌందర్యమే సౌందర్యము. అందును నకృత్రిమాలంకరణములలోఁ గురులసంతతియే ప్రథమగణ్యంబు.

గీ. కృష్ణవిమతంబు ద్రోణగాంగేయభూషి
తంబు ద్విష్టశిఖండిమద్రబాహుళంబు

కర్ణసంరోధియై కల్మిఁ గాంచఁగాని
కాలగతిఁ గ్రుంగుఁ బాండవాక్రాంతమగుచు.

నటి— కాలక్రమము మాటఁ దలంచిన నీకురుల సంతతియే కాదు.

గీ. అంచితాంగాతిశయమెల్ల నడఁగిపోవుఁ
జివరకు బల్లెంబు శల్యావశిష్టమగును
గడకు భీమగదాహతిఁ గాల్లు గదప
లేక చెడు రాజరాజైన పీఁక యొడలి.

సూత్ర— ఈయప్రస్తుత ప్రశంసవలనఁ బ్రకృతమే మఱచితిని.

నటి— 'ఏమిసెల' వని మొదటనే ప్రార్థించితిని గదా.

సూత్ర— ఇదిగో నీ పత్రికఁ జదివికొనుము. (చేతికిచ్చును)

నటి— (తనలోఁ జదివికొని ప్రకాశముగా)

గీ. పాండుసంతానకీర్తి దర్పణము ధార్త
రాష్ట్రశతతతదుర్యశోర్పణము నపర
సాపణముఁ జూడవలయు సంసారభార
తరణమగునట్టి యాభారతరణమిపుడు.

అని యిందున్నది. కావునఁ దత్కథాభూయిష్టమగు నాటకమును ప్రదర్శింపవలయు. కాని యట్టినాటక మేదియో స్మృతికి రాకున్నది.

సూత్ర— స్మృతికి రాకేమి ? నేనిదివరకే నిశ్చయించుకొని యున్నాను.

నటి— దాని పేరేమి సెలవిండు.

సూత్ర— సీ. గోదావరీపావనోదారతీరద్వ
యీరాజితావనీదారుఁ డనుచు
సంస్కృతాంధ్రకవిత్వ సారస్యమకరంద
భసలాయితామితప్రతిభుఁ డనుచు
హూణభాషోదన్వ దుల్లంఘనక్రమ
ప్రాప్త బీ. ఏ. పట్టభద్రుఁ డనుచుఁ
గరుణాతరంగరంగత్కటాక్షచ్ఛటా
పాలితాఖిల పరివారుఁ డనుచుఁ
నెవని నుతియింతు రట్టిపోలవరనగర
పాలకుండును బ్రాహ్మణ ప్రభువునైన
కృష్ణభూపాలవరుని ప్రేరేపణమున
సకలగీర్వాణ రూపరూపకము లరసి.

చ. నవరసపూర్ణపూరితము నాటకమీయది! యంచు బెంచిపాం
డవవిజయంబుఁ జెల్గునటనొవ్వరిచ్చిరి వీరరసప్రధానమున్

నటి— కృతికర్తలపేరు చెప్పరైతిరి.

సూత్ర— చెప్పుచుండఁగనే నీకింత తొందరయేల ?

కవలవలెం జరించుచుఁ బ్రఖ్యాతి వహించు శతావధానులే
కవు లిఁక వారిపేరులు జగద్విదితంబులు చెప్పనేటికిన్ ?

నటి— తిరుపతి వేంకటేశ్వరులా ?

సూత్ర— ఏమీ నీ తెలివితేటలు ? చెప్పకయే తెలిసికొంటివి.

నటి— (నవ్వుచు) నీమాటలువినిన 'నేమీ నీతెలివితేట' లని కాకుస్వరముగానే మరల ననవలసి వచ్చినది. 'వారిపేరులు జగద్విదితంబులు చెప్పనేటికిన్' అనుచు నెట్లు తెలిసికొంటివని యడిగితివేమి ?

సూత్ర— ఆ పాండవవిజయ మీ సభాసదుల యానతికిం దగినది. కావున దానిం బ్రదర్శింతము. ఈ నీ చతురవాక్యముల కేమిలే. సంగీతము పాడి చాతుర్యముఁ గనఁబఱచుకొనవలయును.

నటి— ఏఋతువు నాశ్రయించి పాడవలయును ?

సూత్ర— మనము ప్రదర్శింపఁబోవు నాటకమున కనుగుణమగు నీ శరదృతువునే వర్ణింపుము.

నటి— గీ. ధార్తరాష్ట్రసమూహంబు దక్షిణాశ
కభిముఖంబుగఁ జను సమయంబుచూవె
ప్రబల పాండవహంసలు పట్టువదలి
యచ్ఛమానసవైకల్య మనుభవింప.

(తెరలో)

భరతపుత్రా ! ఏల యిట్టి యసంబద్ధాలాపము లుపన్యసింపఁ జేయుచుంటివి ?

ఉ. నేఁటికి రెండునాళ్ళు చనె నేను ధనుస్సు ధరించి శాత్రవో
ద్ఘాటన మాచరించుటకుఁగా నని సేయఁగడంగి; సేన నా
నాఁటికిఁ బాండవేయులది నాశనమందు కాని కాన నే
పాటునులోటుఁ గౌరవులపక్షమునం; దిటు పల్కనేలొకో.

సూత్రి— (వినుటనటించి) చెలీ ! నీ ఋతువర్ణనమునందలి ధార్తరాష్ట్ర పదంబునకు హంసవిశేషము లను నర్థముకన్న ఝడితిస్ఫూర్తిఁ నందుచున్న కతన ధృతరాష్ట్ర పుత్త్రులను నర్థంబును గైకొనుటచేఁ గాఁబోలు భీష్ముఁడు మనపైఁ గనలుచు నిటు వచ్చుచున్నాఁడు. ఇఁక మన మీతని యగ్రమున నిల్చుట తగదు. పోదమురమ్మ. (నిష్క్రమింతురు)

(ఇది ప్రస్తావన)

(భీష్ముఁడు ధనుఃపాణియై పటాక్షేపమునఁ బ్రవేశించి దృష్టినించి తనలో)
ఓహో ఇదియా హేతువు.

చ. అనలము గ్రుమ్మరించెడి మదస్త్రపరంపరచేతఁ జాల నొ
చ్చినకతనన్ యదూద్వహుఁడు చేత సుదర్శనమున్ ధరించి తా
మును పొనరించు నాసమయముం దిగఁద్రావి ననున్ వధింపఁగా
ననికిఁగడంగె (కొంచెమూరకుండి) అర్జునుని యానసమల్లదె వెల్ల
(ఆశ్చర్యముతో) నయ్యెడిన్.

మ. తన కేలం గల పగ్గముల్ కశయు భద్రంబౌగతిన్ డాఁచి హ
మ్మని చక్రంబును గేలఁగైకొని యధర్మారంభుఁడయ్యున్ సధ
ర్మునిఁ బార్థుం గెలిపింపనెంచి యచలంబుంబోని కౌంతేయు స్యం
దనమందుండి మృగేంద్రుభంగి ధరకున్ దైత్యారి లంఘించెడిన్.

(మరలఁ బరికించి)
వెనుకకు లాగు బాహువులు బిగ్గఁగఁబట్టి ధనంజయుండు; కో
పనుఁడు సుదర్శనాయుధుఁడు పార్థునితోడన వచ్చుచుండె ముం
దునకు; మహోశుగోద్ధతిని దూఁగుచు సంద్రము సాంద్రభంగి ని
స్స్వనితముగాఁగ నేగుతటి సంయుతమాతరి యేపు దోఁపగన్.

(యథోక్తముగాఁ గృష్ణార్జునులు ప్రవేశింతురు)

అర్జు— శా. బావా ! కోపము సంహరింపుము రణప్రారంభమున్ మాను మీ
వే వీఁకన్ రణముం బొనర్చునెడలన్ వీఁకేల ? నీ ఢాకకున్
జేవన్ వీడని వీరుఁడెవ్వఁడు ? కృపాసింధుండవై నాయశ
శ్శ్రీవర్ధిల్లఁగఁ జేయుమయ్య యనఘా ! చేమోడ్చి సంధించెదన్.

కృష్ణ— (అనాకర్ణితముగా ముందడుగు వేయుచు)
శా. వృద్ధుండౌ నలజామదగ్న్యుఁ డేనుకొంటే ? వీఁడు పార్థుండు నీ
యుద్ధప్రక్రియ కోహటించె నని లో నుబ్బంగ నింకెంత నే

పౌరుత్వమ్ము వహించెదో కనెదఁ గా కాహారవవ్యాప్తది
గ్ధంబై జగ మక్కజంపడఁగఁ జక్కంజేతు నిన్నిక్కడన్.

క. జనకుఁడు స్వేచ్ఛామరణ
మ్మనొసంగె న్నాకటంచుఁ బొంగెదవో? య
య్యనిమిషు లడ్డంబైనను
నినుఁ జంపు సుదర్శనంబు నేఁడేమైనన్.

భీష్మ— (ధైర్యసంతోషములతో) దేవా! లీలామానుషవిగ్రహా!

సీ. నేఁడుగా నాధనుర్నిగమంబులోకైక
విఖ్యాతమయ్యె సంవిత్స్వరూప!
నేఁడుగా నాజన్మ మీఁదులేని యశం బ
జాండంబు నిండించె దండితారి!
నేఁడుగా నాబాహునాడులఁ బ్రవహించు
రక్తంబు శక్తంబు ముక్తగేయ!
నేఁడుగా శంతను నృపతివరేణ్యుండు
పుత్రవంతుం డబ్ధిభూకళత్ర!
నేఁడుగా నిర్జరాపగ నిక్కమైన
వీరమాత ప్రఫుల్లదంభోరుహాక్ష!
రమ్ము దయసేయు మిటువేగిరమ్ము సంగ
రమ్ముతీర్పుము భూమిభరమ్ముతోడ.

మ. దయసేయంగదవయ్య కృష్ణ! త్రిజగత్కళ్యాణ మోక్షం బొగిన్
దయసేయంగదవయ్య; చక్రిమున మత్కంఠంబు వైకుంఠ! వే
గయిసేయంగదవయ్య; ధర్మసుతు నేకచ్ఛత్రసంపత్తిచేఁ
గయిసేయంగదవయ్య; నీ కిదె నమస్కారంబు నారాయణా!

అర్జు— (ఎట్టకేలకుఁ గృష్ణునిలువరించి) బావా! వసుదేవనందన!

శా. గీతల్ సెప్పి రణంబుసేఁతకు ననుం గీల్కొల్పు టెల్లన్ ధరా
నేతల్ నవ్వఁగఁ బాలుసేయుటకె యౌనే! కొంత సైరించి నా
ఖ్యాతిన్నిల్పుము సాత్యకిం దునిమిన ట్లాలంబు చాలింపవే
నేతన్మాత్రకు యుద్ధరంగమున కే నేతేరఁగా నేటికిన్?

ఉ. చక్రము దాల్చి నీవు రిపుచక్రము ద్రుంచు టదేమిలెక్క? నీ
వక్రిమమే రొమనర్చునెడ నాఁగుని యీపదునాల్గులోకముల్?
శక్రసుతుండు నీకుఁ దనుసద్యశమ్మును గలిగింతువేని నీ
విక్రమమున్ మరల్పు మరవిందదళేక్షణ! భక్తరక్షణా.

(పటాక్షేపమున సాత్యకి ప్రవేశించును)

అన్నా! బలభద్రసోదర!

చ. కలగినసైన్యముల్ ప్రళయకాలపటుత్పటవభ్రగర్జితం
బుల నొనరించుచున్ రిపుసమూహముపై నదె యేగుచున్న వా
వలనికిఁ జూడుమయ్య? "తలపంపు ఘటిల్లునో" యంచుఁగుందు నీ
యలఘు పరాక్రమక్రముని నర్జునుఁ బ్రోవఁగదయ్య నెయ్యునిన్.

కృష్ణు— (వెనుక దిరిగి చూచి) తమ్ముఁడా!

శా. పాఱుంబోతుల నీనృపాలుర మరల్పం బోకు మీక్రీడియే
ధీరత్వమ్మును గోలుపోయినపు డేదేశాధిపుల్ నిల్తు రా
వీరవ్యాఘ్రమహాకిరాతు నెదుటన్ వీరేల? నీవేల? నేఁ
బ్రారంభించితిఁగాదె యాహవమొనర్పన్ ధర్మరక్షార్థినై.

అర్జు— బావా! నీవిక్రమం బక్రమంబగుటంజేసి ధర్మరక్షార్థంబు గానేరదు. కాని కేవలమాపదంబునకు ధర్మరాజరక్షణ మని యర్థము చెప్పకోవలసి వచ్చును.

కృష్ణు— అర్జునా! వృథాగా నన్నేలదులకు వారించెదవు? దుర్జనభర్జనంబున కొక్కొక్కతఱి నధర్మప్రవర్తనంబుగూడ నుపక్రమింప నగునని నామ నసాక్షికి వచ్చుచున్నయది. ధర్మమార్గమేయైనను సజ్జనాపకారంబునకుఁ గారణంబగు నేని యవలంబింప ననర్హంబు.

చ. తెలిసె భవద్భుజాబలము; తెల్లముగాఁ దెలిసెన్ సమస్త సే
నలయులతూరతాగరిమ; నన్నికఁ వారణ సేయఁబోకు మీ
కలను, సమస్తమీదినము కాలునిపోలికిఁ జేరుఁగాక భూ
తల మిదియెల్ల నాథునిగ ధర్మసుతునూభవుఁ గోరుఁగావుతన్.

(సేనలదిక్కు బిగ్గరగా)

ఓహో! పాండవచమూపతులార!

ఉ. పొండిఁక నాలుబిడ్డలము బోలఁగఁ గన్నులనిండఁజూచి కొం
డొండొక దేళ లేదు విలయోద్ధతకేళికిఁ జక్రపాణికిన్!
భండనఖిన్నులై ముగిసెఁ బాండుసుతాగ్రజుతోడఁ జెప్పఁ దే
గుం డభిషిక్తుఁడస్తువులు గూర్పుఁడు మార్పుఁడు యుద్ధబుద్ధులన్.

భీష్మ— (తనలో) అర్జును దిట్టకేలకోలిబడి ఘంటాం తమునుబాలో నివిక్రంభరు నిలువరించి నాఁడు కాదు కాదు. ఇయ్యకభ్యుదయమునేభక్తపరతంత్రుఁడగు

కతేవ ఫల్గునానురాగంబుఁ బ్రకటించుటకై యతని ప్రయత్నంబున నాగినట్లు నటించె ననుట ధ్రువము. లేనిచో—

మ. విలయాంభోదములీల మేనొలయ నుర్వీచక్రమెల్లన్ దలా
తలపర్యంతము క్రుంగఁ జక్రరుచు లుద్యద్విద్యుదుల్లాసముల్
దెలుపన్ సింహనినాదముల్ పిడుగులై దీపింపఁ గల్పక్షయం
బెలమిం జేయగవచ్చు నీతనికి నడ్డే క్రీడియున్ గిడియున్.

(నిరూపించి) ఇంతకును బూర్ణముగా సంరంభము తగ్గలేదు. ఏమైనను నిఁక నాకుఁ గృతార్థత్వము కలుగుట సంశయాస్పదమే (యోజించి) అవును. ఇది నిశ్చయమే.

మ. అలవేదంబులు ధర్మమూలములుగా, యం దీమహాభాగుఁడే
తెలియంగాఁ బడువాఁడుగా, యతఁడె యుద్దేశించి యిప్పట్టునన్
గలనన్ శూరు లనేకు లున్నయెడ సంకల్పించునే సూనృగ
స్ఖలితంబాపనిసేయ? నట్లయిన లోకంబెల్ల ఘోషిల్లదే?

ఒకవేళ దుష్టశిక్షణ శిష్టరక్షణంబులు తనపనులుగాన నెట్లేని యయ్యవి కర్తవ్యంబులనియు దుర్జనాగ్రగణ్యుండగు సుయోధను నవలంబించిన్న నేనును దుర్జనుండనే కావున వ్యుత్క్రమంబున నన్నుక్కడంప నెంచెన నియును నిప్పట్టున యోజింప నయ్యెడిఁ గాని దీర్ఘదర్శులగు వారిది యును సమంజసమగు త్రోవగా భావింపరు. ఇది నిక్కముగా నస్మదీయశౌర్యసంరంభమునకు నోహటించు పార్థుని బాహుబలంబు పరికొల్పుటకుఁ బన్నిన పన్నుగడయే కాని వేఱొండు గాదు. ఇట్లే కానిచో,

ఉ. నాఁడు సుయోధనుండు కరుణామయుఁ దన్నను గట్టుపూనిక ను
న్నాఁడని పూర్తిగా నెఱిఁగి న్యాయపథంబును జెప్ప వచ్చి వా
మోడక మీఁదుమిక్కిలిగ నుక్కుమెయిన్ దన కెగ్గొనర్ప మా
టాడక విశ్వరూపధరుఁ డయ్యును మిన్నక పోవనేర్చునే?

ఇయ్యనఘున కిట్టియూహయే నిక్కముగా నున్నచో విశ్వరూపప్రదర్శనముతోడనే భారతయుద్ధము ముగియవలసినది. (వినుట సూచించి) స్వామి యేమో మేఘగంభీరభీషణంబు లగు భాషణంబుల నర్జునుని యెడలఁ గనలినయట్లు నటించుచుఁ గృపగనుపరచుచున్నారు.

కృష్ణు— అర్జునా! యిఁక నీ మాటలయం దంత పాటవ మున్నట్లు నాకు నమ్మిక లేదు. ముమ్మాటికి నిన్నుఁ బురికొల్పి పురికొల్పి వేసారియే తుదకీ సుదర్శనమ్మునా సంస్మరించితిని. నీకును నాకును లేశమైన భేదంబు లేనియపుడు

మనలో నన్యోన్యజయంబు లన్యోన్యమును సంక్రమించుటలో నాక్షేపణ మేమున్నది?

శా. గాంగేయుఁ బరిమార్తు మొట్టమొదటన్; ఖండింతు నామీఁద దు
స్సంగున్ ద్రోణు; వధింతు నాపయిని నశ్వత్థామ నావెన్క న
య్యంగాధీశు గతాసుఁ జేయుదు; ససోదర్యంబుగా రాజు ను
ర్విం గూల్తున్ వెనువెంట, నిత్తు నవనిన్ వేయేల నీయన్నకున్.

అర్జు— బావా! నీవు సలుపరాని దిం దేదియును గాదు. ఇతరులకేని యీపల్కు లుత్తరకుమార ప్రజ్ఞలుగాఁ బరిణమించును గాని నీకు నియ్యవి స్వభావోక్తులకును దీసిపోవును. ఇది యటులుంచుము. నీ వొనర్చిన విజయము నన్ను సంక్రమించుటకు నీనుడివిన యుక్తిమాత్ర మతివ్యాప్తిగ్రస్తమై యున్నది. ఏమందువా,

ఉ. నీవిజయంబు నాదిగ గణింతురయేని ప్రజల్; భవజ్జయ
శ్రీవిభవం బభేదమునఁ జేసి సుయోధను సంక్రమింప కే
లా వెనుదీయు? నెల్లరకు నాత్మవ కావె మహానుభావ? నీ
వే వచియించి తింతయును నింతనె గీతలు విస్మరింతువే.

కృష్ణు— (నవ్వి) ఫల్గునా! గీతార్థగ్రహణం బన సామాన్యంబుగాదు. అందు నేనొక్కయెడ నుత్కృష్టులెల్ల మత్స్వరూపంబని నొక్కి వక్కాణించి యుంటి నయ్యది విశేషాకారంబుగ గ్రహింపఁ దగునంశంబు. ప్రకృతం బది విచార్యంబు గాదు. దుర్యోధనుండు నికృష్టుండగుట నాకుం గడు దవ్వు. ఇదిగాక యేను దఱచు భక్తపరాధీనుండనని యెఱుంగుము. ఎన్నటికేని భక్తుం డస్మదైక్యముం గాంచుఁగాని యభక్తుం డందుల కర్హుండుగాఁడు. ఇదియంతయు మున్ను వచించినదేయగుటఁ జర్వితచర్వణంబును బిష్టపేషణంబును నగు.

ఉ. నొచ్చితి వీవు చాలఁ; గడు నొచ్చె దురంగము; లేను మిక్కిలిన్
నొచ్చితి; నంగకంబులఁ గనుంగొను మెన్ని శరంబులున్నవో?
చిచ్చున మ్రిందుకారడవి సేన యిఁకన్ మన మూరకొన్న వి
వ్వచ్చుఁడ! భీష్మునిన్ గదియ వచ్చునె యొండొరుఁ డెంతవానికిన్?

చ. పలికిరి వీరముల్ నృపులు; పల్కితివీవొక కొన్ని వీరముల్
సలిపెడి వేళకున్ బలము చాలక పోయె నశక్య మాపనిన్
దల నిడుకోఁ దరంబె యిఁకఁ దప్పదు. సిద్ధము నేఁ డొకింత నే
వలుగకయున్న రాజ్యమది యబ్బ సుయోధను చేతి కర్జునా!

క. కావున నన్వారింపకు
మీవీరమ్మున్న భీష్ము నిప్పుడ తుంతుమున్
కావలుఁడు సుయోధనుఁడీ
భూవలయం బేలఁ జూచుఁబో కృష్ణుఁడెటుల్ ?

అర్జు— దేవా ! నాలో నేనే నీమొగముఁగన సిగ్గిలుచున్నప్పుడు సర్వజ్ఞుండ వయ్యు నన్ను మఱియు నవమానపఱచు టనునది యుత్తముల త్రోవకాదు. ఇంతపఱకు నొనర్చిన తప్పులన్నియు మన్నించి మరల నొగ నెక్కఁదవేని.

ఉ. ఏమగునో ధనుర్ధరులనెల్లను గ్రిమింగెడిభీష్మవహ్ని యిం
కేమగునో రణావనికి నెల్ల గురుండు ఘటోద్భవుండు తా
నేమగునో కృపుండు మఱి యేలిక యేమగునో కనుంగొనం
గా మది నీవకౌతుకముఁ గాంచెదు మేల్ బళి యంచు మెచ్చుచున్.

(పాదములంబడి లేవకుండును) ch. very lengthy

కృష్ణ— (తనలో) ఎట్లును భీష్ముని చేతిలోఁ బాపమున్నంతవఱ కర్జునుండెట్టి వీరుఁడైనను నతనిం దలకడపఁ జాలఁడు. ఇందుపాయ మేమి ? (యోజించి) ఉపాయ శాలియగు నజాతశత్రుండు సంగరారంభ సమయమ్మున నయ్యా నఘు దర్శించి "తాతా ! మాకుజయంబు ప్రసాదింపు" మన నమ్మహా మహుఁడు ధర్మపక్షపాతంబునం జేసి "నీవు మరల నేతెంతువుగాక. నీకు శుభంబుకాఁగల" దని వచియించి యున్నవాఁడు. ఇకఁ డిట్లనితర సాధ్య విక్రమక్రియుండై కొన్నాళ్ళు పోరినపిమ్మటఁ దిరిగియు ధర్మజుఁ డతని కడకరిగి- X

మ. కలనన్నిన్నెదిరింప నేర్చునె మహాకాలుండు గాని లయా
నలుఁడుం గాని యఖండచండిముఁడు పూర్వాశక్రియాధుర్యుఁడు
జ్వాలతేజుం డలశూలి గాని ; కరుణింపన్ గాక మేతెంచె మ
న్మల మార్తిం బడి క్రమందుచుంటిమి దయన్ మన్నింపవే దీనులన్.

ఉ. నిద్దుర రాదు సేనలకు నీదగు పేరును విన్న ; నెట్టులో
నిద్దుర పట్టినన్ గలను నీకల నూహకు వచ్చి వెంటనే
దద్దఱు పాటు చేకుఱు వృథాయిఁక మాశ్రమమెల్ల ; మాకు నీ
యొద్దడి నెట్లువాపెదవొ యేగతి నేలను నేలఁజేతువో.

క. నీవింతపరాక్రమమున్
గావింతువటంచు మున్ను గన్గొననైతిన్
దేవ ! యిది యెఱుకపడినన్
గావింతునె యాహవంబుఁ గావఁగదయ్యా !

అని మఱియు మఱియుఁ దన్నుఁ బ్రార్థింప డెందంబు కరఁగి స్వార్థత్యాగియగు దేవవ్రతుండు తుట్టతుదకా మనుజుని వినయమ్మునకు మెచ్చి తన్ను నిగ్రహించు నుపాయంబు వక్కాణించు పిదప నితండతని సంగరంబునుండి తప్పింపఁగలఁడు. కావున నిప్పుడే నొనర్చిన యకాండతాండవంబెల్లఁ బాండవసేనాపతులకు శౌర్యోద్రేకదోహదంబుగా సమర్థించుకొని యిఁక యథాపూర్వంబుగ నరదంబు నడిపించుటయ కర్తవ్యంబు. అంత వలసె నేని యిఁకనొకపరి యిట్లే యీ సేనలం బురికొల్పుటకును నర్జునునికి శౌర్యంబెక్కించుటకును బ్రయత్నింపఁగలను.

(అర్జునుని లేవనెత్తి, ప్రకాశము)

చ. పలికినయంతపట్టు నలుపంగలవాఁడవె నిన్ను మెచ్చితో
వలసిన నుండఁగాఁ దయు వక్త్రమ్ములొక్క సహస్ర ; మిందులో
వలతులె కొంద ; అందఱును నట్టిరె ; దమ్మరదమ్ములైకి ; సే
నల నెసకొల్ప సాత్యకి చనంగలవాఁ ; డిదె వోవుఁ జక్రముల్.

(చక్రమును విసర్జించును. సాత్యకినిష్క్రమించును. కృష్ణార్జునులురథమధిరోహింతురు. రణోచితంబులగు ధ్వనులు మ్రోఁగును.)

భీష్మ— (తనలో) ఇంతకుమున్ను

శా. “చచ్చెన్ భీష్ముఁడు చచ్చెఁ జచ్చె” ననుచున్ జాపంబు లంసమ్ములన్
గచ్చున్ విచ్చునుగాఁ దగిల్చికొని చీకాకైన సైన్యంబు వి
స్వచ్ఛం గూడి మురారి తేరి కరుగన్ వైవర్ణ్యముం బాసి వీ
రోచ్చైర్నాదము రోదసీకుహరమం దుచ్చండమై పర్వెడున్.

(పట్టరాని సంతోషముతో)

శా. లీలామానవవిగ్రహుండు రణకేళీలాలసుండైనఁ గా
కాలం బందెదిరింప లే రొరులు భీష్మాచార్యు నంచున్ భుజా
శాలుల్ మెచ్చఁగఁ జేసె శౌరి ; యిఁక నాజన్మంబు ధన్యంబు

(వైమనస్యముతో)

దుశ్శీలుం డీ కురువంశపాంసనుఁ డనిం జేయించుటింకెందుకో ?

చ. కొలఁదికి మీఱినప్డు మునికోల కరంబునఁ గ్రాల లీల న
య్యలఘుఁడు నన్నెకా దెవని సైకము జంపఁగ నేగుదెంచు న
వ్వలన మహానుభావుఁడటు పాండవ పక్షముఁబూని యుండ నీ
కల నెటు నెగ్గ నేర్చుఁ ; దనుఁగాచెడి వాఁడెవ డంతపట్టుగన్ ?

ఔరా ! యీసుయోధనుని యవివేకము !

మ. భగవంతుం డితఁడంచు స్పష్టపడియెన్ బాహాబలప్రౌఢిచే
నగధారిత్వముచే విశిష్టమునిమాన్యత్వమ్ముచే విశ్వరూ
పగతిం జూపుటచే ననేకగతులన్; బ్రహ్మాదు లర్చించు లో
కగురున్ గృష్ణు జయిష్ణు నిప్పుడయినం గైకోఁడు వీఁ డంధుఁడై.

(యోజించి) అయినను నాకిప్పు డీవిషయము ప్రస్తుతముగాదు. (సింహనాదంబుచేసి ధనుర్గుణంబు మ్రోయించుచు) ఓ సేనానాయకులారా !

ఉ. విచ్చిన మొగ్గరంబులను వీఁక మెయిం బురికొల్పి నిల్పుకొం
డెచ్చట నేరికిం దలఁకి యేడ్తెఱ వీఁడకుఁ డేను గల్గ వి
వ్వచ్చుఁడు రాఁడు మీపయికి; వచ్చిన వచ్చెడుఁ గాక మీరు వె
న్నిచ్చితి రన్నదుర్యశ మొకింతయు నాచెవి సోఁకకుండుతన్.

(రణాభిముఖ్యమును నటించును.)

కృష్ణు— (చేతితోఁ జూపుచు) ఫల్గునా ! కనుఁగొంటివా మనసేనలకు భీష్ముఁడనిన నెంతభీతి గల్గుచున్నదో,

శా. టంకారం బొనరించె సింహరవ ముట్టంకించె నావృద్ధుఁ, డా
శంకాసంకులమయ్యె సైన్యములు ధార్ష్ట్యంబెల్లఁ జీకాకుగా
నింకన్ బాణ మొకండు గాని విడువండే యాతఁ డౌరౌర ! యీ
జంకుం గొంకును మాన్పఁగా వలయు నీశౌర్యం బవార్యక్రియన్.

చ. తలయును గడ్డము న్నరసెఁ దాత యనంజన దెల్లలోకము
త్తలపడునట్లుగా రణముఁ దద్దయు నిమ్మహితుం డొనర్చు నా
మెలఁకువ యాభుజావిభవమేదురతాతిశయంబు నామహో
జ్జ్వలరథచాలనంబులును సాఁగనిరీతిఁ బరాక్రమింపుమీ.

అర్జు— బావా !

చ. అతఁడు మహామహుం డనుట యందఱికిన్ విశదంబ యాతఁ డ
ప్రతిముఁ డనంగ నేల, కురువంశ భవుండనె యేనుఁ గూడ స
మ్మతిఁ గనుఁగొమ్ము తాతయును మన్మఁడుఁ బోరెడుతీరు, మాటలన్
జతురత చూపనేల, క్రియ సాత్త్వ మొసంగెడుఁగాక నీకిఁకన్.

రథంబు భీష్మాభిముఖంబుగఁ దోలుదువుగాక.

కృష్ణు— (రథము తోలుట నటించును.)

అర్జు— బావా !

శా. రణముం జేసెదిపట్ల నొక్కరుఁడనై రాఁగూడదే వేఱుకా
రణమై కొండొక హెచ్చుతగ్గు, అది పోరన్ లేమి యౌ ! శస్త్రమా
రణకర్మంబు తెఱుంగనే యనఘ ? చక్రంబంతలోఁ దాల్తువే
యణుమాత్రంబు సహింపఁగా వలదె ? దేవా యింత కారుణ్యమే !

కృష్ణు—(తనలో) ఇతని నిఁక మెల్లన సమాధానపఱుపవలయును. (ప్రకాశము) అర్జునా ! నేను చక్రంబు గైకొనుటకుఁ గారణము నీ వెఱిఁగియును నాక్షేపించిన నే నేమి యుత్తరం బీనేర్తును.

శా. గంగానందను బాణపాతముల కాఁగన్ లేక చక్రంబు కే
లం గైకొంటి; సమానులే యిరువురున్; లాఘవం బలంబున్ సమం
బంగీకారమె; తాతయన్నదయ నీ వావంత సూచింతు వే
ర్మిం గన్పట్టఁగ నీఁడతం డురక గంభీరాహవోత్సాహియై.

అర్జు— బావా ! ఈ నీయుత్ప్రేక్షలు నే నెఱుఁగనివి కావు. నేను ప్రథమమున బంధువధంబునకుఁ దలఁకుటయు నీవాయజ్ఞానంబు వారించుటయు నప్పుడే గతించినవి. ఇటీవల నాకట్టి ప్రీతి యుదయించుట లేశమేని లేదు. మఱియు నొక విశేషంబు,

తే. గీ. చిన్నతనమున నెత్తి మాయన్నదమ్ము
లం దఱిని బెంచె నాపగానందనుండు
అతని కబ్బిన నబ్బుఁగా కట్టికరుణ
నాకు లేదు నిక్కం బిది నమ్ము మనఘ. ×

ఉ. ఆతఁ డనేకయుద్ధముల నాఱితేఱఁ దేఱిన వృద్ధమూర్తి నే
నో, తరుణుండ నక్కతన నుఱడిన నుండగవచ్చు నంత వి
ద్యాతిశయంబు తాతయెడ; నందులకున్ బడివేలరెట్లు నీ
యూఁతగదా గదాధర ! జయోదయ మబ్బుట కింక శంకయే.

సర్వంబును నిర్వహింపఁజెడివాఁడవు నీవయైనను ననుమన్నించి యీ యశంబు నాకుఁ దక్కింపుము.

కృష్ణు— (అంగీకరణ సూచనాపూర్వకంబుగ రథవేగంబు నిరూపించుచు ఇరువురను నిష్క్రమింతురు.)

భీష్మ— (తనలో)

మ. కడు సన్మార్గులు పాండవుల్ మనుమలుం గానన్ రణం బంత యొ
క్కుడుగాఁ జేయుట పాడి గాదనుచు నాకుం దోఁచ లో నప్పుడ

ప్పుడు; యుద్ధాభిముఖుండ సైనతఁడు బోవుఁగా సర్వమా పేర్మి; నే
నుడుగంగావలెఁ; గాంచఁ గావలె జయం బుద్రేకులై పాండవుల్.

చ. కరమునఁ జాప మున్నదనుక న్నను గెల్చెడివాఁడు గాఁడు శం
కరుఁడు త్రిశూలపాణియగుఁ గా కనిసేఁతకు; నర్జునుండు నే
ర్పరియగుఁ గాన నాకెదుటిపక్షమున న్నిలువంగఁజాలె ధ
ర్మరతుఁడు ధర్మజుం డతఁడె రాజగు నెవ్వర మెంతపోరినన్.

(పరికించి)

చ. భరముగఁ బోరుచున్నయవి పాండవసైన్యము లస్మదీయులున్
దురమున వెన్కఁద్రొక్కకయ దోర్బలమున్ బ్రకటించుచున్న వా
రరిగెడుఁ గాక నాయరద మర్జునుఁ డున్నెడ కింకొకింతలో
నరుణుఁడు గ్రుంకఁ బోవు సమయం బగుచున్నది వేగమే గదన్.

(నిష్క్రమించును)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందుఁ బ్రథమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవవిజయము

## ద్వితీయాంకము

(పిదప తెల్లని చీరతో భాగీరథి ప్రవేశించుచున్నది)

భాగీ— హా కుమార! హా భువనైకధనుర్ధర! హా పరశ్వహాస్త్రమాసజీవి! హా యస్ఖలిత బ్రహ్మచారి! కురువృద్ధ! ఈయుద్ధము నీకొఱకేవచ్చినదా? పెండ్లిపేరంటములు లేకపోయినను నొంటిజంటముతోడనే వ్యాసాదులవలెఁ జిరకాలజీవి వగుదు వనుకొంటింగాని యింతలో నాకడుపునఁ జిచ్చిడుదు వనుకొనలేదోయి తండ్రీ! (చదికిలఁబడుచున్నది)

(యమున నల్లనిచీరతోఁ బ్రవేశించును)

యమున— (దెసలు పరిశీలించి) ఎచ్చటనో యార్తస్త్రీ నాదము వినిపించుచున్నది. (చెవియొగ్గి) భాగీరథీదేవిగారి కంఠస్వరమువలె నున్నదే. (ఎదుటఁ జూచి సమీపించి) సోదరీ! ఏల విచారగ్రస్తురాలనై కుందుచుంటివి?

భాగీ— (అనాకర్ణితముగా) ఆధర్మరాజునకెట్లు నోరాడెనో చచ్చుటకుండగిన సాధనముం జెప్పుమని యడిగెనఁట! ఆకిరీటి కెట్లు చేతులాడెనో శిఖండి వెనుకనుండి తానే బాణములు ప్రయోగించెనఁట!

యము— దేవీ! ఎవరమ్మా? ఎవరిని? నేను యమునను. తలయెత్తి నాపంకకుఁ జూడు.

భాగీ— (తలయెత్తి) చెల్లెలా! యమభగినీ! కురుపాండవులకు జరగు మాయయుద్ధములో మనభీష్ముఁడు పదిదినములు పోరి మాయదారి శిఖండిచేఁ దుదకు నొచ్చి మకరాయనప్రవేశ మాసించి శరతల్పంబున నిరశనవ్రతుండై పడియుండెనఁట.

యము— కుమారా! విజితపరశురామా! నీకెట్టిదశ వచ్చినది! ఓరీ చండాలదుర్యోధన! ఎటువంటివారి కెంతలేసి యాపదలు తెచ్చిపెట్టుచున్నా

వురా! (గంగదిక్కై) దేవీ! విచారింపకుము. నీకన్నసంతానము పుడమి మీఁద నొక్కఁడైనను నిలిచియుండెను గదా యనుకొంటిమి. ఇంతకు దైవవిధి యిట్లున్నది. ఈవాఁడు మాయన్నగారి యింటినుండియే వచ్చుచుంటిని. పదిదినములనుండి భీష్మునిచేతఁ జచ్చిన యోధవరుల పేరులు చిత్రగుప్తులతనికి విన్నవించుచుండఁ జాటుననుండి వింటిని. పాప మా యులూచికొడుకు కిరావంతుఁ డలంబసునిచేత మడిసెనఁట. భీమునిచేతఁ జచ్చిన కురుకుమారు లెందఱో వారి పేరు లన్నియు మఱచిపోయితిని. సునాభుండఁట, పండితకుండఁట, మహోదరుండఁట, ఎవరోయఁట! ఎవరోయఁట! ఎందఱు రాజులమ్మా! ఇఁక సైనికులమాట లెక్కయే లేదు.

భాగీ — ఇంతమంది కడతేఱుటకు నీతమ్ముఁడు కర్ణుఁడే ప్రథమ కారణము.

యము — అతఁడేమిచేసెనమ్మా! మా భీష్ముఁడు కానివారందఱిని మహారథులలోఁ జేర్చి వాని నర్థరథులలోఁ జేర్చెనఁట. దానికిం గోపించి నీయుద్ధము ముగియువఱకు నేను ధనుర్బాణములు ధరింపనని ప్రతినపట్టి యింటనే యుండెనఁట.

భాగీ — ఈపదిదినముల యుద్ధములోనికి వచ్చిన నేమి రాకున్న నేమి! మొదటి మాట చెప్పుము.

యము — అగును, వానిమతము పట్టిదుర్మతమై పోయినది. వాఁడుమాత్రము బ్రతికి పట్టము గట్టుకొనునా యేమి. మాయలాఁడా కృష్ణుఁ డేదియో యొక మాయపన్నికపన్నును.

భాగీ — ఔ నిది యంతయు వాసుదేవుని పనియే. సంధికానీయక కౌరవసభావిశేషంబు లున్నవికొన్ని లేనివికొన్ని ధర్మరాజుతోఁజెప్పి యుద్ధమునకు సన్నద్ధపఱచె. ఇరుతెగల నడుమనుండి గురుజనవధమహాపాతకంబునకై భీతిల్లి కంపించు విజయుచ్చునకు గీత లుపదేశించి మనంబు విఱిచె. నరునకు సారథ్యంబు గావించుటతప్ప చక్రము బట్టరాదను శేర్పాటున్నను గుమారశరధారాభిన్న శరీరుండై చక్రము ధరించె. ఇఁక నెన్ని యకృత్యములు చేయునో? నిజ మితనివలనఁ బాండవ పాంచాలయుద్ధ మనర్థ ప్రధాన మనిపించుకొనకమానదు.

యము — దేవీ! గతజలసేతుబంధనమేల? శరతల్పగతుండగు బిడ్డ నొకసారి కడసారిచూపు చూచివత్తము రా.

భాగీ — ఎచ్చటఁ బడియుండెనో! యెట్లుండెనో! చూచివత్తునని మనసరస్వతి యేగినది రానీ.

సర— (పచ్చని చీరతోఁ బ్రవేశించి) ఇదిగో దేవిగారిని ధ్యానమున నారాధించుచున్నది. (సమీపించి) దేవీ ! ఏమనివిన్నవింతు, గైరికరాగధారాలంకృతం బగు మేరుగిరిచందంబున ఘనీభవించిన నెత్తుటిచారికలతో శరమయంబగు తల్పంబునఁ బరుండియున్న దేవవ్రతుం జూచి వచ్చితిని.

యము— తగినయుపచారములు చేయుట కెవ్వరును దగ్గఱ లేరా ?

సర— లేకేమి. అంతదనుక ధర్మరాజాదులును సుయోధనుఁడును జుట్టియే యున్నారఁట కాని నేఁ బోవునప్పటికిఁ గర్ణునితో నేమేమో మంతనము లాడుచున్నాఁడు.

భాగీ— సరస్వతీ ! ఇంకను మంతనము లాడుటకుఁ దగిన తెలివిలోనున్న వాఁడుగద.

యము— (తనలో) కర్ణునితోఁ జేయు మంతనము లెట్టివో ! ఒకవేళ వానిజన్మవృత్తాంతము తెల్పుచున్నాఁడేమో.

సర— అమ్మా ! మహానుభావు లిచ్ఛాధీనమరణులుగదా.

భాగీ— అది యతనికిఁ దండ్రిగారిచ్చిన వరమే.

(తెరలో)

పాండవయోధులారా ! కౌరవచమూపతులారా ! ఆలకింపుడు.

గీ. కౌరవేశ్వర చూఁడు నీకడకుఁ దెత్తుఁ
బ్రాణములతో యుధిష్ఠిరుఁ బట్టుపట్టి
పార్థుఁ డొక్కింతయే నడ్డపడకయున్నఁ
బగకు వెన్నిచ్చియాతఁడు పాఱకున్న.

అని కుంభసంభవుండు దుర్యోధన మహారాజున కభయమిచ్చినాఁడు.

యము— సరస్వతీ ! ధనురాచార్యునకు సర్వసేనాధిపత్యమునకుఁ బట్టముగట్టిరాయేమి ?

సర— ఔను, దేవవ్రతుండు పడినపిదపఁ గురురాజు రాధేయునితో నాలోచించి ద్రోణుం బ్రార్థించి యా యాధిపత్యమిచ్చెనఁట.

భాగీ— ఉన్న పెద్దవారల నందఱిం జంపించుట కీతులువ కిదియే మార్గము.

యము— సరస్వతీ ! తరువాత ?

సర— తరువాత గురుఁడు సంతోషించి కురురాజు నొకవరము గోరుకొమ్మనిన నతఁడు రణంబున "ధర్మరాజుం బట్టి తన కొప్పగింపు" మని కోరెనట.

యము— వీనికోరిక పాడుగాను ! ధర్మరాజునో, భీమునో, యర్జుననో, కవలనో చంపుమని కోరిక యిది యేమి కోరిక ! మరల జూదమాడి యడవులకుం బంపవలయునని కాఁబోలును.

సర— అవును ! అదియే యని వింటిని.

యము— ఈద్రోణుని ప్రతిన పాండవులు వినియుందురా ?

సర— ఓసి వెఱ్ఱి యమునా ! ప్రజలందఱు వినవలయునని వారు చాటించు చుండఁగాఁ బాండవులేల వినకుందురు ?

(తెరలో మరల చాటింపు వినఁబడును.)

యము— (వినుటనటించి) ఓహో ! ఈచాటింపదియేనా ? సరస్వతీ ! ధనురాచార్యుఁడును సామాన్యుఁడుగాఁడే. అతని ప్రతిజ్ఞకుఁ బాండవులు జడియవలసినదే.

సర— జడియకేమి ? ధర్మరాజు గోలయెత్తుచుఁ దనతమ్ములందఱితోఁ జెప్పుకొని మరల నడవిలోనికిం బోవుప్రయత్నము చేయఁగా విష్వచ్చుఁ డోదార్చి మరల్చెనఁట.

యము— అటులేని నేఁటియుద్ధము మహాఘోరముగా జరుగును.

సర— జరుగుచునేయున్నది, చూడు మాకసమువంక; దేవతలెట్లు గుములై చెప్పుకొనుచున్నారో !

యము— (ఆకాశముం జూచి) అవును. దగ్గఱనున్న వారందఱు యుద్ధమునకుఁ బోదురు. ఒంటిగానున్న భీష్మునియొద్దికి దేవిం దోడ్కొని పోదమురా ?

(నిష్క్రమించుచున్నారు.)

(పిదప యుద్ధప్రశంసఁ గావించుకొనుచుఁ గృశానువిశ్వావసులను నిరువురు గంధర్వులు విమానములతోఁ బ్రవేశించుచున్నారు.)

విశ్వా— కృశానూ ! దివామధ్యప్రచండుండగు చండకిరణునిపగిది నీమునసలి పాఱుఁడు నేఁడు యుధిష్ఠిరుం బరాభవదవానలంబుపాలు సేయునేమో కదా. అదిగోఁ గాంచనవేదీపతాకావిరాజితంబగు నరదం బతనిమీఁదికే పోవుచున్నది.

ఉ. "చేతులతీఁటవోఁ గలను చేసెద ద్రోణునితోడ నేఁడు; చే
సేఁతలనేర్పు నాదుభుజసేతువు చాటుగఁ జూచుచుండు మ
య్యా ! తలఁకేల" యంచుఁ దమియున్నకుఁ గ్రీడి దిటంబు చెప్పెఁగా;
కాతనియొద్ద నేర్చిన మహాస్త్రము లగ్గురునాఁగ నేర్చునే.

కృశా— గంధర్వరాజ! ప్రతిభావిశేషమున గురువుల నతిక్రమించు శిష్యులే లేరా? దీప మొక్కటియైనను నాధారవిశేషంబునం బ్రభావంతమగు గతి విద్యకును బ్రతిభావిశేషంబున హెచ్చుతగ్గులు గలవు. అదియు నంగాక,

గీ. ఫల్గునుండొక్క కుంభసంభవునియొద్ద
నేర్చునే దివ్యసాయకనిచయ, మతని
నడ్డుటకుఁగాదె మఱికొన్ని యభ్యసించె
శివునివలనను మన సునాసీరువలన.

విశ్వా— సునాసీరతనూజాతుండు కుంభసంభవు నెదిరింపలేఁడనికాదు. గురుపరాభవ మహాపాతకంబునకు జంకునేమోయని.

కృశా— అయ్యా! జంకిన మురారిలేఁడా, మరల గీతలుపదేశింపఁడా, గురుపరాభవంబుకంటె భ్రాతృపరాభవంబు తక్కువదా?

విశ్వా— కృశానుఁడా! తినఁబోవుచు రుచులడుగనేల? అదిగోఁ దుములసంగరంబు ఘోరంబగుచున్నది. సేనాపతిద్వయంబును శకునిసహదేవులును వివింశతిభీమసేనులును భూరిశ్రవశ్శిఖండులును లక్ష్మణక్షత్రదేవులును నల్లుఁడుమామలగు నకులశల్యులును శారద్వతధృష్టకేతులును వృషసేన చేకితానులును విరాటకర్ణులును ద్రుపదదుశ్శాసనులును దలపడి శరాసారంబున ముంచుకొనుచున్నారు. ఈదెస,

లయగ్రాహి.

క్రూరులకబంధములు, దారువులుగా గజశరీరములు తాలుగ శిరోజములు నీలాంభోరుహసమూహములుగా రథములోడ్లుగ విసారములుగా విహగవారములుగా డిండీరములు గాఁగఁ దరవారులు శిరాలు వెలిచీరలు దగనృపరివారముగ ఘోరాకారముగశోణితపుటేఱు ప్రవహించె రణధారుణి మనంబు వెఱపారఁగనుఁగొమ్మా.

కృశా— అగ్రజా! మనము నలుదెసల సమరము పరిశీలించుటచే నొకటియు సాకల్యముగఁ జూడలేకున్నారము. కావున నీపౌరవాభిమన్యుల సంగ్రామమునుమాత్రము కనుఁగొందము.

విశ్వా— (ఆవైపునకుం జూచి) బలే! సౌభద్ర! నీతండ్రికంటె సమరమహాప్రబంధమునం దేడాకు లెక్కువ చదివితివి.

(తెరలో)

చ. నిలు నిలు సూరిపార్థసుత! నీబల మూబలహీనుఁ బౌరవు
దలపడినంతనే తెలిసె నా; కిదెవచ్చితి వానిఁగావ నీ

[illegible] గనుంగొనంగ, [illegible] నూతని [illegible]; కాచుకోర నీ
తరమగునే? నిమామకగవాహతి నీతల వ్రయ్యలుండఁగన్.

కృశా— అన్నా ! వింటివా, రథాశ్వసారథుల మగ్గుచేసి పౌరవునిం దలవట్టి యీడ్చుచున్న వేల్పుదొర మనుమనిపై వేవేఁగవియుచున్న సైంధవుని దురాలాపములు. దీని కభిమన్యుఁడేమి ప్రత్యుత్తర మిచ్చునో విందము.

(తెరలో)

ఓరీ ! దురాత్మా ! నాఁడరణ్యంబున ద్రౌపదీపరాభవంబైన సహించి దుస్సల మొగంబు చూచి మాతండ్రు లూరకుండిరి గాని యిపుడు నిన్నుఁ గాపాడువాఁడెవఁడురా ?

విశ్వా— నిజ మభిమన్యుఁడా ! నిజము. తమ్ముఁడా ! చూచితివా కుమారుని చాకచక్యము !

ఉ. కత్తియుఁ గత్తలంబుఁగొని కవ్వడిబిడ్డ విలోచనంబులం
జొత్తిలు కెంపుచే మొగము నూరెల నెఱ్ఱవడంగ దంతిపై
మత్తమృగాధిపం బురుకు మాదిరిగా నిదెవచ్చుచున్నవాఁ
డుత్తది యింక సింధునృపుఁ డూపిరితో సమరంబు సేయుటల్.

కృశా— అయ్యో ! అయ్యో ! ఎంతలో నెంతఘోరకృత్యము జరిగినదో. సౌభద్రుండట్లు జయద్రథుని మీఁదికిం దురుకుచుండ మధ్యేమార్గంబున-

ఉ. "నీకు భయంబులే దెదిరి నిల్వుము సింధుపతీ !" యటంచు ఘో
రాకృతియైన శక్తిఁగొని యడ్డముగాఁ జనుదెంచి నైచె న
స్తోకబలుండు శల్యుఁ ; డది సూర్యశతప్రభతో వెలుంగుచుం
దాఁకెడునయ్య ! దండధరదండమువోలెఁ గిరీటినందనున్.

విశ్వా— తమ్ముఁడా ! యేల భయపడెదవు. కొంచెమోపికయూంచి చూడుము.

గీ. కౌరవానీకినికి ముఖకాంతి తఱుగఁ
బాండవవరూధినికి ముఖప్రభలు పెరుఁగ
మద్రపతిముక్తశక్తి నే మరలఁద్రిప్పి
కొట్టఁగలవాఁడు విప్పచ్చుకొడుకు చూడు.

కృశా— కుమారపరాక్రమ మాలోకింపఁ దమతమ ప్రతిపక్షులుఁగూడ నుత్సుకులగుటంజేసి ద్వంద్వయుద్ధమ్ములు చాలించి విరాటద్రుపదసాత్యకి ధృష్టకేతుశిఖండిధృష్టద్యుమ్న ధర్మజులును గవలతో ద్రౌపదేయులును దక్కుఁగల యోధవరులును జూఁచుచున్నారు. తనశక్తి విఫలంబయ్యెనను కోపంబునం దావంబు [illegible] సర్వాయసంబగు గదాదండంబుం ద్రిప్ప

కొనుచు మాద్రీసహోదరుండు మరలఁ గేశవభాగినేయుం దాఁకఁబోయెడను.

విశ్వా— ఈసమయమునం దర్జునుఁ డుండఁ దగినది. పాల్కడలినడుమఁ దిరుగు కవ్వపుఁగొండచందంబునఁ గౌరవసేనఁ గలఁచు కుమారుని నైపుణిం జూచును.

కృశా— అర్జునుఁడున్నఁ గోడు కనిసేయుటయే తటస్థింపదు. పాపము! సమరము సేయఁదగినప్రాయమా! మొన్నటి పసివాఁడు.

విశ్వా— శల్యుఁడిట్లు పసివానిం దాఁకుచుండ నీవిరాటద్రుపదాదు లగు మహాయోధులందఱు నూరక చూచెదరేమో?

కృశా— వీరెవ్వరును గదాయుద్ధపరిశ్రమమే యెఱుఁగరు. (ఎదుటికిఁ బాఱంజూచి) పిల్లవాఁడని తలంపక గదాయుద్ధంబునకుం దొడరిన యీమద్రపతికిఁ దగిన ప్రాయశ్చిత్తమగునులే.

మ. కనకక్షోణిధరంబుపైఁ గురియు మేఘవ్రాత మన్నట్లుగా
వెనుకన్ముందును బ్రక్కలం దగుల వేవేలమ్ములం జిమ్ము యో
ధనికాయమ్మును గ్రేణిసేయుచు గదాదండంబు సారించుచుఁ
మొన చెండాడుచు వచ్చి యడ్డుపడు భీముం జూడుమా యగ్రజా.

విశ్వా— ఓశల్య! ఇఁక నీశల్యంబులు విఱిగినవికా తలంపుము. ఏవృషసేనునో యేలక్ష్మణకుమారునో సౌభద్రు నెదిరింపంజేసి నీవుగూడఁ జూచుచుండిన నీచేటు మూఁడదుగద!

(తెరలో)

చ. అని నిసు వొంటిఁజేయఁ జనునా! యిటుఁ జోద్యము చూడ నంత తె
ప్పనిపని యేమివచ్చెఁ బసిపాపని బోరికిఁ బంపుసేయ, మీ
తనువులు గాల్పనే? పిదప; దంభనరాధిపులార! దేవకీ
తనయుఁడుఁ దమ్ముఁడు న్వినిన దక్కునొకో మనప్రాణమానముల్.

కృశా— భీమసేనుండు దురాగ్రహంబునఁ బల్కుపల్కులు విని ధృష్టద్యుమ్నప్రముఖులందఱు శరాసనమ్ములను వెదకికొనుచున్నారు.

విశ్వా— దీనికేమి, తన్నుం గయ్యముసేయఁబలదని నివారించు పెదతండ్రి కర్జుననందనుం డెట్టి ప్రత్యుత్తరము చెప్పునో విందము.

(తెరలో)

అయ్యా! వన్నెలవారించెదవు. రణాభిలాషంజేసి నాకు నేనైవచ్చి

యీనరాధిపుల "బాసటవల" దని నివారించిన నిల్చిరిగాని వారిలోపము గాదు.

క. బాణాసనంబు నేనొక
పాణింగొని నిలువ మద్రపతి యొకలెక్కా?
ప్రాణాశయున్న సగణ
స్థాణునకు వశంబె యెదిరి సమరము సేయన్.

కృశా— ఎందును రాచబిడ్డ రాచబిడ్డయే. అందుం గిరీటినందనుఁడు హరికి మేనయల్లుఁ డతనినోట ననుచితపుఁ బల్కులేల వెలువడును.

విశ్వా— తమ్ముఁడా! ఇచట భీమసేనుండు శల్యునితో గదాయుద్ధమునకు డీకొనియె. అవ్వలిదెస భారద్వాజుండు ప్రళయరుద్రునిపగిదిఁ బాంచాల సేనం జెక్కి చెండాడుచున్నాడు. మన మేసమరము చూతము?

కృశా— మనమా భారద్వాజుని యుద్ధమే చూడవలయును. ఏమన-

ఉ. "బవరమునందుఁ బట్టికొనివచ్చెద ధర్మజు" నంచుఁ గుంభసం
భవుఁడు ప్రతిజ్ఞచేసెఁ గురువల్లభుతోడఁ; గిరీటి యన్నతో
"నవయకుమయ్య! నేఁ గలరణంబున నిన్నుఁ బరాభవించువా
రెవ" రని యూఁతయిచ్చెనిపు డేమగునో సమయంబు వీరికిన్.

విశ్వా— సహోదరా! రెండును సమదర్శనీయములే యని నాకుఁదోఁచుచున్నది. కావున నీవీప్రక్కనుండి యిచ్చటి విశేషంబులు నాకుం దెల్పుచుండుము. ఏనావలనుండి యచ్చటి సంగతులు నీకుఁ జెప్పుచుం డెదను. రెండును జూచినట్లగును.

కృశా— మంచిది (ఆవలితట్టునకుఁ బోవును)

విశ్వా— తమ్ముఁడా! పార్థమధ్యముండు ప్రయత్నమున సౌభద్రుని వారించి మద్రపతిం దాఁకుట నీవు చూచినదే. ఇపుడుగదా! గదాధరులగు భీమసేనశల్యుల స్వరూపములు చూడఁదగినవి.

ఉ. శృంగములందు మధ్యములఁ జెంతలఁబూచినకింశుకంబులొ
ప్పం గగనంబునం దిరుగుపక్షపదద్రులు నాఁ జెలంగి రు
ప్పొంగుచు వీరు వారుఁ దమపోరివిచిత్రము లెంచుచుండ స
ర్వాంగములందు భీకరగదాహతి నెత్తురుధార లోడఁగన్.

కృశా— అగ్రజా! ఇచ్చటమాత్ర మేమి తక్కువ? సాయంతనార్కమండలంబునకు మరల మధ్యాహ్నంబు వచ్చిన తెఱంగున ద్రోణాచార్యునకు మరలఁ గౌమారంబు తటస్థించినది. ప్రళయకాలవారివాహంబు గర్జించుచున్నదో యన

నిజద్రోణంబు డాంకరించుచు, "భారద్వాజా ! రక్షింపుము రక్షింపుము! గురువర్యా ! కావుము కావుము ! కుంభసంభవా ప్రోవుము ప్రోవు" మని పెద్ద యెలుంగులతోఁ బందరాజులందఱు నమస్కరింపఁ గటాక్షించుచు, "శిఖండీ ! నిలువుము, సాత్యకీ ! పాఱిపోకుము, నకులసహదేవులారా! నాయొద్దఁ జదివిన ధనుర్నిగమం బప్పగింపుఁడు, ద్రౌపదేయులారా! మీరు కుమారులు నాబారికిఁ దొలఁగుఁడు, ద్రుపదా! నేఁటితో నీకు సురద్రుపదంబుఁ జూపింతు. విరాటా! నీవేల యీపోరాటమునకువచ్చితి" యనుచుఁ బదింటనో యిరువదింటనో ముప్పదింటనో చేతికివచ్చిన కొలందిఁ దూపులం జుఱుక్కున గాడనేయుచు నీటిమీఁది నూనెచందంబున సర్వత్ర తానయై యుప్పతిలం జేయు శరనిర్ఘాతంబులకుఁ గొందఱు సైనికులు "శ్లో॥ అర్జునః ఫల్గునః పార్థః కిరీటి శ్వేతవాహనః, భీభత్సో విజయః కృష్ణ స్సవ్యసాచీ ధనంజయః" అని యతని నామంబులు స్మరింప, మఱికొంద "ఱిఁ కెక్కడిపాండవు? లెక్కడియుద్ధ? మెక్కడి ధర్మరాజు? నేఁడు గురుఁడు తనమాట చెల్లించుకొనఁ గలఁ" డని బిక్కమొగంబులతోఁ బ్రలపింపఁ, గురంగంబుల మీఁదకి దుముకు సింగంబు చందంబున నురుకుడించుచు, ధృతకోశంబుమాడ్కిఁ దనయుధిష్ఠిర నామంబు నిరర్థకంబుగాఁజేయు ధర్మతనయు వెంటఁబడి విల్లుఁదునిమి కేతనంబుఁద్రుంచి రథ్యంబులంగూల్చి చక్రరక్షకుండగు సత్యజిత్తును వృకునితోఁగూడఁ జదిపి శరాఘాతంబులకోర్చి మరల నెదిరిన విరాటద్రుపదులఁ దఱిమి యనేకులఁ బాంచాల కుమారుల సురాంగనాకుచకుంభపాణులంజేసి విక్రమించుచున్నాఁడు.

ఉ. కదనము నేఁటితో ముగియుఁ గౌరవనాథుఁ డదృష్టశాలి యీ
ముదుసలి జన్నిగట్టు మునుముందఱఁ దీఱిచె వేరమెల్ల; వ
ట్టిది ప్రజలంద ఱాడుకొనుటే యది; పాండవపక్షపాతి గాఁ
డదియుఁ డితండు; బ్రాహ్మణుల కౌర ! పరాక్రమ మింతయొప్పునే.

విశ్వా— తమ్ముఁడా ! నీవు నుడివినవచనములు కొన్ని నే విననేలేదు. వాయునందన మద్రనందనులు గదాపాణులయి కొంతవడిపోరి తుదకుఁ బరస్పరాఘాతంబుల నిర్వురు మూర్ఛిల్లిరి. అందు శల్యునిఁ గృతవర్మ తనరథంబుపైనిడుకొని యెచ్చటికో కొనిపోయిన పిదపఁ గర్ణునికొడుకు వృషసేనుఁడు పిడుగువలెవచ్చి సర్వసేనాముఖంబుగ వాఁడివెడందతూపులు నిగిడించి విక్రమించుచునంత నకులపుత్త్రుండగు శతానీకుండును ద్రౌపదేయుండు నతని కోల్తల కడ్డంబై నిలువరించె. వృషసేనుం డతని చాపకేతనములుద్రుంచి యతిక్రమించు నాలోఁ దక్కుంగల ద్రౌపదేయులాతనిఁ బడఁబడి యశ్వ

త్థామాదులు వారిపై శరపరంపరలు గురిసిరి. దానంజేసి యాసమరంబు దేవాసుర సంయుగంబు పోల్కి నతిభీషణం బయ్యె.

కృశా— (అనాకర్ణితముగా) ఓ కుంభసంభవా! ఏపాప మెఱుఁగని ధర్మరాజు పయినా నీపరాక్రమము?

చ. మగఁటిమి గల్గెనేని రిపుమారకుఁడైన కిరీటితోడఁ బో
రఁగవలె నాతనిం గొనఁగ రాజుసమక్షమునన్ ప్రతిజ్ఞ చే
యఁగవలె నాతనిం జెనకి యాశశితారక మైనకీర్తి పొం
దఁగవలెఁ గాని యీ ప్రతిన ధర్మమె? ధర్మజుఁ బట్టితెత్తువే.

విశ్వా— (బిగ్గరగా) తమ్ముఁడా! అచ్చట ధర్మరాజనవస్థ యెట్లున్నది? ఇచ్చటను గిరీటి జాడ కనఁబడదు గదా.

కృశా— "భ్రాతృవత్సల! అజాతశత్రుండు పట్టువడియెఁ బట్టువడియె" నను సర్వ జనాక్రందనంబు విని కిరీటి వచ్చుచున్నట్లే యున్నది. ఏమన నీవెసఁ బాండవసేన పెల్లురేఁగుచున్నయది (తేఱిపాఱఁజూచి)

ఉ. అల్లదిగోఁ! గపిధ్వజ మహార్పతికిం దలచూపు, నల్లదే
తెల్లనిగుఱ్ఱముల్ గలుగుతేరు; రదుగో! హరి గొల్లపాగతో
నల్లనిమేనితోఁ గరమునం గొరడా గొని కూరుచున్నవాఁ
డల్లమునందుఁ దల్లడిల కూఱటఁ జెందును ధర్మజుం డిఁకన్.

(తెరలో)

ఉ. చంద్రుదు మర్జునుం గొడరి, చాలక చత్తుము రెండుగా కనిం
బెంపటి పాఱిపోము రణభీరులమై గురునాన; యింత మా
తెంపు గురుండు లావున యుధిష్ఠిరునిం గొనితెచ్చుదాఁక సై
రింపుచుఁ బార్థుని న్నిలువరించెద మో కురునాథ! పంపుమా.

కృశా— అన్నన్నా! ధర్మరాజుం బోవఁ దొందరతోఁ జనుదెంచుచున్న పార్థునకు నారాయణగోపాలసంశప్తకగణంబులతో సురథ సుబాహు సుధన్వసుశర్మ లడ్డుపడుచున్నారే. ఇఁక ధర్మరాజుగతి యేమగునో? (విశ్వావసువంకఁ జూచి) అగ్రజా! నీవు నీవైపున కేరమ్ము. భీమాదు లంద ఱీ దెసకే వచ్చుచున్నారు. (పరికించి) బళే! భగదత్త! భీష్ముని తరువాత నీవలెఁ గృష్ణునిట్లు నొప్పించినవారే లేరు. నరకపుత్రుండవు గదా! (ఆశ్చర్యముతో) భగదత్తప్రయుక్తంబగు వైష్ణవాస్త్రంబు శౌరికిఁ బూలమాలికగాఁ బరిణమించినదే! (వినుట నటించి) తనపైకి వచ్చు నస్త్రంబునకు లక్ష్యమైన వాసుదేవునితోఁ బార్థుం "డిది తగదు దీనికతన నన్ను రిపు లేవగింతురు. ఇదిగాక దయచే నీవు సారథ్యం బొనరింప

నంగీకరించుటయే చాలు. పయిపెచ్చిదికూడనా" అనుడు దానికి సమాధానంబు చెప్పి భగదత్తుపైc బురికొల్పుచున్నాcడు. (విచారముతో) అక్కటా! భగదత్తుడు తన సుప్రతీకముcగూడ సమీకమునకుc బురికొల్పుచున్నాcడు. (సంతోషముతో) ఔరా, యీనీలుని పౌరుషము! (తత్తఱపాటుతో) "నే నెవరితోడనో పోరాడుచుండ నీవునీవై నన్నుం గొట్టుమని పిల్చితి విదిగో!c గాచికొ" మ్మని యశ్వత్థామ శిరమ్మునకు గుఱిచూచి యొక క్రూరభల్లంబు ప్రయోగించుచున్నాcడు (నిరూపించి) ద్రౌణి యాశస్త్రంబును ఖండించి "నేనెందుకుc బిల్చితినో యాఫల మియ్యది తెల్పంగల" దని క్రోధహాసమ్ము లుప్పతిల్ల నొక్కవాడిభల్లమ్ము నిగిడించుచున్నాcడు. (విచారముతో) అక్కటా! నీలుండు కాలుండుండుచోటికిc బోవుచున్నాcడు.

విశ్వా— (ఆకసమువంకc జూచి) సంధ్యాకాల మాసన్నమైనది. నిన్నటితోc బాటు నేcడుగూడ ద్రోణునిప్రతిజ్ఞ వ్యర్థమయినట్లే మన మనుకొనవచ్చును. భీమాదులు చుట్టును గాపాడుచున్న యీమహారాజ ద్రోణునికిc గాదుగదా, స్థాణునికేని యజయ్యుcడే. (పరికించి) కర్ణార్జునులు తాcకుచున్నారు, పోరు ఘోరం బగుచున్నది. (తత్తఱపాటుతో) అయ్యో! అయ్యో! శిఖండి ధృష్టద్యుమ్నులు సారథిని జాపంబున నఱికిరి. ఇcకc గర్ణుcడేమగునో కదా! (దృష్టినించి) భయములేదు రారాజు ద్రోణసైంధవులతోనరిగి కాపాడుచున్నాcడు (విచారముతో) పాపము! ఇదేసమయమని కర్ణబాంధవులc బదివేవుర నొక్కపెట్టున వృకముడి తన గదాధిదేవతకు బలివెట్టుచున్నాcడు.

కృశా— (వినుటనూచించి) రేపు జరుగు యుద్ధక్రమము గడు విచిత్రముగా నుండును.

క. ఛద్మంబువేచి విప్రక
కుద్మంతుం డేచి కుంతికొడుకులను మహా
పద్మఘ్నులc గావింపcగc
బద్మవ్యూహంబుc బన్నువాcడcట వింటే.

విశ్వా— తమ్ముcడా! ఈవ్యూహము భేదింపc దగినవారిందుc గృష్ణార్జునాభిమన్యు లున్నవారని యయ్యానఘుc డెఱుcగcడా!

కృశా— ఆయన కీమాత్రము తెలియదా? తెలిసియును బన్నుచుండుటచేతనే [illegible] మఱియొక పన్నుగడగూడc దోడుండునని మన మూ[illegible] [illegible].

విశ్వా— ఊహించినట్లే యున్నది. సంశప్తకులు కృష్ణార్జునుల నరికట్టెదరనియు నభిమన్యుఁ డీవ్యూహ విషయమును సమగ్రముగా నెఱుఁగఁడనియు వారి యభిప్రాయము కావచ్చును. కానిమ్ము, త్రిస్కఁబోవుచు రుచులెందుకు? రేపకడ సర్వము స్పష్టమే యగునుగదా.

కృష్ణా— ఏమీ! సమగ్రముగా నెఱుఁగఁడనియా? యెఱుఁగకపోవుఁగాక.

మ. అభిమన్యుం డభిమానధన్యుఁ డతఁ డయ్యాచార్యు గీచార్యు వీ
తభయుం డించుక లెక్కసేయఁ డొకో పద్మవ్యూహమే కాదు తా
నవు డించేదియేని వ్యూహమున యుద్ధాసక్తిమై వచ్చుఁగా
క రణాంబంబునఁ బలంపఁ దాఁగఁగలఁ డొక్కండ తాఁ గోదండుఁడై.

విశ్వా— అవును. నీవు చెప్పిన దించుకయు నతిశయోక్తి కాదు. బాగుగ యోజించిన స్వభావోక్తియుం గాకపోవచ్చును. ఏమంటివా?

తే. గీ. తండ్రి రుద్రు నెదిర్చిన ధన్యమూర్తి
తల్లియును గొంత యుద్ధవిధ మ్మెఱుంగు
మేనమామకు సాటి జగానఁ గాన
మన్యు లెట్లోడగుదు రభిమన్యునకును?

(నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ ...తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవ విజయము

## తృతీయాంకము

(అంత ధర్మజ భీమ నకుల సహదేవులు ప్రవేశించుచున్నారు.)

ధర్మ— భీమసేనా! ఈపద్మవ్యూహంబు భేదించుట మన యభిమన్యుం డెఱుఁగునని తొల్లి ప్రసంగవశంబున వాసుదేవునిచే వింటిని. అతనిం బంపుదమా?

భీమ— మనము చేయవలసినపని యిదితప్ప నొండొకటిలేదు. కృష్ణార్జునులు కోపపడినఁ బైసంగతి విచారింతము.

నకు— సుభద్రతోనైనఁ జెప్పి పంపించిన శ్రేయము.

ధర్మ— అవును. సహదేవా! నీవుపోయి సుభద్రతోఁ జెప్పి యభిమన్యు నిటకుం దోడుకొనిరమ్ము.

సహ— (పోయి యభిమన్యు సహితుండై ప్రవేశించును)

ధర్మ— (అభిమన్యుం గౌఁగిలించుకొని) నాయనా! సౌభద్ర!

ఉ. "కయ్యము సేయ ర"మ్మని త్రిగర్తులు పిల్వఁగ గెల్వఁబోయె మీ
యయ్య; గురుండు పూని కభయంబిడె నన్గొని పెత్తు నంచుఁ దా
నొయ్యన; నెందుఁజొత్తుఁ? బ్రబలోగ్రుఁడనంగ వెలుంగుచున్న వాఁ
డయ్యనఘాత్ముఁ; డేది తెరువయ్య! వచింపుము మాకుఁ బుత్రకా.

నిన్నటిరణంబుననే సత్యజిత్తు సూర్యదత్తుఁడు మొదలగు పెక్కురు యోధులు మడిసిరి. తక్కినవారు తమయథాశక్తిఁ బెనంగుదు మన్నను—

శా. మా కెవ్వారి కభేద్యమైన యొక పద్మవ్యూహముం బన్ని క
న్నాకై వాకిలి గాచి యుండె గురుఁడన్నా! యెట్లుపోనేర్తు! మే
వీఁకం గెల్చెద? మింతసేపు సమరోర్విం "గిరీటియుం గృష్ణుఁడుం
లేకుండిన నుత్తదే" యను పదంబిం బాపి కాపాడుమా.

భీము— (బుజ్జగించుచు)

గీ. మద్రిపతితోడఁ బోరాట మానిపించి
వంటితినటంచుఁ గోపింపవలదు తండ్రి!
పెద్దవారుండ నీకేల పిన్నవాఁడ
వనుచుఁగా కీవు చాలవే యనుచుఁగాదు.

నేఁడుమాత్రము పెద్దవారము కాకపోతిమా, బలవంతులము కాకపోతిమా? అయినను-

చ. పెనుగదఁబూని శత్రువులఁ బిప్పిరియొనర్చుట తప్ప నెన్నఁడుం
బనివడి యిట్టివ్యూహములు పన్నుట విప్పుట యే నెఱుంగ; నా
కనువుగ వాఁడిసూది మొనయంత కదల్చితి వేవిఁ జొచ్చి య
మ్మొనఁ గలగుండువెట్టి పడమొత్తెద మత్తగజంబు చాడ్పునన్.

నకు— కుమారా! పద్మవ్యూహంబు భేదించువెరవెఱుంగ మనుటకే కాక మా నోట నిన్ను యుద్ధమునకు బాసట గమ్మనుటకుఁగూడ లజ్జవొడము చున్నది.

చ. "ఒరులకుఁ జేతఁగాదు చనె నొండెడ కర్జునుఁ" డంచుఁ జిత్తమం
దరసి గురుండు పన్నిన మహాకపటం బిది; మొగ్గరంబులోఁ
జొరవెర వొండు చూపి మము శూరులఁ జేయఁగదయ్య! నేఁటి సం
గరమునఁ గుంతిభోజసుతకంటెను గోడలు వీరమాతగన్.

క. మాయెడకంటెను గురునకు
నీయెడఁ గలకూర్మి హెచ్చు నే నెఱుఁగుదు నీ
వే యెదిరిన నినుదృఢతర
సాయకముల నేయఁ డెట్టి సమయమునందున్.

సహ— తండ్రీ! వంశోద్దీపక!

గీ. చేతిలావు చూపి చిన్నన్న దగ్గఱ
లేకయున్న వెలితి లేకయుండ
మొగ్గరంబుసొచ్చి మొనచించి పాండుభూ
పాలుకీర్తి నిలుపవలయునయ్య.

"మొగ్గరంబు సొచ్చుట తప్ప వెడలుట యెఱుంగఁ" డని సంశయించిన మావదినెతో "ధృష్టద్యుమ్న సాత్యకి ప్రముఖులతో మేము వెనువెంటఁ గాపాడుచుందు మింతలో మాయన్న రాఁగలఁ" డని చెప్పి యొప్పించితిని.

ఉ. దారియొనర్చి మొగ్గరము దాటిన పిమ్మటఁ బెక్కుమంది యు
న్నారము చంపఁ జావఁగ; రణంబున నీవు వహింపఁ దగ్గ దీ
భారము; మోచి కీర్తి నిలుపందగునయ్య కుమార! మమ్ము నా
శౌరియు నన్నయున్ బరవసంబున నుల్లస మాడకుండఁగన్.

అభి— తండ్రులారా! యీ యలంతికార్యమునకు నన్నింత బతిమాలవలయునా? పుట్టినది రాచపుట్టువుగాదా! ఈదుర్యశంబు నాకుమాత్రము రాదా? రాచబిడ్డ రణంబుసేయుట కాఁడువాండ్ర యంగీకృతి కావలయునా? వేయేల యిదిగో నాప్రతిజ్ఞ వినుఁడు.

ఉ. ఆఁకలి మంటచే వడిఁ దటాకము సొచ్చెడి యేనుగున్న య
ట్లాకురురాజఘోరపృతనాంబుజముం దగద్రుంచి ద్రోణునిం
దాఁకి కలంచి మామలను దండ్రుల సంతసపెట్టుటేనియున్
లేక "కిరీటినందనుఁడ నే" యని యేనిఁకఁ జెప్పికొందునే.

దేవా! అజాత శాత్రవ! ఇంకొకమాట వినుము.

ఉ. ద్రోణుఁడుఁ గర్ణశల్యులుఁ గురుక్షితినాథుఁడు దుస్ససేనుఁడుం
ద్రౌణియు బాహ్లికుండు "బళిరా! యొడలిట్లు చుఱుక్కుమన్న యీ
బాణము లర్జునాత్మజునివా? హరపుత్రునివా? కిరీటివా?
స్థాణునివా?" యటంచు మది సందియ మందునటుల్కలంచెదన్.

ఎవఁడురా యక్కడ? సుమిత్రునితో నామాటలుగాఁ గర్ణికారకేతుస్ఫీతంబును ద్రిహాయనాశ్వంబును నగు రథంబుఁ దోడితెమ్మని చెప్పుము.

భటుఁడు— దేవా! చిత్తము. (పోయి సుమిత్రునితోఁ బ్రవేశించును)

సుమి— (నమస్కరించి) ఆయుష్మంతుఁడా! తేరు సన్నద్ధపఱచి తెచ్చితిని. ఇంక దేవరప్రమాణము.

అభి— తండ్రులారా! నేను బోయెద.

ధర్మ— (శిరంబు మూర్కొని) పాండవనయనకువలయచంద్రికాసార! కుమార!

ఉ. దగ్గఱ లేరు మామయును దండ్రియుఁ; ద్రోణునితోడిపోరు కాఁ
దగ్గది; భార్యగర్భవతి; తల్లి సుభద్ర త్వదేకపుత్ర; నీ
వగ్గ నిరంకుశంబు; పసిపాపవు; పాపులు వారు; మేనికిం
గగ్గురుపాటు పుట్టెఁ గొడుకా! నిను యుద్ధము చేయఁ బంపగన్.

అభి— ఆర్యా! ఏల యిట్లధీరోచితంబులగు పల్కులు?

క. పురహరుఁడు వచ్చియునికిం
జోరబడుఁ గాకేమి విజయునూతి జడియునే!

హరియుం గ్రీడియుఁ గౌరవ
పరమగ రానిమ్ము గెల్పువడయుదుఁ దంగ్రీ!

ధర్మ— (సంతోషముతోఁ జేయియెత్తి)

గీ. ఆడి యెన్నఁడు బొంకనివాఁడనేని
ధార్మికుఁడనే నజాతశాత్రవుఁడనేని
బదుగు రొకటయి నినుఁ గవయుదురు గాక
నీకవిజయంబు సుమి సుభద్రాకుమార!

భీము— (తనలో) అమంగళంబు ప్రతిహతం బగుఁగాక! భావికార్యమెట్లున్న దోగదా? అమోఘవచనుండగు నిమ్మహానుభావునినోట సందిగ్ధార్థంబు లగు నక్షరములు వెలువడినవి. ఆశీర్వాక్యమునం దమంగళార్థము స్ఫురింపఁగూడదు. "పదువు రేకమయినను నీకే జయముసుమీ" యని యీ యనఘుని తాత్పర్యము. "పదుగురు నిన్నుఁ జుట్టుముట్టుదురుగాక!" అని యశ్లీలార్థము స్ఫురించుచున్నది. ఇంతకుమున్ను కుమారునివాక్యమున "పోయివచ్చెద" ననుటకు బదులు "పోయెద" ననిమాత్రమే నుడువుటచేతనే కొంత సందియపడి యుందుచున్న నాకిది మఱియును వెనుబాటు కల్పించుచున్నది. కానిమ్ము, మాకందఱ కేడుగడయు విశేషంబుగ నితనికి మేనమామయునగు మురాంతకుని యనుగ్రహ మున్నంతవఱ కేమియు లోపంబు రాఁగూడదు. (ప్రకాశము) దేవా! యుధిష్ఠిరమహారాజ! ఈ మాద్రేయభుజచతుష్టయ రక్షితుండవై నీ విచటనే నిలువుము. నేనుం గుమారుండును జనియెదము.

ధర్మ— నాయనా! భీమసేన!

ఉ. అంచితసత్త్వలౌ మనమహారథు లీవును నాల్గుప్రక్కలం
బొంచి కుమారు నేమఱక ప్రోచుచుఁ దామరమొగ్గరంబు వోఁ
జించినవెంటనే రిపులఁ జిందరవందర చేసి మాట ద
క్కించుఁడి! క్రమ్మఱ న్సుతునిఁ గృష్ణసహోదరి కప్పగించుఁడీ.

భీము— దేవా! అందఱిని దేవర సత్యప్రభావమే కాపాడఁగలదు.

(కుమారసుమంత్రులతో నిష్క్రమించును.)

ధర్మ— నకులసహదేవులారా! భీమసేనునకుం గోపమువచ్చునని నాసంరక్షణకై మిమ్ము నిలుపుకొంటింగాని వేఱుకాదు.

చ. కదనములోపలం బగఱకండలు రాల్చుచుఁ గ్రీడిపోలికం
బదుగుర నొంచుఁజాలిన కుమారులు మీరిచటేల్ల నై బాహుసం

పడఁ గురుసేనఁ దాఁకు నభిమన్యున కూఁతము గండు పాండు నే
నొదిగెద నెచ్చటేని హరియుం జిన తమ్ముఁడు వత్తురింతలోఁ.

కావున నాకుం బాంచాలీశిబిరమునకుం ద్రోవచూపి యంతఃపుర సంచారయోగ్యుండగు నొక కరండకునిచేఁ గుమారయుద్ధ పరిచారంబు దెలిపింపుఁడు.

నకు— (జనాంతికము) సహదేవా! పాంచాలీశిబిరమునకుం ద్రోవచూపుమనుటవలన మనము నిశ్చింతముగా సమరమునకు బురికవచ్చును. మహారాజు నొంటిగా విడిచి వచ్చితిమని భీమన్నకును గోపము రాదు.

సహ— (ధర్మరాజుతో) దేవా! దేవరయానతి శిరసావహింతుము. అదిగోఁ బాంచాలీశిబిర మిచ్చటికి కనతిదూరముగా నున్నది. ఇట్టిటు (కొంతదూరము నడిపించి) ఎవ్వఁడురా?

ద్వారపాలకుఁడు— (ప్రవేశించి) దేవా! నేను బకోటకుఁడను.

సహ— ఓరీ! పాంచాలరాజపుత్రికిం దెల్పి యీమహారాజును లోనికిఁ దోడ్కొనిపొమ్ము. (ధర్మరాజుతో) దేవా! యింక మాకు సెలవొసంగుము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ద్రౌప— (బకోటకునితో ధర్మరాజు నెదుర్కొని) ఆర్యపుత్ర! మీ మొగంబు చింతాక్రాంతమై బడలినట్లున్నది. నిరంకుశప్రతాపు లగుమీ తమ్ములు నలువురకుఁ గుశలమే కద?

ధర్మ— (నిట్టూర్పుపుచ్చి) చెలీ! యాచార్యభాస్కరుం డస్తమించునంతకు మాకుఁ గుశలమెక్కడిది? ఇప్పుడింకొక యుపద్రవము తలస్థించినది.

ఆ. వె. సవ్యసాచి హరియు సంశప్తకులమీఁది
కేగఁజూచి ద్రోణుఁ డేపుమిగులఁ
బంపినాఁడ మన సుభద్రకుమారుని
దురము సేయ భీముఁ దోడొసంగి.

ద్రౌప— మహారాజ! రాజకుమారులకు సమరశాత్రవగర్వనిర్వాపణము విహితకృత్యమే కదా! దానికింత పొగులనేల?

ధర్మ— పాంచాలీ! అట్లుకాదు. మాయర్జునుం డొకనాఁడు "నేను దగ్గఱ లేనిచోఁ గుమారు వ్యూహసమరమునకుఁ బురికొల్పకుఁ" డని యొత్తి చెప్పెను. దానఁజేసి మనసు కలఁగుచున్నది.

# తృతీయాంకము

ద్రౌప— అదియు విచారణీయాంశమే. అతఁడు మాత్రము "పులికడుపునఁ దురంగపోతము జనించు" ననుకొనునా! అట్లనుటకుఁ దగిన కారణ ముండకపోదు. కాని యేల యంత తప్పని పనివచ్చె?

ధర్మ—(తనలో) స్త్రీలకడ లజ్జాకరంబగు కడచినవృత్తాంత మేమని చెప్పుదును.

(తెరలో)

ఉ. పాండవయోధులార! యిటు భండనభూమికి ఫల్గునుండు రా
కుండినఁ గట్టిపెట్టెద సుయోధనుముందట ధర్మపుత్రు మా
ర్తాండుఁడు గ్రుంకకుండ సమరంబటు పాఱకయుండెనేని; యె
వ్వం డెడసొచ్చినం దునిమివైచెద శీర్ష మొకొక్క తూపునన్.

ధర్మ— (వినుట సూచించి) పాంచాలీ! వింటివా? ఆచార్యుని ఘోరప్రతిజ్ఞ! ఆ ముసలిపాఱుని మేఘగంభీరస్వన మెంతదూరము వినఁబడుచున్నదో?

ద్రౌప— (తనలో) ఈమహారాజున కంతఃపురప్రవేశ కారణమిదియే కాఁబోలును. (ప్రకాశముగా) దేవా! జడియకు జడియకుము. సమరభూమి నర్జునుం డొకటియు నభిమన్యుఁ డొకటియునా? ఇదిగాక సంగర మందున్నచోఁగదా పట్టుకొనుట.

భటు— (ప్రవేశించి) దేవా! రణరంగమునుండి కరండకుఁడు వచ్చి ద్వారమున నున్నవాఁడు.

ధర్మ— (ఆస్థలో) త్వరగా ప్రవేశపెట్టుము.

కరం— (ప్రవేశించి) దేవా జయము జయము.

ధర్మ— కరండకా! కుమారుని సంగరరంగప్రచారము వినిపించి మాచెవులకు రసాయనముఁ గావింపుము.

కరం— దేవా! చిత్తము. దేవరయానతింగొని కుమారుం డరదంబున నుదయదంశుమాలితెఱంగునం బ్రకాశించుచు నీషత్కుటిలంబును జ్యాకిణాంకితంబును గాని గాండీవిభుజాదండంబునుంబోని భుజార్గళంబున వింటిత్రాఁడు సంధించి దిగ్గజశ్రవణ బధిరీకరణచణంబుగ గుణంబు సారించుచు శంఖంబు పూరించుచు మేమందఱము చూచుచుండ నవలీలఁ దమ్మి మొగ్గరంబు చించి లోనికిం బ్రవేశించి యేనుఁగులమీఁదికిం దుముకు కేసరికిశోరంబు చందంబునం బొలిచి యాచార్యప్రముఖ యోధవరులపై కుఱుకుచు "ధమ్ము, నిలువు, మాఁగు, మెవఁడవు రా! నీవా! నేను, వాఁడు వీఁ" డనుచు నొడలెఱుంగక ప్రేలుచు మంటలోఁబడు శలభమ్ముల మాదిరి [illegible] నొక్కొక్క తూపునను గుదులు

గుదులుగఁ బోరిమాల్చుచు విజృంభింప దుర్యోధనుండు సూచి నలుదెస లగ్నిదరికొన్న శుష్కశరవణంబు భాతిఁ బలుచనైన తన సేనయవస్థకు మండిపడుచుఁ గుమారుండాఁకె.

ధర్మ— కరండకా! ప్రథమకబలంబుననే మక్షికాపాతమన్నట్లు మొదటనే సుయోధనుం డెదురుపడెనా! తరువాత?

ద్రౌప— ఆర్యపుత్ర! అది మక్షికాపాతముగాదు సుధాపాతమే.

కరం— తరువాత ద్రోణుం డెలుఁగెత్తి "యో ధరాధిపతులారా! అభిమన్యుండు కురు నాథుం దాఁకుచుండ నూరకుండెదరేమి. అతఁడు పసివాఁడను కొంటిరేమొ, యర్జునాత్మజుఁడు సుడీ! ఒరులకు దుర్భేదంబగు పద్మవ్యూహము నొక్క చెప్పపాటులోఁ జించుటయైనఁ జూడరా!" యని తన రథం బతని మీఁదికిఁ దోలింప నశ్వత్థామ కృపదుశ్శాసన కర్ణ కృతవర్మశల్య పౌరపశలభూరిశ్రవః ప్రముఖులు చుట్టుకొనిరి.

ధర్మ— కటకటా! కుంభసంభవ! నీవే యిట్లు క్రూరకృత్యమున కొడిగట్టుచున్నావా! ఒక్క కుమారునిం బదువురఁ జేరదాకించుట ధర్మమా? కంచియే చేను మేసినఁ గాఁపేమిచేయఁగలఁడు! తరువాత?

కరం— తరువాత సౌభద్రుండు తన సుందర పదనారవిందంబున కందంబుఁ జెందించు చిఱునవ్వునవ్వి తేలుకుట్టిన నోడలంతయుఁ జుఱుక్కుమని సట్లొక్కొక్క బాణంబున నయ్యోధవరుల నాటించి విశేషంబుగ ద్రోణునిం బదుసేను నారసంబుల నీరసంపడఁజేసె.

ధర్మ— (సంతోషముతో) బళే! కుమార!

* గీ. కులము చెఱుపంగ నూర్వురు కొడుకులేల
యొకఁడు చాలఁడె నీవంటి యుక్కులుంపు
ఊఁకుక్కలు పదివేలు చేరనేల
చాలదే వేఁటకై యొక్క జాగిలంబు.

---

* ఇయ్యెడ నీచోపమయని యనేకులు ప్రాజ్ఞులు సంశయించినట్లు విని యుంటిమి. కాని వారింకను బరిశీలింపఁ బ్రార్థితులు. వస్తు వెట్టిదియైనను అందలి గుణమేదో మంచిదియున్న దానినే పురస్కరించుకొని వాల్మీకి మొదలు నేఁటి సుకవుల వఱకును గవు లుపమానముగాఁ గైకొనుచునే యున్నారు. ఇందులకుఁ బ్రయోగములు- వాల్మీకి రామాయణమున యుద్ధకాండమున (దృశ్యేతేశల్య కావివ) శ్రీరామలక్ష్మణులు సమయోచితముగ నేదుపందులతోఁ బోల్పఁబడిరి. మఱియు భారతమున (శరాచితాంగస్సౌభద్రశ్శ్వావిద్వత్ప్రత్యదృశ్యత) అభిమన్యుఁడు

కరం— తరువాత గురుండు ఖల్లఁదనము చిఱునగవుగను గన్నీరానంద బాష్పంబుగను బరిణమింప “ బాపురే కిరీటినందన ! మాకుందగిన సత్కారంబు గావించితి” వని బగ్గుబగ్గునమండు కాయ మాపాదమస్తకము సవరించుకొనుచుండ వృషభంబుపై దుముకు బాలవ్యాఘ్రంబు పోలికఁ గురురాజు పైఁబడు కుమారున కశ్మకేశ్వరుం డడ్డపడియెను.

ద్రౌప— వీఁడశ్మకుని కొడుకే గాఁడా ! వీనికి వినాశకాల మాసన్నమయినది. “ మహాగజాః పలాయంతే మశకానాంతు కా కథా ” వీఁడా కుమారు నడ్డువాఁడు ? తరువాత తరువాత ?

కరం— తరువాత నో దేవీ ! రథాశ్వసూత కేతనంబులతో నాతనితల భూతలంబునకు బలియిచ్చి కర్ణుని మీఁదికిం దుమికి యాతని కవచం బీవలినుండి యావలికి దూసిపోనేసి యతని సహోదరుఁ గసిమసంగిన దుర్యోధనాదులు వెన్నుచూపిరి. శల్యుండు మూర్ఛిల్లె నని యతనికి సహాయుపడిన యతని యనుజుఁడు మడిసె. ఇట్లు మహాసంవర్త సమయశూలపాణిం గ్రోణిసేయుచు నేనుంగుల నుచ్చిపోనేయుచు నరదంబులఁ గూల్చుచు హయంబులం బిండిసేయుచు గేతనంబులు రాల్చుచుఁ బదాతుల మేనులు నెత్తురుకాలువలపైఁ దేల్చుచుఁ బీనుఁగు పెంటలుగాఁ జేసినఁ జిక్కువడియుఁ జీకాకువడియు గగ్గోలువడియుఁ దొలంగియు వెఱచఱచియు

---

వెనుకటి వలెనే పోల్పబడినవాఁడు. మఱియు భీష్మ పర్వమున 3 ఆశ్వాసమున (ప్రబలోద్ధతలులాయలుళితంబులైన కమలకైరవోత్పలంబులగు కొలంకులు) ఇట లులాయము (దున్నపోతు) భీష్ముఁడే కావలసియున్నది. మఱియు ద్రోణపర్వము 4 ఆశ్వాసమున-గురుఁడామిషమ్మునకు వేచు డేగచందమ్మునఁ, మఱియు సైంధవవధఘట్టమున (పార్థః .నివారయామాసలోభస్సర్వగుణానివ) అర్జునుఁడు లోభగుణములతోఁ బోల్పఁబడె. మఱియు మాఘకావ్యమున (కఠోరతారాధిపలాంఛనచ్ఛవిః) చంద్రుని కళంకముతో శ్రీకృష్ణుఁడు పోల్పఁబడియె. మఱియు అనర్ఘరాఘవనాటకమున (అయమపిఖరయో[illegible]ంతకాషాయగౌరం .....అర్చిః) సూర్యకాంతి ఆఁడగాడెద కంఠకాంతితోఁ బోల్పఁబడియెఁగాని యియ్యెడ వ్యాఖ్యాత (న్యూనోపమాదోషః క్షంతవ్యః) అని వ్రాసినాఁడు. అతని తాత్పర్యము న్యూనోపమయైనను ఔచిత్యముంబట్టి గ్రహించవచ్చుననియే కన్పట్టుచున్నది. ఇట్టి వింకను అనేకములు చూపవచ్చును. ఇప్పటికే గ్రంథవిస్తరమైనది. కావున నింతతో విరమించుచు దీనిచేతఁగూడ సమాధానమునొందని దోషజ్ఞులకొఱకై పాఠాంతరములు రెండుదాహరించుచున్నారము.

1 కఱపర్వాల్వంద చెక్కుటకన్నముక్క, రలకుఁజాలదె యొకమగటాలిముక్క

2 రిక్కలెన్నేనియుఁ బెలరేఁగ నేల, చాలదే చీఁకటికి నొక్కచంద్రరేఖ

మూర్ఛిల్లియు బరవసంబేది దీనదశకువచ్చు తన సేనఁజూచి యాచార్యుండు ఫల్లవ[illegible] "పాండవపక్షపాతి" యని యాతనిం దూలుచు దుశ్శాసనుం డెదుర్కొన నాఁటి సభలోని దౌర్జన్యంబు బుగ్గడించి మించి విక్రమించి ప్రాణమాత్రావశేషుం జేసి పాఱఁగొట్టె. వృషసేనుండు రథంబు మీఁద నొఱగె. లక్ష్మణకుమారుం డెదుర్కొన ద్రోణాదులసమక్షమ్మునఁ బ్రతిజ్ఞాపూర్వకమ్ముగ యమాలయమ్మున కనిపె.

ధర్మ— ([illegible]రముతో) అక్కటా! లక్ష్మణకుమార! యెఱిఁగియును నీవు సౌభద్రు నెదుటి కేల పోతివి తండ్రీ! (కోపముతో) ఓయీ మూఢదుర్యోధన! యిప్పటికేని నీకు బుద్ధివచ్చినఁ దక్కిన కురుకుమారులేని బ్రతుకుదురుగదా!

కరం— దేవా! యెంత యమాయికత్వము? పుట్టెను బుట్టిన బుద్ధి పుడకల తోడనేకదా పోవలసినది.

ధర్మ— అవును, నీవనినట్లే. తరువాత నేమిజరిగెను.

కరం— పిదప బృహద్బలుండు రూపుమాసె. అశ్మంతకుండు చదిసె. ఈగతిం బ్రలయవారివాహచటుల నిర్ఘోషతుల్యంబుగ మ్రోగు వలయీకృతకోదండ మండలంబు నడుమనుండి వెడలు బెడిదంపు పిడుగుటంపర సహింపక కురుసేన చెల్లాచెదరై నుగ్గునూఁచమై పంచబంగాళమయి బెదర మన కుమారకంఠీరవంబు యుద్ధంబునం దనివితీఱక హతశేషంబగు దళమును వెనుదగిలి కసిమసంగి నెత్తుటికాలువ లనేక వైతరణీ నదులం బురణింప మింట మంటలుఁగురియు మధ్యాహ్నమార్తాండునకుం దోడై వెలుంగుచు ద్రోణునిపై కరదండంబుఁ దోలించి పెద్ద యెలుంగుతోఁ "దాతా! యర్జునుండు సమరభూమికి రాకుండిన" నని యవకాశముంచుకొని "మామహారాజుం జెఱపట్టి కురుకుల[illegible]గలఁ బెట్టెద" నని కదా! బీరంబులాడితి, విదిగో! నేనే యవకాశంబు లేకుండ మీ యందఱు జూడ మీమహారాజుం బట్టుకొని మా పెద్దతండ్రియొద్దఁ బెట్టెద నని బెబ్బులియట్లు మరలఁ గురురాజుపయిం గవిసె.

ధర్మ— తండ్రీ! ఇదిచాలు పదుగురు వినచుండ గురువరుండు నాకుం జేసిన పరాభవంబునకుం దగినమాట మాఱుచెప్పితివి.

కరం— అంత మద్రరాజు కొమరుండు రుక్మరథుఁడు రాజతో నేమో ప్రగల్భములు వల్కి "యీతనిం బ్రాణముతోడనే పట్టవాఁడ" నని చెప్పి

విక్రమించి [illegible]. [illegible] రాజపుత్రులు లహమ [illegible] దవు [illegible] అగ్గలమయిన [illegible] ప్రాణములం గోలుపోయిరి.

ద్రౌప— కరండకా! ఎంతసేపు చెప్పినను కుమారుని యుద్ధప్రసంగమునే చెప్పుచుంటివి. భీమసేనాదు లెక్కడ నొదిగిరి.

కరం— తల్లీ! ఏమనివిన్నవింతు. కుమారుం డొకర్చిత దారివెంబడి నుగ్గరంబు చొరంబోవు మన మహారథు లందఱకు సాక్షీకంబుగా సైంధవుం డడ్డపడియె.

ధర్మ— (తలపంకించి) సింధురాజా? సైంధవుఁడా? వానికి భీమాదుల నరికట్టు పాటి సామర్థ్య మెక్కడిదిరా?

కరం— నాఁడు వనంబునఁ బాంచాలిం జెఱగొన్న- (పెదవి కఱచుకొనును)

ద్రౌప— కరండకా! సంశయింపకుము. నా బన్నము లెఱుంగనివారెవరు, తలంపనివా రెవరు?

కరం— అపుడు పాండవులు చేసిన పరాభవంబు సహింపక పురశాసనుంగూర్చి తపంబొనర్చి యసహాయంబుగఁ బాండవుల నెల్లర నాజి నాఁగుటకుఁ వరంబుగోరుకొనెనఁట. దానికి మహాదేవుం డెట్టకేల కంగీకరించి "యర్జునుం దక్కఁ దక్కిన నలువుర నొక్కనాఁడు వారింపఁగలవు పో" మ్మని యొనఁట.

ద్రౌప— గోరుచుట్టుపై దాఁకు రోఁకలిపోటువలె నా చండాలుని దినముకూడ నేఁడే రావలయునా?

ధర్మ— (నిట్టూర్పు నిగిడించుచు) అటులేని భీమాదులు దోడుపోయినలాభంబును నేను వోని నష్టంబును గూడలేదు. తరువాత నేమిజరిగినది?

కరం— తరువాత నో మహారాజ! దుశ్శాసనుని కొడుకు మట్టమధ్యాహ్నంబున మూఁడవ మార్తాండునివలె మండిపడుచు వచ్చి పెద్దతండ్రి కడ్డుపడియె.

ధర్మ— బళే! కుమారులారా! మీరిరువురును బలపరాక్రమములచేఁ నసమానులైనను సమాన వయస్కులే. ఇరువురును బెదతండ్రులకొఱకుఁ బోరాడువారే. పిమ్మట?

కరం— పిదప వారిరువురును తేరులు డిగి బాహాబాహవి ముష్టాముష్టి కేశాకేశి తలాతలి ముఖ్యంబులం బరాపరంబులు లేకుండ సరాసరిగఁ బోరాడునప్పు డందఱికిని జూడవేడుకరైనది. ఈపగిదిఁ గొంతవడి నియుద్ధము సలిపి

యప్పాండవ కౌరవ కుమారులు మరల నరదంబులమీఁది కెగసి పరస్పర విముక్త శరంబు లంబరమార్గంబున నే తుత్తునియలు గావించుకొనుచు జగడంబుఁ జేయుచుండ నపరాహ్ణంబగుడు నట్టిటు తిరుగు క్రవ్యాదపటలంబునకు శత్రుంజయ సూర్యభాను మేఘవేగ సువర్చశ్చంద్రకేతు ప్రముఖుల మాంసఖండంబులు ఫలాహారంబులుగను శోణితంబు పానీయంబుగ నుపయోగించె. అట్టియెడ వికసత్కోకనద చారువిలోచనుండగు నా సౌభద్రుండా దుశ్శాసనతనయు నేడు బాణంబుల నొప్పించి రథాశ్వసూతకేతనంబు లవనింగూల్ప నతఁడొండు రథంబునంబడి పలాయితుఁడయ్యె. ఇట్టు లయ్యేకవీరుండు నిర్నిరోధంబుగా విజృంభించుటఁజూచి కర్ణుండు శౌనితో యోజించి యాచార్యునొద్దకు వచ్చి "కుంభసంభవా! ఇదేమి చోద్యము. పిల్లపిడుగు మన పాలిటికిఁ బిల్లలపిడుగయ్యె. దేవర యీవరుస మిన్నకుండుటకన్న యధర్మమున్నదే!" యని యనేక ప్రకారంబులం బ్రార్థింపఁ గొంతనడి నేమియుననక యతండు "ఎట్లో విల్లు దునిమి విరథుం జేసినఁగాని యితని ఫాలాక్షుండేని యెదిరింపలేఁ" డని యుత్తరంబిచ్చె. పిదప గుప్తచతుష్టయం బేదియో యోజింప మొదలిడియె. నే నీయుదంతము దేవరకు విన్నవించుటకై వచ్చితిని.

ధర్మ— హా కుమార! బోనులోఁబడిన కొదమ సింగమవైతివిగదా! ఓ భారద్వాజ! ఏండ్లుగడచిన నీకు సయిత మిట్టిదుర్బుద్ధి వొడమెనా.

ఉ. చిన్నతనంబునం దెడము సేయక "రార! కిరీటిపుత్ర! నా
యన్న" యటంచు నెత్తి శిరమందున మూర్కొని "తండ్రికన్న పే
రున్నతి గల్గువాఁడ వగువోయి! చిరాయువుగ" మ్మటంచు నీ
వన్నది నీవ నేఁటి కయథార్థము చేసెదవయ్య బాపఁడా.

ద్రౌప— ఆర్యపుత్ర! ఏల యీ యధీరాలాపములు. తథాస్తు దేవతలు తథాస్తనుచుందురఁట.

ధర్మ— పాంచాలీ! ఇఁక నెక్కడికొడుకు? (గురునుద్దేశించి)

ఆ. వె. చదువు చెప్పుమనుచు సంధ్య నేర్పుమటంచు
వేఁడి యప్పగించినాఁడ నాఁడు
చంపుమంచు నొద్దికంపించినాఁడ నేఁ
డౌర! నీకుఁ జేతులార గురుఁడ.

ద్రౌప— మహారాజ! ఆచార్యుఁడేమి చేసె. ఆ సైంధవాధముం డడ్డుపడక యున్న నింత మునుఁగునా.

ధర్మ— (పండ్లుకొఱుకుచు) ఓరీ దురాత్మ ! మా దుస్సల విధవముండయగునని కనికరించి నందులకుఁ దగినఫల మనుభవించితిమి.

ద్రౌప— దీని కొకటికేకాదు. మొట్టమొదటినుండియు మీ కనికరమునకే ఫల మనుభవించుచున్నారము.

ధర్మ— మానినీ ! చచ్చిన బురదపాముం గొట్టెదవేమి ?

కరం— మహారాజ ! ఏల యీతొందర ? ఎందుల కీవిచారము. పర్యవసానము తెలియక దుఃఖింపరాదు.

ధర్మ— కరండకా ! ఇంకను బర్యవసానము తెలియవలయునా ? తెలిసినట్లే యున్నది.

గీ. అనిలసుతునకు సైంధవుం డడ్డుపడుట
యొక్కరుఁడు మొగ్గరంబునఁ జిక్కువడుట
పదుగు రొకటయి యతనిఁ జంపఁగఁదలఁచుట
యట్టిపరిత్యుత్తరము గురుఁ డానతిడుట.

(ఆకాశమున)

ఓ సురగరుడోరగ విద్యాధర కిన్నర కింపురుషులార ! ఇంద్రాది దిక్పాలకులార !

ఉ. చూచెదరేమి మీరయినఁ జొచ్చి తటాలునఁ బ్రోవరయ్య ! సం
కోచము లేక క్రీడికొడుకుం బదిమందియు నాల్గువైపులం
గాచి హయంబులం దునిమి కార్ముకము న్విదళించి సారథిం
ద్రోచి రథంబు నేలఁబడఁ ద్రోసిరి కౌరవయోధు లక్కటా !

ధర్మ— (విని) హా భరతయాదవకులాధార! కుమార! నీవిపద్దశకు విమానచారులు సయిత మెట్లు కుందుచున్నారో !

సీ. కంసాదివిమతులఁ గసిమసంగినవాఁ డ
మేయప్రభావుండు మేనమామ
బక జరాసంధాది బలవద్రిపులఁ గూల్చి
పేరు చెందినవాఁడు పెద్దతండ్రి
కాలకేయాది రాక్షసరాజులం జంపి
గణుతికెక్కినవాఁడు కన్నతండ్రి
ధనదాదు లాడిగ మ్మొనరింప విష్టప
త్రయ మేలువాఁడు పితామహుండు

తే. గీ. సురలతో విజృంభించి ద్రోణముఖుల
వెన్నుచూచిన జగదేక విద్యశాలి
వక్కటా! తుట్టతుద కిట్టు దిక్కులేక
దక్కెతే పగవారి చేఁతలకుఁ దండ్రి!

కరం— దేవా! రథాశ్వసూత కేతనంబులు తెగినంతనే శత్రువులకు దక్కినట్లె తలపోయుదురా? నియుద్ధప్రవీణుఁడగు కుమారుండు ముష్టియుద్ధము చేతనే రిపులఁ బరిమార్పఁగలఁడు.

ధర్మ— ఓరీ! కరండకా! ఎంత వెఱ్ఱివాఁడవురా?

ఆ. వె. రథము తెగిన నొండురథ మెచ్చు దిక్కున
విల్లు తెగిన నొండు విల్లొసంగు
దిక్కులేనివాని కెక్కడి విజయంబు
ముష్టిరణ మిఁకేటి ముష్టిరణము.

ద్రౌప— ఆ సైంధవహతకుఁడే దీని కంతకును ప్రథమ కారణము. లేకున్న ధురంధరులైన భీమాదులతో నున్న కుమారు నెవ్వరయినఁ దేఱిచూడఁ గలరా?

ధర్మ— (దిగ్గున లేచి కోపముతో) పాంచాలీ కరండకులారా! నన్ను వారింప వలదు. తత్క్షణమే పోయి యా సైంధవరాజబంధువుం బట్టి పరిమార్చి వచ్చెద. (ధనుస్సు వెదకఁబోవును)

కరం— దేవా! వలదు వలదు. తమరు పోయిన రాఁబోవు నుపద్రవముతోఁ గూడ మఱియొక యుపద్రవము రావచ్చును.

(ఆకాశమున)

క. ఆమేయి విరథుండయ్యు సు
త్రాముని మనుమండు మరల ద్రౌణాసనితో
సామజపోతముగతి ము
ష్టీముష్టిరణంబుఁ జేయ డీకొనియె బళే!

ధర్మ— (ఆలించి యాశతో) కరండకా! వింటివా? నియుద్ధంబునకే తొడరె నఁట. నీవచనములు సమస్తదేవతలు పాలింతురుగాక. నీ వాక్యామృత వాక్కగుఁగాక.

ద్రౌప— ఆర్యకులదేవతలారా! [illegible]నఁ గుమారునకుఁ దోడ్పడుఁడు. ఓ విమానచరులారా! మీకు శక్తి లేని [illegible] పాండవమన్యము నకు వినఁజేయవల్లయినను జాలును.

(ఆకాశమున)

చ. గద లెవిలోా రణస్థలిని గన్పడ వానిని గొంచు నిర్వురున్
గదవ మొనద్చుచుండఁ గృప కర్ణ ముఖుల్ నరుపట్టి మధ్య సం
పొదలిన శౌరిపై తుఱుముదనో యని భీతిలువంత ద్రౌణి తే
రదె పొడిచెఁదునిమ్యు వారధిముఁ ఢావలితైామయి దాఁటె నుర్వికిన్.

ధర్మ— తండ్రీ! ఇప్పటికిని నిన్నుఁజూచిన జోదులమనంబులు జలదరించుచునే యున్నవా! కానిమ్ము. మే మదృష్టవంతులమేని నీకే జయము కలుగ వచ్చును.

(ఆకాశమున)

ఓ గీర్వాణసుందరులార! మీ రందఱు నందంబగు పారిజాతకుసుమ మాలికాబృందంబులతో సిద్ధపడుఁడు.

ధర్మ— (ఆలించి) హృదయమా! తొందరపడకుము. ఈ విమానచారుల పలుకులు కుమారవిజయసూచకంబులేమో. (ఆలోచించి) ఈపాపాత్ముని కిట్టి మేలు తటస్థించునా?

(ఆకాశమున)

క. ఈసును రోసము గల దు
శ్శాసనుసుతుతోడ నిట్లు సమరం బమరన్
జేసి యభిమన్యుఁ డా దు
శ్శాసనితోఁగలసి మొలసి స్వర్గముచేరెన్.

ధర్మ— (విని) హృదయమా! యింకను సిగ్గులేక యారాటపడెదవేల? చేయఁ దలసినపని చేసితివి. వినదలఁచినమాట వింటివి. హా! భరతాన్వయరత్న దీపమ!

ఉ. తామరమొగ్గరంబునకు దారియొనర్చి కుమార! నీవు వోఁ
గా మన జోదులం గొలివిగా మనసైంధవుఁ డాగె, దేవతా
ధామము సేఁతు చేయుటకు దారి యొనర్చి గమించుచున్న నీ
తో మముసెల్ల నొక్కమొగిఁ దోడ్కొనిపొమ్ము మరల్పఁ డెవ్వఁడున్-

(మూర్ఛపోవును)

ద్రౌప— (పట్టుకొనుచున్నది)

ధర్మ— (లేచి) పాంచాలీ! పుత్రఘాతినగు నన్నంటఁబోకుము.

(తెరలో)

శా. సంతోషించెదవేల యిద్ధ్వరికి కురుక్షత్రనాథ! వేమందితో
శుంభైసం ద్రపలేక బాలుని గతాసుంజేసి తీ వన్నవ్వ

త్రాంతమ్ముఁ విని సైఁచునే విజయుహార్యత్మంబు? పాపాత్మ! మీ
యంతం బాతనిచేత నున్నయదిలేరా! నేఁటితోఁ దీఱునే.

ధర్మ— (వినుటనటించి) ఇవి యుయుత్సుని యుపాలంభవాక్యములు. (స్మృతి నభినయించి) ఓహో! యీమాటలువిని దురాత్ముండగు సుయోధనుం డీ నైశ్యాంబాపత్యమున కేమిముప్పు కల్పించునోకదా! సంగరారంభ సమయమున నేను పితామహాదుల సందర్శించి తదనుజ్ఞాతుండనై మరలి వచ్చునప్పుడు—

ఉ. "మమ్మెవరేని జేరఁగల మానిసు లుండిన వారలిప్పుడే
క్రమ్మఱివచ్చి చేరదురుగా కలవారిని నేను జూచెదన్
దమ్ములతోడి పా" టనినఁ దా నితఁడొయ్యన వచ్చిచేరె న
త్సమ్మతు నాదురాత్ముఁ డిది సాకుగఁ జేసి వధించునేమొకో.

(సంరంభముతో) ఓరీ ధనుస్సు, ధనుస్సు.

కరం— (నేపథ్యాభిముఖముగాఁజూచి) దేవా! అత్యాహిత మేమియును లేదు. అయ్యనఘుఁ డిక్కడికే వచ్చుచున్నాఁడు.

ధర్మ— కరండకా! అర్జుని నీవరిగి పుత్రశోకమ్మునఁ గుందు సుభద్రయుఁ పతిశోకంబున నొగులు నుత్తరయు జీవించు నుపాయము వేచియుండుము.

కరం— చిత్తము. (నిష్క్రమించును)

యుయుత్సుడు— (తత్తఱపాటుతోఁ గన్నీటితోఁ బ్రవేశించి తెరవంకదిరిగి)

క. ఒక కలగనఁ దెలవాఱెనె?
యకటా! యిల్లలికినంత నయిపోయెనె పా
తకులార! పండు; వీమీ
వికవిక లివియెల్ల తీపు వీక్షింపమొకో. (సమీపించును)

ధర్మ— (యుయుత్సునిం గౌఁగిలించుకొని దుఃఖముతో)

మ. నగలుం బెట్టి అలంకరించునెడ యానం బెక్కుచో నాడుచోఁ
బగలు న్నేలును భోజ్యము ల్గుడుచుచోఁ బన్నుండుచోఁ గాని ముం
దుగ నెవ్వానికిఁ బ్రీతి సల్పుదురు పార్థుల్ వాని నాముద్దులా
నిఁగటా! యందఱికంటె ముం దనికి నేనే పంపి చంపించితిన్.

యుయు— (తనలో) ఈయనఘు నేమని యోదార్పఁగలను (ప్రకాశము) అన్నా! ఊరడిల్లుమూరడిల్లుము.

ద్రౌప— హా! భువైన ధనుస్సార! కిరీటికుమార! నీకొలఁకుఁ బెక్కుపాట్లుపడి పరించిన శశిరేఖయుం దైనఁ గరుణలేకపోయెనా! దుర్భరగర్భాలసయు

గోలయు నగు విరాటపుత్రి నెవ్వరికప్పగించితివి! ఎవరెన్ని యిక్కట్లు పడినను నాగర్భశ్రీమంతురాలవగు నోసుభద్రా! మూలదైవము నీకీ కడుపు మంట కల్పించెనా? నీమొగ మెట్లు చూతుము? ఏమనియూరడింతుము?

ధర్మ— నాయనా! అభిమన్యుఁడ! పద్మవ్యూహనిర్భేదనచణంబగు నీపౌరుషంబు తెలుపుటకు మాఱుగా నీతండ్రితోఁ జావా తెలుపవలసినది?

క. పకపకనవ్వుచు "సం
శప్తకులం జంపితి" మటంచుఁ దగుమెయి నాయొ
ద్దికివచ్చు పార్థకృష్ణుల
మొకములు నేనెట్లు చూడ మొనయుదు తండ్రీ!

యుయు— ఊరడిల్లుము. జగదేకవీరులగు పార్థకృష్ణులు శత్రువులం జించి చెండాడి తుదకుఁ గాలధర్మము నొందిన కుమారునకై పగతుర్రా! శత్రువుల కోహటిల్లిన నగతురు. చంపుటయుఁ జచ్చుటయుఁగాక సంగరంబునం బువ్వులచెండ్లు విసరుకొందురా యేమి? విపరీతకాలమున కేమిచేయఁ గలుగుదుము. పగఱకొడుకులు మనకొడుకులవంటివారుకారా? వారు మాత్రము దుర్భరంబగు పుత్రశోక మనుభవించుటలేదా!

ధర్మ— ఓయీ యితరకుమారులకు నభిమన్యునకును సాటియగునా?

శా. ఆకర్ణాంతములైన యాకనులసొం పామోముసింగార మా
మోకాల్మీఁదికి జాఱు కేలుగవ యాముద్దైన చెక్కిళ్ళు నా
యాకారంబుఁ దలంచినన్ మఱవ శక్యంబే? కటా! యెట్టు లీ
శోకంబుం దిగమ్రింగువారు! కరుణాశూరు ల్సుభద్రార్జునుల్.

సీ. తమ్మిపూరేకు చందముగల్గి చెవిదాఁకు
వెడఁద కన్నుంబోయి బెడఁగుతోడ
నిండుజాబిల్లి వెన్నెలవంటి చిఱునవ్వు
దొలకించు కెమ్మోవి కులుకుతోడ
గండుతుమ్మెద ఱెక్కఁగమిచెల్వమును బిల్వ
సాగు నూనూఁగు మీసములతోడఁ
గొదమచందురుఁ బోలెఁ గొమరారు కుదురైన
చదురుగల్గిన సోఁగనుదురుతోడ

తే. గీ. జక్కఁదనమున కిక్కయై చంద్రబింబ
మునకు సహపాఠి యైన పుత్రుని మొగంబు

వడయఁజేరని వీరుని ర్భాగ్యపురుష
గణములోఁ జేరనే కురంగకా యకట !

యుధి— అన్నా ! ఏలవిచారింతువు ? ఎవరిపిల్ల లెవరికి యుంచివారుకారు ? హెచ్చుతగ్గులు మనకుఁగాని మృత్యుదేవతకుఁ గలవా ! అదియునుంగాక, పెక్కుజన్మము లొనర్చి బ్రాహ్మణుల సంతృప్తిపరచెనా, లేక దేవతలచేఁ బసిఁడివాన గురిపించుకొనెనా ? షోడశమహాదానములు గావించెనా ? లేక సప్తద్వీపములు జయించెనా ? శివునివిల్లు విఱిచెనా, లేక గంగానదిని వెలయించెనా ? శతాశ్వమేధములొనర్చెనా, లేక పంద్రెండేండ్లప్రాయమున భూమికంతకు నేకచ్ఛత్రాధిపత్యముఁగాంచెనా? వర్ణాశ్రమధర్మములు నిల్పెనా, లేక విప్రులకు మృష్టాన్నమిడి మణులు దక్షిణలొసంగెనా ? లక్షమందిభార్యల నుపలాలించెనా, లేక యగ్ని నారాధించెనా ? సత్రయాగంబు గావించెనా ? లేక చిన్నిప్రాయమున సింహశరభాదిమృగముల నెక్కి తిరిగెనా ? భూమినావుంజేసి పాలుపితికెనా ? లేక యిరువదియొక్కమాఱు రాజులం దునుమాడెనా? ఏమియు లేక పూపప్రాయమునఁ ద్రెళ్ళిన కుమారునకై యింతవనట తగునా ?

ధర్మ— తమ్ముఁడా ! సమస్తభోగము లనుభవించి ముదిసిచదిసిన షోడశరాజ చక్రముతోఁ బసివానికి సాటిలేనగునా ?

ఉ. "పాండుకులంబు నిల్పఁదగువాఁ"డని యెవ్వనినమ్మి క్రీడి యీ
ఖండన మాచరించుటకుఁ జాల్పడె నట్టికుమారరత్న మా
గండరగండఁడే మొదటఁ గాలవశంబును జెంద భూమియం
దుండి యిఁకేమి చూచుకొని యుద్ధమొనర్చెదరయ్య పాండవుల్.

ద్రౌప— (కన్నీరు తుడుచుకొనుచు) హా ! కుమార! పాండవకులాంకూరమని తలఁచిన నీవే ముదిసిన మ్రానునైతివా ? తల్లిదండ్రుల కేముద్దు చెల్లించితివి ? ఇఁక నుత్తర కడుపులోనున్న జరాయు పిండమా మాకు దిక్కు ?

ధర్మ— పాంచాలీ ! ఎంతవెఱ్ఱిదానవు ? ఏల మిథ్యామనోరథంబులు తలపోసికొందువు. దుర్భరంబగు వియోగదుఃఖంబును భరించి యుత్తర బ్రతికినప్పటిమాటగదా ? ఓభీమసేననకులసహదేవులారా ! మీకయిన సమయోచితంబగు తెలివిలేకపోయె.

ఉ. శిప్పఁడలంచి పోరికి వృథా సుతు నంపితిఁ జంపుకొంటి నే
నప్పుడు పోరిలో నిలిచినంతఁ బరాభవమబ్బఁగాక మా
యప్పయు నప్పయుం గలసి యప్పుడ నను[illegible]ప్పకుందురే?
యిప్పుడు వానిఁ దేఁగలుగునే! భగవం[illegible]ఁడు వచ్చెనేనియున్.

(తెరలో)

చ. పడమటి కొండదాపునకు భానుఁడు చేరెఁ దమంబు నంత వె
ల్వడె విహగవ్రజంబులు కులాయకులంబున కేగుచుట్టు లే
ర్పడ బవరంబు మాని శిబిరంబుల కేగుఁడు సేనలార ! మీ
యొడయలతోడ రేపకడ యుద్ధముచేయఁగ రండు మెండుగన్.

యుయు— (ఆలించి) ఆర్యా ! భాస్వంతుం డస్తమించె. ఇరుదెగలవారును బటకుటీరములకుఁ జేరుచున్నారు. మన మీయంతిపురంబు విడిచి కుమారమరణఖిద్యమాన మానసులగు భీమసేనాదుల నూరడింపఁబోదము.

ధర్మ— తమ్ముఁడా ! ఒక సూర్యుఁడే కాఁడు నామదికి జగమంతయు నస్తమించినట్లేయున్నది. హా భువనైకవీర !

గీ. కలకలని నవ్వు ముద్దు మొగంబు మఱపు
వచ్చునే చంద్రుఁడున్నంతవఱకు మాకు
నెన్నిజన్మంబు లెత్తిన నిన్నువంటి
కొమరుగలవానిఁగాంతుమే కొమరుగుజ్జ !

ఓ పాంచాలీ ! నాకై విచారింపకుము. ప్రజ్వలితంబులగు దహనజ్వాలలంబడి "తండ్రుల రాజ్యము వల" దని పితామహుని రాజ్యమేలఁ బోయిన కుమారుం జూడ నేగెదను.

గీ. "ఎదురురాఁడేమి సౌభద్రుఁ డేడి" యనుచు
నడుగు క్రీడికి నే నేమినుడుగువాఁడ
"గొడుకునంపితి గురునకు జడిసి" యనుచు
నతనితోఁ బల్క నాకు నోరాడదకట !

అదియునుంగాక,

చ. "కొడుకును బల్వు రేకమయి కూల్చిరి ఘాతుకు" లంచు నెవ్వఁడో
జెడిదపువార్తయు న్వినుచు, విన్నఁ గిరీటికి మేనునిల్వదీ
గడబిడయేల ? యావెనుకఁ గాఱులు పేల్చిలు రిపువ్రజంబు పా
ల్పడుటకుమున్న యీచెనఁటి ప్రాణమువాసి సుఖింతు నంగనా !

ద్రౌప— ఆర్యపుత్ర ! మే మందఱమును నీతోడివారమే. కాన నాకు వగచుటకుఁ బనియేమున్నది ?

ధర్మ— తమ్ముఁడా! నీవుపోయి భీమసేనాదులతో నావచనములుగా నిట్లనుము.

ఆ. శక్తిగలరయేని సమరంబు సేయుఁడు
శక్తి చాలదేని శరణమనుఁడు

లేకయున్న రండు లేఖలోకంబున
యంద గలిసియుంద మందఱమును.

యుయు— అన్నా! ఈసందేశమును నేను జెప్పఁజాలను. ఇతరులును జెప్పఁజాలినది కాదు. (వినుట సూచించి తనలో) అవిగో! దేవదత్త పాంచజన్యస్వనంబులు వినవచ్చుచున్నవి. సంశప్తకారణ్యంబు దహించి యర్జునానలంబు వెలుఁగుచుండంబోలు? పాప మాతఁ డిప్పటి కీవార్త విని యుండఁడుకదా!

(అంత దేవదత్తపాంచజన్యంబులుపూరించుచుఁ గృష్ణార్జునులు ప్రవేశించుచున్నారు)
(ద్రౌపదీధర్మజులు శోకాతిశయమును సూచించుచుందురు)

అర్జు— (సంశయముతో) బావా! ఏమిది నా యెడమకన్నదరుచున్నది? కాళ్ళు తడఁబడుచున్నవి. స్వరము గద్గదపడుచున్నది. కుంభసంభవుఁడు ధర్మసంభవున కేమి కీడు కలుగఁజేసెనో గదా! ఈశిబిరముపంకఁ జూడుము.

సీ. వందిమాగధులు కైవారంబు చేయరు
న్నారేల నీరజనాభ నేఁడు?
ఆఱువేళల మ్రోయనగు నగారామ్రోఁత
వినఁబడదేల గోవింద నేఁడు?
మనలఁ గన్గొని లెంక లనుసరింపరు నమ
స్కృతులు సేయ రిదేల కృష్ణ నేఁడు?
ముత్తైదువులు మన మోసాలనుండి యా
రతు లెత్తరేల చక్రధర నేఁడు?
గీ. తోయజారాతి నలవిధుంతుదుఁడు మూఁడు
వంతులుగ్రసింప వెలవెలఁ బడిన పగిదిఁ
గానఁబడున్నదకట! నా కన్నుఁగవకుఁ
బటకుటీర మిదేల గోపాల నేఁడు?

ఏ యనిష్టంబు రాకుండ నామనం బిట్లు క్షోభింపదు. విరాట ద్రుపదాదు లేమయినారో? కవలెట్లున్నారో? ధర్మజునిగతి యేమయినదో?

కృష్ణు— (తనలో) నాకు యుయుత్సుని యుపాలంభ వాక్యములు విన్నది మొదలుగ నభిమన్యునివిషయమునఁ బూర్ణముగా ననుమానము తగిలియున్నది. ప్రతిక్రియ చేయఁబూనుట కప్పటికప్పుడే సమయము గతించినది. ఆ యుయుత్సుఁ డంత కొక్కింతమున్నే యామాట లుపయోగించినఁ గుమారుఁడు విధిగా దక్కును. ఇంతకు దైవ మనివార్యము. ఇటఁగర్తవ్య మేమి? ఇతనికిఁ గ్రమముగాఁ దెలియవలయునే కాని యిప్పుడే తెలియఁ

గూడదు. కావున నిట్లు చెప్పెదఁగాక. (ప్రకాశము) అర్జునా! ఏల యిట్లధైర్యపడియెదవు?

క. నీ యన్నలకుం గుశలము
నీ యనుజులకున్ శుభంబు నిక్కంబుగ నే
దో యొక కొంచె మనిష్టం
బీయెడ నగు దానికింత యేటికిఁ బొగులన్?

అర్జు— (స్మృతి నభినయించి) నే నా సంశప్తక సంగరపు టలజడిలో నుండ నొక్కుమ్మడిగఁ గౌరవుల సింహనాదంబులు వినవచ్చినవి. అందులకుం గత మేమైయుండునో?

(పరిక్రమించి శిబిరమువంక తేఱిపాఱఁజూచి కన్నీటితో)

చ. రణ మొనరించి నేను శిబిరమ్మునకుం జనుదేరఁగా నకా
రణముగఁ జంద్రబింబ మెదురం బడు పోలికఁ గన్నుఁదోయి పా
రణ మొనరించుచు న్మృదుకరంబుల నన్నుఁ గవుంగిలించు స
ద్గుణములప్రోవు లేఁడు గృహతోరణమం దభిమన్యుఁ డక్కటా!

(యోజించి)

గీ. గురుఁడు పన్నిన తమ్మిమొగ్గర మభేద్య
మనుచు మనవారు సౌభద్రు నంపిరటకుఁ
గటకటా! వాఁడు దానిఁ జించుటయెగాక
మెన వెడలివచ్చు టెఱుఁగక మోసపోయె.

కృష్ణ— ఏల యీతత్తఱపాటు? ఇది ద్రౌపదీశిబిరము గదా! ఇక్కడ నభిమన్యుఁ డేల యుండవలెను.

అర్జు— (ఎదుటఁజూచి) వాసుదేవా! మన శిబిరంబునకు మాఱుగా ద్రౌపదీ శిబిరంబునకు వచ్చితిమేమి? కలఁతపడిన మనంబుతో నేఁ దెలియక పోయితిని. నీవును జెప్పవైతివి.

కృష్ణ— (తనలో) నా మనముమాత్రము స్వస్థముగా నుండెనాయేమి? (ప్రకాశముగా) ఔను. ఇది ద్రౌపదీశిబిరమే! ఇచటఁ బాంచాలి యుండును గదా! ఆమె నడిగిన సర్వమును విశదమగును.

అర్జు— (స్మృతి నభినయించి) నాకుఁ బాంచాలీసదనమునకు రాఁదగిన సంవత్సరము కాదుగదా! అయినను గనుగొందము. ఎవఁడురా యక్కడ?

బకో— (ఎదుర్కొని) దేవా! నేను బకోటకుఁడను.

అర్జు— (ఆత్రముగా) అన్నగారెక్కడ?

బకో— (తనలో) అక్కటా ! ఈచావుకబురు నే నేమని తెల్పుదును (కన్నీటితో వాక్స్తంభముననటించుచు) దేవా! అదుగో నక్కడ నేడుచున్నారు.

ధర్మ— హా ! అభిమన్యుకుమార ! హా ! భువనైకశూర ! (విలపించుచు)

ద్రౌప— అయ్యో ! ఎంతదురవస్థ వచ్చుచున్నది? పుత్రశోకాతురుఁడై కిరీటి లోనికివచ్చునేమో ? మరల భూప్రదక్షిణము చేయవలసి వచ్చును.

అర్జు— (విని శోకముతో) వాసుదేవ! ఇపుడైన నిజము తెలిసెనా ? హాసుభద్రా కుమార !

మ. చతురంభోధిపరీత మైనధరణి న్పాలింతు వీ పంచు న
మ్మితి నీరీతిగ దిక్కుమాలి రణభూమిం గూలితే ?కేశవ
ప్రతిరూపంబగు నీ పరాక్రమము వ్యర్థంబాయెనే పోరనా,
కుతుకంబంతయు నీటఁబుచ్చితివిగా ?కృష్ణా! జగన్మోహనా !

కృష్ణ— (దుఃఖమాపుకొని) అర్జునా ! శోకింపకుము. రణమునం దోపాటిల్లక పోరు రాచవారందఱు సంతసింపఁదగినచావు శోచనీయము కాదు.

ఆ. నీకుఁ బుత్రకుండు నాకు మేనల్లుండు
శోక మొక్కరూపసూ ! యిరువుర
కేద్వ లేకపోతినే యేనునీవలె?
ధైర్యశాలి కిట్లు తగదు తగదు.

గీ. రాచబిడ్డకు మరణంబు రణమునంద
తప్పదని నిర్ణయించిరి ధర్మవిదులు
పలువురం జంపి చచ్చినబాలునకయి
వగవ నేఁటికి నీవంటివాఁడు? పార్థ!

ఏడ్చి యేడ్చి ప్రాణములు శోషించి యున్న ధర్మజుని బ్రతుకు విచారించుకొనుము.

బకో— దేవా! నిజము. దేవర యోదార్పకున్న నది మొదటిది యిది రెండవదియు నగును. "అసహాయంబుగఁ గుమారు ననికిం బంపి చంపించితి నీకఁ కిరీటి మొగ మెట్లు చూతు" నని కుందుచున్న యన్నగారి నోదార్పుఁడు.

అర్జు— హా! ధర్మరాజ ! ఎంతపని చేసితివి ?

గీ. ఎక్కడకుఁబోయె మనభీముఁ? డేమిరైరి
కవలు ; పార్షతుఁ డేమయ్యెఁ? గనికరంబు
లేక పసివాని నొంటిగా నీవుపూరుఁ
బంపఁదగునయ్య? సంగ్రామభారమునకు.

ఓరీబకోటకా ! కొడుకు పడియున్న చోటైనఁ జూపింపుమురా.

ఉ. గాసిలియుండియుం గరుడుగట్టిన నెత్తుటిలోనఁ బ్రాణముం
బాసియు వానికాంతి కనుమాయదు నిక్కము వీసమేని ; రా
కాసులు నాల్గువంకల వికావిక నవ్వఁగఁ జంద్రమండలం
బే సరిపోవు వానిమొగ మేగతి బూడిదఁ దోఁగియున్నదో ?

(శోకావేశముతో)

మ. అకటా ! దిక్కఁటి వోయెనే ? హరికి మేనల్లుండు, గాండీవిపు
త్రకుఁ, డాచార్యనకుం బ్రిశిష్యుఁ,డఖిలాస్త్రజ్ఞాత, గీర్వాణనా
యక పౌత్రుండు, విరాటు పెండ్లికొడు కన్యాయంబు గొంతమ్మకో
రిక లిట్లాఱడివో సుభద్రకెదఁ గార్చిచ్చింత దాకొల్పుమన్.

ధర్మ— (తెలివి తెచ్చుకొని) పాంచాలీ ! కరండకుఁ డేడి ?

ద్రౌప— ఉత్తరా సుభద్రల ప్రాణసంరక్షణకై నియోగింపఁబడెఁ గదా !

అర్జు— (కోపముతో) ఓరీ ! బకోటకా ! త్రాఁచుపాముపిల్లతో సయ్యాటము
లాడి యిట్టి సాహసమున కొడిగట్టిన మహాపాతకి యెవ్వఁడురా ? వాని
నిప్పుడే- (అనునర్ధోక్తిలో)

ధర్మ— (సమీపించి కన్నీటితోఁ గౌఁగిలించుకొని)

మ. వనజాక్షుండును నీవు శత్రువుల గెల్వన్ బోవ నాచార్య బు
ద్ధినిబద్ధంబగు తమ్మిమొగ్గరము భేదింపంగఁ బంపించి నీ
తనయున్ జంపఁ దెగించె నేఖలుఁడు, పుత్రద్రోహి, యా బుద్ధిపో
యినవాఁ డా యవివేకి యా చెనఁటి వీఁడే చంపు మో యర్జునా !

కృష్ణ— ధర్మపుత్రా ! ఊరడిల్లుమూరడిల్లుము. వాని కాయువుమూఁడిన నీవేమి
చేయఁగలవు? కాని భీమాదులు కూడఁ బోయి కావలేక పోయిరా? లేక
పోనేలేదా ?

యుయు— అక్కటా ! పసివాని నొక్కనిం బంపి యూరకుందురా ?

తే. గీ. గురునిభయమున రా జంతిపురము చొచ్చె
భీముఁడాదిగ మేమెల్ల వెంటఁబోతి
మడ్డువడె సైంధవుం డట నభవదత్త
వరముచే దారిలో మా కవార్యుఁడగుచు.

అర్జు— (పండ్లుగొఱుకుచు) ఆ ! సైంధవచండాల! ఎంతపని చేసితివిరా? శత్రు
శేష ముంచుకొన్నందులకుఁ దగిన ప్రాయశ్చిత్త మొనర్చితివి.

కృష్ణ—(తనలో) ఇతని కీ శోకము వీరముగా మాఱుఁగాక (ప్రకాశము) అర్జునా! "అగ్నేశ్శేషం ఋణాచ్ఛేషం శత్రోశ్శేషం న శేషయే" త్తని పెద్దలూరక పలుకుదురా? అప్పుడు పూర్తిగాఁ జంపకుండుటయే మనకీ విపత్తునకుఁ గారణమైనది.

అర్జు— (గాండివముసారించుచుఁ గోపముతో) ఓ మహారాజా! ఓ వాసుదేవా! ఓ పంచభూతములారా! నా ప్రతిజ్ఞ యాలింపుఁడు.

తే. గీ. ఎల్లి చంపుదు సైంధవు నెవ్వరడ్డ
పడిన నిజముగఁ జీఁకటిపడకమున్న
చంపలేకున్నఁ బావకజ్వాలయందు
భస్మమైపోదు నీగాండివంబుతోడ.

కృష్ణ— అర్జునా! ఏల యీతొందర? ఆలోచింపకుండ నిట్టి ఘోరప్రతిజ్ఞ చేయుదురా? కుంభసంభవాదిమహాయోధగోపాయితుండగు సింధురాజుం దేఱిచూడ నెవ్వరితరము?

అర్జు— కృష్ణా! ఏల యిట్లు పిఱికిమందు వోసెదవు. (మరల విచారముతో)

శా. పాపాత్ముండగు సైంధవాపశదుఁ డాఁపన్ దోడురాకున్కి "రా
వే పాలింపవె తండ్రి" యంచు నను "వే వే రమ్మ మామా" యటం
చాపద్బాంధవు నన్ను నెంతగ నెదన్ ధ్యానించెనో? కృష్ణ!
(యోజించి)యే, మీ! పార్థాత్మజు మానసంబు తగునే యానీచమర్యాదకున్?

క. మనకు నెదియేని యాపద
యనువుపడన్ బ్రోవఁజాలు నభిమన్యుండా
మన తో డాసించుట! యిం
కను నేనేమంచుఁ బ్రదుకఁగాఁవలెఁ గృష్ణా!

(ధర్మజుదిక్కై) అన్నా! కుమారుని పరాక్రమ మెట్లు ప్రవర్తించెనో చెప్పి నాకుం గొంత సంతసము కల్గింపుము.

ధర్మ— (కన్నీటితో) తండ్రీ! నేనేమిచెప్పఁగలను? నాకు నోరాడదు. కాక యా పరాక్రమము సహస్రముఖుఁ డగు శేషుఁడేని వర్ణింపఁ జాలఁడని కరండకుఁడు చెప్పిన మాటలంబట్టి నిశ్చయించు కొంటిని.

యుయు— సోదరా! అదియట్టిదియ. సూత్రప్రాయముగా నేనొక్కింత చెప్పెద వాలింపుము.

చ. ఎనిమిదివేల తేరు లఱయేన్గులు తొమ్మిదినూర్లు లక్ష్మణా
ద్యనఘమతేజు లొక్క ద్విసహస్రము రాజసుతుల్, బృహద్బలుం

డు నితరవీరు లెందఱో గనుంగొన శక్యము గాదు వీరి న
య్యనిమిష రాజపౌత్రుఁడు రణావనికిన్ బలిపెట్టె నెట్టనన్.

అప్పట్టున ద్రోణాదులందఱును "నితఁ డర్జునునికించుక హెచ్చగు" నని ప్రశంసించిరి.

అర్జు— (ఎదుఱొమ్మునఁ జేయినైచుకొని)

మ. హరి సారథ్యము లేదు, లే దకట! దివ్యాశ్వంబు లెప్పట్టునం
దిరమౌ తేరును లేద, యక్షయపుఁదూణీరమ్ములా లే, వొరుల్
నఱకన్ రాని ధనుస్సు లేదు, పడగన్ లంకారియున్ లేఁ డెటుల్
దురమం దిందఱిఁ గూల్చితయ్యొ? కొడుకా! ద్రోణాదు లగ్గింపగన్.

క. ఇట్టి యసహాయశూరునిఁ
బట్టి పోఁగొట్టుకొనియు బావా! యిఁక నేఁ
డెట్టులు సుభద్రఁ గనుఁగొను?
నెట్టులు పాంచాలిఁ గాంచు నెటు జీవింతున్.

కృష్ణు— (తనలో) తిరిగియు నితని మనము శోకమునే యనుసరించుచున్నదే! అవును. పుత్త్రశోకము దుర్నివారము. (ప్రకాశము) బావా! నీ పుత్త్రఘాతి మరణంబునం గాని నీకీ శోక ముపశమింపదు.

అర్జు— (స్మృతి నభినయించి) అవును కృష్ణా! ఇదిగో! ముమ్మాటికిని నా నిశ్చయము వినుము. ఈ సైంధవహతకుఁడే నా పుత్త్రమరణమ్మునకు మూలకందము కావున,

ఉ. కావుమటంచు ధర్మజుని కాళ్ళపయిం బడకున్నఁ బేర్మిమై
నీవు భరింతునం చభయ మీయకయున్న, గురుండు కాఁడు గా
రీవరుఁ డడ్డమై నిలువరించును గా కని నన్ను చూపుచున్
బోవకయున్న, సైంధవుని బోకడఁతున్ రవి క్రుంకునంతకున్.

కృష్ణు— కానిమ్ము. అననే కూడదు గాని యన్నమాట నెఱవేర్చుకోవలయుఁ గావున నీవీ పుత్త్రశోకము మఱచి శుచివై రహస్యప్రదేశమునం బాశుపతమహామంత్రం బుపాసింపుము. ధర్మపుత్త్రా! నీవు నిజశిబిరంబునకుం బోయి భీమసేనాదుల నోదార్పుము. నేను బుత్త్రశోకాతుర యగు మా చెల్లెలి నూరడింపఁ జనెద.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు తృతీయాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవవిజయము

## చతుర్థాంకము.

(తెరలో)

గీ. చిత్రముగఁ బ్రొద్దుఁజక్రంబుచేతఁగప్పి
ప్రొద్దుగ్రుంకెఁగదా యిఁకఁ జోలియు నర్జు
నుండనుచు మోదమున సైంధవుండు నిగిడి
చూడఁ దునిపించెఁ దల శౌరి క్రీడిచేత.

గీ. బంతిమాదిరిగా సింధుపతిశిరంబు
నఱకి యభ్రమునుండి క్రిందఁ బడకుండఁ
ద్రిప్పుచున్నాఁడు కృష్ణుఁడు చెప్పినట్లు
ప్రతిన నెరవేర్చుకొన్న యా ఫల్గునుండు.

(ఇది చూళిక)

(పిదప యథోక్తముగాఁ గృష్ణునితో నర్జునుఁడు ప్రవేశించుచున్నాఁడు)

అర్జు— వాసుదేవా! ఈతల నెచ్చటఁ బడవేయవలయునో వేగముగ నెల విమ్ము.

క. ఒకబాణపుంఖమున వే
ఱొకబాణపుమొనఁ దగిల్చి యుంచితి నీసా
యకమయ నిశ్రేణికపై
నకటా! యిటు లెంతకాల మాడింతు హరీ!

కృష్ణ— దీనికిఁ జేయఁదగినపని నీబాణములకు సాధ్యమగునది కాదు- "వీనితల యేమఱ్పాటున ద్రుంపఁబడు" నని మున్నొకప్పు డంబరవాణి యానతీఁగా

చ. "ఎవనికరంబునుండి యిది యీ యిలపైఁబడు నంతఁ దచ్ఛిరం
బవును సహస్రఖండము" లటంచు శపించెఁ దపస్వియైన సైం

ధరజనకుండగు శ్రీ; నిపుడతండు శమంతక పంచకంబుగా
న విమలనిష్ఠ నిత్యమును గాయత్రియున్ జపియించు ఫల్గునా!

కావున సమంత్రకంబుగాఁ బాశుపతంబు సంధించి వృద్ధక్షత్రియుండగు నావృద్ధక్షత్రుని దోసిలిలోఁ బడవేయుము. అతండు నీ! యని త్రోసి నేలకుం ద్రోయఁగలఁడు. పదఁపడి వాని వ్రేలు పెట్టి వానికన్నె పొడిచి నట్లగుఁగాక.

అర్జు— (అబ్బురముతో) దేవా! మంచిది. (పాశుపతము సంధించి)

గీ. క్రీడి నిన్నెద నమ్మిన భృత్యుఁడేని
నీవు పశుపతియస్త్రంబవేని దీని
సింధుపతితండ్రి దోసిలిఁ జేర్చుముమ్ము
వసుధఁబడకుండ నో పాశుపతమ! నీవు,

(విడుచుచున్నాఁడు)

(తెరలో)

ఋషిబాలకులారా! ఆశ్చర్యమాశ్చర్యము!

గీ. మొండితల యొండు వడుమింట నుండి యొగిరి
వచ్చి మన రాజఋషి సంధ్యవార్చుచుండఁ
జేతిలోఁబడ నాతఁడు క్షితికిఁ ద్రోచెఁ
ద్రోయఁగాఁ దల చెక్కలై పోయె ఋషికి.

కృష్ణు— (విని) ఫల్గునా! యిఁకఁ గృతకృత్యుండ వైతివి.

క. కురుబలముకాదు దేవా
సురబలములు వచ్చియనికిఁ జొరఁబడినను నీ
శరవహ్నిలోన మిడుతల
కరణింబడి మ్రగ్గి బూది గాకుందురొకో!

అర్జు— దేవా! నీ యనుగ్రహమునే కొనియాడుకొనుము. నన్నేలపొగడెదవు?

ఉ. నీదయకల్మి నే గెలువ నేర్చితిఁ గాక పురారికైన ద్రో
ణాదులుమూడ సింధుపతి నట్లొనరింపఁ దరంబె? నీవు తో
డీఁది తరింపఁజేయ నెవ రెట్టి ప్రతిజ్ఞను దాఁట నేర్తు? దా
మోదర! దాసవర్గమున మీరక యిట్టిపొగడ్త చెల్లునే?

కృష్ణు— అర్జునా! అట్లుగాదు. ఓడ తోటిదైనఁ జుక్కానేమిచేయఁగలదు?

ఉ. ఆహవదోహలుండయి పురారి కిరాతునిభంగి నీరణో
త్సాహము చూచుచోఁ దివిజు లార్భటమున వచ్చిరి? దేవవైరి సం

ద్రోహము నాఁగి యింద్రునకుఁ దోడ్పడు నాఁడెవ రూఁతమైరి నీ
సాహసధైర్యశౌర్యగుణసంపద గాక ధనుష్మదగ్రణీ !

ఇన్నిటికన్న నేఁడు నేను రణరంగమ్మునఁ దురంగంబులను నీరు వెట్టుటకు విడిచినపుడు పదాతివై నీవొనర్చిన యాత్మాదిరక్షణము వేయిరెట్లధికముగఁ బొగడఁదగినది సుమా! (చేతనిర్దేశించి) చూచితివా? కురుబల మెట్లు నశించినదో!

అర్జు— (సరికించి) దేవా! ఇట్టిమిథ్యాస్తుతు లొనర్చి నన్ను సిగ్గుపఱపకుము.

తే. గీ. రాత్రి స్వప్నమిషమ్మున రజతభూధ
రమ్మునకుఁ దీసికొని చని రాజమౌళి
చేతఁ బాశుపతాస్త్రసంసిద్ధి రూఢి
పఱపకున్న; నేఁజేసెడి పనియుఁగలదె?

అది యట్లుండనిమ్ము.

గీ. ఖరకరుని మండలంబు చక్రంబుచేత
ఱెప్పపాటంతకాలంబు గప్పకున్న
నాబలం బభిమానము నాప్రతిజ్ఞ
తెలివితేట లీపాటికిఁ దెలియకున్నె?

మఱియు నుచితసల్లాపములాడి నమస్కరింపించుచు నరదంబుఁ బ్రదక్షిణంబుగాఁ బోనిచ్చి శిష్యవత్సలుం డగు నాచార్యుచేఁ గొంచె మనుగ్రహింపఁజేసితివి.

కృష్ణు— ఔను. నాలుగుపాయంబులం బగఱ సాధింపవలయుఁ గాని యొక్క పౌరుషంబునకు సాధ్యు లగుదురా?

ఉ. ద్రోణునకుం బ్రదక్షిణముతో దయవచ్చుఁగదా యటంచు నేఁ
బ్రాణము గాచుకోఁదలచి పర్వునఁ దేరటు త్రిప్పుచుండఁగా
బాణము లేయ మానవు చివాలునఁ జేతులు వ్రేయిలింప వా
స్థాణునికైన మోహరము దాఁటఁగ శక్యమె యాతఁడల్గినన్?

అర్జు— (రణరంగముచూచి విచారముతో) అక్కటా! కృపాచార్యు లిప్పటికిని మూర్ఛఁదెలియ నేలేదు.

మ. విలువట్టించె విశేషముల్ దెలిపె నీవిప్రోత్తముం డక్కటా!
కలనన్నన్నెదిరించుఁగాక గురునిం గారింపఁగా నొప్పునే?
కలుషాత్ముండను బ్రహ్మఘాతిని మహాకష్టుండ దుష్టుండ ని
ర్మలఘుం డభ్యుదయాభిలాషి మన కయ్యాచార్యుతోఁ బోటుగన్.

కృష్ణ—ఫల్గునా! నీ వితనిం గుఱిచేసినవాఁడవు కావుకదా ! యాదృచ్ఛికముగా నిది తటస్థించినది. ఏలవిచారించెదవు? (నిరూపించి) అదుగో నతండు మూర్ఛదేరినాఁడు. ఇఁకఁబోదము, పద. (పరిక్రమింతురు)

అర్జు— కేశవా! సుయోధను నోరి కెన్నఁడురాని మాటలు వచ్చినవి. నిమిత్తమేమో!

కృష్ణ— రణాభిలాషంజేసియు ఘోరప్రతిజ్ఞాభంగభయంబునను నీవు వెనుకఁ జూడకుంటివిగాని నే నందఱిపల్కు లాలించుచునే యుంటిని. శ్రుతాయుధుఁడు తన గదచేతనే హతుఁడైనపిదప నీవు కాంభోజపతిం దెగటార్చి శ్రుతాయుర్ముఖులతో సమరము సేయుచుండఁ గురురాజాచార్యుని యొద్దకుం బోయి,

గీ. "సింధురాజును నేను రక్షింతు" ననుచు
నభయమిచ్చియు నిటుసేయ న్యాయమగునె?
యతని దయచేత విడిచితి వంతెకాక,
పగ్గచేతను జొచ్చెనే మొగ్గరంబు?

ఉ. ఊరక మేము చంపుకొనుచుంటిమి కప్పయెలుంగుపామనై
చేరిన నిన్ను నమ్మికొని సింధునృపాలుని; లేకయున్న నీ
పోరికి వచ్చునే యతఁడు! పుణ్యమొ పాపమొ పౌరుషంబొ ని
ష్పౌరుషమో మఱొక్కయెడఁ జాటున డాఁగినఁ బ్రొద్దుగ్రుంకదే!

నీ యభయదానముకతనఁ గాని యతఁడు పూర్వమువలెనే యా పాండవులనే శరణుఁ జొచ్చునేమో?" అని యేడ్చిన నయ్యాచార్యుం డిట్లుత్తరము చెప్పెను.

అర్జు—ఆచార్యుఁ డిచ్చిన యభయము మనకు సాహాయ్యమే చేసినది. తరువాత?

కృష్ణ— తరువాత గురుఁ "డోయీ దుర్యోధనా! సురాసురులయినఁ గిరీటిం గెలువలేరని నీతోఁ బలుమాఱులు నుడివితిని. నా మాటట్లుండ నీతాత దేవవ్రతుం డెట్టి చింతతో శరతల్పము నలంకరించెనో యెఱుఁగుదువా ?

ఉ. "భండనమందు నాకు నొక పాండవు లెంతటివారు శౌరి రా
కుండిన; నాదువిల్లొకఁడె యుక్కడఁగింపక యున్నె యక్కటా!
దండుగ జోదులేటికి? కరదంబులు నేటికి? వాజులేల? వే
దండములేల? యింతకును ధర్మము నెగ్గక యెట్లుమానెడిన్?"

ఇట్లు యోజించుచుండ దేవత లయ్యనఘుని "నీవీ వీరకర్మమ్ము నుండి యుపరమింపుట యుక్త" మని హెచ్చరించిరఁట. నే నంతకన్న నధికుఁడను గానుగదా!

ఉ. పాపములాడె దేల మదవల్లభ! పోరఁగరాద నీవు నీ
ప్రాపగు కర్ణుఁడుం బతుచువారలు; నే నిపుడేమి సేయుదుం
బాపఁడ వృద్ధుఁడన్ దురభిమానము చంపుకొనంగలేక యీ
చాపము చేతఁ బట్టుకొని చావఁగ వచ్చినవాఁడఁ బోరికిన్"
అని యుల్లసమాడెను.

అర్జు— నాయందలి వాత్సల్యమేకాని యీ మహానుభావునిముందు నేనెంతవాఁడను. నిజముగాఁ నమ్మహితుఁ డభయమే యిచ్చినచో మన మా సైంధవు వెనకేనిఁ బోఁగలుగుదుమా? ఏదో యాతనయొద్దికిఁ బోయి యేడ్చిన లోకముతోఁబాటు "మీ ముండ నీ కేమిభయ" మని యోదార్చియుండును. తరువాత?

కృష్ణ— నీ వనినట్లే; పదఁపడి సమంత్రకంబగు నొకకవచం బొసఁగి "యీవాఁడు రణంబున నిశ్శంకముగాఁ దిరుగు" మని యనిచె. దానంజేసి యాతఁ డట్టిపల్లదములు నీ యెదుట నుడువఁ గలిగె.

అర్జు— అదియా కారణము. ఆ కవచధారణము గురువరుఁడుతప్ప నొరు లెఱుఁగరు. అయ్యనఘునకతన నాతను నాకతన నీ మేనల్లునతను నదియెఱుకపడియె. (దుఃఖమాపుకొని స్మృతినభినయించి) నేఁడు మన యుత్తమౌజోయుధామన్యు లొనర్చిన విక్రమము కడు శ్లాఘనీయము సుమా!

చ. కురుపతి దేరు గూల్చ నెఱఁగుంబడ కిర్వురు నొక్క తేరిపై
నతిమతి నిల్చి రాజరథ మల్లన భగ్నము చేసి రేని చే
మరల రథంబుగోలుపడి మాత్రన యొద్దిరి యస్మదంతికం
బరుల నొకిర్వురం జదిపి యయ్యరదమ్ములె యెక్కి యుక్కునన్.

కృష్ణ— చెప్పవలసినదేమి? ఆపాంచాలకుమారులు నీకుఁ జక్రరక్షకులు గదా? (స్మృతి నభినయించి) అర్జునా! ధర్మజునకు ధృష్టద్యుమ్ను సరరక్షకుఁగా నేర్పరచి తా నయ్యజాతశత్రు ప్రేరణంబున మనకుఁ దోడ్పడువాఁడై మధ్యమార్గంబున ద్రోణుఁ డడ్డపడి "సీతమ్మునివలె మత్సమ్మతిం గొనిపోయెదవా? లేక నన్నుఁ దలకడచి యరిగెదవా?" యని శరాసారంబున ముంచ "అర్జునుం డొకరసమ్మతి నెన్నఁడును గొనువాఁడు కాఁడు. కొసరఁగాక. వీఁడు భీముఁడునుమీ" యని క్రేణించుచుఁ గొంతవడి పోరిపోరి విసివి తుట్టతుదకు,

చ. అరదము డిగ్గి ద్రోణునిశరావళి కట్టులొ శీర్ష మొగ్గి యు
గ్గురునిరథంబు ప్రేల్మిడిన కూడఁగముట్టి నొగల్ కరద్వయిన్

బరువడిఁ బట్టి యయ్యనిలుపట్టి తటాలున తీసి వైవ తే
రుటికి గురుండు శిష్యునిమహోద్ధతి కచ్చెరువంది మెచ్చుచుఞ్.

అని యతనిసారథి విశోకునివలన వినినది మొదలు కడు నక్కజమగుచున్నది.

అర్జు — (మెచ్చుతో) అన్నసాహసము నిరుపమాన మని లోక ప్రసిద్ధమే! (యోజించి) ఐనను, ఈనాఁ డీ మహావీరునికిఁ గర్ణునివలని యవమాన మించుక ఘటించుట కీ యతిసాహసమే కారణము. కానిచో భీమునిముందు కర్ణుఁ డెవఁడు. బావా! మాయన్నగారికి రథ మలంకారమాత్రమునకే గాని పనివడినప్పుడెల్ల నాయనకుఁ బాదచారిత్వమే శరణము సుమా.

కృష్ణ — అవును. సింగమునకు మాతంగవాహన మేల? ఇతఁ డసహాయశూరుఁడే గాని యీతనికిఁ బ్రమాద మప్పుడప్పుడుఁ గొండొక బాధించుచుండును.

అర్జు — నీ వనినట్లే. కానిచో,

చ. తన యరదంపు గుఱ్ఱముల త్రాళులు ద్రుంచి విశోకు నొంచి వి
ల్లును రథకేతువుం దునుములోపల వేఱొకవింట శత్రునిన్
దునుమ యతింప కన్న గడు తొందరమైఁ దనతేరు డిగ్గి యా
తని యరదంబుపైకి నొగి దాఁటునె తాను గృపాణపాణియై.

కృష్ణ — తనకత్తి విసరి యక్కతన నిరాయుధుండై మఱియు దాఁటెనఁట. ఆయుధ మున్నచోఁ గర్ణుఁ డవమానింపఁగలఁడా? (యోజించి) కత్తిచేఁ జాపము తెగకొట్టుచున్న నితని నతఁడు రాకుండ వారింపఁ గల్గునేమో యని యెంచితింగాని గురునియెడఁ జూపిన సాహస మాసందియమును దీర్చినది. (నవ్వి) అరులయంపఱ మీయన్నకు దున్నపైఁబడు చినుకులు నంగావుసుమా బావా!

అర్జు — అయ్యనఘుఁ డమాయికుఁడు గావుననే మీమీ హాస్యవచనముల కప్పుడప్పు డవకాశ మిచ్చుచుండును.

కృష్ణ — అమాయికుఁడు గావుననే గర్ణుఁడరవమ్మునవే యొకఁట డాఁగియున్న నయ్యది గనిపెట్టనేరకపోవుటయుఁ దుద కవమానితుఁ డగుటయుఁ దటస్థించినది. కానిచో నీవు మున్నొనర్చిన ప్రతిజ్ఞనుగూడ నితఁ డప్పుడు చూచువాఁడు కాఁడుసుమీ! దీనికేమి, "పులిమీఁదపుట్ట" యన్నటు లెట్టో సైంధవవధ ప్రతిజ్ఞను నిస్తరించితి మనుకొనుచుండఁ గర్ణునితో మీయన్నయొనర్చిన [illegible] చెప్పి, యరఁటిబోక [illegible] [illegible],

క. అని నీవు సూచుచుండఁగఁ
దునిమెద వృషసేను నీసుతునినని ప్రతిన౯
బొనరించితి వద్దానిని
మనమున స్మరియింతె? యిట్టిమాటలు చనునే.

మీయమ్మకడుపు చల్లఁగ నిందుఁ గాలనిర్ణయముమాత్రము చేయ మఱచితివి.

అర్జు— వాసుదేవ! జగదేకరక్షకుఁడవగు నీయనుగ్రహము గల నాకుఁ గాలనిర్ణయ మొనర్చినను నయ్యది దుస్తరముకాదు. (స్మృతి నభినయించి) బావా! దారుకుఁడు నీ రథమ్మును సన్నద్ధపఱచి తెచ్చెనుగదా, కారణమేమి?

కృష్ణ— అర్జునా! రాత్రి యట్లు చెప్పితిని. పనిపట్టినచో నేనుగూడ రథినై యుద్ధంబొనర్చుటకు నిశ్చయించుకొనియే యున్నాఁడను. నీవు జగదేకవీరుఁడవుగాన నెవరిసాయమును నపేక్షింపనైతివి. కాని సన్నద్ధపఱచి తెమ్మన్నందులకు భూరిశ్రవస్సుతో నన్యోన్యరథాదిపరికరమారణంబుగఁ బోరియున్న నీ శిష్యుఁడు సాత్యకి కడ తిరిగియుఁ గర్ణునితోఁ బోరి యోడించుట కుపయోగించినది. లేనిచో సాత్యకి రథస్థుఁ డగు కర్ణునికి నోడవలసినవాఁ డగును.

అర్జు— అతఁ డీనాఁ డొనర్చిన విజయములు గణించినచో నిరాయుధుఁడైకూడ గర్ణు జంపంపఁ గలుగుననియే నానిశ్చయము. (పశ్చాత్తాపముతో) వాసుదేవా! నేఁటి యుద్ధములో నొక యధర్మమునకు నామది కంపించుచున్నదిసుమా.

కృష్ణ— భూరిశ్రవస్సుచేయి నఱకుటకేనా? సమయజ్ఞుఁడవు కావుసుమీ. అంతపాటి యధర్మమును లేకుండ బవరము సేయువారెవ్వరు?

చ. ఎదురెద వీ యధర్మ మొకఁ డెద్దియొనర్చి రిపుల్ రణంబునం
బదుగురు కూడిమాడి యభిమన్యునిఁ జంపఁగవచ్చు నేమి? దో
ర్మదమున నాతఁ డెత్తినకరం బది త్రుంపక కంటి కామయ
ప్రదమయి దొర్లు సాత్యకికబంధము చూచెదవా ధనంజయా!

అర్జు— పోనిమ్ము, కృష్ణా! అంతటితోఁ బోనీక మనసాత్యకి ప్రాయోపవేశంబున ప్రాణములు వీడు నయ్యనఘుకంఠము దునుముటకేని వ్యసనపడవలదా?

కృష్ణ— పడవలసినదే. కృపనికై వ్యసనపడి యేమిచేయఁ గల్గితివి? భూరిశ్రవుని విషయమునఁ బూర్వజన్మగాథగూడఁ గలదు. అది సావకాశ

మఱగ నీకుఁ జెప్పఁగలను. ఆపై నీకీసందియము వోవుటయేగాక యీనాఁడు ద్రోణకర్ణాద్యనేక యోధుల నుక్కడఁచి సర్వవిధముల నిన్నును నన్నును మఱపించిన సాత్యకి ~~కీయవకాశ ముందులకు~~ ఘటిల్లెనో కూడఁ దెలియఁగలము. దీనికేమి? ఆచార్యు నెదిర్చి నవసియున్న మాపెద్ద యన్నకు సైంధవవధప్రకారంబు వినుపించి యోదార్చుదము రమ్మా.

(పరిక్రమింతురు)

అర్జు— (స్మృతినభినయించి సాత్యకినుద్దేశించి) సాత్యకీ! ఎంతపని చేసితివి? నిన్ను నమ్మగదా, మాయన్న నొంటరిం జేసి వచ్చితిని.

(ధర్మరాజునుద్దేశించి)

క. నలుగురు తమ్ముల మనిలో
పలనుండియు నిన్ను గురుని బారికిఁ ద్రోవం
గలపాటి కాకపోతిమి
దళితాంతర్వైరివీర ధర్మకుమారా!

కృష్ణ— ఫల్గునా! సాత్యకి రాకపోయిన భీమసేనునోడించి నీచోక్తులువల్కిన కర్ణునదలించువారెవ్వరు? మనము ప్రతిజ్ఞానిర్వర్తనత్వరాయమాణ మానసులమయి సైంధవునిదిక్కు మొగంబై యుండ,

చ. రిపుబలమెల్ల నొక్కఁడెదిరెన్ బెదరెం గురునాయకుం; డప
త్రప విడనాడి పారె యువరాజు; సుదర్శనుఁ డాదియైన భూ
మిపతులు సోమదత్తుఁడు నిమీలితలోచనులైరి కానిచోఁ
దపతపలాడదే ప్రబలతాపముచే మనచిత్త మర్జునా!

అర్జు— కృష్ణా! సైంధవవధోత్కర్షామర్షంబునఁ జూచినదియుఁ జూడనియట్లే యున్నయది. (కోపముతో) ఓరీ పాపవిచారా! రాధాకుమారా!

ఉ. కౌరవనాథుతోడి చెలికారము పెంచినకండక్రొవ్వునన్
మారుతసూతి కట్టు లవమానము సేయఁగఁ బోయినావురా
మోఱక! నిన్ను దీనిఫలముం గుడిపింపఁగ లేకయున్న నా
పేరు కిరీటికాఁడు రిపుభీముఁడు భీముఁడుకాఁడు పూజ్యుఁడున్.

కృష్ణ— (తనలో) ఓహో! యీజిష్ణునిమనం బప్పుడే కర్ణవధపర్వము నన్వేషించుచున్నది. కాని యయ్యెడ కరుగుటకు ద్రోణపర్వతము దాఁటవలయునను విషయమే యితఁడు మఱచినాఁడు. (ప్రకాశము) ఫల్గునా! మనమీ యుదంతము మహారాజునకు వినిపింప నేగుదము రమ్మా.

(నిష్క్రమింతురు.)

(ధర్మరాజు బకోటకునితోఁ బ్రవేశించును.)

ధర్మ— బకోటకా! తరువాత?

బకో— తరువాత వారిలోవారికే పెద్దకలహము జరిగినది.

ధర్మ— ఎవరెవరికి?

బకో— ద్రోణదుర్యోధనులకు.

ధర్మ— ముఖ్యులగువారికే! కారణమేమి?

బకో— దేవరతమ్ముఁడు సైంధవునిఁ దెగటార్చుటయే కారణము. భావుకమరణంబునకు శోకించుచు మొదటఁ గురురాజు భారద్వాజుకడకుంబోయి "కుంభసంభవా! నాఁడట్లు శిఖండి నెదుటం బెట్టుకొని శాంతనవుం దెగటార్చిరి. నేఁడు సైంధవునిం జంపి మాటచెల్లించుకొనిరి. ఈయాలములో జలసంధసుదర్శనాది మహాయోధులు పెక్కురు మడిసిరి. నేఁటికి వారిసేన సురక్షితముగానే యున్నది. మనబలం బేడక్షౌహిణులు రూపుమాసినది. ధనురాచార్యుండనని పేరుపెట్టుకొని పిల్లవాఁడు చేయఁదగినపనియైనఁ జేయఁదలఁపవైతివి. అన్నమాట చెల్లించుకొనలేక పోయితివి. నిగ్రహానుగ్రహములు రాజులకుఁ జెల్లుఁగాని బ్రాహ్మణులకుఁ జెల్లునా? కాక యిట్టి కపటాత్ముండవగు నీవు బ్రాహ్మణుఁడవా! నీవు శత్రుపక్షముననేయున్న బ్రతికిపోదుము. ధురంధరుండగు కర్ణుని వదలి మొదటనే నీకు సేనానాయకత్వ మిచ్చినందులకుఁ దగినఫలముం గుడిచితిమి; నిన్నఁ "బదుగురుప్రోవై యభిమన్యుని విరథుంజేసి చంపుఁ"డని యెచ్చరించితివి. నేఁడు శిష్యవాత్సల్యమున నర్జునుని మోహారంబు చొర నిచ్చితివి. సర్వవిధంబుల నీచే మోసపోయితిమి" అని యనరానిమాటల దూషింప గురుం డరుణసరోజంబుల కెనయగు కందోయితో "నోయీ! మూఢదుర్యోధన! ఇదియంతయును నాసేనానాయకత్వమునకా ఫలము? జూదములోనఁ దబ్బిబ్బుపాచిక లాడించినందులకుఁ గాదేమి? మహాసభలో ద్రౌపదిపుట్టము లొల్చినందులకుఁ గాదేమి? సంధిచేయవచ్చిన వెన్నుని పలుకులు విననియందులకుఁ గాదేమి? చాలుఁ జాలు. పాండవపాంచాలుర యంపగము లోకదండ నోడలు మండింపనందుపై గడియగడియకు వచ్చి నీ విట్లుడికించెదవేమి? చేతనైన యుద్ధముచేయుము. లేదా, ధర్మరాజు శరణుజొరుము; నిక్కముగాఁ బాండవుల వంతలుచేసిన కతనాత్మునకు రణసహాయముఁ జేయవచ్చిన నేను బ్రాహ్మణుఁడనేకాను" అని యేమేమో కనలి మరల శాంతము దెచ్చుకొని "కానిమ్ము; నే నీ రేయి పాంచాలురం జంపక కవచం బూడుచు

వాఁడఁగాను. కృపాశ్వత్థామలనిట్టే యుడికింపక చని యుత్సాహంబు కల్పింపుము. నాచేతికిఁ జిక్కినవారల వారలఁడఁగింతు" రని యొదార్చె.

ధర్మ— అక్కటా! అట్లయిన నిఁకఁ బాంచాలురు మనకు దక్కరుకాఁబో లును. (యోజించి) పాంచాలురంత పైపై లేర్వు. అందులో ధృష్టద్యుమ్నుఁ డసాధ్యుఁడు. అతఁ డీ గురునకు లొంగువాఁడు కాఁడు.

ఉ. చిన్నతనంబునం దనకుఁ జేసినయొగ్గుఁ దలంచి శిష్యసం
పన్నుఁడు కుంభజుండు మన పార్థునిచే ద్రుపదక్షితీంద్రునిం
బన్నమునొందఁజేయ నభిమానముచే నతఁ డీకుమారునిన్
జన్నముచేసి యాగురుని జంపునిమిత్తము గాంచె వహ్నిలోన్.

బకో— నేఁడేమోకాని యితఁడు ద్రోణునిబారి కగ్గమై ప్రమగ్నుడు సాత్యకిచే రక్షింపఁబడిరెు.

ధర్మ— ఒకప్పు డెంతవారికిని బరాభవము రావచ్చును. (మెచ్చుతో) సీరి సోదరా! నీఋణ మెట్లు తీర్చికొందును?

ఉ. "అన్నలఁ దమ్ములన్ గలన నన్నిటఁ గాచుకొనంగఁజాలి మా
యన్నను గాఁచెనే" యనుచు నర్జును ద్రోవది దెప్పకుండ నా
పన్నత ద్రోణు బారిఁ బడుపట్టునఁ బార్షతుఁ గాచి తీవహో!
కన్నన నిన్నుఁబోలు నుపకారులు మా కెవరయ్య సాత్యకీ!

బకో— తరువాత కోఁడు కర్ణునియొద్దికరిగి "ద్రోణుఁడే మనసైంధవు మృతికిఁ గారణుఁడయ్యె" నని దూఱనారంభింప నతఁడు "మిత్రమా! అట్లనఁ జనదు. దైవమే మన సైంధవుని హరించె. మనకన్న నన్నివిధములఁ బాండవులు లొచ్చెనను దైవబలమందు మిక్కిలి హెచ్చు. లేనిచో లాక్షాగృహ దహనాదికంబు వారల కించుకేని గీడుఁ గల్పింపకుండునే" యని సమాధానపఱచె.

ధర్మ— వీనికింత తెలిసియు సంధి నెందుకుఁ గుదురనీక చెడఁగొట్టెనో?

బకో— (తెరవంకఁజూచి) దేవరతమ్ముఁడును శ్రీకృష్ణుఁడును వచ్చుచున్నారు.

ధర్మ— అట్లయిన జయలక్ష్మీశోభితులగు వారిని మన మరిగి గౌరవింతము రమ్ము.

(నిష్క్రమింతురు)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు చతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవ విజయము

## పంచమాంకము

(తెరలో)

శా. దీపంబుల్ వెలిఁగించి రెల్లెడల, హేతివ్రాతసందీప్తిపైఁ
బ్రాపయ్యెన్, నృపమౌళి మాళులెసఁగెన్ భాస్వంతులై; రే యొగిన్
లోపించెం బగలయ్యె సేనలకు; ద్రోణుం జూచి భీతిల్లుచున్
వే పాఱెన్ యమనందనుండు గవిసెన్ వీరున్ గురున్ గ్రీడియున్.

(ఇది చూళిక)

(ధర్మరాజు ప్రవేశించును)

ధర్మ— (లజ్జతో) ఈ విమానచరుల తప్పేమి? నేను బలాయతుండనగుట యబద్ధమా?

(మరలఁ దెరలో)

మ. అను మామా! యనుమయ్యె ఘాతులువ నేఁ డంతంబునొందింతు నా
ల్కను ఖండింతు టదేమొ జూచెదను డొల్లంజేతు శీర్షంబు, రా
జునకుం గల్గిన యుద్ధభారమది తీర్పం గాక నాయస్త్రశ
స్త్రికాయంబు వృథాప్రగల్భములు మీఱన్నీకు మీ కర్ణునిన్.

ధర్మ— (విని) రామాయణములో పిడుకలవేట్లాడుట బయలుదేరినదే! కృప గురుపుత్ర కర్ణుల కేవో యవాంతరకలహము గల్గినట్లున్నది. (సంతోషముతో) మనకీ యంతఃకలహములే చాలవఱకు దైవముతోపాటు తోడ్పడుచున్నవి. నిక్కముగా నీ బ్రాహ్మణత్రితయమే విజృంభించిన మనలో నెదురువారెవరు?

ఉ. కౌరవనాథుఁడుం దనకుఁ గర్ణుని బాసట గెల్పు చెందఁగాఁ
గారణమంచు లోఁదలఁచుఁగాని నిజంబది పార్థవృద్ధికే
కారణ; మా ఖలుండటుల గాఁకులు పేరిలకయున్న నెందు దు
ర్వారులు బ్రాహ్మణుల్ రణపరాఙ్ముఖు లౌదురె మాటిమాటికిన్.

(తెరలో)

గీ. అర్జునునితోడఁ బోరి సూతాత్మజుండు
విరథుఁడై యెక్కెఁ గృపుతేరు, వీఁకఁబార్థు
దాఁకనెంచుసుయోధను దర్పధనుఁడు
ద్రౌణి వారించె మిగుల గౌరవమెలర్ప.

ధర్మ— పాపము! కర్ణుఁడు తానోడుట కంత విచారింపఁడుగానికృపాచార్యుల తేరే తనకుగతియైనందులకు లజ్జించునుగాఁబోలు. (విని) తన్ను బ్రతికింపనెంచిన గురుపుత్త్రుని రారాజేమో దూఱుచున్నాఁడు.

(తెరలో)

ఉ. ఫల్గునుఁడన్న మీకుఁ గడుపక్షము తండ్రియు నీవు వానిపై
నల్గరు మీరు పార్షతుల నార్పఁడు నేను వధింతుఁ బార్థులన్
గల్గెడుఁగాక మృత్యువో యఖండరమావిభవంబో నాకు; మీ
రల్గనుచుండ్రుగాక కురురాజుపరాక్రమ ధైర్యశౌర్యముల్.

ధర్మ— వారిప్పుడు క్రొత్తగాఁ జూడనక్కరలేదు. నీవు పార్థునెదుటను నేను ద్రోణు నెదుటను లేశమేనిఁ బనికిరాము.

(తెరలో)

గీ. కలదు పాండవులందుఁ; బక్షమ్ము మాకు
నయిన నది యుద్ధపుంబట్ల నవలికేగుఁ
జూడు పాండవసేనఁదూఁగాడఁజేతు
నేను గల్గ యుద్ధమ్ము నీ కేల రాజ?

ధర్మ— (విని) ఓహో! ఈ గురుపుత్త్రుఁడు గురుని కెప్పట్లను దీసిపోవువాఁడు కాఁడు (తెరవంకజూచి) యుద్ధము కడుసంకులముగా జరుగుచున్నది. ఎవ రేమిచేయుచున్నదియు విస్పష్ట మగుటలేదు.

(మరలఁ దెరలో)

తే. గీ. ఇది యలంబసుతల నీకు నితఁడుమిత్రుఁ
డిప్పటికి దీనిఁ గైకొను మింతలోన
నీదుప్రాణమిత్రునితల నీరథంబు
పైనిబడు సిద్ధమిది తాటిపండుపగిది.

ధర్మ— (సవిమర్శముగా) ఈ యలంబసుఁడు మున్నరణ్యంబున యాజ్ఞసేనికిని మాకును హానిగావింప నెంచిన జటాసురుని కొడుకు కావలెను. బకాసురుని తమ్ముఁడును, నిదే పేరివాఁడును నగు రక్కసుఁ డీహిడింబా

సుతునిచే నింతకుమున్న మడిసి యలక్కసు తల కురురాజు రథముపైఁ బడవైచి సింహనాదమొనర్చి కర్ణునిపైకి గుమాఁ డరుగుచున్నాఁడు. ఇది రాత్రియుద్ధ మగుటచేఁ నీరాక్షసీపుత్రు నెవ్వరును నెదుర్పఁజాలరు. (విచారముతో) తప్పక తనప్రాణసంరక్షణకై కర్ణుఁ డింద్రదత్తంబగు శక్తి నీయనిల పౌత్రునిపైఁ బ్రయోగించును గాఁబోలును. అయ్యో దైవమా! నిన్నటి పుత్రశోకముపై నిదియొకటి డచ్చిపెట్ట దలఁచితివా!

చ. ఉరుపగుశక్తి నేఁ డలఘుటోత్కచుపైఁ బడవైచి దానికిన్
బరు వెడలించుకన్న నిది పార్థునిపై నడరించు టొప్పు వాఁ
డొరిగిన యుద్ధమే యడఁగు నుర్వియు నీకిదక్కుఁ, దక్కభూ
వరులకుఁ జావు దప్పు; మన పార్థివు నప్పను దీర్చునట్లగున్.

ధర్మ — (విని ఆత్రముతో నింద్రునుద్దేశించి) దేవా, పురందర!

చ. కొడుకును బ్రోవఁగాఁ గవచ కుండలముల్ హరియించితీవు వి
ప్రుఁడవయి దైన్యమంచుఁ దలపోయక; నేఁడది ముల్లు దీసి కొ
ఱ్ఱడఁచిన భంగి యయ్యె నకటా! యిపు డీ విడినట్టి శక్తిచే
నడఁచెదనంచుఁ దాఁకెనఁట! యాలములోపలఁ గర్ణుఁ డర్జునున్.

హా! పార్థ! సైంధవునిం దునిమి యొకగండము దాఁటితి వనుకొనుచున్న నీకై యింకొకగండము వేచియున్నదా? కానిమ్ము. సర్వదా మన కార్తశరణ్యుండగు భగవంతుఁడే దిక్కు. ఓవాసుదేవ!

ఉ. కావు మటంచు నీపదయుగంబు మనంబులఁ బాఁదుకొల్పుచుం
దేవరఁ గొల్చుచుంటిమి త్వదేకశరణ్యుల మాజిలోన మా
యేవురప్రాణము ల్నిలుపు మే దెటులైనను నరత చింత లే
దావిలమయ్యె నాహృదయ మావడిఁ బాపఁగదయ్య కేశవా!

(తెరలో)

గీ. ఎట్టకేలకుఁ గర్ణుఁ డయ్యింద్రదత్త
మైన శక్తిని భీమసేనాత్మజాతు
పైఁ బ్రయోగించుచున్నాఁడు బ్రతికెఁ బార్థు
డవని కైవసమయ్యె యమాత్మజునకు.

ధర్మ — (విచారముతో) అక్కటా! దివ్యానచరులార! యేమి దివ్యానందము? అతఁడు రాక్షసీపుత్రుఁడేయైనను మా భరత సంతతిలోని వాఁడే కదా! సహజవైరముచే మీరును శౌరియు సంతసించినను,

గీ. బ్రతికె దమ్ము డటన్న సంబరము కొంత
పడియెఁ దమ్ముని కొడుకన్న వంత కొంత.

రెండు దెసలకు వ్రాలికయుండఁ జేయ
నడిమి నట్టాడుచున్నది నా మనంబు.

(తెరవంకఁ జూచి) ఉభయ సైన్యంబులును ననివార్యం బగు నిదుర మత్తునఁ దమతమ వాహనంబులపై విశ్రమించుచున్నవి. నేనును గొం డొక నిదురింతుఁ గాక. (నిదుర నటించును)

(తెరలో కలకలము)

ధర్మ— (ఉలికిపడి లేచి దెసలు పరికించి)

క. తనవంశము క్షీణించెడి
నను వగపునఁ బోలెఁ జంద్రుఁడదె! నగమై మె
ల్లన దివికిఁ బ్రాఁక నిదువాఁ
గును సమరంబునకుఁ గవిసెఁ గుంభిని యవిసెన్.

(తెరలో)

చ. ద్రుపదుని జంపితి న్విరటుఁ ద్రుంచితిఁ దున్మెదనింకఁ బార్షతున్
గృప విడనాడితిం బరకుభృచ్ఛయకూలదవాగ్నినైతి భూ
మిపతి "పృథాసుతాప్తులరు మీ" రని దూఱఁగ నేల? నేఁడు శౌ
ర్యపటిమ ధార్తరాష్ట్రిల జయాపజయంబులు నిర్ణయించెదన్.

ధర్మ— (విచారముతో) హా! బంధుసమూహములారా! విరాటద్రుపదులారా! అల్లుండ్రకొఱకుఁగదా మీకీపాటు తటస్థించినది?

ఉ. అల్లునిఁ జూడఁగా విరటుఁ డర్మిలిచేత దివంబుఁ జేరఁగా
కల్లరపేర్మిఁ బోవిడిచి హా ద్రుపదక్షితిపాల! నీవుఁ బోఁ
జెల్లునె? కుంభసంభవుని చేతికి లక్ష్యము చేసెనే నినుం
దెల్లముగా నెఱింగియు మదిం దలపోయక పార్థుఁ డక్కటా!

ఔరా! ఈదిన మెంత దుర్దినము? ప్రభాతంబుననె యిట్టి బెట్టిదపు వార్త విననయ్యె. ఇంకేమి దుఃఖములు తెచ్చిపెట్టునో కదా? (కోపముతో) పరమకుత్సితుఁడగు సుయోధనుఁడు మాటిమాటికిం బోయి పురికొల్పుటం బట్టిగాని లేనిచో నయ్యాచార్యుండు మనయెడల నింత నిర్దయాత్ముఁడు కాఁడు. (చింతించుచుండును)

(ఒక సేవకుఁడు ప్రవేశించును)

సేవ— దేవా యుధిష్ఠిరమహారాజా! కృష్ణభీమార్జునులు మిమ్మొకసారి ధనుర్బాణములు ధరియించి సమరభూమికి రమ్మనుచున్నారు.

ు— (తనలో) ఇదియేమి యుపద్రవమో? గురువితో నన్ను యుద్ధము చేయుమనుటకుఁ గాదుగద? కానిమ్ము. యథాశక్తిఁ బెనఁగుదుఁగాక. (ప్రకాశము) ఇదిగో వచ్చుచున్నాఁడను. అల్లదె ధనుస్సు, దాని నిటు తెమ్ము!

సేవ— (తెచ్చియిచ్చి) దేవా! యిట్టిటు. (ఎదుటఁజూచి) మహారాజ! వారు మువ్వురు నేలొకో సమరభూమి విడిచి యామఱ్ఱిచెట్టుక్రింద నేమేమో యాలోచించుచున్నారు. సమీపించెదము రమ్ము. (పరిక్రమింతురు)

(అంతటఁ గృష్ణభీమార్జునులు ప్రవేశించుచున్నారు)

కృష్ణు— (ఎదురుకొని) మహారాజ! మేము నీయొద్దకు రాక నిన్నుం బిలువనంపి నందులకు క్షమింపుము. మేమందఱము నోపినకొలఁది రణంబున దోర్లాడుచుంటిమి. నేఁటికి నీ వంతువచ్చినది. (చేత నాకసముచూపి) ఈమధ్యాహ్నమార్తాండు లోక సూర్యరకన్న మిన్నయై కుంభసంభవుం డేరికిని దేఱిచూడరాకున్నవాఁడు కావున నతని మాయించుటకుఁ దగినయుపాయ మాలోచింపుము.

ధర్మ— వాసుదేవా! నీ యపహాస్యమునకు నేఁటికిఁ బాత్రుఁడనైతినా? గురునకు జడిసి యిల్లుఁదూఱితినని యుడికించెదవాయేమి? కానిమ్మం దఱి వంతులు భరియించు మహానుభావుఁడవు నీవే యుంటివిగదా.

భీము— భ్రాతృవత్సల! శౌరి మీతో నెన్నఁడయిన నెక్కసక్కెములాడెనా?

ఉ. కాలము దాఁపరించిన ప్రకారముగా నడఁగించె నెల్లషాం
చాలబలంబుఁ గుంభభవచాపవినిర్గతబాణకీల; మా
కేలు వడంకుచున్నది చికీర్షిత మేమియుఁ దోఁచ దో మహీ
పాలక! దేవరం బిలువఁబంపితిమయ్య రణంబులోనికిన్.

కావునఁ గర్తవ్యంబు నాలోచింపుము.

ధర్మ— ఓ భీమార్జునులారా! ఓయీవాసుదేవ! గురుండట్లు కనికరంబుమాలినను మీరు సమరనిరుత్సాహులరైనను నేనేమిచేయఁగలను? ఐనను,

ఉ. ఏ నెదిరింతు గుంభభవు నేకరథంబునఁ బంపుఁడట్లు కా
దేని రణంబు మాని వనదేశములందు సుఖింత మీ దురా
శానిగళంబుఁ ద్రెంచుకొని సారతపోధను లెల్లకాలమున్
మానులు ధర్మశాస్త్రవచనంబులసార ముపన్యసింపఁగన్.

కృష్ణు— (నవ్వుచు) బావా!

గీ. రాజు రాజుతోఁ బోరు టర్హంబుగాని,
తదితరులతోడఁ బోరుట తగదటంచు

# పంచమాంకము

మాపు గురుతోడఁ బోరు నిఁక మానిపించి
యిప్పు డగ్గురుపైకి ని న్నెట్లుపనుతు?

నీ వీరెండును జేయనక్కఱలేదు. కొంచెము వాక్సాహాయ్యము జేసి నం జాలును.

ధర్మ— అనృతమాడుట తప్ప మఱి యేది యేనియుం జేసెద.

కృష్ణ— నా కదియే కావలసినది. వినరానిమాటలు వినిన గురుం డస్త్ర సన్న్యాసము గావించును గావున నతనియొద్దకుఁ బోయి "అశ్వత్థామ సచ్చె" నని యనవలయును. ఆతం డిప్పుడు తండ్రికిఁ గనుచాటగు ప్రదేశమున సమరము చేయుచున్నవాఁడు కావున నమ్మును.

చ. అడవుల కేగిన న్విడుచఁ డాగుచఁ డాపయి మీరు రాజ్యముం
గుడుతురొ? కానకేగుదురొ? కొండొకకార్యము సేయవచ్చు ని
ప్పుడు గల గండముం గడచిపోయినఁ జూతము మాటత్రోవఁగా
నడువకు మీనఁగాచియును నక్కలపాలొనరింపఁ బాడియే?

మ. చదిసెం భీమగదాప్రహారమున నశ్వత్థామ పేరింటిదే
గద మాతంగము; దానిమీఁద నెపముం గల్పించి ముందన్ము, పై
"నదిహా స్త్రీంద్ర" మటన్ము మెల్లఁగ; నసత్యాలాప దోషంబు నుం
డదు, కార్యంబు ఫలించు, నంత భవదిష్టప్రాప్తి చేకూరెడున్.

అర్జు— (నిర్విణ్ణుఁడై యధోముఖుఁడై యసమ్మతి నటించుచుఁ దనలో(

క. తుచ్ఛమగు రాజ్య మేటికి?
స్వచ్ఛంబగు యశములేని సౌఖ్యము ఘనమే?
విచ్ఛిన్నధర్ములైన జ
యేచ్ఛులు నెరియాదు రకట! యిహపరములకున్.

భీము— ఇంతకు మున్నొకసారి నేనుపోయి చెప్పితిని. కాని కార్యకారి కాలేదు. ఈ శౌరి మాటలకన్న మన కాగమములును శాస్త్రములును నెక్కుడు కావు.

ఉ. బొంకనివాఁడవౌట నినుఁబోలినమానిసి నీవ యౌట ని
శ్శంకముగా గురుండు తనుజాతునిచావెద నిశ్చయించి యా
యంకనముం ద్యజించు నిజ మావలఁ దెల్లముకానఁ బాండవై
ణాంక! స్వకార్యసిద్ధి కటు లాడితిగా, యని యల్గఁ డాతఁడున్.

ధర్మ— (చెవులు మూసికొని) హరహరా! ఎంతమాటాడితిరి? ఎంతసాహసము

చేసితిరి? కుమారుని చావు విని [illegible]చార్యుఁడు [illegible] ననుకొను చున్నారా యేమి?

ఉ. తిండికి లేకపోయి పరదేశము లేగిన వచ్చుఁగాక వి
ప్రుం డదిగాక దేశికుఁడు పూజ్యుఁడు రిత్త వచించి చంప బ్ర
హ్మాండము లన్నియుం దిరుగులాడవె? తుచ్ఛులతోడిపాటు కా
కుండునె ధర్మసంభవుఁడు నూరక యిట్టు లసత్య మాడినన్.

ఉ. సత్యముచేతనే జగము సర్వము క్రుంగక నిల్చె, సత్యమే
నిత్యము, సత్యమే శుభము, నీరజబంధువు నీరజారియున్
సత్యముచేతనే గతు లజస్రముఁ దప్పకయున్నవారు సా
మత్యము సత్యముం జెడిన క్ష్మాపతి కెందు జయంబు గల్గునే?

అదియునుంగాక బొంకనివాఁడవనిగదా! "నీమాట గురుండు నమ్మ" నని నుడివితిరి. నేనన్నృతవాది నేని నా కాగౌరవ మేల వచ్చును?

శా. సత్యంబే విడనాడినం గహన వాసం బేలొకో? రాజ్యభా
గత్యాగంబది యేలొకో? చెలువకుం గారాని పాట్లేలొకో?
వ్యత్యాసంబుగ నొక్కరాజుకడ సేవావర్తనం బేలొకో?
యత్యాలోచన శాలు లీపలుకు లేలా? మీకుఁ జాలింపుఁడీ.

ఉ. "ఇంతపరాక్రమంబు వహియించిన మేము భరింప లేము కా
సంత యనుగ్రహింపు" మని యాయన పాలికిఁబోయి వేఁడి నే
శాంతుని జేయఁ గాఁగల నసత్యము లాడఁగఁ జాల మున్ను నా
శంతనుపుత్రు బాహుబల సంపద పెంపున గెల్చినారమే?

కృష్ణు— యుధిష్ఠిరా! నీ వజాతశత్రువుఁడ వనుమాట నేఁటికిఁ దెలిసినది. ద్రోణుఁడును భీష్మునివంటి వాఁడనుకొంటివా? భీష్ముఁడు పదియవ నాఁటి యపరాహ్ణంబున యుద్ధమిషమ్మునఁ దేరు నీయొద్దికి రానిచ్చి—

ఆ. వె. "ధర్మరాజ! నీవు తప్పక నాదు హి
తమ్ముఁగోరెదేని తడయ కిపుడె
వారువీరు నాక వీరులందఱు నొక్క
పెట్టఁ జట్టిముట్టి కొట్టుఁడయ్య."

ఇట్లుబోధించెఁగదా! దీనియర్థమేమి? అతఁడు నీకుఁబితామహుఁడు. నీమేలుఁగోరువాఁడు. అంతవఱకేని యయ్యనఘుండు పెనంగుటకు హేతువు కురురాజునకుఁ దనయిచ్చిన బాస నమ్మఁగాకుంటకుఁ జుమీ! ఇఁక ద్రోణునో, [illegible] శాంతుని గావింప వారు కుపితుని శాపింతురు- ద్రోణ

శాంతనవులకుఁ గల భేదము వీరివీరి ప్రతినలను బట్టియే నిర్ణయించుకొన వచ్చును. "ఎవరినో రథికులను పదివేవురను సమయింతు" నని యతఁడు ప్రతిజ్ఞ చేయ నీబ్రాహ్మణుండో తనకు సేనాధిపత్య మిచ్చెనుగదా! యని యుబ్బి నిన్నే పట్టికొనుటకుఁ బ్రతిజ్ఞం బొనర్చె. భీష్ముం డింతకన్న నసమర్థుఁడా? అతఁడు పూనినచో నీవుగాని నీతమ్ములుగాని నేనుగాని బ్రదికిపోవువార మేనా యోజించుకొనుము.

ఉ. అనృతము లాడఁగూడ దనునంత వివేకము లేక కాదు నీ
యనుజులఁ బ్రోవనెంచి సులువైన యుపాయముఁ జేసినాఁడ నీ
పని నెఱవేర్పవేనిఁ జనువాఁడను ద్వారక కేమి లాభ? మీ
వనుజులఁ గాచికొమ్ము నిజ మాడియు లే కనృతంబు పల్కియో.

ఉ. "ప్రాణము పోవుపట్టున నబద్ధమునుం జను" నంచుఁ బూర్వగీ
ర్వాణగురుండు వ్రాసె; ననివార్యపరాక్రముఁ డొక్క ప్రేల్మిడిం
ద్రోణుఁడు రూపుమాపు మనతోయము; నల్లనె విన్ము ద్రోణ ని
ర్వాణము లేగతిం బ్రళయగర్జితము ల్బలె మ్రోఁగుచున్నవో!

భీము— మహారాజ! ఇంతకును మనయుపాయము ద్రోణకోపానలంబు చల్లాఱుటకుఁగాని ద్రోణవినాశనమునకుఁ గాదుగదా! అట్లే యగుఁగాక. అయినను,

క. గురుఁడుం దైవము చుట్టము
సరసీజాక్షుండు మనకు సకలం బిపుడా
హరి సెప్పినట్లు చేసిన
దురితము వాయుటకు బదులు దురిత మెనయునే?

ధర్మ— తమ్ముఁడా! మీరందఱు నేకీభవించుటం జేసి యనవలయు ననుకొన్నను నా నాలుక తుదకా మాటరాదు. కావున నేపాట్లు పడియో గురుని రణరంగమునుండి మరలింతును. మీ కెందుకు మిన్నకుండుఁడు.

కృష్ణ— (నవ్వి) ధర్మతనూభవా! నా కొఱకుఁ జెప్పుచుంటె ననుకొంటివాయేమి?

చ. గురువరుమ్రోల కేగ మది గొల్పెద వక్కట! బైసి మాలి నీ
వరిగినచో మఱింత చెడుగా నినుఁగట్టఁ బ్రతిజ్ఞ చేయఁడే
కురుపతి యొద్ద; ద్రోణునెడకుం జనుదే ధరణీంద్ర! పాండుభూ
వరునికులంబు నిల్ప "కొక పల్కనృతం" బని కూలఁద్రోసెదే!

ధర్మ— వాసుదేవా! నాపల్కు లాలించి నన్ను మన్నింపుము.

చ. పలువురఁబోలి నేఁ బలవంతుఁడనై విలుపూని బుద్ధికౌ
శలమున మార్తురం గెడపఁ జాలుదుఁ గాని పరాక్రమింప నా

కలుకజనింప దట్టు లసమర్థుఁడ నయ్యు యశంబుఁ గొంటి నే
బలమున నట్టి సత్యమును బాసిన నేఁ దల యెత్తి నేర్తునే?

భీము— కృష్ణా ! నేనేపోయి యింకొకసారి చెప్పిచూచెదను.

(నిష్క్రమించును)

(తెరలో)

ఓయీ వాచాల ! మారుత తనయ! ఏల పదిసారులు వృథాశ్లీలము లాడెదవు?

శా. విశ్వంబు ల్తలక్రిందుగాఁ బడి దిశావేదండము ల్గూలి స
ప్తాశ్వుండుం గతిఁబాసి చంద్రుఁడు ఖిలుండై తార ల్లాడియు
న్నిశ్వాసంబులు లేక లోకములు పోనీ ! యెన్నఁడేగాని మా
యశ్వత్థామకుఁ జావు లేదు గురుఁ డీ యాలాపము ల్నమ్మునే ?

గీ. ఆడి బొంకనివాఁడు నీ యగ్రభవుఁడు
వచ్చి చెప్పిన నమ్మఁగవచ్చుఁగాని
యనృతవాది వధర్మమార్గానుసారి
వేమి చెప్పిన నమ్మ నో భీమసేన !

కృష్ణు— (విని) మహారాజ ! వింటివా ? నీవుపోయి నిజమని నుడువకున్న భీము
నేనుఁ డనృత మాడెనను కోపంబున మండిపడు గురుహుతాశనునియం
దాహుతికాఁగలఁడు. కావునఁ దమ్ముని బ్రదికించుకొనుము.

ధర్మ— (తనలో) హా ! భగవంతుఁడా ! నాకెంతయాపదఁ దెచ్చి పెట్టితివి?

చ. బ్రదికిన నాల్గునాళ్ళు "ఋతవాది యుధిష్ఠిరుఁ" డన్న మేటి కీ
రితి గలవాఁడనై ధరఁ జరించి తుది న్నృపకోటి మెచ్చ దు
ర్గతిఁ గనకుండ స్వర్గమునఁ గాఁపుర ముండఁదలంచు నాకు నీ
యతు కొనరించెదే కటకటా ! యదునందను పేరుమీఁదుగన్.

(ప్రకాశముగా) కేశవా ! అనృతము లాడువారివంశము లంతరించుం
గాని సత్యవాది కులంబున కెన్నఁడును గీడురాదు.

శా. సత్యం బింతయుఁ దప్పకుండిన హరిశ్చంద్రావనీంద్రుండు రా
జ్యత్యాగం బొనరించియుం దుదకు సర్వైశ్వర్యము ల్చెందఁడే ?
దైత్యధ్వంసక ! సత్యవాక్యము సమస్తశ్రేయము ల్గూర్చు గో
హత్యాపాతకికైన శుద్ధియిడు సత్యాలాపి లోకంబునన్.

(స్మృతినభినయించి తనలో) ఇట్లగుఁగాక. (అంజలిఘటించి ప్రకాశము)

చ. మొదటిదినంపుయుద్ధమున మోములు వ్రేలఁగ నైచుశోదులన్
మదిఁ గని " యేను భీష్మునికి మారను బోర త్యజింతు " నన్న " నేఁ

జదివెద మీకు మించిన యసాధ్యుల" నంటివికావె దేవ! యి
య్యదనున నేదియో యొకయుపాయము చూడుము వత్స వీడుమా.

కృష్ణు— ధర్మరాజా! ధర్మజ్ఞుండవయ్యును పొరఁబడుచున్నావు.

క. ఒకవంక ననృతదోషం
బొకవంకఁ గులక్షయాఘ ముంచి గురుత్వా
దిక మెంచి చేయుమీ తా
పకహిత కార్యంబు పెక్కువాదము లేలా?

ధర్మ— (అర్జునునిదిక్కు కోపముతో) నీవేమియు నెఱుఁగనట్లుండి వాసుదేవు
నిచే నాకుఁ జెప్పించుచున్నావు. కాన నా మనోనిశ్చయము వినుము.

చ. ఒడఁబడఁ డీపృథాగ్రతనయుం డనృతమ్ము వచింపఁ; బోయి కా
రడవులలోని యద్రిగుహాలందుఁ దపంబున సర్వకాలముం
గడపఁ గలండు గాని; భుజగర్వముచాలిన ధార్తరాష్ట్రులం
గెడపి యశోభరంబున సుఖింపుఁడు శౌరియు మీరు రాజ్యముక్.

(లేచిపోవుచున్నాఁడు, సేవకుఁడు వెంటఁబోవును)

అర్జు— (తనలో) అక్కటా! అన్నగారు నామనంబు గుఱితింప లేకపోయిరే!

కృష్ణు— ఫల్గునా! మన పలుకులు ధర్మజునిమది కెక్కవయ్యెను. ఇఁకఁగర్త
వ్యమేమి?

అర్జు— ఏమున్నది? సర్వజ్ఞుండవయ్యు నన్నడుగుచుంటివా?

చ. బ్రతుకఁగ నేగుదెంచునొకొ? భండన మెవ్వరికేనిఁ "బాఱి పో
యితి" మనుదుర్యశంబు మనకేటికి? రమ్మరదంబుఁ బోరి కా
యిత మొనరింపు మాగురునియేత్తెఱ చూతము చేతిగాండివం
బు తెగకయుండుదాఁక రణభూమి త్యజించుట వీరధర్మమే?

భీము— (అపరీక్షేపముగాఁ బ్రవేశించి పండ్లు పటపటగొఱుకుచు) ఇంకను
మహారాజుచే "నశ్వత్థామ సచ్చె" నని యనిపింప కూరకున్నారేమి?

క. అవనీతలంబు నిష్పాం
డవ మగు నొకక్షణము కుంభనందనబాణో
ద్భవదావకీల లార్పం
దివురక మన మంటిమేని ధీనిధులారా!

కృష్ణు— ధర్మపుత్త్రుఁ డంగీకరింపమిచే నితికర్తవ్యతామూఢులమయి యూర
కుంటిమి.

భీము— హా! దైవమా! మమ్మిట్లు ధర్మరాజస్వరూపమున సర్వవిధముల వేధించు చుంటివిగదా? (ధర్మరాజు నుద్దేశించుకొని) హా! మహారాజ!

ఉ. ద్రోణము డాంకరించుచు నరుంతుదపూవిశిఖంబుఁబూని దృ
క్కోణము లెఱ్ఱఁబాఱ రిపుకోటిని గాలునిభంగి దీర్ఘని
ద్రాణులఁజేసె ద్రోణుఁడు; విదారితదేహుల మైతిమేము; మా
ప్రాణము లీవ ప్రాపఁగదె ప్రాణునిచేఁ బడకుండ నగ్రజా!

(తెరలో)

క. సంశయమువలదె రాజక
వంశక్షయముఀ బొనర్పవచ్చునె? మానీం
ద్రాంశంబ కావొకో? నీ
"వోం శాంతిశ్శాంతి" చదువకుంటివొ యెపుడుఀ?

కృష్ణు— (విని) ఇవి ఋషులపలుకులు. శాంతి నుపదేశించుచున్నారు. అయి నను విరమించువాఁడు కాఁడు. ఇందుల కుపాయమిది. (చెవిలోఁ జెప్పును)

భీము— కృష్ణా! చక్కనిదారిఁ జూపించితివి. ఘటోత్కచుండు పడినను రాక్షసపుత్రి యున్నదిగదా! ఆమె కతన మనపని సులభముగ సఫలమగును.

హిడిం— (ప్రవేశించి) హా! హిడింబభాగినేయ! హా! పరస్సహస్రమాయావిశారద! హా రాక్షసరాజ! ఘటోత్కచ! నీ మాయలన్నియుఁ గర్ణుని యెడల మాయమయి పోయెనే? దైత్యవిరోధి యగు దేవేంద్రుచండాలుండు నిన్నుఁ జంపుటకై కర్ణుని కాశక్తి యొసఁగియుండును. ఓసీ! కర్ణ! నీనెత్తురు త్రావెదను. నీమాంసము మెసవెదను. (ముందుఁజూచి) వీరె నాపతియు మఱఁదియు నన్నయు నేమేమో యోజించుచున్నారు. వీరి యనుజ్ఞమీద నే కర్ణుం జంపుదుఁగాక. (సమీపించి) ఆర్యపుత్ర! నమస్కారము. కృష్ణా! నమస్కారము.

అర్జు— వధూనికా! నమస్కారము.

హిడిం— సుఖినై చిరకాలము బ్రతుకుము. (భీమునితో) మత్పుత్రఘాతియగు కర్ణుం జంపుటకు నన్ననుమతింపుము. దానంగాని నాకడుపు మంట చల్లాఱదు.

భీము— అందులకు నీ వెందుకు? ఇది వినుము. (చెవిలో నేమో చెప్పును)

హిడిం— (శాంతించి) ఎంతపని? ఇదిగో! నాయనుచరులచే వీరాయాభీష్టము

నెఱవేర్పించుచున్నదానను. తప్పక కర్ణుని జంపించి నాశోకము తీర్తురు గదా! (నిష్క్రమించును)

(తెరలో)

హా కుమార! భరద్వాజకులాంకూర!

చ. వడముడి యెంత చెప్పిన భవన్మృతి నమ్మకపోతిఁ గాని యి
ప్పుడు "నిజ" మంచు ధర్మజుఁడు బొంకనివాఁడు వచించె నక్కటా!
కొడుక! "చిరాయు వౌదు" వని కొండికనాఁ డనినట్టి మింటిచ
ప్పుడు వితయయ్యెనే? వెతలఁ బోయెనె? నా సుకృతంబు లన్నియున్.

కృష్ణు— (విని) భీమార్జునులారా! వింటిరా? ఇఁకఁ గుంభసంభవుం డస్త్ర సన్యాస మొనర్పఁగలఁడు.

సాత్య— (అపటీక్షేపముగాఁ బ్రవేశించి విచారముతో)

చ. "తనయునిచావు సత్య" మని ధర్మతనూజుఁడు వచ్చి చెప్పిపో
యినతరువాత నస్త్రగురుఁ "డీ ధను వేటికిఁ, దూపు లేటి?" కం
చును విడనాడి కొంతవడి సూనునికై వగఁజెంది చెంది దై
వనియతి బ్రహ్మరంధ్రమునఁ బ్రాణము వాసెను యోగపద్ధతిన్.

అర్జు— (దుఃఖముతో) హా! జగదేకధనుర్ధర! హా! పరశ్వతాంతేవాసివిని యుక్తధనుర్వేదసార! హా! శిష్యవత్సల! ద్రోణాచార్య!

ఉ. మంచియుఁ జెట్టయుం గఱపి మాకు ధనుర్ధరు లంచుఁ బేరు దె
ప్పించినవాఁడ వీవ మముఁ బెంచినవాఁడవు నీవ నిష్ప్రపం
చించి యసత్యకల్పన రచించి దురాత్ములమైన మేము చం
పించితి మాసుయోధనుఁడు వెట్టిన పోరొక కారణంబుగన్.

సాత్య— (నిరూపించి తత్తఱపాటుతో) అయ్యో! అయ్యో!

క. కరవాలము గైకొని కం
ధరముం దెగఁగోసె తల యదల్చుచు మొండెం
బరదంబునుండి క్రిందికి
దొరలించెన్ వీని సైఁపఁదురె? పార్షతునిన్.

(కోపముతోఁ బండ్లుగొఱుకుచు) ఓరీ! క్షత్రియచండాల! పాంచాల కులకలంక!

మ. దురహంకార మడంతుఁ గాచికొను మో దుష్టాత్మ! సీ! సీ! యుధి
ష్ఠిరభూపాలుఁడు విన్న నిన్నెడమఱుచ్చెన్ గొట్టకెట్లుండు? భూ

వరులెల్లం గని మెచ్చ ద్రౌపదియు "నీపాపాత్ముఁ డెట్లయ్యె సో
దరుఁ" డంచుం దల వంపఁ బాండవుల కంతస్తోషము న్నింపఁగన్.

(ధృష్టద్యుమ్నునిపై కుఱుకఁబోవ భీముఁడు పట్టుకొనును)

ధృష్ట— (సంరంభముతోఁ బ్రవేశించి) సాత్యకీ! ఊరకున్న కొలఁది నోరికివచ్చిన ట్లెల్లఁ బ్రేలుచుంటివి. కాని యీ మహారథులలో నేరమి కావింపనివాఁ డెవ్వఁడు ?

చ. ఎదుట శిఖండి నుంచుకొని యేసినతూపులచే జయింపఁడే
ముదుసలి భీష్ము నర్జునుఁడు; మూర్ఖ! యెఱుంగమె సౌమదత్తి నీ
చదిపినరీతి; ధర్మజుఁ డసత్యము లాడిన నేటివార్త; మం
చి దనకయుండురే యెవరు చేసినతప్పును వారు దుర్మతీ !

సాత్య— ఓరీ ! బ్రహ్మఘ్నమహాపాతకి! ఇంకను నీతల పగులకున్న దేమి ? నీనాలుక చీలికలు గాకున్న దేమి ? పీనుంగుతల దు్రించిన నడపీనుఁగవు నీ కభిమాన మెక్కడిదిరా ? పాండవస్యాలకుండ వగుటచే బ్రతికిపోయితివి. లేదేని,

క. కౌరవులకుఁ బాండవులకు
గౌరవ మొనరించి ఖ్యాతిఁ గన్న ధరాబ్రం
దారకునకుఁ గావించిన
నేరమికిం బ్రతుకవచ్చునే యొక్కనికిన్.

అర్జు— (నిట్టూర్పు విడుచుచు) పార్షతా ! క్షత్రియోచితము గానిపనిఁ గావించి ద్రుపదకులముఁ గూడ నలుపు గావించితివిగదా !

చ. అనృతము లాడి మేము భరతాన్వయమంతయు నిందపాలు చే
సినయది చాలదే యిటు ఓసీ! దళవాయివి నీవు సేయుదే
ఘనులగురాజులిట్లు శవకంఠముఁ ద్రుంచుదురయ్య! ద్రౌణియున్
జనకపరాభవంబు విని సైఁచునె నీతలఁ ద్రుంప కుండునే ?

భీము— అర్జునా ! మునీశ్వరులు చెప్పవలసిన నీతులు చెప్పుచుంటివి.

చ "అనృతము లాడి మేము భరతాన్వయమంతయు నిందపాలు చే
సినయది చాలదే" యనుచు సిగ్గిలుచుంటివి పాప మీవు; నీ
తనయునియాల్గు లెవ్వనికతంబుననో తెలిపించుకొన్న చ
చ్చినవిత మెవ్వరేని బరిశీలన చేసినఁ బోదు సాగునే?

వాసుదేవు నెదుటఁగూడ ద్రౌణి శ్లాఘునీయుఁ డేమి? మీకంత యనివార్యమైనచో నతని పరాక్రమము నేను వారించెదను రెండు.

చ. ఎఱిఁగి యెఱుంగలేవు మదహీనపరాక్రమ మొక్కవేళఁ గ్రీడిన్
వఱకెదఁ గౌరవవ్రజము, నాశమొనర్చెద నెల్లలోకముల్,
హరిహయుఁ ద్రుంతు, నయ్యనలు నార్పుదు, సంద్రము ద్రమఁడఁజేతు నీ
గురుతనయున్ వృథానుతులఁగూర్చెదు శౌరికిఁగూడ సిగ్గుగన్.

ధృష్ట— (విచారముతో) అర్జునా! మీ కులశీలస్వభావంబు లెఱుంగక బిడ్డనిచ్చి
నప్పుడే ద్రుపదకులంబు నలుపుఁ గావించుకొంటిమి. దానికేమి,

ఉ. బందుగు లంచుఁ దోడ్పడఁగ వచ్చిన పాపమటంది నెప్పుడో
ముందఱ రజ్జులాడఁగఁ బ్రమోదము చెందుట కాక నిందసే
యం దలకొందు రయ్యా! భవదన్యులు కాని యొనర్పఁబోలు మీ
కందనగాయ యాకనకగర్భుఁడు స్నేహము లేని రాతిచేన్.

అదియునుంగాక—

చ. గురుతనయుండు నా శిరముఁ గూల్పఁగఁ జాలినఁ గూల్చుఁగాక నీ
వరయక యిట్లు పల్కఁదగునయ్యా! గురుం గెడపింపఁగాదె య
ధ్వరమున నన్నుఁ గాంచె ద్రుపదక్షితిపాలుఁడు; చంప కుందునే
దురమున ముక్కు మూసికొని దొంగజపం బొనరించు పాతకిన్.

సాత్య— భీమసేనా! నన్ను వారింపకుము. (విడిపించుకొనఁబోవును)

ధృష్ట— రానిమ్ము. నే నొంటిచేతి భూరిశ్రవుండను గానులే రానిమ్ము.

కృష్ణు— సాత్యకీ! ఇంతమాత్రమున కింత వివాద మెంచెదవేల? (వీఁపు
జేయినైచి) ద్రుపదపుత్రా! నా పలుకాలింపుము.

చ. జరిగినదానికై మనము చర్చయొనర్చుట పాడిగాదనం
తరకరణీయ మేమగునో! తండ్రిని జంపిన కిన్కమై ధురం
ధరుఁ డగుద్రోణపుత్రుఁడు వృథా మనసేనకుఁ జేటుఁ దెచ్చుఁ గ్ర
మ్మఱఁ గురుఁబోలెఁ; గావఁ జనుమా! పనిలేని వివాద మేటికిన్?

ధృష్ట— వాసుదేవా! నీవును వీరితోఁ గలిసి నన్నెకసక్కెము లాడెదవా
ఈ ద్రోణపుత్రునకు గీణపుత్రునకును నేను జడియువాఁడను గాను.

(తెరలో)

చ. అనృతములాడి ద్రోణుని గతాసునిఁ జేసిన పాపులార! భం
డనము తొలంగి పోకుఁడు కుఠారము కైకొని రాచపిండు ద్రుం
చిన జమదగ్ని సూతి యనఁ జీమయుఁ దిక్కకయుండ ధర్మపు
త్రునిబలమెల్ల నేనొకఁడఁ ద్రుంచి యొనర్తు నపాండవంబిలన్.

కృష్ణ— (ఆలకించి) పార్షతా! వింటివా? గురువధసంజాతగురుక్రోధంబున నపరరుద్రునివలె నశ్వత్థామ సంగ్రామమున కుఱుకుచున్నాఁడు.

గీ. కల్లలాడి ద్రోణుఁ గడతేర్చితిమి గాని
చావఁడు చిరకాలజీవి యితఁడు
మొనకలంగకుండ మొగియింపు మీ వేగి
తీర్చుకొంద మవల దీనితగవు.

(తెరలోఁ గలకలము)

ఓ కృష్ణార్జునులారా! ఓ వాయునందన! మీ రెక్కడికేగితిరి? ప్రళయకాలహుతవహ జ్వాలాజాజ్వల్యమానం బగు పెనుమంట రణరంగమంతయు భస్మముగావించుచున్నది. రక్షింపుఁడు రక్షింపుఁడు.

ధర్మ— (తత్తఱపాటుతోఁ బ్రవేశించి)

శా. ఓయీ సాత్యకి! పాఱిపోకుమి తఱితో; నో ద్రౌపదీసోదరా!
కాయ మ్మెట్టులొ నిల్పుకొమ్ము చనుమీ; కాలాఁగఁ గాఁ బోకుమీ,
ఈయగ్నిం బడి మ్రగ్గిపోయెదము మేమే యెవ్వరున్; నేఁటితో
మాయాశాలత ద్రెస్సె ద్రోణకతనన్; బాపాత్మకుల్ ద్రుంగరే?

క. ఈఁదితిని ద్రోణభీష్మ మ
హోదధి; "జయమబ్బె" నంచు నుప్పొంగితి న
య్యో దైవమ! గోష్పదమం
దేఁదంగా నొసఁట వ్రాసితే పార్థులకున్?

కృష్ణ— (ధైర్యముతో) ధర్మనందనా! భయపడ నక్కఱలేదు. క్షణమోపిక పట్టుము. (బిగ్గఱగా) ఓ సేనాపతులార! సేనలార! అది గురుపుత్త్రప్రయుక్తమ్మగు నారాయణాస్త్రంబువలని మంట. కావున మీ రందఱు ఆయుధంబులు విడిచి వాహనంబులు డిగ్గి నిటలఘటితకరాంజలులై మ్రొక్కుఁడు. ఇదె మేము వచ్చుచున్నారము. (భీమాదులతో) ఈ నారాయణాస్త్రంబునకు నమస్కారంబు తప్ప నొండు ప్రతీకారంబు లేదు. నమస్కరింపుఁడు. (అందఱు నట్లొనరింతురు)

భీము— అర్జునా! శాపదగ్ధక్షత్త్రియకుల సంభూతుండగు నీ గోపాలుని మాట చొప్పున నీ పౌరుష మేటఁ గల్పుకొందువా? ప్రత్యర్థియస్త్రంబునకు శరణు చొచ్చుట ప్రత్యర్థిని శరణు చొచ్చుట కాదా? (బిగ్గఱగాఁ దెర వంకకుఁ జూచి)

చ. అడఁచెద ద్రోణి సాయకదవానలకీలలు సేనలార ! కే
ల్మొడుపకుఁ డేను వచ్చితి (ధృష్టద్యుమ్నునివంకఁ దిరిగి)
"సమ్మోహను" యంచు విరోధియస్త్రముం
గడచుట పాడి గాదు బలగర్వము చాలినఁ జాలుఁ జాలదే
నడఁగెద మేగుదెమ్ము సమరావనికిం ద్రుపదక్షితీంద్రజా !

(ధృష్టద్యుమ్నుని చేయిపట్టి లాగుకొని పోవుచుండఁగా)

కృష్ణు— (వెంటనేచని పట్టుకొని తత్తఱపాటుతో) అర్జునా! అప్పుడే యస్త్రజ్వాలలితని జుట్టుముట్టుచున్నవి. తదుపశాంతికై వారుణాస్త్రంబు నడ్డంబువైచి ధర్మజాదులతో నీవుగూడ నిటురమ్ము.

క. చేతులు జోడింపింతము
వాతతనూజాతు చేత పడివడిగాఁ; ద
జ్జాతానలమున భస్మీ
భూతుం డగుఁ గానిచో నిముసమునకింకన్.

అర్జు— (అస్త్రప్రయోగము నటించి యట్లొనర్చును)

భీము— (అందఱిని విదలించుచు మ్రొక్కక పెనఁగును)

కృష్ణు— క. ఇదియేమి వెఱ్ఱితన మి
య్యది వారింపన్ వశంబ యైనది యేనిన్
మదమతి మ్రొక్కఁడు మే మే
మదనెఱిఁగి చరింపకున్న ననువులుకలవే ? Policy.

భీము— (అనాకర్ణితముగా నందఱి నీడ్చికొని పోవుచు నిష్క్రమించును)

గద్యం.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు బంచమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః.

# పాండవవిజయము

## షష్ఠాంకము

(అంతట రథముతో శల్యుఁడు ప్రవేశించుచున్నాఁడు)

శల్య— (తనలో) కటకటా ! ఈ దుర్యోధనుండు నారాచకోలమైనఁ దలంపక నా రాచవిద్యయైన గణింపక సూతపుత్రునకు సారథ్యము చేయ నియమించె. ఇందులకు నే నంగీకరించువాఁడను గానుగాని ఱేనివాజ్ఞాధుర్యమునకు లొంగిపోతిని. (సంతోషముతో) ఎల్ల రాజులును విన "వాసుదేవునికన్న ఘనుఁడ" వని రారాజు నుతించుటకన్న జన్మసాఫల్యమేముండును ? (స్మృతినభినయించి) మున్నమోఘవచనుండగు ధర్మరాజు "మామా ! నీకుఁ గర్ణ సారథ్యంబు రాఁగలదు. నాఁడు పార్థునిఁ గాపాడవలయుఁ జుమా" యని పలికిన పలుకులు యథార్థంబులయ్యె. నేను బాండవపక్షపాతినై సమరంబునకుఁ దోడుపడుటకై వచ్చుతఱి మధ్యేమార్గంబున సేవకాకారంబుతో నుచితాతిథ్యంబు గావించు నెపంబున నన్ను వంచించి తనవానిఁగాఁ జేసికొనిన రారాజును వంచించినను దుష్కృతంబులేదు. కర్ణుని తేరు నడపునపుడు సమరోత్సాహంబు పెంచుటకు మా రనుచితంబులాడి కుంచించెదను. ఇదిగోఁ గర్ణునిపటకుటీరము. (పరిక్రమించి) ఎవఁడురా యక్కడ ? రారాజు పంపున మద్రపతి రథచోదకుండై సర్వోపస్కర సంయుతంబగునరదంబుతో మొగసాల నిలిచి యున్నాఁడని చెప్పుము.

కర్ణు— (ప్రవేశించి సంతోషముతో) మద్రేశ్వరా ! ఏమి నాసుకృతము. ఇంక మిత్రకార్యంబు నిర్వర్తించుటకు సందేహమేమి ? (కౌఁగిలించుకొని)

చ. నలువ పురారిస్యందనమున న్నొగ లెక్కినచంద మొప్ప మా
తలి దివిషత్కులాధిపురథంబునఁ జోదకుఁడైనరీతిఁగా
జలజవిలోచనుండు తన సారథిగా నని సేయుఫల్గునుం
దలఁపడఁ బోవు కర్ణునరదంబునఁ జేయుదె సూతకృత్యముల్.

గీ. ఏను మూర్ధాభిషిక్తుఁడ నితఁడు సూత
కులమువాఁడని మది రోయకుము మహీంద్ర !
సూతకృత్యంబు చేయుటచేత నేఁడు
కలుపుకొంటిమి చుట్టఱికంబు మనము.

చ. హరివలె నీవు నశ్వహృదయజ్ఞుఁడవై నొగలెక్కియుండ సం
గరమునఁ గవ్వడింబోడరఁగా నిఁక సందియమేల నాకు; దు
ర్భరభుజవిక్రమంబుఁ బరిపంథికులం బడఁగింతు మద్రభూ
వర ! నరపాలగౌరవ మవంధ్య మొనర్చితి వింత యొప్పదే ?

శల్యు— (పైకి సంతోషము నటించుచు) రాధేయా ! నీవు నుడివినపగిది మన కును మహాత్ములగువారికిని బింబప్రతిబింబభావ మెక్కడిది ? రథారోహకత్వ రథచోదకత్వరూప ధర్మంబుల నుపమ వచ్చిన రావచ్చునేమో !

కర్ణు— (నవ్వుచు) మాద్రిసోదరా ! దేవతలమా టటుంచుము. కృష్ణార్జునుల కైన సాటిరాకుందుమా !

శల్యు— కృష్ణార్జునుల కా దేవతలు సాటియనుటకే నాకు సందేహము. ఇఁక మనమా ?

కర్ణు— (లేని సౌహార్దముతో) సఖా ! అభిమానవంతులగు నీవంటివారి కిట్లు మార్తురం బెద్దగావించి పొగడుట తగవుగాదు.

గీ. చండభుజగర్వమున సవ్యసాచివోలె
నేను సమరంబుఁ గావింపలేనొ, నీవు
తోయజాక్షునివలెఁ దేరు తోలలేవొ
సముల మెటు కాము వారి కో శల్య ! మనము.

శల్యు— సూతపుత్ర ! తోయజాక్షునివలెనో యంత కెక్కుడుగనో నేను రథంబుఁ గడపుదు నేమో కాని యా యర్జునువలె నీవు సమరంబు చేయుటమాత్రము కల్ల.

కర్ణు— మద్రేశ్వరా ! నా భుజబలము నేను బొగడుకొనుట కాదు. చూచె దవుకదా ! కొండంతలు పలికి గోరంతలైనఁ జేయక గతించిన భీష్మద్రోణు లనుకొంటివా యేమి ?

శల్యు— (ఎకసక్కెముగా) చూడకేమి. ఇన్నిదినంబులనుండియుఁ జూచు చుంటిని.

కర్ణు- చ. దవభవకీలజాలము నిదాఘమునందు వనౌఘుమెల్లఁ గా
ల్చువరుస నే మహాహవములో దివినుండి సుపర్వు లెల్ల సం

స్త్రవమొనరింప నొక్కవయసం గడికండలుగాఁగ నేఁడు పాం
డవబలమెల్లఁ ద్రుంతుఁ గురునాథుఁడు పెంచిన యుప్పు దీఱఁగన్.

శల్య— కర్ణా! ఏల నోరికివచ్చినట్లెల్లఁ బ్రగల్భంబు లాడెదవు. జయించ నక్కఱలేదు,

మ. గద చేతంగొని భీమసేనుఁడు మహోగ్రస్ఫూర్తిమైఁ దాఁకుచో
నుదితార్కప్రభ కన్నులం దొలఁక మన్యుజ్వాల దీపింప నీ
నుము రా కవ్వడి వాఁడితూపుగములన్ గుప్పించి నొప్పించుచో
నెదురై నిల్చినఁజాలు నేల యిపు డిస్సీ! యిట్టి యాలాపముల్.

కర్ణ— (తనలో) ఇతఁ డేలొకో మొదటినుండియు నసంబద్ధాలాపములే మొదలిడియెను. ముం దే యపకృతి గావింపనున్నాఁడో! (ప్రకాశముగా కోపముతో) శల్యా! నాకు సారథివై వచ్చి చేయవలసిన యుపదేశ మిదియా? నిన్న నితర సారథ్యంబునం బెక్కండ్రు మహారథులను జయింపలేదా? ఇంత దుష్టబుద్ధివని యెఱుంగక రాజు సూతకృత్యమునకు నిన్ను నియమించుటంజేసి బ్రతికిపోతివి. లేదేని,

క. ఈ కరవాలముఁ గైకొని
నీ కంఠముఁ దునుమకుందునే? యాలములో
నా కరదము గడపుచు రిపు
లోకము నుతియింమనంతలోఁ గపటాత్మా!

ఇఁక నోరు మెదపక తేరు వోనిమ్ము. కాదేనిఁ బ్రాణంబులకుం జెడెదవు.

శల్య— రాధేయా! నేనొర్చిన దోసఁగేమి? సారథికి రథికహితాహితోపదేశంబు కరణీయంబు గావున నుడివితి. నీవు కుపితుండ వైనంతఁ గఱదలు కఱపుటకు వెఱతునా యేమి? కఱపకున్న నన్ను లోకము నిందింపదా? ఇంతమాత్రమునకే యింత కనలెదవు. నే నింకను హంసకాకీయోపాఖ్యానాదికములు పెక్కులు గాథ లుపన్యసించి నీకు హితము చెప్పవలసియున్నదే! దానికెంత కనలెదవోకదా! శాంతింపుము శాంతింపుము.

ఉ. ఉంటివొ లేవొ నీవు నరుఁ డొంటరియై పసులన్ మరల్చి నీ
కంటికడన్ భవత్సహజుఁ గాంచినయప్పుడు; ఘోషయాత్ర నె
న్నంటిన చిత్రసేనునకు చర్వణచేసితి జ్ఞప్తియున్న దే?
గెంటి రిపున్ నృపాలు బ్రతికించె నృపాలుఁడు క్రీడియేకదా!

ఉ. ఫల్గున సాయకాగ్ని శలభంబవు కాకుము సూతపుత్ర ! నీ
వల్గిన నింద్రసూతికి భయంబిసుమంతయు లే, దిఁకాతఁడే
యల్గిన నీకుఁ దప్పదు భయంబు, బపృథాతనయంబుఁ జేయఁగా
కీల్గఁగఁ బోరుదేని జను మే నిదిగో శరదంబుఁ దోలెదన్.

కర్ణ— (పరికించి తనలో) మనశ్శల్యాయమానంబులగు నీతని ప్రతికూలవచనంబులకుఁ దోడు దురుత్పాతంబు లుప్పతిల్లుచున్నయవి. (ప్రకాశము)

మ. హితమంచుం బరుషోక్తులాడెదవిసీ! యీనాఁడు సారాయి త్రా
వితివో? నీకది తప్పుగాదు, పతి నీ విశ్వాసము న్నమ్మి స
న్మతిపంచు న్నిను శత్రుగాఁ బనుప నస్మద్వైరిఁ గొండాడుచుం
గుతుకం బంతయుఁ గూలఁ ద్రోసెదవుగా, కుచ్చెళ్ళలోఁ బామవై.

ఉ. ఆహవమందు నే నొరులయక్కఱఁ గోరను మద్రరాజ! క్రూ
రాహిశిరం బొకంట,జమదగ్ని సుతాస్త్ర మొకంటఁ గృష్ణులం
దేహము బాయఁజేయుదును నిశ్చితమీయది; యెంతగా నిరు
త్సాహునిఁ జేసెదో బగవసంబునఁ జేయుము పల్కులేటికిన్?

శల్య— (కోపముతో) వెలవచ్చినఁ గులకాంతలను గూడ విక్రయించుకొను ప్రజల కేలికనై యంగదేశ మేలు సూతాధముండవు నన్నుఁ గల్లుత్రావితివని యధిక్షేపించినంత నాపరువు పోవునా? వేవురు కర్ణులు వేయి నాగబాణంబులు విడిచినను గిరీటికి భయములేదు. ఈ యసమర్థాలాపముల వలనఁ బ్రయోజనమేమి? పర్యవసానం బే నెఱుంగుదును. చెప్పెద వినుము.

గీ. రథము దిగఁబడదే బవరంబు సేయు
నెడల బ్రాహ్మణశాపంబు గడవఁదగునె,
కలదు భార్గవాస్త్రంబని కులుకుచుంటి
వా పరశురామ శాప మే మానో కర్ణ!

కర్ణ—(తనలో నిర్వేదముతో) అర్జునపరాక్రమప్రశంసకు వెఱవనుగాని నిక్కముగ బ్రాహ్మణగురుశాపంబులకు వెఱచుచుంటిని. (ప్రకాశముగా) శల్యా! నీ భయోక్తులచే జడియువానిని భయపెట్టుము. ఇదిగో, మదీయ దివ్యాస్త్రంబు "లర్జునం డర్జునం" డని నాలుకలుక్రోయుచున్న; వింక నోరు విప్పక యర్జునుదెస శరదంబు దోలుము. (ఎలుఁగెత్తి) ఓ చమూపతులార! ఓ సైనికులార!

గీ. డాఁగియున్నారు కృష్ణపాండవులు జడిసి
సూతసూతి పరాక్రమస్ఫూర్తి కిపుడు

వారుగల తావు చూపిన వారి కేను
పాయసముగా నొసంగెద బహుళధనము.

శల్యు— రాధేయా! నీకింత యపాత్రదానమేల? కృష్ణార్జునుల నొకరు చూపవలయునా? గాండీవవిముక్తశరపరంపరయే వారున్నతావు తెలుపునది. రమ్ము పోదము. (పరిక్రమింతురు)

(తెరలో)

క. నాయందలి యభిమానం
బీయెడఁ బ్రకటింప నెంచె దేనియు నీనాఁ
డీ యవనీపతిపలుకుల
కై యలుగకుమయ్య పేర్మి నారయుమయ్యా!

కర్ణు— (స్మృతినభినయించి సిగ్గఱగా) మిత్రమా! యుద్ధబద్ధాదరం బగు చిత్తమ్మున నొక్కింత విస్మృతికల్గినను నీ పల్కులచే జ్ఞప్తికివచ్చినది. ఇక నితఁడేమన్నను నేను గోపింపను. ఇదె కృష్ణార్జునుల వధించి వచ్చుచున్నాఁడను. (నిష్క్రమింతురు.)

(పిదప గృష్ణార్జునులు ప్రవేశింతురు.)

అర్జు— బావా! గురుపుత్త్రుఁడు మనముగూడ సమసితిమనియే తలఁచెను జుమీ.

ఉ. నొచ్చె శరీరమంతయుఁ దనూరుహకూపములెల్ల విచ్చె నా
కచ్చెరు వయ్యెఁ జచ్చిరి మహారథులందఱు; సేన పాఱఁగాఁ
జొచ్చె భయంబునం; గడుపు చుమ్మలువారఁ దొడంగె నుగ్రుఁడై
వచ్చినకర్ణుచేత మనపార్థివుఁ డెట్టివిపత్తుఁ జెందెనో?

కృష్ణు— కిరీటీ! ధర్మపుత్త్రుని కేమియు భయములేదు. కొంచెము విశ్రమించియే మనము కర్ణు నెదిరింతము. అందాఁక భీమసేనాదులాతనితోఁ బోరుచుందురు.

అర్జు— (లేనిసంతోషముతో) బావా! గురుతనయు పరాక్రమాతిశయంబున కర్థవాదంబుగా ముచ్చటించితినేగాని నీ దయయు గాండీవంబు నున్నంతవఱకు వివ్వచ్చునకు విశ్రాంతియేల?

చ. అరదము సాగనిమ్ము తునుమాడెద మారి మసంగినట్లు మా
ర్తురబలగంబుఁ బట్టుదలతోఁ; గడతేర్చెదఁ గర్ణు; దంతిపై
కుఱుకక మానునే యలసియుండియు సింగము; నేటియుద్ధమే
చిరముగఁ గోరుచున్నదియుఁ జేతికిఁ బండువు దేవకీసుతా!

## షష్ఠాంకము

(చేయెత్తి) ఓ పాండవసేనానులారా! కర్ణసమరోత్సాహ దోహల భుజుండగు వివ్వచ్చుండు వచ్చుచున్నాఁడు. తొలంగకుఁడు (ఎలుగెత్తి) ఓ కౌంతేయమధ్యమ! ఓ వాయుకుమార! ఓ భీమసేన! ధర్మతనయుం డెచట? నీవు కాలినడకం జనుదెంచుటకుఁ గతమేమి? (చెవియొగ్గి) "ధర్మతనయుండు రాధేయకృతపరాభవంబునం జెన్నుమాసి శిబిరమ్మునంక కరిగె. మేము రథాశ్వసూతకేతనంబులు గోల్పోయి డీల్పడియు నెట్లో పెనంగుచున్నార" మనుచున్నారా? (తలపంకించి) వాసుదేవా! పగ్గంబులు సడల విడువుము.

కృష్ణు—మంచిది. ఇదిగో రథ మతిత్వరితంబుగఁ దోలుచున్నాను (అట్లొనర్చును)

అర్జు—(సమరభూమిఁ దేఱిపాఱఁజూచి యాశ్చర్యముతో)

చ. గతపడఁజేయుచుండె గఱకంఠుఁడు చిచ్చఱకన్ను విప్పి యీ
గతిఁ జనుదెంచెనో యనఁగఁ గర్ణునిఁ జూచితివే ముకుంద! నేఁ
డతని జయింపలేము మనమార్వురముం గడతేఱకుండఁగా
బ్రతికిన చేపటం బడయనచ్చు జయ మ్మరదంబు ద్రిప్పుమా.

కృష్ణు—హరహరా! (చెవులుమూసికొని) అర్జునా! నీ నోటనుండి యెన్నఁడును వెలువడని మాటలు వెలువడుచున్నవి. ఈపుమాత్ర మీ కర్ణుఁ డేమగును?

అర్జు—అట్లుకాదు. నేఁడు కర్ణుఁడు వరప్రసాదిగా నా కంటికిందోఁచుచు న్నాఁడు.

గీ. మట్టమధ్యాహ్నమందున్న నెట్ట సర్వ
కాలములయందుఁ గల్గునే ఖరకరునకు
మరలఁజనుదెంత మొక్కయామంబు గడపి
తేరు మరలింపుమో వాసుదేవ! యిపుడు.

కృష్ణు—అటులేనిఁ గర్ణకృత గురుపరాభవంబున వందురు ధర్మపుత్రు కుంమఁ దీర్చు నెపంబునం బోయి కించిత్కాలము విశ్రమింతము. రమ్ము.

(పరిక్రమింతురు)

(పిదపఁ బరాభవక్లేశ మనుభవించుచు ధర్మరాజు ప్రవేశించును)

అర్జు—ఎవఁడురా యక్కడ? అన్నగారితోఁ గృష్ణార్జునులు వచ్చిరని తెల్పుము.

ధర్మ—(విని తనలో) మాతమ్ముఁ డాజన్మపాండవద్వేషియగు కర్ణునిం దెగటార్చి నామనోవ్యథ దీర్ప రానోపు. (సంబరముతో నెదురుకొని కౌఁగిలించి పరికాశము)

ఉ. ఎన్నఁడు కర్ణుఁ డీల్గు? మన కెన్నఁడు యుద్ధభరంబు తీఱు? నా
కెన్నఁడు సంతసంబు ఘటియించు? నిఁకెన్నఁడొకెన్నఁ డంచు నా
పన్నుఁడనై మురారి పదపద్మము లాఱని భక్తిఁ గొల్వ నా
చెన్నఁటి నేఁటికిం దెగుట చేకుఱెనయ్య యనుంగుఁ దమ్ముఁడా!

కృష్ణ— ధర్మపుత్రా! వాఁడెన్నఁడు మీతోఁ బగగొనెనో నాఁడే గతాసుఁ డయ్యెను.

ధర్మ— (నిట్టూర్పునించి) వాసుదేవా! వాఁడు నన్నుఁ బఱచినపాట్లు మఱచెద నన్నను మఱపురాకున్నవి. జూద మాడించుట, ద్రౌపదిని భంగపఱచుట మొదలగు నెగ్గులటుండనిమ్ము.

ఉ. మీ రెడయైనకాలమున మీఁదికివచ్చి పిడెంబుఁ ద్రుంచి నా
తేరును సారథిం దునిమి దీప్తశరంబులఁ గాయ మత్యసృ
గ్ధారలు గాఱుగాయములుగా నొనరించియుఁ జంప కెన్నియో
నోరికి వచ్చినట్లు లని నోవిడచెం బలుపల్కు లేటికిన్ ?

అర్జు— (దుఃఖముతో) కడచిన పనికి వగచిన ఫలమేమి? మేమిందఱ మున్నను డమకుఁ బరాభవంబు రాకుండఁ జేయ లేక పోతిమి.

చ. కురుపతియొద్ద నిన్నుఁ గయికోఁగఁ బ్రతిజ్ఞ యొనర్చినట్టి యా
గురుఁడు పరాభవింప నను గొంటిమి నాఁ డది యీఁగి తెట్లో సా
గరములఁ బెద్దయేఱులును గాల్వలు బోదెలు దాఁటి యింటిముం
దటి చిఱుగోతిలోఁ బడిన నావికుచందము వచ్చె నక్కటా!

కృష్ణ— విధిదురతిక్రమణీయతం జేసి యొక్కొక్కతఱి నిట్లే తలఁపరాని యవస్థలు తటస్థించుచుండును.

ధర్మ— కృష్ణార్జునులారా! ఏల యప్రస్తుతవిచారము? ఏల గతజలసేతుబంధనము?

చ. అలయదు మీశరీరమిసుమంతయు; శూరుని ద్రోణిసేయునా
తులపబలంబునం గెలుపు దుర్లభ; మేగతి వాఁడువచ్చెనో
పలుఁకుఁడు నాదుహీనులకుఁ బండువు సేయుఁడు వానిరూపు క
న్నులనిదె వ్రేలుచున్నది మనోధృతి చాలనిభీతి పెంపునన్.

అర్జు— (తనలో) ఈయనఘుండు కర్ణుఁడు తెగటారె ననియే తలంచుచున్నాఁడు. (ప్రకాశముగా వినయముతో) అగ్రజా! మీకు భీమసేనుఁడే తమ్ముఁడు. కాని నేను గాను. గురువధజనితద్విగుణీకృత క్రోధాతిశయంబున మొన్నటి నుండియు నశ్వత్థామ మండిపడుచుఁ దఱచు నన్నుం దాఁకుచుండును. నేఁడెట్టకేలకు నతనిఁ గడచి భవదన్వేషణంబు

గావించుతఱి భీముండు మీ పడినపాటు దెలుప దేవరసేమం బరసి పోదు వని వచ్చితిని. నాతప్పు సైరింపవలయును.

చ. సెలవిడి పంపినం గదన సీమకుఁ బోయి విరోధివర్గముం
గలఁచి కురుక్షితీంద్రుసముఖమ్మునఁ గర్ణుని నేఁడు శేలకుం
బలియిడి సూర్యుఁ డస్తగిరిమాటున కేగకమున్న మీ పదం
బులు విలసత్కిరీటమణిపుంజముచేత నలంకరించెదన్.

ధర్మ— (దుఃఖముతో) తమ్ముఁడా ! కర్ణుఁడు భీమాదులనే కాక నన్నుఁగూడ పరాభవించెనని వినియు వానిం జంపక నా సేమం బరయ వచ్చితివా?

చ. సమరమునందు శత్రువులఁ జంపక శత్రులచేతఁ జాక జీ
వము ధరియించి త్రిమ్మరు శవంబగు క్షత్రియజాతివాని సే
మ మడుగనేల ? శత్రుజనమారణకర్మనిబద్ధకంకణ
క్రములగు వారిసేమ మడుగం దగుఁ గాక ధనుర్విదగ్రణీ !

గీ. రాధకొడుకట్లు నన్నుఁ బరాభవించి
నందులకు నేను దుఃఖంబుఁ జెందనకట !
చేతఁ జిక్కిననన్ను హింసింపకుండ
వదలినందుల కేనింక వగవవలయు.

కృష్ణ— ధర్మపుత్రా ! ఏల వృథాప్రసంగంబు గావించుకొనెదవు? సేమ మరయవచ్చుటయుఁ దప్పాయెనాయేమి ?

ఉ. ద్రోణిశరక్షతంబుల భరంపడి యుంటిమి కాన సైనిక
త్రాణ మొనర్ప నీయనుఁగుఁదమ్ముని భీమునిఁ బంచి నీపరి
త్రాణ మెఱింగి సేదఁటి పదంపడి యేగఁ దలంచి నార మీ
ప్రాణముఁ గాచుకోఁదలఁచి వచ్చినవారముకాము పార్థివా !

చ. అలయికఁ గొంటి మేము పదియారుదినంబులనుండి శత్రు దో
ర్బలమునఁగాదె ? కర్ణుఁ డొకపట్టున నిన్నలయించినంతనే
కళవళపాటుతో నొరుల కష్టసుఖంబులు చూడవైతి నేఁ
డలఁతిగఁ జచ్చునయ్య వివిధాస్త్రధురంధరుఁ డాతఁ డల్పుఁడే ?

ధర్మ— కృష్ణా! సమయోచితములగు మాటలతో నేమిలే. కర్ణుఁ డలంతిగఁ జచ్చువాఁడును గాఁడు. ఈయర్జునుఁ డతని జయింపఁ దగినవాఁడును గాఁడు.

చ. అని యొనరింపఁ బోవుసమయంబునఁ "గర్ణుని గెల్చువార లీ
మొన నెవ రంచు నే నడుగ మోసము చేసె నితండు "నేను నే"

నని వను; లేకయున్న విపినాంతరభూమికి వచ్చి తాఁక నే
ర్చునె? నిశితాంబకంబులను వారిక్షులీసుని పోటుమాటలున్.

చ. కొడుకులనిర్వురన్ గనియెఁ గుంతి మనున్; బయి కాను పక్కటా!
పడుచయి పుట్ట కేల మగవాఁడయి పుట్టెనొ, పుట్టఁగాక ము
న్నడఁగిన పుంస్త్వ మేటికి బయల్పడెనో? పడుఁగాక యారకీ
బడుగు కరంబు గాండివము పట్టఁగ నేఁటికిఁ? జెప్పు మచ్యుతా!

హా! పితృవత్సలులారా! అభిమన్యు ఘటోత్కచులారా!

మ. పినతండ్రిన్ సహదేవునిన్ నకులునిన్ బెత్తండ్రిని న్నన్ను దు
ర్జనమూర్ధన్యుడు కర్ణుఁ డట్టులు ధనుర్జ్యాబంధనోచ్చండ వా
ఘనిర్ఘాతములన్ గలంచి బ్రతుకంగా నేర్చునే? యింత ద
క్కను మీరిర్వురొ యొక్కరో తుదకు సంగ్రామంబునం దుండినన్.

అర్జు— మహారాజా! సర్వధర్మంబు లెఱింగిన తమరే యీలీల నశ్లీలోక్తులు పలికినఁ గాదనఁ జాలువా రెవరు?

ఉ. చంపెద నంటిఁ, జంపెద విశాంపతు లందఱు చూచుచుండఁగాఁ
బంపుఁడు మమ్ము, భీమునకు భార మగుం గదనంబు, చాలు మీ
తెంపును జంపు, జామునకు దెల్పెద మద్భుజవిక్రమంబు, మ
న్నింపుఁడు తమ్ములందు దయ నింపుఁడు ద్రెంపుఁడు కోపవల్లికన్.

ధర్మ— అర్జునా! మరల నాముం దేటికి మగబీరము లాడెదవు?

ఉ. కుంభభవుండు నీవలనఁ గూలెనొ? భీష్మునిఁ గూల్చి విక్రమో
త్తంభన మాచరించితివొ? తామరసాక్షుని తోడులేక యా
శంభువరప్రసాది యగు సైంధవుఁ దున్మితొ? నీవు సంగరా
రంభమునుండి యిందనుక ద్రచ్చిన శూరుల పేరు దెల్పుమా!

నీచేతం బడుటచే గాండివంబుపరువును నీకు సారథియగుటచే హరి మర్యాదయుఁ గూడ రూపు మాసినవి.

క. రథియై తామరసాక్షుఁడు
ప్రథనము గావించు గాండివంబొసఁగుము సా
రథివై వడపుము లే రీ
విధమునఁ గర్ణుండు త్రుంగు వీరమ్ము వ్యా!

అర్జు— (కోపముతో వాలుఁజెఱికి) కృష్ణా! ఇందుల కే మందువు?

ఉ. మాలిమి మాలి యీతఁ డనుమాటలకన్నిటి కింతసేపు నేఁ
దాలిమిఁ బూనియుంటి నికఁ దమ్ముఁడఁగా నితఁ డన్న గాఁడు వా

య్యేల "శరాసనం బొరులకి" మ్మను నెవ్వఁడు; వానికంత మీ
వాలునఁ ద్రుంపఁగాఁ బ్రతిన వట్టితిఁ గావునఁ ద్రుంతు నీతనిన్.

(ధర్మరాజుమీఁది కుఱుకఁబోవును)

కృష్ణు— (నవ్వి) పార్థా! ధర్మపుత్రునిం జూచి కర్ణుఁ డనుకొంటివా యేమి?

ఉ. అన్న జగత్ప్రసిద్ధుఁడు మహాత్ముఁడు ధర్మపరుండు సత్యసం
పన్నుఁ డుదారమానసుఁడు వైరిపరాభవఖిన్నుఁ డౌచు ని
న్నన్నవి పాటిగాఁ దలఁతు రయ్య! ప్రతిజ్ఞ విరోధిమీఁదఁ గా
కెన్నక యన్నదమ్ములపయి న్నెఱవేర్తురటయ్య? ఫల్గునా!

అందును సూక్ష్మధర్మ మాలోచింపుము. హింసావిషయిక ప్రతిజ్ఞ నెఱవేర్పకున్నను పాతకంబు రానేరదు. అదియునుంగాక ద్రోణవధోపాయోపన్యాసంబున మన మయ్యనఘున కుపదేశించిన పలుకు లప్పుడే మఱచితివా?

అర్జు— (యోజించి) కృష్ణా! నే నేమి తప్పుచేసితినని నా గాండీవం బొరుల చేతికిమ్మనెను? (ధర్మరాజుం జేయెత్తి పొడుచుచు)

ఉ. ద్యూతములోన రాజ్యము సుయోధనుపా లొనరించి కానన
వ్రాతము లేలఁబోయిన గరాసవు నీ వని రేగ నేల? రా
ధాతనయాశుగోత్కరవిదారితవిగ్రహ తాగ్రహంబునన్
నీతిదొరంగ నేల? నను నెట్టనఁ దిట్టఁగ నేల? ధర్మజా!

సీ. నీమూలముననఁగదా! నెలఁతుకఁ గొల్వులోఁ
గారానియిబ్బంది కలిగె నాఁడు
నీమూలముననఁగదా! నిన్న మొన్నటిదాఁకఁ
బడరాని యిక్కట్లు పడితిమేము
నీమూలముననఁగదా! నిలువ నీడయులేక
గొంతి మా త్తురయింటఁ గుడువవలసె
నీమూలముననఁగదా! నేలఁబాసితొలంగె
పదిపదాఱేండ్లు నెంబడిన కొడుకు
భరతకుల గౌరవంబును బాండురాజు
గౌరవంబును దమ్ముల గౌరవంబు
వో నడచెనార! నీ పాఱుఁబోతుతనము
దళితనిజయోధబలతేజ! ధర్మరాజ!

కృష్ణు— ధనంజయా! భ్రాతృవధోత్సాహ మింకఁ జాలింపుము. నీవంతము చెల్లెఁగదా!

క. అక్కసమునఁ జంపెదనని
నిక్కముగాఁ బంతమిడి తము నిందించినచోఁ
జక్కాడుటయే యగునని
వక్కాణించెదరు పెద్దవారు కిరీటీ!

ధర్మ— గోవిందా! ఏల వారించెదవు? కత్తి దూయనిమ్ము. కంఠము దునుమనిమ్ము.

గీ. సోదరుల బాధపఱచిన సూడుకాఁడు
పాతకుఁడు ధర్మరాజేల బ్రతుకవలయుఁ?
"గర్ణునకుఁజాల కన్న నే కసిమసంగె
బళిర!" యని పేరువడుత నీ బావమఱఁది.

అర్జు— (పశ్చాత్తాపముతో) కృష్ణా! ఏ నిప్పు డగ్రజుం గినిసి పలికిన యప్రియంబులకును నిందనుకఁ గర్ణునిం జంపకుండుటకును దగిన ప్రాయశ్చిత్తంబుగా నా గొంతు కోసికొనియెదను. (కోసికొనఁబోవును)

కృష్ణు— (వారించి) విజయా! మతిభ్రంశమాయెనా? గ్రహగ్రస్తుండవైతివా? లేక కర్ణు నెదిరించుటకు జంకుచుంటివా?

అర్జు— అయ్యా! త్రిశూలపాణి యగు శంకరుండు వచ్చినను నే జడియువాఁడఁగానని యెఱింగియు నన్ను నెల్లిదము సేయుచున్నావా? యాగార్థం బగు హయంబుతో సప్తద్వీపాక్రాంతం బగు భూచక్రం బంతయుఁ దిరిగి యీ ధర్మనందనునిచే రాజసూయంబు చేయించినవా రెవరు? ఈ మహారణంబునం గించిదవశిష్టంబుగాఁ ద్రిగర్తసేన నంతయుఁ జిందఱవందఱ గావించినవా రెవరు? మున్నుత్తరగోగ్రహణకాలంబున ద్రోణకృపాశ్వత్థామకర్ణదుర్యోధనదుశ్శాసనప్రముఖమహారథికుల యుష్ణీషంబులు తెగఁగోసి యుత్తరకు బొమ్మపొత్తికలకై తెచ్చియిచ్చినవా రెవరు? మదీయ గాండీవ ప్రయుక్త శరధారచేఁ గురుసేన యెట్లు పీనుఁగుపెంటలై యున్నదో కన్నులున్నవానికిఁ దెలియఁగలదు. కానీ, సూతాత్మజునిం దునిమిన పిదపనే ప్రాయశ్చిత్తంబుఁ గావించుకొనెదను. (ధర్మరాజు దిక్కు) దేవా!

చ. కలువలదాయ యస్తగిరి గహ్వరమున్ జొరకుండఁ గర్ణునిం
బలుగురలోనఁ జంపి మురవైరి కొసంగెద గాండివంబు; నా
పలుకులు విశ్వసింపుము, సభాజనయోగ్యుని నిన్నుఁ గిన్కమైఁ
దెలియక కొన్ని కార్లఱచితిం, గరుణింపుము నీకు మ్రొక్కెదన్.

కృష్ణు— (చిఱునవ్వుతో) అర్జునా! కర్ణవధయే యవశిష్టముగాని యాత్మహత్య నిప్పుడే జరపితివి. ఆత్మస్తుతి యాత్మహత్యతో సమానమయినదే గదా!

ధర్మ— అర్జునా! నే గరుణించుటకు నీచేసిన యపరాధ మేమి? నీ నుడివిన పనులలో నేను జేయనివేవి? ఎన్నితప్పులేనియు నాయందే కలవు.

ఉ. ఏ ననమర్థుడన్ ధరణి యేలగ జాలదపోనిరూఢికై
కాననసీమకున్ జనెద గర్ణుని ద్రుంతువో? కర్ణుచేత నే
ప్రాణము గోలుపోయెదవో? భండనభూమి బరిత్యజింతువో?
పూనినమానమున్ విడిచి పోయి సుయోధను నాశ్రయింతువో?

(దిగ్గున లేచి పోవును)

కృష్ణు— (పట్టుకొని) ధర్మపుత్రా! ఎవరిమీద నీ యాగ్రహము? నిజముగా రాజ్యమేలుట కంగీకరింపవేని,

చ. అనుజులచేత శత్రువుల నందఱిని గెలిపించి నాయునం
దను నవనీంద్రు జేసి విపినంబుల కేగుము సంగరంబు కో
రి నడుమ మాన్పగా దలతురే నృపవీరులు? రాజు లేచి పో
యిన బగవారికిన్ విజయమే యిక దక్కురు పోర నేటికిన్?

ధర్మ— వాసుదేవా! నే నీసంగరంబు మాన్పుట కిది యేను బ్రవర్తింప జేసినదా?

చ. సంధియొనర్తు మన్నను దిసంతులు గొట్టినవారు లేరె? గ
ర్వాంధులు నీవెఱుంగవె? జయాపజయంబులు నావి కావు ని
ర్బంధముచేతఁగాదె సమరంబునకుం దల యూఁచె వీతసో
ర్గంధుఁడు ధర్మరాజు కృతకప్రభునామఁడు బంధుకోటిలోన్.

అర్జు— (సిగ్గుచే దలవంచుకొనును)

కృష్ణు— నిర్బంధముచేత నే నేటి కీ పయనము మానుము. ఈ తప్పులన్నియు నావిగా దలంచి దయాంతఃకరణంబున నన్నుజూడుము. నీ కివే పదివేల వందనములు. (మ్రొక్కును)

ధర్మ— (లేవదీసి ప్రసన్నతతో) కర్ణశరాహతుల కాహుతులగు నవయవంబుల వలని వికారంబునం గలుషితహృదయుండ నగుటం జేసి-

క. అన రానిమాట లని త
మ్ముని నిన్నుంగలఁచి నింద మోపితి నా చే
సిన నేరము నీ వెన్నక
మన మఱవఁగవలయు నిక్కముగ మహితాత్మా!

కృష్ణు— అర్జునా! తలయెత్తు, యింకను విషాదపడియెదవేల? మీయన్నగారి ముఖప్రసన్నభావ మాలోకింపుము. (చిఱునవ్వుతో) మా పుణ్యము కతంబున మీయన్నదమ్ము లిరువురును బ్రతికితిరి.

అర్జు— (తలయెత్తి) అగ్రజా! నాతప్పులు సైరింపుము (కన్నీటితో మ్రొక్కును)

ధర్మ— (లేవదీసి) తమ్ముఁడా! నన్ను మన్నింపుము. (కన్నీటితోఁ గౌఁగిలించును)

కృష్ణ— (నవ్వుచు) బావలారా! యిఁక నేడ్పు లుడిగి కర్తవ్యమాలోచింపుఁడు (ఇరువురను విడఁదీయును)

ధర్మ— (చేరఁదీసి) తమ్ముఁడా భరతవంశోద్దీపక! నామాటట్టు లుంచుము.

గీ. "ఒడలు గడు నొచ్చెనయ్య! సుయోధనుండు
నొడువుమనఁబోలు నన్నుఁ గర్ణుఁడు నొడిచిన
వింటి పోటుల; నింక నాకంటినీరు
దుడువఁ దగుఁజుమి కర్ణునిఁ దునిమి నేఁడు"

అని కడగొట్టు తమ్ముఁడును-

గీ. "వెంటఁబడి వింట నాకంత మంటఁదూర్చి
వెన్కకుఁ దీసి వదరులు వేయి వదరి
'పొమ్మనియె దిక్కుగల్గినపొంత'
కవ్వఁ; డయ్యధముఁజంపి నా తాపమార్పుమయ్య"

అని పెద్దతమ్ముఁడును నాముఖమ్మున నిన్నుఁ బ్రార్థించుచున్నారు.

చ. వడముడి నాల్కఁ గోయఁ జని వానికి వాఁ డొనరించినట్టి యా
గడమున కెన్నిరెట్లొ ప్రతికారము చేసికొనెన్ సమర్థుఁడా
తఁడు నినుఁ బోలె; మా ముగుర తాపము వాపఁగదయ్య; పేర్మి ని
ప్పుడ చని వానిఁ ద్రుంచి; నిను మ్రొక్కఁగఁ రా దివె కొమ్మ దీవనల్.

అర్జు— అన్నా! ఒక్కరని వక్కాణింపనేల? మన మేగురమును వాని యవమానము నంతో యింతో పొందినవారమే. (క్రోధముతో) దేవా! నీపాదములతోడు. నేఁడు కర్ణునిం దునుమకున్న మాతాపితృగతులకుం దప్పువాఁడ. (వినయముతో) నన్ను దీవింపుము.

ధర్మ— (సంతోషముతో) కృష్ణార్జునులార! మీకు జయ మగుఁగాక.

క. విజయుఁడను నీదు నామం
బజయ్యుఁ డగుకర్ణు నిపుడ యనిఁ ద్రుంచి జయ
ధ్వజ మెత్తించి సమస్త
ప్రజకును మాకును మహోత్సవప్రద మగుతన్.

కృష్ణు— పోయి వత్తుము రమ్ము. (కొంతవఱకరిగి) ధర్మనందనా! నీవిటనుండి చూచుచుండుము. మా రాకకై వడముడి వేచుచున్నాఁడు.

(నిష్క్రమింతురు)

ధర్మ— (తనలో) ఏమగునో? జయాపజయమ్ములు దైవాధీనమ్ములుగదా?

ఉ. అమ్ములకూర్పునందలిరయంబున లాఘవమందు బాహుద
ర్పమ్మున నస్త్రశస్త్రముల ఫల్గునునిన్ గయికోఁడు వాఁ; డిఁకన్
దమ్మునివంకఁ గృష్ణునిసుతారము కర్ణునివంక విప్రశా
పమ్మును నామదిం దిగులు వాపుచునున్నవి కార్యసిద్ధికై.

(తెరలో)

క. ఒక్కరుఁడయయ్యొ వడముడి
జక్కాడఁ దొడంగె సేనఁ; జంపుఁ డితనితో
నుక్కడఁగుదు రప్పాండవు
లక్కడికిన్ వేగ మేగ నగు మనమెల్లన్.

ధర్మ— (విని) రాజు పురికొల్ప శకుని వృకోదరుం దాఁకుచున్నాఁడు (నిరూపించి) ద్యూతం బుగ్గడించి తమ్ముఁడు విజృంభించిన నుక్కడఁగి తేరుపై నొరిగినాఁడు. "స్వకులక్షయహేతుస్సాయ" యని వీనిచేతనే ధృతరాష్ట్రునికొంప కీ గతి వచ్చినది. వీనికిఁ జక్కని ప్రాయశ్చిత్తము జరిగినది.

(తెరలో)

ఉ. ఉమ్మలికమ్ముఁ దీర్చుకొనుచుండెఁ గటా! పవమాన సూతి రా
తమ్మునిఱొమ్ముఁ జీరి బెడిదమ్ముగ వెచ్చని నల్ల ద్రావుచుం
బొమ్మల పోలికం గడలఁ బొంచెదరేల నరేంద్రులార! నీ
నమ్మక మంతయుం దెలిసెనా? యిఁక నేనికి సూతనందనా!

ధర్మ— (సంతోషముతో) కర్ణుఁడు చూచుచుండగనే పెద్దతమ్ముఁడు కృతకృత్యుండయ్యె. నిఁకఁ జిన్నతమ్ముఁడుమాత్రి మేలకాకుండును? నేఁటికి దుర్యోధన మాయాఘటిత్వికయం దొకకో డూడినది.

(దృష్టినించి యేవముతో)

ఉ. అక్కసుదీఱ రాజసతి నంతలుచేసిన వానివక్షముం
జెక్కలుచేసిన న్వగవఁ జెల్లదు గాని. తదీయ మాంసముం
గుక్కలు నక్కలుం దినవు క్రోలరు నిక్కము వానిరక్తముం
రక్కసు; లక్కటా! రొటులఁ బావితి జేసము శేక తమ్ముఁడా!

(మఱియొకవంకఁ జూచి) పిన్నతమ్ముఁడు కర్ణుఁడు చూచుచుండఁగనే వృషసేనుని తల డొల్లనేసె (యోజించి) ఈవధ కర్ణవధానంతరము కాఁదగినది.

తే. గీ. ఉన్నదే నేఁడు క్రీడికి మొన్న సింధు
రాజు నడఁచినయంత పరాక్రమంబు
యోగికైనను బంధువియోగదుఃఖ
జనితతాపంబు కోపంబుఁ బెనుచుఁగాదె!

(తెరలోఁ గలకలము)

ధర్మ— పుత్రవధజనితామర్షమ్మునఁ గర్ణుఁ డాగ్నేయాద్యస్త్రమ్ము లుపయోగింపఁ దమ్ముఁడవలీలగాఁ బ్రత్యస్త్రప్రయోగంబున వారించుచున్నాఁడు.

(తెరలో)

స్యందుల కీ దురాశ; మనమిందఱముం గన దుస్ససేను న
స్పందితుఁడై విచిత్రవధ సల్పె బకారి; యతండు చూడఁ ద
న్నందనుఁ డీల్గుటం, వినెడు నానుడిఁ గర్ణుఁడుఁగూడ; నిప్పుడే
నిం దగదే యమాత్మజుని నెయ్యముఁ దియ్యము రాజనందనా!

ధర్మ— (విని) అన్నప్పుడన్నను గురునందనుఁడు విగుల దయాళుఁడు. ఈ తులువ మది కీపథ్యవాక్యము లెక్కౘవు.

(తెరలో)

క. మామయు నీవును బ్రిదుకుఁడు
సేమముగాఁ; జావులేని చిరజీవులుగా,
మా మాట కేమి, చత్తుమొ?
యేమగుదుమొ? దైవలిఖిత మెట్లున్నదియో!

ధర్మ— (విని) ఆ! నే ననుకొన్నటులే జరిగినది.

(తెరలో)

గీ. మేటివిలుకాఁడవయ్యును నూటిదప్పి
యస్త్రసంధాన మొనరించి తనుచుఁ బైని
యమరు లదె నవ్వుచున్నవా రహిశరంబు
పరువు వోఁగొట్టె దిట్లని యరసివిడుము.

ధర్మ— (విచారముతో) మద్రేశ్వరా! సత్యసంధుఁడవుగాన నీవన్నచొప్పున సాయమొనర్చుచున్నావు. మా యదృష్ట మెట్లున్నదో? (సంతోషముతో) బ్రదికితిమి. చక్రి యేదో యుపాయము చేసియుండును.

లేనిచోఁ గిరీటము మాత్రమే హరించి యూరకుండునా? వీఁ డింద్రదత్తమగుశక్తి నేనాఁటి కానాఁడు తమ్మునిపైఁ బ్రయోగింతునని సుయోధనుతోఁ జెప్పియు మఱచిపోవు వాఁడఁట. ఇది యంతయు వాసుదేవు ననుగ్రహమే. (విచారముతో) హా! కిరీటరాజమ!

చ. గొనబు ఘటిల్లఁ జేసె ననుకూలనివాస మొసంగి యింద్రుఁ డ
ర్జునుతల నీకు; దాని విడఁ ద్రోచెనె పాపపుఁ బాపఱమ్మ, తె
ల్లనితలపాగఁజుట్టునె విలాసచలన్నవరత్నకాంతివ
ల్గన విలసత్కిరీటసహకారము కల్గిన క్రీడిమూర్ధముల్.

(తత్తఱపాటుతో) ఏమీ! యీ పాపపుఁ శాపఱమ్మ శాంతించియు విషమజ్వరముంబోలె మరల వెనుకకు విజృంభించుచున్నదే. ఇది యిట్టిది కావుననే ఘటోత్కచునిపై దీనిం బడవేయక తమ్మునికై దాఁచి పెట్టినాఁడు. ఇదిగాక యాశక్తి యింద్రదత్తం బగుటకూడ వీనికి సందేహకారణము గాకపోదు. పాపము శాంతించుఁగాక. ఇఁక నిది యేమి చేయఁగలదు? (నిరూపించి) దీనికై తమ్ముని కాఱు దొడ్డ నారసములు వ్యయమైనవి. (యోజించి) కర్ణుఁడు భార్గవాస్త్ర ముపయోగింప లేదేమో! పాపము! శాపోపహతుఁడెట్లు ప్రయోగింపఁగలుగును. (స్మృతి నభినయించి) బ్రాహ్మణశాప మేమయ్యెనో!

(ఆకసమున)

క. అరదంపుఁ జక్రమది భూ
సుర శాపముకతనఁ గ్రుంగు సురనాథసుతుం
డఱలేక వీనిశీర్షము
నఱుకంగలవాఁడు వాఁడి నారాచముల౯.

ధర్మ— (విని) ఇఁక వీనిభయము లేశమేని నాకుండదు. కాన దరికరిగి వీనివధ కన్నులారఁ గాంచెదఁగాక. (నిష్క్రమించును)

(అంతఁ గృష్ణార్జునులును గర్ణశల్యులును బ్రవేశింతురు.)

కర్ణు— (భుజముతోఁ జక్రము నెత్తుచు) పార్థా! ముహూర్తము శరప్రయోగ మాపుము.

వ. అరదము నేలఁ గ్రుంగె రథమం దొక, రొక్కరు నేలమీఁద సం
గర మొనరింతు రెట్లు? త్వరగా రథచక్రము లెత్తుకొందు, వీ
తరథునితోడఁ బోరుట యధర్మము కావునఁ జెప్పుచుంటిఁ గా
ని రథము లేకపోయినను నీకును కొరికి జంకి కాదు సూ!

కృష్ణు— ఏమి రాధేయా! చిన్ననాఁడు చదివిన ధర్మశాస్త్రము నేఁటి కాదకు వచ్చెనా?

గీ. ధర్మమతులైన మా పాండుతనయు లేవు
రకు శుభంబగు మీ కందఱకును గీడు
వచ్చు; వచ్చునుగాక కవ్వడికిఁ గరుణ
వచ్చునే దయ మృత్యుదేవతకుఁ గర్ణ!

కర్ణ— కృష్ణా! ఇందు శుభాశుభంబుల ప్రస్తావన మేమున్నది? రణ ధర్మము కావున నుడివితిని. నిలిచిన నిలువుఁడు. లేదేని మీరును గ్రిందికి దిగుఁడు. గదాయుద్ధము చేయుదము.

కృష్ణు— కర్ణా! నీ వేపాటి రణధర్మము లనుష్ఠించితివి? సిగ్గులేక ధర్మముమాట తలపెట్టెదవు. మాకు మారణధర్మంబులు తప్ప మీ రణధర్మంబులతోఁ బనిలేదు.

ఉ. పెల్చనఁజాలకాలమునఁ బెక్కురు గూడి ధనంజయాత్మజుం
గూల్చుట ధర్మమా? కొడుకుఁగుఱ్ఱల గొంతిని లక్కయింటిలోఁ
గాల్చుట ధర్మమా? కనులు గానక ద్రౌపది చీరలెల్ల నాఁ
డొల్చుట ధర్మమా? యల దురోదరమండలి గెల్పు ధర్మమా?

(లజ్జించుచుఁ దనలో) హా దైవమా! నాయొనర్చిన సుకృతము లన్నియు నెచట దాఁచితివి? కర్ణ నీరీతిఁ బౌరుషము లేని చావు చంపెదవా? (కన్నీరు తుడుచుకొనుచు ప్రకాశముగా సారథితో) మద్రేశ్వరా! అరదముమీఁది గదాదండ మందిమ్ము.

మహాస్రగ్ధర.

తలఁకుం దిగ్దంతులెల్లం; దలఁకుఁ గులగిరుల్; తారలల్లాడు; బృథ్వీ
తలమెల్లం గ్రుంగుఁ; గాకోదరపతియును మత్పార్ష్ణిఘాతంబుచేతన్
దలలెల్ల న్వంచు; నీ శాత్రవబలములు భీతంబులై పాఱు; వార్ధుల్
గలఁగుం; గర్ణుండు కేలం గదఁగొని సమరోత్కంఠమైఁ బోరువేళన్.

శల్యు— అంగరాజా! నీ గదాయుద్ధప్రశంస యెగ్గెత్తి చెప్పకుము. భీముండు వినును.

ఉ. "నాగశరంబు నూటి చెడె నాపవచనంబులు నమ్మ" మంచు నే
ప్రోగఁగవింటివే? యింక నరుం బరిమార్చుట కేదిదిక్కు? నీ
యాగడ మింత చేసెఁ బోలుపారఁగ నేర్చిన వింటి విద్యయే
యీగతి నుడదాఁగాఁ జెలియం మేమగునో? గద చేతఁ బట్టినన్.

కర్ణు— శల్యా! ఎన్నఁడును గొఱగాని పల్కులే పలికితివి. మణి యనికొని యగ్నికణముం గేలఁదాల్చిన నాకుం దగిన శాస్తి చేయుచుంటివి. రోగగ్రస్తునకుఁ బెడవిడిచిన వైద్యునివలె దిగులు నెలకొల్పుచుంటివి.

శల్యు— విషగ్రస్తునకు విభీతకఫలంబులు మధురంబు లగుగతి నీకప్రియవాక్యంబులు గాని రుచింపవు. కానిచో నా ప్రియోపదేశంబు నీకు వెగటగునా?

కర్ణు— అది పరస్పర సమాగమకాల ప్రభావముగాని వేఱుగాదు. ఇఁక నేవియిట్టి కొఱగాని యుపదేశంబు లొనరింపక గద నాచేతి కందిమ్ము.

శల్యు— అంగపతీ! నా పలుకులు విశ్వసింపుము. నీవు గదాపరిశ్రమ మెఱుంగవు. తేరు పెకలించుకొనుము. ఏనును సహాయపడెదను.

కర్ణు— (తనలో) కటకటా! ఈ పాపాత్ముం డూరకుండఁడు. (భుజము మోపి రథచక్రము పైకెత్తుచు) ఇదియేమివింత! నగరారణ్యపట్టణ సముద్రంబులతోఁ బుడమి యెగయుచున్నది గాని రథచక్రంబులు కదలవు. కాలమాసన్నమైనదని తోఁచుచున్నది. హా! దుర్యోధన! నీకుఁ జేయఁదగిన యంత యుపకారము చేసితిని. నన్ను మన్నింపుము. దైవప్రాతికూల్యంబున మడియుచున్నాఁడు గాని కర్ణుఁడు మనుష్యప్రయత్నమున మడియువాఁడు కాఁడు.

(తెరలో)

ఉ. ఓ గురుపుత్ర! యోకృపుఁడ! యోకృతవర్మఁడ! రండు కర్ణుఁడా
లాగున డస్సియుం దనబలంబునఁ గ్రుంగిన స్యందనాంగమున్
లాగినరాక కష్టపడులాగు గనుంగొను చూరకుందు ర
య్యో! గతిమాలువాఁడగునొకో? యిఁక ఱేఁడు హితుండు గ్రుంగుటన్.

కృష్ణు— ఫల్గునా! వింటివా సుయోధనుని పలుకులు. తడయక వీనిశిరంబిపుడే త్రుంపవలయును. లేదేని వా రడ్డమువత్తురు.

ఉ. ఓదము త్రవ్వి కాచుకొని యొద్దకుఁ జేరిన మత్తవేనుఁగుం
బాడలి యెవ్వఁడేని నవపాతమునం బడఁద్రోయకుండునే?
సాదుతనంబు చూపెద వసాధ్యుఁడు వీఁడగు నేఁపు; చాలు నో
హో! దయ; ప్రొద్దు గ్రుంకువడుచున్నది కంఠము దున్ము మర్జునా!

(తెరలో)

ఉ. ఏనిఁక పోయి యా యరదమెత్తెద మొత్తెదఁ బార్థకృష్ణుల
న్మానుమ ధైర్యముం గౌరవమానకు మెక్కటిపోరు పోరుటే

వానితలంపు గానఁ బయివారముగా నిటు లూరకుంటి మీ
దానికినింతఁగా దిగులు దాల్చుట బీరమె కౌరవేశ్వరా !

(అశ్వత్థామ ఖడ్గపాణియై ప్రవేశించి చేయెత్తి)

చ. జడియకుమోయికర్ణ ! రథచక్రము నెమ్మియి నెత్తికొమ్ము నెం
బడిఁ జనుదెమ్ము నీ పడెడుపాటుఁ దలంచి విభుండు "పొమ్ము" నా
వుడుఁ జనుదెంచినాఁడ నినుఁ బ్రోచుటకై ; చనివిశ్రమింపు మే
నడఁచెదఁ బార్థకృష్ణుల రణాహమికత్వ భుజావలేపముల్.

అర్జు— (కృష్ణునితో) దేవా ! అధర్మయుద్ధ మొనర్చుటకుఁ జేతులాడకున్నవి. మది యొప్పదు. నేనేమి చేయుదు ?

కృష్ణు— కానిమ్ము. అశ్వత్థామకర్ణుల సంభాషణము విందము. గురుపుత్రసంవర్త జలధరంబునకుఁ గర్ణుని వాక్యంబులు జంఝామారుతంబులు కాకపోవు.

కర్ణు— (సిగ్గుపడుచు మరలఁ జక్రమెత్తఁ బోవును)

అశ్వ— కర్ణా ! ఏల వృథాప్రయాసము ! క్రొవ్వి తెచ్చుకొనిన విప్రశాపంబు రిత్తవోవునా ? పుడమియైనఁ గదలుఁగాని యీ రథచక్రములు కదలవు. దైవోపహతుండవగు నిన్ను నేఁడు దూఱుట పాడిగాదు.

గీ. పరువుపోయిన మరల రావచ్చుఁగాని
నాశమొందిన మరలఁ బ్రాణములు రావు
తలఁగునీమీఁద భారమంతయును మోపి
ధరణియేలఁగ నున్నాఁడు కురువిభుండు.

కర్ణు— (కోపముతో రథచక్రము విడిచి) గురుతనయా ! వెంగలియగు సుయోధనుండు నిన్ననిపిన ననుచుఁగాత. నీచేతఁ బ్రోవఁబడువాఁ డెవ్వఁడు?

ఉ. ఇచ్చితి నర్థికోటికి మనీషులు మెచ్చఁగ వాంఛితంబు లం
దిచ్చితి మేటిలగ్గులు మహీశ్వరు చేతికి ; నేనుగాంచితిం ;
జొచ్చితి సంగరంబున వసుప్రకరంబుఁ దృణీకరించుచుం
జచ్చెదఁగాక బ్రాహ్మణులసాయముఁ గోరుదు నే రణంబునన్.

అశ్వ— రాధేయా ! "చింతవిరిగినను బులుసు విఱుగలే" దనురీతి నేఁటికిని నీకున్న పట్టుదలకు సంతోషించుచుంటిని. కురురాజున కుపకారము చేయుటయే నాతలంపుగాని నిన్ను బ్రదికించుటగాదు. కానీ నీవుచచ్చిన వెనుక నే వచ్చెదనులే. (నిష్క్రమించుచున్నాఁడు)

అర్జు— సూతపుత్రా! ప్రొద్దు గ్రుంకుచున్నది. నీ కోరినవిధంబున ముహూర్త కాలంబు గడచినది. సంగరంబునకు వచ్చెదవా ? తొలంగిపోయెదవా?

కర్ణు— (రోషముతో రథముమీఁది గదలాగుకొనుచున్నాఁడు)

శల్యు— (గదను మరల లాగుకొనుచు) కర్ణా ! నీకింతలో మానహాని రానేరదు. తొలఁగి చనుము.

కర్ణు— ఛీ ! మద్రేశ్వరా! నీవంటి తుచ్ఛరాజులు చేయఁదగిన పనిగాని నాబోఁటి పోటుమానిసులు చేయఁదగిన పనిగాదు. (గదపుచ్చుకొని అర్జునునితో) ఫల్గునా ! సమస్థలంబున గదచేతనే పోరెదను రమ్ము.

(నిష్క్రమించును)

కృష్ణు—అర్జునా! తడయక వీని శిరంబు వెనువెంటనే వాఁడితూపునఁ దునుముము.

అర్జు— మంచిది. అట్లనే చేసెదను. రథంబటుపోనిమ్ము.

(నిష్క్రమింతురు)

శల్యు— (నిరూపించి) కర్ణుఁ డిప్పటికిని నెట్లు పెనఁగుచున్నాఁడో! (పెడవి విఱచి) ఈ యస్త్రము తప్పక కర్ణుని మస్తకమును దునుమక మానదు. (ఆశ్చర్యముతో) ఔరా! యీ రథచక్రము కర్ణశిరంబుతోడన పైకి నుబుకుచున్నది. (విచారముతో)

ఆ. వె. కర్ణుచావు చూడఁగాఁ జాల కక్కట !
రాజరాజు మొగము తేజమెడలి
దుఃఖసాగరమునఁ దోయంగఁబడియె
ధైర్యంబు చెప్పి యరుల నడఁతుగాక.

(రథముతో నిష్క్రమించును)

గద్య.

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు షష్ఠాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవవిజయము

## సప్తమాంకము

(తెరలో)

ఉ. ఆఱనిలోఁతు నీటికొల నక్కట! పూచిన తమ్మికిన్ విధి
ప్రేరణ రాలిపోయినవి రేకులు తొంబదితొమ్మి; దిప్పు డా
నీరజమందుఁ దా మిగులునే యొక రే, కటు లుండెఁ బో; యహం
కారము లౌనె యా కొలనుగాని సరోజముగాని భూమికిన్.

దుర్యో— (రక్తసిక్తాంగుఁడై తత్తఱపాటుగాఁ బ్రవేశించి, విని, తనలో) ఎవరో నాతండ్రిని నన్నును నెత్తిపొడుచుచున్నట్లున్నది. కానిమ్ము. లోకము నో రెవఁడు కట్టఁ గలఁడు? (యోజించి) ఈ మాటలు నాకు ద్వైపాయనహ్రదంబునకు దారి చూపుచున్నయవి. (పరుగిడి ద్వైపాయన హ్రదముం జేరును.)

(తెరలో)

ఉ. తాతలనాఁటనుండి కడు ధర్మముగా నిల యేలుకౌరవ
వ్రాతము రూపుమాసెఁ గదరా! ధృతరాష్ట్రునిబావవైన నీ
మాతులతాప్రభావమున మాన్యులు పల్కెడు "సర్వనాశకో
మాతుల" యన్నవాక్య మసమంజస మౌనె? తలంచి చూచినన్.

దుర్యో— (విని) అక్కటా! శస్త్రవ్రణంబులకన్నను యీమాటలు వేదనాపాదకము లగుచున్నవే! ఇయ్యవి యెవ్వరివై యుండనోపు? (యోజించి) మఱెవ్వరివియుఁగావు నాకై యడలుచు నన్ను వీడలేక వెంబడించుచున్న నా రాజ్యాధిదేవతవై యుండును.

(తెరలో)

తే. గీ. ఒక్కఁడే గెల్వజాలిన యుక్కఁడీఁడు
నేఁటికేనియు నట్టిద్రౌణినిఁ బగాధ
వింటిరే? నీ చరిత్రలు వింత లేమ
హాఘుమొనరించిరో? చీకుటాలు మగలు.

దుర్యో— (దీనముగా) అమ్మా! సకలమును నెఱింగియు నీవుఁగూడ నిట్లధిక్షే
పించెదవేమి? కర్ణునికేమి, శల్యునికేమి, నేను గురుతనయుని యనుజ్ఞ
చొప్పున నేకదా సేనాధిపత్య మిచ్చియుంటిని. (యోచించి) అవును
నాదిలోపమే. నేను "ఆధిపత్య మెవరి కిమ్మందు" వని యతని నడుగు
టచేఁ దనకిమ్మనుట కతఁడు సంశయించి యుండును. పదఁపడి లోకుల
కిట్టి యనుమానము కల్గినది. అమ్మా! ఇప్పుడేని నీ యాజ్ఞ శిరసావహించి
యమ్మహామహుని సేనాధిపతిం గావించి నీయడలుడిప నిన్ను స్థాపింపఁ
గలను. నన్ను క్షమింపుము.

(తెరలో)

ఉ. కాళులుఁ జేతులుం దెగిన కాల్బలముం గని వారు ముప్వురుం
గాలము దూఱుకొంచుఁ జనఁగా వెనుకన్ మనరాజు "సంగరం
బే" లని కాల్కొలందిఁ బరువెత్తెఁ గటా! యొకమూఁపు పైగదం
దాలిచి; కాలకర్మములు తప్పవుగా! భువి నెంతవారికిన్.

దుర్యో— (విని సంశయముతో) ఈ కంఠధ్వని వెనుకటిదానికన్న భిన్నముగా
నున్నదే! (పరికించి) ఓహో! ఇతఁడు స్వపక్షనాశముకై యడలుచు,
నా పరిచారకుఁడు కంకాళకునితో నన్ననుసరింప నరుదెంచుచున్న సంజ
యుఁడు. (నిరూపించి) మడుగునొడ్డునకు వచ్చితిని. కాన నిట నిలిచి
యితనివలనఁ గొన్ని సంగతులు వినుట కొంతయవసరము. (లజ్జాదైన్య
ములతో) ఈ యవస్థలో నేను వీరల మొగమెట్లు చూడఁగలను? ఓహో
దైవమా!

క. నతులై యుడుగరలొసఁగెడు
క్షితిపాలురచేతఁ గొల్వఁజేసియుఁ దుదకుఁ
గతి లేనివానిఁ గావిం
చితివే రారాజు, నెంతచేసితి వకటా!

సంజయకంకాళకులు— (ప్రవేశించి దైన్యముతో నమస్కరించి) మహారాజా!
జయము జయము.

దుర్యో— (లేనితెల్వితో) సంజయా! నేను రణము వదలిన పిదప విశేషము
లెట్టివి?

సంజ— కుమారా! యేమిచెప్పుదును. మనస్కంధావారము కాలిపోయిన
యూరివలె సర్వశూన్యమైనది. కృపాశ్వత్థామకృతవర్మలు మాత్ర
మెటకో చనిరి. వారిబలమున నిప్పటికి రెండువేల రథంబులును, నేను

నూర్గ దంతావళంబులును, పదివేల కాల్బలమును, నయిదువేల ఘోటకమ్ములును, యుయుత్సుండును, ధృష్టద్యుమ్నుండును శిఖండియు, ద్రౌపదేయు లేగురును, కృష్ణసాత్యకులును, పంచపాండవులును మిగిలిరి. పడఁపడి యంతఃపురస్త్రీల యడలు వినఁజాలక యుయుత్సుండు ధర్మజానుమతి గొని పాలికలనినుండి వారలను బురంబునకుఁ దీసికొని చనియె.

దుర్యో—(తలపంకించి) కానిమ్ము, వీరుమాత్రి మింకెంతకాలము మిగులుదురో చూచెదఁగాక. (కన్నీరునించి) నేనెంత బలసంపన్నుఁడ నయినను విపరీతదైవమున కేమిచేయుదు? తక్కినవన్నియు నట్లుంచుము. అక్కటా! శల్యునంతవాఁడు ధర్మరాజుచే వధింపఁబడువాఁడా!

క. యమ తనయుం డీతఁడు ని
 క్కమటంచుం దెలియఁ జేయఁగడఁగి మహాయు
 ద్ధముగావించెను నేఁటి ది
 నమున నొకఁడు సురలు ముదమునం గనుఁగొనఁగన్.

సంజ—కుమారా! అట్లనవలదు. అజాతశత్రుఁ డసమర్థుఁ డనుకొంటివా? నిక్కముగా నతఁడే యల్గినచోఁ గ్రీడి యెందుకు? వడముడి యేల?

దుర్యో—(పెడచెవినిబెట్టి) సరే, మీరెందుల కిటు వచ్చితిరి?

సంజ—సేవాధర్మము కావున నేకాదశాక్షౌహిణీపతి వగు నీవొంటిఁ జనుచుంటివను వగపున ననుసరింప వచ్చితిమి.

దుర్యో—పాండవులవలన మీకే యొగ్గును గలుగలేదుకద.

సంజ—వారివలన జరుగకున్నను శత్రువిజయ సంభ్రమమున నొడలెఱుఁగక కాఁబోలు, సాత్యకి నన్ను ముండలనట్టి నఱకఁబోవునంత వ్యాసభగవానులు వచ్చి వారించి బ్రతికించిరి.

దుర్యో—(కోపముతో) హా! దుర్మార్గు లనపరాధివగు నిన్నుఁ గూడఁ జంపనుంకించిరిగా! కానిమ్ము, నానిశ్చయము వినుము.

క. కొండొక యీ మడుగున నే
 నుండి శ్రమము దీర్చుకొని రణోర్వికిఁ జని నా
 యుండు రథికత్రయము రాఁ
 బాండవ హతకులను బట్టి బరిమార్పింతున్.

 నీ వరిగి మాతండ్రికి సకలమ్మును దెల్పుదువుగాక.

(నిష్క్రమించును)

సంజ— కంకాళికా! చూచితివా? ఇతఁడు వారి నేమో చేయుదుననియే యహంకరించుచున్నాఁడు. ఇప్పుడేని ధర్మజుని శరణన్న నతఁడు ప్రోవనివాఁడు కాఁడునుమా! కానిమ్ము. వృద్ధరాజుకడ కరుగుదము రమ్ము. (నిష్క్రమింతురు)

(రథిక త్రియము ప్రవేశించును)

కృపా— కుమారా! అతఁడు జలస్తంభన మెఱిఁగినవాఁడు. తప్పక యిందే యుండును.

అశ్వ— అట్లయినఁ బిలిచిచూతము రమ్ము. (బిగ్గరగా) మహారాజ! దుర్యోధన! మేము కృపాశ్వత్థామ కృతవర్మలము. నిన్నుఁ గనుఁగొనవచ్చితిమి.

చ. భయమున డాఁగియుంట పరువా? పెఱవారికి మాత్ర మేమిటం
జయము లభించె మద్రపతి చచ్చినమాత్రన పోరు మాని తే
మి యనుదు నిన్ను; లెమ్ము రణమేదినికిం జనుదెమ్ము మార్త ర
ప్రియములు సేయకుండఁగ భరించెద నేను సమీకభారముఁ.

కృపా— కౌరవేశ్వర! హతవిధి నీయట్టివానిచేఁ దుద కట్టి విపద్దశ యనుభవింపఁజేయుచున్నాఁడు! ప్రాణాశ కలవాఁడవేని నానుడువు లాలకింపుము.

చ. తలఁపకుమయ్య లోఁగడ గతంబు; గతంబు దలంపఁ బోకు మీ
యులకతనంబు; ధర్మజునియొద్దకుఁ బోయి భరింపుమన్న వా
యలుకుడి విన్నఁ బ్రోవఁగలఁ డాఁతడు నీ సగపాలొసంగి; యా
వల సకలంబుఁ గల్గును భవత్సహవర్గము గౌరవేశ్వరా!

దుర్యో— (మడుగునుండివచ్చి) శారద్వతా! నీ పలుకులు విన్ననే దత్త్యోత్తరంబులయ్యె. నీవు నాహితంబు గోరినవాఁడ వని యెఱుంగుదు. ఐనను.

చ. చలము బలంబు మానము యశంబును మాయఁగఁ బోయి పాండుపుత్రుల శరణందుఁగాక దయతో ననుఁ బ్రోతురుగాక ప్రోచినం
గలుగుదు రాలుబిడ్డలటుగాక సహోదరు లేగుదెంతురో?
కలకల నవ్వుకర్ణుని మొగంబు గనుంగొనుభాగ్య మబ్బునో?

కృపా— (ఏకసక్కముగ) రాజా! నీకుఁ గర్ణుని మొగమే చూడవలయునని యున్న స్వర్గమునందే చూడవలయును. అదియునుఁగాక (అనునర్థోక్తిలో)

అశ్వ— మామా! ఇది పురస్కారమునకు సమయముగాని తిరస్కారమునకుఁ గాదు. మహారాజు మిగుల నాపదపాలై డస్సియున్నవాఁడు. ఇంకఁ గలిమి వహించుననుట కలలోని వార్త.

ఉ. కొమ్మలు గాలిచే విఱుఁగఁ గుంకటి వేరసియాడఁ జెట్టుపొం
క మ్మెడఁబాసియున్న సహకారము తీయని కాపుగాచునో!
కమ్మని పూఁతఁబూచునో! పికప్రముఖద్విజపాళిచేతఁ జి
త్తమ్మున కింపుఁగూర్చునో! సదా తెరువర్లకు నీడ యిచ్చునో!

పదునొకం డక్షౌహిణులకు మనము ముగ్గురము గదా మిగిలితిమి. ఇష్టపడితివేని పోరితమున కాయిత మ్మగుదము. లేదేని గిరిముఖంబుల కరిగి మునివృత్తి సలుపుకొందము. అంతియకాని రాజుం దూఱనాడుట యనుచితము. సంధి సేయుమనుట యంతకంటె ననుచితము.

కృత — ఆచార్యనందన! లెస్సపలుకు పలికితివి.

ఉ. లే వరదంబులుం; గరులు లేవు, మనుష్యులు లేరు; గుఱ్ఱము
ల్లేవు, సహోదరుం డొకఁడు లేఁడు, సుయోధనుఁ డాజిలోపలం
జావక మేనుదాఁచుకొని సంధికొడంబడినం బ్రతిష్ఠయుం
జేవయుఁ బోవుఁగాని తనజీవముఁ దాల్చిన లాభమున్న దే.

అయినను మహారాజుతలంపు గట్టిగాఁ గనుఁగొందము. (రాజుతో) అయ్యా! ఇందుల కేమనియెదవు?

దుర్యో — నన్ను వృథాజీవితాశ గలవానినిగాఁ దలంపకుఁడు. ప్రతిష్ఠాప్రతిష్ఠలు తప్ప నిప్పుడెవరు గెల్చినను బ్రాముకొనునది లేదు. కులక్షయంబునకు వగవంగాని గాంగేయుని గెడపిన శిఖండి యొకఁడును గురువధ మహాపాతకంబున కొడిగట్టిన పాంచాలకులకలంకంబును బాండవకులాంకూరంబులగు ద్రౌపదేయు లేవురును బ్రదికియున్నందులకు వగచుచుంటిని.

చ. అరసితిఁగాని మీరథము లచ్చటఁ గన్పడవయ్యె; నొచ్చె మే
దురగము వోయె; నేనొకఁడనుం జనుదెంచితి విశ్రమింప నాఁ
డరదపుఁజక్ర మెత్తుకొను నప్పుడు చంపిరి కర్ణునంచు; నీ
తరమగు నేని సాహృదయతాపము వాపుము ద్రోణనందనా!

ఉ. పోటుదనంబునం దుడుకుఁబోకలు బోవుచుఁ "గూడ" దన్న మీ
మాట నిరాకరించితిఁ గుమారుల నందఱఁ గోలుపోతి నా
చేటున కేమి యాముసలిచీకుల కక్కటా! బుద్ధిహీనతం
గూటికిఁ గాటికిం బరులకొంపకుఁ జేరునవస్థఁ దెచ్చితిన్.

ఉ. కాలము చేరువయ్యెఁ గలకాలము రాజ్యము జేసి రేనరా
పాలురు? కాలకర్మపరిపాకము దాఁటఁదరంబె! కంత మీ
వాలునఁ ద్రుంచి నాకుఁ ద్రిదివంబునఁ జూపుము వారినెల్లఁ జం
డాలుఁడు భీముఁడేల కురునాథునిఁ జంపవలెన్ ద్విజోత్తమా!

అశ్వ— మహారాజా! కడచినపనికి వగవనేల? నామేనం బ్రాణము లున్నంతవఱకు నిన్ను భీమసేనుబారినుండి కాపాడెదను.

ఉ. మించి పరాక్రమించెద సమీకము నేఁటి కపాండవంబుఁ గా
వించెద నేఁడు నీకుఁ గనిపించెద నాభుజవిక్రమంబు మె
ప్పించెద, నూతనూతి మఱపించెద నీమది; నీకురాజ్య మి
ప్పించెదఁ, బాండువంశము శపించెద; నమ్ముము కౌరవాధిపా!

(తెరలోఁ బెద్దకలకలము)

కృత— (తేటిపాఱఁజూచి) ఎట్లు తెలిసెనో కాని పాండవులు వచ్చుచున్నారు మనకుఁ గర్తవ్యమేది?

దుర్యో— నే నిప్పుడు యుద్ధము సేయఁజాలను.

చ. ఒడలు పృథాకుమారచటులోగ్రశరాహతి డస్సి మండఁగాఁ
దొడఁగెఁ బ్రతీకసంధులు విఘాతములయ్యెఁ గదల్పఁజాల లో
దడ జనియించె గుండెలు యథాయథలయ్యెఁ జలించి ప్రాణముల్
సుడివడెఁ గాన నీమడుఁగులోపలఁ గొండొక విశ్రమించెదన్

అశ్వ— మహారాజ! మేమిప్పటి కటకేనిఁబోయి మరల నిటకు వచ్చెదము. నీవందాక నీమడుగులో నిశ్చింతగా నుండుము.

కృత— వా రేమన్నను వెడలిరాకుము. మేము పోయివత్తుము.

(నిష్క్రమింతురు.)

దుర్యో— హాశకుని! హా దుశ్శాసన! హా కర్ణ! హా శల్య! హా నరేంద్రులార!

ఉ. "అందనిద్రాక్షపం" డని మహాత్ములుసెప్పిన ధిక్కరించి మి
మ్మందఱి ఘోరయుద్ధమున కాయితపెట్టి సహానుగంబుగా
గ్రమ్మఁదఁగఁ జేసియుం దుదకుఁ బ్రాణము మానముకంటె హెచ్చుగాఁ
బంద సుయోధనుండు నృపపాంసులుఁ డక్కట! నీట డాఁగెడున్.

(మడుఁగులో డాగును)

(పిదపఁ బాండవపంచకంబునుఁ గృష్ణుండునుఁ గిరాతుండునుఁ ప్రవేశించుచున్నారు.)

ధర్మ— (చేతఁజూపి) ఓరీ కిరాత! ఇదియేనా నీవు వారినిఁజూచిన మడుఁగు.

కిరా— ఇదియే దేవర! ఆవలివైపునుండి మాటలాడినారు.

ధర్మ— (ఆ వైపునకుఁ బోయి) కృష్ణా! ఇవిగో హాలకులిశధ్వజప్రముఖ

రేఖాంకితంబులగు పాదంబులజాడ. లీచెమ్మ నేలఁ గనబడుచున్నవి. చూడుము. ఇవి దుర్యోధనుని పాదములేనా ?

కృష్ణు— ఓరీ ! దుర్యోధన మహారాజును నీవెఱుఁగుదువురా ?

కిరా— దేవరా ! యెఱుఁగకేమి ?

కృష్ణు— అతని నెట్లు గుర్తుపట్టితివి ?

కిరా— మారాజుగారి చేతిలోని గదవంటి గద యొకటికలదు. కిరీట మున్నది. శరీరమునిండ నెత్తురుచారికలున్నవి.

ధర్మ— అయ్యా ! యేల సందేహపడెదవు ? అతఁడు జలస్తంభనవిద్య యెఱిఁగిన వాఁడు. తప్పక యీమడుఁగులో డాఁగియున్నవాఁడు. కాదేని నడవిలో నుండు జడదారులకుఁగాని కిరాతులకుఁగాని పాదములయం దిట్లు సుస్పష్టములగు భాగ్యరేఖ లుండునా ?

కృష్ణు— అయిన నిపుడు మనము చేయవలసినదేమి ?

భీము— నేనీమడుగులో డిగి కరికలభము కలంచినట్లు కలఁచివైచెదను.

కృష్ణు— కాదు కాదు. ఈమడుఁ గగాధమైనది. పాతాళగంగకును, దీనికిని ద్వారము కలదని విందుము.

భీము— అటులేని పోటుమాటలతో నెత్తిపొడిచెదను. అభిమానధనుఁ డగువాఁడు బయలు పడక మానఁడు.

కృష్ణు— నీవు కాదు. నీయన్న ధర్మనందనునిచే ననిపింతము. (ధర్మజునితో) ధర్మజా ! నీవు పిలువుము.

ధర్మ— (మడుఁగు సమీపించి బిగ్గఱగా)

మ. చతురంభోధిపరీతమైన ధరణీచక్రంబు శాసించి భూ
పతివర్గం బరిగాపులై కొలువ సేవానమ్రరాజేంద్రమా
శితలాలంకృతరత్నదీధితి సరోలీనుండవై యుండు నీ
స్థితి యీరీతిగ నేఁటికిం బరిణమించెం గాదె దుర్యోధనా !

ఉ. చచ్చిరి సోదరు ల్సుతులు చచ్చిరి చచ్చిరి రాజులెల్ల, రీ
కచ్చెకు మూలకందమగు కర్ణుఁడు మామయుఁ జచ్చి రీగతిం
బచ్చని కొంప మాపితివి బాపురె ! కౌరవనాథ ! నీ సగం
బిచ్చెద జీవితేచ్ఛ గలదేని బయల్పడు మయ్య ! గ్రక్కునన్.

దుర్యో— (తనలో) అభిమానమా ! కొంతకాలము నామనంబునఁ బ్రవేశింపకుము. ఛీ ! మూఢ దుర్యోధన ! అభిమానముకంటెఁ బ్రాణము హెచ్చని

తలంచుచున్నావా? బయల్వెడుము. (ఆలోచించి) నా కుపకారకంబగు రథికత్రయంబు నన్ను మడువు వెడలకుమని చెప్పిపోయిరి. హా! భగవంతుడా! నాకెట్టి యిక్కట్లు సంభవింపఁ జేసితివి? ఓమనమా! తొందరపడకుము.

చ. "మడువున డాఁగఁబొ"మ్మనుచు మార్తురముందఱ హెచ్చరించి నా
కడలు జనింపఁ జేసితి వహా! యిపు డీవు "జలంబునుండి వే
వెడలు" మటంచుఁ దెల్పెదు వివేకము సుంతయుఁగాని యున్నదే
చెడుగుమనంబ! నీకుఁ; బరిశీలన చేయకపోతి వక్కటా!

భీము— ఓయీ! దుర్యోధనమహారాజ! మడుగులోనుండి దయచేయుము.

ఉ. దంభము పన్ని సంగరపదంబు తొలంగి హ్రదంబునన్ జల
స్తంభనవిద్య డాగినను జావక యుందువె మూఢుఁడా! జలో
జ్జృంభణఁజేసి జాలరులు చేపలఁ బట్టిన రీతిగా దురా
లంభుని నిన్ను నా భుజబలంబున నేఁ డెటులేనిఁ బట్టెదన్.

నకు— దుర్యోధనా! ఏల కష్టపుం జావుఁ జచ్చెదవు? క్షత్రియోచితంబుగ మడిసిన నిహపరంబులు రెండును గలవు.

ఉ. కౌరవులందుఁ బుట్టియు నఖండరమావిభవంబు పట్టియుం
బోరనఁ గీర్తిఁగట్టియు నపూర్వ గదారణమందు జెట్టివై
పోరి రణంబులోపల రిపుప్రకరంబున కోడిపోయి కా
సారముఁ జొచ్చి తీవని ప్రజ ల్వని నవ్వదురే మొగంబునన్.

సహ— సుయోధనా! గాంధారరాజదౌహిత్ర!

ఉ. మానిని ద్రౌపది న్వలువ మాసినదానిఁ బరాభవించుచోఁ
గానల కేగునప్పు డొడికారముపై మము నిందసేయుచోఁ
బూనిన పౌరుషంబుఁ దలపోయుదువే? త్రప లేకపోయెనే
మానసమందు; నీ దురభిమానము కర్ణునితోడఁ బోయెనే?

అర్జు- ఉ. శాంతనవుండు ద్రోణుఁడు విశాంపతు లందఱు నీ నిమిత్తమై
యంతముఁ జెంది రంగపతి యంతటి మిత్రితముండు చచ్చె, నీ
వంతము లొచ్చిపోయెఁ బరిపంథికులంబు బలంబు హెచ్చె, నీ
వింతటి మొండిధైర్యము వహించుటకుం గత మేమి తెల్పుమా.

కృష్ణు— కౌరవేంద్ర! నాఁడు సభాముఖంబున "బ్రతికినన్నాళ్లు రారాజు ననిపించుకొనవలె" నని మీ యమ్మతోఁ బలికిన పలుకులు జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము.

ఆ. వె. మడుఁగు వెడలివచ్చి మాతోడ నెదిరించి
తేనిఁ బేరునిలుచు నీల్గుదాక
లేకయున్న నిన్ను లోకంబు పాఱుఁబో
తనుచుఁ బిలుచుఁ దప్ప దనియు నీకు.

దుర్యో— పాండునందనులారా! ఏల యీ మదాలాపములు. ధర్మనందనా!

ఉ. ఏలుము రాజ్య; మైతివి మహీంద్రుఁడ; వేను బరిత్యజించితిం
గాలము చేరు వౌదనుకఁ గానలలోఁ దప మాచరింతు నే
నాల మొనర్పఁగాఁ దగిన యాయుధము ల్దరి లేవు యుద్ధ మిం
కేల? భవన్మనోరథము లే నొడఁగూర్చుచు నుండ నిత్తఱిన్.

ధర్మ— దుర్యోధనా! దానపూర్వకముగా గ్రహించుటకు మేము బ్రాహ్మణులము కాము. నిన్నుఁ గడతేర్చుటయే మా మనోరథము గాని రాజ్యమేలుటయుఁ గాదు. కావునఁ దడయక వెడలిరమ్ము.

దుర్యో— (తనలో) ఈ దురాత్ములు వెడలింపక మానరు. ఓ వనదేవతలారా! ద్వైపాయనహ్రదపావనోదకంబులారా!

గీ. అనుఁగు నెచ్చెలి! నీవు చేసిన ప్రతిజ్ఞ
తప్పకుండఁగ నెఱవేర్పఁ దలఁపుమయ్య
పాండవుల బారిఁ బడఁద్రోచెఁ బట్టుపట్టి
నన్నుఁ జండాల దురభిమానగ్రహంబు.

అని నామాటలుగా గురునందనునకు విన్నవింపుఁడు. (ప్రకాశముగ) ధర్మతనూజ!

గీ. అరదమైనను లేదు నిరాయుధుండ
నెదిరి మీతోడఁ బోరుట యెట్లటంచుఁ
బల్కితిని గాని మీరు తప్పదనిరేనిఁ
గదలి చనుదెంచుచున్నాఁడఁ గాచికొనుఁడు.

(మడువునుండి వెడలి వచ్చుచున్నాఁడు)

ధర్మ— (చూచి) కురునాథ! ఆయుధంబులు లేవనియు నేకాకిననియు వంతఁ జెందకుము. ఇవిగో నీ యిచ్చవచ్చిన యాయుధములు గైకొని మాయేవురలో నీయభిమతం బగువానితోఁ గయ్యమొనర్పుము.

ఉ. ఈవు రణంబునం గెలిచెదేని జయంబు వహించి యేలు మీ
భూవలయంబు మేము వనభూముల కేగెద మట్లు గాక నీ
వే పడినన్ ధరాభరణ మేము వహింతుము రాజరాజ! నీ
చావునుఁ జావకుండుటయు సజ్జనగణ్యముగా నొనర్పుమా.

దుర్యో— (తనలో) ఔరా! యీ ధర్మపుత్రుని న్యాయాతిశయము! తన్నొ, కవలనో, విప్వచ్ఛునో గదాయుద్ధమునకుఁ జేర్కొనిన నాకు గెలుపు సులభముగదా! ఛీ! నేనేల వారి పేరులు తలపెట్టెదను? చచ్చిన భీమునిచేతనే చావవలయును, కడతేర్చిన వానినే కడతేర్పవలయును. (ప్రకాశముగ) కౌంతేయాగ్రజ! నీ ధర్మవర్తనమునకు సంతసించితిని. కవచ శిరస్త్రాణాదులుమాత్రము కైకొందును. నీ యాయుధములతోఁ బనిలేదు.

గీ. యమగదాదండమున కుపాధ్యాయమైన
నా గదాదండ మిదిగో! యున్నయది కేల
నెవరు వచ్చినరందు మీ యేగురందు
నాలమున రాజరాజోలమాస గొనఁడు.

(కవచాదిధారణ మొనర్చును)

భీము— అన్నదమ్ములారా! అల్లేని నన్నే యుద్ధము చేయనిండు.

మ. యువరాజక్షతజామృతోదనముచే నూర్జస్వలంబైన యీ
పవమానాత్మజవామబాహుశిఖరస్థాయద్గదాదండ మా
హవమందీనృతరాష్ట్రజాగ్రజునిఁ జక్కాడం గట క్షింపుఁడీ
సవనంబేఁ దుదముట్టఁ జేసెద మదుత్సాహంబుఁ జెల్లింపుఁడీ.

దుర్యో— భీమసేనా రా రమ్ము. నాకును మనోరథ మట్లేయున్నది? (స్మరించి)

మ. బలరాముం బలరాము దేశికునిగాఁ బ్రార్థించి చేకొన్నవి
ద్యలుగావే! ఖురలీగవారణము; లా ధన్యాత్ము నేఁడైననుం
దలఁపం జెల్లదె? రాజరాజు భవదన్యప్రాణియొద్దం గదా
బలముం జూపి కలంకుఁ దెచ్చునె ప్రసుంబఘోన్నజ్వలత్కీర్తికిన్.

(తెరలో)

ఓ జడదారులారా! ఏను బ్రహ్మహత్యాదోష నివారణంబునకై తీర్థయాత్రలు సేవింపఁబోయి మరలవచ్చిన బలరాముఁడను. ద్వైపాయనహ్రదంబునకుం దారిచూపుఁడు. దానియందుఁగూడఁ గృతావగాహనుండనై హస్తినాపురంబునకు దుర్యోధనాదులగు బంధుగులంజూడఁ బోయెదను. ఏమనుచున్నారు? ఇంకను దుర్యోధనాదు లెక్కడననియా? పాండవులచేఁ దనవారందఱుఁగూల నేకాకియై దుర్యోధనుం డెచ్చటికో పాఱిపోయెనా! ఔరా! విధిపారిలికాల్యము! ఎంతలో నెంతె మాఱినది? కానిండు. నేను వేగముపోయి రారాజును వెదకించి వాని రాజ్యము

వాని కిప్పించెదను. మంచిది ! ఈ కదంబవృక్షవాటికకు దక్షిణభాగ మునందున్న యేకపదిం బట్టి పోవలయును ! (ప్రవేశించుచున్నాఁడు)

**కృష్ణ**— (విని యర్జుననితో) ఫల్గునా ! నీవియ్యంకుఁడు బలభద్రుఁడు సుయోధనుని యదృష్టముచేఁ గాఁబోలు నిచటికే వచ్చుచున్నాఁడు.

**అర్జు**— (విచారముతో) కృష్ణా ! ఇఁక నెక్కడి వియ్యంకుఁడు. తొల్లింటి బాంధవ్యమే మిగిలెనుగదా. నేనతని మొగ మెట్లు చూడఁగలను.

చ. "అనుపమవిక్రమక్రమసమన్వితు లేగురు జీవవంతు ల
య్యును శశిరేఖకుం బతివియోగ దశానుభవంబుఁ దెచ్చిరే
యని మొగిడింప నేల విలయంబునకై యిటు" లంచు రిత్తవో
యినమదితోడ నీముసలి యెట్టిదురాగ్రహముం గ్రహించునో.

**కృష్ణ**— ఫల్గునా ! దైవగతికి మన మేమిచేయఁగలము. నేను దానికనలేదు. ఈ జరుగఁబోవు భీమదుర్యోధనగదా యుద్ధమమాత్ర మితఁడు చూడఁదగినది కాదు.

**బల**— (ఆశ్చర్యముతో) వీరె కురపాండవయూథపతులు ! అందఱు నిచ్చటనె యున్నారు ! (ఆలోచించి) జలస్తంభనవిద్యచే డాఁగియున్న దుర్యోధనుని బయలు పఱచుటకై వచ్చిరనుకొనియెదను. హా కురురాజకంఠీరవా! పాండవులు నీకెంతవిపద్దశ తెచ్చిరి ! (సమీపించుచున్నాఁడు)

**దుర్యో**— (చూచివివర్ణవదనముతో) కౌరవశ్రేయస్కా-మా ! బలరామ !

చ. కొడుకులఁ దమ్ములం గదనకోవిదుఁ బ్రాణసమానుఁ గర్ణు వృ
ద్ధుఁ డయిన యాపగాతనయు ద్రోణునిఁ దక్కినయుక్కడీంద్ర నె
వ్వడు పొలియించి తా మిగిలెఁ బాపభరంబునఁ జావకుండ నొ
క్కఁడగుచు; నా సుయోధనుఁడు కైకొనుమా కడసారి మ్రొక్కెడుఁన్.

**భీమ**— (సంతోషముతో) బావా ! హాలాప్రియ !

ఉ. ద్రౌపదికట్టుచీరలు సదస్సున దుల్చినయన్నదమ్ములం
బాపులఁ జంపఁగాఁ బ్రతినవట్టి సహోదరు ముందుఁ జంపి సం
తాపము కొంత దీర్చుకొని న్యాయముగాఁ జెఱవానిజీవముం
బాపఁ దలంచుపావని నమస్కృతిఁ గైకొను మచ్యుతాగ్రజా !

**అర్జు**— (కన్నీటితో నమస్కరించి) బావా ! నీకు మఱవరానిదుఃఖముఁ దెచ్చిపెట్టిన యీ పాండవులతప్పు క్షమింపుము.

ఉ. మాయఘటోత్కచుండు పెనుమాయ సృజించి విరోధులం దృణ
ప్రాయులఁగా విదల్చుచు వివాహము చేసినచేత కివ్వడ

యౌర్యా యని కుందఁగా పలికె నోయదుభూషణ ! తొల్లి దుర్లభ
శ్రేయులమైన యిర్వురము చేసినపాపఫలంబు లెట్టివో.

కృష్ణు— వెఱ్ఱియర్జునా ! ఉత్కృష్టునకే యిచ్చితిమనుకొనుము. శశిశేఖకి వ్రాఁత తప్పునా !

బల— ఏమి ! అభిమన్యుఁడు మడిసెనా ! హా సుభద్రాకుమార ! ఈ కురుపాండవయుద్ధము నీమృతికొఱకే తటస్థించెనా ! కానున్నవంతగందరగోళము జరిగిన పెండ్లి యెట్లుకక్కఁబడ వచ్చును ? ఓ పాండవవీరులారా !

గీ. పెద్ద లరిగినపిమ్మటఁ బిన్నవాండ్రు
బవర మొనరింపఁ బోవుట పాడిగాని
కలదె యెందును ముందు సంగరములందుఁ
జంటివాండ్రను బంపించి చంపుకొనుట.

కృష్ణు— అగ్రజా ! దానికిఁ దగినంత కారణము లేకపోలేదు. సావకాశముగ నివేదించుకొందుము. ఇపుడు నీశిష్యు లిరువురకు గదాయుద్ధము కానున్నది. మనమిందుఁ గూర్చుండి యావేడుకఁ గనుఁగొందము.

బల— ఈ ఘోరయుద్ధమున కాదికర్తవైన నీకిది వేడుకగా నుండదా ! నీ వొనరించిన కపటోపాయంబులంగాక జగదేకవీరులగు ద్రోణభీష్ములు మడియుదురా !

గీ. సంధి గావింపకుండువే చతురుపాయ
ముల నెఱింగిన బుద్ధికౌశలము గలవు
ఉత్త వైరంబుఁ బెంచితి; రిత్తనేలఁ
దలధరించి సుఖించునే ధర్మరాజు.

కృష్ణు— అన్నయ్యా ! నామీఁద లేని యపవాద మోపిన నే నేమందును. అద్దమున్నది మొగమున్నది. దుర్యోధనునే యడుగరాదా! "అయిదూళ్లిచ్చినఁ బాండవులకుఁజాలు" నని నేబతిమాలితినో లేదో ! కడచినదానికేమి. నేఁడు నీవు కూకలిడి సంధిచేయింపుము. పాండవుల నే నొప్పించెదను.

బల— సర్వశూన్యమైన పిదప సంధికావించిన నేమి ? కావింపకున్న నేమి?

గీ. ఇరువురొకరూపు నాకు నిందెవరియందుఁ
గాని కించిదధర్మంబు కానిపించ
నేని జూచుచు నేను సహింపఁజాలు
నెవరి కర్మము వారిదె యేగువాఁడ,

ధర్మ— బావా ! నీ వుపద్రష్టవై యుండ నట్లేల జరుగును ? ఇందు నీయానతి నుల్లంఘించు వారెవ్వరు ?

ఉ. ప్రాణభయంబునం బెదరి పాఱి సుయోధనుఁ డీహ్రదం బసు
త్రాణముగా మొఱంగిన కథావిధము న్విని యేము వచ్చి " నీ
ప్రాణ ముటున్నదే" యని యరాళము లాడ సహింపలేక యు
ద్రీణతమై సమీక మొనరించుట తప్ప దటంచు నెల్వడెన్.

తరువాత రణసామగ్రి లేక యేకాకియై యున్నయతనితో-

క. " ఏయాయుధంబుఁ గోరిన
నాయాయుధ మొసఁగువార మనికిఁ గడఁగుమా
మా యేగురయం దెవ్వరి
నో యొకరినిం బేరుకొనుము యుద్ధంబునకున్.

వానిం గెల్చితివేని జయము నీపక్షముగా నంగీకరింతు"మని పల్కితిం.

బల— బలే ధర్మరాజా ! నీబుద్ధికి సంతసించితి. కావున నీ ధర్మయుద్ధమును గనుఁగొనియే యేగెదను.

కృష్ణ— (జనాంతికముగ నర్జునునితో) ఈ ధర్మనందనుండు పోవుచున్నవానిని బలాత్కారముగ నాపుచున్నాఁడు. భవితవ్య మెట్లున్నదో !

ఉ. న్యాయముగా గదారణ మొనర్చిన భీముఁడు కౌరవేశ్వరుం
ద్రోయుట దుర్లభం బౌకనితో రణమే కద ! నిర్ణయించె న
న్యాయ మొకింతయుం జరిగినం గని సైఁపఁడు సీరపాణి; యిం
కాయనతోడ మీకుఁ గలహంబు ఘటిల్లుట నిక్క మర్జునా !

అర్జు— మా యన్నగారొనర్చు పనులన్నియు నేమిపాపమో మనకపకారము గనే పరిణమించుచున్నయవి. కానిమ్ము. భవితవ్య మెట్లును గాకమానదు.

ధర్మ— మనమందఱ మీ హ్రదఘట్టంబునం గూర్చుందము రండు. (కూర్చుందురు)

భీము— (పరికరము బంధించి గద నుద్దేశించి)

ఉ. కమ్మని జాళువా యొఱపు గంటలుగట్టి యహర్నిశంబు నే
మమ్మనఁ బూజ చేయుచు నమస్సు లొనర్చుచుఁ గొల్చుచుంటిఁ జి
త్తమ్మన నిన్ను నమ్మితిఁ గదమ్మ సుయోధనుతోడి పోటి క
య్యమ్మునఁ జేయి నిల్పఁగఁగదమ్మ ! మదంబ గదావతంసమా !

దుర్యో— చేతిలావును బుద్ధికౌశలమును నుండవలయుఁగాని పూజాపురస్కార ములతో గదారణకోవిదుండ వగుదువా! చాలు నీస్తోత్రపాఠములు. రా రమ్ము.

అర్జు— (కృష్ణునితో జనాంతికముగా) గదాగ్రజా! బుద్ధికౌశలంబున రారాజు నకు భీమసేనుండునుఁ, జేతిలావున భీమసేనునకు రారాజునుఁ జాలఁడనుకొని యెదను. నీ యభిప్రాయ మేమి?

కృష్ణు— చేతిలావున భీముఁడెక్కుడైననుఁ జిరతరాభ్యాస పాటవమందును నేర్పు నందును సుయోధనుఁడే ఘనుఁడు.

గీ. అప్పుడప్పుడు వేఁడి మదగ్రజాతు
వలనఁ దత్తద్రహస్యము దెలిసికొనుచు
సలిపె నితఁడు గదాపరిశ్రమము మీరు
వనమునందున్న పండ్రెండు వత్సరములు.

భీము— (క్రోధహాసములతో) దుర్యోధనా! ప్రాణభీతిం జేసి నీటఁ డాఁగిన నీతో రణ మొనర్చుటకే నాకు సిగ్గగుచున్నది. కాని రణసత్రము ముగి యమిం జేసి చంపఁదగిన వాఁడవైతివి.

చ. "అవని సమస్తమేలుకొనుమయ్య! రణంబిఁక నే నొనర్ప మా
నిపరులతో నరణ్యమున నిత్యసుఖాప్తి మెయిం జరింతు న
య్య విడువు" మంచు వేఁడఁగ దయామతి నీపయి రాక పోయె ధ
ర్మవిభునకే; దురాత్మ! పవమానతనూజున కింకవచ్చునే.

దుర్యో— ఓయీ వాచాల! వృథాస్వార్థసంభావక! పాండుకుమార! (నాలుక కఱచుకొని) కాదు కాదు, వాయుకుమార!

ఉ. ఎందఱు రాజు లీ ధరణి యేలఁగ రోసి పరిత్యజించి మా
నీంద్రులతోడి చెల్మికయి యేగిరి కానల; కెల్ల సౌఖ్యము
ల్పొందినవాఁడ నేఁటఁ బరలోక సుఖంబున కంటెఁగాక మీ
కుం దిట వేది యంటి వనుకొంటివె? మూర్ఖకులావతంసమా!

బల — ఓ భీమ దుర్యోధనులార ! మీకుం బరస్పరజుగుప్సావచనంబులతోఁ బనిలేదు. ఈప్రదేశము శమంతపంచకములోనిది కాదు. కావున స్వర్గాపవర్గప్రదంబును బావనంబును నగుపాలికలనికిం బోదము గండు. మీయుద్ధముగూడ నయ్యెడనే యగుట ప్రశంసనీయము.

(నిష్క్రమింతురు.)

## గద్య

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
పాండవవిజయమునందు సప్తమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవ విజయము

## అష్టమాంకము

(పాండవచతుష్టయమును కృష్ణబలరాములును ప్రవేశింతురు)

నకు— సహదేవా! ఈ దెబ్బతో దుర్యోధనునితల చెక్కలుగాక మానదు. చూడుమా మనభీముని చూపునందలి యొడుపు.

క. బరిమీఁది యురగ మొడుపుగఁ
గఱచుటకుం దిరుగుకరణిఁ గౌరవనాథ
స్ఫురదురుగదాహతులకుం
దొరకక తగుసమయముం గనుంగొనుచుండెన్.

సహ— అగ్రజా! అరరే! ఆదుర్యోధనుఁ డాదెబ్బ నెంతసులువుగాఁ దప్పించుకొనెనో చూచితివా?

గీ. తద్గదాఘాతముల కోర్చ తగినసందు
వేచి గుఱిచేసి తలమీఁద విసరినట్టి
యన్నగారి పవిం బోలు నన్నగారి
గదను గుఱియయ్యెనకట సైకత తలంబు.

అర్జు— కృష్ణా! ఈ కురురాజు శరీరలాఘవంబున ఱెక్కలున్న పక్షివలె నెంత దూరమెగురుచున్నాఁడో చూడుము.

ఉ. గాలిపటంబులీల దివిఁగన్పడు నొక్కొకమాఱు ఱెక్కలం
గ్రాలు ధరాధరేంద్రము ప్రకారముగాఁ దనరారు నొక్కెడం
దూలక నిల్చు నొక్కపరి దూలము గాలికిఁ దూగులీల గాఁ
దూలు మఱొక్కసారి గద దూలము పోలికఁ గేల నొప్పఁగన్.

కృష్ణు— అర్జునా! నేనేమంటిని? వీనిం గడతేర్చుట కొక్కయుపాయము కలదుగాని ప్రళయకాలరుద్రుం డగు నేతోయని మదగ్రజుంజూచి వెనుదీయుచుంటిని.

ఉ. పాములవానిచేఁ బడిన పన్నగమట్లు కరంబు డస్సెన
య్యో ! మనభీమసేనుఁ గనుమోయి కపిధ్వజ ! దీనతాస్పదం
బై మదహీనమైన మొగమంతట నల్లవడెం బ్రమర్దనో
ద్దామములైన బాహులు మదంబతి వ్రేలఁగఁ జొచ్చెడున్ గటా !

అర్జు— (ఆత్రముతో) ఈసారి గదాఘాతముతో మనప్రయత్నము లన్నియు విఫలంబు లగుచున్నవని తోఁచుచున్న దేమిగతి !

చ. అనృతములాడి ద్రోణుని గతాసునిఁ జేయుటకన్నఁ బాడి మా
లినపని యున్నదయ్యా ? యవలీల నొనర్చితి మట్టికార్య; మా
వెనుక హలాయుధు న్నతులు వెట్టి ప్రసన్నునిఁ జేసికొంద మీ
యన పడకుండఁగాఁ గలదుపాయ మటంటివి తెల్పు మచ్యుతా!

కృష్ణ— లెస్సపలుకు పలికితివి.

మ. "విఱుగన్ గొట్టెద నూరుయుగ్మ" మని మున్ వీరుండు మీయన్న కో
పరసావిష్టుఁడు వల్కె; నాభికి నధఃప్రాంతమ్మునన్ గొట్టు టొ
ప్పరు తా మెందు గదారణజ్ఞు; లిపుడీ పాపాత్ము మాయాగతిన్
బొరిగోకున్న నితండు మీకినుఁడుగాఁబోవున్ ధ్రువం బర్జునా !

అర్జు— (భీమునికిఁ గనుపడునట్లు తనతొడపైఁ జరచుకొనును)

బల— (లేచి కోపముతో) ఓరీ ! పాపాత్మా! వృకోదర ! బలరాముఁ డున్నాఁడని యైన భయంబులేక గదారణంబున నాభిక్రిందఁ గొట్టఁగూడదని యెఱింగియుఁ దొడలమీఁదఁ గొట్టితివేమిరా ? నిలువు నిలువుము ! ఈ ముసలంబునకు నీతల బలియొసంగెదను. (భీముని మీదికి పోఁబోవును)

కృష్ణ— (అన్నను బట్టుకొని) అన్నయ్యా ! ఏమిది వెఱ్ఱికోపము ? ఆదెబ్బ తొడలమీఁదఁదగిలెనో నడుముపైఁ దగిలెనో చూడకుండఁగోపించెదవేల?

బల— నడుము మీఁదనా ! గదావిక్షేప మెఱుఁగని వానికి బోధించినట్లు బోధించుచుంటివి. అయిననుఁ జూతము పద. (అందరునుఁ బరిక్రమింతురు)

(తెరనెత్తుదురు; తొడలు విరిగిన దుర్యోధనుఁడు కన్పట్టును)

బల— (సమీపించి) కౌరవేంద్ర ! కాళ్ళూఁది నిలువుము.

దుర్యో— (వగరుచుచుఁ దొడలు జూపించి మూర్ఛపోవును)

బల— కృష్ణా ! దీని కేమందువు? (పరికించి) ఆ దురాత్ముఁడేఁడి? కానరాడు.

భీము— (సంరంభముతోఁ బ్రవేశించి) ఓరీదురాత్మ ! కౌరవజఘన్యా !

శా. "కాతర్యంబు వహించె నోసి పశువా! కానిమ్ము నీకొక్కండు నీ
పాతివ్రత్యము వోవునే" యని సభం బాంచాలి నన్నట్టి నీ
బూతుంగూఁతల కీ ఫలంబు గలిగెం బో! యిద్ది మా ధర్మభూ
నేతం బెట్టిన పాట్లకుం ఫలము కానీ పాపమున్నోఘనా!

(ఎడమకాలితోఁ గిరీటముఁ దన్నును)

ధర్మ— ఆఁ! ఆఁ! భీమసేన! ఎంత తెలివిమాలిన పని గావించితివి! ఉడుగు ముడుగుము.

బల— (మండిపడి) కృష్ణా! ఇంకను నీ నీచు నెట్లు క్షమింతును?

చ. కసి గలదేని బాహుబల గర్వముచేఁ గురురాజు నాజిలోఁ
గసిమసగింతు గాక కాఁగాక గదారణమందుఁ బాడి లే
క సముఖమం దొకండు శఠకార్య మొనర్చినఁ జూచి రాముఁ డీ
ముసలముచేత వానితల ముక్కలు సేయక యూరకుండునే.

కృష్ణ— అగ్రజా! దీన భీమునియందుఁ దప్పేమి? బంధుత్వ మటుంచుము. ద్రౌపది యొక సామాన్యవనితయే యనుకొందము.

గీ. నిండుఁ గొల్వున దుశ్శాసనుండు వలువ
లొల్వఁగాఁ జూచి నీ వూరకొందువోటు
కురువుఁ జూపింపవచ్చునే? కూరుచుండు
మనుచుఁ గులకాంత కీ సుయోధనుఁడు సెపుమ.

నాఁడు ధర్మజనిగళబద్ధంబగు భీమమత్తగజంబు కదలలేక, "ఓరీ దురాత్మ! రణంబున నిన్నుఁ దొడలు విఱుగ నడచెద" నని వాచాశూరత్వముమాత్రము చూపించెను. నేఁడది నెఱవేర్చుకొనెను.

బల— తొడలు విఱుగఁగఁగొట్టుట యొకతప్పు. దాని నటుంచుము. తలదన్నుట యెంత నీచపుఁ బని? దాని కేమందువు?

కృష్ణ— ఇది తప్పిదమే కావచ్చునుగాని, యిదియును నతని ప్రతిజ్ఞలోనిదేయై యుండవోపు. కాకపోవుఁగాక, ఈతఁ డొనర్చిన దోసఁగులలో నిది శతాంశమునుఁ గాదుగదా! అదిగాక, ఇది కలియుగము. ధర్మము నాలుగుపాదముల నడచునా? శాంతించి యనుగ్రహింపుము.

బల— కృష్ణా! కురురాజుమాత్రము ధర్మశీలుఁ డంటివా? మీరొనర్చిన యధర్మము లెన్నియో వా రొనర్చిన తప్పు లెన్నియో నేను జూచితినా! (ధర్మజుదిక్కు) ధర్మరాజ! పోవువాని నన్నాఁపి యీ యధర్మముఁ జూపించితివిగదా!

ఉ. "కౌరవనాథు నుందొడలు గాఁడఁగ వేసి శిరంబు దన్నె న
మ్మారుతి మధ్యవర్తియగు మాబలరాముఁడు నూచుచుండఁగా
నారి?" యటంచు ధర్మనిధులందఱు దూఱఁగ నెల్లకాల మీ
దారుణమైన దుర్యశముఁ దాల్చి నేఁ దలయెత్తనేర్తునే?

కృష్ణ— సహోదరా! ఇందు దుర్యశ మేమున్నది? మేనత్తకొడుకుల కుపకారము సేసె నందురు.

బల— చాలుఁజాలు. కపటోపాయములకు మూలకందమవై నీవు సేయుచుంటివి చాలదా? ఇందు బలరాముఁడుఁగూడఁ గలియవలెనా? (విచారముతో) హా! దుర్యోధన!

గీ. ఎన్ని దుష్కపటంబులు వన్ని నీదు
బలముఁ బరిమార్చిరో గదా పాండుసుతులు
దైవవిధి యేరికైనను దప్పదిప్పు
డెదుట నుండియు బలరాముఁ డేమిచేసె?

(కోపముతో) ఛీ! యీ పాపాత్ములమొగముఁ జూడరాదు. పాప వృకోదర! నిన్ను ముసలమునకు బలి యిచ్చి నాయప్రతిష్ట తీర్చుకో వలయును.

భీము— క. గడబిడ యేటికి నీ పద
ముడికిం గదలేరె? నీకు ముసలమ్మున్నన్
"దొడ లనిలోపల విఱుగం
బొడిచెద" నని నుడివి రిత్తవోదునె ముసలీ.

బల— ఏమీ! నాకు ముసల మున్న నీకు గద కలదా! నిలువు నిలువుము. నాముసలితనముఁ జూపించెదను. (మీఁది కుఱుకఁబోఁగా)

కృష్ణ— (ఆఁపి యర్జునునితో జనాంతికము) ఫల్గునా! ఈ భీముఁ డూరకున్నవాని మరలఁ గదిపె. ఈ బలరామ ముసలాఘాతమున కితఁ డెంతవాఁడు? (జనాంతికముగ) భీమసేనా! శాంతింపఁగదోయి. మీయన్న శాంతమునకును నీకోపమునకును బ్రతుకలేకున్నారము.

ఆ. వె. మొదటఁ బోవువాని పదముల కర్ఘ్యపా
ద్యమ్ము లిచ్చి నిలిపె ధర్మరాజు
వేఁడు పోవు వాని నిటలభ్రూకుటిచేత
నిల్పఁదలతు వౌర! నీలచేలు.

బల— (కోపావేశముతో) మంచిమాట చెప్పితివి. అవును మీసంగతి గుఱు తెలియక ఈపాపపు సభలో నిల్చుట నాదేతప్పు. (నిష్క్రమించును.)

దుర్యో— (మూర్ఛ తెలిసి) హా బలదేవ! నీవుండియు నిట్టియన్యాయమున కొడి గట్టితివా? నీతమ్ముని మాయమాటలకు లోఁబడితివా!

గీ. మధ్యవర్తివి రణధర్మమయుఁడవీవు
కలవనుచుఁ గాక నే నూర్ధ్వకాయమునకుఁ
గాపుదల చేసికొని యధఃకాయమునకుఁ
జేసికోలేనె యకట! వంచితుఁడనైతి.

భీము—(కోపముతో మరల దుర్యోధనునితలఁ దన్నఁబోగా)

ధర్మ— (వారించి విచారముతో)

గీ. మంచియో చెడ్డయో పదిమంది చేత
మెచ్చఁగాంచునో లేదో భవచ్చరిత్ర
మించిపోయెఁ బ్రతిజ్ఞ చెల్లించుకొంటి
విట్టియాగడపుం బని యేల యిపుడు?

మ. ఇతరప్రాణి కలభ్యమైనసిరిచే నేకాదశాక్షౌహిణీ
పతియై సర్వవిధంబులం జెడి దురాపంబైన దైన్యంబుచే
నతిశోచ్యత్వముఁ జెందుఁగాక మన దాయాదుండు నీవింత హీ
నతగాఁ జూతువె? రాజరాజితనిఁ దన్నం బాడియే మౌళిపై?

గీ. కాలమునుఁ గర్మమును రెండుఁగలిసి యిటులు
దైవవిధిచేత మనకు నింతలు జనించె
కాని నీ కీతఁడెవ్వఁడు? కలదె నాకు
నీతనికి భేద మావంతయేని భీమ!

భీము—(శాంతించి) ధర్మనందన! ఈదురాత్ము నేమిచేసినను బాపములేదు. కలదుగాక నరకమునకేపోవుదును. ఓ పంచభూతములారా! ఓ సూర్య చంద్రులారా!

ఉ. పయ్యెద లాగె నేచెనఁటి "బంధకి నీ" యని సాధ్వి నే ఖలుం
డొయ్యన సన్న చేసెఁ దనయూరువులందు వసింపుమంచు నే
నియ్యెడ వానిఁ గూలిచి మదీప్సితము న్నెఱవేర్చుకొంటి న
న్యాయ్యమొ న్యాయ్యమో నరక మైనను నాకది స్వర్గలోకమే.

ధర్మ— (దుర్యోధనుని సమీపించి కౌఁగిలించుకొని)

గీ. నేఁడు భీముఁడు చేసిన నింద్యకర్మ
మును సహింపఁగదన్న ! తప్పులు క్షమింపు
మన్న ! మదిసిగ్గుఁ జెందకుమన్న ! పూర్వ
కృతముఁదప్పింపఁ జేయఁగా నేరితరము ?

క. ఏలా పగచెద వకటా !
నీ లోభము నీ మదంబు నీ చిన్నతనం
బీలాగు పరిణమించెను
గాలముఁ గర్మంబుఁ గడవఁగలరే మనుజుల్ ?

అర్జు— దుర్యోధనా ! విచారింపకుము. తత్త్వమరసిన నీవే సుకృతివి.

ఉ. బందుగు లెవ్వరుం దిననిభాగ్యము భాగ్యమె ! భర్తృహీనలై
కుందుచు మీకళత్రములు గొల్లు మనం గనుఁగొంచు దూఱఁగాఁ
గొందలమందుచుం గెలుచుకొన్న ధరానరకంబుకంటె ని
ర్ణిందితసౌఖ్యరాశి యగు నిర్జరలోకము మేలుగాదొకో ?

కృష్ణ— ధర్మజార్జునులారా ! ఎందుల కీయప్రస్తుతనిర్వేదము ?

ఉ. కోరి సమస్తముం గెలుచుకొంటిరి బందుగులెల్లఁ జావ కే
పోరును లేక చత్తురె రిపుల్ ? చనుదెంచునె రాజ్యలక్ష్మి మీ
కోరినరీతి ? ధైర్యమెడఁ గూర్చుఁడు నేఁటికిఁ దీఱిపోయె మీ
వేరము; లేదుపు ల్మొదలునెట్టితి రక్కటా ! నవ్వువేళలన్.

దుర్యో— (కృష్ణునివంకఁ జుఱచుఱఁ జూచుచు)

క. పాపము సేసియుఁ బశ్చా
త్తాపంపడుపాండవుల నదల్చుచు నీ వో
పాపాత్మ ! యేలొకో సం
తాపము చెందెదవు కంసదాసకుమారా !

నీవు పాపపుబండితోలుటయు విజయుఁడు తొడవిూఁదఁ జఱచుకొం
టయు నేను జూడకపోలేదు.

మ. ఎటులైనన్ ధర ధర్మపుత్రకునిచే నేలింపఁగానుంటి మ
త్పటుశక్తిం బవమానసూనుఁడు గతప్రాణుండు గానీ భవ
త్కుటిలత్వంబు నసూయయున్ దెలిసె నో గోవింద ! కీల్బొమ్మ లీ
వెటు లాడించిన నట్టులాడుదురుగాదే పార్థు లీయేవురున్.

లజ్జాపరిత్యాగముఁ గావించిన నన్నేకాదు, ముల్లోకములు జయింప
వచ్చును. శిఖండి నెదుటఁబెట్టుకొని పితామహుని జంపించితివి. "చక్రం
బుఁ దాల్ప" నని ప్రతినపట్టియుఁ జేపట్టితివి. ధర్మరాజుచే నసత్య

మాడించి కుంభసంభవుం బరిమార్చితివి. సిగ్గుమాలి పార్షతుండు శవకంఠము నఱకుచుండ నివారింపలేకపోయితివి. దూరమునుండి భూరిశ్రవస్సు చేయి నఱికించితివి. కర్ణునిఁజంప ధర్మభీతిచే వెనుదీయు నర్జునునకు దురుపదేశం బొనర్చి పాపము గట్టికొంటివి. తుట్టతుద కొంటిసైన నన్నుఁగూడ ఋజుమార్గంబునఁ జంపింపలేకపోయితివి. ఛీ! సిగ్గులేక తగవులాడవచ్చితివి. నీయితివృత్తం బెవ్వరెఱుఁగరు?

కృష్ణు— దుర్యోధన! నీ శక్తికొలఁది దుష్కృతులు నీవునుఁ జేసితివి.

క. నీకర్మంబున కెవ రో
యీకర్తలు? వాసుదేవుఁ డెవ్వఁ డొనర్పన్
బాకారికైనఁ బాపం
బాకారమునం గులక్షయం బొనరించున్.

భీమునకు విషము పెట్టించి, పాములఁ గఱపించి, నీటఁద్రోయించితివి. కుమారులతోడఁ గుంతిని లక్కయింటఁ గాల్పించితివి. పాంచాలరాజపుత్రికి సభలోఁ గట్టువలువ లొలిపించితివి. చేఁత గాని ధర్మరాజునకును మాయాద్యూతవిశారదుండగు నీ మేనమామకును దురోదరంబుఁ గల్పించితివి. నీ బావమఱఁదిచే వనంబున ద్రౌపదినిఁ బరాభవింపఁజేసితివి. నన్నుం గట్ట నుంకించితివి. పదిమంది రథికుల నొక్క బాలునిమీఁదికిఁ బురికొల్పి చంపితివి.

క. దుండగములు మాకంటెను
రెండింతలు గలవు హెచ్చరించిన విను మెం
దుండును ధర్మము జయ మం
దుండునను మ నెవ్వరెఱుఁగ రోయి దురాత్మా!

దుర్యో— గోపాలా! ఇది ధర్మమునకుఁ గాలము గాదు. కలికాలము వచ్చినది. కపటోపాయము లేనివారికి జయము లే దనుము. ఇది వినుము.

సీ. చదివినాఁడను వేదశాస్త్రంబు లర్థుల
కిచ్చినాఁడను మనోభీప్సితమ్ము
లేలినాఁడను భూమి యేకాతపత్రంబు
ప్రజలను సంతోషపఱచినాఁడఁ
జరిపినాఁడను పెక్కు జన్నము ల్పుత్రులఁ
గాంచితిఁ బున్నరకంబు వాయ
మెచ్చించినాఁడ సుమిత్రుల నార్జించి
పొందినాఁడను సర్వ భోగములను

క్షత్రియులచేత మిగులఁ బొగడ్తగన్న
కదన మరణంబుఁ గంటి నాకంటె భాగ్య
శాలి సుకృతి వదాన్యుండు చతురమతియుఁ
బండితుం డెవ్వఁ డేమిలోపంబు నాకు?

గీ. బంధుగులు లేక సైన్యసంపదలు లేక
సంతసము లేక తగిన వంశంబు లేక
బహుళ దుఃఖాకరంబగు సాడు నేల
యీ యుధిష్ఠిరుచేత మోయింపుమయ్య.

(తెరలోఁ గోలాహలము, దివినుండి పుష్పవర్షము గురియును)

ధర్మ— (సిగ్గుతోఁ దనలో) ఔరా! ఈ సుర లీతని పల్కు లెట్లు పొగడు చున్నారో! (తల పంకించి) ఔను. ఇతఁడు మనయెడల నెట్టివాఁడైనను రాజ్యపాలనాదులయం దెందును దుర్మార్గుఁ డనిపించుకొన్న వాఁడు కాఁడు. (యోజించి)

ఉ. అమ్ములపాన్పుమీఁదఁ దనయంతన చావఁదలంచి మాఘమా
సమ్మునఁ గోరి తాత దివసంబులు లెక్కిడుకొంచు నున్నవాఁ
"డెమ్మెయి రాజరాజును జయించితి వీ" వన నెట్టు లీ యన
ర్మమ్ము వచింతు వృద్ధకురురాజు నిఁకేగతి నూఱడించెదన్?

చ. మడిసిరి బంధుజాలము సమస్తము; రాజ్యముఁ బ్రోవఁజాలు నే
కొడుకు కనుకొంటిమో యతఁడుఁ గూలెను ముండితమూర్ధయైన యీ
పుడమిఁ బునర్భువు న్వయసుపోడిమి వోయిన నేను సంతసం
పడుచుఁ బరిగ్రహించుటకుఁ బాల్పడఁ జేసెనె దైవ మక్కటా!

కృష్ణ— ఉ. ఇంటికిఁబోద మేల పదునెన్మిదినాళ్ళు గతించె వీరికిన్
గంటికి నిద్రలే దుదయకాలముదాఁకను బోమ పాణి మీ
తుంటవి; కెంతసే పితనితో శవజాగరణంబు రండు మీ
బంటులు మీరు చేతు లెదపై నిడి స్వస్థత విశ్రమింపఁగన్.

— మంచిది. (అందఱితోఁ బరిక్రమించి) బావా! వసుదేవనందన!

క. పరమపతివ్రత గాంధా
రరాజనృపపుత్రి మదిఁ గరంబును శోకం
బొరసి మనల శపియించెడిఁ
గురురాజు నధర్మరీతిఁ గూల్చితి మనుచున్.

కృష్ణ— ఆమెను మీ పెద్దతండ్రినిం గూడ నే నిప్పుడ చని తగువిధంబున నోదార్చి శాంతులంజేసి వచ్చెదను. రండు పోదము. (నిష్క్రమింతురు)

(తెరలో మంట కన్పట్టును)

దుర్యో— (తేటిపాఱఁజూచి తనలో) ఏమో! అర్జుని తేరట్లు మండుచున్నది. వట్టి తేరు మండిన నేమిలాభము? (ప్రకాశముగా) ఎవరురా అక్కడ? (యోజించి) ఛీ! మూఢదుర్యోధన! ఇంకను నీవు పిల్చినఁ బలుకువా రెవరు?

సంజ— (దుఃఖముతోఁ బ్రవేశించి) దేవా! నేను సంజయుఁడను. నేనిక్కడనే కను పెట్టుకొని యున్నవాఁడను.

దుర్యో— (కౌఁగలించుకొని కన్నీటితో) సంజయా! పాండవులొనర్చిన యనర్థమును గన్నులారఁ గాంచితివిగదా! గురుపుత్రునితో నిదియెల్లఁ జెప్పి

క. కడసారి తల్లిదండ్రుల
యడుగులకున్ నాకు మారు నంజలి యిడి వా
గడలకయుండు నుపాయము
కడువడిఁ గరిపురికి నరిగి కావింపు మిఁకన్.

సంజ— ఇట్టిస్థితిలో నిన్నొంటిగ డించి యరుగ నాకెట్లు కాళ్లాడును?

దుర్యో— ఇంతకన్న నాకు నిప్పుడు కావలసిన ప్రయోజనము వేఱొండు లేదు పొమ్ము. (నిరూపించి) నాకై కుందుచుఁ బౌరులెల్లఁ దటవచ్చుచున్నారు. వార నోదార్చి పురంబున కంపుము. (సంజయుఁడు కన్నీటితో నిష్క్రమించును)

దుర్యో— (తెరవంకఁ దిరిగి)

ఆ. వె. పౌరులార! వగవఁ బనిలేదు నాకునై
చనుఁడు ధర్మజాతు శరణమనుఁడు
యశమునాది వార లన్యాయవర్తులై
యపయశంబుఁగొనిరి హరికతమున.

(దెసలు పరికించి తనలో) హా! దైవమా! క్రూరసత్త్వభయంకరంబగు నిమ్మహారణ్యంబున నన్నీ రాత్రి యెట్లు గడపింతువు? ప్రాణవాయువులారా! గంపంత బలఁగము వదలిపోయినను భగ్నోరువగు నీ శరీరము వదలలేకున్నారా? హా! సర్వలోకబాంధవా! అందఱు బందుగులవలె నీవుఁగూడ నాపై దయ విడచి చనెదవా? నీపోవుట న్యాయము గాదు. ఇప్పుడు మన మిరువురము సమాన తేజఓజోబల కాంతులు కలవారము. తుల్య వ్యసనులము.

శా. మందేహాభిధరాక్షసక్షతజరమ్యంబయ్యె నీమేను; నా
కుం దృప్తారిగదాప్రహారజనితక్రూరాహతిన్ రక్తమ
య్యెం దేహంబు; విపత్సముద్రమున ముందే మున్గితి న్నేను; ము
న్గం దాపైతివి నీవు; తుల్యులము కానన్ దేవ! నీవాఁగుమా.

కటకటా! భాస్కరదేవ! నారోదన మరణ్యరోదనము చేయుచున్నావా! నీకు నేనేమి యెగ్గుఁ గావించితిని? (యోజించి) అవును. "పాండవులందు నాకుఁ గడుఁ బక్షము ధర్మతనూభవుండు మన్మండవుటన్ ద్వదీయ మరణంబు హితంబ" యటంచు లోకబంధుండవు నీవు నాకభిమతుండవు గాకిపు డేగుచుంటె, మిత్రుండవు కష్టవేళ నిసిరో! యిటు తోడ్పడకుంట పాడియే?

కొండొకకాల మస్తమింపకుము. ఇంతలో నా రథికత్రయము వచ్చి నా మనోరథముఁ దీర్పఁగలదేమో? (ఆలోచించి) మూఢబుద్ధి! దుర్యోధన! గురుపరాభవాభిభూతుండవై నీవిట్లనుచుంటివే కాని సూర్యచంద్రుల గతి యాఁగునా? (బిగ్గఱగా) హా! అశ్వత్థామ! ఏను గతప్రాణుండనైనను నీ వనిన ప్రతినమాత్రము చెల్లించవలయును జుమా!

(మూర్ఛిల్లును)

(రథికత్రయము ప్రవేశించును)

అశ్వ— (కన్నీటితో సమీపించి) హా! దుర్యోధనమహారాజ!

క. నిన్ను నధర్మపు యుద్ధము
న న్నీతిఁ దొరఁగి యిట్లొనర్చి రనెడి వా
ర్తన్నేను వింటి, వచ్చితిఁ
జన్నే యిఁక మిన్నకుంట శక్తుఁడనయ్యున్.

దుర్యో— (మూర్ఛ తెలిసి)

చ. గురుతనయుండ! నిన్నుఁ గనుఁగో నసువు ల్బిగఁబట్టియుంటి స
త్వరముగ రాఁగదయ్య! బలవత్తర మైన విధం దరింప నె
వ్వరితర? మీ ప్రకారపు నవస్థకు లోనయితిం దురాత్ము లా
మురహరభీమఫల్గునులఁమూలమున న్విపినంబు లోపలన్.

(కౌఁగిలించుకొని)

క. నుదుల నుడికించి నన్ను
న్వెడలించిరి నీటనుండి, వెడలించి ననున్
జడుపేది గదారణమునఁ
దొడలు విఱుఁగఁగొట్టి రకట! దుర్నీతిమెయిన్.

అశ్వ — (కోపముతోఁ దలపంకించి) ఏమీ ! దురాత్ములగు పాండవు లిట్లొంటి వానింజేసి నిన్ను భంగపఱిచిరా ! చూడు నేఁడు నీమనోరథము దీర్చి భానుమతీదేవితో ద్రౌపదింగూడ సమాన దుఃఖభాజనం గావించెద. దైవానుగ్రహమున నంతదనుక నీ ప్రాణములు నిలిచెనేని మరల వచ్చి నీకా వృత్తాంతమును వినిపించెదను. నన్నభిషేకించి యనుపుము.

కృపా — (జనాంతికము) అబ్బాయీ ! అడుగుఁద్రొక్క నేల కాలుగడుగ నేల? భవదీయ విజృంభణంబు పాండవుల కపకారము గావచ్చుఁగాని, యీ సుయోధనునకు మాత్ర ముపకారంబు గానేరదు. కావున నీవీ దుర్వ్యవసాయ ముడుగుము. వంశచ్ఛేదము సేయరాదు సుమీ !

అశ్వ — మామా ! అటులేనిం బితృద్వేషియగు పాంచాలపశువును జంపకుండు మనెదవా ? పాండవవంశచ్ఛేదము నేఁడు వేఱుగఁ జేయ నక్కఱలేదు,

మ. జగదాచార్యుఁడు శస్త్రము ల్విడిచి స్వేచ్ఛం బ్రాణబంధంబు వా
యఁగ దుర్మార్గుఁడు గత్తి చేకొని తదీయగ్రీవ నిర్లజ్జతన్
దెగఁగోయం గని రెప్పుడో యపుడె పో ! నిర్మూలితం బయ్యె ; నా
పగ సాధింప నిమిత్తమాత్రి మిపు డశ్వత్థామ శారద్వతా !

అదియునుంగాక పాండవులు నాకు సుయోధనామిత్రులగుటచే శత్రువులను కొంటివేమో ! కాదు కాదు. గురుద్వేషియగు పార్షతుని చేతులు నఱికింపకపోవుటచేతఁ జుమీ !

మ. అకటా ! బాపమఱంది యంచుఁ ద్రిజగత్త్వాచార్యుఁడౌ నొజ్జను
న్నికృతిం జేసిన నీచుఁ గాతురొకో ! యంతేవాసులే పాండుపు
త్రకు ! లీ రీతి బరాభవంబు తనయంతం జావఁగా నున్న తా
తకుఁ జేయింతురె గొంతుకోఁత ? పరమాత్మద్రోహులో మాతులా !

ఛీ ! వారిమాట తలంపకుము. తండ్రికిని గురువునకును భేదమున్నదా! (ఆలోచించి) కౌలశేయులకుఁ దండ్రియెడలఁ గౌరవమన నెట్టిది ? భూమియం దెంద ఱెందఱో రాజులుండ నైనవేయుల నాశ్రయించిన గురున కిట్టి యవమానము వచ్చుట యబ్బురముగాదు (బిగ్గఱగా)

గీ. కర్ణుదెసఁ జేర్మిఁ జూపిన కౌరవేంద్రు
పట్టుదల యీ ప్రకారము పండెఁగాక
నాఁడు కాదొకో ! ద్రౌణిసేనానియే న
వని యపాంచాలయాదవ పాండవంబు.

దుర్యో — ఆచార్యనందన ! నాయపరాధము లన్నియు సహింపుము.

ఉ. శాంతనవుండు పోరుదివసంబులఁ గర్ణుఁడు లేమి, హా సతం
-డంతముఁ జెందుదాఁక సమరావని కీ వొకభంగి యాట, నిం
తింతలు పుట్టె నంతటియదృష్టము నేమును నోఁచనైతి నా
సంతతి మాపుకొంటి సహజన్ముల నందఱిఁ గోలుపోయితిన్.

కృత— మహారాజ! ఎందులకీ కృతోద్ఘాటనము! నేఁడైన మమ్ము నిరువుర సేనగా నిర్ణయించుకొని యితనికిం దదాధిపత్యం బొసంగుము.

దుర్యో— ఎవఁడురా యక్కడ? పావనోదకంబులు తెప్పింపుము (ఆలోచించి) హా! మూఢదుర్యోధన! నవఖండమండలాధిపత్యంబు గావించియుఁ బిలిచినఁ బలుకువారు లేకుండఁ జేసికొని యొరిని బిలిచెదవు. నీవే తెచ్చికొమ్ము.

కృత— (కలశముతోఁ బావనోదకముం దెచ్చి) దేవా! ఇవిగోఁ బరమపవిత్రంబులగు నుదకంబులు. తడయక గురునందను నభిషేకింపుము.

దుర్యో— (అభిషేకించుచు) మదీయసేనాధిపత్యము వహింపుము. (యోజించి) సేనాధిపత్యమేకాదు. రాజ్యమే యేలుకొనుము.

మ. మతిమంతుం గురునంతవాని నిను దుర్మానంబునం జేసి య
ర్చితుఁ గావింపక సూతపుత్రకునకున్ సేనాధిపత్యం బొసం
గితి నా యొగ్గు సహింపు మన్న! నను నీ క్రీఁగంటఁ గాపాడు మ
న్న! తగన్ దీర్పఁగదన్న నాయెడ దయన్ నా కోర్కి ద్రోణాత్మజా!

అశ్వ— మహారాజ! మేము పోయివచ్చెదము. (నిష్క్రమింతురు)

దుర్యో— (పరుండి)

గీ. కదలుచున్నాఁడు పీఁడింకఁ గలదు ప్రాణ
మనుచు నక్కలు దూరమునందు నిలువఁ
గటికి నేలఁ బరుండు నే కౌరవేంద్రుఁ
డంపబావులు బుగబగమనుచు మండ.

హా! అశ్వత్థామ! నీవు గావించునపాండవము వినుటకు నే నోఁచుకుంటిని గాఁబోలు. మూఢచిత్తమా! పాండవవంశ మంతరించిన నీకేమి లాభము? కాకపోయిన నీకీదుర్లభ మనోరథము దీర్చువారెవ్వరు? హా! దుశ్శాసనాదిసహోదరులారా! సోమదత్తభగదత్తాది మూర్ధాభిషిక్తులారా! హా ప్రాణప్రియా! రాధేయా! మీరందఱుఁ ద్రిదివంబున నాకై నిరీక్షించుచున్నారా! మీ దరికివచ్చుదారి నాకు లేకున్నది. హా! అసూర్యంపశ్య! లక్ష్మణమాత! భానుమతీ!

గీ. “ నిండు పేరోలగంబున నీయగండు
వలువలొల్వించెఁ గాదె ద్రోవది ” కటంచు
భీముఁడే మానహాని గావించుకాఁడొ
సత్యసంధుని ధర్మజు శరణమనుము.

హా ! తల్లిదండ్రులారా !

గీ. తనయులను నూర్వురను ధురంధరులఁ గనియు
బాపమతియగు నొక్కనావలవమీకు
ముసలితనమునఁ బగయింటి భోజనంబు
విధవకూఁతురు దిక్కౌట విధి లిఖించె.

ఓ నిద్రాదేవి ! నీకైన నాపై దయలేకపోయెనా ! (కన్నులుమూసి కొని) రథధ్వనివలె నున్నదే! రథికత్రయము వచ్చుచున్నదేమో! (ఆకాశము వంకఁజూచి) రాత్రి యామ మాత్రావశిష్టము కావచ్చినది.

క. పలపలని వెన్నెలలు ది
క్కులకుఁ బర్వంగ వజ్రకుండలశోభా
కలితమయి చంద్రబింబము
చెలఁగెఁ బ్రాచీపురంధ్రి చెవికొనయందుఁ.

అశ్వ— (కృపకృతవర్మలతోఁ బ్రవేశించి) ఓ మహారాజ ! బ్రతికియుంటివా లేదా ?

క. మామయుఁ గృతవర్మయుఁ దో
డై మది కుల్లాసపఱుప నరుల నడఁచి నీ
కా మాట దెలుప నశ్వ
త్థామ దరికి వచ్చె ద్రోణితనయు నెఱుఁగుదే !

పాఱిపోయిన పాండవ పంచకంబును నీతమ్ముఁడు యుయుత్సుండును గృష్ణ సాత్యకులును దప్పఁ దక్కిన బలమంతయును నామావశిష్టముఁ గావించితిని.

దుర్యో— (విని యల్పస్వరముతో) గురునందనా ! యీనైపునకు రమ్ము.

గీ. నిన్నముదమునఁ గనుఁగొని నీ మొగంబు
గానపాండవమును విని మేనువాయఁ
బ్రాణములు నిల్పుకొంటి నో ద్రోణతనయ
యిమ్ము కడసారి యాశ్లేషణమ్ము నాకు.

అశ్వ— (సమీపించి) మహారాజా ! నీపరివారమునం దెల్ల మేమే విశ్వాసహీనులము.

గీ. అందఱాత్మీయులను మునుముందఁబంపి
కదలుచున్నావు స్వర్గలోకమునకీవు
లేక పోయెను నీతోడిలోకమునకు
మాకుఁ జనుదెంచు పుణ్యమో మానవేంద్ర!

ఉ. "నీకు విరోధియైన జననింద్యచరిత్రునిఁ జంపెఁ బార్షతున్
నీకొడు" కంచుఁ జెప్పు మవనీధవ! ద్రోణునితోడఁ; బాండవా
నీకము నెల్ల నేఁడు స్మరణీయముగా నొనరించె నంచు స్వ
ర్లోకమునందు దేవతలలోపల నీయశ ముగ్గడింపఁగన్.

కృత— మహారాజా! ఇది పరాజయ మని తలంపక దేవేంద్రునిఁ బోలి స్వర్గమేలుము.

గీ. పాండవుల కోడి నీవు ద్వైపాయనహ్ర
దమున డాఁగితి వనుట కాదపయశంబు;
ద్రోణపుత్రుని కోడి వారును బలాయ
మానులైరిగదా! యభిమాన ముడిగి.

కృపా— కౌరవేశ్వరా! నీవు వారికంటె సర్వవిధంబుల సుకృతాత్ముఁడవు.

గీ. బాంధవులతోడ సకల సంపదలతోడఁ
త్రిదివమున కేగుదువు జగద్విదితకీర్తి;
వంశమా లేక తగిన సంపదలు లేక
వారుజీవచ్ఛవంబులైనారు నేఁడు.

దుర్యో- ఆచార్యా! సత్యము వచించితివి. (అశ్వత్థామనుద్దేశించి పరమప్రీతితో)

ఉ. ఎంతపరాక్రమంబు వహియించితి! వింతటిసంతసంబు గ
ల్గింతువటంచు నే నెఱుఁగ లేఖవిభున్ దలఁదాటి నాఁడ నే
డింతపనిన్ బొనర్చిరె మహీసురపుత్ర! గురుండుఁ గర్ణుఁడున్
శాంతనవుండు శల్యుఁడును; సఖ్యపుమేరను దెల్పితి మ్మెయిన్.

మీ ముగురికన్న నాకొండొరు లుపకారులు లేరు. ఎన్నటికైన మరల మీదర్శనంబు త్రిదివంబున నగుంగాక. నాకై విచారింపకుఁడు. సర్వమనోరథము లనుభవించిన నాకే కోరికయును లేదు.

కృపా— ఇంతవఱక మర్త్యలోక దేవేంద్రుఁడవై యిఁకఁ బరలోక సౌఖ్యసామ్రాజ్యపట్టాభిషేకము నందనున్న నీకుఁ గావలసినదేమియును లేదు. అయిన నిట్లగుఁ గాక.

## భరతవాక్యము

చ. ఇల భరియింత్రుగాక ధరణీంద్రులు నీవలెఁ, గాని యానశేం
ద్రులకు సతీపరాభవము ద్యూతము లాడుట పిన్నతండ్రిపు
త్రులకు ధరాంశ మీక విత దొమ్మి యొనర్చుట లేక పోవుఁగా
కలిమి రచింతురిగాక సుకవీశ్వరు లీకథఁ బెక్కుకావ్యముల్.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

## గద్య

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతి శతావధాని తిరుపతి వేంకటేశ్వరులచే
రచియింపఁబడిన పాండవవిజయమున సర్వంబును
అష్టమాంకము సంపూర్ణము.

# తప్పొప్పుల పట్టిక.

| పేజీ. | పంక్తి. | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 10 | 30 | డేవ | డేవఁ |
| 29 | 12 | | "పలువురు నిన్నుఁ జుట్టిముట్టుదురుగాక" అనిన తరువాత "నీకు జయము లేకపోవుగాక" అని చేర్చుకొనవలయును. |
| 61 | 2 | బాహ్య | బాహ్యఁ |
| 62 | 7 | | మొదట (తెరలో) అని చేర్చుకొనవలయును. |
| 78 | 31 | ఠిపు౯ | రిపు౯ |
| 112 | 20 | మీాదిఁకి | మీాఁదికి |
| 114 | 14 | షీ | చీ |
| 115 | 20 | నించె | నించెఁ |
| 115 | 21 | కాని | గాని |
| 117 | 5 | షీ | చీ |
| 119 | 8 | కాఁగ | కాగి |
| 121 | 21 | రితి | రీతిఁ |

శ్రీ మత్పరదేవతాయైనమః

శ్రీ

# పాండవాశ్వమేధము

# ఇందు వచ్చు పాత్రములు

**ప్రథమాంకము—**

అశ్వత్థామ
కృపాచార్యులు
కృష్ణుఁడు
భీముఁడు
అర్జునుఁడు
వ్యాసుఁడు
నారదుఁడు
ధర్మరాజు
ద్రౌపది

**ద్వితీయాంకము—**

ధృతరాష్ట్రుఁడు
గాంధారి
విదురుఁడు
వ్యాసుఁడు
పంచపాండవులు
కృష్ణుఁడు

**తృతీయాంకము—**

నారదుఁడు
పంచపాండవులు
ద్రౌపది
దౌవారికుఁడు
కృష్ణుఁడు
వార్తాహరుఁడు

**చతుర్థాంకము—**

కవి
వర్తకుఁడు
భీష్ముఁడు
ధృతరాష్ట్రుఁడు
విదురుఁడు
పంచపాండవులు
కృష్ణుఁడు
వ్యాసుఁడు
గంగ

**పంచమాంకము—**

ధౌమ్యుఁడు
కాణ్వుఁడు
సూర్యవర్మ
కేతువర్మ
ధృతవర్మ
మంత్రి
వజ్రదత్తుఁడు
గంధర్వుఁడు
దుస్సల

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

(ప్రథమాంకము)

(నాంది)

ఉ. భారతసంగరాంతమునఁ బాండుతనూభవులందు దుఃఖపుఙ్
భారము దీర్చి వారల కపారపు రాజ్యము నిచ్చి యుత్తరా
దారకుసేమ మారసి పదంపడి వారల నశ్వమేధసం
చారులఁజేయుఁ గృష్ణుఁడు భృశమ్ము యశమ్మనిశమ్ము శమ్మిడున్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి తెరవంకఁ జూచి)

సూత్ర— మారిష ! ఏల యీ యాలస్యము ? ఇటు రమ్ము.

మారి— (ప్రవేశించి) ఇదిగో వచ్చితిని. ఆలస్యమున కేమున్నది?

సూత్ర— ఎవరితోడనో యెందులకో వివదించుచున్నట్లున్నావు !

మారి— (తనలో) ఇంతవఱకు వినిపించినదే ! (ప్రకాశముగా) ఇఁక నెవరు న్నారు ? మన మైత్రేయుఁడు.

సూత్ర— పాపము శాంతించుఁగాక, గురువుతో గ్రుద్దులాడ మొదలు పెట్టితివే! అందునను ఏగురువు ననుగ్రహమ్మున మనమిట్టి రంగస్థలమున నిర్భయమ్ముగ నిలువఁ గలిగితిమో, అట్టి భారతగురువుతోడనే నా కలహించుట!

మారి— (తనలో) భారతగురు వెవరు ? ద్రోణాచార్యులాయేమి ? (యోజించి) కాదు భరతశాస్త్రగురువు గాఁబోలును (ప్రకాశము) గురువుతోఁగాదు, గురుపుత్రునితో.

సూత్ర— ఓహో ! ఇదియా నీతెలివి !

క. గురునకు గురుసుతునకు నం
తరముండునె వెఱ్ఱిగాని తత్తనయుని న
గ్గురునిబలె వరయ నేరని
మొఱకులు గూలుదురు నరకమున నిక్కముగన్.

మారి— (గర్వముతో) సమయమువచ్చినచో నేను గురువునే లెక్కించువాఁడను గాను నా కితఁడు లక్ష్యమా !

సూత్ర— (నవ్వుచు) అవును "తల్లిచెవులు ద్రెంచువానికిఁ బినతల్లిచెవులు బీఱపువ్వులును గా" వఁట. సరే ఇంతకును గలహ మెందుకుఁ దటస్థించినది?

మారి— ఎందుకా ? ఎందుకేమిటి దుర్మార్గులకు! నిన్నరాత్రి నిదురఁబోవుచున్న మా పిల్లల నితఁడు గొట్టినాఁడఁట.

సూత్ర— అతఁ డేమంత యవివేకి కాఁడే ! నిదురబోవువారి నెందుకుఁ గొట్టును? ఎట్టివారి నేని యింతకుఁ గొట్టవలసిన యవసర మేమి ? ఇది నమ్మఁదగినది కాదు. ఈలా గని నీతోఁ జెప్పినవా రెవ్వరు ?

మారి— మాయింటి యజమాని పుట్టింటి నవుకరు. ఆ పైని నాభార్యకుఁ గోపము వచ్చి యతని నెట్లేని యవమానింపక తప్పదనియు, నందులకు జరిమానాగా నాతని శిరోభూషణముఁ దెమ్మనియుఁ బట్టుపట్టినది.

సూత్ర— ఆఁడువాండ్ల మాటలను బుచ్చుకొని మనము యుక్తాయుక్తములు విడిచి కలహమునకుఁ గాలుద్రవ్వవచ్చునా ?

మారి— నేను గలహము గూడదనియే నేర్పుగానే యడిగించి నాఁడను.

సూత్ర— (కోపముతో) ఛీ! ఛీ! ఇంకను సిగ్గులేక యేమో చెప్పఁబోవుచున్నావు. గురుద్రవ్యాపహారముగూడ నీ కుచితమని తోఁచినదా? (తనలో) ఓహో! ఈ ప్రశంసలోఁ బ్రకృతము మఱచితినే! (ప్రకాశము) సరే దానిం గుఱించి పిదప మాటలాడికొందముగాని, యీనాఁడు మనము ప్రదర్శింపఁదగిన నాటక మెయ్యది ?

మారి— పాండవాశ్వమేధమని యూహించితిని.

సూత్ర— ఎట్లు ?

మారి— మీ రొనరించిన నాందినిబట్టి.

సూత్రి— చక్కఁగాఁ బోల్చితివి. ఈ గ్రహింపువలననే కాఁబోలును, మీరు తెరలో మొదటి యంకము నప్పుడే కొంత ప్రదర్శించినారు.

మారి— (తనలో) ఓహో! ఈతఁడింకను ఆవిషయమై నన్నెత్తిపొడుచుచునే యున్నాఁడే! (యోజించి) అయినను ఇప్పట్లు నాకిది యనుగ్రహమే (ప్రకాశము) అవును పాండవులకన్న మన మెక్కువవారమా యేమి? వారు తిప్పొనరించిన గురుపుత్రునిఁ బరాభవింపఁ బ్రయత్నింపలేదా? (తెరలో) ఎవఁడురా నన్నుఁ బరాభవించువాఁడు?

సూత్ర— (అనాకర్ణితముగా) సరే, యీ పోలికలకేమిగాని మనము కవుల ప్రశంస బొత్తిగా సభాస్తారులకు శ్రుతపఱపమైతిమే.

మారి— ఈ కవులంగుఱించి వేఱే మనము చెప్పనక్కఱలేదు. తిరుపతివేంకటేశ్వరులు శతావధానులు చర్లబ్రహ్మయ్యశాస్త్రిలవారి శిష్యులు నని నెల్లరును నెఱిఁగియే యుందురు.

సూత్ర— అవును. ఆ మాటనిజమే, వీరు సుప్రసిద్ధులే; వీర లిదివఱ కనేక గ్రంథము లొనర్చి యున్నవారలు.

(మరలఁదెరలో) ఎవఁడురా నన్నుఁ బరాభవించువాఁడు?

మారి— (ఆకర్ణించి) అదిగోఁ జూచితివా? ఇప్పటికిని విరమింపక మైత్రేయుఁడు నాపైఁ గయ్యమునకుఁ గాలు ద్రవ్వుచునే యున్నాడు.

సూత్ర— (నవ్వి) నీ గొడవనీది, ఆతఁడు మైత్రేయుఁడు గాఁడు, అశ్వత్థామ. మన మీపాటికిఁ బోవుదము. (నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

(అంతఁ గత్తి చేతఁ బట్టుకొని రక్తసిక్తాంగుఁడై
యశ్వత్థామ కృపకృతవర్మలతోఁ బ్రవేశించును.)

అశ్వ— (క్రోధావేశ సంతోషములతో)

ఉ. శత్రుల నెల్లఁ జక్కడఁచి స్వామిఋణమ్మును దీర్పఁగంటి; స
త్పుత్రుఁడ నైతిఁ దండ్రితలఁ ద్రుంచిన ఘుస్మ్రు నుగ్గణంచి; లో
కత్రయ రాజ్య మబ్బినను గా దిఁక నింతటికన్న మోద; మీ
గాత్రముతోడఁ జేయఁదగు కార్యము లే దిఁక నాకు నెయ్యెడన్.

(కొంచెమాలోచించి) లేకేమి? పాండవహాతకులును గృష్ణసాత్యకులును గూడ నీవేషముతోడనే వధింపఁదగినవారు. (తూర్పుదిక్కు చూచి) ఇంకను గొంత రాత్రి మిగిలియే యున్నది. ప్రభాత మగునంతవఱకును మహేశ్వరుని వర మనుసరింపఁదగినదే. (వెనుకకు మఱలి) సఖా! దుర్యోధన! ఇదిగో నీ మనమ్మున నున్న కొఱఁతఁ దీర్ప గురుపుత్రుం డేగుచున్నవాఁడు. సజీవుఁడవై యున్న నీకీవార్త వినిపింపని నన్ను మన్నింపుము. భీమగదాఘాతంబుల నలిగియున్న నీవీమాత్రము వార్త కేని నోఁచవేమో యని వారల వెదకక త్వరగా జరిగినపట్టు వినిపింప వచ్చితిని. కానిమ్ము,

క. పాండవుల మరణ మదియు
క్కండున్ దక్కంగ వింటికాదె! కడమ, నీ
పిండంబులపై ధారకు
నుండున్ దప్పేమి? యిదియు నొక సంతసమే.

ఓరీ ధర్మజ భీమార్జున నకుల సహదేవులార!

ఉ. మాయలమారి కృష్ణుఁడు ప్రమాదము దప్పఁగఁ జేయఁ బోలు; నీ
రేయి యపాండవంబు నొనరించినవాఁడనె లేక యున్న; మీ
రేయెడ నేని యున్న నెదురేగుఁడు; నేనిదె సన్యసింపఁగా
నాయిత మైతి; నీ కొదవ యన్నది నాకిఁక నుండకుండుతన్.

(చెవియొగ్గి) ఎక్కడను బ్రతిశబ్దము వినరాదు. పాఱుఁబోతులు ప్రత్యుత్తర మెందు కొసంగుదురు!

చ. హ్రదమున డాఁగెనంచు నృపు నాఁటి కూఁతలు కూసినట్టి మీ
రెదురిపుడేల రారర యిహీ! యిది పౌరుషమానురోరి? దు
ర్మద మది యేడఁ బోయెనురా? మాటున భీతిలి డాఁగుకన్నఁ జ
చ్చి దివికిఁ జేరుటొప్పదె యిసీ! యభిమానములేదె, పందలే?

ఎక్కడ డాఁగుదురో చూచెదంగాక, మిమ్మితఁడు శేషము, మిగుల్చు వాఁడను కొంటిరే. (పోఁబోవును.)

కృపా— (నడుము గట్టిగా వెనుకనుండి పట్టుకొని) గురునందనా! శాంతింపుము శాంతింపుము. పాఱిపోయినను జచ్చినను నొకటియేకదా! ఎందుకీ యకాండ తాండవము.

అశ్వ— మామా! నీకు నమస్కారము, నన్నీపట్టున నడ్డగింపకుము.

కృపా— ఇంతకన్నను, విజయి వగుదువు గాక, ప్రభాతము కావచ్చినది. ఇప్పుడిఁక వారల నెదకుటకు వ్యవధిలేదు. శాంతింపుము.

అశ్వ— ఏమి! యింతకన్నను విజయమా?

ఉ. చంపిచంపని రీతిఁ జంపితిని ధృష్టద్యుమ్ను సైన్యమ్ములన్
గుంపుల్ గుంపులుగాఁగఁ గూల్చితిని నేఁగుర్పాండవుల్ దక్క మా
యింపన్ జేసితిఁ బోటుమానిసుల నా కీనాఁటి కయ్యమ్మునం
దింపే వుట్టె దెదుర్కొనన్ గడఁగు వారెందున్ గనన్ రామిచే.

కృపా— గురునందనా! అప్పటి మాటట్టులుంచుము. ఇప్పుడుమాత్రము నిన్నెవరేనిఁ దేఱిపాఱఁజూడఁగలరా?

తే. గీ. కట్టుపుట్టమ్ములెల్ల రక్తమున నిండి
నిదురలేమిని గన్నుల నెత్తురురలఁ
బూల నిండు నశోకపు భూరుహమ్ము
నన్నుకరించునినుఁగన గన నడలువుట్టు.

కృపా— కుమారా! నీ వింతకుమున్న చెప్పినదే యైనను విస్పష్టముగాఁ దెలియమిని మరల నడుగుచున్నాఁడను. ఉపపాండవు లేమైరి?

అశ్వ— ఏమైరా ? మేనమామలకుఁ దోడైరి.

కృపా— శివశివా ! ఎంతపాతకము నొనరించితివి !

అశ్వ— (వెడనవ్వుతో) పాతకము గాక యింకొకటి పుణ్యమున్నదా !

ఉ. పాపమొ పుణ్యమో విను మపాండవముగ్ గొనరింతుపొంటె నే
నీపనిఁ బూనితిన్ మిగిలి రేవురు వారలు వారిఁ జంపుటే
యీపసిబాలురన్ గడపు టేపయి వారలు రాజ్యమేలఁగా
నోపరు ; దీనిచే మన సుయోధనుచిత్తము సంతసిల్లెడున్.

ఇఁక నేనీ పాపోపశాంతికై తపంబు చేసికొన నేగెదం గాని మీకీ శుభవార్త పుత్రశోకాతురుండగు నాంబికేయున కెఱిఁగించి యూఱడింపుదురుగాక !

ఉభయులు— మంచిది (వెళ్ళఁబోవుదురు.)

అశ్వ— మామా ! మాట, రారాజుతో నిందాఁక నీమాటచెప్పితినా ?

కృపా— ఏమాట ?

క. "ధృష్టద్యుమ్నుని నీకు న
నిష్టుని నిద్రించియున్నయెడ నెన్నెన్నో
కష్టములు వెట్టి తుదకు ని
కృష్టంపుం జంపుఁ జంపి గడపితి ననుమీ."

ఇట్లు పుణ్యలోకగతుఁడగు మీతండ్రితోఁ జెప్పు మనియేనా ?

అశ్వ— అవును.

కృపా— చెప్పితివి, మాకు బాగుగ జ్ఞాపకమున్నది.

కృత— ఇదియే కామ. "తక్కిన మనరాజులనందఱిని గూడ నడిగితి" నని సయితము చెప్పుమంటివి. నీవీ క్రోధావేశముచే నిప్పుడు మఱచితివి.

అశ్వ— అట్లైనఁ గృతకృత్యుఁడనైతిని. మీరు చనుఁడు. నేనునుం బోవుచున్నాను. (కృపకృతవర్మలు నిష్క్రమింతురు.)

(అశ్వత్థామ కొంత వఱకునడచి తనలో)

అప్పుడే భగవంతుండగు సూర్యుఁ డుదయించినాఁడే?

క. మందేహు లనెడి రక్కసు
లందఱినిం దునిమి రక్తమది తన దేహం
బం దెల్ల నిండ రవి సా
చందమునన్ సత్వరవిశీఁ జనియెడి నదుగో.

అవును. ఇంతకన్న సన్మార్గమేముండును? సన్న్యస్తశస్త్రుండనై తపంబున కేగుచుంటిఁగదా ? (దృష్టినిగుడ్చి) అదిగో ద్వైపాయనాశ్రమము. ఇఁక ఖడ్గ మెందుకు ? (ఖడ్గమునుద్దేశించి)

ఉ. ఛాగములన్ వధించెడి కసాయి విధమ్మునఁ గుత్తుకల్ దెగం
గాఁ గెరలించి రక్తమును గంఠము నిండఁగ సారెసారెకున్
ద్రాగితి తృప్తినొందితి పినాకిపదమ్ముల వ్రాలి మ్రొక్కి నా
యీగతి నెల్ల దెల్పఁ జనుమీ యిఁక నిన్నుఁ బరిత్యజించితిన్.

(ఖడ్గమును బాఱవైచి పరిక్రమించి) ఇదిగో ద్వైపాయనాశ్రమమ్మునకే వచ్చితి నిఁక నిమ్మునులతోఁగూడి వారు చెప్పినచొప్పున నిష్పాతకమ్మునకుఁ బ్రతీకార మ్మొనర్చుకొనియెద. (వైమనస్యముతో జందెము చేతఁబట్టుకొని)

క. పుట్టినది బ్రాహ్మకుల మెటు
పట్టించితి వాయుధమ్ముఁ బట్టించితి వో
యిట్టిపనులు సేయింతురె
కట్టా ! యజ్ఞోపవీతకమ ! దయవలదే.

(తెరలో)

మ. గురుపుత్రుండని మీకు సంశయము గల్గంగాక భీముండు ము
ష్కరులన్ సైఁచెడివాఁడు గాఁడు గురు వోఁ గాకన్యుఁడోఁ గాక దు
శ్చరితున్ జంపక యున్నరాజు చెడు వాత్సల్యమ్ము లేనట్టి యి
ద్దురితాత్మున్ వధియించి ద్రౌపదికి సంతోషమ్ము గావించెదన్.

(కృష్ణార్జునులతో భీముఁడు ప్రవేశించును.)

అశ్వ— కానిమ్ము దీని కేమి, మంచిపనియే చేయించితివిలే,

తే. గీ. పరశురాముండు మును రాజవరుల నెల్లఁ
దునిమెనని చెప్పుటది కొంత త్రిప్పుపక్షు,
మరలఁ బొగరెక్కి నీ రాచమండలంబు
తిరిగియును బ్రహ్మతేజమ్ము దెలిపి తీవు.

అమ్మహాత్ముఁడు వోవుగతికే యేనునుం బోవుదుఁగాక. (సంశయముతో) అమంగళము శాంతించుఁగాక. ఆతఁడు తుట్టతుదకుఁ గురువంశజుఁ డగు భీష్మునిచే నవమానింపఁ బడియె; నట్టు నాకునుం గలిగెడి నని స్ఫురించుచున్నదే! (ధైర్యముతో) కానిమ్ము బ్రహ్మశిరోస్త్రంబు నాయొద్ద నున్నంతవఱకు నీ కురువంశజులగు నర్జునుండును గిర్జునుండును, భీముండును గీముండును నన్నేమి సేయఁగలరు. (నిష్క్రమించును)

భీము— బావా! యదునందన! నీవింత మెల్లగా రథము నడిపినం గాదు. త్వరగాఁ బోవనిమ్ము. లేదా నేను ముందేగెదను. మీరు వెనుక రండు. ("గురుపుత్రుండు" అనునది మరలఁ జదివి పోఁబోవును)

కృష్ణు— (చేయి పట్టుకొని) బావా!

చ. గురుసుతుఁ డన్న నేమియనుకొంటివొ! ద్రోణునికన్న నెక్కుడే
వ్వరికి నసాధ్యుఁ; డీవు బలవంతుఁడవే యనుకొ; మ్మైనన్
ద్వరపడు టొప్పునే! యతని దర్ప మెఱుంగవిదే! యుపాయమున్
బఱపినఁ గాక మత్తకరిఁ బట్టుకొనన్ వశమౌనె యెవ్వరికిన్?

భీము— (కోపముతో) ఏమంటివి?

క. ఏమంటివి గురుసుతుఁడా
నాముందఱ నిల్చువాఁడు! నా గద యశ్వ
త్థామను గిశ్వత్థామను
భూమికి బలియీదె, దీని పొగ రెఱుఁగనిదే?

అర్జు— అన్నయ్యా! శాంతింపుము.

తే. గీ. అతఁడు చిరజీవి వివిధశస్త్రాస్త్రవేది
యతనిఁ జంపఁగ మనకెట్టు లలవియగును?
పరిభవ మొనర్చి ద్రుపదాత్మభవకు దుఃఖ
భరము దీర్చుటయే పెద్ద భరము తుదకు.

క. ఇరువురము సమానమ్ముగ
గురునొద్దన్ జదివితిమి; యగుం బుత్త్రుం డా
గురున కతం, డేశిష్యుఁడ
నిరువురకున్ భేద మింత యిట నుండుఁ జుమీ.

చ. అతఁ డిటువంటి పూన్కిమెయి సాహసభూమికి బుద్ధిపూర్వక
స్థితి నరుదేఁడు; వచ్చినను జేసెడి చేఁతయె లేదు; నేఁడు దు
ర్మతి యగు నా సుయోధను పరాభవమున్ విని స్వామియప్పు దీ
ర్చు తలఁపు పుట్టి యిప్పనికిఁ జొచ్చె నతం డతి రౌద్రమూర్తియై.

కృష్ణు— సంశయ మేమి? వెనుక నారాయణాస్త్రమ్ము ప్రయోగించినప్పు డేమైనది? అది యీతఁడుమాత్ర మెఱుఁగనిదా? భీష్మద్రోణకృపాశ్వత్థామలు నల్వురును మన కజేయులే. అయినను, అందు రెండు సముద్రమ్ముల నాయా యుపాయమ్ములం జేసి దాఁటితిమి. తక్కు రెంటితో మన కప్పు డంత యవసరమే లేకపోయినది. ఇప్పు డిప్పనియైనను,

క. అనయమతి యైన దుర్యో
ధను పంపునఁ జేసెఁ గాని తనయంతన తా
నొనరించునె గురుసుతుఁ డెం
దును ధర్మాధర్మపద్ధతులు నేరఁడొకో.

అర్జు— సంశయమేమి? ఎంత యోగ్యుల కైనను రాజనిరోధమ్మునఁ గొన్ని యకృత్యమ్ములు పొసఁగుచుండును.

చ. గురుఁడును భీష్ముఁడుజ్ మనకుఁ గూర్చెడివారలు కారె, వార లి ర్వురుఁ జనుదేరె యుద్ధమునఁ బోరఁగఁ, జంపరె పెక్కుమంది, నె వ్వరుఁ దమ పూను వేషమును బట్టి చరించుట యొప్పదే! మతుల్ దిరుగనె తన్మయం బగుగతిజ్ బవరంబు లొనర్చుపట్టునజ్.

కృష్ణు— నీవు చెప్పినదియే యిక్కడఁ దగియున్నది. నాటకములోని వేష ధారులే యొకప్పుడు తన్మయు లగుచుఁ దత్తత్కృతులకు సిద్ధ మగుదురు. అట్టిచో నిజముగా యుద్ధసన్నద్ధు లగువారి కాయా సమయమ్ముల బంధు త్వాదికంబు పొడకట్టునే?

భీము— యుద్ధసన్నద్ధు లగువారిం జంపిన నీతఁ డపరాధియే కాఁడు.

క. ఎదఁ జేయి పెట్టికొని పొరి
నిదురించెడి వారిఁ బట్టి నింద్య మనక చం
పెదరకొ శూరులు! లోకం
బిది మెచ్చునె? పరము గలదె! యిహ ముండెడినే?

కృష్ణు— ఆ తప్పునకే కదా, యితఁడు గురుపుత్త్రుం డైనను బరాభవింపవలసి వచ్చినది. (పరిక్రమింతురు)

అర్జు— అదిగో ద్వైపాయనాశ్రమము. అటఁ బారాశర్యమునీంద్రులు శిష్య సహితముగాఁ బుణ్యగోష్ఠిచేఁ గాలం బపనయించుచున్నారు. వారి దర్శింపవలసినదే కాని వా రిప్పటి మన యుద్యమమ్మున కంతరాయ మ్మొనరింతురు. కాన నిటనుండియే నమస్కరింపుదము. (రథమును దిగుదురు, నమస్కరింతురు)

భీము— (కొంతముందు నడచి దృష్టి నిగుడ్చి) ఇదియే భాగీరథీతీరము. మన మాతని నీయెడలనే వెదక వలయును.

కృష్ణు— అదుగో. ఒక పిన్న సన్యాసి, కాఁడు కాఁడు. అశ్వత్థామ.

తే. గీ. కేల జపమాల మెయినిండ రాలు బూది
దండను గమండలువు మోల దర్భలొప్ప

నయనములు మోడ్చి కృష్ణాజినంబుమీఁదఁ
గూరుచున్నాఁడు తపసియై గురుని కొడుకు.

బావా! పవననందన!

చ. తనపొనరించు దుష్కృతికిఁ దద్దయుఁ బాండవు లల్గి వత్తురో
యనుభయమో, యిసీ! ద్విజుఁడనై పొనరింపఁగ రానికృత్యముల్
బొనరిచినాఁడ నన్ హృదయమో ద్వయమో గురునందనుల్ విర
క్తినిఁ గనఁజేయఁ బోలుఁ బరికింపుమ యీతనిదైన వేసముల్.

(అశ్వత్థామ ప్రవేశించును.)

భీము— (పండ్లు పటపట గొఱుకుచు) నీవు మొదల నుడివిన హేతువే సరిగా నున్నది. (ముందుకునడచుచు) ఓరీ! విప్రకులాధమ! భ్రూణహత్యా పరాయణ!

ఉ. బాణకలాభిమాన మది భగ్నముగా నిసివేళఁ బోయి ని
ద్రాణులఁ జంపి దొంగవలెఁ దాపసినై యిట కేగుదెంచితే!
ద్రోణుప్రతిష్ఠ గంగఁ బడఁ ద్రోచితె! యింతన చావు దప్పెనే!
ప్రాణము లింత తీపె? పసిబాలురఁ జంపితి వేమి? దుర్మతీ!

అశ్వ— (చూచితనలో) ఓహో భీముఁడా! వెనుకఁ గృష్ణార్జునులుగూడ నున్నట్లున్నారే! అగుం గాక, వీరిలక్ష్యమేమి. (ఊరకొనును)

భీము— తే.గీ. లేచిరావేమి రోరి? నీచ మడఁతు
నీచపుం బనిఁ జేసియు నేమమేల?
గురుసుతుండ వటం చూరకొందు మనుచుఁ
దలఁపఁబోకుమ! యీ దారి తప్పెనేఁడు.

చ. చదివితి వేమి సార్థకము శాస్త్రము వేదము నెల్లవిద్దెలున్?
మది నొకయింతయున్ దయయు మానము లేని వివేకహీనపుం
బ్రదుకును గణ్యమే? యెటకుఁ బాఱిన నెయ్యెడ సొచ్చినన్ క్షమిం
పమ గద! నే క్షమించినను మద్గప యోరి దయావిహీనుఁడా!

(కృష్ణార్జునులు సమీపించుచున్నారు.)

అశ్వ— (తనలో) మనమూరకున్నను ఈతఁడూరకొనునట్లులేదు. ఈ ప్రేలరి కిదియే యుత్తరం బగుఁగాక (తృణమునభిమంత్రించి) తల్లీ! బ్రహ్మశిరంబ!

చ. ధర కలిగెం గదా! యనెడి దర్పమునన్ బొగరెక్కి "దేవునై
గురువునునై" యనుంగతిని గ్రొవ్వి చరించెడి యిద్దురాత్ములన్
బొరిగొని నాదుపూన్కి మెయి భూమి నపాండవమున్ బొనర్చి యు
క్కురుకులనాథు చిత్తమునకున్ ముదమున్ దనుకంగఁ జేయుమా.

(పాం. అ. 2) (విడుచును.)

కృష్ణ— (తత్తఱముతో) అర్జునా! అర్జున!

ఉ. పావనిపల్కులన్ గనలి బ్రహ్మశిరంబు సరంహుఁడై మహీ
దేవసుతుండు నించె నిది ద్రిప్పఁగ సాకును, నీకునున్ మహా
దేవునకున్ గడింది నెస దీనికి దీనినె పంపుమయ్య యా
పైవిధిఁ జూచుకొందమదె పావని చచ్చెడిఁ జచ్చెడిన్ సఖా!

అర్జు— (శరమభిమంత్రించి విడిచి)

శా. అమ్మా! బ్రహ్మశిరంబ! నాగురుఁడు ద్రోణాచార్యపుత్రుండు జీ
వమ్మం బాయక యుండఁగా వలయు; మావంశమ్మునన్ మేము సౌ
ఖ్యమ్మున్ గాంచవలెన్; బ్రపంచమునకున్ గష్టమ్ము రా రాదు; నీ
విమ్మైనన్ను ననుగ్రహించి చనుమా! యీయస్త్రమున్ ద్రిప్పుమా!

(తెరలో) ఓహో సాత్యవతేయ! దగ్గఱ నుండియు నిట్టిపని చూచుచు నూరకుంటివేమి? వారింపుము వారింపుము.

(వ్యాసులు ప్రవేశించును)

వ్యా— (ఆకాశమువంకఁజూచి తనలో) ఓహో! నారదులవారి వాక్యములా యివి!

(నారదుఁడు ప్రవేశించును.)

నార— ఓ అశ్వత్థామార్జునులార!

క. ఇప్పటికి నెన్ని యుద్ధము
లిప్పుడమిం జరిగె! నెవ్వరేనియు దీనిం
గుప్పిరె? యిది జగ మడఁపదె?
యిప్పాపపుఁబనికి మీర లెట్లొప్పితిరో?

వ్యా— అర్జునా!

క. గురువన గురుసుతుఁ డన నో
క్కరూపు గా కున్నె? యతఁడు కనలిన మనకుం
ద్వరపడు టుచితమె? శరమున్
మరలింతువు గాక జగము మాయించెదవే?

అర్జు— (వినయముగా) మహాత్ములారా! క్షమించి నామనవి చిత్తగింపవలయు.

క. మీయానఁ గట్టువడి నే
నా యస్త్రము గ్రమ్మఱింతు నతఁ డారీతిన్
జేయునొ చేయఁడొ యది మీ
రే యూహింపంగవలెఁ జుఁడీ దయకలిమిన్.

(అస్త్రమునంకఁ జూచి) అస్త్రరాజమా !

తే. గీ. గురువునెడ భక్తిఁగలనేని గూళతనపుఁ
బనికిఁ జొరనేని భీతులఁ జెనకనేని
నిన్ను నమ్మి పూజించితినేని శాంతిఁ
జెంది లోకహితంబు సేసెదవుగాక.

నార— కుమారా ! నీయస్త్రముం గూడ నుపసంహరింపుము.

అశ్వ— ఇదిగో నుపసంహరింపుచున్నాఁడను. (తనలో)

గీ. అతఁడు దేవాంశసంభవుఁ డగుటఁజేసి
యధిక గురుపాదనిరతాత్ముఁ డగుటఁజేసి
యుపశమింపఁగ నేర్చె నా కుపశమింప
రాదు, చేసెడిదేమి ? యీమీఁద నేను.

ఇట్లగుంగాక (ప్రకాశము) మహాత్ములారా ! వినుండు.

చ. ఎఱుఁగుదు నిట్టి యస్త్రమును నేయుట తప్పని; రాజరాజు నాఁ
బరఁగు సుయోధనున్ శిరము ప్రయ్యఁగఁ దన్నిన దానిచేఁ గృథా
భరము వహింపలేక యిది పాండవులన్ గడతేర్చుపొంటె నేఁ
బఱపితి లోక మీ శరముబారికిఁ దా గుఱి గాక యుండుతన్.

వ్యా— ధర్మాత్ములగు పాండవుల వధించుట నీ తరము గాదు. మా మాట విని మఱలింపుము. మఱియు నింకొకటి వినుము.

తే. గీ. పోరు దుర్యోధనునితోడఁ దీఱె మీకు
నిరువురకు నాల మియ్యది యెందుకొఱకు ?

నార— ఎందుకొఱ కననేల ? ఇతఁ డొనర్చిన యకార్యముంబట్టి సహేతుకమే యయినను యేదో యొకవిధమున సంధి యగుట శ్రేయము.

వ్యా— (ఆలోచించి) గురునందనా ! యెవరేని నీది తప్పనక తీఱదు. సత్య ప్రతిజ్ఞు లగు పార్థులు మిన్నక పోవువారు గారు. కావున,

తే. గీ. నీ శిరోమణి వారి కీ నేర్చెదేని
సంధి యగు నింత కొండు పొసంగ దిందు.

అశ్వ— (తనలో) ఓహో! మును లెంత పక్షపాతముగాఁ దగవు దిద్దుచున్నారు. అగుఁగాక. ముని నైతింగదా ! ఇఁక వైరము తగదు. ఈ మణితో నా కేమి యవసరము ? (ప్రకాశముగా)

చ. కురుపతిఁ గెల్చి రత్నములు కొల్లలుగాఁ గొనినట్టి ధర్మభూ
వరునకు నిట్టి రత్న మొక ప్రాఁతియె ? విప్రుల ద్రవ్యముఁ గ్రహిం

చిర మెగడన్ దలంచు నృపశేఖరు ? లిచ్చితి దీని నో మునీ
శ్వర భవదర్పితమ్మగ, భవద్వచనం బవిలంఘ్య మాటచే.

ఇద్దాని ధరించువారలకు నాఁకలియు దప్పియు శ్రాంతియు నెప్పుడును జనింపవు. ఇట్టి నా ప్రాణమ్ము నిచ్చియు నిఁక శాంతి యెట్లు పొందనేర్తును ? (కోపముతో)

తే. గీ. బ్రాహ్మణస్వాపహారమ్ము పాండవులకు
వేడ్క గావున నిది పాండవేయ దార
గర్భముల నెల్ల హరియించుఁగాక పిదప
శాంతి గనుఁగాక కనుఁగాక సంతసంబు.

కృష్ణ— (తనలో) ఓహో! యీ దురాత్ముఁడు మరల నస్త్రమును బ్రజ్వలింపఁజేయుచున్నాఁడే!

మునులు— అందొక్కటి మా వచనంబున నిలుచుఁగాక.

కృష్ణ— విధిగా నట్లగుంగాక.

అశ్వ— (తనలో) ఉత్తరాగర్భము గాఁబోలును. (ప్రకాశముగా) మీ పక్షపాతవచనమ్ము లిప్పట్ల సాఁగవు.

ఉ. మీరును మీరునుం గలసి మెల్లఁగఁ జల్లని మాట లాడినం
దీఱెడిపాటి గాదిది సుతీక్ష్ణము బ్రహ్మశిరోస్త్ర, ముత్తరా
దారకు గర్భమంద భసితం బొనరించెడిఁగాక దానిచేఁ
బోరిది యేల వచ్చెనని పొక్కుచు నుందురుగాక పాండవుల్.

కృష్ణ— గురునందనా! యిటు చూడుము.

ఉ. నీదగు నస్త్ర మిట్టిదని నేను నెఱుంగుదు; నందుకే కదా!
నీదెస నింత చెప్పితిమి నీ వటు చంపెదవేని వానికే
నే దయఁ బ్రాణ మిచ్చితిని నీవిఁకఁ జేసెడి దేమి? పొమ్ము నిన్
గాదన నేల! నీకుఁ దగుఁ గా కిది యొడ్లకు నెందుఁ జెల్లునే.

అక్కమరుండు నీ మేనమామయొద్దనే యస్త్రవిద్య నేర్చికొని భూమిం బరిపాలించుఁ గాక. నీవిప్పాపమ్మునం జేసి మూఁడువేలేండ్లన్నవస్త్రమ్ములు దొరకక దుర్గంధదూషితశరీరుండవై తిరుగుదువుగాక.

వ్యా— అది తప్పక యమోఘమ్మగుఁ గాక.

అశ్వ— ఏమీ! నన్ను శపించితివిగా! నీకును నేను బ్రతిశాప మీనేర్తును గాని యమ్మ్యాది నేఁట రేపట నొక్క పతివ్రతాశిరోమణిచేఁ గానై యుంటఁ జేసి యూరకుంటి.

చ. విదురుని యింట విం దనుచుఁ బెట్టితి సంధి చెడంగ; నాజికిం
గుదురని హానిఁ బార్థుఁ బురికొల్పితి గీత లటంచుఁ జెప్పి; యా
పద గలవేళఁ గర్ణుపయిఁ బంపితి పార్థుశరంబు ; చక్రమున్
దుద కొకసారి పట్టితివి ; ద్రోహము లియ్యవి కావె ? మాధవా !

ఇవి యిట్లుండుంగాక.

చ. నరుఁ డతిధర్మతత్పరుఁ డనం దగు నుత్తముఁ డయ్యు నీ వచ
స్సరణికి లోఁగి కాదె విరసమ్ములు పెక్కు లొనర్చె ; నాఁటిసం
గరమున సన్న సేయు టది కాపురుషుల్ పొనరించుకృత్యమా ?
పరువు గలట్టి యుత్తముల పద్ధతియా ? వివరింపు మో హరీ !

నీవు విష్ణ్వంశసంభూతుండ వగు మహానుభావుండ వగుటం జేసి నిన్నేమియు ననఁగూడదు కాని యైనను యథార్థమునకుఁ దప్పుండఁ గూడదు గదా !

ఉ. కర్ణుఁడు దుర్గయుం డగుచుఁ గౌరవనాథుని బాడుచేసె ; నీ
నిర్ణయ మాదరించి యవినీతులు పాండవులైరి ; నీవునుం
గర్ణుఁడు లేక యున్న యెడఁ గౌరవపాండవయుద్ధ మున్నదే ?
గర్ణుఁ డొకండె దుర్జనుఁడు గాఁడు సుమీ వసుదేవనందనా!

ఇఁక నొకమాట నీతోఁ జెప్పి విరమింప నెంచుకొన్నాఁడను. ఇది యుంగూడ సావధానంబుగ నాకర్ణింపుము.

ఉ. పావనుఁడైన ధర్మజునిఁ బట్టిపలార్చి నిరోధపెట్టి నా
చావు వచింపఁ జేసి కలశప్రభవున్ గికురించి చంపి ; తీ
యేవపుఁగార్యముల్ జగము నెల్లెడ నెవ్వ రెఱుంగనట్టివా ?
రీవిఁకఁ గోటిజన్మముల నెత్తిన నిద్దురితమ్ము వాయునే ?

ఇంకను నీ దోసమ్ము లనేకములు గలవు గాని నేఁ బోవుచుంటి క్షమించి నాయందు దయ యుంచుము. (నిష్క్రమించును.)

వ్యా— (రత్నమును భీమునికిచ్చి) నాయనా ! పవమాననందన !

ఉ. ఈమణి నిచ్చి ద్రౌణిశిరమే యనుకొమ్మని చెప్పి పుత్రశో
కామయమగ్న యౌ ద్రుపదునాత్మజ నూఱడిలంగఁ బల్కుఁడ ;
కామిని ధర్మజుం డెదురుఁ గన్నులు గా మిము వేచి యుండ్రు ; మీ
రీమెయి నిల్వకే చనుఁడ యేమును బోయెద మిచ్చకచ్చుగన్.

(వ్యాసాదులు నిష్క్రమింతురు)

(ధర్మరాజును ద్రౌపదియు బ్రవేశింతురు.)

ద్రౌప— అయ్యో! కుమారులారా! అభిమన్యుని మృతికే విచారించుచుండ మీరుఁగూడ గన్మొఱంగితిరా? అయ్యో! అన్నలారా! అయ్యో తండ్రీ! అక్కటా! పుట్టినది మొదలెన్నఁడును సుఖమెఱుఁగనైతిఁగదా! అన్నా జూదమా! యెంతచేసితివి!

ధర్మ— దేవీ! యాఁడిల్లు మాఁడిల్లుము, క్షత్రియపుత్రుల కిట్టిమరణమే యెప్పటికైనఁ దటస్థించెడిది. (తనలో)

మ. గురులన్ జంపి కుమారులన్ గెడపి కోర్కుల్ మన్నుగాఁ జేసి యీ
కురువంశమ్మును బాండువంశమును బొగ్గుల్ సేసి తే మంచు నిన్
జిరకాలమ్మననుండి రాజపరు లుచ్ఛేదింపరైరో దురో
దరమా! నీదగు పేరెఱింగియును గట్టా! మోసపోతిం జుమీ.

ద్రౌప— అయ్యో! యీదుష్కృత్యము వలదని కృపాచార్యులైన బోధింపక పోయెఁ గాఁబోలును. తండ్రులారా! ఎంతెదుర్మార్గురాలనైతినోయి!

(కృపాచార్యులు ప్రవేశించును)

కృపా— ద్రుపదరాజపుత్రీ! నేను బోధింపక పోయినవాఁడఁగాను. తల్లీ యిదియంతయు నవశ్యంభావియగు కాలపు దౌర్మార్గ్యము. అట్లుకాదేని,

ఉ. ఏగురుఁ బార్థులన్ మిషమెయిన్ దొలఁగించిన యాదవోత్తముం
డీగుఱుతించుకం తెఱుఁగఁడే? యిటు లౌటకు నొప్పికాదె తా
మేఁగెడివేళ వీరి నిట నేదిగఁద్రావుట నాఁటఁ బాండవుల్
డాఁగిరి గాని ప్రాణములు దక్కుట దుర్లభ మేరికేనియున్.

ధర్మ— ఆచార్యా! యెప్పటికన్న నాఁటి విశేషమేమి?

కృపా— చెప్పెద నవధరింపుము.

చ. అటులు సయోధనుం డనుప నయ్యెడ నేఁగెడివేళ మధ్య నొ
క్కట వికృతాకృతిన్ శివుఁడు గానఁగనై తుదకున్ బ్రసన్నుఁడై
"యిటు విధిచోదితంబ యగు మీవు నిమిత్త" మటంచు ఖడ్గమొ
క్కటి దయచేసి తానతని కాయమునం దిమిడెన్ స్వయమ్ముగన్.

ధర్మ— వింటివా? పాంచాల రాజపుత్రీ! ఇది ప్రళయకాలరుద్రుం డొనర్చిన కృత్యముగాని యశ్వత్థామది కాదుసుమీ!

ద్రౌప— మనుజులు నిమిత్తమాత్రులుగాని యన్నింటికిని భగవంతుఁడే మూలము. అయ్యో! తండ్రులారా! మఱఁదులయందు దయగల్గు శ్రీకృష్ణునకు మీయందు దయలేక పోవుటయు నా దురదృష్టమే!

ధర్మ— పతివ్రతా శిరోమణీ! ఇది యవశ్యంభావియే కానిచో,

ఉ. నెన్నఁ డెఱుంగనట్టి పని వీసము నుండ దెఱుంగనట్టి భం
గిన్నటియించు; భూభరము కేవలమున్ హరియించుపొంటెఁ దాఁ
బన్నె నటంచు వింటిఁ గురుపాండవయుద్ధ, మబద్ధమానె? యా
పన్నులఁ బ్రోచు శౌరి కిది భారమె! వీరల కాయు వుండినన్.

కృపా— సమస్తధర్మవేదులగు మీ కొరులు చెప్పవలసినది లేశమును గాన రాదు. అమ్మా ద్రౌపదీ!

ఉ. ఏల సమస్తముం దెలిసి యిట్లు వృథా విలపించెదమ్మ? గో
పాలుఁడు నిన్నుఁ జెల్లెలిని బాలన సేయక మిన్నకుండునే
వీ లోకయింతయున్న? నిది విశ్వజన ప్రళయంబు కానిచో
నాలములోన లేని గురునాత్మజుఁ డేమిటి కల్గఁగావలెన్.

ద్రౌప— ఎందు కల్గిన నేమి. నా కడుపునఁ జిచ్చు వెట్టెనుకదా. అయ్యో! బ్రాహ్మణుఁడై పుట్టి యిట్టి యకృత్యమునకుఁ బాలుపడుట యెచ్చటను గన్నదియు విన్నదియుఁ గాదు. కొడుకులారా! అప్పాపాత్ముఁడు మిమ్మెంత కష్టపెట్టి చంపెనో కదా!

ధర్మ— (ఆలోచించి) ఆచార్యా! యిఁక నొక్క బాహ్యకారణ మియ్యెడ లేకపోలేదు సుమీ!

చ. ద్రుపదుని నాఁటనుండియును ద్రోణునికిం బడ; దక్కుతమ్మునన్
ద్రుపదసుతుండు ద్రోణుతల ద్రుంచె నధర్మము గాఁగ; దానిచేఁ
గుపితమనస్కుఁడై యితడు కోలుమసంగెను సైన్యమెల్లఁ; గో
పపరివృతాత్ము లౌజనులు పాపముఁ బున్నెముఁ జూడ నేర్తురే!

కృపా— అవును. నీ వనినదియు యథార్థమే (పరికించి) రాజా! భీమార్జును లెక్కడ?

ధర్మ— (సంశయముతో) పుత్రశోకాతుర యగు పాంచాలి నూరార్ప గురుపుత్రునిపై కరిగిరి.

కృపా— (కొంచెము కోపముతో)

గీ. అందఱము సల్పియుంటి మనర్హకృతులు
గణనచేసిన నిందు యోగ్యతము లెవరు?
నీ వెఱుంగవో సంగతి నే నెఱుఁగనొ
భారతమె బొంకు గాదె? యో పార్థివేంద్ర!

ధర్మ— (తనలో) ద్రోణుని మృతికై నాయొనరించిన దుష్కృత్యము నుగ్గడించుచున్నాఁడే? (ప్రకాశము) అవును, సత్యమే. నాకు గురుపుత్రునిఁ

బరాభవించుట యంత యిష్టమేలేదు. మన కర్మమున కతఁడేమి యొనర్చును. మీరు భీముని కోప మెఱుఁగని వారు కారుగదా! అతనివెంటఁ గృష్ణార్జునుల నేదో యొకవిధమున సంధి గావింపుఁడని పంచితిని.

కృపా— రాజా! మంచిపని చేసితివి. నీకు సర్వవిధముల వృద్ధియగుఁ గాక!

చ. మిగిలిన వార మేని యిది మే లది కీ డని చెప్పికొంచు దై
వగతికి నక్కజంపడుచు వందురువారల కొండొకళ్లు శాం
తి గలుగఁ జేసి కొంచు సుగతిన్ గనుమార్గము చూచుకోక యీ
పగ లివి యేల? మీరనఁగఁ బార్థివ మేమన నేఁటివారమే?

క. మీరని కొమరుం డనియును
నారయఁ డొక్కింత భేద మాదేశికుఁ; డా
ధీరుమొగ మైనఁ జూచి వి
చారించితి మంచితోఁవ సారాచారా!

ద్రౌప— అయ్యో! పట్టరానికోకమ్మున మారుతిం బ్రేరేపితి. దీన నేమి యుప ద్రవము సంఘటిల్లునో? దైవమా! ఇప్పుడిఁక నేమి చేసినను నా కొమ రులు లేచిరారుకదా!

కృపా— (తనలో) ఆహా! యీమె యెంతయోగ్యురాలో కదా! ఇట్టి సమయ మ్మునఁ గూడ వంశద్రోహి పట్ల నిట్లు పశ్చాత్తాప పడుచున్నది. (ప్రకా శము) అమంగళము శాంతించుఁ గాక! కృతసంధులై యరుదెంతురుగాక!

(అంతఁ గృష్ణ భీమార్జునులు ప్రవేశింతురు.)

భీము— పాంచాలరాజపుత్రి! ఇదిగో నాతని శిరోరత్నము. నీప్రతిన నెఱ వేర్చుకొనుము.

ద్రౌప— (పుచ్చుకొని) దీనికేమి! యమ్మహాత్ముఁడు నా కొమరులవలెఁ దల్లికి దుఃఖదాయి కాలేదు కదా!

కృష్ణు— వ్యాసాదుల యనుగ్రహముం బట్టియు ద్రోణుని నిష్పక్షపాతముం బట్టియు నిప్పటికి మీయత్తగారును నాచెయు ధన్యురాండ్రే.

ధర్మ— (సంశయముతో) అర్జునా! బ్రహ్మశిరంబు ప్రయోగించెనా యేమి?

అర్జు— అన్నగారి పలుకులం గనలి మొట్టమొదటనే యాతఁడు దాని నుపయో గించెను.

గీ. గగనమెల్లను మంటలఁ గప్పి పుచ్చు
నమ్మహాస్త్రమ్ము వదలు నెవ డడ్డువోవుట!
యతని తండ్రియె బ్రహ్మాస్త్రమై యవతరించి
మనలఁ గాపాడె; లేకున్న మనము మనము.

ధర్మ— అమ్మహాత్మునిం దలఁచుకొన్న నాకెవ్వరిచావుకన్న దుఃఖము పొడ మెడుఁజుమీ!

చ. కొమరునికన్న నెక్కుడుగఁ గూర్చు తలంపున విద్య చెప్పె; సా
ధ్యమయిన పట్టుఁ దా మనలఁ దాఁకకయే బవరంబొనర్చె; రా
జ్యము మన కీఁదలంచి తనచావున కేనియు నొప్పె; నిట్టి యు
త్తముఁడు దటస్థమాసె? యికఁ దమ్ముఁడ! జన్మము లెన్ని యెత్తినన్.

అర్జు— ఒక్కయీయనయే యేమి? వీరో,

చ. కృపుఁ డను నామ మీయనకె కేవలముం దగుఁగాక యాలమం
దెపు డెవరిన్ వధించు నటులే కనుపట్టు; దసాధ్యమైన బా
హుపటిమ గల్గి యీతఁ డిటు లూరక యుండుటఁ జూడ, నస్మదీ
యపరిభవాన కొప్పుమిరొ యాఁ జుమి కారణ మెన్నిభంగులన్.

కృపా— నీ వనినట్లే సాధ్యమైనంతవఱకు సంచరించినను దుష్టతుద కీఘోర కృత్యమునందు నేనుగూడ నుండవలసివచ్చెఁ గదా యని విచారించు చున్నాఁడను.

ధర్మ— గురువర్యా! ఇవి యేటిమాటలు?

ఉ. ఉండక తీరునే యొరులయొద్దఁ దగన్ గొలువుండి! యందులో
ఖండన మాచరించుపనిఁ బట్టి చరించెడునప్డు; శత్రులన్
గండడఁగింప టన్న సరిగా నగునే! యొకవేళఁ గొన్నియు
ద్దండపుఁ గార్యముల్ వలసి తప్పని వయ్యెడుఁ దప్పు మార్గముల్.

ద్రౌప— ఇంతకు నెవరి కర్మమున కెవరు కర్తలు? ఎప్పుడో యిట్టి దుఃఖము నితరులకుఁ గలిగించితిని. ఇప్పుడనుభవించుచున్నాను. ఒకరా! యిద్దఱా! అయిదుగురు కొమరులు వోయి రాయివలె జీవించియున్నదానను.

ధర్మ— ఆశ్చర్యమేమి? నూఱుగురు కొమరులు వోయిన గాంధారి జీవించి యుండలేదా!

కృష్ణు— ఇఁక నిట్లున్నకొలఁదిని దుఃఖ మతిశయించుచునే యుండును. లెండు త్వరగా స్నానము లాచరింపుఁడు.

క. పరలోకగతులకొఱకె
వ్వరు నింటఁ దాన మాడఁ వలదు; తటినికై
యరిగి యటఁ గ్రుంకు లిడుటయ
మరియాద సమస్త ధర్మమార్గము లందున్.

కృపా— అది యట్లే, నీవెఱుఁగని ధర్మము లేవి గలవు ?

ధర్మ— (తనలో) అక్కటా ! నాకుఁ బెద్దతండ్రిపోలికయే వచ్చినదిగదా దైవమా !

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవాశ్వమేధమ్మునఁ
బ్రథమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

## ద్వితీయాంకము

(అంత గాంధారీ ధృతరాష్ట్రులు విదురసహితముగాఁ బ్రవేశింతురు.)

ధృత— దేవీ! యీఱడిల్లు మాఱడిల్లుము.

ఉ. ఏకుటిలాత్ము లొడ్ల కెపు డెగ్గు ఘటింతురొ యేరు పెద్దలన్
గై కొని యేలరో సకలకష్టములుం దుది వారి కబ్బు; లో
కైకహితమ్ముగా నడచునట్టి మహాత్ములు సౌఖ్యభాక్కు; లీ
శోక మిదేల? దైవగతి చోద్యమె! శోకము కార్యకారియే?

గాంధా— (దుఃఖముతో) అయ్యో లక్ష్మణకుమారా! నీవైన బ్రతుకవైతివి గదరా! నాయనా!

ధృత— తండ్రీ! యింత జరుగు నని యెఱింగితి నేని నిన్ను రణరంగమునకే పోనీయకపోదును గదరా!

విదు— దేవి నోదార్చుటకు బదులు తాముగూడ నజ్ఞానమునఁ బడెదరేమి?

ఉ. ఇయ్యెడ శోక మందు ఫల మేమి? సమస్తము మున్నె యుంగమే?
కయ్యము సౌఖ్య మిచ్చుటయుఁ గల్గునె? యా యభిమన్యుఁ డిట్లనే
యయ్యకు నమ్మకుం గడుపునం దనలం బిడఁడే? జగమ్ములో
నెయ్యెడ నిట్టి శోకముల నెవ్వరు కుందనివారు? పార్థివా!

ధృత— (కనులు దుడిచికొని) నాయనా! దుర్యోధన!

చ. కడుపు దవానలంబుగఁ బొకారెడిఁ; గన్నులు మున్నె కానరా;
వడలెడి మాకు నేమి గతి యంచుఁ దలంచితి వయ్యొ? నూర్వురన్
గొడుకులఁ గన్న మాకు నొక కొడుకు_ను జేతికి నూఁత లేక పో
యెడినె? విధాత నీయెడల నింత వహించునె పక్షపాతమున్?

గాంధా— తండ్రీ! దుశ్శాసనా! నిన్ను నేనెట్లు మఱచి పోదు నోయి!

విదు— (తనలో) ఎంత కష్ట మెంత కష్టము. వీరి కేమి చెప్పి యూఱడిల్లఁ జేయఁగలను. ఇట్టి కష్టము శత్రువులకేని లేక పోవుఁగాక (ప్రకాశము) అమ్మా! వధూనికా!

ఉ. శత్రుల నాజి నోర్చి వెలుచక్ జగ మంతయు నాక్రమించి నీ
పుత్రకు లేలి యేలి తుదిఁబోయిరి యాహవరంగమం; దిదే
క్షత్రియు లైనవారలకు సమ్మత; మేడువ నేల? ద్రౌపదీ
పుత్రులు పోరె? జ్ఞాతులకుఁ బోరిత మూరక యిట్లు కల్గెనే!

ధృత— (కొంచెము సంతోషముతో) గురునందనుఁడు మాత్రము తుదకు మంచి పనిఁ జేసినాఁడు సుమీ తమ్ముఁడా! ఇంతపని కర్ణుఁ డేనియుఁ జేయలే దనియే నా తాత్పర్యము.

విదు— (తనలో) ఇప్పటికిని నితని కీదుర్బుద్ధి వదలనే లేదు. అయినను నిప్పు డేమియు మన మనఁగూడదు. (ప్రకాశము) ఏమంత శ్లాఘ్యమైన పని చేయలేదు. ఈ యకార్యమునకు నీవంటి జ్ఞానవంతులు సంతోషించు టుచితము గాదు. ఇంత యెందుకు? అతనికి బానటగానున్న కృపా చార్యులే యిందులకు సంతోషింపలేదుగదా! ఈసంగతి యాయన చెప్పిన మాటలవలన నీకు స్పష్టపడియే యుండును. "సర్వేజనా స్సుఖినో భవంతు" అందఱును సుఖముగా నుండవలెనని యెవరు కోరుదురో వారికి భగవంతుఁడు శుభముల నొడఁగూర్చును.

గాంధా—అమ్మా! దుస్సలా! మామూలమున నీకు వైధవ్యము తటస్థించినదికదా!

ధృత— ఓహో! పుత్రశోక మెంత తీవ్రమైనది! తండ్రీ! దుర్యోధన!

ఉ. అల్లుఁడు పోయినప్పుడుఁ ద్వదాత్మజుఁ డీల్గిన యప్పు డెల్ల రా
ట్పల్లజు లేగినప్పుడు నెదం గుదియించితిఁ; గర్ణుపోకకున్
దల్లడ మంతగాఁ గొనని ధైర్య మదెక్కడఁ బోయె నేఁడు నీ
త్రెళ్లినవార్త వింటిఁ గడతేఱితిఁ జచ్చితిఁబో పాకాలితిన్.

గాంధా— అయ్యో! అయ్యో! (మూర్ఛిల్లును)

విదు— (తనలో) ఆహా! పతివ్రతాశిరోమణీ! నీకడుపున నెంతటి దుండగులు పుట్టిరి! (ప్రకాశము) అమ్మా! గాంధారరాజపుత్రి!

ఉ. కన్నులు లేని భర్తదశఁ గాంచఁ గదమ్మ! యతండు నీదు దుః
ఖోన్నతిఁ జేసి ప్రాణముల నూడ్చెడిఁ; సౌఖ్యము పైఁచి; కష్టముల్
పన్నిన ధాతకైన యడలఁ జాడి యటమ్మ? ద్వాయమ్మ తుల్యమే
యన్న బంధొక్తుల్ దలఁపవమ్మ! పురాకృత మీడఁ బోవునే!

గాంధా— (మూర్ఛ దేలిసి) అయ్యో! భీముం డెంత దుష్కృత్యము చేసినాడు.

ధృత— దేవీ! మన బంగారము మంచిదైనఁ గంసాలి యేమి చేయును?

ఉ. "మాయ దురోదరం బుడుగుమా" యననో! "ద్రుపదాత్మజాత న
న్యాయము సేయఁగాఁ దగదురా" యననో! "వెసఁ బాలు పంచి యా
దాయలతోడఁ గూడఁ దగదా" యననో! వినఁడాయె నింతకుఁ
బాయని మంచిచెడ్డ లవి పల్కులఁ దీఱునె? యింత సేయవే!

(కొంచెము కోపముతో)

గీ. స్యాలకుండవై కొంపను గూలఁద్రోచి
తాత్మజుల మేనమామవై యడఁచివైచి;
తీవు చేరిన ఫల మిప్పు డింత లేట
తెల్లమాయె; వృథా మాట ధీరు లనరు.

విదు— అన్నయ్యా! యేమి మీ నెట్టి, శకుని యేమి చేయును? దైవగతి యిట్లున్నది.

గాంధా— అయ్యో! తమ్ముఁడా! నీ వెందుంటివోయి?

ధృత— (తనలో) ఓహో! ఇది యీమెకు మఱింత దుఃఖహేతు వైనదే! (ప్రకాశము) దేవీ! శోకావేశమున నోడ లెఱుఁగక యట్లంటివే కాని యతఁ డేమి కర్ణుఁ డేమి యెల్లపుడును మన బాగునకే ప్రయత్నించిరి. అయిన నేమి? మన మిరువురమును దురదృష్టవంతులము.

గీ. ఎన్నఁడో పెట్టిపుట్టితి మిన్ని బాము
లనుభవించుచున్నార మటియె యిపుడు
కాదు కూడదటన్నఁ బోఁబోదునుమ్మ
యెవఁడు చేసిన కర్మమ్ము నెవఁడు గుడుచు?

విదు— (తనలో) ఇట్టి సమయమున నితని నేమియు ననరాదు గాని, ఐనను (ప్రకాశము) అన్నయ్యా! మొదటి నుండియు మీకీ భ్రాంతియే యింత తెచ్చినది.

చ. శకునియుఁ గర్ణుఁడుం సలుపు సంగతులం దొకఁడేని మీరు లె
క్కకుఁ గనఁజేయుఁడీ సుకృతకార్యము! వీరల పొత్తుఁ జేసి కొం
పకేఁ గలిగెన్ వినాశనము పార్థివసత్తమ! యెందు బాలనా
యకము నశింపకుండునె! వృథాగ్రహముల్ తుది ముప్పొనర్పవే!

ధృత— అవును. తమ్ముఁడా! ఇది యంతయు నా లోపమే.

ఉ. పాఱఁ జెవి నిల్లు గట్టుకొని పోరితి; వేనును దేవియుం దురో
దర మది యాదిగాఁ బ్రతిపదమ్మును జెప్పితి; మింత వంత ను

స్థిర మయి యుండఁ బోలుఁ; జెవిఁ జేర్పక పోయె నొకింత యేని యు
క్కురుకులపాంసనుండు; కడకున్ మముఁ ద్రోచె విచారనీరధిన్.

(యోజించి)

తే. గీ. అంతరించిన వంశంబు నడఁగ నీక
మన పితామహి కెందు కీ మమత పుట్టెఁ
గావలయుఁ ? గావలయు నిన్ని కానిపనులు !
కావలయు దాని నాఁగఁగాఁగలరె యొరులు ?

(అంత వ్యాసులు ప్రవేశించును)

వ్యాసు— (తనలో) అయ్యో ! ఎంతకష్ట మెంతకష్టము! కొడుకుం గోడలి నేమొగముతోఁ జూతును ? అక్కటా ! నావంశమున కెంత ముప్పు మూఁడినది. ఛీ ! అజ్ఞానము నన్నుఁగూడ నావరించుచున్నదే.

ఉ. గీతలు సూత్రముల్ దగ లగించితి మేటి విరక్తి నంది లో
కాతిగ మైన జ్ఞానమున కాస్పద మైతిని; నన్నుఁ గూడ నీ
జ్ఞాతివధానలమ్ము పెలుచన్ గరఁగింపఁగఁ జొచ్చె నక్కటా !
రాతికి నేనిఁ దప్పదు భరమ్మగు దుఃఖము చేత మున్నచో.

(విదురునితో ప్రకాశము) ఓహో యింత జరిగినదా ?

విదు— మహాత్మా ! వీరి దుఃఖమ్ము నాప నావశము గాకున్నయది. తా మివ్వారిం దేర్చి యనుగ్రహింపవలయు.

ధృత— (తనలో) ఏమీ ! నా తండ్రియగు సాత్యవతేయుఁడా ! (ప్రకాశము) దేవీ ! యూఁజడిల్లుము.

వ్యాసు— ఆంబికేయా ! ఏమి నీ యజ్ఞానము !

తే. గీ. ఎవ్వరేనియుఁ జేసెడి దేమి గలదు ?
పాండుమరణంబు విని నేను బ్రతుక లేదె ?
దాని నటులుంచు భీష్మునంతటి సహోద
రుండు పోయియు నిటు లొంటి నుండవలసె.

గాంధా— అయ్యో ! అయ్యో ! యెంత పాపాత్మురాల నైతిని. ఒక కొడుకు నేనియు మిగుల్ప వైతివిరా నాయనా భీమన్నా !

విదు— అమ్మా ! గాంధారరాజపుత్రీ ! వ్యాసభగవానులు వచ్చినారు. ఇఁక మనకు దుఃఖోపశాంతి కలుగును. శోకముమాని వారి దివ్యోపదేశములను విందము.

ధృత— తండ్రీ! సాత్యవతేయ!

చ. జగ మఖిలమ్ము నోర్చి జయశాలి భృగూద్వహు నాఁగెఁ దండ్రిచేఁ
దగనివరమ్ముఁ గైకొనియె ధీరుఁడు భీష్ముఁడు ద్రెళ్ళనేల? యే
పగ నతఁ డంపశయ్యపయి వందురుచుండెనొ! వంశవృద్ధి ని
ట్టి గతికిఁ దెచ్చు కూళలకు డెప్పరమే యిఁక నేను నాసుతుల్?

వ్యాసు— తనయా! అటు లనవలదు.

చ. తన కులమెల్లఁ బోవునని తా మునుమున్న యెఱుంగుఁ గాన నా
యనుజుఁడు స్వేచ్ఛజీవి యగు నైనను జూడఁగలేక యాదినే
పని నెఱవేర్చి కొండొక నెపమ్మున నిట్లొనరించెఁ గానిచో
మన మెటు లొప్పుఁ జెప్పుమ? కుమార! కుమారుల చావు చూడఁగన్.
అదియునుంగాక,

చ. అతని యనుజ్ఞఁ గైకొనియె యట్లొనరించిరి వారు; కానిచో
బ్రతుకఁ దరంబె? కృష్ణ నొక ప్రాఁతిగ జూడని భీష్మముందు దే
వతలకునేని; నీ కొమరునైఖరు లింతకు నింతఁ దెచ్చె; దు
ర్మతు లుదయించు వంశములు మాయవె?. పెద్దలు బుద్ధిహీనులే!

విదు— "బుద్ధిఃకర్మానుసారిణీ" ఇంతకు నిది యిట్లు కాక తప్పదు.

చ. ఇరువుర మేలు గోరు జగదీడ్యుఁడు భీష్మునికన్న, వంశపుం
గురువగు ద్రోణుకన్న, ననఁగూడదు గాని, యొరుల్ పలంతురే?
యెఱిఁగియు నాపయిం దురము నేమని తా సరిపెట్టఁడయ్యె న
క్కురుపతి? సర్వనాశనము గోరకయుండిన నింతసేయునే!

వ్యాసు— మన మిప్పు డేమనుకొన్న నేమిలాభము?

చ. జరుగవె పెక్కు యుద్ధములు, చావరె పల్వురు, పూర్వకాల మె
వ్వరికిని నిట్టి సంగరము వచ్చినయట్లును నిట్టి దుర్మృతుల్
దొరఁగినయట్లునున్ వినము; దోర్బల ముండిన నుండుఁగాక, యొం
డొరులు నశింతురే? కడుపు లొక్కటఁ గాలిన యన్నదమ్ములై.

ధృత— అయ్యో దైవమా! సర్వసముఁడ వగు నీకీ పక్షపాత మెందుకు?

ఉ. ఐదుగు రైదుగు ర్గలిగి యట్లన యుండిరి సోదరాత్మజుల్;
నాదు సుతుల్ శతంబును వినాశము నందిరి; యందు నొక్కఁడు
న్నీదయకున్ దగండె? యవినీతి యొకింతయు లేదె వారియం?
దేఁ దగువాఁడనే దినము నీపయి వారిడు పొట్టకూటికిన్?

గాంధా— అందుకును భీముఁ డొప్పికొనఁడు. ఇంత వెట్టి యెందుకు? కొడు
కులకన్నను మనుమలకన్నను మనకీ మేనులు త్యజింపరానివా?

ధృత— చక్కఁగా నుడివితివి.

ఉ. ఇంతకుఁ బూర్తిగాఁ బ్రజల, కేమనుపాయ మటందుదు; వారి శోకపుం
బాంతమునందుఁ దూర్చెడి సుపాయము నేను గురిత్యజించుచేఁ;
యంతము లేని దుఃఖముల నార్తి సహించుట కన్నఁ జచ్చుటే
శాంతి; మఱెందు నింత కుపశాంతులు గల్గవు గల్గ నెమ్మెయిన్.

ఎవరురా యక్కడ! మాకుఁ జితిఁ బేర్పింపుము.

వ్యాస— కుమారా! యేమి నీ యవివేకము!

ఉ. చచ్చినవారితోడఁ బడి చత్తువె? యాత్మవిఘాతుకత్వముల్
దెచ్చునె సద్గతిన్? వలదె తేఁకువ? యార్యుల సేవ లేదె? యు
ద్యచ్చరితుండు ధర్మజుఁడు తండ్రికి నెక్కుడు నిన్నుఁ జూడఁడే!
నొచ్చుకొనండె నీగతి గనుంగొని? వేఱొక చూపు చూచునే!

క. మీయన్న శుకుఁడు విద్యల
నాయాసముగాఁ బఠించినట్టిఁడు బాల
ప్రాయమున మృతిం గన నే
నాయుర్దాయమున నుండనా! గనుఁగొనుమా.

ధృత— తండ్రీ! నే నెవ్వరిం జూచికొని బ్రతుకుదు?

చ. ఒక కొడుకేని యుండెనని యుందునొ? మన్మలకోస ముందునో?
యకట! యమంగళాస్పదములైన మొగంబులతోడ నేడ్చు కొం
డికతనపున్ వధూమణులు నిండిన సంస్కృతిఁ జూడ నేర్చుటే
సుకరమొ? చావు మేలొ? తగఁ జూచి వచింపుము నాకు నిమ్మెయిన్.

వ్యాస— నాయనా! విదురునివల్ల సమస్త ధర్మములు విని యున్న నీకు నే నిప్పుడు క్రొత్తగాఁ జెప్పవలసిన దేముండును?

చ. ఎవరినిఁ జూడ నేమిటికి? నెవ్వరి కెవ్వరు? మాలసంత! కా
లవశమునన్ జనుర్మరణలక్షణముల్ జను లొందుచుందు రి
య్యవి గనకే నిరంతరము నాత్మ లిరుండయి యుండు జ్ఞానముం
దవులని వార లియ్యెడ వృథా విలపించెద రింతయేటికిన్.

విదు— సంశయ మేమి? జననమరణప్రవాహభూయిష్ఠ మగు నీ సంసారమునఁ బ్రాజ్ఞు లంతగా మమత గూర్పంజనదు. అన్నయ్యా!

ఉ. ఎందఱ కీవు తండ్రివో మఱెందఱికిం దనయుండవో మదిం
గొందల మంద నేల? కనుఁగొమ్ము విచారణ సేయు మయ్యయో!
తుందుడు కింత చెల్లునె బుధుండవు గావె యెఱుంగవే? ధృతిన్
జెందుము చింతవంతి నిటు చిందఱవందఱఁ జేయ నాయమే?

ధృత— తమ్ముఁడా ! యిది యంతయు నిట్టిదే.

ఉ. ఇప్పటి కెన్నిజన్మముల నెత్తితిమో యిఁక నెన్ని యున్నవో
యెప్పటి కప్పుడే మఱచి యీఁగతి వందురుచుందు; మేరికిన్
దప్పదు కష్టమున్ సుఖము త్రాసునఁ దూఁగుచునుండు; నైననున్
ముప్పున నిట్టి బాధ నను బోఁటికి ధాత నిధించి యేఁచునే.

వ్యాస— అదియే యజ్ఞానము.

ఉ. ధాత యొవండు సేయుటకుఁ? దక్కొరు లెవ్వరు? ప్రాక్కృతంపుఁ గ
ర్మాతిశయమ్మునన్ గలుగు నన్నియుఁ; దానిని దాఁటఁ జాలఁ డా
ధాతయు వానితాతయును; దప్పక తత్ఫల మంది తీరుచే
చూతుము కాని వేఱొకటి చూడము చూడఁగ నేర రన్యులున్.

గాంధా— అయ్యో ! నాదుర్దశవంటి దుర్దశ వినినదియు వినఁబోవునదియుఁ గూడఁగాదు. దైవమా, దైవమా ! యెంత దుర్గతిఁ దెచ్చితివి !

వ్యాస— గాంధారరాజపుత్రీ ! విచారింపకుము.

చ. కొడుకులు పుట్టలేద యనుకొన్మ ; కులానఁ గళంకునించు న
క్కొడుకులు కొడుకులే ? నయము కొంకక చెప్పితి చెప్పఁజేసి తె
క్కుడుగ; వినండ నీకొడుకు కూళతనంబున నింతకున్ జగం
బడఁచు తలంపుతో నుదయమందె నితండు పతివ్రతామణీ !

ధృత— అయ్యో, దైవమా !

చ. మనమునఁ దాపమాఱఁ గడమా ఱొకమాఱు తనూజులన్ గనుం
గొనుటకుఁ గన్నులేనిఁ దనకుం దయసేయవుగా ! మఱెంత యాఁ
పిన నదియేమొ దుఃఖమది పెచ్చగుచున్నది ; యీపె శోకమున్
గనుఁగొనఁ జాల; నిందుఁ బ్రతికారము గన్పడ దేమిసేయుదున్ ?

వ్యాస— దంపతులారా ! మీకట్టి యభిప్రాయమున్నచోఁ జూడుఁడు. శ్రీకృష్ణుం డయ్యెడల దృష్టిని మీకుఁ బ్రసాదింపఁగలఁడు.

విదు— ఇఁక నాలస్య మెందులకు ? ఇమ్మహాత్ముని వచనం బమోఘము. ధర్మజాదులతోఁ గృష్ణుం డీపాటికి నయ్యెడకు వచ్చుచుండవచ్చును. మనము గూడ నయ్యెడకుఁ దక్కుంగల జనులతో నరిగి యొకసారి చూచి యుచితక్రియలు నిర్వర్తించుటయే కర్తవ్యము. (నిష్క్రమింతురు)

(అంతఁ బాండవులు కృష్ణసహితముగాఁ బ్రవేశింతురు)

ధర్మ— కృష్ణా ! వాసుదేవ !

క. ఏ మొగమునఁ గనుఁగొందును
మోమోట మొకింత దక్కి ముది తొక్కుల దుః
ఖామయమగ్నుల ? నకటా !
యేమాడ్కిన్ వీరిదుఃఖమిది చల్లాఱున్ ?

కృష్ణ— బావా ! మీ శాంతమునకుఁ దగిన ఫలము గలుగనప్పుడు మీరేమి చేసెదరు ?

భీమ— (కోపముతో) ఓహో ! యేమి యీవిరుద్ధము ?

ఉ. చచ్చినవాఁడు చావక నెసన్ గురుపుత్రునిఁ బిల్చి యాతనిన్
మచ్చికఁజేసి ద్రోవదికుమారులఁ దక్కిన రాజసైన్యమున్
బొచ్చెముమై వధింపుటకుఁ బుచ్చిన దుర్మదునింక నొక్కమా
టెచ్చటనైనఁ జంపవలదే ? యటుగామిని గోప మాఱునే ?

ధర్మ— భీమన్నా ! "మరణాంతాని నైరాణి" యనుట యెఱిఁగియు నీకెందుకోయీ కోపము ?

భీమ— అన్నయ్యా ! ఈశాస్త్రములు లోకమునకేగాని యీ దురాత్మున కుపచరింపవు. ఏమంటిరా ?

చ. మరణముతోడఁ దీఱుదురు మంచిప్రవర్తన గల్గువారు; దు
శ్చరితులు చచ్చియున్ బగఁ బిశాచములై కనఁజేతు ; రిట్టియు
ద్ధురచరితమ్ము గల్గుటనె దుష్టచతుష్టయ మన్నయట్టి యీ
బిరుదు సుయోధనాదులకె పేర్కొనఁగాఁబడెడిన్ జగమ్మునన్.

ధర్మ— తమ్ముఁడా ! ఇది సమయముగాదు, శాంతింపుము. (కృష్ణునివంకదిరిగి) వాసుదేవా !

తే. గీ. తగుదునని యే మొగమ్ముతోఁ దెగని వగలఁ
బొగులు తలిదండ్రులను గనఁ బోదునయ్యా
ఇంత కష్టము దోపలే దెపుడు నాకు
నాఁడు వనవాస మప్పుడైనను మహాత్మ !

భీమ— (కోపముతో) అన్నయ్యా ! మీరు మొదటనుండియు (అనుసర్థోక్తిలో)

అర్జు— (వారించి)

చ. ఒకరి నొకళ్ళు చూచుటది యొక్కటి తప్పని కార్య మాటచే
నకట ! యిటుల్ చనన్ వలసె ; నంతియెకాని ఘటోత్కచుండు నా
దు కొడుకు ద్రౌపదేయులును దోఁపఁగఁ జేసెడివంతకన్న దు
ష్టకుటిలబుద్ధు లాత్మజు లెడందఁ బగుల్తురె తండ్రిగారికిన్ ?

కృష్ణ— అజాతశత్రూ ! మహారాజ !

ఉ. సామము చెప్పి చూచితిమి సంధికిఁ జొన్పితి; మెందు కేని యా
సోమరి యొక్కటన్ హితవు చూపఁడ; కార్యము లేక యంత సం
గ్రామము చేయఁబూనితిమి; కాలము చెల్లినవారు వోయి రి
చ్ఛో మనదోషమేమి ? యనసూయులకున్ సకలంబు దెల్లమే.

నకు— దేవా ! జగన్నాథ !

క. మనమొగము చూచు టెటులని
జనకుఁడు శంకింపవలయు సంధికిఁదాఁ బూ
నినఁ గాకపోవునే ? యా
యనదోషముకాదె ? కులము నడుగంటించెన్

సహ— బావా ! దేవకీపుత్ర !

క. తల నెరసినంతనే పె
ద్దలె ! తానొక్కింతఁ బూని తన తమ్ముని పు
త్త్రిలమైన మాకుఁ బాలీ
దలఁచినఁ బోకున్నె యిదియుఁ దగదే తనకున్ !

ధర్మ— అన్నలార ? యెందు కీ గతజలసేతుబంధనము ? ఎటువంటి యార్యుల
కును నొకానొక సమయంబుల బుద్ధులు తప్పుత్రోవలం బడియెడి.

చ. వనమున ద్వాదశాబ్దములు వాసము సల్పితి మాఁగదా సుఖం
బును గనకుంటిమే యపుడు ? పోరొనరించి జయించి రాజ్యముం
గొనుటయుకాని లేరు కొడుకుల్, మఱియెవ్వరికోస ? మిప్పుడే
మనుకొన నేమిలాభమగు ? నన్నియు నింతకుఁ దీఱెఁ బూర్తిగన్.

భీము— అన్నయ్యా ! అట్లనెదరేమి ? కొడుకులే కావలయునా ? మనుమలు
దినఁగూడదా ?

ధర్మ— అక్కటా, యెంత వెఱ్ఱివాఁడవోయి !

ఉ. దుర్భగుఁడైన ద్రౌణిశరదుస్సహతాపము చేతఁ గ్రాఁగుటన్
గర్భమునందె చచ్చియును గంజదళాక్షు ననుగ్రహమ్మునై
నర్భకుఁ డెట్టులో యుదయ మందెడి నుత్తర కాతఁ డిమ్మహీ
ధూర్భృతి సల్పువాఁడనుచుఁ దోషము వొందుదమయ్య ! తమ్ముఁడా !

ఉ. పేరును బెంపునున్ వెలయు బెట్టిదుఁడౌ నభిమన్యుఁడున్ మహా
శూరులు ద్రౌపదేయులును సోమునివంశము వృద్ధి సేయఁగా
నేరనియప్పు డీనినువు నేర్చునటంచుఁ దలంచు టెట్లు ? సం
సారమునందుఁ గోర్కి కొనసాఁగిన వారలు లేరు తమ్ముఁడా !

పరిశీలించి చూచినచో నిప్పటి ఘనసంసారమునకన్న నేదియేనియు సుఖకరమే.

ఉ. పిల్లనిమోముఁ జూచి పొరి బెగ్గిలి యుత్తర యేడ్చు; నాపె సొం
పెల్ల నశించెఁగా యనుచు నేడ్చు సుభద్ర; గృహంబిఁకెట్లు శో
భిల్లెడి? గేస్తులిట్లనుభవింపఁగలారె సుఖమ్ము? లంతయుఁ
జెల్లినమీఁద రాజ్యమును జేయుటకన్నను దోసముండునే?

కృష్ణ— (దృష్టినిగుడ్చి) ధర్మనందనా! అదుగో, విదురధృతరాష్ట్రులిటు వచ్చుచున్నారు. మనము వారి నెదుర్కొనవలయును. (పరిక్రమింతురు)

(విదుర ధృతరాష్ట్రులు ప్రవేశింతురు)

విదు— అన్నయ్యా! అదే పాలికలను, దగ్గఱకు వచ్చినారము. ధైర్యమవలంబించి బంధుగులం గనుఁగొందువుగాక.

ధృత— తమ్ముఁడా! యింతకన్న ధైర్య మేముండును?

తే. గీ. అందఱుఁ గుమారులును బోయినట్టి వార్త
వినియు నీగతి నుండె జీవనముతోడ
వృక్షమో! లేక రాయియో! వీఁడు మనుజ
జన్మమేదైన నిది యెట్లు సంభవించు?

ధర్మ— (దగ్గఱకరిగి) తండ్రీ!

ఉ. సోదరి జ్ఞాతిఘాతుకుఁడు క్షుద్రుఁడు శీతకరాన్వవాయవి
చ్ఛేది యజాతశత్రుఁ డను చెల్లని పేరు వహించువాఁడు నీ
మోదము నెల్ల నాఁటిపిన మూర్ఖుఁడు కష్టుఁడు వీఁడె నేఁడు నీ
పాదయుగమ్ము మ్రొక్కెడిఁ గృపన్ గని తప్పులనెల్ల సైఁపవే.

ధృత— (కౌఁగిలించుకొని) నాయనా! ఇందు నీతప్పే మున్నది?

శా. ఏమాత్రేనియుఁ జాలు నంచు హరి నీ పంపింపఁగా లేదె? నీ
దేదీ నేరము? దానిపై సుతులచే నిప్పింపఁగా లేని నా
దే దౌర్భాగ్యము గాక; నిన్ను సుఖిఁ గా దీవించితిన్ దండ్రి! నీ
వే దిక్కేమని నిన్నుఁ గూడఁ దెలుపన్నేనెంతు నో పుత్రకా!

భీమ— (నమస్కరింపఁబోఁగాఁ గృష్ణుఁడు వారించును.)

ధృత— (ప్రేమతో) నాయనా! ధర్మనందనా! భీమున్న యేఁడోయి?

కృష్ణ— (తనలో) అయ్యో! యెంత ప్రీతియో, పాపము! (ప్రకాశము) ఇదుగో
(ఇనుప భీముని ముందటికిఁ ద్రోయును.)

పూర్వకాలపు వారి కీపురుషులకును
నింత భేదము గల్గుట యిపుడు తెలిసె.

భీము— (సంరంభముతో)

ఉ. భీముఁడ నీ కుమారకులఁ జెక్కురఁ జంపినవాఁడ ఘోరసం
గ్రామములోన నీకొడుకు రక్తము గ్రోలినవాఁడ నిన్ను దు
ర్ధీమహితున్ మదగ్రజుని ప్రేరణఁ జేసి పరామృశింపఁగా
నీమెయి వచ్చినాఁడ నిపు డింతయుఁ జూచినవాఁడ నీకృతిన్.

ధర్మ— (నిర్వేదముతో) తమ్ముఁడా ! కాటికిఁ గాళ్ళు చాచుకొన్న కులవృద్ధులతో మన కీ యధికప్రసంగ మెందుకోయి ?

భీము— ఇప్పుడును నన్నే మందలింప వలయునా ?

తే. గీ. వృద్ధుఁ డంటివి సత్యమే యెందుకీ దు
రాగ్రహము వృద్ధలక్షణ మందువేమొ
పరమచండాలుఁ డితఁ డెట్టివాఁడయేని
నిజము వధ్యుండు వధ్యుండు నీవెఱుఁగవు.

ధర్మ— తమ్ముఁడా ! నామాట విని యంతతోఁ జాలింపుము.

క. సుతశోకజ్వరమున సం
ప్రతిపన్నం బయ్యె సన్నిపాత మితని కి
ట్టి తఱిన్ బొనర్చుపని దు
ష్కృతమో సుకృతమ్మొ తెలియునే రోగులకున్.

కృష్ణ— మామా ! ఆంబికేయా !

గీ. కొడుకులా లేరు ! వారల కొడుకులేని
లేరు ! వీరల నెల్ల బల్మిని వధించి,
యపయశము నొందుటయొ తక్కనక్కటకట !
యెవరి కిచ్చెదు రాజ్యమ్ము నెఱుఁగఁ జెపుమ.

భీము— ఎవరి కెందు కీవలెను ? తానే పరిపాలింపఁ గలఁడు. చేఁతకాదా యేమి ? భగవంతుఁ డెఱిఁగి గుడ్డివానిఁగాఁ జేయఁబట్టి గాని లేనిచోఁ బ్రపంచమంతయుఁ బ్రమింగక పోవునా ?

ధర్మ— భీమన్నా ! యిఁక నీ వితనిం గుఱించి మాటాడితివేని పాండునృపాలుని యడుగులకుఁ దప్పినవాఁడవు. ఏదో చెప్పఁదగిన సంగతి బావ చెప్పచున్నాఁడు చాలదా ?

కృష్ణ— మామా ! సత్యవతీపౌత్ర !

క. తనకడు పొక్కుటియును ద
మ్ముని కడు పొక్కుటియు నే సమున్నతమగు వ
ర్తన గల్గు నుత్తముల? కే
మన నేరుతు మింతకన్న నధికముగ నినున్.

విదు— వాసుదేవా! మహానుభావ!

చ. ఎఱుఁగనివాఁడు గాఁడు "పరమేశ్వరు నంశమ వీ" వటంచు; నీ
యరయుట వీరికిం గల దటంచు నెఱుంగనివాఁడు గాఁడు; స
త్వరమున భీముఁ జంపుటకుఁ బొల్పడి మేటియవజ్ఞ సేసె; సా
దరమతిఁ జూచి యెట్లయినఁ దప్పు క్షమింపఁగదయ్య మాధవా!

ధృత— దేవా! వసుదేవనందన!

చ. సుతులను జంపె వీఁ డనెడి శోకభరం బని దేహమెల్ల వ్యా
పృతమయి రోఁజి రోఁజి యొక పెట్టున బగ్గున మండి యిట్టి దు
ష్కృతిని వివేకమున్ విడిచి చేయఁగఁబూనితి, సత్యమే; కృపా
రతి నను బ్రోవఁగావలె శరణ్యుని నిన్ శరణంటి మాధవా!

ఉ. మామను! పెద్దవాఁడను నమస్కృతి చేసెదనన్న దాన నీ
నేమము వోవు నంచు మరి చెల్లదు; దేవుఁడ వయ్యు నీవు మా
భూమిని బుట్టి చుట్టరికమున్ మముఁబోఁటులతోడఁ గల్పి శే
మూ! మది నిట్టి సంశయముఁ జొప్పడఁ జేసెదు హేతు వల్లుఁడా!

కృష్ణ— మామా! నీవు నిజముగా నపరాధివయ్యును పశ్చాత్తప్తుండవై నిర్దోషివైతివి. (చేత ధర్మజు నిర్దేశించి)

మ. ఎవుటన్ జెప్పఁగరాదు గాని యితఁడీ పృథ్వీభరం బొక్కుటా!
త్రిదివం బేనియు నేలఁగాఁ దగిన వర్ధిష్ణుండు; కృష్ణుండు మెచ్చి
కఁదగున్ వాఁ డనుకోకు; మీతఁడు జగత్కళ్యాణశీలుండు మెచ్చి
కఁదగున్ వాఁడును మాకు నెల్లరకు; నిక్కం బిట్టిఁ డొం డుండునే!

విదు— కృష్ణా! మహానుభావ!

ఉ. నీచరితం బ దిట్టి దని నిర్ణయ మెవ్వఁడు సేయనేర్చుఁ గా
నీ చతురబ్ధివేష్టిత మహీవలయమ్మున ధర్మసూతి కే
రాచకుమారులున్ సవతు రారను మాటవి విశ్వసంబు సం
కోచము లేదు లోకమునకున్ గుణ వీతఁడె శీలసంపదన్.

కృష్ణ— సంశయ మేమి? ఒక శీలముననే కాదు. సర్వవిధములచేతను నితని కొరుఁబు సాటిగాదు. మామా! కురుకులజ్యేష్ఠ!

ఉ. అట్టి యితఁడు నీయెడ మహాదరమున్ గడుభక్తియుం గలం
డెట్టియెడన్ సహోదరులు నీతని యాజ్ఞకుఁ గట్టు దప్ప రీ
విట్టి కుమారు లుండియును నెందుకు దుఃఖము నొందె? దయ్యయో!
చెట్టలునూర్వు రుండిన విశేషమె? యిట్టిఁ డొకండు చాలఁడే!

ధృత— కృష్ణా! దేవకీనందన!

ఉ. ఈ పనినట్లు ధర్మసుతుఁ డిట్టిఁడ, బుద్ధి జనించె నాకు నీ
సేవ కతమ్మునన్ మునుపు చేసిన పాపము లెల్లఁ బోయెఁ గా
నీ పగ పింకనున్ మనము నీఱుగఁ జేయుచు నున్న దయ్య! యో
దేవ! మహానుభావ! యిది తీర్పఁగ వేఁడితి నిన్ను మాటికిన్.

నినొక్కసారి కన్నులారఁ జూచినం గాని నాకీ దుఃఖ ముపశమింపదు.

ఉ. మున్నొకసారిఁ జూచితిని; ముద్దులు మూటలు గట్టఁ జాలు నీ
యన్నువ రూపు; దాని నిపు డారయఁ జేయు మిఁకొక్కసారి; యే
జన్మములన్ దపమ్ములను సాఁగని సౌఖ్యము దానఁ గల్గు నం
చున్నది లోనఁ గోర్కి; దయ యుంచుము భక్తపరా! పరాత్పరా!

కృష్ణ— (తనలో) పాపము కొడుకుల నందఱిం గడసారి జూచుటకై కాఁబోలు నిట్లు కోరుచున్నాఁడు. (ప్రకాశము)

తే. గీ. కనుఁగొనుము నేఁడు నీపుత్రగణమునెల్ల
రాజబంధులతోఁ గూడ, రమణితోడ
నిచ్చితిని దృష్టి, పోలికల నిదుగో చూడు
మా! యొకించుక దూరాన మానవేంద్ర.

ధృత— (కలయంజూచి) నాయనా! యొక్కసారి దగ్గఱగాఁదీసికొనిపోయి చూపింపుము.

కృష్ణ— ఇదిగో, నిటురమ్మ. (అందఱును బరిక్రమింతురు)

ధృత— (చూచి)

చ. విఱిగిన తేరులా యివి! భువిన్ బడిపోయిన గౌరుబారులా!
సురిఁగిన నూరులా! యకట! చూడఁగఁ జాల జనార్దనా! మహా
భర మనిపించుచున్నది; కృశన్ మరలించఁ గదన్న దృష్టి; యే
వరమును మందభాగ్యుఁ డగువానికి మోదము గూర్పఁజాలునే!

(తెరలో)

శా. కోదండైకగురుండు తండ్రి; యసదృత్తుల్ పెద్దతండ్రుల్ పితృ
వ్యాదుల్; వీర లిటుండఁ గేవలము లోకాధ్యుండు జీవం బిడం

గా ధర్మజుం డగు తేంతవాఁడు; విధివక్రం బెట్లు నిన్ జంపె నా
డా దౌర్భాగ్యము కాక నీకు విధు లన్నా! గడ్డిపోఁచల్ గదా!

కృష్ణు— (విని) బావా! సుభద్ర కాఁబోలును దుఃఖించుచు నిటు వచ్చు చున్నది. నీవు పోయి యోదార్చి వెనుకకుఁ బంపుము.

నకు— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

చ. అన్న ప్రతిజ్ఞ త్రిప్పుటకునై చని యే బ్రతిమాలుకొందు నా
పన్న శరణ్యుఁ డాతఁడు కృపన్ "బతిభిక్ష" మటన్న "లేదు పొ"
మ్మన్నను "గాదు కూడ" దని యప్పటి కట్టులా "యొప్పఁ జెప్పఁగా
నన్నరు" నంటె నాపలుకు నాలుకపోయె నిఁకేమి సేయుదున్.

ధర్మ— (విని) అర్జునా! దుస్సల కాఁబోలును. నీవే పోయి యాపె నోదార్పుము.

అర్జు— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

ఉ. పేరును పెంపునున్ వెలయు పెద్దలు ద్రోణుఁడు మున్నుగాఁగ న
వ్వీరులు కౌరవేశ్వరుని ప్రేరణ కారణమై యహో! దురా
చార మటం చెఱింగియు నసాధ్యు నినున్ బోరిఁ జుట్టుముట్టిరే!
వేరము దీర్చి యే మనుభవించిరి వా రపకీర్తి దక్కినన్?

ధృత— పాపము. ఉత్తర కాఁబోలును. అయ్యో! దైవమా! యెక్కడఁ జూచినను రోదనధ్వని తప్ప రెండవ ధ్వని వినఁబడదుకదా!

ధర్మ— తమ్ముఁడా! నీ వరిగి యాపె నోదార్పుము.

సహ— (నిష్క్రమించును)

(మరలఁ దెరలో)

ఉ. ఒక్కరో యిద్దఱో శతము నొక్క మొగిన్ బలియిచ్చి భీముఁడన్
దక్కలిశక్తి, కెక్కరణిఁ దీవ్రిపుశోకముఁ బట్టనేర్తు; న
మ్మక్క! యిదేమి దారుణమొ ప్రాణము వోవదు పొమ్మటన్న; నే
నక్కలు రావు నాదరికి నందను మెక్కుచు నున్న వక్కటా!

క. కొడుకా! యంతటి రాజ్యము
విడిచి జనకు విడిచి నన్ను విడిచి యనుజులున్
గొడుకులును దోడ రా న
ట్టడవిని నిలు గట్టికొంటివటరా! తండ్రీ!

ధర్మ— (విని) తమ్ముఁడా! ఆమె పరమపూజ్యురాలగు గాంధారరాజపుత్రి. మనకుఁ బెద్దతల్లి; ఆమెకుఁ గోపోపశాంతిఁగా వేఁడికొని యామె యనుగ్రహముం బడయుట కిట్లు ప్రార్థింపుము.

ఉ. అమ్మరో! నీదుపుత్రకుల నందఱఁ జంపితి ధర్మమో యధ
ర్మమ్మొ రణమ్మునం, దనపరాధిగఁ జూచి కృపారసాభిషే
కమ్మొనరించు చూడ్కులను గాంచఁగదమ్మ! భవత్పదాంబుజా
తమ్ములు దక్క నిష్కృతిపథ మ్మిఁక లేదు గదమ్మ! యెమ్మెయిన్.

భీము— (వెళ్ళఁబోవును)

కృష్ణు— బావా! మాట. (రహస్యముగా) ఆమె ని న్నిట్లనంగలదు.

గీ. "పోరుదురుగాక రిపులఁ జంపుదురుగాక
రాజ్యమును గొంద్రుగా కెందు రాజవరులు
రక్తమును గ్రోలినట్టు లే రాజ్యమందు
మున్న వింటిమె? యోరోరి మూర్ఖతముఁడ!"

ఇందుకు నీవి ట్లుత్తరమిమ్ము.

వృ. "పరమపతివ్రతన్ ద్రుపదుపట్టినిఁ బట్టి భవత్సుతుండు ము
ష్కరమున వల్వ లొల్చుతఱిఁ గట్టినయట్టి ప్రతిజ్ఞకై నిజా
ధర యొకయింత రక్తమునఁ దడ్పితి నంతియకాని యంత త
ప్పెఱుఁగనివాఁడనమ్మ! మది యేనము సైమనటమ్మ! నమ్ముమా."

భీము— (నిష్క్రమించును)

(తెరలో)

క. రారాజనై యశేషధ
రారమణులు గొల్వ నిన్ను గ్రద్దలు చుట్టుం
జేరెనె ధర్మజునకు ముద
మారెనె? నీదగు నవస్థ మాఱెనె? తనయా!

ధృత— కృష్ణా! నీవొసంగిన దృష్టి మా దంపతుల కెంత యుపకారక మగుచున్నదోయీ తండ్రీ!

ధర్మ— (తెరవంకఁ జూచి) అమ్మా! గాంధారరాజపుత్రీ!

క. నీకొడుకులఁ జంపించితి
వాకొడుకులఁ జంపుకొంటి నయహీనుఁడ దు
ర్భీకుఁడఁ బాపాత్ముఁడ శో
చ్యాకారుఁడ నాకు శాప మర్పింపఁ దగున్.

ధృత— తండ్రీ! నిష్కలుషుండ వగు నీకు శాప మెందు కీవలయు?

విదు— గీ. ధర్మమకదా యనుచుఁ గేల ధర్మమూని
గుణమకద యంచు నద్దాన గుణముఁ గూర్చి
తంతియే కాని నీవేరి కాహవమున
నపకృతి యొనర్చి యెఱుఁగ వయ్యయ్యొ రాజ!

(తెరలో) కృష్ణా! కురువంశ కృష్ణవర్త్మ!

ఉ. కూఁకటివ్రేళ్ళతోడఁ గురుకోటికుటుంబలిన్ వెలార్చితీ
వే కుటిలాత్మ! జ్ఞాతులకు నింతలు పుట్టునె లేకయున్న, లే
వే కలహమ్ము లెయ్యెడను? నీయుసురంతయు నిన్ను నట్లనే
తాఁకి నశింపఁజేయు నిది తప్పదు నేనొక సాధ్వి నైనచోన్.

కృష్ణ— (లేని సంతోషముతో) అత్తా! నీవు నాకు శాపమిచ్చినను నది యను గ్రహముగానే పరిణమించినది సుమీ!

ఉ. యాదవు లెరికిన్ సమరమం దవిజేయులు చచ్చు టెట్లొకో
యీ దురహంకృతుల్ భువికి నేగతిఁ దీఱునొకో భరం బటం
చేఁ దలపోతు; నీకొడుకులే యనుకొంటిని నీవుఁ గూడ నా
పై దయఁ జూపి భూభరము వాపితి వంతియ చాలు నెమ్మెయిన్.

ధర్మ— హా! పాండవులవలనఁ గదా మీవంశమునకుఁ గూడ నిట్టి యాపత్తు ఘటించుచున్నది. అయ్యో! పుణ్యమునకుఁ బోయినఁ బాప మెదు రగుట యిదియే కాఁబోలును!

గీ. ఎన్నివిధముల సంధికి నియ్యకొల్పి
తెంత కష్టించితివి పోయె నిదియునెల్ల
నకటా! యాపె యొక్కింత యరయదయ్యె;
నైపఁగదవయ్య మాతల్లి సాహసంబు.

కృష్ణ— ధర్మనందనా! నీకింత నిర్వేద మెందుకు? ఇది యీమె శాపంబువల ననే కాఁదగినది కాదు. మున్నిట్లు యాదవులకు బ్రాహ్మణ శాపం బున్నది. అది యట్లుండ,

క. ఎందులకు నేనియును జం
కందగుఁ జావునకు జంకఁగా రా దది తా
నంకట యొక్కపరియె యగుఁ
గండఁగ నేమిటికి దీనికోస మ్మనఘా.

విదు— దేవా! మహానుభావ! అజ్ఞులకుఁ గాని యప్పట్ల భవాదృశులకు దుఃఖ

మెక్కుడిది? ఆపె యేవియు సమస్తధర్మము లెఱింగినదే యైనను నెందు
లకో యిప్పట్ల తొందరపడినది. ఇంతకును నీ వనినట్లు,

తే. గీ. ఇతర మగు శాప మిచ్చిన నించుకంత
జంకఁగావలెఁ గాని యీ శాపమునకు
జంకఁ బని లేదు; చావక శాశ్వతమ్ము
గా నిలుచువార లంచు జగానఁ గలరె!

ధృత— దేవా! జగన్నాథ! మాతప్పు లన్నియు క్షమించి మమ్ము మన్నింపుము.

కృష్ణ— ఇం దెవరి తప్పును లేదు. ఏది యెట్లు జరుగునో అట్లు కాక మానదు. మనము నిమిత్తమాత్రములుగా నుండక తీరదు.

(తెరలోఁ బెద్ద రోదనధ్వనులు)

విదు— (విని) అదుగో! అంతఃపుర జను లందఱును నొక్కపెట్టఁ దమతమ బంధుజనంబులకు విలపించుచు నిటు వచ్చుచున్నారు. మన మీపాటికి వీరల నందఱిని నోదార్చి యుచితక్రియలు నెఱవేర్పఁ బోవుదము.

కృష్ణ— ఇఁక నిట్లున్నఁ గాలఁదిని దుఃఖ మతిశయించుచునే యుండును గావున నట్లొనరించుటయే మంచిది. (అందఱును నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవాశ్వమేధమ్మున
ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

## తృతీయాంకము

(నారదుఁడు ప్రవేశించును)

నార — ఓహో! నేఁటి దినమున ధర్మజుని పట్టాభిషేకమహోత్సవమఁట. అట కరిగెదను. అయ్యెడ శ్రీకృష్ణదర్శనము సైతముఁగలుగును. కావఁ దీర్థమును స్వార్థమును గూడ గలసివచ్చును. (పరిక్రమించి) ఏమీ! యీ బ్రాహ్మణు లందఱును గుంపులు గుంపులుగా నేమేమో చెప్పుకొనుచుఁ బోవుచున్నారు. "విఘ్నేశ్వరుని పెండ్లికి వేయి విఘ్నము" లన్నట్టు లేదేని యంతరాయము రాలేదుకదా! (దివ్యదృష్టింజూచి) నే ననుకొన్నట్లే జరిగినదే! పాపము!

క. ఇంత దనుక దాఁచిన యా
కుంతికి నే మంత వచ్చెఁ గొడుకని కర్ణున్
మంతనము విడిచి చెప్ప ర
వంతేనియు సిగ్గు వలదె! యాఁడుదిగాదే!

ఇంతకు నామె యేమిచేయును! కర్మలోపమునకు శంకించి నోడివి యుండును. (కోపముతో)

గీ. ఎదుటనున్నను గోపించి యెగిరి మీఁదఁ
బడి శపించునుగాని దుర్వాసు లకట
కొంపతీఁతకుఁగాక తాఁ గుంతి కేల
యీయఁగావలెఁ గన్నియ కిట్టి వరము?

సరే, ఆమె చేసిన శుశ్రూషకుఁ బ్రతిఫలముగా నిచ్చియుండును దానికేమి,

తే. గీ. సూర్యుఁ డేమంత యోగ్యుఁడు! సుదతి దన్నుఁ
బిలుచుఁగాక వరమ్మది తెలిసికొనఁగ;

వచ్చెఁబో! మునియాజ్ఞ యవార్యమాటఁ
దప్పు క్షమియింపు మన్న ట్లు డొప్పవలదె.

దీని కేమిగాని కర్ణుని మనోనిశ్చయము మాత్రము కొనియాడఁదగినది.

క. ఎఱుఁగును బాండుసుతులు సో
దరులని; యట్లెఱిఁగి మనమునం దించుకయుఁ గ
గరుణ జనియింపకుండ బ
వరమున నరికట్టుటన్నఁ బైపైఁ గలదే!

ఇతఁడిట్టివాఁడు గనుక నే యనేకులు యోధవరు లుండఁ "కర్ణునితల భారత" మను పేరితనికి వచ్చినది. సరే ఇంతకు మనము వచ్చిన పని వాకిటనే నెఱవేఱినది. ఇఁక మరలిపోకేందుకు? (మరలి) పోనీ వచ్చిన వాఁడను రానే వచ్చినాను. ఒకసారి చూచి పోవుట మంచిది గదా (కొండొక పరిక్రమించి) అదిగో ధర్మజుం డచటనే విచారముగాఁ బాంచాలీసహితముగ సోదరులతోఁ గూర్చున్నాఁడు. పోయి పాప మాతని నోదార్చెద.

(అంతఁ బాండవులు ద్రౌపదితోఁ బ్రవేశింతురు.)

ధర్మ— (అర్జునుంజూచి కోపముతో) అక్కటా! తల్లి యెంతపని చేసినది! ఇఁక స్త్రీల కీరహస్యగోపనశక్తి లేకపోవుఁగాక (శాంతముతో) తమ్ముఁడా! ఆమెలోపముకన్నను నా తెలివితక్కువ యిక్కడ నెక్కు డనక తప్పదు.

ఉ. కుంతి మొగమ్ము తీరచటఁ గొండొక గన్పడ సంశయించి "యీ వింత యిదేమి" యంచడుగ వేమఱు నాలుక జాఱఁబోవ న ల్లంతనె "భావ్యమానె యిది" యంచు మరల్చితిఁ గాని యాపెతో మంతనమందుఁ బల్కిన సమస్తము నా కెఱిఁగింపకుండునే.

నార— ద్వారికా! మేము వచ్చితిమని చెప్పుము.

ద్వా— (ప్రవేశించి) జయము జయము నారదులవారు విచ్చేసిరి.

ధర్మ— ప్రవేశపెట్టుము.

ద్వా— స్వామీ! ఇటు దయచేయుఁడు. (అందఱును లేతురు)

ధర్మ— బ్రహ్మపుత్రా! నమస్కారము. ఆ యాసనము నధిష్ఠింపుడు.

(అందఱును గూర్చుందురు)

నార— అభీష్టావాప్తి ర్భూయాత్.

చ. హరి కరుణావిశేషమున నర్జును గాండివపాటవమ్మునన్
గరువలిపట్టి బాహుబలగర్వమునన్ రిపులన్ జయించి భూ
భర మడఁగించి రాజ్యమును బాలన సేయుచు నుంటివే! వసుం
ధరసుకృతమ్ము లిప్పటికిఁ దద్దయుఁ బండెనె? గోర్కె నిండెనే?

ధర్మ— (విచారముతో) దేవా! మహానుభావ!

ఉ. జ్ఞాతుల నెల్లఁ జంపి సిరిఁ జైకొనినట్టి యపాత్రు ధర్మసం
జాతుని మిమ్ము బోఁటి మునిసత్తము లింత ప్రశంస చేయఁగాఁ
జూతురె! యెల్లవారలును సూతతనూజుని గాఁగఁ జూచు స
ర్వాతిశయుండు సోదరుఁడె యౌనఁట! మాకిఁక నేమిసేయుదున్.

ఉ. తల్లి వచించె నాఁడు పితృతర్పణముల్ పచరించునప్పు "డా
నల్లలితుండు సూర్యుని ప్రసాద" మటం చతఁ డేము నైనచో
నెల్లజగమ్ము లొక్కటయి యెత్తి పయిన్ బడెనేని లక్ష్యమా?
చెల్లె సమస్త మిప్పటికిఁ; జేసెడిదేమి? మునీంద్రచంద్రమా!

భీము— (విషాదముతో)

ఉ. "నన్నుఁ బరాభవింపఁ దగు నాయకుఁ డెవ్వఁడు రా!" యటంచు నే
మున్ననుకొందు నేఁటికి సమూల మెఱింగితి నక్కటక్కటా!
మున్నరికంపు మాటల సముద్ధతిఁ జూపితిఁ బాపి నైతి నా
యన్న యటం చెఱుంగక మహాత్మ! కడుం జెడిపోతి నింతకున్.

అర్జు— (విచారముతో)

చ. అతఁ డెదురైన యప్పు డని నర్కులు వేవురు దోఁచినట్లు నా
మతిఁ గనుపట్టి "శూరుఁ డను మాటిది నిక్కమ మాకొకో! యనే
ఋత మగునేని యిట్టిస్థితి యింతటి చేవిటువంటిపౌరుషో
న్నతియు ఘటించునే?" యనుచు నామది నెంతు ననేకభంగులన్.

నకు-ఉ. ఎన్నఁడు నేరిఁ జూచి భయ మించుకయుం గని యే నెఱుంగ; నా
కన్నరనాథుఁ జూచినపు డాత్మనదేమొ, భయోదయంబు మా
యన్న యజాతశత్రుఁ గనినప్పటికన్నను గొంత హెచ్చెడున్;
మన్ననఁ జేసి తత్పదనమస్కృతి సేయఁగ బుద్ధి పుట్టెడున్.

సహా— క. అని నతని నప్పుడప్పుడు
గని "యింతటి మేటి గొల్వ గావించునె? యొ
క్కని చెంత" ననుచు నామది
ననుకొంటిని గాని, యిట్టు లనుకొననైతిన్.

ద్రౌప — అక్కటా! వాఁడు సభామధ్యమున నన్ను కేశపక్షగ్రహమాటల గేలి సేయ, నది యేమో! సుయోధనుని యెడఁ గనలిన మన మిమ్మహాత్ముని యెడ నంతగాఁ గనలక సమ్మతింగఁ జేసెను. అయ్యో! అత్తగారు మీతోఁ జెప్పక పోయిన నాతోడనైన నించుక చెప్పక పోయిరిగదా!

నార — అమ్మా! ద్రుపదరాజనందని!

ఉ. ఇంత యమాయికత్వ మది యెట్లొనర్చుటఁ జూచి యెఱుంగఁ; గారణం
బింతకు నిట్టు లుండ మఱి యెవ్వరు నేటికిఁ జెప్పఁగావలెన్?
వంత ధ్రువమ్ముగా మీరు నవశ్యము చెంద విధించె ధాత యే
మంతన మిట్లు డాఁగెనను మాటలు మున్నెపుడేని వింటిమే?

క. తనకుఁ దనతండ్రి సెప్పఁడొ!
జనని వచింపదొ యి దిట్టి సంగతి యని! మం
తనమునఁ గృష్ణుఁడు సెప్పఁడొ!
వినఁజాలెనె యతఁడు? మీకు వెత్తి యిదేలా.

ధర్మ — మునీంద్రా! యెవరు చెప్పినను మాయన్నగారితోడనే చెప్పిరి గాని మాకు నొక్కింత చెప్పక పోయిరి కదా! పోనిండు.

ఉ. ఎట్టి రహస్య మైన నది నించుక సేపు వహింపలేని మీ
యట్టి మహానుభావులును నస్మదదృష్ట మదేమొ? నాలుకన్
గట్టిగ బిగ్గఁ బట్టి మముఁ గాపురుషాగ్రణులం బొనర్చి య
ట్టి ట్టనరాని దుఃఖమున కిక్కలఁ జేసితి రేమి పాపమో!

నార — (సంశయముతో) రాజా! యిప్పట్టున నేను గూడ వ్రతభంగం బొనర్చుకొన్నమాట సత్యమే. ఏమంటివా! దానికిఁ గారణము లేక పోలేదు.

క. కారణ మెటులైనను భూ
భారహరణమునకె మున్ను బ్రహ్మాదులు దా
మేరుపఱచి; రట విఘ్నము
నారదుఁ డొనరించె ననుచు నాపైఁ బడరే?

అప్పటికేనియు నేను దాఁచెడివాఁడను గాను గాని,

క. సనకాదులతో సరిగ
ద్దెను గూర్చుండఁ దగువాఁడ దీనిని నే నే
మని నీతోఁ దగుదు నటం
చును జెప్పదు ననుచు లజ్జ చొప్పడె నఘా!

ధర్మ— మునివర్యా! తమ రిట్లు తప్పుకొనుచున్నారు గాని నిజముగా మాయందుఁ దమ కనుగ్రహ మున్నయెడల,

తే. గీ. అనయమును మాకు శాత్రవుఁ డైన యట్టి
యల సుయోధనుతో నైనఁ గల తెఱంగు
తాము గరుణించి చెప్పిన దాని మీఁద
నతఁడు ఖండనమునకేల యత్నమతించు?

(కర్ణు నుద్దేశించి)

శా. అన్నా! నీవు గతించుమీద భవదీయం బైన రాజ్యంబు గై
కొన్నన్ గొందును గాక న్యాయ్యమగుటన్, గుంతీమహాదేవి యా
జ్ఞ న్నీకే మును మున్న భార్య యగు పాంచాలిన్ గురుద్రోహినై
యి న్నీచుండ పరిగ్రహించె నకటా యీదోషముం బోవునే!

భీమ— అన్నా! హరిదశ్వనందన!

చ. "కురుపతి యంగరాజ్యమునకు న్ననుఁ బట్టముగట్టె" నంచు సం
బరపడి; తెవ్వఁ డాతఁడు? భవత్పరిపాల్యము కాదె యర్ధరా
జ్యరమయు దీనిలోన లవమైనను నుండునె యంగభూమి, బం
గరు మసిపాఁతఁ గట్టఁ బడెఁ; గార్యము లే దిఁక నేమి సేయుదున్?

అర్జు— అన్నా! లోకైకవీర!

క. "ఎన యొకరి కొకరు కర్ణా
ర్జును" లని జనులాడుకొన నసూయవడుదు "నా
కెనయా నె? సూతసుతుఁ" డని
మనువుమ యీ తప్పొకండు మన్నించి ననున్.

సీ. "పాంచాలికాసతీ పరిణయమ్మున నను నీ
తోఁ బోరి నిన్ బాఱఁదోలితి" నని
"ఉత్తరగోగ్రహణోత్సవమ్మున నిన్ను
మించి వెన్నంటి భంజించితి" నని
"సర్పముఖాస్త్ర ప్రసారంబు కృష్ణుని
దయఁ దప్పె లే కున్నఁ దప్పని" దని
"అసమయమ్మునఁ బాడియగుఁగా దనక
బాణమేయకుండినఁ దెగఁ డీతఁ" డనియు

తే. గీ. నొక్కొకప్పుడు మనమున నూహసేతు
నంతియేకాని నా జయ మభిలషించి

"యీ వుపేక్షించితి" వటంచు నెఱుఁగనైతిఁ
క్రూరమతినైతిఁ గృష్ణుండు గొంపదీసె.

(కృష్ణుఁడు ప్రవేశించును)

కృష్ణ— అవును, పాపము నే నే కాను కొంపతీసినది ! మీయన్న తీయలేదు కాఁబోలును. ఆవేళ నతనిచే నవమానింపఁబడి నిన్నును నన్నును నేమని యెనో జ్ఞప్తికిఁ దెచ్చికొనుము ? ఇంతకును జీతమును బత్తెమును లేని మీ కొలువు గొలిచినందులకు నన్నిట్టు లనవలసినదే.

ధర్మ— ఇంతకు మాకర్మ మిట్లున్నప్పుడు నీవేమి చేసెదవు ?

ఉ. "సూతజుఁ జంప లే వయిలి శూరుఁడ నంచుఁ బ్రగల్భపున్ వచ
శ్చాతురిఁ జూపఁ గాఁ గలవె, చాలును గాండివ మింక నేల నీ
చేత ధరించెదో? " యనుచుఁ జిన్నెలు వన్నెలు నెట్టి తిట్టితిన్
బాతకినైతి ముక్కు తెగబారఁడు చేసితి నిక్క మచ్యుతా !

భీమ— సరే, అందులకు మాత్రమితఁడే కాఁడా నిమిత్తము. ?

ధర్మ— తమ్ముఁడా ! అతఁ డేమి చేయును ? సంధి కరిగినప్పుడు మంతనమ్మున నమ్మహా మహునితోఁ గలతెఱంగు పచియించెను గదా ! అతఁ డొప్పని యప్పు డితని తప్పేమున్నది?

భీమ— అంతతో నేమిలాభము?

ఉ. చెప్పెనె యన్న "తమ్ములను జేరుము నీ" వని యంత మాత్రఁ దా
నొప్పెడివాఁడె కర్ణుఁడు మఱొక్కరి యట్టిఁడె ! యన్నమాటకున్
దప్పునె ? యా సుయోధనునిఁ దన్నెద నమ్మినవాని నూరకే
యొప్పరికించునంతటి యయోగ్యుఁడె ? నీ కెనగాఁడె యన్నిటన్ !

నకు— బావా ! నీకుఁ గోపము లేనిచో నేనొకటి మనవి చేసికొనుచున్నాఁడను.

చ. ఎఱుఁగనియప్డు "సూతజుఁడనే" యను బుద్ధి సుయోధనున్ నిరం
తరము భజించి తత్కృపను దా నొకరాజయి "పార్థునోర్తు సం
గరమున" నంచుఁ బల్కి, తటి గల్గినయప్పు డెఱింగి తానరై
మరలి మమున్ గనుంగొనెడి మాత్రమె ? యాతని శౌర్య మల్పమే ?

సహ— బావా ! నీమనమున నిజముగాఁ గపటమే లేనియెడల మాతో నించుక చెప్పవలసినది.

గీ. అట్లు చెప్పితివేని మాయన్నగారు
కోరి బ్రతిమాలి రాధతోఁ గొంతచెప్పి

యొప్పఁగాఁ జేసి యీపక్షముండునటుల
సలిపి యాతని రాజుఁగా నిలుపకున్నె!

ధర్మ— తమ్ముఁడా! అంతపట్టు కేందుకోయి?

ఉ. అన్నగదా! మనందఱికి నాతనిమాటకు నడ్డువారమే?
యిన్నరుఁ డేనుఁ బావనియు నీరలుఁ; గృష్ణుఁ డొకింత చెప్పకే
కన్నులు మూసెఁగాని "యల కౌరవనాథుఁడె నాకు సమ్మతుం"
డన్నను "మంచిదే" యనమె? యాతనిఁ గొల్చుట కొప్పకుందుమే?

ద్రౌప— అవును, మీరు "రాజ్యము వదలి యరణ్యమునకుఁ బదం" డనిన నెదురు చెప్పనినా రమ్మహామహుఁడు "దుర్యోధనునికే రాజ్య మి" మ్మన్న నట్లొనరించుటకు సందియమేమి?

నార— (తనలో) వీరల కించుక కలహమును బెంచెదఁగాక. (ప్రకాశము) అవును. తక్కినవారి మాటకేమిగాని శ్రీకృష్ణులవారుమాత్రము కొంచెము సూచనయైనఁ జేయవలసినది.

కృష్ణు— (క్రోధహాసములతో) మహానుభావా! కలహభోజన! యేమి యిట్లు సెలవిచ్చుచున్నారు!

ఉ. ఏనటు చెప్పఁజే నిజమ యేనియు వీరలు సేసినట్టి య
న్యాయనములౌ ప్రతిజ్ఞలవి యొప్పునె? వీరలు సమ్మతించు టె
ట్లైనను సూనువుల్ విఱుచుటా! రుధిరమ్మను గ్రోలుటా! మృతుం
గా నొనరించుటా! యొకటికాదు గదా! మఱి యేరికిన్నియున్!

అర్జు— బావా! బలభద్రసోదర!

చ. ప్రతిన యనంగ శత్రువులపైఁ బ్రసరించునె కాని యెయ్యెడన్
హితులకు నన్నదమ్ములకు నిట్లగునయ్య? స్మరింపు మమ్మహో
ద్ధతు వధియింపలేని నను ధర్మజుఁ డించుక దూఱ· నేనుఁ జి
న్నతనము చూప నేమనుచు నాఁడు వచించితి వీవు? మాధవా!

ద్రౌప— (కొంచెమునవ్వుతో) అన్నా! నిన్ను వారు వృథాగా నాడిననాడు దురుగాక, నే నట్లనుదానను గాను గదా. ఇయ్యెడల నెఱిఁగియో యెఱుఁగకో నీయందు లోపముమాత్రము లేకపోలేదు. నీశక్తి యెవ్వరెఱుఁగనిది?

నార— (తనలో) అయిన నేమిగాని చక్కఁగా నడిగినది. దీనికేమి యుత్తర మిచ్చునో?

కృష్ణు— (భారముగా) ఇంతకు "నేను గపటముగాఁ గర్ణునిఁ జంపించి నా"

ననికదా ! మీరందఱును నిందించుచున్నారు. సరే మంచియో చెడ్డయో యిందులకు నేనొప్పుకొన్నాఁడను గాని,

చ. అలయభిమన్యునిన్ ద్రుపదునాత్మజులన్ మఱి నీకుమారులన్
గలన వధించువాఁ డితఁడు గాఁడు గదా ! కపటమ్ము పన్ని, వా
రల బ్రతికించుకొం డవల రాధసుతున్ బ్రతికించి యేను నా
తల నిడినట్టి తప్పిదము తప్పఁగఁ ద్రోసెద నింత యేటికిన్ ?

నార— ఎందులకేని నీవే సమర్థుండవు గాని వీరలవలన నేమగును ?

ద్రౌప— మహాత్మా ! చక్కఁగా సెలవిచ్చితిరి.

భీము— బావా ! అభిమన్యునిమాటకు నేను జెప్పఁజాలను గాని తక్కినవారి మరణమునకు నీవు గాక మఱియెవ్వరు నిమిత్తము ?

తే. గీ. మమ్ము నెద్దియొ యొకనిమిత్తమ్ము సెప్పి
శిబిరమును బాపినట్టి విశిష్టదృష్టి
యూరకే కల్గెనే నీకుఁ ? గారణమ్ము
నెఱిఁగియును జెప్పకుంటచే నింతపుట్టె.

అర్జు— బావా ! క్షమింపుము.

శా. నీతోఁబుట్టువు పూర్ణగర్భవతికి న్నేఁ గాలముల్ బుచ్చఁ గం
జాతవ్యూహవిధమ్ము సెప్పునెడ నాసాధ్వీవతంసమ్ము ని
ద్రాతైక్ష్ణ్యమ్మునఁ గన్మొగుడ్ప శిశు వంతస్థాయి యూఁకొట్టుచోఁ
గాతర్యమ్మున మధ్య వచ్చి యది విఘ్నమ్మొందఁగాఁ జేయవే ?

నార— అవును. ఈసంగతి నేను స్వర్గమున నప్పుడప్పుడు విన్నదే. ఆతనికిఁ బద్మవ్యూహము చొచ్చుటయే కాని మరల వచ్చుటఁ దెలియమికి నే హేతు వని మాత్రము ప్రవాద మొకటి లేకపోలేదు.

కృష్ణు— మహానుభావా ! మీరుఁ గూడ నాయెడల నింత యనుగ్రహించుచున్నారేమి! కొంచెము సందర్భాసందర్భములు విచారించ నక్కఱలేదా ! ఊరకే యనినంతలో నేమగును? గర్భములోని శిశు వెక్కడ నేని యూఁకొట్టునా? యూఁకొట్టునే యనుఁడు. దానిచే నాకుఁ గాతర్యమేమిటికి ! సరే, అప్పుడు నేను విఘ్నము చేసినచో మఱియొకప్పు డితఁడు తనకొమరున కా శేషమును బోధించఁగూడదా ?

నార— చిగురు సంగతికి నేనుత్తరము చెప్పఁజాలను గాని దాని వెనుక సంగతికిఁ జెప్పఁ గలను.

కృష్ణు— (తనలో) ఓహో ! ఈయన నిష్కారణముగా నాపై లేనిపోని తుట్టు

వేయుచున్నాఁడే ! (ప్రకాశము) పోనీ దానికేని తగిన యుత్తరము సెలవిండు.

వార— ఎందుకా కాతర్యము, సంపూర్ణముగా విన్నచో నభిమన్యుని జయించు వా రెవరును నుండరుగదా ! అప్పుడతనికై మరల నీవే యవతరింప వలసి వచ్చును. "గోళ్ళం దీసెడిపనికి గొడ్డళ్ళెందుల" కని యట్లొనరించి యుండవచ్చును.

కృష్ణు— (నవ్వుచుఁ గొంచెము కోపముతో) మునీంద్రా ! మీరు మఱియుఁ నెక్కుఁగా సమర్థించు చున్నారే !

తే. గీ. లేకలేకొక్క చెలియ లాలేమకొక్కఁ
డే సుతుండఁట ! యువ్వాని కితఁడు మేన
మామయఁట ! వానివృద్ధికై మానసమునఁ
గనలునఁట ! కంటిమే యిట్టి కట్టుకథలు !

వసు— బావా ! క్షమింపుము.

క. నరకాసురుండు నీకుఁ గా
మరుఁడేకద ! యతని నీవు మడియింపవె ? భూ
భరము నివారించెడి నీ
కరయఁగఁ బుత్త్రుఁడనిఁ శత్రు వనియుం గలదే.

కృష్ణు— దుర్మార్గుఁడైనచో భూమికి భరముగలిగించుఁగాని సన్మార్గుఁ డట్లు చేయఁడు కదా ! అభిమన్యునకును నరకునకును నెక్కడిసాటి!

తే. గీ. వరగుణుండైన పార్థుని పట్టి వాఁడు
మేనయల్లుండు సుగుణనిధాన మకట !
యతని కతమునఁ బుడమి కే యడరుగల్గు ?
నెవ్వరును నమ్మరీగాథ లింత నిజము.

వార— భవిష్యత్సందర్భము లెఱింగిన నీతో మాటలాడఁ గల మఁట కాని.

తే. గీ. ఒక్కఁడెవ్వండొ దక్క నీయుద్ధమందు
మఱియు రాజులు లోకసమ్మతులుగారె !
వీరు భూభారకారులు గార యేని
యెందులకుఁ దెచ్చి పెట్టితి విట్టి రణము ?

ధర్మ— (తనలో) ఓహో ! యితరులకలహమును జూచి సంతసిల్లెడు నారదుఁడు స్వయముగనే కలహమునకు దిగుచున్నాఁడే ! (ప్రకాశము కృష్ణునివంకఁ జూచి) కృష్ణా ! వాసుదేవా!

ఉ. ఏవిషయమ్ముఁగూడ "నిద మిత్థ" మటంచు వచింప లేము గా
నీ విను మొక్కమాట, యెది యేనియు గోచర మౌను నీకు; నే
కోవిదు లేని యిప్పలుకుఁగూడ దనం గలవారు కారు, నీ
సేవకులైన పాండవులసేగికి నెప్పుడు నొప్పు వచ్చునా!

నార— రాజా! నీవు చిగురునఁ జెప్పినమాట సత్యమే. ఈతఁడు పాండవుల సేగి కెప్పుడును నొప్పలేదు.

కృష్ణ— (తనలో) ఓహో! వీరు విరమించినను నిమ్మని విరమింపక మరల నేదో రెట్టించుచున్నాఁడే! (ప్రకాశము) మునీంద్రా! బ్రహ్మమానస పుత్ర!

ఉ. ఏ నొక మర్త్యుఁడన్ సకల మెట్లు లెఱుంగెద మిమ్మువంటి ప్ర
జ్ఞానిధులైన సన్మునుల సంగతి నించు కెఱింగి యున్న మా
టే నిజ, మైన నయ్యది బహింబడ నైచుట తప్పుకాదె? క
ర్మను గతుల్ మరల్పఁ బరమా పరమాత్మకు నేని? నారదా!

ధర్మ— ఇంతకును నతఁడు చెప్పినట్లు కర్మ మనివార్యము.

ఉ. కడచిన దానికిన్ వగచి కార్యము లే దిఁకమీఁద నైన నీ
గొడవలు మాని పాపమునకున్ దగు నిష్కృతి చేసి కొంచు న
ట్టడవిని మిమ్ముఁ బోలెడు మహాత్ములఁ గొల్చుచుఁ గాలశేష మి
ట్లుడుపఁ దలంచి రాజ్యమిది యొప్పఁగఁ జెప్పితి వాయుసూతికిన్.

అర్జు— (తనలో) ఓహో! తిరిగియు నన్నగారు పూర్వపు వైరాగ్యములోనికి దిగుచున్నారే! ఇందు కేమి యుపాయము?

ద్రౌప— ఆయన మీతమ్ములు గారా? మీకున్న యడవులాయనకు లేవా? తీరఁదగు ముచ్చటలన్నియు నిప్పటికి తీరినవి. ఇఁక నిప్పు డరణ్యవాసమెందుకు? పోనిండు, అట్లొనర్చిన మీయన్నగారు గాని తక్కిన వారుగాని లేచి వచ్చెదరా?

నార— రాజా! ఆమెయుఁ బుత్రదుఃఖములో నున్నది. నీకై ధైర్యమవలంబించి యాఁడుది యైనను నిట్లు పలుకుచున్నది. ఆ పలుకు విశ్వసించి,

తే. గీ. శిష్టరక్షణమును దుష్టశిక్షణంబు
సల్పుచును లోకులెల్లరు జయ మనంగ
ధర్మరాజను పేరు సార్థకము గాఁగ
నేలుకొనుమయ్య ధరణికి మేలుగాఁగ.

భీము— అన్నయ్యా! ఇందులకుఁ దా మొప్పితిరా సరే, అట్లుకాదేని,

చ. కొడుకులా కొమ్మలో యెవరికోసము రాజ్యము నాకుమాత్ర; మే
జడమతి నయ్యు మీకతన జ్ఞానము కొంచెము నేర్తి; మీర లె
య్యెడ వసియింతురో యచట నేనును మీపదసేవ సేయుచున్
గడపెదఁ గాల; మాజ్ఞ యిడఁగాఁ దగు నాకు ననుగ్రహమ్మునన్.

ధర్మ— (విసువుతో) తమ్ముఁడా! నేనొక్కటి చెప్పెద నాలింపుము.

గీ. ఆది నుండియు నాకు రాజ్యమునఁ గాంక్ష
యంతగా లేదు నిజమిది యని యెఱుంగు;
దానిపై నిన్న కష్టముల్ దాపరించి
“ఛీ” యని విరక్తి వొడమె నా చేతమునకు.

అర్జు— (తనలో) ఈయన కెవరు బోధింపఁ గలరు? మొదల నుండియు నీయన యభిప్రాయ మిట్టిదియే (ప్రకాశము) అన్నా! ధర్మనందన!

క. ఇపు డీ వొనర్చు యత్నం
బపుడే యొనరింప రాదొ? యాత్మజులును భూ
మిపతులు జ్ఞాతులు నీదగు
కృపను బ్రతికిపోదు; రెసఁగుఁ గీర్తియు మనకున్.

ద్రౌప— సంశయ మేమి? అప్పుడే గట్టిగా నామనోనిశ్చయ మిట్టిదనిన నిం దొప్పనివా రెవరు? ఇప్పు డిట్లనిన నేమి లాభము? వారకిని లేదాయె మన కంతకన్న లేదాయె, ఇట్టి వృథాప్రయాస మెందుకుఁ బడవలెను?

ధర్మ— ఎందుకా? ఇందుకు.

క. “అరులకు భయపడి యీతం
డరణ్యములు దిరుగు” ననెడి యపయశ మది నా
కు రుచించెనేనియును మీ
కు రుచింపమి నిందు దిగితిఁ గ్రూరుఁడ నైతిన్.

కృష్ణు— సరే, అట్లయినచో,

క. “ఇల నేలలేక కానన
ములకేగెన్ ధర్మజుండు మొగి” ననియెడి ప
లుకులు సైఁపలేరు నీ త
మ్ములు వీరి ననుగ్రహింపు మును పటివలెనే.

ద్రౌప— (తనలో) ఇప్పట్ల నన్న మంచి సమాధానము చెప్పినాఁడు.

భీము— అన్నయ్యా!

తే. గీ. "కడు విరక్తిని నన్న కాఁడవి కేగఁ
దగిన తమ్ముఁలు గల్గియుఁ దగవు చెప్పి
మాన్పలేరై" రటంచు ధీమంతు లనెడి
పల్కు లేగతి సహియించు వారమయ్య

వార — (తనలో) కొంచెము త్రోవఁ జూపినచో ధర్మరాజునకుఁ దగిన యుత్త రము చెప్పఁదగినవాఁడు భీముఁడే; ఈ యంకుశము లేనిచో నామ త్తగజ మిదివఱకే యడవులం బడి పోవును.

నకు — అన్నా ! కౌంతేయాగ్రజ !

క. రణ మన్న యప్పుడే మా
రణ కర్మము గాదె ? యది హరణమునకే కా
రణ మగును గాని సుఖకా
రణ మగునే? దీనిచే విరాగము తగునే ?

సహ — అన్నా ! సకలధర్మవేదిరగు నీకొరులు చెప్పవలయునా?

తే. గీ. నృపున కన్నయయి దమ్ముఁడు నితరులును
నధర్మవర్తనులగు నెడ దండ్యులె కద?
కర్ణుఁడు నధర్మవర్తియౌ కతన దండ్యుఁ
డయ్యె నియ్యెడ సందియమంద నేల ?

వార — (తనలో) చిన్నవాఁడైనను మంచి ఖండితోత్తరముగాఁ జెప్పినాఁడు. భీమార్జునులు చెప్పినను నింత నిరాఘాటముగాఁ గనుపట్టదు. ఇంతకు నితఁడు చెప్పినట్లు వారెట్లు చెప్పఁగలరు. ఏకగర్భజనితులుగదా. వీరి కైదుగురకును నట్టి భేదములేదు గాని, ఐనను ఆ్రవేలి కాగ్రవే లెట్లనియుఁ గొంచెము దూరము కాకపోవునా ?

కృష్ణ — ఇప్పట్ల నితఁడు చెప్పినమాట కడుశ్లాఘాపాత్రముగా నున్నది. రాజు లకు శత్రుమిత్రాది భేదము లెట్లు కుదురును. శాస్త్రమునుబట్టి పోవల యును. లేదా నరకము సిద్ధము.

ధర్మ — (నిర్వేదముతో) ఏమీ ? నేనా అన్నమహాత్ముని శిక్షించువాఁడను!

ఉ. అక్కట ! యిట్టులాడఁ దగు నయ్యె ? పరాక్రమశాలి దాతృతా
ధిక్కృతకల్పపాదపుఁడు దీనజనావనపక్షపాతి పే
రెక్కినవాఁడు "స్వామికృతి కింతటిసాహసి లేఁ" డటంచు నే
నెక్కడ, యాతఁ డెక్కడ ! యిసీ ? జగ మిప్పని కుత్సహించునే.

అతఁడు విధేయులమగు మాయెడల నెట్లు నటించినను నది తప్పుకానే రదు. మాకుఁ దక్క నతఁ డెవ్వరి కేమి యపకృతి చేసెను?

చ. ఎవని భుజాబలమ్మునను యింద్రతనూజుని వాయుపుత్రునిన్
గవలను నిన్ను నన్నెదురఁగా గమకించె సుయోధనుండు, దా
నెవనికి దాసుఁడై మెలఁగె నీజగతీతల మెల్ల నేలియున్,
శివశివ! యమ్మహామహునిఁ జెప్పి మఱొక్కనిఁ జెప్పనున్నదే!

బావా! ఇంత యెందుకు! సంగరమున నొక్క యర్జునుం దక్క మమ్ము నలువురను నతఁ డవమానించుట నీ వెఱుంగనిది కాదు గదా! చేఁజిక్కినప్పుడు వదలిపెట్టుట కాతని నీతిధురంధరత్వము తప్ప వేఱొండు కారణము చూపుము. నాకన్న నే కాదు, ఎవరికన్నను నతఁడు లోకోత్తరుఁడు. చక్కని బుద్ధితోఁ బరికించిన నతనియెడ దోసము వీస మేనియు నుండదు. (నిర్వేదముతో) అయ్యో! దాతృత్వమా! నీవు దిక్కు లేని దానవైతివి సుమీ!

వార— నిజమున కతఁ డట్టివాఁడే కాని దుర్యోధనునియొద్ద నుంటచే నతని యోగ్యత కనుపట్టినది గాదు. ఆశ్రయవిశేషమునం గదా గుణములు శోభించవలయును! అందులో "దాతృత్వ మతనితోఁ బోయిన" దన్నది యతిశయోక్తి గాదు.

ఉ. ఆతని దాతృతామహిమ మయ్యమరేంద్రుఁ డెఱుంగు "నిచ్చుచోఁ
జేతికి నెమ్ము లే" దను ప్రసిద్ధికి నీతఁడె తగ్గవాఁడు; ప్ర
ఖ్యాతశరీరి కర్ణుఁ డిపుడైనను జావఁగ లేదు నిక్కమే
దాతృత దిక్కు లేని దయి తా నశియించెఁ జుమీ యమాత్మజా!

క. బలిశిబిదధీచు లిల మును
గల రెక్కుడు దాత లందుఁ గర్ణునితోడన్
దులఁదూఁగువార లిరువురె
బలి కీతని దొరయుపాటి బలముం గలదే?

కృష్ణు— సంశయమేమి? తమరు సెలవిచ్చినట్లే.

గీ. అర్థమీవచ్చుఁగాక సమస్తరాజ్య
మీయఁగావచ్చుఁగాక వెన్నెమ్ముమాంస
మీయఁగా శక్యమే చర్మ మేరికేని
నితనికే వారికే తగె నింతపట్టు.

ధర్మ— (కన్నీటితో)

ఉ. అట్టి మహానుభావుఁ డిల యంతయు నేలిన నేలుఁ గాక నా
యట్టేఁడు తాదృశుండగు సుదారుని రాజ్యముఁ బూని యేలినన్

దిట్టరె పండితుల్ ? కవులు దిట్టరె? పేదలు దిట్టిపోయరే ?
"పట్టి పినాసి వీఁ" డనెడు వా డెటు నే మెడఁ గట్టి కొందునో ?

కృష్ణ—బావా! నీ వా దాతృతయందును నాతనికిఁ దమ్ముఁడవే సంశయమేమి?

చ. వెనుకటి రాజసూయమున విప్రుల నెందఱి నెన్ని భంగులన్
దనిపితి! చక్రవర్తివిగదా యిపు డంతకు నెక్కుడైన చ
క్కని సుకృతమ్ములన్ విరివిగా నొనరింపుము; జ్ఞాతివర్గఖం
డనజనితాఘసంహతు లణంపుము చింతిలనేల దీనికిన్ ?

భీము— అన్నా ! దండధరనందన!

చ. అమలమనీష నీవు ముద మారఁగఁ జేయఁ గదయ్య యశ్వమే
ధము దురితమ్ము లెల్లను యథా యథలై నశియించు దాన; "ద్ర
వ్య మిపుడు లేదుగా" యని లవమ్మును సందియ మందఁ బోకు, వి
క్రమధనులైన సోదరులకన్నను ద్రవ్య మొకండు గల్గునే !

నార— రాజా ! మేము విధింపఁదగిన యంశమ్మును ధర్మజ్ఞుఁ డగు నీతమ్ముఁడే బోధించుచున్నాఁడు. కావున నవశ్య మట్లొనరింతువు గాక.

అర్జు— తే. గీ. ద్రవ్యమున కేమి సంపత్ప్రదాత్రియైన
యంబుజాక్షుని దయ మనయందుఁ గలదు;
కామధేనువు నట్టింటఁ గట్టిపెట్టి "కోర్కె
లొనఁగూర్పు" మని యొకఁ గోరనేల ?

నకు— (పౌరుషముతో) అన్నా ! ధర్మవిదగ్రగణ్య ! అట్లేదో నిష్కృతి యొనరించుకొను టుచితము, అంతియెకాని,

తే. గీ. రాచపుట్టువుఁ బుట్టి యరణ్యసీమఁ
దిరుగుదురె ? బ్రాహ్మణులమె ? విధించె ధాత
మనకు భూభారభరణ, మమ్మహితు నాజ్ఞ
వమ్ము సేయుట మీవంటివారి కగునె ?

సహ— అన్నా ! కౌంతేయాగ్రజ! ఇదియేనియుఁ బ్రాయశ్చిత్తార్థము చేయ నక్కఱలేదు. రాజులకు నవశ్యాచరణీయ మగుట నొనర్పఁదగినది.

తే. గీ. జ్ఞాతులను మన మేటికిఁ జంపినార !
మంతరించిరి వా రెల్ల నాత్మదోష
ముల కతమ్మున; నీవంటి పుడమి ఱేఁడు
జాతిధర్మమ్ము విడిచిన జగము సెడదె ?

ధర్మ— అన్నలార ! యెఱిఁగియెఱుఁగని మాటలు చెప్పకుఁడు. కులవృద్ధగు

భీష్ముఁడేమంత దోషియై యంతరించెను?

(అంత నొక పురుషుఁడు ప్రవేశించును, "ఇదుగో"యని ఉత్తరమిచ్చును, పోవును.)

ధర్మ— (విప్పిచూచి తనలో)

క. తమ్ముంగుఱ్ఱలఁ గృష్ణుని
నిమ్ముగనివరు నెట్టులేని యే నొప్పింపం
గ మ్మది నెంచితిఁ; గులగురు
విమ్మాడ్కి విధించెఁ దాత; యిఁక నేమందున్!

కృష్ణ— ఏ మిది రహస్యమా, మీలో మీరే యోజించుచున్నారు!

ధర్మ— (చేతికిచ్చును)

కృష్ణ— (చదువును)

క. "శ్రీరస్తు చిరంజీవికి
సారాచారున కజాతశత్రునకు ముదం
బారఁగ శంతనసుతుఁ డా
శీరాద్యంతమున వ్రాయు సేమపువార్తల్"

ద్రౌప— (తనలో) ఏమని వ్రాయునో!

భీమ— (తనలో) ప్రకృతానుగుణముగా నున్నచోఁ జక్కఁగా నుండును.

అర్జు— (తనలో)

గీ. అకట! నాదు శరమ్ముల నంపసెజ్జఁ
గూలియుండి రవంతేనిఁ గోపమొంద
కిపుడు దీవించియే వ్రాయు నిద్ధచరితు
శాంతి నా కెంతయేని లజ్జాకరంబు.

నార— తరువాత?

కృష్ణ— క. "అరుల జయించితి రాజ్యము
కరగతముగఁ జేసికొంటి కావున ధర్మ
స్ఫురణమ్ము వలయు నీకది
యరసి వచింపఁగఁ దలంతు నరుదెమ్మిటకున్"

ద్రౌప— (తనలో) పాపము! ఆయన యిప్పటి దుర్యుద్యమం బెఱుఁగఁడు.

నార— అవును. ధర్మరాజునకుఁ గూడ ధర్మములు చెప్పుట కాయనయుఁడే తగినవాఁడు. తరువాత?

కృష్ణ— క "ఏ నిపుడు చెప్ప నెంచిన
యీనీతులు రాజ్య మూనియే వినవలె వే
వే నీవు పట్టభద్రుఁడ
వై నాకడ కరుగుదేఁగదయ్య కుమారా"

ద్రౌప— (తనలో) అమ్మయ్యా! ఇప్పటికి బ్రతికితిమి. ఎవరిమాట తీసివేసి
నను ఆయనమాట తీసివేయఁగూడదు.

భీమ— (తనలో సంతోషముతో) ఇయ్యనఘుని వైరాగ్యగజమునకు మంచి
యంకుశము తటస్థించినది.

నార— (ఏకసక్కెముగా)

గీ. నారదుఁడు గాఁడు దేవకీనందనుండు
గాఁడు భీముఁడునుం గాఁడు కనలు గాదు
క్రీడి గాఁడు ద్రోవది గాఁదు "కూడ" దనినఁ
దీర దిఁక భీష్ముఁ డీతం డుదీర్ణగుణుఁడు.

ధర్మ— (వినయముగా) మీ రందఱును నాకుఁ దెలుపఁ దగినవారు కారా?
అందులోఁ దమ రేమి, హరి యేమి, ఆయనకన్నను మాన్యులు.

క. నా మనము కేవలము చిం
తా మగ్నంబైన కతనఁ దమ యాజ్ఞకు నే
నై మొగియ నైతి దయతో
నీ మూర్ఖు క్షమింప వలయు నియ్యెడ ననఘా!

నార— (నవ్వుచు) రాజా! నే నూరక యట్లంటినే కాని దేవవ్రతుఁడు మా
యిరువురకన్న వేయి రెట్లధికుఁడు.

కృష్ణ— సంశయ మేమి?

సీ. జననంబు నెంతుమా! సకలాఘసంహృతి
క్షమ మగు గంగ గర్భమునఁ బుట్టెఁ;
పౌరుషం బెంతుమా! పార్థివాంతకుఁడైన
పరశురాముని నాజి భంగపఱచె;
సత్యమ్ము నెంతుమా! జనకుని పెండ్లికై
తా నన్నమాట నిందనుక నిల్పె;
వ్రతనిష్ఠ నెంతుమా! పార్థుచేఁ గూలి పు
ణ్య దినమ్మువఱకుఁ దా నట్టె నిలిచె;

గీ. నింటు నొక్కొక్కటియు కడు నెన్నఁ దగిన;
విన్నియును గల్గు భీష్మున కెవరు సాటి?

మమ్ము రక్షించుము భువనైక మాన్యులైన
మూఁడు మూర్తు లియ్యనఘుతో మొనయఁ గలరె!

ధర్మ— (విచారముతో) ఇట్టి మా తాతగారును, నట్టి ద్రోణాచార్యులవారును వీరలతోడనే పోల్పఁదగు మా యన్నగారును నేలొకో యీ రణమున నిహతులైరి. అక్కటా! కాల మెంత యనివార్య మైనది!

నార— రాజా! ఇం దాశ్చర్య మేమున్నది? భీష్మ ద్రోణు లిరువురును న్యాయైక పక్షపాతమున మీ కుపకార మాచరింప నెంచి యస్థిరమ్మగు కాయమ్ము విడిచి సుస్థిరమ్మగు యశమ్ము సంపాదించుకొనిరి. "నిష్పక్షపాతముగఁ బోరాడినవాఁడు మీ యన్నగా రొక్కఁడే" యని నిష్కర్షగాఁ జెప్పవచ్చును.

సీ. గోవధమ్మునకు సంకోచించి వేఁడిన
తఱిని విప్రుఁడు దయ దాఁపఁ డేని
బ్రహ్మాస్త్రమును గొను పట్టున భార్గవుఁ
డెఱిఁగి చెచ్చెర శపియింపఁ డేని
పార్థునందలి పక్షపాతబుద్ధిని నింద్రుఁ
డరిగి తన్నను బిచ్చ మడుగఁ డేని
యర్ధరథునిఁ జేసి యవమానపఱచి భీ
ష్మం డసూయ నొకింతఁ జూపఁ డేని

గీ. కుంతి "వర" మని పలుమఱుఁ గోర దేని
శల్య సారథ్య మను ము ప్పెసంగ దేని
కృష్ణుఁ డన్యాయధమ సాఁగింపఁ డేని
గర్ణు నోడించువారు జగానఁ గలరె!

ధర్మ— మహాత్మా! యయ్యనఘుని గుణము లెన్ని విన్నను దఱుఁగవు. దుర్యోధనుఁ డొనర్చిన యకృత్యములకుఁ గోపము గల్గియును నీతని ముఖము చూచునంతనే యయ్యది పటాపంచలై పోయెడిది. కారణాన్వేషణమునకు మనము ప్రయత్నించియు నిట్లు జరుగుట యవశ్యంభావి యగుటచేఁ గాఁబోలు నంత దీక్ష మాత్రము వహించినది కాదు.

క. జనకుండు చిన్నతనమునఁ
జనె; నగ్రజుఁ డిట్టు లాయె; సంసారము నె
త్తిని బడియె; "విడిచిపెట్టెద"
ననుకొన్నను వీలు చిక్క దార్యుల కతనన్.

నార— రాజా! యీ యాశ్రమమున కే యాశ్రమమును సరిగాదు సుమా! ఏమందువేని,

సీ. వేదపఠితముల నాపాదించి చరియించు
 బ్రహ్మచారుల కెల్లఁ బట్టుగొమ్మ
అతిథులై చరియించునట్టి గృహస్థుల
 నాదరింపంగఁ గల్పాగమంబు
భార్యైకయుక్తులై వనమునఁ దిరుగు వా
 నప్రస్థులకు రక్షణప్రసక్తి
సంసార హింసా రిరంసా విరక్తులౌ
 సన్న్యాసులకును విశ్రాంతిభూమి
గీ. యైన గార్హస్థ్యమున నుండి యఖిల కర్మ
 ముల నొనర్చి తుదకు ముక్తిఁ బొందవచ్చు
 నట్లుకాదేని యా వసిష్ఠాదిమునుల
 కేల గార్హస్థ్యమున నుండు టెఱుఁగఁ జెపుమ?

ధర్మ— మహాత్మా! మీయాజ్ఞ శిరసా వహించుచున్నాఁడను.

భీము— (సంతోషముతో) నకుల సహదేవులారా!

ఉ. ఇంతకు మున్న వచ్చిన నృపేంద్రకుమారుల కెల్ల నేఁటి యీ
వింత నెఱుంగఁ జేయుటయు, వీడఖిలంబు నలంకృతమ్ముగా
నెంతయు వేడ్క నల్పుటయు, నిప్పటికిం దగు కార్యముల్; ప్రసం
గింతురు గాక యిప్పను లొగిం దగువారల నేర్పరించుచున్.

(నకుల సహదేవులు నిష్క్రమింతురు)

ధర్మ— అర్జునా!

గీ. ఇప్పటి విశేషముల నెల్ల నెఱుఁగఁ జెప్పి
 "వలయు సాధనసామగ్రి గలయఁగూర్పఁ"
 డనుచు ధౌమ్యులతో వినయమున నేను
 మనవి చేసితి నని చెప్పుమా కుమార.

(అర్జునుఁడు నిష్క్రమించును)

నార— రాజా! మేము తిరిగియుఁ బట్టాభిషేక కాలమున కరుగుదెంతుము.

కృష్ణ— బావా! నే నిప్పటికిఁ జని యుత్సవసమయమునకు సకుటుంబముగా నరుదెంచెదను.

ధర్మ— అట్లనే యొనరింపుము.

చ. శశభిష లంతగా నలుపఁజాలవు నీవు, హలాయుధుం డక
ల్మషహృదయుం డైన మనమాటఁ దలంచినమాత్ర మందు, నా

ఋషితుల్యప్రభావునకు నేగతి నేనియు నొప్పఁ జెప్పి బల్
కృషి నొనరించి యియ్యెడకు నెట్లయినం గొనితేవలెం జుమీ.

నీవెంబడి భీమునిం గూడఁ దీసికొని పోయి యతనిచేఁ దగు మాటలు చెప్పించి యతనికిఁ గోపోపశాంతి కావించి యిందులకు సమ్మతింపంజేసి తోడ్కొని వత్తువుగాక !

కృష్ణు — మంచిది. (భీమునితో నిష్క్రమించును)

ధర్మ — దేవీ ! దుౝపదరాజనందని !

ఉ. పట్టపుదేవి వైతి నను భావమునన్ గరువంబు దాల్ప కె
ట్టెట్టులు నేరి నేరిఁ దనియింపుట యొప్పగు నట్టు లట్టు లి
ప్పట్టున వారి వారికి సపర్యల నర్పణ సేసి కీర్తికిన్
బట్టగునట్టు లుండఁ దగు భాగము నీతలఁ గట్టెతిం గుమీ !

గీ. ధనములా శాశ్వతము గావు ; తనువు లంత
కన్న శాశ్వతములు గావు; కలిమిలేము
లబ్బుతతి నుబ్బుటయును దబ్బిబ్బువడుట
సారవిదులైనవారి లక్షణము గాదు.

ద్రౌప — నాథా ! తమ యానతి చొప్పుననే సకలము నిర్వర్తింపుదానను. మన మిరువురమును దుఃఖాంబుధిమగ్నులగు మీ తల్లిదండ్రులకడ కరిగి యోదార్చి యెట్టులేని యిందులకు వచ్చునట్లు ప్రార్థింపవలయును.

ధర్మ — దేవీ ! చక్కఁగా బోధించితివి. ఇప్పుడే పోయి యట్లొనరింతము.

(నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవాశ్వమేధమ్మునఁ
దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

## చతుర్థాంకము

(అంతట నొక కవి ప్రవేశించును)

కవి— (విసువుతో)

ఉ. ఎక్కడి కేగినన్ శిశువులే నృపతుల్ కవితారసాయనం
బెక్కడ! కుట్లు లెక్కడ! యిసీ! యిటు లందఱి రాజులన్ యశో
భాక్కుల దాతృతాఖనులఁ బాండవు లేమని చంపిరో కదా!
యక్కట! సత్కవీశ్వరుల కన్న మిఁ కేగతిఁ గల్గఁగా వలెన్.

(పరిక్రమించి చెవియొగ్గి) ఇయ్యెడ రాజు నెట్లు పొగడుచున్నారో!

(తెరలో)

గీ. ఇంత శాంతుండు లేఁడు లేఁ డింత దాంతుఁ
డింత సదయుండు లేఁడు లేఁ డింత దాత
ఇంతటి నిగర్వి లేఁడు లేఁ డింత యోగ్యుఁ
డింతటి యశస్వి లేఁడు లేఁ డింత రాజు.

కవి— ఇట్లెల్లయెడలం గొనియాడఁ బడుచున్న యీ రాజు నిజముగా "పంట వలంతి నోఁచుకొన్న నోములపంట" యనినం దప్పేమి? ఇట్టి మహానుభావుని దర్శనమునకుఁ బోవుచుంటిని గదా! ఒక పద్యమేనియు రచించుకొనవలదా? (రచించుట నభినయించి)

చ. కృతయుగ మాది నిప్పటికి సెండలు రాజులుగారు! రామభూ
పతి యొకరుండు దక్క నినువంటి నృపాలకు లేరి? యాతఁడుం
"బ్రతి" యతి చెప్పఁజాల మొకపట్టున; నింతటి భాగ్యశాలివై
క్షితి నలరించు నీకు దయసేయు రమాపతి సర్వసౌఖ్యముల్.

పద్య మనకూలముగాఁ గుదిరి యుండునా? కుదుర కేమి? కాని కొంచె మతిశయోక్తి పడినట్లు మాత్రము తోఁచుచున్నది. లేదు!

రాముఁడు తప్ప నిట్టి రాజు లేనే లేఁడు. ఉన్నచో నాదికావ్యమును రచించిన వాల్మీకి యాతని చరిత్రమునే యేల కైకొనవలెను? తరువాతఁ దిరిగియు నట్టి కవి యున్నచో నీతని చరిత్రము వ్రాయఁ దగినది. ఇందులకు నిప్పటి వారిలో వ్యాసులవారే తగినవారు. ఒక్కొక పట్టున నియ్యనఘునికి శ్రీరాముఁడునుం దుల్యుఁడు గాఁడు. సత్యమే! ద్రౌపదిం జెఱగొన్న సైంధవు నీతండు ప్రాణావశేషముగా విడిచినాఁడు. రాముఁడో! సీతం జెఱగొన్న రావణునిఁ బుత్రమిత్రసమేతముగ నశింపఁ జేసెను. సరే, ఇక్కడికిఁ బద్యము కుదిరినది. రిక్తహస్తములతో రాజుం జూడఁ గూడదు. (దృష్టి నిగుడించి) అడుగోఁ, బండ్లమ్ముకొనువాఁ డొకఁ డటు పోవుచున్నాఁడు. వాని నిటు పిల్చెదఁగాక. ఓయీ! పండ్లవర్తకుఁడా! ఇటు రమ్ము.

(అంత వర్తకుఁడు ప్రవేశించును)

వర్త— ఏమయ్యా పిల్చినావు?

కవి— పండ్లుకావలెను.

వర్త— ఇదిగోఁ గొనుండు.

కవి— వెల యెట్లు?

వర్త— జో డర్ధపావలా.

కవి— ఇఁక నొక మాట చెప్పు.

వర్త— ఎన్నిసారులు చెప్పినను అంతే.

కవి— సరేగాని మీరాజుగారు మంచివారు కదా?

వర్త— ఇంత మంచివా రెక్కడను లేనే లేరు.

కవి— తఱచుగాఁ గవీశ్వరులు వచ్చుచుందురా?

వర్త— రాకేమి, తఱచు పండితులతోడనే కాలక్షేపము. తమరుఁ గూడఁ గవీశ్వరులవలెనే యున్నారే! రాజుగారు గ్రామములో లేరు.

కవి— (విషాదముతో) ఏమీ, యెక్కడికివెళ్ళినారు? ఎప్పుడు వత్తురు?

వర్త— భీష్ములవారియొద్దకు వెళ్ళినారు. వారీదినమున స్వర్గమునకు వెళ్ళెదరఁట.

కవి— (తనలో) ఇక్కడికి వచ్చినను మన దారిద్ర్యదేవత వెంటనే వచ్చినదే! (ప్రకాశము) అయినచో నాకీఫలము లక్కఱలేదు.

వర్త— పోనిండు (నిష్క్రమించును)

కవి— ఈ గొడవ యడఁగినమీఁదఁ దిరిగియు వచ్చెదఁగాక. (నిష్క్రమించును)

(అంత శరతల్పగతుఁడగు భీష్ముఁడును పాండవులును విదుర ధృతరాష్ట్రులును కృష్ణుఁడును ప్రవేశింతురు)

భీష్మ— (దీనస్వరముగా) నాయనా ! ధర్మనందన !

ఉ. నీ పరిపాలనమ్ము విని నిత్యము సంతస మందు చుంటి నే
యాపద లేక భూమిప్రజ లందఱును సుఖ మందు చుండి రో
హో ! పరమాత్ముఁ డిప్పటికి యోగ్యత మున్నిను రాజుఁ జేసి సం
తాపము నందు భూసతికిఁ దానొనరించె ముదం బతండ్రుఁడై.

ధర్మ— (విచారముతో) పితామహా ! గాంగేయ ! సర్వబంధుసంహారం బొన రించి నే నిప్పుడెట్లు పాలించిన నేమి లాభము ? అయినను

ఉ. భవదుపదేశవాక్యములపై మది నిల్పి త్రికాలవేది మా
ధవు ననుశాసనమ్ము గొని తమ్ముల సమ్మతి యూఁత గాఁగఁ బె
ద్దవిభుని యాజ్ఞ చొప్పున సదా విదురానుమతిన్ గృపార్య శా
స్త్రవిధికి లోఁగి నేనును యథామతిఁ జూతు సమస్త సంగతుల్.

కృష్ణ— తాతా ! లోకైకపూత !

ఉ. ఎవరు సహాయు లెంచులకు నీయనఘాత్మన కెన్ని యెన్ని ధ
ర్మవిధులు గల్గు నన్నియును మాన్యచరిత్రుఁడ వైనయట్టి నీ
సవిధమునంద శిష్యుఁడయి సంగ్రహణం బొనరించెఁ; దాము పాం
డవులకుఁ గాదె దేహము కడంగి పహించితి రింతకాలమున్ !

భీష్మ— కృష్ణా ! వాసుదేవా !

గీ. ఎవనిలో నుండు లోకమ్ము లెవఁడు లోక
మెల్లెడ వసించు నట్టి యోగీశ్వరేశ్వ
రుండ వీవుండ వేఱొక్కరుండవలెనె?
పాండవుల పాలి పరమబంధుండ వీవు.

విదు— సంశయ మేమి ?

గీ. ఎన్నియో కారణమ్ముల నిమ్మహాత్ము
నవతరించుటకై పెద్ద లండ్రు గాని
పాండుసుతరక్షణైకతత్పరతకుఁ బని
గట్టికొని పుట్టె నని నమ్మకమ్ము నాకు.

భీష్మ— విదురా ! జ్ఞానవిదుర ! నీయూహ చక్కఁగనే యున్నది. వినుము

గీ. ఇమ్మహాత్ముని యవతార మెన్నియేనిఁ
గారణమ్ములు గలయది గాని యందు

దిక్కుమాలిన నావంటి దీనులకు వి
ముక్తి నొసఁగుటయే సుమ్ము ముఖ్యఫలము.

ధృత— (కన్నీటితో) తండ్రీ ! నీవు నిజముగా దిక్కుమాలినవాఁడవే యైతివి.

గీ. వీర వీరార్చిత ! విచిత్రవీర్యునకు వి
వాహ మొనరించితివి కష్టపడి జయించి;
అతఁడు నేఁటికి ప్రత్యుపకృతిని నిట్టు
లాచరించెను నావంటి యధము కతన.

అర్జు— (విచారముతో) తండ్రీ ! ఇప్పట్లు నీవుగాని నీ కొమరులు గాని లేశ
మును నింద్యులు గారు.

ఉ. అని నొనరింప లేక చని యాచనఁ జేస నజాతశత్రుఁ; డీ
మనుమని యందనుగ్రహము మైఁ దన చచ్చు నుపాయముఙ్ గృపా
ఖని వచియించెఁ దాత; "యగుఁ గా" దన కేనటు లాచరించి యి
య్యనఘుని నిట్లొనర్చితి నహో ! మము నిర్వ్యర దూఱుటొప్పగున్.

ధర్మ— తాతా ! శంతనుపుత్ర !

ఉ. "ఏమని కోరె వీఁడు గుణహీనుఁడు ద్రోహి దురూహుఁ డక్కటా !
పామరుఁ" డంచు నెంచక కృపామతి గుట్టెఱిఁగించి తీవు మా
సేమముఁ గోరి; "యిట్టిపని సేయుట త" ప్పని యే నెఱింగియున్
భూమికి నాసఁ జేసితిఁ; దపోమహితున్ గులవృద్ధుఁ జంపితిన్.

భీమ— (విచారముతో) తాతా ! శాంతిగుణోపేత!

క. కులవృద్ధు నిట్లొనర్చిన
ఖలులకుఁ గులవృద్ధి గలదె ? కాఁబట్టియె ని
ష్కలుషులు సుతులు నశించిరి
కలనెల్లను దీరుపై నకారణ మనఘా.

అర్జు— అందునను, నేను బరమ దుర్మార్గుఁడను.

గీ. పరశురాము జయించిన బల్లిదుండు
తాత; యీతని మెప్పుఁ దద్దయు వహించి
నట్టి చెట్టంత కొడుకు దానాహవమునఁ
గూలు నే! దోసములు కట్టి కుడుపకున్నె ?

ధృత— తండ్రీ ! అర్జున !

గీ. కొడుక ! మీ రేల నిందించుకొనెదరోయి ?
దోషమిది యెల్లనాదు పుత్రులది కాది

దాయభాగమ్ము హరియింపఁ దలఁపకున్న
నింత పుట్టునె ? యిట్లౌనె శాంతనవుఁడు !

ధర్మ— తండ్రీ ! ఆంబికేయ !

ఉ. నీకొడు కేమిసేయు ? నవినీతుఁడనై చని యేను " తాత ! నీ
పోక కుపాయముం దెలిపి భూమికి నన్ బలిఁజేయు " మంటి " నీ
దౌ కడిమిన్ సహింపఁ గలమా ? దయ యుంచు" మటంటి; దానఁ గా
నే ! కులవృద్ధు నిట్లు బలి యిచ్చితి రాజ్యరమన్ గ్రహించితిన్.

(భీష్మనుద్దేశించి) తాతా ! ధార్మికాగ్రేసర !

గీ. తొడల నిడికొని కడు ముద్దు దొడర నెత్తి
పెంచితివి పెద్దఁజేసితి వంచితముగ;
పాఁపజాతికిఁ బాల్పోయు పగిది యయ్యె;
నెన్ని జన్మములకును నా కిదియ చాలు.

భీష్మ— తండ్రీ ! ధర్మనందన !

ఉ. ఏల విచార మందెద ? పహీనులు మీ రొక రుండఁ బట్టియే
యాలములోన నాకు మృతి యబ్బె; నిదే కద క్షత్రజాతికిన్
బోలెడిచావు ! యుద్ధమున ముద్దిసుకొందురె యెవ్వరేని ?దు
శ్శీలురకున్ సహాయములు చేసెడివార లదండ్యు లౌదురే?

క. నా కేమి పెద్దవాఁడను
జీఁకు కుమారుండు వీని చేతులలో నా
పోక యుచితంబ కాదొకొ?
శోకించుట తగునె జ్ఞానశూరుఁడ వయ్యున్?

కృష్ణ— (కన్నీటితో) తాతా ! స్వాయత్తజీవన !

ఉ. చక్రము కేలఁ గైకొని విశాంపతు లంద "టిసీ ! యిసీ ! యిసీ
యక్రమ" మంచు దూఱ, రయ మారఁగ బాహువు పట్టి వెన్క కీ
శక్రసుతుండు లాగ, నినుఁ జంపు తలంపున వచ్చునట్టి యీ
వక్రచరిత్రు తప్పిదము వాపి క్షమించి యనుగ్రహింపవే.

భీష్మ— (చిఱునవ్వుతోఁగూడిన భక్తితో) కృష్ణా ! లీలామానుష విగ్రహా!

క. ఎందుకుఁ గళుఁ గన్చెదు? గో
విందుఁడ వని మొదలనుండి విని యుంటి, నిన్నా
చందం బెఱుఁగుదు స్వామీ !
వందనములు నీ కొనర్తు వందలు వేల్గన్.

కృష్ణ— పితామహా! కురుకులాలంకారా! నేను గోవిందుఁడ నైన నగుదుం గాక దానికేమి?

మ. అవనీచక్రము నెల్ల గెల్చితివి లోకారాధ్యుఁడైనట్టి వి
ష్ణ్వవతారున్ భృగుపుత్రు మించితివి నీ వాజన్మమున్ బ్రహ్మచా
రివి స్వాయత్తుఁడ వాత్మశుద్ధుఁడవు వారింప న్నినున్ శక్యమే?
యవివేకమ్మున నట్లొనర్చితిని తాతా! తప్పు సైరింపవే.

భీష్మ— కృష్ణా! పాపారణ్యకృష్ణవర్త్మ! నాజన్మమునకెల్ల నేనొనర్చినవే యీ రెండు తప్పులు. ఒకటి గురునితో నెదుర్కొనుటయు, రెండు నీ కెదురుగా నుండి యనిసల్పుటయు; భార్గవు నోర్చుట కేవలము నాశక్తి చేతనే యన వలను పడదు.

క. గురు వగుట వృద్ధుఁ డగుటన్
గరుణాంతఃకరణుఁ డగుటఁ గలనన్ నే న
ప్పరమాత్ము నోర్వఁ గల్గితి
దురిత మ్మొడిగట్టికొంటి దుర్మతి నైతిన్.

ఇంతకు నప్పటి కయ్యనఘునియందు విష్ణ్వంశము లేక పోవుట ముఖ్య కారణము.

అర్జు— తాతా! ధానుష్కైకశరణ్య! ఇయ్యెడ నీ తప్పేమున్నది?

ఉ. ఆయన కాయనై రణమునందలి కోర్కె నినున్ వరించె; లే
దే యిట దోష మించుకయు; నే నొనరించితి మెట్టికూళలున్
జేయఁగ రానికృత్యము; లజేయు నినున్, గురునిన్ భవత్సమున్
మాయమెయిన్ వధించితి మహాయికులన్ గరుణాంతరంగులన్.

భీష్మ— నాయనా! ఇంద్రనందన!

ఆ. వె. నరుఁడ వీ వితండు నారాయణుండు మీ
చరిత మెఱుఁగనట్టి జడుఁడఁ గాను
వీర లుండి రనెడి కారణమ్మున నె యు
ద్ధమున నేను సమ్మతమ్ము గంటి.

(సంతోషముతో)

గీ. మరణ కాలమ్మునం దొక్కపరి నొడివిన
నెవని నామంబు మోక్షమ్ము నిచ్చితీరు
నట్టి విష్ణుండు నాదు ప్రయాణసమయ
మునకు దయచేసె నాపుణ్యమునన కాదె.

భీమ— (కన్నీటితో) తాతా! త్రైలోక్యవంద్య!

శా. ఆయాసమ్ముగ నుండఁ బోలు నిఁక మాటాడంగ లే వేమొ నీ
దాయాదాపకృతుల్ క్షమించి కరుణన్ దైవార నీక్షించి యి
మ్మా యాశీర్వచనంబు ! పాదములు తెమ్మా యొత్తెదన్ మ్రొక్కెదన్
గాయంబుల్ నిలువెల్లఁ గల్గియును శక్యంబే యిటుల్ నిల్వఁగన్ ?

భీష్మ— తండ్రీ ! వాయునందన !

చ. జనక వరప్రసాదమున సాయకబాధ యొకింత లేదు; నీ
మన మతి నిర్మలం బెపుడు మాయ నెఱుంగవు వెట్టి కోపమున్
గనుటయ కాని, యంతటనె కారుణికత్వముఁ దాల్తు; సేవ చే
సిన సుకృతమ్ము గైకొనుము చెందె మనమ్ము ఘనప్రమోదమున్.

(కృష్ణునుద్దేశించి) కృష్ణా ! పరలోకబాంధవ !

చ. మృదు వగు వెన్నవంటిది శరీరము నీయది, యెప్డు కష్ట మ
న్నది సయిపంగ నేరదు పదాఱుసహస్రము లిందుకై సదా
మది జపియింత్రు గోపికలు, మాధవ ! నిష్కరుణుండవైన నా
ప్రదరము లిందు నాటి యపరాధ మొనర్చె ననుగ్రహింపవే.

ధృత— (కన్నీటితో) తండ్రీ ! నాగతి యేమి చెప్పితివి ?

గీ. కన్నులా లేవు, మదికి సౌఖ్యమ్ము లేదు
కొడుకులా ? మన్మలా ? యెందుకోస మేను ?
నన్ను నీవెంటఁ గొనిపొమ్ము నాథ మైన
ప్రేత మిందున్న నందున్న నేమి ఫలము ?

భీష్మ— నాయనా ! ఆంబికేయ !

ఉ. ఏల యధైర్యముం గొనెద వేగురు పుత్రులు గల్గి యుండియున్
బేలవె ? కూళలౌ సుతులు పెక్కురు గల్గిన నేమి, యొక్కఁడే
చాలఁగదా సుశీలుఁడు ! విశాలనయుల్ మఱి వీర లందఱున్
జాలిఁ బడంగ నిత్తురె ! విచారము నొందకుమయ్య పుత్రకా !

విదు— (కన్నీటితో)

క. ఏ సందియమ్ము గల్గిన
నా సందియ మంతలోన నడఁగించు నుప
న్యాసకు నిన్నుం దండ్రిని
బాసి యెటుల్ ప్రాణములను బాయక నిలుతున్.

భీష్మ— విదుర ! జ్ఞానవిదుర !

తే. గీ. కృష్ణునికి నీ వనిన దయ కేవలముగ
స్వయముగాఁ బండితుఁడ వీవు చతురమతివి

నేను జెప్ప నక్కఱలేదు గాని యిమ్మ
హోమహూ భజింపు మిహమును నబ్బుఁ బరము.

కృష్ణు— తాతా! దేవవ్రత!

క. ధన్యుండ వీవు మును రా
జన్యులు పెక్కండ్రు గలరు జ్ఞానమున ధృతిన్
జన్యమ్మున నన్యమ్మున
మాన్యాగ్ర నీవంటి మేటి మానిసు లేరీ!

భీష్మ— కృష్ణా! వసుదేవనందన!

గీ. ఆలుబిడ్డలు లేకున్న యట్టి నాకు
సమయమున కబ్బె నీదు దర్శన సుకృతము
సెలవు దయసేయు మయ్యా! నీచే ననుజ్ఞఁ
గొంటినా జగమున నెందుఁ గొదువ లేదు.

అర్జు— (కన్నీటితో) తాతా! సద్గుణవ్రాత!

క. గీతలలో హరి సెప్పిన
యాతీరెల్ల భవదీయమగు నాచరణమునన్
జూతు నిటువంటి విజ్ఞా
నాతీతులు కోటి కొక్కరైనను గలరే!

భీష్మ— నాయనా! హరినందన!

క. హరి యనఁగ నీవనఁగ నొం
డొరులవులె? యవతారపురుషు లొక్కొక కార్యం
తిరముల నిటు జన్మింతురు
నరనారాయణులు; వింటి నారదు కతనన్

కృష్ణు— తాతా! భువనైకపవిత్రచరిత్రుండవగు నీ కెవరి యాజ్ఞతో నేమి యవసరము.

ఆ వె. ఈవు ధర్మపరుఁడ వెఱుఁగని దొక్కటి
లేదు నాయెడల మహాదరమ్ము
గలుగు కతన నిట్లుగాఁ బల్కితివి నీయ
భీష్టసిద్ధి యగుఁ బ్రీకృష్ణహృదయ!

భీష్మ— (సంతోషముతో)

క. నీయాజ్ఞ వడసితిని నా
కేయేలోకముల నేని నిఁక లోపము రా

దో యదునందన! కృష్ణా!
పోయెద దయయుంచు పురుషపుంగవ! నృహరీ!

(ధృతరాష్ట్రాదుల నుద్దేశించి) తండ్రీ, ధృతరాష్ట్రా! నాయనా, విదుర! కుమారా, ధర్మనందన! మీయందఱిచేత ననుజ్ఞాతుండనై పరసుఖమ్మున కేగుచుంటి నాకై విచారింపకుఁడు.

కృష్ణ— తాతా! నేఁడు మాఘశుద్ధ ద్వాదశి. ఇట్టి పుణ్యదినమ్మున నీవు దేహత్యాగంబొనరించి పరమ్ము నలంకరించుచుంటివి. కాన నీదినము స్వతః పవిత్రమైనదయ్యు మఱింత వన్నె కెక్కి నీపేరఁ బ్రసిద్ధివడయుఁగాక మఱియు,

గీ. విప్రు లెల్లరు నీకుఁ దృప్తిగను నేఁటి
దినము ప్రతివత్సరమ్ము సుదీర్ఘచరితు
నిన్ను ధ్యానించి మిగుల మన్నించి తర్ప
ణముల నిత్తురుగాక పుణ్యమును గోరి.

భీష్మ— దేవా! నీయనుగ్రహమున్న నాకొక్కటియుఁ గొదువలేదు. నేను యోగమార్గమ్మునఁ బ్రాణమ్ములు విడువం దలంతుఁ గాన నాకించుక యావరణం బేర్పఱిచి మీరందఱును గొండొక దవ్వున నిలుతురుగాక.

ధర్మ— ఎవరురా, అక్కడ! (తెరవైతురు)

కృష్ణ— (తెరసందునుండిచూచి ధర్మజునితో)

క. చూచితివె? ధర్మజా! స
త్యాచారుండైన యిమ్మహామహు యోగ
ప్రాచుర్య మ్మిట్టువలె నే
యాచార్యులు నేర రిది యథార్థము సుమ్మీ!

విదు— (అట్లనేచూచి) ఓహో! యిదివిచారకర మయ్యును నత్యాశ్చర్యం బగుచున్నది.

ఆ. వె. ప్రాణముడిగినపట్ల శల్యములు లేవు
కలనె? యిట్టిదియును యోగగరిమ లెందు
(ఆకాశమువంకఁ జూచి)
అదిగో! బ్రహ్మరంధ్రమునుండి యనుపమాన
మైన తేజం బొకం డేగు నంబరమున.

(అందఱును నాశ్చర్యపడుదురు. పుష్పవృష్టి కురియును.)

కృష్ణ— (ఆశ్చర్యముతో)

ఉ. చావులులేవె? యిట్టిక్రియఁ జచ్చినవారల నెందుఁ జూడ; మీ
పావను కారణమ్మునను భారతవంశము వన్నెకెక్కె; జ
న్మావధిఁ జచ్చునంతకు రవంతయు లోటును లేనివారి నెం
దే వినియుంటిమే? కనిరె యిట్టి విచిత్రము లెందు నెవ్వరున్?

ధర్మ— (కన్నీటితో) కృష్ణా! ఆర్తత్రాణపరాయణ!

గీ. అక్కటా! యెందఱో రణ మాచరించి
రందుఁ బెక్కండ్రు గలరు బలాతిశయులు
కొడుకు కనియు తాత యని చెప్పికొనుట గాదు
నిక్క మీ యిర్వురకు సాటి నేను గాన.

ధృత— అక్కటా! యెంత మందభాగ్యుఁడను? ఎన్ని దుఃఖములు భరించుచున్నాఁడను?

గీ. కొడుకు లందఱు వోవుటకున్ సహించి
నట్టి మనమేమొ? యిది సవ్య మని యెఱింగియుఁ
బొంగిపొరలు దుఃఖాంబుధి ముంగుడువడుఁ
దండ్రి నేఁటికి నన్నుఁ బెద్దఁగ నొనర్చె.

విదు— సచ్చరిత్రుల మరణమునకు జగ మంతయు దుఃఖించును. ఇప్పట్ల బంధుత్వాదిక మనవసరము. (కన్నీటితో) తండ్రీ! గాంగేయ!

గీ. ఏను వృషలుండ నయ్యు విజ్ఞాని నైన
నీవు చేపట్టి పేర్మి మన్నించు కతనఁ
బ్రబలి రాజులచే నిమ్మపండ నైతిఁ
గలదె లేకున్న నాకిట్టి గౌరవంబు?

(వ్యాసులు ప్రవేశించును).

వ్యాసు— గీ. బ్రతుకఁ దగినంత కాలమ్ము బ్రతికి కులము
వన్నెకెక్కించి జగతికిఁ దన్నుఁ దెలిపి
యరిగె నాసోదరుం డమరాలయమునఁ
దన్నెదురుచూచువారి ముదమ్ము దీర్ప.

ధర్మ— (విచారముతో) తాతా! సాత్యవతేయ!

గీ. తండ్రి లేని పిల్లలమని దయఁదలంచి
తక్కు మనుమలకన్న నదనము గాంచి,
పెంచి విద్దెయు బుద్ధి చెప్పించినట్టి
తాత నిటు చేసినారము చేతులార.

వ్యాసు— తండ్రీ ! ధర్మనందన !

గీ. ఎవ్వరో యొక్కరు నిమిత్త మింతె కాని
యితరుఁ డితరుని జంపుటయే హుళిక్కి
అందులో నీతఁ డనిన స్వచ్ఛందజీవి
యేల పరితాప మందెదోయీ కుమార !

చ. మరణ మలంఘ్య మేరికిఁ; గ్రమమ్మున వృద్ధుల శోక యందులోఁ
బరమశుభంబు దానికి లవమ్మను జింతిల రార్యు; లిట్టి సో
దరుఁడు గతింప నేను బరితాపముఁ జెందుట మానుచేని నీ
వరసి మనంబునం దుడుగుమయ్య విచార ముదారవర్తనా !

కృష్ణ— బావా ! వారి యుపదేశమునందలి సారమును గ్రహించి దుఃఖ ముడుగుము. అదే భాగీరథీతీరము. మన మందఱమును నిప్పట్ల నప్పరమపావని యందు స్నానం బొనర్చి యిమ్మహామహుని కనంతరకృత్యములు నెఱవేర్ప నుంకింపవలయు నటు చనుండు. (పరిక్రమింతురు)

(గంగ ప్రవేశించును.)

గంగ— అయ్యో, అయ్యో ! తండ్రీ ! వ్యాసాదులతోఁ బాటు చిరంజీవి వసుడు వనుకొంటిఁ గాని యింతలో నిట్లగుట యెఱుఁగనైతినోయి!

క. ఎనమండ్రు కొడుకులకు నొ
క్కని కేనియు నోఁచనైతిఁ గాలస్థితికే
మని వగతు గొంతికొడుకే
మని నిన్ను వధించె? నేఁడి యాతఁడు ? కొడుకా !

తే. గీ. జనన మందినదాది యీసరికి లెక్క
కొక్క తప్పేని లేని నిన్నో కుమార!
వంశవృద్ధినియేనిఁ గవ్వడి యెఱుంగఁ
డాయెనా ? నాయనా ! యేమి సేయనయ్య?

అర్జు— (తలవంచికొనును.)

కృష్ణ— (అర్జునుని కడ్డముగాఁ దాను నిలిచి) అమ్మా, త్రిలోకపావని!

చ. ఎఱుఁగనిదానవేని యెవరేని వచించుట నీకుమారునిన్
వరుఁడు వధించె నన్న నెటు నమ్మితివమ్మ? తదగ్రమందు నీ
వరు లటులుండ రక్కసులు నాకనివాసులు నొక్కలెక్కయే!
దగమునఁ గాదె భృత్యుని విధమ్మన మృత్యువు నిల్చెదవ్వగన్ !

వ్యాసు— అమ్మా, త్రిలోకజనని !

క. నరుఁ డీతని వధియింపఁగ
హరశిష్యుండైన జామదగ్న్యునికన్నన్
శరవిద్య నధికుఁడే ? యి
ప్పరముఁడు తనయంత విడిచెఁ బ్రాణముల నొగిన్.

కృష్ణ— సర్వజ్ఞవగు నీ వెఱుఁగని దేమున్నది ?

తే. గీ. అతఁడు వసువులలో నొక్కఁడని యెఱుఁగవా ?
శాపవశమునఁ బుట్టు నంశ మ్మెఱుఁగవా ?
తండ్రి యిచ్చిన వరము విధ మ్మెఱుఁగవా ?
సకల మెఱిఁగి శోకించుట చనునె నీకు ?

గంగ—(కోపముతో) కృష్ణా ! కురుకులమారక !

తే. గీ. అంతయును నిక్కమే యగు; నైన నేమి,
కడుపు దరికొని మండు నెక్కరణి నైఁతు ?
నాయుసురు మిన్నకయపోదు నరుని శిరము
కొలఁది కాలమ్మునన త్రెళ్లగలదు ధ్రువము.

ధృత— (విదురునితో జనాంతికము) ఆఁడుదియైనను నీమె మంచిశాస్తి చేసినది. నూఱుగురు కొడుకులను జంపినను నూరకొనుటకు గ్రుడ్డి ధృతరాష్ట్రుఁడు గాఁడు. కాని యీశిక్ష భీమునకు జరిగినచో నాకడుపుమంట గొంత చల్లాఱును. ఎట్లయిన నాఁడువాండ్రలో నీమెయు, మగవాండ్రలో నశ్వత్థామయు, వీర లిరువురే వీరల నధఃపాతాళ మడఁగఁ ద్రొక్కిన వారు.

విదు— (జనాంతికము) అన్నయ్యా! యేమి నీ యవివేకము? మొదల నుండియు నీకీ యవివేకమే యింత తెచ్చినది. ఎప్పుడును ధర్మము జయించును; అధర్మ మడుగంటును. ఇంతకు గంగ శపించె ననికదా నీవు సంతసించుట ! ఆపెయు నిప్పట్ల నీవలెనే యవివేకురాలు.

తే. గీ. ఎవని పాదమ్మునను జనియించు కతనఁ
దనకు నింతటి ఘనత పావనత గలిగె
నతఁడు శ్రీకృష్ణుఁ, డితనికి నర్జునునకుఁ
జచ్చినను జత్తు మన్నంత సఖ్య మమరు.

ధృత— (జనాంతికముగాఁ బశ్చాత్తాపముతో) అవును, నీ వన్నమాట నిక్కమే.

క. సుతులు నశించిన కతమున
మతిచెడి యిట్లంటిఁ గాని మహనీయులు పాం

డు తనయు లందును గృష్ణుని
చతురత వారలకుఁ బెద్దసాయ మ్మనఘా.

విదు— (జనాంతికము) అనుగో ! కృష్ణుఁ డేమో చెప్పుచున్నాఁడు. అది వినుము. మనమిప్పు డిట్లు గుసగుస లాడుకొనుచుండుట యంత భావ్యము గా నుండదు.

కృష్ణు— దేవీ, విష్ణుపాదోద్భవి !

గీ. ఎన్నఁడును లేని కోపమ్ము నిట్టు లూనఁ
దగునె ? ఘనుఁడు ధర్మతత్త్వరుఁడు సుగుణి
వినయసంతుండు మిగుల వివేకి నీకు
భర్తుఁ డీతని కిట్టిశాపమ్మె ? యకట !

వ్యాసు— (అర్జునునిచే మ్రొక్కించి)

క. మునిమనుమని పైఁ గించి
త్తనుగ్రహము సూపు మమ్మ ! యాతనియాజ్ఞం
గొనియే యేసె నితం డో
జననీ ! శాపాంతమును బ్రసాదింపఁ దగుఁన్.

గంగ— (శాంతముగా) కృష్ణా ! కృష్ణద్వైపాయన !

క. ఇతఁ డుత్తముండె యగు నే
నితని శపించుటకు హేతు వీ రెఱిఁగినదే
మృతి గని యొకింతలోపల
బ్రతుకుఁన్ దద్విధము చెప్ప వలనుపడ దిటన్.

వ్యాసు— (తనలో) ఓహో , ఇదియా హేతువు ! అన్నా ! వసువు లెంత పట్టుపట్టినారు !

తే. గీ. అయిన నేమాయె దీనికి నహికులావ
తంసమైన యులూపి ప్రశంసనీయ
మైన పనిఁజేసె వసువుల నాశ్రయించి
నరకమునకన్న నిదియె యెంతయు హితంబు.

కృష్ణు— (తనలో)

తే. గీ. బభ్రువాహను క్షతమున బవ్వమున శి
రంబు డెగు నీతనికిఁ, దన రమణి నాగ
కన్య బ్రతికించు, గాంగేయుఁ గలనఁ గపట
వృత్తిఁ జంపిన దోసఁగున కిదియె శాంతి.

ధృత — (విదురునితో జనాంతికముగా) తమ్ముఁడా! భాగీరథి యేమో కొంత దాఁచిపెట్టినది, యది నీవు గుఱుతింపఁగలవా? భావికార్యవేత్తవుగదా!

విదు — (ధ్యానము నటించి) ఆ! తెలిసినది. కాని యది దేవరహస్యము. బయలుసేయ వలనుపడదు. ఇట్లు జరుగును. (చెవిలోఁ జెప్పును)

ధృత — (తనలో)

గీ. తీర్థయాత్రను భార్యఁగాఁ దీసికొన్న
యందులకుఁ దగ్గ యుపకృతి నాచరించి
తే, యులూపి! సుదాత్మజుఁ డిట్టి కాంత
నొక్కతెను గట్టికొన్నవాఁ డొకఁడు లేఁడు.

ఈరహస్యము వెలిఁబుచ్చినచో, "బభ్రువాహనునితో నర్జునునకు సంగరమే లేకపోవు" నని కాఁబోలును దేవధుని గప్పి పుచ్చినది. (తల పంకించి) పోనీ దీని నేను బయలుచేయుదునా? (పెదవివిఱిచి) అయిన నేమగును?

క. తాత నిటు చంపినందుల
కీతని కొక కొంత నరక మేర్పడు దానన్
నాతనివి తీరునే? యిటు
లేతన్మాత్రమ్ము నరక మేరికి లేదే.

ఇంతకు నిదియేని భీమునికైనం గదా, యేను సంతసింపవలసినది. విదురుఁడు చెప్పినట్లదియును సమంజసము గాదు.

గీ. కన్న కొడుకులకన్న మిక్కుటపుఁ బేర్మి
నన్ను మన్నించుచున్న పాండవులయెడల
దోసఁగుఁ దలఁచుటకన్నను దోసమున్నె?
తిన్న యింటి వాసమ్ముల నెన్నగునె?

నా కింతటినుండియేని భగవంతుఁడు మంచి బుద్ధినిఁ బ్రసాదించుఁ గాక.

ధర్మ — (తనలో) ఏదో యొక గొప్ప యిక్కట్టును దప్పించుటకై యీమె యిట్లు శపించియుండును. ఇంతకన్న గొప్ప కష్ట మేముండునో! (యోజించి) ఉండకేమి, నరక మన్నిటికన్నను దురంత మైనది కదా! (ప్రకాశము) దేవీ! శాపాంతము ననుగ్రహించి నాతమ్ముని మరల నా కిచ్చితివి.

ఉ. నీ కొమరుండు పోవుటకు నేను బ్రధాననిమిత్త మిట్టి దు
ర్ధీకుని నన్నుఁ బోవిడిచి దీనుఁడు తమ్ముని కల్గ నేల? నా

కీకతనన్ మహానరక మెట్లొదఁగూడదొ? చెప్పు మమ్మ; నీ
వేకద! యెట్టి పాతకుల నేనిఁ బవిత్రులఁ జేతు వెమ్మెయిన్.

గంగ— (శాంతముగ) తండ్రీ! నీకన్నిటికిని గృష్ణుఁడే కలఁడు.

గీ. అశ్వమేధమ్ము నొనరింపు మఖిల దోష
ములు నశించు నక్కతమునఁ బుణ్యలోక
మునకుఁ బోనేర్తు వీవు, తమ్ములకు నెట్టు
లేని నరకమ్ము దప్పనిదే నిజంబు.

ధర్మ— (విచారముతో) తల్లీ! నాతమ్ములు లేని స్వర్గమునకన్న నాకును నరకమే యనుగ్రహింపుము.

గంగ— కుమారా! యేది యనుగ్రహించుటకేని యొకరి వశమా? వారి వార సుకృత దుష్కృతములంబట్టి యుండును. నీకు నరకమ్ము దర్శనమాత్రమ్మునం దీఱు. నీ తమ్ములకును ద్రోవదికిని బుత్రులకును దుష్కృంగల్గు వారలకును యత్కించి దనుభవంబునం గాని తీఱదు. పదఁపడి యందఱికిని బుణ్యలోకమ్ము గల్గు. వత్సా! యొకపరి కొమరునిఁ గడసారి చూచుటకునై మనము తత్తఱపడుచున్నది. నాకచటికిఁ ద్రోవఁజూపుము.

ధృత— (సమీపించి) తల్లీ! నే నెప్పటికిని నిట్టు లుండవలసిన వాఁడనే కద! నాకు విముక్తి ననుగ్రహించి రక్షింపుము.

క. పోయినవారలు వోయిన
నీ యనఘుల యెదుట నైన నేఁ గాయంబున్
బాయుదునో! లేకిట్లన
రాయిక్రియన్ మోదుకరణిఁ గ్రాలుదునొక్కొ!

గంగ— తండ్రీ! అది యెవరితరము, ఇది ఎవరితరము?

విదు— అమ్మా, త్రిపథగ!

గీ. ఏ నెవఁడనయ్య భవదీయసూను దయను
గౌరవకుటుంబ మందు నొక్కరుఁడ నైతిఁ
బతితపావని! నాకు సద్య మగు మరణ
మిచ్చి కాపాడు మమ్మరో! యిదియ చాలు.

గంగ— గీ. మీర లిరువురుఁ గుంతి గాంధారి సంజ
యుండుఁ గొండొక వనిఁ దపముండి పాండ
వులు గతింపక మున్న వోవుదురు; యాద
వులు నశించినపైఁ బాండవులు నశింత్రు.

మఱియు నొక్కవిశేషంబు, పాండవాగ్రజుండును నీవును ధర్మాంశ సంభవు లగుటంజేసి నీతేజమ్మమ్మహాత్మునియం దైక్యమ్ము నొందఁగలదు.

(గంగ నిష్క్రమించును)

వ్యాసు— తండ్రీ! విదుర!

క. కొండొక కతమున మాండ
వ్యుం డాగ్రహమంది ధర్ము నొగి శపియించెన్
దండధరుఁడు దాసీపు
త్రుండై నాకతన నిల్లు దోఁచెను వత్సా.

కృష్ణు—మన మింక నీ మహాభాగునకు నుచితకృత్యములు నెఱవేర్ప, భాగీరథికిం జని స్నానమ్ము లాచరింపవలయును. (అందఱును నిష్క్రమింతురు)

## గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవాశ్వమేధమ్మునఁ
జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

## పంచమాంకము

(అంత ధౌమ్యులు ప్రవేశించును)

ధౌమ్యు— (సంతోషముతో) భగవదనుగ్రహమువలన నేఁటికి మా యజాత శత్రునకు మంచిదినములు వచ్చినవి.

ఉ. మృతుఁడగు నుత్తరాసుతుఁడు కృష్ణు దయన్ బ్రదికెన్; దుషారప
ర్వతమున కేగి యయ్యెడల వ్యాసులు చెప్పినయట్టు లద్రిజా
పతిని యజించి యందుఁ గల పాఁతఁబలన్ బెకలించి ద్రవ్యము
న్నతముగఁ దెచ్చె; యాగము నొనర్చుటయే కొదు వింక మీఁదటన్.

ఓహో! యిట్టి యాగ మెప్పుడును గన్నదియు విన్నదియుఁ గాదుగదా!

గీ. సవనపాత్రల లెక్కేమి? శాల గూడ
బంగరువుతోడ నిర్మింపఁబడియె; నిందుఁ
గొదవ యేమి? మరుత్తిచ్చెఁ గొల్లగాఁగ
ద్విజుల; కగియెల్ల వీరి యధీన మయ్యె.

అహహ! ఆ బ్రాహ్మణులు పట్టుకొని పోయినది పట్టుకొని పోఁగా మిగిలినదే యింత యున్నప్పు డంతయు నెంత యుండునో! ఇంతకు నిప్పటి సుకృత మా మరుద్భూపాలునిది. కాదు కాదు, ఋత్విక్కు లది. సంశయ మేమి? ద్రవ్యస్వామికిఁ గదా తజ్జన్యసుకృతము చెంద వలయును. (యోజించి) సుకృతము మా టట్టులుండ బ్రాహ్మణద్రవ్యాప హరణ దోషము తటస్థించుచున్నదే! ఐనను,

గీ. వారు పాఁతఁబన్నై చెడి పట్టునందు
సమయము నొనర్చికొనిరఁట "జనుఁ డెవండు
దీనిఁ గనుఁగొను నిది వానిదే" యటంచుఁ
గాన విప్రస్వహరణశంక యిట లేదు.

(పరికించి) అదుగో! అశ్వోత్సర్జనము చేయించుటకై నాచే నంపఁబడిన నా ప్రియశిష్యుండు కాణ్వుండు వచ్చుచున్నాఁడు. ఇతనివలనఁ గొన్ని విశేషములు దెలియఁగలవు.

(అంతట శిష్యుఁడు ప్రవేశించును)

కాణ్వ— గురువరా! నమస్కారము.

ధౌమ్య— విద్యాభివృద్ధి ర్భూయాత్. చక్కఁగా నాయశ్వోత్సర్జనమును నెఱవేర్పింపఁ గలిగితివి కదా!

కాణ్వ— దేవర యాశీర్వచనమున నెందును గొదువ రాలేదు.

ధౌమ్య— అచ్చటి విశేషములఁ గ్రమముగాఁ జెప్పుదువుగాక.

కాణ్వ— చిత్తము. ప్రథమమున నేను ధర్మరాజుగారి యెదుటి కేగినతోడనే నమస్కరించి మీ కుశలం బడిగిరి.

ధౌమ్య— ఆశీర్వచనము సమయానుగుణముగాఁ జేసితివా?

కాణ్వ— చిత్తగింపుఁడు.

ఉ. పోయిన వంశమూ నిలిచె; భూరి యశ మ్ముదయించె; యాగమూ
చేయఁగ నుంటి; సర్వమును సిద్ధము; సాధ్య మొకండు లేదు నీ
కోయవనీశ! దీవనల నొందు టిఁకెందుకుఁ గాని, యైనను
శ్రేయము తృప్తికిం దగదు, చేకొనుమయ్య మహోదయమ్ములన్.

ధౌమ్య— (సంతోషముతో) ఇఁక నేమి! నేను నీ వింతవాఁడవని యనుకోలేదు సుమీ! తరువాత?

కాణ్వ— దానిపై రాజుగారు "ఇపుడు కావింప నున్న యశ్వమేధము నిర్విఘ్నముగా నెఱవేఱునట్లాశీర్వదింపవలయు" ననిరి.

ధౌమ్య— కార్యాసక్తిచే నాతఁడటు కోరెనే కాని, అందులకు మన యాశీర్వచన మెందుకు?

క. ధనహీనుండయ్యును నొ
క్కని బాధింపకయె వ్యాసు కారుణ్యమునన్
ధనకనకవస్తువాహన
ఘని యయ్యెన్ యాగ మింకఁ గా కేమగునో!

ఇది యిట్లుంచుము.

గీ. నాలుగు సముద్రములఁ బోలఁజాలు ననుజు;
లవులఁ గృష్ణుండు సర్వలోకావనుండు;

సిద్ధసంకల్పుఁ డాతండు సేయఁబూనె
నిందు విఘ్నములును గూడ నెందు కబ్బు.

తరువాత ?

కాణ్వ— అశ్వమును వదలుచు వెనువెంబడి పోఁదలఁచిన యర్జునుతో నారాజ శేఖరుఁడు చెప్పిన మాటలు కడు నీతిదాయకములుగా నున్నవి.

ధౌమ్య— అతని నోట నెప్పు డేది యుచ్చరించినను నది యట్టిదే, ఐనను విందుము చెప్పుము.

కాణ్వ— మనవి చేయుచున్నాను. అజాతశత్రుఁడు తమ్మునింబిలిచి,

ఉ. తురగము వెంట నేగుము; చతుర్జలరాశిపరీతభూపురం
దరు లెవరున్ నిరోధము నొనర్ప; రొనర్చినచోఁ గృపారసం
బురులఁగ నప్పటప్పటికి నొప్పెడిరీతి నొనర్పు మాగ్రహ
స్ఫురణము చూపి వేగ పొరిపుచ్చకు మింతకె చచ్చి రెల్లరున్.

ధౌమ్య— చక్కఁగా నుపదేశించినాఁడు. దానిపైఁ బార్థుఁ డేమనియెను.

కాణ్వ— ఇట్లు పలికెను. "అన్నా ! ధర్మనందన !

తే. గీ. ధర్మజునియశ్వ మన్న నేధరణిపతియు
నడ్డగింపఁడు సమరం బనవసరంబు.

ధౌమ్య— సంశయ మేమి ?

కాణ్వ—గీ. ఎదిరిఁ దన్ను నెఱుంగక యెవ్వఁడేని
యడ్డినను వాని యసువుల కాస గొనను"

ధౌమ్య— ఇతఁడు మాత్ర మెవరు ? ధర్మరాజు తమ్ముఁడు కాఁడా యేమి ! తరువాత ?

కాణ్వ— మరలఁ బాండవాగ్రజుండు; ఆయారాజులతోఁ దనమాటలుగా నిట్లు విన్నవింపు మనియెను.

ధౌమ్య— ఓహో ! ఏమయా యీవినయము ! ఏమని చెప్పుమనియెను ?

కాణ్వ-ఉ. జ్ఞాతులఁ దక్కు-భూపతులఁ జంపిన పాపము నిస్తరింప మే
మీ తతి నశ్వమేధమున కిచ్చ యొనర్చుట; యంతెకాని ప్ర
ఖ్యాతికిఁ గాదు; మీరు త్వరగా సవనమ్మును జూడరండు, ద
ర్పాతిశయమ్ము చూపకుఁ ; డహంకృతి కాలము కాదు భూపతుల్ !

ధౌమ్య— సరే, ఆయన చెప్పవలసినసంగతి కనుకఁ జెప్పినాఁడు. కాని నిజముగా నొక్కొక్క రాజెవఁడేని యెదురైనచో నంతమాత్రమునకు మరలఁడు.

కాణ్వ— అట్లు మరలనివారిం గుఱించి యిట్లు జరుపు మనెను.

ధౌమ్య— ఎట్లు ?

కాణ్వ—

ఉ. సారథిఁ గొట్టిరయో, రథముఁ జక్కడఁగించిరయొ వాజులఁ వెసఁ
బాఱఁగఁ దోలిరయో, ధను వపాస్తముఁ జేసిరయొ వారిఁ దుఃించియో
వారి కొకింత నీదు బలనైఖరి సూపుదు గాని, చావరా
దేరును, నట్టివార్త విని యే సయిరింపఁగఁ జాలఁ దమ్ముఁడా !

ధౌమ్య— ఆతని వచనము లెన్ని విన్నను దనివి తీరదు. తరువాత ?

కాణ్వ— అశ్వమువెంట పార్థుఁ డరిగిన యనంతరమునఁ గౌంతేయాగ్రజుండు
నన్నుం జూచి,

తే. గీ. అన్నియును జెప్పియే నరు ననిపినాఁడఁ
గాని మది సందియం బది మాన దకట
ఎక్కడేమగునో ! యెవ్వ రెదురుకొందు
రో ! యెవరిఁ ద్రుంచునో దయయుడిగి యితఁడు.

ధౌమ్య— సర్వమును శుభమేయగుగాక. రాజా ! నీ కీ సంశయ మెందుకు.

క. వడముడి ననిపినచోఁ దుం
దుడు కేదియునేని యచటఁ దొడరినఁ దొడరుఁ
గడు శాంతుఁడు గవ్వడి యీ
తఁడు మఱచునె నీదునాజ్ఞ ? తత్తఱపడునే ?

కాణ్వ— నేనును ఇట్లే పలికితిని. తరువాత నా నృపాలుఁడు,

తే. గీ. ధర్మసంవేది విజ్ఞాని తండ్రివెనుక
తండ్రియంతటివాఁడు పెత్తండ్రి యమ్మ
హాత్ముకడ కేగి యాతని యాజ్ఞ వడసి
యశ్వమేధమ్మునకుఁ గర్త నగుట మేలు.

అని నన్ను వీడ్కొని పితృదర్శనమునకుఁ జనియెను.

ధౌమ్య— ఇది ముఖ్యముగా నిట్లు జరుగఁదగినదే. నాతోడ నేమియుఁ జెప్ప
మనలేదా ?

కాణ్వ— "ఋషుల నందఱిని సత్వరమునఁ బిలిచి రావలయు" నని తమతో
మనవిఁ జేయు మనియెను.

ధౌమ్య— సరే. అర్జునుం డశ్వమువెంటఁ బుడమి నెల్లఁ గ్రుమ్మరి రాజ
పుత్రులం దోడ్కొని వచ్చునంతకు మనమీపని నెఱవేర్చుకొనలేక పోదుమా

యేమి ? (యోజించి) ఎందుకేనియు ముందుఁ దశకున్న ధని సెలవేర్చు
కొనుట కడు మంచిది. కావున మనము ఋష్యాశ్రయానార్థ మరుగుదము
రమ్ము. (నిష్క్రమింతురు)

(అంత ధనుర్ధరులై ఇరువురు రాజపుత్రులు సూర్యవర్మ కేతువర్మలు ప్రవేశింతురు)

సూర్య- ఉ. మూఁకలతోడఁ బోరి కడు ముష్కరకృత్యము సేయుచుంటి నా
రాక యెఱింగియుం మరలి రావదియేమి ? మఖాశ్వ మేన చు
మ్మిత్త కడియంగఁ బట్టితిని ! నేఁటి మగండవ యేని నాపయిం
దాఁకి రణం బొనర్పుము పినాకి నెమర్చుట నేఁడు చూచెదన్.

అర్జు— (తనలో) ఓహో ! యీ బాలురఁ జూచిన నామనంబు కరుణామయం
బగుచున్నయది (ప్రకాశము) క్షత్రకులాంకురములారా ! నామాట విని
మీరీ యశ్వము జోలికి రాకుఁడు.

గీ. అశ్వమేధదీక్షితుఁడయి యన్నమిమ్ముఁ
బిలువ నంపింప వచ్చితిఁ బిలుపుఁ గొనుఁడు;
బంధుగులమైన మన కేల బవరమిచటఁ ?
గదలి మీరెల్ల వత్తురు గాక యటకు.

కేతు— (గర్వముతో) మేము జన్యమునకు వచ్చువారమే కాని జన్నమునకు
వచ్చు వారము కాము.

ఉ. బంధుగు లంచుఁ బల్కితివి, బంధులు గారె సుయోధనాదు ? లే
చందమునన్ రణంబు కొనసాఁగెను మీ ? కది యెల్ల నేఁడు చూ
డం దలఁపూని వచ్చితిమి టక్కరి మాటలఁ బోప దింకఁ; బో
రందగు గెల్వఁగాఁదగుఁ దురంగమముఁ మరలింపఁగాఁదగున్.

అర్జు— మీతో నేనొక్కమాటఁజెప్పెదను దానిని మీరన్యథా గ్రహింపక
విశ్వసించి ప్రాణ[illegible]ం బొనరించి కొనుఁడు.

క." మన రణమునకే పోయిరి
జనపాలకులెల్ల వారిసంతానములన్
మనము గరుణింపఁ గావలె"
వని ధర్మజుఁ డానతిచ్చె ననికిఁ జొరకుఁ డీ.

సూర్య— (మీసము దువ్వుకొనుచు) ఏమీ ! మీయన్న గారిట్లు సెలవిచ్చినా
రేమి ? ఓహో ! యేమి యాయన యోగ్యత !

గీ. ధర్మరాజను మాట మాత్రంబ కాని
యంతయును నధర్మమే యతఁ డాచరించె;

నతని తమ్ముని నిన్నిపుడని వధింప
బుద్ధిపచ్చెదుఁ బాప మూభూమిపతికి.

అర్జు— (తనలో) ఓహో ! అధికప్రసంగములోనికి దిగుచున్నాఁడే ? అయినను నింకొక సారి చెప్పి చూచెద (ప్రకాశము)

గీ. గాండివంబిది వీఁడల్ల పాండవుండు
అక్షయంపుఁ దూణీరము లవియుఁ డివిగో
అదుగో ! కపిరాజు కేతనమందుఁ గనుఁడు
వినుఁడు నామాట యశ్వంబు విడిచి చనుఁడు.

కేతు— (గర్వముతో) అశ్వమ్ము విడిచి చనుట నీవా ? మేమా ?

చ. "ఇరువురు వీర లే నొకఁడనే" యని భీతిలఁ బోకుమయ్య ! యొ
క్కరు నొకమాఱు గైకొనుము, గైకొను మొక్కరు నొక్కమాఱు; మున్
విరటుని యింట బంటవయి వీఁక ననేపుఱితోడఁ బోరితం
చెచేఁగినయట్టు లోకు లను టింతయు నిట్టిది యయ్య ? వాసవీ!

సూర్య— (క్రోధముతో)

గీ. గాండివం బని యూపయిఁ బాండవుఁ డని
పేరు సెప్పినయంతనే భీతి పుట్టె
నొక్క ! యిదియే మొ చూత మీ యుక్తులేల ?
దిగుము రణరంగమునకు, నే దిగితి నిదిగో.

(నిష్క్రమించును)

అర్జు- (తనలో) ఓహో ! వీనికిఁ గొంచెము చవిఁ జూపినఁ గాని బుద్ధి కలుగదు. అమ్మా ! గాండివము !

చ. కలన వధించి నీకు బలిగా నొనరించితిఁ జెక్కుమంది రా
జులఁ గడుఁ దృప్తి గంటి "పరిసూదన" మన్ యశమున్ వరించి తిం
కలుగఁగఁ బోకు మమ్మ ! సమయ మ్మగునప్పు డజాతశత్రు హా
క్కులు స్మృతికెక్కఁజేసి యొకకొంత నమన్ వెనుదీయఁ జేయుమా.

(నిష్క్రమించును)

కేతు— (పరికించి) ఓహో ! నా యన్నయే ముందు నారాచములు విడిచినాఁడే ! అరరే ! అందులో నొకటి యర్జును శిరము దునుమవలసినదే కాని యొక్కింత తప్పి పోయినది. (విని) అర్జునుఁ డేమో యనుచున్నాఁడు

(తెరలో) గీ. బాలకుఁడ వయ్యు మెచ్చంగవచ్చు నిన్ను
వాల మింతటితో నైనఁ జాలు నుడుగు

వేమి ప్రాణమ్ములన్న నీకింత బరువె ?
బ్రతుకజాలవె ? వలవని కుతుకమేల ?

కేతు— అన్న దీని కేమి యుత్తర మిచ్చునో ?

(తెరలో)

గీ. బాలకుఁడ నంచు నన్నేల గేలిచేసె ?
దాహవమునకు వృద్ధులకన్న బాలు
రే తగినవారు నీ విది యెఱుఁగ వొక్కొ ?
బాలకుఁడు గాఁడె యల్ల సుభద్రి కొడుకు ?

కేతు— తగిన యుత్తరమునే చెప్పినాఁడు కాని యుపమానము మాత్రి మంత జయసూచకముగా లేదు. మరల నర్జునుఁ డేమో యనుచున్నాఁడు.

(తెరలో)

క. అల సౌభద్రేయుని నీ
తలఁపున నెఱిఁగియును నన్నుఁ దాఁకుట మేలే ?
కులము నిలుప నుంకింపుము
చల ముడుగుము యజనమునకుఁ జనుదె మ్మనఘా !

కేతు— అక్కటా ! యింత శాంతిగల మహాత్ముఁడు మును రణ మెట్లొనరించెనో ? (విని) అన్న మరల నేమో యనుచున్నాఁడు.

(తెరలో)

గీ. యజన మటు లుంచు మిప్పు డీ యాజి చూడు
మవులఁ దక్కిన కార్యమ్ము లరయవచ్చు
రాచపుట్టువుఁ బుట్టి నారాచమునసె
కాక యుత్తర మిత్తురే వాకు నొడివి ?

కేతు— (విని) అతఁడును నారి సారించుచున్నాఁడు. బలే ! ఇప్పట్ల నన్న యొన్నఁదగిన పని జేసినాఁడు. ఒక శరమైనను దనకుఁగాని సారథికిఁగాని రథమునకుఁగాని తగులకుండఁగనే వారించినాఁడు. ఇఁక నిప్పుడర్జునుఁ డేమి చేయునో ? అదుగో ధనుస్సునకు గుఱిచూచుచున్నాఁడు. (తత్తఱపాటుతో) అప్పుడే విఱిగినదే ధనుస్సు. బలే ! చచ్చినం జచ్చుఁగాక, యితనితో యుద్ధ మొనర్చినదే జన్మము. అన్న మఱియొక ధనువు పైకొని యమ్ముల విడుచుచున్నాఁడు.

(అంత నితని తమ్ముఁ డింకొకఁడు ధృతవర్మ యనువాఁడు ప్రవేశించును)

కేతు— (చూచి) తమ్ముఁడా ! నీవుఁ గూడ నెందుకు వచ్చితివోయి ? ఇతనికి నేము చాల మనియా ?

కృత— క. నరుఁ దాఁకి సమర మొనరుపఁ
గర మనురాగమ్ము గలదు గాన ననుఁ౯ స
త్వరమున బంపుము రాచకొ
మరులకుఁ బందువులుగా సమరకృత్యంబుల్ !

కేతు— అటు మాడుము.

గీ. అన్న వైచిన బాణమ్ము లన్ని ద్రుంచి
యన్నరుం డొక్క యమ్మున నన్నుఁ గొట్టె
అక్కటా, అయ్యో !

గీ. సొమ్మసిల్లె నతండు (ధైర్యము దెచ్చికొని) ఏ గణ మ్మొనర్చి
బదులు తీర్చెద నిదె పోయి పార్థు నడఁచి.

(నిష్క్రమించును)

కృత— ఓహో ! ఏమి ? యీయుద్ధచమత్కారము !

ఉ. ఒకరు నిగిడ్చు బాణముల నొండొక రంతరమందుఁద్రుంచుచుఁ౯
బ్రకటనఁ జేయఁ బూనిరి స్వబాహుపరాక్రమముల్; క్రమమ్ముగా
సుకరము గాక యుద్ధ మిది సూడ భరమ్ముగఁ దోఁచె; నన్న యిం
తకుఁ బయిచేయి యయ్యె నిఁకఁ దప్పనిదే జయ మంచు నెంచెద౯.

పార్థుఁడు శరములు విడుచుట గట్టిపెట్టి యేమో యనుచున్నాడు.

(తెరలో)

ఆ. వె. అన్నపాటుఁ జూచి తాతఁ డిప్పటికివి
మూర్ఛఁ దెలియఁడయ్యె ముగ్ధమతివి
గాను, మింక నైనఁ గౌంతేయు జన్నమ్ము
చూడరమ్ము బవర మేడ ! పొమ్ము.

కృత— అన్న తగిన యుత్తరమును జెప్పకపోఁడు.

(తెరలో) జన్నమా ? చూచెడిది బన్నమా ?

గీ. బవరము నొనర్చుపట్ల నెవ్వరికి నేని
మూర్ఛ వచ్చుట యంత తప్పుగ గణింప
రంతమాత్రాన జయమందినట్టు లాత్మ
సంతసించుట మాత్రి మెుకింత తప్పు.

కృత— పార్థుఁడు మరల నేమో యనుచున్నాఁడు.

(తెరలో)

తే. గీ. తాత తండ్రులు నాఁటి యుద్ధమునఁ జచ్చి
రనెడి పౌరుషమును మానుమయ్య! వారి
కన్న నధికుండ వెందును గావు నీవు
ఇంతకును దగ్గ కారణ మేని లేదు.

ధృత— (చూచి) అన్న యాతని మాట వినిపించుకొనకయే శరపరంపరలు నిగుడ్చుచున్నాఁడు. అదుగో! అతఁడును మొదలు పెట్టినాఁడు. (సంతోషముతో)

గీ. అన్న బాణమ్ము ఫాలమ్మునందుఁ దాఁకి
పార్థుఁ డొక్కింత కనలి విస్ఫారఘోర
శర మొకంటను నరదమ్ముఁ జక్కడంచె
సారథిని నొంచె వేఱొక్క శరము నించి.

అదిగో! అన్న యనేకబాణమ్ముల నొక్కుమ్మడిగాఁ బ్రయోగించి యతని జీకాకు పఱచుచున్నాఁడు. అయ్యో, పాపము! అర్జునుని ధనుస్సు చేతినుండి జాఱి క్రిందఁ బడినది. ఇతఁడు మునుపటి యర్జునుఁడు కానట్లుతోఁచుచున్నాఁడు. ఇదే మనకు జయము రాఁదగిన సమయము గానున్నది. పార్థుఁడు మరల ధనువుగొని రథముపైకిఁ జనుచున్నాఁడు. (పరిక్కగా దృష్టినిగుడ్చి) అదిగో! సమయమునకు మన యమాత్యుఁడు గూడ వచ్చుచున్నాఁడు. (మంత్రి ప్రవేశించును.)

మంత్రి— కుమారా! తుదకు యుద్ధమే స్థిరమైనదేమి? సంధి కుదురలేదా! ఆయన తనంతఁ దాను సంధికివచ్చినపుడు మన మెందుల కొప్పఁగూడదు?

ధృత- ఆ.వె. చనునె? చంకదుడ్డు శరణార్థితో సంధి
యన్న యాజ్ఞయంట! యాగమంట!
కరుణ నిట్టులంట గానియుద్ధమునకు
జంకడంట! యెట్లు సంధిపొసఁగు!

మంత్రి— (చూచి) కుమారా! అటు చూడుము. నీయన్న రథముపై మూర్ఛిల్లి యొరగుచున్నాఁడు.

ధృత— (తత్తఱముతో) ఇదె నేను వచ్చుచున్నాను. నిలువుము. నిలువుము. (పోఁబోవును)

మంత్రి— (చేయిపట్టుకొని) అరుగవచ్చును గాని నామాట మాత్ర మొకటి వినుము.

ఉ. క్రీడి యనంగ లోకములు కేవల మొక్కట నెత్తివచ్చినన్
బాడి యొకింత తప్పకయ భస్మ మొనర్పఁగఁజాలువాఁడు మీ
కోడుట తప్పుగా దతని, కున్నతియే పయి పెచ్చు, నిల్చి పో
రాడితి రింతవట్టు, చనదా యిఁక నైనను సంధిసేయుటల్!

ధృత— నీమాటలు నాకిప్పుడు చెవి కెక్కవు. (నిష్క్రమించును)

మంత్రి— (విని) పాపము! అర్జునుఁడు నావలెనే బోధించుచున్నాఁడే!

(తెరలో) గీ. రాచపుట్టువు పుట్టిన రాణ కింత
వట్టు పోరాడితిరి మెచ్చ వచ్చు మిమ్ము
నందులో నీదు సాహస మద్భుతంబు
చిన్నతనమయ్యు ననికి వచ్చితివి కడఁగి.

నీవు మీ త్రిగర్తకులమునకు వన్నె దెచ్చితివి. సంతసించితిని. మీ యన్నల సేదదేర్చి యింకనైన బవరం బుడుగుము.

మంత్రి— (చూచి) ఆమాటలు వినిపించుకొనకయే ప్రావృడ్జలధరమ్ము పగిది శరము లుఱుముచు నిగుడ్చుచున్నాఁడు. పాపము! అర్జునుఁ డెంతకరుణాశాలియో గాని యాబాణములు వారించుకొనుటయే తప్ప నొకశరమున నేని యితనిం గొట్టకున్నాఁడు. కాని రథమును మాత్రము నుఱుము సేసినాఁడు. అక్కటా! ఇప్పుడైనను జాలించిన బాగుండును గదా!

క. అడిదముఁబలకయుఁ గొని బిగు
నెడలక యయ్యనఘుమీఁద నితఁ డేగఁగ గ
వ్వడి చిఱునగ వడరఁగఁ జే
యొడిసి తటాలునను బట్టియును దెగఁడు కటా!

ఇక్కడికే తీసికొని వచ్చుచున్నాఁడు. (ఇరువురును ప్రవేశింతురు)

మంత్రి— (వినయముతో) ఆర్యా! నమస్కారము. ఈశిశువును మీరు బ్రతికించితిరి.

అర్జు— (నవ్వుచు) ఏమోయి! త్రిగర్తవంశాభరణమా! ఇంక నేని యశ్వమును వదలి తప్పక నీయన్నలతోఁ గూడ మాయన్నగారి జన్నమునకు వచ్చెదవు కదా!

ధృత— (సిగ్గుతోఁ దలయూపుచున్నాఁడు.)

అర్జు-మీరిరువురును బోయి మూర్ఛ మునిఁగియున్న రాకొమరుల సేదదీర్పుఁడు
(మంత్రియును ధృతవర్మయును నిష్క్రమింతురు.)

అర్జు— (పరికించి) అదిగో ! అశ్వమిప్పుడే ముందువోవుచున్నది. నేనుం గూడం బోవలయును. ఇంక ముందుం బ్రాగ్జ్యోతిషపురమ్ము సమీపించంగలదు. అయ్యెడ భగదత్తుని పుత్రుండగు వజ్రదత్తుండు తండ్రివలని వైరమ్మున నడ్డురావచ్చును. (పరిక్రమించును.) (వజ్రదత్తుండు ప్రవేశించును.)

వజ్ర—(సంరంభముతో) గీ. అడ్డగింపుండు గుఱ్ఱమల్లదిగో ! పోవు
చున్నయది కట్టిపెట్టుండే నుక్కడంతు
వాసవుండు వచ్చెనేని, యన్వాసవాత్మ
జుండు లెక్కయె నందియ మొండు వలదు.

అర్జు—రాజపుత్రా ! నీకు శౌర్య మనాదిసిద్ధమే కాని నామాట యొకటివినుము.

క. "ఇదివఱకె రాజులెల్లరు
చదిసిరి యెవ్వారినేనిం జంపవలదు పి
ల్వం దగుఙ జన్నమ్మున' కం
చు దయామతి యన్న సెప్పెంజూ నా కనఘా !

వజ్ర— (గర్వముతో) మీయన్న నీకట్లానతిచ్చినది నిజమే యైయుండును. కాని,

ఉ. ఏనయి రాంగ నంటి మిము నెల్లర నెక్కటి పోరం ద్రుంప, నీ
వే ననుం జేర వచ్చితివి; నెట్టనె, నిన్నుంకం బోవనిత్తునే ?
మానము గల్గి నిల్వు; మును మా జనకుం డతి వృద్ధుం డౌటచేం
బ్రాణము గోలుపోయె; బకు లప్పటి కిప్పుడు తీర్చు పుచ్చెదఙ.

అర్జు— (తనలో) కొంతవఱకు రణము నడిపిన పిమ్మటం గాని మన సామవచనము లితని కెక్కవు. అందులో నితండు సామాన్యుండా ! నరకాసురుని మనుమండు. (ప్రకాశము)

తే. గీ. అనికి రమ్మంటి వచ్చెద నంతెకాని
నిన్నుం జంపుట కాజ్ఞ మా యన్న యిడండు
ఎందు కిట్టి వృథా రణ మెవరుమెత్తు ?
రశ్వమును వీడి యరుగుమా యవుల కనఘ !

వజ్ర— (గర్వముతో)

తే. గీ. పట్టిమాటలం బోయెడివాండు గాండు
వజ్రదత్తుండు నిన్నుం జావంగ నడంచుం
దోడు లేకుండ వచ్చితి తోయజాక్షుం
బిలువ నంపుమ ! యిరువురం బిలుకుమార్తు.

అర్జు— (పరిహాసముగా) తోయజాక్షు నెదిర్చిన నీతాతగారి గతి నీ వెఱింగినదే కదా ? వృథా గర్వాలాపము లెందుకు ? నామాట వినుము.

వజ్ర— మొట్ట మొదటఁ గేవలము గర్వాలాపములుగఁదోఁచినవ ననుభవ కాలమ్మున నిక్కపు విలాపములుగాఁ గనుపట్టుమలే ! రణరంగమున కవతరింపుము.

అర్జు— (తనలో) ఓహో ! వీనికిఁ బట్టుదల గట్టిగానున్నదే. కానిమ్ము, క్రమముగాఁ దగ్గక పోవునా ? (ఆకాశమువంకఁ జూచి) ఓయంబరచరులార!

చ. కనుఁగొనుఁడయ్య మీ రిపుఁడు గాండివిసేఁత కృపారసమ్మునై
విని చెడు పల్కు లన్నియును వీటికిఁ బుచ్చి యితండు దాన్నయై
చెనఁకుచు నున్నవాఁ డొకటఁ జే యెటు జాలునో? యేమి యౌనో? యె
వ్వనికిని హాని నాకతన వాటిలకుండెడిఁగాక మీకృపన్.

(ఇరువురును నిష్క్రమింతురు.)

(గంధర్వుఁడు ప్రవేశించును)

గంధ— (తనలో) భారత యుద్ధానంతరమున నేఁటికి మరలఁ దగినవానితో నర్జునుని యుద్ధము జూచుట తటస్థించినది. (చూచి) అడుగో, వజ్రదత్తుఁ డైరావతము ననుకరించు నేనుఁగుపై నుండి యమ్ములు విడుచుచున్నాఁడు అర్జునుఁడు వాని నెల్ల నవలీలగాఁ ద్రుంచుచున్నాఁడు. (పెదవి విఱిచి) ఇతని సంరంభమేకాని యతని సంరంభము లేశమును గానరాదు. కాకున్నఁ బార్థునికిది యొక లక్ష్యమా ? అరరే! యేనుఁగు నర్జును నరదముపై కెట్లు తోలుచున్నాఁడో ! అక్కటా ! యేనుఁగు పీనుఁగైనదే ! (పరిశీలించి)

క. గద కేలఁ బూని కడు దు
ర్మదమున భగదత్త సుతుఁడు మండలగతులన్
బొదలుచు నైశమ నరుని య
రదముపయికి దుముకు నదిగొ రభస మ్మడరన్,

ఓహో ! గాండీవి గదఁగూడఁ జూర్ణముఁ జేసినాఁడు. పాపము! వజ్రదత్తుఁడు నిరాయుధుఁడై యతఁ డింతకు మున్న విడిచిన యంపగముల వారించునుపాయము లేక కాఁబోలును, వెనుకకు జరుగుచున్నాఁడు. (సంతోషముతో) సెబాసురా ! రాచకొడుకా !

క. వెన్నిచ్చినచోఁ దప్పిద
మన్న భయమ్మునఁ బిఱింది కటు చనుచును నీ
వన్నరు మొగంబుపై దృ
ష్టి న్నిగుడుచుచుంటి నీదుచేవ యలంతియే.

ఆహా ! కరుణాశాలి యగు నర్జునుఁడు శరప్రయోగమ్ము చాలించి యితని వెనువెంట వచ్చుచున్నాఁడ

(ఇరువురును యథోక్తముగాఁ బ్రవేశింతురు.)

అర్జు— (గౌరవముతో) కుమారా ! నీసాహసము శ్లాఘ్యమైనది.

క. చనుదేవలెఁ జుమ్మీ ! నీ
యనుఁగులుఁ జుట్టములు నీవు నందఱు సవనం
బునకుఁ; వచ్చెడి పున్నమ
దినమున కటనుండ వలె విధిగ రాజమణీ !

వజ్ర— (సిగ్గుతో) మీయాజ్ఞ శిరసా వహించుచున్నాఁడను.

గంధ— (తనలో) మరల నేదేనిఁ దగినయుద్ధము దటస్థించినప్పుడు రావచ్చును. ఇఁక నెందుకు ? (నిష్క్రమించును.)

అర్జు— (చూచి) అప్పుడే యశ్వము ముందరుగుచున్నది. ఇఁక సింధుదేశము సమీపమగును. అచ్చట నా తోఁబుట్టువు దుస్సలకొడుకుండును. అతఁడు గూడ నశ్వము నడ్డుపెట్టునా ? దుస్సల యట్టిపని కొప్పికొనఁ గూడదు. (పరిక్రమించును) అప్పుడే వచ్చితిమి. అదిగో ! సింధునది.

(తెరలో)

క. పోనీకుఁ డశ్వమును రా
ట్సూనుఁడు లేకున్న కొదువ చొప్పడకుండం
గా నేగి పట్టు, డమరే
శానతనూజుండు మనకు శత్రుండు కదా !

అర్జు— (సంశయముతో) రాజపుత్రుఁడు లేకపోవుట యెందు చేతనో ? వీర లెవరైయుందురో ? రాజబంధువులై యుండ నోపుదురు. అక్కటా ! దుస్సల కింతటిలో నీదుఃఖ మెట్లు దటస్థించెనో ?
(దుస్సల మనుమని నెత్తుకొని ప్రవేశించును.)

దుస్స— అన్నా, యర్జునా ! యీపసిబాలుని రక్షింపుము, రక్షింపుము.

అర్జు— (కౌఁగిలించుకొని) అక్కా ! నీకొడుకేమాయె ?

దుస్స— (దుఃఖముతో) ఏమి చెప్పుదును. నీ వశ్వమువెంట వచ్చుచుంటి వనువార్త నింతకుఁ బూర్వమే చారులవలన విని బెంగఁబెట్టుకొని నే నెంత బోధించినను నమ్మఁజాలక తుదకు మరణించెను.

అర్జు— (విచారముతో)

చ. కటకట ! రాచపుట్టు విది కాల్పనె ? పేర్విను మాత్రఁ బ్రాణ మూ
డ్చుట ఘటియించు పాతకునిఁ జూచుట కిప్పఁడు రోయకుండు ! న
క్కటికము లేని పుట్టువులకన్నఁ బిశాచము మేలుగాదె ? యే
మిటికి భయంబుఁ జెందెఁ ? దనమీఁదికి నే నని కుత్సహింతునే!

ఒక్క తనమీఁదికే గాదు, "రాచనిసువుల జోలి కించుకయుఁబోక యే యశ్వమును ద్రిప్పుకొనిర" మ్మనికదా! యన్న యాజ్ఞాపించినాఁడు. నారాకఁజెప్పినవార లీమాటఁ గూడ నెందుకుఁ జెప్పరైరో?

దుస్స — ఒకరెందుకుఁ జెప్పవలెను ? నేను "నీకించుకయు భయము లే" దని చెప్పితిని. కాని, తండ్రియవస్థ దలఁచుకొని భీతిల్లి తుట్టతుదకు నన్నుఁ బుత్రశోకార్తిలో ముంచినాఁడు.

అర్జు — అక్కా! విచారింపకుము. గతించినదానికేమి చేయఁగలము ? (పిల్లవాని నెత్తికొని) తండ్రీ ! నీవు దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము. (దుస్సల నుద్దేశించి)

తే. గీ. అన్న కావింపనున్నాఁడు యాగ మొకట
రమ్ము మనుమనితోడ నీరాక కెదురు
చూచుచుందుము మానెదుసుమ్ము మాకు.
లేరు నీకన్న నక్క సెల్లెండ్రు నేఱు.

దుస్స — తప్పక వచ్చెదను. అన్నా ! తల్లిదండ్రులకుఁ గుశలముకద !

అర్జు — ఆ ! క్షేమముగా నున్నారు. నీరాకకు వారును నెదురు చూచుచుందురు. ఇఁక నీవింటికి నరుగుము. (దుస్సల మనుమనితో నిష్క్రమించును.)

అర్జు — (చూచి) అప్పుడే యశ్వము ముందుఁ బోవుచున్నది. ఇటుపైని గొన్ని దేశములు తిరిగినపిదపఁ బాండ్యదేశము తటస్థించును. అచ్చటి మణిపూరపురము నాప్రియురాలగు చిత్రాంగద పుట్టినిల్లు.

తే. గీ. పెండ్లియాడితి నప్పుడు పేర్మికొలఁది
మరల నొకపరి యేనియు నరయనైతిఁ
దరుణి నన్నెంత దూఱునో ! దనయుఁ డేమి
యయ్యెనో ? యెటులుండెనో ? యరయఁబడదు.

కానిమ్ము, అశ్వముం గలిసి కొనియెద. (నిష్క్రమించును.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వర ప్రణీతం
బగు పాండవాశ్వమేధమ్మునఁ
బంచమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవాశ్వమేధము

## షష్ఠాంకము

(అంతర్నాటకము.)

(నాంది)

తే. గీ. ఆర్తుల కెవండు సంజీవనౌషధంబు,
గల్పపాదప మెవఁడు భక్తగణములకు
నెవని మాయ దురూహ మాయీశ్వరుండు
శుభము లిడు జగన్నాటకసూత్రధారి.

**సూత్ర**— (నాంద్యంతమునఁ బ్రవేశించి) మారిష ! ఇటు రమ్ము.

**మారి**— ఇదె వచ్చితిని.

**సూత్ర**— నాటక మాడుఁడని యాజ్ఞాపించియు ధర్మరాజుగా రిప్పటికిని సభకు విచ్చేయని హేతువేమో ?

**మారి**— తమ్మునియొద్దనుండి వార్తాహరులేని రాలే దని యోజించుచున్నారఁట. ఒక్కతనసేకదా కాలయాపనకై మనలం బిలిపించుట !

**సూత్ర**— (దృష్టినిగుడ్చి) అదిగో ! రాజుగారు దయచేసినారు. మన మిఁకె నాటక మారంభింతము.

(అంత ముగ్గురు తమ్ములతో ద్రౌపదీసమేతముగ ధర్మరాజు ప్రవేశించును.)

**మారి**— ఈనాఁడు మన మేనాటకము ప్రదర్శింపుదము ?

**సూత్రి**— ప్రకృతోచితమగు బభ్రువాహనవిజయము.

**మారి**—చక్కఁగా యోజించినావు, కాని యీకతమున వారి మనస్సునకు నొప్పి కలుగునేమో ?

**సూత్ర**— "పుత్రాదిచ్ఛేత్పరాజయమ్" కనుక బభ్రువాహనునిచే నర్జునుఁడు జయింపఁబడుటకు వారానందమునే పొందుదురు.

(తెరలో)

నిటలఘటితాంజలిపుటుండనై యేను మాతండ్రి దర్శనమునకుఁ బోవుచుండ నసంబద్ధప్రలాపము లాడుచున్నా రేమి ?

మారి— (విని) అర్జునుని దర్శనమునకు బభ్రువాహనుండు వచ్చుచున్నాఁడు గాన మనమిఁకఁ బోవుదము. (నిష్క్రమింతురు)

ప్రస్తావన.

(అంత నర్జునుఁడును బభ్రువాహనుఁడును వేఱువేఱునై పురము ప్రవేశింతురు)

బభ్రు— మా పెద్దతండ్రిగా రశ్వమేధయాగదీక్షితులై యశ్వము వెంట మా తండ్రిగారి ననిపిరనియు, వారు మాపురము సమీపమునకు వచ్చి రనియు వింటిఁ గావున నెదురేగి వారిని బురంబునకుఁ దీసికొని వచ్చి సన్మానించి జన్మమును గృతార్థముగాఁ జేసికొనియెద. (పరిక్రమించి) అదుగో, తండ్రిగారు ! (సమీపించి)

చ. తనయుఁడ బభ్రువాహనుఁడఁ దండ్రి ! భవచ్చరణాబ్జ దర్శనం
బునఁ గృతినైతి, మజ్జననముల్ గడు మాన్యత గాంచెఁ, బట్టణం
బున కొకసారి వచ్చి పరిపూత మొనర్పఁగ వేఁడుకొందు, మ
జ్జనని యిటుల్ నను బనిచె, సర్వము విన్నప మాచరించితిన్.

అల్లదె, యమాత్యపురోహితసామంతాదు లందఱును దను రాకకై యెదురు చూచుచున్నారు. కృపావలోకనంబుల వారల నెల్ల వీక్షింపఁ గోరెద.

ద్రౌప— (తనలో) మూఁడుమూర్తుల నితఁడు నిజముగాఁ బాండవమన్యుని వలెనె యున్నాఁడు. నాటకమైనను వేషము లిట్లుండిన నదిరమణీయముగ నుండును.

ధర్మ— (తనలో) ఓహో, తమ్ముఁడా ! నిన్నుఁ జూచి యెంతకాల మైనదోయి! నేఁటికీ నాటకులకతన మరల నినుఁ జూడఁ గల్గెను.

భీము— (తనలో) ఇతఁడా, బభ్రువాహనుఁడు! తమ్మునికి నితనికిని భేదమే కనుపట్టదు.

నకు— (తనలో) ఇందుల కన్న యేమని యుత్తర మిచ్చునో ?

సహ— (తనలో) కొమరుఁడు వచ్చి నమస్కరించినఁ గౌఁగిలించుకొని గారవింపక యేమో కోపముగా నుత్తర మిచ్చుచున్నాఁడు.

అర్జు— (అనాదరముతో)

ఉ. "నా కొమరుండ" వంచు నెటు నమ్మెదు? నశ్వముఁ గట్టిపెట్టితో?
వీఁక నెదిర్చితో? యిదియు నేం దగునే నరపాలమౌళి? కీ
రాక గనుంగొనంగ నిను "రా కొమరుండ" వటన్న మాటకే
లోకము విశ్వసింప దెటులో యిఁక "నాకొమరుండ" వన్నచోన్.

ధర్మ— దేవీ! చూచితివా తమ్ముని యవివేకము? నేను జెప్పిన సంగతులు మరచినట్లున్నాఁడు. తనంతటఁ దానే కయ్యమునకు దిగుచున్నాఁడు.

ద్రౌప— నాథా! యిది నాటకము గదా! కవులు వారి వారి యిష్టానుసారముగాఁ గల్పింతురు.

భీమ— అవును. నీవనినట్లే, లేనిచో నిట్టి విరుద్ధముగా నతఁ డెన్నఁడును మాటలాడఁడు.

బభ్రు— (చిన్నవోయి తనలో) అక్కటా! లోకోత్తరుఁ డైన వివేకి తండ్రి యేమి కతమున నిట్లాడి యుండునో? నే నెంత సంతోషమ్మున నిక్కడికి వచ్చితినో యంత విచారముగాఁ బోవలసిన వాఁడ నైతిని. కానిమ్ము. ఏమైనను జనకునితో వివాదము సమంజసము గాదు.

క. "జనకునికి విరోధించిన
తనయుఁడు తనయుండు గాఁడు తల్లికిఁ దత్పు
త్రుని కతన సతీమణి గా
దను నపయశ మబ్బు" నందు రమలమనీషుల్.

ఇంతకు నన్నీ యనఘుఁడు మాతామహ కుటుంబమున కిచ్చివేయుటం బట్టియుఁ బుట్టినది మొదలిందనుకఁ జూడకుంటం బట్టియుఁ బ్రేమబంధము తెగి యుండును. "స్నేహము ప్రవాసాశ్రయమున నశియించు" నని కదా పెద్దలు సెప్పుదురు! (మరలి పోవుచు) తల్లికడ కరిగి ఆమె యేమనునో చూచి కాని యెందులకును స్వతంత్రింపఁ గూడదు.

గీ. గర్భమునఁ బదిమాసముల్ కష్టమనక
తన్ను ధరియించి మోసి యంతట నఖండ
మైన వేదనఁ బ్రసవించినట్టి తల్లి
జనకుకన్నను హెచ్చగు శతగుణంబు.

ధర్మ— పాపము! తల వంచుకొని మరలి పోవుచున్నాఁడు. (అతని నుద్దేశించి) తండ్రీ! కురుకులోద్భవుండ వగు నీ కిదియే యుచితము. ఎవ్వరో యొక్కరు దక్క మన వంశంబున నవినీతు లిప్పటికి జనింపలేదు.

ద్రౌప— ఇది నాటకము. అటు చూడుఁడు, ఒక నాగకన్యక ప్రవేశించు చున్నది.

(అంత నులూపి పాతాళము నుండి ప్రవేశించును)

భీము— ఈమె యెవరో?

నకు— చిత్రాంగద యేమో?

సహ— చిత్రాంగద నాగకన్య గాదు గదా! తినఁ బోవుచు రుచు లెందుకు? ముందు తేలవచ్చును.

ఉలూ— కుమారా! యిట్లు నిర్విణ్ణమానసుండవై యేగుచుంటివేమి? నీతల్లి మాత్రము నిన్ను "రణము మాను" మను ననుకొంటివా? తండ్రి మనో రథమ్ము నెఱవేర్పుము. శూరులకుఁ దండ్రియుఁ గొడుకును నన్నయుఁ దమ్ముఁడు నను భేద ముండదు. అందులోఁ బాండువంశసంజాతులకు బోత్తిగా బాంధవ్య మవిచార్యము.

ధర్మ— ఈమె యెవరో గాని మంచినీతియే బోధించుచున్నదే, అకటా! నా కతన వంశమున కెట్టి దుష్కీర్తి వచ్చినది. దేవీ! చిగురుమాట నీవు వింటివి కదా?

ద్రౌప— నాటకము గదా, దీనిని మన మంత లెక్కగాఁ జూచుకోరాదు.

ధర్మ— ఎందుకుఁ జూచుకోఁ గూడదు? ఇం దసత్య మేమున్నది? నేను బంధుఘాతుకుఁడను గానా యేమి?

ద్రౌప— అగుదురు, కారు; దాని కేమి? అటుచూడుఁడు.

బభ్రు— (తనలో) ఎవరీమె! ఇంతకును నాలో నే ననుకొన్నసంగతు లెట్లు గుఱుతించినది. (ప్రకాశము) తల్లీ! ముందు నీ వెవ్వరవో నా కాన తీయవలయు.

తే. గీ. కార్తికేయుని జననివో? కాక మన్మ
థాంబవో? జయంతు తల్లివో? యల్ల సప్త
ఋషుల మాతవో? త్రిజగమ్ము లెల్లఁ గనిన
యాదిశక్తివో? వచియింపు మమ్మ నాకు.

భీము— అడుగఁ దగిన సంగతి నడిగినాఁడు.

నకు— ఇంతకు నీమె "యితనితల్లి మాత్రము గా" దని తేలినది.

సహ— అంతయు నిప్పుడు విస్పష్టమగును.

ఉలూ— తండ్రీ! నీకు నేను పెద్దతల్లి నగుదును. మీ యమ్మకన్న మున్న మీతండ్రి నన్ను గాంధర్వవివాహమున వరియించె, నా పేరులూపి. పాతాళము నివాసము, నాగకన్యకను, నీ వియ్యోడఁ దల్లివెనుక తల్లినగు నామాట విశ్వసింపుము. తండ్రిమనోరథం బీడేర్పుము.

సహ— ఇక్కడికిఁ దేలినది కదా!

నకు— వధూనికా! నమస్కారము.

భీము— ఇది నాటకము.

ద్రౌప— (నవ్వుచు) నాథా! మీతమ్మునికిఁ దీర్ఘయాత్ర బహునిష్ఠతో జరిగినదిసుఁడీ!

ధర్మ— (అనాకర్ణితముగా) ఈమె యాకారము జూచినఁ బరమపతివ్రత వలెఁ బొడకట్టుచున్నది. ఇంతకు మున్ను వినికియు నిందుకు భిన్నముగా లేగు. అట్టి యీమె యేలొకో, యిప్పట్లు నిట్టి దురుపదేశం బొనరించి కుమారుని మనముఁ ద్రిప్పుచున్నది!

ద్రౌప— దురుపదేశ మేమి? "తండ్రియాజ్ఞను శిరసా వహింపు" మని బోధించుచున్నది.

ధర్మ— నీవు పక్షపాతముగాఁ జెప్పుచున్నావు. "చెల్లెలుగదా!" యని చెల్లెలి మాట సాధించుట నిష్పక్షపాతము గలవారల కుచితమా?

ద్రౌప— (నవ్వి) ఇంతకు నిది నాటకము గదా!

ధర్మ— నా మనమునకు నిది నాటక మనిపింప కున్నయది.

ద్రౌప— కా కేమి, యటు చూడుఁడు.

బభ్రు— (తనలో) ఈసంగతి తల్లికతన మున్ను విని యున్నదే. ఇంతకు మా యిరువురకును రణము దైవచోదితమై యున్నది. లేనిచో నీపె కాక తాళీయముగా నియ్యోడకు వచ్చి యిట్లేల బోధించును. (ప్రకాశము) తప్పక నీయాజ్ఞ నిర్వర్తింతును.

ఉలూ— నాయాజ్ఞగాదు, తండ్రియాజ్ఞ.

బభ్రు— ఉభయులును మాన్యులే కదా, ఇదిగో, యుద్ధసన్నద్ధుండనై యరుదెంచెదను. (నిష్క్రమించును)

ధర్మ— (తనలో) "ఇది యుచితము గా" దని తమ్మునితో బోధింపుదునా? లేనిచో నేమిచిక్కువచ్చునో? అయినను గొంతసేపు చూచి యట్లొనరింప వచ్చును.

ఉలూ— (తనలో) అకృత్యమైనను నవసరముం బట్టి చేయఁబూనినందుల కి క్కుమరుం డంగీకరించెను. లేనిచో నిమ్మహానుభావునికి భీష్మవధ జనితదోషంబు వేయి జన్మంబు లనుభవించినను దీఱదు. ఇంతకు వసువు లనుగ్రహించి యిట్టి యుపాయ మొనరించినారు. (పరిక్రమించి) అదుగో, నాప్రియుఁడు! తిరిగియు నెన్నాళ్ళ కీతని దర్శనమునకు నోఁచికొంటిని! ఇంతకు నా చెట్టవట్టినది మొద లేదియో యొక చిక్కు మ్మహా మహునికిఁ దటస్థించుచునే యున్నది. నేను దురదృష్టవంతురాలను. అంతియ కా దిప్పుడు పరమ దుర్మార్గురాలనుగూడ నగుచున్నాను. కానిచోఁ దండ్రికిని కొమరునకును వైరము పెట్టుదునా? చిత్తమా! యొక్కింతసేపు కాఠిన్య మవలంబింపుము. లేనిచోఁ గార్యము నెఱవేఱదు.

భీము— అదుగో! కుమారుఁడు సన్నద్ధుండై వచ్చినాఁడు.

(బభ్రువాహనుఁడు ప్రవేశించును.)

నకు— ఇతఁడు రెండవ యభిమన్యుఁడే.

సహ— ఏమో? వినయముగాఁ జెప్పుచున్నాఁడు.

బభ్రు—

చ. కనుఁగొను మయ్య తండ్రి! యిఁక గాండివముఙ్ సగుణం బొనర్పు "నీ
యనుమతియే ప్రధాన" మని యాహవముఙ్ బొనరింప వచ్చినాఁ
డను; "దనయుండు వీఁ" డను కటాక్షము చూపఁగఁ బోకు; మేనునుఙ్
గనికర మూనఁ "దండ్రి" వని; కాఁదగు నెయ్యదియో రయమ్మునఙ్.

ధర్మ— ఓహో! చిలికి చిలికి గాలివాన యగుచున్నదే!

ద్రౌప— మీతమ్ముఁ డేమో యానందముతో ననుచున్నాఁడు, వినుఁడు.

అర్జు— (సంతోషముతో) కుమార! నీ ప్రెమొ క్కిప్పుడు గైకొంటిని. ఇదిగో! ఆశీర్వచనము.

గీ. మనుము చిత్రాంగదను వీరమాతఁ జేయు
మెలమి మాకు యశమ్మును గలుగఁ జేయు
మస్థిర శరీరమున కేమి, యశము మనకు
ముఖ్య మద్దాన నీమది మునుఁగుఁ గాక.

ధర్మ— (తత్తఱపాటుతో) దేవి, వింటివా! తమ్ముని నోట నెప్పుడును రాని మాటలు వచ్చుచున్నవి. శరీర మస్థిర మట! ఇ ట్లెందు కనవలెను?

ద్రౌప— అస్థిరము కాక సుస్థిరమా! అం దేమి తప్పున్నది? శేషము వినుఁడు.

అర్జు— రణభూమి నలంకరింపుము. ఇదె నేను వచ్చుచున్నాఁడను.

(నిష్క్రమించును)

ధర్మ— వినుట కేమున్నది. రణమునకుఁ బ్రారంభించినారు. ఇదిగో, నేను బోయి వారించెదను. (లేవఁబోవును)

ద్రౌప— (చేయి పట్టుకొని) నాథా! యేమి మీ వెఱ్ఱి! యిది నాటకముగదా!

ఉలూ— ఇక్కడికి నేను సగము కృతార్థురాలను. తక్కిన కొదువ శీఘ్రముగనే తీఱవచ్చును. (పరికించి) కుమారుఁడు వింట నమ్ములు సంధించి యును నెందులకో జాగు మొనర్చుచున్నాఁడు. అవును, ముందు తండ్రి విడిచినం గాని విడువఁడు. పరమపతివ్రత యగు చిత్రాంగదకును నఖండ నీతిధురంధరుం డగు విజయునకును బొడమి కుమార్గమున నేలఁ డడుగు వెట్టునా? అదిగో, నాదయితుఁడే ముందుగా నమ్ములు విడుచుచున్నాఁడు. అక్కటా! కన్నకొమరునిపైఁ గఱకుటమ్ములను విడుచుటకు నాథా, నీకుఁ జేతు లెట్లు వచ్చినవి! బలే! యొకరికన్న నొకరు! తండ్రి శరములలో నొక్కటియుఁ దక్కకుండఁగ నన్నిటిని నొక్క యమ్ముననే చూర్ణము చేసినాఁడు. (విని) నాథుఁ డేమో యనుచున్నాఁడు.

(తెరలో)

క. మెచ్చితిఁగదోయి! మదికిన్
వచ్చెను నీచర్య; "పాండువంశమ్మున ను
ద్యచ్చరితు లెందుఁ గల" రను
నచ్చెరు విది యొదవుఁగాక యఖిల జగతికిన్.

ధర్మ— దేవీ! నన్నేందుకు వారించెదవు? సుతి మించుచున్నది. ఎవరో యొకరు తెగక తీరదని యూహించెదను.

ద్రౌప— నాథా! "యిది నాటక" మని యెన్నిసార్లు మనవి చేసినను మీ మన మిట్లు పరాయత్త మగుచున్న దేమి?

ధర్మ— కొలఁది దినములక్రిందట నాకొక దుస్స్వప్నము వచ్చినది. అప్పటినుండియు నామనము మనముగా లేదు.

ద్రౌప— ఇన్నాళ్ళనుండియుఁ జెప్పరైతిరేమి? దాని పర్యవసాన మెట్టిది?

ధర్మ— పర్యవసానము శుభముగా నుండఁ బట్టియే యింతవఱకు జీవింపఁ గలిగితిని.

ద్రౌప— అట్లయిన నిఁకఁ బరితాప మేంటులకు? స్వస్థచిత్తులరై కనుఁగొనుఁడు.

ఉలూ— (తనలో) ఈ యుద్ధ మొకలాగు జరిగినచోఁ గడు నెన్నఁదగి యుండును. వీరలకుఁ బరస్పరజ్ఞాన మించుక ప్రతిబంధించుచున్నది. (చూచి) ఓహో! తుదకుఁ జూడశక్యము గాకున్నదే? ఒకరి నొక రెట్లు కొట్టుకొనుచున్నారో! ఇట్టు లిఁక నొక క్షణకాల మున్న నొక్కరే కాదు. ఇరువురును ద్రెళ్ళవలసినవారే. వల దని వారింతునా, (యోజించి) అయ్యో! మఱల నజ్ఞానమునఁ బడుచున్నాను. వారించినచో ఘటించిన లాభమేమి? సంజీవనమణి దగ్గఱనే యున్నది. భయమెందుకు? పాపము! ఈసంగతి విని చిత్రాంగద నన్నేమని నిందించునో!

(అంతఁ దత్తఱపాటుతోఁ జిత్రాంగద ప్రవేశించును)

ధర్మ— (చూచి) దేవీ! యిది నాటకమే యైనను నేను జూడఁజాలను. "ఇంతటితోఁ జాలింపు" మని భీమునికిఁ దెలియఁ జేయుము.

(కన్నులు మూసికొనును)

ద్రౌప— నాథా! మన్య మానిపించినచో రసాభాసముగ నుండును. అటు చూడుఁడు. మఱియొక దివ్యసుందరవిగ్రహముగల యెలనాగ విచారించుచు వచ్చుచున్నది.

చిత్రా— (ఆత్రముతో) తండ్రీ, తండ్రీ! యెంతటి యకృత్యము నొనరించుచున్నావు! ఉడుగు ముడుగుము. (రంగమునకుఁ బోవుచుండఁగా)

ఉలూ— (తనలో) ఇది గొప్పయంతరాయముగాఁ దోఁచుచున్నది. ఈమె నెట్లు వారింతును? ఇట్లగుంగాక. (చేయిపట్టుకొని) అక్కా! ఇటు చూడుము.

చిత్రా— (చూచి) అక్కా! నీవిక్కడ నుండియే కొమరుని దుష్కృత్యమును వారింపకుంటివా?

భీము— తమ్ముఁడా! ఈమె చిత్రాంగద కాఁబోలును.

నకు— కావచ్చును, కొమరుని వారింపుటకై పోవుచున్నది.

సహ— వధూనికా! నమస్కారము.

ద్రౌప— (నవ్వుచు) ఇది నాటకము.

ఉలూ— (తనలో) ఇప్పట్ల నసత్యమాడక తీరదు. (ప్రకాశము) నాయావచ్ఛక్తిని జెప్పి చూచితిని, విన్నారుకారు. అయిన నేమిలే, కొంతసేపటికి వారే యూరకొందురు.

ధర్మ—(కోపముతో) ఛీ! జాతిలక్షణము పోఁగొట్టుకొన్నావు కావు. లోపల విషము పెట్టికొని పైకి తేనెమాటలు చెప్పెద వేమి? ఇదియంతయు నీవు

చేసిన పన్నుగడకాదా! ఆఁడుదానవై పోతివి లేనిచో నీబ్రదు కేమి యగునో !

ద్రౌప— నాథా ! వృథాగా నీదీనురాలిపై నెందుకుఁ గోపించెదరు ?

చిత్రా— (తనలో) ఏమి, యీమె యిట్లనుచున్నది! ఇందేమైనఁ గపటము లేదుకదా ! (ప్రకాశము) నన్నుఁ బోనిమ్ము. నేను వారించెదను.

ఉలూ— నీవు వృథా పరిశ్రమము పడుటయ కాని, లాభము లేదు, వినరు. ఇంతకు నియ్యది వినోదముగా నొకరి శక్తి యొకరు పరీక్షించుకొనుట కేర్పడిన కయ్యమే గాని మఱియొకటి కాదు, "కొమరుఁడు తనయంత వాఁడగునో కాఁడో" యని నాథునకు సందియము గల్గినది. అది తీఱు చున్నది.

ద్రౌప— (తనలో) ఈమె మొదట నుండియుఁ గుటిలముగానే వర్తించు చున్నది. నిజముగా నిట్లు జరిగె నేని యీమె యట్లాచరించుటకుఁ గారణ మేమో ?

చిత్రా— (చూచి) అయ్యో, అయ్యో ! ఇట్టివిపరీత మెచ్చటనేనిఁ గలదా ? ఇది పరీక్షకే యైనచో నింత ఘోరముగా నుండునా? నీవెఱిఁగియే దాఁచుచున్నావు. నన్ను నిర్బంధింపకుము. పోనీ, వినకుందురుగాక, నామనోభిప్రాయ మెఱిఁగించి నాథునియెడల నిరపరాధిని నయ్యెదను నన్నుఁ బోనిమ్ము.

ధర్మ— (తనలో) ఈమె పోయి మధ్య నిలిచినచోఁ దప్పక వీరు రణ ముడుగుదురు.

ఉలూ— (తనలో) ఓహో! యీమె నాఁగుట దుర్ఘటము గానున్నదే! (ప్రకాశము) స్త్రీలు సంగరభూమికిఁ బోవు టుచితముగాదు, నామాట వినుము. (గట్టిగాఁ బట్టుకొని యాఁపును.)

ధర్మ— (తనలో) ఔరా ! యీభుజంగి దౌర్మార్గ్యము ! ఏదో యొక యడ్డు వెట్టి యామె నాఁగుచున్నది. (ప్రకాశము) సాధ్వీమణీ! యా వామ గామినితో నేమి ? నీవుపోయి వారింపుము.

ద్రౌప— నాథా ! నాటక మాడునప్పుడు సభ్యులు మాట్లాడుట పరిహాస్యము కాదా !

చిత్రా— (చూచి) అయ్యో ! అయ్యో ! కొమరున కెట్టినారసము వెన్నుచ్చి పోయినదో ! అక్కటా ! ఆకోపముచేఁ గొమరుఁ డర్ధచంద్రాస్త్రమును బ్రయోగించుచున్నాఁడు. దైవమా ! యేమి చేయుదును ? కడుపు, వీపు, నిండెవరి యాపదఁ జూడఁగలను.

ద్రౌప— (తనలో) పాపము! ఇప్పుడీమె యవస్థ యెట్లున్నదో?

ఉలూ— ఎవరికి భయములేదు. కొంచెము సేపు తాళుము.

ద్రౌప— (తనలో) ఈమెధైర్యమేమో? నిశ్చింతగా మాటలాడుచున్నది.

చిత్రా— (చూచి) అక్కా! అక్కా! యెంతదుర్మార్గురాలవైతివి! అదిగో! నాథుని శిరము త్రెళ్ళినది. అయ్యో! అయ్యో! (మూర్ఛిల్లును)

ధర్మ— (కోపశోకములతో) దేవీ! అదిగో! నన్ను వారింప నిచ్ఛితివికావు. తమ్ముని శిరము దెగినది అయ్యో! అయ్యో! (మూర్ఛిల్లును)

ద్రౌప— అయ్యో! అయ్యో! (మూర్ఛిల్లును)

నకు— (మూర్ఛిల్లును)

సహ— (మూర్ఛిల్లును)

భీము— (దుఃఖముతో) అక్కటా! యిదె యేమి విరుద్ధము? భీష్మద్రోణాదులతోఁ బోరునప్పుడేని నాతమ్మునికిట్టి దురవస్థ యెన్నఁడు లేదే! ఇయ్యది నిజమై యుండునా? (ధైర్యముదెచ్చుకొని) కల్పితమై యుండును. (నలుదెసలు పరికించి) ఇదె యేమి వీరందఱును మూర్ఛిల్లిరే! (అటు చూచి) ఓహో! కుమారుఁడును ద్రెళ్ళినట్లున్నదే. రథముపైఁ బడియున్నాఁడు (యోజించి) ఇదె కేవల మసత్యము. తుట్టతుదకిట్లు నాటక మెప్పుడు సమాప్తినొందఁగూడదు. వీర లిరువురును దిరిగియు బ్రదుకుట యుండవలెను. (సంశయముతో) తలదెగిన తమ్ముఁ డెట్లు బ్రదుకును? (కోపముతో) ఓరీ! పండితమ్మన్యా, సూత్రధారా! యిట్టి దుష్టనాటక మెట్లు ప్రదర్శింపుచుంటివిరా? ఇదిగో! నీతల పగిలినది. చచ్చితివిరా, లక్షణజ్ఞానవిహీనులైన శుంఠలు చెప్పిన నాటకముల నాడి జగమును మోసము చేసెదవురా? దురాత్మా!

సూత్ర— (భయముతోఁ బ్రవేశించి) అయ్యా! సైపుఁడు. వీర లిరువురు నిప్పుడే జీవింతురు. ఇది మహాలక్షణవేత్తలును త్రికాలజ్ఞులునగు కైలాసశిరోమణి భట్టాచార్యుల వారిచే రచింపఁ బడినది. దేవరకోపముచే మన్య నాటకము విరస మగుచున్నది. అనుగ్రహింపవలయును.

ధర్మ— (మూర్ఛదెలిసి) అదిగో! "త్రికాలజ్ఞుఁ" డనుచున్నాఁడు. ఇది యిట్లు జరుగఁ బోవునని యెఱిఁగి ముందే వాల్మీకివలె వ్రాసియుండును. ఇంతకు నిది నిక్కమే. అయ్యో! అయ్యో! (స్మృతినభినయించి) గంగాశాపమువలన నిట్టు జరిగినను దిరిగియు జీవింపవచ్చును. (సూత్రధారు నుద్దేశించి) ఓయీ! త్వరగా నెఱవేర్పుము. చూడఁజాల కున్నారము.

సూత్ర— చిత్రము (నిష్క్రమించును.)

భీము— (ద్రౌపదిని దమ్ములను లేపఁ బోవును.)

ధర్మ— (వారించి) తమ్ముఁడా ! వీరు తిరిగియు జీవించువఱకును వీరలను లేపకుము. వీరు చూడఁజాలరు. ఇంతదనుక నాటకమని యెఱిఁగియు నిప్పుడు వీరు తన్మయులై యుందురు.

ఉలూ— అయ్యో ! దైవమా ! యెంత పని జరిగినది ! కుమారుఁడు మూర్ఛిల్లినాఁడు. నాథుఁడు త్రెళ్లినాఁడు. అక్కటా, అక్కటా ! యెంత మందభాగ్యురాలను ! (స్మృతినభినయించి) నేనుగూడఁ దన్మయురాలనై విచారించుచుంటి నేమి ? ఇది సంతసింపఁదగిన యవసరమే కాని విచారింపఁదగు నవసరము కాదు. ఈ రూపముగా నితని పాపము శాంతించినది. (చిత్రాంగదం జూచి) అయ్యో ! ఈమె యిప్పటికిని మూర్ఛ దెలియలేదు. (ఆలోచించి) ఇది యీమె కీసమయమున నుపకారకమే. వారలం బ్రదికించి పిదప నీమెకు శీతోపచారము లొనరించెద. కానిచోఁ బతిసుత మరణమ్ము లొక్కటఁ జూచి యీమె భరింపనేరదు. హృదయమా ! ధైర్య మవలంబింపుము. నన్నక్కడికి రయమునఁ గొనిపొమ్ము.

(నిష్క్రమించును)

చిత్రా— (మూర్ఛదేఱి) అయ్యో ! అయ్యో ! పితృఘాతుకుండగు కొమరునిం గన్న నాకెట్టి యాపదయైనను రావచ్చును. (కన్నులువిచ్చి) అక్కటా ! కొమరుఁడు గూడఁ ద్రెళ్లినాఁడు. శివ శివా ! పరమేశ్వరా ! యెట్టియాపద దెచ్చి పెట్టితివి ! (లేచి శవములదరికిఁ బోవుచు మధ్యమూర్ఛిల్లును )

(ఆకాశమునఁ బుష్పవృష్టి, సతీసుతసమేతముగ నర్జునుఁడు ప్రవేశించును.)

ధర్మ— (సంతోషముతో) దేవీ ! (ద్రౌపదిని లేపును)

భీము— (సంతోషముతోఁ దమ్ములను లేపును.)

అర్జు— (ఉలూపిం జూచి తనలో) ఇట్టియుపకృతి నాచరించిన యీమె యెవరై యుండునో ? (స్మృతినభినయించి) ఉలూపి కాదుగదా ?

ద్రౌప— నాథా ! మీరు మరల నెట్లు బ్రతికినారు.

ధర్మ— ఆనాగకన్యక యెట్లో గాని బ్రదికించినది యని యూహించెదను

నకు— మొదలఁ గయ్య మెందుకుఁ బెట్టవలయునో ?

సహ— పాపము ! ఆమె యే మెఱుఁగును ? అన్నయే కదా ప్రథమకారణము!

ధర్మ— దీని కేదో యొకకారణ ముండితీరవలెను. ఆమె మాత్రము పరమ యోగ్యురాలు.

ద్రౌప— మీరిందాఁక నామెను మాటితిరి కదా ?

ఉలూ— అక్కా, చిత్రాంగదా ! లెమ్ము!

అర్జు— (తనలో) సంశయమేమి ? ఈమె నిక్కముగా నులూపియే ! ఇప్పటికి విస్పష్టమైనది. కానిచో "అక్కా !" యని యేల పిల్చును ? ఐనను ముందుఁ దేలకుండునా ? కాని యిక్కడి కెందులకు వచ్చినదో !

చిత్రా— అయ్యో, అక్కా, యెంతపనిఁ జేసితివి ! నన్నుఁ బోనీయవైతివి. దైవమా నీకు నే నేమి యపకృతి చేసితిని.

ఉలూ— కన్నులు తెఱువుము. అదుగో! కొమరుఁడు, ఇదుగో! నాధుఁడు.

చిత్రా— తల్లీ ! నేను చూడఁజాల, నన్ను నిర్బంధింపకుము. నాకుఁ జితిఁ జేర్పింపుము ! నాధునిఁగూడఁ బోయెద !

ద్రౌప— పాప, మీమె యింకను వారు జీవింపలేదనియే యనుకొనుచున్నది ! అక్కటా, యిట్టికష్టము శత్రువులకైన వలదు.

ఉలూ— అట్లు దటస్థించినచో నీవు పోవుదానవును నేను నిల్చుదాననునా ! అరుగో ! సజీవులై నీయెదుట నున్న వారు విలోకింపుము !

అర్జు— (తనలో) నిక్కముగా నీమె యులూపియే !

చిత్రా— (చూచి యాశ్చర్యముతోఁ దనలో) ఏమీవిచిత్రము ? ఇది కలయేమో? (సిగ్గుతో నర్జునునికి నమస్కరించును)

ద్రౌప— ఓహో ! యీమె సౌందర్య మనుపమానము గదా !

అర్జు— దేవీ ! తే. గీ. వీరమాతనై యెక్కుడు పేరుదెచ్చి
నట్టి నీ కేమి దీవన యాచరింతు
నిన్నుఁ బెండ్లాడు ఫలము నందితిని నేను
సతికతనఁ గాదె యశ మయశమును బతికి !

ఉలూ— (సిగ్గుతో నమస్కరించి) నాధా ! ఈతప్పంతయు నాది, నన్ను క్షమింపుము.

అర్జు— (తనలో) ఏలొకో ! యీమె పరమోపకారిణి యయ్యు నిట్లు నొదువు చున్నది. (ప్రకాశము) ఇందు నీయపరాధ మే మున్నది? అంతయునాదే!

బభ్రు— (తనలో) ఈమె నన్నుఁ బ్రేరేపుట కేదో హేతు వుండవలెను.

చిత్రా— మిమ్ము నిరువుర వారింపఁ బోయెడి నన్ను "నియ్యది కలహముగాదు వినోద" మని చెప్పి యాఁపినది.

అర్జు— (ఉలూపింజూచి) చెలీ! అందుకా, నీ విట్లు సంశయించుట! అట్టి యెడ నెవ రడ్డమైనను లాభము లేదు. అది గాక వీరపత్నులకును, వీరమాతలకును నది సమంజసము గాదు.

ఉలూ— నాయపరాధ మంతమాత్రమే గాదు, ఇతఁడు "తండ్రితో సంగర మొనర్చుట జొత్తిగాఁ బాడి గా" దని మానిపోవుచుండ నేఁ బురికొల్పితి.

ద్రౌప— ఎందులకుఁ బురికొల్పితివో యదియే తెలపవలసి యున్నది.

అర్జు— మంచిపని చేసితివి. వీరమాతలలో నగ్రగణ్యురాల వైతివి. కావున నే,

క. నీకొమరుఁ డిరావంతుఁడ
నేకానీకముల నని జయించి పుడమి వె
న్నిక సమరాంగణమ్మున
నే కాయము విడిచి స్వర్గ మేగె మృగాక్షీ!

ధర్మ— అయ్యో, వెఱ్ఱి తమ్ముఁడా! ఇప్పు డీమెకు మరల నా సంగతి యెందులకు జ్ఞప్తికిఁ దెచ్చితివి.

ఉలూ— (కన్నీరు నించును.)

చిత్రా— అక్కా! ఊఱడిల్లుము. రాచకొడుకుల కిదె యుచితమే కదా!

అర్జు— దేవీ! నాగరాజనందని!

క. ఏరికనివిచారింపుద
మో రాజీవాక్షి! కొమరు లొక్కటఁ జగి రీ
భారతరణమున నిది భూ
భార తరణమగుట నట్లు పనుపడె నబలా!

ద్రౌప— అక్కా! ఐదుగురుకొమరులను నేను బ్రమింగితిని, ఏమి చేయుదము? ఊఱడిల్లుము. (కన్నీరు విడుచును)

ధర్మ— దేవీ! ఊఱడిల్లుము.

చిత్రా— ఆయనకుమాత్రము కొమరుఁడు గాఁడా? విచారము లేకపోవునా? శోకించిన ఫలిత మేమి? ఊఱడిల్లుము (కన్నీరు దుడుచును)

ఉలూ— అక్కా! తండ్రికిని గొడుకునకును గలహము పెంచెడి పాపజాతికి నాకట్టి కొడు కెందుకు దక్కును.

చిత్రా— పరమ యోగ్యురాలవగు నీవు మిన్నక యిట్టిపని నాచరింతు వనిన నామది నమ్మకున్నయది. యిందేదేనిఁ గారణ ముండి తీర వలెను.

ద్రౌప— (తనలో) ఈమె వితర్కము కడు శ్లాఘనీయము.

ఉలూ— కారణము లేకేమి? “భీష్మునిఁ గపటోపాయమునఁ జంపినందులకై నాథునికి నరకబాధ తప్పక తటస్థించు” నని యొకనాఁడు వింటిని.

అర్జు— (తనలో) ఓహో, యెట్టి దుష్కీర్తి సంపాదించుకొంటిని!

క. హరి సెప్పఁగాక యగ్రజుఁ
డు లేకలుఁ గొప్పఁగాక యక్కట! నేనీ
దురితమ్మెన్నఁ దప్ప నగునే?
శరీరములు వోవుఁగాని చన వపకీర్తుల్.

ధర్మ— (విచారముతో) అవును, తమ్ముఁడా! దేహములు క్షణభంగురములు కాని కీర్త్యపకీర్తులు కల్పాంతస్థాయులు.

చిత్రా— ఎవరివలన వింటివి?

ఉలూ— వసువుల వలనను, భాగీరథి వలనను.

ధర్మ— దేవీ! ఇక్కడికిఁ గొంత దెలిసినది.

ద్రౌప— తక్కినది గూడ విని కాని చెప్పఁజాలను.

చిత్రా— ఎక్కడ?

ఉలూ— గంగయొద్దను.

చిత్రా— తరువాత వారిని నీవేమి కోరితివి?

ఉలూ— పాదములపైఁ బడి యీ నరకమునకు నిష్కృతి యేదేని యనుగ్రహింపక తప్ప దని వేఁడుకొంటిని.

ధర్మ— సాధ్వీమణీ! మంచి యుపకారము నాచరించితివి.

చిత్రా— వార లేమనిరి?

ఉలూ— ఇది తప్పక యనుభవించియే తీఱవలసిన దని నొడివిరి.

ధర్మ— సుకృతదుష్కృతము లూరక యెట్లు తీఱును?

చిత్రా— పర్యవసానమును దెల్పుము.

ఉలూ— తుట్టతుదకు “నీతని కొమరుఁడు బభ్రువాహనుని చేతిలో నితఁ డొకపరి మృతుం డయ్యేనేని యితని కీపాపము తీఱు” ననిరి.

చిత్రా— తరువాత?

ఉలూ— మాతండ్రి యనుగ్రహమున నాకెట్టులేని సంజీవనమణి యంత దుర్లభము కాదని యెంచి, యట్లనే జరుగునట్లనుగ్రహింపుఁడని కోరితిని.

ధర్మ— ఇక్కడికిఁ దేలినది. చచ్చినవాని నీమె సంజీవనమణిచే బ్రతికించినది. ఇంతకును నామ్మనికి గండము దాఁటిపోయినది. ఇఁక గంగ యిచ్చిన శాపము మఱొక్కటై యుండదు.

ద్రౌప— నాథా, అట్లనే యగుఁగాక! కాని యిది నాటకము. ఎంతవఱకు సత్యమో?

బభ్రు— (తనలో) అట్టి యుజ్జీవనౌషధ ముండుటం బట్టియే యీమె మా కలహమునకు సమ్మతించినది.

అర్జు— (తనలో) ఓహో, దీని ముఖ్యాంశ మిది!

క. వసువులు గంగయు నొక్కట
గుసగుసలాడంగ విని యిగురుఁబోఁడి తదీ
యసమాచార మెఱిఁగి య
వ్వసువులఁ బ్రార్థించి యిట్టి వల నార్జించెన్.

చిత్రా— అక్కా! నినొక్కటి యడుగుచున్నాను. జగదేక వీరుఁడగు నాథుని నీ శిశువెట్లు జయింపఁ గలిగెనో? యని సందేహించుచున్నాను.

భీము— నాకును నిదియే గొప్ప సంశయము.

ఉలూ— నేనప్పుడే వసువులను బ్రార్థించితిని.

చిత్రా— ఏమని?

ఉలూ— మీర మ్మహామహుని జయింపఁ దగు సామర్థ్యముఁ గొమరునకుఁ గలుగఁ జేయవలయు నని.

బభ్రు— (తనలో) ఇప్పటికి నేను నిరపరాధిని.

సహ— తగినంత తృప్తిగా లేదు. వసువులు రుద్రునికన్న నెక్కువవారా?

నకు— మహాదేవుఁడు భక్తపరాధీనుఁడు గదా! అయ్యనఘుని జయించుట మన మొక గొప్పగాఁ జూచుకొనఁ దగదు.

ధర్మ— తమ్ముఁడా! నీవు చెప్పినదే సదుత్తరము. వసువులకు మనపై ననుగ్రహ ముండదు కదా?

గీ. ఒక్క వసు వంశ మగు భీష్ము నోర్చుటకుఁ ద
రంబు గాదయ్యె మును సమరమున మనకు;
నట్టి వా రేడ్గురఁట! పయి ననుజ మరణ
రోషరూషితు లఁట! యిందు దోష మేమి ?

చిత్రా— అక్కా! యింత పరిశ్రమము చేసి నాథునికి నరకముఁ బాపిన నీ మేలు నే నేమని కొనియాడఁగలను.

ఉలూ— స్వకార్యమునకై యే నింత శ్లాఘింపఁ దగను.

చిత్రా— కుమారా! జనకునకు నమస్కరించి క్షమాపణ కోరుకొనుము.

బభ్రు— (నమస్కరించి)

క. ఎఱిఁగియు నెఱుఁగక చేసిన
పొరపాటు క్షమించి నన్నుఁ బుత్రుని బరమా
దర మొలుకు కటాక్షమ్ముల
నరయుము నీయాజ్ఞ యేదియైన నొనర్తున్.

అర్జు— (కౌఁగిలించుకొని) తండ్రీ! నీ వెందుకు క్షమింపఁబడవలయును ?

గీ. నరకముఁ దరించుటకుఁ గదా! నరులు కొమరు
లం గనుట! నీకతన నా ఫలమ్ముఁ గంటి,
నాత్మజుఁడు తండ్రికన్నను నధికుఁడైన
యప్పుడే కద తండ్రికి నబ్బు ముదము!

అనేకులఁ గొమరులఁ గన్నను నేను నీకతన ధన్యుండ. నీమనమ్మున నిందులకు లేశమ్మును సంశయము వలదు. వచ్చు చైత్ర పూర్ణిమ నాఁటికి నీ తల్లు లిద్దఱితోడను నశ్వమేధమ్మున కరుదెమ్ము.

బభ్రు— (వినయముతో) జనకుని యాజ్ఞ శిరసా వహించితిని. తండ్రీ! ఒక సారి పురమ్మునకు విచ్చేసి పిదప దయచేయవలయు నని ప్రార్థించెదను.

అర్జు— కుమారా! నేను దీక్షఁ బూనిన కతన నిప్పటికి రా వలనుపడదు. కావున న న్నవరోధింపకుము. నీవు నీతల్లులతోఁ బురమ్మునకుఁ జనుము. న న్ననుపుము. నే నింకను గాంధారాది దేశమ్ము లీ యశ్వమ్ముతోఁ జరింప వలయును. ఇప్పటికే యన్న నాకై యెదురు చూచుచుండును.

(అందఱును నిష్క్రమింతురు)

(ఇది అంతర్నాటకము.)

ధర్మ— (దెసలు పరికించి) తమ్ముఁడా! యింతలో నెక్కడి కేగితివి ?

ద్రౌప-- ఇప్పటికి నాటకము పరిసమాప్తమైనది. పాత్రము లన్నియు నిష్క్రమించినవి.

ధర్మ- చ. అరిగెఁ దురంగమమ్ము వెనుఁ గర్జునుఁ డెంతయొ కాలమయ్యె; సం
గరములె తారసించెనొ? సుఖమ్ముగ దేశమె చూచుచుండెనో?
యెఱుఁగఁగ రాదు, వార్తయును నిప్పటికియ్యెడ కంపఁ డయ్యెఁ; జి
త్తఱపడు మానసం బకట! తమ్మునిఁ జూడక యెట్లు లోర్చెదన్.

భీము— అన్నా! సకల భూచక్రముం ద్రిమ్మరి కాని రా వలను పడదు కదా! అది గాక మధ్య మధ్య యుద్ధములు ఘటిల్లించుచున్న ట్లిప్పటి నాటకము వలననే మనకు విస్పష్ట మగుచున్నది.

ద్రౌప— నాటకము మాట కేమి గాని తగిన సహాయు లెవ్వరును లేకుంటచేనా మనము కొందల మందుచున్నయది.

ధర్మ— అట్లనకుము, ఇదియును సత్యమే యై యుండును. "త్రికాలజ్ఞుఁ" డని కదా యక్కవినిఁ బేర్కొనిరి.

నకు— దేవీ! అసహాయశూరునకు సహాయ మెందులకు?

క. ఖాండవ మేర్చెడు తఱి గో
మండలి మఱలించునపుడు మఱి యెవ్వరు తో
డుండిరి? కోరం డాతం
డొం డెగ్గియు గాండివమ్ము నొక్కఁడు దక్కన్.

సహ— దేవీ, పాంచాలీ!

గీ శౌరికన్నను జగముల శూరు లొరులు
లేరు గద! యమ్మహాత్ముతోఁ బోరునపుడె
అన్న యసహాయుఁ డితరుల నెన్న నేల
యతని లావు నెఱింగియు వెతలు దగునె.

భీము— తమ్ముఁడా! చక్కఁగ నొడివితివి.

క. అన్న యిటు లాచరించిన
వెన్నేనియుఁ గలవు దురము, లిది యొక లెక్కా!
మొన్నటి బవరం బంతయు
నన్న వయిం జెల్లె ననుట కభ్యంతరమే?

ధర్మ—అది యట్టిదియ, యైనను నెవరికిఁ దగినట్టు వారు పాటు పడుటం బట్టియే జయింపఁగలిగితిమి. ఇందులో నొకరి కొకరు దీసిపోవు వా రెవరును గారు

చ. అలఁతులె ద్రౌపదేయులు? మహా బలశాలి ఘటోత్కచుండు దాఁ
గొలఁదియె? శౌరి యల్లుని కొకం డిల సాటియె? సాత్యకిన్ దగం
బలికిన నోట నింకొకనిఁ బల్కఁ దరంబె? కవల్ నిరస్యులే?
బలమున నీకు సాటియగు పార్థివు నొక్కని నేనిఁ గంటిమే.

ద్రౌప— నాఁడు సౌగంధికకుసుమానయనమ్మున కీ యన్నను నంపినయది మొదలు నా కొంటిగా నిం దెవ రెయ్యెడ కరిగినను మన సొప్పదు.

ధర్మ— అవును. అప్పటి యలజడి కితఁడు గనుక నే కాని మఱియొక్కని కా ప్రముక్కడి రక్కసుల బారిఁ జిక్కకుంట హుళక్కి. ఐనను గార్యావసరముం బట్టి యొంటరిగా నితని నంప వలసి వచ్చినది.

నకు— అవసరము లేదని యూరకొనిరి గాని బావ నంపినచో నేనే వెళ్లుదును.

సహ— అవును. అట్లొనర్ప వలసినది. వారి పరస్పర సఖ్య మసామాన్యము.

ధర్మ— నిజమే కాని, కొంచెము సంశయించితిని.

క. మనకున్ సంధి యొనర్పఁగఁ
జనుదెంచిన నాఁటఁగోలె శ్రాంతి యనుట యొ
క్క నిమేషమ్మును నెఱుఁగఁ డి
తని నిఁక మోమోట పెట్ట ధర్మం బగునే!

ద్రౌప— ద్వారకనుండి యెవరేని శ్రీకృష్ణుని యనుచరులు వచ్చిరేమో? ఆ సమీపమున నున్నయెడ జాడఁ దెలియ నయ్యెడిని.

(అంతఁ గృష్ణుఁ డొక వార్తావహునితోఁ బ్రవేశించును.)

కృష్ణ— (తనలో) పాండవాగ్రజుండు తమ్ముని జాడఁ దెలియమిని జింతిల్లుచుండం బోలు. పార్థుని యుదంతమును జేకొని వచ్చిన యీ పశుపాలునిచే నతని మనోవ్యాకులతను బోఁగొట్టెదను. (సమీపించును.)

ద్రౌప— అన్నా! యిప్పుడే నీమాట చెప్పుకొనుచున్నాము. మాటలోనే నీవు వచ్చితివి.

ధర్మ— (పశుపాలు నుద్దేశించి) ఇతఁడు ద్వారకనుండి వచ్చెనా యేమి?

కృష్ణ— అవును. మీ తమ్ముఁ డితనిచేఁ దన కుశలవార్త నంపించినాఁడు.

భీమ— (ఆదరముతో) అతఁ డప్పుడే ద్వారకకు వచ్చి యట నుండి వెళ్లెనా యేమి? అట్లయినఁ గొలఁది దినమ్ములలో యిటకు రావచ్చును.

ధర్మ— ఓయీ! మాతమ్ముఁడు కుశలముగ నున్నాఁడు గద? నీ పే రెవరు?

పశు— క్షేమముగనే యున్నారు. నా పేరు పశుపాలుఁడు.

ద్రౌప-- (తనలో) అమ్మయ్యా! యిక్కడికి బ్రతికితిమి.

నకు-- పశుపాలా! ఏమేమి సంగతులు చెప్పి పంపెను?

సహ-- త్రోవలో నెక్కడెక్కడ యుద్ధములు జరిగినవో?

భీము-- జరాసంధ పౌత్రుఁడు మేఘసంధి తప్పక యశ్వము నడ్డగించు ; యోజించెదను.

కృష్ణు-- (నవ్వుచు) మీ రందఱును నన్ని ప్రశ్నలను వేసిన దేనికని యతఁ డుత్తరము చెప్పును?

ధర్మ— ఓయీ! తక్కినసంగతులు పిమ్మటఁ జెప్పవచ్చును, గాని యతని కొమరుఁడగు బభ్రువాహనునికి నతనికిని సంగరము జరిగినమాట నిక్కమేనా?

పశు— ఆవిషయము నాతోఁ జెప్పలేదుగాని యాకుమారునిం గుఱించి మీతో నిట్లు మనవి చేయుమన్నారు.

ధర్మ— ఎట్లు?

పశు— క. అరుదేరఁగ నున్నాఁడం
బరచరులకు నేని నోరువఁగ రాని దురు
ద్ధరశక్తి బభ్రువాహనుఁ
డెఱిఁగి యతని గారవించు టెంతయు నొప్పున్.

భీము— నిక్కముగా జరిగియే యుండును. లేనిచో నతని నంతగాఁ గొనియాడఁడు.

నకు— కొనియాడకేమి? ఆతఁ డతని పుత్రుఁడు గదా!

సహ— అందుచేతనే నుతికిం దగ కుండుట.

ధర్మ— ప్రధానమైన యంశమునే తెలిసికొన్నావు కావు. కానిమ్ము, ఇఁక నేమేమి సంగతులు చెప్పెను?

పశు-- ఇదిగో, మనవి చేయుచున్నాఁడను.

తే. గీ. ధరణియెల్లను దురగమ్ము దిరిగె నచ్చ
టచ్చట నృపాలతనుజాతు లడ్డుపడియు
సంధి యొనరించుకొని రొక్క సమరమునను
రాచకొమరులు చాలేదు రాజచంద్ర.

భీము-- సంధి యొనరించుకొన్నప్పుడు చచ్చుట యేల తటస్థించును?

ధర్మ-- తరువాత, తరువాత?

పశు-- క. బలములఁ జంపిరియొ రథముల
నిలఁ గూల్చిరియొ సారథులను హింసించిరియొ భీ
తిలఁజేసి సంధికిఁ దమిఁ
గలిగించితి వెల్ల రాచకాన్పుల కనఘా!

ధర్మ-- తండ్రీ! మంచిపని చేసితివి. అంతమాత్రమును హింస జరుగకుండ నెఱ వేఱినది కాదేమి!

భీమ-- పశుపాలా! మేఘసంధి సంగతిని గుఱించి చెప్పవైతివి.

పశు-- పూర్వవైరమును మదిఁ బెట్టుకొని మేఘసంధి యాశ్వము నడ్డగించినప్పు డాయన యిట్లనియె నఁట.

ధర్మ-- ఎట్లు?

పశు-- క. మాయన్న యేరినిం జా
నేయుము మని యాజ్ఞ యిచ్చె నెందుల కని నీ
డాయుంగ వచ్చెదవు హా
మ్మా! యసువులు నీకు భరమె! మముఁ బోనిమ్మా.

నకు-- ఇంతమాత్రమున కతఁడు మగలువాఁడు గాఁడే!

పశు-- క. అను మాటలు చెవిఁబెట్టక
నను నారాచములఁ గొట్టినన్ నడుమనె నా
నినిఁ ద్రుంచి యతని రణసా
ధనములఁ దునుమాడితిని భ్రిదరముల మూఁటన్.

సహ-- పాపము! విరథుఁడైనాఁడు, ఇఁక సంధి సేయక చేసెడి దేమి?

పశు- ఆ. వె. అంత నీడఁబోక యాతఁడు గదగొని
ప్రళయకాలశమను పగిదిఁ గదియ
మెచ్చి యొక్క యమ్మ వుచ్చి యగ్గద భగ్న
ముగ నొనర్చి వాని కౌగి నిటంటి.

భీమ— చిన్నవాఁడైనను దాతతండ్రులపేరు నిలుపక పోలేదు; తరువాత?

పశు— క. నిలిపితివి తాతతండ్రుల
బలము పరాక్రమము యశము బాపురె! నీకుం
దల్లకఁ బనిలేదు పార్ని
మ్ములకుం దగ; రమ్ము జన్మమును గనుఁగొనఁగన్.
పాం. అ. 134

నకు— పాపము, సిగ్గిలుచు "మంచిదే" యని తల యూఁపెను గాఁబోలును.

సహ— శకునికొమరుఁ డేమైన నడ్డువచ్చెనేమో ?

ధర్మ— అవును. అది ముఖ్యముగా వినఁ దగినదియే ?

పశు— శకుని కొమరుఁడు తన బలములతో నడ్డు వచ్చినప్పుడు మీతమ్ము లిట్లనిరఁట.

ధర్మ— ఎట్లు ?

పశు— క. చిన్నతనము మానుము ? మా
యన్న నినుఁ జన్మమునకు నరుదె మ్మనెఁ ? బి
ల్వన్నేను వచ్చితిని, రా
వన్నా ! బంధుగులు కయ్య మాడుట తెన్నా ?

సహ-- అది యతఁ డసమర్థతగాఁ బరిగణింపం బోలు !

పశు-- ఆ, మీరనినట్లే జరిగినది. అంత నతం డది పెడచెవినిఁ బెట్టి మీయన్నగారిపై శరపరంపరలు నిగుడ్చుచుం గవియుటయు నా నృపనందను శరమ్ముల వారించి కిరీటమ్ము మాత్ర మొక్కయమ్మునఁ గూలనేసిరఁట.

ధర్మ-- అంత నైన నతఁడు మరల లే దేమి ?

పశు-- అటుపై నేమి జరుగునో యని, మంత్రు లడ్డమై యారాకొమరుని యరదమ్ము వెనుకకుఁ బట్టించుటయ కాక శరణమ్ము వేఁడికొనిరఁట.

భీము-- మంత్రులు తెలివికలవారుగాఁ దోఁచుచున్నారు.

పశు-- పిమ్మట మీసోదరు లిట్లు పలికి రఁట.

ధర్మ-- ఎట్లు ?

పశు--ఆ. వె. అన్న సెలవు లేమి యట్లుండ మాయమ్మ
వంకఁ బుట్టినంటివారు వీరు
కాన నితని నేను గాంధారనృపపుత్రిఁ
దలఁచి విడుచు టెట్లుఁదప్పుదుసుఁడి !

ద్రౌప-- అవును. ఆయమ నిట్లు గౌరవింప వలసినదే.

ధర్మ-- ఇంతకును "కుశలముగా నున్నాఁ" డని చెప్పితివి, అంతే చాలును.

భీము-- అన్నా ! నాటకులవలనఁ జూచినయంశము నిక్కమే యగునా ?

ధర్మ-- నిక్కమే. కానిచో నతఁ డతని నంత "గౌరవముగాఁ" జూడుమని నొక్కి వక్కాణింపవలసి యుండదు.

నకు-- ఇప్పుడో, యింకనో అన్న రానే వచ్చుచున్నాఁడు. అన్నియును నతని వలననే తెలియఁగలవు.

(అంత నర్జునుఁడు ప్రవేశించును)

కృష్ణు-- (చూచి) అడుగో ! మీతమ్ముఁడు వచ్చినాఁడు.

ధర్మ-- (తత్తఱపాటుతో లేచి కవుఁగలించుకొని)

క. తమ్ముఁడ ! సేమమె గద దే
శమ్మునకు న్నీకుఁ ? ద్రోవ సంగ్రామములే
యెమ్మెయి నడిచెను ? నశ్వము
నెమ్మెయి మరలించితి ? వచియింపుమునెమ్మికన్.

సహ-- అన్నా ! నీ వితనిని ముందుగాఁ బుచ్చుటచే నింకను నెన్నాళ్ళకో కాని రావనుకొన్నారము.

అర్జు-- ఇతనితోడనే నేనును ద్వారకనుండిబయలుదేఱితిని. పిదప యుద్ధమ్ము లెక్కఁగను లేమింజేసి యితఁడు వచ్చునప్పటికే రాఁ గలిగితిని.

ధర్మ-- అంతకు మున్ను విశేషించి సంగరములు జరిగిన వేమి !

అర్జు-- జరిగినవి కాని,

క. నీయాజ్ఞం దల నిడికొని
యాయా దేశములనెల్లనశ్వమువెంటన్
బోయి యిట కేగుదెంచితి
నేయెడలను రాకొమరుల హింస యొనర్పక.

నకు-- అన్నా ! బభ్రువాహనుంగుఱించి యంతగాఁ జెప్పి పుచ్చితివేమి ?

అర్జు-- అతని పరాక్రమం “బిద మిత్థ” మని చెప్ప నాతరము గాదు.

ధర్మ-- అట్లయిన క్షేమము విన్నసంగతి యథార్థమే కావచ్చును.

అర్జు-- ఎట్లు వింటిరి ? నే నితనితో నాసంగతి విస్తరించి చెప్ప లేదే !

ధర్మ-- త్రికాలజ్ఞుఁడగు నొకకవి వ్రాసిన దృశ్య ప్రబంధమువలన నీశిరము నతఁడు దెగవేసినట్లును మరల సంజీవనమణిచే బ్రతికినట్లును గననయ్యె.

అర్జు-- ఇంతయును జరిగినమాట సత్యమే.

ద్రౌప-- నాథా ! ముందుగా మీరతని నేమంటిరి ?

అర్జు-- (సంశయించును)

కృష్ణు-- బావా ! సంశయ మెందుకు ? వీ రంతయు నెఱిఁగినదే, దానిని బుజావు చేసికొనుటకుఁ గాఁబోలును, అడుగుచున్నది.

అర్జు— మొదల నతఁడు తండ్రినెఱుఁగఁ జూపవలసిన యాచారమును వినయమును జూప నే నిట్లంటి.

తే. గీ. అడ్డఁ గలిగిన నశ్వముఁ బట్టవలయు
నంతియే కాని "కొమరుఁడ" నందు నమ్ము
టిదియు నొక రాచపాడియే యెఱుఁగఁ జెపుమ
"నాదుకొమరుండ" వనుటకు నమ్మనంటి.

ధర్మ— తమ్ముఁడా! యిప్పట్లమాత్రము నీవు తొందరపడితివి సుమీ!

క. "జనకుఁడ" వని నినుఁ జేర్మిక
గనవచ్చిన పుత్రుఁగాంచి కౌఁగిలియిడుటె
ల్లను బోయె నట్టులుంచుము
"తనయుఁడుగా" వనుట గొప్ప తప్పిదము సుమీ!

అర్జు— (తలవంచుకొని యూరకొనును)

కృష్ణ— (నవ్వుచు) ఇం దితని తప్పే మున్నది? కురువంశజుల కిదియొక యపూర్వముగాదు.

క. భరతుని దుష్యంతుఁడు కొ
మరుఁడని యెఱిఁగియును జేర్మి మన్నింపక పె
క్కురు గల సభ నవమానము
పఱుపఁడె తన జనని వెంట వచ్చినవానిన్.?

ద్రౌప—(చిఱునవ్వుతో) అనుట కవకాశము గలుగుటంబట్టి కదా యను చున్నావు?

ధర్మ— ఇంతకును నిర్భాగ్యనీలోపము కాదు. శాపవశమున నీకట్టిబుద్ధి యనివార్యమై కలిగియుండును. (కృష్ణునుద్దేశించి) బావా! నాతమ్ముని కెప్పుడును నాకతన దుఃఖమే గాని సుఖము లేక పోయెఁ గదా!

కృష్ణ-- ధర్మనందనా! ఎందుల కీయసమయనిర్వేదము! ఇది యీతని లక్షణముల యందలి దోషమే కాని నీదోషము గాదు.

ధర్మ-- గీ. అన్నిరేఖలు మహారాజ చిహ్నములె కాని
యేదెసను నీతనికి దోసఁ గింత లేదు
కష్టమే తప్ప నకట సుఖ మెన్నఁడుంగఁ
డిప్పటి కదేమి హేతువో? యెఱుఁగఁ జెపుమ!

కృష్ణ— ఈతని కష్టమునకే కాదు, యావత్కుటుంబకష్టమునకును గారణముగు దోస మొక్కటి సర్వలక్షణలక్షితుండగు నితనియందుఁ జంద్రునకుఁ గళంకమువలె నున్నయది.

ధర్మ— అది యెయ్యది?

కృష్ణ-- ఆ. వె. అర్నియనయనమ్ము లతురూపములె యయ్యు
నూరు లించుకంత యూరువు లితని
కక్కఁతమున నిట్టి యాపత్తు లబ్బె మీ
కెల్లఁ గనుము దీని నెఱుఁగు మధిప!

ధర్మ-- ఇది సాముద్రికశాస్త్రదోషము. దీని కేదేని యుపశాంతి యుండదా!

కృష్ణ-- ఇది యిదివఱకే యనుభవముచేఁ దీఱిపోయినది. అయినను సర్వదోషహరంబగు నశ్వమేధమును గావించుచునే యుంటివి. ఇఁక విచారమెందుకు?

(అంత ధౌమ్యులు ప్రవేశించును.)

ధౌమ్య— క. మును లెల్లరు విచ్చేసిరి
జననాథతనూజులెల్లఁ జనుదెంచిరి యిం
దున కేర్పఱచిన యుల దిన
మును దాదాఁపయ్యె దీక్షఁ బూనుము నృపతీ!

తే. గీ. వేదఘోషమ్ము పురమెల్ల విస్తరించె
రాజరథఘోషములు పూరిఁ దేజరిల్లె
నందఱును నీదు నభివృద్ధి నాత్మఁ గోరి
యున్నవా రింతకును మోదముండు నొక్కొ!

ధర్మ— పరమసంతోషము. ఇదియంతయును దమ యాశీఃప్రభావమును, నియ్యనఘుని దయయును.

కృష్ణ— నీ యదృష్టమును నీతమ్ముల భాగ్యరేఖయును.

చ. అరుల జయించి రాజ్యరమ నందితి; వంతియకాక యన్వయాం
కుర మది నిల్చెఁ దమ్ముఁడును గొప్పవిపత్తు తరించె; ధారుణిం
దిరిగి తురంగమమ్ము నగుదెంచె; మునిప్రవరుల్ ద్వితీయమ
ధ్వరము లిరమ్ముగా జరుప వచ్చిరి నిచ్చలు మోద మందుచున్.

ధౌమ్య— రాజా! నీ కింతకన్న నేమి ప్రియము గావలెను? అయిన నట్లుఁ గాక!

## భరతవాక్యము

తే. గీ. వేదశాస్త్రమ్ములందును విప్రులందు
గోవులందును సజ్జన కోటియందుఁ
బ్రజల కత్యంతసద్భక్తి ప్రబలుఁ గాక!
క్షామ మడుగంటుఁ గాక! సౌఖ్యమగుఁ గాక!

మఱియు,

క. మది ముదమున నెల్ల జనులు
స్వదేశ రాజులను వారి వర్తనలును నె
మ్మది కెక్కఁ జేసికొని స
త్పదమున వర్తింత్రుగాక! పరమాత్మకృపన్.

## గద్య

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి బాలసరస్వతీశతావధాని తిరుపతివేంకటేశ్వరవిరచితంబైన పాండవాశ్వమేధమ్మనందు సర్వంబును షష్ఠాంకము.

# తప్పొప్పుల పట్టిక

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 5 | 17 | గెడ | కెడ |
| 10 | 17 | మూర్ధా | ర్ధామా |
| 13 | 16 | గర్ణ | కర్ణ |
| 26 | 10 | చ్చిను | చ్చిన |
| 29 | 3 | క్రొంతఁది | క్రొంతఁదీ |
| 32 | 12 | రిఁజూ | రిజూ |
| 33 | 10 | నన్‌నరు | నన్నరు |
| 53 | 21 | యథము | యపథము |
| 56 | 19 | యాతి | యని |
| 64 | 14 | గొదువ | గొదవ |
| 65 | 9 | యుంతా | యుఁదా |
| 64 | 26 | వెఁదు | వెందు |
| 66 | 3 | శిక్రి | శక్రి |
| 66 | 20 | నేఁడి | నేడి |
| 70 | 13 | దఁప | దపు |
| 72 | 7 | క్రొదు | క్రొద |
| 74 | 11 | బురు | బుర |
| 93 | 31 | కితే | కిఁదే |
| 95 | 6 | అదు | అది |
| 100 | 5 | నామ్మృ | నాతమ్మృ |

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# ప్రభావతీప్రద్యుమ్నము

# ఇందు వచ్చు పాత్రములు

ప్రథమాంకము.

1 సూత్రధారుఁడు
2 నటి
3 రంభ
4 నారదుఁడు
5 ప్రభావతి
6 చెలికత్తెలు
7 రాయంచ

ద్వితీయాంకము.

1 శుచిముఖి
2 పరిచారకుఁడు
3 శ్రీకృష్ణుఁడు
4 కృష్ణుని భార్యలు
5 మంజువాణి
6 ప్రద్యుమ్నుఁడు
7 గౌతముఁడు

తృతీయాంకము.

1 నారదుఁడు
2 పరిచారిక
3 ప్రభావతి
4 చంద్రవతి
5 గుణవతి
6 కొందఱుకన్నెలు
7 రంభ
8 ఊర్వశి
9 దౌవారికుఁడు
10 వజ్రనాభుఁడు
11 పరివారము
12 శుచిముఖి

చతుర్థాంకము.

1 సూత్రధారుఁడు
2 చెలికత్తె
3 రాక్షోమిర
4 వజ్రనాభుఁడు
5 సునాభుఁడు
6 భరతాచార్యులు.
7 మంత్రి
8 దౌవారికుఁడు

పంచమాంకము.

1 శ్రీకృష్ణుఁడు
2 ఇంద్రుఁడు
3 ప్రద్యుమ్నుఁడు
4 గదుఁడు
5 సాంబుఁడు
6 శుచిముఖి
7 ప్రభావతి
8 గుణవతి
9 చంద్రవతి
10 ప్రభావంతుఁడు
11 చంద్రప్రభుఁడు
12 గుణవంతుఁడు
13 కీర్తిమంతుఁడు

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# ప్రభావతీ ప్రద్యుమ్నము

## ప్ర థ మా ం క ము

### నాంది

శా. శ్రీరామామణి రుక్మిణీవనితయై సేవింపఁ బూవిల్తుఁడుఁ
గారామైన కుమారుఁడై ప్రమదముం గావింప ద్వారావతిం
జేరై రాక్షసఖండనక్రియ పయిం బ్రేమించు కృష్ణుండు మీ
ప్రారంభంబుల కెల్లవేళల శుభప్రాచుర్య మిచ్చుం గృపన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు పుష్పాంజలి యిచ్చి)

అతిప్రతిభావతియగు మతియును ప్రబవృద్ధంబగు ద్యుమ్నంబును గల యీ సభాసదులారా! నేఁడు మా నటిని మా రాజహంసిని నొక కార్యంబు నకై పంపితిని. భవదభీప్సితనాటకావతరణంబునకై కొంతతడవు సైరింప వలయు. ఆమె వచ్చునదియుమైనది.

(తెరవంకఁ జూచి) ఆర్యా! ఆర్యా!

నటి— (ప్రవేశించి) ఆర్యపుత్ర! ఇదె వచ్చితిని.

సూత్ర— ఆర్యా! ఏల తడసి వచ్చితివి? నాటకావలోకంబునకై వచ్చిన సభాసదుల నింత తడ వూరక కూర్చుండ నీయవచ్చునా? మనము నాటక ప్రదర్శనంబునఁ బేరు మోసినవారమనియు నటవిద్యాపారంగతురాలవగు నీవంటినటి యీసమాజము నందున్నదనియుఁ బ్రేక్షకులు పెక్కుదిక్కుల నుండి చనుదెంచిరి. అదియునుఁగాక,

చ. యవనిక లెల్ల క్రొత్తవి నటాదికు లందఱుఁ బ్రాఁతవారు రాం
కవములు భూషణంబులు ధగద్ధగితప్రభలీనుచుండె నీ
భవనము సుందరంబు మృదువాయువశంవదమాట దర్శన
శ్రవణభవశ్రమం బెడలి సభ్యులయుల్లము పల్లవించెడున్.

నటి— ఆర్యపుత్రా! మనము నేఁడు ప్రదర్శింపఁబోవు నాటకమేది? ఎవరిది

సూత్ర— క. శ్రీరావు రామయాంబిక
స్త్రీరత్నము కీర్తికాంత దిక్కుల కాలం
కారికయగుచుఁగాత సదా
పేరైన కవీంద్రు లెపుడు వినుతి యొనర్పన్.

అని యాశీర్వదించి యామె కభ్యుదయ పరంపరాభివృద్ధిగ శతావధానులు, తిరుపతి వేంకటేశ్వరులు రచించిన ప్రభావతీప్రద్యుమ్న నాటకమే నేఁడు మనము ప్రదర్శింపఁ బోవునది.

నటి— ఆర్యపుత్ర! తిరుపతి వేంకటేశ్వరులు సుప్రసిద్ధులే. ఆంధ్రప్రపంచంబున వారి పేరెఱుంగని పట్టణముగాని జనపదముగాని లేదు. ఈ స్త్రీరత్నమెవరు?

సూత్ర— ఈమెయు సుప్రసిద్ధురాలే!

క. కోలంక వీరవరముల
నేలు జమీందారురాలు హితమతితో నేఁ
డాలంబమగుచుఁ గవికు
తీ్కలుం బోషింపుచుండెఁ దిరుపతిశాస్త్రిన్.

నటి— ఇంతకుమున్న వారి నాటకములు కొన్నింటియందుఁ గృష్ణభూపాలుని పేరు వినఁబడుచున్నదే?

సూత్ర— అవును.

చ. తిరుపతివేంకటేశ్వరసుధీకవితల్లజులందు నొక్కనిన్
దిరుపతిశాస్త్రి నెంతయుఁ బదింబదిగాఁ బదునెన్మిదేండ్లు న
బ్బురముగఁ జెంత నిల్పుకొనెఁ బోలవరక్షితినేత కృష్ణరా
వరమర లేని మేటిసఖుఁడై పొరపొచ్చెము లేక యుండఁగన్.

చ. వరమపదించె నాశ్రితుల పాలిటి కల్పకమైన కృష్ణభూ
వరుఁ డనపత్యుఁడై పిదపఁ బత్ని వహించెఁదదాధిపత్యముం
దిరుపతిశాస్త్రిపోషణ మనిందితశీలను బాల కామెకున్
భర మనిపింపఁగా, వదలివైచెఁ గవీంద్రుఁడు తత్పరిస్థితుల్.

నటి— అదియును న్యాయ్యమే.

గీ. కవిత నర్చించు సుకవిపుంగవుల కేటి
కకట నిర్గంధకుసుమంబు లగు నృపతులు
మాధవీఫల మాలికల్ మమతఁ దాల్చు
వనచరుల కేల యగసాలెవాని పనులు.

సూత్ర— ఆర్యా! ప్రసంగవశమునఁ గథాముఖము విస్తరించుచున్నది. కావునఁ బ్రకృత మనుసరింతము.

నటి— ప్రస్తుతము నేఁ జేయవలసిన దేది?

సూత్ర— ఏమున్నది! నాటకానుగుణం బగు వసంతర్తువుం గూర్చి నీ గాన చాతుర్యమును నృత్యసౌకర్యమును జూపించుము.

నటి— వానికేమి, చేఁతనైన పనులేగదా.

గీ. పాట పాడెద నూర్వశి వచ్చినట్లు
రంభకైనను తలవంపు రా నటింతు
ముందు సంగీతకము నృత్యమును సభాస
దులకుఁ గావలె మచ్చుమందులు నటేంద్ర!

(తెరలో)

అయ్యో, యెంత దుష్కాలము వచ్చినది! దురాత్ముం డగు వజ్ర నాభుం డప్సరలనెల్లఁ గ్రొచ్చెఱలపాలు గావించిన కతంబున మా సాధ నంబులు మూలఁబడినవి.

"పాట పాడెద నూర్వశి వచ్చినట్లు
రంభకైనను తలవంపు రా నటింతు"

అను మనుజ స్త్రీల వచనములు వినవలసివచ్చె. "చింత చచ్చినను పులుసు చావ" దనునట్లు మే మెంత నిర్వ్యాపారల మైనను గాంధర్వ మందైన మనుజ స్త్రీల నతిశయింపలేకపోదుమా?

సూత్ర— ఆర్యా! వజ్రనాభునిచేఁ గారాగారమునం దుంపఁ బడియుఁ గార ణాంతరమున విడువఁబడిన రంభ నీ వచనంబులకుం గినిసి వచ్చుచున్నట్లు తోఁచుచున్నది. మన మిందు నిలుచుట కర్జంబు గాదు. పోదము రా.

(నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

(పిదప సకరుణావస్థ యగు రంభ ప్రవేశించును)

రంభ— కృతాంతకృతాంతుం డగు వజ్రనాభుం డీ వేళ నే బాలిమీఁద నుం డెనో గాని పోఁతుటీగకుం జొరరాని యంతిపురంబున నున్న తన కూర్మి పుత్రి ప్రభావతికి సంగీతము నేర్పుమని నన్నని పె. ఆ ప్రభావతియు నేదియో మనంబునం బొడమిన విచారమున ఖిన్నయగుచు నుపవనక్రీడా వినోదంబునం బొదలకెంచి నన్ను నేఁటికిం బొమ్మనియె. నేనును మత్ప్రాణపదం బగు నలకూబరుం జూడమిఁ గన్నులు వాఁచియున్నదానఁ

గాన నీ యవకాశంబున దేవతా సాక్ష్యం బగు నాకాశగమనంబునం బోవుచు నటనటీ సంభాషణంబు లాలించి యిందు నిలిచితి. (నలు దిక్కులు గలయఁ జూచి) కలహాశనముని కాఁబోలు నీ దెసనుండి చను దెంచు చున్నాఁడు. (సమీపించి) మహాత్మా, నారదా! నమస్కారము. నేను దేవవేశ్య నగు రంభను.

నార— నీ యౌవనం బక్షయం బగుఁగాక!

రంభ— దేవ! యేటికి కీ యాశీర్వచనము? ఈ యక్షయ యౌవనమే మ మ్మిట్టి దుర్భిక్షుల్మ పాలు సేసినది.

నార— వజ్రనాభుని చెఱ మీకును దటస్థించెనా యేమి?

రంభ— మాకే తటస్థించెను.

ఉ. అందము నిశ్చలం బగు కడింది తపంబున రాక్షసాధము
లందరకాని నా వెడఁగుఁ దాతను బ్రీతు నొనర్చి స్వర్గ మే
లం దగుపాటి మే ల్వరములం గొనుచుం దయచేయుచుంద్రు మ
మ్మందుగ నప్సరోంగనల పుట్టి మునుంగుఁ జుమీ మునీశ్వరా!

చ. బ్రతుకఁ దలంప కొక్కఁడు పర ప్రమదం జెఱవెట్టె నేని స
న్మతిగలవారు తాద్వృశులు మానిని మానము గావ నెంతు రా
యతివయు శాప మీఁదగిన యంతటి శక్తియుఁ గల్గియుండు నే
మతిఁ బతికించినం బయి సిమాలిన జన్మము లంజ జన్మమే.

నార— రంభా! విచారింపకు, విచారింపకు. నీ కష్టంబులు కొలఁది కాలం బులో గట్టెక్కఁగలవు.

రంభ— ఆ ప్రయత్నముఁ జేయు మహానుభావుఁ డెవరు?

నార— దుష్టశిక్షకొఱకవతరించి ద్వారవతీపుర మేలుచున్న వాసుదేవుండు.

రంభ— ఈ దురాచారి బారి శ్రీశాఖికిం గూడఁ దగిలెనా యేమి?

నార— లేదు లేదు. కాని యార్తపాలనకళాకోమలమానసారవిందుం డగు నా గోవిందుని పాలికిం బోయి మన రాజు తన యవస్థ లన్నియు విన్నవించు కొనియెను.

రంభ— ఇంతవఱకు వచ్చినం గాని మన మహారాజు తగిన ప్రయత్నముఁ గావిం పఁడు. మునీంద్రా! నేఁడా వజ్రనాభుండు తన బలమును స్వర్గమునందే విడియించెనఁటగదా?

నార— అవునవును. వాఁడును స్వర్గమునందే యున్నవాఁడు.

గంధ— మన మహారాజుగా రెందున్నారు ?

వార— వాసుదేవుని యానతిచే సమయనిరీక్షాతత్పరుఁడై పులోమనందనతోఁ గూడ నెందో యొక గిరికందరంబున డాఁగియుండె. మేమందఱ మిటు లోక సంచారమునకై వెడలితిమి.

సీ. కల్పవృక్షముల శాఖలయందుఁ బలుమాంస
ఖండము ల్వ్రేలాడఁ గట్టినారు
మందాకినీవారి యందున్న సౌవర్ణ
కమలము ల్త్రోయించి కలఁచినారు
పురుహూతుఁ డెపుడు కాఁపురముండు పెద్దమే
డ లాసంగినారు లంజలకు విడిది
యమరావతికి ముఖ్యమైన యా పెనుకోట
బురుజులన్నియు క్రిందు పడిచినారు

గీ. మద్యపాయులు సతతదుర్మార్గ నిరతు
లగ్రిరాములు కొఱకచ్చు లక్కుపతులు
లింగిలాయలు కొంటె కోణంగులైన
యా దురాత్ముని భటులు దురాగ్రహమున.

సీ. మాయింటి కంపించుమా యూర్వశి నటంచు
నొక రాక్షసుఁడు తన కుబుసు పంప
నొక శరాత్ముండు కల్పకములు గోయించి
కల్లుపంపుమటంచుఁ గబురుసేయ
మందాకినిఁ జరించు మగరాజయాంచల
మాంసంబు నొకదురాత్మకుఁడు గోర
కామధేనువృషాలు కాఁచి పంపుమటంచుఁ
జిదుముపోతొక్కండు చీటి వ్రాయ

గీ. నెట్టిగావింపలేక నా యట్టివాని
కేటికి లభించె నీమాయయిం డ్రపదవి
యంచు రోయుచుఁ బాకారి యతివ మాట
మోచికొనిరాఁగ నెచటికో లేచిపోయెను.

గంధ— మహాత్మా ! మత్ప్రాణప్రియుండగు నలకూబరుం డెందేనిఁ ద్రిలోక సంచారివగు నీ దృష్టిపథంబునం బడలేదుగదా ?

నార— నలకూబరుఁడా !

ఉ. ఆ బలభిన్నికేతనము లన్నియుఁ బాడుపడంగఁ జేసి గా
రాబము కల్గునందనము రాణయు గాణ యొనర్చినట్టి బా
హాబలశాలికిం దగనిదా యిది! యిప్పుడు వానితేరికిం
గూబరరక్షకుండు నలకూబరుఁడే సుమి యంబుజాననా !

రంభ— కటకటా ! రాజరాజకుమార, కుసుమపేశలశరీర ! (డిల్లఁబోయి) ఓసీ
మాల దైవము !

చ. అనితరపారవశ్యమయమైన మనంబున నన్ను నే నెఱుం
గని తమివేళఁదప్పఁ గసుగందునొకో యని బిగ్గకౌఁగిలిం
తను దనయంగకంబులకుఁ దార్చు టెఱుంగని రాజరాజపు
త్త్రుని బలలాశిపాలఁ బడఁ ద్రోచితివే యరదంబుఁ బ్రోవఁగన్.

(మూర్ఛిల్లును)

నార— రంభా ! ఊఱడిల్లు మూఱడిల్లుము. (తనలో) ఏమీ, యీరంభ కా
నలకూబరునియందున్న యనురాగాతిశయము !

క. వెలవెలఁదుల కొక్కని దెస
వలపు నిలువదనుట యింకఁబై బొంకనుకో
వలయు న్నలకూబరుపై
వెలలేమకుఁ దనరునెనరు వెలలేకునికిన్.

రంభ— (మూర్ఛఁదెలిసి) ఈ దురాత్ముండు నీతండ్రియిచ్చిన వరంబు పెంపున
నింతగా వేఁచుచున్నాఁడు. వాని యానతిలేకుండ వాయువునకైనఁ
దత్పురంబు చొరరాదఁట ! వీని చావునకై మీవంటివా రేదేని యొక
యుపాయ మాలోచింపకున్న మావంటి యనదలకు దిక్కెవ్వరు ?

నార— దేవేంద్రప్రేరితుండై వాసుదేవుం డీప్రయత్నము చేయనున్నాఁడని
తెలిపితిఁగదా ! నేనును నయ్యాదునందను ప్రోత్సాహమునకై యాప
ద్వారక యగు ద్వారకకే పోవుచున్నవాఁడ.

రంభ— మహాత్మా ! ఏనును నుపవనక్రీడావినోదంబు చాలించి యింటి
కేతెంచు ప్రభావతిపాలికిం బోయెద. మీరును వాసుదేవుని దర్శించి
కర్తవ్యం బరపి రండు. (ఇరువురు నిష్క్రమింతురు )

ఇది విష్కంభము.

(పిదప నుపవనక్రీడావిహారంబు చాలించి కూర్చున్న ప్రభావతి, చెలులు ప్రవేశింతురు.)

ప్రథ— ప్రభావతీ! యీ బాలాశోకపాదప మెంత చక్కఁగా నున్నదో చూడుము.

ద్వితీ— ఈమాధవీలత దీని మీఁదికిం బ్రాఁకించిన మఱింత బాగుండును.

ప్రభా— చెలులారా! మీవచనంబులు నాచెవులకుం జవులు దేకున్నవి.

ప్రథ— ఏమమ్మా, యట్లు మాటాడుచున్నావు?

ద్వితీ— (జనాంతికముగా) చంద్రముఖీ! ఏమోకాని మన ప్రభావతి యుదయమునుండియు ఖిన్నయగుచుఁ గన్పట్టుచున్నది. తండ్రియానతింజేసి సంగీతము నేర్పవచ్చిన రంభ నావలకుం బొమ్మనియె. 'అక్కా అక్కా' యని పిలుచు రాచిలుకకు మాఱు వలుకదాయె. చంద్రవతీ గుణవతులాటలకు రమ్మనిన మాటాడదయ్యె. మన మాటలు రుచింపకున్నవఁట! ఇవన్నియుఁ జూడ నీయమ్మ మనం బేదియో దీర్ఘాలోచనంబుఁ జేయుచున్నటులు తోఁచుచున్నది.

ద్వితీ— పద్మముఖీ! ఏ యాలోచనమైనను మనకు దాఁచునది కాదే! అయినను బ్రస్తావింతము.

ప్రథ— చెలీ! మా మాట లంత రుచింపకుండుటకు మేము చేసిన యపరాధమేమి? నీ ముఖవిలాసము నేఁడు వేఱుగాఁ గన్పించుచున్నది. నీరూపంబు విన్నఁదనంబు సూచించుచున్నది.

ద్వితీ— పద్మముఖీ!

క. ఈ వితము జూడ మనచెలి
భావం బల తుంటవింటివాని కతలకుం
దానైన దనుచుఁ దోఁచుం
గావున నిదియేమొ? మనము గనుఁగొనవలయున్.

ప్రథ— చెలీ! యిది పట్టి పిచ్చిమాట సుమీ.

చ. తరుణిపయిన్ మరుండు తన దర్పముఁ జూపఁ దలంచెనేని నుం
దరుఁ గనిపింపఁగావలెఁ గదా! యది యేగతిఁ గల్గు? చీమకేన్
జొరఁగ నశక్య మీపురము చోటికి రాజు ననుజ్ఞ లేక; యె
వ్వరు మనమున్నతావునకు వచ్చిరి రానుత నిట్లుచేయఁగన్?

ద్వితీ— చెలీ! నాయూహ పిచ్చియూహ కాదు.

చ. లలితములైన చెక్కుల విలాసము బూడిద ప్రబ్బుసెట్లుగా
వెలవెలబాఱఁగాఁ దొడఁగె వీక్షణపంక్తులయందుఁ బేలవం
బలసతయుం జనించె బిగియైన చనుంగవయందు సుంత శై
థిలి జనియించె నీయవి రతిప్రియచేష్టలు చువ్వె కోమలీ!

ప్రభ— అయినచో నాయడిగిన ప్రశ్నకు సమాధానమేమి ?

ద్వితీ— సమాధానము లేకేమి ?

మ. కలలోఁ జూడఁగవచ్చు సుందరతరాకారుం దదాకార మి
య్యిలలో నుండఁగవచ్చు మానసమునం దేర్పాటుకావచ్చు ని
శ్చలభావీకృతభావనాబలము మై సాధ్యస్వరూపంబు కో
మలి! తొల్లింటి పురాణముల్ వినవె? యీమార్గంబులుం గ్రొత్తవే ?

గీ. నలమహారాజు నిద్రలోపలనె మున్ను
భీమతనయకుఁ గన్పించెఁ గోమలాంగి
యతని రూపంబు మది హత్తి యతనుబాధ
కగ్గమై యాతని వివాహమాడెఁ దుదకు.

ప్రభ— ఏటి కుయ్యాలలోని పిల్ల కూరంతయు నెదకుట ?

ప్రభా— చెలులారా ! యేమేమో గుసగుసలాడుచున్నారు. నాతోఁగూడ రవంత చెప్పరాదా ?

చెలులు— మే మడిగినమాట నీవు చెప్పితివి కాఁబోలు !

ప్రభా— మీకుఁ జెప్పనిదాననే యనుకొంటిరా ?

చెలులు— పట్టిమాటలతో నేమి ప్రయోజనము?

ప్రభా— సుందరంబగు నీగురివింద పందిరిక్రిందఁ గూర్చుందము రండు.

(అందఱు గురివింద పందిరిక్రిందఁ గూర్చుందురు.)

ప్రభా— చెలులారా ! ఈ పొదరింటి చుట్టుపట్ల నెవ్వరును లేరుకద.

చెలు— మన యంతఃపురారామసరోవరంబున కలంకారంబుగా మీ తండ్రి మొదలుగొని యనుదినంబు వచ్చుచున్న హంసమిథునంబులు తప్ప నెవ్వరును లేరు.

ప్రభా— ఈ రాయంచలయందుఁ గొన్ని కామరూపంబులై మాటలాడ నేర్చిన వుండును జుమీ !

ప్రభ— చెలీ ! ఈదెసకుఁ జూడు. మన మిందఱమున్నను నా దుండగపుఁ దుమ్మెద నిర్భయముగాఁ బూగుత్తిమీఁద వ్రాలి యెట్లు తన్మకరంద పానముఁ జేయుచున్నదో !

ద్వితీ— పద్మముఖీ! ప్రస్తుత ప్రసంగము మాని యితర ప్రసంగముఁ గావించెదవేలే?

ప్రభా— చెలులారా! వినుండు. ఈనాఁటి వేకువ నాకొక కలవచ్చినది. అది తలంచుకొనిన నాకే మిగుల నాశ్చర్య మొదవుచున్నది. అందుఁ గొంత కల్ల, కొంత నిజము. (సిగ్గుపడి యూరకుండును.)

తృతీ— (జనాంతికముగ) చెలీ! నాపల్కుల కవతారిక బయలుదేరుచున్నది.

ప్రథ— ప్రభావతీ! తరువాత నూరకొంటివేమి?

క. చెలులార, వినరుగా యని
కల సంగతి తెలుపుదాని గతి మొదలిడియుం
బలుకక సిగ్గిలుచుంటివి
చెలులయెడం దగునె యిట్టి చెయ్వులు చెలియా!

క. ఒట్టిడుకొంటిమిగద మన
మెట్టి రహస్యములు దాఁచు టెఱుఁగమికిఁ? రా
పట్టివి గావున నన్నృతము
వట్టినను జెల్లు నీకుఁ బర్వేందుముఖీ!

ప్రభా— చెలులారా! సిగ్గుగాదు. మీకుఁ జెప్పకుండవలయుననియుఁ గాదు. ఎకసక్కెముఁ గావింతురేమో యని యూరకుంటిని.

చెలు— చెలీ! ఇంత దారుణముండునా! నిన్ను మేము వేళాకోళముచేసెదమా!

ప్రభా— (లజ్జా సంతోషములతో) నెచ్చెలులార!

చ. వలిమలరాచబిడ్డ కల వచ్చి మొగంబున లేఁతలేఁత న
వ్వొలయఁ "బ్రభావతీ" యని మృదూక్తులచే నను లేపి "నీకు నీ
కులుకుల కందచందములకుం దగు చక్కనివాని నొక్కనిం
జెలువుని వ్రాసి తెచ్చితిని జిత్రమునం" దని చూపెఁ జూపినన్.

నేనును ముదితాంతరంగంబుతోఁ జిత్రగతంబగు నా దివ్య సుందర విగ్రహంబుఁ దనివితీరఁ గాంచుచుఁ దదీయ కులగోత్రనామంబు లెఱుంగక వెఱంగుపాటుతో వాగగోచరం బగు నానందమూర్ఛం జెందితి.

ప్రథ— నిద్రయే మూర్ఛ! అందు నిది యొక యవాంతరమూర్ఛ కాఁబోలు! తరువాతఁ, దరువాత?

ప్రభా— తరువాత నో చెలులారా! నాకు మూర్ఛ తేఱుటయు, నిద్ర తీఱుటయుఁ, దెల్లవాఱుటయు నేక కాలంబునం దటస్థింప నే నా నగరాజకుమారిం గానక యెదుట నున్న చిత్రఫలకము మాత్రము గాంచితిని.

ప్రథ— ప్రభావతీ! ఇది మిగులఁ జిత్రముగా నున్నది.

చ. కలలు శుభాశుభంబు లవఁగాఁ గనఁగాఁదగుఁ గాని నిద్రలోఁ
పలఁ గలలోఁ గనుంగొనిన వస్తువు లుండుటఁ జూడ నంబికా
నలినదళాక్షి నిక్కము కనంబడి నీ కిది యిచ్చి పోయె న
క్కలిఁ, గలఁగాఁగ నీ నవధరించితివేమొ ? భ్రమించి నెచ్చెలీ !

ప్రభా— అంత తెలియనిదాన ననుకొంటిరా యేమి ! కాక భ్రమకుఁ గారణ మేమున్నది ?

ప్రభ— అటులేని నగరాజకుమారికకు నీయందలి వాత్సల్యమే కారణము.

ద్వితీ— చిత్రఫలక మిచ్చి యంతర్ధాన మాయెనా ? లేక నీతో నేవేని కొన్ని మాటలు మాటాడెనా ?

ప్రభా— ముఖ్యముగ నీ మూఁడు మాటలు మాటాడె. "ఇప్పుణ్యపురుషుని కుల గోత్ర నామాదులు నీ కచిరకాలంబుననే తెలియఁగలవు. ఇతండ నీమనో హరవిలాససౌభాగ్యములకుం దగిన పెనిమిటి. ఇతని వలన నీకుం బొడ మిన కుమారుఁ డీ వజ్రపురం బేలు" నని.

ప్రభ— చెలీ ! ఈవృత్తాంతము వజ్రనాభునికిం దెలిసిన మన మానప్రాణంబులు దక్కవు సుమీ !

ద్వితీ— కావున రహస్య మతి జాగ్రత్తగాఁ గాపాడవలయు.

ప్రభ— తాతకు దగ్గులు నేర్పెదవా యేమి ?

ద్వితీ— ప్రభావతీ ! ఆ చిత్రఫలక మేది ? చూపెదవా ?

ప్రభా— ఉదయంబునన లేచి యెవ్వరికిని దెలియకుండ సుందరంబగు నీమాధవీ లతా మందిరంబునం దాఁచితి. (పల్లవాంతరితమగు చిత్రఫలకముం దీసి చూపించును.)

చెలులు— (చిత్రముం బరికించి)

సీ. మాటాడ నుంకించు మాడ్కి సుందర మంద
హాసంబు మోవిపై నమరునట్లు
రక్తరేఖా సుందరములైన కందమ్మి
యంచులు కరుణ చిందించునట్లు
ఆజానులంబంబులైన బాహువులఁ గాఁ
త్యాపగాఝరులుపొటాడునట్లు
కవ విశాల వక్షః ప్రదేశమున మ
హాలక్ష్మి తాండవం బాడునట్లు

గీ. ప్రణయకళ యుట్టిపడునట్లు వ్రాయఁబడియె
నదిర ! యిది యున్నరూపమో, యుదయమాన
చిత్రకారకచిత్తపవిత్రభావ
భావితాకారమో, యెంతవట్టు నిజమొ ?

ప్రభా— చెలులారా ! నాకు నీ సంశయమే కలదు. కాని నా మనంబున సంకల్పవికల్పంబులు పొడముచున్నవి.

సీ. ఉన్నరూపము వ్రాయకున్న నసందర్భ
మిచ్చోట నీ పుట్టుమచ్చ వ్రాఁత
బ్రహ్మచేత సృజింపఁబడని చక్కని రూపు
శివ యేల తెచ్చి నా చేతి కిచ్చు
ఏతాదృశస్వరూపాతిశయంబు సృ
జించుట ధాతకుఁ జేఁతనగునె
అయెఁ బో, యేతాదృశాకృతి కనువైన
స్త్రీస్వరూపంబు సృజింపవలదె

గీ. యనుచు డోలాయితం బౌచు నంతరంబు
నిర్వికల్పసమాధినిర్నిద్ర మగుచు
నుండ కేమంచుఁ దలపోయుఁ జండికావ
చోరచన దప్పనే యనుచుం దలంచు.

ప్రభ— చెలీ ! నీ వికల్పములలో నొక్కటిమాత్ర మనుచితము.

క. నీవంటి యువిద సృష్టిం
గావించిన ధాత మున్నె కావింపఁడొకో
తావకభావుకలీలా
సౌవర్చసయోగ్య నొక్క చక్కనివానిన్.

ప్రభా— చంద్రముఖీ ! నీయూహ నాయందలి సౌహార్దమునకుఁ దగినదేగాని సత్యమునకు మాత్రము దూరము.

సీ. ఈమోహనాంగుని కోమలాధర మాను
యోగ్యత కలదె మదోష్ఠమునకు
ఈమనోహరుఁడు నే నే కాంతముగఁ జాటు
కారంబు సలుపు భాగ్యంబు గలదె
ఈభోగి పర్యంకభూభాగమున నుండఁ
దగునె మీచెలియ సౌందర్యగరిమ

నా మేని కున్న దే యీ మేటి మేటికాఁ
గిలిలోన సుఖియింపఁ గల యదృష్ట

గీ. మీమనోభవుఁ డేడ, నే నేడ! మొట్ట
మొదట నీదృశ సౌందర్యమునకు నాకు
నమ్మకము లేక యున్నది నెమ్మనంబు
పాఱుతెంచునొకో రిత్త కోరికలకు.

ద్వితీ— ప్రభావతీ ! నామాట వినుము. నీ మనోరథంబు నిరంకుశ ప్రచారంబుగాని రిక్తంబు గాదు.

చ. శివ లిఖియించి నీకిడిన చెల్వుఁడు లోకములోన లేనివాఁ
డవునె ! విచారమేటికిఁ దదన్వయనామనివాసభూము ల
వ్యవధిగ నీకునుం దెలియునంచు వచింపదె ! లేకయున్నచోఁ
జివచివ వచ్చి చిత్రమును జేతి కొసంగిన లాభ మున్నదే ?

ప్రథ— నాకును నాయాలోచనమే యున్నది.

ప్రభా— అఘటనఘటనాసమర్థురాలగు పరమేశ్వరియే చేయవలయుఁ గాని యిప్పని యన్యుల కసాధ్యము.

క. నా తండ్రిమొదల లేనిది
వాతార్భకుఁడేని పురము వంకకుఁ దానై
యే తెర నేరఁ డాతని
యాతతశాసనము దాఁటనగు నెవ్వరికిన్ ?

ప్రథ— (నాల్గుదెసలుఁ బరికించి) ప్రభావతీ ! ఆ యంచమగువ మనమాటలు వినుచు మనలఁ గనుచు నేదో ప్రత్యుత్తర మీఁదలంచినదానివలెఁ గన్పించుచున్నది, చూచితివా ?

ప్రభా— అంచలలోఁ గొన్ని మాటలాడ నేర్చిన వుండునని నే నంటినిగదా! ఇది యాజాతిలోని దేమో ?

ప్రథ— ఇది మాటలాడ నేర్చినచో మన ప్రయత్నమునకుఁ గొంత తోడగును.

ద్వితీ— అవును. ఇవి మందాకినీతరంగడోలావిహారము సలుపు రాయంచలు. భవజ్జనకసైనికు లచటి కనకనలినీకందంబులన్నియుఁ బెల్లగించి మన క్రీడాజలాశయంబునందు నాటుటచేఁ దిండికేక మీ తండ్రియానతి నిందు సుఖాహారంబుఁ గొనుచు విహారంబు సల్పుచున్నవి.

ప్రథ— రాత్రుసేంద్రుండును సరోవరాలంకారంబు లనియుఁ బక్షులనియు మొదల యిడిరి.

ప్రభా— అటులేని మనప్రయత్నమునకు మఱియు నుపయోగమే. కారణాంతరంబున నిందుండినను నీపక్షికోటికి మనరాక్షసకోటి విపక్షకోటియే.

చెలులు— అవును. ఇంతకు మాటలాడ నేర్చెనో, లేదో?

ప్రభా— మాటలాడ నేర్చుటయే చాలునా? ఏతాదృశకృత్యంబులం దెంత తెలివితేట లుండవలయు!

చెలులు— మాటలు నేర్చిన పక్షులకుం దెలివితేటలుండకపోవు.

ప్రభా— అటులేని చటుకునం బోయి తోడికొనిరండు.

ప్రభ— (పరిక్రమించి)

గీ. రమ్మ, రాయంచగరిత! మా కొమ్మ నిన్నుఁ
బిలుచుచున్నది నీమీఁది ప్రేమ నిండ
లలితసౌరభసౌవర్ణనలిననాళ
ఖండములు నీకు విందిడుఁ గడుపునిండ.

(తెరలో)

గీ. అమ్మ, రాకేమి ప్రేమ మీ కొమ్మ పిలువ!
మేము మందాకినీతీరభూమి యెపుడు
విడచితిమొ నాఁటినుండి యీ ఓడకు దాసు
రాండ్రమే యందులకు సంశయమ్మ వలదు.

[రాయంచగరిత ప్రవేశించును.]

ప్రభా— (ఆశ్చర్యముతో నెదురుగాఁ జని) వరటాసఖీ! నిన్నింతవఱకు రావించి సంభావింపని తప్పు సహింపుము. నిన్ను నాయాంతరంగిక సఖీజనంబులోనిదానిఁగాఁ బరిగణించుకొంటిని. నాయందును దాదృశతాత్పర్యముంచి యనుగ్రహింపుము. నీ కులగోత్రనామాదులు మాకుం గర్ణరసాయనంబుఁ గావింపుము.

రాయంచ— వజ్రనాభకుమారీ! చెలులతో సంతోషాధాయకంబులగు మంతనంబులు సలుపుచుండఁ దనంతఁ బొంత కన్యకాంత రాఁగూడదుగదా యని దవుదవ్వుల నిలుచుంటి. పరమేశ్వరీ ప్రసాదసమాసాదితంబై నీయొద్దనున్న చిత్రఫలకంబునందలి యకృత్రిమమనోహరుండు నాచే దృష్టపూర్వుఁడా, కాఁడా యను సంశయంబు వొడమి తత్సంశయ నివృత్తి యగుదాఁక నడుమనడుమ నక్కిత్తి చూడఁవొడఁగితి.

ప్రభా— రాజహంసీ ! నీమాటలవలన మాకు సంశయనివృత్తికి మాఱు సంశయమే ప్రబలుచున్నది. ఈ చిత్రగతమనోహరస్వరూపంబు దృష్టచరమా, యదృష్టచరమా, సహజమా ? సంభావ్యమా ? యోజించి చెప్పుము.

రాజహంసి— రాజకుమారీ ! ఏను నళినాసనవాహనంబులలోని యొక మరాళపతికి ధర్మపత్నిని. నా పేరు శుచిముఖి యందురు. చిన్నతనంబున సరస్వతికి శిష్యురాలనై సంగీతసాహిత్యంబులు నేర్చితి. వ్యాకరణంబుఁ జదివితి. చదువుటయే గాదు, లక్ష్యలక్షణచాకచక్యంబునం దద్వితీయ ననిపించుకొంటి. అదియునుంగాక,

సీ. అర్థగంభీరంబులైన శబ్దముల పొం
దిక ముత్యములకోవ తీరుగాఁగఁ
దత్తద్రసోచితతాత్పర్యపర్యాప్తి
సురుచిరాలంకారశోభమాన
గుణపాటవంబు దూషణశూన్యతయుఁ బ్రౌఢ
శయ్యాచమత్కార చతురిమంబు
వ్యంగ్యమర్యాదయుఁ బ్రతిభావిభావిత
కల్పనాకౌశల్య గౌరవంబు

గీ. వెలయునట్లుగ నాశుకవిత్వ మల్లు
టభ్యసించితి వాణీదయావిశేష
వైభవంబునఁ గొన్ని కావ్యములుఁ గొన్ని
నాటకంబులు వ్రాసితి నవ్యఫణితి.

నా కవిత్వంబునకు మెచ్చి సరస్వతియే "బాలసరస్వతి" యను బిరుదొసంగి యీగండపెండేరంబు కాలికిం దొడిగె. మఱియు రాజరాజేశ్వరీషోడశీమహావిద్య నభ్యసించితి.

చెలులు— ఏమీ, మా భాగ్యము! నీవంటి పండితురాలితో మాకుఁ జెలికారము లభించె.

రాజ— నేనొక పండితురాలనా ? మాలో నా తలమీఁదివారు కలరు.

ద్వితీ— తరువాత, తరువాత ?

రాజ— ఇట్లుండ ద్వారకాపురంబు కాఁపురంబుగ దుష్టశిక్షణ శిష్టరక్షణములు కృత్యములుగ నిత్యంబార్తజనపరిపాలనజాగరూకుం డగు శ్రీకృష్ణుండు తమతండ్రి వసుదేవునిచే యాగంబుఁ జేయించుచో శతావధానవిధానమునకై నన్నుఁ బిలిపించె.

ప్రథ— రాక్షసకులనాశకుండని విందుము. తరువాత, తరువాత ?

రాజ— నేనును గొంత పరివారముతో,

క. విద్వాంసు లనేకులుఁగల
తద్ద్వారక కేగి శతవధానముచే నే
తద్వాచకాక్షరాళి
మద్వరకలధౌతబిరుదమాన్యతఁ గంటిన్.

చెలులు— అప్రతిహతకవితాధురంధరురాలవగు నిన్ను సత్కరింపనివా రెవరు?

రాజ— ఆసమయంబున భద్రుఁడను నొక నటశిఖామణి నేఁజేసిన నాటకంబులు గొన్ని ప్రదర్శించె. అతని నాటకప్రదర్శనపాటవం బనితరసామాన్యంబు. నేఁటికాలంబునం దా నటసమాజమువంటి సమాజం బొండు కానఁబడదు.

ఉ. ఆసభలందుఁ జూచినటు లాదటు వచ్చుచునుండె నీమహో
భాసురవిగ్రహంబు నరపాలకపార్శ్వపచారకావళిన్
నే సరిగాఁగఁ బోల్చుటకు నేర నొకించుక "సోయ" మన్నది
ధ్యాసయొనర్పకుండ నుచితస్మృతి కల్గునె యెంతవానికిన్!

ప్రథ— ధారణాధోరణీవిశేషంబున శతవధానంబొనరించు నీవంటి మేధావులకే విస్మృతి తటస్థించుట మా దురదృష్టము.

రాజ— అపేక్షాబుద్ధి లేనిచో నెట్టి మేధావికిని దృష్టస్మరణము కలుగదు.

ప్రథ— రాజహంసీ! గతమున కేమి, ప్రకృత ప్రశంస వింటివిగదా?

రాజ— అగును, వింటిని.

ప్రథ— విన్నచోఁ గర్తవ్య ముపదేశింపుము. స్మర్తవ్యము స్మరింపుము. చిత్రలిఖితమనోహరసమావేశముఁ జేయించి ప్రత్యుదారికం బ్రతికింపుము.

రాజ— చెలులారా! పురుషప్రయత్న మెంత యున్నను దైవబలము సమకూరవలయు. అది కలదనియే నా నమ్మకము. లేనియెడఁ బరమేశ్వరి స్వప్నమం దీచిత్రఫలక మేల తెచ్చియిచ్చును?

ద్వితీ— రాయంచగరితా! ఇంకొకటి,

ఉ. ఇట్టి మహాశయుండు కలఁడే యనుకొందము నీవు పోయి యె
ట్టెట్టులో యాతని న్వాదికి యిట్టి మనోహరరూప మానవా
ల్పట్టెదుగాక యియ్యసురపట్టణసీమకుఁ జేర్చి యెట్లు రా
పట్టికిఁ జూపెదో? చెలియభారము సర్వము నీది హంసిరో!

ప్రభా— చెలులారా! ఆసంగతియు మనము చెప్పవలయునా?

గీ. అన్ని చదువులుఁ జదివిన ప్రౌఢవనిత
చేయవలసిన కృత్యంబు చేయలేద?
"నీవె తల్లివి తండ్రివి నీవె, నీవె
చెలివి మాచెలి" కంచు వచింపుఁ డంతె.

రాజ— చెలులారా! బీజారోపమునకు ముహూర్తము కుదురనిండు. నేను ముం దింద్రప్రస్థపురంబున కరుగవలయు. ఏమంటివా? ద్వారకయందు నాఁడు జరిగిన జన్నంబున,

సీ. విద్వాంసులను గౌరవించు కార్యము పూనెఁ
బ్రథితతేజుఁడు పృథాప్రథమసూతి
పాచకావళికి సంబారంబు లందింప
మసలుచుండెను పార్థమధ్యముండు
శకటముల్ రథములు సారట్లు గుఱ్ఱముల్
త్రిప్పించుచుండె మాద్రేయుఁ డొకఁడు
రాజబంధువుల గౌరవసంప్రపత్తులు
సవరించు పనిఁ బూనె సవ్యసాచి
గీ. సవ్యసాచికిఁ దాఁ జేతిసాయ మగుచుఁ
దిరుగుచుండెను గడమ మాద్రేయుఁ డప్పు
డీ తరుణమూర్తిగూడ నీ యిరువురకును
సాయమైనట్లు నామానసము తలంచు.

కావున నే నా సహదేవుచేనొండె సవ్యసాచిచేనొండె నాతని కులగోత్ర నామనివాసాదులు తెలిపించుకొనిన పిదప నచ్చోటికిం బోయి తద్రూప మీ చిత్రిత స్వరూపముతోఁ బోల్చుకోవలయుఁ గదా? చిత్రఫలకంబు వెంటఁ గొంపోయినంగాని యప్పని సాధ్యంబుగాదు. దాన మనచెలికి దుఃఖోపశమనంబు జేయుటకు మాఱు దుఃఖముఁ దెచ్చిపెట్టినదాన నగుదు నేమో యని శంక వొడముచున్నది.

ప్రభ— వలయునేని గొంపొమ్ము. భర్తృదారిక యంతఃప్రాణంబుతోఁగూడ బహిఃప్రాణంబు నీయధీనంబు సేయుటకు సందియమేమి, కాని,

ఉ. ధారుణిఁ బేరుసెంది తపధానములన్ నయనేంద్రియక్రియా
కారతనైన చిత్తమునఁ గల్గునె విస్మృతి కన్నదాని కీ
వారయ వారుపీరువలె నప్పుడు చూచిన దప్డు విస్మృతిం
గూరెడిదానవే? మఱచికో లోకటున్నద నీకు? హంసిరో!

నాకు నీయందుఁగల విశ్వాసంబుఁ బరీక్షసేయుటకై యిటులంటివి. కానిమ్ము.

ద్వితీ— రాజహంసీ ! రాజపుత్రికి వేఱొండు కాలయాపనోపాయముఁ గల్పించుము.

రాజ— (ఆలోచించి) ఇంతకంటెఁ గాలయాపనోపాయ మేమి కల్పించఁగల్గుదును ? చెలులారా !

చ. వయసు గతించుచుండె నెలఁ బ్రాయమునంగల మేఘ నేఁడు రే
దయమయమంచు నంగకము లం దుదయించిన ప్రత్యభిజ్ఞ ని
శ్చయముగ నిర్ణయించుటకుఁ జాలునొ చాలదొ యందుఁబోయి యే
నయి యెటు సేయఁబోయి యెటు లౌనొ యటంచు మనంబు జంకెడుణ్.

ఈషదాకార భేదంబు గల సుందరు లెందఱో యుందురు. కాని యాకారవిశేషబోధకంబులగు గుర్తు లొకటి రెండేనియు నుండకమానవు. కావున నీ సుందరాకారంబు చిత్తంబున నింకొకమాఱు హత్తించుకొని యెద. (చిత్రఫలకంబు పరిశీలనాపూర్వకంబుగఁ బరికించి)

సీ. హొంబట్టుపలకపై నున్న నీలముడీల
నెదుఱొమ్ము తలుపుపైఁ బొదలు మచ్చ
అంటుమామిడిపండువంటి గండంబులం
దుదయించుచున్న శ్మశ్రూద్గమంబు
నీరెండ కెంజాయ పాఱెడు నచ్ఛద
కాసారముల మించు కన్నుఁదోయి
కెంపుదాపినరీతి సొంపైన నఖముల
నలరారు నిడుపైన యంగుళములు
గీ. కలయఁ బూచిన చూతవృక్షంబు భాతి
మోదమొనరించు నవయౌవనోదయంబు
వజ్రపుం దునుకలఁబోలు పండ్లవరుస
మందబుద్ధులకేనియు మఱపు రాదు.

చెలులు — (పరికించి చూచుచు) హంసాంగనాశిరోమణీ ! ఏతాదృశదివ్యసుందరవిగ్రహంబు విరించి సృష్టంబు లగు విష్టపంబులం దొండు తప్ప వేఱొండు కలదనుకొనుటయు మా యభిమతంబు గాదు. ఏకైకాంశ మెక్కొక్కచోట నుండిన నుండవచ్చుంగాక. కావున నీచిత్తంబు సంశయడోలాయత్తంబుఁ గావింపకుము.

మ. ఇవిగోఁ దామరతూండ్లు సంబళముగా నీ దృష్ట్రమాభాగసం
భవపుణ్యాకరమైన దేశమునకుం బక్షద్వయాభూతమే
ఘవిహారంబగు నభ్రమార్గమున వేగంబోయి యా వ్యక్తి క
న్గవగీలించి తదాప్తసంఘటనముం గావించి రక్షింపుమా.

శా. ద్వారంబుల్ పనిలేదు కోటలనినం దాఁటుల్ తదంతస్స్థితా
గారంబుల్ చోర శంక లేదు పులుఁగుల్ గాకిట్టి కార్యంబు లె
వ్వారల్ సేయఁగలారు? మా చెలియు సర్వంబుం ద్వదాయత్త; మా
? వీరాగ్రేసరు నున్కిపట్టు గని యీ వృత్తాంతముం దెల్పుమా.

ప్రభా— చెలులారా! యీ రాయంచగరిత యనిన నెవ్వరమకొంటిరో! నాకు నేఁటికిఁ దెలియవచ్చెను. మన మామె కుపదేశించుపాటి వలంతులమా?

చ. నలదమయంతు లిర్వుర ననల్పతరప్రతిభాచమత్కృతుల్
తొలుకఁగఁ గూర్చి కీర్తిని త్రిలోకగతం బొనరించినట్టి యం
చలరెడయుండు వంశపతి సారససంభవు తేదినార్వ మీ
తెలివరి కంచు నేఁ జదివితిం జుమి మున్నొక నాటకంబునన్.

రాజ— అవును, రాజపుత్రీ! ద్వారకాపురంబున భద్రుండను నటవరుని సమాజముచేఁ బ్రదర్శింపఁబడిన నాటకమునందే మా వంశావళి వ్రాసితిని. అదియుఁ బఠియించితి ననుటయే నీ యనన్యాదృశవిద్యావత్త్వముం గుఱుతు.

ప్రథ— వరటామణీ! మా చెలి భావిభాగ్యోదయంబున మంచి యుపోద్ఘాతము తెచ్చినది.

ఉ. నాటకదర్శనంబన ఘనప్రమదంబవుచుండు మా తమి
సాత్రికులాంబుజాళికి కాతనియానతి నెల్లకాల మీ
కోటకు వచ్చుచుండు నటకోవిదసంఘము చూపుచుండు నా
నాఁటను పూవుఁదోఁటఁగల నాటకశాలను నాటకమ్ములన్.

సీ. శివ వ్రాసి యిచ్చిన చిత్రస్వరూపంబు
దబ్బరకాక సత్యంబ యేని
మా పుణ్యవశమున మా పెన్నిధానంబు
నిజముగా నీవు కన్పెట్టితేని
యీబిడ సౌందర్య మీబిడ యనురాగ
మా మహాశయు మది కలికె నేని
వజ్రనాభుని పాపపరిపాకదశయు మా
పడఁతి యదృష్టంబుఁ బండెనేని

గీ. అపుడు తత్సంఘటన కుపాయములు కొన్ని
నీవు యోజించుపట్టున నీవిధాన
మందు కనుగుణమౌనేమొ యదియుఁ గూడ
నీమానిని న్మనముకోవమ్మ, యో మరాళి!

రాజ— నాకును నీనాటకప్రయోగవిధానమే సంఘటనోపాయమగునను తలంపు పొడమినది. ఇరువుర యోగా[illegible]భవించినచోఁ గార్యంబు సఫలమగునని నీతివిదులు వక్కాణింతురు. చెలులారా! నాకు సెలవిండు పోయివచ్చెద.

చెలులు— మరాళప్రియవధూటీ! నీకు శుభమగుఁ గాక! (అందఱు సాగనంపుదురు. రాజహంసిం బురస్కరించి చేతులొగ్గి)

సీ. బ్రతికింపుమమ్మ! యీశ్వరఫాలవహ్నిచేఁ
జచ్చిపోయిన పుష్పశరుని మరల
నిల్పుమా! సుకవి వర్ణితమైన శృంగార
రసమున కున్న గౌరవము జగతి
అనుకూలమైన జాయాపత్యఘటనచేఁ
దెప్పింపు మజుని కీర్తికిఁ బ్రశస్తి
విఫలంబుఁజేయక సఫలంబుసేయుమా!
నీచేత నిడిన మా నెలఁత బ్రతుకు

గీ. రాజరాజేశ్వరీ దయాప్రాప్త సుకవి
తా విశేషంబును శతావధానగరిమ
కలిగి యలరినదానవు గాన యామ
హేశ్వరి వచించినట్లు చేయింపు మమ్మ!

(ప్రభావతియుఁ జెలులు వెనుకకు మరలుదురు.)

రాజ— (తనలో) ఈరూపంబున వజ్రనాభునకు వినాశంబు సమీపించినది. దీనివలన దేవకార్యనిర్వాహంబును బ్రభావతీమనోరథనిర్వాహమును గూడఁ దటస్థించును. సాక్షాత్పరమేశ్వరీ సంకల్పంబుగూడ నట్లే యుండ నోపు. లేదేని రుక్మిణీకుమారుండగు ప్రద్యుమ్నుని రూపు మేల వ్రాసి యిచ్చును. నే నిందలి స్వరూపంబు ప్రద్యుమ్నకుమారునిదని యెఱింగియుఁ గొంతవట్టుకు దెలియనిదానివలెఁ గపటనాటకంబాడితి. నే నిప్పుడు ద్వారావతికిం బోయి యతని నేకాంతంబున దర్శించి రాక్షసపుత్రీరామణీయకంబు వర్ణించి సమానురాగులగు నీదంపతుల సంఘటనోపాయంబుఁ గల్పించి యనురాగలతాంకూరముఁ బెంచి యనల్పంబగు కాత్యాయనీ సంకల్పంబు నిర్వహించెద. (నిష్క్రమించును.)

గద్య

ఇది...శ్రీ తిరుపతి వేంకటేశ్వర విరచితంబగు
ప్రభావతీప్రద్యుమ్న నాటకంబునం బ్రథమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# ప్రభావతీ ప్రద్యుమ్నము

## ద్వితీయాంకము

(శుచిముఖి ప్రవేశించును.)

శుచి— (ఆశ్చర్యముతో) ఇదిగో! ద్వారకాపురవరోపాంతప్రదేశం బెల్లఁ ప్రమదవనములచే నిండిపోయినది.

సీ. నలువైన యిసుము తిన్నెల నేలలన్నియు
గుజ్జుమామిడితోఁట గుంపు లయ్యె
పల్వలమ్ములకల్మిఁ జెల్వంబు గనుభూము
లందెల్ల నారికేళాగమములె
ఖరసంకులమ్ములౌ గఱికబీళ్ళన్నియు
నంబరచుంబిసౌధంబు లయ్యె
నుప్పుపండెడి సాగరోపాంతమందెల్ల
రమణీయపుష్పితారామతతులె

గీ. అంతలో నింత మాఱె నయ్యారె! యింద్ర
నీలమయమైన వాసుదేవాలయంబు
కానుపింపకపోయిన నానవాలు
పట్ట శక్యంబె ద్వారకాపట్టణంబు!

బాపురే! భూపురంధ్రీనూపురంబైన యీపురంబునఁ గాఁపురంబు సేయు స్త్రీపురుషుల యదృష్టం బెందు నదృష్టచరంబు.

సీ. మండు వేసఁగినైన మంచుకాలము సేయు
కడుఁ జల్లఁగా వీచు కడలిగాలి
ఏపూఁట కాపూఁట నాపణంబుల ధూళి
పడకుండ వర్షించు వారిదములు
ఏవీధిఁ గనుఁగొన్న నావీధి మొగ విశా
లాటీకనములు శృంగాటకములు

వీప్రక్కఁ జూచిన నాప్రక్క లలితపుష్ప
లతావరణశాలి సౌధపాళి

తే. గీ. నిరత సంచార్యమాణ కర్ణీరథములు
కలిగి తనరు భూలోకనాకం బనంగ
నాదినారాయణుఁడు కృష్ణుఁడై జనించి
కాఁపురము సేయు నీ ద్వారకాపురమున.

(కలయఁజూచి) ఇదె, గోవిందుని మందిరము. (స్మృతినభినయించి) ఇంద్రనీలమణిమయమ్మగు నీ నగరి పొలుపుం దిలకించు నాకు నింతకుమున్న యాజ్ఞాపించిన సందేశంబు జ్ఞప్తిం దగులుచున్నయది. కాని ప్రభావతీసందేశం బంతకన్నఁ బరమగుటచేఁ బరమ్ముచే బూర్వమ్మునకు బాధ శాస్త్రప్రోదితంబు కావునఁ బ్రప్రథమమునఁ బ్రద్యుమ్నదర్శనమే యాచరింపఁదగి యున్నది. అటుగాన నతఁడెక్కడ నుండెనో యిక్కడి పరిచారకులవలనఁ దెలిసికొనియెదను (మరల యోజించి) ఔను. శీఘ్రోపస్థితమగుకతన శ్రీకృష్ణసందర్శన మంతరంగ మ్మగుచున్నదే! కృతాకృతప్రసంగితాప్రయుక్తత్వ ముభయత్ర తుల్యమే కావున నిత్యత్వవిచార మనావశ్యకము మఱియు వాసుదేవసందర్శనమ్మున నంతరంగత్వమే కాక భావికార్యశుభసూచకంబగు కతన నొకవిధమగు నూతనాపవాదత్వముగూడఁ గన్పట్టుచున్నయది. (యోజించి) పైహేతువులంబట్టి తొలుదొల్త నందనందను నారయుటయే నిశ్చితమైనను నట కరుగకమున్న ప్రద్యుమ్నుని యునికిపట్టు కనుఁగొనుట యావశ్యకము కాకపోదు. (స్మృతి నభినయించి) ఓహో! నానాఁటికి నాబుద్ధికి విస్మృతి మెండగుచున్నదే! ఇప్పనికై యింతకుమున్నె కదా! నాసహచారిణి మంజువాణిని నియోగించి నే నియ్యెడ కరుదెంచితిని. స్వామిని సందర్శించి సురకార్యమ్ము నివేదించివచ్చు నీలోపున మంజువాణి ప్రద్యుమ్నుని యునికిపట్టు లోనగు కొన్నిసంగతులు కనుఁగొని నారాకకై ప్రతీక్షించుటకు సంశయ ముండఁగూడదు. ఇఁక నిశ్చితమ్ముగా గోవిందుని దర్శింప నరుగుదుంగాక.

(కొండొక నడిచి యెదుటఁ జూచి పట్టరాని సంతోషముతో)

మ. చిరకాలమ్మున కక్షిజాడ్యము శమించెన్ సర్వదేవద్విష
త్తరుణీమంగళసూత్రఖండనచణోదారప్రభావస్ఫుర
త్తరకేళీపరబాహుదోహలకళాశాంతన్యమానామరా
భరణత్రాణుని వాసుదేవుని మహాభక్తావనుం జూచుటన్.

(బిగ్గరగా) ఎవరక్కడ?

పరిచారకుఁడు— (ప్రవేశించి) ఎవ్వ రా పిలిచినది? (దెసలు పరికించి) ఎవ్వరును గానరారే! ఇంతలోనే నిరాశులయి మరలిపోయి యుండరుగదా! నేను లేశమును నాలసించినది లేదే! ఎటుచూచినను స్త్రీలుగాని పురుషులు గాని కానరారే! మరలఁ బిల్చి చూచెదంగాక. (అట్లు చేయును.)

శుచి— (తనలో) పాపము. ఈ పరిచారకుఁడు చింతాక్రాంతుఁ డగుచున్నాఁడు. ఎవరో స్వామిసందర్శనమ్మున కరుదెంచి తనమాంద్యముకతన హతాశులై యరిగిరేమో యని వగచుచున్నట్టు లితనిముఖకళవలన నెఱుఁగనయ్యెడిని. వీనియోగ్యతం గనిపెట్టుటకేకదా! నేను వెంటనే 'నే' నని ప్రతి చెప్పక మిన్నకుంటిని. ఆకారసామ్యముంజేసి నన్నితఁ డంతఃపురపు రాయంచనుగా గణించెనే కాని వెనుకఁ జూచియున్నను సరిగా గుఱితింప లేఁడయ్యెను. ఇఁక వీనిసందియము తీర్చెదను. (ప్రకాశము) నన్నె యెఱుఁగవా? ఇంతలోనే మఱచితివా? నాఁటి యజ్ఞమ్మున నొకనాఁడు శతావధానము జరిగిన సంగతియేని జ్ఞప్తియందున్నదా?

పరి— (సంతోషముతో) అమ్మా, మీరా! క్షమింపుఁడు. ఇక్కడి రాయంచవే యనుకొంటిని. (స్మృతి నభినయించి) అమ్మా! మీ రిరువురుగాదు?

శుచి— (విచారముతో) ఇపుడు నే నొంటరిని గావలసివచ్చినది. నా సహచారిణి బ్రహ్మలోకమ్మున కరుగవలసి యరిగినది. తనకవితానైపుణ్యముచే నా చతురాననుఁ దనుపుచు నాపె యచ్చటనే నిల్చిపోయినది. అది యటులుండె. నా రాక దేవరకు విన్నవించి రమ్మా.

పరి— చిత్తము. (లోనికరిగి మరలఁ బ్రవేశించి) ఆజ్ఞయైనది, రమ్మా. అదె సభార్యుండై స్వామి యచటఁ గూర్చుండెను.

(శ్రీకృష్ణుఁడు యథోక్తముగాఁ బ్రవేశించును.)

శుచి— (ప్రవేశము నటించి)

శా. శ్రీదంబుల్ నిజభక్తమండలశుభాశీఃప్రాపకంబుల్ పమ
స్తాదిత్యప్రభవిష్ణుమౌళిమణిబాలాదిత్యనిర్ణిద్రముల్
యాదోనాథసుతాపరావతరరామాంకాస్పదమ్ముల్ భవ
త్పాదాబ్జమ్ములకు న్నమస్కృతులివే పద్మాక్షు, పద్మాధవా!

(పాదమ్ములపై నమస్కరించును.)

కృష్ణు— (సబహుమానముగా) చింతితార్థసిద్ధిరస్తు. (స్మృతి నభినయించి) జంట విడిచి యొంటరివై వచ్చితివేమి? నాఁడు మీశతావధానముం డిలకించినది

మొదలు తెలియుచుగ మీరియుపురుసు గన్నులకుఁ గట్టిన ట్లగపట్టె నట్ల య్యెడిని.

శుచి— (విచారముతో) దేవా! దేవర కగోచరంబగు విషయ మేముండును? ఇపుడు నా సహాధ్యాయిని సత్యలోకమ్మునం దున్నయది. ఆపె నిఁక మరలఁ జతురాననుం డిట కనుపఁడఁట!

కృష్ణ— విచారింపనేల? శాశ్వతబ్రహ్మలోకనివాససిద్ధికన్న నాశాస్య మెం డుండదు. ఈమాట సర్వథా యభినందనీయమే కాని నిన్నొంటరిగాఁ దిలకించుట మాత్రము కొండొక శోచనీయము. అది యటులుండె.

గీ. దేవవిభునకుఁ గుశలంబె? దిక్పతులకుఁ
దక్కువారలకెల్ల భద్రంబె? యేమి
కర్జమున కంపె నిను శతక్రతుఁడు తెల్పు
మా! భవద్వాక్యరచనకు మనము తనియ.

శుచి— దేవా! తమ మనమ్మునకు గోచరింపని రహస్యమ్ము లింద్రలోకమ్మం దంద కాదు మఱి పదునాల్గుభువనమ్ములందును నశ్రుతచరమ్ములే. అయినను మన్ముఖమున వినఁగోరుట యనుగ్రహాతిశయంబ కాని వేఱుకాదు. అవధరింపుఁడు.

గీ. వజ్రనాభుఁడు రాక్షసవల్లభుండు
సలుపు దుశ్చేష్టలెల్ల నీ సమ్ముఖమున
మున్న మాఱేఁడు స్వయముగా విన్నపమ్ము
సలిపినట్టిదె పునరుక్తి గొలుపనేల?

వాని వినాశమ్మునకుం దగిన యుపాయమ్ము శీఘ్రకాలమ్మున యోజింపవలయు.

మ. అమరత్వమ్మునఁజేసి చావొదవమిం బ్రాణావశిష్టుండుగా
నమరేశుండు వనాధివాసి యయి నిన్నత్యంతముం జిత్తప
ద్మమునన్ నిల్పుచుఁ గాలముం గడుపుచున్ మానేది యున్నాఁడు త
త్క్రమమున్ జ్ఞప్తికిఁ దెచ్చుపొంటె ననుపంగా వచ్చితిన్ దేవరా!

ప్రస్తుతకార్యమ్మున కనుకూలించు నుపాయమ్మునకు వలయు సాధనసామగ్రిని మత్స్వామి ముదలగొని యేను గొండొక సంపాదించి మనమ్మునందు భద్రపఱచియుంచితిని. అయ్యది గోప్యాతిగోప్యము. ఏమి సెలవు?

కృష్ణ— కొండొక తాళి వినుతువుగాక. (భార్యలవంక సాభిప్రాయముగ దృష్టినిగుడ్చును. అంతఃపురము నిష్క్రమించును.)

శుచి— దేవా ! సావధానచిత్తమ్మున ననుగ్రహింపవలయు.

చ. కలదల వజ్రనాభున కఖండతనూవిభవాభిరామ ము
ర్వ్యలఁ గని యండచండముల పొల్పు గొనమ్మల రావు మేలి వి
గ్దల నిలయంబు కూఁతురు; తదీయతనుప్రభ కారణమ్ముగా
నలరుఁ "ప్రభావతీ" పరసమాఖ్యయు నాపెకు సార్థకమ్ముగన్.

కృష్ణ— తరువాతఁ దరువాత,

శుచి— దేవా ! ఇఁకఁ జెప్పఁబోవునంశము మనకార్యమ్మున కెంత యను
కూలమో తిలకింపుము.

ఉ. భావవిధిం దలంచియొకో, పార్వతి యాసతిస్వప్నమందు సం
భావితయై భవత్సుతుని వ్రాసిన చిత్తరు విచ్చి యేగె నో
దేవర ! నాఁటఁగోలె నల తియ్యనివింటివజీరు పోరికిన్
దావల మయ్యె నయ్యతివ దానిమనోగతు లేమి చెప్పుదున్ !

కృష్ణ— (సంతసముతో) వరటాశిరోమణీ ! పరమేశ్వరీవరప్రసాదంబగు మా ప్రద్యుమ్నునియెడ నయ్యంచికకు మిక్కిలి దయయని వేఱుగఁ జెప్పనక్కఱ లేదు. ఇది యతని పురోవృద్ధికి సూచక మనుటకు సందియము లవమును లేదు. చక్కని ప్రసక్తి తటస్థించినది. ఇఁక నీ తెలివితేటలెల్ల వినియోగించి యక్కన్నియం దితని మనంబు లగ్నమ్ము గావింపుము.

శుచి— దేవా ! అక్కన్నియ రామణీయకంబు విస్తరించి వచించినచో రతిప్రియుం డయ్యతివయెడ ననురక్తుం డగుటకు సందియ ముండదు. కాని మగయీఁగకేని యా రక్కసునను మతి లేక చొరరాని యయ్యెడ కియ్యంగ, జావతారుం డరుగు టెట్టులు ఘటించెడి నని సంశయించెద.

కృష్ణ— కవయిత్రీమణీ ! నీబుద్ధికీమాత్రమును గోచరింప లేదగా ! వినుము.

మ. రతి మాయావతి యనుపేర శంబరపురీరాజమ్మునం దుండి మ
త్సుతుని న్మాయలలోనఁ బండితునిగా శోధించెఁ బ్రద్యుమ్నుఁడ
క్కతనన్ శంబరుఁ జంపె నీవిషయముం గన్నట్టియే యుండదు వి
క్కృతి కప్పాఁడితి కెంతయో కలదనూ వీక్షింపు సంబంధమున్.

మఱియు నొండొక్కటి వినుము. భద్రుండను నటరాజశిరోమణి నీయెఱుంగనివాఁడు కాఁడు. అతఁడు భవత్కృతమ్ములగు నపూర్వ నాటకమ్ములు గొన్ని మజ్జనకాధ్వరమ్ముతఱి నిటఁ బ్రదర్శించి తత్కాలమున సభాసదులగు ఋషిపుంగవులచే వరమ్ము లెన్నియో పడసి యిపుడు సప్తద్వీపమ్ముల నిరాఘాటుండై చరించుచున్నవాఁడు. నీ వేదేని గోష్ఠి

వశమ్మున వజ్రనాభునితో వీని కళాకౌశలమ్ము నివేదించి యేతదాగమనానురక్తుం గావింపుము. మీ యిందుఱిందు ప్రస్తుత విషయమున నాతోఁ బ్రసంగించుపట్టున నీకు వజ్రనాభునియొద్దఁ గల చన వనన్యాదృశమని వక్కాణించి యున్నవాఁడు. నీ మాటలయం దారక్షోనేతకుఁ బక్షపాతం బధిక మగుటంజేసి తదాగమనమ్మునకుఁ దప్పక యంగీకరించును. పిమ్మట.

శా. భద్రాకారముతోడ వజ్రపురికిన్ బ్రద్యుమ్నుఁ దేతెంచుఁ ద
చ్ఛిద్రమ్ముల్ కనిపెట్టు రక్కసునొగిన్ ఛేదించు మీ సేనికిన్
భద్రమ్ముల్ సమకూర్చు వేగ చని నీ ప్రావీణ్యము స్వైరపుం
దద్రక్షఃపతి కెక్కఁజేసి కృతకృత్యత్వంబు సంధింపుమా.

శుచి — (సంతోషముతో) దేవా! యిఁకఁ దప్పక వజ్రనాభుండు మడిసెఁ. శక్తికొలఁదిని దేవరయాజ్ఞ నిర్వర్తించెదను.

[తెరలో]

సీ. అంబరమణిబింబ మభ్రవీథీమధ్య
భాగమ్మునందుఁ బ్రజ్వరిలఁ దొడఁగె
నలసి వ్యాపారస్థులగు జనులందంద
సదనాభిముఖు లౌచుఁ జనఁ దొడంగి
రగములు డిగ్గి పతగజాలములు చెట్ల
నీడల నల్ల నట్టాఁడ దొడఁగె
నాతపమ్మునకు ఛాయాపటలమ్ములు
జడిసి హ్రస్వమ్ములై ముడుగఁదొడఁగె
గీ. సరసుల జలమ్ము సలసల మరిగె దైవ
తాలయమ్ముల నర్చనాకాలఘంటి
కానినాదమ్ము లడరెఁ జక్రానుకృతుల
తోడ ఝంఝానిలములు వీథులఁ జరించె.

శుచి — (వినుట నటించి) దేవరకు మాధ్యాహ్నికసంధ్య విజయాధాయక మగుఁ గాక. నా కానతిండు.

కృష్ణు — భవిష్యద్విషయమ్మున నప్రమత్తురాల వగుదువుగాక. (నిష్క్రమించును)

శుచి — (అంతఃపుర నిర్గమనము నటించి) ఇప్పటికి నావచ్చిన పనులలో నొకటి నిర్వర్తించితిని. ఇట్లే రెండవ కార్యముగూడఁ జక్కఁబెట్టికొని భవిష్యద్విషయమ్మునకుఁ గడంగవలయు. (కొండొకపోయి) ఇదె నాసహచారిణి

మంజువాణి నాకై నిరీక్షించుచున్నది. (నిరూపించి) ఈమె ముఖ కాంతినిబట్టి కృతకృత్యత్వము ధ్వనిత మగుచున్నది.

(మంజువాణి ప్రవేశించును)

మంజు— సఖీ, శుచిముఖీ! నీ యాదేశము చక్కఁగా నిర్వర్తించితిని. సాయం సంధ్యాసమయమునకు వాహ్యాళికై ప్రతిదినము ప్రద్యుమ్నుఁ డీప్రాంత మందలి యెల్ల యుపవనమ్ముల కరుదెంచునఁట. కావున మన మంతదనుక నా యుద్యానవనమున నతని రాక ప్రతీక్షింపవలయు.

శుచి — అట్లే చేయుదము. (ఉపవన ప్రవేశము నటించి) మంజువాణీ! నందన వనమ్మునఁ జరించెడి మనకుఁగూడ నీ యారామము వింత గొల్పుచున్నది సుమీ!

మంజు— నీ వనినట్లే. సఖీ! నందనవనమ్మునందు భూలోకోద్యానమ్ములకన్న నాధిక్యమ్మునకుఁ గతంబు కల్పవృక్షసంపత్తియే కదా!

శుచి— అవును. అంతకన్న నితర మేమి కావలెను?

మంజు— అగుచో, నా కల్పవృక్షము లిచ్చటను గలవుగదా!

శుచి— ఇచ్చట ననఁగా సత్యభామాగృహోద్యానమునం దనియేనా, నీ యాశయము?

మంజు— అట్లు కాదు. ఈ ద్వారకాపురవరోపాంతోపవనములం దెల్లెడల నని నా తాత్పర్యము.

శుచి— అగుచో నది యసంభావ్యము.

చ. తనదు సపత్ని రుక్మిణి నపఃకృతిసేయఁగ సత్యభామ కృ
ష్ణుని నెసకొల్పి కల్పక మనోకహరాజము భర్తతోడ నం
దనవని కేగి తెచ్చికొన ద్వారకలోని తదన్యపుష్పకా
వనముల కేఁగ నాయమ మనంబు సహించునె, యీను గ్రిమ్మదే?

మంజు— (నిరూపించి) అగుచో నా దిక్కునందెల్లఁ గల్పవృక్షములే యున్నవి, కనుఁగొమ్ము.

శుచి— (పరిశీలించుట నటించి) అవి కల్పవృక్షములుకావు. కాని మఱియేవియో యపూర్వ రామణీయకనిధానమ్ము లగు వృక్షరాజములు. అడిగిన కోర్కులనెల్ల నిచ్చుటచేఁ గల్పవృక్షమ్ముల కెక్కుడు ప్రతిష్ఠ కలదుగాని రామణీయకతకు వానికి మించిన వృక్షమ్ము లెన్నియో యీ భూలోక మ్మునఁ గలవుసుమీ.

మంజు— ఒక వృక్షములయందే కాదు. సర్వపదార్థములయందును నందంద స్వర్లోకవస్తువుల నతిక్రమించునవి భూలోకమ్మునం గలవనుటకు మనకుఁ బ్రభావతీరామణీయకమే ప్రథమసాక్షి.

శుచి— ప్రద్యుమ్నుని సౌందర్యము, రతీదేవి లావణ్యము, శ్రీకృష్ణదేవుని మహానుభావత్వము- ఇవి యన్నియును భూలోకము స్వర్గలోకమును ధిక్కరించుననుటకు సాక్షులే. ఇంతవఱ కెందులకు? వజ్రనాభు ప్రతాపము ముందు మన ఱేని పరాక్రమము పూరిపుడకయుం గాకపోవుటచేతనే భూలోకప్రభావమును దెలిసికొనవచ్చును.

మంజు— వజ్రనాభుని మాటట్టులుంచుము. రావణకుంభకర్ణహిరణ్యాక్ష హిరణ్యకశిప్వాదిరాక్షసులలో నొకని నేని మన ఱేఁ డుక్కడగింపఁ గలిగెనా? ఈ మహాశూరాగ్రేసరులకెల్ల భూలోకమే కదా జననస్థానము! మఱియు నీవీరాగ్రేసరుల నణఁపఁగల్గిన శ్రీరామాద్యవతారముల కీ భూలోకమే కదా పుట్టినిల్లు! ఎన్నివిధములఁ జూచినను స్వర్గము భూలోకమునకుఁ దీసిపోవు ననియే చెప్పవలెను.

శుచి— ఒకవిశేషము మాత్రము మనము యోజింపవలెను.

శా. భూమప్రాభవులైన రావణముఖుల్ భూమ్యుద్భవుల్ వారి యు
ద్దామస్ఫీతభుజాబలం బణఁచు నా ధన్యాత్ములున్ భూజనుల్
భూమిన్ స్వర్గముకన్న హెచ్చనవలెన్ బో! యన్న నే నొప్ప నీ
రామాద్యార్యులయందు దైవతకళల్ రంజిల్లి పెంపొందుటన్.

మంజు— నీయోజన కడుంగడు సమంజసమే. ఉక్తిప్రత్యుక్తులకేమి, అవిచ్ఛిన్నముగాఁ బ్రసంగము నడుచుచునే యుండును. రామాదు లెంత దైవతేజస్సంపన్నులైనను,

ఉ. చక్కని శీలముం గలిగి సజ్జనరక్షయు దుష్టశిక్షయు
న్నెక్కని యాచరించుచు మనీషిహితమ్ముగ రాజ్యమేలువా
రక్కట! రావణాదులకు నంతము రామముఖుల్ ఘటింతురే
మొక్కలులైన ఱేఁడులకు మూర్ఖత మారక యెన్నిభంగులన్.

శుచి— (ఆకసమువంకఁ జూచి) సఖీ! మనము ప్రస్తుతమును మఱచి యేదో మాటలాడికొనుచున్నారము.

చ. పడమటికొండ దాపునకు భానుఁడు చేరఁ గడంగుచుండె ముం
దడుగిడుచుండె నీడ తన ప్రాణవిభుం గలియంగ సంభ్రమం
బడరఁగ నేగు చాయ క్రియ నాతపపుంబెనుకాఁక తగ్గఁగాఁ
దొడఁగె నిఁకిప్పుడో, యిఁకనో తోఁటకుఁ గృష్ణునిపట్టి రాఁదగున్.

నాఁడు శ్రీకృష్ణభగవానునితోడంబలెఁ గుమార ప్రద్యుమ్నునితోఁ జనవు విస్తరించలేదు. "అయ మయ" మితి ప్రత్యభిజ్ఞగా నన్నతఁ డెఱుంగునో, యెఱుఁగడో? యని కూడ సందియము. ఇట్టిచో మన మతనితో గోప్యాతిగోప్యమ్మగు ప్రస్తుత కార్యనివేదన మెట్లు నిర్వర్తింపఁ గలుగుదుమో కదా.

మంజు— ఏమి యిట్లనుచుంటివి?

తే. గీ. ఉత్తమకులస్థులగునట్టి యోగ్యు లెందుఁ
బితృబహూకృతులందు నమ్రతము లగుదు
రెఱుఁగవె? జయంతుఁ డెటు మనయెడఁ జరించు
నటులె ప్రద్యుమ్నుఁ డిట సందియంబు వలదు.

ఇంతియకాని యుపేంద్రపుత్రునకు నింద్రబహూకృతులయెడల గౌరవం బప్రయత్నసాధ్యం బని నేనూహింతు.

శుచి— బాగు, బాగు. నీయూహ మిక్కిలి చక్కఁగా నున్నయది. పినతండ్రి పెదతండ్రి కొమరులగు వీరలిరువురును సర్వథా మన కొకటే విధమున నభిగమ్యులగుటకు సందియ ముండఁ గూడదు.

మంజు— ఇదిగాక, యింద్రసన్నిధానవర్తులమగు మనము సర్వథా యమరుల లోనివారము. నరులు మనయెడల గౌరవము చూపుట యొక యక్కజము కాదని నాతలంపు.

శుచి— "కలివోసినను నుట్టినంకకే చూచె" నన్న సామెతగా నింకను నీవు మన యింద్రుని యింద్రత్వమ్మను, మన యమరుల యమరత్వమ్మను దలపెట్టి పొంగుచుంటివేమి? ఎవరేని ప్రస్తుతమ్మగు మనలోకదుస్థితి నెఱుఁగని రాజపుత్రులు మన యెడల నట్టిగౌరవము కల్గి యుండిన నుందురుగాక.

ఉ. మా నగుఁబాటుఁ బాపుమని మాటికి నింద్రుఁడు వచ్చి కృష్ణునిం
దానయి ప్రార్థనల్ సలుపుఁ దద్విధమెల్ల నెఱుంగునట్టి యా
ధీనిధి రుక్మిణీసుతుఁడు ధిక్కృతిఁ జూపక యస్మదాదులం
బూనిక గౌరవించు నని బుద్ధిఁ దలంచుట యెట్టిదో కదా!

ఇదియునుంగాక మన యింద్రు లెందఱైనను నొక నందనందనునికి దీటగుదురా? దీనిం గురించి మన మిప్పుడే కొంత చర్చించుకొని యుంటిమి. మరలఁ బ్రసక్తి దెచ్చితివి. కాన కొంత విస్తరింప వలసి వచ్చినది.

సీ. అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుఁ డితం
డాతఁడో స్వర్గమాత్రాధినేత
సృష్టిస్థితిలయమ్ము లితని కార్యము లాత
నికి శక్తి యిందొక్కటికిని లేదు
యాపదధ్వరరూపుఁ డగు నీతఁ డాతఁడో
యాగైకదేశభాగాధికారి
అనవరతంబు పాయదు లక్ష్మి యితని నా
తని కట్టి యోగమ్ము తఱచు లేదు
తే. గీ. లోకశాసనుఁ డీతండు పాకమాత్ర
శాసనుఁ డతండు వాక్యవిస్తరమదేల?
మర్త్యతామర్త్యతలకేమి, మన విభునకుఁ
గృష్ణునకుఁ దారతమ్య మెంతేని గలదు.

మంజు— అవును. నీవనినట్లే. ప్రత్యక్షమ్ముగా ననుభూతమ్ముగు నీయంశమునఁ గూడఁ బొరఁబడుట నా బుద్ధిమాంద్యమే. యదునందనుండు లీలామానుషవిగ్రహుండు, సాక్షాత్పరాత్పరుండు నని యెఱిఁగియు నప్పుడప్పుడు బ్రహ్మాదులే యజ్ఞానమున బ్రుంగుడుపడుచుండఁగాఁ బక్కలము మన లెక్క యేమి!

సీ. పురిటింట నున్నయప్పుడ పూతనను గూల్చి
మేటివిఖ్యాతిచే మించినాఁడు
అతిబాల్యమైన ప్రాయమున మద్దులఁ గూల్చి
యందరాని యశమ్ము నందినాఁడు
అంత కింతైన ప్రాయమ్ములోనన దావ
దవము మ్రింగి ప్రశస్తిఁ దవిలినాఁడు
అంత కొక్కింత హెచ్చైన ప్రాయముననే
నగమెత్తి సత్కీర్తి నెగడినాఁడు
గీ. కాళియాహిమదం బడఁగంగఁ ద్రొక్కెఁ
గంసు హింసించెఁ దనవారి కష్ట ముడిపె
రుక్మిణిని బెండ్లియాడి నిరూఢి మెఱసెఁ
గృష్ణుఁడు పురాణపురుషుఁడు విష్ణుమూర్తి.

శుచి— శ్రీకృష్ణుండు పరాత్పరుండను నంశమును దెల్పు విశేషమ్ము లెన్నియేనిఁ గలవు. వానింగుఱించి పునరుక్తిగాఁ బ్రసంగింపనేల? మనప్రస్తుతకార్యము చూచుకొందము. కాల మతిక్రమించుచున్నది.

మంజు— (దూరముగాఁ జూపు నిగిడ్చి సంతసముతో)

మ. అదె యుచ్చైశ్శ్రవమో యనంగఁదగు నయ్యశ్వమ్ముపై నెక్కి యొ
ప్పిదపుం జక్కఁదనంపుఁబ్రోవనఁగ నీ వీథిన్ రతీశుండు స
మ్మదసంపాదకసర్వలక్షణలసన్మందానిలాందోళనా
భ్యుదయన్మానికప్రసాదకలనాపూర్ణుండు రానయ్యెడిన్.

శుచి— సఖీ! మనమరుదెంచిన కార్యమ్మునకుం దగిన సమయము ప్రతీక్షించుచుఁ గొంతతడ వీ సమీపస్థమ్మగు మాధవీకుంజమ్మున డాఁగుట యుచితము. ఏమందువా? ఒకవేళ నిక్కుమారుం డీనాఁడు కార్యాంతరమున రసాంతరవ్యాకులుండై యుండునెడల నివేదించినను మన ప్రయోజనము నిష్ఫలమగును గదా!

మంజు— నీవూహించినది చక్కఁగానే యున్నది. (డాఁగుదురు)

(అంతఁ బూర్వోక్తరీతిగాఁ బ్రద్యుమ్న ప్రవేశము)

ప్రద్యు— (సోత్కంఠముగాఁ దనలో)

ఉ. ఆ సొబ, గా మనోహరత, యా యనవద్యత, యా సమస్తసు
శ్రీసమవేతతాగరిమ, చెల్వలయందు మఱొక్కచోఁ గనం
గా సమకూర, దారచన కంజభవుం డెటు లాచరించెనో!
దోసము వీసమే నచటఁ దోఁచ దటుల్ ఘటియింప శక్యమే?

(స్మృతి నభినయించి) ఔను. మఱచితిని. "ఈపెను దాను స్వయముగా సృష్టించితి" నని కదా యంబిక వచించియున్నది అట్లే కానిచోఁ బరమచ్ఛాందసుఁడు కంజభవుఁ డేడ? ఆ యాకృతివిశేష మెక్కడ? నిశ్చయముగా నంబికచేతనే యక్కన్నియ నిర్మింపఁబడినది. ఇది యిటు లుండుఁగాక. ఔరా, ఆశ్చర్యము! అయ్యది చిత్తరువే యయ్యును సజీవము భంగిఁ బొడకట్టుచున్నదే!

ఉ. చూచినయట్లు బల్కుబడి చొప్పడినట్లు దరస్మితప్రభల్
దోఁచినయట్లు నా మదికిఁ దొయ్యలిపట్టున సారెసారెకున్
గోచరమయ్యెడిన్, గుసుమకోమలిచిత్రపటంబె యింత "దో
బూచియు దొంగబూచి" యఁట! పొత్తిమ కెంతభ్రమంబు గొల్పునో!

(ఆశ్చర్యముతో) ఆహా! పరమేశ్వరికి నాయం దెంత యనుగ్రహము లేనిచో,

మ. కలయంబుం బొడకట్టి "యేను త్రిజగత్కల్యాణినో యన్న! త్వ
త్కులజుల్ గొల్తురు వన్న వేలుపుగ నాకున్ మేనయల్లుండ వీ
వలఘుప్రాభవ! నీకుఁ గన్యనిడుటల్ న్యాయంబగుం జూడు మీ
లలనన్, వచ్చినచో గ్రహింపు" మని బాలాచిత్రమున్ జూపునే!

ఔను. ఈ యనుగ్రహ మా యంబికకు నేఁటిదిమాత్రమే కాదు.

సీ. అస్మజ్జనకుని దివ్యావతారమునకుఁ
దోడునీడై యుండి త్రోపు చూపె
నా తల్లి పెండిలినాఁ డీపె చేసిన
సాహాయ్య మది యెన్న శక్య మగునె
దరిఁజొచ్చి రాకున్నతరి నిమ్మహామాత
కృపయే కదా కీడు గడపి ప్రోచెఁ
దండ్రిమా టటు లుంచుదము నా పునర్జన్మ
మున కీపెయే కదా ముఖ్యహేతు

గీ. వొకఁ డనఁగ నేల? యిమ్మహాయోగమాయ
లేని కార్య మొక్కింతయు లేదు జగతి
సకల మీపె వశమ్మున జరుగు నీపె
మాత్రము స్వతంత్రతామహిమమున నొలయు.

(యోజించి) జగదంబికకు మనయందుఁగల యనుగ్రహము వర్ణనీయ మనుట యటులుండుఁ గాక. బాగుగఁ బరిశీలించినచో నిప్పట్ల నేదో యొక దేవరహస్యము గూడ నుండితీరవలయును. అట్లేకానిచో,

శా. నా కాంతామణికన్న సుందరులు భూనాకాదిలోకమ్ములం
దేకన్యాతిలకమ్ములందుఁ గన రానే రారటంచుం జగం
బేకీభావమునన్ వచించెడిఁ గదా! యిట్లుండ, నేతాదృశ
స్త్రీకాంతున్ భ్రమగొల్పు కాంత నొకతెన్ సృష్టింపఁగా నేటికిన్?

ఇయ్యెడ నంబిక కల్పించిన "మేనయల్లుండవు" లోనగు దూరపు బాంధవ్యమాత్రమున సంశయనివృత్తి యగుట లేదు. ఇదియే నిక్కమగు నేని యీబాంధవ్య మింతకు మున్నే మైనది? ఈ యంశము ఫలమువలన నిర్ణయింపఁదగినదియే కాని యింత నంతఁ దేలునది కాదు. (స్మృతినభినయించి) ఏమీ, నా నర్మసఖుఁడు గౌతముఁ డింకను రాకుండెనే! అతఁడును, నా చిత్రపటమును దక్క నా కియ్యెడఁ గాలయాపనోపాయమ్ము గనపట్టదు. (అతనికై ప్రతీక్షించుచుండును)

శుచి— (మెల్లగా) సఖీ! కనుపెట్టితివా? ఈ మనోహరాకారునియం దేదో గొప్ప మార్పు పొడకట్టుచున్నయది. ఆకారగోపనమున నిపుణుఁడయ్యు నీతఁడు ప్రకృతమున నన్యథాగానే కనుపట్టుట కేదో పెద్ద వికృతికారణ ముండితీరవలయునుజుమీ!

మంజు— అవును. నాకును నట్లే తోఁచుచున్నది.

మ. మనమం దేదియొ దొడ్డకోర్కె కొలకై వల్లాడుభావమ్ము తోఁ
చిన దీకృష్ణునిపట్టిమోమున జగచ్ఛ్రీయమ్ములం గూర్చు ద
ట్టునపత్యమ్మునకున్ లభింపని దొకండుం గల్గునే? యట్టులే
నిని వేఱొక్కటఁ బూర్ణకాముఁడగువానిం జూడ వాటిల్లునే.

శుచి— అది యేటియూహ? తండ్రికిఁ దెలియకుండ నెఱవేర్చుకోఁదగిన కోర్కు లుండఁగూడదా?

మంజు— (ఎకసక్కెముగా) మహాకవితాధురంధరురాలవు. నీ యూహయే నిక్కమగుఁగాక. అగుచో,

మ. రతికిన్ భర్త యితండు ముజ్జగములన్ రమ్యత్వమందున్ ప్రభా
వతికిం దక్క మఱొక్కలేమ రతిసావర్ణ్యమ్మునన్ మీఱదీ
యతివం గృష్ణునిపట్టిచూచుటయొ లేదా వింటయో యిందు సం
గతముం గావలె నిట్టిదే జడుఁడు సంకల్పించి జీవించెడిన్?

శుచి— తనకోమిరె స్వప్నమునఁ గూడ నేరికిని నగుపట్టకుండ వజ్రనాభుని శాసనము ప్రతిబంధింపఁ గలుగునా యేమి?

మంజు— మహాకవయిత్రివి. నీకు బోధించుపాటిదాననుగాను గాని, యననుభూతవస్తుసందర్శనముపట్ల స్వప్నములు ప్రయోజనకారులు కావు గదా?

శుచి— నీమాట శాస్త్రజ్ఞసమయానుసారి కాదనను గాని, యీ శాస్త్రజ్ఞసమయమునే పట్టినచో మన ప్రభావతికిఁ బ్రద్యుమ్నసందర్శనమాత్ర మెట్లు సంఘటించెడిని. ఈ స్వప్నమునకుఁ బూర్వానుభూతి నెట్లు కల్పించెదవు?

మంజు— నీవిచ్చినయాపత్తి దుర్వారమే కాని యట శ్రీమత్పరదేవతానుగ్రహ మఘటితఘటనాసమర్థకత నందవచ్చును గదా?

శుచి— అగుచో నాపరదేవత యనుగ్రహమునే యిద్దఱఁగూడ మన మనుసంధించుకోఁ గూడదా?

మంజు— "తినఁబోవుచు రుచు లెందులకు?" (దృష్టి ప్రసరింపఁజేసి) ప్రద్యు మ్నుని చెలికాఁడు కాఁబోలును వచ్చుచున్నాఁడు. వీ రిరువురసంభాష ణలో మనకుఁ బ్రస్తుతవివాద్యాంశము తేలకపోదు.

[గౌతముఁడు ప్రవేశించును.]

గౌత— (విసువుతో) ఇదిగోనయ్యా! నీ చిత్రపటము. నీవిద్దానిని ముసలాగ్రి బాధ్ధినగు నాచాకచక్యము సర్వము నెఱిఁగియు నాచేతికి దాఁపనిచ్చితివి. దాఁచినచోటు వెదకుటకు నాకింతసేపు పట్టినది.

ప్రద్యు— మిత్రమా! ఇయ్యది సూక్ష్మవస్తువుగాదే, దీనిని వెదకవలసి యేల వచ్చెను?

గౌత— నీకీవిరహతాపములో మతియేపోయినట్టులున్నది. దాఁచినచోటు నే మఱచితినని నేను జెప్పుచుండఁగా, వస్తునిష్ఠమగు స్థౌల్యసౌక్ష్మ్యవిచార మున కవకాశ మెక్కడనున్నది? అదియునుంగాక, చిత్రపటము సూక్ష్మ వస్తువుకాకపోవచ్చును గాని, నాబుద్ధి సూక్ష్మాతి సూక్ష్మవస్తువుగదా, యీసూక్ష్మవస్తువున కీస్థూలపదార్థము గోచరింపనిచోఁ దప్పేమి? ఇది యిటులుండుఁగాక. చెలికాఁడా! ఈచిత్రపట మెటులభించె? ఇందలి స్త్రీ యెవ్వతె? ఈ పటము లిఖించిన శిల్పియెవ్వరు? నాకుంజెప్పనగు నేని జెప్పుము.

ప్రద్యు— (చిఱునవ్వుతో) నీకుం జెప్పఁదగనిదియని నాకించుకయు సందియము లేదు గాని నా చెప్పువిషయమును నీ వెంతవఱకు విశ్వసించెదవో యని శంకించు చున్నాఁడను.

గౌత— (వికృతముగా నవ్వి) సఖా! నీకే నమ్మిక లేనివిషయమున నాకెట్లు విశ్వా సము గలిగెడిని.

ప్రద్యు— ప్రత్యక్షప్రమాణముగ నీ చిత్రపటము కన్పట్టుటచేఁ గాని ప్రస్తుత విషయమున నాకును నమ్మిక లేకపోవలసినదియే.

గౌత— వృథా కాలయాపన మెందులకు? కథాసందర్భమును వచించితివేని యందలి సత్యాసత్యములను నేనే నిర్ణయించికొందును.

ప్రద్యు— చెలికాఁడా! పరమేశ్వరియని చెప్పఁగా వినియుంటివికదా?

గౌత— వినకేమి? మీతండ్రి శ్రీకృష్ణభగవానుఁడు పసివాఁడుగానున్నప్పుడు పురిటింటికిఁ గంసునిపంపున వచ్చి పాలిచ్చి తుట్టతుదకుఁ జచ్చిన పెను రక్కసినే యెఱుఁగనా?

ప్రద్యు— (నవ్వి) ఆపె దుష్టబుద్ధియగు పూతనగదా?

గౌత — సుబుద్ధి యగు నీపె యెవ్వరు ?

ప్రద్యు — సాక్షాత్పరదేవత.

గౌత — ఆమాటకు నాకర్థమే తెలిసినదిగాదు.

ప్రద్యు — విస్తరించి వచించెద నాలకింపుము.

సీ. జగములు సృష్టించి సంరక్షణ మొనర్చి
విలయ మొందించు నే విశ్వజనని
మూఁడుమూర్తులకును మూలకందంబయి
సకలమ్ము నడపు నే సర్వసేవ్య
అమృతసముద్రమధ్యగతమణీద్వీప
మందుఁ జెల్వారు నే సుందరాంగి
హృల్లేఖలోనా ననేక శక్తులతోడ
నిండుకొల్వుండు నే నిరుపమాన

గీ. యాపెయే పరదేవత యాపె యాజ్ఞ
కతన సకలమ్ము జరుగు నొకండుగాని
తద్వశుఁడు గాక తీరదు తన్మహస్సు
సకలము నతిక్రమించి స్వేచ్ఛను రహించు.

గౌత — ఓహో ! నీ మూఁడవహస్తమునకుఁ బరిమితి లేకున్నదే. ఈ దేవతను జెప్పుట కింతసోద పెంచితివేమి ? "మనగ్రామదేవత దుర్గ" యని చెప్పిన మాత్రన నేను దెలిసికోఁగలను గదా ! మనమర్గ స్వప్నమునఁ బొడకట్టి నీకీ చిత్రపటము నిచ్చినట్లు విస్పష్టమైనది. నాకును ననేక పర్యాయములు స్వప్నములో రాజ్యాధిపత్యము లభించినట్లు, పక్వాన్నములతోఁ గడుపునిండ భుజించినట్లు, మఱియు నేమేమో మహాయోగములు చేకూరి నట్లగపట్టుట కలదు. కాని కన్నువిచ్చి చూచునంతలో యథాపూర్వపుఁ గుటీరమే, యథాపూర్వపు మంచమే, ప్రత్యక్షమగుటతప్ప వేఱొండు గానరాదయ్యె. "అద్దములోనిముల్లె, కలలోనివార్త" లోనగు లోకోక్తులుకూడ నా యనుభవము నే బలపఱచుచున్నవి. అయినను మాకును నీకును బోలికకాదుగదా ! సాక్షాన్మహాలక్ష్మీ పుత్రుఁడవు. నీవు పట్టిన దెల్ల బంగారమగుటకు సందియముండదు. అందుచే నీకు స్వప్నదృష్ట పదార్థములుగూడ నుపలబ్ధములగుచుండంబోలు. లేదా, యే యైంద్రజాలికుఁడేని వంచించి గ్రామదేవతారూపముం గనఁజేసి యీపటము నంటఁగట్టి సుఖముగానున్నవాని కీపరితాపము తెచ్చిపెట్టియేని యుండవలెను. కానిమ్ము, ఎట్లయిననేమి, నీకీ చిత్రపటము లభించినమాటలు మాత్రము సత్యము. ఇఁక భవితవ్య మేమి ?

ప్రద్యు—భవితవ్యమునకేమి, ముందు పరమేశ్వరివచించిన వాక్యములువినుము.

గౌత— వచింపుము.

ప్రద్యు— ఈ విషయము పరమరహస్యముగా నుంచఁదగినది. నీనోట నువ్వుగింజ నానదు. అంతిపురమున కెక్కనిచ్చెదవేమో?

గౌత— నా తెల్విలోపముచే నీయంశ మంతిపురమున కెక్కనక్కఱలేదు. నీముఖకళవలననే యట నీ రహస్యము బయలుపడవచ్చును. లేదా, యే నిదురవేళనో యున్నదున్నట్లు పలవించుటవలననేని బయలుపడఁగలదు. అపుడు గూడ నీవు నాయందే యపరాధమును మోపవుగదా?

ప్రద్యు— (అనాకర్ణితముగా) గోప్యాతిగోప్యమైనను ప్రాణమిత్రుఁడ వగుట నా రహస్యమును నీకర్ణమున కతిథిం గావించుచున్నాఁడను.

గౌత— అట్లయినచో నీయెడమచెవిలోఁ జెప్పుము.

ప్రద్యు— ఏమటులంటివి?

గౌత— బ్రహ్మోపదేశపావనమ్మగు దక్షిణకర్ణమ్మున నీశృంగార వార్తావర్ణమ్ములను ధరింపఁజాలను. అపుడు నీరహస్యము బయలు కావచ్చును.

ప్రద్యు— నీతో నాకు వాదెందులకు? ఎట్లేని నీవు గోప్యముగాఁ గాపాడుటయే నాకుఁ గావలసినది. (ఎడమ చెవిలో నేమో చెప్పును.)

గౌత— అంబికకు నీవేదో దూరపు బాదరాయణసంబంధముచే మేనయల్లుఁడవను హేతువునఁ గన్యాగాన మొనర్పవలసివచ్చినట్లును, నక్కతన లోకోత్తరతరుణీమనోహరుండవగు నీకొఱకే ప్రతిమాగతమగు కన్యారత్నమును సృష్టించినట్లును విస్పష్టముగాఁ దెలియుచున్నది. (పెదవి విఱచి) ఆపె యెంత మహానుభావురాలైనను నిప్పట్ల నీయెడలఁ దలపెట్టిన కార్యము చాల శిష్టవిగర్హితముగాఁ దోఁచుచున్నయది.

ప్రద్యు— మిత్రమా! ఏమట్లంటివి?

గౌత— నేనేకాదు. ప్రకృత మంబికపూనిన యిక్కార్యము నేప్రాజ్ఞులును సమ్మతింపరు. భార్యాభర్తలను విడఁదీయఁబూనుటకన్న దుష్టకార్యమేముండును? వినలేదా, నీవీ పద్యమును?

శా. "తల్లింబిడ్డలఁబాయఁ జేయుటయు నిద్రాభంగముల్ భర్తలో
నిల్లాలిన్ విడఁదీయఁబూనుటయు దుష్కృత్యప్రవృత్తిం గథా
సల్లాపమ్ముల కంతరాయకృతులన్ సంధించుటల్ తుల్యమై
చెల్లున్ దేవర! బ్రహ్మహత్య కివి నా చేసేఁతఁ జేయింతువే!"

ప్రద్యు — వేఱొక తలోదరితో సంపర్క మేర్పడినంతమాత్రమున భార్యకును భర్తకును నెడఁబాటు వాటిల్లుననుకొనుట శృంగారరసవేత్తలు సమ్మతించునది కాదు. అట్లేని దక్షిణనాయకుఁ డీలోకమున నుండకపోవలసి వచ్చును. ఇదిగాక, నీవు శృంగారమునందు ధర్మశాస్త్రప్రసంగము నిమిడ్చి నీ బుద్ధిమాంద్యమును వెలిఁబుచ్చుచున్నాఁడవు.

గాత — (కోపముతో) అనేకసహస్రవనితాకాముకుని కుమారరత్నమునకు నా చెప్పు ధర్మవాక్యములు బుద్ధిమాంద్యప్రయుక్తములగుటలో నాశ్చర్యమేమి? పోనిమ్ము, నాకెందులకు? నేను నీకార్యమునఁ జేయవలసిన సాహాయ్య మేమో వచింపుము. శక్తివంచనలేక పాటుపడి నీమెప్పునకుఁ బాత్రుఁడనుగాఁ బ్రయత్నించెదను.

ప్రద్యు — ఇంతమాత్రమునకే యింత కోపమేల? మనస్సు కుదురుపఱచికొని యంబిక యుద్దేశ మిప్పట్టున నెట్టిదియై యుండునో విచారించి నిర్ణయింపుము.

గాత — (కనులుమూసికొని ధ్యానము నటించి)ఇదిగో, గోచరించినది. నీభార్య సౌందర్యాదిలక్షణములలో స్త్రీజాతికెల్ల నుపమాస్థానమేయైనను, నీకన్న వయస్సునఁ జాల ముదురు. వయోధికతరుణీసమాగమమువలనఁ గల్గు నష్టములకుఁ బరిమితిలేదని శృంగారరసవేత్తలే కాక భిషగ్వరులు కూడ వేనోళ్ళ ఘోషించుచున్నారు. కాన నీభార్యకన్న మిన్నయు నీకన్న వయసునఁ జిన్నయు నగు నీకన్నెమిన్నను నీయందలి యనుగ్రహముచే జగదంబిక సృష్టించి యుండునని నేనూహించుచున్నాను.

ప్రద్యు — నీయుత్ప్రేక్షాపాండిత్యమున కేమిగాని, యీతలోదరి తనుసౌష్ఠవ ముం దిలకింపుము.

గాత — రతిమనోహరు నువ్విళ్ళూరఁ జేయుటచేతనే యీకన్నెమిన్న సౌందర్యమునకుఁ బ్రతిష్ఠాపత్రము లభించినది. పరికించినచో నెందేని గొన్ని లోపము లుండకపోవు.

ప్రద్యు — అంబిక స్వయముగా సృజించిన యీ యన్నుమిన్న సొబగునందుఁ గూడ లోపముల నాపాదింపఁగలవాఁ ధుంధుఁడవా ?

గీ. శుకపులకుమారు భావసామ్రాజ్యలక్ష్మి
నెట్టి సామగ్రిఁ గల్పించి యొసఁగుఁ గన్చు
నములను దర్శింతురో, యట్టి సామగ్రికన్న
మిన్న యీకన్నె యుండు లోపమైనఁ ధర్మమె ?

గౌత— కవుల వర్ణనములును కాముకుల మనోదౌర్బల్యములును నే నెఱుఁగనివి కావు. నీవు కడుంగడు వలచి కులుకుచున్న యిక్కన్నెయెడల నేను లోపములు చూపుట పాడిగాదని కాని, లోపములు లేకపోలేదు.

ప్రద్యు— ఏదీ చూతము, నీ వొక్క లోపమును బరిగణింపుము.

గౌత— అట్లేని యీపటము నిటు తెమ్ము. (పటము పుచ్చుకొని తదేకదృష్టిగాఁ జూచుచుండును)

శుచి— (మెల్లఁగా) చెలీ! ఇక్కడికిఁ దేలినదా? ఈ ప్రసంగమంతయును మన ప్రభావతికి సంబంధించినదే. ప్రభావతికిఁ బ్రద్యుమ్నుని స్వప్నమునఁ జూపి చిత్రపట మిచ్చి యరిగినట్లె ప్రద్యుమ్నునకును బ్రభావతీ చిత్రపటము నొసంగి యంబిక యంతర్ధానమునొందినట్లు స్ఫుటమగుచున్నది.

మంజు— విషయమంతయు నీ వూహించినటులే యున్నది, కాని వీరి ప్రసంగములో నింతదనుక మన రాకన్నియ నామాక్షరములు మాత్రము వినఁబడలేదు సుమా!

శుచి— నామాక్షరములు వేఱుగ వినఁబడవలయునా? రతిమనోహరునిఁ గూడ నిటు లువ్విళ్ళూరింపఁగల తనుమధ్య మనప్రభావతిగాక వేఱెవ్వరగును?

మంజు— అవును. నీవనినట్లె. (వినుట నటించి) మరల వారేదో ప్రసంగించుకొనుచున్నారు. విందము.

గౌత— ఇహిహిహిహి చెలికాఁడా! ఈపె యేమో సర్వానవద్యాంగి యని నీవు కడుంగడు మురియుచుంటివి. నా కిక్కన్నియ రామణీయకమునందు దోసఁగులు కుప్పతిప్పలుగాఁ బొడకట్టుచున్నయవి.

ప్రద్యు— ఏదీ, చూత యొక్క దొసంగునేని నిరూపింపుము?

గౌత— అట్లేని యవధరింపుము. ఈలతాంగి నెమ్మోము మూఁడుముహూర్తములఁ జందురుని బుణికిపుచ్చుకొనుటకు నీ వొప్పికొందువా?

ప్రద్యు— ఆ! నిస్సందేహముగా నొప్పికొందును. అగుచో నిదియే యొక దోసఁగమువా యేమి?

గౌత— తొందరపడకుము. "కశ్చిత్కాంతా" యనుటతోడనే పూర్వపక్షమున కారంభించుటా! కొంచె మోపిక పెట్టుము. అంతవఱ కొప్పికొంటివికదా!

ప్రద్యు— ఒప్పికొంటినని మున్నే తెల్పితినిగా.

గౌత— ఆ! అట్లేని తోవకే వచ్చితివి. కురుల నిటు చూడుము. ఈబిడ

కనుఁగవ పద్మముల యందమును జూఱఁగొనుటకుఁ గూడ నీకొప్పుదలయేనా ?

ప్రద్యు— ఆ! ఒప్పుదలయే. వక్తవ్యమును వచింపుము.

గౌత— ముమ్మాటికి నొప్పుదలయే కదా ?

ప్రద్యు— ముమ్మాటికే కాదు. ఎన్నిమాఱులకేని యొప్పుదలయే.

గౌత— అగుచో, నిఁక వినుము. ఈపె బ్రహ్మసృష్టి కాదనియు, జగదంబికా సృష్టియనియు, నక్కతన నిరవద్యాంగి యనియుఁ గడుంగడు నుబ్బి తబ్బిబ్బగుచుంటివిగదా! చంద్రుఁడు ప్రకాశించునపుడు పద్మములు ప్రకాశింపవు. పద్మములు ప్రకాశించునపుడు చంద్రుఁడు ప్రకాశింపఁడు. ఈ యంశము సర్వజనులకు విదితమే. నీ విందుల కేమి సమాధానము చెప్పి యీపె సౌందర్యమును సమర్థించెదవు ?

ప్రద్యు— (చిఱునవ్వు నవ్వి) ఇవియా, నీ యోజన! సెబాసు. "ఘృతమునకుఁ బాత్ర మాధారమా, పాత్రమునకు ఘృత మాధారమా?" యను సామెతను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది. సాక్షాచ్చంద్రపద్మములకుఁ గల విరోధ ముపమేయములపట్లఁ గూడ వినియోగించుట లోకానుభవ విరుద్ధము కదా! ఇది యిటులుంతము. వేఱొకచో నొక తేజస్విం గుఱించి ప్రస్తావించుచుఁ గవి యగ్నితోఁ బోల్చె ననుకొందము. ఇఁక నా తేజస్వి నివసించు గృహ మెట్లు పరశురామప్రీతికిఁ దావలముగాక నిల్చెనని కూడఁ బ్రశ్నింపవలసినవాఁడవే యగుదువా ?

గౌత— నా కీమాత్రమును దెలియకపోలేదు. మొగము చంద్రునివంటిదిగా విరచించిన శిల్పి కనుఁగవను గలువలవలె నిర్మించుట సమంజసము. అట్లని యౌచిత్యవిదులు మెత్తురు. లేదా పెదవి విఱువకమానరు.

ప్రద్యు— కానిమ్ము. ఇంక నేమేని దోసఁగు నిరూపింపఁగలవా ?

గౌత— చూపకేమి ? కాని, నీవు "తా వలచినది రంభ"గా వాదించునపుడు నే నేమి చూపినను నీ మనస్సున కెక్కదు. కానిమ్ము. ఇక్కన్నియ యొక యవయవము పూర్తిగా లోపించినటులున్నది పరిశీలింపుము.

ప్రద్యు— (ప్రతికృతిని విలోకించి)

గీ. ఏ యవయవమ్మునం దెంత యెంత పుష్టి
యెంత సౌందర్యమున్నచో నెలమి భావ
విదుల కబ్బునో యట్టు లీ వెలఁది యొడలి
పస పసందుగ నొప్పి నా కెసక మెసఁగె.

అట్లౌటచే నీ మాటలు నా కర్థశూన్యమ్ములుగఁ బొడకట్టుచున్నయవి.

గౌత— కాముకులకు నావంటివాని మాటలయందే కాదు, వ్యతిరేకముగ నున్నచో మఱెవ్వరిమాటలయందును నర్థము పొడకట్టను. ఇది సర్వజనవిదితము.

ప్రద్యు— (చిఱునవ్వుతో) చెలికాఁడా! తనుమధ్యగా నుండుటగూడ నీ మతమునం గొండొకదోసఁగే యగునోటు?

గౌత— (తొందరగా) దోసఁగా! మఱియుం దోసఁగా! ఏమందువా? ఈ కన్నియ సర్వలక్షణలక్షిత యగుకతన మహాదృష్టశాలినియే యనుకొందము. మనుముందు నీకు భార్యయగుటయే నిక్కమగునేని నీప్రియురాలు రతీదేవికింబలెఁ గర్మవశమున నే రాక్షసరాజు మహానసమందేని యూడిగ మొనర్పవలసివచ్చినచో నీతనుమధ్యాత్వ మప్పట్ల నెంత యుపకారక మగునో విచారింపుము నన్నడిగితివా, యతివలకు సర్వథా నడుముపుష్టి ముఖ్యముగా నుండవలసిన దనియే చెప్పుదును. ఇట్లుండుట యంతఃపురచారిణీత్వమునకును నంత బాధకము కాదు. పక్షాంతరమునందో మహోపకారకమే. ఎంత యంతఃపురచారిణి యయ్యును దన యూర్ధ్వకాయము నేని తా నశ్రమమ్ముగ వహింపఁదగిన నడుముబలిమి కలిగియుండుట యొప్పకుండెడినా? ఏమి మాటాడవు?

ప్రద్యు— నీయొనర్చు నిరుత్తరపూర్వపక్షముపై నెవ్వరికిని నుత్తరము స్ఫురింపదుగదా? సఖా! తుట్టతుదకు నీ వాక్యసార మిట్లు పరిణమించినది. ఈ కన్నియ చంద్రముఖి, పద్మనయన, తనుమధ్య, స్థాలీపులాక న్యాయముగా నీయొనర్చిన విచారణంబట్టి చూచిన నీపె సౌందర్యము కడు మనోహరమని నీవును నొప్పికొనినట్లైనది.

గౌత— ఇహిహిహిహీ! నీమాట నేల త్రోసివేయవలయును? నా పూర్వపక్షములు నిరుత్తరములే యైనను, నీ యభిప్రాయము ననుసరించి యీ యతివ సౌందర్య మనవద్యమే యని యేనును నంగీకరించితి ననుకొనుము. ఈపె పేరేమో తెలిసికొంటివా?

ప్రద్యు— పేరుగూడ నీచిత్రపటమునందే లిఖింపఁబడియున్నది. తిలకింపుము.

గౌత— (చదివి) ప్రభావతి యను పే రీపెకుఁ దనుకాంతింబట్టియే పెట్టియుందురు. కాని వజ్రాదికమునకుఁబలె నీపె కాంతికిఁగూడఁ జిత్రపటముద్బోధకమగుటలే దనుటలో నాక్షేపణ యుండఁగూడదుకదా? అట్లగుటచే నీయంశము ప్రత్యక్షప్రమాణనిశ్చేయమై యున్నది. అంగీకరింతువా?

ప్రద్యు— (చిఱునవ్వుతో మిన్నకుండును.)

శుచి— సఖీ! ప్రస్తుతప్రసంగము మనకు సంబంధించినదే కావున మన మేతెంచినకార్యము సఫలమయినట్లే.

మంజు— అవును. కుమారు నెదుటి కరిగి సమయోచితముగ మన యరుదెంచిన సందర్భము నివేదించుటయే యింకఁ గర్తవ్యము.

శుచి— అట్లే కావింతము రమ్ము. (ఎదుటి కరుగుదురు.)

ప్రద్యు— (చూచి ఆశ్చర్యముతో) చెలికాఁడా! ఆ యంచల రామణీయకము విలోకించితివా?

గాత— ఆ! చూచితిని. ఇయ్యవి మన క్రీడాసరోవరపు రాయంచలవలెఁ గాక వేఱొక తెఱఁగునఁ గనుపట్టుచున్నయవి. ఇదియునుం గాక నిర్భయమ్ముగా మన నికటమ్మునకే వచ్చెడి ప్రౌఢతనము మిగుల నాశ్చర్య జనకము.

ప్రద్యు— అవును. మన యంచలకును వీనికిని జాలభేదము కలదు. మఱియు నీ రెంటిలో నొకదానినిఁ గొలఁదికాలముక్రిందటఁ జూచినట్లు జ్ఞప్తిం దగులుచున్నయది.

శుచి— (సమీపించి)

సీ. శుభమస్తు నీకు నిస్తులవయఃపరిపాక
సౌందర్యవిజితనిర్జరకుమార!
కళ్యాణమస్తు శ్రీకమనీయతరభోగ
భాగ్యపరిపూర్తిసంపన్న! నీకు
సుఖమస్తు నీకుఁ బ్రసూనశరాచాప
రావతార! మహానుభావ! దేవ!
ఆరోగ్యమస్తు సర్వాతిశాయి పరాక్రమ
క్రమాటోపనిర్వక్ర! నీకు

గీ. నీకు విజయంబు నీకు నిర్ణిద్రకీర్తి
నీ కఖిలలోకసమ్మాననీయగరిమ
యదియిది యనంగనేల? నీ యంటినట్టి
దెల్ల బంగారమగుఁగాక కృష్ణమూర్తి!

ప్రద్యు— (సంతోషముతో) సుకవిశిరోమణీ! భవదాశీర్వచనము శిరసావహించుచున్నాఁడను.

గౌత— (అపవారించి ప్రద్యుమ్నుతో) సఖా! ఇంతటివిక దా, యాశీర్వచనము. సర్వథా నీరొక్కటి నేర్పఁబడినట్లు దీనియర్థము స్ఫురించుచున్నది. "సత్కవి వాక్యము రిత్తవోవునే?" పక్షులలో నచ్చటచ్చట మాటలాడునవి కలవు గాని యర్థయుక్తముగ మాటలాడునవి లేవు. కావుననే "శుకానువాద" మని యర్థగ్రహణశక్తి లేని మాటలయెడ వాడఁబడుచున్నది. అందులో నీమాటలు కేవలము మాటలనుకోవలనుపడదు. ఛందోబద్ధములు గదా! ఇట్టి శక్తి మహాద్భుతము.

ప్రద్యు— సందియ మేమి? నీ వనినట్లే. మఱచితివేమో కాని యీయంచ శతవధానవిధానచాతురీధురీణము సుమా!

గౌత— (స్మృతి నభినయించి) అవును. నాఁడు మీతాతగారి జన్మంపు టుత్సవమునందు నవధాన మొనర్చిన యంచల జంటలోని శుచిముఖియా, యీయంచ?

ప్రద్యు— అవును.

గౌత— (శుచిముఖిదిక్కు) కవయిత్రీ! నీకుఁ గుశలమా? ఈ రెండవ రాయంచ నాఁటి నీ తోడిరాయంచయే యగునా?

శుచి— కాదు. ఆపె యశఃకాయము మాత్రమే ప్రస్తుత మీలోకమున నిల్చియున్నది.

గౌత— (చెవులు మూసికొని) శివశివా! యెంత దుఃఖకరమగు వార్త వినవలసి వచ్చినది.

గీ. శతవధానంపు శకటమ్ము నతిరయమున
మీర లిరువురు నడుపు నా ధోరణి విని
యిచటి సత్కవితల్లజు లెల్ల దలలుఁ
వంచిరి నమస్కరించి నుతించి రెలమి.

అక్కవులు నేఁడు నిన్నొంటరిగాఁ జూచి మిగుల విచారింతురు.

ప్రద్యు— సంశయ మేమి?

గీ. ఒండొరుల యాత్మలం గల యూహ లొండొ
రులు శ్రమమ్మవినాగనె తెలిసికొనుచుఁ
బద్యసంపూర్తి యొనరించు భాగ్య మరసి
యిపుడు నినుమాత్రమే చూచు టెంత చింత!

శుచి— (సవిచారముగా మిన్నకుండును)

ప్రద్యు— సర్వజ్ఞవగు నీ కొరకు బోధింపవలసిన యంశములు లేవు. "అపరి
హార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి"

ఆ. వె. నాన్నగారి దర్శనం బొనరించితే?
వారు నీవటన్నఁ బ్రాణ మిత్రు
లేమికర్జమునకు నీ విట కరుదెంచి
తదియు సఫలమైనదని తలంతు.

శుచి— కుమారా!

శా. శౌరిన్ గాంచితి భక్తిమీఱఁగ నమస్కారమ్ము గావించితిన్
నా రాకన్ హరి పృచ్ఛచేసె జగదానంద ప్రదంబైన మ
ద్రాగంధమ్ము వచించితిన్, విని సమాధానమ్ము వాక్రుచ్చె, నిన్
జేరన్ వచ్చితిఁ గార్య మిప్డె సఫలశ్రీ నిండి దైవారెడిన్.

మీరీ యుద్యానమ్మునకు రాకపూర్వమ మే మిట కరుదెంచి యియ్యె
డంగల రామణీయకమ్ములు తిలకించుచుంటిమి. మృదుమధురగంభీరమ్ము
లగు మీ యిరువుర సంభాషణంబులయందలి యుక్తిప్రతియుక్తులను గొం
డొక యాలించితిమి. సర్వథా ప్రభావతీ ప్రద్యుమ్నుల కత సత్కవీశ్వ
రుల కవితారచన కలంకారమై చెల్వారుఁ గావుత.

గాత— తథాస్తు. ఇక్కతలో మాతోఁబాటు నీవును నొక పాత్రమవై కార్య
నిర్వహణ మొనర్తువుగాక.

శుచి— లోకములోని వివాహనిర్వహణమునకును ప్రస్తుత వివాహనిర్వహణము
నకును జాల భేదముకలదు. తత్పట్టణప్రవేశాది సందర్భములకుం దగు
నుపాయమ్ము మహామాయాసనాథుం డగు శ్రీకృష్ణుండే యుపదేశింపఁ
గలఁడు. నా శక్తిపంచనలేక నేనును బాలుపడుదును. నేఁ బోయి
వచ్చెద. నా కానతిండు.

(శుచిముఖీ మంజువాణులు నిష్క్రమింతురు)

ప్రద్యు— చెలికాఁడా! మన రహస్యప్రసంగ మీ కపయిత్రి వినుటవలనఁ
గార్యభంగ మగుటకు బదులు కార్యసాఫల్యము సిద్ధించుచున్నది.

గాత— సఖా! ప్రస్తుత మీయంచ నీ ప్రియురాలి సన్నిధిని విద్వాంసురాలుగా
నుండినట్లు మన మూహించుకోవలయునా యేమి?

ప్రద్యు— సంశయ మేమి. ఆపె వాక్యములయందలి పొందిక యీ యంశమును
స్ఫుటముగా ధ్వనింపఁ జేయుచున్నది. చాటుననుండి మన ప్రసంగము

విని "తనకార్యము సఫలమైన" దని చెప్పుటచేఁ బ్రకృత మీ రాయంచ కవి యిక్కార్యమున దూతయని విస్పష్టమగుచునే యున్నది.

గౌత — నీ వూహించినట్లే. (ఆకసమువంకఁ జూచి) చెలికాఁడా! సంధ్యా వందన సమయ మప్పుడే యతిక్రమించినది. నేను నీతోఁబాటుగా స్వకృత్యమును మఱచి ప్రాయశ్చిత్తార్ఘ్యప్రదాన మొనర్పవలసినవాఁడ నైతిని.

ప్రద్యు — (ఎకసక్కెముగా) అవును, పాపము! నీవంటి మహాబ్రాహ్మణున కిట్టి దురవస్థ తటస్థింపఁగూడదు.

(తెరలో)

ఉ. అంబుజముల్ చలించెఁ బతగావళి గూళ్ళకు నేగుదెంచెఁ దీ
రంబులనుండి విప్రులు కరంబుల డంబుగ నీరుకావి వ
స్త్రంబుల సంపుటంబులు పొసంగ గృహంబుల కేగుదెంచి ర
భ్రంబున సంజ తగ్గ విరబాఱెఁ దిమంబు క్రమంబుగా దెసల్.

గౌత — గృహమ్మున కేగునప్పటికి శేషించిన సంధ్యావసరముగూడ నస్తమించును గాన నీ యుద్యానసరోవరమ్మున కేగి కాల్యకృత్యములు నెఱవేర్చికొని పదపడి సదనమ్ముల కేగుట యుక్తము.

ప్రద్యు — అట్లే కావింతము. (నిష్క్రమింతురు)

గద్య

ఇది... శ్రీ తిరుపతి వేంకటేశ్వర విరచితం బగు
ప్రభావతీప్రద్యుమ్న నాటకంబునం ద్వితీయాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయై నమః

# ప్రభావతీ ప్రద్యుమ్నము

## తృతీయాంకము

నారదుఁడు— (ప్రవేశించి తనలో) వజ్రనాభుఁడు పోటుటీఁగకుఁగూడ ప్రవేశ మంగీకరింపనివాఁడయ్యు సంగీత విద్యావ్యసనకారణమున నేఁటికిఁ బ్రతిపక్షకోటి పక్షపాతి యని సయితము నన్ను శంకింపక యంతఃపురకన్యకల విద్యను బరీక్షించుటకుఁ గోరి రప్పించినందులకు వీరలైనంతలోఁ బ్రస్తుతము కడుంగడు దీనులై నవయుచున్న నిలింపుల కుపకృతి నాచరించుట నా కత్యావశ్యకము కాకపోదు. ఇందుల కుపాయమేమి? (ధ్యానము నటించి) ఆహా! వరాకి శుచిముఖియెంత పని చేసినది! పరశక్తిచే ప్రభావతీ ప్రద్యుమ్నుల కాపాదింపఁబడిన యనురాగబీజమును బెంచి పెంపొందించి శాఖోపశాఖలుగల పెద్దవృక్షము గావించినది. ప్రభావతీసమాగమమున కేయుపాయమున నైననేమి, ప్రద్యుమ్నున కిప్పురప్రవేశము తప్పదు. అట్టితఱి నతఁ డెంత యసహాయశూరుఁడైనను గొండొకసహాయ ముండుట మఱింత బలకరము. కావున యదుకుమారులలో శూరాగ్రేసరులగు గదసాంబులకుఁగూడ నియ్యెడఁ బ్రద్యుమ్నునకుంబలెఁ బ్రవేశకారణము నాపాదింపవలయును. (యోజించి) ఇది నాకుఁ బ్రస్తుత మొక దుర్ఘటకార్యమును గాదు. ఏమనిన, వజ్రనాభసోదరుఁడగు సునాభుని కొమిరెలు చంద్రవతీగుణవతులు కొమరునఁ బ్రభావతికి దీటగుదురు. గదసాంబులో, ప్రద్యుమ్నునకు దీటగుదురు. కావున నీజంటకును నాజంటకును ననురాగబీజము నాటితినేని దీర్ఘస్వార్థములు రెండును గలిసివచ్చు ననుటలో సందియముండదు. (తలపంకించి) వీరల కనురాగము నాటునపుడు ప్రభావతికిఁ దెలియనీయఁగూడదు. ప్రభావతి ప్రద్యుమ్నునియం దనురాగిణి యను నంశమింతవఱకు చంద్రవతిగాని, గుణవతిగాని యెఱుఁగరు. ఒక ప్రభావతికి మాత్రమే గాదు. ఈ యిరువురలోఁ గూడ నన్యోన్యమును దెలియకుండునట్లే సంఘటించుట యుక్తము. కావున నట్లే ప్రయత్నింతుఁగాక.

పరిచారిక — (ప్రవేశించి) మహాత్మా ! నమస్కారము. అంతఃపురము తమ రాకకు నిరీక్షించుచున్నది.

నార — అట్లేని పోవుదము, పద.

పరి — (వినయముతో) వీణ నాచేతికిండు. నేను భద్రముగా దేవరశుశ్రూష నాచరింపఁగలను.

నార — మాకిది బరువుగాదు. అయినను గైకొనుము.

పరి — మహాప్రసాదము. (వీణపుచ్చుకొనును. ఇరువురును బరిక్రమింతురు.)

నార — ఓసీ ! ఇపుడు నేను బరీక్షింపఁదగిన రాకన్నియ లెల్లరు నొక్కగురువు నొద్దనే విద్య నభ్యసించుచున్నారా ?

పరి — దేవా ! మఱికొందఱుగూడ నభ్యసించుచున్నను ముఖ్యముగా నభ్యసించు మూగురు రాకన్నియలకును గురువు లిరువురు. ప్రభావతిగురువు రంభ. చంద్రవతీ గుణవతులకు గురు వూర్వశి.

నార — (తనలో) అవును. ఇందుఁ గొంత నాఁడు సూచనగా రంభవలన విని యేయున్నాఁడను. (ప్రకాశము) సరియేకాని యీ దేవవేశ్యాద్వయమున కేమేని వివాద మేర్పడినదా యేమి ?

పరి — ఏర్పడినది కనుకనే దేవరవారి రాక కిప్పరము నోఁచికొనినది.

నార — (తనలో) అగుచో నిది కేవలము పరీక్షామాత్రమేకాదు. వివాదవిషయముగూడ నగుటచే జయాపజయనిర్ణయము గూడఁ జేయవలసివచ్చును. ఇది ప్రస్తుతము నాకు మిగుల సంకటము. రంభపక్షము చెప్పిన నూర్వశికిఁ గోపము. ఊర్వశి పక్షము చెప్పిన రంభకుఁ గోపము. నిష్పక్షముగాఁ జెప్పినను నెవరిపక్షమునకో జయము కాకపోదు గదా ! ముని నగుటయేకాక పరమవిరాగినిగూడ నయ్యు నీ సంగీత విద్యాకారణమున నీలంజియల మోమోటమున కించుక లోఁగవలసినవాఁడ నైతిని. అట్లగుటచే నెట్లో వీరైనంతలో నిరువురను సంతోషపెట్టుటకే యత్నింతుఁగాక. (యోజించి) ప్రస్తుతము వీంద్రుడు తమకు జయము నభిలషించి మాత్రమే యీ పన్నుగడ పన్నియుండరు. ఈవ్యాజమునఁగాని యితరులనిటకుఁ బ్రవేశింపఁజేయ వీలుగాదని యెంచి యిట్టు కల్పనచేసియుందురు. అందులోఁ గలహాశనుఁడనగు నన్ను దప్పించినచో నేవో యుద్ధము పాసఁగుననియు నందు దైవవశమున వజ్రనాభుని నాశనము ఘటించినచోఁ దమ్మును జెఱసాలనుంచినందులకుఁ బ్రతికార మొనర్చినట్లగుననియు నీలంజియలయూహ కావచ్చును. భవతు, వీంద్రయుద్దేశమే సఫలమగుఁ

గాక. (ప్రకాశము) సరియే, మా రాకకేమి? ఇపుడు మీ ప్రభువే మా స్వర్గమునకుఁ గూడ రాజుగా నుండెనుగదా. రాజధానియగు మీపురమునకు మేము రాక యెట్లుమానుదుము?

పరి— దేవా! అదిగో! అంతఃపురము. వారే విద్యార్థినులు.

(యథోక్తముగా చంద్రవతీగుణవతీప్రభావతులును మఱికొందఱు కన్నియలును, రంభోర్వసులును ప్రవేశింతురు.)

రంభోర్వసులు— (నమస్కరించి) దేవర దర్శనలాభ మింతకాలమునకుఁ దటస్థించినది.

నార— మనోవాంఛాఫలసిద్ధిరస్తు. (రంభనుద్దేశించి) నీవు నాఁడొకపరి కన్పట్టితివి. ఊర్వశిని జూచి చాలఁ గాలమైనది.

ఊర్వ—చిత్తము, స్వర్గము వదలినతరువాత, మరల నేఁడే తమ దర్శనభాగ్యము.

రంభ— (రాకన్నియల నుద్దేశించి) అమ్మా! పరమగురువులకుఁ బూజాపురస్కారములను నిర్వర్తింపుఁడు.

(ముగ్గురు రాకన్నియలును యథోక్తముగా నాచరింతురు.)

నార—రాకొమిరెలారా! మీ వినయవిధేయతలకు మామనము మిగులసంతసించె.

గీ. గానవిద్యాభివృద్ధియుఁ గలుగుఁగాక
కలుగుఁగావుత ననుకూల కాంతసిద్ధి
యడియు నచిరకాలమ్మున నమరుఁగాక
మేలగునుగాక ధరణికి మీకతమున.

ప్రభా— (తనలో) మహానుభావులు. వీరివాక్యము తప్పదు. కావున నోహృదయమా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

రంభ— తమ యాశీర్వచన మీ భర్తృదారికలు శిరసావహించుచున్నారు.

నార— (రంభోర్వసుల నుద్దేశించి) మహారాజు నన్నిటకుఁ బిల్వబంపిన యంశము మీ రెఱిఁగినదేకదా?

ఊర్వ— శిష్యురాండ్ర ద్వారమున మామా విద్యాపాటవమును నిర్ణయించి మమ్ముగు గౌరవించుటకు రప్పించినారు.

నార— ఈ మూగురకును గ్రంథము సమముగనే యయినదా?

రంభ— చిత్తము.

నార—ఏదేని పల్లవి నిచ్చిన స్వతంత్రముగా జాగాచేసికొని పాడగలుగుదురా?

ఊర్వ— చిత్తగించెదరు గదా!

నార— అగుచో నొక పల్లవిమాత్ర మిచ్చిచూచెదను. తారతమ్యపరీక్ష కీ మాత్రము పరీక్షించినఁ జాలును. ఈ క్రిందిపల్లవిని, తోడిరాగములో రూపకతాళములోఁ గొన్ని యావృత్తములు పాడింపుఁడు.

పల్లవి.

తత్త, దిమిత, దింకి, యని, సదా, శివుఁడాడినాఁడె, తత్తదిమిత దిందియనిసదా!

రంభోర్వసులు— అమ్మలారా! వింటిరా? గురువరుల యాదేశము. ఇట్టి పట్టున స్త్రీజనసహజమైనను లజ్జ నుజ్జగించవలయును జుఁడీ!

రాకన్నియలు— (మిన్నకుందురు.)

నార— ఆలస్యమెందులకు? ప్రారంభింపుఁడు.

ప్రభా— (తనలో) విరహవేదనాదోదూయమానమ్మగు నా మనమ్మున కొక్క ప్రద్యుమ్నానురాగముతక్కఁ దక్కిన రాగములుగాని తాళములుగాని స్ఫురించుటయే లేదు. ఇట్టియవస్థలో నే నేమి పాడఁగలను? నేఁడు నా యుపాధ్యాయురాలికి నాకతన నవమానము ఘటించునేమోకదా? ఈయంశము నెఱిఁగినచో నాపె నన్ను నేఁడు పరీక్షాస్థానమునఁ బ్రవేశ పెట్టుకొనకయేపోవును. ఈ నా రహస్య మీపె కెఱిఁగించుటకు వీలు గాదుగదా? ఇందుపాయమేమి? (విచారించుచుండును.)

చంద్రవతీగుణవతులు— అక్కా! పల్లవి నారంభింపుదమా?

రంభ— (ప్రభావతి నుద్దేశించి) అమ్మా! సంశయింపకుము ప్రారంభింపుము.

ప్రభా— (ఆరంభింపఁబోయి, మరల సంశయించును.)

నార—అమ్మాయీ! సంశయింపకుము. నీకుఁదోఁచినట్లు గతి నేర్పఱచుకొనుము.

రంభ— స్వామీ! సిగ్గుచే వెనుదీయుచున్నదేకాని వేఱొకటిగాదు. సర్వజ్ఞు లగు తమ కెఱుఁగనిదేమున్నది? "సగము చచ్చి సంగీతము, నంతయుఁ జచ్చి హాస్యమును గదా!"

నార— ఊర్వశీ! నీశిష్యురాండ్రేని ప్రారంభింపవచ్చును. ఆపెయే మొదలిడ వలయునను నియమము లేదు.

ఊర్వ— సెలవైనచోఁ బ్రారంభింపఁజేయుదును. కాని జ్యేష్ఠానుక్రమమును దప్పింపరాదని సంశయించుచున్నదానను.

రంభ— స్వామీ! ఊర్వశి చెప్పినమాట యుక్తిసహము. ముందు నాశిష్య

రాలే ప్రారంభించును. (ప్రభావతిదిక్కు) అమ్మా! సంశయింపకుము. ప్రారంభింపుము. పల్లవిని వింటివికదా!

ప్రభా—(ప్రారంభింపఁబోయి మరల మాని తనలో) ఏమో, నామనము నెన్నిగతుల బలిమాలినను విషయాంతరము మీఁదికిఁ జనకున్నయది. ఈ పల్లవి కన్న నా మనోహరునికి సంబంధించిన యర్థముగల వేఱొకపల్లవియైనచో నాహృదయము దానిపైఁ బ్రసరించెడినేమో. కాని, సర్వజ్ఞుఁడయ్యు నామునికట్టియూహ తోఁచకుండుటయు నాదురదృష్టమే.

నార— రంభా! నీ శిష్యురాలికి పల్లవిగతి స్ఫురించినట్లు లేదు సుమా!

ఊర్వ— (తనలో) నాకిది ప్రియము, నాకిది ప్రియము.

రంభ— దేవా! దేవర క్రొత్తవారగుటచేఁ దమసన్నిధిని గొంతెత్తి పాడుటకుఁ గొంకుచున్నది. అంతియకాని తాము సెలవిచ్చినట్లు స్ఫురింపక కాదు. (ప్రభావతి నుద్దేశించి) అమ్మా! మునీంద్రులవారు మఱియొకలాగు భావించుచున్నారు. కావున నిఁక జాలము మానుము.

ప్రభా— (కంఠము సవరించుకొని మిన్నకుండి తనలో) నా చిక్కు నాది. ఈమె తొందర యీమెది. పాపము! మిక్కిలిగ శ్రద్ధచేసి నన్నుఁ దయారుచేసినది. నావలనఁ దన చేసిన కృషి కీమెకుఁ బ్రతిఫల మవమానమునక్క వేఱు కనుపట్టుటలేదు. నాకు బుద్ధిస్వాస్థ్యము లేదు. నే నేమి సేయుదును? "స్వస్థే చిత్తే బుద్ధయ స్సంభవంతి".

నార— ఏమి రంభా! ఈపల్లవిని మాని వేఱొకపల్లవి నిమ్మందువా?

రంభ— చిత్తము. దీనిగతి నా శిష్యురాలికి స్ఫురింపలేదను కారణమున నట్లు తమరు మార్చనక్కఱలేదు. కాని వేఱొక కారణమున మార్పవలసి యున్నది.

నార— ఆకారణ మెట్టిది?

రంభ— సర్వజ్ఞులరు తమకు మాబోఁటులు విన్నవింపవలసినది లేదు. అయినను మన్నింతురేని మనవిచేసికొందును. నవనవోన్మేష యౌవనలగు కన్నియలు తఱచు ప్రధానదైవతముగా మన్మథునారాధించుచుఁ దదితరదైవతములయెడ నంతగ నాదరములేక యుందురనుట క్రొత్తసంగతి కాదు. అందులో స్మరారాతి యగు శివునియెడల నట్టికన్నియల కాదరాభావమే కాక కొండొకవైరముగూడ నుండవచ్చును. తమరిడిన పల్లవి శివస్మరణప్రధానముగ నుండుటచే మా ప్రభావతి యాపల్లవి నారంభింపఁ గొంకుచున్నదని నాయూహ.

నార— (తనలో) ఔరా, యీ ముదితౌత్సుక్యము తత్ప్రశ్నాపాటవ మెంత దూర మెగఁబ్రాఁకినది !

ఊర్వ— దేవా ! చిత్తగించితిరా ? తనశిక్షాలోపము నీపె యెట్లు సమర్థించు కొనుచున్నదో! ఈయూహ యుత్ప్రేక్షామాత్రముకాక నిక్కమేయైనచో నాశిష్యురాండ్రును నిప్పట్లఁ గొంకవలసిరే యయ్యుండును గదా ?

నార— ఆ ! నీవనినట్లే. (రంభ నుద్దేశించి) ఏమిరంభా ! నీవిందుల కేమందువు?

రంభ— (తనలో) ఊర్వశి నాపన్నుగడను బూర్తిగా ఖండించినది. ఇంక నుపాయమేమి? (యోజించి) ఇట్లగుఁగాక (ప్రకాశము) దేవా ! సామాన్య దృష్టితోఁ బరిశీలించినచో నూర్వశియాడినమాట యుక్తిసహముకాక పోదు. కాని విశేషదృష్టితోఁ బరికించిన దేవరచిత్తమునకే సర్వమును విదితము.

నార— (తనలో) రంభయాడినమాట కిప్పట్ల నర్థమేలేదు. కాని యొకవిధమున యోజించినచో నర్థముకలదు. కాని ప్రభావతీహృదయరహస్యము రంభ కూడ నెఱుఁగుననుకొనుట కవకాశములేదు. అది శుచిముఖియును, ప్రభావతి ప్రాణసఖులలోఁ గొందఱును దక్క నొరులెఱుఁగరనుట సత్యము. ప్రస్తుతము ప్రభావతి యన్యాయత్తచిత్తయయి యున్నమాట వాస్తవమే. కాని రంభ యాయంశ మెఱిఁగికాకపోయినను యాదృచ్ఛికముగాఁ బన్నిన యీ పన్నుగడ దాని యుద్దేశమునకు మించి పనిచేయుచున్నది. స్మరాపరావతారుఁడగు ప్రద్యుమ్నుని ద్రికరణశుద్ధిగాఁ బతిగా నేర్పఱుచుకొని తత్సమాగమమును వేచియున్న ప్రభావతికిఁ దదరాతియగు శివుని యెడల ద్వేషమనుట కడుంగడు యుక్తిసహమే. కాని యీ గుట్టునెఱుఁగని రంభనోటినుండి వెలువడిన యీవాక్యము గ్రుడ్డివానిచేతి తాయిగా నున్నది. ఇప్పటికి రంభ యిట్లు తప్పికొఁదలఁచినది. కాని యీదృశావస్థలోనున్న ప్రభావతి కిపుడు వేఱొకపల్లవి పాడుటకూడ రుచింపనే రుచింపదు. అయినను నాపె మనోరథమున కనుకూలించు తెఱఁగునఁ గల్పించి పల్లవి నొసఁగెదను. (ప్రకాశము) ఊర్వశీ ! నీవాదము కాదన రాదు. కాని "మాటకు మాట తెవులు, నీళ్లకు నాఁచు తెవులు." వేఱొక పల్లవి నిచ్చుటకు నీ వంగీకరింపుము.

ఊర్వ— దేవరచిత్తమున కన్యథా మనవిచేసికొనుటకు నే నెంతటిదానను.

నార— రంభా ! ఇదిగో, మఱియొకపల్లవి. దీని, నిచ్చవచ్చినతాళము, నిచ్చ వచ్చిన రాగము నేకరించి. పాడుమమ్మ.

పల్లవి. ప్రద్యుమ్నజనక, పాలింపరావే

ప్రభా — (సంతోషము నాఁపికొని తనలో) హృదయమా ! నీ వికారము నొక్కుమాఱుగా బయల్పఱచెదవేని నిఁక ముందుఁ గాఁదగిన నీవాంఛకు విఘ్నమేర్పడఁగలదు సుమా ! తొందరపడకుము. సుధామధురములగు ప్రియనామాక్షరములచేఁ జిహ్నితమగు నీపల్లవిని నాచేఁ బాడించి నాయుపాధ్యాయురాలికి మాటదక్కింపుము. (పల్లవి నెత్తికొనఁబోయి, మాని తనలో) ఈ నారహస్యము నిక్కడి రంభోర్వశ్యాదులు పలువురెఱుఁగకున్నను నాప్రియుడి చెలికత్తియలలోఁ గొందఱును, ముఖ్యముగా దివ్యజ్ఞానసంపన్నుఁడగు నిమ్మహామునియు నెఱుఁగుదురనుట ధ్రువము. వెనుకటి పల్లవిని బాడక దీనిం బాడినచో నన్ను వీరు లఘుహృదయనుగా భావించి యెల్లిదమాడుదురేమో కదా ! (యోజించి) బాగుగ యోజించినచో నవసరముపడినఁగాని దివ్యజ్ఞాన ముపచరింపరు గాక. అట్లేకానిచో నీ దేవవేశ్యాయుగళమునకుఁ గూడ నాగుట్టు విస్పష్టపడవలసినదియే. ఇందేమిగతి? (మిన్నకుండును)

రంభ — (తనలో) ఈ పల్లవి నెత్తికొనుటకుఁ గూడ నీపె కొంకుచు నేయున్నది. కారణ మేమైయుండునో ? విద్యావిషయమున నీపె కించుకయు లోటు లేదని నాకు బాగుగఁ దెలిసిన యంశమే. ఏమైనను నేఁ డీపె మనము స్వస్థముగా లేదనుట నిక్కము. కావున నిప్పటి కెట్లో సురుఁగుట కింకొక యుపాయము నాలోచించుకోవలయును. (యోజించుచుండును)

నార — ఏమి, రంభా ! ఈపల్లవియెడల నీవు మున్ను చూపిన శంక లేదుగదా! దీనినిగూడ నీ శిష్యురా లనాదరించినటు లున్నదే ! కారణ మేమి ?

ఊర్వ — (తనలో) నాకుఁ బ్రియము, నాకుఁ బ్రియము.

రంభ — (తనలో) ఇప్పటి కిట్లు దాఁటికొందునుగాక. (ప్రకాశము) స్వామీ! దేవర సర్వజ్ఞులు. తమకు మాబోఁటులు బోధింపవలయునా ? ఈపె రక్షశ్చక్రవర్తి కుమార్తె. మీరొసఁగిన పల్లవి రాక్షసారాతిభక్తి ప్రబోధకము. అందుచేఁ గొంకుచున్నట్లు నా తలఁపు.

నార — (నవ్వి) నిజమగుఁగాక, కాకుండుఁగాక. నీవు బొంకినను నయ్యది టక్కున సరిపోయినది. మఱియొక పల్లవి నిమ్మందువా ?

ఊర్వ — ఇంతకుమున్ను చూపిన దొసఁగుకన్న నిప్పటి దొసఁగు యుక్తియుక్తముగ నుండుటచే నీపల్లవిని మార్చుటకు నాకును నభిమతమే.

రంభ — (తనలో) వేఱొకపల్లవి నేని ప్రభావతి పాడి నేఁడు నాకు మాట దక్కించునో, లేదో ? చిత్త మస్వస్థముగానున్న పు డదిమాత్రము పాడ నంకించునా ? ఇంతకు నీపె చిత్త మస్వస్థమగుటకుం గత మేమో ? ఈ

యంశము సామాన్యజ్ఞానమునకు గోచరించునట్లు లేదు. దివ్యజ్ఞానసాధ్యముగాఁ దోఁచుచున్నది. కావున దాని నుపయోగింతుఁగాక. (ధ్యానము నటించి) అయ్యో! యెంత మందభాగ్యురాల నైతిని! ఈ దిక్కుమాలిన రక్కసిముండకొడుకుల సంపర్కపు దోషముచే నాకు దివ్యజ్ఞానసామర్థ్యము నశించినది. (విచారముతో) అవును. అట్టి దివ్యలోక నివాసమే పోయి, యిట్టి దుర్దశ చేకూరినపుడు దివ్యజ్ఞాన నాశమునకై కుందిన నేమి లాభము? ప్రస్తుతము తప్పికొనుట కుపాయము యోజింతుఁగాక. (ఆలోచించి, ప్రిభావతి యొడలిపైఁ జేయివైచి) ఈ యుపాయమువలన నేఁటికీ పరీక్షయే నిల్చిపోఁగలదు. (ప్రకాశము) అక్కా, యూర్వశీ! ఇటు రమ్మ. ప్రిభావతియొడలి వేఁడిమిని బరీక్షింపుము.

ఊర్వ— (దగ్గఱకు వచ్చి యొడలిపైఁ జేయివైచి) మితిమించిన కాఁకగానున్నది. పాపము! జ్వరము తగిలినదేమో! (నారదుదిక్కై) ఏమి యాజ్ఞ?

నార— (తనలో) పాప మీ యమాయికురాలు తనంతటఁ దానే నేఁటికీ యంశము నుపరమింపవలయునని నన్నుఁగోరుటకు సంసిద్ధురాలగుచున్నది. ఈ ప్రిభావతికి మదనజ్వరము బాధించుచున్నదను నంశ మీమె యెఱుఁగదు. అవును, జ్వర మెట్టిదైనను బ్రస్తుతాంశమున కంతరాయమేకదా! (ప్రకాశము) నేఁటికీ పరీక్ష నాఁపుమందువా?

ఊర్వ— దేవర యట్లనుగ్రహించితిరేని మహాప్రసాదమే.

నార— ఏమి రంభా! అటులొనరింపుదమా?

రంభ— (వినయముతో) మహా ప్రసాదము. సెలవొసంగినచో నీమె నుపచారార్థ మంతిపురికిఁ గొంపోయెదను.

నార— తథాస్తు.

(ప్రిభావతియుఁ, జెలులును రంభయు నిష్క్రమింతురు)

ఊర్వ— దేవా! నాకుఁగూడ సెలవొసంగుఁడు.

నార— మంచిది.

(ఊర్వశి నిష్క్రమించును)

పరిచారిక— మునీంద్రా! మరల నీ పరీక్షాసభ యెప్పటికి మార్చితిరి?

నార— మీ రాజుగా రెపుడేర్పఱచిన నపుడే యగును.

పరి—చిత్తము. అంతదనుకఁ దమ రిచ్చట నిల్చియుందురా?

నార— రాక్షసేంద్రుని యభిప్రాయము ననుసరింపక తీరదుకదా!

పరి— చిత్తము. తాము సర్వసములు. కాన మాబోంట్లతోఁ గూడఁ జనవిచ్చి మాటలాడుదురు. అనుజ్ఞయైనచో నీ దాసి తమతో నొక విన్నప మాచరించుకోనున్నది.

నార— అది యేమో తెలుపుము.

పరి— చిత్తము. మా యీ భర్తృదారికలకుఁ బెండిలియైనచోఁ జూడవలయు నని మా కెల్లరకును మిక్కిలి కుతూహలము. వీర లిరువురకును దగిన వరులను దా మెక్కడనేనిఁ దిలకించిన యువసముదయమున నున్నచోఁ దెలుపఁగోరెదను.

నార— (నవ్వి) మీ రాక్షసనేత స్వయంవర మేర్పఱిచినచో నెల్లరును జనుదెంతురు. అందు స్వానురూపవరుల నేరికోవచ్చునుగదా?

పరి— చిత్తము. తాము సర్వజ్ఞులు. తమకు గోచరింపని యంశము లుండవు. కావున మనవిచేసుకొంటిని.

నార— (తనలో) నేనిదివరలో నూహించిన యంశమునకు దైవచోదితురాలై యీదాసి యుపోద్ఘాత మారంభించినది. కావున వీరిలో నొండొరుల సందర్భ మొండొరులకుఁ దెలియకుండునట్లుగా భద్రపఱిచి దీనితోఁ గథాబీజమును బ్రస్తావింపవలయును. (ప్రకాశము) కానిమ్ము. నే నీయంశమును గూర్చి యోజింపుచుందును. ఇంతలో నీవు వీరిని గురుజనసన్నిధికిం గొంపోయి మరల వత్తువుగాక.

పరి— (యథోక్తముగా నాచరించి) స్వామీ! యేమియాజ్ఞ?

నార— (తనలో) ఈముదుసలిది యీ దేవరహస్యమును వినుదనుక నన్ను వదలదు. (యోజించి) చలినీళ్లకు వేడినీళ్లు తోడనునట్లు ప్రభావతీప్రద్యుమ్నకథ కిక్కథ కొంత తోడ్పడవచ్చును. కావున దీనికిం జెప్పుదు. (ప్రకాశము) నీకోరినయంశము దేవరహస్యములలోనిది. స్త్రీస్వభావమునంజేసి బయటఁబెట్టితివేని దేవకార్యమునకు భంగము వాటిల్లును జుమా!

పరి— (నవ్వి) దేవర సర్వజ్ఞులు. నా మనోదార్ఢ్యము మాత్రము గుఱుతెఱుఁగకుందురా? సర్వథా భద్రపఱచి మీ మెప్పు నందెదను.

నార— ద్వారవతీపురి నెఱుంగుదువా?

పరి— ఎఱుఁగ కేమి? చూడలేదు గాని తఱచు వినుచున్నదియే, యదువంశ

తిలకంబగు శ్రీకృష్ణభగవానుని విచిత్రచరిత్రమున కాలవాలంబగు నప్పు త్తనము నెఱుంగనివారే లేరని నే ననుకొనియెద. కడమ సెలవిండు.

నార— ఆయానఘుని కెందఱో భార్యలును గొమరులును గల రనియు నీవు వినియేయుందువు. కావున విస్తరింపను. అక్రూమరులలో గదసాంబు లను నిరువురు యదుకుమారులు మీభర్తృదారికలకు భర్తలు కాఁగలరు.

పరి— స్వామీ! తాము సెలవిచ్చిన సంగతి యమోఘమని నాకుఁ బరమ విశ్వాసముండియును తేజస్తిమిరన్యాయమునఁ బ్రవర్తించు రక్షోరాతి రక్షశ్చక్రవర్తులు వియ్యంకు లెట్లగుదురో కదా యని సందియము మితి మీఱి బాధించుచున్నయది. దీనిం బాప వేఁడెదను.

నార— మొదటనే చెప్పితినిగదా, యిది దేవరహస్యమని ; మరలం బ్రశ్నించెద వేల ? ఈ ప్రపంచ మహామాయానాటకమున మీ రాకొమిరెల పరిణయ భాగ మొకయంతర్నాటకముగా నుండెడిని. అచిరమ్మునన సర్వము నీకనుభూతము కాఁగలదు. ఇప్పు డింతకన్నఁ జెప్ప వలనుపడదు.

పరి— చిత్తము. సెలవు. (నిష్క్రమించును.)

నార—(తనలో) రాక్షసేంద్రుండు తనకొమిరెల విద్యాతారతమ్యము నెఱుంగ నా రాకకై వేచియుండును. (పరిక్రమించి) అదిగో, రాజమందిర ద్వారము.

దౌవారికుఁడు— (ప్రవేశించి) మునీంద్రా! మా ఱేఁడు మీరాకకై వేచి యున్నవాఁడు.

(అంత వజ్రనాభుఁడు సపరివారముగాఁ బ్రవేశించును.)

నార— ఇదె వచ్చుచున్నాఁడను.

దౌవా— ఇటు దయచేయుఁడు. ఇటు దయచేయుఁడు.

వజ్ర— (సగౌరవముగా లేచి) మునీంద్రా! ఆ యాసనము నధిష్ఠింపుఁడు.

నార— (ఆసనమునఁ గూర్చుండును.)

వజ్ర— మునీంద్రా! మీరాకవలన మేమెల్లరమును ధన్యులము.

నార—(తనలో) ఇతఁడు దేవతారాతియయ్యు దేవమునినగు నాయెడల నింతటి గౌరవమును జూపుట యాశ్చర్యము. (యోజించి) అవును. ప్రస్తుత మితఁడు గానవిద్యాధురంధరుండనను హేతువున నన్నింత ప్రేమగాఁ జూచుచుండవచ్చును. "విద్వాన్ సర్వత్ర పూజ్యతే" కనుక దీనివిషయ

మన శత్రుత్వ మంతబాధకము గానేరదు. (ప్రకాశము) నీకుంగల గానవిద్యాభిమానమునకు నాకు మిక్కిలి సంతోషము.

శుచి— స్వామీ! మీరు దేవతాపక్షపాతులరయ్యు నామాటం బాటిచేసి నాకొమిరెల విద్దియం బరీక్షింప నేతెంచుట తమ సర్వసమత్వమును వేనోళ్ల నుద్ఘోషించుచున్నది.

నార— (తనలో) నేనును దేవకార్యార్థినై యేదేని రంధ్రమ్ము నారయు మనమ్ముతో నీయవకాశమున నిట కరుదెంచినవాఁడనే. (ప్రకాశము) అసురేంద్రా! సురాసురశబ్దములయందలి పరస్పర వ్యతిరేకముకతన మీలో మీర లన్యోన్యశత్రువులయిన నగుదురుగాక. కశ్యపుఁడు మా మునులలోనివాఁడగుటచేఁ దదపత్యభూతులగు మీ రెండు తెగలును మాకు నొక్కరూప యగుటలో నాశ్చర్యమేమున్నయది.

వజ్ర— చిత్తము. తమ సమర్థనము చక్కఁగా నున్నయది. ఇదియునుంగాక మామా విరోధములు పరస్పరబాహుబలప్రయుక్తమ్ములు. తామో, కేవలము శాంతిధనులు. తమ హృదయమున కిట్టిపట్టున జోక్యమే యుండదు.

నార— (తనలో) "కానైతే మునినేగాని తిరుగవేసి పొడువు" మన్నట్లు మాకు జోక్యములేని యుద్ధములే యుండవు. మాకు నీవంటి జగదుపప్లవకారకులను వధింపఁజేయుటకూడ నొకతపమే. (ప్రకాశము) అంతే. నీయూహ కడుంగడు యుక్తియుక్తము.

వజ్ర— స్వామీ! ప్రశిష్యురాండ్ర గానవిద్యాభ్యసనముం బరీక్షించితిరికదా! అందు గంధర్వసులలో నెవతెకుఁ దాము జయమొసఁగితిరి?

నార— వాండ్రిరువురును సమర్థురాండ్రే. ఒక్కతె కొకభాగమున, వేఱొక్కతె కింకొకయంశమున, నెక్కుడు ప్రతిభ కల్గియుండినను మొత్తము మీఁద నొకరి కొకరు తీసిపోరు.

వజ్ర— ఆవిషయమిదివఱకే జగత్ప్రసిద్ధమైనదగుటచే నిపుడు క్రొత్తగాఁ దాము నిర్ణయింప నక్కఱలేదు. ప్రస్తుతము శిష్యురాండ్రంబట్టి జయ మెవరిదో నిర్ణయించుటయే తమకు ముఖ్యకర్తవ్యము.

నార— రాకొమిరెలును దెవ్వేతేటలలో నొకరికొకరు తీసిపోఁగూడదు.

వజ్ర— తాము ప్రత్యక్షముగఁ దిలకించియుఁ బరోక్షముననున్నవారివలె నభిప్రాయ మొసఁగుచుంటిరేమి?

నార — ఇందునుగూర్చి నేఁడు పరీక్షజరుగలేదు. కావున ననుమానప్రమాణము శరణ్యము కావలసివచ్చినది.

వజ్ర — పరీక్ష జరుగకుండుటకుఁ గారణమేమి?

నార — రాకొమిరెలుగదా! నేఁడు నీకొమిరెకుఁ గొంచెము మనస్స్వాస్థ్యము తక్కువగానుంటచే సభ తేపు జరుగవలసినదయ్యెను.

వజ్ర — చిత్రము. ఎట్లో శిష్యురాండ్ర ననుగ్రహించి తా మంతదనుక నియ్యోడ విచ్చేసి పరీక్షించి యింకనుంగల లోటుపాటులను బూర్తిగావించుటకు వలనగు నుపాయముల నుపదేశింపఁగోరెదను.

నార — రాక్షసచక్రవర్తీ! విద్యయనునది కేవలము గురూపదేశముమాత్రమున సిద్ధించునదికాదు. ప్రప్రథమమున గురూపదేశ మవసరమే. కాని పిమ్మటఁ బలువురవలనఁ బలుసంగతులను నేర్చికొనవలసియుండును. అది యంతఃపురచారిణుల కగమ్యమేకాక యనుచితముగూడ నగుటచేఁ బ్రస్తుతమింతటితోఁ దృప్తిపడుట యుక్తము.

వజ్ర — గానవిద్యాధురంధరులని పేరువడసినవారినెల్ల నిటకు రప్పించి వారివారి నైపుణ్యములను దిలకింపఁ జేయవచ్చునుగదా?

నార — (తనలో) పోఁతుటేఁగకేనిఁ దనయాజ్ఞలేక చోరరాఁగూడని యీ పురము నేఁటికి గానవిద్యాధురంధరులకెల్ల నివాసము కాఁదగిన దినము లాసన్నమగుచున్నవి. "బుద్ధిః కర్మానుసారిణీ" "వినాశకాలే విపరీతబుద్ధిః" ప్రద్యుమ్నుదు లీనెపమ్మున నిప్పురము ప్రవేశించి రంధ్రమారసి వీని వధించుట కిఁక నేమి సందియము! (ప్రకాశము) "రాజు తలఁచిన దెబ్బలకుఁ గొదవా?" అటులొనర్చినచో నీ రాకన్నియల భరతవిద్య కొలఁది దినములలోఁ బరమోచ్చస్థానము నలంకరింపఁగలదు.

వజ్ర — (స్మృతినభినయించి) కొలఁది దినములక్రిందట నొక నటప్రవరుఁగూర్చియు, నతని నాటక సమాజముంగూర్చియు వినియుంటిని. వాని పేరు భద్రుండట! వాఁడుదీవులయందును నతఁడు నిరాఘాటుండై చరియించుచున్నాఁడఁట! అతని నిటకు రప్పింపవలయునని యనుకొనుచున్నాఁడను. ఇందులకుం దమ రేమనియెదరు?

నార — (తనలో) ఓహో! శుచిముఖి యప్పుడే తననాటకమునకుఁ బ్రస్తావన కావించి యుంచినదే! ఇఁక నేమి, సురపక్షమునకు శుభదినములు సమీపించినట్లే. (ప్రకాశము) భద్రుని పేరు భూలోకమునందేకాదు, స్వర్గమువందును వ్యాపించినది. తప్పక యాభరతపుత్రుఁ డిటకువచ్చి, కొన్ని

నాటకములు ప్రదర్శింపఁదగినవాఁడే. ఇయ్యది మీ కోరికలకు సర్వథా యభివృద్ధి సూచకము.

వజ్ర— మునీంద్రా! ఆ కుశీలవాగ్రణి కవితఁగూడఁ గడుం జక్కఁగ నల్లువాఁడఁటకా?

నార— (తనలో) అతఁడు కవిత నల్లువాఁడో కాఁడో కాని నీకు విధిగా నల్లువాఁడగుటకు సందియము లేదు. (ప్రకాశము) కవితాశక్తి లేనివాఁడు నాటకసూత్రధారపదవి కెట్లు తగియెడిని?

వజ్ర— ఇదిగో, తప్పక యిప్పుడ యతని రాకకై శేఖం బుత్తెంచెద. అతఁడు నాటకములు ప్రదర్శించునట్టునఁ దామకూడ నిటకు దయచేయవలయునని యభ్యర్థించెదను.

నార— ముఖ్యముగా నట్లే కావించెదను.

వజ్ర— ఎవఁడురా, యక్కడ? శుచిముఖిని బిలిచికొనిరమ్ము.

దౌవారికుఁడు— (ప్రవేశించి) చిత్తము.

(నిష్క్రమించి శుచిముఖితోఁ బ్రవేశించును.)

శుచి— దేవరకు జయమగుఁగాక! నన్నెందులకుఁ బిలిపించితిరి.

వజ్ర— నీవా నాఁడు మాతోఁ బ్రసంగవశమునఁ బ్రశంసించిన భద్రుఁడను నటశిరోమణి యిప్పు డెచ్చటనుండెనో యెఱుఁగుదువా? మాయాజ్ఞ నాతనికిం జెప్పి యిటకు శీఘ్రమ్మున రప్పింపఁగలవా?

శుచి— (తనలో) వీనికి వినాశకాలమును, ప్రభావతికిఁ గళ్యాణకాలమును దాపైనట్లున్నది. నాకుఁ బ్రియము. (ప్రకాశము) దేవర యాన యన్నచోఁ ద్రిదశేంద్రాదులు సైతము శిరోమాల్యమ్ముగ గౌరవించునప్పుడీ నటుఁడన నేపాటి? తప్పక వచ్చియే తీరును. మీవంటివా రాతని నైపుణి నారసినచో నతని విద్దియకు సార్థక్యమ్మొదవు. ఇక్కతన నక్కుశీలవాగ్రణి ప్రద్యుమ్నుం డగుటకూడఁ దటస్థించు.

నార— (తనలో) ఓసీ, వరాకీ! నీ శ్లేషపాండిత్యము కొండొకసేపు గట్టిపెట్టుము. కార్యఘాతుకత్వమున కొకప్పు డీ శ్లిష్టవాక్చాతురి కారణమైనఁ గావచ్చును.

వజ్ర— అతని విద్యావైశద్యము మా మనమునకు నచ్చినచో నతని కోరిక యెట్టిదేని నయ్యది తీర్చుటకు మా కభ్యంతరముండదని నీవు చెప్పవచ్చును.

శుచి — నేఁ జెప్పకమున్నే యతఁడు తమ యౌదార్యమును వినియుండును. తమకుం గల కుతూహలాదికమును నేనుమ విశదపఱచి తోడికొనిరాఁ గలను. నా కాజ్ఞ యొసంగుఁడు.

వజ్ర— నీకు శుభమగుఁగాక. పోయిరమ్ము.

(శుచిముఖి నిష్క్రమించును.)

వజ్ర— మునీంద్రా! నాటకశాలలం గొన్నింటి నీ కోటలోఁ గట్టించియుంటిని. అందు వలయు పరికరమ్ము లవ్వారిగా సేకరించియుంచితిని. తా మొక్కపరి చిత్తగించి సంపాద్యమ్ము లేవేని యున్నచో సెలవియ్యఁ గోరెదను.

నార— అట్లే చూతము, పద.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ ... తిరుపతి వేంకటేశ్వరులచే రచింపఁబడిన ప్రభావతీప్రద్యుమ్న నాటకమున దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# ప్రభావతీప్రద్యుమ్నము

## చతుర్థాంకము

(అంతర్నాటకము)

సూత్రధారుఁడు— (ప్రవేశించి) నేఁడు పెందలకడ నాటక మారంభింపవలసి యుండునని యానతిచ్చియు నిందనుక రక్షోవిభుఁడు కొల్వున కేల రాకుండెనో? (దెసలు పరికించి) అదె సపరివారుండై రక్షోవిభుఁ డొక్కెడనను, నుచితపరివారముతో నంతఃపురము వేఱొకదెసను బ్రవేశించుచున్నారు. ఇఁకఁ గర్తవ్యమున కుపక్రమించుటయే యుక్తము.

(నిష్క్రమించును.)

(యథోక్తముగా వజ్రనాభాదులును, అంతఃపురమును బ్రవేశించును)

### నాంది

గీ. ఓషధీట్చిత్రరేఖామహోంచితుండు
బాణకృతవిఘ్నతేజుండు ప్రథనభూమి
నెందు ననిరుద్ధుఁడై జయ మెసక మెసఁగ
వఱలెడి భవుండు మీకు శుభమ్ము లొసఁగు.

సూత్ర— (నాంద్యంతమునఁ బ్రవేశించి తనలో) రక్షశ్చక్రవర్తి నేఁడు ప్రదర్శించెడి నాటకంబునందలి కథ యత్యంతాపూర్వమ్మును గడుఁ జమత్కారజనకమ్మునుగా నుండవలయునని మున్నే కబురంపి యున్నవాఁడు. కావుననే మా భరతాచార్యుఁ డట్టి దొక్కండు గల్పించి పాత్రమ్ములకెల్లఁ బంచియిచ్చి సన్నద్ధపఱచి యున్నవాఁడు. (ప్రకాశము) నేఁడు ప్రదర్శింపఁబోవు నాటక కథ కేవలము క్రొత్తది యగుటచే నించుక దానిం గుఱించి ప్రస్తావించిన పిదప నాటక మారంభింపఁబడును. ఏతావన్మాత్ర మాలస్యమగుటకు సభ్యులు మమ్ము మన్నింపవలయు. ఈ కథననుసరించిన ప్రధానపాత్రముల కేరికిని నిందు నామము

లుదాహరింపఁ బడవు. కావున నందుంగూర్చి మమ్ముఁ బ్రశ్నింపవలదని ప్రార్థించుచుఁ గథ మొదలిడుచున్నవాఁడను. ఒకానొక పట్టణరాజమ్మునఁ ద్రిభువనజేతయై యెందు నెదురులేక విరాజిల్లు నొకానొక సార్వభౌముండు నివసించుచుండు. ఆ పట్టణపు గోట శత్రుదుర్భేదము. ఆ యలఘుని కొక్క కొమరిత త్రిలోకసుందరి కలదు. ఆపెకుఁ బెండ్లి కనువగు వయస్సు ప్రవర్తిల్లుతటి నొకనాఁటి రాత్రి యొక త్రిలోకసుందరునితో రమించినట్లు స్వప్నంబై, మేల్కాంచిన పిదప నక్కామునుం డగుపట్టమికి మిగులం జింతలం జివుకుచుండ నా రాకొమిరె చెలికత్తియ యెట్లకేలకా గుట్టెఱింగి త్రిలోకమ్ములందలి సుందరపురుషులనెల్లఁ జిత్రించి "ఇందు నీ మానంబుఁ జూఱఁగొన్న పురుషరత్నం బెవ్వరో చెప్పు" మని యాపె నడిగి తుద కాపెవలన నప్పురుషసింహు నెఱింగి యాత్మమాయాబలమ్మున నప్పురుషుని నిద్రావస్థాంతర్గతునిఁ దెచ్చి తన భర్తృదారికకు సమర్పించిన కథాంశములం గూర్చి నేఁటి నాటకము ప్రవర్తించెడిని. ఇం దప్రధానాంశములు త్రోసివేసి ప్రధానాంశములు మాత్రము ప్రదర్శింపఁబడును. సావధానచిత్తమ్ములతో నవధరింపవలయును.

(తెరలో)

ఎవఁడురా, పోతుటీఁగకుఁగూడఁ జొరనశక్యమ్మగు నంతిపురమ్మున మాభర్తృదారికకు నేను జిత్రించి చూపుచున్న సుందర పురుషులం గూర్చిన ప్రసంగమ్మును బయటఁబెట్టునంతటి సాహసి! జాగ్రత్త. మా చక్రవర్తితోఁ జెప్పి నిన్నేమి చేయించెదనో చూఁడుము.

సూత్ర— (భయము నటించి) ఓహో! తాటకాశూర్పణఖాది మాయావతుల కన్న మిన్నయగు ప్రకృతకథానాయికాసవయస్య ప్రవేశించుచున్నది. కాన నే నిట నుండుటర్హము గాదు.

(నిష్క్రమించును.)

(ఇది ప్రస్తావన)

---

(అంత చెలికత్తియలతో రాకొమిరె ప్రవేశించును.)

చెలి— సఖీమణీ! ఈ యువపురుషు నవలోకింపుము.

ఉ. ఈ నవమోహనాంగుఁడు సురేంద్రునిపుత్రుఁడు వీని పేరు ప
ద్మాననరో! జయంతుఁ డని యందురు చెల్వున సాటిఁ జెప్పుచో
ధీనిధులెల్ల వీనిని మదిం గణియింతురు వీఁడు కాఁడుగా,
మానిని! నీదుస్వప్నమున మానము గొన్న మనోహరుం డొకో?

రాకోమిరె— (అనాదరముగా) మఱియొక చిత్తరువుం జూపుము.

చెలి— (తనలో) ఔరా! జయంతుఁడుంగూడఁ గొఱగాకపోయెనే!
(మఱియొక చిత్తరువుపై గవుసెన దీసి ప్రకాశము)

ఉ. కోమలి! వీనిఁ జూడు నలకూబరుఁ డీతఁడు, రంభవంటి స్వ
ర్భామకు వీఁడు ప్రాణములప్రాణము, సంపదలందు నెంచు న
ద్దాముఁడు శ్రీదపుత్రకుఁడు ధన్యుఁడు మాన్యుఁడు వీఁడు గాఁడుగా,
కామిని! నీమనోధనము గైకొని యేగిన చోరుఁ డమ్మయీ?

రాకో— (అనాదరముగా) వేఱొక చిత్రపటముం జూపుము.

చెలి— (తనలో) దిక్పతులకొమరులే త్రోసిరాజగుచున్న సందర్భమున దిక్పతులంజూపి కాలయాపన మొనర్చుట వృథాప్రయాసము కాకపోదు. కావున నిఁక మనుష్యలోకమునందలి సుందరపురుషులం గొందఱం జూపుట యుక్తము. (వేఱొక చిత్రపటముం జూపి ప్రకాశము.)

మ. నకులుం డీతఁడు వీనిఁ జూడు లలనా! నాసత్యతేజంబు వీ
నికి నుత్పాదకమాటచే నొరులు వీనిన్ బోలఁగాలేరు మా
త్రికిఁజెప్పన్ మఱి వీనితమ్ముఁ డగుమాద్రేయుం డొకండుండె
(సహదేవుపటముంగూడఁ జూపి)
నిం, దొకఁడుంగాడె? కలన్నినుం గలఁచుధన్యుం డో చకోరేక్షణా!

రాకో— (అనాదరముగా) వేఱొకపటముం జూపుము.

చెలి— (చిత్రపటములు తిరుగవేయుచుండును.)

వజ్ర— తమ్ముఁడా! యింతవఱ కీనాటక సంవిధాన మిట్టిదని నిర్ణయింపవలను గాకున్నను నిప్పటి కియ్యది నేఁటికాలపు చరిత్రకు సంబంధించినదే యని స్ఫుటమగుచున్నది సుమా!

సునా— నకులసహదేవుల ప్రసక్తింబట్టి కాలనిర్ణయము తేలుచున్నను, తక్కిన విషయ మగమ్యగోచరముగా నున్నయది.

వజ్ర— క్రమముగా నదియును దేలఁగలదు.

చెలి— మృదుళాంగీ! ఈ చిత్రపటముల నవలోకింపుము.

చ. ఇతఁడు కళింగరాజసుతుఁ డీతఁడు మద్రనరేంద్రపౌత్రుఁ డ
ల్లతఁడె విదేహరాజతనయాగ్రణి యాతఁడె వంగభూమిభృ
త్సుతుఁ డనవద్యశీలుఁడను సుందరు లీశ్వరలోకళాంచితుల్
వితతయశస్కులిందు నొక వీరుఁడు నీ కలవచ్చినట్టిఁడే?

రాకో— మతికొన్నిటిం జూపుము.

చెలి— (చిత్రపటములను సవరించుచుండును.)

సునా— (అన్నదిక్కై) అగ్రజా! యీ గర్భదాసి యిదివఱకీగాకన్నియ కెన్నియో చిత్రపటములఁ జూపించెనుగదా, యిందుఁ బరాక్రమప్రథిత మగు మనరక్షఃకులమునఁ బొడమిన యువకులప్రసంగము లేశమును గానరాకుండుట కేమికతంబో!

వజ్రి— (కోపసూచకమగు నగవుతో) నాకును జాలసేపటినుండి యీవిషయము ననే శంక గలుగుచున్నయది. కాని యిందుఁ గొన్నియేని చిత్రములు రక్షోరాజయువకులవి లేకపోవని నాలో నేను సమాధానముఁ జెప్పికొనుచుంటిని. ఇంతలో నీకును శంక గలిగినది.

సునా— నాకే కాదు. ఎవరికేని యిట్టి సందియము కలుగకమానదు. దీని నిటు లుంతము. ఈ కథాసంగ్రహమున మునుమున్న చెప్పిన కొన్ని యంశములనుబట్టి చూచిన నీ నాటకము సర్వథా మనల నవ్యాపదేశముగాఁ బరిహసించుట కేర్పడినట్లు నాకుఁ దోఁచుచున్నది.

వజ్ర— (తలపంకించి) బాగుగ నాలోచించితివి. సర్వథా కేవలకల్పితంబగు నీనాటకము మనలం బరిహసించుటకే వీం డుపక్రమించిరి. (నాటకులదిక్కై క్రోధాట్టహాసముతో)

శా. ఔరా, యోరి కుశీలవాపశదులారా! యేటికీనాటకం
బారంభించితి? రెవ్వఁ డిట్టిరచనల్ వ్యాపింపఁగాఁ జేసె? ని
స్సారంబీకథ దీనికల్పనయు నీచం బింకఁ జాలింపుఁ డో
హో! రాట్పుత్రికిఁ జూపఁగా పరులు లేరో, దైత్యులం దెచ్చుటల్!

సూత్ర— (పటాక్షేపముగాఁ బ్రవేశించి వినయముతో) రాక్షససార్వభౌమా! మునుమున్న రక్షోయువకులంగూర్చి ప్రస్తావింపవలసినదని మా భరతాచార్యులెఱుంగనివారు కారు. ప్రస్తుతపాత్రి నీచస్త్రీయగుకతన నద్దానికీయౌచిత్యము దెలియకుండునట్లు కల్పించినచోఁ దత్పాత్రౌచిత్యమును మీవంటిభావజ్ఞులు గని మెచ్చికొందురని యటులొనరించిరని మనవిచేసికొనుచున్నాఁడను.

వజ్ర— (తనలో) ఏమీ, వీని సమయోచితవాచానైపుణి! ఈ తప్పుడుఁగల్పనకుఁ గూడఁ గొంత వన్నెపెట్టుచున్నాఁడే! (తమ్మునిదిక్కై ప్రకాశము) తమ్ముఁడా! యీ సమాధానము సమంజసముగాఁ దోఁచుచున్నది కదా! యిందుల కేమందువు?

సునా— అన్నయ్యా ! యీకుశీలవుఁడు వచించినసమాధానము సత్యేతరమే యయినను ప్రకృతోపయుక్తముగ నుండుటచే యథార్థమేమో యని సంశయింపవలసియున్నది. నిపుణతగలవాండ్రు బొంకెడి బొంకులన్నియు నిట్టివిగనే యుండెడిని.

చ. చదునున మిఱ్ఱుపల్లములు చాతుర వొల్చెడి శిల్పియున్ దుర
భ్యుదయు లవాస్తవమ్ము నెడ నొండొకవాస్తవమున్ భ్రమప్రమా
స్పదులకుఁ దోఁచునట్లొనరుపంగల రించుక చర్చచేయుచో
నది యిదియున్ మదిం దెలియు నద్దమునందలి మోముపోలికన్.

వజ్ర— (యోజించి తలపంకించి) నీయూహ కడుయుక్తియుక్తము. అయథార్థంబైనదానిని యథార్థమనిపింపఁదగు దుర్విదగ్ధులును, యథార్థమును గూడ యథార్థముగ సమర్థింపనేరని యమాయికులును బలువు రీ ప్రపంచమున నన్నమాట నిక్కమే. దీని నిటులుంచినను, ప్రస్తుతకథావిధానము మన కన్యాపదేశముగా నవమానం బొనరించుతలంపునఁ గల్పించి మనయెదుటనే ప్రదర్శింపఁ బూనుట మిక్కిలి సాహసముకాక మఱేమి? ఇందుల కీమందభాగ్యులేమి యుత్తర మొసఁగుదురో ? (నాటకులదిక్కై) ఓయీ భరతపుత్రా ! ఇందుల కేమిసమాధానము చెప్పెదవు ?

మ. కత నూత్నంబుగనుండునట్టి దెదియో కల్పించి చూపింపుఁ డం
చతిమోదమ్మున మేము గోర నది శుద్ధాంతాపచారాత్మక
స్థితిలో నుండునటుల్ ఘటించి మము నెంతే హేళనం జేయఁగా
మతినూహించి వృథాగఁ జాఁగ నెటులాత్మన్ గోర్కిమీకబ్బెరా ?

సూత్ర— (తనలో) వీని యవమానకరంబులగు నీచసంబోధనముల నిఁక సైరింపవలసినపనిలేదు. వీని నాశనమే కడమగాని తక్కినకార్యము లన్నియు నింతకుఁ జిరకాలమ్ముక్రిందటనే గట్టెక్కినవిగదా ! ఇఁకఁ గార్యార్థము ధరించిన నా భద్రనామధేయమునకు 'వీర' పదంబుచేర్చి విక్రమించుటకుం దగిన ప్రస్తావనను గాలమాసన్నమగు కతనఁ ద్రిభువనకంటకుండగు నీరక్షశ్చక్రవర్తియే తెచ్చుచున్నాఁడు. ఇదియుంగాక నే నీ నాటకవ్యాజమున సంబంధమిత్త్రముగా నిట కరుదెంచి యించుమించుగ నొక వత్సర మతిక్రమించినది. నన్నుఁజూడక యిన్నినాళ్లు నాతల్లిదండ్రులును దక్కటి స్వజనమును మిక్కిలి వగలఁ బొగులుచుందురు. కావున నిఁక వీని వధించి సతీసుతులతో నిజపురమ్మున కరుగుటయే కర్జము. (యోజించి) ఇంతకాలమ్మునుండి యెన్నండుగాని నాప్రియురాలితో "నవసరమగునెడల నీతండ్రిని వధించినచో నీవంగీకరింతువా ? " యని నేను బ్రస్తావింపనేలేదు. ప్రస్తావించుటయే తడవుగాని యిందుల కామె సమ్మతించుటకు లవమ్మును సందియ ముండఁగూడదు.

ఉ. మున్ను హిడింబ వాయుసుతు మోహమునై వరియించి వెంటనే
యన్న హిడింబుఁ జంపునటు లానతియీయదె ! భర్తృవల్లభ
త్వోన్నతి ముఖ్య మంగనకు, నొండెదియున్ సరిగాదు దాని, కిం
కెన్నఁబనేమి భర్తయెడ నెగ్గు దలంచెడి బంధు నైనచో ?

కావున నే నాపెతోఁ బ్రస్తుతాంశమును నుడువుటయే తడవు కాని యాపె యభ్యనుజ్ఞకుఁ దడవుండదు. ప్రియురాలికడ కరిగి నే నిట వచ్చునందాక నీ మాయానాటకము జరుగుచునే యుండవలయును గాన రక్షశ్చక్రవర్తితో నింకను వినయముగ నే మాటలాడవలయును. (ప్రకాశము) రాక్షససార్వభౌమా ! (అని యేమో చెప్పఁబోవునంతలో)

వజ్ర— (క్రోధావేశముతో)

చ. అడిగినమాట కుత్తరమునైన వచింపవు తప్పుత్రోవలం
బడినపు డుత్తరం బెటులువల్క స్ఫురించెడిఁ? జావు డగ్గఱం
బడెనొకొ ! మా ధనంబు తిని మా కవమానము దోఁపఁజేయు త
ప్పుడుకత మా సమక్షమునఁ బోలునె యాట కుపక్రమింపఁగన్ !

మాత్రి— (వినయాతిశయముతో) దేవా ! దేవరవారి కవమానము స్ఫురింపఁ జేసెడి యంశము లిందున్నవని మేము తలంపలేదు. నిక్కముగా నట్టివి లేవు. ఒక్కచో నున్నట్లు తామభిప్రాయపడునెడల దానింగూర్చి గ్రంథకర్తను బ్రశ్నింపవలయును గాని ప్రదర్శకుల నడుగుట న్యాయము కాదు. కావున ననుగ్రహింపఁగోరెదము.

వజ్ర— (కొండొకశాంతించి) అట్లేని గ్రంథకర్తనే యిటకు రప్పింపుము.

సూత్ర— చిత్తము. (నిష్క్రమించును.)

భరతాచార్యులు— (ప్రవేశించి) రాక్షససార్వభౌమా !

ఆ. వె. నీకమంగళమ్ము నీకజయమ్మును
నీకకీర్తి మఱియు నీకహితము
కలుగఁజేయుఁగాక కడఁగి నీవొనరించు
నట్టికర్మముల ఫలానుషక్తి.

సునా— (క్రోధతామ్రాక్షుఁడై గదపుచ్చుకొని) ఓరీ ! యమంగళప్రలాపా ! ఏమని ప్రేలుచుంటివి?

భరతా— (భయమునటించి) అయ్యో ! నేనేమంటిని, ప్రభువు నాశీర్వచించుటయు దోసమగునా ?

సునా— (పండ్లు పటపటఁ గొఱుకుచు)

మ. దురభిప్రాయముతో దురర్థము దొరిందుం దోఁప నాశీర్వచః
పరమార్థం బదియప్రధానగతిగా భావింప నీ వాఁడు ని
ర్దురితోక్తుల్ చవిగావు నిన్నిపుడె తున్మింతుం గేవలాశ్లీలవా
గ్భరముం గ్రక్కినదానికిం ఫల మొగిం బ్రాపించి గూల్చెట్టఁగన్.

సూత్ర— (రణోచితవేషముతోఁ బ్రవేశించి) మహారాజసోదరా! సర్వవిధముల నపాయకరమ్మగు కవినిందకుఁ గడంగుట యుక్తముకాదు. కొండొక యుపశమింపుము.

వజ్ర— (తనలో) ప్రస్తుతము భద్రుం డిట్టి రణోచితవేషముతో రావలసిన యావశ్యకత ప్రకృతకథానుకూలముగఁ గన్పట్టదు. తమ గురువును నిరసించిన నాతమ్మునిపైఁ గినుకవొడమి యక్కృతన నోడలెఱుంగక సాయుధుండై యరుదెంచియుండఁబోలు. వీఁడు రవంతయు భయములేక నాతమ్మునినే యధిక్షేపింపఁబూనినాఁడే! ఇందులకుఁ దమ్ముఁడే తగిన ప్రాయశ్చిత్త మొనరించుఁగాక.

సునా— (క్రోధావేశముతో గదాపాణియై నిలిచి)

శా. ఓరీ! నీచ! కుశీలవాపశద! నీయోగంబుమూఁడెన్ వృథా
కారుల్ ప్రేలిన నీగురుప్రవరు నాల్కన్ జీల్తు నీయుద్ధవే
షారంభం బదియెట్టిదో, నిలిచి నీయాచార్యుఁ గాపాడికో
మ్మారాధ్యుండగునొక్కొ? యిట్టి కుకవివ్యాసంగి దుశ్శీలుఁడా!

(అని పైకుఱుకఁబోఁగా)

మంత్రి— (వారించి) మహారాజసోదరా! ఇది నాటకము. వీరు నటులు. తమ కోపాటోపమునందు వీరెవరు? ఉపశమింపుఁడు.

సునా— వీండ్రు ప్రస్తుతస్థితిం బట్టి విచారించిన నాటకులని నామనము లేశమును విశ్వసింపకున్నది. (ఎదుటికిఁ జూచి) అడుగో, భద్రుం డేవియో పదరుట కుద్యమించుచున్నట్లు పొడకట్టుచున్నాఁడు.

సూత్ర— (తనలో) చేయఁదగిన కట్టుబాటు లన్నియు నంతఃపురి కరిగి చేసి వచ్చితిని. ప్రస్తుతము గురునిందావ్యాజమ్మున నీదుష్టాత్ముల వధించుటయ యిఁకఁ గర్తవ్యము. కావున నున్న యీకార్యము నెల్ల సంగ్రహముగ వినిచి యీరక్షోవీరుల కోపం బాటోపింపఁజేసెదఁగాక. (ప్రకాశము గంభీరముగా) ఓయీ, చక్రవర్తిసహోదరా! చక్రవర్తీ! మీరిరువురును నావచించు వాక్యములను బాగుగ విమర్శించి పిదప నేది కర్తవ్యమో

నిశ్చయించికొనుఁడు. మేము నాటకులము గాము. రత్న[illegible]రి మృగాఖేటకులము. మీ దుర్మార్గతను భరింపలేక యమరేంద్రప్రభృతులు మాతండ్రి శ్రీకృష్ణభగవానునిం బ్రార్థించుసందర్భమున నీమాత్రపుఁ బని కమ్మేమిటి కేల పనికల్పింపవలయు నని యెంచి యీవ్యాజ మొండు కల్పించుకొని చిరకాలముక్రిందటనే యిప్పురిఁ బ్రవేశించి యంతకుమున్నే వరియించి మారాక నభిలషించి వేచియున్న మీమాపురతనయలను మా మాయాచాతుర్యమున గాంధర్వవిధిఁ బరిగ్రహించి యమ్మాగురయందును నల్వురు కొమరుల నాత్మానురూపులంగని యీ బాంధవ్యమ్ము కతమ్మున మిమ్ము వధించుటకు వెనుకముందాడుచు నిప్పరమ్మునఁ గుశీలవవ్యాజమ్మునఁ గాలమ్ముగడపుచుంటిమి. ఇంతట నేఁటికి మీకుఁ గాలమాసన్నమగుటం జేసికాఁబోలు,

మ. అనిమిత్తమ్ముగ లేనిపోని యొక తప్పాపాదనంజేసి మ
మ్ము నధిక్షేపణఁజేసి యంతఁ జన కేమో మా యుపాధ్యాయులన్
వినరానట్టి దురుక్తు లాడుకతనన్ క్రేఁగై మిము న్నేఁడు కా
లునిసాన్నిధ్యముఁ జేరనంపుటకు నాలోచించి నే నిల్చితిన్.

(వజ్రనాభసునాభులు పండ్లు పటపటఁ గొఱుకుచు మండిపడుచుందురు)

సూత్ర— (శాంతసంరంభముతో) ఇంకను వినవలసినది కొంత కడమకలదు. అప్పుడే మండిపడెదరేల, కొండొకసేపు సైరింపుఁడు.

శా. దూరక్షోభ్యుఁడు శౌరి, తత్సుతుఁడు ప్రద్యుమ్నుండు వీఁ, డల్ల యా
వ్యారేసూ! గదసాంబు లుద్ధతులు నా భ్రాతల్, వృథా చాక దు
శ్చారిత్రంబును వీడి చక్క బ్రదుకన్ జర్చింపుఁ డొండేని మీ
క్రూరత్వమ్మునకున్ ఫలమ్ము గని యేగుం డా జమున్ జూడఁగన్.

దౌవా— (పటాక్షేపమునఁ బ్రవేశించి నమస్కరించి) దేవరకు జయమగుఁగాక!

వజ్ర— (సంశయముతో) ఏమి, యేదో యత్యాహితము మూఁడినవానివలె నగుపట్టుచుంటివి?

దౌవా— మహాప్రభూ! యేమి మనవిచేయుదును! కన్యకాంతఃపురమున నల్వురు రాకొమరులు సమంకురితయౌవనవయస్కులు సాయుధపాణులై వెలయుచున్నవారు. వారల మొగమ్ముల తీరు మూఁడుముహూర్తముల మీ మూగురుకొమార్తల మోములం బుణికిపుచ్చుకొనుచున్నవి. ఈ పరమాశ్చర్యంబు తమకు విన్నవింప వచ్చితిని. ఇఁక సర్వథా దేవరప్రమాణము. నాకనుజ్ఞ నొసఁగుఁడు. (నిష్క్రమించును.)

వజ్ర— (తమ్మునితో) తమ్ముఁడా, ఇది యేమి మాయ!

ఉ. ఏలిక వజ్రనాభుఁడఁట! యెన్నియొ మాయలు నేర్చునంట! త
త్పాలనమందు వంతిపురిపట్టున నెట్టనఁ బోతుటీఁగయుం
గా లిడలేనిచోటనఁట! కావలు లెవ్వరొ మూగురంట! దు
శ్శీలురు సాయుధుల్ నిలిచి చేయుదురంట! యిదే నపాయముల్.

సునా— అగ్రజా! క్షమింపుఁడు. ఇది యంతయు స్వయంకృతాపరాధము దక్క మఱొండు గాదు. ఆ పాడుపక్షి నిరర్థకపు మాటలకు లోనై తా మెప్పు డీ పట్టణమునకు నీ బూటకపు నాటకులం బిలిపించితిరో నాఁడే మొదలు మన కీ యనర్థపరంపరకుం దగిన సూచనలు కొన్ని కనుపట్ట మొదలిడినవి. గతమునకు విచారించిన ప్రయోజనము లేదు. ఆ నల్గురుఁగూడ నీ కూటమికి సంబంధించిన మాయావులే కావలయును.

మ. త్వరలో వీండ్రను వాండ్రనుం జదిపి దుర్గర్వాంధతాదోషవి
స్ఫురణం బింత యుపేక్షమైఁ బెనుచు నన్నున్ సోమరిన్ బమ్మదే
వర గాటమ్ముగ శిక్షసేయవలె నిర్వక్రక్రమాటోపమై
పరఁగంగావలె నస్మదీయమగు నైశ్వర్యంబు శశ్వద్గతిన్.

సూత్ర— (ప్రౌఢస్వరముతో) ఓహో, యేమి మీ యకార్యజ్ఞత! నా వచించు వచనంబులందలి సారమును విచారించి మఱియు నితికర్తవ్యమునకుం దిగుఁడు.

క. ఈ మూగురు జామాతల
కా మూగురునొకరు పుత్త్రు లాహవధీరుల్
మీ మీ దుహితల కొమరులు
మీ మారణమునకుఁ జాలు మేటులు సుండీ.

అచిరకాలమ్మునన మన కింతటి దౌహిత్రు లెట్లు వెలసిరని శంకింతురేని వినుఁడు. వీరు నల్వురును లోకముతోపాటు నవమాసమ్ములు గర్భమ్మున వసించి పొడమినవారేయయ్యుఁ బొడమిన కొన్ని నిమేషముల లోనన సంప్రాప్తయౌవనులుగాఁ గనుపట్టిరను నంశ మిట కడుంగడు నవీనము. ఈ యంశముఁబట్టియేని మీ మీ పరాక్రమము లిప్పట్లఁ బని సేయవని యెఱింగి,

క. మఱి దెలివి దెచ్చికొనియు దు
హితలకు హితమైన త్రోవ నెఱిఁగి జగద్ద్రో
హిత విడి బ్రదుకు టొప్పగు
నితికర్తవ్యమ్ము మీ కిదే యిటు మీఁదన్.

వజ్ర— (ముందిపడి) ఓసీ, దుర్మార్గ! అంతఃపురాపచారదూషిత! కుశీలవాధమ! కుశీల!

మ. ఇదె మిమ్మెల్ల వధించెదన్, గొమిరె లేయే మీ హాయ్యల్స్వచియో
మ్మృదుచిత్తమ్ముల మీకు లోఁగిరనుమాటే నిక్కమౌనేని దు
ష్టదశోపేతలఁ గూఁతులం జదివెదన్ సద్వంశమం దిట్టి దూ
ఱోదపంజేసిన బమ్మకుం దగినదే శిక్ష గావించెదన్.

సూత్ర— బంధుత్వముం బురస్కరించికొని నా పలుకు సదుపదేశమ్ములు మీ మనమ్ముల కించుకయు నెక్కకున్నవి. కూఁతులకతన మీ వంశమునకు వన్నె కలిగినదని సంతసించుటకు బదులు దూఱుదయించినదని యేవగించుకొనుట పిచ్చితనంబు కాక మఱియేమి? పైఁగా వంశమ్మునకిక్కారణమ్మునఁ బ్రాశస్త్యమ్ము గలిగించిన బమ్మదేవరం గూడఁ దెగడుటకన్న వేఱొండు వివేకశూన్యత కలదే?

ఉ. ఇట్టి వివేకహీనతలె హెచ్చుతపమ్ములు సేసి దేవతా
రాట్టులఁ దృప్తులం జలిపి ప్రాఁకిన యుచ్చపదంబునుండి మీ
దట్టుల నెల్లరన్ ద్రుటి నధఃపథగాములుగా నొనర్చె న
ట్టిట్టని మిట్టిమిట్టిపడ కీపయి నెమ్మది నుండు టొప్పదే!

నీ వెంత పరాక్రమశాలివో నీవు బ్రహ్మవలనఁ గొనిన వరమ్మువలననే ప్రాజ్ఞులు గ్రహింపఁగలుగుదురు

చ. సరసిజసంభవున్ దపము సౌరున దృప్తునొనర్చి దాన నే
వరమును గోరితో 'యది యవాతులతన్ బ్రకటించు భీతికిం
దెరుపయి కాక "యన్యులు మదీయపురిన్ జొరరా" దటంచు దే
వరను వరమ్ము గోరికొను పార్థివశేఖరుఁ డెందు నుండునే!

తాను బరాక్రమశాలియేని యెవ్వఁ డరుదెంచిన నేమి భయము? ఇది గాక శూరులకు శూరులతో నభినందించుట పండువుగదా. అట్టిస్థితిలో నంతఃపురమున డాఁగు చానంబలెఁ గోటలో నడఁగి మడఁగి యుండు నీ వొక శూరుండ వని నేన కాదు మఱెవ్వరును భ్రమింపరు. వృథా వాగాడంబరమును వినియోగింపక యితికర్తవ్యము నెడల జాగరూకత గలిగి జీవింపుము.

వజ్ర— ఊరకున్నకొలఁదిని దుష్ప్రగల్భములు మితిమీఱుచున్నవి. (సునాభు దిక్కై) తమ్ముఁడా! యీ దురాలాపుల నింక నెందనుక క్షమింపుమందువు. కర్ణకఠోరమ్ములగు వీని యసారాలాపములకు వినుచు ఖిన్నకుంటివేమి?

సునా— అన్నా! యీ కుశీలవాపశదుని దుశ్చరిత్రమ్మునకు మనమ్మునం బొడ
మిన లజ్జాదైన్యమ్ములు నన్నితికర్తవ్యతామూఢునిం జేయుటచే నేమియుం
దోఁపక మిన్నకుండవలసినవాఁడ నైతిని.

ఉ. పేర్వినుమాత్రి ముజ్జగము బెగ్గడిలన్ ధరనేలు నెవ్వఁడా
ధూర్వహు ముద్దుకూఁతులఁట! దొంగలబారికి నగ్గమైరఁటే
గుర్వవమానము న్వినియుఁ గూఁతుల మోమెటు చూడవచ్చు? నిం
కుర్వర నెందు నంతిపుర ముండునె యట్టిద యిట్టిదైనదో!

ప్రద్యు— సహోదరా! యీ తప్పుడుముండకొడుకు మాటలను నమ్మి నీమనము
చింతాకులం బగుచున్నది. వీనిమాటలను నిక్కమని విశ్వసింపకుము.

ఉ. నాటకులన్న బూటకమునం జరియింతురకాదె? వాండ్రెదో
మాట వచించినంత నది మర్మమునూడినయట్లులై వృథా
గాటపుఁ జింతలోన మునుఁగం దగునయ్య భవాదృశుల్; శిర
స్స్ఫోటన మాచరించి జముపోలికిఁ బ్రేలరి నంపకుండఁగన్.

సునా— అట్లైన యది యెంతపని. ఇదిగో నన్నుఁ దిలకింపుము.

(సూత్రధారునిదిక్కు)

శా. ఓరీ! ప్రేలితి వింతసేపెవియొ నీచోక్తుల్ తదాడంబరం
బాఱ న్నోటికి బుద్ధిచెప్పి శిర మ్లాడింతు నభ్రస్థలిన్
శూరాగ్రేసరు లారయంగ, మును కంసున్ జంపె నీతండ్రి; యా
వీరుం డిక్కడి కేగుదెంచి కొమరున్ వీక్షించి దుఃఖించుతన్.

సూత్ర— ఆసన్నమరణులకు మీకు నా హితోపదేశమ్ము లెక్కకున్నయవి.

ఉ. చావుఁడు నాదు నస్త్రముల చండతకున్ బలియై; భవత్పుర
శ్రీవిధి నేఁటి కిట్టిగతిఁ జెందఁగ వ్రాయఁగఁబోలు, మన్మ లీ
పై విభవంబు సర్వమును పాలనసేతురుగాక, దేవతల్
కావలులన్ వధించుట కఖండ ముదంబును గాంత్రుగావుతన్.

సునా— (మండిపడి గదం ద్రిప్పుచు) అట్లే కావింతువుగాని రణోచితస్థలము
నకు వచ్చి మరలం బ్రేలుదువుగాక.

(ఎల్లరును నిష్క్రమింతురు)

గద్య

ఇది... శ్రీ తిరుపతి వేంకటేశ్వర విరచితం బగు
ప్రభావతీప్రద్యుమ్న నాటకంబునఁ జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# పరిభావతీప్రద్యుమ్నము

## పంచమాంకము

(తెరలో)

గీ. విష్ణుకామునిచేఁ దెగవేయఁబడిన
రక్కసుల మాంసఖండముల్ మెక్కపోంటె
గరుడి పెక్కురూపులు దాల్చుకరణి గృధ్ర
తండములు విష్ణుపదమున నిండుకొనియె.

(ఇది చూళిక.)

(అంత గరుడారూఢుఁడై శ్రీకృష్ణుఁడు ప్రవేశించును.)

కృష్ణు— (నలుదెసలు పరికించి తనలో)

చ. గగనతలాన నున్నపుడె కానఁగనయ్యెను కోటలోనఁ బో
ర్వగనగుచున్న పోరచటఁ బూపవయస్సులరాలు నల్వు రూ
చఁగ దివిజారులన్ నలుకుచందము మెచ్చొనరించె వారెపో
యగుదురు నాదుమన్మలిట నాత్మజు లూనిరి యుద్ధభారమున్.

పాపము! ఈ వజ్రినాభసునాభులు నాకుం జుట్టమ్ములయ్యు నిట్లు వృథాహంకారమ్మున మడియనున్నవారు. వినినను వినకున్నను, వీరల కించుక హిత ముపదేశించుట ప్రస్తుతము కాకపోదు. (ప్రకాశము) ఓయీ! రక్షశ్చక్రవర్తీ! క్షణకాలము సంగర మాఁపి నా వచనమ్ముల నాలింపుము.

ఉ. బంధుగులైతి మేమిటికిఁ బ్రాణహరమ్ముగు కయ్య మిట్టియీ
సందడిలో జయించినను వచ్చిన రెంటనుగూడ నీకగున్
గుం దదిగాన నానుడులు గొండొక డెందమునందుఁ జేర్చి నీ
మందతనమ్ము వీడి తగువైఖరి మై మను టొప్పుకుండుటే.

(తెరలో)

ఏమీ, నీవా! నీయొద్దనున్న బొల్లిగర్వం బట్టియేకాక, మాతో నిప్పుడు పెనఁగుచున్న యీ కుశీలవాపశదుని యాకృతిసామ్యముంబట్టికూడ నీ వల పరమనీచుండగు కృష్ణుండవని స్పష్టముగాఁ దెలియుచున్నది. ఇట్టి నీ బాంధవ్యము నపేక్షించుట కీవజ్రనాభుం డొక వెట్టిగొల్ల యనుకొంటివా?

శా. నిన్నున్ నీదుతనూజులం గెడపి మీ నేస్తమ్మునం గన్న మా
యన్నంగూఁతుల కొడుక్కులం దునిమి, పై నస్మత్తనూజాతలన్
వన్నెన్ వాసినిగన్న రక్కసుల కీ వాంఛించెదంగాని యీ
బన్నంబున్ సహియించి యూరకుర నీ బాంధవ్యముం గొందునే!

కృష్ణ— (నవ్వుచు) బావా! నీమాటలేల కాదనవలయును? నీపరాక్రమ మట్టిదియే యనుకొందము. ఇంతటి పౌరుషశాలివికదా, యెట్టియభిమానశూన్యుఁడును బొనర్ప నిచ్చగింపని యీదృశ స్త్రీప్రసర్వివాహమునకు నీమనం బెట్లు రోయక సమ్మతించెడిని? సంతానవతులగు కూఁతులకుం బునఃపరిణయం బాచరింప సమకట్టు నీవు పోతుటీఁగకుఁగూడ నంతిపురమునఁ బ్రవేశము నంగీకరింపరానియంత కట్టుదిట్టము నేల చేయవలసివచ్చెనో యని విచారించుచుంటిని.

(మరలఁ దెరలో)

ఇప్పుడు నీతో నుముకదంపుమాటలు ప్రసంగించుటకు మాకుం దీరదు. నీకొమరులను వధించి నిన్ను వధింప నరుదెంతుము. నీ వేమేని యాయ్యెడ, బ్రసంగించి తత్ఫల మనుభవింతువుగాక.

కృష్ణ— ఆసన్నమగు మరణ మెవ్వరికిఁగాని సదుపదేశముపంకకు మనమ్ముం దిరుగనీయదు. అందులో వీండ్రు పరమదుర్మార్గమ్ములగు రక్షఃకులమ్మునఁ బొడమిన దుండగీండ్రు (తెరవంకఁ జూచి) పోరు కడుంగడు భరమ్ముగా నున్నది. కుమారప్రద్యుమ్నుఁడును, గదసాంబులును దండోపతండమ్ములుగా రక్కసులం గూల్చుచున్నారు. ఇఁక వజ్రనాభసునాభులు కుమారుల నెదుర్కొనియెదరు. రథస్థులగు రక్కసులతోఁ బదాతిమాత్రులుగనున్న కొమరులు పోరుట భరముగా నుండునేమోకదా! (మరలఁ బరికించి) లేదు. ఇప్పటి వీరి సంగ్రామము త్రేతనాఁటి రామరావణ సమీకమున్ జ్ఞప్తికిఁ దెచ్చుచున్నయది. (ఆకసమువంకఁ జూచి) అదిగో, నాయన్న మూగురకును మూఁడురథములను బంపి తా నియ్యెడకు రణదిదృక్షాకౌతూహలమ్మునఁ గాఁబోలు నరుదెంచుచున్నవాఁడు!

ఇంద్రుఁడు— (ప్రవేశించి సంతోషముతో) ఆపదుద్ధారకా! నమస్కారము.
(పాదములపైఁ బొరగును)

కృష్ణ— (ఒరగుచుండఁగనే లేవనెత్తి) అన్నా! యాశీర్వచన పాత్రుండగు వీని నిట్లవమానింపఁదగదు.

ఇంద్రు— దేవా, లీలామానుషవిగ్రహ! యెంత మాటాడితివి! ఏదో కారణాంతరమున నాఁడు మాయమ్మ గర్భమ్మున నీవు నాకనుజుండవై జనియించినమాట వాస్తవమే. నేఁటి మానవజన్మంబునుంబోలె నదియును నీకొకలీలామాత్రంబ. అంతమాత్రమ్మున నీపరాత్పరత్వంబు మఱచి సాపరాధుఁడనగుదునా? అట్లొకపరి నీబాల్యమ్మునఁ బ్రమత్తుఁడనై యొనరించిన యపరాధమ్ము చాలక మరలఁ జెడుదునా?

కృష్ణ— (చిఱునవ్వుతో) చిన్ననాఁట బాల్యచాపల్యమ్మున నా యొనర్చిన యొగ్గు నగ్గడించుటచే నాకు సిగ్గగుచున్నది. దానిని మఱచి నన్ను మన్నింపఁగోరెదను.

ఇంద్రు— దేవా! నిన్ను మన్నింప నే నెవఁడను! నీవు సర్వజగత్కర్తవు, భర్తవు, హర్తవు. ఇఁక నన్నుఁ బొరఁబెట్టకుము. ఇదిగో కు, కుమార సంగరాలోకనకుతూహలాయత్తచిత్తులమగు మన కిపు డన్యప్రసంగముల కవకాశమును లేదు. (పరికించి) పోరు మిక్కిలి మిక్కుటముగాఁ బ్రవర్తించుచున్నది. చూచువారల కానంద జనకముగా నున్నను గుమారులకుఁ గొండొక భారముగానుండకపోదు.

ఉ. ఎంతయొకాల మీరణము నేటికి సాఁగఁగనిత్తు వింతలోఁ
జెంతకునంపరాదె హరి! శిక్షితనక్రము చేతిచక్రమున్
మంతువు లెన్నియో సలుపు మానుషఖాదుల శీర్షముల్ తదా
క్రాంతికి నగ్గమై సుఖముఁ గల్పితమా సురభూసురాళికిన్.

కృష్ణ— అగును. "ఆలస్యాదమృతం విషం" కనుక నట్లొనరించుచున్నాఁడను.
(చక్రము నుద్దేశించి) చక్రరాజమా!

చ. తునిమితి వెందఱో రిపులఁ దొల్లి మదీయకరమ్మునుండియే
చని యిపు "డాత్మ పుత్రుఁ" డను శాస్త్ర మెఱింగిన నీవు వాదు ప్ర
ద్యునికరముఁ భజించి యల దుర్మదులన్ సుతుఁడంప నేగి చ
య్యన వధియించి యంతన స్వహస్త మలంకృతముం బొనర్పుమా.

(చక్రము ప్రద్యుమ్ననికడకంపును.)

ఇంద్రుఁడు— (పరికించి) వాసుదేవా! అటు దిలకింపుము.

చ. కొమరుఁడు పంపఁగా నరిగి క్రూరుల రక్కసులం ద్రుటిఁ బరి
భ్రమణరయమ్మునం బొదివిపట్టి శిరమ్ములు ద్రుంచి లోకభ
ద్రము సమకూర్చె నీదగు కరమ్మునకుఁ జనుదెంచెఁ జక్రరా
జము దివిదేవతల్ కుసుమసంతతివర్షము సారె కొల్వఁగన్.

కృష్ణు— (చక్రమును ధరించుట నటించును, పుష్పవృష్టిగురియును.)

ప్రద్యు— (లజ్జాసంతోషములతోఁ బ్రవేశించి యింద్రోపేంద్రులకు నమస్కరించును.)

గదసాంబులు— (అట్లే ప్రవేశించి నమస్కరింతురు.)

ఇంద్రు— (ప్రీతిపూర్వకముగా లేవనెత్తి) మీకతన మీయాదవాన్వయమే కాక సురాసురాన్వయములు గూడఁ దరించినవి. మీకు సమస్తశుభమ్ములు చేకూరుఁగాక.

కృష్ణు— (ప్రీతిపూర్వకముగా నాలింగనము చేసికొని) "పుత్రాదిచ్ఛేత్పరాజయ" మ్మను నభియుక్తోక్తికిఁ బ్రథమోదాహరణమ్ముగా నన్ను సమర్థించిన మీకుఁ గళ్యాణ సమృద్ధి చేకూరుఁగాక.

ఇంద్రు— తండ్రులారా! ఎప్పటికప్పుడు మీ క్షేమోదంతమును శుచిముఖివలనఁ విని యానందించుచునే యున్నాఁడను. ఐనను బ్రత్యక్షముగా నొకపరి మనుమలను గోడండ్రను జూచి యానందింపవలెనని యిట కరుదెంచితిని.

(అంత శుచిముఖియు, ప్రభావతీచంద్రవతీగుణవతులును,
వారల కొమరులును బ్రవేశింతురు.)

శుచి— అమ్మలారా! త్రిలోకపూజ్యులగు మామలకు నమస్కరింపుఁడు.

ప్రభావత్యాదులు— (సంశయింతురు.)

శుచి— ఆశౌచదోషమ్మువలని శంక నుడుఁగుఁడు. కించిద్దూరమ్మునుండియేని నమస్కరింపుఁడు; లేదా శిరమ్ములు పాదమ్ములకు సోఁకునట్లెని నమస్కరింపుఁడు. పతితుల మరణమువలని యాశౌచమును బరిత్యజించినను నం దోసఁగుండదని నా తాత్పర్యము.

ప్రభా— (తనలో) సర్వధర్మవేదియగు నీరాయంచకవయిత్రి నుడులకన్న ధర్మశాస్త్రము లెక్కుడుగాదు. (నమస్కరించును.)

చంద్రవతీగుణవతులు— (అట్లే నమస్కరింతురు.)

కృష్ణు— (ప్రీతితో) అమ్మలారా! వీరభర్తృకలును, వీరమాతలునగు మీ కాశీర్వదింపఁదగినదేదియు మేముండును. సుఖమ్ములం దులఁదూఁగుదురు గాక.

ఇంద్రు— (ప్రీతితో) ఇఁక మీవంశము సద్గుణశోభితంబై జగమ్మున కమితానంద మొసఁగుచుండుఁగాక.

శుచి— (కుమారుల నుద్దేశించి) ఆయుష్మంతులారా! మీమీ నామమ్ములం దెలుపుచు మీ తాతలకు శుభసంఘాతలకు నమస్కరింపుడు.

ప్రభావంతుఁడు— తాతా! ప్రభావతీ ప్రద్యుమ్నతనూజుండు ప్రభావంతుండు మీమనుమండు మీకిదె నమస్కరించుచున్నాఁడు.

కృష్ణు— (ప్రీతితో) తండ్రీ! ఆయుష్మంతుడవు కమ్ము.

చంద్రప్రభుఁడు— తాతా! చంద్రవతీగర్భసంజాతుండు గదాత్మజుండు మీమనుమండు చంద్రప్రభుండు మీకిదె నమస్కరించుచున్నాఁడు.

కృష్ణు— (ప్రీతితో) తండ్రీ! ఆయుష్మంతుఁడవు కమ్ము.

గుణవంతుఁడును కీర్తిమంతుఁడును — తాతా! గుణవతీ గర్భసంభూతులు, సాంబాత్మసంభవులు గుణవంతుఁడును కీర్తిమంతుఁడును మీకిదె నమస్కరించుచున్నారు.

కృష్ణు— (ప్రీతితో) తాతలారా! మీమీ నామమ్ములకు వన్నెవెట్టుగతి దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లుఁడు.

(అట్లే నలువురును ఇంద్రునకుఁగూడ నమస్కరింతురు)

ఇంద్రు— మనుమలారా! సమస్తజగత్కల్యాణసంధాయకుండగు శ్రీకృష్ణభగవానుని ముద్దుమనుమలకు మీకొకఁ డాశీర్వదింపఁదగిన దేముండును? (కృష్ణునితో) అప్ప దిచ్ఛానుసారముగా నాశీర్వదించుటకుఁ దమకు సమ్మతమేనా?

కృష్ణు— అమరేంద్రా! నాయిచ్ఛ యొకటియు, నీయిచ్ఛ వేఱొకటియు నగునా! నీ చిత్తానుసారముగా నీకోమరుల ననుగ్రహింపుము.

ఇంద్రు— అట్లేని యిట్లగుఁగాక.

క. మాతామహార్జితమునకు
నేతలగుచు నల్వురును వినీతియెలర్పన్
ఖ్యాతివిభూషితులై యీ
భూతల మేలుకొనుఁ డయము పొంపిరివోవన్.

కృష్ణు— తథాస్తు. అమరేంద్రు నాజ్ఞంబట్టి యిప్పుడే స్వస్తివాచనపురస్సరమ్ముగ లఘుపట్టాభిషేకమ్ము నిర్వర్తింపఁబడుఁగాక.

శుచి— (పట్టాభిషేక మంగళమును నిర్వర్తించి) నాయనలారా! ఇంతకన్న మీకుం గావలసిన ప్రియమేముండును. అయిన నిట్లగుఁగాక.

## భరతవాక్యము

గీ. బ్రాహ్మణబ్రాహ్మణేతర వైరములకుఁ
దావులేకుండ ధరణి భద్రమ్ముగలిగి
వేదసమ్మత మగునట్టి వృద్ధి కెక్కి—
యై సకలసమ్మతిని జయమందుఁగాక!

## గద్య

ఇది శ్రీ కింకవీంద్రఘటాపంచానన బాలకలానిధి బాలసరస్వతీ
విద్వత్కవి శతావధాని తిరుపతివేంకటీయ ప్రభావతీ
ప్రద్యుమ్న నాటకమ్మున బంచమాంకము
సంపూర్ణము.

# తప్పొప్పుల పట్టిక

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 3 | 8 | నుత | నుద |
| 10 | 27 | గాఁ | గాం |
| 17 | 26 | స్పష్ట | స్పష్ట |
| 44 | 21 | కుచం | కుఁజం |
| 49 | 29 | న్యథా | న్యథా |
| 54 | 6 | రంధ్ర | రంధ్ర |
| 56 | 19 | నుప్ర | నుబ్ర |
| 59 | 4 | పుగో | పుఁగో |
| 67 | 19 | నదృ | నఁదృ |

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# దంభవామనము

# ఇందువచ్చు పాత్రములు.

### 1 వ అంకము.

1 సూత్రధారుఁడు
2 మారిషుఁడు
3 బలిచక్రవర్తి
4 రాక్షసులు
5 ఇంద్రుఁడు
6 బృహస్పతి
7 అచ్చరలు

### 2 వ అంకము.

1 అదితి
2 ఇంద్రుఁడు
3 శచి
4 జయంతుఁడు
5 కశ్యపుఁడు
6 విష్ణుమూర్తి

### 3 వ అంకము.

1 గంధర్వులు
2 ఇంద్రుఁడు
3 బృహస్పతి
4 జయంతి
5 శుక్రుఁడు

### 4 వ అంకము.

1 రక్కసులు
2 బృహస్పతి
3 బలిచక్రవర్తి
4 శుక్రుఁడు

### 5 వ అంకము.

1 సుబ్బదీక్షితులు
2 వేంకటచయనులు
3 వామనమూర్తి
4 బలిచక్రవర్తి
5 శుక్రుఁడు
6 వింధ్యావళి
7 దాసి

### 6 వ అంకము.

1 రక్కసులు
2 శుక్రుఁడు
3 బలిచక్రవర్తి
4 వామనుఁడు
5 ప్రహ్లాదుఁడు
6 వింధ్యావళి

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# దంభవామనము

## ప్రథమాంకము

(నాంది)

మ. పరమాత్ముండు పయోజగర్భముఖదేవవ్రాతసేవ్యుండు భీ
కరరక్షోమదహారి శ్రీధవుఁడు భక్తస్వాంతసంచారి సా
గరసంవాసి యుపాయశాలి జగదాకారుం డుదారుండు శ్రీ
హరి యయ్యుగ్ర హరిసోదరుండు నగుపద్మాక్షుండు మి మ్మేలుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును.)

సూత్ర— (తెరవంకఁ జూచి) మారిష! ఇటు రమ్ము.

మారి— (ప్రవేశించి) ఆర్యా, ఇదె వచ్చితి.

సూత్ర— వింటివా? సభ్యులయాదేశము, భగవంతుం డెట్టివారికి సహాయుం డగునో! పరోపకార మొనర్చువారి తెఱఁ గెట్టిదియో తెలియం దగు నాటకము నేఁడు ప్రదర్శింపవలె నఁట.

మారి— అట్టి నాటకము తిరుపతి వేంకటేశ్వరులచే రచింపఁబడిన దంభవామనమే కదా! దానిం బ్రదర్శింపుదము.

సూత్ర— అవును చక్కఁగాఁ దెల్పితివి కాని,

గీ. మాయ పన్నిన కపట వామనునికన్న
నాఁడి తప్పక మేదిని యఖిల మతని
కిడిన బలి యుత్తముండని యెన్నఁదగదె?
ధర్మమన వేఱుగలదె సత్యంబుదక్క?

అని వామనుని విషయమునఁ గొందఱు దురభిప్రాయపడియున్నారుసుమా!

మారి— అవును. ఆవిషయము నేనును నెఱిఁగినదే. ఆయూహ తమ రన్నట్లు దురూహయే, దుర్మార్గులను వంచించుట కట్టియుపాయమేని యొనర్పవచ్చును. ఎట్లేని దుష్టభంజనంబు కర్తవ్యంబు. "గోవులను జంపి చెప్పులను

దానము చేసినయట్టుత్తమునకు శాప గలిగించినయప్పుఁ డేదో యొక విషయమున యోగ్యుఁడుగా నున్నమాత్రంబున సహజసద్గుణసంపన్నుఁ డగునా ?

(తెరలో) ఎవఁడురా నన్ను నిందించుచున్నవాఁడు !

సూత్ర— బలిచక్రవర్తి కాఁబోలును నాకముపైకి దాడి వెడలుచు నిటు వచ్చుచున్నాఁడు. మన మీపాటికిఁ బోవుదము. (నిష్క్రమింతురు)

(ప్రస్తావన.)

(అంత బలి సేనతోఁ బ్రవేశించును.)

బలి— (బిగ్గరగా) ఓ రాక్షసవీరులారా ! పాతాళభువనమ్మునుండి యియ్యెడ కనేక కష్టమ్ములం బడి వచ్చి యెట్టకేలకుఁ గోట ముట్టడించితిమి. ఇఁక మీరెల్ల వెనుకటి మన పరాభవము జ్ఞప్తికిఁ దెచ్చుకొని మీమీ పరాక్రమములం జూపుదురుగాక. భృగు వరప్రభావమున నిప్పు డింద్రుఁడు మనల నించుకేని యెదిరింప నేరఁడు. మీకు మంచిదినములు సమీపించుచున్నవి.

మ. నవమందార సుమస్రగావళులతో నాకాంగనాసౌఖ్యవై
భవలీలన్ దులఁదూఁగుచున్ నిరతసంపద్ధాత్రియౌ కామధే
నువుపాల్ గ్రోలుచు నాకలోకమునయందున్ మీరు క్రీడల్ పొన
ర్పవలెన్ రక్కసులార ! సంగరసమాగంభస్థితిన్ బొల్చుఁడీ.

రక్క— (అందఱును నొక్క పెట్టున) సిద్ధముగా నున్నారము. జయము, జయము.

బలి— (సంతోషముతో) మీవంటి సమర్థులు నాకుఁ దోడుగా నున్నప్పు డిఁకఁ గొదవ యేమి ? మీయానందమే నాయానందము. లోకము లనేకము లున్నను దీనివంటి లోకము మఱియొకటి గాదు. కావున మన మెల్లెని దీని నాక్రమించుకొన వలయును. (యోజించి) కాదు, కాదు. ఆక్రమించుకొంటిమి. ఇఁక మీచిత్తము వచ్చినట్లు విహరింపుఁడు.

చ. నిరతము నాటపాటలకు నేర్పరులై గడిదేఱినట్టి సుం
దరులగు రంభ యూర్వశి ఘృతాచి తిలోత్తమ మేనకాప్రమ
ద్వరలును విప్రజిత్తియును దక్కిన యచ్చరలున్ బ్రమోదబం
ధురముగ మిమ్ముఁ గొల్వఁ దులఁదూఁగుఁడు నందనమందు దానవుల్.

రక్క— చిత్తము. ఇదిగో నందనవనమునకుఁ బోవుచున్నారము.

(అని కొందఱుపోవుదురు.)

బలి— ఏమి ! ఇంద్రుఁడు గోట వదలి లేచి పోయెనా. లేనిచో లోనఁ గల కలమేని వినఁబడకుండునా ?

(తెరలో) దేవా! రాక్షసేంద్రా! తమయాజ్ఞచొప్పునఁ గోటం బ్రవేశించి యింద్రుని వెదకితిమి. అతఁడుగాని దిక్పాలురుగాని యెక్కడను గానరారైరి. స్వర్గమును వదలి యరణ్యములపాలై పోయిరని యోజించెదము.

(అంత నింద్రుండును బృహస్పతియును ప్రవేశింతురు)

బలి— రక్కసులారా! తెలిసినదా, యిక్కడి కింద్రుని పరాక్రమము? మనము గూడఁ గోటలోనికిం బోవుదము పదుండు. (పరిక్రమించి)

ఉ. వాఁడన నెంత? వాని బల వైభవ మెన్నఁగ శాంతులందు మా
ఱాడని తాపసోత్తములయందుఁ బరాంగనలందుఁ జెల్లుఁ; బో
రాడుట కప్సరోంగనల కౌనె? తపమ్ము లణంచుభంగి ; దూ
టాడెదఁ గోటి యింద్రు లొకటై యని నన్నెదిరించిరేనియున్.

(నిష్క్రమింతురు.)

ఇంద్రు— (విచారముతో) గురువర్యా! మనము స్వర్గమును దుర్గతి పాలొనరిచి యిట్లరణ్యమున నుండవలసిన దనియేనా తమ యభిప్రాయము?

బృహ— మహేంద్రా.

క. అగు నది కాకుండదు దై
వగతికిఁ బ్రతి సేయు నట్టివార మె! చేయం
దగు నైనను యత్నమ్మును
బగరను భంజింపుటకు నుపాయం బున్నన్.

ఇంద్రు— (కన్నీటితో)

మ. అమరస్థానము వాని రాజ్యముగఁ గల్పాగ్రప్రసూనమ్ము ల
య్యమరారాతిపరమ్ముగా మఖము లాహంకారి పాల్గాఁగ సం
ద్రమునన్ బుట్టిన గోవు వానిదిగ నద్దైత్యుండు పెంపొంద దై
న్యమునన్మగ్గి సురేంద్రు డిట్లగుటయు న్యాయంబె యో యీశ్వరా!

బృహ— సురేశ్వరా! మన యదృష్టమునకు నీశ్వరుం డేమి చేయును?

చ. బలియుఁడు క్లేశ మొందుట యపాస్తబలుండు సుఖమ్ము చెందు టు
జ్జ్వలమతి గల్గు ధీరునకు సంపద లేమియుఁ దెల్వి లేనివాఁ
డలఘుగతిన్ మహా విభవ మందుట శూరపరాభవంబు భీ
తుల విజయంబు నన్నది బుధుల్ పరికింతురు దైవికమ్ముగన్.

ఇంద్రు— దేవమంత్రీ! మునుపు మనచే నోడిపోయిన బలి కిప్పు డింతటి శక్తి యెట్లు గల్గినదో?

బృహ — ఇది భృగువుల యనుగ్రహము. వారిడిన మంత్రం బలి నిష్ఠతో జపించి బలి మన కజేయుం డయ్యె.

ఇంద్రు — అక్కటా! అచ్చరల గతి యేమయ్యెనో?

(అంత నిరువు రచ్చరలు ప్రవేశింతురు.)

ప్రథ — చెలీ! దైవవశమున నిప్పటికి మన మిరువురమును ధన్యులము.

ద్వితీ — ఏమీ! ఆ ముష్కరుడి రక్కసుల బారిఁ బడక తప్పించుకొని వచ్చితిమనియే నా? సఖీ, యెంత తెలివితక్కువదానవు? తనవార లందఱును సుఖముగా నున్నప్పుడు గదా సుఖము తనకుఁ గలుగుట!

ప్రథ — అవును. అక్కటా, మన రా జెక్కడ నుండెనో? శచి యేమయ్యెనో? జయంతుఁ డెట్టి దుర్దశలో నుండెనో కదా?

ద్వితీ — (చూచి) చెలీ! అరుగో! ఇంద్ర బృహస్పతులు. (సమీపించి నమస్కరించి) జయము, జయము.

ఇంద్రు — చెలులారా! ఇఁక నెక్కడి జయము? మీ రేవిధమైన యపాయము నుఁ బొందకున్నారు గదా? ఆ బలి ప్రభుత్వ మెట్లున్నది?

ప్రథ — దేవా! ఏమి చెప్పుదుము.

చ. అమరపదమ్ము చేకొని సురారిమయమ్ముగ నేలుచుఁ గ్రమ
క్రమమునఁ దక్కు దిక్పతుల గద్దియలన్ దనపాలు చేసి వి
క్రమమున మూఁడు లోకముల రాజ్యము సేయుచు నందనమ్మునం
దు ముదము మీఱ నచ్చరలతో విహరించు నవార్యచర్యుఁడై.

బృహ — అక్కటా, నాకమున కెట్టి దుర్దశ మూఁడినది! తరువాత?

ద్వితీ — ఇంతటి దుర్దశ శత్రువులకేని లేకపోవుఁ గాక.

చ. అనవరతంబు కల్పకసుమాంచితుఁడై సుధఁ గోలుచున్ సురాం
గనలఁ జెలన్ దగిల్చి కడుఁ గంటకుఁడై మఖభాగముల్ హరిం
చి నిఖల దేవతల్ తనదు సేనయకాఁ బచరించి తత్కృతుల్
పానరుపఁ జేయుచు న్నెగడెఁ బొంపిరివోయిన మేటి సంపదన్.

ఇంద్రు — దేవతల కేవిధమైన యధికారముల నిచ్చుటయే లేదా?

ప్రథ — లే దనియే చెప్పవచ్చును. ఇచ్చినను బ్రధానాధికారము లిచ్చుటలేదు.

చ. ఒకఁడు యముండు శ్రీముఁ డిఁక నొక్కఁడు వహ్ని మఱొక్కఁడింక వే
ఱొకఁడు దినేశ్వరుండు శశియున్ మఱియొక్కఁడు వాయుదేవుఁ డిం
కొకఁడు నొకండు పాశి యిటు లొక్కఁ డొక్కరుండు గాఁ దద
యక్రతులు సేయ నేర్పఱచె నాత్మకు నచ్చినదాన వేంద్రులన్.

బృహ— ఇఁకఁ బరిపాలనము వేఱే చెప్ప నక్కఱలేదు. వారు దేవతలను గడుఁ గష్టపెట్టుదురు. రక్కసులకు సుఖదాయకులుగా నుందురు. కాని, యియ్యెడ మన కొకలాభము లేక పోలేదు. పక్షపాతియగు రాజతి శీఘ్రమునఁ బదభ్రష్టుం డగును.

ఇంద్రు— గురువరా! ఇవి యేటిమాటలు? అని మనసు మీద మేషములు లెక్కించుచు మిన్నకుండఁ జనునా? ఉపాయ మాలోచింపుఁడు.

బృహ— (యోజించి) ఉపాయమున కేమున్నది? "న గాయత్ర్యాః పరం మంత్రం న మాతుః పరదేవతా." కనుక మాతృభక్తి గలవారలకు సమస్త సంపదలును గలుగును. తప్పక యదితిని సేవింపుము. ఆ దేవమాత నిన్ను వృద్ధి చెందించును.

మ. మనమం దెన్నఁగ నేల యన్యులను "నో మాతుః పరా దేవతా"
యనువాక్యమ్మున మాతృశబ్దమున కన్వార్థమ్ము గానేర్చునే?
జననీరూపమునన్ సదా సులభయై శాసించు శక్తిన్ బరాం
బను భావించినవాని కొందు గొదవే? భాగ్యమ్ము చేకూరదే!

ఇంద్రు— అట్లయిన నాపెదర్శనమునకే పోవుదము. (నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ.. తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
దంభవామనము నందుఁ బ్రథమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయై నమః

# దంభవామనము

## ద్వితీయాంకము

(అంత నదితి ప్రవేశించును.)

అది— (విచారముతో) అక్కటా! నా సంతతి కెట్టిదుర్దశ వచ్చినది. ఇప్పట్లు నాచెలియలు దితి తనసంతతి నించుకంతయేని మందలింపక పోయెఁగదా? అవును. ఇఁక నెక్కడిచెలియలు! ఎప్పుడు సవతుల మైతిమో యప్పుడే శత్రువుల మైతిమి. తండ్రీ, మహేంద్ర! అమ్మా, శచి! నాయనా, జయంత! మీరెయ్యెడ నేయే కష్టముల ననుభవించుచున్నారు?

(అంత సతీసుతులతో నిందుృఁడు ప్రవేశించి)

ఇంద్రు— వందే మాతరం.

శచి— వందే దేవమాతరం.

జయం— వందే పితామహీం.

అది— యథాపూర్వ మైశ్వర్య మనుభవంతు వత్సాః.

జయం— కారడవులలో నైశ్వర్య మెక్కడ వచ్చును?

ఇంద్రు— కుమారా, యట్లనకుము. ఆమెవాక్య మమోఘము కదా!

అది— నాయనా, జయంత!

చ. కలిమికి నెట్టు లట్టులనె కన్పడు లేమికిఁగూడఁ బోకడల్
కులికినవారె క్రుంగుదురు క్రుంగినవారలె కుల్కుచుందు రెం
దులకు విచార మందెదవు? తొల్లిఁటి నీసిరి నీకు వచ్చుఁ గొం
దల మిఁకనైనఁ బోవిడుము నవ్వినయాళులె పట్టణంబులో.

శచి— అత్తా, మీవాక్య మసంశయ మగుఁగాక.

ఇంద్రు— తల్లీ! నాకుఁ బునస్సామ్రాజ్యపదవి గల్గుట కుపాయమేమి?

అది— నీకుఁ గల మాతృభక్తియే నీయభివృద్ధికిఁ గారణము కాఁ గలదు. నే నీవిషయమై మీతండ్రితో యోజించి పర్యవసానమును బిదపఁ దెలిపెదను. ఇప్పటికి గూఢముగా నెక్కడనేని వసింపుము, పొమ్ము.

(ఇంద్రాదులు నిష్క్రమింతురు)

(కశ్యపుఁడు ప్రవేశించును.)

కశ్య— (ఆకాశమువంకఁ జూచి) ఏమి? "దైత్యులును ఆదిత్యులును మరలఁ గలహము పెట్టుకొన్నా" రనుచున్నారా? సరే, యిందుఁ గ్రొత్త యేమున్నది? ఇది నూతనము గాదు. "ఇరువురు పెండ్లములమగని కిబ్బందిమరణ" మన్నట్టు లీయవస్థ కడుఁ జిక్కుగా నున్నయది. ఈబాధ పడలేకయే నేను విజనమగు నివ్వనమ్మునఁ దప మాచరించుకొనుచున్నాఁడను. ఇఁక నాకు వార లేమైనను విచారము లేదు.

అది— (సమీపించి) నాథా! నమస్కారము.

కశ్య— (తనలో) ఇదిగో, వచ్చినది. ఏదో యిఁక నన్ను వేధించుటకు మొదలు వెట్టును గాఁబోలును (ప్రకాశము) కల్యాణం భూయాత్. నీకుఁగుశలమా?

చ. కొమరులు చెప్పినట్లు విని కోమలి! నిన్ భజియింతురే? సమ
స్తమునకు నీదు నాజ్ఞ శిరసావహియించుచు నీవధూజనం
బు మెలఁగుచుండునే? కలహముల్ సమకూడవుగా పరస్పరం
బమరులకున్ సురారులకు నన్నివిధంబుల సౌఖ్యమొప్పునే?

అది— దేవా! దేవరకు సర్వంబును గోచరమే. అయినను నడిగితిరిగాన మనవి చేసికొనుచున్నదానను. దుర్జనులగు దైత్యులు సుజనులగు నమరులం బట్టి వెడలఁగొట్టి స్వర్గ మాక్రమించుకొన్నవారు.

కశ్య— సాధ్వీ! ఇది క్రొత్తసంగతి గాదు. ఇరువురును నిరువురే. ఇం దొకరి కొక రెవ్వరును దీసిపోరు. ఎవరి కని చెప్పఁగలను.

అది— స్వామీ! మీకిరువురును గొమరులే యైనను న్యాయాన్యాయములు విచారింప వలదా? నాకొమరులకును దితి సుతులకును యోగ్యతలోఁ దారతమ్యము లేదా? నామనవి విని దైత్యులను మందలింపుఁడు.

కశ్య— దైత్యులు శుద్ధాపాత్రు లనియు నీకొమరులు పరమయోగ్యులనియును నీవు చెప్పుచున్నావు, చక్కఁగా నాలోచించిన వా రట్లు నొడువరు.

గీ. శశి బలాత్కారమున గురుసతి హరించె
ధర్మ మెఱిఁగియు గౌతమతరుణిఁ గలసె

నింద్రుఁడు, సురుంటు గొని భాగ్యనింతి గర్వ
పతి నరసిచూడ నిట ధర్మవర్తనంబె?

ఎందుకు, మనము మాట్లాడ కూరకుండవలెను. "కడుపు చించికొన్నఁ గాళ్లపైఁబడును."

అది— అవును సత్యమే. అయినను వారియంత దుండగులు మాత్రము వీరలు కారు. వీరి ననుగ్రహింపక తప్పదు.

కశ్య— సతీమణీ! నామాట విని కొంతకాల మడవులలోననే వసియింపనిమ్ము, దానిచేఁ గష్టసుఖములు చక్కఁగా వంటఁ బట్టి మంచిచెడ్డలు దెలిసి యోగ్యులగుదురు. అది గాక వీ రేమి వార లేమి రాజ్యలోభమ్ముచేఁ గ్రుమ్ములాడుచున్నారు.

గీ. ఎంతరాజ్యమ్ము కల్గిననేమి! సుఖము
కలుగనేరదు లోభసంక్రాంతమతుల
కదియొకటిలేని వారల కన్నియెడలఁ
గలుగు సౌఖ్యమ్ము నామాట కలికి! వినుము.

కావున నీవు పోయి లోభగుణం బుడిగి వర్తింపుఁ డని నీకొమరులకు బోధింపుము.

అది— నాధా! మీరు వచించినసంగతులు కేవలవిరాగుల కుపచరించునే కాని సాంసారికులకుఁ బనికి రావు. కావున నేదేని యుపాయము యోజించి నాకొమరుల రాజ్యమ్ము నిప్పింపుము.

కశ్య— (నవ్వి) ఎంత వెఱ్ఱిదానవు! "అడ్డాలలోనే బిడ్డలు గాని గడ్డములు వచ్చిన పిమ్మట బిడ్డలా?" నేను బోయి దితిసుతులతో నొక్కి చెప్పితినేని వారిట్లు చెప్పుదురు.

గీ. "ఉభయులము స్వార్థపరులము యుభయులమును
గశ్యపోద్భవులమ ధనకనకవస్తు
వాహనమ్ములకొఱకు నుభయుల మని నొ
నర్ప నొక్కఁడఁ బక్షమూనంగఁ దగునె?"

అది— ఒకరికి బాతాళమును వేఱొకరికి స్వర్గమును బంచి యిచ్చితిరి కదా! అట్టియెడలఁ దమభాగముకాని స్వర్గమునకుఁ దా మెందుకు రావలెను? దీనికుత్తరమిట్లు చెప్పఁగూడదా?

కశ్య— వినువారుండవలెను గాని చెప్పుటకేమి. ఏదోచెప్పనేవచ్చును. ఇంతకును రాజ్య మన్నప్పు డెవరు బలవంతులో వారిది. కావునఁ బ్రకృతము దైవవశమున సురలు బలహీనులైరి వీరికి రాజ్యము లభింప నేరదు.

అది— నాథా! ఇది కేవలము పిచ్చితనము. దైవ మని యొకఁ డున్నాఁ డనుటకు నేను
బొత్తిగా నమ్మను. ఆయా సమయములయందు భోమతులు తమ లోపముల
నదృష్టముపైఁ బడవేయుదురు. కావున మీ రెట్లైన యుపాయ
మూహింపక తప్పదు.

కశ్య— (తనలో) ఓహో, గట్టిగా బాధించుచున్నదే! (యోజించి) అట్లయిన
నీవు పయోవ్రతముం బూని తపం బొనర్పుము. దానిచే నారాయణుండు
ప్రీతుండై నీకొమరులం గెలిపించును. అష్టాక్షరీమంత్రంబు నీ కింతకు
మున్నే వచ్చియున్నదికదా?

అది— తమయాజ్ఞచొప్పున నే నిప్పుడే తపమునకు మొదలుపెట్టుచున్నాను.
తా మొకసారి పోయి రక్కసులకు బుద్ధి చెప్పి చూడుఁడు.

కశ్య— మంచిది. (నిష్క్రమించును)

అది— (కనులు మూసికొని కొంతసేపు జపించి)

గీ. దేవదేవ! జగన్నాథ! దివ్యబోధ!
కుటిలరాక్షససంహార! క్రూరదూర!
ఆర్తజనతాపహరణ! లోకైకభరణ!
సగుణనిర్గుణరూప! నిన్ సన్నుతింతు.

## దండకము.

శ్రీమానినీచిత్తచోరా! ఉదారా! కృపారాశి! వారాశిధీరా! మహావీర!
భూదార! నిన్నెంచ నే నెంతదానన్ గటాక్షించి నా మొఱ్ఱ నాలింపు దేవా!
దురాచారు లత్యంతదుర్మార్గు లస్మత్తనూజాతులన్ మించి వంచించి ముల్లోక
ముల్ తామెయై రక్కసుల్ కర్కశత్వమ్ముమై నేలుచున్నారు; తత్పాలనా
ధీనులై దీనులై హీనులై లోకులెల్లం గడున్ జింతలన్ గ్రమ్మి కర్తవ్యముం
దోఁపమిం గుందుచున్నారు; దుర్మార్గులం దింతపక్షమ్ము నీ కుంటకుం గారణం
బేమొ? సన్మార్గులౌ దేవతల్ గానలే కూరకే చూచుచున్నారు. నీమాయ
నూహింపఁగాఁ జాలువా రెవ్వరో! లోకరక్షా! విపక్షావళీశిక్ష! నీయక్షయం
బైన కారుణ్యముం జూపఁగాఁ గాల మేతెంచె నీజాలమింకేల? యేలీల నీకూళ
లన్ గూలఁగాఁ ద్రోచి పమ్మ్రెలెదో? తాళఁగాఁ జాల కున్నార మోపద్మ
నాభా! స్వభావంబె కా! నీకు ధర్మంబుఁ గాపాడి ధర్మేతరంబుం దిగం
ద్రొక్కు చందంబు, తండ్రీ! యటుల్ సేయ కిట్లూరకుండేని వేదంబులున్
శాస్త్రముల్ తప్పులే; యొప్పు నెట్లో? మహాత్మా! "సుఖంబందుపైఁ గష్టముల్
వొందు టేవారికేనిం గడున్ దుఃఖ" మంచున్ సురేశుండు దిక్కెదియున్
లేక నాత్రోల కేతెంచి చింతించినన్ వానిదీనత్వమున్ గన్నులారన్ విలో

కింకరి నేను నీకై తపంబూనితిన్; గర్జ మీవే పౌనర్పున్ సమర్థుండ, వింతేల రాజ్యంబు నాపుత్త్రులం జేర్చి రక్షింపు మోదేవదేవా! మహాభావ! లోకేశ! లోకాత్మ! మూర్తిత్రయాతీత! స్వామీ! నమస్తేనమస్తేనమస్తేనమః.

ఏమీ, దేవదేవున కింకను నాపై ననుగ్రహము రాకున్నది!

(మరలఁ గనులు మూసికొని జపించును)

గుణరహితం బయ్యును సగుణంబును, స్థూలం బయ్యు సూక్ష్మంబును, చతుర్దశభువనాధారం బయ్యు నరూపంబును, ననేకావతారప్రసిద్ధంబయ్యు నభవంబును నగు పరతేజంబునకు నమస్కరించెద.

(అంత విష్ణువు ప్రవేశించును)

విష్ణు— సాధ్వీమణీ! నీతపమ్మునకు మెచ్చితి. నీ కేమి వరము కావలెను?

అది— (నమస్కరించి) దేవా! నీ వెఱుంగని వరమ్ము లేమి కలవు? నా సవతి కొమరులచే నాపుత్రులు పరాభవింపఁబడి కడు నవయుచున్నారు. వారి రాజ్యమ్ము వారి కిప్పింపుము.

విష్ణు— పతివ్రతామణీ! నే నింతకుమున్న యీ సంగతి నారదునికతన విని యున్నాఁడను. బలికిఁ ద్రిలోకాధిపత్యము వచ్చినది మొదలు,

సీ. "పన్నులు హెచ్చయ్యె భగవంతుఁడా! యెట్టు
లీపైని బ్రతు" కంచు నేడ్చువారు
"రాజానుచరులె చౌర్యము లొనర్ప నిఁకేటి
పరిపాలన" మటంచు వగచువారు
"సేమమ్ము గాఁ బంటచేలుండినను దిక్కు
మాలినకఱ" వంచు మఱుఁగువారు
"అతినీచులగు రాక్షసాధములకు నెట్లు
కేలు మోడ్తు" మటంచుఁ గెరలువారు
గీ. "యజ్ఞములు మూలఁబట్టె" నంచడలువారు
"అడుగుబట్టె సదాచార" మనెడువారు
"ప్రభువు లోపంబె యిది" యంచుఁ బలుకువారు
"కాదు సంబంధులది" యనఁ గడఁగువారు.

మఱియు నానాప్రకారంబుల విలపించువారునునై ప్రజలు కృశించుచున్నవారఁట. కావున నేనీబలి నెట్లేని పదభ్రష్టునిఁగాఁ జేయ నూహించుచున్నాఁడను. ఇందులకు నీవు ప్రేరకురాల వైతివి. నీవు మహాపతివ్రతవు. పరమపావనివియు నగుట నీగర్భమందు నేను వామనుఁడనై

జన్మించి యుక్కార్యంబు నెఱవేర్ప నిచ్చగింతు. ఇఁక నీవు సుఖంబుండుము. పోయివచ్చెద. (నిష్క్రమించును)

అది— (తనలో) "ఏకా క్రియా ద్వ్యర్థకరీ బభూవ" అన్నట్లు నేను భగవంతునికిఁ దల్లి నగుటకుఁగూడ నోఁచితిని. ఎంత ధన్యాత్మురాలనో కదా! ఈ మహాసుకృతమును నాథునకు విన్నవించి కృతార్థురాల నయ్యెదను.

(నిష్క్రమించును)

## గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
దంభవామనము నందు ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# దంభవామనము

## తృతీయాంకము

(అంత నిరువురు గంధర్వులు ప్రవేశింతురు.)

ప్రథ— మన మిప్పుడు చూచిన సంగతిని వేగముగఁ బోయి దేవేంద్రునికిఁ జెప్ప వలయును.

ద్వితీ— అట్లే యొనరింపుదము. కాని నిక్కముగ శుక్రునితపము రాక్షసోప యోగముకొఱకే యయి యుండునా ?

ప్రథ— ఇంకను సందియమేమి ? లేనిచో నయ్యనఘున కట్టి ఘోరతపం బొన రింప నేమి వచ్చెను ?

ద్వితీ— అవును, త్వరగాఁ బోవుదము పద. (పరిక్రమించి) అదిగో ! మన ప్రభువు విచారగ్రస్తుండై యొంటరిగాఁ గూర్చున్నాఁడు.

(ఇంద్రుఁడు ప్రవేశించును)

ఇంద్రు— అక్కటా ! మన మెంతమాతృభక్తిగల్గి వర్తించినను రాజ్యము నందనే లేకపోతిమి. తగినబల ముండవలె, పైని దైవసాహాయ్య ముండవలె. అంతియే కాని వృథామాతృభక్తి యేమిపని చేయఁగలదు ?

గంధర్వులు— (సమీపించి) జయము, జయము.

ఇంద్రు— ఎక్కడినుండి వచ్చితిరి ? విశేషము లేమి ?

గంధ— దేవా ! యేమని విన్నవింతుము ? శుక్రుండు ఘోరమ్మగు తప మ్మొన రించుచున్నాఁడు. అది యెందులకో దేవరయే నిర్ణయింప నర్హులు.

ఇంద్రు— (యోజించి) మీరిప్పుడ చని బృహస్పతి నిక్కడకు నంపుఁడు.

గంధ— చిత్తము. (నిష్క్రమించును.)

ఇంద్రు— (విచారముతో) ఆర్తత్రాణపరాయణా ! నారాయణ !

చ. అమరులమయ్యు నొక్కదనుజాధముచే నిటు లుక్కడక్కి వి
క్రమ మొనరింప లేక గిరిగహ్వరముల్ శరణంబులై పొసం

గఁ మహిమ మేదినస్థితిమాఁ గాంచఁగదయ్య! మహాత్మ! తండ్రి యే
క్రమమున నున్నఁ బుత్రులఁ గరంబు ననుగ్రహబుద్ధిఁ జూడఁడే?

దేవా! నీయనుగ్రహలోప మొక్కటి దక్క నాకేమి లోప మున్నయది?

గీ. ఆయుధం బెన్న వజ్రం, బజేయులైన
సురలు సైన్యమ్ము, మంత్రియో పరమమంత్ర
వేత్త లోకజ్ఞుఁ డెట్టి వివేకులకును
మేటి గీష్పతి, యింకేది లోటు నాకు?

బృహస్పతి— (ప్రవేశించి తనలో) అక్కటా! ఎంతవాని కెంత దుస్థితివచ్చినది! అట్టి యింద్రుని నీయరణ్య భాగంబునఁ జూడవలసివచ్చెఁగదా! ఇంతకును గర్మగతి యనివార్యము.

గీ. రుద్రుఁడు కపాలి, చంద్రుండు రోగియఁట,
సూర్యుఁడు పరిభ్రమించు టించుకయు
నన్య కారణమ్మునఁ గాదది కర్మఫలము
సకల జగమును గర్మవశమ్ము సుమ్ము.

(యోజించి) ఇతఁడు నేను వచ్చిన సంగతినే కనిపెట్టక యేమో యోజించుచున్నవాఁడు. (ప్రకాశము) సురేంద్రా! కుశలమా?

ఇంద్రు— (తత్తఱపాటుతో) గురువరా! నమస్కారము. నాతప్పులు మన్నింపవలయును.

బృహ— పునస్స్వారాజ్యమస్తు, నన్నెందులకుఁ బిలిపించితివి?

ఇంద్రు— దేశికేంద్రా! అసురగురుండు ఘోరతపం బొనరించుచున్నవాఁడఁట. నిమిత్తమేమై యుండునో?

బృహ— (యోజించి) దివ్యదృష్టిం జూడఁగా రక్కసుల కెప్పుడును స్వర్గాధిపత్యము స్థిరముగా నుండునట్లు సాధింపుట కని పొడకట్టెడిది.

ఇంద్రు— ఇందుల కుపాయమేమి?

బృహ— ఉపాయమున కేమున్నయది! నీ కొమిరె జయంతిని శుక్రునికడ కంపింపుము. తత్తపం బక్కన్నె యడంచుఁ; బిదపఁ జూచుకొందము.

ఇంద్రు— అట్లనే పంపెదను. దానికేమిగాని యిప్పుడు రక్కసులకే రాజ్యము స్థిరపడియున్నదిగదా; మరల నీ వృథాపరిశ్రమ మెందులకు?

బృహ— ఎందులకా? అదితి నీకు రాజ్యం బొసంగఁ దలఁచి నారాయణుం

గూర్చి తపంబొనరింప నద్దేవుండు ప్రత్యక్షమై తప్పక నీ కొమారునకు రాజ్యమిప్పించెదనని ప్రతిజ్ఞచేసెను. అది శుక్రుం డెఱింగి శివుంగురించి తపమాచరింప నద్దేవుండును నతనికిఁ బ్రత్యక్షమై వరంబు వేఁడు మన,

క. సురలకుఁ బరాజయమ్ము న
సురులకు విజయం బొనర్చు శుభమంత్రము నా
దరమున నా కిమ్మనవుడుఁ
బరమేశ్వరుఁ డిట్లు లోన భావించె నొగిన్.

క. కృతఘ్నులయెడ నితఁ డప
కృతిసేయఁ దలంచె వారి కేక్రియనైనన్
గతిఁ గల్పించు టుచిత మని
యతిదయ గలఁడగుచు నిట్టు లానతియిచ్చెన్.

ఇంద్రు— గురువరా! ఈశ్వరుఁడు రాక్షసపక్షపాతి యనికదా ప్రవాదము!

బృహ— ఇది వట్టిప్రవాదమే కాని దుర్జనులయెడ దేవున కెప్పుడును పక్షముండదు. ఇది నిశ్చయము.

ఇంద్రు— అది సత్యమే ఏమనియానతిచ్చెను?

బృహ— క. తలక్రిందుగ వేయేడులు
నలయక పొగద్రావుచును నియమమునఁ దపముం
బలువిడి గావించిన నీ
తలఁపు న్నెఱవేర్తుఁ బొమ్ము దడయక శుక్రా!

అనవుఁడు నసురగురుండు తదాజ్ఞప్తవిధానమ్మున గంధమాదనమ్మున కరిగి తపంబు సల్పుచున్నవాఁడు.

ఇంద్రు— గురువరా! నాకొమిరెమాత్ర మా తపమ్మునకు విఘ్నమ్ము సలుప నేర్చునా?

బృహ— ఏమీ! ఇతం డీశ్వరునికన్న నెక్కుడువాఁడా! పార్వతీపరిణయము వినలేదా! సత్వరమ్మున నీకొమిరె నంపుము.

ఇంద్రు— చిత్తము, తమరు దయచేయుఁడు, ఇప్పుడే తమయాజ్ఞనిర్వర్తించెదను.

బృహ— నీకు శుభ మగుఁగాక. నేను పోయివచ్చెదను. (నిష్క్రమించును)

ఇంద్రు— (తనలో) కొమిరెతో నేమని చెప్పగుదును? అక్కటా! రాజ్యలోభమెన్ని దుష్కృత్యము లొనరించుచున్నది! కానిమ్ము, పోయివచ్చెదను. (పరిక్రమించి) అదిగో! నాకొమిరె గుహాముఖమ్మున లేడిపిల్లలతో

నాడుకొనుచున్నది- (అంత జయంతి ప్రవేశించును)

జయం— (తనలో) ఓహో! ఈవన మెంత రమణీయముగా నున్నది. స్వర్గము స్వర్గ మనుటయే కాని యింతకన్న నయ్యెడ నేమి విశేషము లున్నవి? (పరికించి) ఆ చెట్లపైఁ బక్షు లెట్లు దుముకులాడుచుఁ గేరుచున్నవో! (విహరించును)

ఇంద్రు— (సమీపించి) అమ్మా! ఆడుకొనుచున్నావా?

జయం— తండ్రీ! నమస్కారము.

ఇంద్రు— తల్లీ! నీకు శుభమగుఁ గాక. నే నొక్కమాట చెప్పెదను, సావధానముగ విందువా?

జయం— తప్పక తమయాజ్ఞ నిర్వర్తింతును.

ఇంద్రు— తల్లీ! నీ కిష్టమైనయెడల నే యొనరింపుము, లేనిచో నక్కఱలేదు

క. తనయా! నిను శుక్రాచా
ర్యున కిచ్చెద గంధమాదనోర్వీధరమం
దు నతండు తపంబున నుం
డినవాఁ డన్నగమునకుఁ గడించి రయమునన్.

క. చని యతని మనమునకు వ
చ్చిన యుపచారములఁ దనిపి చేతఃప్రియుఁగా
నొనరించికొని తపోనియ
తి నడంచి మదీయభయము దీర్పుము తల్లీ!

జయం— నే నట్లనే యొనరించి యయ్యనఘుని యనుగ్రహమ్ము వడసెద. మీరిప్పనికై నన్నింత నొక్కి చెప్ప వలయునా!

ఇంద్రు— (సంతోషముతో) అమ్మా! నేను గృతకృత్యుండ నైతిని. కాని నీ వమ్మునిని సేవించునెడలఁ గడు జాగరూకురాలవై యుండవలయును జుమీ!

సీ. శ్రమమునఁ దొడరుఘర్మజలంబు వోవంగ
విరివీవనలచేత విసరుమమ్మ
మధురసుగంధి నిర్మలవారిపూరంబు
సమయ మ్మెఱింగి యొసంగుమమ్మ
భగభగ మను పట్టుపగలింటియెండ పైఁ
బడకుండ వసనమ్ము పట్టుమమ్మ
ఆఁకటికై పక్వమైన వన్యాహార
ములు తెచ్చి మోదంబుఁ గొలుపుమమ్మ

గీ. దర్భలుఁ జివుళ్లుఁ బఱచి మెత్తందనమ్ము
దవిలి యొసకంబొనర్చు తల్పం బమర్చి
దేశకాలమ్ము లెఱిఁగి నిదేశ మరసి
కవికి శుశ్రూష సేయు మోకన్నతల్లి!

జయం— చిత్తము. సర్వంబును జాగరూకురాలనై యొనర్చి కార్యసిద్ధిం బడసెదను.

ఇంద్రు— అట్లయిన లోనికిం బోయి మీయమ్మతోఁ జెప్పి యొప్పించి రమ్ము. నిన్ను నే నక్కడికి వెంటఁ బెట్టుకొని పోయెదను.

జయం— చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) ఆమె యనుజ్ఞం బొందితిని. "మీయభిప్రాయమే ఆమెయభిప్రాయ" మని చెప్పినది.

ఇంద్రు— అమ్మా? అటులైనఁ బోవుదము రమ్ము. (పరిక్రమింతురు)

జయం— తండ్రీ! అక్కడ నేమి జరిగినదియు మీ కెవరికతనఁ దెలియఁగలదు?

ఇంద్రు— తల్లీ! ఎప్పటికప్పుడే ఆసమీపమునకు సిద్ధసాధ్యాదుల నంపుచుందును. నీవు వారితో నా యీసంగతులు చెప్పి యంపుచుండుము.

జయం— (మరలఁ గొంత పరిక్రమించి) తండ్రీ! ఆయనఘు నాశ్రమమింక నెంతదూరముండునో?

ఇంద్రు— తల్లీ! సమీపమునకు వచ్చితిమి, ఆయెదుటం బొడకట్టు చిన్నగట్టు దాఁటితిమేని గంధమాదనపర్వతము కనుపట్టును. అక్కడనే యమ్మౌని తప మాచరించుచున్నవాఁడు. (పరిక్రమింతురు)

జయ— ఇదియేనా, గంధమాదనము?

ఇంద్రు— అవును. వచ్చితిమి, ఆచెట్లలోపు చాటుననే దైత్యగురుండు తపం బొనరించుచున్నవాఁడు. నే నిక్కడనే యుండి నీపోక చూచుచుందును.

జయం— (కన్నీటితో) తండ్రీ! నా క్షేమమును దఱచుగనుఁగొనుచుందువుగదా?

ఇంద్రు— తల్లీ! ప్రతిక్షణమును నీకుశలమారయుచునేయుందును. నీకు వచ్చిన భయ మొక్కటిలేదు. సంశయింపకుము. (యోజించి) అమ్మా! నేను స్వకార్యమునకై నిన్నంపుచుండినను నీకు ననుకూలమగు వరుఁడే సుమీ యమ్మహానుభావుఁడు.

ఉ. సుందరులందు నెన్నఁదగు సుందరుఁ డెప్పుడు జవ్వనంబు చె
న్నొందెడివాఁడు విద్యల మహోన్నతుఁ డాపయి సత్కవిత్వ మ
న్నందన సొమ్మె పుణ్యజననాయకు లెల్లరు శిష్యులై సదా
వందనముల్ ఘటించెడి సభాజనరత్నము శుక్రుఁడల్లుఁడే.

జయం— (సంతోషముతో) తండ్రీ! నాకు మీ రెప్పుడేని యపకృతి నొనరింతు రని నే నెట్లనుకొనియెదను? మీ యనుగ్రహమ్మున నా కెందును గొదవలేక యుండుఁగాక. (కౌఁగిలించుకొని) ఇఁక నరుగుదునా?

ఇంద్రు— నీకు శుభమగుఁగాక. తల్లీ! నే నీ దరి నున్న పొదరింట నుండి నీ మార్గ మరయుచుండెద. (నిష్క్రమించును)

జయం— (కొంతనడచి వెనుకకుఁ జూచి) తండ్రి నన్నీ కార్యమున నియమించి నందులకుఁ గృతార్థురాలను గాఁగలిగితి నేని పితృఋణమ్మును దీర్చుకొన్న దాన నగుదును. (పరిక్రమించి చూచి) అదుగో, నమ్మహాముని. ఓహో! ఏమి యా తేజోవిశేషము! ఈతండు నన్ను వరించిన నాయదృష్టము మఱి యొక్కరికి రాదు.

చ. ముని యను పేరు గాని కడు ముద్దులు గుల్కుచు నుండె సౌరు కా
మినులకు పీనిఁ జూచిన నిమేషము నెమ్మన మాప వచ్చునే?
నను జనకుండు దా నిటకు నంపిన దెందులకైననుఁ గృతా
ర్థ నయితి నిట్టి సుందరులు దైవతవర్గమునందుఁ గల్గిరే.

(అంత శుక్రుఁడు ప్రవేశించును.)

శుక్రు— (ధ్యానము నటించి)

గీ. సహజసుఖవంతులకుఁ గడు సౌఖ్య మబ్బు
దుఃఖితుల కెల్ల దుఃఖముల్ దొలఁగిపోవు
ముక్తి గోరిన వారికి ముక్తి గల్గుఁ
దండ్రి! నిన్ను మనమ్మునఁ దలఁచిరేని.

గీ. సృష్టిరక్షాప్రళయములు సేయు నీదు
చరిత మెఱుఁగరు బ్రహ్మాది సకల సురలు
పాపసంసారతారక పటిమ నలరు
త్వత్పదమ్ములు గొల్తురు ధన్యమతులు.

(మరలఁ గనులు మూసికొని జపించును.)

జయం— అక్కటా! యెంతకాల మిట్లుండును. ఇప్పటి కీతండు నా రాకయే యెఱుఁగఁడు. మరలి పోవుదు నేని యిన్నినాళ్లనుండి చేసిన పరిశ్రమము వృథా యగును. ఎట్లేని యీతని తపం బగునంతవఱకు వేచి యుండి యియ్యమలాత్ము ననుగ్రహమ్ము పొందవలయును. (యోజించి) తండ్రి యీతని తపంబున కంతరాయ మొనర్పు మని కదా నన్నుఁ బంపెను. తపము తుదముట్టకుండునట్లనే యేను బ్రయత్నింప వలయును.

ఇందులకేమి యుపాయము! (యోజించి) ఉపాయ మేదియును గాన
రాదు. నావంక కించుకేనిఁ జూచినంగదా, యుపాయముండెడిని.

(నిలిచి యుండును.)

శుక్రు— క. శరదిందుముఖులు చామర
లిరుప్రక్కల వీవ శిబిక లెక్కి మహానం
దరసాబ్ధి నోలలాడెడి
నరు లెల్లఁ బురాభవమ్మున న్నీభక్తుల్.

క. కరులు గలవారు విలస
త్తరుణీసంభోగనిరతతారుణ్యమదో
ద్ధురత గలవారు నరవర
పరిచితచరణులును నీదు భక్తులు తండ్రీ!

(తెరలో) ఓ దైత్యాచార్యా! నీతపంబు తుదముట్టె. నీ కోరిన
మంత్రమ్ము నీకు వశంబగు నిఁక నిష్ఠ చాలింపుము.

జయం— (విని) భగవంతుండగు నాదిదేవుండు నాకుఁగూడ నిమ్మహామహా
కతన దర్శన మిచ్చినాఁడు (తెరవంక దిరిగి నమస్కరించును.)

శుక్రు— (విని కనులు తెఱచి తనలో) ఇక్కడికిఁ గృతకృత్యుఁడ నైతిని. ఇఁక
నా శిష్యుల కీమంత్ర ముపదేశించి జపింపఁ జేసెదను. (దెసలు పరికించి)
ఓహో! యేమి, యీకన్నె యెవ్వరై యుండును? ముక్తికామిని కాదు గదా!

(నివ్వెఱపడిచూచి మనోవికారము నటించును.)

జయం— (తనలో) అక్కటా! నాతండ్రి నన్నెందుల కంపెనో యాకార్యము
నెఱవేర్పలేనయితిని. కానిమ్ము, ఈతని దృష్టిరీతిఁ జూడ నాయం
దనురాగివలెఁ బొడకట్టుచున్నాఁడు ఎట్లేని యీయన దైత్యులయొద్ద
కరిగి మంత్రోపదేశము సేయకుండఁ జేయలేకపోదునా? (సమీపించి
ప్రకాశము) మహాత్మా! నమస్కారము.

శుక్రు— (చిఱునవ్వుతో) కళ్యాణం భూయాత్! సుందరీమణీ!

ఉ. మంగళమస్తు నీదు కుచమండలలక్ష్మికి; నీదు మోవికిన్
మంగళమస్తు; నీమధురమంజులవాగమృతప్రసక్తికిన్
మంగళమస్తు; నీదు తనుమార్దవసంపదకున్ బునః పున
ర్మంగళమస్తు; నీవదనమండలికిన్ శుభమస్తు సర్వదా

చ. ఎవతెవు నీవు? నీమకుల మెయ్యది? నీ జనకుం డెవండు? మా
ర్గవు నవయౌవనంబు గలదానవు మత్పరిచర్య సేయుచుం

టివి కత మేమి ? తెల్పుము కడిందిమనోరథమైన సిద్ధి జెం
దు వర మొంసంగువాఁడఁ బరితుష్టి యొనర్చితి వీవు మా కొగిన్.

జయం—(సిగ్గుతోఁ దలవంచికొని యూరకుండును.)

శుక్రు—(తనలో) ఏమీ, ప్రత్యుత్తర మిచ్చుటకు సిగ్గుపడుచున్నదే! అట్లయిన దివ్యదృష్టిం జూచెదఁగాక. (ధ్యానము నటించి ప్రకాశము) లతాంగీ! నీవు దేవేంద్రుని కూఁతురవు. నీ మనోరథమ్ము మాకుం దెలిసినది. ఐనను సుధారస మొలుకు నీపలుకులు విన నెంచి నిన్ని ట్లభ్యర్థించుచుంటిని.

జయం—(మఱింత సిగ్గుతోఁ దలవంచికొని) భార్గవోత్తమా! నన్ను మాతండ్రి తమకు సమర్పించె. అక్కతమున మీయనుగ్రహము నభిలషించి చిరమ్ము నుండి సేవించుచుంటి. దేవరచిత్తము, నాదు భాగ్యము. సర్వజ్ఞులగు తమకొక సంగతి దాఁగునా! అదిగాక మహాకవీశ్వరులు గదా!

క. మదనుఁడు దుర్మార్గుఁడు నా
మది భీరువు కాన నన్ను మన్నించి స్మరున్
బెదరించి కోర్కె దీర్పం
గదవే ? నను ధర్మపత్నిఁగాఁ జేకొనవే.

శుక్రు—(తనలో) ఇంద్రుఁ డిక్కన్నియను నాకడ కంపుట కేమి హేతువో? ఏ హేతువోయగుఁ గాక, ఇప్పటికే నా తపంబు తుదనెగ్గెఁ గదా. (యోజించి) కాని శిష్యులకు ప్రకృత ముపకారము మాత్రము చేయ వలసియున్నది.(అనాదరముతో) ఇట్టియెడల నుపకృతులను గిపకృతులును జూచిన చేతి కందిన ఫలము దాఁటిపోవును. ఇది యుపేక్షించుట తగదు, అహహ్హ! యేమి నా యదృష్టము

ఉ. తానఁట యింద్రపుత్రియఁట! తా నయి తా ననుఁ గోరునంట! యెం
తేనియు నెమ్మె లాఁడియఁట! యిచ్చటికే చనుదెంచెనంట! యి
మ్మానిని మాను టెట్లు! పలు మాటలు సెప్పఁగ వచ్చుఁగాని; యే
మైనను దీనిఁ గూడ వలదా! యిలఁ దా జనియించి నందుకున్.

(అనురాగముతోఁ జేయిపట్టుకొని ప్రకాశము) సుందరీ! నీయందు నాకుఁ దద్దయుమనంబు లగ్నమై యున్నయది. కావున,

క. ఏరికిఁ గనుపడకుండఁగ
మా రాగమవిహిత మాత్రమార్గమ్మున సం
చార మొనర్చుచుఁ గ్రీడా
పారమ్యముఁ గొందు నొక్కపదివత్సరముల్.

జయం— (తనలో) ఇప్పటికి సర్వవిధములఁ గృతకృత్యురాలనైతిని కాని, యంత రహస్యమ్మైన నియ్యానఘుతో నున్న నా కీ సమాచారము జనకునకుఁ దెలియఁ బఱచుట తటస్థింపదు. అందుకై చింతింప వలసి యున్నది. (యోజించి) దివ్యజ్ఞాన సంపన్నుఁడగు దేవగురుం డుండఁగాఁ దెలియక యెట్లుండును? (ప్రకాశము) చిత్తము సర్వమునకు దేవరయే ప్రమాణము.

శుక్రు— అట్లైన మనము మన గృహమ్మునకే పోవుదము రమ్ము.

(నిష్క్రమింతురు.)

## గద్య

ఇది శ్రీ .. తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
దంభవామనము నందుఁ దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# దంభ వామనము

## చతుర్థాంకము

(అంత నిరువురు రక్కసులు ప్రవేశింతురు)

ప్రథ— మన గురుండు తపమ్మున కరిగి చిరకాల మయ్యెంగదా! ఇప్పటికిని జాడ గానరాకున్న దేమి?

ద్వితీ— గంధమాదనగిరియొద్ద నుండె నని కదా వింటిమి. అట కేగుదము.

(పరిక్రమింతురు)

ప్రథ— ఇయ్యెడ నెవ్వరో యొక ముని తపం బాచరించిన జాడలు కాననగు చున్నవి.

ద్వితీ— అవును. ఈ ప్రదేశ మాశ్రమచిహ్నములతో నొప్పి యున్నయది. ఇవిగో, నగ్నులుంచిన చోటులు.

ప్రథ— గురుండు గానరాకున్నవాఁడు, కారణ మేమో! (పరిక్రమింతురు)

(అంత శుక్రాచార్యవేషముతో బృహస్పతి ప్రవేశించును)

బృహ— (తనలో) శుక్రుండు తపస్సిద్ధి నొందియును జయంతీకారుణ్యవారాశి నోలలాడుచున్నవాఁడు. కావుననే యింద్రుని కుపకారం బొనర్చుటకుఁ దగిన సమయము దటస్థించినది. (తనవంకఁ జూచుకొని) నేనే శుక్రుఁడ ననుకొని రక్కసు లెల్లరు నన్నుపదేశికుఁగాఁ గైకొందురు. ఇప్పటికి వీరికి దుర్మంత్రోపదేశం బొనరించి దానిచే దురాచారులుగా నొనర్చెద. దురాచారం బలపడిన పిదప సిరి వెంటనే తొలఁగు ననుటకు సందియ ముండదు. (దృష్టి నిగుడ్చి) ఇదిగో, మఱికొందఱు రక్కసులు. వీరు రాజున కాంతరంగికులుగాఁ దోఁచుచున్నారు. ముందు వీరిని నా వలలోఁ వైచికొని పదఁపడి వీరల సాహాయ్యమునఁ జక్రవర్తినిఁ గూడ లోఁబఱచికొనియెదను. (సమీపించి) ఓ యంతేవాసులార! మీకుఁ గుశలమా?

రక్కసులు— (తత్తఱపాటుతో) నమస్కారము. దేవా! నమస్కారము.

బృహ — శుభం భూయాత్.

చ. పురమథనుం గుఱించి తపముం బొనరించితి ధూమపాయినై
పరము వరించితిన్ త్రిదశవర్గము గెల్వఁగఁజాలు మంత్రముల్
గిరిశుఁ డనుగ్రహించె నిఁక గీటడఁగింతము నిర్జరాళికిన్
బరమహితుండు చక్రికిని ప్రాణభయమ్ము మదిం గలంపఁగన్.

శుక్ర — స్వామీ! ఇప్పటికి రాజ్యమెల్ల మనదే యైయున్నది. చక్రియుఁ గిక్రియు నేమైరో కనుపట్టరు. కాని, యదితికిమాత్రము "రాక్షసుల నిర్జించి నీ కొమరులకు రాజ్యం బొసంగెద" నని వర మిచ్చినాఁ డని ప్రవాద మొకటి కలదు.

బృహ — అందులకే గదా! నేను "బ్రమ్మికి తిమ్మి" చేసినం గాని వలనుపడ దని యెంచి శివుంగుఱించి తప మాచరించితిని.

క. హరుఁడును నా కొసఁగిన మం
త్రరాజములు మీ కొసంగెదను నిఁక మీ రా
హరివలనన్ గిరివలనన్
దరమున్ బొందకుఁడు మేటి ధైర్యము కలిమిన్.

శుక్ర — స్వామీ! తాము మా కిప్పు డుపదేశించెడి మంత్రము లెయ్యవి?

బృహ — మంత్రము లనఁగా యాలోచనములే కాని వేఱు కావు. వినుఁడు. అందులో ముఖ్యమైన యంశములు సూత్రమ్ములుగా నొనర్చి చెప్పుచున్నాఁడను. దేవుఁడు లేఁడు; ఆచార మక్కఱ లేదు; ధర్మశాస్త్రములు పురాణములు వేదములు మొదలైనవి నమ్మఁగూడదు; వర్ణాశ్రమభేద మనవసరము; యజ్ఞములు మొదలైన వానికన్న దుష్కార్యములు లేవు; కడుపే కైలాసము; వివాహ మిష్టము వచ్చినట్లు చేసికోవచ్చును; నా విపరుస లకించిత్కరములు. ఇట్లయినచో నెప్పటికిని మన రాజ్యము సుస్థిరమై యుండును.

శుక్ర — (తనలో) ఈయన బోధించెడి దంతయుఁ గడుఁ గ్రొత్తగా నున్నయది. ఐనను మన చక్రవర్తి దగ్గఱకుఁ దీసికొని పోయినచో దీని యాథార్థ్యము దేలఁగలదు. (ప్రకాశము) చిత్తము. ఈసంగతులన్నియు ముందు రాజున కుపదేశింపుఁడు. పదఁపడి మే మాచరింతుము.

బృహ — అట్లయినఁ బదుఁడు. (పరిక్రమింతురు)

(అంత బలిచక్రవర్తి ప్రవేశించును)

శుక్ర — దేవా! దేవరకు జయమగుఁ గాక. గురువులవారు విచ్చేసిరి.

బలి— ప్రవేశింపఁ జేయుఁడు.

బృహ— రాజా ! నీకుఁ గుశలమా.

బలి— దేవా! నమస్కారము. తమ యాశీర్వచనమువలన సకలము సుసుఖంబు. తా మొనరించు యత్నము సఫల మైనదా ?

బృహ— (తనలో) ఇతర రాక్షసుల వంచించుట యొక గొప్ప గాదు. వీని నమ్మించుట కడు దుష్కరము. అయిన నేమి ? నా బుద్ధిబలముం జూపి వంచించెద. (ప్రకాశము) సఫలమే; కాని యా నగజాధిపతి యుపదేశించిన సంగతులు మీకుఁ గ్రొత్తగా నుంటచేఁ గొంతకాలమువఱకు విరుద్ధములుగాఁ దోఁచును.

బలి— ఈశ్వరుండు సెప్పిన విషయము విరుద్ధమైనను గ్రాహ్యమే కదా !

బృహ— ("దేవుఁడు లేఁడు" మొదలైనవి మరలఁ జెప్పును.)

బలి— (తనలో) ఏమి, యీ యనఘుఁ డిట్టి దురుపదేశ మొనర్చుచున్నాఁడు. (ప్రకాశము) స్వామీ ! శిష్యుని దొక మనవి. దేవుఁడు లేఁడు కదా ! మీరు తప మెవరిం గూర్చి చేసితిరి ?

బృహ— గట్టి శంక నే చేసినాఁడు. అయిన నిదియొక లక్ష్యమా ? (ప్రకాశము) చక్కఁగా నడిగితివి. ఈశ్వరునిం గూర్చి చేసితిని. ఈశ్వరుఁ డనఁగా నైశ్వర్య సంపన్నుఁడు. అతఁడు మనకన్న గొప్పవాఁ డగుటచే నతనిఁ గూర్చి వేఁడుకోవచ్చును. నీకన్నఁ దక్కువవాండ్రు నిన్ను నాశ్రయించి కోర్కులం బడయుట లేదా ? అంతమాత్రమున నీవు దేవుఁడ వైతివా!

బలి— (తనలో) కడు ననుకూలముగ సమర్థించినాఁడు. తక్కువవా రెక్కువ వానిని దైవ మని యనుకొనుట లోకానుభవసిద్ధమే ! (ప్రకాశము) ఇదియే నిక్కమైన మత మరియా, తమ యభిప్రాయము ?

బృహ— ఇందులకు సంశయముగూడనా ?

బలి— అట్లైన మనము చేయవలసిన మార్పు లేమి ?

బృహ— (తనలో) ఇతఁడు గూడ సులభముగ నే వలలోఁ బడినాఁడు. (ప్రకాశము) దేవాలయములను గూలఁద్రోయించుట, వేదములు తగులఁబెట్టించుట మొదలైనవి.

బలి— ఓ రక్కసులారా ! మీ రీ కార్యములు జాగరూకులై నిర్వర్తించుచుండుఁడు.

రక్క— చిత్తము. (నిష్క్రమింతురు)

బృహ — (తనలో) ఇక్కడికి వీనికి "వినాశకాలే విపరీతబుద్ధిః" అనునట్లు దుర్బుద్ధి పుట్టించితిని. ఇతఁడు రాక్షసుండైనను గడు యోగ్యుఁడు.
౮ ఆస్తికుఁడు, గర్మరతుఁడు. అక్కతమున నితనియందు లక్ష్మి చంచలగాక నిల్చియున్నది. ఇఁక నిలువదు. కాని శుక్రుఁ డరుదెంచి మరల దీనికి విఘ్న మొనర్చునేమో?

(అంత నిజమైన శుక్రుఁడు ప్రవేశించును)

శుక్ర — (తనలో) అక్కటా! కామ మెంత చెడ్డది! పది వత్సరములనుండి యిప్పటివఱకును నిమ్మహాసముద్రమున మునిఁగి శిష్యులగతియే కనుఁగొనకపోతిని. (పరిక్రమించి) అదుగో, చక్రవర్తి! (పరిశీలించి) అక్కడ నెవ్వరో నావలెనే యొకఁడు గూర్చున్నాఁడే! ఇతఁడెవ్వరో? ఓహో! ఇతఁడు దేవగురువు. వీరల వంచింప నిట్టి రూపమ్ము ధరింపఁ బోలు (ధ్యానము నటించి) ఇది నిక్కమే!

చ. గురుఁడఁట! సర్వశాస్త్రములఁ దెరవౌనఁట! పాపబీజలో
భరితనసత్యవాక్యములు వల్కు సురాదుల మోసపుచ్చి సు
స్థిరమతి నున్నవాఁడఁట! యిసీ! కడుఁ బాపపు లోభ మెంతయు
న్నాకపుఁ ద్రోవ, దీనిఁ గనినన్ జనుఁ డెప్పుని సేయకుండునే?

(దరికరిగి) అక్కటా! యెవ్వరును నన్నుం జూచి గౌరవింపకున్నారే?

బృహ — (చూచి తనలో) ఓహో! సమయమునకుఁ బడిపోయినట్లు నీతఁడు గూడ వచ్చినాఁడే! వచ్చి యేమి చేయఁగలఁడు? కాని (యోజించి) మరల సదుపదేశ మొనర్చి వీరలం ద్రిప్పునేమో! త్రిప్ప నేరఁడు. ఏమనిన, దురుపదేశ మెక్కనట్లు మనమునకు సదుపదేశము లెక్కవు.

బలి — (చూచి) ఇది కడుఁ జిత్రముగా నున్నదే! ఇక్కడ శుక్రాచార్యుం డుండ మఱియొక శుక్రుఁ డెక్కడినుండి వచ్చెను? (యోజించి) ఒకరిని బోలినవారు మఱియొక రుండవచ్చును గదా! (మరల యోజించి) లేక వేషగాఁడు గావచ్చును.

శుక్ర — (సమీపించి తనలో) ఇతఁ డేదో గట్టిగా నమ్మించినాఁడు. ఇఁక నన్ను వీరు గణుతే పట్టుట లేదు. ఇదిగాక వీరని వదలి యనేకకాలము గావచ్చినది. ఇట్లగుఁగాక. (ప్రకాశము)

గీ. ఏను నిక్కపు శుక్రుఁడ నితఁడు దాంభి
కుఁడు మదాకృతిఁ బొరసిన గురుఁడు నమ్ముఁ

డితని పలుకుల నాస్థమై వినఁబోకుఁ
డక్కటా ! చెడిపోయెద వక్కడక్క.

బలి— (తనలో) ఇతఁడు వేషగాఁడుగాని మఱియొక్కఁడుగాని కాఁడు. కేవలము మనల వంచింప నేతెంచిన బృహస్పతియే కావలయు. (ప్రకాశము) స్వామీ! చూచితిరా, యీ దేవతల కృత్రిమోపాయములు!

బృహ— (తనలో) ఇతనికిఁ గాలవశమున దుర్బుద్ధియే పుట్టుచున్నది. సంతోషమే. (ప్రకాశము) రాక్షససార్వభౌమా! చక్కఁగా గుఱుతించితివి. కావుననే లక్ష్మి నీయందు సుస్థిరమైనది. ఇంకను గాఁగలదు. (దనుజులవంక దిరిగి)

ఉ. దానవులార ! నమ్మకుఁ డితం డమరప్రియ మాచరింపఁగా
లోనఁ దలంచి మిమ్ములను లోభమునం గికురింప వచ్చినాఁ;
డేను భవన్నిమిత్తము వినీతునిఁ గొల్చితి విద్యఁ గొంటి ; ని
ద్దాని కతమ్మునన్ సురల దర్ప మడంతురు మీర లొప్పుగన్.

శుక్ర— రాక్షసచక్రవర్తీ! పొరపడి చెడిపోవుచున్నావు. నామాట నమ్మి యీతని నవలకుం గొట్టింపుము.

బలి— (ఏకసక్కెముగా)

క. సదమలమతివై యెక్కుడు
పదిలముగా విద్య గఱపు పరమగురుని బల్
సదయునిఁ గా దన నేర్తుమె ?
మదిలో నెఱిఁగితిమి నీదు మాయలనెల్లన్.

బృహ— (తనలో) భేష్ ! బాగుగా నమ్మినాఁడు. ఇఁక శుక్రుఁ డెన్ని చెప్పినను నితని కెక్కవు.

శుక్ర— (రోషముతో) నేనే మాయ సేయువాఁడ ననుచున్నావు గాదు ! కానిమ్ము, నీప్రియంబుఁ గోరిన యథార్థవక్తనగు నన్నవమానించితివిగా!

ఉ. ఎండకు వానకున్ హృదయ మించుకయున్ జలియింప నీక లో
మండెడి జాతరాగ్ని కొకమాత్రము లక్ష్యము సేయ కెట్టులో
పండఁగఁజేసి సత్తపము పక్షమునన్ నిను బాగుచేయ నీ
దండకు వచ్చు నన్నుఁ గని దండము సైతము బెట్టవైతిగా !

ఓరీ ! గురుద్రోహీ ! దురాచారపరాయణా ! కపటాత్ములను దరికిఁ జేర్చుచున్నావుగా ! దానికిఁ దగిన ఫలం బనుభవింపుము.

గీ. అల్పకాలమ్ములోన నీయఖిలరాజ్య
మిట్టి కపటాత్ముఁడే యొక్కఁ డేగుదెంచి
యపహరించి భవచ్ఛత్రు నుపకరించి
నీ కథఃకార మొనరించుఁ గాక తలుప ! (నిష్క్రమించును)

బృహ— (తనలో) జరుగఁదగిన పని జరిగినది. ఇఁక నేనిక్కడ నెందులకు ? దురాచారమునకుఁ దోడు గురుశాపముగూడఁ దటస్థించినది. ఎట్లైన నితఁడు రాజ్యహీనుఁడు కాకతప్పదు. (ప్రకాశము) రాజేంద్రా ! నీవీ శాపమున కించుకయు జంకక చెప్పినచొప్పునఁ దప్పక వర్తించుచుండుము. నేను బోయి వచ్చెదను. (నిష్క్రమించును.)

బలి— (తనలో) ఇం దెవరు నిజమైన శుక్రుఁడో ముందు దెలియఁ గలదు. ఇది కడు సులభముగను సర్వజనాచరణీయముగను నున్నయది. . ఇట్టి మార్గోపదేష్ట కేవలము నిష్కపటిగా నుండితీరవలెను. ఓహో ! యెంత సుకరముగా నుపదేశించినాఁడు.

మ. ఉపవాసమ్ము లటంచు మాడుచుట లే ; దున్నాఁడు దేవుం డటం
చపలాపించుట లేదు ; వేఱొకరిచే నాక్షేపణ ల్లేవు ; పా
పపుఁగార్యం బని పుణ్యకార్య మనియుఁన్ వాదించుట ల్లేవు ; బా
గుపడుఁన్ లోకము దీనిచే నిజముగాఁ, గొండాట మ్మిం కేటికిఁన్ ?

ఇట్టి వెట్టిమొట్టి కట్టుఁబాట్లు పెట్టుకొనుటచేతనే దేవతలకు రాజ్యము స్థిరము కాక పోయినది. మనముఁగూడ నిట్లే వర్తించినఁ దుదకు మన గతికూడ నట్లేకావచ్చును. అందులకే యీ యుపాయము దేశికుండు కనిపెట్టియుండనోపును. ఈ మతమే మంచిదను జ్ఞానము రక్కసు లందఱికిఁ దెలియునట్లు తగినవారల నేర్పఱచి యూరూర బోధింపఁజేయ వలయును.

(అంతఁ గొందఱు రక్కసులు ప్రవేశింతురు.)

రక్క— అయ్యా ! మనచే నింతకుమున్ను జయింపఁబడిన దేవత లిప్పు డెక్కడఁ జూచినను దామయై రాక్షసుల నెదిరించి యోడించుచున్నారు.

బలి— (తనలో) ఇంతలో నిట్లు జరుగుటకుం గత మేమైయుండునో ! (ప్రకాశము) మన ప్రజల వర్తన మెట్లున్నది ?

రక్క— అందఱును గ్రొత్తమతము నవలంబించి యున్నారు.

బలి— అప్పుడే యీమతము దేశమందంతటను నెట్లు వ్యాపించినది ?

రక్క— తమ యొద్దకు నిప్పుడు దయచేసిరి గాని గురువులవారు పదియేండ్ల నుండి దేశదేశములు తిరిగి యీమతమును వ్యాపింపఁజేయుచున్నారఁట.

బలి— అట్లైన మనపక్షమున కపజయము రాఁగూడదే! ఇయ్యెడ లోకుల యభిప్రాయ మెట్లున్నది?

రక్క— దేవర క్షమింప వలయును. తమ రింతకుమున్ను దైవభక్తి గలిగి కులాశ్రమాచారములు చక్కఁగాఁ బరిశీలించువార లనియు, నది యిప్పుడు తగ్గుటచే నిట్టియవస్థ వచ్చినదనియుఁ జెప్పుకొనుచున్నారు.

బలి— (తనలో) బృహస్పతి మనల మోసపుచ్చెనేమో కదా! (యోజించి) తప్పక మోసమునే చేసెను. లేనిచో దేవుఁడు లేఁ డని యెవ్వఁడేని పలుకునా!

చ. తెలియక భ్రాతృభార్య రతిఁ దేలిన పాతకు మాయఁ జిక్కి ని
ష్కలుషు గురుం ద్యజించి యిటు శాపహతిం గనినట్టి బుద్ధిహీ
నుల మనలన్ జయింపఁగ మనోగతి నెంచి సురల్ రణేచ్ఛ పెం
పలరఁగ నున్నవారఁట, కటా! మన కిప్డు సహాయులెవ్వరో?

కాని అప్పు డిట్టి యనుమానము కల్గియును నతని వాఙ్మాధుర్యమునకు లోనై నిష్కారణముగా స్వగురు నవమానించి శాపదగ్ధుండ నైతిని "జన వాక్యంతు కర్తవ్యం" గనుకఁ బ్రజలందఱు నేమనియెదరో అట్లొనర్చుట న్యాయము. (ప్రకాశము) ఓయీ! ప్రజలు దీనికి శాంతి యేమిగా నూహించుచున్నారు.

రక్క— మరల దేవర నిజశుక్రునిం గొలిచి యాయన కరుణ వడయుటయే తప్ప మఱియొక శాంతి లేదఁట.

బలి— అట్లయిన నమ్మహామహుని దర్శనమునకే పోవుదము, పదుండు.

(నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన

దంభవామనమునందుఁ జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# దంభవామనము

## పంచమాంకము

(అంతఁ గొందఱు బ్రాహ్మణులు ప్రవేశింతురు)

సుబ్బదీక్షితులు— ఏమోయి, వేంకటచయనులు! ప్రవణ బొత్తిగాఁ జెప్పవు?

వెంక— ఒక రెండుకుఁ జెప్పవలెను. బలిచక్రవర్తి మహాధర్మాత్ముఁడు. అఖండదాత, పెద్దక్రతువు చేయుచున్నాఁడు. ఘృతకుల్యా, మధుకుల్యా, విన్నావా?

సుబ్బ— అతఁడీమధ్య నేదో వెఱ్ఱిమతములోఁ బ్రవేశించినట్లు విన్నానే.

వెంక— అవును గాని నెంబనే యా మతమునందుఁ గల యాథార్థ్యమును గని పెట్టి శుక్రునిపాదమ్ములం బడి క్షమాపణ వేఁడుకోఁగా నతఁ డనుగ్రహించి తిరిగియు సన్మతములోనికి దింపినాఁడఁట.

సుబ్బ— అట్లయిన నక్కడికిఁ బోవుదము. (పరిక్రమించి) చయనులూ! అడుగ మఱచితిని గాని యా మధ్య నీ దగ్గఱ నొక పొట్టిశిష్యుఁ డుండువాఁడు, వాఁడేమైనఁ దెలివి గలవాఁడేనా?

వెంక— తెలివీ! ఔరా! ఎంతమాటన్నావు! వాని ముందఱ మూఁడులోకములును నాఁగవు.

సుబ్బ— అవునఁట. అట్లే విన్నాను. "పొట్టివానికిఁ బుట్టెఁడుబుద్ధు" లనుట యిక్కడ యథార్థమే యైన దనెదవా యేమి?

వెంక— అతఁడు నా శిష్యుఁడు గనుక నే నేమియుఁ జెప్పఁగూడదు. కాని సాక్షాద్బగపదవతారము.

సుబ్బ— సరే. "ముఖే ముఖే సరస్వతీ" దానికేమి? కాని నాకీనాఁడు కొంచెము పని యున్నది. అది నెఱవేర్చికొని రేపు యాగముఁ జూచుటకు వచ్చెదను.

వెంక— నేనును రేపే వచ్చెదను. (నిష్క్రమింతురు) (విష్కంభము)

(అంత వామనుఁడు ప్రవేశించును.)

వామ— (తనలో) గురువుగారు బలియాగమునకై చనిరని గురుపత్ని చెప్పినది. కావున నేనును బోవుదుఁగాక (ఆకాశమువంకఁ జూచి) ఏమనుచున్నారు? "బలిచక్రవర్తి వంటిదాత లేఁడు. అతఁడెవ రేమికోరిన నదియే యిచ్చుచున్నాఁడు. త్వరగాఁబొ" మ్మనియా! ఇదిగో, వెళ్ళుచున్నాను. (పరిక్రమించి) అడుగో! రాక్షసచక్రవర్తి తానును భార్యయు శుక్రాచార్యపురస్సరముగాఁగూర్చుండి దానమ్ము లాచరించుచున్నాఁడు.

(అంత బలి యథోక్తముగాఁ బ్రవేశించును)

బలి— ఓ విప్రపుంగవులారా!

క. ఇది యది యని యెంచకుఁడె
య్యది గోరిన నదియె యిత్తు ననఘాత్ములు మీ
ముదమే నా ముద మిఁక నె
య్యదియును నిక్కమ్ము గాదు యశ మొకటి వినా.

(తెరలో) మహారాజా! సమృద్ధి సమృద్ధి. చాలును చాలును. ఇఁక నింతకన్న మోయఁజాలము.

వామ— (సమీపించి కుడిచేయెత్తి)

శ్లో॥ శుభమస్త్వవిఘ్నమస్తు శ్రీరస్తు చిరాయురస్తు విజయోఽస్తు
అస్తు ధనధాన్యవిభవ శ్రేయోవిద్యాయశోఽంగనాసిద్ధిః.

శ్లో॥ ఇతోఽప్యధిక సంపత్తి రితోఽప్యధిక సంతతిః
ఇతోఽప్యధిక కీర్తిస్తే రక్షస్సామ్రాడ్ధురంధర!

బలి— (ఆశ్చర్యముతో) ఓహో! ఏమి యీ వాక్యమాధుర్యము!

ఉ. పిల్లఁడు చూచినన్ గుఱుచ, పెద్దలకున్ బయిపెచ్చు పల్కు, లే
తల్లికి నెట్టితండ్రికి నితం డుదయించెనొ? మేల్! సెబాసు! వం
శోల్లసనంబు గల్గుటకు నొక్కఁడె యిట్టిఁడు చాలుఁ, బుత్రికుల్
కొల్లలుగా జనించుటకుఁ గోరుదు రేటికి నెట్టికోరికల్?

(ప్రకాశము) గురువర్యా! చిత్తగించితిరా?

శుక్ర— ఆ! చూచితిని. బుద్ధిమంతుఁడును గాఁదగినవాఁడుగాఁ దోఁచుచున్నాఁడు.

వామ—మ. బలి యంచు న్నినుఁ జెప్పుచుందురు మహాబాహాబలప్రాప్తి నీ
తులకున్ వచ్చెడివారు లోకములయందున్ లేరె లేరంచు నీ

తులకుఁ మిన్నపటంచు దాతృతకు నీతో సాటి లేరంచు మేల్
బళిరే! యో బలిచక్రవర్తి! నినుఁ జెప్పన్ వచ్చు ధన్యాత్ముఁగా.

బలి— శ్రోత్రియపుత్ర! నీకు స్వాగతమా? అటు కూర్చుండుము.

వామ— మంచిది. (కూర్చుండును)

దేవి— ఆహా! యేమి యీ తేజోవిశేషము! ఇతఁడు సాక్షాద్భగవంతుఁడై యుండనోపు. ఇతని కతమున నీ యజ్ఞంబెల్లఁ బవిత్రం బయ్యె.

బలి— ద్విజార్భకశిరోమణీ!

ఆ. వె. ఏమి యూరివాఁడ? వేపేరివాఁడ? విం
దేమికతన రాక? యేది పలయు?
తల్లిదండ్రు లెవరు? ధన్యుఁడనైతి నీ
దర్శనంబుకతనఁ దగ వచింపు.

వామ— (నవ్వి) రాజా! నీ ప్రశ్నంబులు కడుఁ జిత్రముగా నున్నయవి.

గీ. ఇంటిలో నేఁడు, మఱునాఁడు మంట నుండు
వారికి నివాసమన నెద్ది? పేరు నేది?
యూరు నెయ్యది? కన్నట్టివారు నేరు?
నీవు నే నను భేదమె నిజము కల్ల.

అయినను నీవు నన్నుం గడుఁబ్రత్యాసక్తితో నడిగితివి కావున వినుము.

చ. ఇలఁగల బ్రాహ్మణోత్తము లనేకులు, వారలలోన నొక్క యు
జ్జ్వలునకు నొక్కసాధ్వికి నపత్యము నేను, సమస్త విద్యలం
గలదు ప్రవేశ మొప్పగ, జగం బఖిలంబుఁ బరిభ్రమింతుఁ గా
వలసినఁ బేరు చెప్పెదను, వామనుఁ డందురు నన్ను నెల్లరున్.

శుక్రు— (తనలో) ఈ పే రితనికిఁ దగి యున్నది.

బలి— బాలశాస్త్రీ! ఇంతకును నీ పే రొక్కటియే చెప్పితివి కాని కడమ యించుకయుఁ జెప్పవైతివి కదా?

వామ— (నవ్వి) రాజా! ఇంతకుమున్న నీ వెఱిఁగినవా రైనచో నా తల్లిదండ్రుల పేరు చెప్పిన నీకుం దెలియు. ఎఱుఁగని యప్పుడు చెప్పినను నొకటే, చెప్పకున్నను నొకటే. ఇఁక నీ వడిగిన సంగతు లన్నియు నట్టివియే. నీ వడుగఁదగినదియు నేను జెప్పఁదగినదియు నా పేరొక్కటే. అది చెప్పనే చెప్పితిని. బాగుగఁ బరిశీలించిన స్వనామము చెప్పనే కూడదని శాస్త్రము లుద్ఘోషించుచున్నవి. ఇఁక నా రాకకుఁ గారణ మడిగితివి. ఇదియును దత్తోత్తరమే!

క. వేదము! శాస్త్రము! పుణ్యా
పాదకమగు తీర్థమో! నృపాలునిఁ జూడన్
రాఁ దలఁచేటికి ధనసం
పాదనకే కాక చెప్పవలయునె యిదియున్ ?

బలి— (తనలో) ఓహో! ఇతనితో మాటలాడుటయే కడుఁ గష్టముగా నున్నదే! ఇంతకును జిన్నతనము గనుక "అహమేవ పండితః" అను నవస్థలో నున్నాఁడు. ఎటులనో యితని వాక్యములు మఱికొన్ని వినవలెను. (ప్రకాశము) వామనశాస్త్రీ! అట్లయిన నీ కేమి కావలయునో కోరుకొనుము.

వామ— రాజా! "అసంతుష్టా ద్విజా నష్టా స్సంతుష్టా ఇవ పార్థివాః" కావున నీకేమి తోఁచునో యదియే యొసఁగుము. దానితోడనే సంతసించెదను. "దానం దాతృవశ" మ్మనికదా! పెద్దలు చెప్పుదురు.

బలి— బాలశాస్త్రీ! యీబలి యెవ రేది గోరిన నది యిచ్చుటకే యేర్పాటు చేసికొని యీ జన్న మారంభించినాఁ డని నీవు విని యుండ లేదా ?

వామ— వినకేమి? వింటిని గాని కోరిన కోరిక లెల్ల నిచ్చుటమాత్రము తటస్థింప దని నా యభిప్రాయము.

బలి— నీవేది కోరినను నిచ్చువాఁడను నే నుండఁగా నీకట్టి యభిప్రాయము కలుగనే కూడదు. కోరికొనుము.

ఉ. కావలెనే మహాశ్వములు? కావలెనే కరు, లగ్రహారముల్ ?
కావలెనే కనత్కనకకల్పితరత్నవిభూషణావళుల్ ?
కావలెనే ధనంబు? లెవి గావలె నీకవి గోరుకొమ్ము, నే
నీవలె, నీవు పుచ్చుకొని యేగవలెన్ ధ్రువ మింత వామనా!

వామ— రాజా! ఇవన్నియు నీకున్న వని చెప్పుటకా యేమి! బ్రహ్మచారుల కివి యేమి పనికి వచ్చెడిని ?

బలి— ఓహో! ఇక్కడికి నీ యభిప్రాయము దేలినది. తగు కన్నియం దెచ్చి వివాహ మొనరుపు మని కోరెదవా? అట్లయిన నది యెంత, మా పురోహితులు భృగువు లుండనే యున్నవారు. వారలతోఁ జెప్పి నీవు గోరిన కన్నియ నిప్పించెద.

వామ— అదియును నా కక్కఱలేదు. ఏమంటివా ?

చ. వనితను జేరి తద్వశత వర్తిలి దుఃఖము సౌఖ్య మంచు భ్రాం
తిని గొని సంసృతిం బడి గతిన్ గన లేక కృశించు వెఱ్ఱులన్

గనుఁగొనియున్ వివాహము సుఖమ్మని యేనెటు సమ్మతింతు దుః
ఖనియతమైన సౌఖ్యము సుఖం బనఁ గూడునె రాక్షసేశ్వరా !

బలి— సరే! అట్లయిన నీ కేమికావలెను ?

వామ— నా కోరికతో నీ కేమి యవసరము ? నీకుం దోఁచిన దిచ్చి పంపింపుము.

బలి— నీవు కోరినం గాని నే నీయను.

వామ— నీ వీనిచో నే నూరకయే పోయెదను.

బలి— నిన్నట్లు వెడలనీయను. కావున నీకోరికం దెల్పి నన్నుఁ గృతార్థుని జేయుము.

వామ— (తనలో) ఓహో! యేమి యీ దాతృత్వము! ఇంతటి యోగ్యుని వంచించుటకన్నఁ దప్పు లేదు. అయినను నదితి కిచ్చిన వరము వేఱొకఁటం దీరదు. (ప్రకాశము) తప్పక కోరిన దిచ్చెదవా ?

బలి— ముమ్మాటికి నిచ్చెదను.

వామ— వదాన్యశిఖామణీ !

గీ. బ్రహ్మచారిని నేను దపంబొనర్చ
కొనెద నొక్కెడఁ గూర్చుండి కొంకుదక్క
యిమ్ము మూఁడడుగుల నేల యిదియ చాలు
మూఁడులోకమ్ము లిడినంత ముదముగాంతు.

బలి— (పెదవి విఱిచి) శ్రోత్రియకులావతంసమా ! ఏమి కోరికఁ గోరితివి ? ఈ స్వల్పము నీ వడుగనుం దగదు. నే నిచ్చుటయుం దగదు.

క. మూఁడడుగు లేమిసేసెదు!
మూఢుఁడవే ? నన్ను నగరె ముల్లోకంబుల్ ?
వేఁడికొను మేదియేనియు
మేడలా ? మాడలా ? వరాలా ? మేల్ నేలువలో ?

వామ— రాజా ! నీ విచ్చినను విశేషపరిగ్రహము భిక్షాటకుల కుచితముగాదు. అదియునుఁ గాక,

ఉ. కోరిన దిచ్చుటే మిగుల గొప్ప గదా ! యొకఁ డొక్క వస్తువున్
గోరు, నొకండు వేఱొకటి గోరు, మనంబులు పల్ తెఱంగు లేఁ
గోరిన దిమ్ము నా కదియగున్ సకలమ్మను, నిన్నుఁబట్టి నేఁ
గోరుదునే ? నిజేచ్ఛ మెయిఁ గోరుదుఁగాక త్రిలోకనాయకా !

శుక్రు— (తనలో) ఈ వడుగు చందమును నితఁ డాడు మాటలును జూచిన నేదో కపటపుఁ బన్నుగడగాఁ బొడకట్టుచున్నయది. (ధ్యానము నటించి) జ్ఞాన దృష్టిచేఁ జూచినను దానికి భిన్నముగాఁ దోఁపదు. కావున నితం డింద్ర హితార్థముగా నరుదెంచిన దైత్యారి యగు నారాయణుండు గావలయు. (ధ్యానము నటించి) ఓహో, ఎంతదురూహతో వచ్చినాఁడు! మూఁ డడుగులచే మూఁడులోకములు నాక్రమింపవలయు ననియే నా వీని దురాశ! కానిమ్ము. నే నది సాఁగనిత్తునే? (ప్రకాశము) రాజా! అట్లు బిఱ్ఱబిగియుచున్న యీ పెంకికొయ్యకు నీవేమియు నీయనక్కఱలేదు. పొమ్మని చెప్పుము.

బలి— గురువరా! ప్రపంచ మనేకవిధములుగ నుండు. దాతలమను యశము నార్జింప నెంచువారలకుఁ గోప ముండిన ధనవ్యయమేకాని తుదకు నప కీర్తియే ఘటించును. కావున మనకుఁ గోప ముచితము కాదు.

క. కోపము చీఁకటికూపము
కోపము పాపముల కాదిగురు వగు హింసా
ధూపము కోపము కావునఁ
గోపింపం గూడ దేరికొఱకేని మునీ!

వామ— రాజా! నామాట యేమి చెప్పితివి? నాకు మూఁడడుగులే కావలెను.

బలి— అట్లయిన నంతియే కైకొనుము. ఇదిగో నిచ్చుచున్నాఁడను. (భార్య వంకఁదిరిగి) దేవీ! జలముం బోయుము, పాదప్రక్షాళనంబు సేయవలయును.

శుక్రు— (తనలో) ఇతనికి విస్పష్టముగాఁ జెప్పినం గాని తెలియదు. అట్లు చెప్పినచో నీతనికి నాపైఁ గోపము వచ్చును. వచ్చుఁగాక యీ నారాయణునకు గీరాయణునకు నేను జంకుదునే? (ప్రకాశము) రాజా! నా దొక్కమాట వినుము. ఇతఁడు నీ వనుకొనునట్లు బ్రాహ్మణపటువు గాఁడు. శ్రీమన్నారాయణుండు. నీవు ధర్మాత్ముఁడవగు కతన నిన్ను దండోపాయమ్మున జయింప నేరక యీ కపటోపాయముం బన్ని యిట్లు నిన్నర్థించుచున్నాఁడు. ఇంతకుమున్ను నా వేషమును వేసికొని దేవ గురుఁడు నీకు దుర్బోధ చేసి యనాచారుఁగా నొనర్చుట యెఱిఁగియే యున్నావుకదా! ఈ కపటాత్మునావలకుఁ ద్రోయింపుము.

వామ— రాజా! నన్నావలకుఁ ద్రోయించ నక్కఱలేదు నీవు పొమ్మన్నఁ జాలును, నేనే పోవుదును.

తే. గీ. తాతతండ్రు లార్జించిన ధనము దెచ్చి
దాఁచఁ బెట్టితినే నీదు దరిని నేను?

ఇచ్చినం బుచ్చుకొండు లేదేనిఁ బోదు;
లేదు ప్రతిబంధకము వృథావాద మేల ?

బలి— (తనలో) గురుం డట్లు నొడువుచున్నాఁడు. ఇతనిరీతిం జూచినఁ గడు యోగ్యుఁడుగాఁ దోఁచుచున్నాఁడు. ఇదిగాక,

చ. అడిగిన దెల్ల నిత్తు నని యంద తెఱుంగఁ బ్రతిజ్ఞ జేసి మూఁ
డడుగుల మేర యిమ్మనిన నల్ప మటంచును గేలి సేసి యీ
వడుగున కిప్ప డేమనుచు స్వల్పము నేని యొసంగ కూరకే
కడపుదు దాతలెల్ల ననుఁ గాదనరే ? తలనెత్త నిత్తురే ?
అప్రతిష్ఠ మాటట్టు లుండ ననృతదోషము సామాన్యమా ?

తే. గీ. ధర్మమున కాదిపదము సత్యంబు, రెండ
వపద మెన్నఁగఁ దగు శుచిత్వంబు, మూఁడ
వపద మెన్నఁగ దయ, నాల్గవపది మెన్న
దాన మని చెప్ప నెల్లబుధప్రజంబు.

ఇం దేమియు నుపాయము కానరాదు. గురునకు మాఱాడితినా, అతఁడు శపించును. ఇంతకు మున్నే శపించియున్నాఁడు కదా. కానిమ్ము. ఇట్లగుంగాక. (ప్రకాశము) గురువరా ! ఇతఁ డాదిదేవుఁడగు శ్రీమన్నారాయణుఁడని కదా సెలవిచ్చితిరి!

ఆ. వె. దాత లుండవచ్చు దానమ్ము లీవచ్చు
నేరి కిట్టి పాత్రి మెందు దొరకు ?
నిపుడొ యపుడొ యెపుడొ యీరాజ్య మీ కాయ
మేగకున్నె దీని కింత యేల !

కావున నన్ను మన్నించి యిప్పట్ల నా కాజ్ఞ యిందు.

శుక్రు— రాజా ! నీకిప్పు డాజ్ఞ యిచ్చితినా, యిఁక నెప్పుడును నాజ్ఞ యీయనే యక్కఱలేదు. నీకనృతదోషము గాని మఱియొక దోషము గాని యిప్పట్ల లేశమును దగులదు. ఏమంటివా, యితఁ డెట్టివాఁడైనను నిప్పట్ల కేవలద్రోహి కావున మూర్ఖులలోఁ జేర్పఁ దగినవాఁడు.

క. విను మూర్ఖు లయిన ద్విజులకు
ధన మీవల దిచ్చెనే నుదరపోషణకుం
గనిపెట్టి యీవలయు లం
ఘన మొనరింపంగఁ దగదుగా శాస్త్రములన్.

కావున నతని కీ పూటకు సరిపడు భోజనసామగ్రి నిచ్చి పంపించుము.

వామ— ఏమి, రాజా! "సద్యో దదాతి చతుర స్సద్యో నాస్తీతి చతురతరః" కావున నన్ను వృథాగా నెందులకు నిల్పెదవు?

బలి— (వినయముగా) స్వామీ! క్షణమాత్ర మనుగ్రహింపుఁడు. (శుక్రుని దిక్కు) గురువరా! తమయిచ్చు చొప్పున మూఁడడుగులలో మూఁడు భువనములు నిమిడ్చెడి మహానుభావునకు సరిపడు భోజనసామగ్రి మాత్రము మన మీయఁగలమా? కావున నన్ననుగ్రహించి మొదటిదానికే సమ్మతింపుఁడు.

గీ. సిరి యురమ్మునఁ గల దొర చేతు లొగ్గి
యడిగికొనునఁట న న్నొక యధికుఁ జేసి
దాతనని పేరు వెట్టుక తగునె యట్టి
వాని కీయక యెందు కీ వైభవంబు.

శుక్ర—(కోపముతో లేచి) నీవు హితోపదేష్ట నగు నన్ను లెక్కింపకున్నాఁడవు కావున రాజ్యభ్రష్టుండవు గమ్ము. పొమ్ము. (లేచిపోవును)

బలి— (తనలో) అక్కటా! గురుఁడు వెళ్ళిపోయెనే! పైపెచ్చు శాపముఁ గూడ నిచ్చినాఁడు. కానిమ్ము. ఈ శాపమున కేమి? ఏమి పోయినను యశ మొకటి నిల్పుకొనుటకై పురుషుఁడు యత్నింపవలయు.

చ. అనుభవహీనుఁడైన జడుఁ డక్కట! సంపద గోరుఁగాని స
జ్జనుఁడు యశంబుఁగోరుగలి సంపదకున్ మొగియండు; కీర్తియున్
ధనమును గల్గు కార్యము బుధవ్రజసమ్మతమై చెలంగుఁ; గీ
ర్తి నడఁచు సంపదల్ పరిహరింతురు ధీరవరుల్ తృణమ్ముగన్.

అదియునుం గాక,

గీ. హాయిగా నిన్ని వాళ్ళు నే ననుభవించి
విసివితిని సంపదల నింక వీడఁ దగదె?
అందులో నూరకే వీడుటా! జగమ్ము
లెవఁడు పోషించు వానికి నిడుటగాని.

(భార్యదిక్కు ప్రకాశము) దేవీ!

శా. సంపాదింపఁగ వచ్చు సంపదలు భూచక్రమ్మునం గాదు నై
లింపావాసమునందె గా; దెచటనున్ లేఁ డిట్టి పాత్రుండు శం
కింపం బాడియె యిట్టిపట్టునఁ? బయిం గీడైన మేలైననున్
గంపింపం బని లేదు; పూర్ణహృదయుం గావింత మీ బాలకున్.

వింధ్యా— నాథా! పాత్రపాణికమలార్పణముకన్న సంపదల కొండు ఫలమ్ము లేదని యార్యులు వచింతురు. కావున నవశ్యము నట్టు లొనరింతురుగాక.

బలి— (తనలో సంతోషముతో) ఆహా! సత్కళత్ర మన నిట్టిదియే కదా!

క. మన గతి యేమగునో యని
మనమున నొక్కింతయేని మటమట లేదీ
వనజాయత నేత్రకు నెం
దును నిట్టి కళత్రి మున్న దొరకన కీర్తుల్!

(ప్రకాశము) దేవీ! నీ సౌశీల్యమునకు నేను మెచ్చితిని. నేనే కా దెల్లలోకములును మెచ్చును. అట్లయిన నియ్యనఘునికిఁ బాదప్రక్షాళనం బొనరించెదను. నీ వుదకంబు వోయుము.

వింధ్యా— చిత్తము. (బిగ్గరగా) ఎవ రక్కడ?

(ఒకదాసి జలకలశ మిచ్చి పోవును)

బలి— (వినయముతో) మాణవకోత్తమా!

క. ఆలస్యము చేసిన నా
మాలిమి సైరించి నన్ను మన్నించి కృపా
వాలుఁడవై పాదంబుల
నీలాగున నిమ్ము! కడిగి యేఁ దరియింతున్.

వామ— (ఆదరముతో) రాజా, యాలస్యమున కేమి!

క. ఫలవంతం బగు కాలపు
విలంబనము సైఁప కేమి వెట్టిసె! శుక్రా
ర్యులమాట విందు వని నేఁ
దలఁచితి మేలేమ్మెలు! నీవె దాతవు బళిరే!

క. ఏ దానం బేనియు నీ
భూదానమ్మునకు సుంత పోలవు నీకున్
శ్రీదయితుఁ డిక్కతమ్మున
సాదరుఁడై యొసఁగు నఖిల మగు సౌఖ్యమ్ముల్.

బలి— (కాళ్లుగడుగుట నటించి చిఱునవ్వుతో) కపటమాణవకుండ వగు నో పరమాత్మా! ఇదిగో! నీ కోరిక చొప్పున మూఁడడుగుల భూమియును ధారవోయుచున్నాఁడను. పరిగ్రహింపుము. (ధారవోయును)

వామ— (తనలో) ఏమీ! ధారపడకున్నది. (యోజించి) అవును. ఇయ్యది శుక్రుని కపటకృత్యము. (దర్భకఱ్ఱతోఁ బొడిచి ప్రకాశము)

శా. ఎంతోమంది నృపాలకుల్ గలరు వా రెంతేసి రాజ్యమ్ముల
త్యంతప్రాభవరీతిఁ జేసినను విద్వత్పుష్పాలంబు లిం

లింతల్ గల్గెనె యింత గాదె యిది నీవే నీకు సాటెన్నఁగా
సంతోషించె మనంబు దానవపతీ! సత్యప్రభావాకృతీ!

బలి — (తనలో) ఔరా! యేమి యీ విప్రవటుని చాతుర్యము. నిజముగా నితఁడు బాలకమాత్రుఁడే యగునా! (యోజించి) ఏమైన నేమి? భగవంతుం డగు శ్రీమన్నారాయణుండే యగుఁగాక. అట్లయిన నేను మఱియుం గృతార్థుఁడను. (ప్రకాశము)

క. వటుకా! నీ మృదు వాచా
పటిమమ్మున కేమి యిడినఁ బ్రతిఫల మగునే
యెట నేర్చితి వెటు నేర్చితి
విటువంటి వచోవిశేష మీ ప్రాయమునన్.

నీకు నాచే నీఁబడిన పృథివిం గొలిచికొని దానికిం బట్టా పుచ్చుకొందువు గాని యీనాఁడు మా యింట విందు నొనరింపుము. పదఁపడి సకలమ్మును గాపచ్చును. నీవంటి యతిథి వచ్చుటచే నా యాగంబు గూడ సంపూర్ణం బయ్యె నిఁక నియ్యెడఁ దడయ నేల? గృహమ్మునకే పోవుదము రమ్ము.

(కేలు పట్టికొని తత్సహితముగా భార్యతోఁగూడ నిష్క్రమించును)

## గద్య

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
దంభవామనము నందుఁ బంచమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# దంభవామనము

## షష్ఠాంకము

(అంతఁ గొందఱు రక్కసు లాయుధసహితులై ప్రవేశింతురు.)

ప్రథ— (కోపముతోఁ జూచి) ఓహో! రక్కసులారా!

ఉ. ఇంతకు మున్ను మిన్ను మను నేకముగా నెవఁ డాక్రమించె దు
శ్చింతనుఁ డావటుం డిపుడు చిన్నశరీరము నెప్పటట్ల భూ
కాంతుని మ్రోలఁ గన్పఱచి కాలులు ప్రేలఁ దొడంగె వీని నేఁ
డంతము నొందఁజేయుద మహో! కపటాత్ముని సైఁపఁ జెల్లునే?

ద్వితీ— (పరికించి) అదిగో! మన గురువుగారిట వచ్చుచున్నారు. వారితో యోజించి పిదప నేదేని యొనరింతము.

(అంత నొంటికంటితో శుక్రుఁడు ప్రవేశించును.)

శుక్ర—(చేతితో నొకకన్నుపట్టుకొని రెండవకంటఁ జూచి) ఓ శిష్యులారా! చూచితిరా నాగతి? మీవంటి పరాక్రమశాలులకు గురువునై యిట్టిదుర్దశకుఁ బాలయితి. ఆ కపటాత్ముండగు హరి మనరాజ్య మపహరించుటయే కాక నాకుఁ జావు దప్పి కన్ను లొట్ట గూడ నైనది.

రక్క— మహాత్మా! తమకీ దుర్దశ యేమి? ఇదిగో, వాని నిప్పుడే సంహరించుచున్నారము, సెలవిండు.

శుక్ర— (వినుట నభినయించి) అదిగో, నా దుర్మార్గుఁడు మన చక్రవర్తితో నేమో యింకను మంచివానివలె సంభాషించుచున్నాఁడు. వింటిరా? ఇప్పటికేని వీనికి బుద్ధి గలుగలేదు చూచితిరా?

ఆ. వె. ధార వోయునపుడు జారికొమ్మన నేను
దూరి యడ్డుపడితి దోసకారి

వటుఁడు దర్భకత్తి నటునిటు పొడిచి నా
కన్నులొట్టఁజేసి కస్తి తెచ్చె.

(అంత బలి భార్యతో వామనునితోఁ బ్రవేశించును.)

రక్క— అక్కటా! యెందులకు మే మింతమంది శిష్యులుండి తగులఁబెట్టనా? ఇదిగో, నిప్పుడే యద్దురాత్ముం జంపి మీ పరాభవము బోగొట్టుచున్నారము.

(కోలాహలము గావింతురు.)

బలి— (చేయెత్తి బిగ్గరగా)

ఉ. దానవులార! యెందుకు స్వజ్ఞాకలహం బిది వేళ గాదు నా
యాన సుఁడీ! రణమ్మునకునై ప్రయతించకుఁ డిప్పు డెట్టులో
ప్రాణము చేతఁ బట్టుకొని పాఱుఁడు కాలికొలంది మీఁద నె
ట్లైని యదృష్ట మున్న జగ మేలుద మాపద లట్టె యుండునే?

రక్క— (శుక్రునిదిక్కై) గురువర్యా! వింటిరా, చక్రవర్తి యాదేశము? ఇందులకుఁ డనుయభిప్రాయ మేమి?

శుక్రు— (అనాకర్ణితముగాఁ గోపముతో) ఓయీ! దుర్వ్యసనపరాయణా! పలాయనోపదేష్టా! రాజ్యభ్రష్టా! దనుజలోకానిష్టా! కష్టా! నికృష్టా!

శా. నీబాగుల్ మదిఁ గోరిచెప్పి తుదకు న్నేత్రంబుఁ గోల్పోతి నీ
కీ బాలుం డెవఁడో యెఱుంగఁ బడెనే? యిద్దేవి లేదన్న లే
దా, బంధుల్ మఱి నీవునుం జెడుదు రేలా యిట్టిదానంబు? క
ట్టా! బోధించిన సుంతయుల్ వినవు నీప్రారబ్ధ మెట్లున్నదో!

బలి— (వినయముగా) దేశికేంద్రా! నాతప్పు లన్నియు క్షమించి నన్ననుగ్రహించి మీ రీదానవుల నందఱిని శాంతులం జేసి రక్షింపుఁడు.

క. భగవంతునకుల్ మనపైఁ
బగ గలిగినఁదప్పు డెవరి వశము జయింపం
దగ నెఱుఁగు భవాదృశులకుఁ
దగవే మాబోఁట్లు చెప్ప దనుజాచార్యా!

శుక్రు— (కోపముతో) అట్లయిన నీకర్మము. మేము పోవుచున్నారము. నీవింక నతనిని నెత్తిమీఁద నెక్కించుకొని యారేగుము. (రక్కసులతో నిష్క్రమించును.)

వామ— రాక్షసేంద్రా!

క. మూఁడడుగు లిత్తు నంటివి
పోడిగ రెండడుగు లాయె భూమియు నభముక్
మూఁడవ యడుగునకుం జో
టేడఁ గలదు ? చూపు మింక నేటికిఁ దడయక్.

బలి— (యోజించి)

క. లేదని నీ వెఱిఁగియు న
న్నే దెసఁ దెమ్మనెద వనఘ ! యే బొంకినచో
మోదము నొందెదవే ? యు
ష్మదృశులకు నిట్టియూహ మఱియా దగునే !

క. సంకటము లెన్ని గల్గిన
బొంకనివాఁ డెవఁడో, వాఁడె పురుషుఁడు దేవా !
బొంకం జాలను నిక్కము
బొంకంగాఁజాల నేను బొంకఁగఁ జాలక్.

వామ— (తనలో) అక్కటా ! యిట్టి సత్యసంధు నిట్లు సేయుట యెంతయేని దుష్కృత్య మనుటకు సంశయము లేదు. కాని యితని యనుచరు లొనర్చు దుష్కృత్యమ్ములం జేసి యిప్పని తప్పక వచ్చినది. (ప్రకాశము) ఓయీ! నోటితో బొంకకున్నఁ జేతతోనైన బొంకెదవా ? లేదా ?

బలి— (యోజించి) మహాత్మా ! నే నెట్లును బొంకను.

ఆ. వె. బొంకువాని పుట్టు బొంకువాని ధనంబు
బొంకువాని బ్రతుకుఁ బొల్లుగాన
నెట్లు బొంక నేర్తు నెఱిఁగియు దేవ ! యా
యడుగు వాదు శిరమునందు నిడుము.

(అంబరమునుండి పుష్పవృష్టి కురియును)

వామ— (తనలో) ఏమి ! ఇయ్యనఘుని మనోనిశ్చయము. నిజముగా నితఁడు ప్రహ్లాదుని మనుమఁ డనిపించుకొనఁ దగినవాఁడే.

(అంతఁ బ్రహ్లాదుండు ప్రవేశించును)

ప్రహ్లా— (వామనునికి నమస్కరించి)

సీ. కలుము లీనెడి పాలకడలి రాకూఁతురు
నునుఁదొడఁ దాల్చు రతనపుఁ దొడవు
పాతకమ్ములు పంచ బంగాళముగఁ జేయు
నట్టి గంగాదేవి పుట్టినిల్లు

ప్రాఁబల్కు కల్క-గారాపుఁ జెయ్యులకు ని
దానమై యొప్పు నుద్యానవనము
స్వారాజునకుఁ ద్రిలోకీ రాజ్యభారమ్ము
పట్టమ్ము గట్టెడి పట్టుగొమ్మ
తే. గీ. సేవ్యమై యొప్పు నల గయాక్షేత్రమను కొ
లంకునం దింపు మీఱు మేల్పంకజంబు
బ్రహ్మరుద్రాది దేవతా ప్రభుశిరముల
నెరయు మవ్వంపు మకుటంబు నీదు పదము.

ఇట్టి పదమ్మున నామనుమని శిరంబుఁ బవిత్రం బొనరింప నెంచెడి నీ యనుగ్రహమ్మునే నేమని కొనియాడఁ గలను ?

వామ— (బలిశిరమ్ముపై పాద ముంచును)

బలి— (శిరమువంచి) దేవా ! నే నిప్పటికి ధన్యుఁడను. (ప్రహ్లాదునిదిక్కు) తాతా ! నమస్కారము.

వింధ్యా— (విచారముతో) దేవా, మహానుభావా ! ఇయ్యనఘుండు నీయెడ నించుకయుఁ గపటమ్ము లేక నీవు కపటాత్ముండ వని యెఱిఁగియుఁ ద్రిలోకరాజ్యమును సమర్పించెఁగదా ? ఇట్టి నా దయితు నవమానింప నీ కుచితమా ? క్షమించి నాకీ సందియముం బాపుము.

వామ— (శిరమునుండి పాదము దీసి) పతివ్రతాశిరోమణీ ! నీయడిగిన ప్రశ్నమ్మున కవశ్యము నుత్తరంబు చెప్పఁదగి యున్నది. వినుము.

తే. గీ. ఇతఁడు ముమ్మాటికిని యోగ్యుఁ డింతవాఁడు
మూఁడు కాలమ్ములందును లేఁడు నిజము
నా పరీక్షకు నీపతి యోపినాఁడు
కాన నా మెప్పు నీతఁడు గాంచినాఁడు.

ఇది యవమాన మ్మని తలంపకుము. బాగుగ నూహించిన సన్మానమునుమీ !

ప్రహ్లా— దేవా ! నీ మెప్పుఁ గాంచుటకన్న నిఁక నెక్కుడు సామ్రాజ్యమే ముండును !

క. కనులుండి గ్రుడ్డివారలు
వినఁగాఁ జెవు లుండియుం జెవిటివారలు భూ
మిని బాలించెడి నృపతులు
ధనమును రాజ్యమును గోరఁ దలఁపరు తద్జ్ఞుల్.

ధం. 5క

ఉ. ఇంతకు నెంతమంది నృపు లేలిరి? యేలఁగ నున్న ధారుణీ
కాంతు లిఁ కెంద? ఱక్కటా! యొకండని నిశ్చయ మేల? భూమి కో
యింతి, తదీయనాథుఁ డొకఁడే యెటు లౌఁ? గనలేరు దీని నో
క్కింతయు, శాశ్వతం బని నరేంద్రులు పొంగుచునుంద్రు మందులై.

సీ. ఇంద్రుని యైశ్వర్య మెవ్వా రెఱుంగని
దితఁ డెన్నిసార్లిట్లు హీనుఁ డయ్యె
నహుషుఁ డింద్రపదమ్మునకు వచ్చినప్పటి
యాతని దురవస్థ నెంచికొన్న
నింద్రత్వమునకన్న నేపనియేనియుఁ
మెఱుగనియును నిట్టి పరువుమాలు
నుద్యోగధర్మంబు నొందుట గర్భశ
త్రునకు నైనను గూడ దనుచుఁ దోఁచ

తే. గీ. కున్నె? యేపాటి తెలివియు నున్నవాని
కనఘ! వామనుమని రాజ్య మపహరించి
తనుచుఁ జింతింప మదమత్తతను హరించి
బాగుఁ జేసితి నీపదభక్తి నిచ్చి.

బలి — (భక్తితో)

ఉ. ధన్యుఁడ నైతి నీదుపదతామరసమ్ము శిరమ్ము సోకి సౌ
జన్యము గల్గె జన్మము ప్రశస్తత గాంచె చరిత్రముల్ జగ
న్మాన్యత కెక్కె, నెక్కటిన మాణవకోత్తమ! నన్ను నింతలో
నన్యునిఁగాఁ దలంచి శిరమందలి పాదము దీసి తక్కటా!

వామ — రాక్షసచక్రవర్తీ! నీజ్ఞానమ్ము కడు వర్ణనీయము.

క. దాతలలో నేతలలో
నీతివిదగ్రణులయందు నిన్నుం బోల్పన్
నాతరమె వేరొకరుని
నీతో సామ్యంబు చెప్ప నీకే చెల్లున్.

నీ విప్పుడ నాయానతిం జేసి రసాతలం బరుగుము. నీయాజ్ఞ రక్కసులెల్ల శిరమ్మునం దాల్చి యెప్పటియట్ల మెలంగుచుందురు. చక్రధారినై యెల్లప్పుడును నేను నీసేవ మారయుచుండెదను.

బలి— (సంతోషముతో)

క. అజ్ఞాన మెల్లఁ బోయెన్
విజ్ఞానము గల్గెఁ గనులు విడియెన్ మిగులన్
బ్రాజ్ఞుఁడ నైతిని నిక్కము
యజ్ఞేశ్వర ! యజ్ఞవరద ! యజ్ఞాకారా !

వామ— దనుజలోకసార్వభౌమా ! నీవు రాఁబోవు సావర్ణికమన్వంతరంబున నింద్రత్వమ్ము నందఁగలవు. ఇప్పటి కీ రాజ్యంబెల్ల నింద్రుండు పరిగ్రహించు.

ఉ. ఇందుల కించుకేనియును నీవు మదిం గదియింపఁబోకుమీ
సందియ; మస్మదీయకృప చాలఁగఁ గల్గుటకున్ ఫలం బిదే
యందురు జ్ఞాను; లెయ్యెడల నారయ లేదె యతీంద్రులన్, బదా
నందము తప్ప సంపద తృణంబుగ వార లనాదరింపరే ?

బలి— (సంతోషముతో) దేవా ! నాకు నీ పదభక్తియే యెప్పటికిని ననుగ్రహింపుము. నాకు నిఁక నింద్రత్వ మెన్నఁటికిని నక్కఱయే లేదు.

సీ. ఈ జగత్త్రయ మేలు నింద్రునికైన స
న్న్యాసి కున్నంత సౌఖ్యమ్ము లేదు
సాక్షాన్మహాలక్ష్మి వక్షమందున్న వి
ష్ణునకేని యతి కున్న సుఖము లేదు
త్రిజగత్కుటుంబియౌ నజునికైనను విర
క్తున కున్నయంత నిశ్చలత లేదు
అణిమాదియుక్తుఁడౌ హరునికైనను గోఁచి
పాఁతరాయని కున్న భాతి లేదు

తే. గీ. తపములకు విఘ్నము లొనర్పఁ దలఁచుటయును
దైత్యుల హరింపఁ దలఁచి ఖేదంబు గొనుట
యును గదా! వీర లొనరించుపనులు నే నె
ఱింగియును సంగమునఁ బడి క్రుంగ నేల ?

ప్రహ్లా— (తనలో సంతోషముతో) ఆహా ! నామనుమనికిఁ గూడఁ జక్కని జ్ఞాన ముదయించినది. ఇఁక నావంశ మెల్లఁ బావన మైనది. (ప్రకాశము) తండ్రీ! లోభగుణంబుం జయించి పరమవిజ్ఞాని వైన నీకుఁ ద్రిలోకాధిపతులే కాదు చతుర్దశభువనాధిపతులును సాటి గారు.

తే. గీ. ఎంతరాజ్యమ్ము గల్గిన నేమి? సుఖము
గలుగ నేరదు లోభసంక్రాంతమతుల
కదియొకటి నిగ్రహించిన నన్ని యెడలఁ
గలుగు సౌఖ్యమ్ము నీ వెఱుంగనిది కలదె?

నీ కింతకన్న నీ యనఘునివలనఁ గాఁదగు ప్రియం బేమి? అయినను నిట్లగుఁ గాక.

## భరతవాక్యము

ఉ. దాతృత సత్యవర్తనము దైవతభక్తి విరాగము దయో
పేతత జ్ఞానముం బ్రజల కెక్కుడుగా ఘటియించుఁగాక! ప్ర
ఖ్యాతిని గోరి రాజులు ప్రజార్థముగా నిరుపప్లవంబుగా
ఘాతుకభీతిదాయకులుగాఁ బొగ డొంది భరింత్రుగా కిలన్.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరు
లొనర్చిన దంభవామనమునందు
షష్ఠాంకము సంపూర్ణము.

# తప్పొప్పుల పట్టిక

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 3 | 3 | యణర్య | యరణ్య |
| 3 | 4 | నుప్రి | నుబ్రి |
| 19 | 20 | నూత్రి | నూత్రి |
| 22 | 27 | పదఁపడి | పదపడి |
| 26 | 4 | ధః | ధః |
| 29 | 13 | యుమ | యును |
| 30 | 10 | ల్లిఁదం | ల్లిదం |
| 42 | 14 | వామ | వామ |

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# అనర్ఘనారదము

# ఇందువచ్చు పాత్రములు.

## 1 వ అంకము.

1 సూత్రధారుఁడు

2 నటి

3 లక్ష్మి

4 నారాయణుఁడు

5 సనకాదిమునులు

6 నారదుఁడు

## 2 వ అంకము.

1 నారదుఁడు

2 నారాయణుఁడు

3 సౌభాగ్యసుందరి

4 తాలధ్వజుఁడు

5 విదూషకుఁడు

## 3 వ అంకము.

1 తుంబురుఁడు

2 రాజు

3 సౌభాగ్యసుందరి

4 బ్రాహ్మణుఁడు

5 నారదుఁడు

## 4 వ అంకము.

1 నారదుఁడు

2 పర్వతుఁడు

3 మాలాకారుఁడు

4 సృంజయుఁడు

5 మదయంతి

## 5 వ అంకము.

1 చెలి

2 నారదుఁడు

3 పర్వతుఁడు

4 మదయంతి

5 సృంజయుఁడు

## 6 వ అంకము.

1 నారదుఁడు

2 పర్వతుఁడు

3 మదయంతి

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# అనర్ఘనారదము

## ప్రథమాంకము.

### నాంది

మ. పరమేశత్వము గల్గి యెవ్వఁడు సదా దైత్యంబు నాశించు సం
సరణం బెవ్వఁడు రోసియుఁ ద్రిజగతీసంసారముం జేయు గా
నరసజ్ఞుండును నాట్యవేదనిధియు న్నానావిధానందియుఁ
బురుషుం డయ్యును బూవుఁబోఁడియగు శర్వుం డిచ్చు నైశ్వర్యముల్.

మఱియును,

సీ. మోముగోమును జూచి ముదము చంద్రుఁడు వొందఁ
గనకగర్భుఁడు దేహకాంతికలర
మోవికావికి హేళి తా విరాళిఁ గనంగ
నూగారుఁ గని శేషభోగి వొగడ
తనుగంధమునకు గంధవహుఁ డానందింప
హాసమ్మునకు శర్వుఁ డాసఁ జేయ
చూపుకోఁపులకు మెచ్చుచు నింద్రుఁడెదసొక్క
నైరావతము గతి ననుకరింప

గీ. రక్కసులు మోహమున మూర్ఛ నెక్కొనంగ
నమృతకలశంబుఁ జేఁ బూని యతులగతుల
నిటు నటుఁ బచారు సేయు మోహిని శుభంబు
లిచ్చి రక్షించుఁ గాత మీ కెల్లవేళ.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సూత్ర— (తెరవంకఁ జూచి) ఆర్యురాలా! యిటు రమ్మ.

నటి— ఇదిగో, వచ్చితిని. ఏమియాజ్ఞ?

సూత్ర— ఆజ్ఞ కేమున్నది ? నారదవివాహమను నామాంతరము గల యనర్ఘ నారదమను నూతన నాటక మొకటి ప్రదర్శింప వలె నని సభ్యుల యనుమతి యైనది.

నటి— (నవ్వి యాశ్చర్యముతో) నాథా ! సతతంబును నేకాకియై త్రిభువనంబులను బరిభ్రమించు నాజన్మబ్రహ్మచారికి నారదునకుఁ బెండ్లి గూడనా ! మీరు గ్రొత్తగాఁ జేయఁ దలంచినను నమ్మ్యనఘుఁ డొప్పుకొను టెట్లు ?

సూత్ర— పండితమ్మన్యురాలా ! అంతతోఁ గట్టిపెట్టుము. నారదునకొక పెండ్లికే నీవాశ్చర్యపడుచుంటివి ! మరల మాటాడిన రెండు పెండ్లిండ్లునుమా !

నటి— అబద్ధమున కర్థమేమిటి ? ఒకదాని కంగీకరించినవా రెన్నిటికేని యంగీకరింపవచ్చును.

సూత్ర— (కోపముతో) ఇంకను నీదుష్పాండిత్యమును వెల్లడి చేయుచునే యున్నావుగా ! ఏవో రెండు మూఁడు కథల పుస్తకములు చదివి యంత మాత్రమునఁ బెద్దలచరిత్రములలోని రహస్యములను గేలి సేయఁ బూనెదవా !

నటి— (వినయముగా) లేదు, లేదు. క్షమించి యానతిండు. రెండవ పెండ్లికిఁ గారణమేమి ?

సూత్ర— ప్రేయసీ ! మొదటి పెండ్లి నీకుఁ దెలిసినపిమ్మటఁ గదా, రెండవ పెండ్లినిగూర్చి చెప్పవలయును.

నటి— అట్లయిన నేను పెండ్లినే యెఱుఁగనిదాననని యా, మీయభిప్రాయము!

సూత్ర- నిశ్చయముగా, మున్నాటికి నీ విప్పట్టునఁ దెలియనిదానవే యేమంటివా? ఈపెండ్లి లోకముతోఁబాటిది కాదు. లేనిపోని ప్రశ్నలు వేయక వినుము.

నటి— అవహితురాలనై వినుచున్నదానను. ఆనతిండు.

సూత్ర— గీ. నారదుఁడు విష్ణుమాయచే నారి యగును
పిదపఁ దాళధ్వజుండను పేరి నృపుని
వలచి పెండ్లాడి సంసారవార్ధి మునిఁగి
తుదకుఁ దనరూపుఁ దాఁ గాంచుఁ దోయజాక్షి !

నటి— ఆశ్చర్యమాశ్చర్యము ! తరువాత నేమి జరుగును ?

సూత్ర— ఇది యొక పెండ్లివృత్తాంతము. ఇఁక రెండవపెండ్లి కత వినుము.

సీ. పర్వతుండను తనభాగినేయుండును
దానును ద్రిజగతీదర్శనేచ్ఛ
నటు నిటుఁ దిరుగుచు నంతట వార్షిక
దినములు చనుదేర దేవమాని
సృంజయుండను రాజకుంజరు గృహమున
నా నాల్గుమాసము లతని కోమిరె
మదయంతి పరిచర్య లాదవింప నివసించి
తన గానవిద్య న వ్వనితఁ గరఁచి

గీ. పర్వతుని శాపమునఁ గీశవక్త్రుఁడయ్యు
విద్య నెఱిఁగిన యక్కన్నె పేర్మి కలిమి
నాపెఁ బెండ్లాడి తుదకు శాపావసాన
మగుడు సుందరుఁడై ముద మంది యుండె.

నటి— నాథా! వినినకొలఁది సంశయములు మెండగుచున్నవి. పర్వతుఁడు మేనమామ యగు నారదు నెందులకు శపింపవలెను? మరల శాపావసాన మెట్లయ్యెను? నా కివి యెల్ల వివరించి వచింపుఁడు.

సూత్ర— ఓహో! మన యుత్తర ప్రత్యుత్తరములతోడనే రాత్రి సమాప్త మగునట్లున్నది. తినఁబోవుచు రుచు లెందుకు వినవలెను? అన్ని సంశయములను నాటకమే తీర్పఁగలదు గాని నీ కృత్యమును నీవు నెఱవేర్చి కొనుము.

నటి— చిత్తము.

గీ. అళుల నాదంబు మందరమై చెలంగఁ
బరభృతధ్వని పంచమ ఫణితి నొనర
కేకికేకలు షడ్జంబు డాక నెఱప
గాయని విధాన మాధవ శ్రీ యెసంగె.

సూత్ర— బాగు, బాగు. నీ గానము కేవలస్వరములతోఁ గూడి నిరర్థకము గాక ప్రకృత పాత్రప్రవేశమునకుఁ గూడ సూచకమైనది. ఇఁక మన మరుగవచ్చును, రమ్ము.

నటి— నాథా! కవు లెవరో చెప్పరైతిరే, మఱచిపోతిరా యేమి!

సూత్ర— నీ విదివఱకనేక పర్యాయములు వినియున్న పేరులే కదా యని యుపేక్షించితిని.

నటి— తిరుపతి వేంకటేశ్వరులేనా యేమి?

సూత్ర— అవును.

నటి— అట్లయిన వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు పదుండు. (నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

(అంత సనకసనందనాదులతో లక్ష్మీనారాయణులు ప్రవేశింతురు)

నారా— దేవీ! ఏదో యడుగఁ దలఁచి యూరకొన్నట్టు లున్నావు?

లక్ష్మి— నాథా! అడుగుట కేమున్నది, దేవర తప్పులు క్షమించి యవధరింతురేని చిరకాలమునుండి కల యొక సంశయమును మనవి చేసికొనుచున్నదానను.

నారా— అవశ్యముగా నడుగవచ్చును.

లక్ష్మి— దేవా! వేదాంతము లన్నియు దేవరకన్న నెక్కువయగు వస్తువు లేదని యుద్ఘోషించుచుండును గదా! తాముగూడఁ దపం బప్పుడప్పుడు చేయుచుందురు. అందు ధ్యేయ మెయ్యదియో యని శంకించెద.

ముని— (తమలో) అవును. ఈవిషయము ముఖ్యముగాఁ దెలుఁ దగినదియే ఈప్రశ్నము కడు రమణీయము. ఇందులకు స్వామి యేమి యుత్తర మిచ్చునో?

నారా— దేవీ! ఈ ప్రశ్నమ్మ నొకనాఁడు మన కొమరుండగు చతుర్ముఖుఁ డడిగినప్పుడే నిట్లుత్తరమిచ్చితి, నది వినుము.

ఉ. ఈవు సృజింతు వంచు మఱి యేఁ గరుణించి భరింతు నంచు గౌ
రీవిభుఁ డాగ్రహమ్మున హరించు నటంచు జనుల్ వచింతు రీ
త్రోవలు తప్పుత్రోవలు బుధుల్ మనలన్ సృజియించె నొక్క తే
జోవతి యాదిశక్తి యనుచున్ వచియింతురు గాదె పుత్రకా!

మ. సిరిసాంగత్యము గోలుపోయి సుఖముల్ చేసేత వర్జించి సూ
కరకూర్మాంబుచరాదితుచ్ఛకలుషాకారమ్ములం దాల్చి సం
గరముల్ సేయుచు బాములం బడుచు నజ్ఞానాబ్ధి నోలాడఁగాఁ
బరతంత్రుండను గాక యున్న నది నా ప్రారబ్ధమా? పుత్రకా!

మునులు— దేవా! తాము పరతంత్రుల మని సెల విచ్చుచుంటిరి కదా! ఆ పరవస్తు వెట్టిది?

లక్ష్మి— అదియే తేలవలసి యున్నది.

నారా— ఆ వస్తువు శక్తియని యిదివఱకే చెప్పితిని. ఆ వస్తు మహత్త్వము

చెప్పుటకు నాకు సామర్థ్యము లేదు. అయినను మీ రడుగుచుండుటం
జేసి వలసినంతవఱకు సంగ్రహముగాఁ జెప్పెదను.

—. శక్తివిహీనుఁ డేపనికిఁ జాలఁడు శక్తియ సర్వభూతసం
సక్తత చెంది సర్వకృతిసాధనమై తనరారుచుండు నా
శక్తియ ముక్తికారణము శక్తియ సర్వము శక్తి లేనిచోఁ
శక్తులు గారు రుద్రహరిసారససంభవముఖ్యనిర్జరుల్.

అని విజ్ఞాను లగు బ్రహ్మవేత్తలు వచింతురు.

(అంత వీణ చేఁబూని నారదుడు ప్రవేశించును.)

నార- శ్లో. బాలం సమస్తజగదాలంబ మంబుధరనీలం బలారివినుతం
లోలంబజాలసమవాలం కనత్కనకచేలం కుచేలవరదం
గోలంపటం వినుతశీలం లసత్తిలకఫాలం సురారిజనతా
కాలం మునీశసురసాలం రమాయువతిలోలం సదా హృది భజే.

(పరిక్రమించి) అప్పుడే వైకుంఠమునకు వచ్చితిని. అదుగో, శ్రీహరి
శ్రీమహాలక్ష్మితోఁ గూడి సనకసనందనాదులతో నేమో యుపన్యసించు
చున్నాఁడు. దగ్గఱకుఁబోయి నమస్కరించెదను. (ప్రవేశమునటించును.)

లక్ష్మి— (దిగ్గున లేచి లోపలికిఁ బోవును)

నార— (నిల్చి తనలో)

క. ఏమీ, ననుఁ గనినంతనె
పామరుఁ డని యెంచెనొకో పద్మాలయ! యిం
కే మని తలఁచెనో ? లోనికి
నామొగముం గనినయంతన చనియె నకటా !

సీ. శ్రీహరినామంబు చింతసేయుటతప్ప
నెఱుఁగ నైతిని నన్య మించుకేని
భగవంతులీలలు పాడుచుండుట తప్పఁ
గలనైన నన్యమ్ముఁ గాంచ నైతి
లోకేశుమహిమ మాలోకించుటయె తప్పఁ
జూడ నైతిని వేఱు సోయగములు
పరమాత్మపదములు భజనసేయుట తప్ప
నరయ నైతిని దైవతాంతరముల

గీ. నకట! యిటువంటి పరిశుద్ధు నాత్మవేత్త
బ్రహ్మచారిని బరమపావనుని నన్నుఁ
గాంచినంతన యీయమ్మ కలుషుఁబోలె
నీసడించునె ? యిది సైఁచు టెట్లునాకు ?

కానిమ్ము, శ్రీహరి యిందుల కేమి సమాధానము చెప్పునో వినవలయును. ఎంత గొప్పయింటి వారలైనను నెట్టి మహామహులు చేపట్టినను స్త్రీలు స్వతస్సిద్ధమైన యవివేకమును బాయఁ జాలరు. అట్లే కానిచో,

గీ. రత్నముల పుట్టినిల్లు సంద్రమ్ము, దానఁ
గల్పకాదులు సోదరుల్ గాఁగఁ బుట్టి
యాదిదేవునిఁ జేపట్టి యకట! యిట్టి
వట్టి జెట్టిద మిటఁ గనుపట్టనేల?

(యోజించి) అవును, దీనికిఁ గారణము నిక్కముగా నిదియే కావచ్చును.

గీ. విషమునందుండి వేలుపువెలజెలఁదుల
తోడ నీయమ జనియించెఁ, దోడఁబుట్టు
వుల గుణం బొక్కటేనియుఁ గలుగకున్నె!
పరపరాభవ మప్సరోవ్రతమకాదె.

(యోజించి) అప్సరస్త్రీలకు నితరులఁ బరాభవించుట మాత్రమే వ్రతము గాని యీమెకుఁ బరులలో నుత్కృష్టులను బరాభవించుట ముఖ్యవ్రతము. అట్లు కాదేని,

చ. పరమతపోధనుల్ పతితపావను లుత్తమవంశ్యులుఙ్ గళా
కరులు యథార్థవక్తలు మఖవ్రతనిష్ఠులు దీనపోషణా
దరులగు విప్రులఙ్ విడిచి తక్కరులఙ్ భజియింపనేల? యీ
సిరి కిది క్రొత్తయే? సహజచేష్టయె; యింత యెఱుంగరే బుధుల్?

మహానుభావులగు విప్రుల నవమానించుటకుఁ గారణము భర్తచే నడుగంబడి యొకప్పు డీమె యిట్లు నిష్కర్షగాఁ జెప్పినదఁట.

సీ. మునినాథుఁ డొక్కండు మున్ను నా తండ్రిని
నపరాధిని బట్టి యట్టెమ్రింగె
నందఱు విప్రులు నాబాల్యముననుండి
నాకోడలిని వదనముల నుంతురు
శివపూజ కని ప్రతిదివసమ్మునను మద్గృ
హమ్ము లెన్నిన్నియో వమ్మొనర్తు
రివి సహించినను నిన్నెవ్వఁడో యొకవిప్రుఁ
డతికోపియై పదాహతు నొనర్చె

గీ. నిన్ని హేతువులంబట్టి యేను విప్ర
జాతుల గృహమ్ములకుఁ బోవ సమ్మతింపఁ
బుట్టినింటికి నత్తింటి కిట్టి జెట్టి
దము లొనర్చిన విప్రులఁ దలఁప రోఁత.

కానిమ్ము, పరమభక్తుఁడ నని యేనిఁ దలఁపక నా కిట్టి పరాభవముఁ జేసినదికదా! ఈమె కెట్లైన శ్రీహరిచేఁ బరాభవము గలిగింపఁ జాలక పోదునా? (సమీపించి ప్రకాశము) దేవా! నమస్కారము.

నారా— కళ్యాణం భూయాత్.

ఉ. ఎక్కడనుండి రాక? యిట కేటికి వచ్చితి? వింతకాల మీ
వెక్కడనుంటి? వెయ్యెడల నెట్టి విశేషము లుప్పతిల్లె? నీ
వొక్కఁట నుండ కెల్లెడల నూరక త్రిమ్మరువాఁడవౌట నీ
కెక్కత లేనియుం దెలియు నేదియు నేని వచింపుమీ మునీ!

నార— (వినయముగా) దేవా! దేవర కెఱుఁగరాని విశేషములు నా కెట్లు తెలియనగును!

ముని— (తమలో) ఇయ్యనఘుఁ డేమో కొంచెము వేఱురీతిగాఁ దోఁచుచున్నాఁడు.

నారా— (తనలో) ఈతని దృష్టియుం దేమో కొంచెము కోపరస మొలుకుచున్నది. (ప్రకాశము) నే నెఱిఁగిన విశేషములే యైనను నీ మొగమ్మున వినుటకుఁ గుతూహలపడుచున్నాఁడను.

నార—(తనలో) నాకు లక్ష్మి యొనర్చిన పరాభవముచే మనమునకు స్వాస్థ్యము బొత్తిగాఁ గానరాకున్నయది ఇట్టియెడ ని య్యనఘునకు నే నేమి చెప్పి యానందింపఁ జేయఁగలను. "స్వస్థే చిత్తే బుద్ధయ స్సంభవంతి" మనస్స్వాస్థ్యము లేనివాఁ డెందులకును గొఱగాఁడు. (ప్రకాశము) దేవా! నా మనమునకు స్వస్థతలేని హేతువుచేఁ జెప్పవలసిన విశేషము లనేకము లున్నను నేనిప్పుడు మనవి చేయఁజాలను.

ముని— (తనలో) మన మనుకొన్న మాట నిక్కమే యైనది.

నారా— నిత్యానందివగు నీకును మనోవైకల్యమా! అందులకుం గారణమేమి?

నార— (తనలో) ప్రసక్తి వచ్చినప్పుడు విడిచిపెట్టఁ గూడదు.

గీ. అవసరమ్మునఁ జెప్పిన యట్టి మాట
గుణగణవియుక్త మయ్యును గణుతి కెక్క
పయనపుం దఱి వామపార్శ్వమున నున్న
గర్దభ మొనర్చు నఱపులు గను హితములు.

(ప్రకాశము) జగన్నాథా! అడిగితిరి గాన మనవి చేసికొనుచున్నాఁడను. (గర్వముతో)

క. విటుఁడనొ, ధూర్తుండనొ! నే
జటిలుఁడ జితమాయుఁడఁ బ్రశస్తహృదయుఁడం
దటుకున ననుఁ గని చనె లో
గిఁటిలోనికి లక్ష్మి; యదియుఁ గీర్తిద మగునే!

ఇం దేమైనఁ దప్పు లున్న మన్నింప వేఁడెదను.

నారా— (తనలో) ఏమీ, యీతని గర్వము! "మాయను జయించినా" నని కూడఁ జెప్ప మొదలిడెనే! అవును. ఇం దితని తప్పేమున్నది? ఇది జగత్స్వభావమై యున్నయది.

గీ. ఏవియో రెండుముక్కల నెందొ నేర్చి
యంతలోనన సర్వజ్ఞు లగుచునుంద్రు;
కాకయున్నను మాయనే కడకుగెల్చె
నేమి యీముని! యౌరౌర, తామసంబు!

(ప్రకాశము కోపముతో) ఏమీ, నీవు మాయనే గెల్చితివిగా!

నార— (తనలో) ఏమి చెపుమా, యితఁ డిట్లడుగుచున్నాఁడు? (ప్రకాశము) ఏమి, స్వామీ! తా మట్లు సెల విచ్చుచున్నారు!

నారా— ఏమనియా, నీమాటలు కడు విచిత్రములుగా నున్నవి.

క. పతిఁదక్క నన్యసన్నిధి
సతి నిలువం దగదు నీతి చందం బిది; యే
మతిమంతు లైన మాయా
గతికిఁ లోఁబడక యుండఁగాఁ గలరె? మునీ!

"ఆమె లోని కరుగుటకుఁ గారణ మేమి?" యని యడుగుట యనవసరమే యైనను దాని గూర్చి నే నంతగాఁ జర్చింపను. ఆమె నీయెడ మఱియొక దురభిప్రాయము నొడియుండు నని నే నూహింపఁ జాలను. నీవు మాయను నిర్జించితి నంటివే, యది యెట్లు?

క. జితమారుతులుఁ సాంఖ్య
స్థితివేత్తలునైన మునులు దేవతలును ద
గ్గతు లగుచు నుండ మాయా
గతి గీతజ్ఞునకు నీకుఁ గడవఁ దరంబే!

నీ వెట్లు గెల్చితివో కాని యిప్పటికి మే మమ్మాయను గెలువలేదు. పరికదా, దాని స్వరూప మిట్టిది యని కూడఁ దెలియఁ జాలము.

గీ. ఏను బ్రహ్మయు శివుఁడును నిద్ధతేజు
లైన సనకాదులును తదధీను లౌట!
దేవతిర్యఙ్మనుష్యాది దేహధారు
లం దెవఁడు దాఁటు నమ్మాయ ననుపమేయ?

నార— (తనలో) ఏమి! స్వామి యిట్లు సెలవిచ్చుచున్నారు. మాయను గెల్చు టంత దుస్తరము కాఁబోలును. అదిగాక 'గీతజ్ఞునకు నీ' కని యాక్షేపించినారు. ఈ గానవిద్య యంత గర్హ్యమై యుండునేమో! ముందు దీనిం గూర్చి కనుఁగొని పిదప మాయా విషయమై యడుగుదుం గాక. (ప్రకాశము) స్వామీ! మీరు నన్ను గీతజ్ఞుఁడని యాక్షేపించితిరి కదా, యిది చిరకాలమునుండి తామందఱును సమ్మానించుచుండి రను కారణమున నే నిద్దానియం దభిమానము గలిగి వర్తించుచున్నాఁడను. మీ రీసడించిన యీవిద్య నా కేమిచేయుటకుఁ బనికివచ్చెడిని? ఇదిగో! నీ వీణ నిక్కడనే పగులఁ గొట్టుచున్నాఁడను. (వీణ బద్దలుగొట్టుకొనఁ బోవును)

నారా— (చేయి పట్టుకొని) నారదా! గానవిద్య మంచిది గాదని నా తాత్పర్యము గాదు. అయ్యది మాయను మఱెంత వృద్ధిపరచునేమో కాని యణఁగింప నేరదు. ఇదిగాక యీ విద్య నిత్యవ్యభిచారిణు లగు నచ్చరల చేఁజిక్కి యుండుటచే నిద్దానియం దలపడువారు గూడఁ దఱచుగా వారలకుఁ జేఁజిక్కవలసి వచ్చుచుండును. అక్కతముననే గాయకులం జూచుటకుఁ బతివ్రతాంగనలు సంశయింతురు. ప్రకృతము శ్రీదేవి కూడ నిందులకే సంశయించెనని తోఁచుచున్నది.

ఉ. నీవటువంటివాఁడ వని నేను వచింపఁ జుమీ యమీంద్ర! స
ద్భావుఁడ వీవు నిన్ను బలెఁ బల్వురు గాయకు లుండఁ బోరు; కా
మావిలచిత్తులై చెడెడియట్టిరె గాయకులెల్ల; నింతె కా
దీ విషయంబు జ్ఞానమున కించుకయుం బని సేయ దెయ్యెడన్.

క. ఎంత స్వరవేత్తయైనను
నెంతటి లయవేదియైన నేమిఫలము? జ
న్మాంతము నొనర్చు జ్ఞానము
సుంతైనను దెలియఁడేని శుద్ధుఁ డెటులగున్.

నీ వీవీణియయందు సామవేదంబును గృషిచేయుటం బట్టి యితరుల వలెఁ గాక గౌరవార్హుండవే యగుటకు సంశయములేదు. కావున నీవీ విద్యను వీడకుము.

నార— (తనలో) అవును. స్వామి సెలవిచ్చిన సంగతి కడు హితముగా నున్నయది.

క. ఎందుకు జన్మించితిమో ?
ఎందుల కేగెదమొ ? మరల నేమగుదుమొ ? యీ
చందంబు దెలుప నేరని
పంద కళలవలన నెంత ఫలముం గలదే.

(ప్రకాశము) దేవా ! నన్ననుగ్రహించి మాయ యన నెట్టిదియో నాకుఁ బ్రత్యక్ష ప్రమాణముగాఁ జూపి నన్నుం గృతార్థు నొనరింప వేఁడెదను.

నారా- ఆ. వె. మాయఁ జూడ నీకు మదిఁ గట్టిగాఁ గోర్కె
గలిగె నేని రమ్ము కనఁగఁజేతు
నజతనూజ ! మాయ నరయంగఁజేసిన
పిదప దానికతన బెదరెదేమొ ?

నార— స్వామీ ! నేను బెదరెదనని తాము లేశమును సంశయింపకుఁడు.

క. సింగంబో, వ్యాఘ్రంబో ! సి
వంగియొ, శరభంబో! లేక పామో, బామో!
యంగజజనకా ! మాయ య
వంగా నెట్టిదియొ ? నేఁ గనంగా వలయున్.

నారా— (తనలో) పాపము ! ఈతఁ డజ్ఞానముచే నిట్లు కోరుచున్నాఁడేకాని యనుభవసమయమ్మునఁ గడుఁ గష్టముల పాలగును. ఈతండు బ్రహ్మచారి యగుటచే సంసారము తెలియంగలుఁగఁడు. అయ్యది,

ఉ. సింగముకన్నను గడుఁ గుచేష్ట లొనర్చును కార్ముకంబు క
న్నం గడు భీతిఁ గొల్పు ఫణినాథునికన్నను గ్రూర మౌ ; దవా
గ్నిం గడలిన్ భయంకరవనిం దరియింపఁగవచ్చు నిచ్చ దాఁ
టంగలవార లుండిరె జడంబగు సంసరణంపు సంద్రమున్ !

(ప్రకాశము) ఇప్పుడే పోవుదము రమ్ము. మాయం జూపించెదను.

నార— మహాప్రసాదము. అనుగ్రహింపఁ బడితిని.

(అందఱును నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
అనర్ఘనారదమునందుఁ బ్రథమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# అనర్ఘనారదము

## ద్వితీయాంకము

(అంత నారదనారాయణులు ప్రవేశింతురు.)

నార— (తనలో) ఏమో యీమహామహుఁడు నన్నూరకయే త్రిప్పుచున్నాఁడు! ఈ దేశము లన్నియును నే ననేక పర్యాయములు చూచినవే. (దృష్టిని గుడ్చి) అదిగోఁ, గాన్యకుబ్జపట్టణము. (ప్రకాశము) దేవా! మాయ యిఁక నెయ్యెడఁ జూపించెదవు?

నారా— (తనలో) ఇతనికిఁ గడుఁ గుతూహలముగా నున్నది. పాపము! ఎంత యజ్ఞానమో కదా! (ప్రకాశము) మాయ యన వేఱుగా నున్నదియా? ఈ ప్రపంచ మంతయు మాయయే.

ఆ. వె. నిన్న నున్నవాఁడు నేఁడు లేకుండుట
నేఁటివాఁడు ఱేపు చేటు గనుట
ఒకఁడు సంతసించు టొకఁడు దుఃఖించుట
కన్న మాయయంచుఁగలదె జగతి ?

నార— (తనలో) ఓహో! యితఁడు నన్ను వృథాగా భ్రమ పెట్టినాఁడే! ఈమాత్రమున కింత త్రిప్పుట యెందులకో? (ప్రకాశము) స్వామీ! అట్లయిన నీ పాటికి మరలి పోవుదమా? ఇప్పుడు తాము సెలవిచ్చినదియే మాయయైన నే నిదివఱకే యెఱుఁగుదును.

నారా— (తనలో) ఔరా, వహ్నిలోఁ జొరఁబడఁ గడంగు శలభంబుకరణి నీతఁడెంత తుందుడుకును జెందుచున్నాఁడు! (ప్రకాశము) పోవుదము గాని యీ యెదుటం బొడకట్టు తటాకము దరి కరిగి దాని రామణీయకము గనుంగొని యయ్యెడఁ గృతస్నానులమై పిదపఁ బోవుదము.

నార— చిత్తము (పరిక్రమింతురు.)

నారా— (చేత నిర్దేశించి)

క. నారద! కనుఁగొంటివె, క
హ్లారచ్ఛన్నంబు సారసారావరసో
దారంబు స్వచ్ఛనీరం
బై రంజిల్లు నాతటాక మప్రతిహతమై. (కొంతవఱకు నడిచి)

క. అరసితె? సాధులచిత్తము
కరణిన్ స్వచ్ఛమ్ములగుచుఁ గ్రాలెడిఁ గంజా
తరజఃపరిమళపరిచితి
సురుచిరములు జలము లిందుఁ జూపఱు వొగడన్.

నార— (సంతోషముతో) దేవా! చూచితిని,

చ. కలువలు కన్నులై వికచకంజగణంబులు మోములై కన
త్సలిలము దేహకాంతి యయి చక్రియుగంబు లురోజయుగ్మమై
యల లలరారునట్టి వళులై కమఠాళి పదంబులై సర
స్సలరుచునుండె స్త్రీజనమయంబొకొ నాఁ జను మేటిసంపదన్.

నారా— (తనలో) ఔరా! పరమవిరక్తుండగు నిమ్మౌని యొనరించిన వర్ణనము భావిగతిసూచకం బగుచున్నయది. లేనిచో నితని కిట్టి వర్ణన మేల స్ఫురింప వలయును? (ప్రకాశము) సెబాసు! నారదా, సెబాసు! చక్కఁగా నుత్ప్రేక్షించితివి.

ఆ. వె. అబ్జసూతి తనకు నంగనాసృష్టికి
వలయు పరికరంబు గలయ నొక్క
యెడలఁ గూర్చుకొనఁగ నెంచి పుట్టినయింటి
చక్కఁజేర్చె ననఁగ సరసు వొల్చు.

నార— దేవా! అటు తిలకింపుము.

క. అమృతమున కంచు నమరులు
సముద్రము మథించి మిగుల శ్రమఁజెందిరి యీ
యమృత మమృతమ్ము గాదొకొ!
యమరత్వ మొసంగఁజాలదని యెంచిరొకో! (పరికించి)

ఆ. వె. కల్హారమ్ము సారెసారెఁ గాంతాజనంబుల
[illegible] బుద్ధిపూలలోని రొక్కతె
యీసరోవరంబు నెల్లెడ వేలకొ
లంది పద్మినులు ముకుంద కంటె!

నార— (తనలో) సర్వథా యితని యిప్పటివైఖరి భావిసూచకముగానే చూపట్టుచున్నయది. (ప్రకాశము) అవును. ఇయ్యది నీవనినట్లు స్త్రీమయముగానే కన్పట్టుచున్నది. ఇందు స్నానం బొనర్చి యమృతోపమానంబు లగు నిందలి జలంబులం గ్రోలి యరుగుదము.

నార— చిత్తము. (సరస్సులో దిగి మూఁడు మునుఁగులు మునిఁగి స్త్రీయగును.)

నార— (చూచి తనలో) ఏమి, యీ సౌందర్యవిశేషము! ఇతఁడు నారదుఁడే యని యెఱిఁగిన నాకే యింతయాశ్చర్యముగా నున్నదే. మేలు, మేలు! ఈ యబలం గొన్నవానిదే యదృష్టము.

మ. ఎవనిన్ ధన్యునిఁ జేయ నున్నదియొ! తా నెవ్వాని కారుణ్యమున్
గవిపర్ణ్యం బొనరింప నున్నదియొ? యే కాంతాశిరోరత్నమున్
సపత్నిగ యడికింప నున్నదియొ? యేపారజ్ఞసంసారసా
రవిహీనత్వముఁ బాపనున్నదియొ? నేరం బోల దూహింపఁగన్.

(ధ్యానము నటించి) అవును. ఈ కాన్యకుబ్జపురాధీశ్వరుం డగు తాలధ్వజుం డిప్పుడే యిచ్చోటకు వచ్చి యీమెం జూచి మోహింపఁ గలఁడు. ఇది మొదలీమెకు సౌభాగ్యసుందరి యను నామము చెల్లుం గాక. (నారదుని వీణయును కృష్ణాజినమును బుచ్చుకొని) నే నిప్పటికిఁ బోయి మరల నవసరమగుతఱిఁ బొడసూపెదం గాక. (నిష్క్రమించును)

సౌభా— (సరస్సునుండి బయటికి వచ్చి ఆశ్చర్యముతో) నేను స్నాన మొనరింప నెప్పుడు దిగితిని! (చేత శరీరము స్పృశించి) నేను నీటనుండి వెలువడితిని గదా! దేహమునఁగాని వస్త్రమునఁగాని యెక్కడను తడి గానరాదే! (నలుదెసలు పరికించి) నే నెవతెనో! నామనస్సులో నేమేమో వింతకోర్కెలు పుట్టుచున్నవి! (తలవంచుకొని) అయ్యవి తలంచుకొన్న నాకే సిగ్గగుచున్నది. ఇఁక నితరుల కెట్లు చెప్ప నొప్పును! (ఇటు నటు చూచి) ఒకవేళఁ జెప్పుదమనుకొన్నను ఇక్కడ నెవరున్నారు? (పరిక్రమించి భయముతో) ఇది యంతయు మహారణ్యమే! (విచారముతో) ఏమిగతి? ఎవరు దిక్కు? ఏమిసేయుదును? (బెదరి) అదిగో! యొకపులి యటువోవుచున్నది. అది నన్ను మ్రింగునేమో కదా! (ధైర్యముతో) "యావజ్జీవం తావ చ్చికిత్సా" కావున నీపొదరింట దాఁగి ప్రాణములు కాపాడికొనియెదను. (అట్లొనరించి) హా! పులి యీదిక్కునకు రాక యెటకో పోయినది. భగవంతుఁ డెల్లయెడలఁ గాపాడుచునేయుండును. కానిమ్ము నే నెవరో కొంచెము యోజించికొని చూచెదను. (యోజించి) కొంచెమేని బోడకట్టకున్నదే!

కారణ మేమై యుండునో? (తనయవయవములవంకఁ జూచుకొని) యోజింపఁగా నిప్పటికిఁ గొంత పాదుకట్టినది. ఈతటాకమే నాకు జననియై యుండ నోపును. ఇఁకఁ దండ్రి యెవఁడో తెలియవలెను. తల్లిని గనుఁగొన్నఁ జెప్పక పోవునా? (తటాకముదిక్కు బిగ్గఱగా) అమ్మా, సరోవరమా! నీకు నమస్కారము. నే నెవతెను? నా పేరేమి? నన్ను నీవెట్లు గంటివి? నా తండ్రి యెవరు? నన్నింతకాలము నీలో నుంచుకొని యిప్పుడేల వెడలఁ గొట్టితివి?

(తెరలో) నీపేరు సౌభాగ్యసుందరి. తక్కినసంగతులు నాకెఱుక లేదు.

సౌభా— (విని) నాకు నామకరణము మాత్రమాకాశవాణి చేసినది. కానిమ్ము. ఈపేరు జ్ఞాపక ముంచుకొనవలెను. సౌభాగ్యసుందరి (అని మూడుమార్లు పలికి ఆకాశము చూచి) అప్పుడే చంద్రోదయమైనదే! సూర్యాస్తమయ మెప్పుడైనదో! (యోజించి) ఇది కల గాదుగదా! కలయే యైన నీతెలివి యెట్లు? ఏమీ! కలలోమాత్రము తెలివి యుండదా? నాటకములో నంతర్నాటక మున్నట్లు స్వప్నములో నంతస్స్వప్నమును ఆ యంతస్స్వప్నమున మఱియొక యవాంతర స్వప్నమును దాన మఱియొకటియును గూడఁ గన్పట్టును. అవును. సరే! నేను నిన్న నెవరో యెక్కడ నుంటినో నా చరిత్రము రవంతయును తెలియదే! నాకీస్వప్నాద్యనుభవ మెట్లు కలిగినది? (విసుకుట సూచించి) ఇది యంతయు నయోమయముగా నున్నది. ఇందుం గుఱించి యోజించిన ఫలములేదు సరిగదా, పైపెచ్చు వెఱ్ఱిగూడఁ గలుగ వచ్చును. (ఆకసమువంకఁ జూచి) ఔరా, యీ వెన్నెల వేఁడిమి! సరే! ఇది వెన్నెల యని నాకెట్లు తెలిసినది. ఛీ! మనస్సు మరల నీ దిక్కుమాలిన విచారములోనికే పోవుచున్నది. (కోపముతో) ఏమో, యెట్లో తెలిసినది. హృదయమా! నీకీ విచారముతో నేమి యవసరము? "కాకస్య కతివా దంతాః?" కాకికి దంతము లెన్ని యున్నవి? ఎన్నియో యున్నవి. అది యనవసర విచారము. (యోజించి) నాకీ శ్లోక మెక్కడనుండి వచ్చినదో! (విసువుతో) ఓహో! బాగుగానున్నది, తిరిగియు నందులోనికే పోవుచున్నదే మనస్సు! ఇఁక నీ విచారణములోనికి రాక నా మనమునం బొడము వింతకోర్కుల నుపశమింపఁ జేయ యత్నించెద. (చూచి) ఆహా! ఆ లతామతల్లి యా భూజము నెట్లు కౌఁగిలించుకొని యానందించుచున్నదో! పాప మిది కేవలము ముగ్ధ. (పరికించి) ఇదియే కాదు. ఈ లత లన్నియు నట్టివే. అట్లే కాకున్న పృథాగాఁ గుజనుల నాలింగించికొని జన్మమును వమ్మొనరించుకొనునా? (చూచి) కుజనులు తప్ప

నియ్యెడ సుజనులు లేనే లేనట్టు లున్నది. కానిమ్ము. నా గతి నేను జూచుకొనవలెను. నే నెవరిం జెంద్లాడుదును? (తాపముతో) అక్కటా! ఇట్టి వెన్నెలరేలలో నిట్టి మలయమారుతము వృథాపుచ్చెడి కాంత దుర దృష్టవంతురాలు గదా! దైవమా! నన్ను సృష్టించినవాఁడవు నా కేదేని గతి గల్పింపవేని దయాళు వనెడి నీ బిరుదమ్మునకు భంగము వచ్చును జుమీ! ఇఁక నేను నిన్ను ధ్యానించుట తప్ప వేఱొక్క పని చేయను. నా కేదేని గతి కల్పింపుము. (కన్నులు మూసికొని ధ్యానము నటించును)

(అంత రాజును విదూషకుఁడును బ్రవేశింతురు)

రాజు — మిత్రమా!

క. కుడికన్ను కుడిభుజంబును
గుడితొడయును నదరఁ జొచ్చెఁ గ్రూరవనం బి
య్యెడఁ గలుగఁ దగిన శుభ మొ
క్కఁడు గల్గునె? దీని కేమి కారణ మొక్కో!

విదూ — కారణమునకై విచారింప నేల? వచ్చినది వేఁటకుఁ గదా? ఏదో మంచి పెద్దపులినో సింహమునో కూల్చెదవు.

రాజు — (నవ్వి) సఖా! ఈ నిమిత్తములకు దైవజ్ఞులు స్త్రీ సమాగమమును ఫల ముగాఁ జెప్పుదురు కదా?

విదూ — అవును. వారు చెప్పిన మాటలు మాత్ర మసత్యములా? కావు. ఏమం టివా? వేఁట దీరి యంతఃపురమునకుఁ బోవుమీఁద నయ్యాదియును దట స్థించును గదా!

రాజు — చెలికాఁడా! పరిహాసమును మాని యథార్థమును జెప్పుము. ఇందు లకు ఫలము నూత్నవధూ సమాగమ మనికదా శకునశాస్త్రమునందుఁ జెప్పఁబడినది?

విదూ — (కోపముతో) నీకు నూత్నవధూ సమాగమము కావలె నేమి? ఈ సం గతి యంతఃపురమునఁ జెప్పి ని న్నేమి చేయించెదనో చూడుము.

రాజు — మిత్రమా!

ఉ. తుమ్మెద క్రొత్తపూవులఁ గుతూహలముం గనునట్లు చిల్కమొ
త్తమ్ములు క్రొత్తపండ్లకు ముదంపడునట్లు పికావళుల్ రసా
లమ్ముల నూత్నపల్లవములన్ మది నించెడునట్లు పూరుషుల్
కొమ్మలయందు నూతనపుఁ గొమ్మలఁ గోరుట సాజమే కదా?

విదూ— పురుషులకుఁ గ్రొత్తక్రొత్త పడఁతుల్లఁ గోరుట సహజమేని స్త్రీలకుఁ గ్రొత్తక్రొత్త పురుషులను గోరుకొనుట మాత్రము సహజ మెందులకుఁ గాకుండును? వినలేదా? "పండుగనాఁడును ప్రాతమగఁడేనా?" యని వెనక నెవరో నీవంటి పతివ్రతాశిరోమణియే చెప్పినదఁట.

రాజు— ఛీ! మూర్ఖుఁడా! అది యెవతెయో దుశ్శీలయైన స్త్రీయై యుండును. పతివ్రతల ట్లెప్పుడును జెప్పరు.

విదూ— ఈమాటలు స్త్రీలు విన్నచో నేమందురో యెఱుఁగుదువా? "ఎవఁడో దుర్మార్గుఁడైన పురుషుఁ డిట్లు బహుస్త్రీలను జెందునే కాని యుత్తముఁడేక పత్నీవ్రతుఁడుగనే యుండు" నని నీబోఁటుల నీసడింతురు.

రాజు— నీ వనుభవజ్ఞుఁడవు కావు గావున నిట్లు వాదించుచున్నావు. ఏమంటివా,

చ. కరిణు లనేకముల్ కరి యొకండె మగం డగు వానికెల్ల; నం
బరమున నెల్లచుక్కలకు భర్త శశాంకుఁ డొకండె; గోవులున్
వరునిఁగఁ గోరు నొక్కవృషభప్రవరున్ శతసంఖ్య లయ్యు; నీ
వెఱుఁగనిమాట లాడెద విసీ! రసికుల్ నిను మెచ్చుకొందురే?

విదూ— (నవ్వి) నిజమైన రసికులు నన్ను విధిగా మెచ్చుకొందురు. నిన్ను మాత్రము విధిగా నేవగింతురు. నీ వేమో దృష్టాంతములు కుప్ప తెప్పలుగా నిచ్చితి నని యనుకొనుచున్నావు గాని యవి యన్నియును తెలివిలేని పక్షులును శుద్ధపశువులును జడములును గాని యం దొక్కటేని వివేకము గలది లేదు. కావున పశుప్రాయులగు పురుషులకేమి యట్టి స్త్రీలకేమి బహుసంబంధ ముండునుగాని వివేకులగు నిరువాగులకును నది దూష్యమని తేలినది. ఇక్కడికి నీకు వాగ్బంధ మయినదా? లేదా? చెప్పుము ఇహిహిహిహీ! నాతోఁ బెద్దపెద్ద పండితులే వాదింప లేరు, నీవు వాదించెదవేమి! తమాషా చూడు నా పాండిత్యము.

రాజు— (నవ్వి) మిత్రమా! నీ పాండిత్యము లోకోత్తరమైనదే సంశయము లేదు గాని యీ వనము నలుగడలు పరికించెదము రమ్ము.

విదూ— ఎందుకుఁ బరికించుట? ఈ ఘోరారణ్యమునఁ గొమ్మయేదేని దటస్థింప వచ్చు ననియేనా?

రాజు— (నవ్వి) అరణ్యములోఁ గొమ్మలకును గఱవే యగునా? కొమ్మలును గోఁతులును గూడఁ దామరతంపరగా నుండవచ్చును. మన మీ వనము రామణీయకము చూతము రమ్ము.

విదూ— అబ్బో! నా శాస్త్రమును దెలియ దనుకొంటివా యేమి? కొమ్మలన్నను గోతులన్నను గూడ స్త్రీవాచకములే. నీ కిక్కడ శాఖలును శాఖామృగములును కనుపట్టునే కాని స్త్రీలుమాత్రము కనుపట్టరు. ఇది ధ్రువము, పద. (పరిక్రమింతురు)

రాజు— (ఉత్కంఠతో) సఖా! ఆ రసాలశాఖలయందుఁ గూయుచున్న పికనికరముం జూచితివా?

విదూ— ఆ! చూచితిని. అవును. అది కపినికరమే.

రాజు— కపినికరము గాదు పికనికరము.

విదూ— అవును. నా కేమి కన్నులు లేవనుకొంటివా? ఇది పార్శీభాషా సంప్రదాయము. తలక్రిందుగాఁ జూచుకొనుము. కపి, పిక. తెలిసినదా?

రాజు— మిత్రమా! నీభాషాజ్ఞానము కడు విపరీతముగా నున్నది గాని, యాయెదుటఁ బొడకట్టుచున్న సరోవరము దరి కరిగి యందలి విశేషములఁ దిలకింతము రమ్ము.

విదూ— పద, ముందు నీవు త్రోవ తీయుము. తొ్రటితో దబ్బనముగా నేనును వచ్చెదను. (పరిక్రమింతురు)

సౌభా— (కనులు విచ్చి) అక్కటా! యెంతసేపు ధ్యానించినను నరణ్యరోదనమే యైనది కాని, యించుకేని లాభకారి కాదయ్యె; నేమి సేయుదును? (బిగ్గఱగా) ఓహో, దైవమా! నిష్కంటకమగు నీరాజ్యమునందిట్టి యన్యాయము జరుగ వచ్చునుగదా! ఇట్టి మహారణ్యమునం దుంచఁ దలంచుకొన్న నీవు నన్నుఁ బురుషునిఁగా నెందుకుఁ జేయవైతివి?

రాజు— (వినుట నటించి) మిత్రమా! నన్నాక్షేపించితివి. తుదకు నియ్యెడ నేదో స్త్రీకంఠము విన వచ్చుచున్నది.

ఉ. కోయిల కూఁతకుఁ జెమిలికూఁతలకుఁ జ్ఫుటవర్ణవైఖరుల్
పాయక యుండు టబ్బురము, భామినికంఠరవంబె కావలెన్;
డాయఁగ బోయి చూతము, తటాలున నేయెడకేనిఁ బోవునే
మో? యలినీలవేణి యెవరో? యిట కేమికతంబు వచ్చెనో?

విదూ— (తనలో) అవును. ఇతనియూహ చక్కఁగనే యున్నది. ఆధ్వని స్త్రీధ్వనియే యైనచో నాస్త్రీ యెవరై యుండునో? (యోజించి) వనదేవత కావలెను. లేనిచో నిట్టి సమయమున నిక్కడ స్త్రీ యెవ్వతె యుండఁ గలదు. (ప్రకాశము) మిత్రమా! నీ యభిప్రాయము చొప్పున నాధ్వని స్త్రీ కంఠధ్వనియే యైనను నాపె సామాన్యమైన యాఁడుది

కాదుసుమా ! ఒకవేళ నీకుఁగల యుద్రేకమును జూపెదవేని నిష్కారణముగా శపింప వచ్చును. ఆపె యెవ రనుకొంటివి? వనదేవత.

రాజు— పోనీ, ముందు నీవరిగి యెవరో కనుఁగొని వచ్చెదవా ?

విదూ— నాకుఁ బగలే యొంటరిగాఁ బోవుటకు భయము. అందులో రాత్రి యింకఁ జెప్పనే యక్కఱలేదు. ఆపె నిజముగా వనదేవతయే యైన నన్ను మ్రింగినచో నేమి సేయఁ గలను ? నే నొంటరిగాఁ బోనేరను.

రాజు— అట్లయిన నిరువురమును బోవుదము రమ్ము. (పరిక్రమింతురు)

సౌభా— (దుఃఖముతో)

ఆ. వె. తల్లి లేదు నాకుఁ దండ్రి యంతకు మున్న
లేఁడు చిన్నదాన లేఁడు భర్త
ఏల పుట్టవలెనొ ! యేమి కావలయునో !
యెఱుఁగ; దిక్కు నీవె యీశ నాకు.

రాజు— (ఆలించి) వింటివా ? ఆమాటలయందలి తాత్పర్యము చక్కఁగా విచారింపుము. ఎవరో యార్తురాలుగాఁ దోఁచుచున్నది. త్వరగఁ బోవుదము రమ్ము. (కొంత సమీపించి చూచి తనలో) ఔరా! యీచక్కఁదనము. (ప్రకాశము) మిత్రమా ! ఆలతాంగిం దిలకింపుము.

చ. అళికులమాలఁ బోలు కురులా ! విరిచేరులవంటి చేతులా !
మల కెనవచ్చు మేల్ జఘనమా ! లికుచమ్ములఁ బోల్కి చన్నులా !
మలఁచినసంకుఁ బోలు గళమా ! కలమంబులవంటి జంఘులా !
కలికి మెఱుంగుదీగె తళుకా ! కులుకారుసుధాప్రవాహమా !

విదూ— ఏమో, నీవే యడుగుము. రాజా ! ఈకన్యక సౌందర్యవతి యగుటకు సందియము లేదు. కాని బాగుగాఁ బరికించినఁ గొన్ని లోపములు లేక పోలేదుసుమా ! చూడు. నడుము బలిమి బొత్తిగాఁ గన్పడదు. ఊర్ధ్వకాయముయొక్క భారమునంతయు నాపఁ దిగినది కావున నడు మెంత పూటుగా నున్న నంతమంచిది కదా ? పరిశీలింపుము. పలువరుస యెంత సన్నముగా నున్నదో! పంటిబలిమి ముఖ్యముగా నుండవలెను. ఏమంటివా ? జీవనమున కెల్ల ముఖ్యమగు నాహారము పండ్లతో నేకదా నమలవలయును !

రాజు— (అనాకర్ణితముగా) సఖా ! నన్నే పోయి పలుకరింపు మందువా ?

విదూ— విధిగా నట్లేయొనర్పుము. దౌత్యములలో స్వయందౌత్యము కడు శ్లాఘ్యము.

రాజు— అట్లయిన నీవు చెప్పినట్లే చేయుచున్నాను. (సమీపించును)

విదూ— మిత్రమా! మాట. (చెవిలో నేమో చెప్పును)

రాజు— (నవ్వి) చెలికాఁడా! అంత యరసికుఁడ ననుకొంటివా! నే నెంత కామాంధుఁడ నైనను యుక్తాయుక్తము లెఱుఁగ నని యూహించితివా!

విదూ— ఏమో లే. "కామాంధానాం యుక్తాయుక్త వివేకశూన్యత్వాత్" అనియందురు గనుక నాకుఁ దోఁచినది చెప్పితిని.

రాజు— మంచిదే. నాహితము కోరినవాఁడవు కాన నుపదేశించితివి.

క. తనమనము తెలియ నీకయె
వనితాహృదయం బెఱుంగువాఁడె సుమీ! పం
చనఁ జేయ నేర్పు నతివల;
ననంగుఁ డేనియును బేలయై బెండుపడున్.

విదూ— పొమ్ము, కృతకృత్యుఁడవు కమ్ము.

రాజు— (సమీపించి) ఈమెతో నే మని మాటలాడుదును? ఏ మనిన నే మను కొనునో?

విదూ— (వాగల పంకఁ జూచుచుండును.)

సౌభా— (చూచి తత్తఱపాటుతో లేచి) ఏమీ! యీయనఘాత్ముఁ డెవ్వఁ డైయుండ నోపు! నాపాలిఁటి భగవంతుఁడే యగునా? ఆహా, యేమి యీసౌందర్యవిశేషము! నాకనులు మిఱుమిట్లుగొనుచున్నవే! ఎవరైన నేమి? ఇట్లు చేసెదను. (సమీపించి ప్రకాశము) దేవా! నమస్కారము. అనాథ నగు నన్ను మన్నించి మీ రెవరో యానతిండు.

రాజు— (తనలో) ఓహో, యేమి యీవినయము! ఈమె న న్నెవనిఁగా భావించియుండునో? (ప్రకాశము) మానినీశిరోమణీ! నేను తాలధ్వజుం డను రాజన్యుఁడను. ఈ సమీపమునం దున్న కాన్యకుబ్జపురము నారాజధాని.

క. నరసుందరివో? సురపం
కరుహాక్షివొ? నాగకన్యకామణివో? కి
న్నరమత్తకాశినివొ? యెం
టరివై యిట్లుంటి వక్కటా గజగమనా!

క. బాలవు యౌవనరూపవి
శాలవు నినుఁ జూచి మనము చంచలమై రా
గాలోలమయ్యెఁ, బెండిలి
కాలేదే నీకు నిజముగాఁ శశివదనా!

సౌభా— (తనలో) ఈతఁడు భగవంతుఁడు కాఁడు. భగవత్ప్రేరితుఁడైన న న్నుద్ధరింప వచ్చిన రాజన్యుఁడు. (సిగ్గుచేఁ దలవంచికొని సరోవరము చూచుచుండును.)

రాజు— (వ్యామోహములో)

ఉ. ఏమిటి కీసరోవరము నెల్లెడఁ గన్గొనె దో లతాంగి? నీ
కై మరు లూనినాఁడ, నను నారయ రాదె యొకింత ? ప్రాయపుం
గౌముది యారకే యడవిఁ గాసిన నేమి ఫలమ్ము ? కోమలీ !
నామది చల్లఁ జేయఁగ మనమ్మున సుంత యనుగ్రహింపుమా.

సౌభా— (సిగ్గుతో)

క. జననీజనకుల నెఱుఁగన్
నను నెవ్వం డీ వనమ్మున న్నిలిపెనో ? నే
ననద గతి దైవమున్ నె
మ్మనమున నమ్మి యిటు లుంటి మన్నింపు నృపా!

క. నీ యిచ్చవచ్చినట్టులు
న్యాయగతిన్ నన్నుఁ జూడు ; నాభాగ్యమె ని
న్నీయెడకుఁ దెచ్చె ; లేదే
నీ యడవిని నిట్టి సుకృత మెటు చేకూరున్.

విదూ— (పరుగుపరుగున వచ్చి) మిత్రమా ! ఏమి జరిగినది ? సంగతిసందర్భము లేమిటి ?

రాజు— (అనాకర్ణితముగా) సుందరీ ! నిన్ను న్యాయముగాఁ జూచితి నేని నన్ను వరించెద నంటివి కదా ! ఇదిగో, వినుము.

ఉ. పట్టపుదేవిఁ జేతు నిను భాగ్యము సర్వము నీయధీన మౌ
నట్టు లొనర్తు నీ విడెడి యాజ్ఞల నెల్లను మౌళిఁ దాల్తు నీ
పట్టికి రాజ్య మిత్తు నినుఁ బాయక యెల్లపుడుం జరింతు నే
నొట్టిడునాఁడ నిందునకు నొక్క లవమ్మును దాఁటకుండఁగన్.
(చేతిలో చేయి వైచును)

విదూ— "అనయో ర్దంపత్యో రన్యోన్యం ప్రీతిరస్తు. అష్టపుత్ర బహుధనమస్తు" పదండి, పోవుదము. ఇఁక నిక్కడ నెందులకు ? శేషహోమము నగరులోనే జరిగించుకొందురు గాక. (అందఱు నిష్క్రమింతురు.)

గద్య.

ఇది శ్రీ... తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
అనర్ఘనారదము నందు ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# అనర్ఘనారదము

---

## తృతీయాంకము

(అంత తుంబురుఁడు ప్రవేశించును.)

తుంబు— (తనలో) అక్కటా! నా ప్రియసఖుండు నారదుఁ డేమయ్యెనో గదా! ఎక్కడఁగ వెదకినను జతుర్దశభువనంబుల నొక్కెడ నేని గానరాఁడయ్యె. ఎన్నఁడును నన్ను విడచి యుండువాఁడు గాఁడు. ఆ నాఁ డేమికారణమో యొంటరియై పయనము చేసినాఁడు. ఏయరణ్యమ్మున నే మృగమ్ములచే నే మయ్యెనో? అమంగళము శాంతించుఁగాక! ఆకాశగమనంబు గల యయ్యనఘుని కట్టియాపద యెన్నటికిని రాఁగూడదు. (విచారముతో) సఖా, నారద!

ఉ. నీదగు పాటసొంపు మఱి నీస్వరకల్పన నీ లయశ్రుతి
స్వాదము నీవు పల్లవిని బాడెడి పొందిలి నీమగాత్రపు
న్నాదము పాటవేళ వదనంబునఁ బొల్చెడి నీదు మేల్మి యిం
కే దెసఁ జూడఁ గల్గు? గతి యెవ్వరు గానకళాలతాంగికిన్?

గానాభినయాది సకలకళావిశారదా, నారద! నీయంతేవాసినులగు నచ్చరల గతి యేమి చేసితివి?

సీ. రంభ నాట్యమున కారంభించి నిన్నెంచి
నిలువున నీరయి నెగులు సెందె
హేమ వీణియను వాయించుచు నిన్నెంచి
కడలేని దుఃఖాగ్నిఁ గరఁగఁ జొచ్చె
హరిణి రాగాలాప మారంభమును జేసి
నిన్నెంచి చూపుల నీరు నించె
శశిరేఖ యభినయచాతుర్యమున మించి
నిన్నెంచి కృశియించి వన్నె దరిగె

గీ. నెవరు పాడిన నింద్రున కించుకేని
హాయి లేదయ్యో నీకుఁ బ్రత్యర్థులైన
గాయకులుఁగూడ నీజాడ గానరామి
పగచుచున్నారు నీవంటివాఁడు లేమి.

గీ. కాంచి మెచ్చెడి వారలు గానరామిఁ
బోరుఁ జాలించుకొన్నారు శూరవరులు
స్వర్గపురమున లోగిళుల్ చవుకయయ్యె
నూతనులు రాని హేతువుచేత సఖుఁడ!

అక్కటా! నీవు నన్నేకాకిం జేసి పోతివిగదా! ఎంతెంత రహస్యమైనను సురేంద్రునకుఁ దెచ్చి చెప్పువా రెవ్వరు? మిత్రరత్నమా!

గీ. తనదు చెలికత్తె మహతి లేకునికిఁ జేసి
యీ కళావతి కళయెల్ల నింకిపోయె
శ్రుతి యొనర్పఁగ నాకు సమ్మతియె లేదు
నాదు సమ్మతికే, మిది నాదు నీదు!

ఎంతసేపు విచారించినను లాభము లేదు. నిన్నుద్ధరించనేని నా మైత్రి తగులఁబెట్టనా? మిత్రుఁడననేమి, సమసుఖదుఃఖభాగియే గదా! (యోజించి) ఇందులకుపాయ మేమి? ఇట్లగుఁగాక. సకలమాయావిశారదుం డగు శ్రీమహావిష్ణు నడిగి తెలిసికొనియెద. (ఆకాశగమనము నటించి) ఓహో! యీ యంబరగమన మెంత సుఖకరమైనది! (దృష్టినిగుడ్చి) భూలోకమ్మున నియ్యెడకుఁ దిన్నఁగా నొక ప్రోలు కన్పట్టుచున్నది. ఆ ప్రోలి సమీపమున నేదో యొక జెడిదం బగు సంగరము పరివర్తిల్లినట్లు కొన్ని గుఱుతులు చూపట్టుచున్నవి. (విచారముతో) పాపము! ఎవరో వృద్ధ దంపతులు శోకాకులమనస్కులై యటఁ బొడకట్టుచున్నారు. అక్కటా! ఈసంగరమున వీరిసుతులు కొందఱు మరణించియుందురు కాఁబోలును. పోనిమ్ము. ఆర్తధ్వని వినఁగూడదు. "సర్వేజనా స్సుఖినో భవంతు." మఱియొకమార్గమునఁ బోయెదను. (నిష్క్రమించును)

(అంత యథోక్తముగా తాలధ్వజుండును సౌభాగ్యసుందరియును బ్రవేశింతురు)

రాజ — దేవీ! యూరడిల్లు మూరడిల్లుము.

సౌభా — ఓహో, కొడుకులారా! అయ్యో, మనుమలారా! మీ రందఱు నొక్కసారిగనే మృతి నందితిరా!

రాజు — (విచారముతోఁ దనలో)

చ. అఱువది యేడు లాయెఁ గమలానన తా ననుఁ బెండ్లియాడి పొం
పిరిగను మేటి సౌఖ్యములఁ బెద్దయునుం దులఁదూఁగఁ గాని యీ
పరమపతివ్రతామణి లవంబును దుఃఖ మెఱుంగ దక్కటా!
తిరుగని దుఃఖ మిక్కరణి దేవునిచేత లభించె నేఁటికిన్.

ఎప్పటి కెట్టి గతి మూఁడునో తెలియదు గదా! (ప్రకాశము) ఓహో, కొడుకులారా! అయ్యో, మనుమలారా!

ఉ. ఎక్కడి మాయయుద్ధ, మిటు లేటికిఁ దాపుర మయ్యె? వార్ధకం
బక్కట! లేవఁ జాల, నిపుడా యిటువంటి మహావిపత్తు? నే
నెక్కరణిన్ సహింతు? సతి కేమని యూఱట చెప్పనేర్తు? నే
దిక్కును మొక్కు లేని గతిఁ దెచ్చితె, దైవమ! చూడ నోపమిన్.

దేవీ! దైవగతికి మన మేమి సేయఁగలము? ఊరడిల్లుము. ఇది యంతయు నఘటనఘటనాపటిష్ఠుండగు నమ్మహావిష్ణుని మాయ. దాని దాఁటినవాఁ డెవ్వండు?

(అంత వృద్ధబ్రాహ్మణ వేషముతో శ్రీవిష్ణువు ప్రవేశించును)

బ్రాహ్మ— (ఆదరముతో) పాపము! అందఱు నొకసారిగనే మృతినొందిరేమి? దైవగతి కడ్డువారెవరు? ఏల విచారించెదరు? విచారించిన లాభమేమి? గతజల సేతుబంధనము, రండు ఈ సమీపమున నున్న సరోవరమ్మున స్నానము లాచరించి తర్పణాంజలులు విడువుఁడు.

శౌభా— (తనలో) ఈవిప్రుఁ డెవ్వడో దుఃఖాబ్ధి మునిఁగి యున్న నన్నును నాథుని నోదార్ప వచ్చినాఁడు. (ప్రకాశము) అయ్యో! యెంత దుర్మార్గురాలనో, యెంత యాపత్తు భరించుచున్న దానను!

ఆ. వె. కొడుకులార! నాదు కడుపునఁ జిచ్చిడి
యడవి నిల్లు గట్టె యాత్మజాతు
లెల్లఁ దోడ రాఁగ నేగఁగఁ దగునె? దు
ర్వారమైన దైవవశము కతన.

బ్రాహ్మ— ఏమి యీ యజ్ఞానము! ఎక్కడి కొడుకులు! ఎక్కడి నీవు!

ఉ. ఏల విచారమంద? వినుమీ, యొక రొడ్లకు నేమి కావలెన్?
బోలఁగఁ జూడు నీ వెవతెవో? భ్రమగాక మఱెవ్వరీ సుతుల్?
కాలవశమ్మునన్ మృతిని గాంచినవారల కింత యేల? యీ
జాలము మాని స్నానమును సల్పి నివాపము నాచరింపుమా.

రాజు— దేవీ! ఇయ్యనఘుని యుపదేశముం బట్టి చరింతము. ఇది యంతయు విష్ణుమాయ. దానిచే నీ జగము పరిభ్రమించుచుండును.

బ్రాహ్మ-ఆ.వె. విష్ణు వేమిసేయు? విధి యేమిసేయును?
శర్వుఁ డేమిసేయు? జనుఁడు తనకుఁ
దాన బద్ధుఁ డగు నిదానంబు దెలియమి
సాలెపురువువోలె జనవరేణ్య!

నేనునునిట్టి కష్టములు పలుసారు లనుభవించితిని. పరిశీలించినచోఁ గష్ట మెఱుఁగని సంసారియే యుండఁడు. లెండు, సరసి యొడ్డునకుం బోవుదము. (పరిక్రమింతురు)

సౌభా— (దుఃఖముతో తనలో) అక్కటా! నే నెందుకు బ్రతుకవలెను. ఈ తటాకమ్మునం బడి ప్రాణములు విడుతునా? (యోజించి) బ్రతికి యున్న మంచి చెడ్డలం జూడవచ్చును. చచ్చి యేమి సేయఁగలను?

రాజు— (తనలో) ఈమె కడుదుఃఖసముద్రములో నున్నయది. ఏదేని సాహసము చేయునేమో? కాచికొనియే యుండవలెను.

బ్రాహ్మ-ఉ. స్నాన మొనర్ప విచ్చట మనమ్మున నెవ్వరి కేడ్చుచాన వో
మానిని? యెన్నిజన్మములు మాటికి నెత్తితో? భర్త లెందఱో?
సూనులుఁ దండ్రులున్ మఱియు సోదరు లన్యులు నెందఱైరొ? స్వ
ప్నానుగతిం జెలంగు భవమం దిటు భ్రాంతి వహించు టొప్పునే?
(చేయిపట్టికొని తటాకమున దింపును.)

(సౌభాగ్యసుందరి మునిఁగినవెంటనే నిష్క్రమించును.)

(ఆసరస్సులోనే నారదుఁడు పూర్వరూపముతోఁ బ్రవేశించును.)

నార— (శరీరమువంక చూచుకొని తనలో) ఎంతకలఁ గంటిని! (పరికించి) ఈవృద్ధరా జెవరు! ఓహో, యిది యేమో యింద్రజాలముగా నున్నదే!

చ. ఎవఁడను నేను? నారదుఁడ; నేటికి నీయెడ రాక? యిందిరా
ధవునికతమ్మునన్; మఱి పడంపడి వర్తనమేమి? యక్కటా,
శివశివ! నీట మున్గితి; విశేషము లాపయి నేమి? స్త్రీత్వమున్
దవిలితిఁ బెండ్లియాడితి ముదంబును ఖేదముఁ గూడఁ జెందితిన్.

(బయటికి వచ్చి తలవంచుకొని యేమో విచారించుచుండును.)

రాజు— (చూచి తనలో) అయ్యో! అయ్యో! నాభార్యయేమైనది! ఇందు మునిఁగినట్లున్నది. ఏమి గతి? ఔరా! ఆపదలమీఁదనే యాపదలు వచ్చుట యిదియే కాఁబోలును. ఏమైనను సరే! నేనుగూడ నీతటాకమ్మునం బడి ప్రాణమ్ములు విడిచెద.

(ప్రకాశము)

చ. కొమరులవెంటఁ బోతివొకో కోమలి! నన్విడనాడి, యేమి పా
పము నొనరించికొంటి, ననుఁ బాయుట న్యాయమె? పల్కవేమి? దో
సము నొడిగట్టికొంటి నతిసాహసముం బొనరించి మాలదై
వము నను సర్వథా కటికవానినిఁ జేసె నిఁకేమి సేయుదున్.

(తటాకములో నురుకఁ బోవును.)

బ్రాహ్మ— (చేయిపట్టుకొని)రాజా! నీభార్య యేమైనది? (నారదునిం జూపి) ఇదిగోఁ జూడుము. జీవించియుండఁగనే యిట్లు తుందుడుకుఁజెందదవేమి?

రాజు— (దగ్గఱకు వచ్చి పాఱఁజూచి కోపముతో) ఏమయ్యా, బ్రాహ్మణుఁడా! నీకు వేళాకోళమునకు నేనే దొరకితినా? ఎవరో ఋషిని జూపి నా భార్య యనెదవేమి! (దుఃఖముతో) అయ్యో! అయ్యో!

క. దీనుఁడగు పతిని విడిచియు
సూనులయెడఁ బేర్మి మిగులఁ జొప్పడుకతనన్
దోనేగితి; భార్యాపు
త్రానుగతికిఁ జెడితి నేమి యనుకొందుఁ గటా.(దుఃఖించును)

నార— (తనలో) ఔరా! విష్ణువు న న్నెంత మోసము చేసినాఁడు! నే నీ రాజుంగూడి యెన్ని యకృత్యము లొనర్చితిని! ఛీ! తగుదునని యిఁకఁ దలయెత్తుకొని యెట్లు దిరుగఁగలను?

క. ఏవము నెంచక మద్యము
ద్రావితి గ్రామ్యక్రియావిధానము లెల్లన్
గావించితి నేమేమో
భావములన్ మెలఁగితిని నభాంసై పోతిన్.

అక్కటా, యెన్నివిధములఁ బాడైతిని! అవి యన్నియుఁ దలఁచుకొనిన కొలఁదిని నాకు శరీరము కంపించుచున్నది. హృదయము నీరగుచున్నది. ఛీ! నాబ్రతుకుకన్న నిఁక నేటొండు నీచము లేదు. నాకన్న సూకరము కొంత మేలుగాఁ గన్పట్టుచున్నది.

(తలవంచుకొని విచారించుచుండును.)

బ్రాహ్మ— (మొగము నెత్తి) ఏమి రాజా! నిన్ను నేను వేళాకోళము చేయుచున్నాఁడ ననియా, నీ తాత్పర్యము? అంత యవివేకి ననుకొంటివా? ఎప్పుడును నట్లు తలఁపకుము. నేనుమాత్రము కష్టసుఖము లెఱుఁగ ననుకొంటివా? నీభార్య యీ మునియే యని కదా నేను జెప్పితిని!

అట్లేందుకుఁ గాఁ గూడదు ? నేనొక్కటి యడిగెదను. అందులకు సరి
యైన యుత్తరమిమ్ము.

గీ. ఏల దుఃఖించెదవు నరపాల ? నీదు
భార్యయేమాయె ? ధర్మంపుఁ బద్ధతులను
వినవె ? బుధ సేవ లేదె ? యావెలఁది యెవ్వ
రీ వెవరు ? యోగము వియోగ మెట్లు మీకు?

రాజు— వియోగము కన్నట్టుచునే యున్నదికదా ! ఇఁక యోగమును జెప్పెద
వినుము.

బ్రాహ్మ— చెప్పుదువు గాని శేషము వినుము

క. నీ కా లతాంగితోఁ దగ
నేకతమున యోగ ? మెఱుఁగుదే నీవు నృపా!
యాకలికి తల్లిదండ్రుల ?
శోకింపకు, దైవచర్య చోద్యము కాదే!

రాజు— (తనలో) ఓహో ! ఏమి యీతని యుపన్యాసము! ఈతని మాటలు
విననకొలఁదిని దుఃఖము పోవుచున్నది. (ప్రకాశము) ఆమె తల్లిదండ్రు
లెవరో నే నెఱుఁగను.

బ్రాహ్మ— మంచిది. ఎఱుఁగవు కదా,

గీ. కాకతాళీప్రసంగ మక్కలికి పొందు;
కాన శోకమ్ము విడిచి వేగ గృహ మేగి
కాలచోదితమైన భోగమ్ము గనుము;
వచ్చినట్టుల యేగెన వ్వనరుహాక్షి.

గీ. అధిప ! సంసార మను సముద్రమ్మునందు
నెవరి కెవ్వరు? రోదన మింత యేల ?
యింటి కరుగుము; నాకపై నెక్కి దాఁటు
వారి ఛందంబ కాదె సంసార రీతి ?

క. ఘటికాయంత్రము వడువున
నటు నిటు సుఖదుఃఖములకు నగు భ్రమణ మ్మొ
క్కటఁటొనునికి చొప్పడదు సం
కటపడకుము పురికిఁ బోవఁగాఁ దగు నింకన్.

రాజా ! ముఖ్యమైన సారాంశ మొక్కటి చెప్పెద, వట్లొనరింపుము.

క. క్షాంత్యావిద్యహోద్భవ మగు
చింతన్ విడ స్వాడి గృహము చేరుము జగ మ

త్యంతము మాయామోహిత
మింతయు నద్దాని కతన నే నీశబ్బెన్.

రాజు— (తనలో) ఇతఁ డెవరో మహాయోగివలెఁ దోఁచుచున్నాఁడు. (ప్రకాశము) చిత్తము. తమ యానతిచొప్పున గృహమునకుఁ బోయెదను. పోయి నేను జేయవలసినదేమి? నాకీ యజ్ఞాన మెట్లు నశించును? కృపచేసి వచించి నన్నుం గృతార్థునిం జేయుము.

బ్రాహ్మ— ఏమియును జేయ నక్కఱ లేదు. చావఁగా మిగిలిన నీ మనుమనికి రాజ్యాభిషేకం బొనర్చి నీవు వనమ్మునకుం జని విరక్తుండవై తపం బొనరించికొనుము.

రాజు— చిత్తము. తమ యాజ్ఞచొప్పున వర్తింతును. మహాత్మా! నాదొక్క మనవి. ఈముని యెవ్వరు? నా భార్య యీ మునిగా మాఱ నేల? నీ వెవ్వరవు? ఆ యీ రహస్య మొక్కింత చెప్పితివేని యేను గృతార్థుఁడ నయ్యెదను.

బ్రాహ్మ— (నవ్వి) రాజా! ఇది దేవ రహస్యము. నీకుం జెప్ప వలనుపడదు. మాటాడకుము, పొమ్ము.

రాజు— చిత్తము. (వెనుకకుఁ దిరిగి తిరిగి చూచుచు నిష్క్రమించును)

బ్రాహ్మ— (చిఱునవ్వుతో) ఏమి, నారదా! ఆలస్య మెందులకు, పోవుదము రమ్ము. (వీణయు కృష్ణాజినమును నిచ్చును)

నార— (ఆశ్చర్యముతో) సంశయ మేమి? ఇతఁడు శ్రీ మహావిష్ణువే.
(ప్రకాశము)

క. దేవా! వంచన చేసితి
వీవ మ్మాయాబలమ్ము నెఱిఁగితి, నిపుడున్
భావమునఁ దోఁచు వనితా
భావమ్మున నే నొనర్చు పను లవి యెల్లన్.

చ. మునిఁగితి నత్తటాకమున, మున్గినయంతనె యెట్లు నాకుఁ గ
ల్గెనొ వచియింపు విస్మృతి, మృగీనయనాకృతిఁ జెందినప్పుడున్
మనమును దేహలింగములు మాఱెనె? యయ్యవి కాక, జ్ఞాననా
శన మగు టెట్లు? నాకుఁగల సందియ మియ్యది వాపు మచ్యుతా!
జగన్నాథా! సిగ్గు విడిచి చెప్పెద నవధరింపుము.

చ. నృపవరునిన్ వరించి యొక నేమము లేక యనేక భోగముల్
త్రుపయు నహం బటం చెఱుఁగఁ జాలక పొందుటె కాక మద్యపా

నపుఁగృతి సల్పుచున్ మెలఁగినాఁడ సతీమణినై మహాత్మ ! నేఁ
దపసిని నారదుండనను తత్త్వ మొకింతయుఁ దోఁప దయ్యెడన్.

దేవా ! యెంత మాయ పన్నితివి !

క. ఇయ్యెడ సర్వము దెలియఁగ
నయ్యెడిఁ, గత మేమి యప్పు డల్లొటకు? నేఁ
దొయ్యలినై సలిపిన కృతు
లయ్యారె ! తలఁచికొనిన నత్యద్భుతమా.

బ్రాహ్మ— (ఆదరముతో) మునీంద్రా ! ఇది యంతయు మాయావిలాసంబు కాని వేఱొండు గాదు. దేహాంతరప్రాప్తి యగునప్పుడు పూర్వజ్ఞానంబు నశియించుట కేమి సంశయము ? ఇందులకు నీ కొక చిన్న దృష్టాంతము చెప్పెద వినుము.

క. నిదురం జెందిన మనుజుఁడు
పదఁపడి యొక్కింత యెఱుక పడయఁడు పలుకం
డెది వచియించినఁ దెలియం
డది వోయినమీఁద నెఱుఁగు నఖిలం బనఘా !

మఱియు నిద్రావస్థయందు మనోభావమ్ము లనేక విధముల మాఱుచుండు. చూడుము.

గీ. మృతుఁడయిన తాత తన యింటి కేగుదేర
నతనితోఁ గూడి భోజనం బాచరించి
తగఁ బ్రసంగం బొనర్చు నిద్ర నొక యప్డు
స్వప్న వశమున నిది యెంత సత్య మగునో.

ఆ. వె. స్వప్నమందుఁ దనకు జరగిన దంతయు
మేలుకాంచి నుదువు మిథ్య యనుచు
నెవఁడుగాని యప్పు డెఱుఁగంగ నేర్చునే
భ్రమ యటంచు ? నింత పలుకుమయ్య !

ఇది యంతయు మాయావిలాసంబు. దీనిం దాఁటినవారు లేరు. నీకు నీ రహస్యం బెఱిఁగించితిని. ఇఁక నీ యిచ్ఛం జనెదవా ? లేక నాతో వైకుంఠపురమ్మునకు వచ్చెదవా ?

నార— (తనలో) ఇంక నే మొగముతో సనకసనందనాదులను శ్రీ మహాలక్ష్మిని దర్శింతును. (ప్రకాశము) స్వామీ ! నా కిప్పటికి నాజ్ఞయొసంగుము. పదఁపడి వచ్చెదను.

బ్రాహ్మ— (తనలో) పాపము ! సిగ్గుగా నున్నది కాఁబోలును (ప్రకాశము) కానిమ్ము. అట్లే చేయుము (నిష్క్రమించును)

నార— తే. గీ. దారుమయ మైన పాంచాలిఁ దనదు కరము
నందుఁ గొని యైంద్రజాలికుం డద్భుతముగ
నర్తనం బొనరించు చందమున జగము
నెల్ల నాడించు మాయయే యింత నిజము.

కానిమ్ము. ఇఁక నేని యీ మాయకు లోను గాక సాధ్యమైనంతవఱకు బుద్ధిగలిగి ప్రవర్తింప వలయును. ఈ సంగతియెల్లఁ బోయి తండ్రికిం జెప్పి పదఁపడి నా భాగినేయుండగు పర్వతునితోఁ గూడి యెటకేనియుఁ బోయెద (నిష్క్రమించును)

## గద్య

ఇది ..శ్రీ తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
అనర్ఘనారదమునందుఁ దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# అనర్ఘనారదము

## చతుర్థాంకము

(అంత పర్వతనారదు లిద్దరును ప్రవేశింతురు)

నార— (చూచి) సఖా, పర్వత!

చ. నదులును బర్వతమ్ములు వనమ్ములుఁ బల్లెలుఁ బట్టణంబులుం
బొదలుముదంబునం గని ప్రభాత సుఖోదయ మందినార మి
య్యదను పటత్పటజ్జలదమై పయనంబును సాఁగ నీదు ని
ల్వఁ దగును నెక్కడేని యొకపట్టునఁ గార్తిక మేగునంతకున్.

పర్వ— అవును. ఈ నాల్గుమాసములును నెక్కడేని యొక్కచో నుండి చాతుర్మాస్య వ్రతమును నెఱవేర్చికొని పదంపడి తీర్థయాత్రకు బయలుదేరుట యుక్తము.

తే. గీ. ఇంద్రచాపంబు కాంతు లెల్లెడలు నిండె;
మొగులుతెర గప్పె నాకాశమున; మెఱుంగు
డీఁగ లెల్లెడ మిలమిల దిశలు ప్రాఁకె;
నెండ గఱపయ్యె; వర్షముల్ మెండుకొనియె.

నార— ఇఁక నేమాత్రము ప్రయాణ మొనర్చినను దక్కిన మాటట్లుండ నా వీణియ చెడిపోవును. కావున నెచ్చటనేని నిలువక తప్పదు. (పరిక్రమించి చూచి తనలో) అదిగో, నొక యుద్యానవనము. ఆ దాపుననే యొకపట్టణము పొడగట్టుచున్నయది. (కొంతవఱకు నడిచి) ఈ యుద్యానవనమున రమణీయంబగు సౌధం బొండు గానంబడుచున్నది. (చూచి) అదిగో, నొకచిన్న తటాకము. సర్వవిధముల నీ యుపవనము మునిజనవాసయోగ్యముగా నున్నయది. (ప్రకాశము) అబ్బాయీ! ఈ ప్రావృట్కాల మియ్యుపవనమ్మున నుండి వెళ్లింతమా?

పర్వ— మీయూహ కడుఁ జక్కఁగా నున్నయది.

క. ఫలవృక్షజాతులును బూ
వుల తీఁవెలు మంచినీరు వొల్చు సరస్సుల్
గల విచటఁ జెంపుడు మృగం
బులు నున్నవి కందమూలములుఁ గల వనఘా!

కావున నియ్యది యాశ్రమంబో యను భ్రాంతిం గలిగించుచున్నయది.

నార— (దగ్గరగా) ఎవరురా, యక్కడ?

మాలాకారుఁడు— (ప్రవేశించి) స్వామీ! దండము. తా మెవ్వరు? ఇయ్యెడఁ దమకుం గల పని యేమి? లోన సృంజయమహారాజుగారు వచ్చి విహరించుచున్నారు. దగ్గరగా నఱవకుఁడు, క్షమింపుఁడు.

(అంత రాజు ప్రవేశించును.)

నార— ఓరీ! మీరాజుతో పర్వతనారదులు వచ్చియున్నా రని చెప్పుము.

మాలా— చిత్తము. (పోయి చెప్పును)

సృంజ— (ఎదురుగా వచ్చి వినయముతో) మునివరులారా! నమస్కారము. శిష్యునియం దకారణజాయమానకరుణాకటాక్షమున నిట్లు విజయముచేసి కృతార్థత గలిగించితిరి. శిష్యుఁడు దేవర యేమి యానతిచ్చినను సంసిద్ధుఁడై యున్నాఁడు.

నార—నీకుఁ గళ్యాణమగుఁ గాక, రాజా! మాకు నీవలనఁ గావలసిన కార్యము వినుము.

శా. ప్రావృట్కాలము గాన దేశము చరింపన్ వీలు గాకుండుటన్
నీ వత్యంతము మంచివాఁడ వగుట న్నీవిట నుండంగ మే
మావిర్భూతకుతూహలాస్పదులమై యాచించుచున్నాము; భూ
దేవారాధనమే కదా నృపుల వర్ధిల్లంగఁ జేయున్! నృపా!

సృంజ— ఇది ముమ్మాటికిని నన్ననుగ్రహించుట. ఇట్లు నేనే మిమ్ము యాచింపవలసినది. నా కొమిరె దమయంతిని తమ కుపచారార్థము నియోగించెదను. తామిందు నివసించి చాతుర్మాస్యవ్రతమును నిరంతరాయముగ జరగించుకొనుఁడు. (వనములోనికిఁ దీసికొనిపోవుట నటించి) మహాత్మా! ఈ యుద్యానమంతయుఁ దమది గాని నాది కాదు. ఇందు నిస్సంశయముగఁ బ్రవర్తింపుఁడు. ఇప్పుడే నా కొమిరె దమ సందర్శనమ్మునకు రాఁగలదు. నేను దమ వీలును బట్టి దర్శనము చేసికొనుచుందును.

(నిష్క్రమించును.)

నార— అబ్బాయీ! చూచితివా, యిందలి విశేషములు?

క. శ్రుతి లేకయె పాడుటకై
మతి గలిగించెడిని మత్తమధుకరపికబ
ర్హితతులు, గాయకులకు నిది
కుతుకం బొనఁగూర్చి మెప్పు గొలుపకయున్నే!

పర్వ— (చిఱునవ్వుతో) మామా! నీవు గాయకుఁడవు గనుక నీకుఁ గడు నుపకారిగా నివ్వనము చూపట్టుచున్నది. కేవలచ్ఛాందసుఁడనగు నా కెందులకును గొఱగాదు గదా!

నార— (నవ్వి) అబ్బాయీ! నీకు దీనియందు శ్రద్ధ లేదు గాని నాకు మేనయల్లుఁడవగు నీకు సంగీతమే రాకుండునా! ఏదీ, చూతము. ఈ నాలుగు మాసములును గృషి చేయుము. నీచేతఁ బల్లవిని పాడించెదనో లేదో చూతువుగాని.

పర్వ— "అఱువది యేఁడ్లు వచ్చి చదువుకొనక మున్ను గొట్టుకొందునా" యన్నట్లిప్పుడు నాకు సరళిదగ్గరనుండి చెప్పుకొన్నను రాదు. నాకంత స్వరజ్ఞానముతో నవసరమును లేదు. ఏదేని శ్లోకమును రాగయుక్తముగాఁ జదువఁ దగినంత సంగీతమును నేర్పితివా, యంతే చాలును.

నార— ఏదీ! చూతము, మొదలు పెట్టుము.

పర్వ— నేను మొదలు పెట్టితినేని "అనమ్రరాగేణ గీయతే" అన్నట్లగును. కావున నీవే ముందు చదువుము.

నార— (వీణ మీటుచు గాత్రము సవరించుకొని)

శ్లో. నారాయణం నిగమపారాయణం మునిజనారాధనీయచరితం
క్రూరాపహం కలుషభారాపహం కలశవారాశివాస మనఘం
మారాజితం వ్రజకుమారావృతం చ సుకుమారాకృతిం నిరుపమం
ధారాధరోపమశరీరాధిరాజ మము మారాధయామి మనసా.

పర్వ— నాకు నీవు చదివినశ్లోక మొక్కసారికే వచ్చినదిగాని రాగము మాత్రము పట్టుపడినది గాదు.

నార— ఎందుకుఁ బట్టుపడినది గాదో, చూతము. బిగ్గరగాఁ జదువుము.

పర్వ— చదువుటకేమి, నీవు నవ్వెదవేమో యని సంశయముగా నున్నది.

నార— భయములేదు, చదువుము. నేను శ్రుతి వేయుచుండెదను.

పర్వ— (చదువఁబోయి మానివేసి) ఎందుకు, మామా! నా కీవిద్య రాదు. అది గాక వేదముఁ జెప్పుకొన్ననోటికి సంగీతపు ముక్క లెక్కవు.

నార— ఎక్కకేమి? నాకుమాత్రము వేదము రాదా? నేను పాడుచున్నానా, లేదా?

పర్వ—అది నీకు సహజముగా వచ్చినది. వేదము తరువాతఁ జెప్పుకొన్నాఁడవు. ఎక్కడనో కోటి కొక్కఁడు తప్ప నీవంటివార లుండరు.

శ్లో. "గాంధర్వంచ కవిత్వంచ శూరత్వం దానశీలతా
అభ్యాసేన న లభ్యంతే చత్వార స్సహజా గుణాః"

అనుట నీవెఱుఁగనిది కాదుగదా?

నార— చదివి చూడుము. తరువాత రాకపోయినచో మాని వేయవచ్చును.

పర్వ— (వైదికస్వరముగాఁ జదువును)

నార— (తనలో) ఇతనికి సంగీతము వచ్చుట కడు దుర్లభము. (ప్రకాశము) నీవు భయపడుచున్నావు గాని కృషి చేసినచో నీకును గానము వచ్చుట కభ్యంతరము లేదు.

పర్వ— (పరికించి) రాజకుమారి కాఁబోలును వచ్చుచున్నది.

(అంత మదయంతి ప్రవేశించును)

మద— (తనలో) నేను గడుఁ గృతార్థురాలను. ఇట్టి మహానుభావులసేవ పురాకృతసుకృతవశమ్మునంగాని కలుగదు. (సమీపించి ప్రకాశము) దేవరా! నమస్కారము. వంట సంసిద్ధమైనది. తాము దేవతార్చనకు లేవవచ్చును.

నార— ఇదిగో, లేచుచున్నాము. దేవతార్చనకుఁ గుసుమములు దీసికొనిరమ్ము.

మద— చిత్తము. (పూలు గోయుచుండును)

పర్వ— మామా! నీవు శ్లోకముఁ జదివినను సంగీతము పాడినట్లే యుండును. ఇంక నొకశ్లోకము చదువుము.

నార— (కంఠము సవరించికొని రాగముతో)

శ్లో॥ భూతాభపాదిసుర నేతార మార్తజనపాతార మన్యసదనా
నీతాలిమాతృనవనీతాదనాదర మనేతాదృశం దరధరం
గీతానుతం పరమపూతాభిధేయ మతిశీతాయితస్వహృదయం
తాతాయితం జలధిజాతాయుతం ప్రణతపీతామృతం హృది భజే.

మద— (కుసుమములు గోయుట మాని యాసక్తితో విని తనలో) అవురా, యీ కంఠ మాధుర్యము! ఎన్నఁడును విన లేదే! ఎంతపుణ్యము చేసికొంటిని.

పర్వ— మామా! యెంత వినినను దనివి దీరకున్నది, యింక నొకటి చదువుము.

మద— (తనలో) ఈయన యిప్పట్టున నాకుఁ బరమోపకార మొనర్చుచున్నాఁడు. ఇంకను నిట్లు పలుమాఱులు గోరుచుండుఁగాక.

నార— అబ్బాయీ ! గానమున కిది వేళ గాదు. ఏమంటివా ? సూర్యుఁడు నభోమధ్యము నలంకరించుచున్నాఁడు. మరల సాయంకాలమున విందువుగాని.

పర్వ— చిత్తము.

మద— (తనలో) అయ్యో ! ఇంక నొకటి పాడినపిమ్మట నేని మానక పోయెనే! కానిమ్ము. ఇక్కడ నాలుగు మాసము లుందురుగదా ! ఇన్నినాళ్లును వీరి పరిచర్య నేనే చేసెదనుగదా ! ఇఁక నాకు వినిపింపక యెవరికి వినిపించెదరు ? (కుసుమములుగోసి సమీపించి) దేవా! ఇవిగో, పుష్పములు.

నార— (పుచ్చుకొని యాదరముతో) రాజపుత్రీ ! అటు కూర్చుండుము. దేవతార్చనము కాఁగానే వచ్చుచున్నాము.

మద— (కొంచెము దూరముగాఁ గూర్చుండును)

నార— (దేవతార్చన చేయుట నటించి) ధ్యానముతో,

శ్లో॥ అస్త్రప్రదోష మతిశస్త్రప్రభావ పతినిస్తంద్రశీల మనఘం
ధ్వస్తాధికోటి మరిమస్తాకిటిం నిగమబిస్తాంతరం చితఘనం
నిస్తామసామలమనస్తాపసప్రకరహస్తాభిపూజితపదం
న్యస్తాభయం సుజనహస్తాంబుజేషు హృది నస్తారకం మనుమహే.
రాజపుత్రీ ! నీరాజనమునకుఁ గర్పూరమును దీసికొని వచ్చితివా ?

మద— ఇదిగో, సిద్ధముగనే యున్నది. (ఇచ్చును)

నార— (కర్పూరము వెలిగించి) రాజపుత్రీ! ఇది కనుల నద్దుకొనుము. నీపేరెవరు ?

మద— (కన్నుల నద్దికొని) దేవా ! నాపేరు మదయంతి.

నార— సరే, భోజనమునకుఁ బోవుదము పద.

(అందఱును నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
అనర్ఘనారదమునందుఁ జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# ఆనర్ఘనారదము

## పంచమాంకము.

(అంత నొక చెలికత్తియ ప్రవేశించును.)

చెలి— (తనలో) ఈశుభవార్త రాజపుత్రితోఁ జెప్పి యామెకు సంతోషము గలిగించెదను. (పరిక్రమించి) అప్పుడే యుద్యానమునకు వచ్చితిని. (ప్రవేశము నటించి) ఆహా! రాజపుత్రి భక్తితాత్పర్యములు! ఎప్పుడును నీ యుద్యానవనమును విడువక యామునివరుల కిరువురకును సేవ సల్పుచుండును. ఇంతియ కాదు, నారదునియొద్ద నప్పుడప్పుడు గానమునందలి మెలుఁగులను గూడ గ్రహించుచున్నదఁట. (పరికించి) ఈ రెండవముని యేమో యాలోచించుచున్నాఁడు. అంతియగాక కడుఁ గోపదృష్టిగానున్నాఁడు. ఇతనియెదుటనుండి పోవుటకన్న మఱియొకప్రక్కగా రాజపుత్రియొద్దకుఁ బోవుట మంచిది. (నిష్క్రమించును.)

(పిదప యథోక్తముగాఁ బర్వతుఁడు ప్రవేశించును.)

పర్వ— (తనలో) ఈ రాజపుత్రి మొన్న మొన్నటివఱకును,

గీ. స్నానమొనరింప జలము భోజనమొనర్ప
నిష్టమగు వస్తువులు శయ్య యెద్దియేని
గోర నయ్యవి మా కిడుఁ గొసరికొసరి
హెచ్చుతగ్గులు లేకుండ నెసక మెసఁగ.

ఈ మధ్య క్రమముగా నారీతి మాఱినది.

సీ. స్నాన మొనర్ప నుష్ణజలం బతని కిచ్చుఁ
జలినీళ్ళు నా కిచ్చు సరసిజాక్షి
పెరుఁ గాతనికిఁ బోయుఁ బ్రీతిమై బింబోష్ఠి
నాకుఁ దక్రము వోయు నళినవదన

సెజ్జఁ గల్పించు మెచ్చెడిరీతి నతనికి
నా కొక్కకంబళి నాతి పఱచు
సొగసుమేల్ చూపులఁజూచు నాతనిఁ బేర్మి
చూడదు నన్నట్లు సుందరాంగి

గీ. ఎల్ల యుపచారముల నిట్లు లేకరీతి
మాని ననుఁ గొంచెపఱచె నిమ్మగువమిన్న
యింతలో నిట్లు మాఱుట కెంతయేనిఁ
గారణం బొకఁ డుండియేతీరవలయు.

(యోజించి) కారణమున కేమున్నది ?

తే. గీ. ఛాందసుఁడ నేను, గాయకసార్వభౌముఁ
డతఁడు, నృపపుత్రియును గానమందు మిగుల
నాసగల యది, కారణం బరఁటిపండు
నొలుచు భంగినిఁ బొడకట్టుచున్న దిందు.

ఆపెమాటట్లుంచి యితనివైఖరిఁ జూచినను నింమలకు భిన్నముగా లేదు. తప్పక వీరిరువురికిని నన్యోన్యానురాగము గలిగినది. (స్మృతినభినయించి కోపముతో) ఔరా! ఇతఁడు మొట్టమొదట నాతో నేమని ప్రతిజ్ఞ సేసినాఁడు.

క. మంచియుఁ జెడ్డయునుచు లో
నెంచక మనయాత్మఁ బొడము నిచ్చల మనలో
నించుకయు డాఁపఁగాఁ జన
దంచితగతి నొకరికొక్క రట చెప్పఁదగున్.

ఇట్లొసర్చి యిందులకు భిన్నముగా వర్తించుచున్న యితనిని నేను క్షమించుటెట్లు? (శాంతించి) అయినను బోయి యడిగిచూచెదం గాక. (కొండొక నడిచి పండ్లు గొరికి) అదుగో! ఈ కుహనాముని యా వన్నెలాఁడితో నేమో సల్లపించుచు వినోదించుచున్నాఁడు. కొంతవఱకు నా ముచ్చట లిచ్చటినుండియె నిరీక్షించెదం గాక.

(ప్రక్కగా నిల్వఁబడును.)

(నారదుఁడును మదయంతియుఁ బ్రవేశింతురు.)

మద— (నవ్వి) మునినాథా! పదఁపడి యేమి జరిగినది ?

నార— (తనలో) ఎల్లపుడును నీమె నన్ను మాటలాడించుచునే యుండును. ఇదిగాక, యీమెమనస్సున నేదో యొక విధమైన కోరిక యుదయించి నట్లున్నది. ఈమెకే కాదు, నాకును నుదయించినది. ఏమి కానున్నదో!

అగుట కేమున్నది? మదనుం డెట్లును గృతార్థుఁడు కాక మానఁడు. (ప్రకాశము) అట్లానృపునిచే పరింపఁబడిన యనంతరమున,

ఉ. ఆనృపుఁ డెల్లకార్యములయం దపరక్తి వహించి మించి యు
ద్యానములందు దీర్ఘికలయందు గృహమ్ములయందు వారుణీ
పానమనస్కుఁడై రతులతోఁ దులఁదూఁగుచు రాత్రియుం బవల్
తా నెఱుఁగంగ లేక పరతంత్రత వర్తిలు నాకధీనుఁడై.

మద — (సంతోషముతో) మునిచంద్రా! తరువాత నేమి జరిగినది?

నార — (నవ్వి) ఏమి జరుగఁదగినదో యదియే జరిగినది.

మద — దాఁపక సెలవిండు.

నార — (తనలో) ఏమని చెప్పుదును? సిగ్గువేయుచున్నదే! (ప్రకాశము) సుందరీ! తప్పక చెప్పవలయునా? అట్లయిన వినుము.

గీ. ఇటు లహర్నిశ మా భూపు డెనసి ద్యావ
శాద్రముల్ కావ కేళీవిహారములను
గొనఁగ సంతట వేఁకటి యనుఘటించెఁ
బార్థివోత్తముఁ డానందవార్ధి మునుఁగ.

మద — (తనలో) వేఁకటి యన నేమో! (యోజించి) సందర్భమునుబట్టి చూడ గర్భమైన దని యర్థ మగుచున్నది. కానిమ్ము. ముందుఁ దేలవచ్చును. (ప్రకాశము) తరువాతి వృత్తాంతము సెలవిండు.

నార — తలోదరీ! సిగ్గగుచున్నది. ఇంకను జెప్ప మనియెదవా?

మద — ఇక్కడ నన్యు లెవ్వరును లేరు గదా! సిగ్గందుకుఁ బడవలెను?

నార — (తనలో) ఇఁక నీమె విధిగా నన్ను మోహించుట నిశ్చయము. (సంతోషముతో) ఇంతకు మున్ను స్త్రీనై సంసార సుఖ మనుభవించితిని. కాని పురుషుఁడనై యనుభవించలేదు. దైవానుగ్రహమువలన నాముచ్చట గూడఁ దీరుగాక. (ప్రకాశము) ఏమి చెప్పుదును. అటు నిటు చూడుము. ఎవరేని యొందులకేని వచ్చి పొంచి యున్నారేమో?

మద — (తనలో) ఇమ్మహాత్మునకుఁ గూడ నాయందు మనము లగ్నమైనది. లేనిచో రహస్యమున కెందులకుఁ బ్రయత్నించును? ఇప్పటికి నేను గృతార్థురాలను. (ప్రకాశము) చిత్తము. అట్లే యొనరించెదను. (అటు నిటు చూచుట నటించి) స్వామీ! యెవ్వరును లేరు.

(అంత చెలికత్తె వచ్చి వెనుకప్రక్క దాఁగి వినుచుండును)

నార— సుందరీశిరోమణీ !

క. మూలాలనైన నను భూ
పాలుఁడు దగ బుజ్జగించి "బాలరో ! నీ కిం
కే లోలత" నాఁ జెప్పం
జాలన్ లజ్జాధరం బశక్యం బగుటన్.

కన్య— (కోపముతోఁ దనలో) ఈ పరమమూర్ఖుఁడు దాను మున్ను స్త్రీయై చేసిన నాఁటి ప్రక్కిటిపురాణ మంతయును జెప్పుచున్నాఁడు. తన కీ కన్నియయం దేదో యొకదురభిప్రాయమే లేనిచో నిట్టి శృంగార ప్రసంగ మెందులకు వెళ్ళఁబోయవలయును? ఔరా! చేతులు త్రిప్పుకొనుచు నెంత చక్కఁగాఁ జెప్పుచున్నాఁడు! అవును, చెప్పకేమి!

క. పాములకు నమ్మికలు లే
వేమియు దుర్మార్గులకును గృప లేదు కదన్
సోమరికిఁ దెలివి యుండదు
కాముకులకు లజ్జ యుండఁగాఁ బో దెందున్.

చెలి— (తనలో) ఈ మునివరుఁడు చెప్పు మాట లించుకయును నాకు బోధింప కున్నవి. చెప్పువాఁడు తాను మగవాఁడు గదా! అట్టియెడ గర్భిణి నైతి నని చెప్పుచున్నాఁడు. ఇది యెట్లు సంఘటించునో! కానిమ్ము పదఁపడి రాకన్నియ నడిగి తెలిసికొనియెద. (యోజించి) ఈమె యయ్యనఘునిఁ జూచుచందమును నతం డీమెను గౌరవించు విధమును బరిశీలించిన నా మనమున నేమో సంశయము కలుగుచున్నది. రాజీమె నెవరికో రాజన్యున కీఁదలఁచి స్వయంవర యత్నము చేయుచున్నాఁడు. తుద కీమె యీ జడదారిని వరింపదుగదా!

మద— నాథా! (నాలుకఁ గఱచుకొని తనలో) అక్కటా! తన్మయురాలనై తేలికపడితినే! కానిమ్ము, దీనిచే నా భావము నీతఁడు గుర్తించుగాక. (ప్రకాశము) మునినాథా! అంతలోఁ జాలించితి రేమి? పదఁపడి వృత్తాంతము సెలవిండు.

నార— (సంతోషముతోఁ దనలో) నేను కృతార్థుండ నైతిని. నన్నీమె విధిగా వరించినది. లేనిచో, "నాథా" యని యేల సంబోధించును?

చ. కనుఁగవ కింపు గల్గి తగు గానకలాభ్యసనంబు గల్గి యా
వనమున లేఁత యయ్యు రసభావములం గడుఁ బెద్దయై తనం
దన వలపున్నదైన వనితామణి యెవ్వని కబ్బుఁ? బ్రాగ్భవం
బునఁ దులలేని పుణ్యములు పూవులు పూచి ఫలింపకుండినన్.

(యోజించి) నేను మునినిగదా! నా కియ్యది తగునా? (ధైర్యముతో) తగ కేమి?

మ. వెలయాలిం గవగూడెఁ గౌశికుఁ; డహో! వేదాంతి వ్యాసుండు పుం
శ్చలి భోగించె సహోదరప్రియులు విశ్వస్త్రాంగనల్ గాక; మూ
ర్ఖులె వీరెల్లరు? మానివర్యులె కదా! గోనాతి కా దీ దళ
జ్జలజాతేక్షణ రాజకన్య, గానఁగా సందేహ మిం దేటికిన్.

ఉ. కోరినదాని మాను టది గొప్ప విశేష మిఁ కట్టి పూరుషుం
డారయ లేఁడు నూటి కొకఁడైనను, గోటికి నొక్కరుండు చే
కూరునొ లేదొ? తా నగుచుఁ గోరెడి పూరుషుఁ డన్న నెట్టివాఁ
డై రసహీనుఁడై జగమునం దపహాస్యతఁ గాంచకుండునే.

కావున నా యభిప్రాయముమాత్రము వెలువరింపకయె మనము బిగఁబట్టుకొని యీ యంగనామణి హృదయం బారయవలయు.

మద— (తనలో) ఈయన యేమో యోజించుచున్నాఁడు, నామాటయే వినిపించుకొను నట్లు లేదు. నా మనసున వలెనే యీతని మనమందుఁగూడ మదనుఁడు ప్రవేశించి యుండునా? కానిమ్ము. ఎట్లైన నిమ్మునిని వివాహము చేసికొని తీరెదను. (ప్రకాశము) మునిపుంగవా! తరువాతి సంగతి సెలవిచ్చినారు కారుగదా?

నార— (తనలో) మరల నీ సంబోధనము నాయభిప్రాయమునే బలపఱచుచున్నది. కానిమ్ము, దైవ మనుకూలించుఁగాక. రసికుఁ డగువానికిఁ దటస్థించినచో నిట్టి సౌఖ్యమే చేకూరవలయును గాని తక్కిన వివాహములు వివాహములే కావు (ప్రకాశము) లతాంగీ! యేమి చెప్పుదును!

క. పదినెలలు నిండఁ గంటి శు
భదినమ్మున నొక తనూజుఁ బార్థివుఁ డానం
దదశఁ దగు నుత్సవమ్మ
భ్యుదయంబుగఁ జేసె నింగి భూమియు ముట్టన్.

చేటి— (తనలో) నేను వచ్చి చాల సేపైనది. ఎందుకు వచ్చితినో యది మఱచి యేమో వినుచు నిల్చితిని. వచ్చినకార్యము చెప్పెదను. (ఎదుటికి వచ్చి ప్రకాశము) అమ్మా! మాట. (చెవిలో నేమో చెప్పును)

మద— (తనలో) ఓహో! నాకు వివాహము తలపెట్టినారేమి! నే నెట్లయిన నిమ్మునివరుం బెండ్లాడవలె. లేదా, బ్రహ్మచారిణిగా నుండవలె. ఇదివఱకే మానస మిమ్మహామహునికి దార వోసితిని. అట్టిచో నితరు నెట్లు చేకొందును? ఇయ్యెడఁ గర్తవ్య మేమి? (యోజించి) ఇట్లగుఁగాక—

(ప్రకాశము) సఖీ! ఇటు రమ్ము (కొంచె మావలకుఁ దీసికొని పోయి జనాంతికము) మాతండ్రిగారితో నామాటలుగా నిట్లు విన్నవింపుము.

మ. జనకా! నారదునిన్ వరించి యితరేచ్ఛాశూన్యనై యున్న న
న్యుని కీ నెంచకు; నక్రశూన్యమయి సంతోషప్రదంబై రస
మ్మునెడన్ క్షారము గాక మీనముల కిమ్ముం గాక నిర్దుష్టమై
తనరున్ దన్మహతీనినాదము సంద్రం; బందు నే మున్గితిన్.

చెలి— (తనలో) నే ననుకొన్నట్లే జరిగినది? (ప్రకాశము) అట్లే చెప్పెదను. కాని నా రిందుల కంగీకరింప రేమో?

మద— అది యంతయు నీ కెందులకు? పెండ్లియాడుదానను నేనా? నారా? ఇందుల కమ్మనివరుఁడు సమ్మతించుట కష్ట మేమో గాని యితరుల సమ్మతితో నంత యవసరము లేదు.

చెలి— ఆయనమాత్ర మెందులకు సమ్మతింపఁడు! పుచ్చ పూసినదా యేమి? నీవంటి సుందరి యా జడదారి కెట్లు లభించును? (చూచి) అదుగో! ఆ తెండవముని వచ్చి యేమో కోపముగా మాట్లాడుచున్నాఁడు, చూడుము. నేను బోయెదను. (నిష్క్రమించును)

పర్వ— (నారదుని నవిూపించి) మామా! నే నొక్కటి యడిగెదను. తగిన సమాధానము జెప్పెదవా?

నార— (తనలో) ఏమి, యితని ముఖకళ యేదో రీతిని బొడకట్టుచున్నది! వీని కేమైన యనుమానము తగులలేదుకదా! కానిమ్ము. (ప్రకాశము) అభ్యంతర మేమి?

పర్వ—ఇదిగో, వినుము.

ఉ. భోజనమజ్జనాదుల నపూర్వపుఁ గృత్యములన్ మనోభవ
శ్రీ జనియింపఁ జేసెడి విశేషవిలాసముల న్నినుం గనున్
రాజకుమారి యక్కరణి నన్ గనకుండెడి నిన్ వరింపఁగా
నా జలజేక్షణామణికి నాస జనింపఁగఁ బోలు నద్దిరే!

నార— (తనలో) సరే, యిది వీనికి స్పష్టముగాఁ దెలిసినది. ఇం దాశ్చర్య మేమి? మే మిరువురమును నెల్లవేళల నేదో యిష్టగోష్ఠి మాటలాడుకొనుట మొదలగు నంశములు గనుఁగొనిన నెవ్వారికేనియుఁ బొడకట్టియే తీరవలెను. కానిమ్ము. ఇఁక దాఁపరిక మెందులకు? యథార్థము వచించెదను. కాని రాజపుత్రి వినునేమో! (జనాంతికముగా) నీ యూహ కడుఁ జక్కఁగా నున్నది. ఏమంటివా?

మ. అనుకూలమ్ముగ వీణ సుస్వరయుతం బౌనట్లు సారించి నె
మ్మన మానందరసామృతార్ణవమునన్ మగ్నమ్ముగా సామవే
దనినాదం బొనరింప, దాని విని, యీ తన్వీశిరోరత్న మె
క్కినమోహమ్మునఁ బేర్మి నాయెడలఁ దాఁ గీలించెఁ గామార్తయై.

అబ్బాయీ! అటుపిమ్మట నామన మెంత త్రిప్పుకొన్నను దిరుగదు. ఏమి చెప్పుదును! ఆ కన్నియ వగలు నీకు సూత్రప్రాయముగాఁ జెప్పెద నాలింపుము.

శా. ఎంచు న్మర్మము లెత్తి మాటికిఁ, దుటాయించుం గనుల్, బల్మిటా
రించుం జన్గవపైచెఱంగు, వల పూరించున్, నగించున్, బ్రశం
సించున్, మించు మనోవికారమును సూచించున్, మరల్ వెంచు, న
మ్మ్రించుంబోఁడి స్వభావమొక్కొ! నను నమ్మించన్ బ్రయత్నించుటో?

నే నేమైనదియు నిశ్చయింప లేక సంశయసముద్రములో మున్గి, యేమియుం దోఁపకున్నాఁడను. "మనము మునులము గదా! మన కిట్టి ప్రశంసలు తగునా" యని నీ వడుగవచ్చును. అవును. అది నిజమే కాని,

క. ఆ తరుణీరత్న మ్మిటు
చేతోభవుబారిఁ దవిలి చేసెడి చెయ్వుల్
ప్రీతి గలిగించె నాకుఁ, బు
రాతన కర్మములు దాఁట రా దెవ్వరికిన్.

మధ—(తనలో) ఇయ్యనఘుఁ డేమో రహస్యముగా సమాధానము చెప్పినాఁడు. (చూచి) అదుగో! ఆయన ప్రకాశముగనే యేమో యనుచున్నాఁడు. దీనివలన నా రహస్యముగూడ స్పష్టము కాఁగలదు. (వినును.)

పర్వ— (కోపముతో) మనము చేసికొన్న యేర్పాటు నీకు జ్ఞాపకమున్నదా?

నార— (తనలో) ఏమి ఏర్పాటు? బొత్తిగా స్మృతికిఁ దగులకున్నదే! (స్మృతినభినయించి) ఓహో! యిప్పటికి జ్ఞప్తికి వచ్చినది. (ప్రకాశము) జ్ఞాపకము లేకేమి; "అన్యోన్యమును రహస్యము దాఁపక యొకరి కొకరు నెంటనే చెప్పికొన వలయు" ననియే కదా?

పర్వ— (కోపముతో) నీ వట్లు చేయ లేదేమి?

నార— అబ్బాయీ! శాంతింపుము. నేనును జెప్పవలెననియే యనుకొను చున్నాఁడను. అంతలోనే నీ వడిగితివి. ఇప్పుడు చెప్పనే చెప్పితిని.

పర్వ— ఇప్పుడు నీ వెందుకుఁ జెప్పవలెను? నే నే గుఱుతించితిని. ప్రతిజ్ఞా భంగం బొనరించితివి. కావున (అనునర్థోక్తిలో)

నార — ఆఁగు. ఆఁగు. తొందరపడకుము. నీవు శపించినచో నిన్ను నేను మరల శపించెదను జుమీ! ఏ మనుకొన్నావో?

పర్వ — (తొందరగా) ఏమైనను సరే. శపింపక మానను. ప్రతిజ్ఞాభంగం బొనరించితివి కావున,

క. ఏ మొగము చూచి నిన్నీ
కామిని వరియించె గాన గతసంతోష
వ్యామోహమ్మున, నా మొగ
మీ మెయిఁ గోఁతిమొగ మగుచు నింపు దఱుఁగుతన్.

మద — (విచారముతోఁ దనలో) అక్కటా! యీ చిలుతముని యెంత యపకార మొనర్చినాఁడు! కానిమ్ము. నాకితఁడేనియు నితఁడే భర్త యగుఁగాక. (ప్రకాశము) మునివరా! రాచకన్నియలను మునులు గ్రహించుట తప్పుకాదు గదా? నీ వెందులకు శపించితివి? ఇదిగాక, నీవొక పొరఁబాటుఁ గూడఁ బడి యుంటివి. నే నీయనఘుని సౌందర్యమును జూచి మోహించినట్లు సూచించినాఁడవు. అది తప్పు. విద్యను జూచి మోహించితిని. అట్టిచో నాకితనిది కోఁతిమొగమే యైనను సంతోషజనకమే యగును. కావున శాపము గ్రమ్మరింపుము.

నార — (కోపముతో) సుందరీ! నీ వితని వెందుల కభ్యర్థించెదవు. ఇతని పని నేను జక్కపగడము జేసెదను జూడుము. ఏమి, నన్ను శపించితివిగా! అటులైన నిదిగో! ప్రతిశాపమును స్వీకరింపుము.

గీ. స్వల్పమగు నపరాధమ్ము సైఁపకిట్లు
శాప మిచ్చితి నీ కిఁక స్వర్గవాస
మెడలి మర్త్యమ్మునన వసియించు టబ్బుఁ
బొమ్ము నీతోడ నాకిఁకఁ బొత్తుతగదు.

పర్వ — (వెడనవ్వుతో) పోనిమ్ము. నీ శాపమువలన నాకు నష్టము లేదులే! భూలోకములో స్వర్గముకన్న ననేకములగు రమణీయప్రదేశములు కలవు. పోయి యవియన్నియుం జూచెదఁ గాక. (నిష్క్రమించును)

నార — (తనలో) ఏమీ! నా కప్పుడే కోఁతిరూపు మొగమ్మునఁ గన్పట్టుచున్నట్టులున్నదే! అద్దములోఁ జూచికొందునా? అదిగో! ఆ మేడగోడలో నున్న యద్దమునం దిలకించెదను. (నిష్క్రమించి కోఁతిమొగముతో ప్రవేశించి) ఓరా! యీకన్నియ యిఁక నన్నుఁ జూచి యేమనుకొనునో! కానిమ్ము, దైవగతి కేమి చేయఁగలను? ఇఁక నీ లతాంగి నన్ను బలవంతపెట్టినను నే నీమెం బరిగ్రహింపఁ గూడదు. సుఖము

మాటలట్లుండఁ జూచినవారందఱును "గాకిముక్కునకు దొండపండు" అని పరిహసింతురు. (నలుదెసలు జూచి) ఈతోఁటవాండ్లందఱును నన్నెంత వింతగాఁ జూచుచున్నారో! ఔరా! ఫలకాలమున కట్టి యిక్కట్టు వచ్చినది?

మద— (తనలో) తల్లిదండ్రులు మునిని బెండ్లియాడుటకే యొప్పుకొనరుగదా! అందులో "గోరుచుట్టుమీద రోకటిపో" టన్నట్టు లిది గూడఁ దటస్థించినది. (నారదుని దిక్కై) ఈ మహామహుఁడు నావంకఁ జూచుటకే సిగ్గుపడుచున్నాఁడు. ఔరా! ఆపాడుముని నాయాశలెల్ల నిష్ఫలము చేసినాఁడు. కానిమ్ము. ఏమైనను నా కిటఁడే భర్తయగుఁగాక.

నార— (దెసలు పరికించి) రాజు కాంబోలు వచ్చుచున్నాఁడు. కానిమ్ము, పుత్రికతో నేమి సంభాషించునో దట్టముగ నల్లికొన్న యీ పొదరింటం డాఁగి వినియెద. (నిష్క్రమించును)

(అంత రాజు ప్రవేశించును)

సృంజ— ఎవఁడురా, యక్కడ?

మాలి— (ప్రవేశించి) జయము, జయము. దేవా! యేమి యానతి?

సృంజ— మునీశ్వరు లెయ్యెడ నున్నారు? అచ్చటికిఁ ద్రోవ చూపుము.

మాలి— ఇట్లు దయసేయుఁడు. (కొంత నడిచిన పిదప) మహాప్రభూ! ఇప్పుడే చిన్న మునియును బెద్దమునియును నెందుకో పోట్లాడికొన్నారు. ఆ చిన్నాయన పెద్దాయనను దిట్టి లేచి పోయినాఁడు. ఏమోగానండి బాబూ, ఆ పెద్దముని మొగము కోఁతిలా గున్నదండి. అచ్చముగా కోఁతి సుమండీ. అదిగో! అమ్మాయి, సెలవు బాబూ! (నిష్క్రమించును)

సృంజ— (తనలో) వీరిలో వీరి కెందులకో కలహము గలుగుట! (యోజించి) నిశ్చయముగా నా కిప్పుడు ధాత్రేయి చెప్పిన వృత్తాంతమే యిందులకుఁ గారణము గావచ్చును. కానిమ్ము, ఇప్పటి కిది మంచి పనియే జరిగినది. ఇఁక నా కొమిరె యీతనిఁ బెండ్లి చేసికొనదు. నిశ్చయము.

మద— (తనలో) తండ్రిగారు వచ్చుచున్నారు. ధాత్రిక చెప్పిన మాటల విని నాతో నేమో బోధించుటకై యుండును. కానిమ్ము, నాహృదయ మెప్పుడును దిరుగక యమ్మునిచంద్రునియందే నిలుచుఁగాక. (ఎదురుగాఁ బోయి ప్రణమిల్లును) తండ్రీ! నమస్కారము.

స్రృంజ— కళ్యాణసిద్ధిరస్తు. అమ్మా! ధాత్రిక నాతోఁ జెప్పిన మాటలు నిజమేనా?

మద— నిజమే.

స్రృంజ— పోనిమ్మా. అందులకు మేమును సమ్మతించితిమనుకొన్నను పతనికి వానరత్వము సంభవించినదఁట కదా?

మద— (తనలో) అప్పుడే తెలిసినదే! (ప్రకాశము) తండ్రీ! వివాహామైన పిమ్మటఁ దటస్థించిన నేమి సేయుదుము?

స్రృంజ— (తనలో) ఓహో! ఇప్పటికిని నీమె మనము తిరిగినట్లు లేదే! ఔరా! సంగీత మెంతపని చేసినది? అయినను సాధకబాధకములు చెప్పి చూచెద. (ప్రకాశము) అమ్మా! నేను గొన్నిమాటలు చెప్పెదను సావధానవై యాకర్ణింతువా?

మద— వినకేమి, సెలవిండు.

స్రృంజ— పుత్రీ!

ఉ. లత కెన వచ్చి యొక్కుడు తళత్తళఁ బొల్చెడి నీదు మేను ; రూ
క్షతనుఁ డతండు భస్మమును సారెకు మెత్తుటఁజేసి, సుందరం
బగువ భవన్ముఖం బకట! యాతఁడు కోఁతిమొగమ్మువాఁడు స
మ్మతుఁ డెటులయ్యె నారదుఁడు? మాటలపొందికఁ గోఁతి కొప్పునే!

మద— క. మొగమును సామ్రాజ్యమ్మును
సొగసును ధన మేల శుద్ధశుంఠకుఁ? దండ్రీ!
మొగమును సామ్రాజ్యమ్మును
సొగసును ధన మేల రసవశుం డీతనికిన్?

స్రృంజ— తల్లీ! నామాటలు తుదముట్ట విని పిమ్మటఁ జెప్పుము. చిన్నతనముచే నీ పట్లనుచుంటివే కాని ముందు ముందు విచారింపక మానవు.

క. నరులకు వానరులకు నె
క్కురణిన్ మాటలు పొసంగుఁ? గా కతఁడు సదా
తిరుగున్ భిక్షుకుఁడై యా
దర మెటు నీ కబ్బె నట్టి తాపసుమీఁదన్?

ఇది యిట్లుండనిమ్ము.

ఉ. అందము గోరుఁ గన్నె [illegible]ఫులం దది వొల్చు లతాంగి యిట్టినీ
మందత కేమనందు! [illegible] నీ కయి కుంద దేవి సాం

పుం దగు మాలతీలత బుబూలనగోపరి లగ్నమైన దా
నిం దిలకించి ఖేదమును నెక్కొనకుండెడివార లుందురే ?

క. మృదుతాంబూలీదళముల
నెద నుప్ప్రిమ్మన కొసంగ నెవఁడొప్పెడి ? నా
రదుచేతఁ బడ్డ నినుఁ గని
ముదితలు నవ్వరె వివాహమున నా తల్లీ !

క. కుముఖునితో సల్లాపము
కొమరార దొకింతయేని కోమలి ! నీ వే
క్రిమమున నామరణము కీ
శముఖునితోఁ గాఁపురంబు సల్పవె పకటా !

మద— తండ్రీ ! నా మనోనిశ్చయము విని నన్ను మన్నింపుము.

క. గానరసమ్మున హరిణులు
తేఁ నెఱుఁగక ప్రాణమిచ్చి మేల్ పడయ నిసీ !
మానవులు గొంద ఱీ రస
మానంగా లేరు జన్మ మది యెందులకో?

గీ. అరయ సప్తస్వరాత్మిక యైన విద్య
నెఱుఁగు నారదమునిచంద్రుఁ ; డెఱుఁగు హరుఁడు;
వ్రేలు మడఁచి వచింపఁగ వేఱొకండు
గానఁగా రాఁడు మూఁడు లోకముల నెందు.

చ. ధనమును రూపమున్ మిగుల దర్పము గల్గి రసజ్ఞభిన్నుఁడౌ
జనవరు గర్వధూర్వహు నెపన్ వరియించి తదీయ మైత్రి నె
క్కొను చెలికిన్ బ్రతిక్షణ మగున్ మరణంబు, రసజ్ఞుఁడైన ని
ర్ధనుని వరించి తాఁ బ్రతిపదమ్ము ముదమ్మున నుండఁ జెల్లదే.

గీ. మూర్ఛనాజ్ఞానభేదమ్ము మొట్టమొదటి
కరసి స్వరవేత్తయై గ్రామపరిచితి గని
యష్టరసవేత్త యగు నరుం డంగవికలుఁ
డయ్యు నానంద మొనఁగూర్చు నంగనలకు.

క. గానంబువినికిఁ బశువుల
నానందరసాబ్ధి నోలలాడించెడి న
ద్దాని వినఁ జెద్ద లాదర
మూననిచో వారి జన్మ మొక జన్మంబే!

క. వినఁ జెవులు గలిగి మోదం
బెనయని యరసికుల కన్న నెంతే మోదం

బును గానరసమూ కతనం
గను సత్శ్రోత్రములు మేలు కాకోదరమౌళీ.

చ. తెలియవు గాక నారదు నుదీర్ణగుణమ్ములు నీవు, ముజ్జగం
బులఁ గలఁడే యొకం డతనిఁ బోలఁగ గానమునందుఁ? బూర్వమే
వలచినదాన నాతనిని, వానరవక్త్రము శాపకారణం
బలవడి నేఁడు వచ్చె; నెటులైన నతండు ప్రియుండు నా కగున్.

క. తురగాస్యులు గారే కి
న్నరులెల్లరు? వారిఁ జూచి నరుఁ డెవ్వఁడు గా
న రసజ్ఞుఁ డాదరింపఁడు?
మురు వందియు విద్దె లేని మొగ మేమిటికిన్?

స్నాంశ— (తనలో) ఓహో! ఈమెకీ గానవిద్యా పరిచయ మెంత ముప్పు దెచ్చినది! ఈ విద్యనగూర్చి యీమె యిట్లెన్ని దినములైన నుపన్యసింపఁగలదు. ఈమెకిప్పట్లు నెవ్వరును సమాధానము చెప్పఁజాలరు ఇంతకు నిందు నా లోపమే విశేషించి యున్నయది. ఓహో! జనవరులార, గృహస్థులార,

చ. అనుభవపూర్వకం బగు రహస్య మొకండు వచింపుచుంటి జ
వ్వన మలరారు మేటి కులబాలికలన్ స్వరవిద్య కంచు స
జ్జనుఁ డగునట్టి గాయకుని సన్నిధి నేనియు నొప్పఁ జెప్ప కుం
డనఘుఁడు నారదుం డితనికన్న మఱెందును యోగ్యుఁ డుండునే!

ఆ. వె. గానవిద్య కొక్క దానికే కాదు; మీ
రీడు వచ్చినట్టి యెమ్మెలాఁడి
నితర పురుషునొద్ద నెందులకేనియు
నొప్పఁ జెప్పకుండు యోగ్యులార!

(ప్రకాశము) తల్లీ! నీ యిచ్చచొప్పున నమ్మునివరునే పెండ్లియాడుదువు గాని మీ తల్లి నిన్నుఁ జూడఁ గుతూహలపడుచున్నది. ఒక్కసారి వచ్చెదవా?

మది— చిత్తము. (నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరు లొనర్చిన
అనర్ఘనారదమునందుఁ బంచమాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# అనర్ఘనారదము

## షష్ఠాంకము

(అంత విచారముతోఁ బర్వతుఁడు ప్రవేశించును)

పర్వ— (తనలో) ఎక్కడనుండి బయలుదేరి వెళ్ళితినో తిరిగియు నక్కడికే వచ్చితిని. ఒకసారి స్వదేశమగు స్వర్గమునకుఁ బోవలయు నని యున్నది. (స్మృతి నభినయించి) ఏమి లాభము? స్వర్లోకగమనమున కింక నోఁచుకొనలేదు. ఏమి సేయుదును? (యోజించి) పూజ్యుఁ డగు నారదుని యొద్దికిఁ బోయి యయ్యనఘునకు నే నిడిన శాపము గ్రిమ్మరింతు నేని యయ్యమలాత్ముండుఁ గూడ నాశాపము నుపసంహరించును.

ఉ. ఆతఁడు మేనమామ విమలాత్ముఁడు పూజ్యుఁడు విద్వదీడ్యుఁ డ
త్యాతతమిత్రుఁ డయ్యనఘు నట్లు శపించితిఁ దప్పు గాదె! యా
నాతి వరించెనో పిదప నా కతనన్ ద్యజియించెనో మహా
పాతకినైతిఁ గూడిన వివాహము వమ్మొనరించి యక్కటా!
ఏమైనను నయ్యనఘు దర్శనమ్మునకే పోయెదను. (నిష్క్రమించును)

(అంత మదయంతీనారదులు ప్రవేశింతురు)

మద— నాథా! మీ రెందులకుఁ బరితాపము నందెదరు. నా కించుకయు మీయాకారమునందు విరక్తి గలుగలేదు.

నార— గీ. అబలరో! నన్నుఁ బెండ్లాడి తఖిల బంధు
జనులఁ దలిదండ్రులను గాదటనుచు రోసి;
యక్కటా! నా స్వరూప మిట్లయ్యె సాధ్వి!
యయ్యవారిఁ జేయఁగఁ గోఁతి యైనయట్లు!

క. సమరూపము సమశీలము
సమగుణములు గలుగునట్టి జంపతులకు సౌ
ఖ్యము కల్గుఁ గాని, కోఁతికిఁ
బ్రమదాజనరత్న మగు నె భార్య? మృగాక్షీ!

మద— నాథా!

గీ. వాలి సుగ్రీవు లని పేరువడసినట్టి
వానరేంద్రుల కినమె, య య్యారి భార్య
లెవరు? తారయు రుమయుఁ, మునీంద్రపాళి!
వారికన్నను నెక్కుడు వనిత నొక్కొ.

నార— అవును, నీ యభిప్రాయ మట్టిదియే. నీవు పరమపతివ్రత వగుటం బట్టి యిట్టి సదూహాతో నన్నుఁ బ్రేమించుచున్నను నా మొగమే నన్ను వెక్కిరించుచుండును గదా!

క. తన తెలివియుఁ దన తేటయుఁ
దన రూపము తన విరూపతయు నెవ్వఁడు దా
మనమునఁ దలపోయఁడో యా
జనుఁడే హాస్యాస్పదుండు జనవరపుత్రీ!

వేయేల? నా మనంబునంగల ముఖ్యాభిప్రాయము వినుము.

శా. ఎంతో ప్రీతి నన న్వరించితివి నీ విందీవరాక్షీ! నిను
న్సంతోషింపఁగఁ జేయ నేరనుగదా చంచన్మణీభూషణా
నంతైశ్వర్యవిశేషసంపదల! నే నాజన్మరిక్తుండ నో
యింతీ! రూపముఁగూడ నిట్టు లగునే! యింకేటి సంసారమో?

ఎప్పటికేని నా మేనల్లుఁడును నేనును గలసికొంటిమేని, యీ శాపమ్ములకు విముక్తి గల్గు; మన కానందమ్మును జేకూరెడి; లేదేని నాకు నిన్నుం జూచినప్పుడెల్ల విచారం బుదయించుట తప్ప వేఱొండు ఫలము లేకుండు.

(అంతఁ బర్వతుఁడు ప్రవేశించును)

పర్వ— మామా! నమస్కారము.

శా. శాపం బిచ్చితి మున్ను దుష్టమతినై; సైఁపంగదయ్యా! మహా
పాపాత్ము న్ననుఁ గ్రూరచిత్తుఁ జపలు న్బ్రత్యుగ్రకోపిన్; సదా
యీ పద్మాక్షియు నీవు నన్ను నెదలో నెట్టట్టు లూహింతురో?
యీపైఁ బూర్వమునట్లె యుండుదువుగా కింపారు నెమ్మోముతో.

(నారదునికి స్వస్వరూపము వచ్చును)

నార— (సంతోషముతో పర్వతునిఁ గౌఁగిలించుకొని) తండ్రీ, భాగినేయ!

క. ప్రతిశాపం బిచ్చితి నే
నతికలుషితచిత్తవృత్తి ననఘా! యిటుపై
గతి నీకు స్వర్గమం ద
ప్రతిహత మగుఁగాక నాదు వాక్యము కతనన్.

పర్వ.— మామా! నీ శాంతమునకుఁ గృతజ్ఞుఁడనై యుండెదను. నీ వీ రాకన్నియతో సర్వసుఖము లనుభవించుచు నిచ్చటన యుందువుగాక. నే నరుగుచున్నవాఁడను. ఇంక నీకేమి ప్రియ మాచరింతును? అయిన నిట్లగుఁగాక.

## భరతవాక్యము

చ. తగిన కుమారికిం దనదు తల్లియుఁ దండ్రియుఁ దగ్గవాని భ
ర్తగ నొనరింత్రుగాక! వనితాజనమందుఁ బతివ్రతా ప్రభా
వగరిమ మొప్పుఁగాక! ప్రతివారును పెండిలిసేయుపట్ల రూ
పగుణముకన్నఁ దక్కుగుణవర్గమె చూతురుగాక గొప్పగన్.
క. మాయామయమగు సంసర
ణాయాసము లెఱిఁగి యెల్ల యార్యులు సర్వ
ధ్యేయంబగు పరవస్తువె
శ్రేయఃప్రద మంచు స్మరణ సేతురుగాతన్.

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరు
లొనర్చిన అనర్ఘనారదమునందు
షష్ఠాంకము
సంపూర్ణము.

## తప్పొప్పుల పట్టిక

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 12 | 1 | నిరే | నిద్రే |
| 24 | 20 | వంకే[illegible] | సంకేఁ[illegible] |
| 36 | 3 | బేర్మి | బేర్మిఁ |
| ,, | 4 | చూడ | జూడ |
| ,, | 15 | రికిని | రకును |
| 38 | 18 | దఁప | దప |
| 40 | 29 | మోఁను | మోఁను |
| 42 | 10 | శేనియు | శైన |

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# సుకన్య

## —• ఇందు వచ్చు పాత్రములు •—

**ప్రథమాంకము—**

1. సూత్రధారుఁడు.
2. శర్యాతి.
3. మంత్రి.
4. పౌరులు.
5. ఉద్యోగులు.
6. దాసి.

**ద్వితీయాంకము—**

1. ఇద్దరు చెలికత్తెలు.
2. శర్యాతి.
3. దేవి.
4. సుకన్య.

**తృతీయాంకము—**

1. చ్యవనుఁడు.
2. రాజు.
3. దేవి.
4. సుకన్య.
5. పరివారము.

**చతుర్థాంకము—**

1. నారదుఁడు.
2. అశ్వినీదేవతలు.
3. సుకన్య.
4. చ్యవనుఁడు.
5. శర్యాతి.

**పంచమాంకము—**

1. ఇద్దరు బ్రాహ్మణులు.
2. శర్యాతి.
3. దేవి.
4. చ్యవనుఁడు.
5. ఇంద్రాదిదేవతలు.
6. అశ్వినులు.
7. మనుఁడు.
8. బృహస్పతి.
9. సుకన్య.

ఓం

శ్రీ ఈశ్వరదేవతాయై నమః

# సుకన్య

## ప్రథమాంకము

### నాంది

చ. సుముఖము సర్వనమ్యము విశుద్ధముఁ బావనమున్ ద్రిలోకపూ
జ్యముఁ ద్రిదశేంద్ర ముఖ్యుల కసాధ్య మగమ్య మభేద్య మెట్టి యు
త్తమపదమేని నందుటకుఁ దావలమైన పతివ్రతాప్రభా
వము నల బ్రహ్మతేజము నపారసుఖమ్ము లొసంగుఁ గావుతన్.

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్ర— (తెరవంక చూచి) ప్రేయసీ! యిటు రమ్ము.

(తెరలో) ఆర్యపుత్రా! తమకుఁ బ్రతిఁ జెప్పుచున్న యీ దీనురాలిని మన్నింపుఁడు. నానావిధ జనసమాకులంబగు సభాముఖమ్మునకు నేను రాఁజాలను.

సూత్ర— (తనలో నాశ్చర్యముతో) ఏమీ, ప్రియురా లిట్లు నొడువుచున్నది! నవోఢ యగుటచేఁ గాఁబోలు సిగ్గుపడుచున్నది. (ప్రకాశము) ఆర్యురాలా! మన కియ్యది కులవృత్తి కావున నీవిట్లు సంశయపడ వలను పడదు. అదిగాక పతివ్రతాత్వమునకుఁ గూడ శీలము కారణము గాని ఘోషా కానేరదు. దుర్జనులు సయితము పతివ్రతలకు భయమందు టట్లుండఁ బై పెచ్చుగ నుపకారమునే పొనరింతురు.

(మరలఁ దెరలో) ఆర్యపుత్రా! నేనీ సంగతి సుకన్యాచరిత్రము నందుఁ జదివినదియే కాని యామెను గామింప నెంచిన యశ్వినులు మాత్రము కేవలము దుర్జను లన వలనుపడదు. పూర్వకాల మెట్లైనను, నిప్పటికాలమున నీతు లుపన్యసించువారే గాని యాచరించువారు గడు నరుదు. కావున నంగనలకు ఘోషా యుండుటయే మంచిదని నా యభిప్రాయము.

సూత్ర— ఈ చర్చ కేమి, యియ్యెడఁ బల్లవురు పలువిధములఁ దలఁచుచున్నారు. ప్రకృతోచితమైన నాటకము సుకన్య యని సూచించితివి. ఇఁక నీవియ్యెడకు వచ్చియైనఁ జేయవలసినదేమియు లేదు. నీ కోరికయే నెఱవేర్చికొనుము. (సభవంకఁ దిరిగి) ఆర్యులారా! నేఁడు తిరుపతి వేంకటేశ్వరులచే రచింపఁబడిన సుకన్య యను నాటకమును బ్రదర్శింప నేర్పఱచుకొంటిమి. దీనివలన వృద్ధులకుఁ గన్యకల నీరాదనియును బరోపకారులు స్వసుఖములను గోరరనియుఁ బతివ్రతలు మాననీయ లనియును బరకాంతాసక్తి పరిభవస్థానమనియును బ్రహ్మతేజము దురుద్ధరమనియును దెలియనయ్యెడిని. (వినుట నభినయించి) ఓహో! మీ రొకరితో నొకరు గుసగుసలాడికొనుచున్నారు. ప్రకరణముం బట్టి దానిని గుర్తించితిని. మా నటి సభకు రాకపోవుటకుఁ గారణము నటీగానశ్రవణము పరిత్యాజ్య మను ప్రకృత సిద్ధాంతముం బట్టి యిందుఁ గొంద ఱట్టివా రున్నచో వారల కిది సరిపడ దని యూహించుటయే సుఁడీ.

(తెరలో) కాలాతిపాతం బగుచున్నది.

సూత్ర— అవును. ఇయ్యది గ్రీష్మరాత్రి గాని హేమంతరాత్రి కాదు. ఈపాటికి నాటక మారంభింతము.

(తెరలో) హేమంతరాత్రి గాకేమి, నాకుఁ జలివెట్టుచున్నది. అయ్యో! సర్వావయవములును బిఱ్ఱబిగియుచున్నవి. అయ్యో, అయ్యో!

సూత్ర— (విని) సుకన్యావజ్ఞాకోపరూషితుండగు చ్యవనమహామునీంద్రు కతనఁ గలిగిన యాపదలవలనఁ బీడింపఁబడు ప్రజలు శర్యాతిమహారాజుం జూడఁ జేరుదెంచుచుండం బోలు. నేనును ననంతరకరణీయమ్మునకై త్వరపడియెద. (నిష్క్రమించును)

ఇది ప్రస్తావన.

(పిదప శర్యాతియు మంత్రులును బ్రజలును బ్రవేశింతురు)

శర్యా— ఏమి, యీ విరుద్ధము! మొన్న జలక్రీడావినోదమ్మున కరిగి వచ్చినది మొదలు దేహమున నించుకయు స్వాస్థ్యమ్ము గానరాకున్నయది.

మంత్రి— చిత్తము. నాకును నట్లే యున్నది. గ్రామమంతయు రోగపీడితం బుగా నున్నయది. దీని కేదేని శాంతి యొనరింపందగు.

ప్రజ— అయ్యో! అయ్యో! (అని మరల మొఱవెట్టుదురు)

మంత్రి— అయ్యా! అటు చూడుఁడు. మన మోసాలలోఁ గొందఱు రోగులు వచ్చి "యౌషధములు కావలె" నని మొఱ్ఱ పెట్టుకొనుచున్నారు.

శర్యా— అక్కటా! ప్రజ లిట్లు దుఃఖించుచుండ రా జూరకుండఁదగునే.

గీ. కఱవులేకాని మఱియు రోగములెకాని
కలహములెకాని యెట్టి యి క్కట్లుగాని
రాజలోపమ్మునన కాని రావు ప్రజకు
రెండవది మంత్రి లోపమే నుండవలయు.

దీనికేమి, ముందు విచారించుకొందము గాని వారలకడ కరిగి వారి సేవ మారయుదము. (దరికరిగి) ఏమి మీ రిట్లు బాధ పడుచున్నారు? నగరవైద్యు లేమైరి?

ప్రజ— బాబూ! ఎందుకండి నగరవైద్యులు? వారివల్ల నేమియును లాభము లేదు. ఏవో యిన్ని నీళ్ళిచ్చి పొమ్మన్నారు. వారి కేదేని లంచ మిచ్చు వారికిఁ గాని మంచి యౌషధము లీయరు. బీదల మెట్లీయఁగలము?

శర్యా— మంత్రిశేఖరా! వింటివా? వేలకొలఁది వెచ్చించి మన మీ శాల లేర్పఱచుట బీదలకే కదా! బీద లిట్లు దుఃఖించుచున్నచోఁ గుక్క గొడుగులవలె నివి యెందుఁకు?

మంత్రి— చిత్తము. ఇది సర్వజనసంక్షోభము. ఇట్టియెడ నగరవైద్యులుమాత్ర మేమి చేయఁగలరు. ఇది యేదో యొక దోషముం బట్టి తటస్థించి యుం డును. దానిని దెలిసికొని తగిన శాంతి యొనర్పవలయు.

ప్రజ— మహాప్రభూ! దేవరవా రనుగ్రహించి యట్లొనరించినం గాని బ్రతుకఁ జాలము. ఇంట నెందఱున్న నందఱును రోగులే యౌటచే వారల కుప చారము చేయుట కేదియు నుపాయము లేదు.

శర్యా— జనులారా! మీ రోకటియును నా కొమిరె సుకన్య యొకటియుఁ గాదు. కావున మీ రిప్పటికిఁ జనుఁడు. శీఘ్రకాలముననే మీ రారోగ్యము నొందఁ గలరు.

ప్రజ— (నడువలేక నడువలేక పడుచు లేచుచుఁ బోవుదురు)

దాసి— (ప్రవేశించి) దేవా! అంతఃపురములో దేహస్వాస్థ్యము లేకున్నయది. ఔషధము లెన్ని యిచ్చినను హెచ్చుటయే గాని తగ్గలేదు.

శర్యా— వింటివా, యీ యుపద్రవము?

మంత్రి— చిత్తము. ఇది యేదో గొప్ప లోపము నాయం దుండి తీఱవలెను.

శర్యా— పరిచారికా! నీ వరిగి యిది సర్వలోక సామాన్యము గాన ననుభవించియే తీఱవలె ననియు నచిరమ్మునసె శాంతిక్రియాలు జరపుదుమనియుఁ జెప్పి యిఁక మందులు పుచ్చుకొన వల దని చెప్పుము. పొమ్ము.

(దాసి నిష్క్రమించును)

శర్యా— (మంత్రివంకఁ దిరిగి) ఇది నీ లోప మనియా యూహించితివి! ఏమి, నా లోప మేల కాఁగూడదు?

క. దున్నల కెనయగువారలఁ
గన్నెఱుఁగక పదవు లందఁగాఁ జేసితినో?
పన్నులు హెచ్చించితినో?
పున్నె మనుచుఁ బాపకృతినిఁ బొనరించితినో?

మంత్రి— దేవా! దేవర సర్వజ్ఞులు. తమ రేలోపమును నాచరించియుండరు. ఇదిగాక తమరు పన్ను పుచ్చుకొనుట ప్రజల క్షేమమునకే కదా! అది ప్రజాక్షోభమునకు హేతు వెట్లగును?

శర్యా— వెఱ్ఱివాఁడా! నీవు చక్కఁగా నూహించితివి కావు. ఏమంటివా, ప్రజాక్షోభమునకుఁ బన్ను వృద్ధి చేయుటయే ముఖ్యకారణము.

ఉ. పన్నిడువారు హాలికులు వర్తకులుం గద! వారితోడనే
యున్నది లోకమెల్ల, వెల లొయ్యన హెచ్చొనరింత్రు వారు, దా
నన్నరులెల్ల బీదలయి నాఁటికి నాఁటికి సారవంతమూ
వన్నము లేమి రోగముల కాస్పదులై నశియింపకుందురే!

పంటలు పండుచున్నవి కదా యని పన్నులు వృద్ధి చేసిన వారలా పన్ను గూడ వర్తకులపైఁ బడవైతురు. వర్తకులు ప్రజలపైఁ బెట్టుదురు. తుదకు రాజు బీదలఁ బీడించినవాఁ డగును. దానిచే బీదలు రోగగ్రస్తులగుదురు. వారికతన ధనికులకుఁ గూడ నా రోగములు సంక్రమించును.

మంత్రి— చిత్తము. అట్టి దుర్నయమును నే నొనరించుట లేదు. దేవర పరిశీలింపవచ్చును.

శర్యా— నీవే యొనరింపవలయునా? మన యెఱుక లేకుండనే ప్రజలం బీడించెడి యుద్యోగులు లేరా?

మంత్రి— లేకేమి! ఉండవచ్చును. ఐనను నింతమందికి నేకకాలమున రోగములు మూఁగుటకుఁ గారణ మేదో యుండి తీఱవలెను.

శర్యా— ఐనచో మన యుద్యోగులం బిలిపింపుము. విచారింపుదము.

మంత్రి— చిత్తము. ఎవరురా, యక్కడ?

ప్రతీహారి— (ప్రవేశించి) ఏమి యాజ్ఞ?

మంత్రి— కచ్చేరీకిం బోయి యచ్చటి కాయస్థుల నిటకుఁ దోడి తెమ్ము.

(ప్రతీహారిపోయి వారితోఁ బ్రవేశించును.)

కాయ— (నమస్కరింతురు)

శర్యా— కాయస్థులారా! మీరలెల్ల మీ మీ వ్యాపారమ్ముల జాగరూకులయి ధర్మంబుఁ దప్పక వర్తించుచుంటిరా? సాధుబాధ మీవలన నేరికిని లేదుకదా?

కాయ— చిత్తము. దేవరపాదసాక్షిగ నట్లే వర్తింపుచుంటిమి కాని యేమి కర్మమో రోగములు మాత్రము మమ్మెల్లరఁ బీడించుచున్నవి.

శర్యా— (తనలో) ఎక్కడఁ జూచినను నిటియే శబ్దము వినఁబడుచున్నది. రోగముచేతనే కష్టపడుచున్న వీరలను మన మింతకన్న నొప్పింపరాదు. దీని కేమి హేతువో భగవంతుఁడే నాకు సూచించుఁగాక.

(తెరలో) "చ్యవనుఁడు, చ్యవనుఁడు, చ్యవనుఁడు."

(అందఱును విందురు.)

శర్యా—(తనలో) ఏమి, యీ మాట లాకాశమునుండి వినఁబడుచున్నవి. అమ్మహాముని చిరకాలమునుండి యీ పురిదరి నడవియందుఁ దపమ్మొనర్చుకొనుచుండుట నిక్కమే. అయ్యనఘుని కెవరేని యపకృతి గావింపరు కదా! ఐనను వీరి నడుగుదము. (ప్రకాశము) ఓ కాయస్థులారా!

క. ఈపురమునకుం బడమటి
వైపు తటాకమ్ముదరిఁ దపమొనర్చుమహా
తాపసుఁడు చ్యవనుఁ డమ్ముని
కేపాటియుఁ బీడఁ గొల్పిరే? మీర లొగిన్.

తే. గీ. ఎఱిఁగియెఱుఁగక తత్తపోవృద్ధు వృద్ధు
నెవ్వఁడో యిందుఁ బీడింప హేలనంబు
సైఁప కమ్మని మన కిట్టి శాస్తిసేసె
నెవ్వఁ డపరాధియిందు మీ కెఱుఁగరాదె?

కాయ— స్వామీ? మేమెవ్వరమును నాయన నెఱుఁగము. ఇంకను విచారింపుఁడు. దేవరసాక్షి, గాయత్రిసాక్షి.

శర్యా— మీరు గాకున్న మఱియొకరేనిఁ గావించి యుండవలయు. అంటర వాణి సూచించెఁగదా? మీరు పోయి దోషి నన్వేషింపుఁడు.

కాయ— చిత్తము (నిష్క్రమింతురు.)

మంత్రి— దేవా! యెవ్వఁడో యొక్కఁ డమ్మౌని కేదేని యపకృతి చేసెనే యనుకొందము. అట్లయిన నెల్లరకును బాధ యెందులకు రావలెను?

శర్యా— వెఱ్ఱివాఁడా! అట్లనరాదు.

తే. గీ. రావణుం డొక్కఁడే కదా రామభార్య
నెత్తికొనిపోయె దానిచే నెల్ల రక్క
సులు నశింపరె యెవ్వఁడో తులువ తనదు
కొంప నిప్పిడ నూళ్లెల్లఁ గూలకున్నె?

దాసి— (ప్రవేశించి) దేవా! తమ కీ పత్త్రిక నిచ్చి రమ్మని మా భర్తృదారిక సెలవిచ్చినది.

శర్యా— (పుచ్చుకొని విప్పి చూచి తనలో) ఓహో! ఇది ప్రమాదము. దీని కింతగా నమ్మౌని కనలఁ దగఁడు. క్షమాపణ చెప్పినచోఁ బ్రసన్నుఁడు కావచ్చును. (ప్రకాశము) మంత్రివరా! దీనిం జదువుము.

మంత్రి— "పరమపూజ్యులగు తండ్రిగారి సన్నిధికి—కొమిరె సుకన్య నమస్కరించి వ్రాసికొను మనవి. అయ్యా! మీరు ప్రకృతోపద్రవమునకై పౌరుల నెవ్వరిని శిక్షింపవలదు. ఈ యపరాధము నాయది. మొన్న జలక్రీడావినోదమ్మున కరుగుతఱిని దమవెంట వచ్చి నే నా కాసారమ్ము దరిం జెలికత్తియలతోఁ గ్రీడించుచుండ నట నొకపుట్టపొడకట్టె.

తే. గీ. అందు ఖద్యోతరీతి నింపొందు రెండు
జోతు లగుపడ నేనును సూచిఁ బొడిచి
నంత నయ్యది జలదిగ్ధమయ్యె నదియుఁ
గాక "హాహా" నినాద మొక్కం డు వెడలె.

క. మంటపమ్మున హాహారవ
ముందగ విని విస్మయమ్ము మొనయఁగ నే నం
తం బరలి వచ్చితిని సూఁడఁడే
చిం దేనిం బొడిచితినో వచింపనెఱుంగన్.

పదఁపడి నా చెలికత్తె లాపుట్టలో నొక మునివరుం డున్నవాఁడని చెప్పిరి. అయ్యనఘుఁడే చ్యవనుండు గావలయు. ఈ నా యపరాధమ్మునకు నిష్కృతి విచారింప వేఁడెదను.”

శర్యా— దీనికేమి యుపాయము?

మంత్రి— ఉపాయమున కేమున్నయది, మునులు దయాస్వభావులు గదా! మనము పోయి క్షమాపణ చెప్పికొనిన ననుగ్రహింప వచ్చును.

శర్యా— అటులేని జాగుసేయక యట్లొనరింతము. (నిష్క్రమింతురు.)

## గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ బడిన
సుకన్య యను నాటకమ్మునందుఁ బ్రథమాంకము.

ఓం.

శ్రీమత్పరదేవతాయైనమః

# సుకన్య

## ద్వితీయాంకము

(అంత నిరువురు పరిచారికలు కుమిదినీశాలినులు ప్రవేశింతురు.)

కుము— ఏమే, శాలినీ! యెక్కడ నుండి వచ్చుచుంటివి?

శాలి— అంతఃపురమునుండి. నీ వెక్కడనుండి?

కుము— నే నింటియొద్దనుండియే. విశేషము లెవ్వియుం జెప్పవు?

శాలి— విశేషములకేమున్నది. ఆనాఁటి ఘట్టలోనిముని మన సుకన్యను బెండ్లాడునఁట, వింటివా?

కుము— "తాతా పెండ్లాడతావా? అంటే మనకిచ్చేవారెవ".రన్నట్లాయన యిష్టమేనా యేమి?

శాలి— ఆయన యట్లయినఁగాని శాంతింపఁడఁట, శాంతింపకున్నచోఁ బట్టణమున కారోగ్యము గలుగదు కదా!

కుము— రోగములచే మనమందఱమును జచ్చినను సరియే గాని యాముసలి గ్రుడ్డివానికిఁ జిద్దపులికి లేడి నిచ్చినట్లు లీ మన రాకన్నియనుమాత్ర మిచ్చుట నాయిష్టము గాదు.

శాలి— ఎన్నివిధముల బ్రతిమాలినను "నీ కొమిరె నిచ్చుటతప్ప వేరొక్కటి నే నంగీకరింప" నని యమ్మునిని పట్టుపట్టెనఁట.

కుము— ఇందులకు రాజు సమ్మతించునా?

శాలి— ఏమో, యేమగునో! ఆయన కేమియు నుత్తర మీఁజాలక చింతాక్రాంతుఁడై మరలి వచ్చెను. ఇప్పుడు దేవితో యోజింపఁ బోవును.

కుము— అట్లయిన మనము పోయి సుకన్యతో నా మునినిఁ బెండ్లాడకుండ బోధింతము. (నిష్క్రమింతురు.)

(అంత శర్యాతియు దేవియుఁ బ్రవేశింతురు)

దేవి— చిత్రము. తరువాత నేమిజరిగెను?

శర్యా— జరుగుట కేమున్నది? అమ్మౌని తుట్టతుదకుఁ బ్రశాంతుండై,

ఉ. "నావచనంబు విన్ము జననాయక! యించుకయేనిఁ గోపమున్
భావమునందుఁ జేర్ప నొకపట్టునసైన, భవత్తనూజ నా
కీ విధ నేత్రఘాత మొలయించినదానికినై లభించె మీ
కీ వికలత్వ; మేను శపియించితి నంచుఁ దలంపఁబోకుమీ."

దేవి— పాపము! ఆముని మన మెంత పరితపించి యుండునో! తరువాత?

శర్యా— అని మఱియు నిట్లనియె.

క "అపరాధం బొండెఱుఁగక
తప మొనరుచుకొనెడి మేటితాపసులకుఁ దా
రపకారం బొనరించి సు
ఖపడుట చొప్పడునె? హరుఁడు గనలకయున్నే?"

దేవి— అవును, దిక్కులేనివారికి దేవుఁడే దిక్కు. తరువాత?

శర్యా— క. "ముదుసలిని గ్రుడ్డివాఁడ న
నద నోరాజేంద్ర! యెవరు నా కిఁకఁ బరిచ
ర్య దగం జేయుదు?" రని దీ
నదశన్ వగఁజెందు మునిఁ గనఁగ లేనైతిన్.

పదఁపడి యంజలి ఘటించి యిట్లంటిని.

క. తెలియక మత్పుత్రిక ని
న్నలయించినపనికిఁ గోప మందక తగు శీ
తలదృష్టి మనుపఁ గోరెద
నలమునె కోపమ్ము తాపసాగ్రణులందున్!

అని మఱియును,

క. మునివర్య! చాలినందఱ
నని పెద సేవకుల నీకు ననుగుణముగ సే
పన మొనరుప; నిఁకనైనన్
మనమునఁ గోపమ్ము విడిచి మన్నింపు దయన్.

దేవి— పాపము! అట్లొనర్పవలసినదే. అందులకు సమ్మతించెనా?

శర్యా— సమ్మతించినచో బాగుగనే యుండును. ఆపై నీ విషమపుఁ గోరికను గోరెను.

దేవి— ఆయన యేమి కోరినను మన మంగీకరింప వచ్చును. ఋషు లనార్యము లైన సంగతులు కోరనే కోరరు.

శర్యా—చ. అనవుడు మౌని నాకనియె "నక్కట! గ్రుడ్డికి నాకు నేగతిం
బనుపడు నిష్ఠ? యేమొనరుపం దగువా రగుదుర్ త్వదీయులౌ
ననుచరు? లింతయేల? విను మాత్మజ నిమ్ము మదీయసేవకున్,
దనిసి తపమ్ము చేసికొనెదన్, సుఖ మబ్బెడి దీన నీ కొగిన్."

దేవి— ఇందు వైషమ్య మేమున్నది? రాచకన్నియలు మునిచంద్రులకు సేవ సేయుట యనాదిగా నున్న యాచారమే కదా! అది శ్రేయస్కరమే.

శర్యా— దేవీ! ఊరక సేవ చేయుటయే యనుకొంటివా! శేషము వినుము. అతఁ డంతతోఁ జాలింపక,

క. "జనవర! క్షమాపణన్ గో
రినవాఁడవయేని న్యాయరీతిని నీపు
త్రినొసంగి పెండ్లి సేయుము
మునినగు నా కిడఁగ శంక మొనయుట తగవే?

క. నీకొమిరె సేవ సేయ న
నాకులగతి నేఁ దప మ్మొనర్చికొనెద నీ
కే కాదు నీదుసేవక
లోకమ్మున కెల్ల సుఖములు గలుగు దీనన్.

దేవి— అక్కటా! సర్వజ్ఞుం డయ్యు నిట్టి విపరీతప్రసంగలోనికిం దిగినాఁ డేమో! వృద్ధునకుఁ దన కీ గుదికట్టు యెందులకో! ఊరక యట్లు కోరెనే గాని మన మంగీకరించినను నయ్యనఘుఁ డంగీకరించు ననుకొంటిరా? మన మనము చూచుటకై యిట్లు కోరి యుండు నని నాయభిప్రాయము.

శర్యా— దేవీ! అంగీకరించుటకు మనమెవ్వరము? మన కధికార మున్నదే యనుకొందము.

చ. ముసలికి గ్రుడ్డికిన్ మిగుల మోటునకున్ సురకన్యవోని నా
దు సుత నొసంగి సౌఖ్యములఁ దూగఁగ నిచ్చ యొనర్చు టెట్లు? లా
త్మసుఖము గోరి యెవ్వఁడును మంచియుఁ జెడ్డయు నేర్చువాఁడు? పు
త్రిసుఖము వాపి కాఁపురము ద్రెళ్లఁగఁ జేయునె? కీర్తి రోయునే?

గీ. అక్కటా! కడువృద్ధుని నంధు మందు
నితనిఁ బతిగా వరించి పంచేషుబాణ
వివశయై యొప్పు మత్పుత్రి వేగు నెట్లు?
బ్రతికియున్నంతకాలమ్ము ప్రథకుఁదక్కి.

అదియునుం గాక,

చ. తమ కనురూపులౌ పతులు తారసమైనను మేటియందచం
దములు గలట్టి కామినులు దక్కఁగలం గవఁగూడ నెంత్రు దు
గ్గమమగు జవ్వనమ్మున నొకం డిటువంటి కురూపి భర్తగా
నమరినఁ జెప్ప శక్యమె! యహల్య సురేశ్వరుతోడఁ గూడదే!

అననుగుణ దాంపత్యంబుకన్న దుఃఖంబు వేఱు లేదనుకొని యమ్మని కేమియుం జెప్పనేరక విమనస్కుండనై యిట్లు చనుదెంచితి. ఇందుల కేమి యుపాయముం జెప్పెదవు? ఇచ్చినచో నాఋషి పరిగ్రహించుట నిక్కంబ. ఆయన జితేంద్రియుం డయ్యు మన కర్మవశమున నట్టి దురూహ నేఁటికి జనించినది.

దేవి — అయ్యో! యెంత పాపకృత్యమున కొడిగట్టినాఁడు! వేఱొం డుపాయమ్ము చూడుఁడు. లేక లేక కలిగినకూఁతు నమ్మని కిచ్చుటకన్న నతని వశమున మన మెల్లరము చచ్చినను సమ్మతమే.

శర్యా — సెబాసు! దేవీ, సెబాసు! మంత్రులును బౌరులును గూడ ఖండితోత్తరముగా నిట్లే చెప్పినారు.

క. ఉటజమ్మున నఁట కాఁపుర
మఁట! ముదుసలి కోపియునగు నంధుండఁట ! య
క్కఁట! నా తనయకుఁ బతియఁట!
ఘటియించిననాకుఁ బుట్ట గతు లెట్లుండుఁ ?

(తెరలో)

ఉ. నాకొఱ కింతయాపదఁ గనందగునయ్య! నరేంద్ర! నేన య
వ్యాకులలీల నేగి మునివర్యుని మత్కృతదుష్కృతక్రియా
పాకృతనేత్రు నుద్ధరకృపాయుతుఁ గా నొనరింతు నాత్మదా
నాకలనమ్మునన్, సుఖము లందుఁడు స్వస్థతఁ జెంది యెల్లరున్.

దేవి — (విని) మన మనుకొనుచున్న మాటలను వినియో లేక యక్కడి ప్రశంస చెలుల కతన నెఱింగియో మన చిరంజీవిని వచ్చుచున్నది.

(సుకన్య ప్రవేశించును.)

శర్యా — (తొడపై నిడికొని) అమ్మా! యేమంటివి?

సుక — ("నాకొఱకింత" అనునది మరలఁ జదువును)

శర్యా— (కన్నీరు దెచ్చుకొని)

చ. అవల మహేమిత్రయైన ముద మందితి ధన్యుఁడ నైతిఁ దల్లిరో!
శివశివ! యెట్లొనర్చెదవు సేవన? మవ్వనమందు నిల్చి యా
చ్యవనున కక్షిహీనునకు సంతతకోపికి వృద్ధమూర్తికిన్;
గువలయనేత్ర! మత్సుఖము గోరి నినున్ మునినాని కిత్తునే!

క. ధనధాన్యసమృద్ధునకున్
సునిశితమగు వయసు గల్గు సుందరునకు నం
దని నీఁడగు జనకుఁడు; ని
ర్ధనునకు ముదుసలికి నిడుట ధర్మంబగునే?

క. మృదుతాంబూలీదళముల
నెద నుష్ట్రమ్మన కొసంగ నెవఁడొప్పెడి? న
మ్మృదుసలి వరించు నినుఁ గని
ముదితలు నవ్వరె వివాహమున? నా తల్లీ!

క. అమ్మా! విను మేనును రా
జ్యమ్మను వమ్మైనఁ గాని జంకుఁగొనన్ ; ని
న్నమ్మదునె? యిందుకై నే
త్రమ్ములు లేనట్టి ముసలితపసికి నకటా!

సుక— (నిలువంబడి)

చ. జనవర! యిట్టులాడుటయు సమ్మత మెట్లగునయ్య? లోకపా
వనుఁడు మహామహుండు మునివర్యుఁడు వృద్ధ నేల? నిత్యసే
వన మొనరించుదాన సుఖవాంఛ యొకింతయు నాకు లేదు; భూ
జనులకు నెల్ల నాకతన సౌఖ్యము గల్గుట యొండు చాలదే?

క. వనమున నమ్మునివరు సే
వనమునఁ దగులొంది భక్తిపరవశనై యా
తని మాట కడ్డుదాఁటక
జనవర! నీకున్ యశంబు సంపాదింతున్.

నాకై నీ వించుకయు విచారింపకుము. "అవశ్య మనుభోక్తవ్యం
కృతం కర్మ శుభాశుభం" అనుట వినలేదా?

గీ. రుద్రుఁడు కపాలి చంద్రుఁడు రోగి యాట
సూర్యుఁడు పరిభ్రమించు టించుకయు నన్య
కారణమ్మునఁ గా దది కర్మఫలము
సకలజగములు గర్మవశమ్ము సుమ్ము.

ఇందు మీ తప్పేమి యున్నది? నే నమ్మునివరు నేత్రమ్ముల కపాయ మ్మొనరించితిని. నేనే తత్ఫల మ్మనుభవింపవలయు. "అత్యుత్కటైః పుణ్యపాపై రిహైవ ఫలమశ్నుతే" కావునఁ దద్దోషం బీ జన్మమున నే యనుభవించెద.

దేవి— తల్లీ! నీవు చిన్నదానవు. కష్టసుఖమ్ము లెఱుంగవు. సాహసము పనికిరాదు. వివాహ మన యావజ్జీవభావ్యము గాని వేఁట రేపఁటఁ దీఱెడిది గాదు.

సుక— తల్లీ! అట్లెందుకుఁ దీఱవలయును?

క. అనసూయ యత్రికి వసి
ష్ఠునకు నరుంధతియుఁ బోలె సుగుణుం డగు న
మ్ముని ప్రేమ భ్రీతిఁ గొల్వద
జననీ! నీ వింతఁ జింత సలుపుట తగునే?

ఇందులకు నంతరాయమ్ములు మీ రెన్ని వచియించినను నా మదికెక్కవు. నన్ననుగ్రహించి యయ్యనఘాత్ము సన్నిధికిం దోడ్కొని పోయి మనఃపూర్వకమ్ముగా సమర్పించి తత్కృతాశీర్వచనమ్ముల నందికొనుఁడు.

శర్యా— (కన్నీటితో) అమ్మా! సర్వదా పరిచారికలు సేవింప మెలంగెడి నీ వమ్మునినెట్లు సేవింప నేర్తువు?

సుక— సేవింపకేమి? నాకు నాపరిచారిక లెట్లు సేవ సల్పుదురో, యంతకు శతగుణమ్ముగ నయ్యనఘాత్మునికిఁ బరిచర్య సల్పుదాన. ఇది నాకుఁ బరమసమ్మతంబ. ఇట్టి మహానుభావుని శుశ్రూష యెంతవారలకు లభియించును?

సీ. నలుదిక్కులకు నేగి నానావిధమ్ములౌ
ఫలమూలములు దెచ్చి పజ్జ నునిచి
యగ్నుల నలరింప ననుగుణమ్ముగు సమి
జ్జాలంబు శుష్కంబు సంతరించి
తిలలును గుశలును దెచ్చి, తోమిన కమం
డలువుతో జతగూర్చి కేలన నిలిపి
యుష్ణోదకస్నాన మొనరింపఁగాఁ జేసి
యజినంబు పఱచి యాం దల్లఁ జేర్చి
గీ. యనఘ! యిఁక నిత్యకర్మమ్ము నాచరించు
కొనుఁడని వచించి, కర్మాంతమునఁ గరమ్ము

పట్టికొని సంస్తరణమున కట్టెచొన్పి
మునికి ననుగుణమైన సేవన మొనర్తు.

తల్లిదండ్రులారా ! మీకు దుఃఖ మెందుకు ? నాకు మునిసేవ సేయు క్రమ మంతయుఁ గరతలామలకమై యున్నయది.

శా. నీవారాన్నముఁ గందమూలఫలముల్ నేమమ్ముమై వండి యెం
తే వేడ్కన్ భుజియింపఁ బెట్టి తగుతృప్తిం జెందఁగాఁ జేతుఁ బైఁ
గావింతున్ గరశుద్ధిఁ గాళ్గడుగుదుం గైకొమ్ము తాంబూల మో
దేవా ! యంచు నొసంగి యాసనము పొందింతున్ గరాధారమై.

(తెరలో) అయ్యో ! అయ్యో ! యీరోగబాధపడలేము. బాబూ! రక్షింపవలెను.

శర్యా— (విని తనలో) కొమిరె కుతూహల మట్లులున్నది, లోకులబాధ యిట్లులున్నది. ఏమి చేయుదును ? (ప్రకాశము) దేవీ ! చిరంజీవిని యుద్యమము వింటివికదా ? ఇంతకును నిది దైవచోదితము. మున్ను సావిత్రి యాసన్నమరణుఁడగు రాకొమరున్ వరించి సమస్త సుఖములనంది యశంబు సంపాదించలేదా ? అట్లే మన కూఁతునకును దైవ మనుగ్రహించుఁగాక.

(తెరలో) తథాస్తు.

దేవి— (విని) ఇందులకు దేవతలు గూడఁ దోడ్పడుచున్నారు. మునుల మహిమములు విచిత్రములు. అయ్యనఘుండు కామరూపియైనం గావచ్చును.

సుక— అమ్మహామహుఁడు నాకిప్పుడే కామరూపి యయి యున్నవాఁడు. ఏలజాలమొనరించెదరు ? లేనిచో నాయంతన యరుగుదానను.

శర్యా— తల్లీ ! అంతపని కెందుకు ? ఇదె మేము వచ్చి నిన్న య్యనఘునకు సమర్పించుచున్నారము. నీకు దేవతలు శుభము గూర్తురుగాక !

(అందఱును నిష్క్రమింతురు)

గద్య

ఇది... శ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
సుకన్య యను నాటకమ్మునందు ద్వితీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# సుకన్య

---

## తృతీయాంకము

(శర్యాతియు దేవియు సుకన్యయుఁ గొంత పరివారమును బ్రవేశింతురు)

శర్యా— దేవీ! ఇదియె, యమ్మునీంద్రునాశ్రమము. సమీపమునకు వచ్చితిమి.
(పరిక్రమింతురు)

దేవి— (కూఁతు నుద్దేశించి) అమ్మా! ఈవనము చూచిన నేరికేని యొడలు గడఁకెడిని. ఇయ్యెడ నీ వెట్లు కాఁపురమ్మున్నెదవు! అమ్మునిని మఱి యొక తెఱఁగునఁ బ్రసన్నుఁగా నొనరించికొనియెదము. నీ వీయుద్యమము నుండి మరలుము.

సుక— తల్లీ! నాకిదియే పట్టణముగాఁ దోఁచుచున్నది. నే నమ్మహామహుని మనములోఁ గామించి యున్నదానను. ఇఁక నన్యుల నెట్లు వరింతును?

శర్యా— దేవీ! అదియే మేము త్రవ్వించిన వల్మీకము. అదుగో! ఆ మహానుభావుఁడు.

(చ్యవనుఁడు ప్రవేశించి)

చ్యవ— (తనలో) అక్కటా! రాజపుత్త్రి యెంతపనిచేసినది! పుట్టదరికివచ్చిన తోడనే, నేను,

క. కని శుష్కస్వరమున "నో
వనజానన దీనిఁ ద్రవ్వ వలవదు దూరం
బున కేగుము నేఁ దాపస
జనుఁడ" నటన్న విన కిట్టి శాస్తి యొనర్చెన్.

మదోన్మత్తులగు రాజుల నిసువులకు బోత్తిగాఁ గార్యాకార్యమ్ములు దెలియవుకదా! ఇంతకు నిది కర్మలబ్ధము కావున ననుభవింపక తప్పదు. పాపము! ఆ రాకన్నియ యేమి చేయును? (యోజించి) కాని యీ కన్నియం జూచినది మొదలు పరమవిరాగినగు నాకు సంసారవాంఛ

యుదయించుచున్నది. రాజు నామాట కెద్దియు నుత్తరమీకయే యరిగి నాఁడు (విని) ఏదో కలకలము వినవచ్చుచున్నది.

శర్యా— (దరి కరిగి భార్యతోఁగూడ నమస్కరించి) మునీంద్రా! ఇదిగో, నాకొమిరె సుకన్యను నీకు భార్యగా నర్పించుచున్నాఁడను. దన్నను గ్రహింపుము.

చ్యవ— (సంతోషముతో) నీకు సర్వశుభములును గలుగుఁగాత.

శర్యా— మహాత్మా! ఇక్కన్నియతోఁబాటు నారాజ్యమ్ము సగము నీ కరణం బిచ్చుచున్నాఁడను.

చ్యవ— (నవ్వి) రాజా! మునులమగు మాకు రాజ్య మెందులకు? మాకీ కన్నియయే చాలును. ఇతరము లేశమును బరిగ్రహింపము.

దేవి— స్వామీ! మీ రిప్పుడు గృహస్థాశ్రమము నవలంబించుచున్నారు గాన ధనము నావశ్యకమే కదా!

చ్యవ— సురాజ్ఞీ! యవధరింపుము. ఋషుల గార్హస్థ్యమునకును దక్కరుల సంసారమునకును దారతమ్యముండెడిఁగదా?

చ. నలితోలి లేని కందరమునన్ వసియించుట సర్వకాలముం
దోలఁగక పాఱు నీరములఁ ద్రోఁగుట తా మయి ముగ్గి రాలు స
త్ఫలముల నేర్చి మెక్కుట తపంబొనరించుట శుద్ధవర్తనం
బొలయుటయున్ మునీంద్రులకు నొప్పెడి; నొడ్లకు నవ్వి యొప్పునే!

క. మృగములె తోడంబుట్టువు
లగములె గ్రామములు గహన మానందం బీ
జగమున మునులకు నొరులకుఁ
దగునే పోల్పంగ? నెవ్విధమ్మున నైనన్.

క. ధన మంత పలసి వచ్చిన
గను లీవే? రత్నములను గాంచనమును; మీ
కును నివియ కా యొసంగుట?
ధనమేటికిఁ దాపసులకు దంభన మకటా!

శర్యా— మునీంద్రా! మాకాజ్ఞ యొసంగుఁడు. పురమ్మున కేగెదము.

చ్యవ— శుభమస్తు.

దేవి— మునీంద్రా! "ఈ మా కన్నియ యెఱిఁగి యెఱుఁగక యొనరించు తప్పుల నొప్పులుగా గణించి యేలుకొనుఁ" డని మిమ్ము వేఁడుకొను చున్నదానను.

శర్యా— తపోధనాగ్రగణ్యా ! నా యీ మనవి చిత్తగింపవలయు.

సీ. నడిచి యెఱుంగ దెన్నఁడు నేని రత్నకం
బళములపైఁ గాని వట్టినేల
కొలిచి యెఱుంగ దొక్కొటఁగాని దేవదే
వుల నేనిఁ దల్లిఁ దండ్రులనె కాని
పలికి యెఱుంగ దెప్పట్లఁ బెంపుడు పులుం
గులతోనె కాని యన్యులకు నెదిరి
నిలిచి యెఱుంగ దేనెలవునం దెపు డంతి
పురియందె కాని మాదరిని నేని

గీ. మాకొమిరె యంచుఁ జెప్పెడిమాట గాదు
శుద్ధముగ్ధావతార మీ సుందరాంగి
తప్పులొప్పులుగాఁ జూచి దయను బ్రోచి
మమ్ముఁ గృతకృత్యుల నొనర్పుమా మునీంద్ర!

(కూఁతు నుద్దేశించి) అమ్మా ! నీకు వేఱే యొకరు జెప్పఁ దగిన యంశములు లేవు. ఐనను,

గీ. రాచకూఁతుర ననెడి గర్వంబు మాని
యణఁకువ వహించి మెలఁగు మీయనఘుపట్ల
అమ్మరో ! దాన నిహముఁ బరమ్ము గల్గు
సజ్జనారాధనము వృథా చనదుసుమ్మ.

సుక— (తలవంచికొని వియోగదుఃఖము సూచించును.)

శర్యా— తల్లీ ! విచారింపకుము.

గీ. తఱచుగా వచ్చుచుందు, మీతల్లిగూడ
నప్పటప్పటి కరుదెంచి యరయుచుండు
నెప్పటికి నప్పుడే సేమ మెఱుఁగఁజేతు
సంతతము నీదు చెలుల నంపింతు నిటకు.

దేవి— తల్లీ ! హరిహరబ్రహ్మలకును దుర్లభంబగు తపమ్మున నెన్నిక గన్న యిమ్మునివరునియెడ మన్నన గలిగి మమ్మును రాజ్యసుఖమ్ములను దల పెట్టక యుభయకులమ్ములకు వన్నెం గలిగింపుము. పోయివచ్చెదము. (కౌఁగిలించుకొని కన్నీరునించును.)

సుక— అమ్మా ! నాకై మాత్రము విచారింపకుము. నేను

క. మునిపత్నీ వేషమ్మును
గొని నీకుఁ సద్యశంబు గూర్పఁగ మఱి నా

కను బరము గూర్ప నిపా
వనని మదికి వచ్చునట్లు వర్తింతు నిటఁక.

మీరలు చనుఁడు. (అని యాభరణములు తీసి తండ్రిచేతి కిచ్చుట నటించును.) తండ్రీ! ఈ భూషణమ్ములు నా చెలికత్తియల కిప్పింపుము. నాకు నారచీరలు దెప్పించి యొసంగుము.

శర్యా— (కన్నీటితో) మంచిది. అట్లే పంపించెదను.

(భార్యతో నిష్క్రమించును.)

సుక— (దృష్టినిగుడ్చి తనలో) అప్పుడే తల్లిదండ్రులు దృష్టిమార్గము నతిక్రమించినారు. అగుఁ గాక. ఇఁక నాకు వారితో నేమియవసరము.

గీ. తల్లి తండ్రియు దైవంబు దాత గురుఁడు
తపము దానంబు సత్యంబు కృపయు సకల
మిమ్మహాత్ముఁడె యీతని నెమ్మనమ్ము
సమ్మదంపడుటయు నాకు సమ్మదంబు.

(అని చేతులు జోడించి) ఇదే మీపాదదాసి. ఏమి యాజ్ఞ? సెలవిండు.

చ్యవ— రాజపుత్రీ! సంధ్యాకాల మిఁక నొక రెండు గడియలకు వచ్చునను నంతవఱకు నాకు నీవలని కార్యం బొండులేదు. అంత దనుక నియ్యెడఁ గూర్చుండుము. నీకు బోధింపఁ దగిన యంశములు కొన్ని గలవు. వానిని సావధానచిత్తవై యాకర్ణింతువుగాక.

సుక— చిత్తము. ఆనతిండు.

చ్యవ— నీవు రాచకన్నియవు. నీకు నాచారవ్యవహారము లంతగాఁ దెలిసియుండవు. అంతగాఁ గాదు, బొత్తిగాఁ దెలిసియుండవు. వైదికవర్తనులకు లౌకికుల కన్నియలను బెండ్లిచేసికొనిన నాచారములు భేదించునుగదా. అందులో జాత్యంతరులైనచో వేఱే చెప్పనే యక్కఱలేదు.

సుక— చిత్తము. దేవర యేర్పాటు చొప్పున జాగరూకత గల్గి వర్తించెద. అప్పటికిని దోసఁగులు పొసంగిన క్షమింపఁ గోరెద.

చ్యవ— తలోదరీ! శ్రద్ధాభక్తులు గల నీకు నియ్యవి యలవడుట యొక కష్టము గాదు. వినుము.

క. రవి యుదయింపక మును లే
వ వలయు శాస్త్రోక్తవిధిని బనులెల్లను దీ
ర్పవలయు నెప్పట్టున శుచి
దవులని పని సేయఁదగదు తరుణీమణిగో!

ఇది సంక్షేపముగాఁ జెప్పెడి తెఱంగు. దీనిచేతనే నీవు సకలమ్మును గ్రహింపఁ గలుగుదువు. సందేహమ్ము గలిగినయెడ నడుగుచుండుము విస్తరించి చెప్పెదను.

సుక— చిత్తము. ఈ మూఢురాలొకమనవి చేసికొనుచున్నది. కులస్త్రీలెట్లు వర్తించిన నిహపరమ్ములకు వెలిగాకుందురు? ఇయ్యెడలఁ బలువురు పలు తెఱంగుల నుడువుచున్నవారు. తమ తాత్పర్యము వినఁ గోరెద.

చ్యవ— సాధ్వీమణీ! ఇయ్యెడల నీ కొరులు చెప్పవలసినది లేదు.

గీ. బాల్యమందునఁ జదువు నేర్వంగవలయుఁ
వయసువచ్చిన పదఁపడి భర్తయొద్ద
నే మిగులు దానిఁ దాఁ బఠియింపవలయు
గాని యన్యుఁడు గురుఁ డింకఁ గాఁడు సతికి.

సుక— చిత్తము. భర్త చదువురానివాఁడు గాని లేక యీమెకు నభిమతమగు విద్యయందుఁ బ్రవేశము లేనివాఁడు గాని యైనచో ?

చ్యవ— (నవ్వి) సమాధానము చెప్ప శక్యము గాని యంశముగాఁ గన్పట్టుచున్నను నియ్యది దత్తోత్తరమే ! ఏమంటివా ? ధర్మార్థకామములయందు భర్తకనుకూలురాలుగా నుండునదియే కదా పతివ్రత యనిపించుకొనును! అట్టిచో నతఁడు మూర్ఖుఁడైనఁ దానును నట్టులే నటింపవలయును. అతనికి నభిమతము గానిది తన కభిమతమే కాఁగూడదు; ఐనను ద్యజింపవలయు. (యోజించి) నీ కీయుత్తర మంత రుచింపక పోవు టట్లుండఁ బై పెచ్చు దీనిపై ననేకములు కుశంకలు గూడఁ దోఁప వచ్చును. కావున నింకొక్కటి చెప్పెద వినుము. వివేకినియగు కన్నియను మూర్ఖున కిచ్చి పెండ్లియొనర్చుటయే తప్పు. అట్లేని దైవవశమున సంభవించినచో నేను జెప్పినదియే యుత్తరము. మఱియు నొక్కటి వినుము.

ఆ॥ వె॥ భర్త మూర్ఖుఁడైనఁ బత్ని కేవలము గ
ర్వమ్ము దాల్ప కవసరమును బట్టి
మనవి చేయు పగిది మంచిచెడ్డలు బోధ
సేయవచ్చు నఘము చెంద దతివ!

దీనిచేతనే యిహపరమ్ముల కాససేయు పతివ్రతల కంతగా స్వాతంత్ర్య ముండఁదగదని నీకు స్పష్టపడియే యుండును. ఇంక నొక్కటి యాలకింపుము. గానాభినయాది శృంగారవిద్యలు కులస్త్రీల కనుపయుక్తము లగు టట్లుండఁ బై పెచ్చు హానికరంబులు. స్త్రీలకు విద్య

యెందుల కనఁగా జ్ఞానమునకుఁగదా! దాని నొసంగనివిద్య పురుషులకును ననవసరమే.

గీ. మంచిచెడ్డలు దేనిచే మనకుఁ దెలియు
నయ్యదియె విద్య దానినే యభ్యసింప
వలయు నితరం బవిద్య యభ్యాసమునకుఁ
దగదది సదా సదాచారతత్పరులకు.

సుక— (ఆకాశమువంకఁ జూచి) దేవా!

గీ. అరుణుఁ డరుణ ప్రభాంకితకిరణుఁడగుచు
వరుణుదెస నల్లనల్లన వ్రాలుచుండె
నిడుదలుగఁ దోఁచెఁ జెట్టుల నీడలెల్ల
గహనవీధుల చలువలు గ్రమ్మఁ జొచ్చె.

చ్యవ— అట్లేని నన్నీయెడ నుండి సరోవరమ్ము పొంతకుఁ దీసికొని చనుము. అయ్యెడల నేతత్కాలోచిత కృత్యమ్ములు నెఱవేర్చికొనవలయును.

సుక— (పరికించి) స్వామీ! తటాక మెక్కడను గానరాదే!

చ్యవ— ఇట నుండి పడమరగా నొక్కింత పోతిమేని యయ్యెడ సాలతాల తమాలహింతాలాదితరునికరంబుల డంబగు నొకయకృత్రిమ వనరాజి గన్పట్టు, దాని నతిక్రమించినచో

ఉ. మానససన్నిభం బనుపమానజలంబు సమస్తపక్షిసం
తాననివాసభూమి సముదంచితపంచవిధాబ్జసంగతం
బై నిఖిలాగమాకరతటానుగతంబు తటాక మొక్కఁడిం
పౌ నలుప్రక్కలం జెలఁగు నద్రులు పోయనిగట్లు దానికిన్.

(సుకన్య భర్తృకరము పట్టికొని పదిలముగా నడిపించుచు.)

చ్యవ— (కొంతవరకు నడచి) చెట్లతోఁపుదరికి వచ్చినట్లున్నాము.

సుక— ఇంకను రాలేదు. కొంతదూరములో నున్నది.

చ్యవ— కాల మతిక్రమించుచున్నట్లున్నది, త్వరగా నడువుము.

సుక— చిత్తము. అట్లే నడుచుచున్నాను. (వేగముగా నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁ బడిన
సుకన్య యను నాటకమ్మునందుఁ దృతీయాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# సుకన్య

---

## చతుర్థాంకము.

(అంత నారదుఁడు ప్రవేశించును.)

నార— భూచక్రమెల్లఁ గ్రుమ్మరుచుంటిం గాని యెన్నఁడును నిట్టి పతివ్రతా శిరోమణిని జూచి యెఱుఁగను. ఓహో! యేమి యీ పతిభక్తి! పతివ్రతలు లేరని కాదు.

గీ. అందము వయస్సు ధనము విద్యయును గలుగు
భర్తయెడలఁ బతివ్రతల్ పలువు రుండ్రు
వృద్ధు నిర్ధని గ్రుడ్డియుఁ గ్రుద్ధుఁడు నగు
భర్త కిటు సేవ సేసెడి పడఁతి గలదె!

(యోజించి) "పురుషాణా మభావేన సర్వా నార్యః పతివ్రతాః" అనునట్లు లీ కాఱడవిలో సుందరులగు పురుషుల సందర్శనమే యీమెకుఁ దటస్థింపదు గావున నీ సాధ్వి పాతివ్రత్యము నిరంతరాయముగ జరగుచున్నది. (ఆకాశమువంకఁ జూచి) అశ్వినేయులు కాఁబోలు నాకసము నుండి యవతరించుచున్నారు. (మఱియొకవైపునకుఁ జూచి) ఈప్రక్క నుండి సుకన్య జలాహరణార్థము తటాకమున కరుగుచున్నది.

(అంత నశ్వినులిరువురును బిందె చేఁబూని సుకన్యయు వేరువేరుగాఁ బ్రవేశింతురు)

సుక— అప్పుడే జాము పొద్దెక్కినది. త్వరలోఁ బోయి నీళ్ళు దెచ్చికొని వైశ్వదేవమునకు వంట గావింపవలయును.

ప్రథ— సఖా! నేను నీతోఁ జెప్పిన సరోవర మిదియే. చూచితివా, మానససరస్సు దీని ముందు గణనీయమగునా?

ద్వితీ— దీని కిదియే యుపమానము. స్వర్గము స్వర్గ మనుటయే కాని యొక్కొక్కపట్టున భూలోకమునకుఁ దీసిపోవు ననియే నా యభిప్రాయము.

నార— (తనలో) వీరు దేవతలలోఁ గడు సుందరపురుషులు. ఈమె త్రిలోక

మూలకును నందమున నెన్నఁదగినది. వీర లిరువురును నీతటాకమ్ము పొంతఁ దారసించుచున్నారు. ఈమె పాతివ్రత్య మిప్పట్టున స్థిరపడ వలయును. నేనీ పొదరింట దాఁగి యిక్కడిసంగతులు పరిశీలించెద.

(నిష్క్రమించును.)

సుక— (నీళ్లు ముంచుట నభినయించి బిందె యెత్తుకొని కొంత నడిచి నిలిచి) అక్కటా! యెంత యభ్యసించినను నీగులకరాళ్లు కత్తులవలెఁ బాదములకు బాధగల్పించుచున్నవి. ఛీ! సౌకుమార్యమెంత పనికిమాలినది. దేవుఁడిచ్చిన కరచరణాదులను గ్రమప్రకారమున వినియోగపఱచుకొనక దాచికొనెడివారల కెన్నటికేని యిట్టి ముప్పున్నదే ఏమో యెప్పటి కేయవస్థ తటస్థించునో యెవరి కెఱుక ? (మరలనడుచును.)

ప్రథ— సఖా ! అటు చూడుము. ఆ లతాంగి యెవరై యుండును!

ద్వితీ— (చూచి) ఓహో, ఎవరని చెప్పఁగలము! చెలికాఁడా ! ఏమి యీ సౌందర్యము! ఈమెం జూచినది మొదలు నామనసు మనముగా లేదు. కాన నేనీ చానతో నొక్కింత మాటలాడి చూచెద.

ప్రథ— ఆపె యెవ్వరో మహాపతివ్రతవలెఁ బొడకట్టుచున్నది. అట్టివారలఁ బలుకరించుట తప్పు. అదిగాక నీమనము గలుషితమైనదని గూడఁ జెప్పుచున్నావు.

ద్వితీ— నామనమే నా కలుషిత మగుట, నీమనము కాలేదేమి? ఏమైనను సరియే పోయి పలుకరించెద. (అని కొంత దవ్వరిగి)

క. ఒక్కింత నిలువుమో జల
ముక్కచ ! యశ్వినులమేము మోదమ్మున ని
న్నొక్కటి యడిగెద మిక్కడి
కెక్కాలమున వచ్చి తేడ కేగెదు చెపుమా?

ప్రథ— (తనలో) ఓహో ! ఇతనిప్రశ్న కడు సందర్భముగా నున్నదే! నీళ్లకు వచ్చినది; ఇంటికి వెళ్ళుచున్నది. ఇతని కప్పుడే వెఱ్ఱి తలకెక్కినది. ఇందాశ్చర్యమేమున్నది? (యోజించి) పరకళత్ర సందర్శనము తప్పని యెంత బోధించినను, నా దృష్టియు నద్దెసఁ బాయకున్నయది. ఈ దోషము సహజాకర్షణశక్తి గల యీ సుందరి యందమ్మునదే యుండవలయు.

సుక— (వినియును విననియట్లు నడుచుచుండును.)

ద్వితీ— (మఱియుం గొంత నడిచి)

గీ. పంకజాక్షిరో ! నీకు నెవ్వాఁడు భర్త ?
యెవని కాత్మజ ? వకట ! రెండవసిరి యనఁ
గలుగు నీ మృదుపదము లీ కర్కశంపు
నేలఁ బొరసిన మామది జాలి వొడమె.

ప్రథ— అక్కటా ! ఆమె యితనిమాట వినిపించుకొన్నట్లు లేదు. నేనుఁగూడ నొక్కింత పలుకరించి వాగ్వైభవమును సార్థక మొనరించుకొనియెద. (సమీపించి)

క. కమలాక్షి ! విమానమునకు
నమరెడి నీ కిట్టి యటవియం దంఘ్రిచర
త్వము వొల్చుటెట్లు ? దాసీ
సముదాయముతోడ నేల చనుదేరనొకో ?

సుక— (వెనుకఁజూచి తనలో) ఓహో ! వీరలెవరో యుక్తాయుక్తము లెఱుఁగని నాగరులవలె నున్నారు. అగుదురుగాక, వీరితో నా కేమి యవసరము. (పోఁబోవును)

ద్వితీ— (దారికడ్డమై)

క. రాజపుత్త్రికవో ? యచ్చరవో ? వచింపు
మేమహాభాగ నినుఁగన్న దిందువదన !
నిన్నుఁ జైకొన్న భర్త వర్ణింపఁదగఁడె ?
యని నీకల్మి నాకలోకాధికంబు.

ప్రథ— (ప్రీతితో)

క. నిను నిత్యము గనుఁగొను నీ
వనమృగముల భాగ్యదశయుఁ బకులపుణ్యా
మ్మును నెన్న శక్యమే ? పా
వనమయ్యెన్ భూమి నీదు పాదరజమునన్.

ద్వితీ— (వినయముగా)

క. స్తుతికేమి; నీకు నెవ్వఁడు
పతి ? జనకుం డెవఁడు ? పద్మపత్త్రాక్షిరో ! యా
కృతకృత్యుల దర్శింపఁగ
మతివొడమెం దెలుపు వారి మనికి సదయతన్.

సుక— (తనలో) వీరికి నాయం దాదరము గలుగుటకు హేతువు కానరాకున్నది వైఖరి చూచిన శుద్ధకాముకులవలెఁ బొడకట్టుచున్నారు. మాటలును

మూఁడు పంతులు తదనుగుణముగనే యున్నవి. కాని కొన్ని పలుకు లట్లు కనుపట్టవు. యథార్థము వచించెదఁగాక. ఇందు దోసమేమి? (ప్రకాశము)

గీ. ఏను శర్యాతికూఁతుర మానవీయుఁ
డుత్తమజ్ఞాని చ్యవనుని విత్తభార్య
నంధుఁడును ముదుసలి యగునట్టి భర్త
కెప్పుడును సేవచేయుచు నిచట నుందు.

ప్ర (తనలో) ఈమె మాటల వైఖరిం జూడఁ బైకి ననురాగము గానరాకున్నను లోపల ననురాగ మున్నట్లు సూచన యగుచున్నది. లేనిచో భర్త యంధుఁ డనియు ముదుసలి యనియు నేలచెప్పవలయును? (ప్రకాశము) అక్కటా, శర్యాతి యెంత దుర్మార్గుఁడు!

సుక— ఆయన దోష మిందు లేశమును గానరాదు.

క. న్యను నాయనుమతిఁ గొని మ
జ్జనకుం డమ్మునికి నిచ్చె సద్వర్తనుఁ డా
యనఘుని యాశ్రమ మయ్యది
చనుదేఁడిగు మీర లెవరొ సచ్చారిత్రుల్.

ద్వితీ— (తనలో) అక్కటా! యీమె వైఖరియందు లేశమును దుర్గుణమున్నట్లు లగుపట్టదు. కాని పలుకులయం దేలొకో కొంచెము వ్యంగ్యము గన్పట్టుచున్నయది. అయినను గొంతవఱకు మాట్లాడినచోఁ దేలక యుండునా? (ప్రకాశము)

ఉ. ఈ వొకవేళ నొప్పుకొనుచో నిజ, మేగతి నిచ్చెఁ దండ్రి దు
ర్భావుఁడు గ్రుడ్డియౌ ముసలివానికి? భూషణరాజిరాజితం
బై పరవస్త్రభాజనమునై వెలయుండగు మేను వల్కల
వావృతమయ్యెనే! యిఁకఁ బాపముఁ బున్నెము లేక పోయెనే!

ప్రథ— తలోదరీ! జలకలశమ్ము దించుకొని కొండొక సేపిచ్చటఁ గూర్చుండు వేని నేను నీ కొక్క సదుపాయమ్ము వచియించెద.

సుక— (తనలో) ఇతనిమాట లేవో యుపద్రవకరములుగాఁ దోఁచుచున్నవి. కాని సదుపాయమనుచున్నాఁడు. కావున వినవచ్చుననియే తోఁచెడిని (ప్రకాశము) నేనిట్టులే నిలిచి వినియెదను, వచింపుఁడు.

ప్రథ— (తనలో) అక్కటా! ఈమెకు మనకతన నాయాసము తటస్థించుచున్నదే. ఏమని చెప్పుదును. ఏమైననుసరే చెప్పిచూచెద.

(ప్రకాశము)

ఉ. నీ సరివచ్చు లేమ సురనీరజనేత్రలయందు లేని లే
దోసరసీరుహాక్షి ! యెటులో మెదుగ్రుడ్డికి భార్యవై కటా !
నీసొగసుల్ వయస్థితియు నేర్పును వమ్ముగ నిట్టులుండ నే
లా ? సమకాంతియుక్తుఁడగు నన్యు వరింపఁగరాదె, యుగ్మలీ ?

సుక- (తనలో క్రోధముతో) ఔరా ! వీని పోతరము. (అని కనులెఱ్ఱజేయును)

ద్వితీ— (పరిహాసముగా) సఖా ! ఆ సంస్కృత మెందుకు ? ధారాళముగనే చెప్పరాదా ! (సుకన్యదిక్కు) సుందరీ !

గీ. అంధు వరియించి జవ్వన మపనయించి
జన్మమును నిష్ఫలమ్ముగ సలుపనేల ?
వల్కలము లేడ ? నీవేడ ? వనమిదేడ ?
కొనఁదగదె మాయిరువురం దొకరుని ? యబల !

గీ. అట్లు వరియించి నందనమందుఁ జైత్ర
రథమునం దెల్లపుడు మనోరథము వెలయఁ
గ్రీడసల్పఁగ రాదె ? యీ ప్రౌఢగాని
వృద్ధు నంధుని సేవించి యేమి ఫలము ?

ప్రథ— (తనలో) ఏమో కడుఁ గోపముగాఁ జూచుచున్నది. కానిమ్ము, కొంచెము చెప్పిచూచెదను.

క. నరపాలపుత్రికవు నీ
కరయంగా రావె తగు విహారంబులు ? సం
సరణసుఖ మిట్టివానిం
బొరసినఁ జెడకున్నె ? యెట్టి పొలతికి నేనిన్.

గీ. ఫలజలాహారణమ్ముల బడలి, మృదుల
మైన నెమ్మేని వాసి యింతైనఁ గనక
విజనమగు విపినమ్మున వృద్ధదాసి
వగుట మేలని తోఁచెనె ? యంబుజాక్షి !

సుక— (తనలో) వీర లధికప్రసంగములోనికి దిగినారు. శపించితినా, వృథాగా నశించిపోవుదురు. బుద్ధి చెప్పి చూచెద. అప్పటికిని విననిచో దండోపాయ ముపయోగింపవచ్చును. (ప్రకాశము)

ఉ. మీరలు సూర్యపుత్రులరు మీకు సమస్త మెఱుంగవచ్చు ని
ష్కారణ మన్యకాంతనగు సాధ్విని నన్నిటులాడు టొప్పున

య్యా? రవి కశ్యపాత్మభవుఁ డారయుఁగా నఖిలంబు సాక్షియై;
ధీరులు మిమ్ముఁబోటు లిటు లేఁకువ దక్కుదురయ్యా! యెయ్యెడన్.

క. కులకన్యఁ గాని నేఁ బుం
శ్చలిఁగా నధికప్రసంగసంగతికిం బో
వలవదు మారాడిన మి
మ్ముల శపియింపఁగలరాజపుత్రికఁ జుండీ!

ఆశ్వినులు— (భయము నటించుచుఁ దమలో) ఔరా! ఏమి, యీమె ధైర్యము!

ప్రథ— (వినయముగా)

క. శీలముగల బాలలలో
నేలీలావతియు నీకు నీ డగునే? యో
లోలాక్షి! వర మొసంగెద
మోలిం గైకొమ్ము సౌఖ్య మొందుము దానన్.

సుక—(తలపంకించి) వర మొసంగెద రేమి? ఏమి వర మిచ్చెదరు?

ద్వితీ— (తనలో) ఈపెకు మనమాటయందు విశ్వాసము చెడినది. అయిన నిది యొక యుపాయము కనుపట్టుచున్నది. (ప్రకాశము) ఏమి వరమా?

ఉ. మమ్ముఁ గవీశ్వరుల్ మిగుల మన్ననఁ జేయుదు రెల్లయందు నం
దమ్మున మేటు లంచు విను తన్విరో? నీహృదయేశు నిట్టి రూ
పమ్మును బ్రాయముం గలుగువానిఁగఁ జేసెద మిందు నొక్కనిన్
సమ్మతిమై వరించెదవె సాధ్విరో! మూగురియందు భర్తగన్.

అదృష్టవశమ్మున నాతండు నీపతి యైనం గావచ్చును. లేదా నీ వప్పుడు విచారింప నవసరముండదు. నీయందలి కోర్కెచే మేము నిన్ని ట్లభ్యర్థించుచున్నారము. నీ కెట్లయినను నిందు లాభమే కాని నష్టము లేదు. ఆలోచించుకొనుము.

సుక— (తనలో) తుదకీతోవకు వచ్చినారు! ఐనను నిందులకు నేనై స్వతంత్రింపఁ జనదు. నాథుని కడకుఁ జని యయ్యనఘు సమ్మతిం గొనవలయు. (ప్రకాశము) మీ రియ్యెడలన యుండుఁడు. నే నరిగి మత్పతికి నివేదించి తత్సమ్మతిం గొని మీకు వచింతును. (నిష్క్రమించును)

ప్రథ— సఖా! ఆహా! అక్కన్నియ లేని యివ్వనము చంద్రిక లేని యాకసముకరణి నెంత వన్నె దరిగినదో చూడుము.

ద్వితీ— ఇప్పుడు మనయొనర్చిన యుపాయమున కమ్మని సమ్మతించునా?

ప్రథ— (ధైర్యముతో) సమ్మతింపకేమి? మును లమాయికులు గదా! అదిగాక యియ్యెడ నతనికే లాభమున్నది. భార్యకేమి; మంచియాకారము చెప్పడిన మఱియొక కన్నె వరించవచ్చును.

సుక— (ప్రవేశించి దరికరిగి) అశ్వినులారా! మీరు చెప్పిన తెఱం గమ్మహా మహుని కెఱింగించితిని. దానిపై నప్పుడయ్యండు

క. "దేవత లసత్యవాదులు
గా వలవదు వారియాజ్ఞఁ గావింపఁగ నెం
తే వేగ మరిగి యిటకుఁ
రా వెర వొనరింపు మా సురభిషగ్వరులన్"

అని యాజ్ఞాపించెను. ఆయన మీరాక కెదురు చూచుచున్నవారు

ప్రథ— అట్లయిన మేమక్కడి కేందుకు? నీ పతి నిక్కడికే దీసికొనిరమ్ము. ఆయన ముందుగ నిత్తటాకమ్మున మా యిరువురితో స్నానం బొనర్పవలయు.

ద్వితీ— అవును, వేవేగఁ దీసికొని రమ్ము.

(సుకన్య నిష్క్రమించి చ్యవనసహితముగాఁ బ్రవేశించును.)

సుక— నాథా! మీరు వారిరువురితో నాతటాకమ్మున మునుఁగ వలయునఁట. ఇందుఁ గపట మేమియు లేదుకద?

చ్యవ— సుందరీ! వారు నిజముగా నశ్వినులే యైన నేమి చేసినను జేయఁగలుగుదురు. కానిచోఁ గాపట్య మాచరింతురు; నశింతురు.

సుక— తమ కేమియు భంగము గలుగఁ జేయరుగదా!

చ్యవ— (నవ్వి) వెఱ్ఱిదానా!

క. అపరాధం బొండెఱుఁగక
తప మొనరుచు శక్తిభక్తతతి కెవ్వారే
నపకారం బొనరించి సు
ఖపడుట చెప్పుడునె? హరుఁడు కనలక యున్నే?

అంతకాలము పుట్టలో నివసించి యున్న నా కేవిధమైన హానియు లేకుండుట నీ వెఱిఁగినదే కదా. ఇప్పుడు వీరు నన్నొకవేళ నీటిలో ముంచి వేయుదురే యనుకొనుము. అప్పుడును నేను భంగపాటు కనను. తపశ్శక్తి కన్నిశక్తులును లొచ్చుగాఁగలవు. సందేహింపకుము.

సుక— అట్లయినఁ బదుండు. (అని చేయి పట్టుకొని పరిక్రమించి) నాథా! అరుగో, నశ్వినులు. వారితో మీరు మాట లాడుఁడు.

ప్రథ— (తనలో) ఇయ్యనఘుం జూచిన నాకు గుండె లదరుచున్నది. (సమీపించి) స్వామీ ! నమస్కారము. మా తప్పులు సైఁచి మమ్ము మన్నింపుఁడు.

ద్వితీ— (నమస్కరించి అట్లే చెప్పును.)

చ్యవ— నిర్వ్యాజపరోపకారపారీణులగు మీ రూరక యే తప్పును నొనరింపరు. ఒకవేళ నొనర్పఁ బూనినను నయ్యది యొప్పుగనే పరిణమింపఁ గలదు. దీనికేమి, యిప్పుడు నే నొనర్పవలసిన దేమి ?

అశ్వి— ఆ తటాకమ్మున మాతోఁ గూడ మునుఁగ వలయు.

చ్యవ— ఆలస్య మెందులకు ? పోదము పదుండు. (ముువ్వురును నిష్క్రమింతురు)

సుక— (దృష్టినిగుడ్చి) ముువ్వురును మునుఁగుచున్నారు. (మఱలఁజూచి) శిరములు మాత్రము కనవచ్చుచున్నవి. ఆహా ! యేమి యీ వైచిత్ర్యము- మూఁడు మొగములును నొకటే తీరున నున్నవే !

(మొగములు మాత్రము తెరచాటునుండి కనుపడవలెను.)

ప్రథ— ఇందు నీపతి నేరికొనుము.

ద్వితీ— (అట్లేపల్కును.)

తృతీ— (అట్లేపల్కును)

సుక— అక్కటా! స్వరమునందును భేద మగుపట్టదు. నాధుండు గూడ యథార్థమునకుఁ గట్టువడి వారిలోనే చేరినాఁడు.

ఉ. చక్కఁదనమ్మునన్ వయసుచందమునన్ మగు రొక్కరూప యిం
దక్కట ! భర్త యెవ్వరని యారయనౌ? మరణమ్మ దక్క వే
ఱొక్కయుపాయ మియ్యెడల నున్నదె ? వీరల రాకకల్మి నీ
చిక్కు తటస్థ మయ్యె నెడఁజేయఁగ వచ్చునె యింద్రజాలమున్.

క. పతివిడిచి యన్యునిన్ స
మ్మతి వరియించితినయేని మహి నయశము, దు
ర్గతి పరలోకమ్మున నగుఁ,
బతిరతలెల్లరును నవ్వఁజాలగుదు నహో !

(అంజలి ఘటించి)

గీ. సరసిజోద్భవ! శంకరసాధ్వి! విష్ణు
సతి! సరస్వతి! యాగమజనని! త్రికృతి
కారిణి! త్రిమూర్తిజనని! వికారశూన్య!
ప్రకృతిపురుషస్వరూప! నిన్ బ్రస్తుతింతు.

ఉ. ఎల్లర భుక్తిముక్తు లిడి యేలెద వీ వఖిలేశి ? జ్ఞానులన్
జల్లఁగఁ బ్రోతు జ్ఞాన మిడి సౌఖ్య మొసంగెదు సిద్ధి నిత్తు వో
హల్లకపాణి! కీర్తి జయ మన్నియు నీ విడునట్టి వజ్ఞ లా
పల్లవమేనిఁ బాయుటకుఁ బాల్పడ్డ రంబరో! నిన్నెఱుంగమిన్.
ఆ. వె. ముగురు నొక్కరూప మొనసి రిం దెవ్వఁడు
చ్యవనుఁ? డతనిఁ దెల్పి సకలజనని
మత్పతివ్రతాత్వ మహిమంబు నిల్పి కా
పాడు మమ్మ! నిన్నుఁ బ్రస్తుతింతు.

(తెరలో) ఆ మూఁగురిలో మధ్యనున్నవాఁడు చ్యవనుఁడు.

సుక— (చెవియొగ్గి తనలో) పరశక్తి నన్నుఁ గరుణించుచున్నది. ఇఁక సంశయ మెందుకు? (ప్రకాశము) మీ మూఁగురిలో మధ్య నున్న యనఘుఁడే నా పతి. అతఁ డియ్యెడ కరుదెంచి మత్పాణిం గ్రహించుఁగాక.

(అంత సుందరాకారుఁడగు చ్యవనుఁడు వచ్చి పాణిం గ్రహించును.)

చ్యవ— (అశ్వినులదిక్కు మొగంబై) ఓ యశ్వినులారా!

మ. నయనశ్రీ చెడి వార్ధకమ్ముఁగొని విన్నాణంబు లేకుంటచేఁ
బ్రియురాలిన్ గరఁగింప నేరక వనిం బెంపేది యున్నట్టి నన్
దయకల్మిం గని కన్నులున్ వయసు సౌందర్యమ్ము చేకూర్చి త
ద్దయు సంసారసుఖాత్ముఁ జేసితిరి మిత్రత్వంబు దైవారఁగన్.
క. ఉపకారులైన మిత్రుల
కుపకారము చేయకుండు నొగి నెవ్వఁడు వాఁ
డపకీర్తికిఁ దానకము బు
ణపక్రీతుఁడు వానిజీవనము విఫలమగున్.

మీకుఁ బ్రత్యుపకారం బేమి యొనర్తు? భవద్వాంఛితంబు వెలుపరింపుఁడు

అశ్వి— మాకు సమస్తమ్మును గలదు. కోరఁదగిన దెయ్యదియు లేదు. మీరు బలాత్కరించి యొసంగ నెంచెదరేని,

గీ. అమరు లెల్లరు సోమపానావసరము
లందు వెలిఁబెట్టి రనఘ ! మ మ్మధ్వరముల
భిషజులను నొక్కమిష చూపి; ప్రీతి గల్గె
నేని మా కది సాధింపు మిద్ధశక్తి.

ఇంతకన్న నీవలన మాకుఁ గాఁదగినది లేదు.

చ్యవ— మీ కోరిక యింతమాత్రమే కద!

క. మీ కతన వయసుఁ గన్నులు
నాకారముఁ గలిగె నాకు నశ్వులు మీకున్
బ్రాకారిన్ వారించి ని
రాకులగతి సోమపాన మది నే నిత్తున్.

క. మారాజగు శర్యాతి మ
హారా జొనరించు మేటియజ్ఞమ్మున మి
మ్మారాజుపంక్తి నిడి పెం
పారన్ సోమరస మొసఁగున ట్లొనరింతున్.

(అంత శర్యాతి ప్రవేశించును.)

అశ్వి— మునీంద్రా! యీమాట మాత్రము మఱవ వలదు. మే మరిగెదము.
(నిష్క్రమింతురు)

శర్యా— (తనలో)

"క. ముని కంధునకు నొసంగితి
మనవద్యాంగియగు కూఁతు నక్కట! యది య
వ్వనమున మృతి చెందెనో? జీ
వనమున నున్నదియొ చూడవలదె యొకింతన్"

అని దేవి నన్ను మిక్కిలి దూరుటచే నిట్లు వచ్చితిని. అక్కటా! యీయాశ్రమము శూన్యముగా నున్న హేతు వేమో? ఏమైరో కదా! (వెదకుట నభినయించి)

గీ గృధ్రియగు నమ్మునీంద్రుతోఁగూఁతుఁగూడ
నే మృగమ్ములు మ్రింగెనో, యేమిసేతు? — (యోజించి)
తపము చేసెడివారల దరికిఁ గ్రూర
మృగములే రావు, వచ్చిన మ్రింగఁబోవు.

ఇది యిట్లుండ నా కొమిరె యట్టి ఘాతుకజంతువుల వధింపుటకుఁ గూడ వెనుదీసెడిదికాదు. క్షత్రియ కన్యగదా!

సుక— నాథా! యీపాటికి మన మాశ్రమమునకుఁ బోవుదము.

చ్యవ— సుందరీ! నీవప్పుడు నా కన్నులుమాత్రమే పోఁగొట్టితివి. ఇప్పుడు దానికిఁ బదిరెట్లుపకృతి నాచరించితివి. ని న్నేమని కొనియాడుదును!

సుక— నేనెవరు కొనియాడఁ బడుటకు! తమ తపోమహిమయే సకలమునకుఁ గారణము. ఇఁక నాశ్రమమున కరుగుదము. ( పరిక్రమింతురు )

శర్యా— అక్కటా! యెక్కడను గానరారే?

గీ. కందమూలఫలమ్ములఁ గాలమెల్లఁ
గడపు మునివేషధారిణిఁ గన్నకూఁతుఁ
బ్రాణమవశేషముగ నుండు పరమసాధ్వి
నొక్కపరిఁ జూడకున్న నే నోర్చుటెట్లు ? (పరిక్రమించును.)

చ్యవ— (చూచి) సాధ్వీ! అదుగో, మీతండ్రి శర్యాతిమహారాజు. ఇప్పటి నాయవస్థ యతఁడు నమ్మఁడు సుమీ !

సుక— (చూచి) అవును. ఇందుల కుపాయ మేమి ?

చ్యవ— ఆయనచే జన్నమొనర్పించి యందు దేవతలచే సాక్ష్యమిప్పించుటయే!

శర్యా— (చూచి) అదిగో, నాకొమిరె తటాకమునుండి వచ్చుచున్నది. (పరిశీలించి) ఆయన యెవరు ! (వికృతినభినయించి) అక్కటా ! యెంత దుర్మార్గురాలిం గంటిని!

గీ. మదనవేదన సైఁపక మమత పెచ్చు
పెరిగి మత్పుత్రి యంధుని వృద్ధు నతనిఁ
జంపి, యన్యుని వరియించె; శక్యమగునె
జవ్వనంపు మదం బెట్టిసాధ్వికేని !

క. మనుకులమున నేఁటికి మ
త్తనయకతనఁ గందుగలిగెఁ దద్దయు నింద్యం
బనఁదగదె పుత్రికం గను
జను జన్మము? కొమిరె బల్ దోసం బగు గృహికిన్.

గీ. ఎన్నియో పాపములుచేసనేని వాని
కుదయ మందుఁ గుమారిక, యొరుల ననఁగ
నేల ? వృద్ధున కంధున కెఱిఁగి యెఱిఁగి
కన్నె నిచ్చితి నాత్మసుఖమ్ముగోరి. (నిట్టూర్పు విగుడ్చి)

క. ఏవానిపుత్రి కుత్సిత
యై వెలిఁ బడు వానిజన్మ మనమాఘము, మెం
తే వెదకి కొమిరె నిడఁ దగుఁ
గోవిదునకు ధనికి రూపగుణసహితునకున్.

సుక— (సమీపించి నిర్భయముగా) తండ్రీ! నమస్కారము.

శర్యా— (చూడకయే)

గీ. ఎఱిఁగిచేసిన ఫల మిప్పు డెదురుకొనియె
మనుకులమ్మును శశికిఁ గందనువు పడియె

కులమునకు హాని దెచ్చితి సొలవకేగి
తెంపరినిఁ గూఁతుఁ బాతకి ద్రుంపవల్లదె.

(కత్తిదూయఁ బోవును)

సుక— (తనలో) ఓహో! ఏమి తండ్రిగారి మనము కడుఁ బరాయత్తమైనదే! యెదుటనున్న నన్నుఁ జూడకయే ముందరగుచున్నారు.

శర్యా— (కొంతవడికరఁగి నిల్చి)

గీ. పాతకమ్ములకెల్లను బాతకంబు
స్త్రీవధము, దానికన్నఁ బుత్రిక వధించు
టెక్కుడగు నింత కెక్కుడై పొక్కుఁగాదె
లోకనింద, యిసీ! యెంత శోక మొదవె!

అక్కటా! లేక లేక కలిగిన కూఁతు రోకతెయుఁగూడ నిట్టి యపాత్రురాలు కావలెనా! దైవమా! యెంతదుర్దశ ఘటించితివి?

(అని యొకచోఁ జతికిలఁ బడును.)

సుక-(చేయిపట్టుకొని) తండ్రీ! యేల వృథాసందేహగ్రస్తుండవై చింతించెదవు?

క. శతపత్రనేత్రి రూపసి
నతులితమగు జవ్వనమ్ము నంది యొలయు మ
త్పతిఁ గాంచి శంక నొందక
మతిఁ జింత న్విడిచి వే నమస్కృతు లిడుమా!

జాగుసేయకుము. నీసందియమ్ము పదఁపడి తీఱఁగలదు.

శర్యా—(క్రోధముతోఁ జేయి విడిపించుకొని)

క. జరఠుం డంధుఁడు తాపసి
యరయఁగ నీభర్త; యీతఁ డతియౌవనదు
ర్భరుఁడు మనోన్మత్తుఁడు సుం
దరుఁ డేగతి నమ్మవచ్చు ధవుఁడనినీకుఁ ?

సుక— తండ్రీ! దేవవైద్యులకతమున నిన్నియు సంఘటించినవి. క్రమముగా నీకే సకలమ్మును దార్కాణమ్మగును.

క. నీతిదురంధరుఁడగు శ
ర్యాతికి నీ కాత్మజాతనై యే నకటా!
పాతకమున కొడిగట్టుదు
నే? తడయక మ్రొక్కు మమ్మునీందుృన కనఘా!

శర్యా— (తనలో) ఏమి యిట్లు వచించుచున్నది! ఇట్టి వింత యొన్నఁడును వినలేదే! కానిమ్ము. (చ్యవనునకు నమస్కరించి) మహాత్మా! నీవప్పటి చ్యవనుండవేనా? నీ కిట్టి వయోరూపాదికం బెట్లు సంఘటిల్లె?

చ్యవ— రాజా! నీ కీ సందియ మింత నంతఁ దీఱెడిది గాదు. నీవు యజ్ఞం బొనర్పుము. అందు నీకుఁ దగుసాక్ష్య మిప్పించెదను. నేనే యందాధ్వర్య మొనర్చెదను. అదె మనయాశ్రమము. దానికిఁ దగు విధాన మంతయు నయ్యెడఁ జెప్పెదను. అక్కడికేగుదము.

(అందఱును నిష్క్రమింతురు.)

గద్య

ఇది శ్రీ...తిరుపతి వేంకటేశ్వరులచే రచియింపఁబడిన
సుకన్య యను నాటకమ్మునఁ జతుర్థాంకము.

ఓం

శ్రీమత్పరదేవతాయై నమః

# సుకన్య

## పంచమాంకము

(అంత నిరువురు విప్రులు ప్రవేశింతురు)

అన్నంభట్టు— సర్వభొట్లూ ! వింటివా, యీ విరుద్ధము ! క్రొత్తక్రొత్త చిత్రములు బయలు దేరుచున్నవి.

సర్వ— ఆ విరుద్ధమేమో చెప్పుము. శర్యాతియజ్ఞములో పిష్టపశువు నేర్పఱచినా రను మాట కాదుగదా !

అన్నం— ఇఁక నేమి ? నీకును దెలిసియే యున్నది. ఇన్ని దినములనుండి యజ్ఞములు చూచుచున్నారము. ఎప్పుడేని యిట్టి యపాత్రపుఁ గర్మము జరిగినదా ?

సర్వ— నీకుఁ గోపమువచ్చినచో నేను జెప్పఁ జాలనుగాని, ప్రత్యక్షజీవమును నవరంధ్రములు మూసి బాధపెట్టుటకన్నఁ బిష్టపశువును బెట్టికొనుటయే మంచిదని నా యభిప్రాయము.

అన్నం— మనయిష్టమేనా యేమి ! వేదశాస్త్రము లొప్పికొనవద్దా?

సర్వ— ఒప్పుకోకేమి ? కొందఱు స్మృతికర్తలును గొన్ని పురాణములును బిష్టపశుఖండనమును విధించుచునే యున్నవి. వేదముమాత్రము ప్రత్యక్షపశువును విధించియున్నది. ఏమైనను పిష్టపశుఖండనమే మంచిది.

అన్నం— (కోపముతో) నీతో నీవిషయమును నేను మాట్లాడుటయే తప్పిదము. నీవు శుద్ధనాస్తికుఁడవు. అపాంక్తేయుఁడవు. (అని పోఁబోవును.)

సర్వ— (నవ్వుచు చేయి పట్టుకొని) వెళ్ళకు, మాట. ఆర్త్విజ్య మేమి చేసినావు ? యాగ మెంతవఱకు జరగినది ?

అన్నం— ఆ దరిద్రుగొట్టుయాగములోఁగూడ నార్త్విజ్యము చేసెదనను కొంటివా ? "ఈ యాగ మశాస్త్రీయము గాన, నా కార్త్విజ్య మక్కఱలేఁ"

దని స్పష్టముగాఁజెప్పి, లేచివచ్చినాఁడను. యాగము సోమపానము వఱకు నీ పాటికివచ్చి యుండును.

సర్యా— సరే, ఇఁక నొకసంగతి విన్నాను. అది నిజమేనా? ఈ యజ్ఞములో నశ్వినీదేవతలకుఁగూడ నింద్రాదులతోఁ బాటు సోమపానమున్నదఁట గదా?

అన్నం— ఏమో! ఆ చ్యవనుఁడుగారన్నియుం గ్రొత్తక్రొత్తలు కల్పన చేయుచున్నాఁడు. నేను బోవలయు. రేపు మధురలో మంచియజ్ఞము జరగును.

సర్యా— అట్లయిన నేనును నీతో వచ్చెదను. (నిష్క్రమింతురు)

(విష్కంభము)

(అంత శర్యాతి, దేవి, సుకన్య, చ్యవనుఁడు, ఇంద్రాదులు,
అశ్వినులు, ప్రవేశింతురు.)

ఇంద్రు— (దేవతలతో)

క. అకలంకము క్రతువిది; యే
మికతమ్మున భిషజు లిచట మెలఁగుట? సోమం
బకటా! వీరికి నర్హమె?
యిఁక నైనను బోవరాదె? యెవరు పిలిచిరో?

చ్యవ— మహేంద్రా! పిలిచినవారెవరనియా? చ్యవనుఁడు. ఎందుకుఁ బిలువఁ గూడదు?

గీ. సంకరులుగా రహర్పతిసతికిఁ బుట్టి
నట్టి కొమరులు వీర లేయఘము చేసి?
రనఘ! యెట్లగ్రహార్హత నంది రీమ
ఖమునఁ దెలియంగవలయు నిక్కమ్ము మాకు.

అశ్వినులు— (తమలో) అడుగఁదగిన ప్రశ్నము నడిగినాఁడు.

ఇంద్రు— (క్రోధహాసములతో) ఏమీ! ఈయజ్ఞ మిందుకొఱకేర్పాటైనదేనా?

చ్యవ— సంశయ మేమి.

క. ఈ మహీపతి నా ప్రేరణ
చే మఖ మొనరించె నింత సిద్ధ మిచట నే
నీమహితుల కిప్పించెద
సోమరసము నీవు నెల్ల సురలును జూడన్.

ఇంద్రు— మునీంద్రా! వేదవిదగ్రగణ్యుఁడవగు నీకీ పట్టుదల యెందులకు? వీరు వైద్యులగు కతమున నపాంక్తేయులని వెలి వైచితిమి కదా! వైద్యులకును

గాయకులకును గ్రామపాచకులకును శ్వవృత్తిజీవనులు మొదలగు వారికిని బంక్తి బాహ్యత్వము శాస్త్రము లుద్ఘోషించుట యెఱుఁగవా ?

చ్యవ— (క్రోధహాసములతో) ఇయ్యెడల జారులవిషయమై పంక్తి బాహ్యత్వము చెప్పలే దేమి ?

క. ఏఁ జెప్ప నేర్తు వీ రం
భోజాప్తనిసుతులు సోమమున కర్హు లహ
ల్యాజార ! వృత్రహార ! ని
ర్బీజం బిక్కోప మింక విడువం దగదే ?

అశ్వి— (తమలో) మంచిది. బాగుగ నెత్తి పొడిచినాఁడు. కాక, యింద్రుఁ డనిన మునులకు లక్ష్యమా !

శర్యా— (తనలో) ఇందుల కుత్తర మేమి చెప్పనో?

ఇంద్రు— (తనలో) ఏమి, యీ పాఱుని పారుష్యము! కానిమ్ము. నే నహల్యా కాముకుఁడ నని తిరస్కరించుచున్నాఁడు. నేఁడు వీనిం గడతేర్పక పోదునా ! (కోపముతో లేచి పరికాశము)

గీ. ఎన్నఁడును లేని మర్యాద నేర్పరించు
పాటివాఁడవె ? యోగోరి, బ్రహ్మబంధు !
విశ్వరూపునిఁబలె నిన్ను వేగఁ జంపి
శత్రుహీనుండ నగుదు నిస్సంశయముగ.

అశ్వి— (తమలో) విశ్వరూపునిఁ జంపినప్పు డనుభవించిన కష్ట మప్పుడే మఱపునకు వచ్చెనుగాఁబోలును.

శర్యా— (వినయముగా) ఆర్యా ! ఎన్నఁడును లేని యాచారమైనను న్యాయ్యమైనప్పు డంగీకరింపవచ్చును గదా !

చ్యవ— రాజా ! నీ వూరకుండుము. (ఇంద్రునివంకఁ దిరిగి కోపముతో) నన్నుఁ జంపెదవుగా ! నీ చేతనైనఁ జంపుము. నే నివ్వారికి సోమ మిప్పు డవశ్యమును నిచ్చితీఱెదను.

క. ఈ రవిపుత్రులు మిగుల ను
దారులు ముదిమి నెడపి ననుఁ దరుణవయస్కుం
గా రచియించిరి ప్రత్యుప
కారం బొనరించి ఋణము గడతేర్పవలెన్.

అశ్వి— (తమలో) మనకు నిమ్మహామునివలనఁ గలుగవలసినదే కాని మఱి యొకరి కిది సాధ్యము గాదు. కాని గట్టిగా నెదురుకొన్నాఁడు.

శర్యా— (తనలో) ఓహో! ఇక్కడికిఁ దేలినది. ఈ యశ్వినులే నా యితని కిట్టి రూపాదికమును బ్రసాదించినవారు! ఇట్టి యోగ్యులను దేవేంద్రుఁ డవమానించుట కడు నన్యాయముగా నున్నది.

ఇంద్రు— (కోపముతో)

క. ఈవలవదు స్వార్థమ్మున
కై వీరికి సోమపాత్ర మబ్బైనను నీ
పై వైచెద వజ్రమ్మును
జా వోడ నెడు విశ్వరూపు చాడ్పున నీకుత.

చ్యవ— (ఎకసక్కెముగా) విశ్వరూపునివలె నీచ్యవనుఁ డమాయికుఁడుగాఁడు. ఏదీ? నీ వజ్రాయుధమును సిద్ధముగాఁ బట్టుకొని నిలువుము, చూతము. నా మాట విని నిష్కారణముగాఁ గలహమునకుఁ గాలు ద్రివ్వి చెడి పోకుము.

గీ. తేజమున రూపమున ధనాదికమున నిరు
వురు నఖండులు నీ కనాదరము వలదు
ఎంతవారలు గాకున్న వృద్ధ సంఘు
నమరతుల్యునిఁ జేయు నేర్పమరు టెట్లు?

వేయేల? వీరికే సభాపూజ్యత లేనిచో నీ కంతకుమున్నె లేదు. స్వల్ప దోషము గణింపఁ దగదు నా మాట వినుము.

అశ్వి— (తమలో) కడు న్యాయ్యముగను, నిర్భయముగను జెప్పుచున్నాఁడు. అయిన నేమి? ఈ కుత్సితుఁడు వినువాఁడు కాఁడు.

ఇంద్రు— మునీంద్రా! నీ వైదికపుఁ జాదస్త మంతయు నిక్కడ నుపన్యసింపకుము.

క. ఎన్నివిధమ్ముల వీరలు
జన్నమున కనర్హు లీవు సాహసము మెయిం
బన్నెద వేనియు భాగము,
గ్రిన్నన నీ శిరము ద్రెళ్ళఁగాఁగలదు సుమీ!

చ్యవ— త్రెళ్ళినను సమ్మతమే. సత్కార్యమ్మునఁ బ్రాణము పోయినను నది శ్రేయస్కరమే. (అని యశ్వినులదిక్కై) ఓ యాశ్వినేయులారా! మీ రీయింద్రునికి జంకక యీసోమపాత్రమ్ము నందికొనుఁడు. (అందిచ్చును)

(అశ్వినులు పాత్రమ్మును బుచ్చికొని త్వరలోఁ బానము చేయుట నటింతురు)

ఇంద్రు— దురాత్మా, మునిపిశాచీ! ఇదిగోఁ జచ్చితివిరా!

(వజ్రాయుధమును విడువ యత్నించును)

చ్యవ— (కోపముతో) ఓరీ, మదాంధా! నీవు నాయుధముతోడన బాహుస్తంభన మగుఁగాక! (శాపోదకమును విడుచును)

ఇంద్రు— (చేతులు కదలించుకొనఁ బ్రయత్నించి నివ్వెరపడి నిలుచును)

(అందఱును నాశ్చర్యమును సూచింతురు)

చ్యవ— (ఎకసక్కెముగా) ఇప్పుడేని యశ్వినులకు భాగ మీవచ్చునా?

ఇంద్రు— (కోపముతో) దురాత్మా, మూర్ఖా! ఇదిగోఁ జచ్చితివిరా!

(మీఁదికి దుముకఁ బోవును)

(చ్యవనుఁడు లోపల నేదియో జపించినట్లు నటించి హోమము చేయఁగా నా యగ్నికుండము నుండి భీకర మగు వేషముతో మదుఁడను రక్కసుఁడు బయలుదేఱును అందఱును భయమును నటింతురు)

(మదుఁడు భీకరముగా నరచుచు నింద్రుమీఁదికి నరుగును)

శర్యా— మునీంద్రా! నీ తపోబలము వాఙ్గోచరము. ఈ యింద్రు ననుగ్రహింపుము.

చ్యవ— రాజా! క్షణ మూరకుండుము. అన్నియుఁ జక్కఁబడును.

ఇంద్రు— (నలుదిక్కులకుఁ బరుగిడుచు) దేవమంత్రీ! బృహస్పతీ! చ్యవనుఁడు నాపై మంత్రశాస్త్రముచే నొక్కరక్కసునిఁ బ్రయోగించి బాధించుచున్నాఁడు. చచ్చితిఁ జచ్చితి. రమ్ము. కాపాడుము. (అని మొఱవెట్టును)

(బృహస్పతి ప్రవేశించును)

బృహ- (తనలో) గీ. చ్యవనుని తపోబలమ్ము దుస్సాధ మతని
కతన నుదయించె నీతఁ డఖండబలుఁడు
మదుఁ డనెడి రక్కసుఁడు వీఁ డమరులకువలె
నాకును నసాధ్యుఁ డెట్టి మంత్రముల నేని.

(ప్రకాశము) సురేంద్రా!

గీ. శక్తిభక్తుల కోపమ్ము సంహరింపఁ
దరమె? యెవ్వారికేనిఁ దత్తఱము మాని
చ్యవనమునిపద్యానే పోయి శరణ మనుము
నిన్నుఁ గాపాడు నాతండు నెమ్మిగ్రివిమ్మ.

ఇంద్రు— (చ్యవనుని పాదములపైఁ బడును)

క. క్షమియింపుమయ్య ! నీ వా
క్యము దప్పునె ? యశ్వినులకు నయ్యోడి నిఁక సో
మము, నీదు తపముశక్తి ను
హిమఁజూడఁగ నాయొనర్చు టిది నిక్కముగన్.

చ్యవ— (గౌరవముతో లేవనెత్తి) భయపడవలదు. అభయమిచ్చితిని. (మదునిం జూచి) ఓరీ ! నీవిఁక నితనిజోలికిం బోక యదృశ్యమగు రూపమ్మున సంచరించుచుఁ బ్రపంచ మున్నంతవఱకు జీవింపుము.

మదు— నేనెక్కడ నివసింపవలెను ?

చ్యవ— నీకు నివసించుటకుఁ జోటే లేకపోవునా ?

గీ. జూద మెప్పుడు నాడెడి క్షుద్రులందుఁ
గల్లు మొదలుగఁ ద్రావెడి కష్టులందు
సిగ్గు నెఱుఁగక వర్తించు స్త్రీలయందు
నిరతమును నిల్లుగట్టుకో మ్మెరుగు మింక.

మదు— చిత్తము. (నిష్క్రమించును.)

బృహ—మునీంద్రా ! నిన్నుం బోల నాసప్తఋషులకేని యలవిగాదు. నీభార్య యగు నీసుకన్యం బోల నాయనసూయ మొదలగు పతివ్రతలును జంకుదురు.

దేవి— (సుకన్యచే బృహస్పతికి మ్రొక్కించును.)

బృహ— అమ్మా, సుకన్య !

ఆ. వె. భర్తనుద్ధరించి పడయరాని యశమ్ము
దిక్కులెల్ల నించి తెల్వి మించి
సాధ్వులందు మేటిసాధ్వివై రాణించి
నట్టి నీకు సాటి యరయ నెందు.

ఇట్టి నీ కేమి ప్రియ మొనరింతును ? అయిన నిట్లగుఁ గాక !

## భరతవాక్యము.

గీ. ప్రజలకును రాజులకు మైత్రి ప్రబలుఁ గాక
కలహములు క్షామములు నడుఁగంటుఁ గాక
కాంతలు పతివ్రతాత్వమ్ము గాంత్రు గాక
శ్రీయు నారోగ్య మెల్లెడఁ జెలఁగుఁ గాక.

## గద్య

ఇది శ్రీ కింకవీంద్ర ఘటాపంచానన విద్వత్కవి బాలకలానిధి
బాలసరస్వతీ శతావధాని తిరుపతి వేంకటేశ్వరు
లొనర్చిన సుకన్యా నాటకమ్మునందుఁ
బంచమాంకము
సంపూర్ణము.

| పేజీ | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 1 | 6 | వంకచూ | వంకఁజూ |
| 9 | 19 | దఁప | దప |
| 19 | 9 | దఁప | దప |
| 22 | 7 | ఛీ | ఛీ |
| 37 | 8 | కుత | కున్ |

శ్రీమత్పరదేవతాయైనమః

శ్రీ

# పాండవరాజసూయము

శ్రీ తిరుపతి వేంకటేశ్వరులచే
రచింపఁబడినది.

రెండవకూర్పు 1,000 ప్రతులు.

బందరు మినర్వాప్రెస్‌నందు ముద్రింపఁబడియె.

1934.

కాపీరైటు రిజిష్టర్డు ] [వెల రు. 0-5-0

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవరాజసూయము

## ప్రస్తావన

చ. సరసుఁడు నాగభూషణుఁడు చారుతరాప్రతిమానగాత్రభా
స్వరుఁ డురుగాననాట్యముఖసర్వకలానిలయుండు భూతివి
స్ఫురితుఁ డమాయికుండు నిజబోధసుధామయుఁ డొప్పుచుండు శ్రీ
హరిపరిచింతనామృతసమర్పితనై జమనఃప్రచారుఁడై.

మ. అనుసంధ్యమ్మును నాతఁ డాడు సుమనోహస్తధ్వనుల్ పెల్లుగాఁ
దనకున్ భృంగిముఖుల్ సహాయులుగ సాంద్రంబైన యానందమున్
గనువారల్ భజియింప నాత్మతనుభాగస్థాయి సర్వప్రజం
బును గీతామృతసారసంపదలచేఁ బోషించి రక్షించుచున్.

ఉ. ఆతఁడు నాట్యమాడు సమయమ్మున కయ్యెడ కేగుదెంత్రు ప్ర
ఖ్యాతులు మానితల్లజులు గణ్యులు సిద్ధులు సాధ్యు లప్సర
శ్శీతకరాననల్ మొదలు; సేవకు నట్లరుదెంచు వారి సం
ప్రీతమనస్కులన్ సలుపు శ్రీహరిఁ బాడుచు నాతఁ డాడుచున్.

ఉ. అశ్వపుధాటియో! జలధరార్భటియో! యను భంగి భృంగి వి
శ్వేశ్వరుఁ "డౌను, మే!" లనుచు నెంతయు మెచ్చ మృదంగమాని తా
విశ్వవిచిత్రవాద్యమున వేడ్కఁ ఘటింపఁగ నాగభూషణుం
డీశ్వరుఁ డాడి పాడునఁట! యే రల సౌరు నుతింప నేర్తురో!

తే. గీ. ఇట్టు లనుసంధ్యమును నాట్యమెలమి సలిపి
ముక్తిప్రత్యక్ష మొనరించు మూర్తియాట
నితరదైవతములకన్న నితని నెల్ల
సుమనసులు వచ్చి సేవింపఁ జూచుచుండ్రు.

చ. జరిగె ననంతకాల మిటు స్వాదుతరాప్రతిమానగానమా
ధురియును దాండవంబు గడుఁదోరముగాఁ గనువారి మానసాం
తరముల నాటికో; నతని తత్త్వ మెఱుంగని వారుగూడ వ
త్తురు కనిపోదు రంచుఁ దటితో నతఁ డాడుచుఁ బాడుచుండఁగన్.

వ॥ అమ్మహాదేవుం డిట్లనుసంధ్యంబును శ్రీహరిభక్తితత్పరత్వమ్మునఁ దనవిద్యాతిశయమ్ము సఫలమ్మొనర్చుచుఁ దాండవానంతరమ్మున నొకటఁ సభాస్తారులం గాంచి యిట్లనియె.

శా. ఈ నిండోలగ మోలిమై వినుత మే నిష్ఠాదువాక్యమ్ము లు
త్థానైకాదశి వచ్చుచున్నది హరిన్ దత్కాలమం దర్చనా
ధీనుం జేసినవారల న్నిరతమున్ దీవ్యన్మహావైభవా
నూనాముత్రపరత్రసౌఖ్యములు చెందున్, డిందు సర్వాఘముల్.

శా. ఇందన్కన్ శయనించియున్న హరి నాఁ డీక్షించు నందమ్ములా
కందము ల్వికసింపఁజేసి జగ మాకంజాక్షు నావేళ నా
నంద మ్మొప్పతిలన్ యజించు టది సంధానించుఁ బున్నెంపుఁ ది
న్నెం దైవారఁగఁజాలుభాగ్యము నమందీభూత సామ్రాజ్యమున్.

క. తులసీబృందావనమున
నలఘున్ లక్ష్మీపనాథు హరిదినమునఁ బూ
జలు కార్తికమునఁ జేసెడి
నలలితమతిశాలి కొక్క సౌఖ్యము కొదవే!

శా. నే నేమో పరతత్త్వ మంచు మదిలో నిక్కమ్ము మీరెల్లరున్
ధ్యానింత్రా మహనీయు నేఁ గొలుతు నిత్యమ్మున్ ; మహాభాగుఁ డా
శ్రీనాథుండు మదీయనాట్యకలనాసేవ్యుం డెఱుంగుండు వి
జ్ఞానాంభోనిధి యాతఁ; డాతనికి నిచ్చల్ పూజసేయుందగున్.

మ. ప్రతిసంవత్సర కార్తికమ్మునను దత్పాదాంబుజమ్ముల్ సుమ
పత్రితతిన్ నే యజియింతుఁగాని "యిటు సల్పంబోలు" నంచున్ భవ
న్మతి కెక్కన్ వచియింపలే దెపుడు, సమ్మానింపుఁ డీమేఁడు స
త్కృతులన్ శ్రీహరి నుత్సవాదులఁ గడున్ దేదీప్యమానమ్ముగన్.

వ॥ నావుడుఁ బరమభక్తులగు సభాసదులు కరమ్ములు మొగిచి యిట్లనిరి. స్వామీ ! యేము మీయందుంబలె శ్రీహరియందును భక్తులము, తదారాధనమ్మునకై యింత నొక్కి సెలవీయంబనిలేద ; తప్పక యట్లయొనరించెదము, కాని కొండొక విజ్ఞాప్యంబు గల దయ్యది యాలింపం బ్రార్థించెదము. కార్తికైకాదశినాఁడు స్వామి మేల్కాందు రనికదా! సెలవిచ్చితిరి, వారేదినమ్మున నెచట శయనించియుండినదియు నాశయనమ్మునకు౯ గతమ్మును వచించి మామనమ్ములు నిస్సంశయము లొనర్పవలయు నాఁగ నాగభూషణుం డిట్లను.

క. వినుఁ డాషాఢైకాదశి
ననఘుఁ డతఁడు బోధమూర్తి యహితల్పమున౯
వననిధిని యోగనిద్ర౯
గొని విద్యాస్ఫూర్తి మెఱయఁ గొమరారుఁజూఁడీ!

క. కార్తికశుద్ధైకాదశి
నార్తిహరుం డతఁడు త్రిభువనావనదీక్షా
స్ఫూర్తి౯ మేల్కను, సువ్రత
వర్తుల కానాఁడు మిగులఁ బావన మరయ౯.

ఉ. కావున నాఁటి పూజ త్రిజగమ్ముల కే నెఱిఁగింప నెంచి స
ద్భావులరైన మీకడ ముదమ్మున నేఁడు వచించితి౯, మహా
ధీవిభవుండు శ్రీకరుఁడు దివ్యమహోమహితుండు మీదు సం
భావన కర్హుఁ, డే నెఱుఁగువట్టును దెల్పితి నట్లొనర్పుఁడీ!

చ. అనవుడుఁ దత్సభాసదులు హస్తము లెత్తిరి, యెల్లవారు మే
లనిరి "సెబాస్సెబా" సనుచు నాడిరి పాడిరి, యేమిచెప్ప' నా
ఘనుల హళాహళుల్ ; పిదపఁ గాలగళుం డల వారి శ్రద్ధకు౯
మనమున మెచ్చుచు౯ మరల మాట యొదో వినఁబడ్డ యట్టులై॥

మ॥ "ఎవడా బుస్సలుకొట్టు నాతఁ?" డని తా నెల్ల౯ విలోకించి యం
దవఁడు౯ గానగరామి ఱిచ్చపడి మో మేమాత్రమో వంచున
ష్డవలోకించె నిజాంగసంగతు నహి౯ బ్రారబ్ధకోపానల
స్థవిరాస్యు౯ నయనాంతరుద్గళదమందస్ఫారదావానలు౯.

క. అప్పగిది నున్న యంగపు
సర్పమ్ముల్ గాంచి హరుఁడు జాడ్యపరీతం
బిప్పా మా హరిపూజకు
నొప్పనిగతి దోఁచుచున్న దూహింపంగన్.

వ. అని యద్దానితో నిట్లనిరి.

క. ఉమ్మలిక మిట్టులో నా
గమ్మా! నీకేల కలిగెఁ గడు రోజెదు బల్
చెమ్మటలు గ్రమ్మ సారెకు
"హు"మ్మని బుసఁగొట్టె దేటికో చెప్పుమనన్.

శా. ఆనాగ మ్మిట్లు చెప్పఁగాఁదొడఁగె, దేవా! శ్రీహరిన్ మీరు పూ
జానైవేద్యమహోత్సవాదుల నవశ్యమ్మున్ యజింపంగ ను
త్థానైకాదశి వచ్చుచున్నదనుచున్ దద్దన్ బ్రసంగించు నా
యీ నాదున్ విని నంత నా దొదవె నెంతే నాదు శీర్షమ్మునన్.

ఉ. ఏమని యందురేని యతఁ డెంతయుఁ బూజ్యుఁడె యౌనుగాక, వి
ద్యామహనీయు లెల్లరును నర్చితుఁగా నొనరింత్రు గాక, మా
కామయసంవిధాత యతఁ, డక్కటతనన్ హరిపూజ కొప్పఁగాఁ
బోము, భవత్సమీపమునఁ బొచ్చెము మాని వచింతు నింతయున్.

క. హరి నాగభూషణులకున్
బరస్పరము మైత్రియనియు బాగుగ నా యం
తర మెఱుఁగు, నైన మాకా
హరి సైఁపఁడు కాళియాహి నడఁచిన కతనన్.

శా. మా చుట్టంబగు కాళియాహిశిరమున్ మర్దించుటే కాక నా
ట్యాచార్యత్వ మదెల్ల నయ్యెడలనే వ్యాపింపఁగాఁజేసి "పో
నీచా! యీయమునానదిన్ విడిచి, ఖండింతున్ జుమీ! యెన్నఁడే
నీ చెంతన్ గనరాకుమీ" యనునె! మమ్మేనిం గనం బోలదే!

తే. గీ. బురదతో స్నాట నటు సరిపోయెఁగాని
మా యురగజాతి నింకొక్క మహితుఁడేని
పాదతాడనముల నట్లు పడియు శీర్ష
మెత్తి బ్రదుకనా ? యటుమీఁద నేమియైన.

చ. అతని శిరమ్ముపైని హరియంఘ్రులు నిల్పి నటించెఁ గానిప
ద్ధతి, యది మాకు నెల్లరకు నాతనికింబలె సంఘటించె; శి
ర్షతలము చూడుమా కడు భరమ్ముగఁ దత్పదయుగ్మ మెట్లు ము
ద్రితమయి యొప్పుచున్నదియొ తెల్లము నాగులకెల్ల నల్లఁగన్.

చ. అనవుడు నాగభూషణుని కక్షిగ నుండిన సూర్యుఁ డెంతయున్
గనలియు లోనడంచికొని క్రమవచో విభవం బెలర్ప ని
ట్లను, నిది గొప్ప తప్పనుమి! యాహరి మీకొలమం గొకానొకం
డనఁదగువానికిన్ నలుపు నాయపకార మిటన్ గణించుటల్.

చ. ఎవనికిఁగాని యెన్నఁడును నెవ్వఁ డసత్కృతి సేయకుండు వాఁ
డవని వినంబడండు, యపుడప్పు డటుల్ ఘటియించువాని క
ట్లవమతి వాఁ డొనర్చుటకునై పలుహేతువు లుండితీరు, నా
యవమతి జాతికంతకును నబ్బినయట్లు తలంపఁగూడునే?

క. అది కారణముగఁ బుణ్యా
స్పదమగు సత్కృతికి నడ్డు నల్పి వృథా దు
ర్మదము వెలార్చుట తగునే?
సద్గ్రణులు వొల్చునట్టి సదములయందున్.

క. ఇప్పగిది హరుని యంగపు
సప్పమ్మును మందలించె సత్సేవ్యుండై
యొప్పారు సూర్యుఁ డింకొక
సప్పము తలయెత్తి అంతు సలుపకయుండన్.

మ. హరుఁ డాశ్చర్యపరీతుఁడై మనమునం "దారార! యేపాటి దీ
యురగంపుంబురు వట్టి శ్రీహరి కరితోద్రేకియై యింతగా
నలువన్ సాహస మెట్లుగల్గు? నిట సాహాయ్యంబు వేఱొక్క తెం
పరి లోలో నొసరించి దీని కిటు జల్పాకత్వమున్ గూర్చెడిన్.

ఉ. అట్టి పరిబుద్ధుఁ డిం దెవఁడొ యటంచుఁ గనుంగొన వీరభద్రు మో
మట్టి కళంకమున్ తెలుపునట్టిదియై కనుపట్టె, శూలి య
ప్పట్టున దివ్యదృష్టిఁ గని "భద్రుఁ డదే మొదలంతరంగమున్
బెట్టెను విష్ణుపై; మిగుల ద్వేషమె చూపఁగడంగు నిచ్చలున్.

ఉ. దక్షుని దుర్మదాంధ్యము వదల్పఁగ వీఁడొక స్వేదజంబుగా
నాక్షణమందు నాహృదయమందలి తీవ్రతఁ బట్టి పుట్టెఁ, ద
చ్ఛిక్షకు నేగి యయ్యెడల శిష్టుల గూడఁ బరాభవించెఁ, బ
ద్మేక్షణుఁ గూడ వీఁడచట నించుకయున్ గణియింపఁ డక్కటా!

ఉ. ఆతఁడు నన్నుఁ జూచి కడునగ్గలపున్ రుష నాఁగి వీని దు
ర్నీతికి సైఁచె, నా సయిచు నేరుపు వీఁ డెఱుఁగండు బొత్తిగాఁ,
"గాతరుఁ డాతఁ" డంచు మదిఁ గన్గొని తన్మహిమానుభావ వి
ఖ్యాతులు లెక్కపెట్టక నికార మొనర్పఁగ నెంచు మూర్ఖతన్.

తే. గీ. ఈయనాత్మజ్ఞుఁ డెప్పుడో యీసరీసృ
పమ్ములకుఁ జేసె దుర్బోధ చనవుమిగిలి
ఇవి ననుంగూడ లెక్కింప కిందు నొకని
బైకి లేపి ప్రేలించు దుర్భాషణములు.

ఉ. ఏనఁట! చెప్పువాఁడనఁట! యెల్లజగమ్ముల నేలు శ్రీహరిన్
ధ్యాన మొనర్పఁ డం; చది సదస్సఖిలమ్మునకున్ హితంబఁ ట
ద్దానికి నస్మదంగమునఁ దాల్చిన నాగ మొకండు వారకం
బౌనఁట! యింతకన్నఁ గలదా! యిల దారుణసాహసం బహో!

తే. గీ. వీరభద్రుం డొకించుక ప్రేరిణంబు
చేసెనే యన్మ హరిపయి నీసుకతన,
నంతమాత్రన నామాట కడ్డు చెప్పఁ
దలఁచుపాటిది యీహాలాహలపుఁబురువు."

చ. అని తనయంశమై హరికి నర్చలొనర్చి తదీయతత్త్వమె
ల్ల నెఱిఁగి దీర్ఘజీవియగులాగున దీవన గాంచి పొల్చు నా
హనుమయు గానమున్ వినఁగ నయ్యెడనుండు లెఱింగి "చెప్పు మో
యనఘ! హరింగురించి మనయజ్ఞుల తిక్క లడంగు ముచ్చటల్."

మ. హనుమంతుం డది యాలకించి "వినుఁడయ్యా సర్పరాజుల్! మహా
ఘనుఁ డాతం డొకనాఁడు మున్నతని మిర్గట్టన్ బ్రయత్నించి పం
బినకిన్కన్ దనుజేంద్రపుత్రకుఁ డొగిన్ బ్రేరేచఁగా మూఁగి వి
చ్చినదిన్ జచ్చినదిన్ సమస్తమును నేఁ జెంతన్ విలోకించితిన్.

ఉ. అంతన 'సర్వజాతిపయి నాహరికిన్ గన' టంచు మీరు మీ
స్వాంతములన్ దలంచు టది చాలఁ బ్రమాద; మెవండుగాని దు
శ్చింతత నొడ్లకున్ జెఱుపుచేసెడి జంతువులన్ సహింపఁ, డే
మంతు వెఱుంగకుండిన యమాయికులన్ వధియింపఁ డెమ్మెయిన్.

శా. మీలో నుత్తము లెందఱో కలరు నెమ్మిన్ వారిఁ బూజింపదే!
పూలుం బత్తిరి గూర్చి లోకము; జగంబున్ ద్రుంగఁగాఁజేయు దు
శ్శీలమ్ముం గలవారినో, లగుడముల్ చేఁబూని మర్దింపఁగా
నాలోచించుచునుందు రెమ్మెయిని దా మాబాలగోపాలమున్.

క. కావున గోపాలుండటు
మీవానిన్ గాళియున్ క్షమింపమి తప్పే!
యావిష్ణువు దుష్టుల నిం
కేవారిన్ సైఁచె? మీర లెఱుఁగరె నాగుల్!

తే. గీ. శిష్టరక్షణమును దుష్టశిక్షణంబు
నతని కృత్యమ్ములగుట మీయందె కాదు;
ఎవరియందేని దుష్టుల నేరి శిక్ష
సేయు, శిష్టుల నెలమిఁ గైసేసి ప్రోచు.

ఉ. "వాలిని జంపె నాత" డనిఁ వాలముగల్గిన యస్మదాదు లా
శ్రీలలనామనోహరుని సేవను దూఱుటలేదు, వాలి దు
శ్శీలము వాలిజీవము నశింపఁగఁజేసెనె కాని యాతనిన్
గూళతనాన రాఘవుఁడు గూల్పఁడు, ప్రాజ్ఞులు మీ రెఱుంగరే!

శా. మీజాతిన్ గడుఁబ్రాజ్ఞు లెందఱొ మహామేరుప్రకాశుల్ గలా,
రోజన్ వ్యాకరణంప్రభాష్యము నెసండో కాదు మీచుట్టమే
రాజద్భోగసహస్రవాగ్లహరిపర్వంజేసి నిర్మించె, మీ
యీ జాడ్య మ్మతఁ డాలకించునెడ "హీ హీ" యంచు గర్హింపఁడే!

ఉ. ప్రాజ్ఞత లేనివాం డ్రుఱక ప్రాజ్ఞులువోలెఁ దలల్ గదల్చుచున్
విజ్ఞులు సెప్పు వాక్యములు వేగిరపాటున నవ్వుచుందు, ర
ల్పజ్ఞత కిద్దియే గుఱుతు; భావి సమస్త మెఱుంగునట్టి స
ర్వజ్ఞుని మాట 'కా' దనఁగవచ్చునె? యించుక జ్ఞానమున్నచోన్.

తే. గీ. జ్ఞానలవదుర్విదగ్ధతాధీనులైన
మిమ్మువంటి యల్పజ్ఞు లహమ్ము పూని,
సల్పు దుష్కార్యములఁ జేసి జాతికెల్ల
వచ్చు నపయశంబు, ప్రాజ్ఞులవలనఁ బోదు.

మ. హరి మీలో నెవఁడో యొకానొకని మాద్యచ్ఛిష్టు మర్దించి మేల్
తెరువున్ జూపిన యంత నాతనిపయిన్ ద్వేషించి దూషింతురే!
సరి లెం, డింతయు మీభుజంగపతి తాఁ జర్చింపలేఁ డొక్కొ! త
చ్చరణమ్ముల్ భజియించు నిచ్చలును దచ్ఛయ్యాకృతిన్ బొందుచున్.

ఉ. అల్ల భుజంగరాట్టునకు నంతర ముండదె మీకు నుంత; మీ
యుల్లములందుఁ జూచికొనుఁ, డూరక శ్రీహరిపై నవాచ్యపుం
బ్రల్లదముల్ లిఖింపకుఁడు, భావభవారి వచించుచొప్పు సం
ధిల్లు ముదమ్ముతో వినుఁడు, ధృష్టత మానుఁడు, పూనుఁ డీనుడుల్."

ఉ. నా వుడు మున్ను లేచు నల నాగ మిటుల్ వచియించె, "జాతిలో
నేవగ నెవ్వఁడో యొకని కెవ్వఁడొ తా నపకారిగాఁ బరీ
భావము తక్కువారలకుఁ బట్టదటంటివి, మున్నొకండు భూ
దేవుఁడు నీవు సల్పు నుపదేశ మెఱుంగక మమ్ము మోఁదఁడే!

శా. ఏదో కొండొక నాగ మాతని సతిన్ హింసింపఁగా జచ్చి యా
మీఁదన్ దత్పతి చల్లఁగా బ్రతికె, నామేలెనిఁ జింతింప కా
భూదేవుండు వధింపఁగా దొడఁగె మమ్ముంబోట్ల నెల్లన్ బోరిన్;
వేదాంగమ్ములు వేదముల్ సదివి యవ్విప్రుండు నప్రాజ్ఞుఁడే?

చ. ఒకనికతాన నార్తిమెయి యుల్లము మండి మదీయజాతి కం
తకు నతఁ డెట్లు శత్రువయి తజ్ఞత ముందు చరించె నట్ల యే
మొకని నికార ముల్లముల నూనెద మెల్లర; మూని యాహరి
ప్రకటతరాంఘ్రిపూజలకుఁ బాల్పడ, మిందొక దోసముండునే?"

చ. ఇటు కటురీతిగాఁ బెనఁగు నిట్టలపుం జెడుపాము సేయు దూ
రటనము సభ్యులెల్లరు భరమ్ముగ నోసిరి, వారియున్నతి యు
త్కటరుషుఁ డయ్యె, నయ్యెడలఁ గాలగళుండు నిజాశ్రితాళిలం
పటహృదయుండు భక్తజనపుంగవు నిస్తారణధీరుఁ డిట్లనున్ ;

చ. సతతపురాణసూరిజనసమ్మతికిం గుదురైనభక్తి మీ
కిత వుపదేశమున్ సలిపె నీహనుమంతుఁ, డమంతుభావసం
గతిఁ జనుటొప్పు, సర్వజనకాలుని నీ వనిసట్టి విప్రునిన్
క్షితిసురుఁ డొక్కరుం "డిటులు సేయుట తప్పు" ని యందలింపఁడే!

చ. కావున నా యుదాహృతిని గైకొని కాళియుఁబట్టి మీర లా
శ్రీవరుపై దురాగ్రహము చేకొని క్రుందుట చెడ్డతప్పు, లో
కావనశీలుఁ డాహరి మహామహిమంబు నెఱుంగశక్యమే?
మీవలెఁ దప్పుత్రోవలను మేకొను దుర్విషజాతి కెమ్మెయిన్."

తే. గీ. అంత ఖండితముగఁ జెప్ప వారుని గూడఁ
జనవునంజేసి యాసర్వజడుఁడు గణన
సల్ప కేమేమొ మ్రోఁగుచు జాతికెల్ల
మచ్చరముగల్గఁజేయు నమ్మాడ్కి నుండె.

క. అంత హనుమంతుఁ డను "నో
మంతుహరా! సాంబ! నీదు మహనీయకృపా
దంతురితైశ్వర్యధురా
పంతము లీపాము లురక వంగునె? నుడులన్.

శా. ప్రత్యక్షమ్మునఁగాని లోఁగ రిల నప్రాజ్ఞుల్; హరిం దూఱి యీ
కాత్యాయన్యధినాథ! కీడ్పడిన వేడ్కల్ దృశ్యమౌ నట్లుగాఁ
బ్రత్యేకించి ప్రదర్శనంబొనరుపం బ్రాల్మాలుటల్ మాని యీ
వ్యత్యస్తోక్తులు వీడి బాగుపడి సంభావింతు రయ్యచ్యుతున్."

ఉ. "ఔ! నది బాగు బా!" గనియె నా హనుమంతుని మాటకున్ శివుం
డా నగజామనోహరుని యంతరమున్ గనిపెట్టి వెంటనే
ధీనిధి నందికేశ్వరుఁడు తెయ్యితకత్తక యంచు మర్దల
ధ్వానమొనర్చె దిగ్గజవితానము గుండెలు గూడ ఝల్లనన్.

ఉ. నాంది పఠించె సూచనఁ గనంబఱచెన్ శిశుపాల దుర్వచః
క్రందనముల్ వినంబడినకైవడి సభ్యులకెల్లఁ దోఁచ న
స్పందయుతుండు ధర్మజుఁడు శౌరికి నర్ఘ్యమొసంగు సత్కథా
చందనవల్లికాకుసుమసౌరభసారభరంబు వెల్వడెన్.

( ఇది ప్రస్తావన )

ఓం

శ్రీమత్పరదేవతాయైనమః

# పాండవ రాజసూయము

(అంత సహదేవుఁడు సాట్టహాసముగాఁ బ్రవేశించును)

సహ— (శ్రుతి నభినయించి)

శా. వామం బీచరణంబు వానితలపై వర్తింపఁగాఁ జేయుఁ దా
నీమై నీసహదేవుఁ డెవ్వఁడు వృథా హేయమ్ములన్ గూసి స
ర్వామేయున్ జగదీడ్యు గోపతిని సత్యాలంబి నర్ఘ్యప్రదా
నామాన్యుండని ప్రేలునో మరల సవ్యాజాంతరంగమ్ములో.

శిశుపాలుఁడు— (ప్రవేశించి సవైలక్ష్యస్మితముతో)

మ. మరలన్ జెప్పినఁగాని నీచెవులకున్ మామాట విస్పష్టమై
చొరఁబోదొక్కొ! సురాపగాసుతుబలెన్ జూపుల్ చెవుల్ నీకు మం
ధరభావంబు వహించెనోటు ! మగలన్ వాక్రుత్తు నట్లేని, నీ
చరణం బెట్టిదొ చూపు! నీచరణనాసారంబు వారించెదన్.

సహ— (సక్రోధాట్టహాసముతో)

మ. మరలన్ ప్రేలుమటంటి ప్రేలుము జగన్మాన్యున్ మునీడ్వంద్యు న
ధ్వరరూపున్ హరి నేతదన్యునిగ; నీతప్పం బ్రలాపమ్ము రూ
పఱ నీమస్తక మస్మదీయచరణన్యస్తమ్ము గావించి నిన్
బురికొల్పన్ బ్రయతించు రాజులకు నుద్బోధింతు సద్బుద్ధులన్.

శిశు— (కొండొకసమీపించి)

మ. ఇదిగోఁ జక్కఁగ విన్మ చెప్పెదను, మీ రీనిండు పేరోలగం
బెద నింతేని గణింప కొక్కచెనఁటిన్ హీనున్ దురాచారు దు
ర్మదు గోపాలకు నగ్రపూజ్యునిగ సంభావించినా రిప్డు, దే
ముదితో కొక్కొ వచియించు మాటలపయిన్ మోమోటమున్ జూపుచున్.

క. మరలన్ జెప్పెద నిట్టుల్
మరలన్ మరలన్ వచింతు మరల వచింతున్

మరలన్ మరలన్ మరలన్
మరలన్ వచియింతు నీదుమగఁటిమి గందున్.

సహ— (తీవ్రకోపముతో నెడమకాలి పైకెత్తి కుడికాలితోఁ బోవుచు)

మ. ఇదె నీనాలుక చీల్తు, నిద్దిగొ శిరం బీకాల మర్దింతు, దు
ర్మద మాఱింతు,మఱొక్కపూజ్యు నెవఁడున్ మందుం డిటుల్ ప్రేలుటల్
వదలింతున్ దులువా ! యటే నిలువు నీవాచాలకత్వ మ్మదే
తుదముట్టింతు, జగజ్జనార్చితుఁడు నింద్యుం డెట్టు లౌతుంటరీ!

(అంత ధర్మజాదిపాండవులును భీష్ముఁడును బ్రవేశింతురు)

ధర్మ— (సహదేవుని మధ్యేమార్గమున నాపి నెమ్మదిగా)

ఉ. ఎంతయు శాంతభావమున కిక్కవు నాఁ దగు నీకు నింతగా
స్వాంతము మార్పు చెందుటకు శౌరినిరాకరణంబు హేతువౌ
టెంతు; నటేనియున్ మనకు నెందుకుఁ గోపము పిల్చినట్టి భూ
కాంతులమీఁద,వారొకటఁ గష్టపు దుష్పథ మూనిరేనియున్.

తమ్ముఁడా ! వారతిథులు, మన మాతిథేయులము. కావున శాంతిం
పుము. (శిశుపాలుదిక్కు) రాజవరా ! నాయీమాట లాలింపుము.

ఆ. వె. సకలధర్మవేది జాహ్నవీపుత్రుని
యనుమతమునఁజేసి యర్ఘ్య మచ్యు
తున కొసంగినార మనఘ ! యెందులకయ్య
యూరక దూఱఁదొడఁగి తోర్పువిడిచి.

శిశు— (ఎక్కసక్కెముగా)

ఉ. చాలునుజాలు గొల్లనికి సత్కృతిఁజెప్పెడి భీష్మతెల్వి, నీ
బాలిశతాప్రసంగమును; బార్థివులెల్లరు నిన్నుదారస
చ్ఛీలునిగా గణించి యిటఁజేరినదానికి బుద్ధిచెప్పి,తే
గోలయు నీవొనర్చుపని కూడదు నాకెద సమ్మతించునే !

శా. వాచాదత్తను రుక్మిణింగొనియె వ న్వంచించి యీగొల్లవాఁ,
డీచౌర్యమ్మును భీష్ముఁ డేగతిని సత్కృత్యమ్ముగాఁ జూచెనో!
ఛీ ! ఛీ !యీసభ నుండఁగూడదు యశశ్శ్రీమానధన్యుల్ నృపుల్
కాచంబున్ మణిగా గణింతు రిట, సత్కారం బెవం డొప్పెడిన్.

(కోపతిరస్కారములతో మరలిపోవుచు) ఓహో ! మాన

మహితులగు నో రాజకుమారులారా !

శా. జారుల్ చోరులు బ్రహ్మవేత్తలిచటన్; సత్కారమవ్వారికే
ప్రారంభింపబడియెడిన్ దదితరప్రాజ్యావనీపాలకుల్
గారగాఁ దుచ్ఛులు, తాతగారిటులు వల్కన్ మన్మ లాలింత్రు, మీ
శూరత్వమ్ములు కాల్పనే ! కదలుఁ డిచ్చో నిల్వ సిగ్గయ్యెడిన్.

(అని తొందరగా సభవిడిచి పోవుచుండఁగా)

ధర్మ— (వెంటఁజని సగౌరవముగా నాపి)

ఉ. ఏటికి దత్తలంపడి నృపేంద్రుల కెల్లరకున్ మనమ్ములన్
గాటపుఁగోపముల్ రగులఁగా గమకించెదు నిల్వుమయ్య ! యే
పాటియుఁ గాఁడు కృష్ణుఁ డని పల్కితి, వందునుగూర్చి యీసభా
వాటమునన్ విచారణము ప్రాజ్ఞులచే వినవచ్చు నచ్చుగన్.

నీవాదమే ప్రాజ్ఞసమ్మతమగునేని మాయొనర్చిన తబ్బిబ్బు సవరించుకొందుము. లేదా, నీవేని యిటు లొనర్పవచ్చును. కొండొక కోపముపశమింపుము.

భీష్మ— (సమందస్మితక్రోధముతో) ధర్మజా ! యేమిటి కవ్వాని నట్లు బతిమాలెదు.

చ. ఎఱుఁగుదు వాఁడు కృష్ణు జగదీడ్యత, సత్త్వపరాక్రమాదికం
బెఱుఁగు, నృపవ్రజమ్ములకునెల్ల ననూయ జనింపఁజేసినన్
బోరిఁగొనవచ్చు నంచు మది బోలెఁడుకోరిక వాని కున్న, దీ
శ్వరుని త్రివిక్రమున్ జెనఁకువాఁ డెవఁ డీనరపాళిలో ?

అంతటి దురదృష్టవంతుం డెవ్వండేనియున్న "సహేంద్రతక్షక" న్యాయమ్ము ననుకరింతురు. నీవీ శూరమ్మన్యు నేల యనునయించెదవు ? వీఁడు నీవంటివారి యనునయమ్ములకుం దగఁడు. విరమింపుము.

శిశు— (పండ్లుకొఱుకుచు)

శా. ఏమీ ప్రేలెదు, నీకతానఁ జెడె నేఁ డీరాజసూయంబు; నీ
మోమోటమ్మునఁగాదె గొల్లని నొగిన్ బూజించె నీతేఁడు; శౌ
ర్యామేయుల్ జగదేకధన్వులు యశోవంతుల్ ధరాకాంతు లీ
సామాన్యార్చకు సైఁచుటెట్టు ? లరరే ! చర్చించి వాక్రుత్తువే !

భీష్మ— (శిశుపాలుని కుత్తరమీఁబోఁగా)

సహ— (భీష్ముని సగౌరవముగా వారించి) తాతా! యీ దుష్ప్రాజ్ఞుంగుఱించి మీ రింతకయుఁ బ్రత్యుత్తరమీకుండ నిదె మిమ్మభ్యర్థించెద, వీనికిం దగిన ప్రాయశ్చిత్తమ్మునకెల్ల మదీయవామచరణమే పూఁటపడియున్నది.

(శిశుపాలుదిక్కు మొగమై మండిపడి)

మ. పరమాపాత్రశిరోమణీ! త్రిజగతీవంద్యుండు కృష్ణుండు భూ
వరవర్గమ్మున నగ్రపూజ్యతకునై పాత్రుండు గాఁడేమి! వా
చరణం బీనుడి వ్రేలు నీకు నిపుడే సద్బుద్ధి చెప్పున్, శిరో
భర మల్లంతన దీఱి బాగుపడె దో వాచాటవారాగ్రణీ!

(సభ్యులకెల్లఁ దన యెడమకాలిం జూపుచు)

శా. ఈవొక్కండవె కాదునూ! యిచట నింకేపార్థివుండేని యీ
శ్రీవాసార్చన మేవగించునొ, యిదే శీర్షంబు మద్వామపా
దావాసంబగు వాని దం చెఱుఁగు, మారా! భీష్మునల్లంతవాఁ
"డేవం కార్య" మనన్ యజించితిమి, నీ వేపాటి? మూర్ఖాగ్రణీ!

(తెరలో)

శా. మేలో హో! కడుమేలు! మేలు! త్రిజగన్మిత్రుండవై తీవు, నిన్
బూలన్ బూజయొనర్పవచ్చితి మిదే; పూజార్హు దాశార్హు నీ
వాలోచించితి వృద్ధసమ్మతిగ, నీ కాయుర్యశోధీబల
శ్రీ లెల్లప్పుడు వృద్ధిఁ జెందుత జగత్క్షేమంబు దైవారఁగన్.

(సహదేవునిపై పుష్పవృష్టి గురియును)

నారదుఁడు— (పటాక్షేపముగాఁ బ్రవేశించి)

ఉ. చక్కనికృత్యమున్ సలిపి జన్మము సార్థకమై ఫలించు స
త్ఫక్కిని ద్రొక్కితీవు కులవర్ధన! యో సహదేవ! శౌరికిన్
మ్రొక్కని కట్టిఁడుల్ జడులు, ముక్కున నూఁపిరిగల్గియున్ మృతుల్
నిక్కము చెప్పితిన్ వినుము, నీ హరిభక్తికి సంతసించితిన్.

(నిష్క్రమించును)

ధర్మ— (తెరలోఁ గలకలము విని భీష్ము నుద్దేశించి)

శా. తాతా! కంటివె రాచమండలము మాద్యద్దంతిసంతానవి
స్ఫీతంబై మఖవిఘ్నమున్ సలుపఁగాఁ జెన్మోత్రితలన్ ద్రోఁగుచున్

దోశేసెంచెడిఁ జేదిభూమిపతికిన్ దోడౌచు; నేమందు నీ
వీ తీవ్రానల మెట్లు శాంతిగనునో యిప్డే విచారింపవే!

చ. పిలిచినవచ్చి రెల్లపృథివీపతు; లందఱుఁ బూజనీయు ల
వ్వల శిశుపాలుహేతువున వైరముచేసురెు, వార లెంతగా
నలిగిన నాతిథేయులకు నల్గుట యుక్తముగాదు, శాంతికిన్
గలతెఱఁ గూహచేసి మఖకార్యసమాప్తికిఁ ద్రోవచూపవే!

భీష్మ— (నిర్లక్ష్యముగా)

ఉ. వింటిని చైద్యు నూఁతగొని వేదుఱులట్టులు ప్రేలుచున్న యా
తుంటరిరాచమండలపు దుర్వచనమ్ములు; కృష్ణసింహ మె
వ్వంటికి నిద్రమేల్కొనునొ వాగెడి నీభషకంబు లంత; కా
దంట యొకింత గర్జిలిన తత్క్షణమే సకలంబు తగ్గెడిన్.

శిశు— (సధైర్యస్మితముతో) ధర్మజా! నీతమ్ముఁడు పసివాఁడనియు నీతాత ముదుకండనియు నీ వెంత నోరుచేసికొన్నను మా మనమ్ముల కంతగా నొప్పితగులుటలేద. నీయందీ రాజలోకమెల్ల స్నిగ్ధమ్మగుటకున్ గతంబు నీధర్మవర్తనంబ కాని, నీతమ్ముల బలపరాక్రమమ్ములు గావు; సకలరాజలోకవిశ్వాస్యమ్మగు నీయోగ్యతాలతకీభీష్ముండు వేఱుపురుగై మఖవిఘ్నమ్మాపాదించుచున్నవాఁడు. (భీష్మునిదిక్కై)

ఉ. ఏనొక బ్రహ్మచారినని యెంతయుఁ బొంగెదు, నీదు వర్ణితా
ఖ్యానము షండతాప్రభవమంచుఁ దలంచెద మేము, ధర్మవి
జ్ఞానము దంభమాత్రి; మధికమ్ముగ నిన్నును దూఱుటేల, నీ
వీనలిశాత్ముఁ బూజ్యునిగ నేగతిఁ జెప్పితి నాకుఁ జెప్పుమా!

(కేల నిర్దేశించి) ఆరాచమండలముం దిలకింపుము.

శా. అందేరాచకొమారుఁ బోలఁగలఁ డీయజ్ఞాత్ముఁ డైశ్వర్యపున్
సంధర్భమ్మున శౌర్యధైర్యగరిమన్ జాతుర్యసౌందర్య ని
ష్యందఖ్యాతివిశేషసంపదల; నప్రాజ్ఞుండవై యుండఱన్
నిందింతే! కడు వృద్ధమూర్తి వని మన్నింత్రేమి! భూపాలకుల్.

సీ. ద్రోణునికన్న నాద్రోణాత్మజునికన్న దుర్యోధనునికన్న ద్రుపదుకన్న
కర్ణునికన్న నకాంభోజవిభుకన్న భగదత్తుకన్న నపాండ్యుకన్న

భీష్మునకన్న నవ్విరటుకన్నను మద్రపతికన్న సింధుభూపాలుకన్న
భూరిశ్రవునికన్న భూధరేశ్వరుకన్న నేకలవ్యునికన్న నెవరికన్న
తే. గీ. మఱియు ద్వైపాయనునికన్న మహితశక్తి
నైన నీకన్న నాకన్న నన్యుకన్నఁ
గృష్ణుఁ డేపాటివాఁడని కెరలి యర్ఘ్య
మీయఁజేసితివోయి గాంగేయ! నీవు.

అది యటులుండె. ఇంతవఱకీ గోపాలుండొనర్చిన మహాకార్యము లెయ్యవి? స్త్రీఘ్నుండును, గోఘ్నుండును, కృతఘ్నుండును నగు వాని కగ్రపూజ్యత యెట్టిది? ఇఁక వల్మీకమాత్రమ్మగు నగ మ్మెత్తుట కేవలపక్షపాతివగు నీకు నాశ్చర్యజనకమయ్యు బాహుబలాఢ్యులగు భూపాలుర కట్టిదికాదు. పైఁగా నీతఁడు లజ్జావిహీనుండనుట కావంతయు సందియమ్ము లేదు.

శా. నాకుం బత్నిగ నీయనున్న నృపకన్యన్ దొంగయై కాదె! మీ
శ్రీకృష్ణుండు గ్రహించె, నీజడునకున్ సిగ్గున్నదే! యన్యకాం
తాకళ్యాణము లిచ్చగింతురె? యశోధర్మస్పృహుల్ సోఁడు; లీ
వీకష్టుం డెటు పూజ్యుఁ డంటి? చెపుమా! యీసభ్యు లాలింపఁగన్.

మఱియు నీపిరికిపంద జగదేకవీరుఁడగు జరాసంధు వంచించి భీముచేఁ జంపించిన తెఱంగు శూరలోకదూరంబని నీవెఱుంగనిదికాదు. సర్వము నెఱింగి నీ వీనీతిబాహ్యు నెట్లగ్రపూజ్యుఁడని స్తుతించితివి?

చ. బాలిశుఁడైన కృష్ణుని సభాజనమాన్యునిగాఁగఁ జెప్పి ల
జ్జాలవమేని లేక కడుసజ్జనునింబలె ధర్మపన్నముల్
చాలవచించు నీ చెడురసజ్ఞ తటాలున నింతలింతలై
చీలని హేతువేమొ! పరిశీలనఁజేసి వచింప నేర్తువే?

భీము— (కను లెఱ్ఱఁజేసి మండిపడి)

మ. ఖర! వాచాట! రటద్వృథావదన! నీకాలంబు దాపయ్యెనే
మిర! మూర్ఖాగ్రణి! యాపగాతనయు పేర్మిన్ సుంత లెక్కింప, వ
ధ్వరమూర్తిన్ జగదీడ్యుఁ గృష్ణుని వృథా పాపమ్ములన్ గూసి దో
దురితాత్మా! యిదె నీశిరమ్ము గదచేఁ ద్రుంగించెదన్ వ్రేల్మిడిన్.

(లంఘించును)

భీష్మ— (అడ్డై పట్టుకొని) తండ్రీ! భీమసేన!

మ. విపులమ్ముల్ సహజారుణమ్ములు రుడావేశమ్ము కల్మిన్ దప
త్తపనప్రాయములై భవన్నయనముల్ ధైర్యమ్ము మాయించు నే
రిపుభూపాలునకేని; వీఁడన గతవ్రీడుండు నీర్భీకుఁ డే
విపరీతోక్తులొ ప్రేలుఁగాని నయమున్ వీక్షింపఁ డజ్ఞాంతిమై.

ఉ. వీఁడు పరాక్రమమ్మునను బెద్దయుఁ బేర్కొనఁదగ్గవాఁడు, నీ
వాఁడిమగంటిమిన్ జెడని వైఖరి కన్య నిమిత్తమున్న, దా
జాడయెఱుంగఁ జెప్పెదను; శాంతివహింపుము మిన్నకుండు, మీ
గాడిదవంటి దేహమును గళ్మలమున్ బొనరించు టర్హమే!

శిశు— (నిర్లక్ష్యముగా) తాతా! రానిమ్ము, నివారింపకుము.

చ. ముదుకఁడ వీవు, వాయుజుఁడు ముష్కరుఁ డించుక యస్మదీయదో
ర్మదము నెఱుంగుఁగాక, వెస మామకశౌర్యదవానలంబునన్
గదయును దానునున్ మిడుతకైవడి ప్రమందును గాక, యాఁగఁబో,
కెద మఱి వాని కెంతటి యభీప్సితమున్నదొ! వీఁడు, చూచెదన్.

భీమ— (భీష్మునియాజ్ఞపై రోజుచునిల్చును.)

భీష్మ—

శా. ఈకష్టాత్ముఁడు నీగదం జెడఁడు, లోకేశుండు కృష్ణుండు ప
ద్మాకాంతుం డగు మారకుం డని మదిన్ దర్శింపు, మప్పాటము
న్నాకాశోక్తి స్థిరీకరించె, సమయంబయ్యెన్ బడున్ వీఁడు తా
వాకంజాక్షు సుదర్శనంబున శిరంబామూలమున్ ద్రెళ్ళఁగన్.

వీఁడు చతుర్భుజుండును త్రిలోచనుండునై పుట్టి రాసభంబుంబలె నార్చిన నావికృతస్వరమ్మునకు శంకించి తల్లిదండ్రులు విచారించుచుండ నంబరవాణి యుపశమవాక్యమ్ములు చెప్పి "వీఁడు బలాఢ్యుండును శూరుండును, ననన్యసాధ్యుండును నగు"ననియు "వీఁ డెవ్వనియుత్సంగమ్మునఁ గూర్చుండునెడల నీవికృతస్వరూపమ్ము వదలి సామాన్యమనుజాకారమ్ము నందునో వాఁడ వీనికి మృత్యువగు" ననియుం జెప్పెను. "వాఁ డెవ్వం డగునో కో" యని కనవచ్చిన రాజుల యుత్సంగమ్ములందెల్ల వీనిం గూర్చుండఁబెట్టుచుఁ దల్లి పరిశీలించుచుండునెడలఁ దన మేనత్త

కౌమరుఁడగు వీనింజూడ నొకపరి శౌరి యేతెంచెను. అంత యథా పూర్వమ్ముగ నీతని నాతనియుత్సంగమ్మున నిడుటయు, విషమలోచనంబును నభ్యధికబాహుద్వయమ్మును బోయి వీని యిప్పటి యీరూపంబు నిలిచె; నదికాంచి తల్లి శ్రీకృష్ణుని వరమ్ముగోరి వీని వధింపకుండ ననుగ్రహింపుమనుటయు, నావరదుం డపరాధశతాచరణమ్ము మితిగా నావరం బనుగ్రహించె. ఆ యపరాధమ్ములు నిండె; నింక వీని వధించుటయు కడమ, కావున నీవు శాంతింపుము.

శా. నీకన్నన్ బలియుండు గాఁ, డయిన నీనీచుండు నీపై కిటుల్
శ్రీకృష్ణుం డిడు నావరమ్ము కతనన్ జేసాచుచున్నాఁడు;నీ
వీకాలమ్మున శాంతిచూపు,మతఁడే యీదుష్టు శిక్షించు, దు
ష్ప్రాకుల్ వీనికిఁ దోడుసూపు నృపతుల్ వాపోయి గూపెట్టఁగన్.

శిశు— (వికృతస్మితముతో)

ఉ. తాతయు మన్మఁడున్ ఋజువిధమ్మున శాంతినిగొంటిరే మఖ
ప్రీతులు గొణ్గికొంచు,రిపువీరులు నవ్వఁగ; మేలు! మేలు!నీ!
కాతరులార! మీ బ్రదుకు కాల్పనె! (భీష్మునిమాత్రమే కేల నిర్దేశించుచు)
భీమునిమాట కేమి, నీ
వాతికి బుద్ధిచెప్పి పశువైఖరి నిన్ను వధించుటొప్పెడిన్.

(తెరలో)

ఉ. మంచిగఁ జెప్పితీవు మతిమంతుఁడ, వీనదినూనుఁ డెంతయున్
జంచలబుద్ధియై పలికె, శౌరికి "నగ్రసపర్య సేయు" మం
చంచితుఁ జేసె ధర్మజుఁ డనర్హుని గృష్ణుని గొల్లబోయ, నీ
వంచకు భీష్ముఁ బట్టి పశువైఖరిఁ జంపుట కర్జ మెమ్మెయిన్

(సింహనాదము లొనర్తురు)

భీష్మ— (వినుట నటించి గంభీరకోపముతో)

శా. ఓరీ రాజకులాధముల్! పలికినట్లోలి న్ననుంబట్టి క్రో
వ్యాలం జంపుఁడు; లెండు, మీశిరములం బాదూళి మత్పాద మొ
ప్పార న్నిల్పితి నేల యోర్చెదరు! రండా! ఖండనోద్యుక్తులై
శౌరత్వమ్ములు చూపి రాజకులవిస్ఫూర్తిన్ బ్రవర్తింపుఁడీ!

(శిశుపాలుఁడిట్లు)

శా. ఓయీ! మూర్ఖ! జఘన్య! నీయఱచు నీచోక్తుల్ చెవుల్ సోఁచియు
న్నీయుద్రేకమునూన్ప శాంతనవుఁ డింతేనిం బ్రయత్నింపఁ, డా
మ్నాయధ్యేయుఁడు నందనందనుఁడు నిన్ బ్రమందింపఁగాఁ బుట్టినాఁ
డాయజ్ఞేశ్వరుఁ జేరి పోరి చావుమా! యద్దేవు తేజమ్మునన్

క. హరియై హిరణ్యకశిపున్
హరిణముబలె నడఁచె, నరవరాకారమునన్
బోరిఁగొనె రావణు నెవఁ, డా
పరమేశుఁడు శౌరి నిన్నుఁ బట్టి వధించున్.

(తెరవంకఁ దిరిగి)

ఓహో! స్వశక్తిపరశక్తిజ్ఞానశూన్యులగు నోరాజన్యకీటములారా!

శా. మీలో నేరికిఁ జావు దాపగునో వారల్ మీ గ్లాలముంబోలె గో
పాలున్ జేరి పరాక్రమింపుఁడొగి, జీవభ్రాంతి నుంతేనియున్
వాలాయమ్ముగనున్న రాకొమరులా నైనేని వీక్షింపకుం
డోలిన్ దల్పితిఁ గృష్ణమార్గణనిన నాయుర్భాగ్యముల్ రూపఱున్.

శిశు — (సాధిక్షేపముగా) తాతా! యిటు చూడుము.

చ. పొగడెదు సారెకున్ హరిని బూతువిధానఁ, బొగడ్తకర్హులై
నెగడెడు రాజులుండ, నవనీపతి కాని యనాథు నింతగాఁ
బొగడెద వేటికో! ముదుకబుద్ధికిఁ గర్జము లెట్లు దోఁచు మేల్
మగఁటిమి గల్గెనేని నను మార్కొనఁ డేటికిఁ గృష్ణుఁ డిమ్మెయిన్.

(తెరవంకఁ దిరిగి బిగ్గరగా)

ఆ. వె. రాఁగదోయి బావ! రారమ్ము, నిన్నుఁ బాం
డవులతో వధింతు నవనిపతులు
మెచ్చిపొగడ; నర్ఘ్యమిచ్చినందుకు వారి
కిపుడు ఫలముగల్గు దెలుకపడఁగ.

శ్రీకృష్ణుడు — (పరివేశించి తనలో)

క. అపరాధశతము సైఁచి శి
శుపాలు వధియింతు ననుచు మాన్యతగత్తి నీ
కపటాత్ము తల్లి కిచ్చితి
నపుడు వరము, శతము నిండె కార్యంబున్ దోసఁగుల్.

ఇపుడు నూటొకటవ యపరాధమ్మునకీ జడుం డారంభించె. జగద్ద్రో హవ్రతపరాయణుండగు నివ్వాని శిక్ష సైఁచుట పాడిగాదు. (రాజుల నుద్దేశించి ప్రకాశముగా)

ఉ. ద్వారక గాల్చె, బభ్రుప్రమదన్ హరియించెను, గట్టిపెట్టె నీ
ధీరహితుండు మున్ను వసుదేవుని యాగతురంగమంబు, దు
ర్వారము లెన్నియేని యపరాధము లిట్టివి సల్పె; వీనిపైఁ
గారుణముంటఁజేసి యలుగన్; వర మిట్టిది తల్లి కిచ్చితిన్.

ఉ. ఆవరవర్ణినీమణికి నవ్వు డొసంగితి నావరమ్ము; నీ
కావరుఁడా వరమ్మునకుఁ గల్గఁగఁజేసె నపార్థకత్వ; మిం
కేవరుసన్ క్షమింపవలె నీచెనఁటిన్; నృపులెల్లరుం గనం
గావలమార్చి భూజనుల కష్టము వాయఁగఁ జేయుటొప్పదే!

(తెరలో)

ఉ. నందకుమార! "మేల్, బళి" యనందగు పల్కు వచించి తీవు, ని
న్నందురె! యోగ్యులైన నృపు; లధ్వరమూర్తిని వీఁడు వీనితోఁ
గొందఱు దుర్మదుల్ గలిసి కూసిరి కూళతనంపుఁగూఁత; లీ
తుందుడుకున్ హరించుటది దోసముగాదుసుమీ రమాధవా!

కృష్ణు— (తనలో) ఇవి ప్రాజ్ఞులగు రాజర్షుల పలుకులు వృద్ధసమ్మతమ్ముగ నిఁక నివ్వాని వధించెద గాక. (ఆకాశమువంక దృష్టినిగిడ్చి)

ఉ. రమ్మిటు చక్రరాజమ! దురాక్రమగర్వితుఁడైన చైద్యుమూ
ర్ధమ్ము హరించి వేగ నిజధామము చేరుము, ప్రాజ్ఞరాజలో
కమ్మునకున్ ముదమ్మగుతఁ, గశ్మలభూధవజాతికెల్ల దుః
ఖమ్ము ఘటిల్లుఁగాక, మఖకార్యము నెగ్గుతఁ బూర్ణకామమై.

(చక్రమువచ్చి శ్రీకృష్ణుని హస్తమున నిల్చును)

శిశు— (అధిక్షేపముగా)

ఉ. చక్రము గిక్రిమున్ గని వెసన్ భయమందెడి వాఁడఁ గాను, నీ
వక్రతమాన్ప సిద్ధపడివచ్చితి, భీష్మునిమాట పొల్లుగా
సక్రమభంగి నాలమున శౌర్యముచూపి వధింతు నిన్ను; నీ
విక్రమమున్ గనంబఱచు వేళ యిదే, తడ వేల చేసెదో!

కృష్ణు— (శిశుపాలుదిక్కై)

చ. అల తటి రుక్మిణీరమణి నట్టు వరించెడినాఁడు నీదు దో
ర్బల మణఁచేసి శిక్ష [illegible] నీకు దుష్ట దా

విలత కడుంగడుం బెరిఁగె వేఁదుఱుపట్టిన వానిపోల్కి నో
తులువ ! చెవంగఁ బ్రేలెదవె! దుండగపుం జెడుకూఁత లేడ్తెఱన్.

శిశు— (తొందఱగా)

శా. నీకున్ సిగ్గు లవమ్మునుం గలదె! మన్నీలున్న యిచ్చోట ము
న్నా కీనెంచిన రుక్మిణీరమణి విన్నాణంపుఁ బెండ్లిన్ వచిం
తే! కొంకింతయు లేక; నాఁడె నిను బ్రమందింపన్ బ్రయత్నించితిం
గా కెట్లో బ్రతుకంగ నేర్చితి విపుడ కార్యమ్ము పూరించెదన్.

కృష్ణు— (బిగ్గరగా)

చ. కనుఁడు నృపాలకుల్ ! కనుఁడు, కశ్మలచిత్తుని మీర లెల్లరున్
గనుఁగొనుచుండఁ జంపెద, నిఁకన్ సయిఁపం బని లేద; నన్ను వీఁ
డనుటకుఁ గాదు, భీష్ముని మహామహు దూఱినదానికిన్ ఫలం
బును గనుఁగాక, దుర్మదుల బుద్ధివిహీనత లింకుఁగావుతన్!

(చక్రమును బ్రయోగించును— తెర దింపుదురు)

నందికేశ్వరుడు— (ప్రవేశించి)

( భరత వాక్యము )

మ. మొఱకుల్ పూజ్యులపై నసూయఁగొని యున్మాలమ్ము గాకుండ్రుగా !
కురుబుద్ధుల్ కడువృద్ధు లాడు పలుకుల్ యోజించి కైకొండ్రుగా
ని, రహీన్దూలు ప్రసంగముల్ జరిపి వన్నైన్ దక్కి చాకుండ్రుగా!
కరవిందాసను రాణి తా నిలుచుఁగా కస్మన్మనఃపీఠికన్.

(అందఱును నిష్క్రమింతురు)

గద్య

ఇది శ్రీ......తిరుపతి వేంకటీయమ్మగు పాండవ
రాజసూయమ్మను నపూర్వనాటకమ్మునందు
సర్వమ్మును బ్రథమాంకము.

— ఫలశ్రుతి —

మ. ఇటు ప్రత్యక్షు మొనర్చునంత యురగం బిట్లొటకున్ గొంకి యా
కటువాగ్ధోరణి కట్టిపెట్టి యటుపైఁ గంజాక్షుపాదార్చనా
ఘటనాతత్పరులైన వారలగతిన్ గాంక్షించి తత్పద్ధతి
స్ఫుటరేఖాకలితోత్తమాంగములుచున్ బొల్పారె సాకల్యమున్.

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 2 | 13 | కంపెము | కందమ్ము |
| 3 | 25 | ఎవడా | ఎవఁడా |
| 6 | 6 | కీర్తి్కి | కీర్తికి |
| 7 | 17 | డనిఁ | డని |
| ,, | 20 | మీెఱుంగరే | మీరెఱుంగరే |
| 9 | 14 | మహోనీయ | మహానీయ |
| 12 | 20 | నరపాళిలో | నరపాలపాళిలో |
| 15 | 9 | పూఝ్యత | పూజ్యత |
| ,, | 27 | కృష్టుని | కృష్ణుని |
| 16 | 4 | నీర్భికు | నిర్భీకు |